శ్రీ గర్గ సంహిత



పురిఘళ్ళ శ్రీఫణి సీతారామన్

శ్రీగర్గ సంహిత

పురిఘళ్ళ శ్రీఫణి సీతారామన్

ఓం శ్రీరామ

నాహం కర్తా
హరః కర్తా.

అంకితం

శ్రీ సీతారామ చంద్రుల పాదపద్మములకు

శ్రీరామ స్థుతి

విడువను నీ చరణాబ్జములను విడువను ఏకాంతభక్తి
విడువను మిథిలాజనకజ శ్రీపద యుగళిన్
విడువను మారుతి నందను
విడువను నీ నామ జపము సఖదు:ఖములన్ ॥

శ్రీకృష్ణ స్థుతి

అంగలకాలింగనములు క్రోధకు సౌందర్యశక్తి
శిశువునకనితర భాషాపటిమన్ ఇచ్చితివి
అడిగిన దర్శన మిచ్చుట
నీకిది కష్టమె యాదవేంద్రా ! ॥

పరిచయం

శ్రీ సీతా సహిత శ్రీరామ చంద్ర ప్రభువు మా కులదైవం. కానీ నాకు వ్యక్తిగతంగా రుద్రాభిషేకం చాలా ఇష్టం. “శివకేశవులు అభేదము” అని తెలిసినా, సింహాసనంలో ఉన్న శ్రీరామ చంద్రమూర్తిని అశ్రద్ధ చేస్తున్నాననే భావన చిరుగాలిలా మొదలై పెను తుఫానులా మనసును బాధపెట్టడం ప్రారంభించింది. ఆ సమయంలో “ఏమీ చేస్తే ఈ బాధ తీరుతుంది!” అని ఆలోచిస్తుండగా ఆర్ష విద్యా గురుకులానికి ఒక వారాంతంలో సత్సంగానికి వెళ్ళడం, అక్కడ ఒక స్వామీజీ వద్ద గర్గసంహిత పేరు వినడం జరిగింది. తీరా అది చదువుదామని అనుకుంటే తెలుగులో ఆ పుస్తకం లభించలేదు. గీతా ప్రెస్ వారి హిందీ పుస్తకాన్ని కొనుగోలు చేయడం జరిగింది. నా జీవితంలో హింది గ్రంధం చదువలేదు. ఈ గ్రంధాన్ని తెలుగులోనికి అనువాదం చేసి సీతారాములకు అంకితం చేస్తే బాగుంటుంది, నా మనోవ్యధ తీరుతుంది అని అనిపించింది. కానీ అని సాధ్యమా? దైవకృప ఉంటే ఏదయినా సాధ్యమే! “మూకం కరోతి వాచాలం, పంగుంలంఘయితేగిరిమ్”. మూగవాడు మాట్లాడతాడు. కుంటివాడు గిరిశిఖరాలు ఎక్కగలుగుతాడు. నాలాంటి నిరక్షరాస్యుడు ఒక మహా గ్రంధాన్ని అనువాదం చేయగలుగుతాడు.

ఈ పుస్తకానికి స్ఫూర్తినిచ్చిన కొంతమంది మహానుభావుల్ని ఇక్కడ తప్పక తలుచుకోవాలి. “క్రమశిక్షణలేని జీవితం నిరర్ధకం” అని తెలియజేసిన మా తండ్రిగారికి, “భక్తి లేని జీవితం వ్యర్ధం” అని చెప్పిన మా అమ్మగారికి నేను ఎల్లప్పుడూ ఋణపడి ఉంటాను. వారి పాదాలకు సాంజలి బంధకంగా సాష్టాంగ దండ ప్రమాణాలు సమర్పిస్తున్నాను. “జీవితంలో తీసుకొవడం కన్నా ఇవ్వడంలోనే ఎక్కువ ఆనందం ఉంది.” అని చేసి చూపించిన ధన్యాత్ములు మా అన్న వదినలు. వారికి నా నమస్కారం. నా జీవిత భాగస్వామిని ఉమ ధర్మార్ధకామములలో మేము భాగస్వాములం. మోక్ష సాధనలో నాకంటే ఎంతో ముందుకు పురోగమించినది. ఆమె సహాయానికి ఎంతో కృతజ్ఞుడిని. మా పిట్స్‌బర్గ్ పుర పురోహితులు, నాకు గురుతల్యులు అయిన శ్రీ దర్మతేజ గారికి పాదాభివందనములు. ఈ పుస్తక ముద్రణకు ఎంతో సహయపడిన శ్రీ చరణ్‌తేజ గారికి ఎంతో ఋణపడి ఉన్నాను. ఈ గ్రంధంలో తప్పులన్నీ నావి, ఒప్పులన్నీ పరమేశ్వరునివి.

రామన్

విషయ సూచిక

శ్రీ గోలోక ఖండము

శ్రీ బృందావన ఖండము

గిరిరాజ ఖండము

మాధుర్య ఖండము

శ్రీ మధురా ఖండము

ద్వారకా ఖండము

విశ్వజిత్ ఖండము

శ్రీ బలభద్ర ఖండము

శ్రీ విజ్ఞాన ఖండము

అశ్వమేధ ఖండము

శ్రీ గర్గ సంహితా మాహాత్మ్యము

అనుబంధము

సుముఖ: ఏకదంతశ్చ కపిలో గజకర్ణక:
లంబోదరశ్చ వికటో విఘ్నరాజో గణాధిప:
ధూమకేతు ర్గణాధ్యక్ష: ఫాల చంద్రో గజానన:
వక్రతుండ: శూర్పకర్ణో హేరంభ: స్కంధపూర్వజ:
అష్టావష్టాచ నామాని య: పఠే: శృణుయాదపి
విద్యారంభే వివాహేచ ప్రవేశే నిర్గమే తధా
సంగ్రామే సర్వ కార్యేషు విఘ్నస్తస్య నజాయతే ॥

ఎవరు లక్షలాది కల్పవృక్షములచే ఆవరింపబడినదియు, చింతామణుల సమూహాములతో నిర్మింపబడిన దివ్య సౌధముల యందు లక్ష్మీ సదృశులయిన లక్షలాది పద్మముఖులచే నిరంతరము సేవలందుకొనునో అట్టి ఆదిపురుషుని, స్వయముగ వనముల యందు యుధేశ్చగా తిరుగాడుచు ఆవులను సంరక్షించు భగవానుడయిన గోవిందుని శరణుజొచ్చుచున్నాను.

ఎవరు నిరంతరమూ అహ్లాదభరితమయిన వేణునాదమును వెలువరించుచుండునో, కమల పత్రాక్షుడునూ; నెమలి పింఛమును మకుటమునందు ధారణ చేయనో; వర్షాకాల మేఘవర్ణసంజాతుడునూ, కోట్లాది కామదేవులను మించిన శోభాయుతుడునూ, ఆదిపురుషుడును అయిన భగవానుడగు గోవిందుని యొక్క భజన చేయుచున్నాను.

చిరుగాలికి రెపరెపలాడు నెమలిపింఛముతో, సుందరమయిన వనమాలతో, రత్నములు పొదిగిన మురళితో, త్రిభంగుడయిన శ్యామసుందరుడు, ప్రణయ కార్యకలాప దక్షుడు, అచలుడు, సర్వకాల సర్వావస్థల యందు వన్నెతగ్గని కాంతియుతుడు, అయిన ఆదిపురుషుడు, భగవానుడయిన గోవిందుని ఆశ్రయించుచున్నాను.

సచ్చిదానంద మయుడు, ప్రకాశయుక్తమయిన తన శుభ సర్వాంగములచే, అనంతకాలము సర్వలోకములను కనిపెట్టి, రక్షించు ఆదిపురుషుడయిన గోవిందుని ఆశ్రయించుచున్నాను.

ద్వంద్వాతీతుడునూ, తన స్వరూపము (స్వస్థానము) నుండి చ్యుతుడు కాని అచ్యుతుడునూ, అందరి కంటే ప్రథముడునూ, ఆది అంతములు లేని వాడను, స్వయం ప్రకాశుడునూ, సనాతనుడయినప్పటికీ నిత్యయవ్వనుడునూ, వేదవేదాంగములచే కూడా గ్రహింపలేనివాడునూ, కానీ భక్తజన సులభుడునూ అయిన ఆదిపురుషుడు గోవిందుని శరణుజొచ్చుచున్నాను.

మహానుభావులయిన మునులు వేలకొలది సంవత్సరములు ప్రాణాయామము, చిత్తనిరోధము ద్వారా కనుగొను భగవత్ప్రాప్తి మార్గము అచింత్యము, మహత్వపూర్ణము అయిన భగవంతుని పాదపద్మముల చెంత ఆగిపోవును. నేను అట్టి దివ్యపాదుడయిన ఆదిపురుషుడు గోవిందుని ఆశ్రయించుచున్నాను.

ఎవరు సర్వధా ఏకాకియో, తనకు మించి వేరొక ప్రాణి లేదో, అయినప్పటికీ తన అనంత మహిమచే కోటి, కోటి బ్రహ్మాండములు రచింపగల శక్తి గలవాడో, అంతేకాక ఆబ్రహ్మాండములన్నింటినీ తన కుహరమున కలిగియున్నాడో, తిరిగి ఆ బ్రహ్మాండములు చేయబడిన పరమాణు సమూహాముల లోపల స్థితిగతుడై యున్నాడో, అట్టి పురుషుడు గోవిందుని భజించుచున్నాను.

తనకు తాను సర్వాత్ముడయినప్పటికీ, ఆనంద చిన్మయరస స్వరూప ప్రభావితమయిన తన స్వస్వరూపము యొక్క వివిధ కళలతో (గోపాలురు, గోపికలు, గోవులు) ఎల్లప్పుడు గోలోకము లో నివసించునట్టి ఆదిపురుషుడు, గోవిందుని శరణుజొచ్చుచున్నాను.

ప్రేమరస అంజనము అలదబడిన భక్తిరూప నేత్రములు గల మహాయోగుల హృదయ కమలములలో నిరంతరమూ, శ్యామసుందర రూపముతో వెలుగాడుచున్న భగవంతుడునూ, అంతేకాక తన స్వస్వరూపమునూ, గుణగుణములనూ, యదార్ధ రూపమునూ చింతింపనలవిగాని మహా మహిమాన్వితుడునూ, అయిన ఆదిపురుషుని, గోవిందుని ఆశ్రయించుచున్నాను.

ఎవరు వివిధ భువనములలో శ్రీరామాది అవతారములలో నియమిత పరిమితితో అవతరించెనో, కానీ పరమ పురుషుడయిన శ్రీకృష్ణావతారము నందు తనకు తానుగా ప్రకటీభూతుడాయెనో, అట్టి ఆదిపురుషుడు గోవిందుని భజించుచున్నాను.

వేద ప్రతిపాదితమూ, వేద విస్తారితమూ, త్రిగుణాత్మకమూ, అయిన మాయ కొన్ని వేల బ్రహ్మాండములకు ఉనికియై ఉన్నది. అందు సత్వగుణాశ్రయుడునూ, సత్వమునకు ఆవల విశుద్ధ బుద్ధ సత్య స్వరూపుడును అయిన ఆదిపురుషుడు గోవిందుని శరణు జొచ్చుచున్నాను.

ఎవరు తనను నిరంతరము స్మరణ జేయు భక్తుల హృదయ కమలములయందు తన ఆనంద చిన్మయ రసాత్మక స్వరూపమును ప్రతిబింబించునో, ఎవరు తన కేవల లీలా విహారాల ద్వారా సమస్త భువనములనూ నిరంతరము వశీభూత మొనర్చు కొనునో అట్టి ఆదిపురుషుని గోవిందుని ఆశ్రయించుచున్నాను.

ఎవరు తన ధామమయిన గోలోకముననూ, క్రింది దేవలోకము, కైలాసము, వైకుంఠము, మొదలయిన స్థానములలో భిన్నమయిన ఐశ్వర్య సృష్టికి కారకుడయిన ఆదిపురుషుడు గోవిందుని భజించుచున్నాను.

సృష్టి, స్థితి, లయ కారకురాలైన శక్తిస్వరూపిణి, భగవతి, దుర్గ ఎవరి ఛాయా మాత్రంగా సమస్త భువనములను ధారణ, పోషణ జేయిచున్నదో, ఎవరి ఆజ్ఞానుసారం తన చేష్ఠలను ప్రవర్తిల్ల జేయుచున్నదో అట్టి ఆదిపురుషుడు, గోవిందుని భజించుచున్నాను.

తోడుకొనుట అనే ప్రక్రియ ద్వారా పాలు పెరుగు అయినప్పటికీ తన నుండి విజాతీయత చెందదో అట్లే సంహార ప్రక్రియ కొరకు శంకరునిగ రూపాంతరము చెందిన ఆదిపురుషుడు గోవిందుని శరణు జొచ్చుచున్నాను.

ఒక దీపము నుండి వెలిగింపబడిన మరియొక దీపము మొదటి దీపము వలెనే ఎట్లు గుణ ప్రకరణము (కాంతి ప్రసరణము) చేయునో, అట్లే వివిధ అవతారములలో ప్రకటితమయినప్పటికీ విష్ణు రూపముతో విలసిల్లు ఆదిపురుషుడు గోవిందుని ఆశ్రయించుచున్నాను.

ఆధార శక్తిరూపుడయిన శ్రీమన్నారాయణ ప్రభువు తన శ్రేష్ఠరూపముతో కారణార్ణవ జలముల యందు యోగనిద్రలో వశీభూతుడయినప్పటికీ తన ఒక్కొక్క రోమ కూపము నందు అనంత కోటి బ్రహ్మాండముల రక్షణ చేయుచుండును. అట్టి ఆదిపురుషుడు గోవిందుని భజించుచున్నాను.

తప రోమకూపములలో ప్రకటితమగు విభిన్న బ్రహ్మాండములకు తన ఒక్క శ్వాస ద్వారా అనంతకాలము జీవన దానము చేయునో, అట్టి సర్వ విదిత మహానుభావుడు విష్ణుమూర్తి, విశిష్ఠ కాల స్వరూపుడు, ఆదిపురుషుడు గోవిందుని భజించుచున్నాను.

ఎట్లు సూర్యుడు సూర్యకాంత మణులయందు తన తేజస్సు యొక్క కించిత్ ప్రకాశమును ప్రకటితము చేయునో అట్లే ఒక బ్రహ్మాండమునకు శాశన కర్త అయిన బ్రహ్మ యందు లేశ మాత్రముగా తన మహిమను ప్రకటితము చేయు అట్టి ఆదిపురుషుడు గోవిందుని శరణు జొచ్చుచున్నాను.

ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృథివి అను పంచ భూతములు, నాలుగు దిశలు, కాలము, మనస్సు, బుద్ధి, అంతరిక్షము, స్వర్గాది ముడు లోకములు, ఎవనియందు ఉత్పన్నమై, సమృద్ధిని పొంది, తిరిగి ఎవని యందు

లీనమగుచున్నవో అట్టి ఆదిపురుషుని గోవిందుని భజించుచున్నాను.

ఎవని నేత్రము సూర్యుడో, ఎవరు గ్రహాధిపతియో, సంపూర్ణ దేవతలకు ప్రతీకయో, ఎవరు కాల చక్రమును ప్రవర్తిల్ల జేయునో అట్టి ఆదిపురుషుడు గోవిందుని భజించుచున్నాను.

ధర్మాత్ములు, పాపులు, వేద వేదాంగములు, వివిధములయిన తపోప్రక్రియలు, పిపీలికాది బ్రహ్మ పర్యంతము ఎవని శక్తిచే తమతమ కార్యాచరణ, కార్య సాధన కావించుకొను చున్నారో అట్టి ఆదిపురుషుని భగవానుడయిన గోవిందుని భజించుచున్నాను.

ఎవరు దేవరాజయిన ఇంద్రునికి సహితము కర్మదాయిక ఫలములను ప్రసాదించునో, కానీ తన భక్తుల యొక్క కర్మలను నిశ్శేషముగ జ్వలించునో అట్టి ఆది పురుషుడు గోవిందుని శరణు వేడుచున్నాను.

మానవులు కామం, క్రోధం, స్నేహం, భయం, వాత్సల్యం, మోహం, గౌరవం, శరణాగత బుద్ధి చే ఎవనిని చింతించి ఆయన సారూప్యము ను పొందు చున్నారో అట్టి ఆదిపురుషుని గోవిందుని ఆశ్రయించుచున్నాను.

గర్గ సంహిత యొక్క సంక్షిప్త పరిచయం

గర్గసంహిత యదుకుల పురోహితుడు, మహానుభావుడు, ఆచార్యుడు, మహాముని అయిన శ్రీ గర్గుని చే రచింపబడినది. ఈ సంహిత సంపూర్ణముగ అత్యంత మధురతరమయిన శ్రీకృష్ణ లీలలచే పరిపూర్ణముగ నిండి యున్నది. ఇందు శ్రీ రాధాదేవి యొక్క దివ్య మాధుర్య భావ మిశ్రితములయిన లీలల యొక్క విశదవర్ణన యున్నది. భాగవతము నందు ఏది సూక్ష్మరూపముగ సూత్రీకరించ బడినదో, అది గర్గ సంహిత యందు విపులముగ విశదీకరించ బడినది. ఒక రకముగ ఇది భాగవతము నందలి కృష్ణ లీలలకు మహా భాష్యము. భాగవతము నందు వ్యాసుల వారు శ్రీకృష్ణ భగవానుని పూర్ణత్వము ను గూర్చి "కృష్ణస్తు భగవాన్ స్వయమ్" అని సంక్షేపముగ చెప్పి ఊరుకున్నారు. కానీ గర్గాచార్యుల వారు తన సంహిత యందు "ఎవని యందు సర్వుల/సర్వము యొక్క తేజస్సు విలీనమగునో ఆయనే స్వయముగ పరిపూర్ణతముడయిన భగవానుడు, కృష్ణుడు" అని శ్రీకృష్ణుని పరిపూర్ణత్వమును ప్రతిపాదించి విశదీకరించారు.

శ్రీమద్భాగవతము నందు రాసలీల కేవలము అయిదు అధ్యాయములలో ఒక్కసారి మాత్రమే ప్రస్తుతించారు. కానీ గర్గసంహిత యందు బృందావన ఖండము, అశ్వమేధ ఖండము నందు ప్రభాస మిళిత సమయమున, దిగ్విజయమునకు తరువాత, మొత్తము మూడు పర్యాయములు రాసలీల విశేషముగ వర్ణింపబడినది. పరమ ప్రేమైకమూర్తి అయిన రాధాదేవి యొక్క దివ్య ఆకర్షణ చే శ్రీ మధురానాధుడు, ద్వారకాధీశుడయిన భగవానుడు శ్రీకృష్ణుడు అనేక పర్యాయములు గోకులము ప్రవేశించి నిత్య రాసేశ్వరీ, నిత్య నికుంజేశ్వరీ, అయిన రాధాదేవి తో "మహారాస" మనే దివ్యలీల నడిపాడు. దీని యొక్క విశిష్ఠ వర్ణన గర్గసంహిత యందు పొందుపొరుప బడినది.

ఈ గ్రంధము నందలి మాధుర్య ఖండము నందు విభిన్న గోపికల యొక్క పూర్వజన్మ వృత్తాంతము, సరిక్రొత్త కధలతో రమణీయముగ వర్ణింపబడినది. ఈ సంహిత యందు భాగవతము నందు ప్రతిపాదింపబడిన నిగూఢతత్వములను స్పష్ఠముగ ఉల్లేషింపబడినవి. అందువలన ఇది భక్త భావుకులకు మిక్కిలి సమాదరమయినది.

గోలోక ఖండము

ప్రధమాధ్యాయము

భగవంతుడయిన నారాయణునకు, నరశ్రేష్ఠుడయిన నరునకు, వేదమాత సరస్వతీ దేవికి, నిగమ విభజన విశారదుడయిన వేదవ్యాస మహర్షికి, ప్రప్రథముగా నమోవాచకములు. శరత్కాల వికసిత కమలమును మించిన శోభ కలిగినవియు, తపోధనులయిన ఋషులనే భ్రమరముల చే నిరంతరమూ సేవింపబడునవియు, వజ్రము, కమలము మొదలయిన చిహ్నములు కలిగినవియు, సుందరమయిన బంగారు నూపురములచే అలరారు నట్టివియు, భక్తులయొక్క తాపత్రయమును నిశ్శేషముగ నాశము చేయనట్టివియు, మరియు దివ్యజ్యోతి స్వరూపములగు రాధాకాంతుని పాద పద్మములను నిరంతరమూ హృదయము నందు ధారణ చేయుచున్నాను. ఎవరి ముఖకమలము నుండి వెలువడిన కధామృతమును భక్తులు నిరంతరము పానము చేయుచుందురో, ఎవరు ఎల్లప్పుడూ బదరీ వనము నందు సంచరించుచుందునో, ప్రణుత జనుల యొక్క తాపము హరించుటయందు మిక్కిలి సమర్ధుడో, విష్ణుభగవానుని అవతారము మరియు సత్యవతీ నందనుడయిన వేదవ్యాస మహర్షి నా వాణిని రక్షించి, దోష విముక్తము జేయు ప్రార్ధించుచున్నాను.

ఒకానొకప్పటి మాట – యొగ శాస్త్ర నిధి, జ్ఞాన శిరోమణి, పరమ తేజస్వీ, అయిన గర్గాచార్యుడు శౌనకుని దర్శనార్ధము నైమిశారణ్యమునకు విచ్చేసెను. ఆయన రాకను గమనించిన శౌనకుల వారు మిగిలిన మునులతో ఎదురేగి విధి పూర్వకముగ అర్ఘ్య, పాద్యాదులను, సుఖాసనమును సమర్పించి ఇట్లు ప్రశ్నించెను – సాధు పురుషులు యొక్క యాత్ర ధన్యత చేకూర్చును. ఎందుకనగా అది గృహస్థుల యొక్క శాంతికి హేతువైయున్నది. మనుష్యుల యందు నిండిన అజ్ఞానాంధకారమును కేవలము మహాత్ములు మాత్రమే నాశనము చేయగలరు. ఓ! దివ్య జ్ఞాన ప్రసాదా! నా మనసునందు ఉత్పన్నమయిన ప్రశ్నకు దయచేసి సమాధానమీయవలసినది. “భగవంతుని యొక్క అవతారములు ఎన్ని విధములుగ యున్నవి?” శ్రీ గర్గాచార్యుల వారు ఈ విధముగా సమాధాన మీయదొడంగిరి– “బ్రహ్మన్! నిరంతరమూ భగవంతుని గుణగణముల యందు సంచరించు మీ యొక్క ఈ ప్రశ్న బహు ఉత్తమము. ఇది అడిగిన వారినీ, వినిన వారినీ, వివరించిన వారినీ కూడా కృతార్థులనుజేయును. దీనికి సంబంధించిన ఒక పురాణేతిహాసము కలదు. దానిని విన్నంత మాత్రముచే గొప్ప, గొప్ప పాపములు నశించును. చాలా కాలము క్రితము మిధిలాపురమును గొప్ప ప్రతాపవంతుడునూ, విఖ్యాతుడు అయిన బహుళాశ్యుడను మహారాజు పరిపాలించుచుండెను.

(మిధిలా ప్రభువు లందరునూ “జనకుడు” అని వ్యవహరింపబడుదురు). ఆయన శ్రీ కృష్ణుని యొక్క పరమ భక్తుడు, శాంతచిత్తుడు, అహంకార వర్జితుడు. ఒకానొక శుభ దినమున పరమ భగవతోత్తముడు, మహానుభావుడు, దేవర్షి నారదుడు ఆకాశము నుండి ఆయన వద్దకు అవతీర్ణుడాయెను. వెంటనే మహారాజు లేచి, ఆయనకు ఆసనమిచ్చి, ఆర్ఘ్య పాద్యాదులచే యధోచితముగ పూజించి, రెండు చేతులు కైమోడ్చి, ఈ విధముగ ప్రశ్నించెను. “మహానుభావా! అనాది ఆయిన భగవంతుడు ప్రకృతికి పరుడు, మరియు అందరి యందలి అంతర్యామి అయి యుండియు ఒక శరీరమును ఎట్లు ధరించుచున్నాడు? ఈ విషయము దయతో సెలవీయవలసినది. నారదుడు ఈ విధముగా పలికెను – “ఓ రాజా! వ్యాసుడు మొదలయిన మునులు ఆరు ప్రకారములయిన అవతారములను వివరించిరి–అంశాంశ– అంశ; ఆవేశ; కళ; పూర్ణ; పరిపూర్ణము. ఇందు చివరిదయిన పరిపూర్ణతమమయిన అవతారము సాక్షాత్తు శ్రీకృష్ణ భగవానుడు మాత్రమే! అంశాంశ అవతారములు – మరీచి మొదలయిన ఋషులు, అంశావతారము చతర్ముఖ బ్రహ్మ మొదలయినవి. కళావతారములు కూర్మము, కపిలుడు మొదలయిన వారు. ఆవేశావతారము పరశురాముడు. పూర్ణావతారములు

నరశింహుడు, రాముడు, శ్వేతద్వీప నారాయణుడు, వైకుంఠుడు, యజ్ఞము, నరనారాయణాది ప్రభృతులు. పరిపూర్ణావతారము కేవలము శ్రీకృష్ణావతారము మాత్రమే! అసంఖ్యాకమయిన బ్రహ్మాండములకధిపతి అయిన ఆ ప్రభువు గోలోకములో ఎల్లప్పుడూ విరాజిల్లుతుంటాడు. సృష్ట్యాది కార్యక్రమములు జరుపు బ్రహ్మాది దేవతలు కేవలము ఆయన అంశలు మాత్రమే! ఈ అంశల యొక్క కార్యక్రమములను నెరవేర్చు వేల్పులు అంశాంశావతారములు, అనే నామము తో విఖ్యాతమయినవి. భగవంతుడయిన విష్ణువు ఎవరి అంత:కరణము నందు ఆవిష్టుడై, తన అవతార కార్యము పరిసమాప్తి కాగానే వాని నుండి వైదొలగునో అట్టి అవతారమును ఆవేశావతారము అని పేర్కొందురు. భగవానుడు ఎప్పుడు ఒక ప్రత్యేక యుగము నందు అవతరించి ఆ యుగ ధర్మమును పునరుద్ధరించి తిరిగి అంతర్ధానమగునో అది కళావతారము అనబడును. రామ, లక్ష్మణ, భరత, శత్రుఘ్నులు, వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు ఇట్లు ఎక్కడ భగవంతుని యొక్క చతుర్వ్యూహమును ప్రకటింపబడునో, అంతేకాక నవరసములు అభివ్యక్తీకరింప బడునో, ఎక్కడ తన పరాక్రమముల పరాకాష్ఠ దృష్టిగోచరమగునో, అట్టి భగవదవతారమును పూర్ణావతారమని పేర్కొనవచ్చు. ఎవని తేజము నందు ఇతరుల తేజము విలీనమగునో, అట్టి భగవంతుని అవతారమును శ్రేష్ఠ పురుషులు సాక్షాత్తు పరిపూర్ణతమ అవతారముగ చెప్పదొడంగిరి.

ఏ అవతారము నందు పూర్ణత్వము యొక్క సంపూర్ణ లక్షణములు వ్యక్తీకరింప బడునో, మనుష్యులు ఏ రూపము ను, తమ భావానుసారముగ తిరిగి తిరిగి తమ ప్రియతమ రూపముగ దర్శించుచుందురో అదియే సాక్షాత్ పరిపూర్ణావతారము. శ్రీకృష్ణుడు ఒక ఉద్దేశ్యముతో అవతారమును స్వీకరించి కోట్ల కొలది ఇతర కార్యములను సహితము సాధించెను. అందుచే కేవలము శ్రీకృష్ణ స్వరూపము మాత్రమే పరిపూర్ణావతారము. ఎవరు పూర్ణుడు, పురాణ పురుషోత్తముడు, పరాత్పర పురుష పరమేశ్వరుడు, సాక్షాత్ సదానంద మయుడు కృపానిధి, సమస్త గుణములు ఒక ఆకారమయినట్టివాడు, అట్టి భగవంతుడు శ్రీకృష్ణ చంద్రుని శరణు వేడుచున్నాను. ఇది విన్న మహారాజు శరీరము రోమాంచితమై, హర్ష పులకితుడాయెను. ఆయన ప్రేమ విహ్వలుడై, అశ్రుపూర్ణ నేత్రములతో నారద మహర్షితో ఇట్లనెను. "మహర్షీ! సాక్షాత్తు పరిపూర్ణతమ భగవానుడు, సర్వవ్యాప్తి, చిన్మయ గోలోక ధామము నుండి భారత వర్షాంర్గత మయిన ద్వారకా పురికి ఏతెంచుటకు కారణమేమి? శ్రీకృష్ణ భగవానుని బృహత్ సుందర గోలోక ధామము ఎట్లుండును? వాటితో పాటు ఆయన అపరిమేమ కార్య కలాపములు వర్ణన కూడా దయచేసి వివరింప వలసినది." "మనుష్యుడు కొన్ని వందల జన్మలు తీర్థయాత్రలు, కఠోర తపస్సు చేసి వాని ఫల స్వరూపముగ సత్సంగమును పొందుతాడు. అపుడు భగవంతుడయిన శ్రీకృష్ణ చంద్రుని సులభముగ పొందగలుగుతాడు. అటువంటప్పుడు నేను భక్తి రసము చే అర్ద్ర చిత్తమయిన మనసు తో శ్రీకృష్ణుని యొక్క దాసానుదాసుల, దాసుడను ఎట్లు కాగలగుతాను?" సంపూర్ణ దేవతానీకమునకు సహితము దుర్లభమయిన పరబ్రహ్మ, పరమాత్మ, ఆదిదేవుడయిన శ్రీకృష్ణుడు ఈ మానుష నేత్రములకు ఎట్లు దర్శనమీయ గలడు?" నారదుడు ఈ విధముగ తిరిగి వచించెను–"ఓ! నృపశ్రేష్ఠుడా! నీవు ధన్యుడవు. నీవు శ్రీకృష్ణచంద్రుని ప్రియభక్తుడవు. నీకు దర్శనమిచ్చుటకు భక్త వత్సలుడయిన భగవానుడు ఇచ్చటకు అవశ్యము ఏతెంచును. భగవంతుడయిన జనార్ధనుడు ద్వారక లో ఉంటూ కూడా నిన్నూ, బ్రహ్మన్యుడయిన శృతదేవుని నిరంతరమూ చింతించుచుండును. ఆహా! ఈ లోకము లో భగవద్భక్తులది ఏమి సౌభాగ్యము?".

శ్రీ గర్గసంహిత యందలి గోలోకఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదములో శ్రీకృష్ణ మహాత్యము వర్ణన యను మొదటి అధ్యాయము సమాప్తము.

రెండవ అధ్యాయము

(బ్రహ్మాది దేవతల ద్వారా గోలోక ధామము యొక్క దర్శనము)

నారదుడు ఈ విధముగా చెప్పదొడంగెను. "ఏ మనుష్యుడు పలుక గలిగిన నాలుక యున్నప్పటికీ, కీర్తనీయుడయిన భగవానుడు శ్రీకృష్ణుని లీలలను కీర్తన చేయడో, అట్టి దుర్బుద్ధి అయిన మనుష్యుడు మోక్ష సోపానములను పొందియు వాటిని ఎక్కుటకు ఇచ్ఛగించని మూర్ఖుడు అగుచున్నాడు. ఓ రాజా! ఈ వరాహకల్పమందు ధరాధామము నందు ఎచ్చట శ్రీకృష్ణుని యొక్క పదార్పణము జరిగినదో మరియు ఆయన దివ్యమంగళ లీలా విలాసములను నీకు పూర్తిగా వివరించెదను".

చాలా కాలము క్రిందటి మాట! దానవ, దైత్య, అసుర స్వభావముతో నిండిన మనుష్యులు, రాజుల యొక్క భూభారమును మోయలేక పీడింపబడిన భూమాత గోరూపమును ధరించి అనాథ వలె రోదించుచు, తన అంతరంగ వ్యధను నివేదించుటకై బ్రహ్మదేవుని కడకేగెను. ఆ సమయమున ఆమె మేను కంపించుచుండెను. అపుడు బ్రహ్మదేవుడు శివుని తోడ్కొని భగవంతుడయిన నారాయణుని ధామమయిన వైకుంఠమున ప్రవేశించెను. అచ్చట చతుర్భుజములతో విరాజమానుడయిన విష్ణు భగవానునకు బ్రహ్మదేవుడు సమస్తమును నివేదించెను. అపుడు లక్ష్మీపతి విష్ణుమూర్తి ఉద్విగ్నులయిన దేవతలను, బ్రహ్మను చూచి ఇట్లనియె. "బ్రహ్మదేవా! సాక్షాత్ భగవానుడయిన శ్రీకృష్ణుడే అగణిత బ్రహ్మాండముల యొక్క స్వామి, పరమేశ్వరుడు, అఖండ స్వరూపుడు, మరియు దేవాతీతుడు. ఆయన లీలలు అనంతములు మరియు అనిర్వచనీయములు. ఆయన కృప లేక ఈ కార్యము సిద్ధి పొందదు. అందుచేత నీవు ఆయన యొక్క నాశరహితము, మరియు ఉజ్వలమయిన ధామమునకు శీఘ్రమే ప్రయాణము చేయుము. బ్రహ్మదేవుడు ఈ విధముగా పలికెను – "ఓ ప్రభూ! మీకంటే వేరయినది అయిన పరిపూర్ణతత్వము ఇంకొకటి కలదని నాకు యెరుక లేదు. అట్టి ఉత్కృష్ట పరమేశ్వరతత్వము ఉన్న యెడల అట్టి లోకమును నాకు దర్శనము చేయించవలసినది".

నారదుడు మరల చెప్ప నారంభించెను. బ్రహ్మ వాక్కులు విన్న విష్ణు భగవానుడు సర్వ దేవతా సహితముగ బ్రహ్మకు బ్రహ్మాండ శిఖరమున విరాజిల్లుతున్న గోలోక ధామము యొక్క మార్గము చూపెను. అచ్చట వామనావతారమునందు వామన మూర్తి యొక్క ఎడమ కాలి వేలిచే భేదింపబడిన రోదసీ కుహర కవాటము నుండి వెలివడుచున్న బ్రహ్మ ద్రవము కనపడెను. అది నిత్యాశ్చర్యకరమయిన నీరు. ఆ నీటి యందు ప్రవేశించి వేల్పులందరూ విష్ణు నియమిత మార్గములో బ్రహ్మాండము యొక్క వెలుపల ప్రవేశించి క్రిందనున్న తమ బ్రహ్మాండమును కళింగబింబ రూపమున చూచిరి. ఇంతేకాక బ్రహ్మద్రవ సముద్రమున ఇంద్రాయణ ఫలముల వలె తేలియాడుచున్న అనేక కోట్ల బ్రహ్మాండముల సహితము విస్మయముతో వీక్షించిరి. అక్కడి నుండి కోట్ల యోజనముల పైన నలచెరుగులా శోభాయమానమయిన, శాఖోపశాఖలు గల రత్నమయములయిన వృక్షములతో నిండిన దివ్యనగరము వారికి కానబడెను. దానికి ఆవలయున్న సుందర విరజానదీ తీరమును దేవతలు కాంచిరి.

ఆ ప్రదేశమంతయు ఉజ్వల దివ్యకాంతి శోభితమయిన వస్త్రమువలె ప్రకాశించుచుండెను. దివ్య మణిమయములయిన సోపానములు గల గట్లు అలరారుచున్న విరజానదీ తీరమును దాటి దేవతలందరూ ఉత్తమమయిన నగర ప్రవేశము చేసిరి. ఆ నగరము అనంత కోటి సూర్యుల యొక్క కాంతితో వెలుగుచుండి గొప్ప పుణ్య ఫలప్రదముగాయున్నది. ఆ కాంతిని చూడ నశక్యమై దేవతల కండ్లు ఛిద్రములాయెను. ఆ కాంతి ముందు పరాభూతులై ఎక్కడ వారు అక్కడ నిశ్చేష్టులయిరి. అపుడు భగవానుడయిన విష్ణువు యొక్క ఆదేశానుసారము బ్రహ్మదేవుడు ఆ కాంతికి వందన మాచరించి ధ్యాన నిమగ్నుగాయెను. ఆయనకు ఆ కాంతికి వెనుకనున్న పరమ శాంతిమయమయిన సాకార ధామము విస్పష్టమాయెను. అందు పరమాద్భుతమయిన కమళనాళము వలె మిక్కిలి తెల్లనయిన శరీరఛాయతో మెరయుచున్న సహస్రశీర్షుడయిన శేషసాయికి సాంజలి బంధకముగ దేవతలందరూ నమస్కరించిరి. ఓ! రాజా! ఆ శేషనాగము యొక్క ఒడిలో మిక్కిలి ప్రకాశవంతమయినది మరియు లోక వందితము అయిన గోలోకము యొక్క దర్శనమాయెను. ఆ పవిత్ర

ప్రదేశము నందు దేవతా ముఖ్యుడు, గణణ శీలుల యందు ప్రధానుడయిన కాలము యొక్క ప్రభావము ఎంత మాత్రము చెల్లదు. సర్వ లోకములను నడిపించి, ఆడించు మాయ ఇచట పూర్తిగా శక్తిహీనము. చిత్తము, మనసు, బుద్ధి, అహంకారము, మొదలగు పదహారు వికారమలు ఇందు ప్రవేశింప అనర్హములు. ఇక త్రిగుణములను గురించి చెప్పనేల?

అచట మన్మథ సమానులు, మనోహర రూప లావణ్యశీలురు, శ్యామ సుందర విగ్రహులు, అయిన శ్రీకృష్ణ పార్షదులు ద్వార పాలకులై యుందురు. అక్కడ నుండి లోనికి పోవుటకు ఉద్యక్తులయిన దేవతలను ఆ ద్వారపాలురు అడ్డగించిరి. వారికి దేవతలు ఈ విధముగా విన్నవించిరి, "మేము బ్రహ్మ, విష్ణు, శంకరులమనే లోక పాలకులము, మరియు వీరు ఇంద్రాది దేవతలు. భగవానుడయిన శ్రీకృష్ణుని దర్శనార్థమై ఏతెంచితిమి. దేవతల యొక్క ఆగమన వార్త పార్షదుల ద్వారా అంత:పురము నందు యున్న ద్వార పాలికలకు తెలియజేయబడినది. ఆకు పచ్చని వస్త్రముల ధరించినది, దండధారిణి అయిన శత చంద్రానన అను ఒక అంత:పుర సఖి బయటకు వచ్చి ఇట్లు ప్రశ్నించినది.

"ఇచటకు విచ్చేసిన దేవతా ప్రముఖులారా! మీరందరూ ఏ బ్రహ్మాండమునకు చెందినవారు? మీ రాకకు కారణమేమి? ఇది తెలిపిన యెడల నేను శ్రీఘ్రమే శ్రీకృష్ణ ప్రభువునకు నివేదించిగలను". దేవతలు ఈ విధముగా బదులిచ్చిరి. " ఆహా! ఏమి చిత్రము! అన్య బ్రహ్మాండములు కూడా కలవా? ఇది మాకు ఎరుక లేదే! ఓ శుభానన! మాకు కేవలము ఒక్క బ్రహ్మాండము మాత్రమే కలదు అని రూఢి". అందులకు శత చంద్రానన "బ్రహ్మదేవా! ఇచ్చటి విరజానది యందు కోట్లాది బ్రహ్మాండములు తేలియాడుచున్నవి. అందు మీ లాంటి దేవతలు ఎందరెందరో నివసించుచుండిరి. మీరు లోకజ్ఞాన శూన్యులు వలెనున్నారు. మిమ్మల్ని చూసి నవ్వు వచ్చుచున్నది. ఎప్పుడూ ఇంటిలో ఉండే బాహ్య ప్రపంచ జ్ఞానశూన్యుల వలె నున్నారే! గూలరీ పండు నందు నివశించు క్రిములు అవి నివసించు ఫలమే సర్వస్వము, బ్రహ్మాండము అని భ్రమపడునట్లు మీలాంటి సాధారణ జనులు తమ బ్రహ్మాండమే సర్వస్వమని తలచెదరు". ఇట్లు శతచంద్రానన చే అపహాస్యము చేయబడిన దేవతలందరూ చకితులై మౌనముద్రాంకితులయిరి. అపుడు విష్ణు భగవానుడు ఇట్లు పలికెను. " ఏ బ్రహ్మాండము నందు భగవానుడయిన పృశ్నిగర్భుని సనాతన అవతారము ప్రాదుర్భవించెనో, ఏ బ్రహ్మాండము యొక్క రోదశీకుహరము త్రివిక్రముని కాలి గోటిచే ఛిద్రమాయెనో, మేము ఆ బ్రహ్మాండము యొక్క నివాసులము".

విష్ణుముఖతా ఈ విషయమును విన్న శతచంద్రానన ఆయనను భూరి భూరి ప్రశంశలతో ముంచెత్తి, లోనికి వెళ్ళి, తిరిగి శ్రీఘ్రముగా తిరిగి వచ్చి, అంత:పుర ప్రవేశమునకు అనుజ్ఞనొసంగి అంతర్హితురాలాయెను. తదనంతరము సమస్త దేవతానీకము పరమ సుందరమయిన గోలోక ధామము యొక్క దర్శనము చేయసాగిరి. అచట గోవర్ధనమను పర్వత రాజము శోభిల్లు చుండెను. ఆ ప్రదేశమంతయు వసంతోత్సవపు వేడుకలతో నిండియున్న గోప గోపీ సమూహములతో క్రిక్కిరిసియుండెను. కల్పవృక్షములతో మరియు కల్పలతలతో శుశోభితముగ యుండెను. అచట శ్యామ వర్ణిని అయిన యమున తన స్వచ్ఛమయిన జలము తో పారుచుండెను. ఆ తీరము కోట్లకొలది భవనములచే నిండియుండి ఆ యమునా నదీ తీర శోభను మిక్కిలి ఇనుమడింప జేయుచున్నది. నదీ స్నానము కొరకు వైఢూర్యములతో నిర్మింపబడిన సుందర సోపానములు కలవు. అచట దివ్య వృక్షములతో, లతలతో నిండిన బృందావనము అత్యంత శోభాయమానముగా ప్రకాశించుచుండెను.

కిలకిలారావములు చేయుచున్న పక్షులతో, భ్రమరములతో, నిండిన వంశీవృక్షములు ఆ బృందావన శోభను మరింత ఇనుమడింపజేయుచున్నవి. సహస్రదళ పద్మ పరాగములతో నిండిన వాయు తరంగములు నలు చెరుగులా మంద మంద గమనముతో వీచుచు నాలుగు దిక్కులనూ సుగంధభరితము చేయుచున్నవి. ఆ బృందావనమునకు మధ్య ముప్పది రెండు వనములతో నిండిన నిజనికుంజము ప్రవర్ధిల్లు చుండెను. ఆ నికుంజమునకు నాలుగు ప్రక్కలా ఎత్తైన, ధృఢమయిన కోటగోడలు కట్టబడినవి. వానికి వెలుపల లోతైన కందకములు త్రవ్వబడి యుండెను. గోడల లోపల విశాలమయిన ఆవరణ కలదు. ఆ ఆవరణ అంతయు ఎర్రని అక్షయ వట వృక్షములతో నిండియుండెను. పద్మరాగములు మొదలయిన ఏడు రకముల మణులతో పొదగబడిన గోడలతో సమాయత్తపరచబడిన ఆ ఆవరణ అంతయు శోభాయమానముగ ప్రకాశించుచుండెను. కోట్ల కొలది చంద్రుల కాంతితో ప్రకాశించుచున్న చాండ్‌లరీలతో, రెపరెపలాడుచున్న పతాకములతో, మార్గమునకు ఇరువైపులా విరబూసిన పుష్పములతో నిండిన పూలమందిరములతో ఒప్పారుచున్న మార్గములు ఆ ప్రదేశమును మరింత సుశోభితము చేయుచున్నవి.

అచటి భ్రమరముల ఘంకారము శృతి చేయుచుండగా, మత్త కోకిలల కిలకిలారావములు, మయూరములు క్రేంకారములు మంద్ర, మధ్యమ, ఉత్తమ, గతులలో సాగు సంగీత వాద్య కచేరీని రూపించుచున్నది. బాల సూర్యుని దోపించు కుండలములు ధరించిన దివ్యాంగనలు వందల చంద్రుల ధవళ కాంతితో భాసించుచున్నారు. ఆ సుందరీమణులు రత్నములు పొదిగిన అద్దములలో తమ ముఖ బింబమును చూచుకొనుచు మణిమయమయిన ఆ ఆవరణ అంతయు అటు ఇటు తిరుగాడుచుండిరి. వారి కంఠముల యందలి హారములు, చేతులయందలి కేయూరములు దివ్య శోభను వెలువరించుచుండెను. వారి కాలియందలి నూపురములు, వారి చేతుల యందలి గాజులు వారి కదలికలకు అణుగుణముగ మధురధ్వని వెలువరించుచుండెను. ఆ గోపాంగనలు తమ తలపై చూడామణిని ధరించిరి. అచట ప్రతి గృహము నందు కోటి, కోటి, మనోహరమయిన గోవులు కానవచ్చుచున్నవి. ఆ గోవులు దివ్య భూషణములచే అలంకరింపబడి, శ్వేత పర్వతములవలె ప్రకాశించుచున్నవి. అన్నియును నవయవ్వనమునందుండి మంచి శీలము, కాంతి, గుణములతో విరాజిల్లుచుండెను. ఇట్టి భవ్యరూపము గల గోవులన్నియునూ అన్ని వైపులా సావధానముగా చరించుచుండెను.

వాటికి కట్టబడిన గంటలు, మంజీరముల ధ్వని మృదు మధురముగ వినబడుచుండెను. ఆ గోవుల శృంగముల బంగారపు తొడుగులతో కప్పబడి, మెడలో సువర్ణసదృశమయిన మాలలు చుట్టబడి, తమ అంగముల నుండి ధగ ధగమను కాంతి వెలువడుచుండగా అనేక రంగులతో ఒప్పారెను. కొన్ని ఆవులు తెలుపు, కొన్ని నలుపు, ఎరుపు, మరికొన్ని ఉదయసూర్య కాంతితో మెరయుచుండగా కొన్ని బూడిద వర్ణములోయున్నవి. కొన్ని కోయిలలతో సమానమయిన రంగుతో మెరయుచుండగా కొన్ని ధూమ్ర వర్ణములోయున్నవి. పయోనిధి కంటెను ఎక్కువ పాలనీయగల గోమాతల శరీరములు తరుణీమణుల రమణీయ హస్త సంస్పర్శచే మరింత కాంతిమయములయి, హరిణములను మించిన రూప లావణ్యములచే శోభించుచుండెను. ఆ గోమాతల సముదాయము నడుమ విశాల కాయముతో విలసిల్లు ఆబోతులు కూడా అటునిటు తిరుగాడుచుండెను. ఆ ఆబోతులు బలమయిన మెడ, పొడవయిన కొమ్ములు కలిగియున్నవి. ఇవి సాక్షాత్ ధర్మ స్వరూపములు.ఈ గోవులను రక్షించుటకు పలువురు, గోపాలురు కూడా అచ్చోటున కలరు. వారిలో కొందరు చేతుల యందు బెత్తములు ధరించి యుండగా మిగిలిన వారు చేతిలో మురళిని ధరించిరి. వారందరూ శ్యామల వర్ణములో శోభించుతూ శ్రీకృష్ణ భగవానుని లీలలను మిక్కిలి మధుర స్వరముతో పాడుచుండిరి. ఆ గానమునకు కామ దేవుడయిన మన్మధుడు సహితము మోహితుడగును.

ఈ దివ్య నికుంజమునకు సమస్త దేవతానీకము సాష్టాంగ దండ ప్రమాణములాచరించి లోనికి చనిరి. అచట వారికి సూర్య కిరణములను తలపించు సహస్రదళ పద్మము కనిపించెను. దానిపై మిలమిల మెరయుచున్న ఉన్నత సింహానము కలదు. మూడు మెట్లతో నిర్మింపబడిన ఆ దివ్య సింహాసనము కౌస్తుభమణులచే తాపించబడినది. దానిపై భగవానుడయిన శ్రీకృష్ణుడు, శ్రీ రాధాదేవితో కలసి ఆశీనుడైయుండెను. వారిరువురు మోహిని మొదలయిన ఎనిమిది దివ్య సఖీమణులు, మరియు సుదాముడు మొదలయిన దివ్య సఖులచే సేవింపబడుచుండిరి. వారి సింహాసనముపై హంసల వంటి తెల్లని ఛత్రము వెలయుచుండగా, ప్రక్కన మణులు పొదగబడిన చామరములు వీయుచుండెను. శ్రీకృష్ణ భగవానుని ఎడమవైపు శ్రీ రాధా దేవి విరాజమానమైయున్నది.

శ్రీకృష్ణ భగవానుడు వర్షాకాల మేఘసదృశమయిన దేహకాంతితో, కమల దళముల వంటి విశాల నయనములతో, ఆజానుబాహువై పచ్చని పట్టు పీతాంబరమును ధరించియుండెను. ఆయన గళమున సుందర వనమాల శోభించుచుండెను. ఆ వనమాల యందలి పుష్పముల చుట్టూ భ్రమరములు ఘంకారముచేయుచుండెను.

శ్రీకృష్ణ భగవానుడు తన ఎడమకాలు కుడి కాలిపై వేచి చేతితో మురళిని ధరించి, చిరునవ్వు విరాజిల్లు మోముతో కోటి మన్మధులను సహితము మోహింపజేయగల సౌందర్యముతో ప్రకాశించుచుండెను. శిరము నందు బహుమూల్య నవరత్న ఖచిత కిరీటము, చెవులయందు మకర కుండలములు, వక్షము నందు శ్రీవత్సము, కంఠము నందు హారములు, తమ తమ స్థానముల యందుండి భగవానుని శోభను మరింత ఇనుమడింపజేయుచున్నవి. ఇటువంటి దర్శనమును కాంచిన దేవతానీకము సర్వమూ ఆనంద సాగరమున ఓలలాడిరి. హర్షాతిరేకముచే వారి కన్నుల నుండి ఆనంద భాష్పములు వెలువడినవి. ఆపుడు దేవతానీకము సర్వమూ రెండు చేతులూ జోడించి అత్యంత వినీతులై పరమ పురుషుడయిన శ్రీకృష్ణ చంద్రునకు ప్రణామము లాచరించిరి.

మూడవ అధ్యాయము

(భగవానుడయిన శ్రీకృష్ణుని యందు విష్ణ్వాది దేవతల ప్రవేశము. దేవతలు భగవానుని స్తుతించుట. భగవానుడు అవతారము స్వీకరించుటకు నిశ్చయించుట. శ్రీ రాధాదేవి చింతించుట. భగవానుడు ఆమెను ఆశ్వాసించుట)

జనకుడు తిరిగి ప్రశ్నించెను " మునివర్యా! మహాత్ముడు, భగవానుడయిన శ్రీకృష్ణచంద్రుని దర్శన ప్రాప్తి పొందిన పిదప సమస్త దేవతానీకము ఏమి చేసిరో నాకు దయచేసి వివరముగ తెలుప వలసినది."

నారదుడు ఈ విధముగ చెప్పదొడెంగెను – ఓ! మహరాజా! ఆ సమయము నందు అందరూ చూచుచుండగా అష్ట భుజధారి అయిన భగవానుడు శ్రీ హరి లేచి సాక్షాత్ శ్రీకృష్ణునిలో లీనమాయెను. అదే సమయము నందు ప్రచండ పరాక్రముడు, కోటి సూర్య కాంతితో వెలుగొందు నృశింహస్వామి అచటికి విచ్చేసి శ్రీకృష్ణ భగవానుని యందు లీనమాయెను. అటు పిదప సహస్రభుజుడు, విరాట్పురుషుడు, శ్వేత ద్వీప నారాయణుడు తెల్లని, లక్ష హయములు పూన్చబడిన రధములో అచటకు ఏతెంచెను. ఆయన వెంట లక్ష్మీదేవియు కలదు. ఆయన తన అనేక హస్తముల యందు రకరకములయిన ఆయుధములను ధరించియుండెను. ఆయన నలుప్రక్కలా పార్షదులు సేవించుచుండగా లక్ష్మీ సమేతముగా సాక్షాత్ శ్రీ కృష్ణుని యందు లీనమాయెను.

ఇంతలో పూర్ణ స్వరూపుడు, కమలలోచనుడయిన భగవానుడు శ్రీరామచంద్రుడు స్వయముగా ఏతెంచెను. ఆయన ఆ సమయమున ధనుర్బాణములు ధరించి, సీతాదేవియు భరతాది సహోదర సహితుడై పది కోట్ల సూర్యుల సమానమయిన కాంతిగల రధము నందు తన ఆసనమునకు ఇరువైపులా చామరములు విసురబడుచుండగా సుఖాసీనుడైయుండెను. అసంఖ్యాకులయిన వానరయూధపతులు ఆయన యొక్క రక్షణ కార్యమందు సంలగ్నులైయుండిరి. ఆ రధము యొక్క లక్షలాది చక్రముల ఘోష గంభీరమేఘ గర్జనను తలపించుచున్నది. ఆ రధము సువర్ణమయమై, లక్ష హయములు పూన్చబడి అనేక పతాకములచే అలంకృతమైయున్నది. ఇటువంటి రధము నందు వేంచేసిన శ్రీరామచంద్ర ప్రభువు శ్రీకృష్ణ భగవానుని యందు లీనమాయెను. తదుపరి ప్రళయకాల అగ్నిశిఖ వలె జ్వాజ్వల్యమానముగ ప్రకాశించుచున్న యజ్ఞనారాయణుడు తన ధర్మపత్ని అయిన దక్షిణ సహితుడై జ్యోతిర్మయి రధము నందు సాక్షాత్కరించెను. వారునూ శ్యామ విగ్రహుడయిన శ్రీకృష్ణ పరమాత్మ యందు లీనమయిరి.

అటుపిదప వర్షాకాల మేఘ సదృశ కాంతి శరీరులు, చతుర్భుజులు, విశాల నేత్రులు, ముని వేషధారులు అయిన నర నారాయణులు ఏతెంచిరి. వారిరువురి జటా జూటములు కోట్లాది మెరుపు తీగల వలె ప్రజ్వరిల్లుచెండెను. వారి కాంతి నలుచెరుగులా ప్రకాశించుచుండగా భగవానుడయిన నారాయణముని అఖండ బ్రహ్మచర్య దీక్షచే శోభించెను. సమస్త దేవతానీకము అమితాశ్చర్య చకితులై, చేష్టలుడిగి వారి వైపు చూచుచుండగా వారు సహితము శ్రీకృష్ణ భగవానుని యందు లీనమయిరి. ఇట్టి విలక్షణమయిన దివ్య దర్శనము కలిగిన దేవతలకు ఆశ్చర్యము కలిగినది. అపుడు వారందరికీ శ్రీకృష్ణుడు, పరిపూర్ణతముడయిన భగవానుడనే భావన పూర్తిగా రూఢి అయినది. అనంతరము వారు ఇట్లు స్తుతింపదొడంగిరి–

"పూర్ణపురుషుడు, పరములకు పరము, యజ్ఞాధిపతి, కారణముకు కారణము, పరిపూర్ణ పరమాత్మ, గోలోకాధీశుడు, శ్రీ రాధావరుడు, అయిన శ్రీకృష్ణ చంద్రునకు సాదర సాంజలి బంధ దండ ప్రమాణములు ఆచరించుచున్నాము. యోగీశ్వరులు పరమ తేజ: పుంజమనియు, శుద్ధాంత: కరణులయిన భక్తాగ్రేసురులు లీలామానుష దేహధారి అయిన అవతార పురుషుడనియు, పేర్కొందురు. కానీ, ఈ రోజు కలిగిన దివ్య దర్శనము వలన కలిగిన అనుభూతి వల్ల మీరు అద్వైతులు, అందరికీ, అన్నిటికీ అభిన్నులు అయిన అద్వితీయులు.

అంతేకాక మీరు మహత్తరమయిన తత్వములకు సహితము అధిపతులు. అటువంటి పరమేశ్వర పరబ్రహ్మకు

మా నమస్సుమాంజలులు. ఎందరు విద్వాంసులు వ్యంజము, లక్షణము, స్ఫోటము ద్వారా మిమ్ములను తెలిసికుందుకు ప్రయత్నించెదరో, వారి ప్రయత్నములన్నియు వ్యర్ధము. ఎందుకు అనగా మీరు నిర్దుష్ఠ భావరహితులు. మాయా రహితమయిన నిర్గుణ పరబ్రహ్మను మేము శరణు వేడుచున్నాము. కొందరు మిమ్ములను "బ్రహ్మ" ముని తలంచెదరు. మరికొందరు "కాలము" అని వ్యవహరించెదరు. మరికొందరు "శుద్ధ ప్రశాంత స్వరూపు" లనియు, కతిపయ మీమాంసకులు "కర్మ" మనియు వ్యవహరించెదరు. కొందరు ప్రాచీనులు "యోగ" మనియు, మరి కొందరు "కర్త" అనియు తలపోసెదరు. ఈ రకముగ విభిన్న సాంప్రదాయములు వివిధ రకములుగ మిమ్ములను తెలిసినప్పటికీ, వస్తుత: ఏ ఒక్కరూ మిమ్ములను ఎరిగిన వారు లేరు. అనిర్వచనీయులు, అచింత్యులు, అనిర్దేశ్యులు అయిన భగవానుడా! మీ శరణు కోరుచున్నాము. మీ పాదసేవ అనేక కళ్యాణములను ప్రసాదించునది. దీనిని వదలి తీర్ధాటనము, యజ్ఞము, తపము, జ్ఞానసముపార్జన మిక్కిలి విఘ్నములతో కూడి ప్రయాసకరమయినది. భగవాన్! మీకు మేము ఏమి నివేదించగలము? మీరు స్వయముగ చరాచర ప్రపంచము యొక్క అణువణువు యుందునూ ప్రకాశించుచున్నారు. మీ వద్ద ఏమియు దాచగలిగినది లేదు. శుద్ధాంత: కరుణులు, దేహబంధ విముక్తులు, అయిన విష్ణ్వాది దేవతలు సహితము మీకు నమస్కరించుచున్నారు. అటువంటి పురుషోత్తమ భగవానులయిన మీకు మా సాంజలి బంధ నమస్కృతులు.

ఎవరు శ్రీ రాధాదేవి హృదయమును శోభింపజేయు చంద్రహారమో, ఎవరు గోపికల యొక్క జీవనమునకు మూలాధారమో, గోలోక ధామము నందు పతాకము వలె అలంకృతమయిన ప్రభువో, అటువంటి ఆదిదేవా! ఓ భగవానుడా! మీరు బృందావనమునకు స్వామి. వ్రజభూమికి అధినాయకులు. "గిరిరాజపతి" అని కూడా ప్రసిద్ధి పొందియున్నారు. గోపాలునిగా అవతరించి అనేక నిత్య విహారలీలలు జరిపిన మాట వాస్తవము. మీరు శ్రీ రాధాదేవి యొక్క ప్రాణ వల్లభులు, మరియు శృతిధరులకు ప్రభువు. మీరు గోవర్ధనధారులు. ఇప్పుడు ధర్మభారము వహించి పృధివిని ఉద్ధరించి మమ్ము కృతార్ధులనుజేయుడు."

ఇట్లు స్థుతించిన దేవతలను చూచుచూ భగవానుడయిన శ్రీకృష్ణ చంద్రుడు మేఘ గంభీర స్వరముతో ఇట్లు సంభాషించెను, బ్రహ్మ, శంకరా, మరియు అన్య దేవతలారా! నా మాటలను పూర్తిగా వినవలసినది. మీ భార్యలతో సహితముగా, మీ అంశలతో అందరూ యదుకులములో జన్మించవలసినది. నేను కూడా అవతారము స్వీకరించి పృధివీభారమును దూరము చేయగలను. నేను యదుకులము నందు ప్రాదుర్భవించి మీమీ కార్యములన్నింటినీ సంపూర్ణము చేయగలను. వేదములు నా వాణి. బ్రాహ్మణులు నా ముఖము. గోవులు నా శరీరము. దేవతలు నా అంగములు. సాధు పురుషులు నా హృదయములో సంచరించు ప్రాణములు. ప్రతి ప్రత్యేక యుగము నందు ధంభాచారులయిన దుష్టుల ద్వారా సాధు పురుషులు పీడింపబడినపుడు, మరియు ధర్మము, యజ్ఞము, దయలకు విఘాతము కలిగినపుడు నేను స్వయముగ భూతలమునందు ప్రాదుర్భవించెదను.

ఇట్లు జగత్పతి శ్రీకృష్ణ భగవానుడు వచించుచుండగా అదే క్షణమున శ్రీ రాధికాదేవి "నా ప్రాణ విభునితో నాకు వియోగము తప్పదు" అని వ్యాకుల పడి దావానలము చే దగ్ధమయిన లేత లత వలె మూర్ఛితురాలై క్రింద పడెను. ఆమె శరీరము రోమాంఛితమై కంపించెను. కన్నులు అశ్రుపూర్ణములాయెను. శ్రీ రాధాదేవి ఇట్లు ప్రవచించెను. " ఓ ప్రాణనాధా! భూభారము తగ్గించుటకు మీరు అవశ్యము వెళ్ళవలసినది. కానీ నా ప్రతిజ్ఞను కూడా వినవలసినది. మీరు వెళ్ళిన పిదప నేను ఇచ్చట క్షణము సహితము ప్రాణములతో ఉండలేను. మీరు నా ప్రతిజ్ఞను వినని ఎడల మరల చెప్పుచున్నాను.నా ప్రాణములు నన్ను విడుచుటకు విహ్వలములగుచున్నవి. అవి ఈ శరీరమును కర్పూరమును ధూళి కణములు విడుచునట్లు విడుచుటకు సమాయత్తమగుచున్నవి.

శ్రీకృష్ణ భగవానుడు ఇట్లు వచించెను. "ఓ రాధికా! విచారించవలదు. నేను నీ తోడుగా నడచి భూభారమును నివారించెదను". శ్రీ రాధాదేవి "ప్రభూ! బృందావనము, గోవర్ధనము, యమున లేని ప్రదేశము నా హృదయమునకు సుఖప్రదము కాదు". నారదుడు తిరిగి చెప్ప దొడంగెను " శ్రీ రాధాదేవి పలుకులాలకించిన శ్రీ కృష్ణ భగవానుడు గోవర్ధన పర్వతమును, యమునా నదినీ, తన గోలోక ధామమందలి 84 క్రోసుల భూమిని భూతలమునకు పంపెను. అపుడు సమస్త దేవతానీకము పితామహుడయిన బ్రహ్మదేవుని తో సహితము శ్రీ కృష్ణ భగవానునకు తిరిగి తిరిగి

ప్రణామము లాచరించిరి. తిరిగి బ్రహ్మదేవుడు ఈ విధముగా వచించెను. “భగవాన్! నా స్థానమేమి? మీరు ఎక్కడ ప్రాదుర్భవించెదరు? ఈ దేవతలందరూ ఏఏ గృహములయందు జన్మనొందనున్నారు? ఏ నామములతో ప్రసిద్ధి పొందనున్నారు?” భగవానుడు సమాధానమీయ దొడంగెను, “ నేను స్వయముగా దేవకీ, వసుదేవులకు జన్మించెదను. నా కళాస్వరూపమయిన శేషుడు రోహిణీ గర్భమందు జనించును. ఇందులకు సందియము లేదు. సాక్షాత్ లక్ష్మీదేవి మహారాజు భీష్మకునకు సుపుత్రిక రుక్మిణి గా ఆవిర్భవించును. పార్వతీ జాంబవతిగా యజ్ఞపురుషుని భార్య దక్షిణాదేవి లక్షణ నామధేయము తో ప్రసిద్ధి పొందెదరు. ఇక్కడ యున్న విరాజనది కాళిందీ నామము తో విఖ్యాతి పొందును. భగవతి లజ్జ, భద్రగానూ, సమస్త పాపములను నశింపజేయు గంగ మిత్రవిందగనూ, ఆవిర్భవించెదరు. కామ దేవుడయిన మన్మథుడు రుక్మిణీ పుత్రుడయిన ప్రద్యుమ్నునిగనూ, అతని తనయుడు అనిరుద్ధుని గ నీవు (బ్రహ్మ) ప్రాదుర్భవించెదరు. ఇందు సందేహము లేదు. వసువుల యందు ప్రసిద్ధుడయిన ద్రోణుడు నందుని గనూ, ఆతని ప్రాణప్రియ అయిన ధరాదేవి యశోదగనూ, సుచంద్రుడు వృషభానునిగనూ, అతని భార్య కళావతి కీర్తిదేవిగనూ ఆవిర్భవించెదరు. వారి ద్వారా ఈ రాధికాదేవి ప్రకటిత మగును. నేను వ్రజమండలమందు గోపికలతో ఎప్పుడు రాసలీల కొనసాగించగలను.

(గర్గసంహిత యందలి గోలోకఖండమందలి నారద బహుళాశ్వ సంవాదము నందలి “భూతలము నందు అవతార దీక్షా స్వీకరణ వర్ణనయను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(నందుడు మొదలగు వారి లక్షణములు, గోపికా యూథ పరిచయము, శృతుల యొక్క గోపికా భావ ప్రాప్తియొక్క కారణము, వివరణ)

భగవానుడు తన సమాధానమును కొనసాగించెను “సుబలుడు, సుదాముడు అను నా సఖులు నందుడు ఉపనందుని ఇంట జన్మించెదరు. అట్లే నా ఇతర సఖులు స్తోకకృష్ణ, అర్జున, అంశు మొదలగు వారు నవ నందులుగా జన్మించెదరు. వ్రజ మండలమందు ఆరుగురు వృషభానులుండెదరు. వారి ఇంట వరుసగా విశాలుడు; ఋషభుడు; తేజస్వీ; దేవప్రస్తుడు; మరియు వరుథపుడు మొదలగు నా సఖులు జన్మనందెదరు. అంత బ్రహ్మదేవుడు ఈ విధముగా ప్రశ్నించెను “దేవేశ్వరా! ఎవరిని నందుడని పిలువవలెను? ఉపనందులు మరియు వృషభానుల యొక్క లక్షణములు ఏవి?

భగవానుడు తిరిగి సమాధాన మిచ్చెను “ ఎవరు గోశాల యందు గోవుల యొక్క సంరక్షణ చేయుచుండునో, ఎవరికి కేవలము గో సంరక్షణమే జీవన విధియో, వానిని గోపాలుడని పిలువవలెను. గోపాలురతో పాటు 9 లక్షల గోవులకు అధిపతి అయిన ఆతడు “నందుడు” అని ప్రస్తుతింపబడును. ఎవరు 10 లక్షల గోవులకు అధిపతియో ఆతడు “వృషభానుడ”ని పిలువబడును. ఎవరు తన ఏలుబడిలో “కోటి” గోవుల సంరక్షణ చేయునో ఆతడు “నందరాజు” అని ప్రస్తుతింపబడును. 50 లక్షల గోవులు ఎవని ఏలుబడిలో యుండునో వానిని “వృషభానువరుడు” అని తెలియవలసినది. సుచంద్రుడు ద్రోణుడు ఈ ఇరువురు ఇటువంటి సంపూర్ణ లక్షణ సంపన్నులు, కావున గోపరాజులగుదురు. నా దివ్య వ్రజము నందు సుందర వస్త్రధారణజేయు శతచంద్రానన వద్ద వంద యూథములు గోప సుందరీ సమూహములు యుండును.

బ్రహ్మదేవుడు తిరిగి ఈ విధముగ ప్రశ్నించెను “భగవన్! మీరు దీనజన బంధువులు మరియు జగత్తుకు ప్రకృతికి

కారణభూతులు. దయ చేసి "యూధము" యొక్క లక్షణములను వర్ణింప వలసినది". తిరిగి భగవానుడు చెప్ప నారంభించెను. "బ్రహ్మదేవా! పూర్వము మునులు పది కోట్లు ఒక అద్బుదముగనూ, పది అద్బుదములు ఒక యూధముగనూ గణించిరి. ఇక్కడి గోపికలు కొంతమంది గోలోక వాసినులు. కొంతమంది ద్వారపాలికలు. కొందరు శింగార సాధనల వ్యవస్థ నడిపేవారు.

"కొంతమంది శయ్యాగృహముల శుభ్ర సంచాలికలు, కొంతమంది పార్షద కోటిలోనివారు. కొందరు వ్రజభూమి పర్యవేక్షకులు. కొంత మంది గోవర్ధన పర్వత వాసినులు. మరి కొంత మంది నా నికుంజము నందు నివసించుచూ ఈ కుంజవన సంరక్షణ, అలంకరణము నందు సంలగ్నులు. వీరందరూ కూడా వ్రజభూమికి ప్రయణము కావలసినదే! అట్లే గంగా, యమునా నదులందు కూడా యూధములు కలవు. అట్లే నా వ్రజము నందు 8, 16, 32 సఖుల యూధములు కలవు. పూర్వ యుగములు యందు వేదములు, మునిపత్నులు, అయోధ్యావనితలు, యజ్ఞము నందు స్తాపింపపడిన స్వర్ణ సీతలు, జనకపురి, మరియు కోసల దేశమందలి ఇంతులు, మరియు పుళింద కన్యకలు, పూర్వ యుగములందు నాచే వరమొందిన పుణ్యశీలురు, వారందరునూ పుణ్యభూమి అయిన వ్రజభూమి యందు గోపికల రూపములో విహరించెదరు".

బ్రహ్మదేవుడు తిరిగి ప్రశ్నించెను "పురుషోత్తమా! ఈ స్త్రీలు ఏఏ పుణ్యములు చేసి ఏఏ వరములనొంది, ఆ వర విశేషముగ వ్రజనివాసమను ఫలమును పొందిరి? ఎందుకనగా ఈ స్థానము యోగులకు సహితము దుర్లభము". భగవానుడు తిరిగి చెప్పదొడండెను " పూర్వము శృతులన్నియును, శ్వేత ద్వీపమునకు ఏగి నా స్వరూపుడు, పరబ్రహ్మ, విరాట్పురుషుని మధుర స్వరముతో కీర్తించినవి. దానికి సంతోషించిన విరాట్పురుషుడు ప్రసన్నుడై ఈ విధముగా పలికెను "శృతులారా! నాకు ఎవని యందు ప్రీతి కల్గినదో వానికి దుర్లభమయిన వస్తువు లేదు. మీ చిత్తమునకు నచ్చిన వరము కోరుకొనుడు" శృతులు ఈ విధముగా బదులిచ్చినవి "భగవాన్! మీరు వాక్కు, మనస్సుకు అందరు. మేము మిమ్ము తెలిసికొనుటకు అసమర్ధులము. పురాణ వేత్తలు, జ్ఞానులు మిమ్ము "పరమానంద స్వరూపులు" గా పేర్కొందురు. ప్రభో! మీకు మాయందు దయకల్గి వరమీయదలిచినచో ఆ ఆనంద స్వరూపము యొక్క దర్శనము కావింపుడు".

శృతుల యొక్క కోరికను విన్న భగవానుడు వాటికి, ప్రకృతికి పరమయిన తన దివ్య గోలోక ధామము యొక్క దర్శనము కావించెను. అది కేవలము నిర్వికారము, అవినాశి, మరియు జ్ఞానానంద స్వరూపము. అందు బృందావనమను వనము కలదు. అది ఇష్టకామ్యార్ధ సాధక అయిన కల్పవృక్షములతో సుశోభితమై యుండును. మనోహర నికుంజములతో సంపన్నమయిన ఆ బృందావనము సర్వ ఋతువుల యందునూ పరమసుఖదాయకముగయుండును.

అందు అనేక జలపాతములకు ఆలవాలమై అనేక గుహలతో నిండిన గోవర్ధనమను పర్వతరాజము కలదు. అనేక రత్నములు, ధాతువులతో నిండిన ఆ శ్రీపర్వతము, అనేక సుందర కారండవములకు నిలయమై యుండును. అచ్చట స్వచ్ఛ జలములతో నిండిన శ్రేష్ఠనది యమున ఉత్తుంగ తరంగములతో ప్రవహించుచుండెను. రత్నమయమయిన ఒడ్లు ఆ యమున కిరువైపులా ప్రకాశించు చుండగా మధ్యలో యమున హంస, కారండవాది పక్షులతో, కమలములాది పుష్పములతో మందగమనయై పయనించుచుడును. అచ్చట వివిధ ఉత్తమ గోపికా సముదాయములు కనిపించును. వారి మధ్య గోప కిశోరుడయిన శ్రీ కృష్ణ భగవానుడు విరాజిల్లుచుండును. ఈ విధముగా శృతులకు తన నిజనివాసమును భగవానుడు చూపి ఈ విధముగా ప్రశ్నించెను. "మీరు నా నిజ నివాసమును వీక్షించిరి. దీనకి వేరుగా ఇంకేదియును లేదు. మీ కొరకు నేను ఇంకా ఏమి చేయగలను?"

శృతులు ఈ విధముగా బదులిచ్చినవి "ప్రభో! కోటి మన్మధులను మించిన మీ మనోహర దివ్య విగ్రహ దర్శన భాగ్యము వలన మా యందు కామినీ భావము ఉత్పన్నమయినది. మాకు మీతో రమించవలెనదు కోరిక ఉదయించినది. మేము విరహతాపముచే సంతత్పులమగుచున్నాము. ఇందు సందేహము లేదు. మీ లోకములో నివసించు స్త్రీలు మీ పొందుకోరుటకై ఎట్లు మీ సేవ చేయుచున్నారో అట్లే మాకునూ చేయవలెనన్న అభిలాష కలుగుచున్నది." శ్రీహరి ఇట్లు పలికెను "శృతులారా! మీ కోరిక బహు దుష్కరమైనది. అయిననూ మీకు వరమిచ్చుట వలన అది సత్యమయి తీరును. తిరిగి పున: సృష్టి జరిగినపుడు బ్రహ్మ సృష్టిరచన యందు సంలగ్నుడు అగును. అపుడు సారస్వత కల్పము గడచిన

పిమ్మట మీరందరూ వ్రజభూమి యందు గోపికలగుదురు. భూ మండలమందలి భరత వర్షము నందు మధురా మండలాగ్గతమయిన బృందావనము నందు రాసమండలిలో నేను మీకు ప్రియతముడనగుదును".

భగవానుడు తిరిగి ప్రవచించెను. "బ్రహ్మదేవా! పూర్వ కల్పమందు నా వర ప్రభావము వలన శృతులన్నియునూ ఇప్పుడు వ్రజభూమి యందు గోపికలగుదురు. ఇప్పుడు ఇతర గోపికల ఆవిర్భావము వినుము – త్రేతాయుగము నందు నేను దేవతల రక్షణ, రాక్షస సంహరణ, కొరకై స్వస్వరూప భూతుడు, అమిత పరాక్రమోపేతుడు అయిన శ్రీ రామ చంద్రుని గా అవతరించితిని. కమల లోచనుడయిన శ్రీ రామ చంద్రుడు ధనుర్భంగము గావించి జనక నందిని అయిన సీతాదేవిని చేపట్టెను.

ఆ సమయము నందు జనకపురి వనితలు శ్రీ రామచంద్రుని చూచి ప్రేమ విహ్వలులైరి. వారు ఏకాంతము నందు ఆ మహానుభావుని చేరి తమ అభిమతమును ఈ విధముగా తెలిపిరి "రాఘవా! మీరు మా యొక్క పరమ ప్రియులు కావలసియున్నది." అపుడు శ్రీ రాముడు "సుందరీమణులారా! మీరు విచారించవలదు. ద్వాపర యుగాంతమున మీ కోరిక సిద్ధించును. మీరందరూ పరమ శ్రద్ధ, భక్తి తత్పరులై తీర్ధయాత్ర, తపము, దానము, శౌచము మరియు సదాచార పాలన కావింపుడు. మీకు వ్రజభూమి యందు గోపికలుగా అవతరించు ప్రాప్తి కలుగును". ఈ విధముగ జనకపురి వనితలకు వరమొసంగి ధనుర్ధారి, కృపానిధి, అయిన శ్రీ రామ చంద్రుడు అయోధ్యకు ప్రయాణమయ్యెను. మార్గ మధ్యము నందు తన ప్రతాపముచే భృగుకుల నందనుడయిన పరశురాముని పరాజితుని కావించెను. కామదేవుని సహితము మోహింపజేయు సుందర విగ్రహుడయిన శ్రీ రామచంద్ర ప్రభువును కోసల రాజ్య చెల్వలు వీక్షించి తమ మనస్సునందు ఆయననే పతిగా ప్రతిష్ఠించుకొనిరి. సర్వజ్ఞుడయిన శ్రీ రామచంద్రుడు ఆ క్షణముననే వారందరికీ వర ప్రదానము కావించెను. "మీరందరునూ వ్రజభూమి యందు గోపికలగుదురు. ఆ సమయమున మీ అభీష్టసిద్ధి కలుగును. ఆయన తిరిగి సీతా సహితుడై, సైనికులతో అయోధ్య నగర ప్రవేశము గావించెను. ఆ సమయమున అయోధ్య నగర భామినులు ఆయన సౌందర్యమును కాంచి ముగ్ధులయిరి. ప్రేమ విహ్వలము చే మూర్ఛితులయిరి. అటు పిమ్మట వారందరనూ శ్రీరామ వ్రతపరాయణులై సరయూ తటము నందు తపస్వులయిరి. ఆంత వారికి అశరీరవాణి ఇట్లు వినిపించెను. " ద్వాపరాంతమున, యమునా తీరమున బృందావనము నందు మీ మనోరథము పూర్ణమగును. ఇందు సందేహము లేదు".

అటు పిమ్మట పితృవాక్యానుసారము శ్రీ రాముడు ధనుష్పాణియై, సీతా లక్ష్మణ సహితుడై వనముల యందు సంచరించుచుండెను. అందు వనవాసులయిన మునులు గోపాల వేషధారి అయిన భగవానుని నిష్ఠగా పూజించుచుండిరి. రాసలీలా నిమిత్తమై భగవానుని ధ్యానించు చుండిరి. ఆ సమయమున వారికి జటామండిత శిరస్కుడు, ధనుష్పాణి, యవావస్థ యందున్న శ్రీ రాముని తమ ఆశ్రమ ద్వారమున ఆ మునులు కాంచిరి.

వారి ధ్యానము, సమాధి భంగమై, కోటి మన్మధాకారుడయిన శ్రీరాముని జూచి ఆశ్చర్య చకితులై "అహో! మన గోపాల ప్రభువు మురళిని, వేత్రమును విడిచి వచ్చినాడే!" అని తలపోసిరి. మనసునందు తర్కించుకొని అందరునూ శ్రీరామ చంద్రునకు నమస్కరించి స్తుతించిరి. వారిని సంతుష్టులును చేయుటకు శ్రీరాముడు వరము కోరుకొనమనగా ముని బృందమంతయు " ఎట్లు సీతాదేవి నీ ప్రేమకు పాత్రురాలో అట్లే మేమునూ నీ ప్రేమకు పాత్రులము కావలెను."

శ్రీరామచంద్ర ప్రభువు ఇట్లు వచించెను. "మీరు చేసిన ప్రార్ధన భిన్నముగ యున్నది. మీరు లక్ష్మణుని పై నా ప్రేమ వంటి భాతృప్రేమ ను కోరినచో ఈ జన్మము నందే మీ అభిమతమును పూర్ణము చేసెడివాడను. కానీ మీరు సీతా సదృశమయిన ప్రేమను కోరిరి. ఈ వరము బహు దుర్లభమయినది. ఎందుకనగా ప్రస్తుతము నేను ఏక పత్నీవ్రతుడను. ప్రాపంచిక ధర్మ మాచరించుట యందు మర్యాదా పురుషోత్తముడను. మీ వరము తీర్చుటకు ద్వాపరాంతమున మీకై జన్మ తీసికొని మీ మనోరథమును పూర్తి చేసెదను. ఈ విధముగా వరమొసగి శ్రీ రామ చంద్ర ప్రభువు పంచవటికి పయనించెను. అక్కడ నివసించుచూ వనవాస దీక్ష ముగించుచుండగా ఆయనను భిల్ల స్త్రీలు చూచిరి. చూచిన తడవే ఆయనను పొందవలెనన్న కోరిక ఉత్పన్న మగుటచే వారునూ ప్రేమ విహ్వలు లైరి. తడవుగా శ్రీరామ పాద ధూళిని శిరసు నందుంచుకొని ప్రాణ త్యాగము చేయుటకు నిశ్చయించిరి. ఆ సమయమున శ్రీ రాముడు బ్రహ్మచారి వేషము

ధరించి ఆ స్త్రీల వద్దకు వచ్చి " ఓ! పడతులారా! మీరు వ్యర్ధముగ ప్రాణములను త్యజించుచున్నారు. ద్వాపరాంతమున బృందావనము నందు మీ మనోరధము సఫలము కాగలదు. అందువల్ల ఆత్మహత్యకు పాల్పడవద్దని వారిని వారించి అక్కడ నుండి తక్షణమే అదృశ్యుడాయెను.

ఆ తదుపరి శ్రీరామచంద్రుడు సుగ్రీవాది వానర ప్రముఖుల సహాయముతో లంకను జేరి రావణాదులను సంహరించి తిరిగి సీతాదేవిని తీసికొని అయోధ్యకు తరలి వెళ్ళెను. లోకోపవాద కారణమున రాజాధిరాజైన శ్రీ రాముడు సీతాదేవిని అడవిలో వదలవలసివచ్చెను. ఎప్పుడెప్పుడు శ్రీరామచంద్రుడు యజ్ఞములు చేయునో అప్పుడప్పుడు స్వర్ణ సీతా విగ్రహములు చేయించి వాటితో యజ్ఞములు పూర్తి చేయువాడు. అందువలన శ్రీరామ భవనము నందు యజ్ఞ సీతా విగ్రహముల సముదాయము తయారయ్యెను. అవి అన్నియు దివ్య చైతన్య ఘన స్వరూపములు ధరించి శ్రీరాముని కడకేగి తమను స్వీకరించమని కోరినవి. అందుకు శ్రీ రామ చంద్రుడు "ప్రియురాళ్ళలారా! మిమ్ములను నేను స్వీకరింపలేను" అని నుడివిరి.

అపుడు పరమ ప్రేమ పరాయణులయిన సీతా మూర్తులు " మేము కూడా మీ సేవా పరాయణులము. మా నామధేయము "మిధిలేశ్వర కుమారి సీత". మేము ఉత్తమ వ్రత పరాయణుల మయిన సతులము. అయిననూ మీరు మమ్ము గ్రహింపకుడుంటకు కారణమేమి? మీరు యజ్ఞములు చేయునపుడు మేము మీకు అర్ధాంగులమై కార్యసంచలనము చేసితిమి. మీరు ధర్మాత్ములు మరియు వేదనుశరణీయులు. అయిననూ ఇటువంటి అధర్మ పూర్వకమయిన పలుకులు మీ ముఖారవిందము నుండి వెలువడుట తగదు. మీరు స్త్రీ హస్తమును గ్రహించి తిరిగి విడిచిపెట్టిన ఎడల పాపమును అనుభవించవలసి వచ్చును" అని హెచ్చరించిరి. ఆ స్వర్ణ సతీమణులకు శ్రీరామచంద్రుడు ఈ విధముగా సమాధానమిచ్చెను, "ఓ! సతులారా! మీరు ముచ్చటించిన విషయములు ఉచితము, మరియు సత్యము. కానీ నేను ప్రస్తుతము ఏక పత్నీవ్రతము నందు యున్నాను. మరియు లోకము నన్ను రాజర్షి అని సంబోధించుచున్నది. అందుచే నియమములను విడనాడలేను. కేవలము సీత మాత్రమే నాకు సహధర్మచారిణి. అందువలన ద్వాపరాంతమున మీరందరూ శ్రేష్ఠబృందావనము చేరవలసినది. అక్కడ మీ మనోభీష్ఠము పూర్తి యగును. భగవానుడయిన శ్రీహరి బ్రహ్మతో ఆ యజ్ఞసీతలు కూడా వ్రజభూమి యందు గోపికలగుదురు అని నుడివెను.

(గర్గ సంహిత యందు గోపాల ఖండము నందు భగవత్ బ్రహ్మ సంవాదము నందలి అవతార ఉద్దేశ్య విషయ ప్రశ్న యొక్క వివరణ అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఐదవ అధ్యాయము

(భిన్న భిన్న స్థానముల స్త్రీలు మరియు విభిన్న వర్ణముల స్త్రీలు గోపికలగుటకు కారణము మరియు అవతార వ్యవస్థ యొక్క వర్ణములు)

భగవానుడయిన శ్రీహరి ఇంకనూ చెప్పగొడండెను " వైకుంఠమున విరాజిల్లు రమాదేవి యొక్క చెలికత్తెలునూ, శ్వేత ద్వీపము నందలి చెలులు, భగవానుడు అయిన అజితుని (విష్ణువు) పదకమలములను ఆశ్రయించుకొన్న, ఊర్ధ్వ వైకుంఠ నివాసినులయిన దేవతా స్త్రీలు, సముద్రము నుండి శ్రీ మహాలక్ష్మిని సేవించుటకు వెలువడి శ్రీలోకాచల వాసినులయిన సముద్రకన్యలు, వీరందరూ కూడా భగవానుడయిన కమలాపతి యొక్క వరము వల్ల గోపికలుగా జన్మించెదరు. పూర్వ పుణ్య కర్మ ఫల వశమున దివ్య, అదివ్య, సత్య, రజస్, తమో గుణయుతులయిన ఎందరో యువతీమణులు సహితము వ్రజభూమి యందు గోపికలగుదురు. రుచీదేవి పుత్రుడు, రుచిర విగ్రహుడు, ద్యులోకపతి అయిన భగవానుడు యజ్ఞుని చూచి అనేక దేవాంగనలు మోహితులయిరి. వారందరూ దేవల మహర్షి ఉపదేశము పొంది హిమాలయమునందు

అత్యంత భక్తి శ్రద్ధలతో తపమాచరించుచుండిరి. వారు కూడా వ్రజభూమి యందు గోపికలుగా జన్మించెదరు.

ఒకప్పుడు భగవానుడయిన ధన్వంతరి భూతలము నుండి అంతర్ధానుడాయెను. అపుడు సమస్త ఔషధులు మిక్కిలి ఖేదపడి తమలో తాము నిష్ఫలములు గా భావించి సుందర స్త్రీ రూపము ధరించి సముద్ర గర్భమున ప్రవేశించి విశేషమయిన తపమాచరించినవి. ఇంతలో చతుర్యుగములు గడిచినవి. భగవానుడయిన హరి ప్రసన్నుడై వారి ఎదుట ప్రత్యక్షమై వరము కోరుకొన మనెను. ఆయన దర్శన మాత్రమున ఆ స్త్రీ రత్నములు అందరూ అమిత మోహితులై శ్రీహరిని పతిగా కోరిరి. అపుడు శ్రీహరి "స్త్రీ రూపము ధరించిన ఔషధులారా! ద్వాపరాంతమున మీరందరూ లతా రూపము ధరించి బృందావనమున నివసించండి. అపుడు రాసలీలా సమయమున నేను మీ మనోభీష్ఠమును పూర్తి కావించెదను.

శ్రీహరి బ్రహ్మదేవుని తో సంభాషణ కొనసాగించుచూ "బ్రహ్మదేవా! భక్తి భావము నందు పరిపూర్ణులయిన ఈ వరాంగనలు బృందావనము నందు లతాగోపికలగుదురు. అట్లే జాలంధర నగర స్త్రీలు, బృందాపతి అయిన శ్రీహరి దర్శనానంతరము మనసు నందు " ఈ శ్రీహరి మాత్రమే మనకందరకూ స్వామి" అని ధృధ సంకల్పము చేసికొనిరి. ఆ క్షణమే అశరీరవాణి ఈ విధముగా పలికినది "ఈ క్షణము నుండి మీరందరూ రమాపతి శ్రీహరి యొక్క ఆరాధన చేయవలసినది. మీరు కూడా బృందాదేవి వలె బృందావనము నందు భగవానుని ప్రియ గోపికలగుదురు. మత్స్యావతారము నందు సముద్ర కన్యకలు శ్రీహరి యొక్క దివ్య మంగళ స్వరూపమును వీక్షించి ముగ్ధులయిరి. వారునూ మత్స్య భగవానుని వరదానము వలన వ్రజము నందు గోపికలయిరి.

నా అంశ అయిన పృధు చక్రవర్తి గొప్ప యోధుడు మరియు పరాక్రమశాలి. ఆయన సంపూర్ణ శత్రు పరాజయము కావించి పృధివిని గోవుగా చేసి, తన అభీష్ఠ వస్తువులను పిండుకొనెను. ఆ సమయమున బర్హిష్మతీ నగర వాసినులయిన స్త్రీలు ఆయన సౌందర్యాతిరేకమునకు ముగ్ధులై, మోహించిరి. వారు అందరూ అత్రి మహర్షి కడకేగి "ఓ! మహామునీ! పృధు చక్రవర్తి సమస్త రాజనీకమునకు తలమానికము. ఆయనను భర్తగా పొందుట ఎట్లు? సెలవీయవలసినది". అత్రి మహర్షి వారికి ఆ ధేనువును చూపి ఈ గోవు సమస్త పదార్ధములు ధరించు ధరణీదేవి. మీ మనోరధములు దుర్గమములయిననూ, సముద్రముల పోలు అగాధములయిననూ, ఈ గోవు యొక్క పాలతో అవి ఈడేర్పబడును. అంత ఆ స్త్రీ రత్నములు తమ మనసులను పాత్రగా చేసి, తమ మనో రధములను పాలను పిండుకొన్నవి. వారందరునూ బృందావన గోపికలగా జన్మించనున్నారు.

ఒకప్పుడు మన్మధుని సేన అయిన అత్యంత మనోహరలయిన అప్సరసలు నారాయణ మహర్షి తపోభంగము చేయుటకై గంధమాదన పర్వతము చేరిరి. కానీ ఆయనను చూసిన తక్షణమే చేష్ఠలుడిగి ఆయన సౌందర్యమునకు నిశ్చేష్ఠులైరి. అంతలో మనసు నందు వారందరికీ భగవానుని పతిగా బడయవలెనన్న తీవ్రమయిన కోరిక ఉత్పన్నమయినది. అంత సిద్ధ తపస్వి అయిన నారాయణ మహర్షి "మీ మనోభీష్ఠము మీరు వ్రజభూమి యందు గోపికలయినపుడు ద్వాపరాంతమున నెరవేరును" అని వరమొసెగెను.

సుతల దేశము నందలి స్త్రీలు వామన భగవానుని కాంచి ఆయనను పతిగా వాంఛించిరి. ఆయన వారిని తపస్సు చేయుటకు ప్రేరేపించెను. వారునూ బృందావన గోపికలుగా జన్మించెదరు. అనేక నాగరాజ కన్యకలు భగవానుడయిన శేషుని పతిగా పొందుటకై ఆయనను సేవించిరి. వారునూ బలదేవునితో రాస క్రీడ యందు పాల్గొనుటకు బృందావనమున జన్మించెదరు.

కశ్యపుడు వసుదేవుని గనూ, పరమ పూజ్యురాలైన అదితీదేవి, దేవకీ దేవి గనూ ఆవిర్భవించెదరు. ప్రాణుడు అను వసువు శూరసేనుని గనూ, ధ్రువుడు అను వసువు దేవకుని గనూ, వసువు అను వసువు ఉద్ధవుని గనూ జనన మందెదరు. దయా పరాయణుడయిన దక్ష ప్రజాపతి అక్రూరుని గనూ, కుబేరుడు హృదీకుని గనూ, జలాధిపతి అయిన వరుణుడు కృతవర్మ గనూ ప్రసిద్ధి పొందెదరు. పురాతన మహారాజు అయిన ప్రాచీన బర్హి గదునిగనూ, మరుత్తులు ఉగ్రసేనుని గనూ, దేహధారణ చేయుదురు. ఇందు ఉగ్రసేనుని నేను రాజుగ ప్రకటించి ఆయనకు రక్షణ కవచముగ

స్వయముగ నేను నిలుచుందును. పరమభక్తుడు అంబరీషుడు యుయుధానుని గనూ, పరమ భాగవతోత్తముడు ప్రహ్లాదుడు సాత్యకి గనూ ప్రకటిత మగుదురు.

క్షీర సాగరము శంతన మహారాజు అగును. వసు శ్రేష్ఠుడు అయిన "ద్యు"లేక "ప్రభాసుడు" భీష్మునిగ అవతరించును. దివోదాసు శాలునిగనూ, భగుడు అను సూర్యుని అంశ దృతరాష్ట్రుని గనూ, రూపుదిద్దు కొందరు. పూష పాండురాజు గనూ, సత్పురుషులచే ఎల్లప్పుడూ నమస్కరింపబడు ధర్ముడు యుధిష్ఠిరునిగనూ, సాక్షాత్ వాయుదేవత మహా పరాక్రమశాలి అయిన భీమసేనుని గనూ, స్వాయంభువ మనువు అర్జునుని గనూ, శతరూప సుభద్ర గనూ, సూర్య భగవానుడు కర్ణుని గనూ, అశ్వనీ కుమారులు నకుల, సహదేవులుగ అవతార స్వీకరణ చేయుదురు.

ధాత మహాబలశాలి అయిన బాహ్లికుని గనూ; అగ్ని ద్రోణాచార్యుని గనూ; కలి దుర్యోధనుని గనూ, చంద్రుని అంశ అభిమన్యుని గనూ, విఖ్యాతి గాంచెదరు. ద్రోణ పుత్రుడయిన అశ్వత్థామ సాక్షాత్ శంకర భగవానుని ప్రతి రూపమే! ఈ ప్రకారముగ మీ దేవతలందరూ నా ఆజ్ఞానుసారము మీమీ అంశలతో, మీ సతీమణులతో సహా యదు, కురు మరియు ఇతర వంశముల యందు జన్మించ వలసినది. పూర్వ కాలమందు నేను ఎపుడు అవతారము స్వీకరించిననూ నా రాణులందరూ రమాదేవి అవతారములే. వారందరూ నా రాణులుగ పదహారు వేలమంది ప్రకటిత మగుదురు".

కమలాసనుడయిన బ్రహ్మకు ఈ విధముగ బోధించి నారాయణుడు దివ్యరూపధారిణి భగవతి యోగమాయతో ఇట్లనియె "మహామతీ! నీవు దేవకి యొక్క ఏడవ గర్భమును వెలికి తీసి దానిని వసుదేవుని పత్ని అయిన రోహిణి యందు ప్రవేశపెట్టుము. ఆ దేవి కంసుని భయమున వ్రజభూమి యందు నందుని ఇంట నివసించును. నీవును ఒక అలౌకిక కార్యము కొరకు నందుని భార్య అయిన యశోద గర్భము నందు ప్రవేశింపుము".

నారదుడు తిరిగి ప్రవచించెను "పరమ శ్రేష్ఠుడవయిన మహారాజా! భగవానుడయిన శ్రీకృష్ణుని పలుకులు ఆలకించి బ్రహ్మదేవుడు సమస్త దేవతానీకముతో కలసి పరాత్పరుడయిన శ్రీకృష్ణ భగవానునికి ప్రణమిల్లి ధీర వచనముల ద్వారా పృథివీ దేవిని స్వాంతపరచి తన నిజ స్థానము నకు చనెను. మిథిలేశ్వరా! జనకా! శ్రీ కృష్ణ చంద్రుని నీవు సాక్షాత్ పరిపూర్ణ పరమాత్ముని గ తెలియవలసినది. కంసుడు మొదలయిన దుష్టుల వినాశము కోసమే ఆయన ఈ అవతార పరిగ్రహణ చేసి ధరాతలమునకు విచ్చేసెను. శరీరము నందు ఎన్ని రోమముల కలవో అన్ని జిహ్వాలు ఉన్నప్పటికీ, శ్రీకృష్ణ భగవానుని అసంఖ్యాక మహత్వ గుణములను పొగడ నశక్యము. పక్షి గణములు ఎట్లు తమ శక్త్యానుసారము ఎత్తుకు ఎగురగలవో, అట్లే జ్ఞానులు సహితము తమ బుద్ధ్యానుసారము శ్రీ కృష్ణ భగవానుని లీలలను గానము చేయుదురు.

(శ్రీ గర్గ సంహిత యందలి గోలోక ఖండాత్గమున నారద
బహుళాశ్వ సంవాదము నందు అవతార వ్యవస్థయను
అయిదవ అధ్యాయము సంపూర్ణము)

ఆరవ అధ్యాయము

(కాలనేమి యొక్క అంశతో ఉత్పన్నమయిన కంసుని బలపరాక్రమములు
మరియు అతని దిగ్విజయ యాత్ర)

బహుళాశ్వుడు ప్రశ్నించెను " ఓ! దేవర్షి శిరోమణీ! మహా బలవంతుడు మరియు పరాక్రమోపేతుడు అయిన కంసుని పూర్వజన్మ వృత్తాంతమేమి? ఈతడు మునుపు పూర్వ జన్మమున ఏ దైత్య రూపము తో విఖ్యాతుడాయెను? ఈతని పూర్వ కర్మ, గూర్చి నాకు వివరముగ తెలియజేయ వలసినది. నారద మహర్షి చెప్పదొడంగెను "మహారాజా! చాలా కాలము క్రిందటి మాట. సముద్ర మధనానంతరము దేవ దానవ యుద్ధము జరుగుచున్నది. ఆ సమయమున,

మహాసురుడయిన కాలనేమికి, విష్ణు భగవానునకు ఘోర యుద్ధము జరుగుచున్నది. ఆ యుద్ధము నందు విష్ణుదేవుని చేతితో ఆ అసురుడు నిహతుడాయెను. అంత రాక్షసగురువయిన శుక్రాచార్యుడు తన మృత సంజీవని విద్య చే అతనిని పునర్జీవితుని గావించెను. అంత మహాబలుడయిన కాలనేమి తిరిగి విష్ణుదేవునితో ద్వంద్వ యుద్ధము నకు పరిపరి విధముల యోచించుండెను. ఆ సమయమున ఆ దానవుడు మందరాచల సమీప సానువులందు తపమాచరించు చుండెను. అతడు ప్రతి దినము దుబ్బు గడ్డి (డెవిల్ గ్రాస్, సినాలిన్ డాక్టిలిన్) యొక్క రసము మాత్రము త్రాగుచూ పితామహుడు అయిన బ్రహ్మదేవుని కొరకు తీవ్ర తపమాచరించెను. దేవతలు కాలమానము ప్రకారము ఒక వంద సంవత్సరములు ఆతడు తపమాచరించిన మీదట బ్రహ్మదేవుడు ప్రత్యక్ష మయ్యెను.

ఆ సమయమున కాలనేమి శరీరము పూర్తిగా శల్యావశిష్ఠమై, యుండి దానిని పురుగులు పట్టి తినివేయు చుండెను. బ్రహ్మ అతని తపమునకు మెచ్చి వరము కోరుకొనమనెను. కాలనేమి "ఈ బ్రహ్మాండము నందు ఎందరెందరు బలిష్ఠమయిన దేవతలు గలరో వారందరికీ మూలము శ్రీ మహావిష్ణువు. అందు చేత నాకు ఈ బ్రహ్మాండము నందు ఏ దేవతా శక్తి చేత మృత్యువు లేని వరము ఈయవలసినది." అపుడు బ్రహ్మదేవుడు "దానవా! నీ వడిగిన ఈ ఉత్కృష్ఠమయిన వరము బహుదుర్లభమైనది. అయిననూ నీకది ఒసంగుచున్నాను. నా వాణి వ్యర్థము కాదు", అని వరమిచ్చి అంతర్ధానుడయ్యెను.

నారదుడు తిరిగి చెప్పదొడంగెను " ఓ రాజా! ఈ కాలనేమియే తిరిగి భూతలము నందు ఉగ్రసేన మహారాజు తన ధర్మపత్ని అయిన పద్మావతి యొక్క గర్భము నందు ఉద్భవించెను. ఆతడు కుమారావస్థ యందు యుండగనే గొప్ప బలిష్ఠులయిన మల్ల యోధులతో మల్ల యుద్ధము చేయువాడు. ఒకప్పటి మాట! మగధాధీశుడయిన జరాసంధుడు దిగ్విజయ యాత్రకై బయలుదేరెను. ఒక రేయి యమునా నదీ తట సమీపము నందు తన సేనా శిబిరములను దింపెను. ఆతని వద్ద కువలయాపీడము అను బలిష్ఠమయిన గజము కలదు. అది వేయు ఏనుగుల బలము కలిగిన కుంజరము. దాని గండస్థలము నందు ఎప్పుడూ మదజలము కారుచుండును. ఆ మహా గజము ఒక రోజు తనకు కట్టిన సంకెలలు త్రెంచుకుని బయటకు పరుగెత్తెను. శిబిరములు, గృహములు, పర్వత సానువులు సహితము ఛిన్నాభిన్నము చేయుచూ కంసుడు మల్ల యుద్ధము చేయుచున్న చోటిన ప్రవేశించినది. ఆ మహాకరి వీర విహారము చూచి పలువురు శూరులు పలాయనము చిత్తగించిరి. కానీ కంసుడు దానికి ఎదురేగి తన రెండు చేతులతో ఆ కుంజనమును పట్టి క్రింద పడవైచి, దంతములు పెకలించెను. అటు పిదప దాని తొండమును పట్టి గిరగిరా త్రిప్పి జరాసంధుని సేన విశ్రాంతి తీసుకొనుచున్న శిబిరములపై విసరెను.

ఈ దృశ్యము చూచిన మగధ నరేశుడు కంసుని యొక్క అధ్భుత పరాక్రమమునకు ఆశ్చర్యము, ఆనందము పొందిన వాడై అస్థి, ప్రాప్తి, అను అతి రమణీయ సుందరీమణులయిన తన కుమార్తెల నిరువురినీ కంసునకు ఇచ్చి వివాహము జరిపించెను. జరాసంధుడు వివాహ సమయమున కట్నముగ వంద కోట్ల గుర్రములను, ఒక లక్ష ఏనుగులను, మూడు లక్షల రధములను, పదివేల మంది దాస దాసీ జనములను కంసునికి సమర్పించెను. కంసుడు ద్వంద్వయుద్ధ ప్రియుడు. ఎప్పుడూ భయంకర బాహుబల గర్వితుడై ఒంటరిగ ద్వంద్వ యుద్ధమునకు ఉవ్విళ్ళూరుచుండెడివాడు. ఆ వీరుడు ఒక పర్యాయము తన ప్రచండ బాహుబల విక్రమము తో మాహిష్మతీ పురమును చేరెను. మహాత్ముడయిన ఆ నరేశునకు ప్రఖ్యాతులయిన అయిదుగురు మహామల్ల విశారదులు అయిన పుత్రులు కలరు. వారు వరుసగా చాణూరుడు, ముష్ఠికుడు, కూటుడు, శాలుడు, తోశాలుడు.

కంసుడు సామ, దాన, భేదము నందలి సామనీతిని ఆశ్రయించి వారితో ప్రేమగా ఇట్లనియె " యోధులారా! మీరు నాతో యుద్ధము చేయవలసినది. ఈ ద్వంద్వ యుద్ధము నందు నేనోడి, మీరు గెలిచిన పక్షమున నేను మీకు దాసుడనగుదును. అట్లుకాక మీరు ఓడిన పక్షమున నాకు దాసులు కావలసినది. కంసుడు ఇట్లు నాగరిక ప్రముఖుల మందు ఆ రాజకుమారులతో ఇట్టి శపధము చేసి ద్వంద్వ యుద్ధ మారంభించెను.

మొదట చాణూరుడు యుద్ధ మారంభించెను. యాదవేశ్వరుడు కంసుడాతనిని తన రెండు చేతులతో పట్టి పై కెత్తి

భూమిపై పారవైచి ఉచ్ఛ స్వరముతో గర్జన చేసెను. తదుపరి ముష్టికుడు మిక్కిలి కోపించి పిడికిలి బిగించి కంసునిపై దూకెను. కంసుడు అవలీలగా ఒక్క ప్రహరణముతో అతనిని మట్టి కరిపించెను. అంత కూటుదు, శాలుడు మిక్కిలి వేగముగ బరిలోనికి దిగిరి. కంసుడు వారిరువురినీ ఒంటి చేతితో ఒడసి పట్టి విసురుగ భూతలము పై పడవేచెను. అటు పిదప తోశాలుని రెండు చేతులు వడసి పట్టుకొని పై కెత్తి పది యోజనముల దూరము విసిరివైచెను. ఈ విధముగా యాదేవశ్వరుడు కంసుడు అతి సునాయాసముగ ఆ వీరులందరినీ తన సేవకులుగ జేసికొనెను.

తదుపరి నా (నారదుని) సలహా మేరకు ఆ వీరులను వెంటబెట్టుకొని ప్రశ్రవణగిరి చేరెను. అచ్చట రామాయణ కాలము నాటి కపి శ్రేష్టుడు ద్వివిదుడు నివసించు చుండెను. కంసుడు వానిని చేరి తన అభిప్రాయమును వెలిబుచ్చెను. వారిరువురి మధ్య ఇరువది దినములు భయంకర ఘోర సంగ్రామము అవిరామముగా పరిఢవిల్లెను. ద్వివిదుడు పర్వత శిఖరములు పెకలించి కంసునిపై ప్రహరించెను. కంసుడు వాటిని మార్గ మధ్యమున పట్టుకొని తిరిగి ద్వివిదుని పై ప్రయోగించెను. అపుడు ద్వివిదుడు తన రెండు చేతులతో కంసుని శిరము నందు బలముగా ప్రహారము చేసి ఆకాశమార్గమున ఎగుర నారంభించెను. కంసుడు వెంఠనే తేరుకొని ద్వివిదుని వెంట ఎగిరి ఆ వానర ప్రముఖుని పట్టుకొని భూమిపై విసిరి వైచెను. కంసుని ముష్టి ఘాతములు ద్వివిదుని మూర్ఛితుని గావించినవి. ఆతని శల్యములు నుగ్గు నుగ్గు కాగా అతని ఉత్సాహము, శక్తి పూర్తిగా నశించినవి. ఆఖరికి అతను కంసుని సేవకుడాయెను.

అనంతరము కంసుడు ద్వివిదుని తో సహా ఋష్యమూక పర్వతపు వనము ప్రవేశించెను. అచట భయంకర హయరూపధారి అయిన "కేశి" అను రాక్షసుడు నివసించు చుండెను. కేశి మేఘ గర్జనము వంటి భయంకర కంఠధ్వని కలవాడు. ఆ దానవుని తన ముష్టి ఘాతములతో నిగ్రహించి, ఓడించి, ఆ హయముపై అధిరోహించి పయనము కొనసాగించెను. అటు పిదప అతడు మహేంద్రగిరిని సమీపించి తన బల దర్పము తో ఆ పర్వతమును సమూలముగా పెకలించి తన భుజములపై ఆనించి ఆవలీలగా పైకి, క్రిందకూ ఆడించ సాగెను. ఇంతలో కంసుడు ఆ పర్వతము పై నివసించుచున్న ఆరుణారుణ క్రోధ నేత్రుడు, ప్రళయకాల భాను సదృశ తేజశ్శాలి అయిన పరశురాముని చూచి వెంఠనే ఆయన పాదములపై వ్రాలి, తిరిగి లేచి మరల మరల ఆయనకు ప్రదక్షిణ పూర్వక సమస్కృతులాచరించెను.

కంసుని భక్తికి శాంతించి పరశురాముడిట్లనియె "ఓరీ! కీటకమా! నీవు మశికము మాదిరి తుచ్ఛుడవు. నీవు బల గర్వముతో ఎల్లప్పుడూ విర్రవీగు దుష్ట క్షత్రియుడవు. నిన్ను ఇప్పుడే మృత్యువునకు ఆహుతి చేయుదును నా వద్ద ఈ మహా ధనస్సు కలదు. దీని బరువు లక్ష బారువులు (మూడు లక్షల మణుగులు). త్రిపురాసుర యుద్ధ సమయమున విష్ణు భగవానుడు ఈ ధనస్సును శంకరునకు బహూకరించెను. నేను అప్రతిహత క్షత్రియ సంహారము చేయుటకు శంకర భగవానుడు నాకు ప్రసాదించెను. ఆ ధనస్సును నీవు ఎక్కుపెట్ట గలిగినచో నీవు కుశలుడవు. లేదేని నీ బలమును నేను పూర్తిగా వినాశము చేసి నిన్ను నిర్వీర్యుని చేయుదును." ఆ మాటలు విన్న కంసుడు సప్త తాళములు ఎత్తు కలిగిన ధనస్సును పరశురాముడు చూచుచుండగానే అవలీలగా ఎత్తి, నారిని ఆ కర్ణాంతము లాగి వందమార్లు ధనుష్టంకారము గావించెను. ఆ సవ్వడి పిడుగుపాటు వలె ధ్వనించి సప్త ఊర్ధ్వ లోకముల నుండి పాతాళము వరకూ రోదశీకుహరము సర్వమూ కంపించెను. భూమండలమును మోయు దిగ్గజములు విచిలితము లయినవి. తారలు నేల రాలినవి. తదుపరి కంసుడు ఆ ధనువును నేలపై పెట్టి అతి వినీతుడై పరశురామునకు మరల మరల ప్రణామములు గావించి ఇట్లనియె " భగవన్! నేను క్షత్రియుడను కాను. మీ సేవకుడయిన దైత్యుడను మీ దాసానదాసుడను, పురుషోత్తమా! నన్ను రక్షించవలసినది." కంసుని ప్రార్థన విన్న పరశురాముడు అతి ప్రసన్నుడై ఆ ధనువును కంసునికి బహూకరించెను. తిరిగి పరశురాముడిట్లనియె " ఈ ధనువు సాక్షాత్ విష్ణుదేవుని ధనస్సు. ఈ ధనస్సును ఎవరు ఛేదించెదరో అతడే పరిపూర్ణ పురుషుడు. వాని చేతితో నీ మృత్యువు ఖాయము."

అటు పిదప బలగర్వము చే ఉన్మత్తుడయిన కంసుడు పరశురామునికి ప్రణామములాచరించి తిరిగి తన ప్రయాణమును కొనసాగించెను. వానికి ఎదురు పడిన రాజులెవ్వరును వాని నెదిరింప సాహసించలేదు, సరికదా అతనిని

శరణ మందిరి, మరియు సామంతులయిరి. ఇప్పుడు కంసుడు భూమిని వదిలి సముద్రము పై దృష్టి సారించెను. ఆ మహోదధి యందు అఘాసురుడను సర్పరూప రాక్షసుడు కలడు. అతడు ఎప్పుడూ ఘోరముగ బుసకొట్టుచూ, భయంకరముగ జిహ్వ నాడించుచూ వికృతముగ యెప్పువాడు. వాని రూపము చూచి దైత్యేంద్రుడు హేళనగ నవ్వెను. అంత నిర్భయముగ ఆ సర్పమును బట్టి నేలపై విసిరి వైచెను. తిరిగి ఆకాళమును మెడలో మాల వలె ధరించెను.

ఆ సమయమున వంగ దేశము నందు "అరిష్ఠుడు" అను నామ ధేయము గల దైత్యుడు నివసించు చుండెను. వాని శరీరము గడ్డి వాము వలె బిగ్గరగా యుండెడిది. కంసుడు వానితో ద్వంద్వ యద్ధమాచరించెను. వారు ఇరువురును మదపుటేనుగుల వలె పోట్లాడిరి. అరిష్ఠుడు పలు పర్వత శిఖరములు పెకలించి కంసునిపై ప్రహరించెను. కంసుడు వానిని మధ్యలో పట్టి తిరిగి దైత్యుని పై విసిరి తునియలు గావించెను. కొంతసేపు యుద్ధము కావించిన పిదప కంసుడు పిడుగుల వంటి ముష్ఠి ఘాతములతో దైత్యుని మూర్ఛితుని గావించెను. ఇట్లు అరిష్ఠుని పరాజితుని గావించి అతనిని తీసికొని ఉత్తర దిశగా పయనించి ప్రాగ్జోషిత పురము ప్రవేశించెను. అచ్చటి నరేశుడు భూపుత్రుడు, మహాబలి, అయిన నరకాసురుడు (భౌమాసురుడు). కంసుడు నరకుని చేరి "దైత్యేశ్వరా! నీవు నాతో యుద్ధము చేయవలసినది. నీవు గెలిచిన యొడల నేనే నీ సేవకుడనగుదను. లేదేని మీరందరూ నా భృత్యకోటి యందు జేరవలసినది". నారదుడు తిరిగి చెప్పనారభించెను. "ప్రాగ్జోషిత పురమున ప్రధమముగ ప్రలంభాసురుడు యుద్ధము నారంభించెను. వారిరువురు పర్వత సానువులందు మదించిన పంచాస్యములు మాదిరి ద్వంద్వ యుద్ధము నారంభించిరి. అంత కంసుడు వానిని తన రెండు చేతులతో పైకెత్తి నరకాసురునికి కానుకగా విసిరివైచెను. తదుపరి ధేనుకాసురుడు రోషముతో కంసుని నెదిరించెను. అతడు అమితబలము తో కంసుని వెనుకకు త్రోసెను.

కంసుడు రోషతామ్రాక్షుడై ధేనుకుని బలముగ వెనుకకు త్రోచి భయంకర ముష్ఠి ఘాతములతో ధేనుకుని శరీరము నుగ్గు నుగ్గు కావించెను. అటు పిదప తృణావర్తుడు నరకాసురుని ఆజ్ఞానుసారము సుడిగాలి రూపములో కంసుని ఎత్తి ఆకాశమున లక్ష యోజనముల ఎత్తు ఎగిరి అచట కదన మారంభించెను. కంసుడు తన అనంత శక్తితో తృణావర్తుని భూమిపై పడవైచెను. ఆ సమయమున వాని ముఖము రక్తసిక్త మాయెను. ఈ విధముగా తృణావర్తుడు పరాజితుడయిన పిదప మహాబలి అయిన బకాసురుడు, తన బలిష్ఠమయిన ఉక్కు ముక్కు దంష్ట్రములతో కంసుని ప్రాణములుత్తరించుకు ముందుకు దూకెను. కంసుడు వజ్ర సమానమయిన తన ముష్ఠి ఘాతములతో ప్రహారము గావించి వానినీ ధరాశయుని కావించెను. కానీ బకాసురుడు తేరుకొని తిరిగి విజృంభించెను. మేఘ గర్జనము వంటి శబ్దము చేయుచూ క్రోధముతో కంసుని శరీరము తుత్తునియలు చేయటకు సమకట్టెను. కానీ కంసుని శరీరము వజ్ర సమ కఠోరమయినది. తనను కరుచుటకు సమీపించిన బకాసురుని రెండు దవడలను తన చేతులతో ఒడిసిపట్టి గిరగిర త్రిప్పి మిక్కిలి వేగముగ నేలపై విసరివైచెను. అంత బకుడు మిక్కిలి దస్సి చేష్ఠలుడిగి పరాజయము పాలయ్యెను. బకుని సోదరి పూతన. సోదరుని పరాజయము కని ఉక్రోషముతో కంసునితో పోరాటమునకు సంసిద్ధురాలయెను. ఆమెను చూచి కంసుడు ప్రహసించుచూ ఈ విధముగా పలికెను. ఓ! పూతనా! నీవు స్త్రీవి. నేను స్త్రీలతో (నీతో) యుద్ధమునకు సమకట్టలేను. ఈ నాటి నుండి నీవు నా సోదరివి. ఆ బకాసురుడు నా సహోదరుడు. అటు పిదప కంసుని అరివీర భయంకర పరాక్రమమునకు చిత్తగించి నరకాసురుడు పరాజయము స్వీకరించెను. అతడు (నరకుడు) తాను దేవతలతో యుద్ధము చేయునపుడు తగిన సహాయమునీయమని కంసునితో సౌహార్ద్రముగా ఒప్పందము చేసికొనెను.

(శ్రీ గర్గ సంహిత యందలి గోలోక ఖండము నందు నాద బహుళాశ్వ సంవాదము నందలి కంసుని బలవర్ణనము అను ఆరవ అధ్యాయము పూర్ణము)

ఏడవ అధ్యాయము

(కంసుని దిగ్విజయ యాత్ర - శంబరుడు, వ్యోమాసురుడు, బాణాసురుడు, వత్సాసురుడు, కాలయవనుడు, మరియు దేవతల యొక్క పరాజయము)

నారదుడు తిరిగి చెప్పదొడెంగెను – ఓ! రాజా! తదనంతరము తాను మున్ను జయించిన ప్రలంబుడు మొదలగు దైత్య సహాయముతో కంసుడు, శంబరాసురుని నగరము ప్రవేశించి, ఆతనితో యుద్ధ ప్రస్తావన కావించెను. శంబరుడు స్వయముగ గొప్ప వీరుడు అయినప్పటికీ కంసునితో యుద్ధము నకు అంగీకరింప లేదు. కంసుడు అత్యంత బలశాలురైన దైత్యులతో మైత్రిని స్థాపించెను. త్రికూటాచల శిఖరము నందు "వ్యోముడు" అను అద్భుత బలశాలి నిదురించుచుండెను. కంసుడు అచటికి చేరి వ్యోమునిపై కఠినముగ పాద ప్రహారము గావించెను. అంత వ్యోమునికి నిద్రాభంగమై మిక్కిలి కోపించెను. కళ్ళు జేవురించినవి. తడవుగా కంసునిపై కఠిన ముష్ఠి ఘాతములు ప్రయోగించెను. వారిరువురి మధ్య భయంకర సంకుల సమరము చెలరేగినది. ఒకరిపై ఒకరు పిడుగుల వంటి ముష్ఠిఘాతములు కురిపించిరి. కొంత సేపటికి వ్యోమాసురుని బలము సన్నగిల్లి కన్నులు తిరిగ నారంభించెను. కంసుడు వానిని పరాజితుని గావించి తన సేవకునిగా నియమించెను. ఆ సమయమున నేను (నాదరుడు) ఆ ప్రదేశము చేరెను. కంసుడు నారద మహర్షికి ప్రణామ మాచరించి "ఓ దేవా! నా రణ కండూతి తీరుట లేదు. నేను ఎవరిపై దండెత్తగలను? శీఘ్రముగా సెలవీయవలసినది". అంత నారదుడు "కంసా! నీవు వెంటనే మహా బలిష్ఠ దానవుడయిన బాణాసురుని ఎదుర్కొనవలసినది" అని సెలవిచ్చెను. నాకును మనసు నందు వారి యుద్ధము చూడవలెనన్న కుతూహలము పెరుగుచున్నది. నారద ప్రేరితుడయిన కంసుడు బల మదమున ఉన్మత్తుడై శోణిత పురము చేరెను.

కంసుని యుద్ధ ప్రతిజ్ఞ విని బాణుడు కుపితుడాయెను. అతడు మేఘ గర్జన చేయుచూ కాలితో బలముగా పాద ఘట్టనము చేసెను. ఆ పీడనము యొక్క ధ్వని పాతాళము వరకు వ్యాపించెను. బాణుడు కంసుని చూని "ముందు నా కాలు కదుపవలసినది" అని స్పర్ధాహ్వానము చేసెను. కంసుడు దానిని స్వీకరించి తన రెండు చేతులతో బాణుని కాళ్ళుపట్టి పడవైచెను కంసుడు ఈ విధముగా బాణుని పడవైచిన మరుక్షణము ఏడు అధోలోకములు గతి తప్పెను. పర్వతములు శిథిలములు అయ్యెను.

దిగ్గజములు తమ తమ స్థానముల నుండి విచలితము లాయెను. అపుడు బాణాసురునికి కాపలా యున్న శంకరభగవానుడు అచటికి వచ్చి వారిని వారించి బలినందనుడయిన బాణునితో ఇట్లు పలికెను–"ఓ! దైత్యరాజా! భగవానుడయిన శ్రీకృష్ణుడు మినహా ఈతనిని పరాజితుని కావించుట ఎవరి కయిననూ అసాధ్యము. పరశురాముడు ఈ విధమయిన వరము ఈతనికి ప్రసాదించెను. తన వైష్ణవ ధనువును సహితము ప్రసాదించెను." ఈ విధముగా పలికి శంకర భగవానుడు వారిరువురి మధ్య ఆ క్షణమే మనోహర శాంతి సౌహార్ద్రములు స్థాపించెను. తదనంతరము పశ్చిమ దిశయందు మిక్కిలి పేర్గాంచిన "వత్సుని" నామము విని కంసుడు వాని నెదుర్కొనుటకు అతని వాసము చేరెను. వత్సుడు గోవత్స రూపముతో యుద్ధము నారంభించెను. కంసుడు వాని పాదములు పట్టి పైకెత్తి త్రిప్పి, నేలపై పడవైచెను. ఆ విధముగా అతనిని జయించి అతని నివాస పర్వతమును తన అధికారము లోనికి తెచ్చుకొని తన దృష్టిని మ్లేచ్ఛ దేశములపై సారించెను.

ఇంతలో నారదుని ద్వారా కంసుని పరాక్రమము, ఆటోపము వినిన కాలయవనుడు కంసుని ఎదుర్కొనుటకు బయలుదేరెను. ఆతని మీసములు, గడ్డము ఎర్రని రక్తచందనము వలె మెరయు చుండగా చేతినందు కఠోరమయిన గదా దండమును చేతపట్టి కాలయవనుడు ముందుకు దూకెను. కంసుడు సహితము లక్ష బారువుల బరువు గల గొప్ప గదాదండమును చేపట్టి కాలయవనుని ప్రతిఘటించెను. ఇరువురు సింహ గర్జనలు చేయుచూ కొంత తడవు గదాయుద్ధము సాగించిరి. రెండు గదల రాపిడికి నిప్పు కణములు వర్షించు చుండెను. వారిరువురి గదలు ఒకదానినొకటి ఢీ కొట్టి

చూర్ణము లాయెను. అంత కంసుడు కాలయవనుని పట్టి బంధించి రెండు చేతులతో పై కెత్తి విసురుగా నేలపై విసరెను. ఈ విధముగా పలుమార్లు గావించి వానిని మృతతుల్యుని చేసెను. ఇది చూసిన కాలయవనుని సేన కంసునిపై బాణ వర్షము కురిపించెను. కంసుడు వారిని లక్ష్య పెట్టక తన గదతో వారందరినీ తుత్తినియలు గావించెను. గదాయుద్ధ విశారదుడయిన కంసుడు కాలయవనుని రథ, హయ, హస్తి, పదాతి దళములను పీనుగుల పెంట కావించి సింహ గర్జన చేసెను. దానితో మ్లేచ్ఛ సైన్యము అంతయూ యుద్ధ భూమిని వదలి నలుదిశలూ పరుగెత్తిరి. కానీ కంసుడు గొప్ప నీతిజ్ఞుడు. ఆతడు వెనుజూపి పారిపోయిన మ్లేచ్ఛులను చంపక విడిచి పుచ్చెను.

కంసుడు పొడవైన కాళ్ళు గలవాడు. వానిపై రెండు మోకాళ్ళు బలమైనవి. వానిపై స్తంభముల వంటి తొడలు, సన్నని నడుము, లోహ సమాన వక్ష స్థలము, బలిష్ఠమయిన చేతులు, కలిగి శరీరము పుష్టిగా, బలిష్ఠముగ యున్నది. నేత్రములు విరిసిన కమలముల వలె ప్రఫుల్లముగ యున్నవి. శిరోజములు పొడవుగనూ, దేహము అరుణ కాంతితో ఒప్పారుచుండెను. ఆతని శరీరము నల్లని వస్త్రముతో సుశోభితమై యుండెను. శిరము నందు కిరీటము, కర్ణము లందు కుండలములు, కంఠము నందు హారములు, వక్ష స్థలమందు కమలముల మాల ధరించి కంసుడు ప్రళయకాల సూర్యుని పగిది ప్రకాశించుచుండెను. కవచము, ఖడ్గము, తూణీరము, ముద్గరము ధరించిన మద మత్త వీర కంసుడు ధనుర్ధారియై దేవతల పై విజయము సాగించుటకై అమరావతి పై దాడి వెడలెను.

చాణూరుడు, ముష్టికుడు, అరిష్టుడు, శాలుడు, తోశాలుడు, కేశి, ప్రలంబుడు, బకుడు, ద్వివిదుడు, తృణావర్తుడు, అఘాసురుడు, కూటుడు, నరకుడు, శంబరాసురుడు, వ్యోముడు, ధేనుకుడు, వత్సుడు అను వివిధ దైత్యులతో అమరావతి కి నలువైపులా సేనలతో మొహరించెను. కంసాది అసురుల సైన్య సమూహమును కాంచిన శచీపతి అగ్రహోదగ్రుడై సమస్త దేవతానీకముతో వారిని ఎదుర్కొనెను. ఆ రెండు సేనల నడుమ భయంకరమయిన, రోమాంఛమయిన తుముల యుద్ధము ఆరంభమయినది. విభిన్న దివ్య శస్త్రములు, మెరయుచున్న బాణములు రెండు ప్రక్కల నుండి (ఇరు సైన్య వీరుల నుండి) మిక్కిలి వేగముగ అటు, నిటు కదలుచున్నవి. ఇట్టి శర పరంపరల వల్ల యుద్ధ భూమి అంతటా అంధకారము అలముకున్నది. ఆ సమయమున రథారూఢుడయిన ఇంద్రుడు వందలాది విద్యుత్ ధారలు విరజిమ్ము వజ్రాయుధమును కంసునిపై ప్రయోగించెను. కానీ ఆ మహాసురుడు ప్రతిగా ముద్గరమును ప్రయోగించి వజ్రమును ఛిన్నాభిన్నము చేసెను. అపుడు వజ్రధారి వజ్రమును విడిచి రోషతామ్రాక్షుడై పొడవైన చంద్ర హాసము ను చేతిలోనికి తీసుకొని భయంకర సింహనాదము చేసి ఆ కరవాలమును కంసుని శిరసుపై ప్రయోగించెను. మదపుటేనుగు పూలమాలను ఎట్లు లక్ష్యపెట్టదో, అట్లే కంసుని శిరసుపై ఇంద్రుని కరవాలము చిన్న గాయము కూడా చేయలేకపోయినది. ఆ సమయమున లక్ష బారువుల బరువు కలిగిన, అష్ట ధాతువులతో నిర్మితమయిన భయంకర గదా దండమును కంసుడు పురంధరునిపై వైచెను. అత్యంత వేగముతో తనపై పడుచున్న గదను నముచి సూదనుడు చూచి, ఒడుపుగా ఒడసిపట్టి, తిరిగి దానిని దైత్యుని పై విసరెను. ఇంద్ర రథమును మాతలి సంచారము చేయుచుండగా దేవేంద్రుడు శత్రుదళమును దమనము గావించుచుండెను.

కంసుడు ఒక పరిఘను చేతిలోనికి తీసికొని అసురద్రోహి అయిన దేవేంద్రుని చేతులపై ప్రహరించెను. ఆ దెబ్బకు దేవేంద్రుడు సహితము ఒక్క క్షణము మూర్ఛితుడాయెను. ఆ సమయమునందు మరుద్గణములు గ్రద్దల ఈకలు కట్టబడి మెరయుచున్న బాణ సముదాయమును కంసుని పై వర్షము వలె కురిపించిరి. అవి వర్షాకాల మేఘములు సూర్యుని ఆచ్ఛాదించు రీతిని కంసుని కప్పివైచినవి. అది చూచి సహస్రబాహుడు, మహావీరుడు అయిన బాణాసురుడు తన బాణసమూహముచే మరుద్గణములను బాధింపసాగెను. బాణుడు వసు, రుద్ర, ఆదిత్య గణములను ఇంకా అన్యాన్య దేవతలును, తన బాణ పరంపర చే నలు ప్రక్కల నుండి ప్రహరణము చేయసాగెను.

ఇంతలో ప్రలంబాది దైత్యుల నిడుకుని నరకుడు ఆ ప్రదేశము చేరి భయంకర సింహనాదము చేసెను. ఆ గర్జనకు పెక్కుమంది దేవతలు మూర్ఛితులయిరి. ఆ సమయమున దేవరాజు ఇంద్రుడు మూర్ఛ నుండి లేచి, ఐరావతము నధిరోహించి రోష తామ్రాక్షుడై, ఆ మదమత్త గజరాజును కంసునిపై పురిగొల్పెను. అంకుశము యొక్క దెబ్బకు కృద్ధుడయిన ఐరావతము శత్రువులను తన పాదముల తో త్రొక్కుచూ కదనరంగము కలదిరుగుచుండెను. ఆ మహాస్తి యొక్క కంఠమునందు

ఒక గంట కట్టబడెను. మూపుపై కింకిణీ జాలమయిన రత్న కంబళి కట్టబడెను. ఆ గజరాజు ముఖ మండలమున గోరోచనము, సింధూరము, కస్తూరి మొదలయిన వస్తువులతో పత్ర రచన చేయబడెను.

కంసుడు తనకు దగ్గరగా వచ్చుచున్న ఐరావతముపై భయంకర ముష్టిఘాతము ప్రయోగించెను. దానితో అమరేంద్రుడు ఐరావతము నుండి జారి దూరముగ పడిపోయెను. ఆ హస్తి సహితము ఒక్క క్షణము నేలపై కూలబడి, తిరిగి తేరుకొని తన దంతములతో కంసుని బలముగ పొడిచెను. కంసుని ఎత్తి కొన్ని యోజనముల దూరము విసరివైచెను. కాని కంసుని శరీరము వజ్ర సదృశధృఢమైనది. అందుచే అంత దూరము విసరబడిననూ అతడు ఎంత మాత్రమూ గాయపడలేదు. కానీ మనసున కొంచెము వ్యాకులత కలిగినది. తిరిగి కోపించి పళ్ళు పటపట కొరికి మిక్కిలి రోషావేశముతో తిరిగి యుద్ధ భూమి ప్రవేశించెను. సరాసరి ఐరావతమును చేరి దాని తొండమును వత్తివలె చేసి దంతములు పెరకి చూర్ణము చేసి, గజమును దరాశయనము గావించెను. ఐరావతము కంసుని ధాటికి తట్టుకొన లేక సమరాంగణము వీడి గొప్ప వీరులను సహితము పరాజయుని కావించు దేవతల నగరమైన అమరావతి యందు దాగుకొనెను.

అపుడు కంసుడు వైష్ణవ దనుసును చేపట్టి పుంఖాను పుంఖములుగ బాణ వర్షమును కురిపించి దేవతా సమూహములను ఛిన్నా భిన్నము కావించెను. కంసుని ధాటికి తట్టుకోలేక దేవతలు తమ శౌర్యము వీడి నలుచెరుగులా అన్ని దిశలకు పలాయనము చిత్తగించిరి. కొందరు దేవతలు అవనిత శిరస్కులై తమ ఓటమిని ప్రకటించిరి. కొందరు దేవతలు అస్త్రసన్యాసము కావించి రెండు హస్తములు కైమోడ్చి, వస్త్రములు సహితము దిగజారు చుండగా అత్యంత దీనులై నిలుచుండిరి. మరికొందరు అత్యంత వ్యాకుల మనస్కులై యుద్ధరంగమందు కంసుని సమ్ముఖమునకు పోవుటకు కూడా ధైర్యము చేయలేకపోయిరి. ఈ విధముగా దేవతలు వెన్నుజూపుట చూచి కంసుడు అచటి ఛత్రసహిత సింహాసనమును సమస్త దైత్యానీకము తో తన రాజధానీ పట్టణమయిన మధురకు కొనిపోయెను.

(శ్రీ గర్గ సంహిత యందలి గోలోక ఖండము నందు నారద బహుళాశ్య సంవాదము నందలి కంస దిగ్విజయము అనబడు ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(సుచంద్రుడు, కళావతుల పూర్ణ జన్మ వర్ణనము, వారిరువురు వృషభానుడు కీర్తి దేవి రూపములతో అవతార స్వీకరణ)

గర్గాచార్యుడు చెప్పదొడండెను. "ఓ! శౌనకా! మహారాజు బహుళాశ్వుని హృదయము భక్తి భావముతో పరిపూర్ణ మయినది. హరి భక్తి యందు ఆయనకు అపరిమిత మయిన భక్తి, నిష్ఠ కుదిరినవి. నారదుని ప్రసంగము వినుచున్న బహుశాశ్వుడు జ్ఞానుల యందు శ్రేష్ఠుడు, మహా విలక్షణ స్వభావము కలవాడు అయిన దేవర్షి నారదుల వారికి పున: ప్రమాణమాచరించి ఈ రీతిగా ప్రశ్నించెను, "భగవాన్! మీరు మీ యొక్క ఆనంద ప్రదమయిన, నిత్య నిర్మల యశస్సు చే మా కులమును భూమండలమందు అత్యంత ప్రాసస్త్యము కావించిరి. ఎందుకనగా శ్రీకృష్ణ భక్తులతో క్షణ మాత్ర సంగము సాధారణ జనులను సత్పురుషులుగనూ, మహాత్ములుగనూ చేయును. ఈ విషయమును గూర్చి ఎంత చెప్పిననూ తక్కువే! దేవర్షీ! శ్రీ రాధేదేవి సహితముగ భూతలమందు అవతీర్ణుడయిన పరిపూర్ణతమ భగవానుడు వ్రజభూమి నందు ఏ ఏ లీలలు గావించెను? "ఓ! దేవర్షీ! ఋషీశ్వరా! ఈ విషయములను దయచేసి నాకు సెలవిచ్చి ఆ కథామృతము ద్వారా నా తాప దు:ఖముల నుండి నన్ను రక్షింపవలసినది".

నారదుడు తిరిగి చెప్పదొడంగెను "ఓ! రాజా! పరాత్పరుడయిన శ్రీకృష్ణుని యొక్క భక్తుడు, సమస్త సద్గుణోపేతుడు అయిన నిమి చక్రవర్తి చే స్థాపించబడిన ఈ వంశము ధన్యము. ఎందుకనగా ఇందు యోగ యుక్తులు, భవబంధ

విముక్తులు అయిన నీ వంటి మహానుభావులు జన్మనందిరి. నీ యొక్క పుణ్య వంశజులకు ఎటువంటి క్లిష్ట కార్యమయిననూ అశక్యము కాదు. నీవు పరమ పురుషుడు, భగవానుడు శ్రీకృష్ణుని యొక్క పరమ మంగళకరమయిన పవిత్ర లీలలను వినవలసినది. ఆ భగవానుడు కేవలము కంస వధకై అవతారము స్వీకరింపలేదు. దానితో పాటుగా భగవద్భక్తులను రక్షించుటకు సహితము అవతారము స్వీకరించెను. భాద్రపద శుద్ధ అష్టమీ సోమవారము మధ్యాహ్న సమయమున ఆకాశము మేఘా వృతమై ప్రకృతి అంతయూ బహు శోభాయమానముగ యుండగా శ్రీ రాధాదేవి కలిందజా కులవర్తి నికుంజ ప్రదేశమున ఒక సుందర మందిరమున అవతరించెను. ఆ సమయమున నదులన్నిటి యుందునూ నీరు స్వచ్ఛముగ యున్నది. దిశలన్నియు ప్రసన్నముగ, నిర్మలముగ, ప్రకాశవంతములుగ యున్నవి.

కమల సుగంధమును గైకొని శీతల వాయువు మందగతిని వీచుచూ సమస్త లోకమునకు శాంతిని చేకూర్చుచున్నది. వందల శరత్కాల పూర్ణిమా సుధాకరుల కాంతిని మించు ద్యుతి గల కన్యకా మణిని చూచి కీర్తి దేవి ఆనంద సాగరమున ఓలలాడినది. ఆ పసిపాపకు మంగళ కృత్యము లన్నియును నిర్వహించి, ఆ బిడ్డ సౌభాగ్యమునకు రెండు లక్షల ఉత్తమ గోవులను బ్రాహ్మణులకు దానము నిచ్చినది. గొప్ప గొప్ప దేవతలకు సహితము ఎవరి దర్శనము బహు దుర్లభమో, తత్వజ్ఞులయిన మునులు సహితము వేల జన్మల తప మాచరించిననూ ఏ తల్లి యొక్క కటాక్షము కలుగదో అటువంటి దివ్య జనని శ్రీరాధికాదేవి వృషభానుని ఇంట పుట్టి సాకార రూపముతో దర్శన మిచ్చెను. గోపాంగనలు ఆ దివ్య శిశువు యొక్క ఆలన పాలన చేయునపుడు సర్వ సాధారణ మానవులను సహితము ఆమె దర్శన భాగ్యము లభించు చున్నది. రత్నఖచిత, చందన నిర్మిత మణికిరణ మండిత ఉయ్యాల నందు నిరంతరము దాస దాసీ జనము చే ఊపబడుచూ శ్రీరాధాదేవి శుక్లపక్ష చంద్రుని వలె దినదిన ప్రవర్ధమాన మగుచుండెను.

“ఈ రాధాదేవి ఎవరు! రాసమండల రంగస్థలమును ప్రకాశింపజేయు దివ్య దీప్య కళిక. వృషభాను మందిరమును దీపింపజేయు దీపావళి (దీపముల వరుస), మరియు గోలోక చూడామణి అయిన శ్రీకృష్ణ భగవానుని కంఠము నందు వెలుగొందు హారావళి. నేను (నారదుడు) ఆ పరాశక్తి యొక్క దివ్య రూప తత్వములను ధ్యానము చేయుచూ భూ మండల మంతయూ సంచరించుచున్నాను.”

బహుళాశ్వ మహారాజు తిరిగి ప్రశ్నించెను, “ఓ! మహామునీ! వృషభానుని యొక్క సౌభాగ్యము, వర్ణనాతీతము. ఎందుకనగా పరాశక్తి శ్రీ రాధాదేవి స్వయముగ పుత్రిక రూపములో అవతరించినది. కళావతి, సుచంద్రులు ఏ పూర్వ జన్మ యొక్క పుణ్య ఫలితముగ ఈ సౌభాగ్యమునకు నోచుకొనిరి? నారద మహర్షి తిరిగి చెప్పదొడండెను “మహారాజా! రాజరాజేశ్వరుడూ, మహాభాగుడు అయిన సుచంద్రుడు నృగ మహారాజు యొక్క పుత్రుడు. పరమ మనోహర రూపుడు, అపర మన్మధుడు అయిన సుచంద్రుడు చక్రవర్తి. ఆయనను సాక్షాత్ భగవదంశగా ఆ రోజులలో పేర్కొనెడివారు. పూర్వ కాలమున ఆర్యముడు మొదలగు పితృదేవతలకు స్వధ అను దక్షపుత్రిక అయిన భార్య యందు ముగ్గురు మానస పుత్రికలు జన్మించిరి. వారి నామధేయములు వరుసగా కళావతి, మేనక, రత్నమాల. పితృ దేవతలు కళావతిని శ్రీహరి స్వరూపమయిన సుచంద్రునకు ధర్మపత్నిగా వివాహ క్రతువు జరిపించిరి.

రత్నమాలను విదేహ ప్రభువయిన జనకునకు (సీరధ్వజుడు), మేనకను హిమాలయమునకు అర్పించిరి. ఆ సమయమున విధి పూర్వకముగ కట్న కానుకలు సహితము చదివించిరి. మహామతీ! రత్నమాలకు సీతామాతయు, మేనకా గర్భమందు పార్వతీ దేవియు ఉద్భవించిరి. వీరిరువురి చరిత్రయు పురాణ ప్రసిద్ధము. అనంతరము సుచంద్రుడు భార్యాహితుడై గోమతీ తటము వదలి నైమిశారణ్యము ప్రవేశించి బ్రహ్మ దేవుని ప్రసన్నము చేసికొనుటకై తపశ్చర్య నారంభించెను. వారు దేవతల కాలమానము ప్రకారము పన్నెండు దివ్య సంవత్సరములు తీవ్ర తపమాచరించిరి. అనంతరము బ్రహ్మదేవుడు ప్రత్యక్షమై వరము కోరుకొనమనెను. ఆ సమయమున వృషభానుని శరీరము చిక్కి శల్యమై, నామావ శిష్టమై, చదపురుగులచే తివివేయుబడు చున్నది. బ్రహ్మ వాణి వినినంతనే ఆయన శరీరము దివ్య రూపు దాల్చినది. అంత వల్మీకము నుండి బయటకు వెడలివచ్చి బ్రహ్మ దేవునకు అత్యంత వినీతుడై ప్రణామములాచరించి ఇట్లనియె “పరమాత్మా! నాకు పరాత్పరమయిన మోక్షము ప్రసాదించ వలసినది.” ఆ మాటలను విన్న మహారాణి సాధ్వి కళావతి యొక్క హృదయము దు:ఖ భూయిష్ఠ మయినది. ఆమె బ్రహ్మ దేవునితో ఈ విధముగ పలికెను” పితామహా! పత్నులకు

పతియే పరమ దైవతము. నా భర్త మాత్రమే ముక్తి నందిన నా గతి ఏమి? ఈయన లేక నేను ఒక్క క్షణము సహితము జీవించ లేను. మీరు నా భర్తకు మోక్షము కలుగజేయుదురేని నా పతి సాంగత్యము నందు విక్షేపము కలిగి నేను విహ్వాలనగుదును. దానిచే మీకు శాపము నీయగలను".

ఆ పతివ్రతా శిరోమణి వచనములకు బ్రహ్మ దేవుడు ఈ విధముగ పలికెను. "ఓ! సాధ్వీ! నేను నీ శాపమునకు భయపడుచున్నాను. కానీ నాచే ఈయబడిన వరము సహితము అమోఘమయినది. అది విఫలము కారాదు. అందుచేత నీవు నీ ప్రాణనాధుదని తో సహా స్వర్గమునకు వెళ్ళుము. అనేక స్వర్గ సుఖములు అనుభవించిన మీదట మీ రిరువురు కాలాంతరము నందు తిరిగి భూమిపై ద్వాపర యుగాంతమున భారత వర్షమున, గంగా యమున మధ్య ప్రదేశమున జన్మ నందెదరు. ఆ జన్మము నందు పరిపూర్ణతమ భగవానుని ప్రియతమ అయిన శ్రీ రాధికా దేవిని పుత్రికగా బడయుదురు. అటు పిదప మీరిరువురూ జతగా ముక్తి నందెదరు." ఈ విధముగా బ్రహ్మదేవుని అమోఘ, దివ్య వర ప్రభావమున కళావతి మరియు సుచంద్రులు భూతలము నందు ఆవిర్భవించిరి. వారే కీర్తి దేవి, వృషభానునిగ పేరుగాంచిరి.

కళావతి కన్యాకుబ్జ దేశాధీశుడయిన బలందనునికి యజ్ఞకుండము నందు ఆవిర్భవించినది. ఆ దివ్య కన్యక కు తన పూర్వజన్మ స్మృతి పూర్ణముగ స్మరణ యందు కలదు. సుచంద్రుడు సురభానుని ఇంట జన్మించెను. ఆ సమయమున ఆయన వృషభానునిగనే పేర్కొనబడెను. ఆయనకునూ తన పూర్వజన్మ స్మృతి సంపూర్ణముగ గలదు. ఆయన గోప శ్రేష్ఠుడు అగుటయే కాక ద్వితీయ మన్మధుని వలె ప్రకాశించువాడు. బుద్ధిమంతుల యందు శ్రేష్ఠుడయిన నాదర మహర్షి వారిరువురి వివాహమును కూర్చెను. వారిరువురికినీ పూర్వజన్మ స్మృతి చేతనూ, ఒకరి యందు ఒకరికి మిక్కిలి అనురాగము చేతనూ, ఇరువురి సంపూర్ణ సమ్మతము చేతనూ ఈ సంబంధము కలసినది. ఏ మనుజుడు కళావతీ, వృషభానుల ఈ ఉపాఖ్యానమును వినుట తటస్థించునో వారు సమస్త పాపముల నుండి విముక్తులై అంతము నందు శ్రీ కృష్ణ భగవానుని సాయిజ్యమును పొందెదరు.

(శ్రీ గర్గ సంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి శ్రీ రాధికాదేవి యొక్క పూర్వ జన్మ వృత్తాంత వర్ణనము అను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(గర్గాచార్యుని ఆజ్ఞానుసారము దేవకుడు దేవకీ వసుదేవుల వివాహము జరుపుట. సాగనంపు సమయమున ఆకాశకాణి కంసుని హెచ్చరించుట. కంసుడు దేవకిని చంపబూనుట, కానీ వసుదేవుని శాంత వచనముల ద్వారా దేవకిని విడిచి పుచ్చుట)

నారదుడు తిరిగి చెప్పదొడంగెను " మహారాజా! ఒకప్పటి మాట. సుందర పురి అయిన మధురానగరమున అందమయిన రాజభవనము నందు గర్గాచార్యులు ప్రవేశించిరి. ఆయన జ్యోతిశ్శాస్త్రము నందు పేరెన్నిక గన్న మహావిద్వాంసుడు. సమస్త యాదవ జాతియును, మహారాజు శూరశేనుని మాట (ఆజ్ఞ) ప్రకారము ఆయనను తమ ప్రధాన పురోహితునిగ ప్రతిష్ఠించిరి. మధురాపురి యందలి ఆ రాజ భవనము వజ్రములు పొదిగిన బంగారు గవాక్షములతో నిండియుండెను. రాజద్వారము బయట గొప్ప గజములు అటునిటు తిరుగుచుండెను. వాటి గండస్థలములు ముత్యాల హారములతో నిండియుండెను. వాని కర్ణముల రాపిడికి భృంగములు ఘంఘారావము చేయుచూ ఎగురు చెండెను. ఈ విధముగ భ్రమరముల కోలాహలము మిక్కుటమై యుండెను. ఆ గజరాజుల గండ స్థలము నుండి మదజలము జలపాతము వలె కారుచూ ఆ నేలను తడుపు చుండెను. ఆ రాజమందిరము అనేక మండపములతో నిండి మిక్కిలి శోభాయమానముగ ప్రకాశించు చుండెను. బలిష్ఠమయిన వీరులు కవచము, ధనస్సు, డాలు ధరించి విచ్చుకత్తులతో

ఖడ్గపాణులై రాజభవన రక్షణ యందు అప్రమత్తులై యుండిరి. రథ, గజ, హయ పదాతి దళము లనబడు చతురంగ బలములచే కాపాడబడు ఆ రాజ మందిరము సురక్షితమై యున్నది. మునివర్యుడైన గర్గాచార్యుడు ఆ రాజ భవనము నందు ప్రవేశించి ఇంద్ర సింహాసనమును పోలు ఎత్తైన ఉన్నత సింహాసనము నందు విరాజిల్లు చున్న మహారాజు ఉగ్రసేనుని కాంచెను. అక్రూరుడు, దేవకుడు, కంసుడు ఆయనను అప్రమత్తులై సేవించు చుండగా, పరిచారికలు చామరములు వీచుచుండగా, ఉగ్రసేన మహారాజు ఛత్ర సహిత సింహాసనము నందు శచీపతి వలె ప్రకాశించు చుండెను. మహాముని గర్గాచార్యుని ఆగమమును గమనించిన ఉగ్రసేనుడు వెంఠనే సింహాసనము నుండి లేచి, ఇతర యాదవ ప్రముఖులను వెంట బెట్టుకొని గర్గునికి ఎదురేగి ప్రణామములాచరించి అర్ఘ్యపాద్యాదులొసగి, భద్ర పీఠమునందు కూర్చొండబెట్టి యధావిధిగా పూజించెను.

గర్గుడు మహారాజునకు ఆశీర్వచనము గావించి, రాజ పరివారము నంతటినీ కుశల ప్రశ్నలతో గౌరవించెను. అటు పిదప మహర్షి నీతి వేత్తలయందు శ్రేష్ఠుడయిన దేవకునితో ఇట్లనియె " ఓ! రాజా! కొంత కాలము నుండి నేను దేశాటనము చేయుచూ తీవ్రముగా ఆలోచించుచున్నాను. ఈనాడు రాజలోకమంతటిలో దేవకీ దేవికి వసుదేవుని తో సాటి వచ్చు రాజపుత్రులు లేరు. అందుచేత రాజా! వసుదేవుని వరునిగా జేసి దేవకిని ఆయనకు పత్నిగా ఇచ్చి విధి పూర్వకముగా వారిరువురికి వివాహము జరిపించ వలసినది".

నారదుడు చెప్పదొడండెను. "ఓ! రాజా! మిధిలేశ్వరా! గర్గుని యొక్క ఆదేశము ను శిరోధార్యముగ భావించి సమస్త ధర్మాచరణుల యందు శ్రేష్ఠుడయిన దేవకుడు నిశ్చితార్ధము నిశ్చయించి, తాంబూల సహిత లగ్న పత్రిక పంపించెను. పిదప గర్గాచార్యుని కోరిక ప్రకారము మంగళాచరణములాచరించి తన పుత్రిక దేవకిని వివాహ మహోత్సవము నందు వసుదేవునకు సమర్పించెను.

వివాహానంతరము సాగనంపు వేళ జవనాశ్వములు పూన్చిన మనోహర రధము నందు వసుదేవుడు రత్న ఖచిత సువర్ణాభరణముల శోభచే ప్రకాశించుచున్న నవ వధువు దేవకితో ఆశీనుడయ్యెను. వసుదేవుని యందు కంసునికి అత్యంత ప్రేమ, స్నేహము కలవు. అతడు తన చెల్లెలికి సంతోషము కలుగజేయదలచి చతురంగ సేనలతో అచటికి ఏతెంచి గుర్రపు పగ్గములను తన చేతిలోనికి తీసికొని రధ సంచాలనమునకు సంసిద్ధుడాయెను. ఆ సమయమున దేవకుడు కన్యాశుల్కముగ ఒక వేయి దాసదాసీ జనము, పది వేల ఏనుగులు, పది లక్షల గుర్రములు, ఒక లక్ష రధములు, రెండు లక్షల గోవులు కానుకగా ఒసగెను. ఆ సమయమున భేరీ మృదంగ నాదములు పిక్కటిల్లు చుండగా దాసదాసీ జనముతో మిక్కిలి కోలాహలముగ యుండెను. ఒక ప్రక్క మంగళగీతములు, మరియొక ప్రక్క వేద పఠనము కొనసాగుచుండెను. ఇదంతయు జరుగుచుండగా అశరీరవాణి బిగ్గరగా కంసుని సంభోదించుచూ ఇట్లనియె "ఓరీ! కంసా! మూర్ఖుడా!! గుర్రపు పగ్గములు పట్టుకొని నీవు ఎవరి రధమును నడుపుటకు ఉత్సుకుడవగుచున్నావో ఆ రధికుల ఎనిమిదవ పుత్రుడు నిన్ను అనాయాసముగ చంపును. ఈ విషయము నీకు తెలియదు". కంసుడు స్వభావరీత్యా బహు దుష్టుడు. ఎల్లప్పుడూ దుష్ట సాంగత్యము చేయువాడు. సిగ్గు, లజ్జ అనునవి వానిని ముట్టవు. చాలా నిర్దయుడు కావున ఎల్లప్పుడు భయంకర కృత్యములు చేయువాడు.

ఇటువంటి కంసుడు అశరీరవాణి పలుకులు విన్న తడవు ఒక భయంకర నిశిత కరవాలము చేతబట్టి నవ వధువు అయిన తన చెల్లిలి కేశపాశమును రెండవ చేతితో ఒడిసి పట్టి, ఆమెను సంహరించుటకు నిశ్చయించెను. ఆ సమయమున బాజా భజంత్రీలు ఆగిపోయినవి. ముందుకు పోవుచున్న గుంపు ఆగి ఆశ్చర్య చకితులై వెనుకకు చూచుచుండిరి. ఆ సమయము నందు సత్పురుషుల యందు శ్రేష్ఠుడయిన వసుదేవుడు ఇట్లనెను. "ఓ! భోజరాజా! నీవు నీ వంశము యొక్క కీర్తిని ఇనుమడింపు చేయువాడివి. నరకుడు, బకుడు, జరాసంధుడు, బాణాసురుడు మొదలగు మహావీరులు నీతో యుద్ధము చేయుటకు సమరాంగణమునకు ఏతెంచి, నిన్ను ప్రశంశించి ఆ కార్యము విరమించుకొనిరి. అటువంటి నీవు కరవాలముతో నీ సోదరిని సంహరించుటకు ఎట్లు ఉద్యుక్తుడవగుచున్నావు? బకాసురుని చెల్లెలయిన పూతన నీతో యుద్ధమునకు దిగినపుడు నీవు నీతిజ్ఞుడవై ఒక స్త్రీతో యుద్ధమునకు ఒల్లనని శాంత కాముకుడవై, ఆమెను నీ చెల్లెలిగా స్వీకరించితివి.కానీ దేవకి సాక్షాత్ నీ సోదరి. ఈ అనుచిత కార్యము చేయుటకు నీ మనసు ఎట్లు అంగీకరించినది? ఈ

కన్య   శుభ కార్యమునకై ఇచటకు ఏతెంచినది. ఈమె చిన్న బాలిక మరియు నీ చిన్నారి చెల్లెలు. ఓ! మధురానరేశ్వరా! ఈమె నీ పుత్రికా సమానురాలు, అందుచే దయా పాత్రురాలు. అంతేకాక ఈమె ఎప్పుడూ నీకు మంచి అభిలషించెడిది. అందుచే ఈమెను వధించుట ఎంత మాత్రమూ పాడిగాదు. నీ చిత్తము ఎప్పుడూ దు:ఖితుల యొక్క దు:ఖము దూరము చేయుట యందు యందును కదా!".

నారదుడు తిరిగి చెప్పదొడండెను "వసుదేవుడు ఈ రీతిగా నచ్చచెప్పినప్పటికీ మిక్కిలి దుష్టుడు, కుసంస్కారి అయిన కంసుడు ఆయన మాట పెడచెవిని పెట్టెను. అపుడు వసుదేవుడు "ఇది భగవంతుని లీల. కాలము యొక్క గమనము గుహ్యము, చిత్రము", అని తలచి తిరిగి కంసునితో ఇట్లు సంభాషించెను, "ఓ! రాజా! ఈ దేవకీ దేవి వలన నీకు భయము లేదు. ఇక ఆకాశవాణి పలుకుట యొడ నా అంతరంగము కూడా నీవు వినవలసినది. నేను ఈమె గర్భము నందు ఉదయించిన అందరు పుత్రులను నీకు ఇచ్చివేయుదును. ఎందుకనగా వారి వల్ల నీవు భయభీతుడవగుచున్నావు. అందుచేత నీవు భయము వీడుము. అంత కంసుడు ఆ వసుదేవుని నిశ్చయాత్మక పలుకులు విని నిశ్చింతగా తన గృహమునకు వెడలి పోయెను.

అంత వసుదేవుడునూ మిక్కిలి భయకంపిత అయిన తన అర్ధాంగి దేవకిని తీసికొని తన భవనమునకు వెడలెను.

(శ్రీ గర్గ సంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందు వసుదేవుని వివాహ వర్ణనమను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదవ అధ్యాయము

(కంసుని అత్యాచారములు బలభద్రుని అవతారము మరియు వ్యాసదేవుని ద్వారా ఆయన స్తుతి)

నారదుడు తిరిగి చెప్పదొడంగెను "ఓ! మహారాజా! కంసుడు ఈ రీతిగా ఆలోచించసాగెను. ఈ వసుదేవుడు ఎటైననూ పారిపోడు కదా! ఇట్ల శంకించి అనేక మంది సాయుధులయిన సైనికులను వసుదేవుని గృహమునకు నలువైపులా మొహరించెను. ఇట్లు జరుగు చుండగా దేవకీ వసుదేవులకు కాల క్రమమున ఎనిమిది మంది పుత్రులు. ఒక పుత్రిక జన్మించిరి. ఆమెయే భగవతి, సనాతని, మహామాయ. మెట్టమెదట వారికి ఒక పుత్రుడు జన్మించెను. వానికి కీర్తి మానుడని నామకరణము చేసిరి. వసుదేవుడు ఆ పసికందును తీసికొని కంసుని వద్దకు పోయెను. సదా సత్యవచన తత్పరుడయిన వసుదేవుని చూచి కంసుడు సహితము దయార్ద్ర హృదయుడాయెను. సాధు పురుషులు ఎటువంటి దు:ఖము నైననూ సహింతురు కానీ సూనృత వాక్యమును మీరరు. సత్యమును కాంచునపుడు ఎవరి మనసు క్షమాభరితము కాదు?

కంసుడు ఇట్లు పలికెను "వసుదేవా! ఈ బాలుని నీ వెంట తోడ్కొని పొమ్ము. ఈ బాలుని వలన నాకు మృత్యుభయము లేదు. కానీ మీరిరువురి ఎనిమిదవ సంతానము నాకు తప్పక ఈయవలసినది. వానిని నిస్సందేహముగ నేను సంహరించెదను. కంసుని భాషణమును విన్న వసుదేవుడు తన పుత్రుని తీసికొని తన స్వగృహమునకు ఏగెను, కానీ ఆయన దుష్టాత్ముడయిన కంసుని పలుకులు ఇసుమంతయు నమ్మలేదు. ఇంతలో ఆకాశ మార్గము నుండి నేను (నారదుడు) కంసుని కడకేగితిని. ఆతడు నారద మునీంద్రుని చూడగానే దండ ప్రణామములాచరించి స్వాగత సత్కారములు జేసెను. పిదప అతడు దేవతల ఉనికి, అభిప్రాయముల గూర్చి ప్రశ్నించెను. నేను అతడికి ఈ విధముగ సెలవిచ్చితిని. "ఓ! కంసరాజా! నందుడు ఆదిగా గల గోపాలురు వసువుల అవతారము. వృషభానుడు దేవతల యొక్క అవతారము. వేదార్థములు అన్నియు రూపుదాల్చి వ్రజభూమి యందు గోపికలుగా జన్మించినవి.

అంతియేకాదు. ఈ మధురా నగరము నందు వసుదేవాది వృష్ణి వంశజులందరూ పూర్తిగా దేవతల ప్రతి రూపములే!

దేవకీ దేవి మరియు ఇతర స్త్రీలందరునూ దేవాంగనలే! ఏడు సార్లు లెక్క పెట్టినచో ఒకటి కూడ ఎనిమిది అగును. "సంఖ్యానాం వామతో గతి:". సంఖ్యా శాస్త్రము నందు వెనుక నుండి లెక్కపెట్టు పద్ధతి కూడా కలదు. అదియే నిజమైనచో ఈ ఒకటో బాలకుడే ఎనిమిదవ బాలుడు (పుత్రుడు) కావచ్చును. ఈ విధముగా పలికి నారదుడు అంతర్ధానుడాయెను. అటు పిదప దేవతలు యొక్క పన్నాగము గమనించిన కంసుడు అగ్రహోదగ్రుడు ఆయెను.

అతడు తక్షణమే యాదవులనందరినీ పరమార్చ దలిచెను. దేవకీ, వసుదేవులను ఇనుప సంకెళ్ళతో బంధించి కారాగారము నందుంచెను. వారి ప్రథమ శిశువును శిలాప్రహారము చే వధించెను. కంసునికి తన పూర్వ జన్మ స్మృతి కలదు. అందుచే తన దుష్ట స్వభావము చేతనూ, విష్ణు భగవానుని యందు భయము చేతనూ దేవకీ వసుదేవుల ప్రతి ఒక శిశువును అట్లే భయానకముగ వధించెను. అతనికి కొంచెము కూడా సంకోచము లేదు. ఇది అన్నియు కాంచుచున్న ఉగ్రసేన మహారాజు మిక్కిలి కుపితుడాయెను. ఆయన వసుదేవునికి సహాయము చేయదలచి కంసుని అకృత్యములను ఆపుటకు ప్రయత్నించెను. కంసుని భయంకర కృత్యములను ప్రత్యక్షముగ గమనించిన యాదవ వీరులు ఆతనిని ఎదుర్కొనుటకు ఉగ్రసేనుని వెనుక సాయుధ పాణులై నిలిచిరి. ఉగ్రసేనుని అనుగాములు సాయుధులగుట కాంచి కంసుని నిజ సైనికులు సహితము వారిని ఎదుర్కొనుటకు సంసిద్ధులయిరి. రాజసభా మండపమున ఇరు వర్గములకు సంకుల సమరము చెలరేగెను. రాజద్వారము వద్దను ఇట్లే ఇరు వర్గములకు సమరము కొనసాగెను. వారందరూ ఒకరిపై ఒకరు ఖడ్గ ప్రహారములు చేయదొడంగిరి. అచ్చట దాదాపు పదివేల మంది యోధులు యుద్ధము నందు పాల్గొనిరి. అంత కంసుడు ఉగ్రగదా ధారుడై తన తండ్రి యొక్క సేనలను పిండి పిండి గావించెను. ఆతని గదా ఘాతములచే కొందరి మస్తకములు విచ్చిన్న మయినవి. కొందరికి దంతములు, కాళ్ళు, చేతులు, గోళ్ళు విరిగి వికలాంగులయిరి. శస్త్ర పాణులయిన వీరులందరూ క్షణమునే ధరాశయనులయిరి. అత్యధిక యోధులు రక్తస్రావము చే మూర్ఛనొంది కాలగతి యందు కలసిపోయిరి.

సభామండప మంతయూ రక్త సిక్త మయినది. రాజరాజేశ్వరా! మిథిలేశ్వరా! ఈ ప్రకారముగా దుష్టుడు, మదోన్మత్తుడయిన కంసుడు శత్రువులందరినీ నిర్జించి తన తండ్రిని బందీకృతుని గావించెను. అయనను సింహాసనము నుండి చ్యుతుని గావించి, పాశములచే బంధించి, ఆయనను అనుయాయుల సహితముగ, కారాగారము నందు బందీకృతులను గావించి, మధుర, మరియు శూరసేన రాజ్యములను ఆక్రమించి వారి సంపద నంతటిని అపహరించి స్వయముగ సింహాసనాధీశుడై రాజ్యపాలన మారంభించెను.

దేవకి యొక్క ఏడవ గర్భము ఆమెకు ఏక కాలమున హర్షోద్వేగములు రెండును కలుగజేసినది. ఆ గర్భము నందు సాక్షాత్ అనంత దేవుడు వృద్ధి పొందు చుండెను. యోగమాయ ఆమె గర్భమును సంకర్షణము చేసి ఆమె గర్భస్థ శిశువును వ్రజభూమి యందు నివసించుచున్న వసుదేవుని మరియొక భార్య అయిన రోహిణీ దేవి గర్భమందు ప్రవేశ పెట్టను. దేవకీ దేవికి గర్భస్రావ మాయెను. ఈ విషయము తెలిసిన పౌరులు మిక్కిలి దు:ఖించిరి. ఇంతలో రోహిణీ గర్భమందు ప్రవేశ పెట్టబడిన అయిదవ దినము భాద్రపద శుక్ల షష్ఠి తిథి యందు, స్వాతి నక్షత్రమున, బుధవారమున రోహిణీ గర్భము నుండి బలదేవుడుదయించెను. తులా లగ్నము, మధ్యాహ్న కాలమందు అయిదు గ్రహములు ఉచ్ఛయందు యుండగా బలభద్రుడు జన్మించెను. ఆ శుభ సమయమున దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. మేఘములు మంద్రముగ వర్షము కురిపించినవి. అనంత దేవుడు తన అంగముల కాంతిచే నందభవనము నంతయూ నింపివేసెను. నందుడు ఆ బాలునకు జాత కర్మములు యథాప్రకారముగ కావించి పది లక్షల గోవులు బ్రాహ్మణులకు దానముగ సమర్పించెను. గోపకులనందరినీ ఆహ్వానించి గొప్ప సంగీత విద్వాంసులచే కచేరీలు చేయించి అద్భుత మంగళమయమయిన ఉత్సవము జరిపించెను. నారదుడు, దేవలుడు, దేవరాతుడు, వశిష్ఠుడు, బృహస్పతి మరియు వ్యాసునితో సహితము అచటికి విచ్చేసి నందునిచే ఈయబడిన అర్ఘ్య పాద్యాదులను గ్రహించి కడు ప్రసన్నులయిరి.

నందుడు ఆ మహర్షులను ఈ విధముగ ప్రశ్నించెను, "ఓ! మహర్షులారా! అద్వితీయముగ వెలుగుచున్న ఈ సుందర బాలకుడెవరు? కేవలము అయిదు దినములో ఈతడి జన్మము ఎట్లు జరిగినది? ఈ విషయము వివరింపవలసినది". అంత వ్యాసముని ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను "నందరాజా! ఈ శిశువు రూపములో సాక్షాత్ సనాతన భగవానుడయిన

శేషనాగుడు ఉదయించెను. తొలుత మధురాపురము నందు దేవకీ గర్భము నందు ఈయన ఆవిర్భావమయినది. కానీ శ్రీకృష్ణ భగవానుని ఇచ్ఛాను సారము ఈతడు దేవకీ గర్భము నుండి కళ్యాణమయి అయిన రోహిణీ గర్భము నందు ప్రవేశించెను. నందరాజా! మహాయోగులకు సహితము దుర్లభమయిన శేషనాగ దర్శనము నీకు ప్రాప్తించినది. నేను (వ్యాసుడు) మరియు ఈ మహర్షులందూ ఆ దివ్య శిశువు సందర్శనార్థమే ఏతించితిమి. అందు చేత మాకు ఆయన దర్శన భాగ్యము కల్పింపవలసినది. నందుడు విస్మితుడై తదనంతరము ఉయ్యాల యందు విరాజిల్లు చున్న శేషుని దర్శనము వారికి కావించెను.

సాత్యవతీ నందనుడయిన వేదవ్యాసుడు శేషుని ఇట్లు కీర్తించెను-"భగవాన్! మీరు దేవతలకు సహితము అధిదేవతలు, మరియు ఎల్లరకు మనోరధములు పూర్ణము గావించు కల్పతరువు. మీకు నమస్కారము. మీరు సాక్షాత్ శేషనాగము, మరియు బలరామ నామధారి. మీకు నా నమస్సుమాంజలులు.మీరు ధరణీధరులు. పూర్ణ స్వరూపులు, స్వయం ప్రకాశకులు హలాయుధులు, సంకర్షణులు, మరియు వేయి పడగలచే శోభించువారు. మీకు నమస్కారము. ఓ! రేవతీ రమణా! మీరే బలదేవులు, శ్రీకృష్ణాగ్రజులు. హలాయుధులు మరియు ప్రలంబాసుర నాశకులు. పురుషోత్తమా! నన్ను రక్షింప వలసినది. మీరు తాళ చిహ్న పతాకము ధారణ చేయువారు. మీరు గౌరవర్ణులు, నీల వస్త్రధారులు మరియు రోహిణీ గర్భ సమన్వితులు. మీరు ధేనుకుడు, ముష్టికుడు, కుంభాండుడు, రుక్మి, కూపకర్ణుడు, కూటుడు, మరియు పల్వాలుల శత్రువు. మీరు కాళింది (యమునా నది) యొక్క ప్రవాహ దిశను మార్చు దివ్యులు మరియు హస్తినాపురిని గంగానది వైపు ఈడ్చు బలదేవులు. మీరు ద్వివిద వానర వినాశకులు, యాదవుల యొక్క స్వామి మరియు వ్రజ మండలమును పావనము చేయు మూర్తి. మీరు కంసుని సోదరులను మట్టుబెట్టు స్వామి, మరియు తీర్థయాత్రలు సలుపు ప్రభువు. మీరు సాక్షాత్ దుర్యోధనునకు గురువు. ఓ! ప్రభూ! ఈ జగత్తును రక్షించండి! రక్షించండి! మీ అపార మహిమ చే ఎప్పుడూ స్వస్థితి నుండి చ్యుతి కాని పరాత్పరా! అనంతా! మీకు జయము అగుగాక!

మీ యొక్క దివ్య యశస్సు దిగంతముల వరకు వ్యాపించినది. హలధారి, మరియు మౌసలధారి, అనంత అవిక్ర పరాక్రముడా! మీరు సురేంద్రులు, మునీంద్రులు, మరియు ఫణీంద్రులందరి యందును శ్రేష్ఠులు". ఎవరు జగత్తు నందు ఎల్లప్పుడు ఈ స్థవము పారాయణము చేయుదురో వారికి శ్రీహరి యొక్క పరమపదము ప్రాప్తమగును. వారికి సంసారము నందు శత్రుసంహారము చేయు సంపూర్ణబల పరాక్రమములు సిద్ధించును. అంతేకాక అతనికి ఎల్లప్పుడూ జయము, విపులసంపద కలుగును. పరాశర సందనుడు, బుద్ధిమంతుల యందు శ్రేష్ఠుడు, సాత్యవతేయుడు, బాదరాయణ ముని, కృష్ణ ద్వైపాయనుడు, వేదవ్యాసుడు మిగిలిన మహర్షుల తో కలసి వంద సార్లు ప్రణామములు ఆచరించి ప్రదక్షిణలు చేసి తిరిగి సరస్వతీ తటమున యున్న తన అశ్రమమునకు చనెను.

(గర్గ సంహిత యందలి గోలోక ఖండార్గతమున నారద బహులాశ్వ సంవాదమున బలభద్రుని జన్మ వర్ణనమను పదియన అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(దేవకీ వసుదేవుల యందు భగవానుని ప్రవేశము. దేవతలు అయనను స్థుతించుట. ఆవిర్భావ కాలము. అవతార విగ్రహము. దేవకీ వసుదేవుల ద్వారా భగవానుని స్థుతి. భగవానుడు వారికి పూర్వజన్మ వృత్తాంతమును వివరించుట, మరియు నందుని వద్దకు గొని పొమ్మని ఆదేశించుట. యోగమాయ కంసునికి శ్రీ కృష్ణ జననము గూర్చి తెల్పుట. కంసుడు పశ్చాత్తాపము తో దేవకీ వసుదేవులను బంధ విముక్తులను చేయుట, మరియు దైత్యులను బాలవధ కావింపమని ఆదేశించుట)

నారద మహర్షి తిరిగి చెప్పసాగెను "ఓ! మిధిలేశ్వరా! తదనంతరము పరాత్పరుడు, పరిపూర్ణతమ భగవానుడు అయిన శ్రీకృష్ణుడు మొదట వసుదేవుని మనసు నందు ప్రవేశించెను. ఆ క్షణము నుండి ఆ మహానుభావుడు సూర్య, చంద్ర, అగ్నిశిఖల తేజస్సుతో ప్రకాశించుచూ, ద్వితీయ యజ్ఞ నారాయణుని వలె తేజరిల్లెను. పిదప సమస్త, భూత కోటికినీ, అభయ ప్రదాతయగు శ్రీ కృష్ణ భగవానుడు దేవకీదేవి గర్భమున ప్రవేశించెను. ఆ సమయము నుండి ఆమె మేఘమండలము నందు విద్యుల్లతవలె ఆ కారాగృహము నందు ప్రకాశింప సాగెను. దేవకి యొక్క తేజస్సును గమనించిన కంసుడు మనస్సు నందు భయభ్రాంతుడయి ఇట్లు చింతించెను "ఇంతకు మున్ను ఎన్నడునూ ఈమె యందు ఈ కాంతి, తేజస్సు కానరాలేదు. నా ప్రాణములను హరించు శిశువు పుట్టబోవుచున్నాడు. ఈ శిశువును పుట్టిన వెంటనే సంహరించెదను." అని పలికి ఆతడే భయవిహ్వలుడై ఆ బాలుని పుట్టుకకై నిరీక్షించుచుండెను. కంసుడు భయము కారణమున ఆతని పూర్ణ శత్రువైన విష్ణువు యొక్క చింతనము చేయుచూ సర్వత్రా విష్ణువునే చూడసాగెను. ఆహా! దృఢమయిన వైరబంధము చేతనైననూ భగవానుడయిన కృష్ణుని దర్శనము ప్రత్యక్షముగా కాగలదు కదా! ఇందు చేతనే అసురులు శ్రీకృష్ణ ప్రాప్తి కొరకు ఆయనతో వైరము పూనెదరు.

భగవానుడు దేవకీదేవి యొక్క గర్భ ప్రవేశానంతరము బ్రహ్మాది దేవతలు, నారదుని మునీశ్వరులు, ఆ కారాగృహమున కేతెంచి ఈ విధముగ స్తుతించిరి, "ఎవనికి జాగృత్, స్వప్నములందు ప్రకటిత మగు విశ్వమునకు కారణ భూతుడయ్యునూ, తనకు సంబంధము పెట్టుకొనడో; ఎవరి కళ్యాణ గుణముల ఆశ్రయము చేత సమస్త ప్రాణకోటి సంచరించు చున్నదో; అగ్ని నుండి బయల్వెడలిన విస్ఫులింగములు ఎట్లు తిరిగి అగ్ని యందు ప్రవేశింప లేవో అట్లే మహత్తత్త్వము, ఇంద్రియవర్గము మరియు వాని అదిష్ఠాత్రు వర్గమయిన దేవతానీకము భగవంతుని నుండి ప్రకటితమయిన పిదప తిరిగి వెనుకకు ప్రవేశింప లేవో; అట్టి పరమాత్ముడు శ్రీకృష్ణునికి మేము సాదర ప్రమాణములు ఆచరించు చున్నాము.

బలవంతులందరి యందు బలిష్ఠుడయిన కాలము ఎవనిపై శాశనము చేయలేదో, మహామాయ సహితము ఎవని యందు తన ప్రభావము చూపించ లేదో, వేదము సహితము ఎవని విషయము వివరించుటకు విఫలమగునో అట్టి అమృత, ప్రశాంత, శుద్ధ పరాత్పర పూర్ణ బ్రహ్మ స్వరూపులైన భగవాన్ కృష్ణా! మిమ్ము శరణు జొచ్చు చున్నాము.

ఏ భగవానుని యొక్క అంశ, అంశాంశ, కళ, ఆవేశ, పూర్ణావతారములచే ఈ సృష్టి యొక్క పాలనాది సమస్త కార్యములు చక్కదిద్దబడుచున్నవో, అట్టి పరిపూర్ణ భగవానుడయిన శ్రీ కృష్ణునికి మేము ప్రణామము చేయుచున్నాము.

ప్రభో! భూత భవిష్యత్, వర్తమాన కాలమందలి మన్వంతరములు, యుగములు, కల్పముల యందు మీరు అంశ మరియు కళావతారములను స్వీకరించిరి/స్వీకరించెదరు. కానీ ఇప్పుడు ఎటువంటి సౌభాగ్యపూర్వక ఆవశ్యకత ఏర్పడిన దంటే తాము పరపూర్ణావతారము స్వీకరించి తమ ధామమును ఈ పృధివి యందు విస్తరింపచేయుచున్నారు. ఆ పరిపూర్ణావతారము ద్వారా భూతలము నందు ధర్మ స్థాపన చేసి లోకమునకు మంగళములు ప్రసాదించ వలసినది.

మహానుభావా! మీ చరణయుగళి ధూళి విశుద్ధాంత: కరణులయిన మహా యోగులకు సహితము దుర్లభము, మరియు అగమ్యము కానీ ఎవరు భక్తియోగ సాధనచే తమ నిర్మల హృదయమందు ప్రేమ రసార్ద్ర ద్రవిత చిత్తము కలిగి యందురో వారికి మాత్రము సుసాధ్యము.

ఓ! యోగీశ్వరేశ్వరా! శిశురూపములో తాము చిన్న చిన్న అడుగులు వేయుచూ నడుచునపుడు వెలయు మకరంద పరాగములను పట్టి మేము శిరోధారణము చేయవలెనని మా అంతరంగిక అభిలాష.

ఓ! దేవాదిదేవా! మీరు అనాది నుండి దివ్యమంగళ కమనీయ విగ్రహులు, మరియు ఈ అవతారము నందు అదే రూపముతో సుశోభితులగుచున్నారు. మీ రూపము శతకోటి మన్మధులను సహితము మోహింపజేయు పరమాద్భుత రూపము. తాము గోలోకమున ధరించు దివ్య ఆభరణ సముదాయమును ఇక్కడను ధరించెదరు. సర్వోత్కృష్ఠమయిన ధర్మధనమును ధరించు ఓ! రాధా వల్లభా! మీకు ప్రణామము చేయుచున్నాము." ఆ సమయము నందు బ్రహ్మాది దేవతలందరూ శ్రీహరికి ప్రణామము లాచరించి ఆయన గుణ మహిమలను, కీర్తిని గానము చేసి, ప్రశంశించి ప్రసన్న హృదయములతో తమ తమ థామములకు ఏగిరి.

ఓ మిధిలాదీశా! బహుళాశ్వా! తదనంతరము శ్రీహరి ప్రకటమగు సమయము ఆసన్నమయెను. ఆ సమయమున

ఆకాశము స్వచ్ఛమయ్యెను. దశదిశలు నిర్మల మయినవి. తారలు మిక్కిలి ప్రకాశము తో శోభించినవి. భూ మండల మంతయూ ప్రసన్న మయినది. నదీ, నదములు, సరోవరములు, మరియు సముద్రముల జలములు మిక్కిలి స్వచ్ఛమయినవి. అన్ని దిశల యందు శతదళ, సహస్రదళ పద్మములు వికసించినవి. వాని సుగంధ యుక్త పరాగము నలుదెసలా వ్యాప్తి చెందుచున్నది. శీతల సుగంధ వాయువు మందగమనము తో వీచుచున్నది. తుమ్మెదలు ఝుంకారము చేయుచూ కమలముల చుట్టూ పరిభ్రమించున్నవి. జనపదములు, గ్రామములు, పట్టణములు, నగరములు, సుఖశాంతులతో ప్రసన్న మయినవి. దేవతలు, భూసురులు, పర్వతములు, వృక్షములు, మరియు గోవులు పూర్ణముగ సుఖీభూతములయినవి. దేవ దుంధుభులు మ్రోగినవి. సర్వ దిశల యందు జయ జయ ధ్వానములు మిన్నుముట్టినవి. ఒక్క ప్రదేశము అని చెప్పలేను. భూనభోంతరాళము సర్వమూ మంగళ స్వరూపమయినది. గాన విద్యా విశారదులయిన విద్యాధరులు, గంధర్వులు, సిద్ధులు, కిన్నెరలు మరియు చారణులు కర్ణపేయముగ గానము చేయసాగిరి. దేవతలు ఆ పరమ పురుషుని స్తోత్రముల ద్వారా స్థవనము చేయసాగిరి. దేవలోకము నందు గంధర్వ, విద్యాధరులు, నాట్యము చేసిరి. దేవతా ముఖ్యులు మందారము, పారిజాతము, మాలతీ పుష్పవర్షము కురిపింప సాగిరి. మేఘగర్జన చేయుచూ జల వృష్టియూ కురియ సాగెను.

భాద్రపద మాసము, కృష్ణపక్షము, రోహిణీ నక్షత్రము నందు హర్షణ యోగ ముండగా వృషభ లగ్నము అష్టమీ తిధియందు అర్ధరాత్రి జతత్తు, అంధకార బంధురమై యుండగా కారాగారము నందు దేవకీ గర్భ సంజాతుడు సాక్షాత్ శ్రీహరి అరణి యందు అగ్ని ప్రజ్వరిల్లునట్లు ఉదయించెను.

ఆ సమయమున ఆయన కంఠము నందు ముక్త హారములు, వక్షమునందు శోభాన్విత మయిన కౌస్తుభ మణి, మరియు రత్నమాల, చరణములందు నూపురములు, బాహువుల యందు కేయూరములు, ధరించి భగవానుడు మండలాకారమున కాంతి వెదజల్లు చండగా ఉద్భాసితుడాయెను. శిరము నందు కిరీటము, కర్ణములందు మకర కుండలములు, బాలభానుని తేజస్సును వెదజల్లు చున్నవి. మణికట్ల యందు అలంకరింపబడిన కంకణములు అగ్ని తేజస్సును విరజిమ్ముచ్నువి. నడుమున ఉన్న వడ్డాణము విద్యుత్తీగ వలె మెరయుచున్నది. కంఠసీమ యందు మధుపములు మధువును గ్రోలుచున్న కమలములతో కట్టుబడిన సుందర వనమాల శోభించుచున్నది. ఆయన దుకూలము పుటము పెట్ట బడిన బంగారము యొక్క కాంతిని ధిక్కరించి చున్నది. శ్రీహరి శ్యామ సుందర విగ్రహము పై శోభించుచున్న పచ్చని పట్టు పీతాంబరము విద్యుత్విలాస విలసితమయిన నీలి మేఘము యొక్క సౌందర్యమును పరిహసించుచున్నది. శిరముపై నల్లని శిరోజములు తుమ్మెదల రాశి వలె శోభించుచున్నవి. ఆయన ముఖ చంద్రిక నుండి వెలువడు కిరణములు అచటి అంధకారమును పటాపంచలు చేయుచున్నవి. ఆయన పరమ సుందర శుభాననము నందు విరిసిన నల్లకలువల జంటవలె నేత్రములు శోభించుచున్నవి. ఆయన కనుల పై భాగమున (నుదిటిపై) చిత్ర, విచిత్ర మనోహర మయిన తిలకము దిద్దబడెను. ఇట్లు సుందర శుభాంగముల చే మండితమయిన ముఖము కోట్లకొలది కామ దేవులను సహితము మోహింపజేయును. ఈ పరిపూర్ణతమ భగవానుడు మధుర వేణునాదము వాయించుటయందు తత్పరుడై యుండును.

ఇట్టి పుత్రుని దర్శించిన యదుకుల తిలకుడయిన వసుదేవుని నేత్రములు భగవానుని జన్మోత్సవ ఆనందము చే భాష్ప పూరితములాయెను. వెంటనే ఆయన తన మనసు నందు ఈ జన్మదిన సందర్భమున బ్రాహ్మణులకు ఒక లక్ష గోవులను దానమిచ్చుటకు నిశ్చయించెను. సూతికా గృహమునందు భగవానుని ఆవిర్భావము అయినంతనే వసుదేవుని భయము తొలగి పోయినది. అతడు అత్యంత విస్మితుడై, చేతులు జోడించి ఆది అద్యాంత రహితుడయిన శ్రీహరికి ప్రణామములు ఒసగి స్తోత్రముల ద్వారా ఆయనను స్థుతింప సాగెను. వసుదేవుడిట్లనియె “భగవాన్! మీరు ఏక మాత్రులయన అద్వితీయులు. మీరే పరబ్రహ్మ, పరమాత్మ. ప్రకృతి యొక్క సత్వాది గుణములకు కారణభూతులు మరియు అనేక రూపములతో మెలగువారు. మీరు సృష్టి, స్థితి, లయలకు మూలకారణము. ఓ! ఆదిదేవా! భువన పాలకా! పరమాత్మా! ఎట్లు స్పటికమణి ఉపాధుల యొక్క రంగును అంటించుకొనదో అట్లే మీరును దేహముల యొక్క వర్ణములకు అతీతముగ నిర్లిప్తముగ యుందురు. ఇట్టి పరమేశ్వరులయిన మీకు నమస్కారము. ఎట్లు ఇంధనము నందు అగ్ని చిపీభూతము (అదృశ్యము) గ యున్నదో అట్లే సర్వ జగము నందు అవ్యక్త రూపము తో మీరు విరాజిల్లుచున్నారు. ఎట్లు ఆకాశము సర్వ భూతములకు లోపల, వెలుపల యుండునో అట్లే మీరునూ సర్వ భూతముల లోపల, వెలుపల విస్తరించి యున్నారు.

మీరు పృథివిగ సర్వులకు ఆధారము మరయు సర్వసాక్షి. అట్లే వాయువు వలె సర్వత్రా వెళ్ళగలగు శక్తి కలిగి యున్నారు. ఓ! ప్రభూ! మీరు గోవులు, భూసురులు, దేవతలు, మరియు తమ భక్త జనుల యొక్క పాలకులు. ఈ దుర్భర భూభారమును తగ్గింటచుటకై మీరు మా ఇంటియందు అవతీర్ణులయిరి. ఈ భూతలము నందలి సమస్త పురుషోత్తముల కంటే మీరు అధికులు, ఉత్తములు. భువనపతీ! నన్ను పాపి అయిన కంసుని బారి నుండి రక్షింప ప్రార్ధన"

నారదుడు తిరిగి చెప్పసాగెను. "ఓ! మిధిలాపతీ! సర్వ దేవతా స్వరూపిణి అయిన దేవకీ దేవి కి కూడా తమ ఇంట పరిపూర్ణ పరమాత్ముడు, శ్యామ సుందరుడు, సాక్షాత్ శ్రీకృష్ణుడు ఆవిర్భవించెనన్న ఎరుక కలిగినది. అంత దేవకీదేవి ఆయనకు సమస్కరించి ఇట్లు పలికెను "ఓ! సచ్చిదానంద ఘన శ్రీకృష్ణా! అగణిత బ్రహ్మాండముల యొక్క స్వామీ! పరమేశ్వరా! గోలోక వాసా! ఆదిదేవా! పూర్ణ రూపుడయిన ఈశ్వరా! పరిపూర్ణతముడవయిన పరమేశ్వరా! ప్రభూ! నన్ను పాపి అయిన కంసుని బారి నుండి రక్షించండి! రక్షించండి!!

మాతాపితరులచే చేయబడిన స్థుతిని వినిన పాపనాశనుడు, పరిపూర్ణ భగవానుడు శ్రీకృష్ణుడు మందహాసము చేయుచూ దేవకీ వసుదేవులకు ఇట్లనియె.

"పూర్వ సృష్టి యందు మీరిరువురు సుతపుడు, మరియు పృశ్ని అను ప్రజాపతి దంపతి. మీరుభయులు అన్నపానములు వర్జించి సంతాన ప్రాప్తి కొరకు బ్రహ్మదేవుని ఆజ్ఞానుసారము ఒక మన్వంతర కాలము అనితర సాధ్యమయిన తపమొనరించిరి. మీ యందు నేను ప్రసన్నుడనై మీకు ప్రత్యక్షమై ఏదేని వరము కోరుకొన మనగా మీరు నాతో సముడయిన పుత్రుని ప్రసాదించమని కోరుకొనిరి. నేను "తధాస్తు" అని పలికితిని. అటు పిదప మీరిరువురు దంపతి మీ పూర్వ పుణ్య కర్మవశమున ప్రజాపతులుగ జన్మనందిరి. జగత్తు నందు నాతో సమానులు ఎవరూ లేరు. అందుచే నేను మీకు పుత్ర రూపముతో లభ్యమయితిని. ఆ సమయమున భూతలము నందు పృశ్నిగర్భునిగ ప్రఖ్యాతి నొందితిని. మరుసటి జన్మనందు మీరిరువురు అదితి, కశ్యపులుగ ఆవిర్భవించి నపుడు మీకు వామనమూర్తి ఉపేంద్రునిగ ఆవిర్భవించితిని. అట్లే వర్తమానము నందు తిరిగి మీరిరువురికి పుత్రునిగ జన్మించితిని. పితాశ్రీ! మీరు నన్ను తీసికొని నంద భవనము నందు చేర్చి, ఆయన పుత్రికను ఇచటకు తీసికొని రావలసినది. ఇందుచే మీకు కంసుని వలన భయము తొలగును.

నారదుడు తిరిగి చెప్పసాగెను. "ఈ విధముగ పలికి భగవానుడు మౌనముద్ర దాల్చి వారిరువురు చూచుచుండగానే తన దివ్యరూపమును ఉపసంహరించి, బాలరూపము దాల్చి, నటుడు క్షణములో వేష భాషలు మార్చునట్లు చిన్న పాపడై భూతలమున పరుండెను. ఆ చిన్నారి బాలుని ఉయ్యాల వంటి బుట్టలో పరుండబెట్టి, బుజ్జగించి, వసుదేవుడు నందుని ఇంటికి ప్రయాణము సమకట్టెను. ఆ సమయమున నందపత్ని యశోద గర్భము నుండి యోగమాయ జన్మనందెను. ఆ తల్లి ప్రభావముచే జనులందరూ సుఖ నిద్రా పరాయణులయిరి. కాపలాదారులు సహితము పూర్తిగా నిద్రావశులయిరి. ద్వారములన్నియు తమకు తాము తెరుచుకున్నవి. వసుదేవునికి కట్టబడిన సంకెలలు ఛిన్నాభిన్నమయినవి. శ్రీకృష్ణ భగవానుని ఉంచిన ఉయ్యాల తట్టను శిరశున ధరించి వసుదేవుడు కారాగృహము నుండి బయటకు వెడలెను. వెను వెంతనే ఆయన హృదయమున నున్న అజ్ఞానము, బయట ఉన్న అంధకారము సూర్యోదయ సమయమున పారద్రోల బడు చీకట్ల వలె పటాపంచలయినది. ఆకాశము మేఘావృతమై కుంభవృష్ఠి ఆరంభమయనది. సహస్ర శిరశుడు శేషుడు తన పడగలను విప్పి ఆ శిశువునకు చత్రము వలె ఆచ్ఛాదనము ఒనర్చి జలధారల నుండి రక్షించుచూ వెనుకనే పయనమయ్యెను.

ఆ సమయమున యమున ఉత్తుంగ తరంగములతో ఉవ్వెత్తున లేచుచూ భయంకరమయిన వేగముతో వరదలా ప్రవహించసాగెను. కానీ నదులలో శ్రేష్ఠమయిన కళిందనందిని వసుదేవునికి మార్గము నిచ్చెను. నంద వ్రజమంతయు నిశీధ సమయమున గాఢ సుషుప్తి యందు నిద్రించుచుండిరి. వసుదేవుడు ఆ దివ్య శిశువును యశోద వద్ద వదిలి ఆ శయ్య యందు నిదురించుచున్న యోగమాయను చూచి శిరశున ధరించి యధా ప్రకారము యమునను దాటి తన కారాగృహము చేరెను.

యశోదా దేవికి ప్రసవ వేదనచే జనించిన అలసట చే ఆనంద సుషిప్తి యందు లీనమై తనకు కలిగిన బిడ్డ పుత్రుడా లేక పుత్రికమా అను జ్ఞప్తి లేక గాఢముగ నిద్రించుచుండెను. ఇంతలో కారాగృహమున బిడ్డ బిగ్గరగా రోదించసాగెను. అదివిని కాపలాదారులు పరుగున పోయి ఈ విషయమును కంసునికి నివేదించిరి. ఆ విషయమును

ఆలకించిన వెంఠనే కంసుడు మిక్కిలి భయాందోళనకు లోనై త్వరితముగ సూతికా గృహమునకు వచ్చెను. ఆ సమయమున ఆతని సోదరి సాధ్వి దేవకిదేవి దీనురాలై రోదించుచు. ఇట్లు పలికెను. "అన్నయ్యా! మీరు దీన దు:ఖితులు ఎడ స్నేహ వాత్సల్య దయాతత్పరులు. నేను మీ సోదరిని. ఆపై కారాగృహము నందు బందీకృతు రాలిని. నా పుత్రులందరూ చంపబడినారు. నేను సంతానము నంతటినీ కోల్పోయిన నిర్భాగ్యురాలినయిన తల్లిని. ఈ పసిపాప ఆడబిడ్డ. ఈ బిడ్డను నాకు భిక్షగా దయ చేయండి. మీ వంటి శూర వీర శిరోమణికి ఒక స్త్రీని, మరియు పసికందును చంపుట శ్లాఘనీయము కాదు. ఓ! కళ్యాణమూర్తీ! ఈ మంగళ స్వరూపిణిని నాకు దయచేసి ప్రసాదించవలసినది. ఇదియే మీకు యోగ్యమయిన కార్యము."

దేవకీ దేవి ముఖము నందు అశ్రుధారలు నిరవధికముగ ప్రవహించుచుండెను. ఆమె పుత్రికా వ్యామోహ కారణమున ఆ బిడ్డను తన పమిట కొంగు నందు దాచి మిక్కిలి వినయముతో ప్రార్ధించుచూ తీవ్రముగ శోకించుచుండెను. కానీ కంసుడు యదు కులమునకు కళంకము మరియు పరమ నీచుడు. ఎల్లప్పుడు పరమ నీచ సంగముచే ఆతని జీవితమంతము పాపభూయిష్ఠము కావచ్చెను. దుర్మార్గుడు తన సోదరిని క్రూరముగ పట్టి, గద్దించి పమిట చాటున యున్న శిశువును రెండు పాదముల పట్టి, విసురుగ లాగి, త్రిప్పి, త్రిప్పి అచటనున్న శిలపై బలపూర్వకముగా విసిరెను.

అకస్మాత్తుగా ఒక ఆశ్చర్యకరమయిన సంఘటన జరిగెను. కంసుని చేతి నుండి విడివడిన వెంఠనే అత్యంత ఆశ్యర్యజనికముగ ఆ శిశువు ఆకాశమునకు ఎగిరెను. ఆమె ఒక దివ్యరూప ధారిణి అయిన స్త్రీగా రూపుచెంది వేయి గుర్రములు పూన్చిక "శత పత్రము" అను దివ్య రథము నందు ఆశీనురాలై యుండెను. ఆ తల్లి తన కరముల యందు వివిధములయిన ఆయుధములను ధరించి అష్ఠభుజయై ఒప్పారెను. ఆ మహాదేవి పార్షదులు తనను సేవించుచుండగా వంద సూర్యుల కాంతితో ప్రకాశించుచూ మేఘ గర్జనము పోలు స్వరముతో ఇట్లనియె "కంసా! నిన్ను పరిమార్చు పరిపూర్ణ పరమాత్మ సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుడు వేరొక చోట అవతీర్ణుడయినాడు. ఈ దీనురాలైన దేవకిని నీవు వ్యర్ధముగ పీడించుచున్నావు." యోగమాయ ఇట్లు పలికి అంతర్హితురాలై వింధ్య పర్వతమున చేరి వింధ్యావాసిని యై మరిన్ని అనేక నామములతో ప్రసిద్ధి పొందినది. యోగ మాయ యొక్క పలుకులు వినిన కుంసుడు మిక్కిలి ఆశ్చర్య చకితుడాయెను. అతడు వెంఠనే దేవకీ వసుదేవులను బంధ విముక్తులను జేసి ఇట్లనియె. "ఓ! దేవకీ వసుదేవులారా! నేను పాపిని, నా కర్మములు అన్నియు పాపభూయిష్ఠములు . నేను ఈ యదు వంశము నందు పుట్టిన పరమ దుష్టుడను, మరియు నీచుడను. నేను మీ సంతానము నంతటినీ పరిమార్చిన నీచ హంతకుడను. మీరిరువురు నా ద్వారా చేయబడిన క్రూర కర్మను క్షమించ వలసినది. నా మాటను వినవలసినది. ఇది అంతయు కాలమహిమ. వాయువు మేఘములను ఈడ్చినట్లు నేనునూ కాలవశమున ఈ అకృత్యములన్నియు ఆచరించితిని. నేను దేవ వాక్యము నందు విశ్వాసము నుంచితిని. కానీ నేడు దేవతలు సహితము అసత్య వాదులయిరి. ఈ రోజు యోగమాయ నన్ను నిర్జించు శత్రువు అవతీర్ణుడు అయెనని సెలవిచ్చినది. కానీ అతడు ఎక్కడ ఉత్పన్నమయ్యెనో తెలియదు", అని పలికి తన శిరస్సును వారిరువురి పాదములపై వుంచి రోదించసాగెను. అతని ముఖము నందు అశ్రుధారలు ప్రవాహములయ్యెను. వారిరువురి పట్ల మిక్కిలి సౌహార్ధము ప్రకటించుచూ వారిని వినమ్రుడై సేవించెను. ఆహా! పరిపూర్ణ భగవానుడయిన శ్రీకృష్ణ చంద్రుని దయా దాన దక్ష రక్షా కటాక్షములచే భూతలమందు ఏ కార్యము సిద్ధించదు?

తదనంతరము ఒకనాడు ఉదయమే లేచి కంసుడు ప్రలంబాది ప్రముఖ రాక్షస యోధులను రావించి ఇట్లు ప్రసంగించెను.

"మిత్రులారా! యోగమాయ చెప్పినట్లు నన్ను నిర్జించు శత్రువు ఈ భూమిపై ఎక్కడో జన్మించి యున్నాడు. అందుచే మీరందరూ పది రోజుల లోపున పుట్టిన పిల్లలందరినీ చంప వలసినది". అపుడు దైత్యులు ఈ విధముగా పలికిరి "మహారాజా! మీరు ద్వంద్వ యుద్ధము నకు దిగి నారి సారించి ధనుష్ఠంకారము చేసినపుడు సమస్త దేవతలు భీతిచే నలుదిశలా పరుగెత్తిరి. అటువంటిది మీరు వారిని చూచి భయపడుటఏల! గోవులు, భూసురులు, సాధుజనము, వేదము, దేవతలు, ధర్మము, మరియు యజ్ఞము, ఇవి అన్నియు విష్ణు భగవానుని శరీరముగ తలుపబడును. వీటన్నిటి

వినాశమే రాక్షసులకు బలమని ఇదివరలో సమ్మతింపబడినది. శ్రీ మహా విష్ణువు మీ శత్రువుగా జన్మించిన ఎడల మనము ఈ చెప్పినవన్నియు నాశనము చేసి గో, బ్రాహ్మణ హింస విశేషముగ చేసిన యెడల విష్ణువు నశించును. దీనికి ఇదియే సరి అయిన ఉపాయము. కంసుడు అందుకు సమ్మతించి ఆ ఘోర అనుచిత కార్యమునకు అనుజ్ఞనిచ్చెను. వెను వెంఠనే ఆ క్రూర భయంకర, దుష్ట రాక్షసులు ఆకాశమునకు ఎగిరి నలుదిశల కేగిగో, బ్రాహ్మణ హింస, మరియు నవజాత (తొమ్మిది దినముల వయసున్న) బాలురను వధింప సాగిరి. సముద్ర పర్యంతము విస్తరించిన భూ మండల మందు కామరూప ధారులయిన దైత్యులు సర్పములు, మరియు ఎలుకల రూపము ధరించి ఇంటింటికి ఏగి దుష్కార్యములు చేయసాగిరి. దైత్యుల స్వభావరీత్యా క్రూరకర్ములు, దానికి తోడు కంసుని ప్రోద్బలము లభించినది. ఒక కోతి సురాపానము చేసినది. దానికి పిచ్చి ఎత్తినది. దాని చిత్తము యొక్క చపలత్వము ఎట్లుండును? దైత్యుల స్థితి కూడా అట్లే అయినది.

నారదుడు ఇట్లు ఉపదేశించెను "విదేహకుల నందనా! మిథిలేశ్వరా! విష్ణు భక్తా! ధర్మాత్ముల యందు ప్రముఖుడా! పరమ తపస్వీ! ప్రతాప వంతుడువయిన అంగరాజా! బహుళాశ్వ జనకా! శ్రద్ధగా వినుము. ఎవరు సాధు పురుషులను, యోగులను అవహేళన చేయుదురో వారి ధర్మ, అర్థ, కామ, మోక్షములను చతుర్విధ పురుషార్ధములు పరిపూర్ణముగ నశించును.

(గర్గసంహిత యందలి గోలోకాంతర్గతమయిన నారద బహుళాశ్వ సంవాద మందలి శ్రీకృష్ణ జన్మ వృత్తాంత వర్ణనమను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(శ్రీకృష్ణుని జన్మోత్సవ వేడుకలు. గోప గోపికలు బహుమతులతో ఆగమనము. నంద, యశోదా, రోహిణిల ద్వారా అందరు సత్కరింపబడుట. బ్రహ్మాది దేవతలు శ్రీకృష్ణ దర్శనమునకు ఏతెంచుట.)

నారదుడు తిరిగి ప్రారంభించెను "రాజా! తదనంతరము గోకులము నందు ప్రముఖుడయిన నందుడు తన పుత్ర జననము విషయము విని ఉదయముననే బ్రాహ్మణోత్తములను పిలచి వాచక పూర్వక పుణ్యా: వాచనము చేయించెను. విధి పూర్వకముగ జాతక కర్మాదులు చేయించి మహా మనస్వి అయిన నందుడు ఆ బ్రాహ్మణోత్తములను పూజించి, భూరి దక్షిణలతో సంతోషపరిచి తదుపరి ఒక లక్ష గోవులను దానముగ సమర్పించెను. ఒక క్రోసు దూరము (వెడల్పు) గల భూమి యందు ఏడు ధాన్య పర్వతములను నెలకొల్పి, వాటిపై రత్న సువర్ణ రాశులు పోసి, వాటితో పాటు స్నిగ్ధ పదార్థములను యుంచి, వాటినన్నిటినీ అతి వినీత భావముతో బ్రాహ్మణోత్తములకు దానముగ సమర్పించెను. మృదంగము, వీణ, శంఖము మరియు దుంధుభి వాయిద్యముల స్వనములతో మిన్నుమట్టుచుండెను. నందుని ఇంటి ద్వారము నందు గాయకులు మంగళ గీతములు పాడుచుండిరి. వారాంగనలు నృత్యము చేయుచుండిరి. రెపరెప లాడుచున్న పతాకములతో, స్వర్ణకలశములతో, మిరిమిట్లు గొలుపు చాండ్‌లరీలతో, సుందర పుష్పములతో కూడిన తోరణములతో, రంగు రంగుల చిత్రములతో నందమందిర మంతయు ఉద్భాసిత మగుచున్నది.

రాజమార్గములు, వీధులు, రచ్చబండలు, సుగంధ భరిత జలములతో కళ్ళాపు చల్లబడెను. ప్రతి ఇంటి యందు ద్వారములు, తలుపులు, గడపలు, గోడలు, ఇంటి యందలి మండువాలు శుభ్రము చేయబడి, రంగు రంగుల వస్త్రములు కట్టబడియుండి ప్రతి గృహము చిత్రశాలయా అన్నంత అద్భుత సౌందర్యము తో విరాజిల్లు చున్నది. గోవుల శృంగములకు బంగారుతొడుగులు, వీపున ఎర్రని తివాచీలు పరుచబడి గోవులన్నియునూ అద్భుతముగ అలంకరింపబడినది. ఆ గోవుల వెంట లేగదూడలు కూడ కలవు. వాటి అంగములు యందు తరుణ స్త్రీల కుంకుమ, గోరింటల హస్తముద్రలు ప్రస్ఫుటముగ కానవచ్చు చున్నవి.

నెమలిపింఛములు మరియు పుష్పములతో అలంకరింపబడి సుగంధ జలములచే అభిషిక్తము చేయబడిన ధర్మ దురంధర మనోహర వృషభ రాజములు నందుని ద్వారము బయట నెమ్మదిగ అటు, ఇటు తిరుగుచున్నవి. ఆవు దూడల తెల్లని శరీరము సువర్ణ హారములు మరియు ముత్యములు మాలలతో కప్పబడి, పాదములకు మంజీరములు పెట్టబడి అవి అటునిటు దూకుచుండగా ఆ దృశ్యము అత్యంత మనోహరముగ యెప్పెను.

నందరాజగృహమున పుత్రోత్సవ సమాచారము విన్న వృషభానువరుడు తన సతీదేవి కళావతి తో కలసి ఒక ఎత్తైన ఏనుగునెక్కి నంద మందిరమునకు విచ్చేసెను. వ్రజభూమి యందు తొమ్మిది మంది నందులు, తొమ్మిది మంది ఉపనందులు, ఆరుగురు వృషభానులు కలరు. వారందరునూ నానా ప్రకారములయిన (విధములయిన) బహుమతులతో నంద గృహమునకు ఏతెంచిరి. నెమలి పింఛము, కంఠమున వనమాల, శరీరమున పచ్చని వస్త్రములు ధరించి, హస్తములు యందు మురళీ మరియు బెత్తములు పట్టుకొని, ముఖమున సుందర తిలకము దిద్దుకొని, గోపాలకులు కూడా తను ప్రభువు వద్దకు వెడలిరి. వారందరూ గీత, గాన వాద్యములచే సంతోషాబ్ధి యందు మునగు చుండిరి. నూనూగు మీసముల యుక్త వయస్కుల నుండి, చిన్న బాలకుల వరకూ బహుమతులతో నందగృహము ప్రవేశించిరి. ముదుసలులు సహితము ఒక చేతిలో కర్ర సహాయముతో నడుచుచూ, తమ వెంట పాలు, పెరుగు, వెన్న, మొదలగు బహుమతులతో నంద గృహమున ఉపస్థితులయిరి. వారందరూ తమ నందరాజుకు పుత్రుడు కలిగెనన్న ఆనందము తో ప్రేమ విహ్వాలులై కనుల వెంట ఆనంద బాష్పములు రాల్చిరి. పుత్రోత్సవ సందర్భముగా నందుని ఆనందమునకు అవధులే లేవు. ఆయన ఆనందపు చరమ సీమలకేగి తన నేత్రముల నుండి ఆనంద భాష్పములు రాల్చుచుండెను. ఆయన తన ఇంటికి విచ్చేసిన సమస్త గోప గోపీ జనములను తిలకము మరియు సుగంధ ద్రవ్యములతో యధోచిత సత్కారము చేసెను.

గోపాలురు ఈ విధముగ నుడినిరి "ఓ! వ్రజేశ్వరా! నంద రాజా! మీ యొక్క ఈ పుత్రోత్సవము సంతాన హీనత అను కళంకము ను పూర్తిగా తుడిచిపెట్టును. ఇంత కంటె పరమ మంగళము మేము ఏమని చెప్పుదము? భగవంతుడు చాలా కాలము తరువాత మిమ్మిట్లు ఈ విధముగ అనుగ్రహించెను. మేము ఈనాడు శ్రీ నంద నందనుని గాంచి కృతార్థుల మయ్యెదము.

మీరు ఆ బాలుని ఒడి లోనికి తీసుకొని ప్రేమమీర మిఠాయిలు తినిపించి "మోహన్" అని పిలుచునపుడు మాకు అత్యంత ఆనందము కలుగును. నందుడు ఈ విధముగ బదులిచ్చెను "బంధువులారా! ఈ రోజు ఈ శుభ ఘడియలకు కారణము మీ ఆశీర్వాదము మరియు మీ పుణ్యబలము. నేను కేవలము వ్రజవాసులయిన గోపగోపీ జనములకు దాసుడను."

నారదుడు తిరిగి చెప్పసాగెను "మహారాజా! నందరాజునకు పుత్రుడు కలిగెనన్న వార్త విన్న గోప స్త్రీల ఆనందమునకు అవధులు లేవు. వారి తనువు, మనస్సు, హృదయము, పరమానందభరిత మయినది. వారు తక్షణమే తమ గృహ కార్యములన్నియు విడచి బహుమతులు చేతులయందుంచుకొని తొందరగా నందుని గృహమున కేతెంచిరి. తమ గృహముల నుండి నందగృహమునకు వచ్చి పోవుచున్న గోపాంగనల ముత్యాల హారములు తెగి నేలపై పడి విడి ముత్యములు ఎగురసాగెను. అత్యంత త్వరిగ గతిన వచ్చుచుండుట చే వారి వస్త్రములు, హారములు, కేశ బంధనము చిందర వందర మగు చుండెను. ఆ దశయందు వారి శోభ మరింత రమణీయముగ యుండెను.

ఘల్లు ఘల్లు మను నూపురములు, తళ తళ లాడు క్రొత్త కేయూరములు, రెపరెపలాడు దుకూలములు, మంజీరములు, హారములు, మణిమయ కుండలములు, బంగారు కంకణములు, కంఠ సూత్రములు, గలగల లాడుచున్న గాజులు, శిరోభూషణములతో, క్రొత్త క్రొత్త కొంగరు మెరుపుతో శింగారించుకున్న ఆ గోప స్త్రీలు చూచెడివారలకు కనువిందు చేయుచూ మనోహరముగ ప్రకాశించు చుండిరి. వారందరునూ గోరింట, పునుగు, జవ్వాది మెదలగు సుగంధ ద్రవ్యములు,మరియు పుసుపు కుంకుమ మొదలగు పవిత్ర ద్రవ్యములు తీసికొని ముఖము నందు ఆనందము వెల్లివిరియుచుండగా ఇనుమడించిన ప్రేమతో ఆశీర్వాదము లొసగిరి.

గోపస్త్రీలు యశోదతో ఈ విధముగ పలికిరి " యశోదా! ఏమి భాగ్యము? నేడెంత సుదినము! ఈ రోజు పరమ సౌభాగ్యము కలిగించు శుభ దినము. ఇటువంటి బాలకునకు జన్మనిచ్చిన మీరు ధన్యులు. మీ కులము ధన్యము. దీర్ఘకాలము పిదప భగవంతుడు మీ కోరికను సఫలీకృత మెనర్చెను. అహో! ఈ బాలుడు కమల నేత్రుడు. ఈతడి

చిరునవ్వు అత్యంత మనోహరము. అత్యంత ఆదరముతో ఈ బాలుని ఆలన పాలన చేయవలెను.

ఆ గోపాంగనలతో యశోద ఈ విధముగ పలికెను. “ఓ! సోదరీమణులారా! మీ యొక్క దయ, ఆశీర్వాదము చే నేడు ఈ గృహము పావనమై, ఆనందోత్సవమునకు కారణయామెను. నా యందు మీ కెల్లప్పుడునూ దయ, కరుణ కలదు. ఇటు తరువాత మీ ఇండ్ల యందు కూడా ఇటువంటి పరమ సుఖ శుభములు ప్రాప్తించవలెనని నా మనసు యందలి శుభేశ్ఛ. సోదరీ! రోహిణీ! నీవు గొప్ప బుద్ధిమంతురాలివి. ఏ కార్యము నైననూ బహు దక్షతతో చేయగలుగు సమర్ధురాలివి. మన ఇంటికి విచ్చేసిన ఈ వ్రజ వాసినిలందరూ ఉత్తమ కులాంగనలు. నీవు వీరిని పూజించి స్వాగత సత్కారములను జరుప వలసినది. నీ ఇఛ్ఛాను సారము వీరి మనోరధములను పూర్ణము చేయవలసినది.

నారదుడు తిరిగి చెప్పసాగెను. “రోహిణీదేవి జన్మత: రాజకుమారి. ఆమె స్వభావరీత్యా మిక్కుట దానశీల. అటువంటి రోహిణీదేవిని యశోద దానము చేయుటకు ప్రోత్సహించెను. రోహిణీదేవి తెల్లని వన్నెతో ప్రకాశించు దేహ ఛ్ఛాయ కలదియై, రత్నమయ భూషణములు దివ్య వస్త్రములు ధరించి శోభాయమానముగ యుండును. అటువంటి తల్లి సాక్షాత్ లక్ష్మీదేవి వలె ప్రకాశించుచూ వ్రజ వాసినులకు స్వాగత సత్కారములు చేయుచూ నలుదిశలా తానై ఎల్లరకును సంభ్రమాశ్చర్యములు కలుగజేసెను.

పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీ కృష్ణుని జననానంతరము వ్రజభూమి యందు భేరీ, మృదంగ నాదములు నలుదిశలా మిన్ను ముట్టినవి. ఆ సమయము నందు గోపికలు పాలు, పెరుగు, నెయ్యి, మరియు గోపాంగనలు తాజాగా చిలికిన వెన్న కుండల కొలది ఒకరికొకరు హర్షోల్లాసము తో ఇచ్చిపుచ్చుకొని ఉఛ్ఛైశ్వరముతో గీతములు పాడుచుండిరి. అందు యువతీ యువకులు, మరియు ముదుసలులు కూడా క్రిందపడుచూ, లేచుచూ చప్పట్లు చరుచుచూ హర్షాతిరేకము చే సంతోషానంద తరంగులయిరి. ఓ! మహారాజా! నంద భవనము నందు పౌరాణికులు, వంశములను పొగడు మాగధులు, నిర్మల మానస్కులయిన బుద్ధిమంతులు, అవసరమునకు తగు మాట, నేర్పరులగు వందులు, ప్రస్థుత మయిరి. నందుడు వారందరినీ ఒక్కొక్కరిగ వస్త్రములు, భూషణములు, రత్నములు, హయములు, ఏనుగులు మరియు ఒక వేయి ఆవులతో తగిన ప్రకారముగ గౌరవించెను. వంది, మాగధులకు విశేష ధనము సమర్పించెను. ధనరాశుల వర్షము కురిపించెను. వ్రజభూమి వీధి వీధులయందు ఇంటింటి యందు నిధి, సిద్ధి, వృద్ధి, భక్తి మరియు ముక్తి తాండవించెను. కానీ వారెవరికీ వీటిపై దృష్టియే లేదు.

ఆ సమయమున కపిలుడు, శుకుడు, సనత్కుమారుడు, వ్యాసుడు, నారదుడు, హంసుడు, దత్తాత్రేయుడు, పులస్త్యుడు, మొదలయిన ఋషులు, ప్రజాపతులను వెంటబెట్టుకొని బ్రహ్మదేవుడు అచటికి ఏతించెను. బ్రహ్మదేవుడు పుటము పెట్టిన బంగారు వన్నె తో దీపించు చుండెను. ఆయన శిరసు యందు కిరీటము, కర్ణముల యందు కుండలములు మెరయుచుండెను. వేదకర్త అయిన చతుర్ముఖ బ్రహ్మదేవుడు హంసారూఢుడై సర్వ దిక్ మండలమంతయు దేదీప్యమాన మొనర్చుచూ అచటికి ఏతెంచెను. ఆయన వెనుక భూత పరివేష్ఠితుడు, వృషభ వాహనుడు అయిన పరమేశ్వరుడు ఏతెంచెను. రధారూఢుడయిన సూర్య భగవానుడు, ఐరావతము నందు శతమఖుడు ఇంద్రుడు, ఖంజరీటమును ఎక్కి వాయుదేవుడు, మహిష వాహనుడయిన యమధర్మరాజు, పుష్పక విమానము పై కుబేరుడు మృగ వాహనుడయిన చంద్రుడు, మేషము నెక్కి అగ్ని దేవుడు, మకర వాహనముపై వరుణుడు, మయూఖ వాహనముపై కార్తికేయుడు, హంస వాహిని అయిన సరస్వతీ మాత, గరుడ వాహనము పై లక్ష్మీదేవి, సింహవాహనము పై దుర్గాదేవి, గోరూప ధారిణి అయిన పృధివీ మాత; ఇట్లు దేవతలందరూ తమ తమ వాహనములు అధిరోహించి అచటకు ఏతెంచిరి.

పదహారు మాతృకలు దివ్యకాంతులు వెదజల్లుచూ పల్లకీల యందు వేంచేసిరి. ఖడ్గము, చక్రము, దండాయుధము ధరించి షష్ఠీదేవి శిబిక యందు ఆశీనురాలై ఏతెంచెను. మంగళ దేవత వానరమును, బుధుడు భాసమను పక్షిని, నల్లని మృగము నధిరోహించి బృహస్పతి; గవయవములను (ఫ్లేమింగ్ హార్సెస్) అధిరోహించి శుక్రాచార్యుడు, కాకిని అధిరోహించి శనైశ్చర్యుడు, ఒంటె పై సింహికా కుమారుడయిన రాహువు; ఇట్లు కోట్ల బాలసూర్యుల కాంతితో ప్రకాశించుచున్న గ్రహాధిపతులు నందమందిరము నకు వేంచేసిరి. అంతకు మునుపే ఆ మందిరమంతయు గోప గోపీ జనముతో నిండి అత్యంత కోలాహలముగ యుండెను.

ఆ దేవతా ప్రముఖులందరూ బాలరూపధారి అయిన పరిపూర్ణ పరమాత్మ శ్రీకృష్ణుని దర్శించి శిరసు వంచి, ప్రణామములు ఆచరించి వివిధ స్తోత్రములతో స్తుతించిరి. బ్రహ్మాది దేవతలు శ్రీకృష్ణ దర్శనము చే ప్రేమ విహ్వలులై, హర్షపులంకాకితులై తమ తమ యథా స్థానములకు చనిరి.

(గర్గసంహిత యందు గోలోక ఖండము నందు నారద బహులాశ్వ సంవాదము నందలి శ్రీ కృష్ణ దర్శనార్థము బ్రహ్మాది దేవతల ఆగమనమను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(పూతనోద్ధరణ)

నారదుడు తిరిగి చెప్పదొడంగెను "మహారాజా! ఒకానొక సమయమున నందుడు కంసునకు కప్పము కట్టుటకు, వసుదేవుని కుశల సమాచార మరశి, తన ఇంట జరిగిన పుత్రోత్సవ వేడుకలు వారితో పంచుకొనుటకు మధురానగరమునకు ఏగెను. ఆ సమయము నందు కంసుని పనుపున వెడలిన భయంకర రాక్షసి, బాలఘాతకి పూతన గ్రామములు, నగరములు తిరుగుచూ గోపీ గోప జనముచే సమ్మర్ధమయిన గోకులము నందు ప్రవేశించెను. ఆమె తన కామరూపముతో పదహారు సంవత్సరములు వయసు కలిగిన నవ యవ్వనాంగి గా మారిపోయెను. ఆ సమయమున ఆమె శరీరము దివ్య కాంతులు వెదజల్లు చున్నది. ఆమె సౌందర్యాతిరేకము శచీదేవి, సరస్వతీ దేవి, లక్ష్మీదేవి, రంభ, మరియు రతీదేవి మొదలగు దివ్యస్త్రీలను తిరస్కరించునట్లు యుండెను. ఆమె నడచుచున్నప్పుడు ఎత్తైన వక్షోజములు మనోహరముగ ఊగుచు చూచువారలకు దిగ్భ్రాంతిని కలుగజేయు చుండెను. ఆమె లావణ్యమును కాంచిన రోహిణీ, యశోదలు సహితము ఒక్క క్షణము నిశ్చేష్ఠులయిరి. ఆ మహా ఘోర రాక్షసి, వచ్చిన వెంటనే బాలగోపాలుని తన ఒడి లోనికి తీసికొని మిక్కిలి గారాబముగ లాలించుచూ తన విషలిప్త స్థనమును ఆయన నోటిలోనికి జొనిపెను. ఇది గమనించిన శ్రీహరి రోషతామ్రాక్షుడై, పాలతో పాటు ఆ రక్కసి ప్రాణములను కూడ హరింపసాగెను. ఆ దానవి తన స్థనముల యందు కలుగుచున్న బాధను బరింపజాలక "వదులు", "వదులు" మని ఆ బాలుని తీసికొని బయటకు పరుగెత్తెను. ఆమె బయటకు వెలువడిన వెంటనే తన కామరూపమును కోల్పోయి యధారూపమును పొందెను. ఆమె నేత్రద్వయము బయటకు వెలువడినవి. శరీరము పాలిపోయినది. ఆమె అరుచుచూ, రోదించుచూ, నేలపై బడెను. ఆమె యొక్క రోదన సహిత భయంకర రావము చే ఊర్ధ్వ, అధో లోకములన్నియు వణకినవి. సప్తద్వీప అయిన వసుంధర సహితము కంపించినది. నృపేశ్వరా! ఇది యొక అద్భుత ఘటన. పూతన యొక్క విశాల కాయము ఆరు క్రోసుల పొడవు యుండి వజ్రసమానమై యొప్పెను.

ఆమె కుప్పకూలిపోవుటచే ఆ శరీరము క్రింద పడి పెద్ద పెద్ద వృక్షములు సహితము చూర్ణమయినవి. ఆ సమయమున ఆ భయంకర విశాల కాయమును కాంచిన గోప గోపీజనము పరస్పరము ఇట్లు సంభాషించు చుండిరి "ఈమె ఒడిలో యున్న చిన్నారి బాలుడు జీవించుట కల్ల". కాని ఆ అద్భుత బాలకుడు ఆమె గుండెలపై పరుండి ఆనందముతో ఆడుచూ చిరునవ్వులు చిందించుచుండెను. ఆతడు పూతన యొక్క గరళస్థన్యమును స్వీకరించినప్పటికీ జీవించియుండెను. ఆ సమయమున రోహిణీ, యశోదా సహితులయిన గోప స్త్రీలు అచటికి ఏతెంచి ఆ బాలుని ఎత్తుకొని, ముద్దాడి, తమ హృదయములకు హత్తుకొని విస్మయులయిరి. ఆ బాలునికి విధ పూర్వకముగ అనేక రక్షలు కట్టిరి. ఆ బాలుని శరీరమునకు పవిత్ర యమునా మృత్తికను రాసి, ఆవు తోకను ఆయన చుట్టూ త్రిప్పి, గోమూత్రము మరియు గోరజము కలిపిన మిశ్రమము చే ఆయనకు స్నాన మొనరించి రక్షాకవచమును ఈ విధముగ పఠించిరి.

"మా ప్రియమయిన బాలుడా! శ్రీ కృష్ణుడు నీ శిరస్సును రక్షించుగాక. వైకుంఠుడు నీ కంఠమును, శ్వేతద్వీప

నారాయణుడు నీ చెవులను, యజ్ఞరూప ధారి అయిన శ్రీహరి నీ నాసికను, నృశింహభగవానుడు నీ నేత్రద్వయమును, దశరథ నందనుడయిన శ్రీరామ చంద్రుడు నీ జిహ్వనూ, నరనారాయణ ఋషులు నీ అధరములను రక్షించుగాక! సాక్షాత్ శ్రీహరి యొక్క కళావతారులు అయిన సనక, సనందనాదులు నీ కపోలమును భగవానుడు శ్వేత వరాహమూర్తి నీ శిరోజములను, నారద మహర్షి నీ కనుబొమలను, కపిలుడు నీ బాహు మూలములను, దత్తాత్రేయుడు నీ వక్ష స్థలమును, సంరక్షణము చేయుగాక. భగవానుడయిన ఋషభుడు నీ భుజద్వయమును మత్స్య భగవానుడు నీ చేతులను, పృధు మహారాజు నీ బాహు దండములను, కూర్మ భగవానుడు నీ ఉదరమును, ధన్వంతరి నీ నాభినీ, మోహినీ రూపధారి అయిన విష్ణువు నీ గుహ్యమును, వామనమూర్తి నీ కటి ప్రదేశమును, పరశురాముడు నీ పృష్ఠ భాగమును, మహానుభావుడయిన బాదరాయణ వ్యాసుడు నీ జంఘలను, బలభద్రుడు నీ మోకాళ్ళను, పిక్కలతో సహితముగ నీ పాదములను భగవానుడయిన కల్కి, సుకుశలముగ కాపాడు గాక!" ఇది సర్వులనూ రక్షించు పరమ దివ్యమయిన "శ్రీ కృష్ణ కవచము". దీనిని విష్ణు భగవానుడు తన నాభి నుండి పుట్టిన బ్రహ్మదేవుని కొసంగెను. బ్రహ్మ శంభునకు, శంభుడు దుర్వాసోమునికి, దుర్వాస ముని నుండి నంద మందిరమున శ్రీ యశోదకు ఈయబడెను.

ఈ కవచము తో యశోదామాత, నందనందనునకు దిష్ఠితీసి, రక్షకట్టి, తన స్థన్యమును పట్టి, బ్రాహ్మణులను విపుల ధనము తో సంభారించెను. ఆ సమయము నందు నందాది యాదవ ప్రముఖులు అందరూ గోకులమునకు తిరిగివచ్చి, పూతన యొక్క భయంకర శరీరమును కాంచి భయ, వ్యాకుల చిత్తులయిరి. గోపకులు కత్తులతో, గొడ్డళ్ళతో పూతన శరీరమును ముక్కలు ముక్కలుగా చేసి యమునా నదీ తీరము నందు ఆ దానవికి దహన సంస్కారములు గావించిరి. పూతనా శరీరము పరమ పవిత్రముగ మారినది. ఆమె చితినుండి వెలువడిన ధూమము ఆశ్చర్యముగ లవంగములు, ఏలకలు, అగరు, చందనముల దివ్య పరిమళము వెదజల్లినది. అహో! పూతనకు సహితము మొక్షమొసంగిన పతిత పావన పరమాత్మ శ్రీ కృష్ణ దేవుని వదలి వేరొకరిని శరణు జొచ్చుట ఎందులకు?

బహుళాశ్వుడు ఈ విధముగ ప్రశ్నించెను "ఓ! దేవర్షీ! ఈ బాలఘాతకి, పూతన రాక్షసి పూర్వజన్మము నందు ఎవరు? ఈమె స్థనముల యందు విషపూరిత క్షీరము, మరియు మదినంతయూ దుష్ఠ భావనలు నిబిడీకృతమై యున్నవి. అయిననూ ఈమెకు మోక్షము ఎట్లు సాధ్యమయినది"?

నారదుడు తిరిగి చెప్పదొడంగెను "పూర్వ కాలమందు బలి చక్రవర్తి యజ్ఞభంగము కావించిన వామనమూర్తి యొక్క రూపము చూచి బలితనయ అయిన రత్నమాలకు వామనుని యందు పుత్రవాత్సల్యము కలిగెను. ఆమె మనసునందు ఈ విధముగ చింతించెను" నాకునూ ఇట్టి పవిత్ర, దివ్య, సుందర, మందహాసము చేయు పుత్రుడు కలిగెనేని, అతనికి స్థన్యము నొసగునపుడు నా చిత్తము ప్రశాంత మగును". బలి చక్రవర్తి పరమ భక్తాగ్రేసురుడు. అంత బలి తనయ రత్నమాలకు వామన భగవానుడు ఈ విధముగ వరమొసగెను. "నీ మనోరథము పూర్ణమగును". ఆ రత్నమాలయే ద్వాపరాంతమున "పూతన" నామధారిణి అయిన రాక్షసిగా పేరు పొందినది. శ్రీకృష్ణ భగవానుని స్పర్శచే ఆమె ఉత్తమ మనోరథము సఫల మయ్యెను.

ఓ మిథిలేశ్వరా! ఏ మానవుడు శ్రీ కృష్ణ భగవానుని పూతనోద్ధరణమను ఆఖ్యానమును వినునో ఆ మానవునకు భగవానుని యెడ మిక్కిలి భక్తి తత్పరత ఏర్పడును.

ఆ జీవికి ధర్మార్థ కామములను మూడు పురుషార్థములు కూడా ఉపలబ్దమగును.

(గర్గసంహిత యందు గోలోక ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి పూతనా మోక్షము అనెడు పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

**(శకట భంజనము, ఉత్కచ, తృణావర్త ఉద్ధారము.
ఇరువురి పూర్వజన్మ వర్ణన)**

గర్గాచార్య ఉవాచ "శౌనకా! ఈ ప్రకారముగ నేను శ్రీకృష్ణ భగవానుని సర్వోత్కృష్ట దివ్య చరిత్ర వర్ణనము చేసితిని. భక్తి పూర్వకముగ ఏ మనుష్యులు దీనిని శ్రవణము చేయుదురో వారు ధన్యులు, కృతార్థులు. వారికి పరమ పురుషార్థ ప్రాప్తి అగును. ఇందు ఇనుమంతయు సందేహము లేదు." శౌనక ఉవాచ "మహామునీ! ఇది శ్రీకృష్ణ భగవానుని మంగళమయ చరితామృతము చే తయారయిన మధుర పదార్థము. సాక్షాత్ మీ ముఖారవిందము నుండి వినుటచే మేము కృతార్థులమయితిమి. ఓ! తపోధనా! సాధు పురుషుల యందు శ్రేష్ఠుడయిన బహుళాశ్వ మహారాజు శ్రీకృష్ణ భగవానుని పరమ భక్తుడు. ఆయన ఎల్లప్పుడూ శాంత చిత్తుడు. అటు పిదప ఆయన నారద మునీంద్రునితో ఏ విధముగ సంభాషించెను! దయచేసి మాకు తెలియపరుచ వలసినది."

శౌనకా! మిథిలేశ్వరుడయిన బహుళాశ్వ మహారాజు ప్రేమ విహ్వలుడై, హర్షోల్లాసిత ఆనంద తరంగ మనస్కుడై, శ్రీకృష్ణ భగవానుని చింతన చేయుచూ నారద మునీంద్రుని ఇట్లు ప్రశ్నించెను. "ఓ! మునీంద్రా! మీరు ఎన్నో గొప్ప పుణ్య కార్యములు ఆచరించిరి. మీ సందర్శనము చే నేను ధన్యుడను, కృతార్థుడనైతిని. ఎందుకనగా భగవద్భక్తులు తోడి సాంగత్యము బహు దుర్లభము మరియు దుస్సాధ్యము. మునీంద్రా! అద్భుత భక్త వత్సలుడయిన శ్రీకృష్ణ భగవానుడు తదుపరి బాల్యావస్థలయందు ఏఏ విచిత్ర లీలలు సలిపెను? నాకు దయచేసి వివరింప వలసినది. నారదుడు తిరిగి ప్రసంగించెను "మహారాజా! నీవు కృష్ణ ధర్మ పాలకుడవు. నీవడిగిన ప్రశ్న బహు ఉత్తమమైనది. సజ్జనుల తోడి సంగము నిశ్చయముగా కళ్యాణకారకము. ఒకానొక దినము శ్రీకృష్ణ భగవానుని జన్మ నక్షత్ర తిథి వచ్చినది. నందరాణి అయిన యశోద బ్రాహ్మణులచే వేద ప్రోక్తముగ చెప్పబడిన విధి విధానములు ద్వారా గోపికలందరినీ పిలచి పేరంటము చేసినది.

అద్భుత లావణ్యమూర్తి, నీలిమేఘా శరీరఛాయ కలిగి బాలుడయిన శ్రీకృష్ణుని ఎర్రని వస్త్రములు ధరింపజేసి, అంగములందు సువర్ణ ఖచిత భూషణములను అలంకరింపజేసెను. ఆయనను ఒడిలోనికి తీసికొని, ఆయన వికసించిన కమల నేత్రములకు కాటుక పూచి, మెడయందు చంద్ర హారములు ధరింపచేసి, సమస్త దేవతలకు నమస్కృతులు సమర్పించి, భూసురులకు భూరి దానములను ఇచ్చెను. అటు పిమ్మట గోపకిశోరుని ఉయ్యాల యందు పరుండబెట్టి, వచ్చిన గోపికలను స్వాగతించుచూ, గృహ కృత్యముల యందు నిమగ్నమయినది. ఆ రోజు అధిక సంఖ్యలో గోప గోపీ జనము ఆ ఇంటికి విచ్చేయుట చే గృహమంతయు మిక్కిలి కోలాహలముగ యుండెను. బాలుని రోదనము ఎవరికినీ వినపడదయ్యె! ఆ సమయమున పాపాత్ముడయిన కంసుని చే పంపబడిన "ఉత్కచుడు" (శకటాసురుడు) అను రాక్షసుడు అచటికి ఏతెంచెను.

ఆ దానవుడు వాయుమయ శరీరుడు. అతడు అచట పాలు, పెరుగు, నెయ్యి, పెట్టుబడిన మిక్కిలి బరువయిన బండి యందు ఆవహించెను. అతడు మిక్కిలి బరువయిన ఆ బండిని ఆ బాలుని మస్తకము పైకి విసరవలెనన్న ప్రయోజనము కొరకు చింతించుచుండెను. ఇంతలో శ్రీకృష్ణుడు రోదించుచూ, రోదించుచూ తన చిన్నారి పాదముతో ఆ బండిని తన్నెను. బండి మొత్తము చూర్ణమై దానవుడు మరణించి క్రింద పడెను. ఆ సమయమున అతను వాయు శరీరమును వదలి, దివ్యదేహము ధరించి శ్రీకృష్ణ ప్రభువునకు వందనము లాచరించి వందగుర్రములు పూన్చిన దివ్య రథము నందు కూర్చొని పరమాత్ముని నిజధామమయిన గోలోకమునకు ఏగెను. ఇంతలో యశోదా, నందులు, గోప గోపీజనము ఆ శబ్దమునకు నివ్వెరపడి, అచటకు ఏతెంచి అచట ఆడుకొను చున్న గోప బాలకులను ఇట్లు ప్రశ్నించిరి "వ్రజకుమారులారా! ఈ శకటము తనంతట తాను పడినదా! లేక ఎవరేని పడవైచిరా? "మీకు తెలిసెనేని చెప్పవలసినది". బాలకులు "ఉయ్యాల నందు పరుండబెట్టిన ఈ బాలుడు పాలు త్రాగుటకై ఏడ్చుచూ, తన కాలితో ఈ శకటమును తన్నెను.

అందుచే ఈ శకటము పడినది". గోపి గోపీ జనము ఈ విషయము నమ్మలేదు. మూడు నెలల బాలుడెక్కడ! బండి ఎక్కడ? ఎట్లు బాలకుడు బండిని తన్నగలడు? అని తర్కించిరి. యశోద బాలుని ఏదేని దుష్ట గ్రహము బాధించుచున్నదేమో యని శంక కలిగినది. ఆమె వెంటనే బాలుని ఒడి లోనికి తీసికొని ఉత్తమ బ్రాహ్మణుల ద్వారా గ్రహ శాంతులకై యజ్ఞయులు చేయించి భూసురులకు భూరి దక్షిణలు దానమిచ్చి తృప్తి పరచెను.

బహుళాశ్వుడు ప్రశ్నించెను "ఓ! మహామునీ! ఈ "ఉత్కచుడు" ఎవరు? శ్రీకృష్ణ భగవానుని పాదస్పర్శచే మోక్షగామి అయిన ఈ ఉత్కచుడు పూర్వ జన్మము నందు చేసిన పుణ్యమేమి? దేనిచే ఈతనికి అంత ఉత్కృష్ట పథము లభించినది? నారదుడు తిరిగి ప్రసంగించెను "ఈ ఉత్కచుడు పూర్వ జన్మమందు హిరణ్యాక్షుని పుత్రుడు. అతడు ఒక పర్యాయము "లోమశ" మహర్షి ఆశ్రమమునకు ఏగి అచటి వృక్షములను చూర్ణము చేసెను. మిక్కిలి పెద్దదయిన దేహముతో ఈ దుష్కార్యము ఆచరించుచున్న ఉత్కచుని చూచి ఋషి రోష తామ్రాక్షుడై ఇట్లు శపించెను. "ఓరీ! దుర్మతీ! నీవు దేహ రహితుడవు కమ్ము". ఆ కర్మ పరిపాకమున ఆతని శరీరము పాము కుబుసమును విడుచునట్లు స్థూల శరీరమును విడచి వాయుదేహుడయ్యెను. అంత ఆ దానవుడు లోమశ మహర్షి పాదములపై వ్రాలి ఇట్లనియె "ఓ! మునిసత్తమా! మీరు కృపాసముద్రులు. మీ ప్రభావము నెరుగక మీకు అపచారము చేసితిని. నాపై అనుగ్రహము చూపి నాకు దేహమును ప్రసాదించవలసినది." అంత నవనీత మనస్కుడయిన లోమశుడు జాలిపడి ప్రసన్న మనస్కుడాయెను. ఆయన విధాత యొక్క పెక్కు రీతులు గాంచెను. ఆయన జీవిత కాలమున వందమంది బ్రహ్మలు గడచిరి. అటువంటి సాధుపురుషుల శాపము కూడా వరమై ప్రకాశించును. అట్టి వరదానము మోక్షప్రదమైనచో ఇంకఏమి చెప్పగలము? లోమశ మహర్షి ఈ విధముగ పలికెను. "నీవు చాక్షుస మన్వంతరము వరకు ఇట్లే వాయు శరీరుడవై యుందువు. అటుపిదప వైవశ్వత మన్వంతరమందు ఎనభై ఎనిమిదవ ద్వాపరాంతమున శ్రీకృష్ణ భగవానుని చరణ స్పర్శ ద్వారా నీకు ముక్తి లభించును".

నారదుడు "లోమశుని తప: ఫలమున దానవునకు ఈయబడిన శాపము కూడా వరముగ ప్రాప్తించి దానవుడయిన ఉత్కచుడు అత్యుత్తమమయిన ముక్తినొందుటకు అధికారము పొందెను. వర, శాపములు ఒసగుట యందు పూర్ణ స్వతంత్రులయిన మునివరులకు నేను నమస్కరించుచున్నాను."

ఒకానొక దినమున శ్రీకృష్ణ భగవానుడు నందరాణి యశోద ఒడిలో పడుకొని ఆడుకొను చుండెను. ఉన్నట్లుండి ఆ బాలుడు ఆమెకు పర్వత సమానమున బరువు త్రోచి, ఆమె ఓర్వజాలక క్రింద పరుండబెట్టెను.

ఈ చిన్ని బాలునకు పర్వత సమానమయిన భారము ఎట్లు సంఘటిల్లినది?" అని తలపోసెను. కానీ ఆ రహస్యమును ఆమె ఎవరికినీ చెప్పలేదు. ఆ సమయమున కంసుని పనుపున "తృణావర్తుడు" అను రాక్షసుడు సుడిగాలి రూపముతో వచ్చి, ఇంటి వసారాలో ఆడుకొనుచున్న బాలకృష్ణుని తీసికొని విసురుగ ఆకాశమునకు ఎగరెను. ఆ సమయమున గోకుల మంతయు ధూళి ఆవరించి అంధకార బంధుర మయినది. భయంకర శబ్దములు అన్ని వైపులా వినిపించ సాగెను. యశోద నందమందిరము నందు బాలకృష్ణుని కాంచన మిక్కిలి భయభ్రాంతురాలై మొదలు నరికిన కదళీ వృక్షము వలె పృథివిపై పడి మూర్ఛిల్లెను. కొంత సేపటికి తేరి, లేగదూడను కోల్పోయిన గోమాత వలె ఉచ్ఛస్వరమున కరుణా విలాపము చేయసాగెను. ప్రేమ మరియు స్నేహము చే వ్యాకుల చిత్తలయిన గోపస్త్రీలు సహితము రోదింపసాగిరి. వారందరి ముఖముల యందు అశ్రుధారలు ప్రవహించుచుండగా నందనందనుని కొరకు తీవ్రముగ గాలించుచుండిరి.

అటు తృణావర్తుడు బాలకృష్ణుని తీసికొని, భుజముల నిడుకొని, పదియోజనములు పైకి ఎగరెను. అతని శరీరము సుమేరు పర్వతమునకు పోలియున్నది. అంతలో ఆ దానవునకు అత్యంత బాధ కలుగుట ఆరంభమయినది. ఆతడు బాలకృష్ణుని ఆకాశము నుండి క్రిందకు విసురు ప్రక్రియ యందు నిమగ్నుడై యుండెను. ఇది గ్రహించిన పరిపూర్ణతమ భగవానుడు శ్రీకృష్ణుడు ఆతని కంఠమును మిక్కిలి గట్టిగ ఒడిసిపట్టి పట్టుకొనెను. నిశాచరుడంత "వదలు, వదలు" నుని బిగ్గరగ కేకలు వేయుట ప్రారంభించెను. అంత బాలకృష్ణుడు ఆతని కంఠమును అదుముట ప్రారంభించెను. అంత తృణావర్తుని పంచ ప్రాణములు పంచత్వమును పొంది అనంత వాయువులందు లీనమయ్యెను. అపుడు ఆతని శరీరము నుండి ఒక దివ్య జ్యోతి మేఘమును చేరు విద్యుల్లత వలె శ్రీకృష్ణుని యందు ప్రవేశించెను. అంత ఆకాశము నుండి ఆ రాక్షసుని దేహము ఒక కొండ శిలపై పడి నుగ్గు నుగ్గు అయినది. దశ దిశల యందు భయంకర ధ్వని

ప్రతిధ్వనించెను. భూమి కంపించినది. ఆ సమయమున రోదించుచున్న యశోద మొదలయిన గోపాంగనలు ఒకేసారి రాక్షసుని ఉరమున నిశ్శబ్దముగ కూర్చొని యున్న బాలకృష్ణుని చూచి ఎత్తుకొని ముద్దాడిరి.

అంత యశోదతో వారు ఇట్లు నిష్ఠురములాడిరి "బాలకుని ఆలన, పాలన యందు నీకు కొంచెము కూడా కుశలత్వము, యోగ్యత లేవు. మేము ఏమేని చెప్పినచో మనమున నీకు కష్టము కలుగును. నీకు ఈషణ్మాత్రము దయలేదు. ఇది సత్యము. అట్లు కానిచో అంధకారము నలుదిశలా క్రమ్ముకున్న వేళ ఎవరైననూ తమ పుత్రుని ఒడి నుండి క్రింద పెట్టుదురా? నీవు నిర్దయురాలివి. అందుచే ఈ క్రూర కర్మము చేసితివి. యశోద "సోదరీమణులారా! ఆ సమయమున ఈ బాలుడు నాకు పర్వత సమాన భారుడై తోచెను. అందుకే ఆ చిన్నారిని నేను క్రిందపెట్ట వలసి వచ్చినది". కానీ గోపాంగనలు "యశోదా! నీవింక చెప్పవలదు. అసత్యము పలుకవలదు. నీ హృదయము దయారహిత పాషాణ సదృశము. ఈ ముద్దు లొలుకు చిన్నారి బాలకుడు పువ్వులు మరియు దూది పింజము కంటె తేలికగ యున్నాడు."

నారదుడు తిరిగి చెప్పనారంభించెను "చిన్నారి శ్రీకృష్ణ భగవానుని గృహాగమనము తోడనే నందుడు మరియు ఇతర గోప గోపీ జనమందు హర్షోల్లాసములు మిన్ను ముట్టెను. ఈ కుశల వార్త వ్రజభూమి అంతయు విస్తరిల్లెను. యశోద శ్రీకృష్ణుని ఎత్తుకొని ముద్దాడి, స్థన్యమునిచ్చి, శిరమును మూర్కొని, ఆ బాలుని తన ఉరము పై నిదుకొని పమిట చెంగుతో కప్పి ప్రక్కన యున్న రోహిణి తో ఇట్లనియె "సోదరీ! నాకు భగవంతుడు కేవలము ఒక్క పుత్రుని ప్రసాదించెను. ఎక్కువ మంది పుత్ర సంతానము లేదు. అయినప్పటికీ మాటి మాటికీ ఈ నా పుత్రునిపై క్షణమున కొక అరిష్ఠము దాపురించుచున్నది. ఈనాడు ఈతడు మృత్యుముఖము నుండి బయల్పెడలెను. దీని కంటె ఎక్కువ ఉత్పాతము ఏమి యుండును? నేనేమి చెప్పగలను? ఎక్కడకు వెళ్ళుదును? ఎక్కడ నివసించగలను? నాకు ధనము, శరీరము, ఇల్లు, సంపద, నవరత్నములు వీటన్నిటి కంటెను నా చిన్నారి బాలుని కుశలమే ప్రధానము. ఈ చిన్ని బాలుడు ఈ అరిష్ఠములు నుండి బ్రతికి బట్టకట్టెనేని నేను భగవానుడయిన శ్రీహరికి పూజ, దానము, యజ్ఞము చేయుదును. వాపీ కూప తటాకములు కట్టించెదను, మరియు వందలకొలది మందిరములు (దేవాలయములు) కట్టించెదను. ప్రియమయిన రోహిణీ! అంధులకు చేతికర్ర ఎంత అత్యావశ్యకమో అట్లే నా సర్వసుఖములు ఈ బాలకుని యందే యున్నవి. అందుచేత ఓ! చెల్లెలా! భయరహితమయిన ఏదో ఒక స్థానమునకు నాగారాబు బిడ్డను తీసికొని పోయెదను. ఆ సమయమున నంద మందిరమున విద్వాంసులయిన అనేక బ్రాహ్మణ ముఖ్యులు యశోదా నందుల యెదుట పరివేష్ఠితులయిరి. ఆ దంపతి వారందరినీ యధోచితముగ స్వాగత సత్కారములు ఆచరించిన పిదప ఆ విద్వణ్మయి భూసురోత్తములు ఈ విధముగ పలికిరి.

"వ్రజపతి అయిన నందరాజా! మీరిరువురు చింతింపవలదు. మేము మంత్రవిహిత రక్షాకవచము ఏర్పరిచెదము. అందుచే ఆ బాలుడు దీర్ఘజీవి అగును. అపుడు ఆ బ్రాహ్మణోత్తములు కుశాగ్రములు నూతన పల్లవములు, పవిత్ర కలశములు, శుద్ధ జలములు, తీసికొని ఋగ్, యజుస్, సామ వేదము లందలి ఉత్తమ స్థోత్రములచే స్వస్తి వాచకములు పలికి విధి విధానముగ యజ్ఞము చేయించి, అగ్నికి ఆహుతులు సమర్పించి దివ్యముగ రక్షా కవచము మంత్ర పూర్వకముగ కట్టిరి. "భగవానుడు దామోదరుడు నీ చరణములను రక్షించు గాక. విష్ఠరశ్రవుడు మోకాళ్ళను, విష్ణు భగవానుడు తొడలను శ్రీకృష్ణుడు నాభినీ, రాధా వల్లభుడు నీ కటి ప్రదేశమును, పీతాంబరధారి నీ ఉదరమును, పద్మనాభుడు హృదయమును, గోవర్ధనధారి నీ బాహువులను, మధురాదీశ్వరుడు నీ ముఖమును, ద్వారకాధీశుడు శిరసును, అసురాంతకుడు అయిన భగవానుడు నీ వీపును, సాక్షాత్ గోవిందుడు అన్ని వైపులా నిన్ను రక్షించు గాక. త్రిశ్లోకాయుక్తమయిన ఈ స్థోత్రమును ఎవరు నిరంతరము పారాయణ చేయుదురో వారికి పరమసుఖ ప్రాప్తి మరియు భయనాశనము కలుగును.

తదనంతరము ఈ బ్రాహ్మణోత్తములకు ఒక లక్ష ఆవులు, పది లక్షల స్వర్ణ ముద్రికలు, ఒక వెయ్యి వినూత్న రత్నములు, ఒక లక్ష విలువయిన వస్త్రములు, నందుడు దానమిచ్చెను. ఆ బ్రాహ్మణోత్తములు నిష్క్రమించిన పిదప నందుడు గోప గోపీజన బంధు మిత్రులతో భోజన మారగించి వారందరినీ కూడా మనోహర వస్త్ర భూషణములతో సత్కరించెను.

బహుళాశ్వుడిట్లు ప్రశ్నించెను. "మునీంద్రా! సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుని యందు లీనమయిన తృణావర్తుని పూర్వ జన్మ కర్మమెట్టిది? ఈతడు ఎవరు?" తిరిగి నారదుడిట్లు ప్రసంగించెను. "ఓ రాజా! పూర్వ కాలమందు పాండు

దేశమున “సహస్రాక్షుడు” అను మిక్కిలి కీర్తి ప్రతిష్ఠలు కలిగిన మహారాజు కలడు. ఆయన అపార విష్ణుభక్తి తత్పరుడు. ధర్మశీలుడు. యజ్ఞ, దానములందు రతి కలవాడు. ఆయన ఒకనాడు లతలతో, వృక్షములతో నిండి మిక్కిలి సుందరమయిన రేవా (నర్మదా) నదీ తీరమునకు ఏగి తన అంత:పుర స్త్రీలతో జలక్రీడలాడు చుండెను. ఆ సమయమున అచటికి రుద్రాంశ సంభూతుడు, దుర్వాస మహాముని ఏతెంచెను. మహారాజు కర్మ వశమున ఆయన ఆగమనమును గ్రహించక, వందనము చేయక జలక్రీడలందు మునిగి త్రేలు చుండెను. అపుడు దుర్వాస ముని ఆగ్రహించి “దుర్బుద్ధీ! నీవు రాక్షసుడవు కమ్ము” అని శపించెను.

అంత సహస్రాక్షుడు తన తప్పిదమును గ్రహించి దుర్వాస ముని పాదములపై బడి కరుణింప వేడెను. అంత మునీంద్రుడు కరుణించి “మహారాజా! శ్రీకృష్ణ భగవానుని దివ్య దేహమును నీవు స్పృశించినపుడు నీకు ఈ రాక్షసత్వము నశించి ముక్తి కలుగును”. ఆ సహస్రాక్షుడే భూతలమందు తృణావర్తునిగ జన్మించి, శ్రీకృష్ణ భగవానుని భుజములపై మోసి ఆయన కర స్పర్శ చే సర్వోత్తమ ముక్తిని పొందెను.

(గర్గసంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందు ఉత్కచ (శకటాసుర) మరియు తృణావర్తుల మోక్షమును పద్నాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(శ్రీకృష్ణ ముఖమండలమున యశోద సమస్త బ్రహ్మాండములను చూచుట; యశోద నందుల పూర్వజన్మ పరిచయము. నంద భవనము నందు గర్గాచార్యుని ఆగమనము, మరియు బలరామకృష్ణుల నామకరణము. వృషభానునికి రాధాకృష్ణులు నిత్యసంబంధము లేక మహాత్మ్యము తెలుపుట.)

నారదుడు తిరిగి ప్రసంగించెను “ఒకానొక దినము నీలిమేఘచ్ఛాయా శరీరుడయిన కృష్ణపరమాత్మ రత్నఖచిత ఉయ్యాల యందు పడుకొని యుండెను. ఆయన ముఖము నందు సమస్త లోకములనూ మోహింపచేయు సుందర దరహాసము నాట్యము చేయుచుండెను. దృష్టిదోషము తొలగుటకు ఆయన నుదిటి యందు కాటుకబొట్టు పెట్టబడెను. ఇటువంటి ముగ్ధమనోహర బాల కృష్ణుని యశోద తన ఒడిలోనికి తీసికొనినది. ఆ బాలముకుందుడు తన కాలి బోటన వేలిని తన నోటియందుంచుకొని చప్పరించు చుండెను. ఆయన స్వభావ రీత్యా చపలుడు. నీలము, నూతనము, మరియు కోమలమయిన ముంగురులు ఆయన నుదిటిపై ఆడుచుండెను. వక్షస్థలము నందు శ్రీవత్సము, మరియు మెరయుచున్న అర్ధచంద్రహారము విపుల శోభను కలిగించుచున్నవి. ఇటువంటి బాలకృష్ణుని అత్యంత మరిపెము తో చూచుచూ అపార కరుణాబ్ధి అయిన యశోదామాత ఆనంద డోలికలయందు ఊగిసలాడు చుండెను. అప్పుడే శ్రీకృష్ణ భగవానుడు తన తల్లి స్థన్యమును తనివితీరా త్రాగి నోరార ఆవులించెను. తల్లి యొక్క దృష్టి ఆయన నోటియందు పడెను.

అకస్మాత్తుగ ఆమెకు ఆయన ముఖము నందలి నోటి యందు పృధివ్యాది పంచతత్వ సహితమయిన బ్రహ్మాండము గోచరింపసాగెను. ఇంద్రాది దేవతలు సహితము గోచరించిరి. ఒక్క క్షణము యశోదాదేవి అయోమయ స్థితికి లోనయ్యెను. ఒక్కసారి ఆమె కళ్ళు మూసికొనెను. మహారాజా! పరిపూర్ణ భగవానుడయిన శ్రీకృష్ణుడు సర్వశ్రేష్ఠుడు. ఆయన మాయచే సంసారమునకు, సర్వజగత్తుకు సత్వము కలిగినది. ఆ కృష్ణ మాయచే యశోదాదేవి తనకు కలిగిన దివ్యస్మృతి మరచి తిరిగి కృష్ణ భగవానుని వాత్సల్య పూరితముగా చూడ సాగినది. అహా! శ్రీ నందరాణి యొక్క తపోభాగ్యమును ఏమని వర్ణింతును?”

బహుళాశ్వుడు ప్రశ్నించెను “మునీశ్వరా! నందుడు యశోదాసహితుడై ఆచరించిన ఏ తప: ప్రభావము వలన

శ్రీకృష్ణ చంద్రుడు వారికి పుత్ర రూపములో ప్రకటయ్యెను? "నారదుడు తిరిగి ప్రసంగించెను" అష్ఠ వసువులలో ప్రధానుడు "ద్రోణుడు" ఆయన సతీమణి "ధర". వారికి అధిక కాలము సంతానము లేదు. వారిరువురు పరమ శ్రీకృష్ణ భక్తులు.

వారు దేవతా రాజ్య పాలనము సహితము చేయుచుండిరి. ఒకనాడు ఆయన పుత్రాభిలాష చే బ్రహ్మదేవుని ఆదేశానుసారము తన భార్య ధరాసహితుడై మంధరాచలము చేరి కందమూలాది ఫలములను, రాలిన పండుటాకులు భుజించుచూ తపస్సు నారంభించిరి. కొంత కాలమునకు కేవలము జలభక్షణము చేయుచూ తపస్సు చేసిరి. ఇట్లు జనశూన్య ప్రదేశమున వారి తపస్సు పది కోట్ల సంవత్సరములు సాగినది. అంత భ్రహ్మదేవుడు ప్రసన్నుడై, వారి యెదుట ప్రత్యక్షమై వరము కోరుకొనమనెను. ఆ సమయమున వారి శరీరముపై వల్మీకములు పెరిగి యుండెను. ద్రోణుడు వాటిని భేదించి, బయటకు విచ్చేసి, తన అర్ధాంగి ధరాదేవిని సహితము బహిర్గత మొనర్చి, భ్రహ్మదేవునికి ప్రణామములాచరించి యధావిధిగా పూజించెను. వారి మనస్సు హర్షోల్లాసిత మయినది. వారిరువురు ఇట్లు పలికిరి– "భ్రహ్మదేవా! విధాతా! పరిపూర్ణ భగవానుడు, జనార్ధనుడు, శ్రీకృష్ణుని మాకు పుత్రునిగ ప్రసాదించుము. ఆయన యందు మాకిరువురకు అత్యంత ప్రేమ పూరిత భక్తి కూడా కటాక్షింపుము. ఆ భక్తి ప్రభావము చే మానవ దుర్లభమయిన భవసాగరమును మేము అత్యంత సులభముగా దాటగలము. తపస్విజనులమయిన మాకు వేరొక అభిలాష లేదు".

అపుడు భ్రహ్మదేవుడు "మీరడిగిన వరము కఠినము. బహు దుర్లభము". కానీ మీరాచరించిన అనితర సాధ్యమయిన తపోఫలితముగ మరు జన్మము నందు మీ కోరిక సాఫల్యము పొందును". పూర్వజన్మమందలి ఆ ద్రోణుడే నందుడు. ధరయే యశోద. భ్రహ్మదేవుని వాక్కును నిజము చేయుటకు శ్రీకృష్ణ భగవానుడు మధుర నుండి వ్రజభూమికి వేంచేసెను. శ్రీకృష్ణ భగవానుని శుభ చరిత్రము సుధాభరిత ఇక్షుకాండము కంటెను మిక్కిలి మధురమయినది. గంధమాదన పర్వత శిఖరము నందు నర–నారాయణ భగవానుల ముఖార విందముల నుండి నేను (నారదుడు) ఆ విషయమును వింటిని. వారి కృపచే నేను కృతార్థుడనైతిని. ఈ విషయమే నేను నీకు విన్నవించితిని, ఇంకనూ నీవు ఏమి వినగోరుచున్నావు? తెలుపవలసినది".

బహుళాశ్వుడు తిరిగి ప్రశ్నించెను "శిశురూపధారి అయిన సనాతన భగవానుడు బలరామునితో కలసి ఇంకనూ ఏమేమి లీలలు చేసెను? ఇవి దయచేసి వివరింప వలసినది". నారదుడు ప్రసంగించెను "ఒకానొక శుభ దినమున వసుదేవుడు పంపగా త్రికాలద్రష్ఠ అయిన గర్గాచార్యుడు శిష్యసమేతముగ నందమందిరమున ప్రవేశించెను. నందుడు అర్ఘ్య పాద్యములతో ఆయనను ఆహ్వానించి, విధి విధానముగ అయనను పూజించి, ప్రదక్షిణలు చేసి సాష్ఠాంగ దండ ప్రణామములాచరించెను. నందుడు ఈ విధముగ పలికెను "మహానుభావా! నేడు మా పితరులు, దేవతలు మరియు అగ్ని సంతుష్ఠులయిరి. మీ చరణ ధూళి చే మా గృహము పావనమయినది. మహామునీ! మీరు మా కుమారునికి నామకరణము చేయవలసినది. ఓ! విప్రవర్యా! అనేక పుణ్యములు, తీర్థ సేవనములు, చేసినప్పటికీ మీ వంటి మహానుభావుల శుభాగమనము జరుగదు. అంత గర్గుడు "నందరాజా! నేనే మీ పుత్రునకు నామకరణము చేయుదును. అందు సందేహము లేదు. కానీ ఒకానొక పురాతన విషయము ప్రస్థావింపవలసి యున్నది. అందుచేత నన్ను ఒక ఏకాంత స్థలమునకు తీసికొని పోవలసినది". పిదప గర్గుడు, నంద యశోదలు, శ్రీకృష్ణ బలరాములను తోడ్కొని ఇతరులు ఎవ్వరూ లేని గోశాల యందు ప్రవేశించిరి. అచట గర్గాచార్యుల వారు నామకరణోత్సవమును జరిపిరి. మొదట గణేశపూజన మొనర్చి, ఇతర దేవతల నారాధించి, గోశాల అంతయు శోధించి, హర్ష పులంకాకితుడై గర్గుడు నందునితో ఇట్లనియె. "ఈ రోహిణీ పుత్రుని యొక్క నామమును చెప్పుచున్నాను. ఈయన యందు యోగి పుంగవులు పరవశము చెందెదరు. ఈయన సర్వులయందును రమించును, మరియు తన గుణముల ద్వారా భక్తజనులను రమింపజేయును. ఇందుచే ఉత్కృష్ఠ జ్ఞానులు ఈయనను "రాముడు" అని పిలిచెదరు. యోగమాయ మహిమచే గర్భము మార్పిడి చేయబడిన పిదప పుట్టెను కనుక "సంకర్షణుడు" అని పిలువబడును. అశేష జగతి సంహరింపబడినప్పడికీ ఈయన అందరికంటెను బలాధిక్యుడు కావున "బలుడు" అను నామము చే ప్రఖ్యాతి పొందును.

నందా! ఇపుడు నీ పుత్రుని గూర్చి చెప్పుచున్నాను. సావధానముగ వినుము. ఈయన నామము లన్నియు

స్మరించిన తక్షణమే ప్రాణకోటిని పావన మొనర్చును, మరియు అవి అన్నియు చరాచర జగత్తుకు పరమ కళ్యాణ కారకములు.

కృష్ణ:-కరుషణ:

"క" అనగా కమలకాంతుడు

"ఋ" అనగా రాముడు

"ష" అనగా షడ్విధ ఐశ్వర్యములకు స్వామి అయిన శ్వేతద్వీప నారాయణుడు

"ణ" అనగా నరశింహుని ప్రతీకము

"అ" అనగా అగ్ని రూపములో హవిస్సు యొక్క భోక్త మరియు అగ్ని రక్షకుడు.

: అనగా విసర్గరూప బిందువులు. ఇవి నరనారాయణులకు ప్రతీక.

ఈ ఆరు పూర్ణ తత్వములు, ఏ మహామంత్ర, మహితాన్విత పూర్ణ శబ్దము నందు నిక్షిప్తమై యున్నదో అదియే "కృష్ణ" నామము. అందుచే ఈ బాలకుడు "కృష్ణ" నామధేయము చే ప్రసిద్ధి పొందును. అది ఒక నామము. ఈతడు కృత (సత్య), త్రేతా, ద్వాపర, కలి యుగములందు వరుసగా తెలుపు, ఎరుపు, పసుపు, మరియు నీలిమేఘా ఛాయ యందు ప్రకాశించెను. ద్వాపరాంతము, మరియు కలియుగా రంభమున కూడా ఈతడు నీలికాంతిచే ప్రకాశించును కావున ఈ నందనందనుడు "కృష్ణుడు" అను పేర విఖ్యాతి గాంచును.

ఈతని మరియొక నామధేయము "వాసుదేవుడు". "వసువు"లనగా ఇంద్రియములు. వీటికి అధిష్ఠానము చిత్తము. ఎవరు ఆ చిత్తము నందు స్థితిగతుడై చేష్ఠలను చేయుచుండునో ఆ అంతర్యామి సహితము "వాసుదేవుడు" అని పిలువబడును. వృషభానుని పుత్రి, మరియు కీర్తిదేవి భవనము నందు ప్రకటింపబడు శ్రీ రాధాదేవికి ఈయన ప్రాణ వల్లభుడు అగును. అందుచే ఈయన "రాధాపతి" అని ప్రసిద్ధిగాంచును. ఎవరు సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడో, అసంఖ్యాక బ్రహ్మాండములు అన్నియు ఎవని అధీనము నందు యున్నవో, ఎవరు గోలోక ధామము నందు విరాజిల్లు చుండునో ఆ పరమ ప్రభువు ఈ చిన్నారి శిశువుగా మీ ఇంట ప్రకటమగు చున్నాడు. పృధివీ భారమును తగ్గించుట; కంసాది దుష్ఠులను పరిమార్చుట; మరియు శిష్ఠ భక్తజన రక్షణ; ఈ మూడునూ ఈ అవతార ఉద్దేశ్యములు. ఈయన నామములకు అంతము లేదు. ఆ నామములన్నియు వేదములందు గౌణములు. ఈయన సలుపు లీలల కారణమున ఆయానామములు తిరిగి సిద్ధించును.

ఈయన అధ్భుత కార్యములు చూచి ఆశ్చర్యపడవలదు. నందా! నీ భాగ్యము నేమని చెప్పెదను! సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడయిన పురుషోత్తముడు, సనాతనుడు, నీ ఇంట పుత్రరూపముతో వెలుగాడు చున్నాడు," ఈ విధముగ సలికి గర్గాచార్యుడు నిష్క్రమించెను. నంద, యశోదలు ప్రహృష్ఠ హృదయాంతరంగులై తాము కృత కృత్యుల మయితిమని భావించిరి.

తదనంతరము జ్ఞాన శిరోమణి, జ్ఞానదాత అయిన ముని శ్రేష్ఠుడు గర్గాచార్యుల వారు యమునా తటము నందు వెలుగొందుచున్న వృషభానుని పురమునకు ఏగిరి. వృషభానుడు దూరము నుండి ఛత్రధారణ చేయుట చే శతమఖుని వలెను, దండధారణ చేయుటచే సాక్షాత్ యమ ధర్మరాజు వలెను శోభించుచుండెను. ఆయన తన తేజస్సుచే నలుదిశలా కాంతిని ప్రసారించుచుండెను. చేతులయందు పుస్తకములు, మణికట్ల యందు కంకణములు ధరించిన గర్గాచార్యుడు సాక్షాత్ బ్రహ్మదేవుని భాంతి ప్రకాశించుచుండెను. శుక్ల (తెల్లని) దుకూలములు ధరించుట చే ఆయన విష్ణు దేవుని వలె కూడ భాసించుచుండెను. ఆ మునీశ్వరుని చూడగానే వృషభానుడు లేచి, అత్యంత ఆదరముతో ఆహ్వానించి, దండ ప్రణామము లాచరించి, చేతులు జోడించి వినమ్రుడై చెంతను నిలచెను. వృషభానుడు పూజోపచార చతురుడు. ఆయన గర్గాచార్యుని ఒక మంగళమయ ఆసనము నందు ఆశీనుని చేసి, విధి విధానముగ పూజించి, ప్రదక్షిణలు చేసి ఈ విధముగ పలికెను "మహర్షుల ఆలోచనలు ఎల్లప్పుడూ శాంతి యుతముగ యుండును. ఎందుకనగా అవి గృహస్థులకు పరమ శాంతిని కలుగజేయును. మనుష్యులు యందలి అజ్ఞానాంధకారమును కేవలము మహాత్ములు మాత్రమే నాశనము చేయగలరు. ఆదిత్యునికి సహితమది అసాధ్యము భగవాన్! మీ దర్శన భాగ్యము చే మా గోపజాతి అంతయు పవిత్రమయినది.

భూ మండలమందు మీ వంటి సాధుపురుషులు తీర్థములను సహితము పావనము చేయుదురు. మా ఇంటి యందు ఒక కన్యామణి కలదు. ఆమె మంగళములకు మూలము మరియు ఆమెది రాధికా నామధేయము. మీరు చక్కగా విచారించి ఆమె యొక్క వివాహము ఎవరితో జరుగునో దయచేసి వినిపింప ప్రార్ధన. సూర్యదేవుని వలెనే మీరు కూడా మూడు లోకముల యందు సంచరించెదరు, మరియు దివ్య దర్శనులు. ఈమెకు యోగ్యమయిన వరునిగా ఎవరిని నిర్ణయించెదరో వారికే ఈ కన్యారత్నమును నిశ్శంశయముగ బహూకరించెదను.

తదుపరి గర్గాచార్యులవారు వృషభానుని చేతిని తన చేతిలోనికి తీసికొని, ఆయనను భార్యా సహితముగ యమునా తీరమున ఒక ఏకాంత ప్రదేశమునకు తీసికొని వెడలెను. అచట కాళిందీ జలములు గలగల ప్రవహించుచూ కనువిందు చేయుచున్నవి. అప్పుడా ధర్మజ్ఞ మునీంద్రుడు, గర్గుడు వారిరువురను కూర్చుండ బెట్టి ఇట్లు భాషించెను "వృషభాను మహారాజా! ఒక రహస్యమును చెప్పుచున్నాను. వినండి. ఈ విషయము ఎవరికినీ తెలియపరుచ వలదు. అసంఖ్యాక బ్రహ్మాండముల కధిపతి, గోలోక ధామము యొక్క స్వామి, సంపూర్ణ తమ భగవానుడు, ఎవరికంటెను వేరొక అధికుడు లేదో అటువంటి పరాత్పరుడు శ్రీకృష్ణుడు నందుని ఇంట ఆవిర్భవించెను". వృషభానుడు "మునీంద్రా! నందుని అదృష్టము ధన్యము, అద్భుతము, మరియు వర్ణనాతీతము. నాకు కృష్ణావతారము యొక్క సంపూర్ణ కారణమును వివరింపవలసినది." గర్గుడు "పృథివీ భారనాశనమునకు, కంసాది దుష్టులను పరిమార్చుటకు, బ్రహ్మదేవుని ప్రార్ధనా ఫలితముగా శ్రీకృష్ణ భగవానుడు అవతరించెను. శ్రీకృష్ణుని పట్టపురాణి, గోలోక మందు విరాజిల్లు శ్రీ రాధా దేవి నీ ఇంట పుత్రికా రూపములో ప్రకటిత మయినది. మీరు ఈ పరాశక్తి అయిన రాధికా దేవిని తెలిసికొనలేరు. ఆ సమయమున వృషభానుని హృదయమంతయూ ఆనందము తో నిండి అత్యంత విస్మితుడాయెను.

శ్రీ రాధాకృష్ణుల ప్రభావము తెలిసి కొనుటకై గోపేశ్వరుడైన వృషభానుడు హర్ష భాష్పములు కన్నులనుండి ప్రవహించు చుండగా మహాముని గర్గాచార్యుని ఇట్లు ప్రశ్నించెను. "ద్విజోత్తమా! అట్టి శ్రీ కృష్ణ భగవానునికి నా కమలనయిన కన్యకామణిని సమర్పించెదెదను. మీరు ఈ సన్మార్గమును నాకు చూపిరి. అందుచే మీ ద్వారా ఈ శుభకార్యము జరుగవలసి యున్నది. గర్గుడు "ఓ! రాజా! శ్రీ రాధా కృష్ణుల పరిణయ సంస్కారము నాచే చేయబడదు. బృందావనమున ఒక ఏకాంత సురమ్య స్థానమున స్వయముగ బ్రహ్మదేవుని చే వారిరువురి వివాహము జరుగును. అందుచేత రాజా! నీవు శ్రీ రాధాదేవిని "శ్రీకృష్ణ వల్లభ" గా ఎరుంగుము. సంసారము నందలి రాజులందరి యందు నీవు శిరోమణివి. గోలోకధామము లోకములకు శిరోమణి. మీ గోపాలరందరూ గోలోకము నుండి భూతలమునకు వచ్చిన వారే! సమస్త గోపికలు శ్రీ రాధాదేవి ఆజ్ఞానుసారము గోలోకము నుండి అవతరించిరి. దేవతలు సహితము భూరి యజ్ఞములు చేసి, అనేక జన్మములు పుణ్య కర్మములు చేసిననూ, ఎవరి దర్శనము దుర్లభమో, అటువంటి రాధికా దేవి నీ మందిరమున, గుప్త రూపమున సంచరించుచున్నది.

సామాన్యులయిన గోప, గోపీ జనము సహితము ఆ తల్లి దర్శనము పొందుచున్నారు. శ్రీ రాధికాదేవి మరియు శ్రీకృష్ణ భగవానుల ప్రశంశనీయ ప్రభావము విని వృషభాను, కీర్తి దేవి దంపతి అత్యంత విస్మితులై ఆనందాహ్లాదమున ఓలలాడిరి. అపుడు వారిరువురు "బ్రహ్మన్! రాధా శబ్దమునకు తాత్విక వ్యాఖ్య తెలియజేయ వలసినది. ఈ భూతలము నందు మనసున ఉదయించిన సందియములు తీర్చుట యందు మిమ్ములను మించిన ఘనులు లేరు".

గర్గాచార్యుడు తిరిగి ప్రసంగించెను "ఒకప్పటి మాట! నేను శిష్యసమేతుడనై గంధమాదన పర్వతమునకు ఏగితిని. అచట నారాయణ భగవానుని ముఖతా సామవేద సారమయిన ఈ సారాంశమును వింటిని.

"ర" కారము రమాదేవి

"ఆ" కారము గోపికలు

"ధ" కారము భూమి

"ఆ" కారము విరజానది.

శ్రీకృష్ణ భగవానుని దివ్యరూపము నాలుగు విధములుగ విభజింపబడినది. అవి లీల, భూ, శ్రీ, విరజ. ఈ నలుగురు పత్నులు ఆయన తేజములు. ఈ నాలుగు శక్తులు కుంజ భవనము నందు శ్రీ రాధికా దేవి యందు లీనమై

యుండును. అందుకే విద్వజ్జనులు శ్రీ రాధికా దేవిని "పరిపూర్ణతమ" అని నుడివెదరు. ఏ మనుష్యుడు నిరంతరము "రాధాకృష్ణ" నామమును జపించు చుండునో వానికి ఈ నాలుగు పదార్ధము లేల? సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుడు సహితము లభ్యమగును. ఆ సమయమున భార్య సహితుడయిన వృషభానుని ఆశ్చర్యమునకు అంతులేదు. శ్రీ రాధాకృష్ణుల దివ్య ప్రభావమును విన్న వారిరువురు ఆనంద విగ్రహులయిరి. తదుపరి వృషభానుడు తిరిగి గర్గాచార్యుని పూజించెను. అపుడు సర్వజ్ఞుడు, త్రికాలవేది అయిన గర్గాచార్యుడు తిరిగి తన ఆశ్రమమునకు చనెను.

(గర్గసంహిత యందలి గోలోక ఖండమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి నందపత్ని చే విశ్వరూప సందర్శనము, శ్రీకృష్ణ బలరాముల నామకరణ, అనెడి పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(భాండీర వనమున నారద మహర్షిచే శ్రీ రాధికాదేవి స్తుతి. బ్రహ్మదేవుని ద్వారా శ్రీ రాధాకృష్ణుల పరిణయము. బ్రహ్మదేవుని ద్వారా శ్రీకృష్ణుని స్తుతి. నవ దంపతుల మధురలీలలు.)

నారద మహర్షి తిరిగి చెప్ప దొడంగెను. "మహారాజా! ఒకనాడు నందరాజు తన ముద్దుల తనయుని భుజములపై నిడుకొని మిక్కిలి గారము చేయుచూ, నెమ్మదిగ గోవులను కాచుచుండెను. తనకు తెలియకుండానే ఆతడు తన గోవులతో సహితము భాండీరవనము ప్రవేశించెను. భాండీరము కాళిందీ స్పర్శచే, మందమనోహర సమీర వీవనముచే మనోహరముగ భాసించుచుండెను. ఇంతలో శ్రీకృష్ణ దేవుని ఇచ్ఛానుసారము వాయువు యొక్క వేగము తీవ్రతరమై ఆకాశము మేఘావృతమయినది. కదంబ, తమాల వృక్షముల ఆకుల రెపరెపలాడుచుండగా కొమ్మలు విరిగి నేలపై బడుచూ భయంకరాంధకారము నలు దిక్కులా అలుముకొనెను. నందనందనుడు మాత్రము భయభ్రాంతుడయినట్లు నటించుచూ ఏడ్చుచుండెను. నందునకు సహితము భయము కల్గినది. అంతట భయభ్రాంతుడయిన నందుడు తన నందనుని ఒడి లోనికి తీసికొని శ్రీ హరిని శరణు జొచ్చెను. ఆ క్షణముననే కోటి సూర్యుల కాంతి ఉత్పన్నమగుట ప్రారంభించినది. ఆ దీప్తిరాశి మధ్య నవనందులకు రాజయిన నందుడు వృషభాను నందిని అయిన శ్రీ రాధాదేవిని కాంచెను. ఆమె కోట్లాది చంద్రకాంతితో ప్రకాశించుచున్నది. ఆమె శరీరము నీలిరంగు వస్త్రముతో అలంకరింపబడి బహు శోభాయమానముగ యుండెను. చరణముల కున్న మంజీరములు నుండి దివ్య శబ్దము వినబడుచున్నది. వీటితో కంకణముల కింకిణీధ్వని సమ్మిళితమై మరింత మధురిమ వినబడుచున్నది. రత్నమయ హారములు, ముద్రికలు, కేయూరములు, ఆ తల్లి శరీరమును మరింత ఉద్భాసితము చేయుచున్నవి. సందర నాశిక యందు ముత్యముల ముక్కెర, పాపిట యందు చూడామణి, చెవులకు కుండలములు మిలమిల మెరయుచున్నవి. ఆ రాధాదేవి యొక్క తేజస్సు నందు సంపూర్ణముగ మునిగిన నందుడు తన తలను వంచి, చేతులు ముకుళించి ఇట్లనియె "శ్రీ రాధాదేవి! ఈయన సాక్షాత్ పురుషోత్తముడు మరియు నీవు ఈయన ప్రాణవల్లభవు. గుప్తమయిన ఈ రహస్యమును శ్రీ గర్గాచార్యుల ముఖతా నేను వింటిని. నీ ప్రాణనాధుని నీవు స్వీకరింపవలసినది. ఈయన లీలా విలాసముగ ఈ ప్రకృతి యొక్క గుణములను స్వీకరించెను. ఓ! దేవీ! నీకు నమస్కారము".

"భూతలము నందు యదేశ్చగా నన్ను రక్షింపవలసినది. నీవు కేవలము నీ కృప చే నన్ను అనుగ్రహించుటకు నాకు దర్శనము నిచ్చితివి. వాస్తవమునకు నిన్ను దర్శించుట ఎవరికయిననూ దుర్లభము". అంత రాధాదేవి ఇట్లనిమె "నందరాజా! నీవు పలికినది సత్యము. ఎవరికయిననూ నా దర్శనము దుర్లభము. ఈనాడు నీ యొక్క భక్తికి ప్రసన్నురాలై నీకు దర్శనము నొసంగితిని. నందుడు ఇట్లు బదులు పలికెను" ఓ! దేవీ! నీవు నా భక్తిచే ప్రసన్నురాలివైతివేని నాకు మీ

ఇరువురి చరణార విందములందు సుధృఢమయిన భక్తిని ప్రసాదింపుము. అంతేకాక సంపూర్ణ భక్తి యుతులయిన సాధు సంసర్గము సహితము నాకు అనుగ్రహింపుము. ప్రతి యుగము నందునూ ఈ సంత మహాత్ముల యొక్క చరణారవింద సేవా భాగ్యము మరియు ప్రేమ నాకు ప్రసాదింపవలిసినది". శ్రీ రాధేదేవి "తథాస్తు" అని పలికి నందుని ఒడిలో యున్న బాలకృష్ణుని తన హస్తయుగళి చే గ్రహించెను. అంత నందుడు తిరిగి ప్రణామము లాచరించి అచట నుండిచనెను. శ్రీరాధాదేవి శ్రీకృష్ణ సహితయై భాండీర వనమున ప్రవేశించెను.

తక్షణమే భాండీరవనము దివ్యశోభతో ప్రకాశింపసాగెను. భూమి అంతయు పద్మరాగయుక్తమయిన సువర్ణమయముగా రూపుచెందెను. బృందావనమంతయు దివ్య వృక్షములు ఆవిర్భవించెను. కళిందనందిని అయిన యమునాతటము నందు సువర్ణ నిర్మిత ప్రసాదములు, మరియు రత్నమయ సోపానములు అంకురించినవి. గోవర్ధన పర్వత మంతయు రత్నమయ శిలలతో నిండి అన్ని వైపులా సువర్ణ శిఖరములతో ఒప్పారెను. ఘంకారము చేయుచున్న భ్రమరములతో, జలజల పారుతున్న జలపాతములతో, దివ్యమయిన గుహలతో నిండియున్న గోవర్ధనము ఎత్తైన గజరాజును పోలి శోభించుచున్నది. బృందావనము నందలి నికుంజములు సహితము తమ దివ్యరూపము ప్రకటితము చేయసాగినవి. అందు సభాభవనములు, ప్రాంగణములు, మరియు దివ్య మండపములు కానవచ్చుచున్నవి. వసంత ఋతువు యొక్క సర్వ మధురిమలు అక్కడ అభివ్యక్తీకరింపబడు చున్నవి. మధుపములు, మయూరములు, పావురములు, కోకిలలు కలకలరావములు చేయుచున్నవి. నికుంజములందలి దివ్య మండపముల శిఖరములు రత్నఖచిత కలశములతో అలంకరింపబడి యున్నవి. అన్ని ప్రక్కలా రెపరెపలాడుచున్న పతాకములు మిక్కిలి శోభాయమానముగ యున్నవి. ఆ ప్రదేశమున సువర్ణ సరోజములతో నిండిన సుందర సరోవరము కలదు. ఘంకారము చేయు తుమ్మెదలు ఆ సరోజముల యొక్క మధువును పానము చేయుచూ మత్తెక్కుచున్నవి.

ఇటువంటి దివ్యధామము అవతరించిన వెంటనే పురుషోత్తముడు శ్రీకృష్ణభవానుడు నవయవ్వన దివ్యదేహము దాల్చి శ్రీ రాధాదేవి సమ్ముఖమున నిల్చెను. ఆయన దివ్య పీతాంబరధారియై వక్షమున కౌస్తుభమణిని ధరించి, చేతియందు మురళితో కోటి మన్మధులను సహితము మొహింపజేయు రీతిని వెలుగొందు చుండెను. ఆయన చిరునవ్వుతో తన ప్రియురాలి చేతిని తన చేతిలోనికి తీసికొని వివాహమండపము లోనికి చనెను. ఆ మండపము నందు కుశలు, సప్తమృత్తికలు, శుద్ధ జలము, మొదలయిన వివాహ వశ్యక వస్తుసముదాయమంతయూ యున్నది. వారిరువురు అచటనున్న సింహాసనము నందు ఆశీనులయిరి. ఒకరితో ఒకరు అన్యోన్యముగ సంభాషించుకొనుచు మేఘ విద్యుల్లతల వలె తమ ప్రభావము చే ఉద్దీప్యమగుచున్నారు.

ఆ సమయమున దేవతా శ్రేష్ఠుడగు విధాత ఆకాశము నుండి భూమిపై దిగి శ్రీకృష్ణ సమ్ముఖమునకు ఏగి వారిరువురికి పాదాభివందనమొనర్చి తన కమనీయ వాణి ద్వారా చతుర్ముఖములతో ఇట్లు స్తుతించెను. "ప్రభూ! మీరు సమస్తమునకు కారణము. కానీ మీకు ఆది, అంతము లేదు. మీరు పురుషోత్తముల యందు ఉత్తములు. మీ భక్తులయందు వాత్సల్య భావము కలవారు. శ్రీకృష్ణ నామధేయులు. అగణిత బ్రహ్మాండములకు పాలకులు. పరాత్పర ప్రభువులు. రాధా ప్రాణవల్లభులు, అయిన శ్రీకృష్ణ చంద్రులను శరణు వేడు చున్నాను. మీరు గోలోకనాథులు, మరియు మీరిరువురి లీలా విలాసములకు అంతులేదు. మీరు వైకుంఠధాములుగ విరాజిల్లునపుడు ఈ తల్లి "లక్ష్మీ దేవి"గ శోభించెను. మీరు శ్రీ రామ చంద్రునిగ అవతరించినపుడు జనకనందిని "సీత" గా మిమ్ము అనుగమించును. మీరు విష్ణువయినచో ఈమె కమలవాసిని అయిన "కమల"యగును. మీరు యజ్ఞ పురుషులయినపుడు ఈమె "దక్షిణ" అగును. మీరు నృశింహ రూపి అగునపుడు ఈ తల్లి మీ హృదయాంతర్గత అయిన "రమ" గా రూపొందును. మీరు నరనారాయణులుగ తపమాచరించునపుడు మీ యందలి "పరమశాంతిగా" ఈ తల్లి విరాజిల్లును. మీరు ఏఏ రూపములను ధరించిననూ ఈమె తదణుగుణ రూపము ధరించి ఛాయ వలె మిమ్ములను ఎల్లప్పుడూ అనుసరించుచుండును. మీరు బ్రహ్మ అయినపుడు ఈమె "తటస్థప్రకృతి" గనూ, మీరు కాలరూపము ధరించి నపుడు ఈమె "ప్రధానము (ప్రకృతి)" రూపిగనూ, మీరు జగత్తుగ మారినపుడు శ్రీ రాధాదేవి "సగుణమాయా" స్వరూపముగనూ, మీరు మనో, బుద్ధి, చిత్త, అహంకారములనెడు నాలుగు అంత:కరణముల సహితమయిన అంతరాత్మగ స్థితిగతులై యున్నప్పుడు ఈ తల్లి "లక్షణావతి" రూపముననూ

విరాజమాన మగును. మీరు విరాట్పురుషులు అయినపుడు ఈ తల్లి "ధారణా శక్తి" గా మారును.

పురుషోత్తమా! రేయింపగలు యందలి ద్వితేజములు మీరే అయి యున్నారు. నేను మిమ్ము శరణు జొచ్చుచున్నాను. ఎవరు ఈ యుగళ రూపము యొక్క ఉత్తమ స్థితిని ఎల్లప్పుడూ పఠించుచున్నారో వారు సమస్తలోకముల యందు శ్రేష్ఠమయిన గోలోకమును చేరెదరు. అంతేకాక వారికి ఇహలోకము నందునూ సుస్వభావము, సౌందర్యము, సమృద్ధి మరియు సంపద ప్రాప్తించును. బ్రహ్మదేవుడు తిరిగి పలికెను "మీరిరువురు నిత్య దంపతి. పరస్పరము ప్రీతిచే పరిపూర్ణులు. పరమ పురుషులు అయినప్పటికీ, ఒకరికి అనురూప్యమయిన రూపము మరొకరు ధరించి లీలా విలాసములు కావింతురు. నేను లోక వ్యవహార రీత్యా, లోక సంగ్రహమునకు మీరిరువురికి వివాహ ప్రక్రియ కావించెదను.

బ్రహ్మదేవుడు ఈ విధముగ స్థుతించి కుండమునందు అగ్నిని ప్రజ్వలింపజేసి, అగ్ని సమ్ముఖమున వారిరువురికి వైదిక విధానముగ పాణిగ్రణము కావించెను. పిదప శ్రీ రాధాకృష్ణులను ఏడు సార్లు అగ్ని చుట్టూ ప్రదక్షిణము చేయించెను. తదనంతరము వారిరువురికి ప్రణామములాచరించి వేదవేత్త అయిన విధాత వారిచే ఏడు మంత్రములు పఠింపించెను. పిదప శ్రీ రాధికాదేవి హస్తమును శ్రీ కృష్ణుని వక్షస్థలమందు, శ్రీ కృష్ణుని హస్తమును శ్రీ రాధాదేవి పృష్ఠభాగము నందు ఉంచి ఉచ్చ స్వరముతో మంత్ర పఠనము కావించెను. పిదప బ్రహ్మదేవుడు నూతన వధూవరులచే ఒకరిపై ఒకరు వనమాలలు ధరింపచేసి, అగ్ని దేవునకు నమస్కరింపజేసి, సుందర సింహాసనము నందు కూర్చొండబెట్టెను. వారు ఇరువురు తమ చేతులు జోడించి మౌనముగ కూర్చొనిరి. అంత పితామహుడు వారిరువురిచే అయిదు మంత్రములు పఠింపచేసి ఎట్లు తన తనయను సుయోగ్యుడయిన వరునకు కన్యాదాన మొనర్చునో అట్లే శ్రీ రాధికాదేవిని శ్రీ కృష్ణునకు అప్పగించెను.

అ సమయమున దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. విధ్యాధరులతో కలసి దేవకాంతలు నృత్యము చేసిరి. గంధర్వులు, విధ్యాధరులు, చారణులు, కిన్నెరులు, మధుర స్వరముతో నూతన వధూవరులపై సుమంగళ గీతములు ఆలపించిరి. వీణ, వేణు, శంఖ, మృదంగ, మురుచుంగ, నాగరా, దుందుభి మరియు కరతాళ ధ్వనులతో ఆ ప్రదేశము మిన్ను ముట్టినది. దేవతా శ్రేష్ఠులందరూ ఆకాశమున నిలబడి ఉచ్ఛస్వరముతో జయజయ ధ్వానములు చేసిరి. అటు పిదప శ్రీహరి బ్రహ్మ దేవునితో ఇట్లనియె "బ్రహ్మదేవా! మీరు మీ ఇచ్ఛానుసారము దక్షిణ గ్రహింపవలసినది". అంత బ్రహ్మదేవుడు "మహాప్రభో! నాకు మీ చరణయుగళి యందు వీడని భక్తిని దక్షిణగా ప్రసాదించవలసినది" అని పలికెను. శ్రీహరి "తథాస్థు" అని అభీష్ఠవరదానము చేసెను.

తదుపరి బ్రహ్మ శ్రీరాధికాదేవి యొక్క మంగళమయ చరణారవిందముల యందు తన శిరసును తాటించి, సాష్టాంగ దండ ప్రమాణము లాచరించి తన నిజధామమునకు చనియెను. ఆ సమయమున ఆయన హృదయము మిక్కిలి హర్షోల్లాసిత మాయెను.

పిదప నూతన దంపతి తమ నికుంజ భవనము నందు ప్రవేశించిరి. శ్రీకృష్ణ భగవానుడు సుమధుర మందహాసము చేయుచూ రాధార్పితమయిన చతుర్విధ పదార్ధములను గ్రహించెను. అట్లే శ్రీరాధాదేవియు శ్రీకృష్ణార్పితమయిన చతుర్విధ పదార్ధములు, మరియు చందన తాంబూలమును స్వీకరించిరి. తదుపరి శ్రీహరి తన ప్రియతమ యొక్క చేతిని తన చేతిలోనికి తీసికొని నికుంజవనము లోనికి చనెను. వారిరువురు మధురాలాపములతో బృందావనము, యమునాతీరము, మరియు లతా విహారములు చూచుచూ ముందుకు సాగిరి. సుందర లతలతో, కొమ్మల మధ్య నవ్వుచూ దోబూచులాడుచున్న శ్రీకృష్ణ భగవానుని పీతాంబరమును వెనుక వచ్చుచున్న రాధాదేవి పట్టుకొనెను. తిరిగి రాధాదేవి శ్రీ కృష్ణుని హస్తకమలమును విడిపించుకొని శ్రీకృష్ణుని కంటె ముందు పరుగెత్తి సాగినది. అంత ఆమె చరణయుగళి నూపురము ల సవ్వడి యమునా తీరము నందలి నికుంజముల యందు ప్రతిధ్వనించినది. అంత కొంత తడవు విశ్రాంతి తీసికొనుటకై కూర్చొని శ్రీహరి మిక్కిలి దగ్గరగ సమీపించిన వెంటనే తిరిగి పరుగెత్తుట ప్రారంభించెను. మేఘము చెంత విద్యుల్లత వలె, తమాలము చెంత సన్నని లత వలె, పర్వతము చెంత సువర్ణ శిఖరము వలె శ్రీరాధాదేవి శ్రీకృష్ణుని చెంత భాసించెను. రాస రంగస్థలము నందు నిర్జన ప్రదేశము చేరి శ్రీహరి రాధా సహితుడై రాసలీల గావించెను.

భ్రమరముల ఘుంకారము, మయూరముల కలకూజితములు, తో నిండిన బృందావనము నందు ఆయన రెండవ

కామదేవుని వలె భాసించెను. సుందర సరోవరములతో నిండి తియ్యని తేనియలొలుకు లతా సమూహములతో నిండిన గోవర్ధన పర్వత సానువులందు పరమాత్ముడయిన శ్రీహరి శ్రీరాధాదేవి తో దివ్య నృత్యము చేసెను. పిదప శ్రీకృష్ణుడు శ్రీరాధా సహితుడై యమునా తరంగము లందు విహరించెను. యమున యందు వికసించిన లక్షదళ పద్మములను శ్రీరాధాదేవి తన చేతిలోనికి తీసికొనెను. అంతలో మాధవుడు ఆ పూవులను అపహరించి పరుగెత్త నారంభించెను. అంత రాధాదేవియు చిరునవ్వుతో మాధవుని వెనుక పరుగెత్తుచూ పరుగెత్తి అయన పీతాంబరమును, మురళిని చేజిక్కించుకొనెను. అంత శ్రీహరి "నా మురళిని ఈయవలసినది" అనగా శ్రీరాధాదేవి "నా పుష్పమును ముందు ఈయవలసినది" అని బదులిచ్చెను.

అంత వారిరువురు ఎవరి వస్తువులు వారికి తిరిగి ఇచ్చి మనోహర యమునా సైకతములందు దివ్య లీలా విలాసము సలిపిరి. తదుపరి వారిరువురు భాండీరవనము ప్రవేశించిరి. నందనందనుడు తన చేతులతో తన ప్రియతమ యొక్క శింగారమెనర్చెను. ఆమె ముఖము నందు చిత్రమయిన పత్రరచన గావించెను. ఆమె పాదములకు లత్తుక అద్దెను. నేత్రములకు కాటుక దిద్దెను. పిదప కురులందు మనోహర పుష్పాలంకరణము సహితము గావించెను. అనంతరము శ్రీరాధాదేవి సహితము శ్రీకృష్ణ దేవుని అలంకరించుటకు సంసిద్ధురాలయ్యెను. అంత శ్రీకృష్ణ ప్రభువు తన యవ్వన రూపమును ఉపసంహరించి బాలకుని రూపము ధరించెను. నందుడు ఎటువంటి బాలకృష్ణుని రాధాదేవి చేతితో పెట్టెనో అట్టి రూపము తిరిగి ధరించి రోదించుట మొదటు పెట్టెను. శ్రీరాధాదేవి సహితము వ్యాకులతయై "ఈ మాయ నాపై ఏల ప్రయోగించితివి?" అని రోదించసాగెను. అంత అశరీరవాణి "శ్రీ రాధా! ఇపుడు ఆలోచింపవలదు. నీ మనోరథము కొంత కాలమయిన పిమ్మట సఫలీకృతమగును". అంత రాధాదేవి శిశురూపధారి అయిన శ్రీకృష్ణుని తీసికొని వ్రజరాజ ధర్మపత్ని అయిన యశోద కడకు ఏగి "మీ పతిదేవులు ఈ బాలకుని నా కప్పగించిరి", అని పలికి బాలకృష్ణుని ఆమె చేతిలో పెట్టెను. అంత యశోద "వృషభాను నందినీ! శ్రీ రాధా! నీవు ధన్యవు. ఎందుకనగా ఆకాశము మేఘావృతమై వనాంతరమున భయ భీతుడయిన ఈ చిన్న బాలకుని నీవు పూర్ణముగ రక్షించితివి". ఈ విధముగ యశోద రాధాదేవిని పరిపరి విధముల ప్రశంశించుచూ సత్కరించినది. అందులకు శ్రీరాధాదేవి మిక్కిలి ఆనందించినదై యశోదాదేవి అనుమతి తీసికొని నెమ్మది నెమ్మదిగా తన గృహమునకు మరలెను.

నారదుడు " మహారాజా! శ్రీ రాధేదేవి యొక్క దివ్య మంగళ గుప్త వివాహ కథను నీకు వినిపించితిని. ఎవరు ఈ ఆఖ్యానమును విన్నా చదివినా, వినిపించినా వారిని పాపములు స్పృశింపవు".

(గర్గసంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి శ్రీరాధాకృష్ణుల పరిణయ ఘట్టమనెడు పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(శ్రీ కృష్ణుని బాల్యలీలల యందు వెన్న దొంగతనము యొక్క వర్ణన)

శ్రీ నారద మహర్షి తిరిగి చెప్పదొడంగెను "మహారాజా! తదనంతరము గౌరశ్యామ వర్ణులయిన బలరామ కృష్ణులు తమ వివిధ లీలలతో నంద భవనమును మరింత ఆకర్షవంతము చేసిరి. వారిరువురు నెమ్మదిగ ప్రాకుట మొదలుపెట్టి, నెమ్మదిగ నడచుచూ చిలుక పలుకులు పలుకుచూ నందవ్రజమంతయు తిరుగ నారంభించిరి. రోహిణీ, యశోదల గారాబముచే నెమ్మదిగ పెరుగుచుండిరి. తమ మాయా ప్రభావము చే త్రిభువనములనూ మోహింపజేయు మహనీయులు శిశురూపములో కాలి గజ్జియలు ఘల్లు ఘల్లు మనుచుండగా అటు నిటు తిరుగాడు చుండిరి. యశోదాదేవి తన గృహ ప్రాంగణమున ధూళి శరీరుడై యున్న శ్రీకృష్ణుని తన ఒడిలోనికి తీసికొని లాలించుచుండెడిది. శ్రీకృష్ణుడు తన

తల్లి నుండి గృహ ప్రాంగణమునకు, ఏగుచూ తిరిగి వచ్చుచూ వ్రజభూమి యందు సింహకిశోరము వలె లీలా విహారము చేయుచుండెను. యశోదాదేవి బాలకృష్ణునకు పీతాంబరము కట్టి, స్వర్ణ హారములు వైచి, శిరసున రత్నమయ కిరీటమును పెట్టి, ఇట్టి భవ్యరూపముతో వెలుగొందు శ్రీకృష్ణ భగవానుని దివ్య రూపమును గని ఆనంద భరితమగు చుండెడిది. అత్యంత సుందరమయిన బాలోచిత క్రీడలయందు తత్పరుడై యున్న బాల ముకుందుని దర్శించుచూ గోపాంగనలు సహితము ముగ్ధులగుచుండిరి. ఈ గోపాంగనలు అందరూ తమ గృహ కర్మములు విడచి నందుని ఇంటికి ఏతెంచి బాలకృష్ణుని లీలలు కాంచుచూ తమను తాము మరచుచుండిరి. నందుని గృహద్వారమునున్న సింహపు ప్రతిమను చూచి శ్రీకృష్ణుడు భయభ్రాంతుడై లోనికి పరుగెత్తు చుండగా యశోద ఆయనను తన రెండు చేతులతో ఎత్తుకొని ముద్దాడి లోనికి తీసికొని వెడుచుండెడిది. ఆ సమయమున గోపాంగనలు ఈ విధముగ పలికెడివారు. "ఓ! శుభాననా! నీ ముద్దుల తనయుని బాలకేళి అత్యంత మనోహరము. ఎవరి దృష్టి అయిననూ తగులగలదు. ఈ బాలుని ఆ ప్రాంగణము నుండి బయటకు తీసికొని రావలదు. ఈతని ఉర్ధ్వ దంతములు మొలువుచున్నవి. ఇది మేనమామకు ద్రోహకరము. అందుచే నీవు విఘ్న నివారణ కు గోవులు, బ్రాహ్మణులు, సాధువులు, మహాత్ములకు దాన ధర్మములు చేయవలసినది". అప్పటి నుండియు యశోద మరియు రోహిణి తమ పుత్రుల కళ్యాణార్థము ప్రతీదినము నూతన అన్న, వస్త్ర, రత్నములు దానము చేయుట మెదలిడిరి. కొలది దినములలో శిశు సింహ, శార్దూలముల వలె బాలరామ కృష్ణులిరువురునూ నడుచుట ప్రారంభించిరి.

అప్పటి నుండి సుబల, శ్రీదామాది వ్రజ బాలకులతో కలసి యమునా నది యొక్క వాలుకా తటమునందు ఈదుచూ, తమాల, కదంబ వృక్ష సహితమయిన యమునా తటములందు విహరించుట ప్రారంభించిరి. శ్రీహరి గోప గోపీ జనమునకు ఆనందము కలిగించుచూ తన సఖులతో కూడి గోపకుల ఇండ్లు చొరబడి వెన్న, నేయి దొంగలించుట ప్రారంభించెను.

ఒకానొక దినము ఉపనంద పత్ని అయిన ప్రభావతి నంద మందిరమున ప్రవేశించి యశోదతో ఇట్లనియె "ఓ! యశోమతీ! ఇంతవరకూ మన ఎవరి ఇండ్ల యందునూ పాలు, పెరుగు, వెన్న, నెయ్యికి కరువు లేదు. నీ కృపా ప్రసాదము చే సర్వులము సుఖముగ యుంటిమి. నీ పాలన యందు ఎంత మాత్రము తప్పులేదు. కానీ నీ బాలకుడు మా ఇండ్ల యందు పాలు, పెరుగు దొంగిలించుచున్నాడు. ఒకనాడు నేను శిక్షింపపోగా నన్ను తిట్టి పారిపోయినాడు. యశోదా! వ్రజ నాయకుని పుత్రుడై ఇట్లు ప్రవర్తించుట పాడిగాదు. నేను మీ గౌరవమును భంగ పరచుటకు ఇట్లు చెప్పుట లేదు". అంత యశోద అత్యంత ఆదరముతో ప్రభావతి తో ఇట్లనియె" సోదరీ! మా యిండ్ల యందు కోట్ల కొలది గోవులు కలవు. ఈ ఇంటి యందు కణకణము గోరసము చే పరిపూర్ణమయినది. ఈ బాలకుడు మీ ఇంటి యందు ఎందుకు పెరుగు దొంగలింప వలెను? మా ఇంటి యందు కూడా ఆ పదార్థములు ఏమియును పూర్తిగ తినడే! నా పుత్రుడు ఎంత వెన్న, పెరుగు దొంగలించెనని నీవు అనుకుంటివో అంతయు మా ఇంటి నుండి తీసికొని వలసినది. నాకు నా పుత్రుని యందు నీ పుత్రుని యందు కొంచెము కూడా పెచ్చు (తేడా) లేదు. కానీ నా పుత్రుని వెన్న దొంగిలించినపుడు నీవు పట్టుకొని నా వద్దకు తెచ్చిన ఎడల వెంటనే వానిని శిక్షింతును, మరియు గృహములో తాడుతో బంధింతును".

యశోదాదేవి యొక్క భాషణము విన్న ప్రభావతి ప్రసన్న హృదయమై తన గృహమునకు చనెను. ఒకానొక దినము శ్రీకృష్ణుడు తన సమవయస్కులయిన బాలకులతో కూడి తిరిగి ప్రభావతి ఇంటిలో చొరబడెను. ఇంటి గోడ వద్ద నిలబడి ఒకరి చేతులు మరొకరు పట్టుకొని జాగ్రత్తగా ఇంటిలోనికి ప్రవేశించిరి. గో క్షీరము ఒక ఉట్టినందు పెట్టబడి అందుట లేదు. శ్రీకృష్ణుడు అచట నున్న ఒక రోలును దగ్గరగా లాగి, గోప బాలకులను అందు నుంచుండబెట్టి వారిపై తానెక్కి అందుకొనుటకు ప్రయత్నించెను. కాని ఉట్టి ఇంకనూ ఎత్తుగా నున్నది. అంత సుబల, సుదాములతో కలసి ఆ భాండముపై ఒక దండము ప్రహరించెను. అంత బలరామ కృష్ణులు, గోప బాలకులు, కోతులతో సహితము ఆ పెరుగంతయు తనివి తీరా త్రాగిరి.

భాండము పగులుటచే వచ్చిన ధ్వని విని ప్రభావతీ దేవి అచ్చటకు ఏతెంచినది. గోప బాలకులందరూ పారిపోయిరి కానీ ఆమె శ్రీకృష్ణుని చేతిని గట్టిగా పట్టుకొనినది. అంత శ్రీకృష్ణుడు మిక్కిలి భయభ్రాంతుడయినట్లు నటించుచూ, మిథ్యా

భాష్పములు రాల్చుట మెదలిడెను. ప్రభావతి అయనను పట్టుకొని నంద భవనమునకు ఏగినది. ఎదురుగ నందరాజు కానబడగా ఆమె తన ముఖమును పమిటితో కప్పికొనినది. నందన భవనమునకు ఏగినది. ఇంతలో శ్రీకృష్ణుడు ఈ విధముగ ఆలోచించెను "ఇపుడు ఈ అవస్థయందు తల్లికి దొరకినచో నాకు శిక్ష అవశ్యము". అంత తన అనంత మాయాశక్తి చే ప్రభావతి పుత్రునిగ రూపాంతరము చెందెను.

కృద్ధురాలైన ప్రభావతి యశోద వద్దకు పోయి "నీ కుమారుడు నా పెరుగు నంతయు తినుటయే కాక భాండమును సహితము బ్రద్దలు కొట్టెను". యశోద ఆమెను చూచి, ఆమె పుత్రుని గాంచి "సోదరీ! ముందు నీ మేలిముసుగు తొలగించి అపుడు బాలకుని తప్పిదము గూర్చి మాట్లాడుము. ఈ విధముగ అబద్ధములు మాట్లాడిన యెడల మా నగరము నుండి బయటకు వెడలవలసినది. నీ పుత్రుని చోరమును నా పుత్రుని యందు ఎట్లు/ఎందుకు ఆరోపించు చున్నావు?".

ప్రభావతి మిక్కిలి సిగ్గుపడి తన మేలి ముసుగు తొలగించి తన పుత్రుని చూచి "అరే! నీ వెప్పుడు వచ్చితివి? నా చేతి యందు వ్రజభూమి సర్వస్వము యుండెను". ఆమె విసవిసలాడుచూ తన బాలకుని చేతిని పట్టుకొని నంద భవనము బయటకు వచ్చెను. నందుడు, యశోద, రోహిణి, బలరాముడు మరియు ఇతన గోప గోపీజనము నవ్వుచూ "అరే! ఏమి చిత్రము? నంద వ్రజమున ఎట్టి అన్యాయము ప్రబలినది?".

అచట భగవానుడు నంద భవనము నుండి బయటకు రాగానే తిరిగి తన యధా రూపము పొంది ప్రభావతిని చూచి నవ్వుచూ, కన్నులు మిటకరించుచూ, ఇట్లనియె "ఓ! గోపీ! మరియొక సారి నన్ను పట్టుకొనుటకు ప్రయత్నించిన యెడల, ఈ సారి నీ భర్త రూపమునకు ధరించెదను. ఇందు సందేహము లేదు". ఇది విన్న గోపిక మిక్కిలి ఆశ్చర్య చకితయై తన గృహమునకు చనెను. ఆ రోజు నుండి గోపికలెవరూ నంద నందనుని పట్టుకొనుటకు సాహసింపలేదు.

(గర్గసంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీకృష్ణుని వెన్న దొంగతనము వర్ణనమను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(నంద, ఉపనంద, వృషభానుల పరిచయము శ్రీకృష్ణుని మృత్తికా భక్షణ లీల)

నారదుడు తిరిగి చెప్పదొడండెను "మిధిలేశ్వరా! నవకుంజ లోచన మనోహరుడు, శ్యామల రూపధారి అయిన శ్రీకృష్ణుడు బాలచంద్రుని వలె పెరుగుచూ, గోకుల లోకుల చిత్తాపహరణము చేయుచూ గోపాంగనల ఇండ్ల యందు వెన్న దొంగతనము అనెడు లీలా విహారము సలుపుచూ వ్రజభూమి అంతయూ తన అత్యద్భుత లీలను విస్తరించు చుండెను. వ్రజభూమి యందు నవనందులు అను గోపకులు నిత్య చంచలుడయిన శ్రీ నంద నందనుని పట్టుకొని తమ ఇండ్లకు తీసికొని పోయి ఆయనకు వివిధ బహుమతులు ప్రధానము చేయుచూ, ఆయన లాలన, పాలన చూచుచూ, ఆయన రూప మాధుర్యమును నిరంతరము గ్రోలుచూ, ఆయన లీలలను నిరంతరము గానము చేయుచూ ఆనందసాగర నిమగ్నులై తమను తాము మరచుచుండిరి. అంత బహుళాశ్వుడు ఇట్లు ప్రశ్నించెను "ఈ ఉపనందులు ఎవరు? వారి నామధేయములు ఏమి? వారి పూర్వజన్మ వృత్తాంతము సర్వమూ నాకు విశద పరచవలసినది. వారేకాక ఉపనందులు మరియు వృషభానుల మంగళమయ వృత్తాంతము సహితము నాకు తెలుపవలసినది".

అంత నారదుడు "గోకులము నందు తొమ్మిది మంది నందులు కలరు. వారు వరుసగా గయ, విమల, శ్రీశ, శ్రీధర, మంగళాయన, మంగళ, రంగోజీ, రంగవల్లీశ, దేవనాయక ప్రభృతులు. గోలోక ధామమందు శ్రీకృష్ణ చంద్రుని నికుంజ ద్వారము నందు వేత్రహస్తులై ప్రహారా కాయు శ్యామ వర్ణాంగ శోభితులు నవ నందులుగ అవతీర్ణులయిరి.

గోకులము నందు తొమ్మిది మంది ఉపనందులు కూడ కలరు. వారు వరుసగా వీతిహోత్ర, అగ్ని భృక్, సాంబ, శ్రీవర, గోపతి, శృత, వ్రజేశ, పావన మరియు శాంతుడు. గోలోకము నందు కోట్ల కొలది ఆవులు కలవు. వాటిని మేపు కాపరులు మురళీధరులై, నెమలి పింఛ ధారులై యుందురు. వారందరునూ ఉపనందులుగ జన్మించిరి.

నికుంజ దుర్గ రక్షణకు ఆరు ద్వారములు వద్ద కాపలా కాయు ఆరుగురు దండ పాశధరులు ఆరుగురు వృషభానులుగ జన్మించిరి. వారు వరుసగా నీతివిత్, మార్గద, శుక్ల, పతంగ, దివ్యవాహన మరియు గోపేష్టులు. శ్రీకృష్ణుని ఇచ్ఛాను సారము వారందరునూ వ్రజభూమికి పయనమయిరి. వీరందరి ప్రభావము తెలుపుటకు చతర్ముఖ బ్రహ్మకు కూడ అశక్యము. నేనేమి చెప్పగలను? ఎవరి ఒడిలో కూర్చొని శ్రీహరి బాల క్రీడా తత్పరుడు అగుచున్నాడో, అట్టివారల అద్భుత సౌభాగ్యమును ఏమని వర్ణింపగలను?"

"ఒకనాటి మాట! వ్రజబాలకులందరూ యమునా తటము నందు ఆడుకొనుచుండిరి. అంత శ్రీ కృష్ణుడు కొంచెము మట్టిని తీసికొని తన నోటి యందుంచుకొనెను. అంత గోప బాలకులు ఆ విషయము యశోదా దేవికి నివేదించిరి. బలభద్రుడు సహితము ఆ విషయము ఒప్పుకొనెను. అంత యశోద కృద్ధురాలై శ్రీకృష్ణునితో "ఓరీ! మూఢమతీ! మట్టిని ఎందుకు తింటివి? నీ సహచరులు, సాక్షాత్ నీ అన్న బలరాముడు వారించినప్పటికీ నీవు మట్టి తినుటకు కారణమేమి?" అంత భగవానుడు "అమ్మా! ఈ వ్రజ బాలకులందరూ అసత్యవాదులు. నేను మట్టిని తినెనన్న మాట అవాస్తవము. నీకు విశ్వాసము లేని ఎడల నా నోరు చూడవలిసినది". అంత యశోదాదేవి ఆ బాలకుని నోరు తెరచి చూసినది "ఎంత ఆశ్చర్యము! అందు ఆమెకు త్రిగుణ విరచితమయిన బ్రహ్మాండమంతయు నలువైపులా విస్తరించి కనబడసాగినది. సప్త ద్వీపములు, సప్త సాగరములు, భారతాది వర్షములు, సుధృఢ పర్వతములు, బ్రహ్మా లోకము వరకు విస్తరించిన మూడు లోకములు, సమస్త వ్రజమండలము, అందు తనను తాను సహితము యశోదాదేవి కాంచెను. ఆమె క్షణ కాలము విస్మితురాలై యమునా తటము నందు కూర్చొండి తనలో తాను ఇట్లు తర్కించుకొనెను. "ఈ బాలుడు సామాన్యుడు కాడు. సాక్షాత్ శ్రీమన్నారాయణుడు". ఈ విధముగ జ్ఞాన నిష్ఠయందు నిమగ్నురాలైయుండెను. అంతలో శ్రీకృష్ణుడు తన మహామాయచే ఆమెను తిరిగి మోహింపజేసెను. ఆమె కాంచిన శ్రీకృష్ణ వైభవము నంతయు మరచి తిరిగి యధాప్రకారము గోపవనిత వలె ప్రవర్తిల్లెను.

(గర్గసంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి బ్రహ్మాండ దర్శనమనెడి పద్ధెనిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(దామోదర కృష్ణుని ఉలూఖ లబంధన మరియు యమలార్జున వృక్ష ఉద్ధరణ)

ఒకనాడు గోపాంగనలు అందరూ తను గృహములందు శ్రీకృష్ణ లీలలు గానము చేయుచూ ఉదయమున దధిమంధనము (పెరుగు చిలుకుట) అను కార్యక్రమము నందు నిమగ్నులయిరి. నందమందిరము నందు సుందరి అయిన యశోదాదేవి సహితము ఉదయమే లేచి, పెరుగుకుండ యందు కవ్వము వైచి, చిలుకుట ప్రారంభించెను. ఆ ధ్వని విన్న బాలముకుందుడు నవనీతము నందు కౌతూహలుడై, మంజీరములు ఘల్లుఘల్లుమని మృదు మధురముగ శబ్దము చేయుచుండగా ముందుకు వెనుకకు ఆడుచూ, తిరిగి తిరిగి తల్లిని చేరుచూ అప్పుడే తీయబడిన వెన్న తినుటకు తల్లిని అభ్యర్థించెను. తల్లి అందుకు నిరాకరించగా కుపితుడై దగ్గరగ యున్న రాయిని తీసికొని తల్లి చిలుకుచున్న పెరుగు భాండమును కొట్టెను. అంత భాండము బ్రద్దలయినది. అదిచూచి కృష్ణుడు పరుగెత్త నారంభించెను. ఆయన వెనుక యశోద పరుగెత్తసాగినది. ఆయన ఎప్పుడూ ఒక్క అంగ ముందు యుండెను, కానీ తల్లికి చిక్కకుండెను. ఎవరు

యోగీశ్వరులకు సహితము దక్కడో అట్టి భగవానుని తల్లి ఎట్లు పట్టుకొన గలదు? కానీ భగవంతుడు భక్త వశ్యుడు. అందుచే తనకు తానుగా తల్లికి చిక్కెను. అత్తరి యశోద అగ్రహోదగ్రురాలై కవ్వపుతాళ్ళచే బంధించుటకు ప్రయత్నించెను. ఆమె ఎన్ని త్రాళ్ళు తెచ్చిననూ అవి అన్నియు చిన్నవి అగుచున్నది. ఎవరు ప్రకృతి యొక్క గుణములకు బందీకృతులవరో, అట్టి ప్రకృతికి పరుడయిన పరమాత్మను గుణములచే/త్రాళ్ళచే ఎవరు బందీకృతుని గావించగలరు? ఇట్లు యశోద శ్రీకృష్ణుని కట్టలేకడస్సిపోయి, హతోత్సాహియై, బంధించుట మాని చేష్టలుడిగి కూర్చుండినది. అంత తల్లిపై కృప కలిగి శ్రీకృష్ణ భగవానుడు తనంత తాను తల్లి యొక్క బంధనము లోనికి వచ్చి రోటికి కట్టబడెను. భగవానుని ఇటువంటి కృప కర్మత్యాగులయిన జ్ఞానులకు సహితము లభించదు. ఇక కర్మ లంపటుల విషయము చెప్పనవసరము లేదు. కానీ ఇది కేవలము భక్తి యొక్క ప్రతాపము. కేవలము ఒక్క గోపవనిత యొక్క భక్తి తత్పరతకు భగవానుడు సహితము బందీ కావలసి వచ్చెను. అందుచే జ్ఞానయోగులకు సహితము భగవానుడు ముక్తి ప్రసాదించెను. కానీ భక్తిని ప్రసాదించడు. ఆ సమయము నందు అనేక గోపాంగనలు అచటకు ఏతెంచి, బ్రద్దలయిన భాండమును, త్రాళ్ళతో కట్టబడి భయభీతుడయిన బాల ముకుందుని చూచి దయార్ద్ర హృదయులై యశోదాదేవితో ఇట్లనిరి.

"ఓ! నందరాణీ! ఈ నీ బాలుడు మాయిండ్లయందు చొరబడి పాలు, పెరుగు కుండలు బ్రద్దలు కొట్టుట సామాన్యము. కానీ కరుణావశమున మేము ఎల్లప్పుడు ఈ బాలుని ముట్టుకొనలేదు. ఓ! వ్రజేశ్వరీ! నీవు ఎంత నిర్దయవు? నీ హృదయము నందు కొంచెము కూడా బాధలేదు. కేవలము ఒక్క కుండ పగలకొట్టిన మాత్రమున ఈ బాలుని త్రాళ్ళతో కట్టి భయపెట్టు చుంటివే? "

గోపిక భాషణము విన్న వ్రజేశ్వరి ఏమియు బదులీయక తన గృహ కార్యాముల యందు నిమగ్నమయ్యెను. నెమ్మదిగ కృష్ణుడు సందు చూసుకొని, గోప బాలకులతో కలసి రోటిని లాగుచూ యమునా తటమునకు ఏగెను. అచట అత్యంత ప్రాచీనమయిన రెండు అర్జున వృక్షములు ఒకదానికొకటి మిక్కిలి దగ్గర యున్నవి. శ్రీకృష్ణుడు మందహాసము చేయుచూ ఆ వృక్షముల మధ్యకు ఏగెను. కానీ రోలు కొంచెము పెద్దదగుటచే రెండు వృక్షముల మధ్య ఇరుకునపడెను. అంత శ్రీకృష్ణుడు బలముగ లాగగా రెండు వృక్షములు వ్రేళ్ళతో సహితము పెకలింపబడి, క్రిందపడి వజ్రపాతము వంటి ధ్వని వ్రజభూమి అంతయు వ్యాపించెను.

ఆ వృక్షముల నుండి ఇరువురు దివ్య పురుషులు ఉదయించి దామోదరునకు ప్రదక్షిణ గావించి, సాష్టాంగ దండ ప్రణామములాచరించి ఇట్లనిరి "అచ్యుతా! మీ దర్శన భాగ్యముచే ఈ క్షణమే మాకు ఈ బ్రహ్మాండము నుండి విముక్తి లభించినది. హరీ! మేము ఎన్నడునూ మీ భక్తులను అవహేళన చేయరాదు. మీరు కరుణానిధి. జగత్తుకు మంగళము చేయుట మీ స్వభావము. దామోదరుడు, కృష్ణుడు, గోవిందుడు అయిన మీకు పరిపరి విధముల నమస్కృతులు. ఇట్లు పలికి ఆ దివ్య పురుషులు ఉత్తర దిశగా పయనించిరి. ఇంతలో నందాది సమస్త వ్రజవాసులు అక్కడకు ఏతెంచి వ్రజ బాలకులను ఇట్లు ప్రశ్నించిరి "గాలి, వాన లేకుండా ఈ వృక్షములు ఎట్లు పడిపోయినవి?" అంత బాలకులు "శ్రీకృష్ణుడు ఈ చెట్లను పడగొట్టెను. వాటి నుండి దీప్తి మంతులయిన ఇరువురు దేవతా మూర్తులు ఉదయించి శ్రీకృష్ణునికి నమస్కరించి ఇప్పుడే ఉత్తరదిశ వైపు వెడలిరి". వ్రజబాలకుల పలుకులు పెద్దలు ఎవరునూ విశ్వశించలేదు. అంత నందుడు శ్రీకృష్ణుని రోటి నుండి విడిపించి, మిక్కిలి గారాబము తో లాలించి, ఒడిలోనికి తీసికొనెను. ఆయన తన పత్నిని మిక్కిలి నిందించి, బ్రాహ్మణులకు వంద గోవులను దానముగ సమర్పించెను.

బహుళాశ్వుడు ప్రశ్నించెను "దేవర్షీ! ఆ దివ్య పురుషులు ఎవరు? యమలార్జున వృక్షములుగ వారు ఎందుకు జన్మింప వలసినది! దయచేసి వివరింపవలసినది."

నారదుడు "ఓ! రాజా! వారిరువురు కుబేర పుత్రులు. నలకూబరుడు మరియు మణిగ్రీవుడు. ఒకనాడు వారిరువురు నందన వనము నందు మందాకినీ తీరమునకు ఏగిరి. వారి చుట్టూ అప్సర స్త్రీలు చేరి గుణగానము చేయుచుండిరి. వారు మదిరాపానమత్తులై, దిగంబరులైయుండిరి. వారు ఒక ప్రక్క యవ్వన మదము, మరియొక ప్రక్క ధనమదము నందు పూర్తిగా మునిగి మదిరాపాన ఉన్మత్తులై యుండిరి. అపుడు అచటకు వేద వేదాంగ పారంగతుడు, మహా విద్వాంసుడు

అయిన "దేవల" మహర్షి ఏతెంచెను. ఆయన నగ్నముగ యున్న కుబేర పుత్రులను చూచి "మీరు ఇరువురు బుద్ధిని కోల్పోయి దుష్ఠ స్వభావము తో యున్నారు. వృక్షములతో సమానమయిన జడత్వము, లజ్జా విహీనత మీ యందు కోకొల్లలుగా యున్నది. మీకు ఐశ్వర్యమదము మిక్కుటముగ యున్నది. అందుచే మీరిరువురు వంద దివ్య సంవత్సరములు వృక్షములు గ యుండవలిసినది. ద్వాపరాంతమున భారత వర్షమునందు మధురా జనపద మందలి వ్రజమండలములో కళిందనందినీ యమునా తీరమున సాక్షాత్ గోలోక ధాముడయిన శ్రీ కృష్ణ భగవానుని దివ్య దర్శనమయిన పిమ్మట మీకు పూర్వ స్మృతి కలిగి తిరిగి మీ నిజధామమును చేరెదరు." ఇట్లు దేవల మహర్షి శాపముచే వృక్షములయిన నలకూబర, మణిగ్రీవులను శ్రీకృష్ణ ప్రభువు ఉద్ధరించెను.

(గర్గసంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి ఉలూఖలబంధనము, యమలార్జున మోచనము అను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(దుర్వాస ముని ద్వారా భగవానుని మాయ లేక గోలోక శ్రీకృష్ణుని దర్శనము మరియు నందనందనుని స్తోత్రము)

ఒకానొక దినము ముని శ్రేష్ఠుడయిన దుర్వాస మహాముని పరమాత్ముడయిన శ్రీకృష్ణ చంద్రుని దర్శనార్థము వ్రజభూమికి ఏతెంచెను. ఆయన కాళింది సమీపమున, మహావన మధ్యమున పవిత్ర వాకులామయ రమణీయ సైకత స్థలమందు శ్రీకృష్ణ ప్రభువును దగ్గర నుండి చూచెను. అచట మదన గోపాలుడు గోపాల బాలురతో ఆడుచూ, మల్ల యుద్ధము చేయుచూ, తిరిగి తిరిగి బాల్యక్రీడలు సలుపు చుండెను. ఆయన అంగములన్నియు ధూళిసరితములయినవి. మస్తకము పై ఉంగరములు తిరిగిన కురులు, ముద్దు గొలుపు చుండగా దిగంబరుడై గోపబాలకుల వెంట పరుగెడుచున్న శ్రీహరి ని చూచి దుర్వాసముని మహావిస్మితుడై మనమున ఇట్లు తలపోసెను. "ఏమీ! షడ్విధ ఐశ్వర్య సంపన్నుడయిన ఈశ్వరు డీతడేనా? అయిన ఎడల ఈ బాలకులతో ఎట్లు ఆడుచుండెను? నా ఉద్దేశ్యము ప్రకారము ఈతడు కేవలము నందనందనుడు. పరాత్పరుడయిన ఈశ్వరుడు కాడు. కానేరడు.

ఇట్లు దుర్వాస మహాముని మోహమున మునుగగా, ఆడుకొనుచున్న శ్రీకృష్ణుడు నడచి వచ్చి ఆయన ఒడిలో కూర్చొండెను. ఆ సమయమున శ్రీకృష్ణమూర్తి బాలసింగము వలె యుండెను. ఆయన చిన్నగా మందహాసము చేయుచూ మునీశ్వరుని తో మృదు మధురముయిన పలుకులు పలుకుచుండెను. అవి వినుచూ, తదేక దృష్టితో చూచుచున్న దుర్వాస మహాముని శ్రీకృష్ణుని ఉచ్వాసము తో ఆయన ముఖ మండలమున ప్రవేశించెను. అచట ముని ఒక విశాల లోకము చూడ నారంభించెను. అందు గొప్ప అరణ్యములు, మరియు నిర్జన ప్రదేశములు కలువు. ముని అరణ్యము నందు తిరుగుచూ "నేను ఇచటకు ఎట్లు ఏతెంచితిని?" అని తలపోయి నంతలో ఆయన ఒక కొండచిలువ చే మ్రింగబడెను. ఆ అజగరము యొక్క ఉదరము నందు సప్తలోకములు, పాతాళము మరియు బ్రహ్మాండము సర్వమూ దర్శనమయినది. మునీశ్వరుడు ఆద్వీపము లందు తిరుగుచూ, ఒక శ్వేత పర్వతము చేరెను. అందు ఒక శక కోటి సంవత్సరములు భగవానుని భజన, తపములచే పూజింపసాగెను. ఇంతలో సర్వజగత్తుకు నైమిత్తిక ప్రళయము ఆసన్నమయినది. సముద్ర జలములు ఘూర్ణిల్లుచూ, సమస్త భూమిని ముంచెత్త సాగినది. దుర్వాస ముని ఆ జలముల యందు పడి మునుగుచూ, తేలసాగెను. ఆ జలములకు అంతము లేదు.

ఇట్లు వేయి యుగములు గడచినవి. తదనంతరము దుర్వాసముని జలముల యందు పడి స్మృతిని

కోల్పోయెను. అంత ఆయనకు ఆ మహార్ణవము నందు మరియొక బ్రహ్మాండము కానబడెను. దాని ఛిద్రము గుండా ఆయన ఆ బ్రహ్మాండము నందు ప్రవేశించి, మరియొక దివ్య సృష్టి. చూడనారంభించెను. ఆ బ్రహ్మాండము యొక్క శిరోభాగమున దీప్తివంతమయిన లోకములందు ఒక బ్రహ్మ ఆయువు పర్యంతము తిరుగసాగెను. అంత ఆయనకు ఆ బ్రహ్మాండము యొక్క ఛిద్రము కానబడెను. ఆయన శ్రీహరి స్మరణ చేయుచూ ఆ ఛిద్రము గుండా బయటకు వచ్చి తిరిగి అనంత జలరాశిని గాంచెను. ఆ జలరాశి యందు ఆయనకు అనంత కోటి బ్రహ్మాండముల యొక్క రాశులు కనబడెను. అంతట ముని ఆ జలరాశిని పరీక్షించి చూడగా ఆయనకు విరజానది దర్శనము ఆయెను. ఆయన ఆ నది యందు ప్రవేశించి సాక్షాత్ గోలోకము చేరెను. ఆయనకు క్రమముగ బృందావనము, గోవర్ధనము మరియు సుందర యమునా తీరము కనబడి మిక్కిలి హృదయ ప్రసన్నత పొందెను. అంతట ముని నికుంజమున ప్రవేశించి లక్షదళ పద్మము నందు విరాజమానుడయిన సంపూర్ణ భగవానుడు, పురుషోత్తముడు, రాధావల్లభుడు, సాక్షాత్ శ్రీకృష్ణుని కాంచెను. ఆ తరి భగవానుడు అసంఖ్యాక గోప గోపీజన పరివేష్ఠితుడై, కోట్ల గోవుల సహితుడై యుండెను. అంత మునీశ్వరునకు అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి అయిన శ్రీకృష్ణ ప్రభువేకాక గోలోక దర్శన మంతయు కలిగినది.

ఆ మునీశ్వరుని చూచి శ్రీకృష్ణుడు నవ్వుట ప్రారంభించెను. ఆయన అట్లు నవ్వుచుండగా ఆయన నిశ్వాసము తో పాటు దుర్వాస ముని బయల్వెడలెను. తక్షణమే తిరిగి ముని బాలరూపధారి అయిన నంద నందనుని యమునా తటమున తిరిగి కాంచెను. మహా వనాంతరాళమున ఈ విధముగ ధూళి శరీరుడై, దిగంబరుడై, గోప బాలురతో బాల్యక్రీడలు సలుపుతున్న శ్రీ కృష్ణుని సాక్షాత్ పరాత్పర పరమాత్మగా దుర్వాస ముని గ్రహించెను. అంత ముని బాలకృష్ణునికి తిరిగి తిరిగి సాష్టాంగ దండ ప్రమాణము లాచరించి, చేతులు జోడించి ఇట్లు పలికెను "స్వామీ! ఎవరి నయనములు నూత్న వికసిత శతదళ పద్మములను పోలియున్నవో, ఎవరి అధరములు దొండ పండ్ల యొక్క అరుణిమను తిరస్కరించునో, ఎవరి అంగములు జలధర నీలిమేఘ కాంతితో మెరయుచున్నవో, ఎవని ముఖము నందు ఆరని చిరు మందహాసము ప్రకాశించుచుండునో, ఎవరు ఎల్లప్పుడూ సుందర మందగతితో నడుచు చుండునో, అట్టి బాల్యా వస్థయందు విలసితమయిన మనోజ్ఞ నంద నందనునికి మనసు యందు ప్రణామములు ఆచరించుచున్నాను. ఎవని శ్రీ చరణములయందు నూపుర మంజీరములు దివ్య శబ్దముతో ధ్వనించు చుండునో, ఎవని నడుమున నూత్నరత్నమయ వడ్డాణము భాసించుచుండునో, అట్టి దివ్య సుందర బాల ముకుందునికి ప్రణామము లాచరించుచున్నాను.

ఎవని కంఠము హారములచే సుశోభితమై యుండునో, ఎవరి నుదిటియందు దృష్టిదోషము తీయు కాటుక బొట్టు పెట్టబడి యుండునో, వీటితో పాటు కాళింది నందినీ తటమునందు బాలోచిత క్రీడల యందు నిమగ్నమై యుండునో, అట్టి శ్రీహరికి వందనము చేయుచున్నాను. ఎవని పూర్ణచంద్ర ముఖార విందముపై కారు మబ్బులు నలుపును తిరస్కరించు సుందర మంగురుల అలుకలు అటునిటు ఆడు చుండునో, అటువంటి నందనందనునకు, ఆయన అగ్రజుడయిన బలరామునకు, నేను తిరిగి, తిరిగి నమస్కరించుచున్నాను. ఎవరు ప్రాత: కాలమున లేచి ఈ నంద నందనుని స్తోత్రమును పఠించెదరో వారి నేత్రముల సమక్షమున శ్రీ నందనందనుడు సానందముగ ప్రకటమగును. ఈ విధముగ శ్రీకృష్ణునికి అనేక ప్రణామములు సమర్పించి, ధ్యానతపములు ఆచరించుచూ, ముని శిరోమణి అయిన దుర్వాస ఋషి ఉత్తరమున బదరికాశ్రమము వైపు నడక సాగించెను.

గర్గాచార్యుడు "శౌనకా! ఈ విధముగ దేవర్షి ప్రవరుడయిన నారదుడు, బుద్ధి మంతుడయిన బహుళాశ్వ మహారాజునకు శ్రీకృష్ణ చరిత్ర వినిపించెను. అది అంతయు నేను నీకు వివరించితిని. భగవానుని సుయశస్సు కలి కలుష వినాశిని, మరియు ధర్మార్ధ, కామ మోక్షము లనెడు చతుర్విధ పురుషార్ధములను ప్రసాదించు దివ్యఖని. నీవు ఇంకనూ ఏమి వినదలచు కొంటివి? శౌనకుడు "తపోధనా! తదుపరి మిధిలానరేశుడు శాంతస్వరూపుడు, జ్ఞానప్రదాత అయిన మహాముని నారదుని ఏమని ప్రశ్నించెను? ఆ ప్రసంగమంతయు నాకు వివరింప వలసినది. గర్గాచార్యుడు ఇట్లు

పలికెను "బహుళాశ్వుడు నారదునికి తిరిగి నమస్కరించి ఇట్లనియె "ప్రభో! పరమానంద విగ్రహుడయిన శ్రీకృష్ణ భగవానుడు తిరిగి ఏ విచిత్ర లీలలను గావించెను?" నారదుడు "రాజా! నీ యందు అత్యంత సాధు స్వభావము కలదు. ఎందుకనగా నీవు శ్రీహరి యొక్క మంగళమయ అవతారముల యొక్క విశేషముల గూర్చి ప్రశ్నించితివి. బృందావనము నందు ఆయన చేసిన వివిధ, విచిత్ర, యశోవర్ధక క్రీడలను నేను అభివర్ణించెదను.

ఈ గోలోక ఖండము పరామద్భుతము మరియు అత్యంత గోప నీయము.గోలోకము నందలి రాసమండల మందు సాక్షాత్ శ్రీకృష్ణుడు వీటిని వర్ణించెను. నికుంజము నందు ఆయన స్వయముగ శ్రీ రాధాదేవికి వినిపించెను. శ్రీ రాధాదేవి నాకు (నారదునకు) ఆ జ్ఞాన ప్రసాదము గావించెను. నేను నీకు పూర్తిగా అది వినిపించితిని. ఆ గోలోక ఖండ వృత్తాంతము సంపూర్ణ మనోరథములను ఈడేర్చు ఉత్కృష్ట సాధనము.

బ్రాహ్మణుడు దీనిని పఠించెనేని సంపూర్ణ శాస్త్రార్థము ల యందు జ్ఞాత అగును. క్షత్రియుడు పఠించెనేని ప్రచండ పరాక్రమవంతుడయిన చక్రవర్తి అగును. వైశ్యుడు అద్భుత నిధిపతియు, శూద్రుడు సంసార బంధ విముక్తుడు అగును. ఎవరు జగద్విషయ వాసనా రహితముగ చదివిన యెడల వారు జీవన్ముక్తులు అగుదురు. ఎవరు నింతర భక్తి భావము చే నిత్యము పఠించు చుందురో వారు ప్రకృతికి పరమయిన శ్రీకృష్ణ చంద్రుని దివ్య గోలోక ధామము చేరుట తథ్యము.

(గర్గ సంహిత యందలి గోలోక ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి దుర్వాస ఋషి ద్వారా భగవానుని మాయా దర్శనము, మరియు నందనందన స్తోత్ర వర్ణనము అనెడు ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

గోలోక ఖండము సమాప్తము

బృందావన ఖండము

ఒకటవ అధ్యాయము

(సన్నందుదు గోపాలురతో మహావనము నుండి బృందావనమును చేరి నివసించుటకు సమ్మతిని కోరుట, సన్నందుని చే బృందావన మాహాత్మ్య వర్ణన)

కోకిలలు, క్రీడాశుకములు విహరించు యమునా తటము నందు కొమ్మ కొమ్మకు విరబూసిన పారిజాతములు మరియు ఇతర దేవతా పుష్పముల తో నిండిన పుష్ప సానువుల యందు శంఖము వంటి సుందర గ్రీవులు మరియు ఒకరినొకరు పెనవేసికొని విహరించు శ్రీ రాధాకృష్ణులు నన్ను రక్షించుగాక!

అజ్ఞానమనెడు రేచీకటిచే అంధుడనైన నన్ను ఎవరు జ్ఞానరూప అంజనమును నా కళ్ళకు రాసి నా దృష్టిని స్పష్టమొనర్చెనో అట్టి గురుదేవునకు నమస్కరించు చున్నాను.

నారదుడు చెప్పదొడంగెను "మహారాజా! ఒకనాటి మాట! వ్రజభూమి యందు వివిధ ఉత్పాతములు కనులారా జూచి నందరాజు తన సహాయకులయిన నంద, ఉపనంద, వృషభాను, వృషభానువరులను మరియు ఇతర గోపకుల వృద్ధులను సమాశ్వాశించి ఇట్లు పలికెను "గోప గణములారా! మహావనము నందు అనేక ఉత్పాతములు కలుగుచున్నవి. మనకు ఇపుడు తక్షణ కర్తవ్యమేమి? ఆ సభయందు మిక్కిలి బుద్ధి కుశలుడు, వృద్ధుడు అయిన సన్నందుదు బలరామ, కృష్ణులను తన ఒడి లోనికి తీసికొని నందుని తో ఇట్లనియె. "నందరాజా! నీ తనయుడయిన ఈ బాలకృష్ణుడు మా కందరకు ప్రాణసముడు. వ్రజవాసుల జీవిత పరమార్ధము. వ్రజము యొక్క ధనము, మరియు గోకులము యొక్క దీపము. మనమందరము మన సామాగ్రి అంతయు తీసికొని ఈ మహావనమును విడచి ఉత్పాతములు సహితము సమీపించని ఒక ప్రదేశము చేరి అచట నివసించుట ప్రారంభించవలెను. ఈ బాలుడు తన బాలలీలలచే సర్వమును మోహింపజేయు విశ్వమోహనుడు. ఎంత దురదృష్టకరము! ఇట్టి చిన్నారి బాలునిపై పూతన, శకటాసురుడు, మరియు తృణావర్తుడు చంపుటకు యత్నించిరి. నిన్నగాక మొన్న రెండు పెను వృక్షములు మీద పడినవి. వీటిని మించిన ఉత్పాతములు ఏమి యుండును? అందుచే మనము అందరమూ, మన కుటుంబము, పిల్లలతో కలసి బృందావనమునకు పోయి నివసించెను. ఉత్పాతములన్నియు శాంతించిన పిదప తిరిగి మన ఇండ్లకు తిరిగి వచ్చెదము."

నందుడు "బుద్ధిమంతులయందు శ్రేష్ఠుడవయిన సన్నందా? మహాత్మా! మన వ్రజభూమి నుండి బృందావనము ఎంత దూరము? బృందావనము యొక్క వైశాల్యమెంత? దాని లక్షణములు ఏవి? ఆ ప్రదేశము నందు ఇంకా ఏమేమి సుఖసౌలభ్యములు యున్నవి? ఇవి అన్నియును వివరింప వలసినది."

సన్నందుడు "బహిషత్ పురమునకు ఈశాన్యము, యదు పురమునకు దక్షిణము, శోణ పురమునకు పశ్చిమముగనూ యున్న భాభాగము "మధురామండలము" గ పేర్కొనబడినది. ఆ మధురా మండలము నందు ఇరువది అయిదు యోజనముల విస్తీర్ణముతో "దివ్య మధురామండలము" లేక "వ్రజభూమి" గ పేరుగాంచినది. నేను ఒక పర్యాయము మధురాపురమున వసుదేవుని ఇంట బసచేయవలసి వచ్చెను. అత్తరి శ్రీ గర్గాచార్యుల ముఖతా తీర్ధ రాజమయిన ప్రయాగ సహితము ఈ వ్రజమండలమును పూజించెను, అని వింటిని. మధురా మండలము నందు అనేక వనములు కలవు. కానీ వాటన్నింటికీ తలమానికము శ్రేష్ఠ బృందావనము. ఈ వనము పరిపూర్ణతమ భగవానుని మనమును సహితము హరింపగల సుందర లీలా క్రీడా స్థలము. వైకుంఠమును మించిన స్థలము ఉండరు. ఉండబోదు. కానీ బృందావనము ఎట్టిదనిన అట్టి వైకుంఠము సహితము అపేక్షించునట్టిది. అచట గోవర్ధనమను గిరిరాజము విరాజిల్లుచున్నది. అక్కడ కాళిందీ తటము యొక్క సుందర తీరము నందు మంగళ కరమయిన ఇసుకతిన్నెలు కలవు. అచట బృహత్సాను (బరసాన) పర్వతము ప్రకాశించు చున్నది. అచట నలుబది క్రోసుల విస్తీర్ణముతో నందీశ్వర గిరి తన చుట్టూ విశాలమయిన అరణ్యముతో పరివేష్టితమై శోభించుచున్నది. పశువులకు హితకరము, గోపగోపీ జనములకు నివాస యోగ్యము, లతా కుంజపరివృతము ఈ బృందావనము.

నందుడు "మహాత్మా! సన్నందా! తీర్థరాజమయిన ప్రయాగ ఎప్పుడు ప్రజభూమికి పూజ సలిపినది? ఇది వినుటకు నా మనసు మిక్కిలి కుతూహలము మరియు ఉత్కంఠ పొందుచున్నది". అంత సన్నందుడు "నందరాజా! పూర్వకాలము నందు ఒకానొక నైమిత్తిక ప్రళయము ఆవిర్భవించిన వేళ "శంఖాసురుడు" అను రాక్షసుడు ఉద్భవించెను. ఆ దేశద్రోహి అయిన రాక్షసరాజు సురలందరినీ జయించి, బ్రహ్మలోకమునకు ఏగి నిదురించుచున్న బ్రహ్మదేవుని వద్దనుండి వేదములు అపహరించి సముద్రమున మునిగెను. వేదములు తస్కరింపబడిన మరుక్షణము దేవతల సర్వబలములు ఉడిగెను.

అపుడు యజ్ఞేశ్వరుడయిన శ్రీహరి మత్స్యావతారమును ఎత్తి, నైమిత్తిక ప్రళయ జలముల యందు ప్రవేశించి శంఖాసురునితో యుద్ధము నొనరించెను. మహాబలి అయిన శంఖుడు శ్రీహరిపై శూలము విసిరెను. చక్రి తన చక్రముతో ఆ శూలమును తుత్తునియలు గావించెను. శంఖుడు తన శిరముతో శ్రీహరి యొక్క వక్షమును తాడించెను. కానీ ఆ తాకిడికి విష్ణువు చలింపలేదు. మత్స్యరూప ధారి అయిన శ్రీహరి తన చేతిలోనికి ఒక గద తీసికొని శంఖరూపధారి అయిన దైత్యుని పై ప్రయోగించెను. ఆ గదా ఘాతముచే దైత్యుడు మిక్కిలి విచలితుడై చిత్తవ్యాకులత్వము పొందెను. తుదకు ఎట్టకేలకు శక్తిని తెచ్చుకొని శ్రీహరిని ముష్టిఘాతము తో ప్రహరించెను. అంత కమలనయనుడయిన భగవానుడు నారాయణుడు కుపితుడై చక్రముతో దానవుని మస్తకమును మెడతో సహా ఖండించెను. ఇట్లు దానవుని సంహరించి దేవతా సహితుడై శ్రీహరి ప్రయాగకు ఏతెంచి నాలుగు వేదములను తిరిగి బ్రహ్మదేవునకు సమర్పించెను. పిదప సమస్త దేవతలతో సహా ఒక మహాయజ్ఞమును విధివిధానముగ ఆచరించి ప్రయాగ తీర్థము యొక్క అధిష్ఠాన దేవతను ఆహ్వానించి ఆయనను "తీర్థరాజు" పదవి యందు అభిషిక్తుని గావించెను. సాక్షాత్ కల్పవృక్షము ఆ తీర్థరాజమునకు ఛత్రమై నిలచెను. ముని కన్య అయిన గంగ, సూర్యపుత్రి అయిన యమున తమ తరంగ రూప చామరములతో ఆయనకు విసరసాగెను. ఆ సమయము నందు జంబూద్వీపము నందలి తీర్థములన్నియు బుద్ధిమంతుడయిన తీర్థరాజము ప్రయాగకు వివిధ బహుమతులు ఒసగి పూజా వందనములు వొనర్చి, యధాస్థానములకు వెడలినవి. అంత దేవతా సహితుడై శ్రీహరి అంతర్హితుడాయెను.

అంత అచ్చోటికి కలహ ప్రియుడయిన నారద మహర్షి సింహాసనము పై దేదీప్యమానముగ వెలుగుచున్న తీర్థరాజము దగ్గరకు ఏతెంచెను. నారద మహర్షి "మహాతపస్వీ! తీర్థరాజా! నిశ్చయముగ నీవు సమస్త తీర్థములచే విశేషముగ పూజింపబడితివి. నీకు తీర్థములన్నియు బహుమతులు సమర్పించినవి. కానీ వ్రజభూమి నందలి బృందావన తీర్థము ఇక్కడకు రాలేదు. నీవు తీర్థముల యొక్క రాజాధిరాజువు. కానీ వ్రజమందలి నిర్లక్ష్య తీర్థములు నిన్ను దర్శించుట కు రాకుండుట, నిన్ను తిరస్కరించుట అగుచున్నది, అని పలికి నారదుడు వెడలిపోయెను. ఇది తీర్థరాజమునకు అవమానకరమై మిక్కిలి కోపించి ఆ క్షణమే వైకుంఠము చేరి శ్రీహరికి ప్రణమిల్లి, ప్రదక్షిణము గావించి, చేతులు జోడించి, ఎదుట నిలిచి శ్రీనాధునితో ఇట్లనియె "దేవ దేవా! మీరు నన్ను తీర్థరాజము చేసిరి. అందుచే సమస్త తీర్థములు నాకు బహుమతులు సమర్పించినవి. కానీ వ్రజతీర్థములు నన్ను నిర్లక్ష్యము చేసినవి. ఈ విషయము మీతో విన్నవించుటకై మీ మందిరమునకు ఏతెంచితిని".

అంత భగవానుడు తీర్థరాజా! నేను నిన్ను భూతలము నందలి తీర్థములకు రాజును చేసితిని. కానీ మధురామండలము నా పరాత్పర ధామము. ఆ దివ్యధామము ప్రళయకాలము నందు సహితము నశింపదు. నా శుభ వచనములు వినుము". అంత తీర్థరాజము మిక్కిలి విస్మితమై తన అహంకారమును, దురభిమానమును విడచి, వైకుంఠము నుండి మధురామండల మేతెంచి, వ్రజ మండలమును పూజించి తిరిగి తన యదార్థస్థలమునకు చనెను. పృథివి యొక్క గర్వభంగ మునకై మొట్టమొదట వ్రజభూమి ప్రకటిత మయినది." సన్నందుడు ఇంతవరకు పలికి నందునితో "ఇంకా ఏమి వినదలచుకుంటివో తెలుపవలసినది" అని పలికెను.

నందుడు "గోపేశ్వరా! ఎవరు పృథివీ గర్వభంగమునకు వ్రజభూమిని చూపించిరి? ఆ వృత్తాంతమును దయచేసి తెలుపవలసినది". సన్నందుడు "ఈ శ్వేత వరాహ కల్పమందు మెదట శ్రీహరి వరాహరూపము ధరించి తన కోరలతో భూమిని రసాతలము నుండి పైకెత్తి ఉద్ధరించెను. ఆ సమయమునందు శ్రీహరి వరాహరూపమునందు మిక్కిలి శోభించుచుండెను. జలముల యందు పయనించుచున్న వరాహరూపధారి, భగవానుడు, రమానాధుడు, జనార్ధనుని

దంష్ట్రల శిరోభాగమున శోభించుచున్న పృధివి భగవానునితో ఇట్లనియె "ప్రభూ! విశ్వమంతయు జలములతో నిండియున్నది. మీరు నన్ను ఎక్కడ/ఏ స్థలమందు స్థాపించనున్నారు?" అంత భగవానుడు "ఎక్కడ నీకు వృక్షములు దర్శనమగునో, ఎక్కడ జలముల ఉద్వేగ మడగునో అక్కడ నిన్ను ప్రతిష్ఠించెదను." అంత భూమి "ప్రభూ! స్థావరముల యొక్క ఉనికి కేవలము నాయందు మాత్రమే నిక్షిప్తమై యున్నది. కానీ వేరొక ధరణి కలదా? ధారణా మయమయిన ధరణిని కేవలము నేనేకదా?" ఇట్లు పలుకుచున్న పృదివికి ఎదురుగ జలముల యందు మనోహర వృక్షములు కనిపించెను. వాటిని కాంచినంతనే పృధివి గర్వము సర్వమూ ఖర్వమైనది. ఆమె భగవానునితో ఇట్లనియె "దేవా! వికసించిన ఈ వృక్షములు ఏ స్థలము నందు విరాజిల్లు చున్నవి? ఈ దృశ్యము నాకు మిక్కిలి ఆశ్చర్యము కలుగజేయు చున్నది. యజ్ఞపతీ! ఈ రహస్యము నాకు తెలుపవలసినది.

భగవానుడు "నితంబినీ! నీకు ఎదురుగా మధురా మండలము కానబడుచున్నది. ఈ స్థలము గోలోకము యొక్క మట్టిచే నిర్మింపబడినది. ప్రళయకాలము నందు సహితము ఈ స్థలము నశింపదు. ఇది వినిన పృధివి మిక్కిలి విస్మితమై, అభిమాన శూన్య అయినది.

ఓ! మహాబహూ! నందరాజా! ఈ వ్రజమండలము సమస్త లోకముల యందు అత్యధిక మహత్వశాలి అయిన ప్రదేశము. వ్రజభూమి యొక్క మాహాత్మ్యము విన్న మానవుడు జీవన్ముక్తుడగును. అందుచే నీవు మధురా వ్రజమండలమును తీర్ధరాజమయిన ప్రయాగ కన్న ఉత్కృష్ఠమయినదని తెలిసికొనుము.

(గర్గ సంహిత యందలి బృందావన ఖండార్గతమయిన నంద, సన్నంద సంవాదమునందలి బృందావనాగమున ప్రయత్నమను ప్రధమోధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(గిరిరాజు గోవర్ధనము యొక్క పుట్టుక మరియు వ్రజమండలాగమనము)

నందుడు తిరిగి ప్రశ్నించెను "మహా ప్రాజ్ఞా! సన్నందా! మీరు సర్వజ్ఞులు, మరియు బహుశృతులు. మీ ముఖతా నేను వ్రజమండలము యొక్క మాహాత్మ్యము వింటిని. అందు గోవర్ధన పర్వతము గూర్చి మీరు ప్రస్థావించిరి. ఈ పర్వతము యొక్క పుట్టుక ఎట్లు జరిగెను? ఈ గిరిశ్రేష్ఠము "గిరిరాజు" అని ఎందువలన పిలువబడుచున్నది? అచట కల యమునా నది ఏ లోకము నుండి ఉదయించినది? మీరు జ్ఞాన శిరోమణులు. అందుచే యమునా మహాత్మ్యమును గూర్చి కూడా నాకు సంపూర్ణముగ తెలుప వలసినది.

సన్నందుడు "రాజా! ఒకనాటి మాట! హస్తినాపురము నందు పాండు మహారాజు ధర్మధారులందు శ్రేష్ఠుడయిన భీష్మ పితామహుని ఇదే విధముగ ప్రశ్నించెను. ఆ సమయమున అనేక మంది లోకులు పాండు రాజు ప్రశ్నను, భీష్ముని సమాధానమును వినిరి. నేను అదే విషయమును నీకునూ వినిపించెదను. అసంఖ్యాక బ్రహ్మాండముల కధిపతి, గోలోకనాధుడు, సర్వ సమర్ధుడు, మరియు పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుడు పృధివీ భారము నివారించుటకై భూతలమునకు అవతీర్ణుడయిన సమయమున తన ప్రాణ వల్లభ అయిన శ్రీ రాధాదేవితో ఇట్లనియె "ప్రియా! నా వియోగము చే నీవు భయభీతురాలి వైన యెడల నీవునూ భూతలమునకు ఏతెంచవలసినది". అంత శ్రీ రాధాదేవి "ప్రాణనాధా! ఎక్కడ బృందావనము, గోవర్ధనము, యమునా తీరము లేదో అచట నా మనస్సునకు సుఖశాంతులు కలుగవు". అంత శ్రీ రాధాదేవి మాటను వినిన శ్రీకృష్ణ భగవానుడు తన ధామమయిన గోలోకము నుండి ఎనుబది నాలుగు క్రోసుల భూభాగమును, యమునా నదినీ, గోవర్ధన పర్వతమునూ భూతలమునకు పంపెను. ఆ సమయమున ఆ ఎనుబది నాలుగు క్రోసుల భూమి ఇరువది నాలుగు వనములతో సహితము ఇచటకు ఏతెంచెను.

గోవర్ధన పర్వతము భారత వర్షమునకు పశ్చిమమున శాల్మలీ ద్వీపమందు ద్రోణాచల పర్వత పత్నియందు జన్మించెను.

ఆ సమయమున దేవతలు గోవర్ధన పర్వతముపై పుష్పవృష్టి కురిపించిరి. హిమాలయము, సుమేరు మరియు సమస్త పర్వతములు ఆ సమయమున అచటకు ఏతెంచి ప్రమాణ సహిత పరిక్రమ ఆచరించి విధి విధానముగ పూజనముసల్పెను. పిదప ఆ పర్వత రాజములన్నియు ఈ విధముగ గోవర్ధనమును స్థుతించినవి, "నీవు పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణ చంద్రుని గోలోక ధామమందు ఎక్కడ దివ్య గోవుల సముదాయములు నివసించుచుండునో, ఎక్కడ గోపకులు, లావణ్యవతులయిన గోప సుందరీమణులతో విహరించుచుందురో అక్కడ శోభించుచుందువు. నీవు గోవర్ధనము పేర బృందావనము యొక్క ఒడిలో సముల్లాసముగ నివసించు గోలోక మకుట మణి రత్నము. ఒకనాడు ఒక విశిష్ఠ అవసరము దృష్ట్యా పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుని చేతియందు ఛత్రము వలె విలసిల్లెదవు. అట్టి మహా మహితాన్విత గోవర్ధనమునకు మేమందరమూ సాదర దండ ప్రణామములు ఆచరించుచున్నాము."

సన్నందుడు తిరిగి చెప్పదొడండెను "నందరాజా! ఇట్లు పర్వతములు అన్నియు గోవర్ధనమును పరిపరి విధముల స్థుతించి తమ తమ స్థానములకు ఏగెను. అప్పటి నుండియు గిరి శ్రేష్ఠ గోవర్ధనము సాక్షాత్ "గిరి రాజు" అని పిలువబడుచున్నది. ఒకానొక సమయమునందు ముని శ్రేష్ఠుడయిన పులస్త్యుడు తీర్ధయాత్రలు చేయుచూ భూమండలమంతయు పరిభ్రమించుచుండెను. ఆ సమయమున ఆ మహాముని ద్రోణాచల పుత్రుడు, శ్యామ వర్ణుడు, సుగంధ మాధవీలతా పరివేష్ఠితుడు అయిన గోవర్ధనమును కాంచెను. ఆ పర్వతమునందలి వృక్షములన్నియు పండ్లభారముచే క్రిందికి వంగియున్నవి. తుమ్మెదల యొక్క ఘంకారావము ఎల్లచోట్లా ప్రతిధ్వనించుచున్నది. ఆ పర్వత మంతయు దివ్యమయిన శాంతి, కాంతి విరాజిల్లుచున్నది. తన నిశ్శబ్ధమయిన పర్వతగుహల కారణమున ఆ పవిత్ర ప్రదేశము యొక్క జాడ తెలిసినది. వందలాది శిఖరములతో కూడిన మనోహర రత్నశైలము తపస్సు చేసికొనుటకు మిక్కిలి అనువయిన ప్రదేశము. వివిధ రంగులు వెలయించు చిత్ర, విచిత్ర ధాతువులు ఈ పర్వతాంగముల యందు ప్రకాశించుచూ పర్వత శోభను మరింత ఇనుమడింప చేయుచున్నవి. అ పర్వత సానువుల యందలి భూమి మిక్కిలి సారవంతమై అనేక రకముల పక్షులకు ఆలవాలమైయున్నది. వివిధ మృగములు, కోతులు, నలుదిశలా సంచరించుచున్నవి. మయూరముల క్రేంకారములతో ప్రతిధ్వనించు గోవర్ధన పర్వతము ముముక్షువులకు మోక్షప్రదమై యున్నది.

మునివరుడయిన పులస్త్యునకు ఈ పర్వతమును గ్రహిచవలెనన్న కోరిక మనసునందు ఉదయించెను. అంత ఆతడు ద్రోణాచలము వద్దకు వెళ్ళెను. ద్రోణాచలము ఆయనకు స్వాగత సత్కారములు ఆచరించెను. అంత పులస్త్యుడు ద్రోణాచలముతో ఇట్లనియె "ఓ! పర్వత రాజమా! నీవు సమస్త పర్వతములకు స్వామివి. దేవతా సమూహములన్నియును నిన్ను ప్రేమతో ఆదరించుచున్నారు. నీవు దివ్య ఓషధులకు నిలయమై మనుష్యకోటికి జీవన దాతవై యున్నావు. నేను కాశిపట్టణ నివాసినయిన ఒక మునిని. నీ వద్దకు ఒక యాచకుడనై ఏతెంచితిని. నీ పుత్రుడయిన గోవర్ధనమును నాకు ఈయవలసినది. ఇచ్చటి ఏ వస్తువుల యందును నాకు మమకారము లేదు. విశ్వేశ్వర భగవానుని నగరము "కాశి" నామము చే మిక్కిలి విశ్వప్రసిద్ధ మయినది. అచట మరణించిన పరమపాపి సహితము తక్షణమే మోక్షమును పొందును. అక్కడ గంగానది ప్రవహించుచున్నది, మరియు సాక్షాత్ విశ్వనాధుడు విరాజిల్లుచున్నాడు. అచట ఏ విధమయిన పర్వతములు లేని కారణమున లతా, గుల్మ, వృక్ష సముదాయములచే నిండిన నీ పుత్రుడయిన గోవర్ధనమును అచట స్థాపించి నేను ఆ పర్వతము పై తపమాచరించెదను. ఈ అభిలాష నా మనసు నందు పొడసూపుచున్నది."

పులస్త్యుని మాటలు విన్న ద్రోణ పర్వతము పుత్రప్రేమ చే విహ్వాలుడై కన్నులనీరు కార్చుచూ ఇట్లనియె "నేనే పుత్రప్రేమచే వ్యాకుల చిత్తుడనగుచున్నాను. ఈ నా పుత్రుడు నాకు అత్యంత ప్రియుడు. కానీ మీ మాటను కాదనినచో మీ శాపమునకు బలి అగుదునేమో అన్న భయము కూడా నన్ను వివశుని చేయుచున్నది. అందుచే నా పుత్రుని మీకు ఇచ్చుచున్నాను." ఇట్లు పలికి ద్రోణుడు తన తనయుని వంక తిరిగి ఇట్లనియె "నాయనా! నీవు ఈ మునీశ్వరునితో కళ్యాణమయ కర్మ క్షేత్రమయిన భారత వర్షమునకు ఏగవలసినది. అచ్చటి మానవులు సత్కర్మల ద్వారా ధర్మార్ధ కామములను పొందెదరు. నిష్కాము కర్మ (జ్ఞానయోగము) ద్వారా క్షణములో మోక్షమును కూడా పొందగలరు."

అంత గోవర్ధనము "మహామునీ! నా శరీరము ఎనిమిది యోజనములు పొడవు, రెండు యోజనముల ఎత్తు, అయిదు యోజనములు వెడల్పు కలదు. అ దశలో నన్ను ఎట్లు తీసికొని పోయెదవు?" అని ప్రశ్నించెను. అంత పులస్త్యుడు "నీవు నా చేతియందు కూర్చొన వలసినది. నేను కాశి క్షేత్రము చేరువరకు నిన్ను నా చేతి యందే మోసెదను" అని పలికెను.

అంత గోవర్ధనము "మహర్షీ! నా ప్రతిజ్ఞ వినవలసినది. మీరు ఏ భూభాగముపై ఒక్కమారు పెట్టిన యెడల నేను అక్కడ నుండి మరి కదులబోను". అంత పులస్త్యుడు "నాయనా! నా ప్రతిజ్ఞ కూడా వినవలసినది. నిన్ను ఈ శాల్మలీ ద్వీపము నుండి భారత వర్షమందలి కోసల దేశము వరకూ దారిలో ఎక్కడ క్రింద పెట్టను". అంత పర్వత రాజము తన తండ్రికి ప్రణామము లాచరించి మునియొక్క అచేతి యందు ఆరూఢుడు అయ్యెను. ఆ సమయమున ఆయన నేత్రములు అశ్రుపూరితములు ఆయెను.

పులస్త్యుడు తన కుడి చేతియందు పర్వతమును ధరించి, లోకులందరు ఆయన మహితాన్విత ప్రతాపమునకు విస్మితులగు చుండగా నెమ్మదిగ నడుచుచూ వ్రజమండలమునకు ఏతెంచెను. గోవర్ధన పర్వతమునకు తన పూర్వజన్మ స్మృతి కలదు. ఆయన వ్రజభూమిని కాంచి ఇట్లు ఆలోచించెను "ఈ వ్రజభూమి యందు అనంత కోటి బ్రహ్మాండ నాయకుడు, పరాత్పర పరబ్రహ్మ, పరమాత్ముడయిన శ్రీకృష్ణుడు అవతరించును. అపుడు ఆయన గోపాల బాలురతో బాల్య, కౌమార క్రీడలు సలుపును. అంతేకాక అనేక దాన, మాన లీలలు సహితము కావించును. నేను ఇచటి నుండి వేరొక స్థలమునకు పోరాదు. ఈ వ్రజభూమి మరియు యమునానది సాక్షాత్ గోలోకము నుండి ఇచటకు ఏతెంచినవి. శ్రీ రాధామాధవుల ఇరువురి శుభాగమనము కూడా జరుగును. వారిరువురి దర్శన భాగ్యము పొంది నేను కృతార్థుడను అగుదును." ఆ సమయమున ముని మిక్కిలి దస్సియుండెను. ఆయనకు ముందు జరిగిన సంభాషణ జ్ఞప్తికి లేదు. ఆయన పర్వతమును చేతినుండి వ్రజభూమి యందు విడచెను. అంత ఒక్క క్షణము పర్వతభారపీడితుడయిన ఆ ముని తెప్పరిల్లి, లఘుశంక తీర్చుకొనుటకై ఏగెను. తదుపరి నది యందు స్నానాదికములు పూర్తి గావించి గోవర్ధనము వద్దకు ఏతెంచి "పైకి లెమ్ము" అని ఆజ్ఞాపించెను. గోవర్ధనము కదులలేదు. అంత మహాముని తన రెండు చేతులతో ఆ పర్వతమును కదుల్చుటకు యత్నించెను. తిరిగి విఫలుడాయెను. అంతట సంపూర్ణ బలము, శక్తిచే గోవర్ధనమును కదల్చుటకు యత్నించెను, కాని గోవర్ధనము ఒక్క అంగుళము కూడా కదులలేదు. అంత పులస్త్యుడు గోవర్ధనముతో ఇట్లనియె "గిరి శ్రేష్ఠమా! దయచేసి భారమును పెంచకుము. నాకు అర్థమయినది. నీవు కోపించితివి. నీ అభిప్రాయము నాకు తెలుపవలసినది." అంత గోవర్ధనము "మునీశ్వరా! ఇందు నాకు రవ్వంత దోషము లేదు. మీ యంత మీరు నన్ను ఇచట స్థాపించిరి. ఇక ఇచట నుండి నేను కదులను. నేను పూర్వమే నా ప్రతిజ్ఞను మీకు వినిపించితిని."

అదివిన్న పులస్త్యుడు సమస్త ఇంద్రియములు కోప భూయిష్ఠములై వణకిని. పళ్ళు, పటపట లాడినవి. ఆయన ప్రయత్నమంతయు వ్యర్థమయినది. ఆయన మిక్కిలి కోపించి ద్రోణపుత్రుని ఇట్లు శపించెను. "ఓ! పర్వతమా! నీవు మిక్కిలి దుష్టుడవు. నీవు నా మనోరథమును భగ్నము చేసితివి. అందుచే ప్రతి దినము కొంచెము కొంచెముగ క్షీణించెదవు." ఆ విధముగ శపించి పులస్త్యుడు కాశీ నగరమునకు ఏగెను. అప్పటి నుండియు గోవర్ధనము కొంచెము కొంచెము గ క్షీణించుచున్నది. ఎంతవరకు భాగీరథి గంగ, మరియు గోవర్ధన పర్వతము ఈ భూతలము నందు యుండునో అంతవరకు కలి ప్రభావము విస్తృతముగ యుండదు.

ఈ గోవర్ధన చరిత్రము పరమ పవిత్రము మరియు మనుష్యుల ఘోర పాపములను సహితము సమూలముగ నిర్మూలించునది. నేను నీతో చేసిన ఈ ప్రసంగము అద్భుతము, సుమధురము మరియు మోక్షదాయకము.

(గర్గసంహిత యందలి బృందావన ఖండాగ్గతమయిన గిరిరాజ ఉత్పత్తి వర్ణనము అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(గోలోకము నుండి యమునా నది యొక్క అవతరణము మరియు తిరిగి గోలోక ప్రవేశము)

సన్నందుడు తిరిగి చెప్పదొడంగెను "నందరాజా! గోలోకము నందు శ్రీహరి యమునా నదిని భూలోకమునకు ఏగమను ఆజ్ఞను శిరసావహించి నదులలో శ్రేష్ఠమయిన యమున శ్రీహరికి ప్రదక్షిణ గావించి పయనమగుటకు ఉద్యుక్తమయ్యెను. అంతలో విరజ, మరియు బ్రహ్మ ద్రవము నుండి ఉత్పన్నమయిన సాక్షాత్ గంగ ఈ రెండు నదులు వచ్చి యమున యందు విలీనమయినవి. ఇందువలన యమునను శ్రీకృష్ణ భగవానుని పట్టపురాణి గా జనులు పేర్కొందురు. అటు పిదప సరితములందు శ్రేష్ఠమయిన కాళింది మనోవేగముతో కదులుచూ విరజానదీ వేగమును భేదించి నికుంజ ద్వారము ద్వారా బయటకు వెడలి అసంఖ్యాక బ్రహ్మాండముల సమూహములను స్పర్శించుచూ, బ్రహ్మ ద్రవము నందు ప్రవేశించెను. అంత తన అమిత వేగముచే బ్రహ్మాండ జలరాశిని భేదించుచూ ఆ మహానది వామనమూర్తి యొక్క ఎడమ కాలిగోటిచే బ్రద్దలు కొట్టబడిన బ్రహ్మాండము యొక్క శిరోభాగము చేరెను. అచటకల బ్రహ్మద్రవము ద్వారా ఈ బ్రహ్మాండము యొక్క పగులు నుండి గంగానదితో కలసి అచటి నుండి ధృవమండల స్థితమయిన వైకుంఠమును చేరి, అచటి నుండి బ్రహ్మలోకమునకు లంఘించి, అచటి నుండి వందలాది దేవతా లోకములు స్పృశించుచూ, ముందుకు సాగినది. ఇట్లు మహా వేగముతో సాగుచున్న యమున సుమేరు పర్వత శిఖరములపై బడి, పర్వత శృంగముల నుండి క్రిందికి లంఘించుచూ, బండరాళ్ళను నుగ్గునుగ్గు చేయుచూ, ఉత్తుంగ తరంగమై, తటములను భేదించుచూ, మేరు పర్వతము చేరి. అక్కడ నుండి దక్షిణ దిశ వైపు పయనించుటకు నిశ్చయించుకొని గంగానది నుండి విడవడెను. అంత పుణ్యనది అయిన గంగ హిమాలయము వైపు ప్రవహించెను. కానీ శ్యామసలిల అయిన యమున కళింద పర్వత శిఖరము చేరెను. అక్కడ నుండి ప్రకటమయిన కారణమున అప్పటి నుండి యమున "కాళింది" అని పిలువబడెను.

కళింద పర్వత శిఖరమునుండి క్రిందకు దుమికి పెద్ద పెద్ద గండశిలలను ఛిద్రము చేయుచూ, తటములను భేదించుచూ, భూ మండల మందలి అనేక దేశములను పవిత్రమొనర్చుచూ యమున ఖాండవ వనమున ఇంద్ర ప్రస్థము చేరెను. యమునా నది పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుని పతిగా వాంఛించెను. అందుచే ఆ జలముల యందు ఒక గుహను నిర్మించెను. ఆ గుహయందు ఆ తల్లి ఇప్పటికినీ నివసించుచుండెను. పిదప నిర్మల శ్యామ సలిల యమున పరవళ్ళు త్రొక్కుచూ బయలుదేరి వ్రజమండలమందలి బృందావనము చేసి అచట నుండి మధుర వైపు ప్రవహించెను. మహావనము నందలి సుందర, రమణీయ సైకత స్థలములను స్పృశించెను. శ్రీ గోకులము నందు పరమసుందరి అయిన యమున తన నేతృత్వమున "విశాఖసఖులు" అను పేర గోపలలామల యూధమును సృష్ఠించి శ్రీకృష్ణుని రాసలీలలో సమ్మిళిత మగుటకై ఆ ప్రదేశమును తన నిజ వాసముగ నిశ్చయించెను. పిదప వ్రజ మండలమును వీడి మిక్కిలి విహ్వలయై కనుల నుండి ప్రేమానంద భాష్పములు విడుచుచూ పశ్చిమ దిశగా ప్రవహించెను.

తదనంతరము వ్రజమండలమునకు తన ప్రవాహ వేగముచే మూడుమార్లు ప్రణామము గావించి తిరిగి తన ప్రయాణము కొనసాగించి అనేక దేశములను తన స్పర్శచే పవిత్రమొనరించి ప్రయాగ తీర్థము చేరి గంగా సంగమము కావించి క్షీరసాగరము వైపు పయనించెను. ఆ సమయమున దేవతలు పుష్పవృష్టి కురిపించి దిగ్విజయ సూచకముగ జయ జయ ధ్వానములు గావించిరి. నదీ శిరోమణి కళింద నందిని, కృష్ణవర్ణ, శ్రీ యమున సముద్రతటమున ప్రవేశించి గద్గద స్వరముతో గంగతో ఇట్లనియె "సమస్త బ్రహ్మాండములను పవిత్రము చేయు గంగా! నీవు ధన్యశీలివి. నీ ప్రాదుర్భావము సాక్షాత్ శ్రీకృష్ణ చరణార విందముల నుండి జరిగినది. నీవు సమస్త లోకములకు వందనీయవు. ఓ! శుభాననా! నేను ఇచట నుండి శ్రీ హరి సన్నిధానమునకు ఏగెదను. నీ ఇచ్ఛ అగునేని నీవు సహితము నాతో రావచ్చును. నీతో సమానమయిన పుణ్యతీర్థములు ఇంతకు ముందు లేవు. ఇక ముందు పుట్టబోవు. నీవు సర్వతీర్థ స్వరూపిణివి. సుమంగళీ! గంగా! నేను నీకు ప్రణామములు ఆచరించుచున్నాను. నేను ఏదేని అనుచిత వాక్యములు పలికిన యెడల క్షంతవ్యురాలిని".

అంత గంగాదేవి ఇట్లు పలికెను "కృష్ణా! నీవే ధన్యశాలివి. ఎందుకనగా సమస్త బ్రహ్మాండములను పావనము చేయు మంగళమూర్తివి నీవు మాత్రమే! శ్రీకృష్ణ దేవుని వామాంగము నుండి నీవు ప్రాదుర్భవించితివి. నీవు పరమానంద స్వరూపిణివి. సమస్త లోకములకు వందనీయవు. పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుని పట్టపు రాణివి. అందువలన కృష్ణా! నీవు సర్వ విధముల ఉత్కృష్టవు. నీకు ప్రణామము చేయుచున్నాను. నీ దర్శన భాగ్యము సమస్త దేవతలకు, తీర్ధములకు దుర్లభము. గోలోకము నందు కూడా నీ దర్శనము దుష్కరము. నేను శ్రీకృష్ణ దేవుని ఆజ్ఞానుసారము మంగళమయమయిన పాతాళ లోకమునకు ఏగెదను. ప్రస్తుతము నీ వియోగ భయముచే మిక్కిలి వ్యాకులతనై యున్నప్పటికీ నీతో పాటు దివికేగుటకు అసమర్థురాలిని. వ్రజభూమి యందలి రాసలీలకై విశాఖాసఖుల దివ్యయాధమునందు సమ్మిళితనై యందును. హరి ప్రియా! నేను సహితము ఏవేని అప్రియమయిన వాక్కులు పలికితినేని క్షంతవ్యురాలిని."

ఈ విధముగ ప్రేమపూర్వక మృదు మధుర వాక్కులు పలికి రెండు నదులు ఒండొరులకు ప్రణామములాచరించి ఎవరికి విధించిన పథము లందు వారు చనిరి. సురధుని అయిన గంగ అట్లు పయనించి అనేక లోకములను పవిత్ర మొనరించుచూ పాతాళము చేరి భోగవతీ వనము ప్రవేశించి "భోగవతీ గంగా" నామముతో ప్రసిద్ధి పొందెను. ఆ పవిత్ర గంగా జలములను శంకర భగవానుడు, మరియు ఆదిశేషుడు శిరమున ధరించెదరు. ఇటు శ్యామసలిల అయిన యమున అమిత వేగముగ సప్తసాగర మండలము భేదించి సప్త ద్వీపములందు ఉత్తుంగ తరంగయై పరవళ్ళు త్రొక్కుచూ ఇంకనూ వేగము సంతరించుకొని ముందుకు సాగి సువర్ణమయ భూముల చేరి లోకాలోక పర్వత సానువులను చేరెను. పిదప లోకాలోక పర్వత గండ శిలలను భేదించుచూ, కాళింది పరవళ్ళు త్రొక్కుచున్న జలధారలతో ఉవ్వెత్తున లేచి లోకాలోక పర్వత శిఖరము చేరి అక్కడ నుండి ఊర్ధ్వ గమనయై నాకలోకలము చేరెను. అచట నుండి లంఘించి బ్రహ్మలోకము చేరి, అక్కడ నుండి వామనదేవుని పదనఖము చే ఛిద్రమయిన బ్రహ్మాండకుహరమునున్న బ్రహ్మద్రవము చేరి ముందుకు ప్రవహించెను. ఆ సమయమున సమస్త దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. ఈ విధముగ శ్రేష్ఠ సరిత, కృష్ణ సలిల, యమున తిరిగి గోలోక ధామము ప్రవేశించెను.

కళింద నందిని అయిన యమునా నది యొక్క మంగళమయ చరిత్ర వినినా, చదివినా వారికి మంగళములు విస్తృతముగ విస్తరిల్లును. ఏదేని మనుష్యుడు ఈ యమునా చరిత్రను మనసున ధారణ చేసి ప్రతిదినము చదివిన యెడల శ్రీకృష్ణ భగవానుని చే నికుంజలీలయందు వర్ణింపబడిన పరమపద గోలోకధామము నిస్సందేహముగ జేరును.

(గర్గసంహిత యందలి బృందావన ఖండాగ్గతమయిన నంద-సన్నంద సంవాదము నందలి కాళిందీ ఆగమన వర్ణనమను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(శ్రీకృష్ణ బలరాముల ద్వారా గోవత్స పాలనము మరియు వత్సాసుర ఉద్ధారణ)

నారదుడు చెప్పదొడంగెను "మహారాజా! బహుళాశ్వ! సన్నందుని పలుకులు విన్న మహానుభావుడయిన నందరాజు మిగిలిన గోపకులతో కలసి మిక్కిలి ప్రసన్నమనస్కుడై బృందావనము చనుటకు ఉత్సుకుడాయెను. యశోదా, రోహిణి, మరియు మిగిలిన గోపాంగనలను అందరినీ రధారూఢులను చేసి, స్త్రీ, బాల, వృద్ధులను బండ్లపై ఎక్కించి సాయుధ హయారూఢులయిన వీరపురుషులు పరిరక్షించుచుండగా, విప్రమండల స్వస్తివాచకములతో దీవన లిచ్చుచుండగా, నందమహారాజు బలరామ కృష్ణులను తన ఒడిలోనికి తీసికొని, రధారూఢుడై బృందావనము వైపు పయనమాయెను. ఆయన వెంట గోసమూహములు కదలినవి. ఆ సమయమున గాయక, వైతాళికులు నందుని యశోగానము చేయుచుండగా శంఖ, భేరీ, నగారా ధ్వానములు మిన్నుముట్టెను.

వృషభానువరుడు సహితము ఒక గొప్ప కుంజరము, నధిరోహించి, ఒడిలో తన ప్రియపుత్రిక అయిన శ్రీ రాధాదేవిని కూర్చుండబెట్టుకొనెను. గాయక, వైతాళికులు తన గుణయశోగానము చేయుచుండగా వీణా, వేణు, మృదంగ, తాళ నాదములు మృదు మధురముగ మిన్నుముట్టుచుండగా వృషభానువరుడు తన సమస్త కుటుంబ పరివార సహితుడై నెమ్మది నెమ్మదిగ బృందావనము వైపు పయనించెను. నంద, ఉపనంద, వృషభానులు సహితము తమ తమ పరివారముతో బృందావనము చేరిరి. మిగిలిన గోప గోపీజనము తమ సేవక సహితులై బృందావనము ప్రవేశించి చిన్న చిన్న కూటములుగ ఏర్పడి వివిధ ప్రదేశములయందు నివాసములు ఏర్పరుచుకొనిరి. వృషభానువరుడు తనకు, తన పరివారమునకు నాలుగు యోజనములు విస్తీర్ణము గల నగరమును ఒక దుర్గము వలె నిర్మించుకొనెను. ఆ పురము వృషభానుపురము (బరసానా) అని ప్రసిద్ధి నొందెను. ఆ పురము నాలుగు ప్రక్కలా కందకములచే రక్షింపబడి, ఏడు ద్వారములతో విలసిల్లినది. విశాల సభామండపములు, అనేక సుందర సరోవరములు, మధ్యన విశాల రాజమార్గములు, ఒక వేయి పుష్పవాటికలు, ఆ నగరము యొక్క శోభను మరింత ఇనుమడింప జేసినవి.

శ్రీకృష్ణుడు నంద నగరము నందు మరియు వృషభానుపురము నందు గోపబాలకులతో క్రీడించుచు, గోపాంగనలకు ప్రీతి కలిగించువాడు. కొన్ని దినములు గడచిన పిమ్మట గోపకుల మనోహరులయిన బలరామకృష్ణులు, బృందావన పొలిమేరలకు ఇతర గోపబాలకులతో కలసి వెళ్ళి లేగదూడలను మేపసాగిరి. కాళిందీ తీరమున పావన ఇసుక తిన్నెలయందు శ్రీకృష్ణ, బలరాముల కుంజ నికుంజముల యందు దాగుడుమూతలు ఆడుట ప్రారంభించిరి.

ఒకానొకప్పుడు ఆటపాటలు యందు మునిగి వనాంతరాళమునకు చని ఆనందసాగరులగు చుండిరి. వారిరువురి కటి ప్రదేశమున పట్టు వస్త్రముల గుచ్ఛము మిక్కిలి శోభాయమానముగ యుండెను. వారిరువురు ఆడుచున్నపుడు వారి పద మంజీర నూపురముల ఘల్లు ఘల్లు మని సుమధుర శబ్దము వినబడుచున్నది. బలరాముని దివ్యాంగముల యందు నీలి వస్త్రము, శ్రీకృష్ణుడు పీతాంబర ధారియై, ఇరువురు హార, నూపుర, కంకణ, కేయూర సమన్వితులై భాసించుచుండిరి. గోప బాలుర తో పాటు దివ్య సోదరులిరువురు పక్షులు యొక్క ఛాయను అనుసరించి పరుగెత్తుచూ, మురళిని వాయించుచూ, శిరమున నెమలిపింఛ శోభితులై గళము నందు పూవులు మరియు పల్లవతీవలు ధరిచి పుడమిని భానుని వలె ప్రకాశించుచుండిరి.

నరేశ్వరా! ఒకానొక దినము కంసుని అనుచరుడయిన దానవుడు ఒకడు గోవత్సరూపము ధరించి ఆ ఆలమందనందు ప్రవేశించెను. శ్రీకృష్ణ భగవానుడు ఆ విషయము గ్రహించి ఆ వత్సమును సమీపించెను. ఆ మాయావత్సము గోపబాలకుల నడుమ అన్ని వైపులకు పరిగెత్తుచూ, అకస్మాత్తుగా తన పృష్ఠ పాదములచే శ్రీకృష్ణుని రెండు బాహువుల పై బలముగా తన్నెను. ఇతర గోపకులు అందరూ పలాయనము చిత్తగించిరి. శ్రీకృష్ణుడు తన రెండు చేతులతో ఆ వత్సరూప రక్కసుని రెండు పాదములు పట్టి, త్రిప్పి త్రిప్పి బలముగ నేలపై విసరెను. తక్షణమే ధేనుకాసురుడు మరణించెను. ఆ ప్రహారమునకు అచ్చటి కపిత్థవృక్షము కూకటి వ్రేళ్ళతో పెకలింపబడి, అటునిటు యున్న మిగిలిన వృక్షములపై బడి వాటిని సహితము నాశనము చేసెను. ఈ దృశ్యము ఒక అద్భుతముగ పరిణమించినది. గోప బాలకులు మిక్కిలి ఆశ్చర్య చకితులై శ్రీ కృష్ణుని ప్రశంశించిరి. దేవతలు పుష్పవృష్టి కురిపించి జయ జయ ధ్వానములు చేసిరి. ఒక విశాల జ్యోతి ఆ దైత్యుని నుండి ఆవిర్భవించి శ్రీకృష్ణ ప్రభువు నందు లీనమయ్యెను.

బహుళాశ్వుడు ఇట్లు ప్రశ్నించెను "మహామునీ! ఇయ్యది మిక్కిలి ఆశ్చర్యకరము. ఈ గోవత్సరూపము ధరించి శ్రీ కృష్ణ ప్రభువు నందు లీనమయిన ఈ పుణ్యాత్ముడు ఎవరు?" నారదుడు "మహారాజా! ఈతడు మురాసుర పుత్రుడు. "ప్రమీల" నామము చే విఖ్యాతుడు. ఈతడు తన ప్రతాపము చే దేవతలను సహితము ఓడించిన పరాక్రమశాలి. ఒకనాడు ఈతడు మహాతపస్వి అయిన వశిష్ఠుని ఆశ్రమమునకు ఏగి అచటకల నందినీ ధేనువును చూచెను. ఆ హోమధేనువును పొందవలెనన్న దుర్బుద్ధి ఆతని యందు ప్రవేశించెను.

అంతట ఆతడు కపట విప్ర వేషధారియై వశిష్ఠుని సమీపించి ఆ హోమధేనువును యాచించెను. త్రికాలజ్ఞుడు, దివ్యదర్శి, ఈయిన వశిష్ఠుడు సమస్తము గ్రహించి బదులీయక మిన్నకుండెను. అపుడు నందినీ ధేనువు ఈ విధముగ పలికెను "ఓరీ! దురాత్మా! నీవు మురా పుత్రుడవయిన దైత్యుడవు. అయిననూ ముని యొక్క గోవును అపహరించుటకు

ఇచటకు ఏతెంచితివి. (బ్రాహ్మణ రూపమున). అందుచే నీవు గోవత్సము అవుదువు గాక!" అంతట ఆ మురాపుత్రుడు గోవత్సముగ మారి నందినీ వశిష్ఠులిరువురికీ ప్రదక్షిణ పూర్వక ప్రణామములు ఆచరించి దీనముగ రక్షింపమని ప్రార్థించెను. అంత నందినీ "మహాదైత్యా! నీవు ద్వాపరాంతమున శ్రీకృష్ణునిచే రక్షింపబడుచున్న గోవత్స సమూహము నందు ప్రవేశించి తద్వారా ముక్తిని పొందెదవు." ఆ శాప వరదాన ప్రభావమునకు దైత్య వత్సాసురుడు పరిపూర్ణతమ పరమపావనుడయిన శ్రీ కృష్ణ భగవానుని యందు లీనమయ్యెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన
వత్సాసుర మోక్షమనెడు నాలుగవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(బకాసుర ఉద్ధారము)

నారదుడు చెప్పదొడంగెను "ఒకానొక దినము గోపబాలకులు మరియు బలరామసహితుడై శ్రీహరి యమునా తటమునకు ఏగెను. అచట వారందరూ ఒక విచిత్ర దృశ్యమును కాంచిరి. అచట శ్వేత పర్వతము వలె ఎత్తుగ యున్న ఒక కొంగను చూచెను. ఆ బకము ఉక్కు దంష్ట్రలు కలిగి మేఘము వలె గర్జించు చుండెను. ఆ బకమును చూచిన మరుక్షణము గోపబాలకులందరూ భయభీతులై నలుదిశలకు పరుగెత్తుట మెదలిడిరి. ఆ బకము మిక్కిలి వేగముగ ఎగురుతూ వచ్చి బాలకృష్ణుని మ్రింగెను. ఇది చూచినంతనే గోపబాలకులు మిక్కిలి రోదించి మూర్ఛితు లయిరి. ఆ సమయమున హాహాకారము చేయుచు దేవతానీకము సహితము అచటకు చేరిరి.

ఇంద్రుడు వెంటనే తన వజ్రాయుధమును ఆ మహాబకము పై వైచెను. వజ్రఘాతము చే ఆ బకము నేలపై బడి, కొంచెము సేపటికి తెప్పరిల్లి తిరిగి నిలబడెను. అంత బ్రహ్మదేవుడు కుపితుడై తన బ్రహ్మదండమును ప్రహరించెను. ఆ ఘాతమునకు బకాసురుడు నేలపై బడి మూర్ఛిల్లి కొంచెము సేపటికి శరీరము కంపించు చుండగా తిరిగి లేచెను. కానీ మృత్యువాత పడలేదు. మహాబలుడయిన దైత్యుడు మేఘగర్జన చేయసాగెను. అంత త్రినేత్రుడయిన శంకర భగవానుడు అచటికి ఏతెంచి తన త్రిశూలమను ప్రయోగించెను. ఆ త్రిశూలమును బకాసురుని ఒక పక్షము (రెక్క) ఉత్తరించెను. అంత వాయుదేవుడు ఏతెంచి తన వాయువ్యాస్త్రమును ప్రయోగించెను. అంత ఆ విశాలబకము పైకి ఎగిరి ఆ అస్త్రము నుండి తప్పుకొనెను. అంత సమవర్తి అయిన యముడు తన యమదండము ప్రయోగించగా భయంకర పరాక్రమోపేతుడయిన బకునికి ఇసుమంతయు కష్టము కలుగక ఆ యమదండము విరిగెను. అంతలో ప్రచండ కిరణ సమన్వితుడు, భానుదేవుడు అచటికి ఏతెంచి ధనస్సు సంధించి వంద తీక్షణ నారాచ బాణముల బకుని బాధించెను. కానీ బకుడు మరణింపలేదు. అనంతరము అగ్నిదేవుడు ఏతెంచి తన ఆగ్నేయాస్త్రము సంధించెను. బకుని ఈకలు కొన్ని కాల్పబడినవి. కానీ బకుడు మాత్రము మరణింపలేదు. అనంతరము వరుణదేవుడు తన వరుణ పాశములను విసరెను. బకుడు క్రిందపడి క్షత విక్షితుడాయెను. కొంత తడవు అయిన పిదప పరమ పాపి అయిన బకుడు తిరిగి తేరుకొని పైకి లేచెను. అనంతరము వేగశాలిని అయిన భద్రకాళి ఏతెంచి భయంకర గదా ప్రహారము గావించెను. దానిచే దానవుడు భయంకర వేదనను అనుభవించి మూర్ఛనొందెను.

కొంచెము సేపటికి తెప్పరిల్లి శరీరము కంపించుచుండగా తిరిగి నెమ్మదిగ లేచి యుద్ధ సన్నద్ధుడాయెను. ధీరోదాత్తుడై మేఘగర్జన చేయనారంభించెను. అంతలో మహాశక్తి శాలి అయిన స్కంధుడు ఉల్కాపాతము వంటి తన శక్త్యాయుధమును ప్రయోగించెను. బకుని ఒక దంష్ట్ర ఊడిపడినది. కానీ మరణింపలేదు. అంత దైత్యుడు భయంకర క్రోధముతో తన తీక్షణ చాచువులతో దేవతల నందరినీ పొడిచి, పొడిచి తరిమి బాధించెను. ఆకాశము నందు నలుదిశలా పరిగెడుచున్న దేవతలందరినీ తరిమి తిరిగి వచ్చి తన యధాస్థానమున కూర్చొని భయంకర సింహనాదమును చేయనారంభించెను. ఆ

సమయమున దేవర్షులు, బ్రహ్మర్షులు, మరియు ద్విజులు నంద నందనుని సఫలమునకై శుభాశీశ్శులు సమర్పించిరి. ఆ సమయమున బకాసురుని కంఠమునున్న. శ్రీకృష్ణుడు తన జ్యోతిర్మయ దివ్య దేహమును విస్తృతము చేయ నారంభించెను. అంత బకుని కంఠము అడ్డగింపబడి తనంతట తానుగా బాలకృష్ణుని కక్కివేసినది. తిరిగి తన ఉక్కు దంష్ట్రలతో ఆయనను పట్టుకొనుటకు ప్రయత్నించగా అంత శ్రీకృష్ణుడు ఆ పక్షి ముక్కును తన రెండు చేతులతో పట్టుకొని క్రింద పడవైచెను. బకము తిరిగి లేచి తన చంపుటములతో బాలకృష్ణుని పొడుచుటకు ప్రయత్నించగా, మహాగజము చెట్టు కొమ్ములను చిద్రము చేయునటుల శ్రీకృష్ణుడు ఆ బకము రెండు దంష్ట్రలను అవలీలగా చీల్చెను. అంత ఆ భయంకర బకము అసువుల బాసెను.

అంత ఒక దివ్య జ్యోతి ఆ మృత శరీరము నుండి వెలువడి శ్రీకృష్ణుని శరీరము నందు ప్రవేశించెను. అంత దేవతలు జయజయ ధ్యానములు చేయుచూ పుష్పవృష్టి కురిపించిరి. గోపబాలకులందరూ శ్రీకృష్ణుని చుట్టూ చేరి ఆశ్చర్య చకితులై ఇట్లనిరి "సఖా! నీవు మృత్యు ముఖము నుండి కుశలముగ బయటకు వచ్చితివి". ఈ విధముగ బకాసుర వధ అయిన పిదప శ్రీకృష్ణ బలరాములు గోపబాలకులతో కలసి ఆడుచూ, పాడుచూ తిరిగి తమతమ ఇండ్లకు వెడలిరి. గోప బాలకులు అందరూ ఈ విచిత్ర పరాక్రమ లీలను తమ ఇండ్ల యందు విస్తృతముగ వర్ణించి తెలుపగా ఎల్లరూ విస్మితులయిరి.

బహుళాశ్వుడు "దేవర్షీ! ఈ బకాసురుడు పుర్వజన్మ మందు ఎవరు? ఈతనికి ఇంతటి బృహత్శరీరము గల కొంగ రూపు ఎట్లు ప్రాప్తించినది? పూర్ణ బ్రహ్మమయిన సర్వేశ్వరుడు శ్రీకృష్ణుని యందు లీనమయిన ఈతని సౌభాగ్యమును ఏమని వర్ణింతును? అంతట నారదుడు "మహారాజా! పూర్వ కాలము నందు "హయగ్రీవుడు" అను రాక్షసునకు "ఉత్కలుడు" అను కుమారుడు కలడు. అతడు సమరము నందు దేవతలను పరాజితులను చేసి ఇంద్రుని ఛత్రమును హరించెను.

అంతటితో ఆగక ఆతడు అనేక మంది రాజులను, మనుష్యులను ఓడించి వారి రాజ్యములను, భాగ్యములను అపహరించి శత సంవత్సరములు సర్వ వైభవములతో రాజ్యమును భోగించెను. ఒకనాడు ఆతడు భూ మండల మంతయు తిరుగుచూ గంగాసాగర సంగమమున యున్న సిద్ధ మునీశ్వరుడయిన "జాజలి" ఆశ్రమమును చేరి అచట కల సరోవరము నందు గాలము వైచి చేపలను, ఇతర జలచరములను హింసింపసాగెను. అంత మహర్షి అతనిని వారించిననూ వినక ఆ దుర్బుద్ధి ఆయన మాటను పెడచెవిని పెట్టెను. మునిశ్రేష్ఠుడయిన జాజలి సిద్ధపురుషుడు. ఆయన ఉత్కలుని ఇట్లు శపించెను, "దుర్మతీ! నీవు బకము వలె ఈ జలచరములను పట్టుచున్నావు. అందువలన నీవు బకరూపము పొందలసినది". తక్షణమే ఆ దానవుడు తేజభ్రష్టుడై బకరూపము ధరించి, తన గర్వము సర్వమూ ఖర్వమవగా తన రెండు చేతులూ జోడించి ఆ మహాముని పాదములపై బడి ఈ విధముగ ప్రార్థించెను.

"మహామునీ! మీ ప్రచండ తపోబలము నాకు ఎరుక లేదు. దయచేసి నన్ను రక్షింపవలసినది. మీ వంటి సాధు పురుషుల సంగము ఉత్తమ మోక్షద్వారము. మీరు శత్రుమిత్రులు, మానావమానములు, మృత్తికాసువర్ణము మెదలగు ద్వంద్వముల యందు సమభావము కలిగి యుందురు. భూతలము నందు మీ వంటి మహాత్ముల దర్శనము చే ఏ మనోరథము సఫలము కాదు? మునిశ్రేష్ఠా! జాజలి! మీ వంటి మహాత్ముల కృప వల్ల సాక్షాత్ పరిపూర్ణ పరమాత్మ లభించును. అయిన ధర్మార్థ కామమలు గూర్చి చెప్పనేల?" ఆ సమయమున ఉత్కలుని వినయ ప్రవర్తన వలన జాజలి మహర్షి మిక్కిలి ప్రసన్నుడాయెను. ఆయన అరువది వేల సంవత్సరములు ఘోర తపస్సు గావించెను. జాజలి మహర్షి ఇట్లనియె "వైవశ్వత మన్వంతరము ప్రాప్తి అయిన పిదప అరవయవ ద్వాపరాంతమున భారత వర్షమున మధురాజనపదమున వ్రజమండలమందు సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీ కృష్ణుడు బృందావనము నందు గోవత్సములు కాయుటకు వచ్చును. ఆ సమయమున నీవు భగవంతుని యందు లీనమయ్యెదవు. హిరణ్యాక్షాది గొప్ప దైత్యులు సహితము వైరభావముచే పరమపదము ప్రాప్తి పొందిరి. ఈ విధముగ బకాసురునిగ మారిన ఉత్కలుడు జాజలి మహర్షి యొక్క వరదానముచే శ్రీ కృష్ణ భగవానుని యందు లీనమయ్యెను. సత్పురుషుల సాంగత్యము చే ఎంత కార్యమయిననూ సులభగమును.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన

బకాసుర మోక్షమను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(అఘాసుర వృత్తాంతము మరియు ఆతని పూర్వజన్మ మరియు ఉద్ధారము)

నారదుడు చెప్పదొడంగెను "ఒకానొక దినము గోపబాలకులతో కలసి శ్రీహరి కాళిందీ తీరము నందు ఒక రమణీయ స్థలమందు బాలోచిత క్రీడలు సలుపుచుండెను. ఆ సమయము నందు అఘాసురుడు అను రాక్షసుడు ఒక క్రోసు పొడవు గల దీర్ఘ శరీరియై, భీషణ ముఖము నందు పూత్కారము చేయుచూ మార్గము నందు వేచి యుండెను. దూరము నుండి ఆ అహిముఖము పర్వత గుహను పోలి యుండెను. మరియు ఆతని శరీరము ఒక పర్వతము వలె కానపట్టెను.

దూరము నుండి బృందావనము నందలి గోపబాలకులు అందరూ ఈ వింతను చూచి చప్పట్లు చరచుచూ, గోవులతో సహితులై ఆ మహానాగము యొక్క ముఖమున ప్రవేశించిరి. వారందరినీ రక్షించుటకై శ్రీకృష్ణుడు బలరామ సహితుడై వారి వెనుక ఆ అహిముఖమున ప్రవేశించెను. ఆ సర్పరూపధారి అయిన అసురుడు ఆ బాలకులందరూ తన నోట ప్రవేశింపగనే వారిని మ్రింగి వేసెను. ఆ సమయమున దేవతలు హాహాకారములు, దానవులు హర్షోల్లాసములు ప్రకటించిరి.

ఆ సమయమున శ్రీకృష్ణుడు తన విరాడ్రూపమును పెంచుట ప్రారంభించెను. అంత అఘాసురుని ప్రాణములు పంచత్వమును పొందెను. అంత శ్రీకృష్ణుడు గోపబాలకులతో కలసి మరణించిన అఘాసురుని ముఖము నుండి బయల్వెడలెను. మరణించిన గోవులను, గోప బాలకులను శ్రీకృష్ణుడు తన అపార కృపా కటాక్ష వీక్షణములచే తిరిగి బ్రతికించెను. అఘాసురుని జీవత జ్యోతి మేఘము నందలి మెరుపు తీగవలె ఘనశ్యాముని యందు లీనమయ్యెను. ఆ సమయమున దేవతలు పుష్పవృష్టి కురిపించిరి.

అంతట బహుళాశ్వుడు ఆ విధముగ ప్రశ్నించెను "దేవర్షీ! పూర్వ జన్మయందు ఈ దైత్యుడు ఎవరు? ఏమి ఆశ్చర్యము? దైత్యులు వైరభారముచే శీఘ్రముగ పరమపదమును ప్రాప్తినొందిరి". నారదుడు "మహారాజా! శంఖాసురునికి ఒక పుత్రుడు కలడు. "అఘ" నామధేయుడు. మహాబలుడయన అఘుడు యవ్వనము నందు మిక్కిలి సుందరుడై రెండవ కామదేవుని వలె ప్రకాశించువాడు. ఒకనాడు ఆతడు మలయాచలము నందు విహరించచూ అష్టావక్ర మహర్షిని కాంచి వికృతముగ నవ్వుచూ "నీవు ఎంత కురూపివి" అని అవహేళన చేసెను.

అంతట అనంత దివ్య తపోధని, మహాజ్ఞాని అయిన అష్టావక్ర మహర్షి ఈ విధముగ పలికెను "ఓరీ దుర్మతీ! భూమండలమున సర్పజాతి మిక్కిలి కురూపులు, మరియు కుటిల రీతిని చరించువారు. అందుచే నీవు సర్పము నవు కమ్ము!" ఆ శాపమును విన్న దైత్యునకు అహంకారము అణగి; దీన వదనుడై మహర్షి కాళ్ళపై బడెను. అంత నవనీత మనస్కుడయిన అష్టా వక్ర మహర్షి మనస్సు కరిగి ప్రసన్న హృదయుడై ఇట్లు వరదాన మిచ్చెను. "కోట్లాది కామదేవులను మించిన లావణ్యాతిశయము గల శ్రీకృష్ణ భగవానుడు నీ ఉదరమున ప్రవేశించినపుడు నీకా శాప విముక్తి కలుగును."

(గర్గసంహిత యందలి బృందావన ఖండాగ్గతమయిన
అఘాసుర మోక్షమనెడు ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(బ్రహ్మదేవుని ద్వారా గోవులు, గోవత్సములు, గోపబాలుర అపహరణ)

నారదుడు "రాజేంద్రా! ఇపుడు శ్రీకృష్ణ భగవానుని మరియొక లీల వినవలసినది. ఈ లీల ఆయన బాల్యమున

జరిగి నప్పటికీ, పౌగండకాలము ప్రాప్తించిన పిదప ప్రకాశిత మయినది. శ్రీకృష్ణుడు గోపబాలురను అఘాసుర మృత్యు ముఖము నుండి రక్షించిన పిదప వారి ఆనందమును ఇనుమడింపచేయుటకై వారిని యమునా తటమునకు తీసికొని పోయి వారితో ఇట్లనియె "ప్రియసఖులారా! ఈ కోమల వాలుకాతటము ఎంత సుందర ముగ యున్నది? శరదృతువు నందు వికసించిన కమలముల పరాగము తో ఈ ప్రదేశము నిండియున్నది. శీతలము, సుగంధభరితము, మరియు మందగమనము తో కూడిన వాయు సౌరభము అత్యంత ఆహ్లాదకరముగ యున్నది. ఈ సుందర యమునా తీరము భ్రమరముల ఘంకారములతో నిండిన లతాకుసుమ భరితమయిన మండపములతో సుశోభితమై యున్నది. దినము నందు ఒక పహరము గడచి మధ్యాహ్న భోజన సమయము అగుచున్నది. ఈ స్థానము భోజనమునకు మిక్కిలి ఉపయుక్తముగ యున్నది. గోవులు సహితము తీయని యమునా జలములు త్రాగి ఈ చిక్కని పచ్చిక బయిళ్ళ యందు గ్రాసము స్వీకరించుచున్నవి. వారందరూ యమునా తటమున మధ్యాహ్న భోజనమునకై కూర్చుండిరి.

ఇంతలో కొంతమంది బాలురు తమ వద్ద ఏమియునూ తినుటకు లేవని గ్రహించి దీనవదనులై శ్రీకృష్ణునితో ఇట్లనిరి, "కృష్ణా! మా వద్ద భోజన పదార్ధములు ఏమియును లేవు. నందగ్రామము సహితము బహు దూరముగ యున్నది. అందుచే మేము గోవులను తీసికొని వెళ్ళుదుము." అంత కృష్ణ భగవానుడు "ప్రియ సఖులారా! శోకించవలదు. నా మాటపై నమ్మక ముంచి నిశ్చింతగ యుండ వలసినది. నేను మీ అందరికి ప్రయత్నపూర్వకముగ భోజనమును ఒసగెదెను." ఆ మాటలు వినిన గోపబాలకులు ఆయన వద్దనే కూర్చొని ఉండిరి. తమ చద్ది అన్నములు తెచ్చుకొనిన గోపకులు తమ పాత్రలను తెరచి తాము తెచ్చుకొనిన పదార్ధములు తినసాగిరి. అంతలో శ్రీకృష్ణుడు వారికి ఎదురుగ ఒక రాజసభను సాక్షాత్కరింప జేసెను. శ్రీకృష్ణుడు పచ్చని పట్టు పీతాంబరము ధరించెను. అన్య గోపబాలకులు రంగు రంగుల వస్త్రములు ధరించి ఆయన చుట్టూ కూర్చుండిరి.

"విదేహరాజా! ఆ సమయమున గోప పరివేష్ఠితుడయిన శ్రీకృష్ణుడు దేవతలచే పరివేష్ఠితుడయిన దేవరాజు ఇంద్రుని వలె, చిత్ర విచిత్ర ఆకర్షణ పత్రములచే పరిరక్షింపబడుచున్న స్వర్ణకమల కర్ణిక వలె ప్రకాశించు చుండెను. కొంతమంది బాలకులు కుసుమములను, కొందరు అంకురములను, కొందరు పల్లవములను, కొంతమంది ఆకులను, మరికొంతమంది ఫలములను, కొంతమంది తమ చేతులను, కొందరు రాళ్ళను తమ పాత్రలుగ జేసికొని తినుట ప్రారంభించిరి. ఇంతలో ఒక బాలుడు లేచి తన ఆహారమును శ్రీకృష్ణునికి అర్పించెను. ఆయన కొంచెము తీసికొని ఈ విధముగ పలికెను. "అన్నలారా! మీ భోజనములను అన్య బాలకులతో కలసి పంచుకొనవలసినది." అందుకు అందరూ అంగీకరించి తమ తమ భోజనము లందు కొంత భాగము మిగిలిన బాలకులతో పంచుకొనిరి. వారు మిక్కిలి ఆనందపడ అందరూ కలసి నవ్వుచూ, త్రుళ్ళుచూ భోజనములు తీసికొన ప్రారంభించిరి. సుబలుడు తన భోజనమును శ్రీకృష్ణునకు తిరిగి అర్పించెను. హరి తిరిగి కొంచెము తీసికొని మిగిలినది వెనుకకు ఇచ్చెను. ఇట్లు ఎవరెవరు తమ భోజనములను ఇతరులతో పంచుకొనిరో వారందరూ ఆనంద పరవశులగు చుండిరి.

ఇంతలో శ్రీదాముడు తన భోజనమును శ్రీకృష్ణునితో, ఇతర బాలకులతో పంచుకొనెను. వ్రజబాలకులు అందరూ ఆతనిని ప్రశంశించిరి. అంత వరూధపుడు కొంచెము కోపముతో తన భోజనమును శ్రీకృష్ణ గోపకులతో పంచుకొనెను. ఆతని గ్రాసను సహితము అందరూ కొంచెము కొంచెము సేవించి "ఇయ్యది కూడా సుబలుని గ్రామసము వలె యున్నది. దీనిని తిని మేము ఉద్విగ్నుల మగుచున్నాము" అని పలికిరి. ఇట్లు ఒకరినొకరు తాము తెచ్చుకొనిన భోజనములను ఇచ్చి పుచ్చుకొనుచు, నవ్వుచు, నవ్వించుచూ, సంతుష్టాంగ తరంగులయిరి.

శ్రీకృష్ణుడు కటి వస్త్రము నందు వేణువు, బాహుమూలము నందు వేత్రము, ఎడమచేతి యందు భోజనము ముద్ద, అంగుళుల మధ్య ఫలములు, శిరమున కిరీటము, భుజముపై పచ్చని పట్టు వస్త్రము, కంఠము నందు వనమాల, నడుమునకు వడ్డాణము, పదములకు నూపురములు, హృదయము నందు శ్రీవత్సము మరియు కౌస్తుభము ధరించి గోపబాలకులు మధ్య కూర్చొని తన వినోద భరిత సంభాషణ చే వారిని నవ్వించుచూ; తాను నవ్వుచూ క్రీడా వినోదముల మధ్య మునిగి తేలుచుండెను. యజ్ఞ భోక్త అయిన శ్రీకృష్ణుడు ఇట్లు భుజించుట కాంచిన దేవతలు సహితము ఆశ్చర్య చకితులయిరి. ఈ విధముగ శ్రీకృష్ణుడు గోపబాలురు వినోద క్రీడలందు మునిగితేలుచున్న సమయమున గోవత్సములు

నెమ్మది నెమ్మదిగ లేతగడ్డి లాలస చే దూరమగ యున్న ఒక వనాంతరాళమున చేరెను.

అంత గోపబాలకులు భయవ్యాకుల చిత్తులయిరి, అంత శ్రీకృష్ణుడు గోపబాలకులను మీరు ఇక్కడనే యుండవలసినది అని వారిని సముదాయించి చేతియందు భోజనము నిడుకుని గోవత్సములను వెదుకుటకు వనమున ప్రవేశించెను. అఘాసుర ముక్తి కాంచిన పద్మయోని సంభవుడయిన చతుర్ముఖ బ్రహ్మదేవుడు యమునా తటము చేరి గోపబాలకులతో క్రీడించుచున్న శ్రీకృష్ణుని చూచి ఇట్లు తలపోసెను “ఈతడు శ్రీహరి అయినచో ఈ అపవిత్ర భోజనమును ఎట్లు గ్రహించును? ఈతడు దేవాధిదేవుడయిన శ్రీహరి కాజాలడు. కేవలము గోపకుమారుడు అయి ఉండవచ్చును. శ్రీహరి మాయ యందు మునిగి బ్రహ్మదేవుడు ఈ విధముగ తలపోసెను. అనంతరము చతుర్ముఖ బ్రహ్మ భగవానుని మనోజ్ఞ మహిమను తెలిసికొనుటకై నిశ్చయించుకుని ఆకాశము నందు ఉపస్థితుడై సమస్త గోవత్సములను గోపబాలకులను అపహరించి అచటి నుండి అంతర్ధానమయ్యెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన బ్రహ్మదేవుని ద్వారా గోవత్సములు మరియు గోపబాలకుల అపహరణమను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(బ్రహ్మ దేవుని ద్వారా శ్రీకృష్ణుని సర్వ వ్యాపకత్వము మరియు విశ్వాత్మ స్వరూపము యొక్క దర్శనము)

నారదుడు చెప్పదొడండెను “గోవత్సములను వెదుకుటకై ఏగిన శ్రీకృష్ణుడు వాటిని కనుగొనలేక యమునా తటమునకు తిరిగి వచ్చెను. అచట గోప బాలకులు సహితము కానరాలేదు. గోపబాలకులను, గోవత్సములను వెదకుచూ తిరుగు చుండగా ఆయన మనసునందు ఇట్లు తలపోసెను “ఇది అంతయు బ్రహ్మదేవుని మాయ.” అంత అఖిల విశ్వ విధాయకుడయిన శ్రీహరి గోవులకు, గోపవనితలకు ఆనందము కలుగజేయుటకై తనను తాను రెండు భాగములుగ విభజించు కొనెను. మొదటి భాగము చే తన స్వస్వరూపముతో భాసించి, రెండవ రూపముతో సమస్త గోపబాలురు, గోవత్సముల రూపము దాల్చెను. ఆ గోపాల బాలురు ఏ విధమయిన గుణ, రూప, స్వభావ, భాషణ సంయుక్తులో అట్లే తాను కూడా మారిపోయెను. భగవానుడయిన శ్రీహరి ఎట్లు తన శ్రీ విగ్రహము నుండి సృష్టి చేయునో ఆ విషయమును ప్రత్యక్షముగ చూపెను. అహా! విశ్వమంతయు విష్ణుమయము గదా! శ్రీకృష్ణుడు సాయం సమయమున గోప బాలకులు, గోవత్సములతో నందవ్రజము చేరెను. గోవత్సములు తమ తమ గోష్ఠములు చేరినవి. గోపబాలకుల వేషమున యున్న శ్రీహరియు ప్రతిదినము వలె వారి వారి ఇండ్లకు చేరెను. వంశీరవము విన్న గోపకాంతలు తమ ప్రియ పుత్రులను కాంచి, చేరదీసి, ప్రియముగ పాలు, పెరుగులు నివేదించిరి. గోవులు సహితము తమ గోవత్సములను చేరదీసి, అంబారావము చేయుచూ, ప్రేమమీర పాలను ఇచ్చినవి. గోప స్త్రీలు తమ బాలకులకు స్నానాదికములు గావించి, భోజనములిడి, తదుపరి శ్రీకృష్ణ దర్శనమునకై ఏతెంచిరి.

అటు పిదప గోప బాలకులకు వివాహములు జరిగినవి. శ్రీకృష్ణుడు గోపబాలకుల రూపమున కోట్లాది గోప వధువులకు ప్రీతి కల్గించు చుండెను. ఈ విధముగ వేడుకలతో రోజులు గడుచుచు దగ్గర దగ్గరగా ఒక సంవత్సరముల నిండెను. ఆ సమయమున బ్రహ్మదేవుడు కూడా గోవత్సములను, గోపబాలకులను అపహరించి అయిదు, ఆరు రాత్రుల శేషమున ఒక సంవత్సరము గడచెను. గోవులు దూరముగ గడ్డి మేయుచున్న గోవత్సములను చూచి, వాటి వద్దకు వచ్చి, తమ అమృతతుల్య దుగ్ధమును ప్రేమపూర్వకముగ వాటికి త్రావించినవి. గోపకులు దూరము నుండి గోవులు తమ పాలను గోవత్సములకు త్రాగించుట చూచి, మిక్కిలి మండిపడి, గోపబాలకులను దండించుటకై పర్వతము వీడి క్రిందకు దిగిరి. కానీ గోప బాలకులను చూచుట తోడనే వారి కోపము కరిగి స్నేహ, ప్రేమ భావము ఉత్పన్నమై వారిని తన

ఒడిలోనికి తీసికొని లాలింపసాగిరి. సర్వజనులు, వృద్ధులు, యువకులు, అందరి నేత్రములు యందు ప్రేమపూరిత భాష్పములు అంకురించెను.

గోపాలురు అందరూ గోవులతో, తమ పుత్ర, పౌత్రులతో కలసి అక్కడనే కూర్చుండి సుఖలాపములు కావించుచుండిరి. సంకర్షణ బలరాముడు గోపాలకులు ఈ ప్రకారముగ ప్రేమపరాయణులగుట గమనించి, తనమనసున అనేక సందేహము లుదయించగా ఇట్లు తలపోసెను, "అహా! ఒక సంవత్సర కాలము నుండి ఈ వ్రజభూమి నందు స్నేహ, వాత్సల్య, ప్రేమ భావనలు మిక్కుటమై దినదిన ప్రవర్ధమానమగుచున్నవి. ఏమీ! ఇది రాక్షసులు, దేవతల, లేక గంధర్వుల మాయ కాదుకదా! కాదు కాదు. ఇది కేవలము నన్ను సహితము మోహింపచేయు శ్రీకృష్ణ మాయ తప్ప వేరుకాదు. ఈ విధముగ తలపోయుచు, తన నిజనేత్రములు బంధించి దివ్య చక్షువుల ద్వారా భూత, భవిష్యత్, వర్తమాన కాలములను కాంచెను. ఆయనకు సమస్త గోవత్సముల యందు, పర్వత సానువుల యందు, క్రీడించుచున్న గోపబాలకుల యందు వంశీ, వేత్ర విభూషితుడు, నెమలి పింఛధారి, శ్యామవర్ణుడు, మణియమ హారములు మరియు కమల, కుముదినీ మాలా శోభితుడు, దివ్య మనోహర కిరీట ధారుడు, కుండలాలంకృతాంగుడు, నుదిటి యందు నల్లని ముంగురుల అలుకలతో దీపించు సుందరాంగుడు, శరత్కాల కమల సదృశ నేత్రుడు, కోట్లాది కామదేవుల శోభా సంపన్నుడు, నాసాగ్రమున నవ మౌక్తికాలంకారుడు, శిఖామండిత భూషిత యుక్తుడు, కరద్వయము నందు దివ్య భూషణ వేష్టుడు, పచ్చని పట్టు పీతాంబర ధారి, కటి యందు మేఖల, పదముల యందు కంకణములు మరియు నూపురములచే ఆభూషితుడు, కోట్లకొలది బాల్యసూర్యుల పగిది ప్రకాశించుచున్న మనోహర శ్రీకృష్ణుడు కానబడెను. బలరామునకు గోవర్ధమునకు ఉత్తరముననూ, యమునానదికి దక్షిణముననూ యున్న సమస్త బృందావనము కృష్ణ మయముగా గోచరించెను.

అంతట సంకర్షణుడు ఈ కార్యము శ్రీకృష్ణుడు మరియు బ్రహ్మదేవుని చే ఆడబడుచున్న లీలగా గ్రహించి తిరిగి గోవత్సములను, గోపబాలకులనూ కాంచుచూ, ముకుందుని చేరి ఇట్లనియె "మహాప్రభూ! బ్రహ్మ, అనంతుడు, ధర్ముము, ఇంద్రుడు, మరియు శంకర భగవానుడు భక్తియుతులై సదా, సర్వదా, నీ సేవా పరాయణులై యుందురు. నీవు ఆత్మారాముడవు, మరియు పూర్ణకాముడు వయిన పరమేశ్వరుడవు. నీవు శూన్యము నందు కోట్లాది బ్రహ్మాండములను సృష్టించగల సమర్ధుడవు." ఈ విధముగ బలదేవుడు శ్రీకృష్ణుని స్తుతించు చుండగా అదే సమయమున బ్రహ్మదేవుడు అచటికి ఏతెంచి, శ్రీకృష్ణ, బలరాములను, గోప, గోవత్సములను కాంచి "అహా! నేను దాచి యుంచిన గోప గోవత్సములను తిరిగి శ్రీకృష్ణుడు వెనుకకు తీసికొని వచ్చెనని మనమున ఊహించి తాను వారిని దాచియుంచిన స్థలమునకు ఏగెను. అచట తాను ఏ విధముగ గోప, గోవత్సములను ఉంచెనో అవి అట్లేయుండుట చూచి తిరిగి వ్రజభూమికి తిరిగి వచ్చి, శ్రీకృష్ణ సహిత గోప గోవత్సములను గాంచి విస్మయుడాయెను.

"ఆహా! ఏమి విచిత్రము! వీరు ఇచటికి ఎట్లు ఏతెంచిరి? ఆ కార్యము చేయుటకు తృటికాలము పట్టిననూ, భూలోక కాలమానము ప్రకారము ఒక సంవత్సరము పట్టినది. ఎల్లరూ ప్రసన్నులై యుండిరి. ఎవరికీ ఆ సంఘటన జరిగిన స్మృతి లేదు. ఇట్లు తలచి బ్రహ్మదేవుడు మోహాతీతుడయిన విశ్వమోహనుని మోహింప చేయు సమకట్టెను. కానీ తన మాయాంధకారమున తానే పడి తన శరీరమును సహితము బ్రహ్మదేవుడు కానక అయోమయుడాయెను. గోపబాలకుల హరణము చే జగత్పతి అయిన శ్రీకృష్ణునికి హాని జరుగలేదు కానీ బ్రహ్మదేవుడు శ్రీకృష్ణరూప భానుని ముందు మిణుగురు పురుగు వలె భాసించెను. బ్రహ్మదేవుడు ఇట్లు జడీభూతుడై మోహాంధకారమున చిక్కుకొనుట కాంచిన శ్రీకృష్ణ భగవానుడు కృపాదృష్టుడై తన మాయను ఉపసంహరించి తన నిజ స్వరూపమును బ్రహ్మదేవునకు చూపెను. అంత బ్రహ్మదేవుడు భక్తి ద్వారా జ్ఞాన నేత్రము విచ్చుకొని గోపకుల యందు, గోవత్సముల యందు శ్రీకృష్ణుని కాంచెను. రాజా! చతుర్ముఖ బ్రహ్మ తన శరీరమునకు లోపలా, వెలుపలా సర్వజగత్తు, విష్ణుమయము గా కాంచెను. ఈ విధమయిన దర్శనమును కని బ్రహ్మదేవుడు నిశ్చేష్టుడాయెను.

బృందాదేవి చే అధిష్ఠాన మయిన బృందావనము నందు ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు జరుగు భగవానుని దివ్యలీలా విశేషములను గ్రహింప శక్యము గాని బ్రహ్మదేవుని అసమర్ధతను గ్రహించిన శ్రీకృష్ణ భగవానుడు తన మాయావరణమును ఉపసంహరించెను. అపుడు బ్రహ్మదేవుడు దివ్య చక్షువులు పొంది అజ్ఞానావస్థ నుండి మేల్కొని, అతి కష్ఠమున కన్నులు

తెరచి తనతో పాటుగా బృందావనమును చూచుటకు సమర్థుడాయెను. ఆయన ఏకాగ్రుడై దశదిశలను ఏకకాలమందు చూచుచుండగా వసంతకాల లతా కుసుమయుక్త రమణీయ బృందావనము దర్శనమిచ్చెను. అచట తోటల యందు బాలకులతో మృగశాబకములు ఆడుచుండెను. పాము, ముంగిస తమ జన్మమాత్ర వైరమును మరచి పాము పడగ నందు ముంగిస సేదదీరు చుండెను. ఇంకనూ బ్రహ్మదేవుడు చేతినందు భోజనము నిడుకొని గోప, గోవత్సములను వెదకుచున్న బాలకృష్ణుని సహితము కాంచెను. అంత బ్రహ్మదేవుడు ఈ బాలకుడు కేవల గోపబాలకుడు కాడు. సాక్షాత్ గోలోకపతి అయిన శ్రీహరి గా తెలిసికొని శ్రీకృష్ణ రూపమును ప్రసన్నము చేసికొనుటకై బ్రహ్మదేవుడు తన హంసవాహనమును దిగి, సిగ్గుచే అవనిత శిరస్కుడై, సాష్టాంగ దండ ప్రణామము లాచరించి భయ భక్తులతో నెమ్మది నెమ్మదిగ శ్రీకృష్ణుని చేరెను. అంతట బ్రహ్మదేవుడు తన కన్నుల వెంట కారుచున్న భాష్పముల చే అర్ఘ్య ప్రధానము కావించి దండము వలె ఆయన పాదముల వద్ద భూతలము పై పడెను.

అంత శ్రీకృష్ణుడు తన చేతులతో బ్రహ్మదేవుని లేవనెత్తి, స్వస్థుని గావించి ప్రేమమీర ఆయన శరీరమును నిమిరెను, మరియు దూరముగ భయ భ్రాంతులైయున్న దేవతా సమూహమును సుధా సిక్త దృష్టిచే కాంచెను. వారందరూ ఉచ్ఛస్వరముచే జయజయ ధ్వానముల తో స్తోత్ర ప్రణామము లాచరించిరి. శ్రీకృష్ణ దేవుని దయా కటాక్ష వీక్షణముల పొందిన దేవతలు సంతుష్టాంగ తరంగు లయిరి. బ్రహ్మ తిరిగి భగవానుని కాంచి, భక్తియుక్త మనస్కుడై రెండు చేతులు జోడించి, రోమాంచితుడై తిరిగి దండము వలె ఆయన పాదములకపై బడి గద్గద స్వరముతో ఇట్లు పలికెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన బ్రహ్మదేవునిచే శ్రీకృష్ణుని యొక్క సర్వవ్యాప్తి విశ్వాత్మ దర్శనమను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(బ్రహ్మదేవుని ద్వారా శ్రీకృష్ణ స్తుతి)

బ్రహ్మదేవుడు ఇట్లు పలికెను "మేఘము నందలి విద్యుల్లత వలె వస్త్రధారణ చేదువాడు, అమృత తుల్యములగు తియ్యని పలుకులు పలుకువాడు, పరాత్పరుడు, వంశీధరుడు, మయూరపింఛధారి అయిన శ్రీకృష్ణ ప్రభువునకు, ఆయన ప్రియ భ్రాత అయిన బలరామునకు సమస్కరించుచున్నాను. శ్రీకృష్ణా! మీరు సాక్షాత్ పురుషోత్తములు, పూర్ణ పరమేశ్వరులు, ప్రకృతికి అతీతమయిన శ్రీహరి. మా దేవతలందరూ ఎవరి అంశ మరియు కళావతారములో, ఎవరి శక్తిచే సృష్ఠి, స్థితి, మరియు లయలను కావించుచున్నామో అట్టి పరమాత్మ శ్రీకృష్ణచంద్ర రూపమున ధరాధామమునందు నందపుత్రునిగ అవతరించెను. మీరు గోపబాలకుల సహితువై గోప వేషమున గోచారము చేయుచూ, విరాజిల్లు చుండిరి. కోట్లాది కామ దేవులను మించిన రమణీయ, తేజోమయ, కౌస్తుభధారి, సుందరుడయిన శ్రీహరికి నేను ప్రణామము లాచరించుచున్నాను. మేఘముల నుండి నిర్లిప్తమయిన ఆకాశము వలె ప్రాణుల దేహములందు క్షేత్రజ్ఞ రూపమున వెలయువాడు, చైతన్య స్వరూపుడు, అధియజ్ఞుడు, మాయా రహితుడు, నిర్మల భక్తి యరియు ప్రబల వైరాగ్యముల చే మాత్రమే ప్రాప్తి నొందువాడు అయిన ఆది దేవుడు శ్రీహరికి వందనములు అర్పించుచున్నాను.".

సర్వజ్ఞా! ఎపుడు ప్రజల మనసు నందు రజోగుణము ఉత్పన్నమగునో ఆ సమయమున మనసు సంకల్పవికల్పమాన మగును. సంకల్ప వికల్పమాన మనసు నందు అభిమానము ఉత్పన్నమగును. ఆ అభిమానము నెమ్మది నెమ్మదిగ బుద్ధిని హరించును. క్షణములో మాయమగు విద్యుల్లత వలె, ఎల్లప్పుడూ మారుచుండు ఋతుగుణముల వలె, జలము నందు గీయబడిన రేఖ వలె, పిశాచము ద్వారా ఉత్పన్నమగు అగ్నికణము వలె, కపట యాత్రికుని సాధు పర్తనము వలె జగత్తు నందు సుఖము కేవలము మిథ్య, అలాత చక్రము (మండుచున్న కట్టె గుండ్రముగ త్రిప్పుట చే కానబడు క్షణభర వృత్తము) వలె విషయ సుఖములు దు:ఖములచే నిండి యున్నది. వృక్షములు తమంతట తాము కదులనప్పటికీ, జల

వేగము చే ఎట్లు కదులుచున్నట్లు కానబడునో, నేత్రములు వేగముగ కదిలినపుడు అచలమయిన పృధ్వి సహితము ఎట్లు చలించునట్లు కానబడునో, అట్లే కృష్ణా! ప్రకృతి నుండి ఉత్పన్నమయిన, త్రిగుణముల చే వశీభూతులయిన జీవులు ప్రకృతి జన్య సుఖములను సత్యమని తలంచెదరు.

సుఖదుఖ:ములు రెండును మనసు నందు ఉత్పన్నమయి, నిద్రావస్థయందు లిప్తమయి, తిరిగి జాగ్రదావస్థ యందు అనుభవైక్యమగును. ఎవరికి ఈ వివేకము ప్రాప్తించునో, వానికి ఈ జగత్తు సహితము నిరంతర స్వప్నావస్థ సమానము. జ్ఞానులు ఎల్లప్పుడు మమకార, అహంకార, అభిమాన వర్జితులై, వైరాగ్యసహితులై, శాంతి యుతులై, యుందురు. ఒక్క దీపము నుండి ఎట్లు వందలాది దీపములు ఉత్పన్నమగునో, అట్లే ఒకే పరమాత్మ నుండి సర్వ జగత్తు ఉత్పన్నమయినది. వివేకవంతుడు ఇట్టి తాత్విక దృష్టి కలిగి యుండును. భక్తుడు నిర్ధూప అగ్ని శిఖ వలె గుణ విముక్తుడై, ఆత్మనిష్ఠుడై, హృదయము నందు బ్రహ్మదేవుని స్వామి అయిన భగవానుడు వాసుదేవుని భజించుచుండును. ఎట్లు ఒకే చంద్రబింబము అనేక ఘటము లందు ప్రతిబింబించునో, అట్లే పరమహంసలు సహితము ఈ జగత్తు నందు ఏకత్వమును గ్రహించి కృతార్ధులగుదురు. వేదము నిరంతరము స్థోత్రపారాయణ చేసినప్పటికీ, శ్రీహరి యొక్క మహాత్మ్యము నందు పదహారవ వంతు కూడా వర్ణింప నశక్యమయినది. ఇంక ఈ జగత్తు నందు ఎవరు ఆయన గుణరూప వర్ణన చేయగలరు? చతుర్ముఖములతో నేను, పంచముఖములతో దేవాధిదేవుడయిన శంకర భగవానుడు, సహస్రఫణుడయిన శేషుడు తన సహస్ర ముఖముల చే ఎవరిని స్థుతించు చున్నామో, వైకుంతవాసి అయిన విష్ణువు, క్షీరోదసాయి అయిన శ్రీహరి, ధర్మ సుతుడయిన నారాయణ మహర్షి, కూడా అట్టి గోలోక పతి అయిన మీ సేవ చేయుచున్నారు. మురారీ! మీ మహిమ ధన్యము. సురాసుర ముని సంఘములు, భూతలము నందు మనుష్య ముని గణములు, కూడా మీ మహిమ నెరుంగుట యందు అసమర్ధులు. వీరందరూ స్వప్నము నందు కూడా మీ చరణ కమల దర్శనము చేయలేరు. గుణసాగరుడు, ముక్తిదాత, పరాత్పరుడు, రమాపతి, గుణేశుడు, వ్రజేశ్వరుడు, అయిన శ్రీహరికి నేను నమస్కరించుచున్నాను.

తాంబూల రాగ రంజిత సుందర ముఖ సుశోభితుడు, మధుర భాషి, బింబాధరుడు, స్మిత ముఖుడు, మల్లెమొగ్గల వంటి తెల్లని దంత పంక్తులు కలవాడు, నల్లని ముంగురులచే ఆవృతమయిన కపోలములు గలవాడు, మనోహర మయిన బాలభానుని కాంతితో ఊగుచున్న సువర్ణ కుండల మండితుడు, అయిన శ్రీకృష్ణునికి నమస్కరించుచున్నాను. మీ పరమ సుందర రూపము మన్మధుని హృదయమును సహితము హరించును. నా కనుల యందు ఎల్లప్పుడు మకర కుండల ధారి మరియు శ్యామసుందరుడయిన శ్రీకృష్ణుని రూపము ప్రకాశించుగాక! ఎవని లీల వైకుంతుని లీల కంటే శ్రేష్ఠ మయినదో, ఎవని మనోహర రూపమునకు దేవ గణములు సహితము నమస్కరించునో, అటు వంటి గోపలీలాధరుడు, గోలోక నాధునకు శిరసు వంచి సమస్కరించుచున్నాను. వసంత ఋతువు నందలి మధుర కంఠధ్వని గల కోకిలాది పక్షిగణములచే నిండినది, సుగంధితము మరియు మెత్తని పల్లవముల తో నిండిన వృక్షములచే ఆవృత మయినది, అమృత మయమయిన చల్లని మందపవనములు వీచుచున్న బృందావనము నందు సంచరించుచున్న శ్రీకృష్ణ ప్రభువునకు జయమగుగాక! ఆయన సదా భక్తులను సంరక్షించు గాక!

శ్రీకృష్ణా! మీ విశాల నయనములు వెలువరించు అపార సౌందర్యము కమలముల యొక్క గర్వము మరియు మెరయుచున్న ముత్యముల దురభిమానమును దూరము చేయును. ఎవని నఖములు శరత్కాల వెన్నెల వలె సుఖకరము మరియు సురక్తము అయి హృదయ గ్రహణి అయిన గాఢాంధకారమును, మరియు సమస్త ప్రాణి కోట్ల పాపములను ధ్వంసము చేయునో అట్టి శ్రీహరిని ఆరాధించు చున్నాను. మహాప్రభూ! మీ గుండ్రని నూపురములు శ్రీ విష్ణుదేవుని సుదర్శనము వలె, సూర్యదేవుని రధ చక్రము వలె ప్రకాశించుచున్నవి. మీ నడుము చుట్టూ చిన్ని చిన్ని గంటలు కట్టబడిన వడ్డాణము మెరయుచున్నది. నేను అక్లిష్ఠకర్ముడయిన శ్రీకృష్ణ భగవానుని ఈ విధమయిన రూపమును ఆరాధించుచున్నాను.

ఎవరి భృగు పదాంకితమయిన విశాల వక్షము నందు లక్ష్మీదేవి నివాసముండునో, ఎవని మెడలో తారల వలె భాసిల్లు ముత్యాల హారములు శోభిల్లునో, ఎవరు సింధూర వర్ణము గల సుందర అంగుళులతో మురళిని వాయించుచుందురో, ఎవని అంగుళుల యందు సువర్ణ అంగులీయకముల ప్రకాశించు చుండునో, ఎవని హస్తములు ఎల్లప్పుడూ

భూసురోత్తములకు దానములు ఇచ్చుచూ, వెన్నెల సమానమయిన నఖములతో మెరయుచుండునో, ఎవని గమనము రాజహంసలను సహితము తలతన్నునో, ఎవని భుజములు మెడవరకు బలిష్ఠములై యుండునో, అటువంటి శ్రీహరిని నేను స్మరించుచున్నాను.

ఎవరు శుద్ధ దర్పణము వలె నిర్మలుడు, సుఖదుడు, మరియు నవయవ్వన విరాజితుడు, మనుష్యులకు రక్షకుడు మరియు మణికుండల వేష్ఠితుడు, చక్కని ఉంగరములు తిరిగిన ముంగురులచే సుశోభితుడు మరియు సూర్యచంద్రుల భాతి ప్రకాశించుచున్న కపోలములు గల శ్రీకృష్ణుని నేను సర్వదా స్మరించుచున్నాను. సువర్ణ, రత్న, వైఢూర్య, ముత్యములు నిండిన ఎర్రని వస్త్రము చే నిర్మితమయినది, కామదేవుని ముఖమండలమున విలసిల్లు సంపూర్ణ సౌందర్యముతో నిండినది, కోట్ల కొలది సూర్య చంద్రుల ప్రకాశమును మించినది, ఎల్లప్పుడు మయూర పింఛము చే పరివేష్ఠిత మయినది అయిన శ్రీకృష్ణుని కిరీటమునకు నమస్కరించుచున్నాను.

ఎవరి ముఖద్వారమున సాక్షాత్ కార్తికేయునకు, గణేశునకు, ఇంద్రునకు, సూర్య చంద్రులకు, సహితము ప్రవేశము లేదో, ఎవని ఆజ్ఞ లేకున్న ఎవరునూ నికుంజ ప్రవేశమునకు అర్హులు కారో, అట్టి శ్రీకృష్ణదేవుని నేను ఆరాధించుచున్నాను.

బ్రహ్మదేవుడు ఈ విధముగ శ్రీకృష్ణుని కీర్తించి, చేతులు జోడించి, తిరిగి ఇట్లనియె "జగద్భర్తా! నేను మీ నాభి నుండి ఉత్పన్నమయితిని. ఎట్లు తల్లి తన తనయుల తప్పిదములను క్షమించునో, అట్లే మీరు కూడా నా అపరాధములను మన్నింపవలయును. వ్రజపతీ! కేవలము ఒక్క లోకమునకు అధిపతి అయిన నేను ఎక్కడ? కోట్లాది బ్రహ్మాండములకు అధిపతులయిన మీరు ఎక్కడ? అందుచే ఓ! వ్రజేశ్వరా! మధుసూదనా! దేవా! నన్ను రక్షించండి. ఎవని మాయచే దేవ, దానవ, మనుష్యాది సమస్తము మోహితులగుచున్నారో అటువంటి మిమ్ములను మూర్ఖుడనై నేను మోహింపజేయ దలచితిని. గోవిందా! మీరు నారాయణులు. నేను నారాయణుని కాను. మీరు కల్పాది యందు బ్రహ్మాండము యొక్క రచన చేసి నారాయణ స్వరూపముతో శేషశాయిగా పరిణమించిరి. మీ యొక్క ఏ బ్రహ్మ తేజము నందు యోగిజనులు లీనమగుదురో బాలఘాతిని అయిన పూతన సహితము తన కులముతో సహా అదే తేజము నందు లీనమయినది. మాధవా! నా అపరాధము చే మీరు గోపబాలురుగ, గోవత్సములుగ వనము నందు తిరుగువలసి వచ్చినది. అందుచే మహాప్రభూ! నన్ను మన్నించి, క్షమించ వలసినది. తండ్రి ఎట్లు తన తనయుని అపరాధమును ఉపేక్షించునో అట్లే మీరును నా అపరాధమును క్షమించి నా యందు ప్రసన్నులు కండు.

ఎవరు మీ యందు భక్తి లేక జ్ఞానరతులు అగుచున్నారో వారు నిరంతర క్లేశముల పాలగుచున్నారు. ఎట్లనగా గడ్డి కొరకు భూరి పరిశ్రమ చేసి భూమిని దున్ను కర్షకులకు గడ్డి మాత్రమే లభించును కదా! కానీ మీ యందు నిరంతర భక్తిభావము గల యోగులు, మునులు మరియు వ్రజవాసులు మిమ్ములను శ్రీఘ్రముగ పొందగలుగు చున్నారు. శ్రవణము, మరియు దర్శనము అను రెండు ప్రకియల ద్వారా వారికి మీ యందు మిక్కిలి రతి గలిగినది. కానీ మీ యొక్క మాయావశమున నాకు మీ యందు భక్తి కలుగలేదు.

బ్రహ్మదేవుడు ఈ విధముగా పలికి కన్నుల వెంట అశ్రుధారలు ప్రవహించు చుండగా శ్రీకృష్ణుని పాద పద్మములకు పదే పదే ప్రణమిల్లుచు తన అపరాధ క్షమాపణకై మిక్కిలి భక్తిభావము తో తిరిగి ఇట్లు నివేదించెను. "మీకు అభ్యంతరము లేనిచో నేను గోకులము నందు జన్మించి మీ పాద పద్మములు ఆరాధించెదను. ఇంద్రియాధిష్ఠాతలమయిన మా దేవతలందరూ ఈ వ్రజవాసులు శరీరము నందు ప్రవేశించి ఒక్కమారు శ్రీకృష్ణుని దర్శించిన యెడల మేము మిక్కిలి ధన్యుల మగుదుము. శ్రీకృష్ణా! మీ మాతా పితరుల,ఈ వ్రజవాసుల అనిర్వచనీయ సౌభాగ్యము నేమని చెప్పుదును? ఈ వ్రజము నందు నివసించుచూ మీ పూర్ణ స్వరూపమును నిరంతరము దర్శించుచున్నారు.

సర్వ జగత్తుకు కర్త, విశ్వ రచయిత, సర్వాధారుడు, రవి తనయ అయిన యమున యందు విహరించు క్రీడా పరాయణుడు, శ్రీకృష్ణావతారము ధరించిన జగద్భర్తా! నన్ను రక్షింపుము. వృష్ణి కుల సరోవరమున ఉదయించిన కమల స్వరూపా! నందనందనా! రాధాపతీ! మదనమోహనా! దేవదేవా! వ్రజపతీ! గోకులపతీ! గోవిందా! దేవదేవా! మాయా మోహితుడనైన నన్ను రక్షింపవలసినది! రక్షింపవలసినది!!"

లోకపతి పితామహుడయిన బ్రహ్మ ఈ విధముగ సుందర బృందావనాధీశ్వరుడయిన గోవిందుని స్తుతించి,

మూడుమార్లు ప్రదక్షిణ మాచరించి, ప్రణామములు చేసి, గోవత్సములకు, గోపబాలకులకు వరములిచ్చి వెడలుటకు అనుమతి కోరెను. అనంతరము శ్రీహరి, బ్రహ్మదేవుడు వెడలుటకు కనుసైగ చేసెను. పితామహుడయిన బ్రహ్మ మరియొక మారు ప్రమాణము చేసి తన సత్యలోకమునకు చనెను. అనంతరము శీఘ్రముగ శ్రీకృష్ణుడు గోవత్సములను, గోపబాలకులను యమునా తటమునకు చేర్చెను. గోవత్సములతో వచ్చుచున్న శ్రీకృష్ణుని గోపబాలకులు చూచి "కృష్ణా! నీవు తొందరగా వచ్చి భోజనము చేయవలిసినది. నీవు లేని కారణమున మేము సహితము సీతాగ్రాసము నారగింప లేదు. అంత శ్రీకృష్ణుడు మందహాసము చేయుచూ వారితో కలసి భుజించి పిదప వారికి అజగరము యొక్క దేహమును చూపెను. అనంతరము శ్రీకృష్ణుడు బలరామ సహితుడై, గోవత్సములను ముందర నిడుకొని నెమ్మది నెమ్మదిగ వ్రజభూమికి తరలెను. తెలుపు, నలుపు, ఎరుపు, దూమ్రవర్ణము మొదలుగా అనేక రంగులు, స్వభావములు గల గోవత్స సహితుడై సుఖదవనము నుండి మరలి వచ్చుచున్న నందనందనునికి నేను వందనము చేయుచున్నాను. శ్రీకృష్ణ విరహము చే క్షణమొక యుగముగ గడువు గోపికలకు శ్రీకృష్ణ దర్శనము చే మిక్కిలి ఆనందము కలిగినది. గోపబాలురు వారి వారి ఇండ్లకు వెళ్ళి గోవత్సములను గోష్ఠములు యందు కట్టి అఘాసుర వధ, మరియు శ్రీహరి ద్వారా ఆత్మరక్షణ వృత్తాంతమును తను కుటుంబములకు వర్ణించి చెప్పిరి.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన బ్రహ్మదేవుని ద్వారా శ్రీకృష్ణ స్తుతి యను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(యశోదా దేవి యొక్క విచారము. నందుని ద్వారా ఆశ్వాశము. బ్రాహ్మణులకు వివిధ ప్రకారముల దానము. శ్రీకృష్ణ బలరాముల గోచారము)

నారదుడు తిరిగి చెప్పదొడండెను "అష్టావక్రముని శాపము చే సర్పముగ మారిన అఘాసురుడు తిరిగి ఆయన ఇచ్చిన అమోఘవరముచే దేవతలకు సహితము దుర్లభమయిన పరమపదము మోక్షమును పొందెను. వత్సాసురుడు, బకాసురుడు, అఘాసురుడు ఇట్లు వరుసగా ఒకరి వెనుక ఒకరు శ్రీకృష్ణుని చంపుటకు యత్నించుట, దైవ వశమున ఎట్లో బాలకుడు కాపాడుబడుట, ఇవి అన్నియు గమనించుచున్న యశోదాదేవి చిత్తము భయముచే మిక్కిలి వ్యాకులమయ్యెను. ఆమె కళావతి, రోహిణి, గోపవృద్ధులు, వృషభానువరుడు, వ్రజేశ్వరుడయిన నందరాజు, నవ నందులు, నవ ఉపనందులు, ప్రజానీకమును, ఆరుగురు వృషభానులను ఆహ్వానించి వారందరి సమక్షమున ఇట్లు పలికెను. "మనము తొలుత మహావనము వీడి బృందావనము చేరితిమి. ఇక్కడ కూడా నా పుత్రునికి క్షణక్షణము ఆపదలు పొడమరించు చున్నవి. ఇచట నుండి నేను నా పుత్ర రక్షణార్ధము ఏ దూరదేశమునకు పోగలను? ఈ బాలకుడు స్వభావరీత్యా చపలుడు. వ్రజబాలకులు సహితము చపలురు. వీరు దినదినము ఆడుకొనుచు దూరదూరములకు ఏగుచున్నారు. పదునయిన చంపుటములు గల బకాసురుడు మెదట మా బాలకుని మ్రింగెను. వాని నుండి బయటపడిన పిదప ఈ అఘాసురుడు మొత్తము గోపబాలకులందరినీ తన ఆహారముగ చేసికొనెను. భగవంతుని కృపాకటాక్షము చే ఎట్లో ఈ బాలకులు రక్షింపబడిరి. వీటన్నిటికి ముందు వత్సాసురుడు వీరిని చంపచూజెను. వాని నుండియు ఎట్లో దైవ వశమున ఈ బాలురు బ్రతికి బట్టకట్టిరి. ఇక నుండి ఈ బాలురను గోవత్సములను మేపుటకు నేను బయటకు పంపబోను."

ఈ విధముగ పలుకుచు మిక్కిలి రోదించుచున్న యశోదను చూచి నందరాజు మాట్లాడుటకు ఉద్యక్తుడాయెను. ధర్మార్ధముల యందు జ్ఞాత మరియు శ్రేష్ఠుడయిన నందుడు ఆమెకు గర్గాచార్యుల పలుకులు జ్ఞప్తిచేసి, ఆమెను ఆశ్వాశించి, శాంత ధీరజ మనస్కనుకావించి ఇట్లు పలికెను "యశోదా! నీవు గర్గాచార్యుల పలుకులు మరచి ఇట్లు బేల వైతివి.

బ్రాహ్మణ వాక్కు ఎప్పుడు అసత్యము కాదు. అది నిత్య సత్యము. అందుచేత సమస్త అరిష్ఠ నివారణార్ధము నీవు చేయవలసినది దానము. దానమునకు మించిన కళ్యాణ కారక కృత్యము లోకమున ఇంతకు ముందులేదు. ఇక ముందు ఉండబోదు.”

అంతట యశోదావేవి శ్రీకృష్ణ, బలరాముల మంగళార్ధము బ్రాహ్మణులకు బహుమూల్య నవరత్నములు, తన అలంకారములు సహితము దానమొనర్చెను. నందుడు ఆ సమయమున పదివేల వృషభములు, ఒక లక్ష ఆవులు, రెండు లక్షల అన్న భాండమలు దానమొనర్చెను.

తదుపరి గోపకుల ఇచ్ఛానుసారము బలరామ, కృష్ణులు గోపాలకులుగ మారిరి. తమ గోపాలక మిత్రులలో కలసి ఇరువురి సోదరులు వనములందు విహరించు చుండిరి. ఆ సమయమున ఆ సోదరులకిరు ప్రక్కలా, మరియు ముందు వెనుకలా సుందర గో సమూహములు మెడలయందు గంటలతో, స్వర్ణ మాలలతో, పాదములయందు గజ్జెలతో, పుచ్ఛముల యందు నెమలి పింఛములు మరియు ముత్యముల గుచ్ఛములతో అలంకరింపబడి కాలి అందెలు ఘల్లు ఘల్లుమనుచుండగా స్వేచ్ఛగా విహరించు చుండెను. మిలమిల మెరయుచున్న నూతన రత్నకాంతి నలుదిశలా వెదజల్లుచుండగా గోసమూహములు మిక్కిలి శోభాయమానముగ వెలుగొందు చుండెను. ఆ గోవుల రెండు శృంగముల మధ్య భాగమున మణిమయ అలంకారములు మెరయుచుండగా ఆ గోవుల శోభ ద్విగుణీకృతము ఆయెను. శృంగములపై యున్న బంగారపు తొడుగులు, నడుముపై అలంకరింపబడిన జూలు ప్రాత:కాల సూర్య పుంజములచే మరింత మనోహరముగ కానపట్టెను.

కొన్ని గోవులు రక్తవర్ణము కలిగి యున్నవి. వాని తోక పచ్చగనూ, గిట్టలు అరుణరాగ రంజితముగనూ యున్నవి. అత్యధిక గోవులు కైలాస పర్వతముల వలె శ్వేత వర్ణముతో ప్రకాశించుచున్నవి మరియు అవి సుశీలము, సురూపము మెదలగు సుగుణ సంపన్నులై యున్నవి. కొన్ని గోవులు ఎరుపు రంగులోయండి భవ్యరూపముతో ప్రకాశించుచున్నవి. కొన్ని గోవులు ఆకుపచ్చగనూ, కొన్ని పచ్చగనూ, కొన్ని నల్లగనూ, కొన్ని మేఘ వర్ణము లోనూ వివిధ రంగులలో భాసించుచుండెను. వాని అన్నిటి నేత్రములు ఘన శ్యాముడయిన శ్రీకృష్ణుని చూచుచుండెను. కొన్ని ఆవుల కొమ్ములు కురుచగనూ, కొన్ని ఎత్తుగనూ, యున్నవి. కొన్ని ఆవుల శృంగములు లేడి కొమ్ములు వలెను, కొన్ని మేషముల కొమ్ముల వలెను యున్నవి. వన, వనాంత రాళములలో కోమల, కమనీయ గ్రాసము వెదకి వెదకి తినుచు కొట్ల కొలది గోవులు శ్రీకృష్ణునికి ఇరువైపులా చరించుచున్నవి.

యమునాపుణ్య తీరము మరియు దగ్గరగయున్న నల్లని వృకసానువులతో నిండిన బృందావనము కదంబ, వేప, అశోక, ప్రవాళ, పనస, కదళీ, కచనార, మామిడి, జంబూ, బిల్వ, కపిత్థ మెదలగు ప్రసిద్ధ దివ్య వృక్షములతచేచ మాధవీ లతల చే నిండియుండెను.

వసంత ఋతువు యొక్క శుభాగమనము చే వనము అంతయు దివ్యశోభలు వెదజల్లు చుండెను. ఆ సమయమున బృందావనము దేవతల నందనవనము వలె ఆనంద ప్రదము మరియు సర్వతో భద్ర వనము వలె మంగళకరము అయియుండి, కుబేరుని చైత్రరథము యొక్క శోభను సహితము తిరస్కరించుచున్నది. ఘోషించు జలపాతములతో, నిశ్శబ్దమయిన గుహలతో, నిండిన రత్నధాతుమయ దివ్య శ్రీ గోవర్ధన పర్వతము బృందావన శోభను మరింత ఇనుమడింపచేయుచున్నది. గోవర్ధనము పారిజాత, మందార, చందన, బేరీ, కదళీ, దేవదారు మర్రి, పలాస, మల్బరీ, అశోక, అరిష్ఠ, అర్జున, కదంబ, పాటల, చంపా వృక్షములచే శోభించుచున్నది. ఇంద్రయవము లనెడు నల్లని వృక్షములచే నిండిన ఒకతోట సూర్యకాంతి నందు వివిధముగ ప్రకాశించుచు మిక్కిలి ఆహ్లాదము నిచ్చుచున్నది. కలకోకిలలు కుహూ కుహూ నాదములతోను, మయూరముల క్రేంకారములతోనూ వనమంతయు ప్రతిధ్వనించుచున్నది. గోవులను మేపుచూ శ్రీకృష్ణుడు ఒక తోట నుండి మరియొక తోటకు వెడలుచూ వనమంతయు పరిభ్రమించుచుండెను.

నరేశ్వరా! ఏమని చెప్పుదును! బృందావనము, మధువనము, తాళవనము, ప్రక్కనే యున్న కుముదవనము, బహుళావనము, కామవనము, బృహత్సాను మరియు నందీశ్వర పర్వత సానువులయందు, కలకోకిలల కుహూ కుహూ నాదములచే కూజితమయిన కోకిలావనము, లతాకుసుమ మండిత సౌమ్య వనము, కుశవనము, పరమ పావన భద్రవనము, భాండీర ఉపవనము, లోహార్గళ తీర్ధము, యమునా నది యందలి ప్రత్యేక తటములు, మరియు తటవర్తి వనము లందు

పీతాంబరధారి, వంశీ వేత్రహస్తుడు, మయూర పింఛము, సుందర సువర్ణ కిరీటము నందు వెలుగులు వెదజల్లుచుండగా, గోపాంగనల హృదయము ప్రీతిచెందుచుండగా విహరించుచున్న శ్రీకృష్ణభగవానుని శోభను వర్ణించుట ఫణిపతికి, బృహస్పతికి, భాషాపతికి సహితము అసాధ్యము.

సంధ్యాసమయము నందు గోసమూహములను ముందరనుంచుకొని అనేకానేక భంగుల వంశీరవము వాయించుచు సాక్షాత్ శ్రీహరి శ్రీ కృష్ణుడు నందవ్రజము ప్రవేశించెను. ఆకాశము నందు వ్యాప్తిచెందుచున్న గోరజమును చూచి, దివ్య మంగళ వంశీరవ ధ్వనిని విని గోపాంగనలు శ్యామసుందరుని దర్శనార్ధమై తొందర తొందరగా తమ ఇండ్లనుండి బయల్వెడలిరి. తమ మానసిక వ్యధను దూరము చేసికొనుటకై మరియు ఉత్తమ సుఖము పొందుటకు గోపసుందరీమణులు గోవింద దర్శనార్ధమై తమ ఇండ్ల బయటకు వేంచేసిరి. వారెవ్వరి యందు శ్రీకృష్ణుని మరచు శక్తి లేదు.

శ్రీకృష్ణుడు గజగమన ధారియై నెమ్మదిగ నడుచుచూ, మధ్య మధ్య, సింహకిశోరము వలె వెనుకకు చూచుచు, మందహాసము చేయుచు ముందుకు నడుచుచుండెను. ఆయన నేత్రములు వికసించిన కమలములవలె విలసిల్లుచుండెను. గోప సముదాయములచే ఆవరింపబడి నెమ్మది నెమ్మదిగ వచ్చుచున్న గోవిందుని గోపకాంతులు నికటముగ చూడజాలకుండిరి.

మిథిలేశ్వరా! గోధూళి దూసరితుడు, సువర్ణమయ వంశీరవ విభూషితుడు, మకుట మండితుడు, గోరజ సమలంకృతుడు, కర్ణముల యందు పుష్పవేష్ఠితుడు, కుండలాలంకృతుడు, పీతాంబరధారి, వేణువాదనాశీలుడు, భూతలభూరిభారహరుడు, అయిన శ్రీకృష్ణ ప్రభువు మిమ్ము రక్షించుగాక.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన యశోదా చింతన, నందుని ద్వారా ఆశ్వాసన మరియు దానము, శ్రీకృష్ణుని గోచారణ లీలా వర్తనమను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(ధేనుకాసుర ఉద్ధారము)

"రాజా! ఒకానొక దినము శ్రీకృష్ణుడు బలరామ సహితుడై ముగ్ధ మనోహర ధేనువులను మేపుటకు తాళవన సమీపమునకు ఏగెను. సమస్త గోపాలబాల గణము వారితో కలరు. ఆ వనము నందు ధేనుకాసురుడు అను అసురుడు నివసించు చుండెను. వాని భయముచే గోపబాలురు ఎవ్వరునూ ఆ వనము నందు ఎప్పుడునూ ప్రవేశింప లేదు. ఆ రోజు మహాబలి అయిన బలభద్రుడు నడుముకు నీలి వస్త్రము బిగించి పరిపక్వ ఫలములు తెచ్చుటకు ఒంటరిగ ఆ వనమున ప్రవేశించెను. బలరాముడు సాక్షాత్ అనంతదేవుని అవతారము. ఆయన పరాక్రమము సహితము అనంతము. ఆయన తన రెండు చేతులతో తాళ వృక్షములను ఊపుచు ఫలములను క్రిందకు పడవేయుచు నిర్భయముగ గర్జింపసాగెను. క్రింద పడుచున్న ఫలముల ధ్వని విని గార్ధభాసురుడు మిక్కిలి కృద్ధుడాయెను. కోపముతో ఆతని రక్తము ఉడికినది. ఆతడు మధ్యాహ్నము నిద్రించును. కానీ ఈనాడు ఈ ధ్వని చే ఆతనికి నిద్రా భంగమాయెను. అందుచే ఆతడు క్రోధ భయంకరుడై పైకి లేచెను. ధేనుకాసురుడు (గార్ధభాసురుడు) కంసుని మిత్రుడగుటయే కాక మిక్కిలి బలవంతుడు. ఆతడు యుద్ధము చేయుటకు బలదేవుని సుమ్ముఖమునకు వచ్చి వెనుక పాదములతో బలముగ ఆయన గుండెలపై తన్నెను. ఆ అసురుడు తన పాద ఘాతములచే తన్నుచూ, వెంటనే పరుగులిడుచూ, గాడిద వలె ఓండ్ర పెట్టుట ప్రారంభించెను. తిరిగి అతడు పాదఘాతము చేయుటకు వచ్చినపుడు బలదేవుడు ఒడుపుగ ఆతని రెండు కాళ్ళను ఒడిసి పట్టుకొని తాళ వృక్షములపై విసిరెను. ఆ కార్యము ఆయన క్రీడా సదృశముగ చేసెను. ఇట్లు ఆ గార్ధబాసురుని పట్టి తాళవృక్షములపై కొట్టుచూ అనేక తాళ వృక్షములను సహితము పడవైచెను.

అంతలో ఒక ఆశ్చర్యము!! క్రిందపడిన ధేనుకాసురుడు తిరిగి లేచి ఒక మదపుటేనుగును మరియొక మదపుటేనుగు ఎదుర్కొని నట్లు రోషపూర్వకముగ తన గిట్టలతో బలముగ బలదేవునిపై ప్రహరించెను. ఆ ఘాతమునకు బలదేవుడు ఒక యోజనము దూరము ఎగిరి పడెను. అంత బలదేవుడు తేరుకుని, తిరిగి వచ్చి, ధేనుకుని రెండు పాదములు పట్టి త్రిప్పి త్రిప్పి విసురుగ భూమిపై పడవైచెను. గార్ధభము మూర్ఛిల్లి, తేరుకొని, పైకి క్షణములో లేచెను. ఆతని శరీరము క్రోధాగ్ని చే కంపించు చుండెను. అంత దానవుడు ధేనుకుడు తన మాయా ప్రభావము చే నాలుగు శృంగములు శిరమున మెలిపించి, భయంకరాకారము దాల్చి, గోపబాలురను పొడిచి, బాధింప నారంభించెను. గోపకులు పరుగెత్తుట చూచి మదమత్తుడయిన ధేనుకుడు వారిని వెంబడించెను.

ఆ సమయమున వివిధ గోపకులు వివిధ ఆయుధములచే గార్ధభుని ప్రహరించిరి. శ్రీదాముడు దండము చేతనూ, సుబలుడు ముష్ఠిఘాతము చేతనూ, స్థోతకృష్ణుడు పాశము చేతనూ, అర్జునుడు క్షేపణము చేతనూ, అంశుడు లాఠీ చేతనూ, గార్ధభుని ఆఘాతించిరి. పిదప విశాలభద్రుడు తన పాదఘాతము చేతనూ, తేజస్వీ అర్ధచంద్ర బాణము చేతనూ, దేవ ప్రస్థుడు అరచేతి ఘాతములుచే, వరూధపుడు బంతులతోనూ, ఆ విశాల కాయుడయిన దానవుని ప్రహరించిరి. అంత శ్రీకృష్ణుడు ధేనుకుని తన రెండు చేతులతో పైకెత్తి గోవర్ధన పర్వతము పై విసరెను. అతడు గోవర్ధనము పై బడి, రెండు ఘడియలు మూర్ఛిల్లి, తిరిగి శరీరము కంపించుచుండగా, రోష తామ్రాక్షుడై తిరిగి పరుగెత్తుచూ వచ్చి తన శృంగములచే శ్రీకృష్ణుని ఎత్తి, ఆకాశమార్గమునకు ఎగసి లక్ష యోజనముల పైన ద్వంద్వ యుద్ధము సాగించెను. శ్రీకృష్ణ భగవానుడు ధేనుకుని పట్టి తన చేతులతో వానిని విసురుగ భూమిపై పడవైచెను. ధేనుకుని ఎముకలు చూర్ణమయినవి. అయిననూ ఆ భయంకర దానవుడు తిరిగి లేచి తన శృంగములచే గోవర్ధన పర్వతమును ఎత్తి శ్రీ కృష్ణుని పై విసరెను. శ్రీకృష్ణుడు ఆ పర్వతమును పట్టి ధేనుకునిపై విసరెను. ధేనుకుడు తిరిగి గోవర్ధనమును పట్టి శ్రీకృష్ణుని పై విసరెను. ఆ మారు శ్రీకృష్ణుడు గోవర్ధనమును పట్టుకొని యథాస్థానమున ఉంచెను.

అంత ధేనుకుడు తన శృంగములతో భూమిని బ్రద్దలు చేయుచు తన వెనుకకాళ్ళతో బలదేవుని గుండెలపై బలముగ ప్రహరించెను. భయంకర గర్జన చేసెను. ఆ గర్జన చే రోదశీకుహరము ప్రతిధ్వనించి పృథివీమండలమంతయు కంపించెను. అంత బలదేవుడు భయంకర ధేనుకుని కాళ్ళను పట్టి, త్రిప్పి, త్రిప్పి భూమిపై పడవేసెను. అంత ధేనుకుని మస్తకము పగిలి అసువులు బాసి, ప్రాణములు అనంత వాయువుల యందు లీనమయ్యెను. తిరిగి శ్రీకృష్ణ భ్రాత ధేనుకుని పై ముష్ఠిఘాతము ప్రయోగించెను. ఈ ప్రకారము ధేనుకుడు మృత్యువాత పడెను. ఆ సమయమున దేవతలు పుష్పవృష్ఠి కురిపించిరి.

దేహము నుండి విడివడి ధేనుకుడు శ్యామ సుందర విగ్రహుడాయెను. పుష్పమాలాలంకృతుడై, పీతాంబరము ధరించి, వనామాలా సమలంకృతుడై, దేవతారూపము ధరించెను. లక్షలాది పార్షదులు పరిసేవనము చేయుచుండగా, వేలకొలది ధ్వజములు రెపరెపలాడుచుండగా, వేలకొలది చక్ర పరివేష్ఠిత రథము నందు పదివేల గుఱ్ఱములు పూన్చిన, అరుణ వర్ణ, రత్నఖచిత, యోజన విస్తార, మనోగతి పోగల రథము నందు ధేనుకుడు అధిష్ఠించి, బలరామ, కృష్ణులకు పరిక్రమ గావించి, దిశామండలములను దేదీప్యమానము గావించుచూ ప్రకృతికి పరమయిన గోలోక ధామము చేరెను. ఈ విధముగ ధేనుకాసుర సంహారము గావించి శ్రీకృష్ణ, బలరాములు గోపబాలురు తమ యశోగానము చేయుచుండగా గోప సముదాయముతో నంద వ్రజము ప్రవేశించిరి.

బహుళాశ్వ మహారాజు ఇట్లు ప్రశ్నించెను "మునీశ్వరా! ఆ ధేనుకుడు పూర్వ జన్మమందు ఎవరు? ఈతనికి ముక్తి ఎట్లు లభించినది? ఈతనికి గాడిద శరీరము ప్రాప్తించుటకు కారణమేమి? దయచేసి నాకు సెలవీయవలసినది". నారదుడు "విరోచన పుత్రుడయిన బలి చక్రవర్తికి ఒక మహాబలుడయిన పుత్రుడు కలదు. వాని నామధేయము "సాహసికుడు". ఒకనాడు ఆతడు పదివేల మంది స్త్రీలతో గంధమాదన పర్వతమందు విహరించు చుండెను. ఆ పర్వత మంతయు అనేక వాద్యములు మరియు అసంఖ్యాక యువతీ నూపుర ధ్వనితో ప్రతిధ్వనించు చుండెను. ఆ పర్వత కంధరములందు ఏకాంతముగ కృష్ణ చింతన చేయుచూ తపమాచరించుచున్న దుర్వాస మహామునికి తీవ్ర ధ్యానభంగ మాయెను. శిరమున కేశములు, మీసములు, గడ్డము సహితము అట్టలు కట్టినవి. దేహ దుర్బలముచే ఆయన చేతి కర్ర సాయము చే

నడుచుచుండెను. దుర్వాస మహాముని మూర్తీభవించిన క్రోధరాశి మరియు అగ్నిసమాన తేజస్వి. ఎవని శాపభయముచే సర్వజగత్తు కంపించునో అంతటి తపస్వి దుర్వాస మహర్షి. ఆయన కృద్ధుడై, కర్రపాదుకలు ధరించి, బయటకు వచ్చి, సాహసికుని గాంచి "ఓరీ! దుర్బద్ధీ! నీవు గాడిదతో సమానముగ భోగాసక్తుడవు. అందునే నీవు గాడిద కావలసినది". ఈనాటి నుండి నాలుగు లక్షల సంవత్సరములు గడిచిన పిమ్మట భారత వర్షమున, దివ్య మధురామండలము న అత్యంత పవిత్ర తాళవనమున బలదేవుని చేతి యందు నీకు ముక్తి లభించును," అని శాపానుగ్రహము నొసంగెను. మహారాజా! ఈ శాపకారణమున శ్రీకృష్ణుడు బలరాముని ద్వారా ధేనుకుని పరిమార్పించెను. ఎందుకనగా ఆయన (శ్రీహరి) పూర్వకాలమందు ప్రహ్లాదుని వంశమున పుట్టిన ఏ దైత్యుని తాను సంహరింపనని ప్రహ్లాదునికి మాట ఇచ్చెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండాంతర్గతమయిన ధేనుకాసుర ఉద్ధారము
అను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(శ్రీకృష్ణుని ద్వారా కాళీయ మర్ధనము మరియు హాలాహల పానము)

నారదుడు చెప్పదొడంగెను."మిథిలేశ్వరా! ఒకానొక దినము శ్రీకృష్ణుడు బలరాముని వదలి గోపబాలకుల సహితుడై గో సంరక్షణమునకై చనెను. యమునా తటము నందు "కాళింది మడుగు" కలదు. అచ్చట కొంత కాలము నుండి కాళీయుడు అను మహావిష సర్పము తన కుటుంబ సహితుడై నివసించు చుండెను. కాళింది మడుగు యొక్క జలములు కాళీయుని విషముచే పూర్తిగా విషపూరితములు అయినవి. ఆ విషయము తెలియని గోవులు, గోపబాలురు ఆ మడుగు నందలి జలమును పానము చేసి తత్ప్రభావమున వెంటనే అసువులు బాసిరి. ఇది చూచిన సర్వపాపహరుడు, సాక్షాత్ భగవానుడయిన శ్రీకృష్ణుని హృదయము ద్రవించినది. ఆయన తన అమృతమయ కృపా కటాక్ష వీక్షణములచే మృతి చెందిన సర్వులను తిరిగి పునర్జీవితులను చేసెను. తదుపరి పీతాంబరమును నడుమున బిగించి, పైకెత్తికట్టి, తీరమునయున్న కదంబవృక్షము యొక్క చిటారు కొమ్మ వరకు ఎక్కి, అంత ఎత్తు నుండి విషపూరిత కాళింది మడుగు నందు దుమికెను. మడుగున వున్న జలములు ఉవ్వెత్తున పైకి లేచినవి.

జలములు ఉవ్వెత్తున లేచుటచే కాళియుని మందిరము కంపింపసాగెను. ఆ సమయమున శత ఫణుడయిన కాళియుడు క్రుద్ధుడై మాధవుని పట్టి దంతములచే కరుచుచూ, ఆయన శరీరమును పూర్తిగా చుట్టెను. అంత శ్రీకృష్ణుడు తన కాయమును పెంచి, ఆ సర్పబంధము నుండి బయల్వెడలి కాళీయుని పడగల బట్టి వేగముగ త్రిప్ప నారంభించెను. త్రిప్పి, త్రిప్పి ఆ కాళీయుని నీటి యందు వంద ధనువుల దూరము విసరివైచెను. ఆ భయానక సర్పరాజము ఉధృతముగ పూత్కారము చేయుచు వచ్చి శ్రీహరి ఎడమచేతిని చుట్టుకొనెను. అంత శ్రీకృష్ణుడు ఆ దుష్ట సర్పము ను కుడి చేతితో పట్టుకొని గరుడుడు చిన్ని పామును శిక్షించినట్లు ఆ జలముల యందు కాళియుని ఒడలపై తీవ్ర ఘాతములు ప్రహరించెను. అంత ఆ అహిరాజము తన శతముఖములను తెరచి శ్రీహరిని కరచుటకు ముందుకు దుమికెను. అంత మధుసూదనుడు ఆ సర్పము పడగలను పట్టి నూరు ధనువుల దూరము ఈడ్చెను. కాళీయుడు మురారి చేతులనుండి తప్పించుకొని తిరిగి వచ్చి ఆయన చేతులపై కాటువేసెను. అంత త్రిభువనముకు బలము నిచ్చు అచ్యుతుడు ఆ సర్పముపై బలముగ ముష్టిఘాతము ప్రహరించెను. ఆ ప్రహారమునకు కాళియుడు మూర్ఛితుడై స్పృహ కోల్పోయెను. కొంత సమయమునకు మూర్ఛ నుండి తేరి, అవనిత శిరస్కుడై తన శత ఫణములను శ్రీకృష్ణుని యెదుట వంచి నిలబడెను.

ఆ సర్పరాజము యొక్క శిరములపై ఒక్కొక్క ఫణముపై ఒక్కొక్క మణి ప్రకాశించుచుండెను. అంత మురహరి ఆ పడగలపై ఎక్కి మనోహర నట వేషధారియై, నటుని వలె నృత్యము చేయ నారంభించెను. ఆ సమయమున

సప్తస్వర మిళితమయిన మధురనాదము తాళవాద్య సహితయై వినిపింపసాగెను. ఈ సమయమున దేవతలు నటరాజు వలె తాండవ నృత్యము చేయుచున్న శ్రీకృష్ణునిపై పుష్పవృష్టి కురిపించి వీణా, వేణు, వంశీరవ ధ్వానములు చేసిరి. ఆ తాళమునకు సరిగా పదవిన్యాసము చేయుచూ శ్రీకృష్ణ తాళమునకు భగవానుడు బృహత్కాయుడయిన కాళియుని అనేక ఫణములు భగ్నము చేసెను. ఆ సమయమున భయవిహ్వలలయిన కాళియుని పత్నులు శ్రీకృష్ణ భగవానుని సమీపించి, చరణములకు నమస్కరించి గద్గద స్వరముతో ఇట్లు పలికిరి.

"భగవన్! మీరు పరిపూర్ణ పరమాత్మ మరియు అసంఖ్యాక బ్రహ్మాండములకు అధిపతులు. గోలోక నాథులయిన శ్రీకృష్ణునకు మేము పదే పదే నమస్కరించు చున్నాము. వ్రజాధీశ్వరులు, శ్రీ రాధా వల్లభులు అయిన మీకు నమస్కారము. నంద, యశోదలకు అత్యంత ప్రియులయిన మీకు నమస్కారము. పరమ దైవతమా! మీరు ఈ అహిరాజమును రక్షించండి! రక్షించండి! మూడు లోకముల యందు వీనికి శరణు ఇచ్చువారు మీరు తప్ప మరొకరు లేరు. మీరు సాక్షాత్ పరాత్పరులయిన శ్రీహరి. లీలామాత్రముగ, స్వచ్ఛంద పూర్వకముగ అనేక అవతారములను స్వీకరించుచున్నారు." కాళీయుని గర్వము సర్వము ఖర్వమయినది. తన నాగపత్నులు ఈ విధముగ శ్రీకృష్ణుని స్థవము చేసిన పిదప కాళీయుడు ఈ విధముగ పలికెను. "భగవన్! పూర్ణకాముడవయిన పరమేశ్వరా! నన్ను రక్షింపవలసినది. పాహి! పాహి!" అని కాళీయుడు శ్రీకృష్ణ సమ్ముఖమున ఆయన పాదములపై బడెను.

అంత జనార్ధనుడు ఈ విధముగ పలికెను "కాళీయా! ఇచటి నుండి నీవు పత్నీ, పుత్ర, పుత్రీ సహితముగ రమణక ద్వీపము నకు పొమ్ము. నీ మస్తకముపై నా శ్రీ చరణములు యుండుటచే గరుడుడు నిన్ను ఆహారముగ స్వీకరింపడు. అనంతరము కాళీయుడు శ్రీకృష్ణుని పూజించి, ఆయనకు ప్రదక్షిణము కావించి, తన సమస్త కుటుంబము, మరియు అనుయాయులతో కాళింది తటము వదలి రమణక ద్వీపమునకు చనెను. ఇంతలో "నందనందనుని కాళియుడు తన గ్రాసముగ గ్రహించెను" అను వార్త కార్చిచ్చు వలె బృందావనమంతయు వ్యాపించి నందాది సమస్త గోపగణము అచటకు ఏతెంచెను. శ్రీకృష్ణుడు జలముల నుండి బయల్వెడలిన దృశ్యము గాంచి సమస్త గోపగణము ప్రసన్నులయిరి. తన పుత్రుని హృదయమునకు హత్తుకొని నందుడు పరమానంద భరితుడాయెను. యశోద తన పుత్రుని చూచి ఆయనకు శుభములు కలుగుటకై బ్రాహ్మణులకు భూరి దానములు చేసెను. ఆ రోజు మిక్కిలి దస్సిపోయి యుండుట చే గోపకులు, గోపాంగనలు ఆ యమునా తీరము నందే విశ్రమించిరి. అంత నిశీధి కాలమందు వెదురు పొదలయందు ఘర్షణచే ప్రళయాగ్ని రూప దావానలము ఉత్పన్నమై అన్ని వైపులా వ్యాపించి గోప గోపీ జనమును దగ్ధమొనరించుటకు సమకట్టెను. ఆ సమయమున మిత్రకోటి సహితముగ బలరాముడు శ్రీకృష్ణుని శరణు జొచ్చి భయముతో చేతులు జోడించి ఇట్లు పలికిరి "శరణాగత వత్సలా! మహాబాహూ! శ్రీకృష్ణా! శ్రీకృష్ణా! ప్రభో! వనాంతరాళమున దావాగ్ని యందు పడుచున్న స్వజనులందరినీ కాపాడవలసినది! కాపాడవలసినది! అంత యోగేశ్వరుడయిన మాధవుడు "భయపడ వలదు. మీరందరూ కన్నులు మూసుకొన వలసినది" అని ఆజ్ఞాపించి ఆ దావానలము నంతటినీ చిటికెలో త్రాగెను. అంత ప్రాత:కాలమున విస్మితులయిన గోపగోపీ జనముతో, గోవులతో నందనందనుడు వ్రజ మండలము తిరిగి ప్రవేశించెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన కాళీయ దమనము మరియు దావానల పానము అనెడి పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(మునివరులయిన వేదశిరుడు, మరియు అశ్వశిరుడు పరస్పర శాపములచే కాళియుడు మరియు కాకభుశుండిగ మారుట, శేషుడు భూ మండలమును దాల్చుట)

విదేహరాజు బహుళాశ్వుడు ప్రశ్నించెను "దేవర్షీ! సంసారము నందు ఎవని పాదధూళి యొగులకు సహితము

అనేక జన్మలందు దుర్లభమో అట్టి భగవానుని చరణార విందము కాళియుని పడగలపై శోభించెను. ఈ సర్ప శ్రేష్ఠుడయిన కాళియుడు ఈ సౌభాగ్యము ప్రాప్తించుటకు ఏఏ పుణ్యములు ఆచరించెను? ఈ విషయము దయచేసి నాకు విశదీకరింపవలసినది." నారదుడు "మహారాజా! పుర్వకాలము నాటి మాట! స్వాయంభువ మన్వంతరము నందు భృగు వంశస్థుడయిన వేదశిరుడను ముని వింధ్య పర్వతమందు తపము ఆచరించుచుండెను. ఆయన ఆశ్రమము నందు తపసు నాచరించుటకై అశ్వశిరుడను ముని అచటికి ఏతెంచెను. ఆయనను చూచి వేదశిరుడు క్రోధోద్రిక్తుడై కన్నులు ఎర్రబడగా ఇట్లనియె "బ్రహ్మాన్! నా ఆశ్రమము నందు నీవు తపము చేయవలదు. ఇది సుఖప్రదము కాదు. తపోధనా! తనస్సు చేయుటకు ఇంక యోగ్య ప్రదేశములు లేవా?" వేదశిరుని మాటలకు అశ్వశిరుడు సహితము కోపించి ఆ ముని పుంగవుని తో ఇట్లనియె "మునిశ్రేష్ఠా! ఈ పృధివి అంతయు శ్రీమహావిష్ణువు సొంతము. మన ఇరువురిది కాదు. ఇచ్చట ఎంతమంది మునులు జప, తపోనుష్ఠానములు చేయలేదు? నీవు వ్యర్ధముగ బుసలు కొట్టుచు సర్పము వలె కోపోద్రిక్తుడవు అయినావు. అందుచే నీవు సర్పమునవు కమ్ము. నీకు గరుడుని చే భయము ప్రాప్తించును," అని శపించెను. అంత వేదశిరుడు "దుర్మతీ! నీ మనోభావము మిక్కిలి దూషణీయము. నీవు అతి చిన్న దోషమునకు సహితము మహాదండనము నీయుటకు ఉద్యుక్తుడవగుదువు. నీ అవసరము తీరుటకు కాకము వలె ఈ పృధివీతలమును తిరుగు చున్నావు. అందుచే కాకివి కమ్ము" అని ప్రతి శాపము నిచ్చెను.

ఆ సమయమున విష్ణు భగవానుడు పరస్పర శాప గ్రహీతలయిన ఋషుల మధ్య ప్రత్యక్షమయ్యెను. ఆ సమయమున ఆ ఋషు లిరువురు పరస్పర శాపములచే మిక్కిలి విషణ్ణులయియుండిరి. భగవానుడు వారిరువురిని ఆశీర్వదించి ఇట్లనియె. "మునులారా! శరీరము నందు రెండు భుజములు ఎట్లు సమానముగ యుండునో అట్లే మీరు ఇరువురు నాకు సమాన భక్తులు. నేను నా వాణిని అసత్యము చేయగలను. కానీ భక్తుల వాణిని అసత్యము కానీయను. ఇది నా ప్రతిజ్ఞ. వేదశిరా! నీవు సర్పరూపిని అయినప్పటికీ, నా పాదముద్రలు నీ శిరము నందు యుండును. అందుచే నీకు గరుడుని భయము ఉండదు.

అశ్వశిరా! నా మాట వినుము. నీవు కాకి రూపమున ఉన్నప్పటికినీ నీకు ఉత్తమ జ్ఞాన ప్రాప్తి కలుగును. యోగ సిద్ధులకు సహజమయిన త్రికాల దర్శత్వము, జ్ఞానము నీకు కలుగును." నరేశ్వరా! ఇట్లు పలికి శ్రీహరి అంతర్ధానుడయ్యెను. అశ్వశిరుడే సాక్షాత్ పరమ యోగీంద్రుడయిన కాకభుశుండి. ఆయన నీల పర్వతమందు నివసింపసాగెను. ఈయన అత్యుత్తమ శ్రీరామ భక్తుడై సకల శాస్త్రార్ధములను సర్వులకు విశదీకరింపగల భక్తాగ్రేసరుడు అయ్యెను. ఈయనే మహాత్ముడయిన గరుడునకు రామాయణ కధామృతమును వినిపించెను.

మిధిలా నరేశ్వరా! చాక్షుష మన్వంతరంబున ప్రాచేతసుల పుత్రుడయిన దక్షప్రజాపతి తన పదకొండు పరమ సుందరీ మణులయిన పుత్రికా రత్నములను కశ్యపునకు పత్నీరూపముగ ప్రధానము చేసెను. అందు శ్రేష్ఠమయిన కన్యక కద్రువ. ఆమె ప్రస్తుతము బలదేవుని తల్లి అయిన రోహిణీ రూపమున ప్రకటితమై యున్నది. ఈ కద్రువ కోట్ల కొలది సర్పములకు జన్మ నిచ్చినది. ఈ సర్పములన్నియు ఉధృత విషరూప బల సంపన్నులు, ఉగ్రులు, అనేక ఫణములు కలవారు, మరియు మహామణి రత్న ధారులు. వారిలో కొందరు వంద ఫణములు కలిగి దుస్సహమయిన విషము కలవారు. వారియందే వేదశిరుడు కాళియుని రూపమున ఆవిర్భవించెను. వారందరి యందు ప్రధముడు ఫణిరాజు అయిన శేషుడు, అనంతుడు కేవలము పరాత్పర పరమేశ్వరుడు. అతడే ప్రస్తుతము బలరామునిగ అవతరించెను. ఆయనే రాముడు, అనంతుడు, అచ్యుతాగ్రజుడు అను నామముల చే ప్రసిద్ధి పొందెను.

ఒకనాటి మాట! ప్రకృతికి పరమయిన సాక్షాత్ భగవానుడయిన శ్రీహరి ప్రసన్నచిత్తుడై మేఘ గంభీర స్వరమున శేషునిచే ఇట్లనియె "శేషా! ఈ భూ మండలమును శిరశున ధరించే శక్తి నీకు తప్ప వేరొకరికి లేదు. నీ శక్తి మరియు పరాక్రమమునకు అంతము లేదు. అందుచే నిన్ను అనంతుడు అని పిలుతురు. జగత్కల్యాణమునకై నీవు ఈ పని చేయవలసినది." అంత శేషుడు "ప్రభూ! పృధివీ భారము నా శిరసు నుండి దింపుటకు దయచేసి ఒక వ్యవధిని నిర్ణయింపవలసినది. మీరు విధించిన కాలపరిమితి పర్యంతము నేను అవశ్యము పృధివిని నా పడగలపై మోయగలను. అంతట భగవానుడు "నాగరాజా! నీవు ప్రతిదినము నీ వేయి ముఖములతో తిరిగి, తిరిగి నాగుణముల ద్వార

ఉత్పన్నమగు నూతన దివ్య నామములను జపించుము. ఏ దినము నా దివ్యనామములు సమాప్తము చెందునో అపుడు భూభారమును శిరము నుండి దింపవచ్చును." అంత శేషుడు "మహాప్రభూ! పృధివికి నేను ఆధారముగ యుందును. కానీ నాకు ఆధారము ఏది? జలముల యందు ఆధారము లేక పృథివిన మోయుట అశక్యము కదా!" అంత భగవానుడు "మిత్రమా? నీకు చింతవలదు. నేను కచ్ఛపము (తాబేలు) నై పృధివీ సహితుడవై యున్న నీ మహాభారమును నేను మోయుదును.

అంత శేషుడు లేచి భగవానుడయిన గరుడ ధ్వజునికి ప్రణామములర్పించి పాతాళమునకు లక్షయోజనముల క్రిందకు వెళ్ళెను. ఆయన తన హస్తము తో గురుతర భూమండలమును పట్టుకొని ప్రచండ పరాక్రముడయిన శేషుడు తన యొక్క ఒక్క పడగ యందు ధరించెను. పరాత్పరుడయిన అనంతుడు పాతాళమునకు వెళ్ళుటచే బ్రహ్మదేవుని చే ప్రేరేపితులయిన మిగిలిన నాగ ప్రముఖులు ఆయన వెంట పాతాళమునకు చనిరి. కొందరు అతలమునందు, కొందరు వితలము, మరికొందరు సుతల, మహాతల, తలాతల, రసాతలము యందు నివసింప మొదలిడిరి. బ్రహ్మదేవుడు పృధివి యందు ఆ సర్పములకు రమణక ద్వీపము ను ప్రసాదించెను. కాళీయాది సర్పములు ఈ రమణక ద్వీపము నందే సుఖముగ నివసించుచుండిరి. "మహారాజా! నీకు సారభూతమయినది, భోగ మోక్ష ప్రదాయిని అయిన కాళీయుని వృత్తాంతమును వినిపించితిని. నీవు ఇంకనూ ఏమి వినదలుచుకుంటివి?"

(గర్గసంహిత యందలి బృందావన ఖండాంర్గత మయిన శేషుని ఉపాఖ్యాన వర్ణనము
అను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(కాళియుడు గరుడుని భయము చే యమునా
జలములందు నివసించుట యొక్క రహస్యము)

మహారాజు బహుళాశ్వుడు ఇట్లు ప్రశ్నించెను "బ్రహ్మన్! రమణక ద్వీపము నందు నివసించుచూ అన్య సర్పములను విడచి కేవలము కాళియుడు గరుడుని వలన ఎందుకు భయభ్రాంతుడయ్యెను? ఈ విషయము సర్వము విశిదీకరింప వలసినది". నారదుడు "మహారాజా! పన్నగ శత్రువయిన గరుడుడు ప్రతిదినము రమణక ద్వీపమునకు వచ్చి అనేక సర్పములను సంహరించువాడు. ఒకనాడు సర్పములన్నియు భయవ్యాకుల చిత్తులై ఆ ద్వీపమును చేరిన గరుడుని తో ఇట్లనియె "మహానుభావా! గరుత్మంతుడా! నీకు నమస్కారము. నీవు సాక్షాత్ విష్ణు భగవానుని వాహనమునవు. ఇట్లు నీవు సర్పములను సంహరించిన యెడల మాకు రక్షణ ఎట్లు లభించును? అందుచేత ప్రతిదినము ఒక్కొక్క ఇంటి నుండి ఒక్కొక్క సర్పమును గ్రహింపుము. వానితో పాటు వనస్పతి, మరియు అమృత సమానమయిన అన్నమును సహితము పంపెదము. ఈ విధానమును నీవు శీఘ్రముగ అంగీకరింపవలసినది. అంత గరుడుడు ఆమోదించి ప్రతిదినము ఒక్కొక్క సర్పమును బలిగా తీసుకొనుట ప్రారంభించెను. ఆత్మరక్షణార్ధము ఒక్కొక్క ఇంటి నుండి ఒక్కొక్క సర్పము మహాత్ముడయిన గరుడునకు బలి సమర్పణము ఆరంభమయినది.

నరేశ్వరా! ఒకనాటి దినము కాళియుని ఇంటి నుండి బలి ఈయవలసిన అవసరము ఏర్పడినది. కాళియుడు గర్వోపేతుడై గరుడునికి బలి ఈయక, ఆయనకు సమర్పించబడిన సామాగ్రి తానే భుజించెను. ఆ సమయమున ప్రచండ పరాక్రముడయిన గరుడుడు రోషతామ్రాక్షుడై కాళియుని తన కాలితో ప్రహరించెను. గరుడుని ప్రహారము తగిలిన కాళియుడు మూర్ఛితుడై, కొంత సేపటికి తేరుకొని, దీర్ఘశ్వాస తీసికొని, నాలుకలు ఆడించుచూ, తన విషము నిండిన కోరలతో గరుడుని పాదములను కరచెను. అంత శ్రీహరి దివ్యవాహనమయిన గరుడుడు కాళియుని తన తీక్షణ

చంపుటములచే పట్టి, నేలపై విసరి, తిరిగి తన బలమయిన రెక్కలచే మరల, మరల ప్రహరించుచూ నేలపై ఈడ్చుట ప్రారంభించెను. ఆ సమయమున ఆయన రెక్కల నుండి రెండు దివ్య పక్షులు ఉత్పన్నమయ్యెను. ఒకటి నీలకంఠము, మరియొకటి మయూరము. మిథిలేశరా! ఆశ్వయుజ శుక్ల దశమి రోజున ఈ దివ్య విహంగముల దర్శనము అత్యంత పవిత్రము మరియు మనోవాంఛాఫల సిద్ధియు కలుగును. రోష భూయిష్ఠుడయిన గరుడుడు తిరిగి కాళియుని తన ముక్కుచే పట్టి, నేలపై పడవైచి శరీరమును ఛిన్నాభిన్నము చేయసాగెను. అపుడు భయము చే విహ్వలుడయిన కాళియుడు గరుడుని బారి నుండి ఎట్లో తప్పించుకొని పారిపోవుట మొదలిడెను.

ప్రచండ పరాక్రముడయిన పక్షిరాజు గరుడుడు ఆతనిని విడువక వెంబడించెను. అంత కాళియుడు, భూలోక, భువర్లోక, స్వర్గలోక, మహర్లోక, జనోలోకము వరకూ పరుగులెత్తెను. కానీ శ్రీకృష్ణుని భయము చే ఏ లోకము నందునూ ఎవరునూ కాళియునికి శరణము నీయుటకు సాహసించేలేదు. అంత కాళియుడు తిరుగుచు క్రింది లోకములకు ఏతెంచెను. ఎక్కడికి పోయినను అతనికి అశేషభయము, వ్యాకులత తగ్గలేదు. శాంతి లభించలేదు. అంత ఆతడు దేవాది దేవుడయిన శేషుని పాదములపై బడి, ప్రదక్షిణ పూర్వక ప్రణామములు ఆచరించి విశాల కాయుడయిన కాళియుడు మిక్కిలి భయాతురుడై కంపిత, దీన స్వరమున ఇట్లనియె "భూమిభర్తా! భువనేశ్వరా! భూమి భారహరా! మీరు సర్వ సమర్థులు; పరిపూర్ణ పరాత్పర పురాణ పురుషులు. నన్ను దయచేసి రక్షించండి!

కాళియుని భయాతుర దీన దుస్థితిని గ్రహించిన ఫణీశ్వరుడయిన జనార్ధనుడు ప్రసన్నుడై ఇట్లు పలికెను "మహామతీ! కాళీయా! నా మాట వినుము. ఈ సంసారము నందు నిన్ను రక్షించునాథుడు లేడు. ఇది నిస్సందేహము. రక్షించుటకు ఏకమాత్ర ఉపాయము కలదు. వినుము. పూర్వకాలమందు "సౌభరి" నామధేయము గల సిద్ధ మునీశ్వరుడు కలడు. ఆయన బృందావనము నందలి యమునా జలము లందే పది వేల సంవత్సరములు కఠోర తపము ఆచరించెను. ఆ జలములందలి మీన రాజములను చూచి ఆయనకు సంసారము నందు ఉత్సుకత కలిగినది. అంతట ఆయన మాంధాత మహారాజు యొక్క వందమంది రాజ పుత్రికలను వివాహము చేసికొనెను.

వివాహమయిన పిదప మాంధాత మహారాజు తన పుత్రికల జీవనము ఎట్లు పొసగును? ధన హీనుడయిన ఈ మహర్షి ఈ కుసుమ కోమల రాజ పుత్రికలను ఎట్లు చూచుకొనునో అని మిక్కిలి ఆంధోళనకు గురి అయ్యెను. కానీ సౌభరి మహర్షి యొక్క దివ్య తప: ప్రభావము వలన శ్రీహరి ఆయనకు వైష్ణవీ సంపత్తిని ప్రసాదించి పరమ ఐశ్వర్య సంపన్నుని చేసెను. ఆ ముని యొక్క సంపదను చూచి మాంధాత మహారాజు ఆశ్చర్య చకితుడై తన పుత్రికల ధన విషయమై చింతను విడచెను.

యమునా జలములందు సౌభరి మహర్షి తపస్సు చేయు సమయమున గరుడుడు అచటి మీనములను పట్టి భక్షించుట ప్రారంభించెను. అంతట ఆ మీన పరివారమంతయు మిక్కిలి దు:ఖము పొందినవి. ఇతరుల దు:ఖము సహింపలేని సౌభరి మహర్షి కుపితుడై గరుడుని శపించెను.

"అభ్రగరాజా! ఆ రోజు మొదలుకొని నీవు ఈ కుండము లోపల బలపూర్వకముగ ఏదేని మత్స్యమును తినుటకు ఉపక్రమించితి వేని నీవు విగత జీవుడవగుదువు." ఆ రోజు నుండి గరుడుడు ముని శాపము చే భయభీతుడై కాళింది తటమునకు పోడు. అందుచేత శీఘ్రముగ బృందావనమున కాళింది మడుగునకు వెళ్ళ వలసినది. అచట నిర్భయుడవై నీ నివాసమును ఏర్పరుచుకొన వలసినది. అచట నీకు గరుడుని భయము ఉండదు." శేషుని పలుకులు వినిన భయభీతుడయిన కాళియుడు తన పత్నీ, పుత్ర, పుత్రికా సహితుడై కాళింది యందు నివాసము నేర్పరుచుకొనెను. తదుపరి శ్రీకృష్ణుడు వానిని అచటి నుండి తిరిగి రమణక ద్వీపమునకు పంపెను.

(శ్రీ గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన

కాళీయోపాఖ్యానమును పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(శ్రీ రాధాదేవి గవాక్షము నుండి శ్రీ కృష్ణుని చూచి ప్రేమ విహ్వాల అగుట.
లలిత శ్రీకృష్ణునకు శ్రీ రాధాదేవి యొక్క స్థితి తెలుపుట, మరియు ఆయన ఆజ్ఞను బడసి తిరిగి వచ్చి
శ్రీకృష్ణ ప్రీత్యర్థము సత్కర్మాచరణము చేయమని శ్రీ రాధాదేవిని ప్రేరేపించుట)

నారదుడు చెప్పదొడంగెను "మహారాజా! మీకు కాళియమర్దనమనెడు దివ్యలీల వినిపించితిని. ఇంకను ఏమి తెలిసికొన దలచితివి? బహుళాశ్వుడు "దేవర్షీ! ఎట్లు దేవతలు అమృతపానము చేసినప్పటికినీ, భ్రమరము కమలము యొక్క మధువు పానము చేసినప్పటికీ తృప్తి నొందలేదో అట్లే సమధుర కృష్ణ కథా సుధాపానము చేయుచున్న భక్తుడు సహితము తృప్తినొందలేడు. అతడు అధికాధికముగ సుందర కథాగానము వినవలెనని తలంచుచుండును. శిశు రూపధారి అయిన శ్రీకృష్ణుడు రాసమునకు భాండీరవనము లోనికి వెళ్ళినపుడు ఆయన లఘురూపము చూచి శ్రీ రాధాదేవి చింతితురాలైనది. అపుడు దేవవాణి "కళ్యాణీ! ఆలోచింపవలదు. మనోహర బృందావనము నందు శ్రీకృష్ణుని ద్వారా నీ మనోరథము పూర్ణమగును " అని పలికినది. శ్రీ రాధాదేవి యొక్క మనోరథము ఏ విధముగ పరిపూర్ణమయినది? దివ్య మనోహర బృందావనము నందు శ్రీకృష్ణభగవానుడు ఏ విధముగ ప్రకటమయ్యెను? బృందావనము నందు సాక్షాత్ పరిపూర్ణతము భగవానుడయిన శ్రీకృష్ణుడు శ్రీరాధా సహితుడై ఏ ప్రకారముగ రాసలీల గావించెను?"

నారదుడు "మహారాజా! నీ సందేహము మిక్కిలి ఉత్తమమయినది. నేను దేవతలకు కూడా అవగతము కాని ఆ మంగళమయ పవిత్ర చరిత్రను, మనోహర లీలాఖ్యానమను వర్ణించెదను. ఒకనాటి మాట! శ్రీ రాధాదేవికి శుభ స్వరూపలయిన ఇరువురు చెలికత్తెలు కలరు. వారు లలిత మరియు విశాఖ. వారిరువురు ఒకనాడు వృషభానుని గృహము ప్రవేశించి ఏకాంతమున శ్రీ రాధేదేవి తో ఇట్లనిరి, "శ్రీ రాధా! నీవు నిరంతరము ఎవని చింతన చేయుదునో, ఎవని గుణకీర్తిగానము చేయుచున్నావో అతడు ప్రతిదినము గోపబాలకుల సహితుడై వృషభానుపురము వేంచేయుచున్నాడు. నీవు వేకువఘామున అతడు గోచారముకై వెలువడు సమయమున అతనిని దర్శింపవచ్చు. ఆతడు మిక్కిలి సుందరుడు సుమా!" అంత శ్రీ రాధాదేవి "చెలులారా! మీరు ఆతని చిత్రపటము గీసి తొందరగా నాకు చూపించవలసినది. అనంతరము నేను ఆతనిని సందర్శించెదను. ఇందు సందియము లేదు." అంత ఆ చెలులు ఇరువురు నూతన యవ్వనముతో విరాజిల్లు చున్న దివ్య సుందర లావణ్యమూర్తి అయిన నందనందనుని చిత్రపటమును గీసి శ్రీ రాధాదేవికి చూపిరి. ఆ చిత్రమును చూసినంతనే ఆమె హర్షపులకాంకితయై హృదయము నందు శ్రీకృష్ణదర్శన లాలస ఉప్పొంగెను.

ఆమె తన కరకమలము నందు ఆ చిత్తరువును యుంచుకొని కనులప్పగించి చూచుచూ ఆనంద నిమగ్నయై నిద్దురపోయెను. ఆ నిద్రయందు ఆమె ఒక స్వప్నము గాంచెను. అందు యమునాతటము నందలి భాండీర వనము నందు ఒక దివ్య ప్రదేశమున నీలిమేఘశ్యాముడు, పీతాంబరధారి అయిన శ్యామసుందరుడు తన చుట్టూ నాట్యము చేయుచున్నట్లు కానబడెను. విదేహరాజా! తక్షణమే ఆమెకు నిద్రాభంగమై, మెళకువ కలిగి, జరిదినది కల అని తెలిసి, శయ్యనుండి లేచి శ్రీకృష్ణవియోగముచే విహ్వాలయై, ఆయన యొక్క కమనీయ రూపమును పదే పదే ధ్యానించుచు, త్రిలోకములను సహితము తృణప్రాయముగ తృణీకరించెను. అదే సమయమున వ్రజేశుడయిన నందనందనుడు తన భవనము నుండి వెలువడి వృషభానుపురము యొక్క వీధులయందు సంచరించు చుండెను. అంతట సఖులు శ్రీ రాధాదేవికి గవాక్షము నుండి ఆయనను చూపిరి. ఆయనను చూచిన వెంటనే శ్రీ రాధాదేవి మూర్ఛిల్లెను. లీలా మానుషధారి అయిన మాధవుడు, శ్రీకృష్ణుడు సహితము సుందరరూపిణి, సుగుణాలరాశి, అయిన వృషభాను నందిని శ్రీరాధాదేవి యొక్క దర్శనము కావించి ఆమెతో విహరించుటకు మనసు అత్యంత ఉత్సుకతతో ఉప్పొంగుచుండగా, ఆమెను పదే పదే

ధ్యానించుచూ, నెమ్మదిగ తన ఇంటిని చేరెను. శ్రీకృష్ణ విరహము చే విహ్వలయై, అతిశయ కామజ్వర పీడితయై సంతప్తచిత్త అయిన వృషభానునందినిని ఆమె ప్రియ చెలి అయిన లలిత ఇట్లు ఆశ్వాశించెను.

"శ్రీరాధా! నీవు వ్యర్ధముగ ఎందుకు మనోవ్యధనొందుచున్నావు? ఒకవేళ శ్రీహరిని పతిగా పొందుటకు ఇచ్ఛ కలిగినేని ఆయనపై మనసునందు ప్రగాఢ ప్రేమ, సుహృద్, వాత్సల్యములను పెంపొందించుకొనుము. ఆయన త్రిలోకములకు సుఖము నీయగల సమర్ధుడు. నీ యొక్క దు:ఖాగ్నిని ఆయన మాత్రమే శమింపజేగలడు. ప్రస్తుతము ఆయన ఉపేక్ష! ఉదీసనత కమ్మరివాని కొలిమి నుండి వెలువడు అగ్నికణములవలె మిక్కిలి దాహక శక్తిని కలిగి యున్నది." తన సఖి అయిన లలిత యొక్క సుమధుర సుఖాశ్వాశనమును విన్న వ్రజేశ్వరి శ్రీరాధాదేవి తన కనులు తెరచి గద్గద స్వరముతో ఇట్లనియె "సఖీ! ఒక వేళ నాకు వ్రజభూషణుడయినన శ్యామసుందరుని చరణారవిందముల ప్రాప్తి కలుగదేని నేను ఈ శరీరమును విడిచి వైచెదను. ఇది నా నిశ్చయము."

శ్రీరాధాదేవి యొక్క దృఢాభిప్రాయమును వినిన లలిత మనసునందు భయభీతయై శ్యామసుందరుని కలసికొనుటకు నిశ్చయించెను. ఆ సమయమున వంశీధరుడు యమునా తటమున మాధలీలతాఛ్ఛాదితమై, భ్రమరఘంకార సహితమయిన ఒక ఏకాంత ప్రదేశమునందు కదంబవృక్షపు నీడన ఏకాంతముగ కూర్చొని యుండెను. ఆ సుఖ ప్రదేశమునకు ఏగి శ్రీరాధా సఖి అయిన లలిత మదనమోహనుని తో ఇట్లనియె.

"శ్యామసుందరా! ప్రభూ! ఏ క్షణము నుండి శ్రీ రాధాదేవి మీ మనోహర దివ్య రూపమును వీక్షించెనో అప్పటి నుండి ఆమె సాత్విక భావావేశమునకు లోనై స్థంభీభూత అయినది. కొయ్యబొమ్మ వలె ఎవరితోనూ సంభాషించుట లేదు. అలంకారము అగ్నివలె, సుందర దుకూలములు వరదచే తపింపబడు సుక్షేత్రము వలె, ఆమెను బాధించుచున్నవి. ఆమె సౌకర్యానందములకై నియమింపబడిన పరిచారికలచే పరివేష్ఠితమయిన రాజభవనము ఆమెకు నిర్జీవ వనము వలె తోచుచున్నది. ముకుందా! వేయేల? నీ విరహము వలన నా ప్రియసఖికి పూవులు బాణములు వలె, పూర్ణచంద్ర బింబము మూర్తీభవించిన గరళము వలె తోచుచున్నది. అందువలన శీఘ్రముగ నీవు శ్రీరాధాదేవికి దర్శనమీయ వలసినది. నీ దర్శనము మినహా మిగిలిన వేవియు ఆమె యొక్క దు:ఖమును శమింపలేవు".

లలిత యొక్క సుమధుర భాషణమును వినిన వ్రజమనోహరుడు, సాక్షాత్ భగవానుడయిన శ్రీకృష్ణుడు మేఘ గంభీర స్వరముతో ఇట్లు బదులిచ్చెను, "భామినీ! మానవుల సమస్త మనో భావనలు ఏకాగ్రముగ పరాత్పర, పురుషోత్తముని వైపు ప్రవహింపవు. ఎల్లరును నా పట్ల ప్రేమీభూతులై యుండవలెను. ఈ భూతలము నందు నన్ను పొందుట కు నా యందు అచంచల ప్రేమ (భక్తి) మినహా వేరొక సాధనము లేదు. నేను మిక్కిలి భక్త సులభుడను. భాండీరవనము నందు శ్రీ రాధాదేవి హృదయము నుందు ఎట్టి మనోరధము ఉత్పన్నమయినదో ఆ కామన అట్లే పూర్ణమగును. సత్పురుషులు అహైతుక ప్రేమను మాత్రమే ఆశ్రయించెదరు. సాధువులు, మహాత్ములు ఈ నిర్హైతుక ప్రేమనే త్రిగుణాతీత మయిన నిర్గుణునిగ భావించెదరు. ఎట్లు పాలు మరియు వాని తెల్లదనము అభిన్నమో, అట్లే ఎవరు నా యందు, శ్రీ రాధేదేవి యందు భేదభావము చూడరో వారి అంత:కరణము నందు అహైతుక భక్తి పొడచూపును. వారు మాత్రమే బ్రహ్మాపదమయిన గోలోక ధామము ప్రవేశించుటకు అర్హులు. రంభోరు! ఈ భూతలము నందు ఎవరు నాయందు, శ్రీ రాధాదేవి యందు భేదమును చూచెదరో వారు సూర్యచంద్రులున్నంత కాలము కాలసూత్ర నరకము నందు పడి దు:ఖమును అనుభవించెదరు."

శ్రీకృష్ణుని పలుకులనాలకించిన లలిత ఆయనకు ప్రణామములు ఆచరించి తిరిగి వెళ్ళి శ్రీ రాధాదేవిని ఏకాంతమున సందర్శించి సుచిస్మితయై ఆయన ముఖారవిందము నుండి వెలువడిన సుధారసమును వెలువరించెను. "సఖీ! నీవు ఎట్లు శ్రీకృష్ణుని కోరుకొనుచున్నావో అట్లే ఆ మధుసూదనుడు సహితము నిన్నే కోరుకొనుచున్నాడు. మీరిరువురు భేదము లేని ఏక స్వరూపులు. లోకులు అజ్ఞాన వశమున మిమ్ములను వేరుగా భావించెదరు. అందుకే సాధ్వీ! నీవు శ్రీకృష్ణుని కొరకై నిష్కామ కర్మ ఆచరింపుము.

" ఆ కర్మయొక్క ఫలితము ద్వారా పరాభక్తిని పొంది నీ మనోరధమును ఈడేర్చకొనగలవు. లలిత యొక్క సుమధుర భాషణమును విన్న రాసేశ్వరి శ్రీరాధ ధర్మవేత్తలయందు శ్రేష్ఠురాలయిన చంద్రానన అను సఖితో ఇట్లనియె.

"సఖీ? నీవు మహానుభావుడయిన గర్గాచార్యుని ద్వారా శాస్త్ర చర్చలను వింటివి. అందుచే శ్రీకృష్ణ ప్రీత్యర్థము నేను ఏ దేవతలను పూజింప వలెను? పరమ సౌభాగ్యదాయకము, పుణ్యజనకము, మరియు మనోవాంఛాఫల సిద్ధి ప్రదాయకము అయిన ఏదేని వ్రతమును నాకు ఉపదేశింప వలసినది."

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గత మయిన "శ్రీ రాధాకృష్ణుల ప్రేమోద్యోగ పర్వము" వర్ణనము అను పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(తులసీ మహాత్యము, శ్రీరాధాదేవి ద్వారా తులసీసేవన వ్రతము అనుష్ఠింపబడుట, దివ్య తులసీదేవి యొక్క ప్రత్యక్షము మరియు తులసీదేవి శ్రీ రాధాదేవికి వర మొసగుట)

శ్రీ రాధేదేవి యొక్క ప్రశ్నను విన్న చంద్రానన ఒక్క క్షణకాలము తన మనసునందు సమాలోచన చేసి తదుపరి ఇట్లనియె "శ్రీ రాధా! శ్రీకృష్ణ ప్రాప్తి కొరకు పరమ సౌభాగ్యదాయకము, మహా పుణ్యజనకము అయిన వ్రతమొకటి కలదు. అదియే తులసీ సేవన వ్రతము. నా మనసు నందు తులసీ సేవన వ్రతమును మించిన వ్రతము వేరొకటి లేదని నా అభిప్రాయము. ఎందుకనగా తులసి యొక్క స్వర, ధ్యానము, స్థవనము, నామ సంకీర్తన, ఆరోపణము, శోచనము మరియు తులసీ దళముల చే పూజ మిక్కిలి పుణ్యప్రదమయినది. ఎవరు తులసిని నవ విధ భక్తితో పూజింతురో వారు సహస్ర కోటి యుగములు తమ సుకృతముల ఉత్తమ ఫలములను భోగింతురు. మనుష్యుల చే నాటబడిన తులసి చెట్టు ఎంతకాలము శాఖోపశాఖలుగ, పుష్ప బీజముల సహితముగ విస్తరిల్లునో అంతకాలము ఆ వంశమునందు జన్మించు జనులందరూ ఆ వృక్షము ను నాటిన వారితో సహా రెండు వేల కల్పముల వరకు శ్రీహరి యొక్క ధామము నందు నివసించెదరు. సంపూర్ణ పత్ర, పుష్పముల చే భగవంతుని చరణార విందములను పూజించుట చే ఎట్టి ఫలితము లభించునో, అట్టి ఫలము ఏకమాత్ర తులసిదళ సమర్పణ చే కలుగును.

ఎవరు తులసీ దళములతో శ్రీహరిని రోజూ పూజించెదరో, వారిని తామరాకును నీరంటనట్లు పాపములు వారి దగ్గరకు కూడా పోజాలవు. వంద బారువుల బంగారము, మరియు నాలుగు వందల బారువుల వెండి దానము చేసిన ఫలితము తులసీవనము సంరక్షించు మానవుడు పొందును. ఎవని ఇంటియందు తులసి వనము యుండునో ఆ గృహము తీర్థయాత్ర స్థలము అగును. అచటకు యముని భటులు వెళ్ళలేరు. ఏ శ్రేష్ఠ మానవుడు సర్వపాప హరము, పుణ్యజనకము, మనోవాంఛాఫల దాయకము అయిన తులసీ వనమును సూర్యకాంతి చే ప్రకాశింప చేయునో ఆతడు సూర్యపుత్రుడయిన యమునికి అతిథిగా పోడు. ఏ మానవుడు తులసి యొక్క ఆలన, పాలన, పోషణ, శోచన, దర్శన, స్పర్శ చేయునో అటువంటి మానవుడు మనో వాక్కాయముల ద్వారా చేసిన సమస్త పాపములు దగ్ధమగును. పుష్కరాది తీర్థములు, గంగాది నదులు, వాసుదేవాది దేవతలు, కేవలము తులసీ దళము నందు నివసింతురు.

ఎవరు తులసిని శిరసుపై ధరించి ప్రాణత్యాగము చేయుదురో వారు కోట్లాది పాపములు చేసినప్పటికీ యముడు వారిని తేరిపార చూడ నశక్యుడగును. ఎవరు తులసీ కాష్ఠమును అరగదీసి ఆ గంధమును ధరించెదరో వానికి క్రియామాణ పాపములు ఏవియును అంటవు. శుభాననా! ఎక్కడ తులసీ వన ఛాయా ప్రదేశముండునో, అక్కడ పితృకార్యములు చేయుట శ్రేష్ఠము. తులసీ ఛాయ యందు ఈయబడిన దానములు అక్షయ ఫలితమును ఇచ్చును. ఆది దేవుడయిన చతుర్ముఖ బ్రహ్మ సహితము తులసీ మహాత్యమును వర్ణించుటకు సమర్థుడు కాదు. తులసీ మహాత్యము శ్రీహరి మహాత్మ్యము వలెనే అగణనీయము. గోపనందినీ! శ్రీకృష్ణుని సదా పొందుటకు నీవు కూడా తులసీ సేవా వ్రతము ఆచరింప వలసినది."

చంద్రానన యొక్క శుద్ధ భాషణమును వినిన రాసేశ్వరి శ్రీ రాధ సాక్షాత్ శ్రీహరిని సంతుష్ఠము చేయు తులసీ సేవా వ్రతము ఆరంభించెను. కేతకీ వనము నందు వంద అడుగుల వృత్తాకార భూమిపై ఎత్తైన మిక్కిలి మనోహర మయిన తులసీ మందిరమును నిర్మించెను. ఆ మందిరము యొక్క గోడలు అన్నియు సువర్ణ మయమై మూలమూలలా పద్మరాగమణులు తాపింపబడియున్నవి. మందిరము అంతయు నీలి మణులతో, మాణిక్యములతో, ముత్యములతో ప్రకాశించుచున్నది. ఆ మందిరము నలు ప్రక్కలా ప్రదక్షిణము చేయటకై ఒక విశాలమార్గము నిర్మింపబడి, ఆ మార్గమంతయు చింతామణులతో నిండియున్నది. ఎత్తైన తోరణములు, స్వర్ణ ధ్వజ దండము, రెపరెప లాడుచున్న పతాకములు, నలు దిశలా పరివేష్ఠితమయిన రంగు రంగుల డేరాలు, ప్రకాశించుచున్న ఆ తులసీ మందిరము వైజయంతీ పతాకము తో విలసిల్లు ఇంద్రభవనము వలె దేదీప్యమానముగ వెలుగుచున్నది.

ఇటువంటి శుభప్రదమయిన మందిరము యొక్క మధ్య భాగమున ఆకుపచ్చని పల్లవములు తో శోభించు తులసీ వృక్షమును స్థాపించి, ఒక అభిజిత్ ముహూర్తము నందు తులసీ వ్రత మారంభించెను. శ్రీ గర్గాచార్యులను పిలపించి ఆయన ద్వారా తులసీ వ్రత విధి విధానములను కూలంకషముగ గ్రహించి శ్రీకృష్ణ సంతుష్ఠి కొరకు ఆశ్వయుజ పూర్ణిమ నుండి, చైత్ర పూర్ణిమ వరకూ తులసీ సేవా వ్రతమును మిక్కిలి భక్తితో అనుష్ఠించెను. శ్రీ రాధాదేవి వ్రత మారంభించిన పిదప వివిధ మాసముల యందు వివిధ ఫలరసముల చే తులసిని పూజింపసాగెను. కార్తీక మాసమందు పాలచే, మార్గశీర్ష మాసమందు ఇక్షు (చెరకు) రసము చే, పుష్యమందు ద్రాక్షరసము చే, మాఘమాస మందు తియ్యె మామిడి రసము చే, ఫాల్గుణము నందు అనేక వస్తు మిశ్రమ రసము చే, చైత్రము నందు పంచామృతము చే పూజించెను.

ఈ విధముగ వృషభాను నందిని తులసిని పూజించి శ్రీ గర్గాచార్యుల చే చెప్పబడిన విధి విధానము గ వైశాఖ పాడ్యమి నాడు ఉద్యాపన గావించెను. ఆ దినము ఆమె రెండు లక్షల మంది బ్రాహ్మణులకు ఏబది ఆరు పిండి వంటలచే నిండిన భోజనము తో తృప్తి పరచి చక్కని వస్త్ర భూషణములు దక్షిణగా ఇచ్చెను. ఒక లక్ష బారువుల పెద్ద, పెద్ద ముత్యములను, ఒక కోటి బారువుల బంగారమును శ్రీ గర్గాచార్యులకు దాన మెసంగెను. ఆ సమయమున దేవ దుంధుభులు మ్రోగినవి. అప్సరలు నాట్యమాడిరి. దేవతలు ఆ మందిరము పై పుష్పవృష్టి కురిపించిరి.

ఆ సమయమున హరిప్రియ అయిన తులసీ దేవి సువర్ణమయ సింహాసనాదిష్ఠురాలై ప్రత్యక్షమయ్యెను. ఆ తల్లి చతుర్భుజయై, కమలనయనయై, పదహారు వర్షముల బాలికా రూపమున శ్యామసుందరి యై ప్రకాశించు చుండెను. శిరము నందు సువర్ణ మయ కిరీటము, కర్ణములందు కాంచనమయ కుండలములు, నాగిని వలె ప్రకాశించు వేణీబంధమందు వైజయంతీ పుష్పములు ధారణ చేసిన తులసీ మాత, గరుడవాహనము నుండి క్రిందకి దిగి శ్రీ రాధదేవిని తన ఒడిలోనికి తీసికొని, కూర్చుండబెట్టుకొని, చంద్రబింబము వంటి ఆమె ముఖమును చుంబించెను. పిదప తలసీమాత "కళావతీ కుమారీ! శ్రీ రాధా! నేను నీ భక్తిచే మిక్కిలి ప్రసన్నమయితిని. వాస్తవమునకు నీవు మనో, బుద్ధి, చిత్త ఇంద్రియముల ద్వారా ఏఏ మనోరధములను కోరితివో అవి అన్నియు సఫలములగును. నీ యందు నీ పతి మిక్కిలి అనుకూలమగును. నీకు పరమ సౌభాగ్యము ప్రాప్తించును." శ్రీ రాధాదేవి "దేవీ! గోవిందుని చరణయుగళి యందు నాకు అహైతుక భక్తిని ప్రసాదింపవలసినది." అంత తులసీ దేవి "తథాస్తు" అని పలికి అంతర్ధానమయ్యెను. అప్పటి నుండి శ్రీ రాధాదేవి తన నగరము నందు ప్రసన్న చిత్తయై నివసింపసాగెను.

బహుళాశ్వ మహారాజా! భూతలము నందు ఏ మానవుడు భక్తి పరాయణుడై శ్రీ రాధాదేవి యొక్క ఈ విచిత్ర ఉపాఖ్యానమును వినునో అతడు తప్పక త్రివర్గములయిన సుఖములు అనుభవించి అంతము నందు భగవానుని పొంది కృతకృత్యుడగును.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన తులసీ పూజనమను
పదహారవ అధ్యాయము సమాప్తము.)

పదిహేడవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు గోపదేవీ రూపమున వృషభాను భవనమునకు ఏగి శ్రీ రాధాదేవిని కలియుట)

బహుళాశ్వ మహారాజు ఇట్లు ప్రశ్నించెను "మహామునీ! శరదృతువు నందు వికసించిన కమలముల యొక్క మధుపానము చేయు భ్రమరములకు ఎట్లు తృప్తి కలుగదో అట్లే శ్రీ రాధాకృష్ణుల చరిత్రను వినుచున్న నాకు తృప్తి కలుగుట లేదు. ఇంకనూ వినవలెనన్న కోరిక ఇనుమడించుచున్నది. తపోధనా! బ్రహ్మన్! శ్రీకృష్ణ పత్ని రాసేశ్వరి, తులసీవ్రతమాచరించిన పిదప ఏమి జరిగినది? ఆ వృత్తాంత మంతయు నాకు తెలుప వలసినది." నారదుడు "మహారాజా! శ్రీ రాధికా దేవి తులసీ వ్రత సందర్భముగ చేసిన తపస్సునంతటినీ ఎరిగిన శ్రీకృష్ణ భగవానుడు ఆమె ప్రేమను పరీక్షించుటకై ఒకనాడు వృషభాను పురమునకు ఏగెను. ఆ సమయమున ఆయన ఒక అద్భుత గోపాంగన వలె దేహధారణ చేసెను. వయ్యారమగ నడుచునపుడు సవ్వడి చేయుచున్న నూపురములు, మరియు కటియందలి వడ్డాణమునకు యున్న చిరుగంటలు, వినుటకు కర్ణపేయముగ యున్నది. సన్నని వ్రేళ్ళకు సుందరమయిన అంగుళీయకములు, చేతులకు రత్నఖచిత కంకణములు భుజములకు మెలి తిరిగిన భుజకీర్తులు, కంఠము నందు, వక్షస్థలమందు ముత్యాల హారములు, కేశపాశమును బంధించుచు బాలభానుని పగిది వెలుగొందు శిరోభూషణములు, ముక్కున బంగారపు ముక్కు పుడక, ధరించి నల్లని నీలి కలువ కాంతిగల శరీరముతో వెలుగొందు సుందర గోపస్త్రీ రూపము ధరించి శ్రీహరి వృషభాను భవనమునకు ఏగెను.

ఆ భవనము లోతైన కందకముల చే పరివేష్ఠితమై, అనేక రెపరెపలాడుచున్న పతాకముల చే అలంకృతమై, నలువైపులా నాలుగు సమున్నత ద్వారముల చే శుశోభితమై యున్నది. ఒక్కొక్క ద్వారము కాటుక కొండల వంటి అనేక భద్ర గజములు, మనో, వాయు వేగము తో పరిగెత్తగల విచిత్ర వర్ణములు గల హయముల చే పరిరక్షింప బడుచు మిక్కిలి శోభాయమానముగ ప్రకాశించు చుండెను. అంతేకాక అచట గోవత్స సహితలయిన గోవుల సముదాయములు, ధర్మ ధురంధరలయిన వృషభ రాజములు సహితము శోభిల్లు చున్నవి. వాటిని నిరంతరము కంటికి రెప్పవలె కాచు గోపాలకులు వంశీ, వేత్రహస్తులై, బహు జాగరూకులై యుండిరి. ఇటువంటి శత్రు దుర్భేద్యమయిన రాజభవనము నందు మాయా మోహినీ రూపధారణ చేసిన శ్యామసుందరుడు, మధు సూదనుడు, శ్రీకృష్ణుడు ప్రవేశించెను.

శ్రీ రాధాదేవి గృహ ప్రాంగణము సూర్యకాంతిని దీపించు అనేక చిత్ర విచిత్ర స్థంభములతో, ద్వారములతో, కిటికీలతో విరాజిల్లు చుండెను. ఆ గృహాంగణమున రత్న భూషణలయిన సుందర వనితలు గృహ కార్యముల యందు నిమగ్నలై, యుండిరి. చేతోహారిణిలయిన గోప సుందరీమణులు పూలమాలలు తీసికొని శ్రీ రాధాదేవి యొక్క గుణగానములను మృదంగ, వీణా, వేణు వాద్యములకు అనుగుణముగ పాడుచుండిరి. ఆ అంత:పురమునకు లోపల విశాలమయిన దివ్య వనము కలదు. అందు మల్లె, మందార, దానిమ్మ, వేప మరియు ఎత్తైన ఇతర వృక్షములు, మరియు కేతకీ (మొగలి) మాలతీ, మాధవీ లతలు, శోభించుచున్నవి. పుష్ప మధువును త్రాగిన మధుపముల ఘూంకారము చే, కల్ప వృక్షముల పుష్ప సుగంధమును మ్రోయుచున్న శీతల మంద వాయు గమనము చే, ఆ ఉపవనము వాతావరణమంతయు మిక్కిలి ఆహ్లాదకరముగ యున్నది. మత్త కోకిలల కుహు కుహు నాదముతో, మయూరముల క్రేంకారములో, సుఖ సారణ పక్షుల తీయని కలకలా రావములతో, ఆ ఉపవనమంతయు ప్రతి ధ్వనించు చున్నది. అచ్చటి మేఘమండల మందు అనేక జలపాతములు ఉపస్థితమై యున్నది.

బాలసూర్యుని పగిది భాసించు కుండలములు, మరియు చిత్ర విచిత్ర దుకూలములు ధరించి వందలాది చంద్రవదనలు శ్రీ రాధాదేవి యొక్క సేవా కార్యము నందు నిమగ్నమై యుండిరి. వారందరి మధ్యన శ్రీ రాధికారాణి భాసించుచుండెను. ఆ రాజమందిరము పలుచని కుంకుమ రంగు వస్త్రముల చే అలంకరింపబడినది. నేల అంతయు

పర్వతీయ మరియు జలపుష్పములు, మరియు సుతిమెత్తని కోమల పల్లవముల చే కప్పబడినది. మాలతీ పుష్ప మకరందము వానిపై జల్లబడినది. అటువంటి ప్రాంగణములందు కోట్లాది చంద్రుల కాంతిగల కోమలాంగి శ్రీ రాధాదేవి విహరించెడిది. ఇటువంటి ప్రదేశము లోనికి వచ్చిన నూతన గోప వనితను శ్రీరాధాదేవి చూసినది.

చంద్రోదయమయిన పిదప తారలు వెలవెలబోయినట్లు ఈ గోపాంగన యొక్క తేజస్సు చూచి మణి మందిరమున యున్న ఇతర వనితలు దిగ్భ్రాంతిని పొందిరి. శ్రీ రాధాదేవి ఆ నూతన గోపవనితను మిక్కిలి గౌరవించి, తన రెండు చేతులతో ఆమెను కౌగలించి, ఆమెను ఒక దివ్య సింహాసనము నందు ఆశీనురాలిని చేసెను. లోకాచారమును అనుసరించి ఆమెకు అర్ఘ్య, పాద్యాదులును ఇచ్చి పూజించి ఇట్లనియె "సుందరీ! సఖీ! నీకు స్వాగతము. నీ నామధేయమేమి? నీ యొక్క ఆగమనము నాకు మిక్కిలి సౌభాగ్యకరము. ఈ భూతలము నందు నీ వంటి దివ్యరూప ధారిణిని నేను చూడలేదు. శుభాననా! ఎక్కడ నీ వంటి సుందర వనితలు నివసించెదరో ఆ నగరము ధన్యము. నీ శుభాగమమునకు కారణమేమి? నేను నీకు ఏదేని కార్యము చేయవలసినచో అవశ్యము చెప్ప వలసినది."

నీ ప్రేమపూర్వకమయిన ఆలోకనము, సుందర దీప్తి, మధుర వచనము, మనోహర మందహాసము, నీనడక, నడత, విన్యాసము మరియు ఆకృతి నాకు శ్రీపతిని చూచినట్లు యున్నది. సఖీ! నీవు ప్రతిదినము నన్ను కలసికొనుటకు ఇచటకు రమ్ము. నీకు కుదరని యెడల నీ నివాసస్థలము నాకు తెలుపుము. నీ శరీరము నాకు మిక్కిలి ప్రియముగ కానపట్టుచ్చున్నది, ఎందుకనగా నా ప్రియతముడయిన, హృదయమును హరించిన నందనందనుని ఆకృతి అచ్చము నీ వలెనే యుండును. నీవు నా యెద్దనే యండవలసినది. ఎట్లు వదిన తన ఆడబడుచును ప్రేమించునో అట్లే నిన్ను మిక్కిలి ప్రియముగ ఆదరించెదను.

ఇది వినిన మాయాగోపిక వేషధారి అయిన శ్రీకృష్ణ భగవానుడు కమలనయన అయిన శ్రీ రాధాదేవి తో అట్లనియె "రంభోరు! నంద గోకులము నందు నంద భవనమునకు ఉత్తర దిశగా నా నివాసము కలదు. "గోపదేవి" నా నామధేయము. నేను నీ సఖి అయిన లలిత వద్ద నీ రూప, గుణ, మాధుర్య వర్ణనము వింటిని. అందుకే ఓ! చంచల లోచనా! నిన్ను దర్శించుటకు ఏతెంచితిని. కమలలోచనా! ఎచట లలిత లవంగలతల యొక్క సుస్పష్ట సుగంధము తేలియాడునో, ఎచట కుంజ, నికుంజములందు భ్రమరముల ఘుంకారము చే కమలములు విరియుచుండునో, అటువంటి నీ యొక్క నిత్య నూతన దివ్య నగరమును నేడే నా కన్నులతో చూడ గల్గితిని. మీ నగరము ఇంద్రుని అమరావతి కంటే సుందరముగ యున్నది."

మిథిలేశ్వరా! ఇట్లు ప్రియా ప్రియుల సమాగమము జరిగినది. అటు పిదప వారిరువురు ఉపవనము నందు విహరించుచూ, పుష్ప కందుకములతో ఆడుచూ, నవ్వుచూ ఆనంద గీతికలు ఆలాపించుచుండిరి. వివిధ కళా కౌశల సంపన్న, మరియు కమల లోచన అయిన రాధాదేవి తో గోపదేవి మృధుమధురముగ ఇట్లనియె "వ్రజేశ్వరీ! నంద నగరము ఇచట నుండి దూరము. ఇపుడు సంధ్యాసమయము అయినది. నేను ఇపుడు వెళ్ళి, రేపటి ఉదయము ప్రాత: కాలమున మరల ఏతెంచెదను. ఇందు సందేహము లేదు." గోపదేవి పలుకులు వినిన వ్రజేశ్వరి శ్రీ రాధాదేవి నయనముల నుండి అశ్రుకణములు జలజలా రాలినవి. ఆమె రోమాంఛయై, భావోద్వేదమునకు గురియై మొదలు నరకిన కదళీతరువు వలె నేలపై బడెను. ఇది చూచి చెలికత్తెలు భయభీతులై దాపున యున్న వింజామర తీసికొని. ఆమెకు విసరుట ప్రారంభించిరి. ఆమె పై అత్తరు, చందనము, మరియు పుష్పముల దళములు జల్లి సేదదీర్చిరి. ఆపుడు గోపదేవి శ్రీ రాధాదేవితో ఇట్లనియె.

"శ్రీ రాధికా! నేను రేపటికి ప్రాత:కాలము తప్పని సరిగా వచ్చెదను. గోవులపై, గోదుగ్ధముపై, నా అన్నపై ఆన. చింత వలదు. రేపు తప్పక వచ్చెదను." ఇట్లు పలికి శ్రీ రాధాదేవిని సమాశ్వాశించి మాయామోహిని వేషధారి అయిన శ్రీ కృష్ణుడు నంద గోకులమునకు చనెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన శ్రీ రాధాకృష్ణ
సంగమమను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు గోపదేవి రూపమున శ్రీ రాధాదేవిని పరీక్షించుట, మరియు శ్రీ రాధాదేవి యొక్క శ్రీకృష్ణ దర్శనము)

తదనంతరము మరునాడు వేకువఝామున మాయా గోపిక రూపమున శ్రీకృష్ణుడు శ్రీ రాధాదేవి యొక్క దు:ఖోపశమనమునకై వృషభానుపురమునకు ఏగెను. ఆమెను చూచిన మరుక్షణము శ్రీ రాధాదేవి హర్షోల్లాసితయై లేచి, ఆమె చేతులు పట్టుకొని, లోనికి తీసికొని వెళ్ళి సుఖాశీనురాలిని గావించి పూజించెను. అనంతరము శ్రీ రాధాదేవి ఇట్లనియె "సఖీ! నీవులేక రాత్రి అంతయు నేను మిక్కిలి దు:ఖించితిని, కానీ నీవు వచ్చిన తోడనే పోయిన వస్తువు తిరిగి దొరికినపుడు పొందిన అనందమును పొందుచున్నాను. ఏదేని కుపథ్యము సేవించినపుడు మొదట సుఖముగ యుండును. కానీ తదుపరి వియోగ దు:ఖము పొందవలసి వచ్చును. అట్లు సుమిత్ర సాంగత్యము చే మెదట సుఖముగ యుండును. కానీ తదుపరి వియోగ దు:ఖము పొందవలసి వచ్చును. ఈ మాటలు విన్న గోపదేవి ఒక్క క్షణమే ఖిన్నురాలై కూర్చొండి పోయినది. గోపదేవి ఖిన్నతను కాంచిన శ్రీ రాధ చెలికత్తెలతో విచారించి ఇట్లు స్నేహ పూర్వక సంభాషణము నెరపెను.

"గోపదేవీ! నీవేల ఖిన్నురాలివైతివి? కళ్యాణీ! నాకు కారణము తెలుపవలసినది. నీ మాతా పితరులు గానీ, నీ అత్త, అడబడుచులు కానీ నీ యందు కుపితులై నిన్ను శిక్షింపలేదు కదా! మనోహరీ! నీ పతీ వియోగము చే కానీ, సవతి దోషము చే కానీ, లేక ఏ ఇతర కారణముచే నీ మనసు దు:ఖపడుట లేదు కదా! మహాభాగా! మార్గాయాసము చే శరీరము డస్సి రోగము పొడసూపలేదు కదా! నీ దు:ఖమునకు కారణము వెంటనే తెలుప వలసినది. ఎవరేని నీకు కృష్ణభక్తుల యెడల, లేక సద్బ్రాహ్మణుల యెడల కుత్సితములు చెప్పిరా ఏమి? నేను వెంటనే వారికి దండన విధింతును. నీకు ఇష్టమగునేని రథ, గజ, హయ, వాహనములు, నానా విధములయిన రత్న, వస్త్ర, ధనములు, భవనములు ఏవైననూ అడుగుము. నిస్సందేహముగ నీకు ఇచ్చెదను. ధనము చే శరీరమును రక్షింపవలెను. శరీరమును త్యాగము చేసి మానమును రక్షింప వలయును. మిత్రుల కార్యము కొరకు శరీరము, ధనము, మానము సహితము అర్పింపవలెను. ఎవరు కారణము, కోరిక లేకుండా నిశ్చల భావము తో మిత్రత్వము నెరపుదురో ఆ మనుష్యులు ధన్యులు. మిత్రత్వము చాటి ఎవరు కపటత్వమును పూనుకొనునో అట్టి స్వార్థపరుని జీవితము వ్యర్థము." శ్రీ రాధాదేవి యొక్క ప్రేమపూరిత వాక్కులు వినిన గోపదేవి చిరునవ్వుతో ఇట్లనియె.

"శ్రీ రాధా! బరసాను నగర వీధులయందు నేను పెరుగునమ్ముటకు స్వయముగ వెళ్ళితిని. ఇంతలో నందుని నవతరణసుతుడు, శ్యామసుందరుడు నన్ను మార్గము నందు ఆపెను. ఆయన వంశీ, వేత్రహస్తుడై యుండెను. ఆ రసిక శేఖరుడు సిగ్గు విడచి నా చేయ పట్టుకొనెను. అంత గట్టిగా నవ్వుచూ ఏకాంతమున ఇట్లనియె "సుందరీ! నాకు పెరుగు ఈయవలసినది లేకున్నచో నీ చేయి విడువను". అంత నేను ఆతనికి పెరుగునీయనని కసరితిని. అంత నంద నందనుడు బలవంతముగ నా శిరము నుండి పెరుగు కుండ లాగి, ఆ కుండకు కన్నము పెట్టి, కొంచెము పెరుగు తీసికొని, నాపై వస్త్రము లాగికొని నందీశ్వరగిరి యొక్క ఈశాన్య దిశ వయిపు నడుచుచు వెళ్ళెను. ఇందువలన నేను మిక్కిలి ఖిన్నురాలైతిని. ఆతడు జాతిరీత్యా గోపాలుడు. కాల కలుషిత దేహము కలవాడు. ఆతడు ధనవంతుడు, వీరుడు, సుశీలుడు, సురూపుడు కాడు. అట్టి పురుషుని నీవు ప్రేమించుట పాడిగాదు. నా మాట వినుము. ఈ రోజు నుండి వెంటనే నీ మనసు నుండి ఆ నిర్మోహి అయిన శ్రీ కృష్ణుని తొలగింపుము". ఈ విధమయిన కఠోర వచనములను విన్న శ్రీ రాధాదేవి మిక్కిలి విస్మయము పొందినది. ఆమె పద వాక్యముల సంభాషణల చతురతకై సరస్వతీ మాత చరణములను శ్రద్ధగా స్మరించి ఇట్లనియె.

"సఖీ! ఎవరి ప్రాప్తి కొరకు బ్రహ్మ మరియు మహేశ్వరాది దేవతలే పంచాగ్ని పూర్వక తపమాచరించెదరో, దత్తాత్రేయుడు, శుక, కపిల, అంగిరాది ఋషులు ఎవరి చరణారవింద మకరంద, పరాగముల సాదరస్పర్శ చేయుటకు ఇచ్ఛగించెదరో, మరియు జన్మ లేనివాడు, పరిపూర్ణ భగవానుడు, లీలావతారధారీ, సర్వజన దు:ఖహారీ! భూతల భూరి

భారహారణకారీ, మరియు సత్పురుషుల కళ్యాణమునకు ఇచట అవతరించిన ఆదిపురుషుడయిన శ్రీకృష్ణుని నీవు ఎట్లు నిందించ గలుగు చున్నావు?"

నీవు ఉద్దండ పండితురాలివి కదా! గోపాలురు ఎల్లప్పుడూ గోవుల ఆలనా పాలన చూచెదరు. గోరజము అనెడు గంగ యందు గ్రుంకులిడెదరు. గోవులను స్పర్శించి వాని ఉత్తమ నామములను భజింతురు. అంతేకాదు, వారు ద్వీరాత్రములు గోవుల సుందర ముఖపద్మములను దర్శించెదరు. నా దృష్టియందు సృష్టిలో గోప జాతిని మించిన జాతి లేదు. నీవు ఆ శ్యామవరుని మిక్కిలి నల్లనివాడు అని అధిక్షేపించితివి. కానీ శ్యామసుందరుని నల్లని కలువ కాంతి విలసిత సుందర ఛాయను దర్శించి, ఆయన యందే మనసునుంచి, ఇతరుల సుందరత్వమును విడచి, జటాజూటము, హాలాహల విషము, భస్మ, కపాల, సర్ప ధారణము చేసిన నీలకంఠుడు ఈ కాలబాలునికై పిచ్చివాని వలె వ్రజభూమి అంతయు తిరుగు చుండెను. స్వర్గలోక, సిద్ధ, సాధ్య, ముని, యక్ష, మరుద్గణ, నర, కిన్నెర, నాగుల అధిపతులు సహితము ఎవరి చరణార విందముల యందు ప్రణిపాత మొనర్చి ఐశ్వర్యమును పొందుచున్నారో అట్టి మాధవుని నీవు నిర్ధనుడు అని వక్కాణించుచున్నావు.

ఎవరు కాళియుని మదము అడగించెనో, యమళార్జున వృక్షములను పెకలించెనో, మరియు వత్సాసుర, అఘాసుర, బకాసుర, శకటాసుర, పూతన, తృణావర్తులను సంహరించెనో వానిని వీరుడు కాదు అయిన చెప్పుచున్నావు. ఎంత చోద్యము? ఎవరు కోటి కోటి బ్రహ్మాండముల సమూహమును ఒక క్షణములో సృష్టించి, సంహరించునో అటువంటి భగవానుడు యశోభూషణుడు కాదా? అటువంటి భగవానునకు, పరమ పురుషోత్తమునకు భక్తులు వినహా మరిఎవ్వరూ ప్రియులు కారు. శంకర భగవానుడు, లక్ష్మీదేవి, చతుర్ముఖ బ్రహ్మ మరియు బలరాముడు సహితము అయనకు భక్తుల కంటె అధికులు కాదు. ఆయన భక్తిచే బంధింపబడి భక్తులు వెనుక పరుగలిడును. అటువంటి శ్రీకృష్ణుడు సుశీలుడే కాదు, సమస్త లోకముల సుజన సమూహము (సమదాయము) యొక్క చూడామణి. ఆయన నిరంతరము భక్తులను వెంబడించుచూ, తన రోమకూపముల యందలి లోకములను పవిత్రము చేయును. ఆ పరమాత్ముడు భక్తుల యందు తన ప్రియత్వమును సూచించునేయుండును. తనను అత్యంత భక్తి భావముతో భుజించు భక్తులకు ఆయన అనాయాసముగ ముక్తిని సహితము ప్రసాదించును.

అంత గోపదేవి "శ్రీరాధా! నీ బుద్ధి బృహస్తతిని ఉపహాస్యము చేయును. నీ వాచిచ ప్రౌఢిమ, ప్రవచన కౌశలము వేదవాణి వలె యున్నది. కానీ దేవీ! నీ పిలుపు చే పరమేశ్వరుడయిన శ్రీకృష్ణుడు ఇచటకు ఏతెంచిన యెడల, నీ మాటకు బదులు ఇచ్చిన యెడల నీ కథనము నిజమని నమ్మెదను." అంత శ్రీ రాధాదేవి "శుభ్రా! నా పిలుపు చే పరమేశ్వరుడయిన శ్రీకృష్ణుడు వచ్చిన ఎడల నీవు ఏమి చేయుదువు? ఏమి ఇచ్చెదవు? అది నీవు చెప్ప వలసినది. కానీ నా ప్రతిజ్ఞ చెప్పుచున్నాను. వినుము. నా స్మరణ చే వనమాలి యొక్క శుభాగమనము కానిచో నేను నా ధన, భవన, సర్వస్వము నీకు ఇచ్చెదను."

తదుపరి శ్రీ రాధాదేవి లేచి నంద నందనునికి సమస్కరించి ఆసనము నందు ఆశీనురాలై శ్రీకృష్ణుని ధ్యానింప మెదలిడినది. ఆ సమయమున ఆమె నేత్రమలు ధ్యానరతి చే నిశ్చలమయినవి. శ్రీహరి ఇట్లు తలచెను. "ప్రియతమ శ్రీరాధ నా దర్శనమునకై ఉత్కంఠితయై యున్నది. ఈమె అంగ ప్రత్యంగముల యందు స్వేదము నిండి కన్నులు అశ్రు పూరితములై యున్నవి. ఇది చూచినంతనే భక్త వత్సలుడగు శ్రీకృష్ణుడు చెలులందరూ చూచుచుండగానే స్త్రీ రూపము విడచి, పురుషరూపము ధరించి అచట ప్రత్యక్షమయ్యెను.

"రంభోరూ! చంద్రవదనా! వ్రజ సుందరీ శిరోమణీ! నూతన యవ్వన శాలినీ! మానశీలా! ప్రియరాధా! నీవు మధుర వచనములచే నన్ను పిలిచితివి. నేను వెంటనే ఇచటకు ఏతెంచితిని. నీ కనులు విప్పి ఒక్కసారి నన్ను వీక్షింపుము."

లలనా! "ప్రియతమ కృష్ణా! ఇటు రమ్ము అను వాక్యము ఇచట నుండి వినిపించినది. ఆ క్షణమే గోకులము, గోప బృందము, వంశీవటము, యమునా తీరము వదలి శీఘ్రగతిని నిన్ను ఆనందపరచుటకై ఇచటకు ఏతెంచితిని. ఎవరో యక్ష, కిన్నెర, గంధర్వ, కింపురుష, దేవ, ఆసురీ సఖిరూప ధారిణి నిన్ను మాయ చేయుటకు వచ్చి, నన్ను చూడగానే

పలాయనము చిత్తగించినది. నీవు అటువంటి స్త్రీలను విశ్వసింపరాదు.” తదనంతరము శ్రీ రాధాదేవి శ్రీకృష్ణుని చూచి ఆయన చరణార విందములందు ప్రణుతించి పరమానందమ నందు నిమగ్న అయినది. ఆమె మనోరథము తక్షణమే పూర్తి అయినది.

శ్రీకృష్ణ చంద్రుని అద్భుత చరిత్రను ఎవరు భక్తి భావము తో శ్రవణము చేయుదురో వారు కృతార్థులగుదురు.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన శ్రీ రాధాదేవి యొక్క శ్రీ కృష్ణ దర్శనము అను పద్దెనిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(రాసక్రీడ వర్ణనము)

బహుళాశ్వ మహారాజు “దేవర్షీ! శ్రీకృష్ణ భగవానుడు శ్రీరాధాదేవికి దర్శనమిచ్చి ఆమెను పరీక్షించిన పిదప ఏఏ లీలలు గావించెను!” నారదుడు “మహారాజా! మాధవ మాసమందు (వైశాఖ మాసం) మాధవీలతల చే నిండిన బృందావనము నందు రాసేశ్వరుడయిన మాధవుడు స్వయముగ రాసలీలారంభము చేసెను. వైశాఖ మాసము నందు కృష్ణపక్ష పంచమి సాయంత్రము చంద్రోదయ వేళ మనోహర శ్యామసుందరుడు తటవర్తి ఉపవనము నందు రాసేశ్వరి శ్రీ రాధాదేవి తో రాసవిహారము గావించెను.

మిథిలేశ్వరా! పూర్వము గోలోకము నుండి అవతీర్ణమయిన గోలోకపు భూమి అంతయు తక్షణమే సువర్ణమయమయి పద్మరాగ మండితమయినది. బృందావనము సహితము దివ్యరూప ధారణ చే కల్ప వృక్షములు మరియు మాధవీ లతలచే సమలంకృతమై, నందనవనమును సహితము తిరస్కరించు శోభను కలిగియున్నది. రత్నములు పొదిగిన సోపానములు, సువర్ణ నిర్మిత ఆచ్ఛాదనములు, హంస, కారండవాది పక్షులు, పద్మములు నిండిన యమునానది, అపూర్వ శోభతో ప్రకాశించుచున్నవి. గోవర్ధన పర్వతము గజరాజు వలెను, ఆ పర్వతరాజమున ప్రవహించు జలపాతములు గజగండస్థలమున ప్రవహించు మదధారల వలెను ఒప్పుచున్నవి. ఆ పర్వతమున పెక్కు ధాతువులు రత్నముల వలె ప్రకాశించుచున్నవి. గోవర్ధన పర్వతపు శిఖరముల దివ్యదీప్తి నలుదిశలా వెదజల్లుబడుచున్నది. ఆ గిరి రాజము యొక్క నలువైపులా సమస్త నికుంజములు దివ్య రూపములు ధరించి శోభించుచున్నవి.

సభా మండపములు నిండిన వీధులు, ప్రాంగణములు, సుందర శిల్పచాతుర్యము నిండిన స్థంభములు నలువైపులా తీర్చిదిద్దబడినవి. రెపరెపలాడుచున్న పతాకములు, స్వర్ణమయ కలశములు, పుణ్యమయ మందిరములందు విరబూయుచున్న శ్వేతారుణ పుష్ప దళములు, ఆ నికుంజముల శోభను మరింత ఇనుమడింప జేయుచున్నవి. వీటన్నిటి యందు వసంతఋతువు యొక్క మధురిమ నిండియున్నది. కోకిలల కుహూకుహూ ధ్వానములు, మయూరముల క్రేంకారములు, సారస పక్షుల తీయని కూతలు, మరియు నలుదిక్కులా ఎగురుచున్న పావురములు మరియు ఇతర విహంగముల కలకూజితములు మిక్కిలి శ్రవణానందకరముగ యున్నవి. శ్రీ రాధాకృష్ణుల గాథాగానము చేయుచున్న భ్రమరముల ఘుంకారము నికుంజముల యందు నిండియున్నది. యమునా తీరము నందలి సహస్రదళ పద్మములు మాటి మాటికీ పుష్ప పరాగము ను విడుచుచుండుట చే ఆ ప్రదేశమంతయు శీతల మంద సుగంధ సమీర ప్రవాహము చే నిండియున్నది.

ఆ సమయమున అనేకమంది గోపికలు శ్రీకృష్ణ భగవానుని సేవ యందు అంకితమయిరి. అందు కొందరు గోలోక వాసినులు, కొందరు శయ్యను సవరించు వారు, కొందరు శింగార ధారణాకళా కుశలురు, కొందరు ద్వారపాలికలు, కొందరు పార్షదులు, కొందరు చత్ర, చామరాది వీవనలు వీచువారు, కొందరు బృందావన రక్షకులు, కొందరు గోవర్ధన వాసినులు, కొందరు కుంజ విధాయినులు, మరికొందరు నికుంజ వాసినులు, కొందరు నాట్యకళా విశారదులు, కొందరు

గొప్ప వాద్య విద్వాంశినులు. ఈ లలనామణులు అందరూ కిశోరావస్థలో యుండి పున్నమి చంద్రుని సహితము తలదన్ను సౌందర్యాతిరేకము గలవారు. ఇటువంటి పన్నెండు యూధముల తరుణీమణులు శ్రీకృష్ణుని సమీపము నకు ఏతెంచిరి. ఇంతలో యమునానది తన స్త్రీ యూధమును తీసికొని అచటకు వచ్చినది. ఆమె నీలి వస్త్రధారిణి మరియు రత్నమయ ఆభూషణములు ధరించిన శ్యామ (ఇరువది సంవత్సరముల నవయవ్వన తరుణి). ఆమె నేత్రములు ప్రపుల్ల కమల దళములను అతిశయించు అందమును సంతరించుకున్నవి.

వారితో పాటు శ్వేత వస్త్ర ధారిణి, ముత్యాల హార శుశోభిని, శ్వేతకాంతి ప్రదాయిని అయిన జహ్నుకన్య గంగాదేవి సహితము తన యూధము తో ఏతెంచెను. ఇంతలో అరుణ వస్త్ర ధారిణి, భిన్న అంగముల యందు పద్మరాగ మణులతో చేయబడిన విభిన్న దివ్య ఆభరణములు ధరించి రమాదేవి తన యూధము తో ఏతెంచెను. ఆమె పూర్ణ చంద్రుని వంటి అంగకాంతి కలిగి అధరములందు దివ్య మందహాసము వెదజల్లుచుండెను. అట్లే కృష్ణపత్నులమని చెప్పుకొను మధు మాధవి (వసంతలక్ష్మి) పుష్పమాలాకృతలు, సుందర వస్త్ర సుశోభితలు, ప్రపుల్ల కమలనయనలయిన తన యూధము తో తరలి వచ్చెను. ఇట్లే సాక్షాత్ విరజాదేవి గౌరవర్ణులు, రత్న భూషాణాలంకరణలు, అయిన తన యూధముతో అచటికి ఏతెంచెను. లలిత, విశాఖ, మరియు లక్ష్మీదేవి తమతమ యూధములతో అచటికి విచ్చేసిరి. అట్లే ఎనిమిది, పదహారు, ముప్పదిరెండు సఖుల సంపూర్ణ యూధములు సహితము ఏతెంచినవి. మహారాజా! భగవానుడయిన శ్యామసుందరుడు ఆ మానినీ జనమధ్యమున రాసమండలి యొక్క రంగభూమి యందు అద్వితీయముగ సుందర గోప సుదతీ మదవతుల మధ్య శ్రీకృష్ణ చంద్రుడు శోభించుచుండెను. శ్రీకృష్ణుడు మురళిని వాయించుచు గోప సుందరీ హృదయమునకు ఆహ్లాదము కలిగించుచుండెను.

శిరసున నెమలిపింఛము నిండిన కిరీటము, వక్షమున పుష్ప మాలికలు, వనమాల, కర్ణములకు కుండలములు. ఇవియే ఆయన ఆభరణములు. రతీదేవి సహితుడై మన్మధుడు ఎట్లు శోభించునో అట్లే రాసమండలి యందు శ్రీ రాధాదేవి తో శ్రీకృష్ణుడు శోభించుచుండెను. ఇట్లు గోప సుందరీమణుల ఆలాపము చే సమ్మిళితుడై సాక్షాత్ శ్రీహరి తన ప్రాణవల్లభ కరమును తన కరకమలమందుంచుకొని యమునా మనోహర తీరము నందు ఆ సుందరీమణుల సహితుడై కూర్చుండెను. తన మధురాలాపముల చే వారందరికీ ప్రియ మొనరించుచూ బృందావన శోభను మరింత ఇనుమడింప జేసెను. శ్రీ రాధా సహితుడై హాస వినోద క్రీడలు సలుపుచూ కుంజవనము నందు విహరించుట ప్రారంభించెను. ఒక లతా కుంజము లోనికి ప్రవేశించి తన ప్రియతమ చేతిని వదలి వెనెక దాగుకొనెను. అంత రాధాదేవి అయనను ఒక కొమ్మ ప్రక్కన కాంచి పట్టుకొనెను. పిదప శ్రీ రాధాదేవి ఘల్లు ఘల్లు మను నూపురములు శబ్దము చేయుచుండగా పరుగులిడి వేరొక నికుంజమునందు దాగెను. మాధవుడు సమితము వెనుక పరెగెత్తి ఆ లతా నికుంజము చేరి చూడగా అందు శ్రీ రాధాదేవి కానబడదయ్యె!

అంత ఆమెను వెదుకుచు శ్రీహరి ఆమెను కనుగొని వెనుక పరిగెత్తుగా ఒకరి వెనుక ఒకరు ఒక అడుగు దూరమున వృక్షములు చెంత దాగుడుమూతలు ఆడుట మెదలిడిరి. ఆ సమయమున ఆ రాధామాధవులు మేఘము చెంత మెరుపు తీగవలె, శ్యామతమాలము చెంత సువర్ణలత వలె, నీలాచలము నందలి బంగారుగని వలె యుండిరి. ఆ రాసమండలి యందలి రంగభూమి యందు ఎంతమంది సుందరీమణులు గలరో అంతమంది శ్రీకృష్ణులు ప్రత్యక్షమై వారితో నాట్యమాడ నారంభించిరి. వారితో పాటు సంపూర్ణ గోపసుందరీ మణులు పాడుచూ, నృత్యము చేయసాగిరి. అ దృశ్యము స్వర్గము నందు బహు సంఖ్యలో ఇంద్రులు దేవాంగనలతో దృశ్యము చేయుచున్నట్లు యున్నది.

పిదప శ్రీకృష్ణుడు వారందరినీ తీసికొని యమునానది యందు జలక్రీడలకై ప్రవేశించెను. ఆ దృశ్యము యక్ష సుందరీమణులతో యక్షరాజు కుబేరుడు జలవిహారమును తోపించుచున్నది. ఆ సుందరీమణుల కేశ పాశముల నుండి బడిన పుష్పములు చే యమునానది నీలి ఫలకము నందు పుష్ప తాపటము చేసినట్లు కానపట్టుచున్నది. మృదంగములు మరియు కరతాళ ధ్వనుల సహితులై ఆ వ్రజాంగనలు మధుసూదనుని యశోగానమును రాగ యుక్తముగ పాడుచుండిరి. వారి మనోరధము పూర్ణమయినది.

వారందరూ ఒకరిపై ఒకరు జలములు ప్రోక్షణము చేసికొనుచు, సల్లాపములతో యుండగా కరములు, శిరము, శిరోజములు అసంఖ్యాక నీటి బిందువులతో నిండి మెరయుచుండెను. గోప సుందరీ పరివేష్ఠితుడయిన శ్రీకృష్ణ భగవానుడు స్త్రీ గజములు చే చుట్టబడిన గజయూధపతి వలె శోభించుచుండెను. ఆకాశము నుండి దేవాంగనలు, విద్యాధర వనితలు, గంధర్వ పత్నులు పుష్పవృష్టి కురిపించిరి.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన రాసలీల అనెడు పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(రాసక్రీడ)

నారదుడు చెప్పదొడండెను "తదనందరము శ్యామసుందరుడు, మనోహరుడయిన శ్రీహరి జలక్రీడలు సమాప్తమయిన పిదప సమస్త గోపాంగనల సహితుడై గోవర్ధన పర్వతము పైకి ఏగెను. ఆ పర్వత కంధరములందు రత్నమయమయిన నేలపై రాసేశ్వరి అయిన రాధతో రాసనృత్యము చేసెను. పిదప పుష్పము తో అలంకరింపబడిన రత్న సింహాసనముపై మేఘము, విద్యుల్లతల వలె ఇరువురు ఆశీనులయిరి. అచట సఖులు అందరు ప్రసన్నమనుస్కులై శ్రీ రాధాదేవి యొక్క శింగారము చేయనారంభించిరి. చందనము, పుష్ప పరాగము, కస్తూరి, అత్తరు, కాటుక మరియు అనేక సుగంధ ద్రవ్యములతో ముందుగా యమున శ్రీ రాధాదేవికి విధివిధానముగా పూజసలిపి నూపురములను ధారణ చేయించినది. జహ్నునందిని అయిన గంగ మంజీరములను సమర్పించినది. శ్రీ రమాదేవి కటి ప్రదేశమున ధరించు కింకిణీ జాలమును, మధుమాలినీ దేవి కంఠ హారములను సమర్పించిరి. విరజ కోటి చంద్రుల భాతి ప్రకాశించు సుందర చంద్రహారమును ధరింపచేసెను. లలితా దేవి మణి మండిత కంచుకీ, విశాఖ కంఠ భూషణములను, చంద్రానన రత్నమయ ముద్రికలను, ఏకాదశి అధిష్ఠాత్రి దేవి రత్నఖచిత కంకణములను, శత చంద్రానన రత్నమయ భుజకీర్తులను, మధుమతి రత్న మయమయిన గాజులను, వంది తాటంకములను, సుఖదాయిని కుండలములను, సఖుల యందు ప్రధానమయిన ఆనంది పాపిడిబిళ్ళను, చంద్రబింబము వలె మెరయుచున్న బొట్టును, పద్మావతి దేవి ముత్యముల ముక్కెరను, ఇట్లు ఒక్కొక్కరు ఒక్కొక్క నగను శ్రీ రాధాదేవి చే ధరింప జేసిరి. చంద్రకాంత ప్రాత:కాలపు బాలసూర్యుని వలె వెలుగు శిరోభూషణమును, సుందరీదేవి చూడామణిని, బృందావనేశ్వరి అయిన బృందాదేవి కోట్లకొలది విద్యుత్తీగల వలె మెరయుచున్న చంద్ర, సూర్యులను రెండు ఆభూషణములను, సమర్పించెను. ఈ విధముగ శింగారింపబడిన శ్రీ రాధాదేవి దివ్యజ్యోతి వలె ప్రకాశించుచున్నది. గోవర్ధన పర్వతము నందు ఇటువంటి శ్రీ రాధాదేవి తో కూడిన శ్రీ కృష్ణభగవానుడు దక్షిణతో కూడిన యజ్ఞనారాయణుని వలె ప్రకాశించుచుండెను. మిధిలేశ్వరా! రాసము నందు శ్రీ రాధాదేవిని శింగారము చేసిన స్థలము "శృంగారమండలము" అను పేర ఖ్యాతి నొందినది.

పిదప శ్రీ కృష్ణుడు తన ప్రియ గోప సుందరీ సహితుడై చంద్ర సరోవరమునకు ఏగెను. ఆ సరోవరజలములందు స్త్రీ గజములు పరివేష్ఠించిన మదగజరాజు వలె శ్రీకృష్ణుడు విహరించెను.

అచటకు సాక్షాత్ చంద్రభగవానుడు ఏతెంచి శ్రీ రాధాకృష్ణులకు రెండు చంద్రకాంతమణులు మరియు రెండు సహస్రదళ పద్మములు బహూకరించెను. తదుపరి శ్రీహరి బృందావన శోభను వీక్షించుచు లతాకుసుమయుతమయిన బహుళావనము నందు ప్రవేశించెను. అచట సంపూర్ణ సఖీజనము స్వేదముచే తడిచి, డస్సియుండుట గమనించి వంశీధరుడు మేఘమల్హార్ రాగమును తన మురళి యందు ఆలాపించెను. అంతట అచట మేఘములు క్రమ్మి సన్నని చల్లని, జల్లులు కురిపించి వారందరి సేద తీర్చెను. అంత సుందర సుగంధ భరిత మంద మారుతము వీచగా సర్వులు మదిని ప్రీతినొందిరి. వారందరు తమ గళములను సమ్మిళితము చేసి ఉచ్చస్వరముతో మురారి యొక్క గుణగణములను గానము చేసిరి (యశోగానమును ఆలపించిరి.)

అచ్చటి నుండి కదలి రాధావల్లభుడు తాళవనము చేరెను. అచట మండలాకారములో చుట్టియున్న గోపవధువులతో రాసనృత్యము ఆరంభించెను. ఆ నృత్యమునందు సమస్త గోపకాంతల శరీరము చెమటతో తడిసి, దాహముతో వ్యాకుల చిత్తులయిరి. అంతట వారు "దేవా! గంగానది బహుదూరముగ యున్నది. మాకు మిక్కిలి దాహమగుచున్నది. మాకు ఇచటనే మీతో దివ్యరాసము చేయవలెనున్నది. ఇచట ఒక మనోహర సరోవరము సృష్టించవలసినది. అందు జలపానము చేసి జలవిహారము చేయగలము. మీరు జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయలకు నాయకులు, కారకులు.

అది వినిన శ్రీ కృష్ణుడు తన హస్తమునున్న వేత్రముతో భూమిని తాడించెను. తక్షణమే అచట ఒక దివ్యసరోవరము ప్రత్యక్షమయ్యెను. అయ్యది "వేత్రగంగ" అనేపేర సుప్రసిద్ధమయినది. ఆ నీటిని స్పర్శించి నంత మాత్రమున "బ్రహ్మహత్య పాతకము" సహితము దూరమగును. ఈ వేత్రగంగ యందు స్నానము చేసిన మానవులు గోలోక ధామమునకు ఏగుటకు అర్హులగుదురు. శ్రీకృష్ణభగవానుడు శ్రీ రాధాదేవి తో అచట జలక్రీడ లాడి తదుపరి కుముదవనము ప్రవేశించెను.

ఆ కుముదవనము నందు శ్రీ రాధాదేవి సమస్త వ్రజాంగనల ఎదుట శ్రీకృష్ణభగవానుని నానా విధములయిన దివ్య పుష్పములతో శింగారించెను. అచట నలువైపులా భ్రమరములు ఘుంకారము ప్రతిధ్వనించుచుండెను. ఈ వనము నందు కూడా శ్రీకృష్ణుడు సఖులతో కలసి రాసము చేసెను. పిదప శ్రీరాధాదేవి సమస్త వ్రజాంగనల ఎదుట శ్రీకృష్ణభగవానుని నానా విధములయిన దివ్యపుష్పములతో తిరిగి శింగారించెను. చంపా పుష్పములచే కటి ప్రదేశమును, సుమధుర మల్లెపువ్వులతో భుజ కీర్తులను, సహస్రదళ పద్మముల కర్ణికలతో కుండలములను, మోహినీ, మాలినీ, కుంద, కేతకీ పుష్ప హారములతో శ్రీకృష్ణుని శింగారించెను.

కదంబపుష్ప కుసుమములతో కిరీటమును, మందార పుష్పములతో ఉత్తరీయమును, హస్తమునందు కమలముల గుత్తి; కంఠము నందు తులసీమాల; తన ప్రియతమ చే ఇట్లు శింగారింపబడిన శ్రీకృష్ణుడు ఆ కుముదవనము నందు మూర్తీభవించిన వసంతుని వలె గోచరించెను. వీణా, మృదంగ, మురళీ, మురచంగ, కరతాళ ధ్వనులతో గోపికలు మనోహరముగ గీతములు ఆలాపించుచుండిరి. భైరవ, దీపక, మాలకోశ, శ్రీరాగ, మేఘమల్హార్, హిందోళ ఆదిగా రాగములు విభిన్న తాళములతో, సప్త స్వరములతో, మృదుమధురముగ గానము చేయుచూ, హావ భావ సహిత నానా ప్రకార రమణీయ నృత్యములు చేయుచు శ్రీ రాధా మాధవులను మిక్కిలి ప్రసన్నము గావించుచుండిరి. వారితో పాటు మధుర గీతికలు పాడుచూ మాధవుడు మధువనము ప్రవేశించెను. అచటకు ఏగి రాసేశ్వరుడయిన శ్రీకృష్ణభగవానుడు రాసేశ్వరి అయిన శ్రీరాధేదేవి తో కలసి రాసక్రీడ చేసెను. వైశాఖమాస చంద్రకాంతి యందు సౌగంధిక పుష్పపరాగము చే నిండినది, మాలతీ పుష్ప సౌరభము చే సమ్మిళిమయినది అయిన మంద మలయ మారుతము ఆహ్లా దము కలిగించు చుండగా నందనవనము నందు విహరించు ఇంద్రుని వలె గోపాంగనలను కూడి శ్రీకృష్ణుడు రమించుచుండెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన రాసక్రీడ
అను ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(గోపాంగనలతోడి శ్రీకృష్ణుని వన విహారము, మరియు రాసక్రీడ. గోపికలను విడచి శ్రీ రాధాదేవితో ఏకాంత విహారము, పిదప శ్రీ రాధాదేవిని విడచి అంతర్ధానమగుట)

నారదుడు "నరేశ్వరా! శ్యామసుందరుడు వ్రజ సుందరీమణులతో మాలతీ పుష్పమయమయిన కుముద వనము, మామిడి, నారింజ, నేరేడు వృక్షములు నిండిన సధన ఉపవనము, ద్రాక్ష, దానిమ్మ, బాదం మొక్కలతో నిండిన వనము, కదంబ, మారేడు, కుటుజ వృక్ష వనము, మర్రి, పనస, రావి చెట్లు నిండిన ఉపవనము, తులసి, కోవిదారము, మొగలి, అరటి, వకుళము మెదలయిన చిన్న మొక్కల నివాసమయిన ఉప వనములందు విహరించుచూ చివరకు కామ్యకవనము

చేరెను. అచటి ఒక పర్వతముపై అందరూ విశ్రమించుచుండగా వంశీధరుడు మృదు మధురముగ మురళిని వాయించెను. ఆయన మోహన తానమునకు వ్రజ సుందరీమణులు విహ్వలులై మూర్చితులయిరి. ఆకాశము నందు విమానముల యందు కూర్చొని యున్న దేవాంగలు సహితము ఆ మృదు మధుర గానమునకు మోహితులైరి. కామదేవుని బాణ తాకిడికి వారందరి అంగాంగములు భగ్నమైనవి. స్థావర జంగమాది నాలుగు ప్రకారముల జీవ సముదాయము మోహము నందు మునిగిపోయినది. నదీ, నదముల యందు నీరు స్థబ్ధమై నిలిచినది. పర్వతములు ద్రవీభూతములై ప్రవహించ నారంభించినవి. కామ్యక వనము నందలి పర్వతములు శ్యామసుందరుని చరణ స్పర్శచే పునీతములై "చరణ పర్వతములు" గ ప్రసిద్ధి నొందినది. ఈ పర్వతముల దర్శన మాత్రము చే మానవ జన్మ కృతకృత్యమగును.

తదనందరము శ్రీ రాధావల్లభుడు శ్రీకృష్ణుడు నందీశ్వర, బృహత్సాను పర్వత సానువుల యందు రాస విలాసము గావించెను. అంత గోపికలకు తమ సౌభాగ్యము యెడల కొంత అహంభావము పొడసూపినది. వెంఠనే శ్రీహరి వారందరినీ అచట వదలి శ్రీరాధా సహితుడై తక్షణము అచట నుండి అంతర్ధానమయ్యెను. అంతట ఆ నిర్జన వనమందు సమస్త గోపాంగనలు శ్రీకృష్ణుడు లేక విరహాగ్ని యందు జ్వలింపసాగిరి. వారి కన్నులు అశ్రుపూరితములై భయ భీతులయిన హరిణముల వలె అటు నిటు పరుగిడసాగిరి. వనము నందు పెనిమిటి కుంజరమును బాసిన కుంజరయూధము వలె, మగ క్రౌంచ పక్షి వీడిన ఆడ క్రౌంచము వలె వ్యధిత మనస్కులై కరుణా క్రందనము చేయసాగిరి.

వారందరూ ఒకరై తిరిగి వేరు వేరు జట్లుగా కలిసి వివిధ వన, వనాంతరాళములందు తిరుగుచూ, శ్రీకృష్ణుని కై వెదుకుచూ, ఉన్మత్తులై లతా సమూహములతో ఇట్లు సంభాషింప దొడంగిరి, "తరువులారా! ఓ! తీవలారా! మా ప్రియ నందనందనుడు ఎక్కడ దాక్కొనినో తెలుపవలసినది" కృష్ణా! కృష్ణా! అని పిలుచుచూ ఉన్మత్తులగు చుండిరి. వారందరి చిత్తము శ్రీకృష్ణ చరణారవిందము లందు లగ్నమై యున్నది. ఆ తన్మయత్వము నందు భృంగము చే బంధింపబడిన క్రిమి కీటకము భృంగముగ మారు చందమున సమస్త గోపాంగనలు శ్రీకృష్ణ స్వరూపలయిరి. గోపాంగనలు శ్రీకృష్ణ పాదుకా చిత్రిత పవిత్ర చరణ పర్వతము చేరి ఆయన శ్రీ చరణములను శరణుజొచ్చిరి. ఆయన చరణ చిహ్నములను దర్శన, అర్చన కావించిరి. అంత అనంత భగవత్ కృపచే వారికి అలంకృతమయిన భగవత్ చరణార విందముల దివ్య దర్శనము కలిగినది.

బహుళాశ్వుడు "ప్రభో! శ్రీ రాధావల్లభుడు, శ్యామ సుందరుడు గోపికలను వీడి ఎచటకు ఏగెను? తిరిగి గోపికలకు శ్రీకృష్ణ దర్శనము ఎట్లు కలిగెను?"

నారదుడు "మహారాజా! శ్రీకృష్ణ భగవానుడు శ్రీ రాధాదేవితో కలిసి సంకేత వట ఛాయా ప్రదేశమునకు చని అచట తన ప్రియమత శ్రీ రాధాదేవి కేశపాశములందు పుష్పరచన (పుష్పములతో అలంకరించుట) కావించెను. శ్రీ రాధాదేవి శ్రీకృష్ణుని కుంతలములయందు పాపిడి తీర్చి, ఆయన పూర్ణచంద్ర సమాన ముఖమండలమందు ఆమె సహితము విచిత్ర పత్రరచన గావించెను. ఈ విధముగ ఇరువురు పరస్పరము శింగారము కావించుకున్న పిదప శ్రీకృష్ణుడు తన ప్రియతమ సహితుడై భద్రవనము, మహాఖదిర వనము, బిల్వవనము, మరియు కోకిలా వనములందు విహరించెను. అక్కడ చరణ పర్వతమునందు వెదుకుచున్న గోపికలకు దివ్య చరణ దర్శనమాయెనని వింటిమి కదా! ఆ దివ్య చరణములు చక్రము, ధ్వజము, ఛత్రము, స్వస్తిక, అంకుశము, బిందువు, అష్టకోణము, వజ్రము, కమలము, నీలశంఖము ఘటము, మత్స్యము, త్రికోణము, బాణము, ఊర్ధ్వరేఖ, ధనస్సు, గోవు, అర్ధచంద్రము మొదలగు పుణ్య చిహ్నముల తో వెలుగొందు చున్నవి. గోపికలు ఆ దివ్య చరణములు మహానుభావుడు, దేవాధిదేవుడయిన, శ్రీకృష్ణ భగవానుని దివ్య చరణములుగ గ్రహించి, వానిని అనుసరించుచూ, ఆ పవిత్ర చరణముల యందలి ధూళిని తమ మస్తకముల పై వేసికొనుచూ ముందుకు సాగుచుండిరి. కొంత దూరము సాగిన పిదప వారికి శ్రీకృష్ణుని శ్రీ చరణములతో వేరొక పద చిహ్నములు కూడ కానబడెను.

వాని యందు ధ్వజము, పద్మము, ఛత్రము, ఊర్ధ్వరేఖ, చక్రము, అర్ధచంద్రము, అంకుశము, బిందువు, లవంగలత, గద, మత్స్యము శంఖము, పర్వతము, శక్తి, సింహాసనము, రధము, రెండు బిందువులు కానబడెను. ఆ చిత్రము కాంచిన గోపాంగనలు పరస్పరము ఇట్లు పలికిరి" నిశ్చయముగా నందనందనుడు శ్రీ రాధికా సహితుడై ఆ వయపు

పయనించెను." ఇట్లు శ్రీకృష్ణుని దివ్య చరణార విందములను తదేకముగ చూచుచూ, అనుసరించుచు అందరు కోకిలావనము ప్రవేశించిరి. ఆ గోపాంగనల కోలాహలము వినిన మాధవుడు శ్రీ రాధాదేవి తో ఇట్లనియె "కోటి పూర్ణ చంద్రుల సౌందర్యమును సహితము తిరస్కరించు చక్కదనము గల శ్రీ రాధా! అన్ని వైపుల నుండి గోపాంగనలు ఏతెంచుచుండిరి. వారు వచ్చినచో నిన్ను వారితో కలిపి వెనుకకు తీసికొని పోయెదరు. అందుచేత వెంఠనే ఇచటి నుండి నిష్క్రమించెదము. రమ్ము". అంత రూప, యవ్వన, శీల, చాతుర్య దర్పిత అయిన శ్రీ రాధాదేవి రమాపతి తో ఇట్లనియె "ప్రియా! నేను రాజ భవనము వీడి ఎన్నడు బయటకు రాలేదు. కానీ ఈ రోజు చాలా దూరము నడువ వలసి వచ్చెను. నేను ఒక్క అడుగు ముందుకు వేయలేను. సుకుమారి రాజకుమారినైన నేను ఎట్లు చెమటతో తడిసి యుంటినో చూచుట లేదా? ఇటువంటి పరిస్థితి లో నన్ను ఎట్లు తీసికొని పోగలవు?"

అది వినిన శ్రీ రాధా వల్లభుడు తన పట్టు ఉత్తరీయమును తీసి దానితో శ్రీ రాధాదేవికి సుకుమారముగ విసరసాగెను. తిరిగి ఆమె చేతిని పట్టుకొని ప్రేమగా "శ్రీ రాధా! నీవు నెమ్మది నెమ్మదిగ నడువుము". శ్రీకృష్ణుడు ఇట్లు పదే పదే ప్రాధేయ పడినప్పటికీ శ్రీ రాధాదేవి అడుగు ముందుకు వేయకుండెను. ఆమె తన వీపు శ్రీహరి వైపు మరల్చి మారు మాట్లాడక కూర్చునియుండెను. సాధుపుంగవులకు సహితము ప్రాణ ప్రదుడయిన శ్రీకృష్ణుడు మానినీ ప్రియ అయిన శ్రీ రాధాదేవి తో ఇట్లనియె "మానినీ! ఇచట అన్య గోపికలు సహితము నన్ను పొందుటకు ఉత్సుకతతో యుందురు. నేను వారందరినీ విడచి కేవలము నిన్ను ఆరాధించుచున్నాను. కేవలము నీకు ప్రీతి పూర్వకమయిన పనులను మాత్రమే చేయుచున్నాను. శ్రీరాధా! నీవు నా భుజములపై కూర్చొనుము. మనము సుఖముగ, శీఘ్రముగ ఇచట నుండి నిష్క్రమించవచ్చును."

ఈ పలుకులు వినిన శ్రీ రాధాదేవి శ్రీకృష్ణుని భుజముల యందు కూర్చొనుటకు ఇచ్చగించి నంతనే స్వచ్ఛందగతి కల భగవానుడు తక్షణము అంతర్ధానుడయ్యెను. మరుక్షణము కీర్తికుమారి అయిన శ్రీరాధాదేవి గర్వము సర్వము పటాపంచలయినది. ఆ మహాకోకిలా వనము నందు విరహము చే వ్యాకులత పొంది ఉచ్చస్వరమున రోదించుట ప్రారంభించినది.

ఆ సమయమున గోపికాయూధము సర్వము అచటకు ఏతెంచినది. శ్రీ రాధాదేవి రోదనము వినిన గోపికలు దయార్ద్రలై తమ స్వామిని కి వివిధ సేవలు చేయుట ఆరంభించిరి. కొందరు పుష్ప మకరందము చే స్నానము చేయించిరి. కొందరు చందనము, అగరు, కస్తూరి, మరియు కేసర మిశ్రమమును అలదిరి. కొందరు వ్యజనము మరియు చామరముల తో వింజామరను వీచిరి. పిదప వివిధ అనునయ. వినయ వచనముల ద్వారా ఆమెకు స్వాంతన చేకూర్చిరి. శ్రీ రాధాదేవి ముఖతా శ్రీకృష్ణుని ద్వారా ఆమె పొందిన మన్ననను విని విస్మయాంతరంగలయిరి.

(గర్గసంహిత యందలి బృందావన ఖండాంతర్గత మయిన రాసలీల
అనెడు ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(గోపాంగనల ద్వారా శ్రీకృష్ణ స్తవము, భగవానుడు వారి మధ్య ఆవిర్భవించుట; హంసముని యొక్క ఉద్ధారము; గోపికలకు క్షీరసాగరము మరియు శ్వేత ద్వీప నారాయణుని దర్శనము)

నారదుడు "మహారాజా! తదనంతరము శ్రీకృష్ణుని శుభాగమనము కొరకై సమస్త వ్రజాంగనలు కలసి స్వర తాళ యుక్తముగ శ్రీహరి గుణగణములను ఈ విధముగ రమణీయముగ కీర్తించుట ఆరంభించిరి "లోక సుందరా! జన భూషణా! విశ్వదీపా! మదనమోహనా! జగత్తు యొక్క పాపములను, పీడలను నాశము చేయు ప్రభూ! ఆనంద కంద యదునందనా! నందనందనా! నీ చరణారవిందముల మకరందము సహితము పరమ స్వచ్ఛము. నీకు మరల మరల

నమస్కారము. గోవుల, బ్రాహ్మణుల, సాధుపురుషుల విజయ ధ్వజరూపా! దేవవంద్యా! కంసాది దుష్ట దైత్యుల వధించుటకు అవతారము తీసికొన్న స్వామీ! నందరాజ కుల కమల దివాకరా! దేవాధి దేవులకు సహితము అధిపతీ! ముక్తజన దర్పణా! నీకు జయమగు గాక!

"గోప వంశ సాగరము నందు ఉదయించిన ఉజ్వల ముత్యమా! గోపాలకుల పర్వతమందలి నీలి రత్నమా! పరమాత్మా! గోపాల మంగళరూప సరోవరము నందలి ప్రఫుల్ల కమలమా! గోపకుల చందనవనమందలి కలహంసా! నీకు జయమగుగాక!" "శ్యామసుందరా! నీవు శ్రీరాధికా ముఖారవింద మకరందము ను గ్రోలు మధుపము. నీవు శ్రీ రాధికా ముఖచంద్రము నుండి వెల్లి విరియు సుధామయ చంద్రికను ఆస్వాదించు చకోర పక్షివి. నీవు శ్రీ రాధికా వక్షస్థలము నందు ప్రకాశించు చంద్రహారము. నీవు రాధికారూపిణి అయిన మాధవీలతకు కుసుమాకరుడవు."

"ఎవరు రాసరంగస్థలమందు గొప్ప గొప్ప లీలలు ప్రకటించెనో, ఎవరు గోపాంగనల జీవనము మరియు మనుగడకు మూలాధారమో, ఎవరు శ్రీరాధాదేవి గౌరవమును తన గౌరవముగ భావించునో, అట్టి శ్యామసుందరుడు శ్రీహరి మా కనులముందు ప్రత్యక్షమగు గాక!"

"ఎవరు సమస్త గోపికాయూధమును, శ్రీ బృందావన శ్రేణిని, గోవర్ధన గిరి రాజమును తన చరణధూళిచే అలంకృత మొనర్చునో, ఎవరు సంపూర్ణ సృష్టి స్థితులను నడిపించుటకు భూమండలమందు ఆవిర్భవించెనో, ఎవని దేహ దీప్తి నీలోత్పల కాంతి వెదజల్లు చుండునో, ఎవని భుజములు అహిరాజ శరీరము వలె సుశోభితములై యుండునో, అట్టి నందనందనుడయిన మాధవుని మేము ఆరాధించుచున్నాము."

"ప్రాణనాథా! నీ వియోగముచే పీడింపబడుచున్న గోపికలందరకు పూర్ణచంద్రుడు మధ్యందిన మార్తాండుని వలె గోచరించి దహించుచున్నాడు. ఈ వనాంతరాళము మొదట ప్రసన్నత మరియు ఆనందమునకు కేంద్రముగ యుండెడిది. కానీ ప్రస్తుతము ఈ వనము అసిపత్ర వనము వలె తోచుచున్నది. మంద మరాళ గతిచే వీయు సమీరము తీవ్ర నాచారముల వలె బాధించుచున్నది."

"శ్రీహరీ! తొలుత సౌదాస మహారాజు పత్ని మదయంతికి పతీ వియోగము చే తీవ్ర దు:ఖము కలిగినది. దానికంటె వేయిరెట్లు దు:ఖము నల మహారాజు వియోగము చే ఆయన పత్ని దమయంతి పొందినది. ఆ దు:ఖము కంటె కోటి రెట్లు అధిక దు:ఖము జనక నందిని సీతాదేవి శ్రీరామ వియోగము చే అనుభవించినది. దాని కంటె అనంత రెట్లు అధికముగ నీ వియోగము చే ఈ రోజు మేము దు:ఖమును పొందుచున్నాము."

ఇట్లు రోదించుచున్న గోపాంగనల మధ్య వారి అభీష్ట, మనోరథముల పుణ్యఫలముగా శ్రీకృష్ణుడు అకస్మాత్తుగా ప్రత్యక్షమయ్యెను. ఆయన శిరసున కిరీటధారియై, భుజముల యందు కేయూరములు, కర్ణములకు కుండలములు ధరించి స్వయందీప్తిని వెదజల్లు చుండెను. స్నిగ్ధ, నిర్మల, సుగంధపూరిత, నల్లని ఉంగరములు తిరిగిన ముంగురులు ఎల్లరనూ మోహింపచేయుచున్నవి. శబ్దాది సూక్ష్మ భూతముల స్పందన చే ఎట్లు జ్ఞానేంద్రియములు సచేతలగునో, అట్లే ఆయనను చూడగనే గోపికలు లేచి, నిలబడి సచేతనలయిరి. మహారాజా! ఆ గోప సుందరీమణుల మధ్య శ్రీ రాధాసహితుడై మాధవుడు మురళిని వాయంచుచూ నృత్యము చేయసాగెను. ఆ సమయమున వారిరువురు రతీ మన్మధులను తోపించిరి. జాగ్రదాది అవస్థలతో మనసు ఎట్లు క్రీడించునో అట్లే మాధవుడు ఎంతమంది గోపికలు కలరో అన్ని రూపములు ధరించి వారిందరితో రాస విహారము సలుపసాగెను. ఆ సమయమున వనాంతరాళమున వ్రజాంగనలు శోకరహితలై శ్యామసుందరుని చూచి గద్గద స్వరముతో ఇట్లనిరి "ఓ! వంశీధరా! శ్యామసుందరా! మేము ఈ జగత్తును తృణ ప్రాయముగ త్యజించి, మా తనువు మనసు, ప్రాణములను నీ చరణార విందములందు అర్పించితిమి. ఆటువంటి ఈ గోప సముదాయమును విడచి నీవు ఎక్కడకు ఏగితివి?"

భగవానుడు ఇట్లు పలికెను "గోపాంగనలారా! పుష్కర ద్వీపమందు దధి సముద్రము లోపల "హంసుడు" అను మహాముని తీవ్ర తపము ఆచరించుచుండెను. ఆయన ధ్యానము నందు రతి కలవాడై, కారణము, కోరిక లేకుండా నిష్కాముడై నన్ను భజించుచుండెను. ఇట్లు తీవ్ర తపస్సు చేయుచుండగా ఇప్పటికి రెండు మన్వంతరములు గడచినవి. ఇంతలో ఆయనను అర్ధ యోజనము శరీరము గల ఒక చేప మ్రింగినవి. ఆ చేపను "పౌండ్ర" మను మత్స్యరూప దానవుడు మ్రించెను. ఇట్లు ఇక్కట్ల యందు పడిన హంస మునీంద్రుని రక్షించుటకై శీఘ్రమే అక్కడకు వెళ్ళి, నా

చక్రాయుధముతో ఆ రెండు మత్స్యములను ఖండించి, మునీంద్రుని రక్షించి ఆయనను శ్వేత ద్వీపము నందు విడచితిని. వ్రజాంగనలారా! అటు క్షీర సాగరము నందలి శేషసాయి పై నిద్రించుటకు ఉపక్రమించితిని. ఇంతలో నా ప్రియతమలయిన మీరందరు దు:ఖితులై యుండుట గమనించి నా నిద్రను త్యజించి, తక్షణమే మీ కడకు ఏతెంచితిని. ఎందుకనగా నేను ఎల్లప్పుడూ భక్త సులభుడను, మరియు భక్త వశుడను. జ్ఞానేంద్రియములు రసాది సూక్ష్మ భూతముల యందు సుఖమును పొందునట్లు నేనునూ జితేంద్రియులై సమదర్శులై ఏ వస్తువు యందు కామన, ఇచ్ఛ లేని మహాసాధు పుంగవుల నిరపేక్షత యందు సుఖమును పొందెదను.

గోపికలు "మాధవా! నీవు మాయందు ప్రసన్నుడవయితి వేని క్షీరసాగరము నందు శేషపానుపు పై ఏ రూపమును ధరించితివో ఆ రూపమును మాకు దర్శనము చేయింపవలసినది." భగవానుడు "తథాస్తు" అని పలికి గోపయూథము చూచుచుండగనే అష్టభుజధారి అయిన నారాయణునిగ మారెను. శ్రీ రాధాదేవి లక్ష్మీరూపము ధరించెను. వారు చూచుచుండగనే ఆ ప్రదేశమంతయు చంచల తరంగిత అయిన క్షీర సాగరముగ మారి అందు దివ్యమంగళ రూప ప్రసాదము దృష్టిగోచర మయ్యెను. అందు బాలసూర్య భాతి తేజస్సంపన్నుడు, కమల నాళ సదృశ శ్వేత శరీరుడు అయిన శేషసాయి చుట్టలు చుట్టుకొని తన సహస్ర ఫణములను ఛత్రము వలె పట్టెను. అట్టి శేషశయ్యపై అచ్యుతుడు సుఖనిద్రా ముద్రితుడై యుండెను. లక్ష్మీ రూపధారిణి అయిన శ్రీరాధాదేవి ఆయన పాదసేవ చేయుచుండెను. కోటి సూర్య సమప్రభుడయిన భగవానుని సుందరరూపమును చూచి గోపాంగనలు ప్రణామములు సలిపి ఆశ్చర్యనిమగ్నలయిరి. మిథిలేశ్వరా! ఎక్కడ శ్రీకృష్ణుడు గోపికలకు తన శేషతల్ప సుఖ నిద్రితుడయిన నారాయణ రూపమును దర్శింపచేసెవో ఆ ప్రదేశము పరమ పుణ్యమయిమయిన, పాపనాశక క్షేత్రముగ ప్రసిద్ధినొందెను.

తదనంతరము మాధవుడు గోపికలనందరినీ తీసికొని యమునా తీరమును చేరి వడివడిగా ప్రవహించుచున్న కాళింది యందు జల క్రీడలాడనారంభించెను. ఆయన శ్రీ రాధాదేవి హస్తము నందలి లక్ష దళ పద్మమును, పై ఆచ్ఛాదనమును తీసికొని నవ్వుచూ ఈ నీటి యందు దూరముగ సాగెను. అంత శ్రీ రాధాదేవి మెరయుచున్న ఆయన ఉత్తరీయమును, మురళినీ, వేత్రమును తీసికొని యమునా జలము నందు ముందుకుసాగెను. అంత మాధవుడు "శ్రీరాధా! నా మురళిని నాకు ఈయవలసినది" అంత శ్రీరాధాదేవి "మాధవా! నా పుష్పమును, పై వస్త్రమును ఈయవలసినదని బదులిచ్చెను. వారిరువురు పరస్పరము వారి వారి వస్తువులను తిరిగి ఇచ్చి పుచ్చుకొనిరి. తదనందరము శ్రీ కృష్ణుడు మోకాళ్ళ వరకు వ్రేళ్ళాడు వైజయంతీ మాలను ధరించి, మధుర గీతములు ఆలపించుచూ భాండీరవనము ప్రవేశించెను. అక్కడ చతుర చూడామణి అయిన శ్యామ సుందరుడు తన ప్రియతమును శింగారించెను. లలాట, కపోలములందు పత్ర రచన చేసి, పాదములకు లత్తుకనలది, పూలమాలతో అలంకృతను చేసి, కొప్పున సహితము పూలను తురిమి, కళ్ళకు కాటుక, లలాలము నందు కుంకుమ బొట్టుతో శ్రీ రాధాదేవిని అలంకరించెను. శ్రీ రాధాదేవి సహితము ఆ శృంగార స్థలమందు కస్తూరి, చందనాగరులతో శ్రీహరి యొక్క ముఖారవిందము నందు పత్రరచన గావించెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన
రాసక్రీడ అను ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(కంస, శంఖచూడుల యుద్ధము మరియు మైత్రి వృత్తాంతము
శ్రీకృష్ణుని ద్వారా శంఖచూడుని సంహారము)

తదుపరి శ్రీహరి గోపాంగనా సహితుడై లోహజంఘ వనమును ప్రవేశించెను. వసంతము నందలి మాధవీలతలు ఒండొరులతో పెనవేసికొని గుబుళ్ళు, గుబుళ్ళుగా అల్లుకొనెను. ఆ మాధవీలతల సుపుష్పములతో మాలలు కట్టి మాధవుడు

సమస్త గోపికల వేణీ బంధమును అలంకరించెను. భ్రమరముల ఘుంకారములతో ప్రతిధ్వనించుచూ, సుగంధభరిత మలయమారుతము చే ఊయలలూగుచున్న సుందర యమునా తీరము నందు శ్యామసుందరుడు తన ప్రేయసీమణులతో విహరించుచుండెను. ఇట్లు విహరించుచూ ఆయన వనాంతరాళమున కంటకభూయిష్ఠమయిన వృక్షముల దరికి చేరెను. అచట గోపాంగనలు, శ్రీ రాధాదేవి తన యశోగానము చేయుచుండగా రాసక్రీడ ఆరంభించెను. ఆ సమయమున ఆయన అప్సరసల చే పరివేష్ఠితుడయిన దేవరాజు ఇంద్రుని వలె ప్రకాశించుచుండెను. ఇంతలో ఒక విచిత్ర సంఘటన జరిగినది. అది వినవలసినది.

కుబేరుని సేవకుడయిన శంఖచూడుడు అను మిక్కిలి బలవంతుడయిన యక్షుడు కలడు. ఆతడు మిక్కిలి గదా యుద్ధ విశారదుడు. ఈ భూతలమునందు అతనితో తలపడు గదాయుద్ధ నేర్పరి లేడనుట అతిశయోక్తికాదు. ఒకానొకి దినము నా నుండి (నారదుని నుండి) ఉగ్రసేన కుమారుడయిన కంసుని బల పరాక్రమములు విన్నవాడై ఆ ప్రచండ పరాక్రముడు తన లక్ష బారువులు బరువు గల గదను తీసికొని తన నివాసమును వదలి మధురానగరము ఏతెంచి, రాజసభ ప్రవేశించి సింహాసనాధీశుడయిన కంసుని గాంచి ఇట్లనియె "మహారాజా! నీవు త్రిభువన విజేతవు అని వినియుంటిని. అందుచే నాకు యుద్ధభిక్ష ప్రసాదింపవలసినది. నేను నీ చేతిలో ఓడినచో, నేను నీకు దాసుడనుగుదును. అట్లు కాదేని నీవు నాకు దాస్యము చేయవలసినది. అంత కంసుడు "తథాస్తు" అని పలికి తాను సహితము ఒక విశాలమయిన గదను తీసికొని రంగ భూమి ప్రవేశించెను. వారిరువురి మధ్య ఘాత, ప్రతిఘాతములతో ఆవిర్భవించిన ధ్వని ప్రళయకాల మేఘ గర్జన వలెయున్నది.

వారిరువురి మధ్య పోరు ఇరువురి ప్రచండ మల్లుల మధ్య పోరును, నాట్యమండలి యందలి ఇరువురు నటులను, విశాలకాయులయిన, ఇరువురు కుంజరాధిపతుల వలెను, రెండు కొదమ సింహములను తలపించుచున్నది. వారు ఇరువురు విజయ లాలసులై ఒకరిపై ఒకరు ఉరుకుచూ, గదా ప్రహారము చేసికొను చుండగా నిప్పురవ్వలు వర్షించుచూ రెండు గదలు చూర్ణమయినవి. కంసుడు మిక్కిలి కోపోద్రిక్తుడై యక్షునిపై తన ముష్ఠి ఘాతములు వర్షించెను. యక్షుడు తిరిగి కంసుని ముష్ఠిఘాతములచే బాధించెను. ఇట్లు వారిరువురు ఇరువదిఏడు రోజులు పోరు సలిపిరి. ఇరువురి యందు కించిత్ కూడా బలము క్షీణింపలేదు. వారిరువురు ఒండొరుల పరాక్రమమునకు చకితులయిరి. అంతలో కంసుడు శంఖచూడుని ఆకస్మాత్తుగా పట్టుకొని బలముగ ఆకాశము పైకి విసిరెను. ఆ యక్షుడు వంద యోజనములు ఎగిరి క్రిందపడెను. అంత ఆతడు మిక్కిలి వ్యాకులతకు లోనై, తిరిగి తెలివి తెచ్చుకొని, కంసుని పట్టి ఆకాశము పైకి విసిరెను. కంసుడు వెయ్యి యోజనములు పైకెగిరి క్రిందపడెను. ఆతడు కూడ మిక్కిలి వ్యాకులతకు లోనైయ్యెను. పిదప ఒండొరులు ఒకరినొకరు భూమిపై పడవైచి ఘోర యుద్ధము సలిపిరి. ఆ ఘోర సమరమునకు భూమి కంపించెను.

ఇంతలో వారిరువురి నడుమ సర్వజ్ఞుడయిన గర్గాచార్యుడు ప్రత్యక్ష మయ్యెను. వారిరువురు రంగభూమి యందు ఆయనకు ప్రణామము చేసిరి. అంత గర్గుడు తన ప్రశాంత ప్రతిభా పూర్వక స్వరముతో ఇట్లనియె "మహారాజా! ఈ యుద్ధము వలన ప్రయోజనము లేదు. మహాబలుడయిన శంఖచూడుడు నీవలెనే వీరుడు. నీ ముష్ఠి ఘాతముచే ఐరావతము మూర్ఛనొందినది. అంతేకాక అనేక దైత్యులు సహితము నీ ముష్ఠిఘాతము చే మృత్యుదేవతకు అతిధులయిరి. కానీ శంఖచూడుడు ధరాశయుడు కాలేదు. నిశ్చయముగ ఈతడు నీకు అజేయుడు. నీవు ఎట్లు పరిపూర్ణతమ భగవానుని చే వధింపబడుదువో, అట్లే శివ ప్రసాదమున బలశాలి అయిన శంఖచూడుడు సహితము అట్లే పరిసమాప్తి పొందును. అందుచే మీరిరువురు ఒండొరుల పట్ల మిత్రత్వము, ప్రేమ కలిగి యుండవలెను," అని పలికి ఇరువురుకి నచ్చజెప్పెను. గర్గాచుర్యుని హితవచనములు వినిన కంస, శంఖచూడులు, ఒకరి పట్ల ఒకరు సయోధ్యను ప్రకటించుకొని మిత్రులయిరి. పిదప శంఖచూడుడు కంసునికి వీడ్కోలు పలికి తన గృహమునకు వెళ్ళసాగెను. మార్గము నందు ఆతనికి నిశీధసమయమందు రాసమండలి తారస పడినది. తాళ యుక్తముగ పాడుచున్న మనోహర గానమాధురి వినబడినది. ఆతడు రాసమందు రాసేశ్వరి అయిన శ్రీ రాధాదేవి, శ్రీకృష్ణుని దర్శించెను.

ఆ సమయమున శ్రీకృష్ణుడు స్వేచ్ఛగా తన ఎడమకాలిపై నుంచొని, ఎడమ చేయి శ్రీ రాధాదేవి భుజము పై వైచి, కుడిచేతి యందు వంశీరవము ధరించి ముఖమండలమందు సుమధుర, సుందర మందహాసము తాండవించుచుండగా

కోటి మన్మధులను తిరస్కరించు సోయగము తో వెలుగుచుండెను. ఆయనను వేలకొలది వ్రజసుందరీమణులు ఛత్ర చామరములతో సేవించుచుండిరి. ఆయనను కోమల శిశువు అని తలచి శంఖచూడుడు ఆ గోప సుందరీమణులను తస్కరించుటకు యోచన చేసెను. శంఖచూడుడు వ్యాఘ్రముఖుడు మరియు కాలమేఘ దేహుడు. ఆతడు ఇంచుమించు పది తాడిచెట్ల నిడివి కలిగి, నాలుక బయటకు వ్రేళ్ళాడు చూండు భయంకర రూపుడు. ఆతని భీకర రూపము చూచి గోపాంగనలు నలుద్రిక్కులా పరుగెత్తిరి. నలుద్రిక్కులా కలకలము ప్రబలి రాసమండలి అంతయు కోలాహలము చెలరేగినది. కామపీడితుడయిన ఆ దుష్టయక్షుడు శత చంద్రానన అను గోపసుందరిని పట్టుకొని శంకా, భయములు లేకుండా ఉత్తర దిశకు పరుగెత్తెను.

శత చంద్రానన మిక్కిలి భయభీతయై కృష్ణా! కృష్ణా! అని ఎలుగెత్తి రోదింపసాగెను. ఇదిచూచి కృష్ణుడు మిక్కిలి కోపించి ఒక సాల వృక్షమును పెరికి చేతిలో ధరించి ఆ యక్షుని వెంబడించెను. కాలము వలె దుర్జయుడయిన శ్రీకృష్ణ భగవానుని చూచి ఆ యక్షుడు గోపికను మార్గమధ్యమున వదలి ప్రాణ రక్షణకై పరుగు ప్రారంభించెను. శంఖచూడుడు ఎందెందు పోయినను, శ్రీకృష్ణుడు వెన్నంటి వానిని తరిమెను. అంత యక్షుడు హిమాలయము చేరి ఒక సాలవృక్షమును పెరకి యుద్ధకాంక్షతో శ్రీహరిని ఎదుర్కొనుటకు సంసిద్ధుడాయెను.

అంత శ్రీ కృష్ణుడు ఆ ప్రదేశము చేరి తన చేతనున్న సాల వృక్షము తో యక్షుని బలముగ మోదెను. తుఫాను గాలికి అవలీలగా పెకలించబడు వృక్షము వలె శంఖచూడుడు కుప్పకూలెను. అంత శ్రీకృష్ణుడు శంఖచూడుని తన బలమయిన కరములతో పట్టి, గిరగిరా త్రిప్పి బలముగ నేలపై విసరివైచెను. ఇంతలో శంఖచూడుడు పైకి లేచి శ్రీకృష్ణుని పట్టుకొని క్రింద పడవైచెను. ఇట్లు ఒండొరులు మల్లయుద్ధము చేయుచుండగా ధరిత్రి కంపించుట ప్రారంభించెను. అంత శ్రీకృష్ణుడు తన ముష్టిఘాతము శంఖ చూడుని శిరశుపై ప్రహరించి వాని శిరమును మెడనుండి వేరుచేసి అందలి చూడామణిని స్వీకరించెను.

శంఖచూడుడు శరీరము నుండి ఒక గొప్ప జ్యోతి వెలువడి నలుదిశలు ప్రకాశింపజేయుచూ, వ్రజభూమికి ఏగి శ్రీకృష్ణసఖుడయిన సుదాముని శరీరము నందు విలీనమయ్యెను. ఈ విధముగ శంఖచూడుని వధించి మధుసూదనుడు రాసమండలికి తిరిగివచ్చి, ఆ చూడామణిని శతచంద్రాననకు బహూకరించి తిరిగి సమస్త గోపాంగనలతో రాస క్రీడ ఆరంభించెను.

(గర్గసంహిత యందలి బృందావన ఖండార్గతమయిన రాసక్రీడా ప్రసంగమున
శంఖచూడుని వధ అనెడు ఇరువది మూడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది నాల్గవ అధ్యాయము

(రాసవిహారము మరియు ఆసురీముని ఉపాఖ్యానము)

తదనంతరము గోపికా సహితుడై శ్రీకృష్ణుడు యమునా తటమును వీక్షించుచూ రాస విహారమునకై బృందావనము చేరెను. శ్రీహరి యొక్క వర విశేషముచే బృందావనము నందలి ఔషధములన్నియు వ్రజాంగనా రూపములతో ఒక యూధముగ సంఘటితమై రాసగోష్ఠి యందు సమ్మిళితలయిరి. గోపరూపిణులు అయిన లతా సమూహములు విచిత్రకాంతి వెదజల్లు చుండిరి. వారందరితో కలసి బృందావనేశ్వరుడు వనవిహారము చేయసాగెను. కదంబ వృక్షములచే ఆచ్ఛాదితమయిన సురమ్య కాళిందీతటము నలువైపులా శీతల మంద సుగంధ మలయామారుతము వీవసాగెను. రాసక్రీడా శ్రమచే అలసిన శ్రీకృష్ణుడు శ్రీ రాధాదేవితో అచటకు ఏతెంచి కూర్చొండెను. ఆ సమయము నందు గోపాంగనల సహితులై దేవతలు వీణా, తాళ, మృదంగ, మురచంగ వాద్యములతో జయజయ ధ్వానములు చేయుచూ పుష్పవృష్టి

కురిపింపసాగిరి. గోప సుందరీమణులు శ్రీహరికి ఆనందము కలిగించు ఆయన ఉత్తము యశోగానమును ఆలపించుచుండిరి. కొందరు మేఘమల్హార్, కొందరు దీపక రాగము, మరికొందరు మాలకోశ, భైరవ, హిందోళ, శ్రీ రాగములను ఆలపించుచుండిరి. ఈ గోపికలు కొందరు ముగ్ధలు, కొందరు మనోహరిణిలు, మరికొందరు ప్రౌఢనాయికామణులు. కానీ వారందరూ శ్రీకృష్ణుని యందు రతి పరాయణులు.

కొందరు శ్రీహరితో కందుక క్రీడ లాడుచుండిరి. మరికొందరు పూలబంతులాడు చుండిరి. కొందరు కేవలము కామ భావనతో సేవ లాచరించు చుండిరి. కొందరు పదముల యందు నూపురములు ధరించి ఆయనతో నృత్యము చేయుచుండిరి. కొందరు గోపికలు యోగులకు సహితము దుర్లభమయిన ఆయన భుజములు పట్టుకొని అతి చేరువగా వచ్చి గాఢముగ ఆలింగనము చేసికొనుచుండిరి. ఇట్లు పరమ మనోహర బృందావనాధీశ్వరుడయిన శ్రీహరి గోపికలతో బృందావన విహారము చేయుచుండెను. కొందరు ఆయన వాయించుచున్న మురళికి అణుగుణముగ వీణ, మృదంగము వాయించుచూ ఆయన గుణగానము చేయుచుండిరి. కొందరు మాధవీలతల ఛాయన కంజర వాయించుచున్న శ్రీకృష్ణ భగవానుని ఎదుట నిలబడి ఆయనతో శృతి కలిపి గీతములు ఆలపించుచుండిరి. ఇట్లు ఎల్లరును భూతలమునందు సాంసారిక సుఖము సర్వము త్యజించి బృందావనము నందు పరమ పురుషుని తో రమించుచుండిరి.

కొందరు గోపికలు శ్రీకృష్ణుని చేతిని తమ హస్తమునందు నిడుకొని నెమ్మదిగ అటునిటు తిరుగుచుండిరి. ఆ సమయమున కొందరు గోప సుందరీమణుల హారములు మాధవీలతలచే చిక్కుపడుచున్నవి. వాటిని మాధవుడు తన స్వహస్తములతో చిక్కులు విడిపించి తన హస్తస్పర్శచే ఆ భామినులను అనుగ్రహించుచుండెను. కొందరు గోప సుందరీమణుల నాసికయందు ముత్యములు ముక్కెరయుండెను. వారి కోమల ముంగురములు ఆ ముక్కరతో చిక్కుబడుచున్నవి. అంత శ్రీకృష్ణుడు ఆ ముంగురులను మృదువుగ విడిపించి సవరించుచుండెను. మాధవుని అధరముల నుండి సుగంధయుక్త తాంబూలమును తమ అధరములతో స్వీకరించి నములుచూ కొందరు గోపికలు ఆనందించుచుండిరి. ఆహా! వీరు పూర్వజన్మయందు ఏమి తపమాచరించిరో కదా!! కొందరు గోపికలు తమ సుకుమారమయిన అంగుళులతో ఆయన కపోలమును నిమురుచూ, నవ్వుచూ, సుతారముగ చిరుత గాయములు చేయుచుండిరి. కదంబ వృక్ష ఛాయల యందు తిరిగి తిరిగి మాధవుడు గోపాంగనతో ఇట్టి రాసక్రీడ సలుపుచుండెను.

కొందరు గోపికలు పురుష వేషధారులై, కిరీట, కుండల మండితులై, శ్రీకృష్ణుని ఎదుట ఆయన వలె నృత్యము చేయసాగిరి. మరికొందరు గోపికలు వందల పూర్ణ చంద్ర సోయగమును తృణీకరించు సౌందర్యఖనులు శ్రీ రాధా వేషధారులై తమ ప్రాణ వల్లభునికి ఆనందము కలిగించు ఆయన యశోగానమును కీర్తించుచు నర్తింపసాగిరి. కొందరు వ్రజాంగనలు స్తబ్దలై, సాత్విక భావయుక్తలై, ప్రేమ విహ్వలలై, పరమానంద నిమగ్నలై, యోగి జనుల వలె భూతలము నందు కూర్చొని సమాధివిష్ఠులయిరి. కొందరు లతల యందు, వృక్ష, భూతల, విభిన్న దిశలయందు, కొందరు తమ యందు శ్రీకృష్ణుని దర్శించి మౌనముద్రను ఆశ్రయించిరి. ఇట్లు వ్రజాంగనలు ఆందరూ రాసమండలి యందు సర్వేశ్వరుడు, భక్తవత్సలుడు అయిన గోవిందుని శరణుజొచ్చి తమ తమ మనోరథములను పరిపూర్ణమొనర్చుకొనిరి. గోపికలకు సంప్రాప్తించిన కృపా ప్రసాదము జ్ఞానులకు కూడ దుర్లభమనిన ఇక కర్మిష్ఠుల సంగతి చెప్పనేల?.

ఇట్లు సర్వాంగ సుందరముగ మధురముగ రాసక్రీడ సాగుచుండగా ఒక విచిత్ర ఘటన జరిగినది. అది వినుము. శ్రీకృష్ణుని ప్రియభక్తుడు, మహాతపస్వి "ఆసురి" అను మునీశ్వరుడు కలడు. ఆయన నాదరగిరి యందు శ్రీహరి ధ్యాన తత్పరుడై తపమాచరించుచుండెను. ఆయన తన హృదయ కమలము నందు జ్యోతిర్మండలాతర్గతమున శ్రీరాధా మాధవులను నిరంతరము చింతించుచుండెను. ఒకానొక నిశీథ సమయమున ఆ మహాముని ధ్యానించు చుండగా శ్రీకృష్ణుడు ఆయన అంతరంగము నుండి అంతర్హితుడాయెను. ఆయన తిరిగి తిరిగి ధ్యానించుటకు యత్నించెను కానీ శ్రీహరి కానరాలేదు.

ఆయన ఖిన్నుడై ధ్యానము నుండి బయల్వెడలి బదరీఖండ మండితమయిన నారాయణాశ్రమము చేరెను. ఆయన అచటనూ కానరాలేదు. ఆ ముని విస్మితుడై లోకాలోక పర్వతము చేరెను. అచట సహస్రఫణుడయిన అనంతుడు కానరాలేదు. ఆ ముని అచటి కల పార్షదులను ఆరాతీయగా వారు తమకు తెలియదని బదులిచ్చిరి. అంతట ముని మిక్కిలి ఖేదము పొంది క్షీరసాగర పరివృతమయిన శ్వేతద్వీపమునకేగెను. అచటకూడ శేషశయనుడు కానబడకుండెను. అచట పార్షదులు

సహితము తమకు ఎరుక లేదని వక్కాణించిరి. ఆ ముని మిక్కిలి శోకగ్రస్తుడై "ఏమి చేయను? ఎక్కడకు వెళ్ళను? శ్రీహరి దర్శన ప్రాప్తిఎట్లు?" అని తర్కించుచూ మనోవేగ గతి గల మహాముని వైకుంఠమునకేగెను. అచట ఆయనకు శ్రీలక్ష్మీనారాయణ దర్శనము కాలేదు. అంత ఆయన గోలోకమునకేగెను. అచ్చటి నికుంజనములందు సహితము శ్రీరాధామాధవ దర్శనము లుప్తమయినది. ఆయన శ్రీకృష్ణ విరహము చే ఖిన్నుడై, వ్యాకుల చిత్తుడై, చింతాక్రాంతుడై అక్కడి పార్షదులను తిరిగి ప్రశ్నించెను. అంతట వారు "వామనావతారము జరిగిన బ్రహ్మాండము నందు పృశ్నిగర్భ అవతారము జరిగిన ప్రదేశమున భగవానుడు నెలకొండెను" అని వక్కాణించిరి. అంతట మునీశ్వరుడు ఆ బ్రహ్మాండమునకు చని శ్రీకృష్ణ దర్శన లాలనుడై ఆ బ్రహ్మాండము నందలి కైలాసము న కేగెను. అక్కడ శివుడు, మహాదేవుడు శ్రీకృష్ణ ధ్యాన తత్పరుడై యుండెను. ఆయనకు నమస్కరించి ఖిన్నుడైన ఆసురీముని ఇట్లనియె "భగవాన్! నేను భగవద్దర్శనమునకై వైకుంఠము మొదలు గోలోకము వరకు శోధించితిని. కానీ నాకు ఆ దేవాధిదేవుని దర్శనము కాలేదు. సర్వజ్ఞశిరోమణీ! ఈ సమయము నందు శ్రీహరి భగవానుడు ఎచట కలడు?" అంత మహాదేవుడిట్లనియె "ఆసురీ! నీవు శ్రీకృష్ణుని నిష్కామభక్తుడవు, మరియు ధన్యుడవు. నీవు శ్రీకృష్ణ దర్శన లాలసచే మిక్కిలి క్లేశము నొందుచున్నావు. క్షీరసాగరమునందు నివసించు హంసముని మిక్కిలి క్లిష్ఠ పరిస్థితి యందు పడెను. భగవానుడు, రశికశేఖరుడు, శ్రీకృష్ణుడు ఆయనను రక్షించి ఇప్పుడిప్పుడే బృందావన మేతెంచి సఖులతో రాసక్రీడ సాగించుచుండెను. ఓ! మహామునీ! ఈ రోజు ఆ దేవేశ్వరుడు తన మాయచే ఆరునెలల సరిపడు రాత్రిని సృష్టించెను. నేను ఆ రాసేశ్వరుని దర్శించుటకు ఏగెదను. నీవు కూడ శీఘ్రముగ రావలసినది. నీ మనోరథము సహితము పూర్ణమగును.

(గర్గసంహిత యందలి బృందావన ఖండాగ్గతమున నారద, బహుళాశ్వ సంవాదము నందలి రాస క్రీడ ప్రసంగము నందు ఆసురీ ఉపాఖ్యానమును ఇరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఐదవ అధ్యాయము

(పరమేశ్వరుడు ఆసురీముని సహితముగ గోపీరూపమున రాసమండలి యందు శ్రీకృష్ణ దర్శనము చేయుట మరియు స్థుతించుట. ఆయన వర ప్రభావమున బృందావనము నందు నిత్య నివాసము ఏర్పరుచుకొనుట)

నారదుడు "మహారాజా! భగవానుడయిన పరమశివుడు ఆసురీ ముని సహితుడై ప్రసన్న హృదయముతో శ్రీకృష్ణ దర్శనమును ఏగవలెనని మనసున నిశ్చయించుకొని బృందావనమునకు ఏగెను. ఆ ప్రదేశమంతయు దివ్య ధామమును దర్శించుచు వారిరువురు యమునా తటమునకు ఏగిరి. అచట మహాబలశాలినిలు, గోలోక వాసినులు, వేత్రహస్తమయలయిన గోపికలు పహారా కాయుచూ వారిని రాసమండలి యందు ప్రవేశించుటకు అడ్డగించిరి. మహాదేవుడు తామ శ్రీకృష్ణ దర్శనార్థము ఏతెంచితిమి అని తెలుపగా ఆ ద్వార పాలినుల "విప్రవరులారా! మేము కోట్లాది గోపాంగనలము రాసమండలికి నలుద్రిక్కులా బృందావనము నందు పహారా కాయుచు రక్షించుచుంటిమి.

శ్యామసుందరుడయిన శ్రీకృష్ణుడే మమ్ములను ఈ వృత్తియందు నియోగించెను. ఆ ఏకాంత రాసమండలి యందు కేవలము, శ్రీకృష్ణ ప్రభువే పురుషుడు. ఆయన మినహా పరపురుషుడు ఎవరూ ఇందు ప్రవేశింప లేరు. మునులారా! మీరిరువురు శ్రీకృష్ణ దర్శనము అభిలషించెదరేని ఆ మానస సరోవరము నందు స్నానము చేయవలసినది. పిదప మీకు గోపికా స్వరూపము ఉపలబ్ధమై రాసమండలి యందు ప్రవేశించుటకు అర్హత కల్గును." అంత పరమశివుడు ఆసురీ సహితముగ ఆ సరోవరము నందు మునిగి గోపికా రూపము పొంది రాసమండలి యందు ప్రవేశించెను.

సువర్ణమయ పద్మరాగమండిత రాసభూమి రాసమండలి అంతయు ప్రకాశించుచుండెను. ఆ ప్రదేశమంతయు

కదంబవనాచ్ఛాదితమై, మాధవీ లతామయమై యుండెను. వసంత ఋతువు సర్వత్రా శోభించుచుండగా పున్నమి చంద్రుని వెన్నెల పిండారబోసినట్లు వెల్లివిరియుచున్నది. యమునా తటము నందు సువర్ణమయ సోపానములు నూతన శోభను కూర్చుచున్నవి. పురివిప్పిన నెమళ్ళు, హంసలు, కోకిలలు, చాతకపక్షులు తమ తమ తీయని కేరింతలతో ఆ ప్రదేశమంతయు రమణీయ ధ్వనులతో ప్రతిధ్వనించుచున్నది. ఆ ప్రదేశమంతయు యమునా నది యొక్క శీతల జలస్పర్శచే చల్లబడిన మృదు మధుర మంద వాయువుల వీవన చే మొలిచిన నవయవ్వన పల్లవములచే మిక్కిలి శోభించుచున్నది.

సభా మండపములు మొహరించిన వీధులు, స్థంభ పంక్తుల చే నిండిన ప్రాంగణములు, రెపరెపలాడుచున్న పతాకములు, మరియు సువర్ణకలశములచే శోభించు మందిరములు, శ్వేతారుణ పుష్పములతో అలంకరింపబడిన పుష్పశాలలు, భ్రమరముల ఘంకారములు, వివిధ సంగీత వాద్యముల మధురాలాపనలు, తో ఆ రాసమండలి అంతయు దివ్యముగ ప్రకాశించుచున్నది. ఆ రాసమండలి యందలి నికుంజములు యందు కొన్ని కోట్ల పున్నమి చంద్రుల వలె ప్రకాశించు పద్మినీనాయిక, హంసగామిని శ్రీరాధాదేవి ని కూడి శ్రీకృష్ణ భగవానుడు విరాజమానుడైయుండెను. రాసమండలాంతర్గతమున స్త్రీ రత్నములచే నిరంతరము పరివేష్ఠితుడయిన శ్యామసుందరుడు శ్రీకృష్ణుని లావణ్యము కోట్లాది కామదేవులను సహితము తిరస్కరించునట్లు యున్నది. మస్తకము పై మయూర పింఛ కిరీటము, కరముల యందు వంశీ, వేత్రములు, కంఠము నందు హారములు, కర్ణములందు బాలభానుని భాతి కుండలములు, వక్షము నందు వనమాల, శ్రీవత్స, కౌస్తుభములు, నడుమునకు వడ్డాణము, పాదములకు నూపురములు, కలిగి కోట్లకొలది పూర్ణచంద్ర కాంతి తన శ్రీ అంగముల నుండి ప్రసరించుచుండగా నందనందనుడు. ఎటువంటి మనోరథములనైననూ పూర్ణము చేయగల కృపాకటాక్ష వీక్షణములచే ఆ అతివల మనసు హరించుచుండెను.

ఇటువంటి శ్రీకృష్ణభగవానుని గోపికారూపిణులయిన ఆసురీ, పరమశివులు సమస్త గోపాంగనలు చూచుచుండగా ముకుందుని చరణాలవిందములందు శిరసునుంచి ఆనంద విహ్వలులగుచు ఇట్లనిరి "జనార్ధనా! జగన్నాధా! పరాత్పరా! పద్మనాభా! దేవాధిదేవా! జగదీశ్వరా! మీకు నమస్కారము. మహాయోగి స్వరూపా! కృష్ణా! పుండరీకాక్షా! గోవిందా! గరుడధ్వజా! త్రివిక్రమా! దామోదరా! హృషీకేశా! వాసుదేవా! నీకు నమస్కారము. దేవా! మీరు పరిపూర్ణతమ భగవానులు. భూతల భూరి భార హరణార్ధము మరియు సత్పురుషుల కళ్యాణార్ధము సమస్త లోకముల నుండి అంతర్ధానులై ఈ నంద వ్రజము నందు ప్రకటిత మయిరి. వాస్తవమునకు మీరు పరాత్పర పరమాత్ములు. అంశాంశ, అంశ, కళ, ఆవేశ మరియు పూర్ణావతారముల చే మీరు సమస్త విశ్వరక్షణ చేయుచున్నారు. గోలోకనాధా! గిరిరాజ పతీ! పరమేశ్వరా! బృందావన పతీ! రాధా వల్లభా! వ్రజ సుందరీమణులచే నిరంతరము కీర్తింపబడుచున్న నీ యశోగానమును కర్ణపానము చేయుచున్న గోవిందా! గోలోకపతీ! సర్వధా మీకు జయమగు గాక!"

"మహాప్రభూ! మీరు నికుంజ లతల యెడల, వానిని వికాసము కావించు వసంత ఋతువు. మీరు రాసమండలి పాలకులు, వ్రజ మండలాధీశులు, మరియు బ్రహ్మాండ రక్షకులు."

ఈ శుభ స్థవము వినిన మాధవుడు మృదు మధుర మందహాసము చేయుచూ మేఘ గర్జన వంటి స్వరము తో ఇట్లనియె "మీరిరువురు ఇరువది వేల సంవత్సరములు నిరపేక్షభావముతో తపమాచరించిరి. అందువలన మీకు నా దర్శన భాగ్యము కలిదినది. ఎవడు శాంతుడు, నిర్ధనుడు, సంపూర్ణ శత్రుభావనారహితుడో అతడు నా సఖుడై యున్నాడు. మీరిరువురు మీ మనోభీష్ఠములు కోరుకొనుడు." అంతట వారిరువురు "మహాప్రభో! మీరిరువురి (రాధా మాధవుల) చరణారవింద సమీపమున, బృందావనాంతర్గతమున మేము ఎల్లప్పుడూ నివసింపవలెను. ఇది మినహా మాకు వేరొక వరము వలదు." అంతట భగవాంతుడు "తదాస్తు" అని పలికి వారిని అనుగ్రహించెను. అప్పటి నుండియు పరమశివుడు, ఆసురీముని మనోహర బృందావనము నందలి కాళిందీ తీరము నందు, వంశీవట సమీపమున నిత్యనివాస మేర్పరుచుకొనిరి.

తదనంతరము శ్రీకృష్ణుడు గోపాంగనలతో కూడి కమల పరాగమ యొక్క సౌరభయుక్త సమీరము మందగమనమున వీచు పద్మాకర వనము ప్రవేశించి రాస క్రీడారంభము చేసెను. ఆ సమయమున శ్రీకృష్ణుడు ఆరు నెలల నిడివి గల రాత్రిని సృష్టించెను. కానీ ఆ రాసలీలయందు సంపూర్ణముగ సమ్మిళితులయిన గోపాంగనలకు ఆ సమయము ఒక్క క్షణము వలె గడచెను. వారి మనోరధములన్నియు పూర్ణములయినవి. అరుణోదయ వేళ వ్రజసుందరీమణులందరూ ఒక్కటై తమ గృహములకు చనిరి. నందనందనుడు నంద భవనమునకు రాసేశ్వరి శ్రీరాధ వృషభాను పురమునకు ఏగిరి.

ఈ విధముగ రాసక్రీడాపాఖ్యానము చెప్పబడినది. ఈ ఆఖ్యానము పుణ్యప్రదము, సర్వపాపహరము, మరియు సమస్త మనోరధములను పూర్ణము గావించు మంగళధామము. సామాన్య జనులకు ధర్మార్ధ కామములు ఇచ్చునది. ముముక్షువులకు మోక్ష ప్రదాయిని."

(గర్గసంహిత యందలి బృందావన ఖండాగ్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి రాసక్రీడా వర్ణనమను ఇరువది ఐదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఆరవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు విరజాదేవి తో విహరించుట. శ్రీ రాధాదేవి వలన భయముచే విరజా నదిగా మారుట. ఆమె ఏడుగురు పుత్రులు ఆమె శాపముచే ఏడు సముద్రములుగ మారుట. శ్రీ రాధాదేవి శాపముచే శ్రీదాముని అంశ శంఖచూడుడు అగుట)

బహుళాశ్వుడు "మహానుభావా! నారద మహర్షీ! మీరు వేదవేత్తల యందు శ్రేష్ఠులు. నాదొక సందేహము. అఘాసురాది అసురులు అంతమయిన పిదప వారి జ్యోతి శ్రీకృష్ణ భగవానుని యందు లీనమయినది. కాని శంఖచూడుని జ్యోతి శ్రీదాముని యందు లీనమగుటకు కారణమేమి! స్వామీ! శ్రీకృష్ణ చరిత్ర వినిన కొలది అద్భుతముగయున్నది." నారదుడు "మహారాజా! ఇది పురాతన కాలమందు గోలోకమున జరిగిన సంఘటన. ఈ వృత్తాంతమును నేను మహానుభావుడయిన నారాయణుని ముఖతా వింటిని. శ్రీహరికి ముప్పురు పత్నులు కలరు. వారు శ్రీరాధా! విరజ (విజయ), భూదేవి. వీరందరి యందు ఆయనకు శ్రీరాధాదేవి అనిన మక్కువ ఎక్కువ. ఒకానొక దినమున ఒక ఏకాంత నికుంజమున శ్రీకృష్ణుడు కోటి చంద్రుల కాంతిమతి, మరియు శ్రీరాధికా సదృశ అయిన విరజాదేవి తో రమించుచుండెను. సఖుల ద్వారా ఈ విషయమును వినిన శ్రీరాధాదేవి ఖిన్నురాలైనది.

శ్రీరాధాదేవి వందయోజనములు ఎత్తు, వెడల్పు గలిగి, కోట్లాది అశ్వములు పూన్చబడి, కోట్లాది పతాకములు, కలశములతో అలంకరింపబడిన భానుతుల్య దివ్య రధమును అధిరోహించి సపత్నీ దోషమున శీఘ్రముగ శ్రీకృష్ణ దర్శనార్ధమై ఏతెంచెను. ఆ సమయమున నికుంజ ద్వారమును మహాబలి అయిన శ్రీదాముడు కాపలాకాయుచుండెను. శ్రీ రాధాదేవి వానిని చూచి కోపించి తన సఖీజనము ద్వారా వానిని దండింపచేసి కుంజ ద్వారము నుండి లోనికి పోవుటకు ఉ ద్యుక్తురాలైయ్యెను. ఇంతలో సఖీజనము కోలాహలము వినిన మాధవుడు వెంటనే అంతర్ధానమయ్యెను. విరజ శ్రీ రాధాదేవి యందలి భయము చే నదిగా మారి కోటి యోజనములు విస్తృతిగల గోలోకము నందు నలుచెరగులా ప్రవహింప నారంభించెను. భూతలము చుట్టూ ఎట్లు సముద్రము వేలాయుతమై యున్నదో అట్లే గోలోకము విరజానది చే చుట్టి యున్నది. శ్రీరాధికా దేవి శ్రీహరి యొక్క అంతర్ధానమును, మరియు విరజ యొక్క నదీరూప పరిణితిని గమనించి తన

నికుంజమునకు ఏగెను. వెను వెంటనే శ్రీకృష్ణుడు తన దివ్య ప్రభావము చే నదీరూపమొందిన విరజను దివ్య వస్త్రవిభూషిత అయిన దివ్యాంగనగా మార్చెను.

అనంతరము ముకుందుడు విరజాసహితుడై తటవర్తి వనము చేరి బృందావన నికుంజము నందు రాసక్రీడ నారంభించెను. శ్రీకృష్ణుని చే విరజాదేవికి ఏడుగురు పుత్రులు ఉదయించిరి. వారందరూ బాల్యక్రీడల యందు మునిగి తేలుచూ నికుంజశోభను మరింత ఉద్దీపింపచేసిరి. ఆ సమయమున ఒక విచిత్రము జరిగినది. ఒకనాడు ఆ బాలకుల మధ్య జగడము కలిగినది. వారి యందలి జ్యేష్ఠుడు కనిష్ఠుని గట్టిగా కొట్టెను. అంత ఆ బాలుడు ఏడ్చుచు తన తల్లి అయిన విరజాదేవిని చేరెను. విరజ ఆ బాలుని దగ్గరకు తీసికొని ఆశ్వాశించెను. ఇంతలో శ్రీకృష్ణుడు అచటి నుండి అంతర్ధానుడయ్యెను. అంత శ్రీకృష్ణ విరహముచే వ్యాకుల చిత్త అయిన విరజ తన కుమారుని గని "దుర్బుద్ధీ! నీ వలన నాకు శ్రీకృష్ణ వియోగము కలిగినది. అందుచే నీవు జలరాశివి అవుదువు గాక! అంతేగాక నీ యందలి జలములు పానయోగ్యము గాకుందు గాక!" అంత ఆమె తన మిగిలిన పుత్రుల వైపు తిరిగి మీరందరు ఎల్లప్పుడు కలహప్రియులు అగుదురు గాక! లేకున్న మీరందరు జలరాశులగుదురు గాక! మీరందరి గతి వేరగు గాక! మీరెవ్వరు తిరిగి కలుగకుందురు గాక!" ఈ విధముగ శపింపబడిన విరజాదేవి పుత్రులు భూతలమున కేతెంచి ప్రియవ్రతుని రథము చే భూమిపై ఏర్పడిన చీలికల యందు చేరి వరుసగా లవణ, ఇక్షు, మదిరా, నెయ్యి, పాలు, పెరుగు, మరియు శుద్ధజల సముద్రములుగా మారిరి.

ఈ ఏడు సముద్రములు శాంతములు మరియు దుర్లంఘ్యములు. వీటి యందు ప్రవేశించుట దుష్కరము. ఇవి మిక్కిలి లోతైనవి మరియు లక్ష యోజనముల కంటె ఎక్కువ విస్తారము కలిగి వేరు వేరు ద్వీపముల యందు ప్రవర్ధిల్లినవి. పుత్రులు తనను వీడిన పిదప వారి యందలి ప్రేమ/వ్యామోహము చే విరజ మిక్కిలి వ్యాకులచిత్త ఆయెను. అంత శ్రీకృష్ణుడు ఆమెను చేరి "దేవీ! నీకెప్పుడు నా వియోగము సంభవింపదు. నీ సహజ తేజస్సు చే నిరంతరము నీవు నీ పుత్రులను రక్షించు చుందువు.

పిదప శ్రీ రాధాదేవి యొక్క విరహమును గమనించిన శ్రీకృష్ణుడు శ్రీదామ సహితుడై ఆమె నికుంజమునకు చనెను. శ్రీ రాధాదేవి శ్రీదామ సహితుడయిన తన ప్రాణ వల్లభుని గాంచి అభిమానవతియై ఆ విధముగ పలికెను "హరీ! ఎక్కడ నీకు క్రొత్త క్రొత్త స్నేహము కుదిరినదో అచటకు పోవలసినది. విరజ నదిగా మారినది. నీవునూ నదము గ మారి ప్రవహింపవలసినది. వెళ్ళి ఆమె నికుంజము వందే నివసింప వలసినది. నాతో నీకు పని ఏమున్నది?" అంత శ్రీకృష్ణుడు విరజాదేవి నికుంజమునకు ఏగెను. ఇది అంతయు వీక్షించుచున్న శ్రీదాముడు మిక్కిలి కోపించి రోషతామ్రాక్షుడై ఇట్లనియె "శ్రీ రాధా! శ్రీకృష్ణుడు సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడు. అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి. ఇక్కడ గోలోకాధిపతిగా విరాజిల్లు చున్నాడు. పరాత్పరుడయిన ముకుందుడు నీ వంటి శక్తులను కోట్లకొలది సృష్టింపగలడు. నీవు ఆయనను నిందించుచున్నావు. ఇటుంటి దుష్కర్మ చేయవలదు.

అంత శ్రీరాధికాదేవి కుపితయై "మూర్ఖుడా! నీవు తండ్రిని స్తుతించి తల్లిని నిందించుచున్నావు. అందుచే నీవు రాక్షసుడవై గోలోకము నుండి బహిష్కృతుడవు కమ్ము," అని శపించినది. అంత శ్రీదాముడు "శుభాననా! శ్రీకృష్ణుడు నీకు ఎల్లప్పుడు అనుకూలుడుగా యుండుటచే నీవు మిక్కిలి గర్వితవయితివి. అందుచే నీవు భూతలమునందు వంద సంవత్సరములు శ్రీకృష్ణ వియోగమును అనుభవించవలసినది," అని ప్రతిశాపమిచ్చెను.

ఇట్లు పరస్పరము శాపములిచ్చుకొని తమ కార్యములకు మిక్కిలి భయావహులై శోక సముద్రమున మునిగిరి. అంత భగవానుడయిన ముకుందుడు అచటకు ఏతెంచి ఇట్లనియె "శ్రీ రాధా! నేను నా వచనములు వెనుకకు త్రిప్పుకొనగలను. కానీ నా భక్తుల వచనమును అవశ్యము పాలించెదను. వారి వచనము వృధా చేయుట యందు నేను కూడా అశక్యుడను. కళ్యాణీ! రాధికా! శోకింపవలదు. వియోగకాలమందు కూడా నీవు మాసమునకు ఒక పర్యాయము నన్ను దర్శించెదవు.

వరాహ కల్పమందు భూతల భార హరణమునకు, భక్తజన పరిరక్షణకు మన మిరువురము భూతల మునకు ఏగెదము. ఆ సమయమున నీకు ఈ వియోగము సంభవించును. సుదామా! నీవు ఒక అంశతో అసురుడవు కమ్ము! వైవశ్వత మన్వంతరము నందు నీవు రాసమండలి యందు నన్ను అవహేళనము చేసి నాచే సంహరింపబడుదువు. అపుడు నీ పూర్వ శరీరము పొందగలవు. ఇందు సందేహము లేదు.”

నారదుడు “మహారాజా! ఆ ప్రకారము శాపవశమున మహాతపస్వి అయిన శ్రీదాముడు యక్షలోకము నందు సుధనుని ఇంట జన్మించి శంఖచూడ నామధేయముతో ప్రఖ్యాతినొంది కుబేరుని సేవకుడయ్యెను. ఈ కారణము చే శంఖచూడుని యందలి జ్యోతి శ్రీదాముని యందు లీనమయ్యెను. శ్రీకృష్ణ భగవానుడు స్వాత్మారాముడు, ఏకమాత్ర అద్వితీయ పరమాత్ముడు. ఆయన తన ధామము నందే లీలా పూర్వకముగ ఈ కార్యములన్నియు చేయుచున్నాడు. ఎవరు సర్వేశ్వరుడు, సర్వరూపి, మహాత్ముడో అట్టి భగవానునికి ఈ కార్యము అద్భుతము కానేరదు. నేను అటువంటి శ్రీకృష్ణ పరమాత్మకు నమస్కరించుచున్నాను. విదేహరాజా! నేను ఈ మనోహర బృందావన ఖండమును ప్రవచించితిని. ఏ నరశ్రేష్ఠుడు ఈ చరిత్ర వినునో, ఆ పుణ్యతమునికి తప్పక పరమపదము ప్రాప్తించును.

(గర్గసంహిత యందలి బృందావన ఖండాగ్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి శంఖచూడోపాఖ్యానము అను ఇరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

బృందావన ఖండము సమాప్తము

గిరిరాజ ఖండము

ఒకటవ అధ్యాయము

బహుళాశ్వుడు తిరిగి ప్రశ్నించెను "దేవర్షీ! బాలకులు క్రీడల యందు కందుకమును తేలికగా చేతియందు తీసికొని సమాశ్వాశింతురు. ఇట్లే గోవర్ధన మహా పర్వతమును శ్రీకృష్ణుడు లీలా మాత్రముగపైకి లేవనెత్తి ఛత్రము వలె ధరించెనని వింటిమి. ఈ సంఘటన ఎట్లు జరిగెను? ముని సత్తమా! పరిపూర్ణ భగవానుడు శ్రీ కృష్ణుడు జరిపిన ఈ లీలను నాకు దయచేసి తెలియజేయవలసినది." నారదుడు "మహారాజా! పంటలు పండించు రైతు ప్రతి సంవత్సరము రాజులకు ఎట్లు పన్ను కట్టుదురో అట్లే సమస్త గోపజనము ప్రతి వర్షము శరదృతువు నందు ఇంద్రుని ప్రియార్థము పూజా భోగములు సమర్పించెడి వారు. ఇది అనేక సంవత్సరముల నుండి, తరముల నుండి వచ్చుచున్న సంప్రదాయము. ఒకనాడు శ్రీహరి ఆ ఇంద్రయజ్ఞమునకు సంభారములన్నియు సమకూర్చుట చూసి గోప సభయందు గోపగోపీజనమందరు వినుచుండగా తన తండ్రి నందునితో ఇట్లనియె "తండ్రీ! మీరందరూ చేయబోవుచున్న ఇంద్రయజ్ఞమునకు ఫలితము లౌకికమా? లేక పారలౌకికమా?" నందుడు "శ్యామసుందరా! దేవరాట్ ఇంద్రుని పూజ భోగ మోక్షఫలదాయకము భూలోకము నందు దీనిని మించిన పూజ మరియు యజ్ఞము లేదు." అంత ముకుందుడు "తండ్రీ! ఇంద్రాది దేవతలు తమ పూర్వ కృత పుణ్యకర్మ ప్రభావము చే స్వర్గాది సుఖములు బడయుచున్నారు. భోగముల ద్వారా పుణ్యసంచయము క్షయమయిన పిదప వారునూ మర్త్యలోకమునకు రావలసి వచ్చును. ఇందువలన ఇంద్రుని సేవ మోక్షదాయకము కాదు. ఎవరి ప్రభావము వలన చతుర్ముఖ బ్రహ్మ దేవుడు సహితము భయము నొందునో, అటువంటి కాలము మాత్రమే ఉత్కృష్టము, అనంతము మరియు అన్నిటికంటె బలమయినదని విద్వాంసులు, శ్రేష్ఠ పురుషులు భావించెదరు."

"అందువలన మానవులు కాలమును ఆశ్రయించి సత్కర్మల ద్వారా యజ్ఞపతి అయిన శ్రీమన్నారాయణుని భజింపవలెను. ఎవరు తమ సమస్త కర్మ ఫలత్యాగము చేసి నిష్కామముగ శ్రీహరిని భజింతురో వారు మాత్రమే శ్రీహరిని (మోక్షము)ను పొందెదరు. ఇక ఇతర ఏ విధముగనూ మోక్షము ప్రాప్తించదు. "గోవులు, బ్రాహ్మణులు, సాధు పురుషులు, అగ్ని, వేదము, దేవతలు, మరియు ధర్మము" ఇవి యజ్ఞ భగవానుని విభూతులు, వీనిని ఆధారముగ ఎవరు శ్రీహరిని పూజించెదరో, వారు ఇహ పరలోకములందు శుభములు బడయుదురు. భగవానుని వక్ష స్థలము నుండి ఆవిర్భవించిన గోవర్ధనమను గిరిరాజు పులస్త్య మహర్షి ప్రభావము వలన వ్రజమండలికి ఏతెంచినది. ఈ గిరిరాజు సందర్శనము చే మనుష్యులకు పునర్జన్మ ఉండదు. మనము గో, బ్రాహ్మణ, దేవతా పూజనము సలిపి ఈ సంభారములను గోవర్ధన మహా గిరిరాజమునకు సమర్పించెదము." ఇది సామాన్య యజ్ఞము కాదు. యజ్ఞ రాజము."

"ఈ పని నాకు ప్రీతి కల్గించును. కాదేని మీ ఇష్ట ప్రకారము కానీయుడు." యాదవుల యందు మహానీతిజ్ఞుడు, వృద్ధుడు అయిన సన్నందుడు నందరాజు వినుచుండగా శ్రీకృష్ణుని ఇట్లు ప్రశ్నించెను "నందనందనా! నీవు సాక్షాత్ జ్ఞాన నిధివి. ఈ గిరిరాజ యజ్ఞము యొక్క విధి విధానములను సంపూర్ణముగ మాకు తెలియజేయవలసినది."

శ్రీకృష్ణుడు "మనము ఎక్కడ గిరిరాజ యజ్ఞము చేయదలిచితిమో ఆ ప్రదేశమునంతయు గోమయము చే అలికి, శుభ్రము చేసి, సంభారము లన్నింటినీ అచట యుంచవలసినది. ఇంద్రియములను వశము నందు ఉంచుకొని పరమ భక్తి భావముతో పురుషసూక్త మంత్రములు పఠించుచూ బ్రాహ్మణ సహాయమున గంగ లేక యమునా జలములతో గిరిరాజుకు స్నానము చేయించవలెను. పిదప గోక్షీరము చేతనూ, పంచామృతములు చేతనూ అభిషేకమొనర్చి శుద్ధ గంగా లేక యమునా జలములచే తిరిగి స్నానము చేయంచవలెను. పిదప గిరిరాజునకు గంధ, పుష్ప, వస్త్ర, ఆసన, పూలమాలలు, భూషణములు, వివిధ నైవేద్యములు సమర్పించి ఆయనకు పరిక్రమకావింపవలెను.

"బృందావనము నందు సంస్థితుడవయిన గిరిరాజా! నీవు గోలోకమునకు మకుటాయమానుడవు. పూర్ణ బ్రహ్మరూప పరమాత్మునికి ఛత్రరూపమయిన ఓ! గోవర్ధన పర్వతమా! నీకు మరల మరల నమస్కారము. అటు పిదప పుష్పాంజలి సమర్పించి ఘంటా మృదంగ నాదముతో గిరిరాజునకు హారతి నీయవలెను. తదుపరి "వేదాహ మేతం పురుషం మహాంతం" మొదలగు పుణ్య మంత్రములు తో గిరిరాజు పై ధాన్యము జల్లుచు, ఆ సమీపమున అన్న కూటములను స్థాపించవలెను.

అచటనే అరువది నాలుగు కడవల యందు తులసీదళములచే పవిత్రమయిన గంగా లేక యమునా జలములను ఉంచవలెను."

అనంతరము ఏకాగ్ర చిత్తముతో ఏబది ఆరు మధుర పదార్థములు గిరిరాజ సేవయందు సమర్పించవలెను. పిదప అగ్ని రగిల్చి, హోమము చేసి గో, బ్రాహ్మణ, దేవతా పుజన మొనర్చి, వారిపై గంధ పుష్పాక్షతలు జల్లి, శ్రేష్ఠ బ్రాహ్మణులకు మృష్టాన్న మొసగి పిదప సమస్త జనులకు ఉత్తమ భోజనమును ఒసంగవలెను. అనంతరము గోప గోపీజనము గోవుల యెదట నృత్య, వాద్య, మంగళ గీతములు జరుపుతూ, జయజయ ధ్వానములు చేయుచూ, గోవర్ధన పూజనోత్సవమును పూర్తి చేయవలెను. గోవర్ధన పర్వతము లేని ప్రదేశమున గోవర్ధనోత్సవమును చేయు విధానమును చెప్పెదను."

"గోమయము చే ఎత్తైన పర్వతాకారమును చేసి పుష్పములు, లతలు మరియు వెదుళ్ళతో అలంకరించి దానిని గోవర్ధన పర్వతముగ భావించి గోవర్ధన పర్వత పూజన మొనర్చవలెను. ఎవరేని గోవర్ధన పర్వత శిలను తీసికొని వెళ్ళి పూజ చేసికొన తలచి రేని, ఆ శిలా సమాన తూకముగల సువర్ణమును గోవర్ధన పర్వతము నందు విడచి అపుడు మాత్రమే ఆ శిలను తీసికొని వెళ్ళవలెను. ఈ శాశనమును ఎవరేని ఉల్లంఘించితి రేని వారు రౌరవాది నరకముల పాలగుదురు. సాలిగ్రామ పూజ సర్వులు చేయవలసినది/చేయదగినది. పద్మ పత్రము ను జలము స్పర్శించనటుల పాపములు సాలిగ్రామ పూజ చేయువానిని స్పర్శింపవు. ఏ శ్రేష్ఠ పురుషులు గిరిరాజ శిలాసేవ చేయుదురో వారికి సప్తద్వీప వసుంధర యందలి సమస్త తీర్థస్నాన ఫలము లభించును. ఎవరు ప్రతి సంవత్సరము గిరిరాజ పూజ చేయుదురో వారు ఇహ భోగములన్నింటినీ అనుభవించి తుదిన మోక్షము ను పొందెదరు.

(గర్గసంహిత యందలి గిరిరాజ ఖండాంతర్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి గిరిరాజ పూజా విధి విధాన వర్ణనమను ప్రధమాధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(గోపీ, గోపాలుర ద్వారా గిరిరాజ పూజా మహోత్సవము)

నందనందనుని ద్వారా ఈ విధి విధానమును వినిన నంద, సన్నందాదులు మరియు ఇతర యాదవ ప్రముఖులు మిక్కిలి విస్మితులయిరి. వారు తమ పూర్వ నిశ్చయమయిన ఇంద్ర యజ్ఞమును మానుకొని గిరిరాజ పూజకు సమకట్టిరి. నందరాజు తన ఇరువురు పుత్రులయిన బలరామ కృష్ణులను, యశోదా దేవిని, పూజా సామాగ్రిని తీసికొని గిరిరాజ పూజకు సంతుష్ఠ హృదయముతో బయలుదేరెను. వారి వెంట యాదవ కుల పురోహితుడు, జ్యోతిష ధురంధరుడు, మాన్యుడు, మహానుభావుడు అయిన గర్గాచార్యుల వారు పయనమయిరి. ఆయన తన పత్నీ సహితుడై ఎత్తైన స్వర్ణ భూషణాలంకృతమయిన ఏనుగు పై ఎక్కి గోవర్ధన పర్వతమును చేరెను. నంద, ఉపనంద, వృషభానువరులు తమ పత్నీ, పుత్ర, పౌత్రులతో సంభారసహితులై గోవర్ధనమును చేరిరి. వేలాది బాలభానుల పగిది ప్రకాశించు పల్లకీ యందు ఆరూఢయై, దివ్యవస్త్ర, రత్నభూషణ ఆభూషిత అయిన శ్రీరాధాదేవి భ్రమరములు చకోర పక్షిని అనుగమించినట్లు తన సఖీసముదాయము చే పరివేష్ఠితయై ఏతెంచినది. శ్రీ రాధాదేవికి ఇరు ప్రక్కలా చంద్రముఖులయిన ఇరువురు ప్రధాన చెలికత్తెలు లలిత మరియు విశాఖ వింజామరలు వీచుచుండిరి.

రమా, విరజా, మాధవీ, మాయా, యమునా మరియు గంగాది ముప్పది రెండు సఖులు తను యూథములతో కలసి అసంఖ్యాక గోపికలు అచటకు ఏతెంచిరి. ఇంతేకాక మిథిలావాసినీ, కోసల ప్రదేశ వాసినీ, అయోధ్యాపురి వాసినీ, శృతిరూప, ఋషిరూప, యజ్ఞసీతాస్వరూప, వనవాసినీ గోపికా సముదాయములు అచట ఉపస్థితమయినవి. రమాది వైకుంఠవాసినీ దేవీ ప్రముఖులు, వైకుంఠమునకు ఉపరిభాగమునున్న లోకముల యందలి ఉత్తమ కాంతలు, శ్వేత ద్వీప వాసినులయిన దివ్యరూప గోపాంగనలు సహితము గోవర్ధనము వద్దకు ఏతెంచిరి. సముద్ర మంథనమున లక్ష్మీదేవితో

పాటు ఉదయించిన లక్ష్మీసఖులు, ఓషధీరూప ఇగురుబోడులు, జలంధరుని అంత:పుర స్త్రీ రత్నములు, సముద్ర కన్యలు, బర్హిష్మతి నగరపు మగువలు, మరియు సుతల లోక ఇంతులు, ఈ దివ్యాంగనా సమూహమంతయు గోవర్ధన గిరిరాజము వద్ద విరాజమానులయిరి. అట్లే అప్సరసలు, సమస్త నాగకన్యలు, వ్రజవాసినీ యూధములు, దివ్య వస్త్రాభూషణ భూషితులై కరముల యందు దీపములు మరియు పూజా సామాగ్రి గైకొని గిరిరాజు వద్దకు చేరిరి. బాల వృద్ధయవ్వన గోపకులు సహితము పీతాంబరములు కట్టి, తలపై రంగు రంగుల తలపాగలు చుట్టి, దానిపై నెమలి పింఛము పెట్టి, కరముల యందు వంశీ, వేత్రములు పట్టి, వక్షమున సుందర హారములు, వనమాల సమకట్టి ఇట్టిట్టను చెప్పరాని శోభను చేపట్టిరి.

గిరిరాజు హిమాలయము మఖతా గోవర్ధనోత్సవమును గుర్చి వినిన మహాదేవుడు గంగాధరుడు, శివుడు మస్తకమందు జటాజూటమును బంధించి, చేత కపాలము పూని, అంగముల యందు విభూతిని పూసికొని, వివిధ సర్పములను మాలలుగ, కంకణములగ శరీరము నందు ధరించి గిరిరాజనందిని, ఉమాదేవి వెంటరాగా ఆదివాహనమయిన నందీశ్వరుని అధిరోహించి ప్రమధ గణములచే పరివేష్ఠితుడై గిరిరాజమండలి కి ఏతెంచెను. ముఖ్యులయిన రాజర్షులు, బ్రహ్మర్షులు, దేవర్షులు, సిద్ధులు, హంసాది యోగీశ్వరులు, వేలాది బ్రాహ్మణులు గిరిరాజ దర్శనమునకై. ఆ ప్రక్కనే ఒక స్థానమును ఏర్పరుచుకొనిరి.

గోవర్ధన పర్వతపు ప్రతిశిలా రత్నమయమయి, శిఖరములన్నియు స్వర్ణమయములై నలుదిక్కులా తన దివ్యదీప్తిని వ్యాపింపచేయు చున్నది. అనేక గుహలు, సుందర జలపాతములతో విలసిల్లుచున్న ఆ పర్వతరాజము ఎత్తైన గజరాజమును పోలియున్నది. ఆ సమయమున మేరువు, హిమాలయము మొదలయిన శ్రేష్ఠ పర్వతములు, దివ్యరూపములు ధరించి మంగళ ద్రవ్యములు, మరియు బహుమతులు చేతనిడుకొని మూర్తివంతమయిన గోవర్ధనమునకు ప్రణామములాచరించిరి. శ్రీకృష్ణ భగవానుడు చెప్పిన రీతిననుసరించి నందుడు ముందు బ్రాహ్మణ, అగ్ని, గోవులకు పూజనమొనర్చి అనేక దివ్య బహుమూల్య సంభారములతో గోవర్ధన పూజకు ఉపక్రమించెను. నంద, ఉపనంద, వృషభాను, గోపగోపీజనము సర్వము గీత, నృత్య, వాద్యములతో దివ్యానందభరితులయిరి. వారందరి సహితుడై హర్షోల్లాసితుడయిన ముకుందుడు గిరిరాజ పరిక్రమ కావించెను. ఆకాశము నుండి దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. భూతలము నందు జనులు లాజలు వర్షముగ కురిపించిరి.

ఆ యజ్ఞము నందు గిరి సామ్రాట్ ఆయిన గోవర్ధనుడు పౌరులచే సాష్టాంగ దండ ప్రణామములు ఆచరింపబడుచున్న చక్రవర్తి వలె శోభిల్లెను. సాక్షాత్ శ్రీకృష్ణుడు ఒక విశాలకాయము ధరించి గోవర్ధన పర్వతపు శిలల మధ్యనుండి ఆవిర్భవించి "నేనే గోవర్ధనుడను" అని ప్రకటించి ఆ అన్నకూట భాగమంతయు స్వీకరించుట ప్రారంభించెను. గోప గోపీజన ముఖ్యులందరూ తమ నేత్రములతో ఆ దివ్యావిర్భావము కన్నులారా గాంచి ఆశ్చర్యచకితులై మనమున అపూర్వోల్లాసు లయిరి.

వారందరూ ఇట్లు ముక్త కంఠమున వక్కాణించిరి "ప్రభూ! మీరు సాక్షాత్ దేవతా స్వరూపులని నేడు మాకు రూఢి అయినది. ఈ నందనందనుడే మాకు ఆ దర్శనము చేయించెను మీ దయతో మా గోధనములు, బంధు వర్గములు, సుఖశాంతులతో ఈ భూతలమందు వృద్ధి పొందుగాక! కిరీట, కుండల కేయురధారి, మరియు దివ్యరూప విలసితుడయిన గోవర్ధనుడు "తథాస్తు" అని పలికి వెంటనే అంతర్హితుడయ్యెను.

తదనంతరము నంద, ఉపనంద, వృషభాను, బలరామ, శ్రీకృష్ణులు తమ తమ పరివారముతో తమ గృహములకు వెడలిరి. శివాది దేవతలు, సిద్ధ సంఘములు, వివిధ బ్రాహ్మణ యోగి సముదాయములు గిరిరాజునకు ప్రణామము చేసి, పూజించి తమ తమ యధా స్థానములకు మరలిరి.

నారదుడు "మహారాజా! శ్రీకృష్ణ పరమాత్ముని ఉత్తమ చరిత్రను మరియు గోవర్ధన గిరి యొక్క విచిత్ర మహోత్సవమును నీకు వర్ణించితిని, ఈ పావన ప్రసంగము మిక్కిలి భయకారకమయిన ఘోర పాపములను సహితము దహించును.

(గర్గసంహిత యందలి గిరిరాజ ఖంగార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి గిరిరాజ మహోత్సవ వర్ణనమను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతమును ఎత్తి ఇంద్రుని ద్వారా కావింపబడిన ఘోర జలవృష్టి నుండి ఎల్లరనూ కాపాడుట)

నారదుడు "మహారాజా! తరువాత జరిగిన సంఘటన వినుము. తన యజ్ఞము నందలి లోపమును, గోవర్ధన పూజనోత్సవమును నా ముఖతా వినిన శతమఖుడు అగ్రహోదగ్రుడు అయ్యెను. ఆయన సంవర్తకములను ప్రళయకాల మేఘములను ప్రజా వినాశమునకై పంపెను. మహేంద్రుని ఆజ్ఞ బడిసిన వెనువెంటనే ఆ మేఘరాశి భయంకర గర్జన చేయుచూ కదలినవి. ఆ మేఘములు కొన్ని నల్లనివి, కొన్ని పచ్చనివి, మరికొన్ని ఇంద్రగోప కీటకముల మాదిరి ఎర్రని రంగుతో మెరయుచున్నవి. ఇటువంటి అనేక రంగులతో యున్న మేఘరాశులు మదమెక్కిన మత్తేభముల వలె పోయి భయంకర వర్షధారలు కురిపించనారంభించినవి. పర్వత శిఖరమములు, భూచరియలు మిక్కిలి వేగముగ పడిపోవ నారంభించినవి. ఆ వర్షమునకు ప్రచండ వాయువు తోడై వృక్షములు, గృహములు సహితము విసిరివేయ బడుచున్నవి. ప్రళయ భయంకర మేఘములు, వజ్రపాతము వంటి మెరుపులతో కూడిన ఉరుములు వ్రజభూమి అంతయు వ్యాపించినవి.

ఆ భయంకర నాదము చే ఊర్ధ్వ లోకములు, పాతాళముతో సహితము అధోలోకములు గజగజ వణికినవి. కుల పర్వతములు, దిగ్గజములు విచిలితములయినవి. తారలు భూమిపై రాలుట ప్రారంభించెను. గోప గోపీజనము భయభీతులై, తమ ప్రాణములు ఉగ్గబెట్టుకొని, కుటుంబములతో సహా నందమందిరమునకు ఏగి ఇట్లు పలికిరి "మహాబాహూ! బలరామా! వ్రజేశ్వరా! శ్రీకృష్ణా! ఇంద్రుని వలన ఆసన్నమయిన ఈ తీవ్ర కష్టము నుండి మమ్ములను రక్షించండి! మీరు చెప్పిన మాట విని మేము ఇంద్రయాగము వదలి గోవర్ధన పూజన మొనర్చితిమి. అందువలన ఇంద్రుడు కోపించి ఈ ఘోర ఆపదను మనకు కలిగించెను. ఇప్పుడు మన తక్షణ కర్తవ్యమేమి? సెలవీయవలసినది." గోప గోపీజలముల వ్యాకులతను, గోవుల, గోవత్సముల పీడను గమనించిన భగవానుడు నిర్భయముగ ఇట్లు అభయమిచ్చెను," భయపడవలదు. మీరందరూ మీ మీ సామాగ్రిని తీసికొని గోవర్ధన పర్వతము వద్దకు వెళ్ళవలసినది. ఎవరు మీమీ పూజలను స్వీకరించెనో ఆయనే మిమ్ములను రక్షించును." ఈ విధముగ పలికి శ్రీహరి స్వజనుల సహితుడై గోవర్ధన పర్వతము దరికి ఏగి దానిని అవలీలగా తన చేతిలోనికి తీసికొని, గొడుగు వలె ఎత్తి నిలుచుండెను.

క్రీడలందు బాలకుడు ఎంతో సునాయాసముగ కందుకమును ఎత్తునట్లు, మదించిన కుంజరము అవలీలగా కమలమును పెరుకునట్లు కృపాళువు, కరుణామయుడయిన శ్రీనంద నందనుడు గోవర్ధన పర్వతమును ధరించి శోభించెను. తిరిగి గోప గోపీ జనము తో ఇట్లనియె "బంధువులారా! మీరందరు మీమీ సామాగ్రిని, పరివారమును, గోవులను, సంపదను తీసికొని గోవర్ధనపు ఛాయలోనికి రావలసినది. ఇది ఒకటే ఇంద్ర భయములేని ఏకైక ప్రదేశము." ఇది వినిన సమస్త గోప గోపీ జనము తమ తమ పరివార సహితులై ఆ ఆచ్ఛాదనము క్రిందికి ప్రవేశించిరి. ఇంతలో ఆ ప్రదేశము లోనికి జల ప్రవాహము రాసాగినది. అంతట ముకుందుడు తన సుదర్శన చక్రమును, శేషుని స్మరించెను. కోటి సూర్య సమాన కాంతియుతుడయిన సుదర్శనుడు ఆ పర్వతము పై నిలిచి అగస్త్యుడు సముద్రపానము చేసినట్లు, ఆ పర్వతము పై పడుచున్న జలధారలనన్నింటినీ పానము చేసెను. శేషుడు ఆ జనముల చుట్టూ గోళాకారములో చుట్టలు చుట్టుకొని నీటిని ఒక చుక్కంత కూడా ఆ గోపకుల వయిపు రాకుండా ఆపెను. ఈ విధముగ శ్రీకృష్ణ భగవానుడు సప్త దినములు సుస్థిర స్వభావుడై నిలిచి యుండెను. సమస్త గోపకులము చంద్రుని చూచు చకోరము వలె శ్రీకృష్ణ చంద్రుని చూచుచూ సుస్థిరులై యుండిరి.

తదనంతరము ఉన్నత ఐరావత కుంజరమునధిరోహించి దేవరాజు ఇంద్రుడు ఆ వ్రజమండలమునకు వేంచేసి నందవ్రజమును సమూలముగ నాశనము చేయు ఉద్దేశ్యము తో తన వజ్రాయుధమును ప్రయోగించెను. కానీ మాధవుడు వజ్రాయుధముతో సహా ఇంద్రుని భుజమును సహితము స్థంభింపచేసెను. అంత ఇంద్రుడు మిక్కిలి భయభీతుడై, సింహగర్జన

వినిన కుంజరయూథము పరుగెత్తు రీతిని తన సంవర్తక మేఘములతో, మిగిలిన దేవతలతో భీరువై వెన్నిచ్చెను. ఆ సమయమున సూర్యోదయ మయినది. మేఘములు విచ్ఛిన్నమయినవి. వాయువు వేగము తగ్గి మంద మధురముగ వీచ నారంభించెను. నదుల యందు నీరు నిమ్మళించెను. ఆకాశము నిర్మలమయ్యెను. పశు, పక్షి, జంతు జాలము సుఖమును పొందెను. అంతట భగవానుని ఆజ్ఞను బడసి సమస్త గోప గోపీజనము నెమ్మది, నెమ్మదిగ ఆ ఆచ్ఛాదనము నుండి బయటకు వచ్చి తమ తమ గృహములకు ఏగిరి. అంత గోవిందుడు తన సఖులను చూచి వారిని కూడ బయటకు వెళ్ళమని అనుజ్ఞనిచ్చెను. అంతట వారు "ఈ పర్వతమును స్థంభముల వంటి కఱ్ఱలతో మేమే భరించుచుంటిమి. అందుచేత నీవే ముందు బయటకు రావలసినది అని మొర్కొనిరి. అంత భగవానుడు మందహాసము చేసి పర్వతపు అర్ధభాగమును ఆ కఱ్ఱలపై నుంచెను. అంత గోప బాలకులు ఆ భారమును వహింపజాలక దుస్సహులై క్రింద పడిరి. అంత భగవానుడు గోపబాలకు లందరినీ సమాశ్వాశించి తిరిగి పర్వతమును తేలికగా పైకి లేవనెత్తెను.

ఇది అంతయు వీక్షించుచున్న ప్రధాన గోపవర్గమంతయు నందనందనుని గంధ పుష్పాక్షాతలతో పూజించి పాలు, పెరుగు మొదలగు భోగములు సమర్పించిరి. ఆయనను పరమాత్ముని గ గుర్తించి సాష్టాంగ దండ ప్రణామము లాచరించిరి. నందుడు, యశోద, రోహిణి, బలరాముడు, సన్నందుడు ఆదిగా గల బంధువులందరూ ఆయనను గాఢాలింగనము చేసికొని ఆయన క్షేమమునకై ధన సమూహములను దానము చేసి, శుభాశీర్వాదములు కురిపించిరి. తదనంతరము సమస్త గోపకులము ఆయనను ప్రశంశించుచూ, ఆయనను ముందుంచుకొని నృత్య, గాన, గీతములు ఆలపించుచు మిక్కిలి వైభోగ పేతముగ నంద గృహమునకు తీసికొని వెళ్ళిరి. ఆకాశమార్గము నందు గంధర్వులు, సిద్ధ సాధ్యగణములు పుష్పవృష్టి కురిపించుచూ ఆయన యశమును గానము చేయుచుండిరి.

(గర్గసంహిత యందలి గిరిరాజ ఖంగార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి గోవర్ధనోద్ధారము అను మూడవ ధ్యాయము సమాప్తము)

నాలుగవ అధ్యాయము

(ఇంద్రుడు శ్రీకృష్ణ భగవానుని స్థుతించుట. సురభి ఐరావతములచే భగవానుని అభిషేకము)

నారదుడు "మహారాజా! తదనంతరము గర్వము పూర్తిగా ఉడుగుటచే దేవరాజు ఇంద్రుడు సర్వదేవతా సహితుడై ఏకాంతమున శ్రీకృష్ణ భగవానుని చేరి, సాష్టాంగ దండ ప్రణామములాచరించి ఇట్లనియె "స్వామీ! మీరు దేవతా సార్వభౌములు, సర్వ సమర్థులు. పరిపూర్ణ పరమేశ్వరులు, పురుషోత్తములు, ప్రకృతికి పరమయిన పరాత్పరులు, శ్రీహరి. గో, వేద, ధర్మ రక్షణ కొరకు దశావతారములను స్వీకరించిన భగవానులు. ఈ సమయమున కూడా కంసాది దుష్ఠ రాక్షసులను పరిమార్చుట కు అవతీర్ణులయిరి. మీ మాయచే సర్వులు మోహితులై, మదోన్మత్తులై, అవహేళనకు పాత్రులగుదురు. నేను అటువంటి కోవకు చెందిన అపరాధి అయిన ఇంద్రుడను. తండ్రి ఎట్లు పుత్రుని అపరాధమును మన్నించునో, అట్లే నా అపరాధమును సహితము మన్నింపవలసినది. దేవేశ్వరా! జగన్నివాసా! నా యెడల ప్రసన్నులు కావలసినది. గోవర్ధనమును ఉద్ధరించిన గోవిందునకు నమస్కారము. గోకుల వాసి అయిన గోవిందునకు నమస్కారము. కరుణానిధీ! జగద్విధాతా! విశ్వమంగళకారీ! సర్వ జగత్తుకు నివాసమయిన పరమాత్మా! నీకు నమస్కారము." అసంఖ్యాక బ్రహ్మాండముల యొక్క పతి, గోలోకాధిపతీ! బలరామ సహోదరా! సాక్షాత్! శ్రీకృష్ణునకు మరల మరల నమస్కారము."

ఇంద్రుని ద్వారా చేయబడిన ఈ స్థోత్రమును ఎవరు ప్రాత:కాలమున పఠింతురో వారికి సకల సిద్ధులు కరతలామలకములు అగును. వారికి ఎటువంటి సంకటముల భయము ఉండదు. ఇట్లు శ్రీకృష్ణదేవుని స్థుతించి సమస్త

దేవతా సహితుడై ఆయనకు ప్రణమిల్లెను. అటు పిదప క్షీరసాగరోత్పన్న అయిన సురభి ఆ గోవర్ధన పర్వతమున కేతెంచి తన సుదగ్ధముతో శ్రీకృష్ణుని అభిషేకించెను. పిదప శ్వేత గజరాజమయిన ఐరావతము దివిజ గంగాజలము చే శ్రీకృష్ణుని శుద్ధాభిషేకము చేసెను. పిదప దేవతలందరూ హర్షోల్లాసితులై ఋషి, గంధర్వ, కిన్నెర, కింపురుషాదులు పుష్పవృష్టి కురిపించుచూ వేద మంత్రోచ్ఛారణతో ముకుందుని స్తుతించిరి. శ్రీకృష్ణాభిషేకము చే ఉత్పన్నమయిన హర్షాతిరేకము చే గోవర్ధనము ద్రవీభూతమై నలుప్రక్కలా ప్రవహించ నారంభించెను. అంత భగవానుడు ప్రసన్నుడై ఆ పర్వతము పై తన హస్తకమలము నుంచెను. ఆ పర్వతము పై శ్రీకృష్ణ భగవానుని హస్త ముద్రిక ఇప్పటికీ దృష్టిగోచరమగును. ఈ ప్రదేశము పరమ పవిత్రమై మానవుల పాపములను సమూలముగ నశింప చేయును.

అచటనే ఆయన చరణ ముద్రికలు కూడ కలవు. శ్రీకృష్ణుని అభిషేకానంతరము దివిజగంగ పడిన ప్రదేశమును "మానసగంగ" అని అభివర్ణింతురు. ఈ మాసన గంగా తీర్థము పరమ పావనమయి మరియు సర్వపాపహారిణి. అప్పుడప్పుడు ఈ తీర్థము నందు పాల సుగంధము వెలివచ్చును. ఆ ధామము నందు స్నానమొనర్చు మనుష్యుడు సాక్షాత్ గోవిందుని ధామము చేరును. ఈ విధముగ శ్రీహరికి పూజాపూర్వక ప్రణామములు సమర్పించి పుష్పవృష్టి కురిపించుచూ, జయ జయ ధ్వానములు చేయుచూ దేవతానీకము సర్వము స్వర్గలోకమున కేగిరి. మిధిలేశ్వరా! ఎవరు ఈ శ్రీకృష్ణాభిషేక వృత్తాంతమును వినెదరో వారు దశాశ్వమేధ అవభృత స్నాన ఫలితము కంటే ఎక్కువ ఫలితమును పొందెదరు. అంతమున పరాత్పర పరమేశ్వరుడయిన శ్రీకృష్ణ ధామమును చేరెదరు."

(గర్గసంహిత యందలి గిరిరాజ ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి శ్రీకృష్ణాభిషేకమను నాలుగవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(గోపాలురకు శ్రీకృష్ణుని విషయమున సందేహాత్మక వివాదము ఏర్పడుట, నందరాజు మరియు వృషభాను వరుల ద్వారా సమాధాన బడుట)

నారదుడు "ఒకనాటి మాట! నందనందనుని అద్భుత లీలలను చూచుచున్న గోప, గోపీజనము ఒకనాడు యశోదానందుల వద్దకు వచ్చి ఇట్లనిరి, "ఓ! యశోదా మాతా! నందరాజా! మీ వంశము నందు మున్నెన్నడు పర్వతములు పెకిలించు బాలురుదయించ లేదు. మీరు సహితము ఒక శిలాఖండమును ఒక వారము రోజులు మోయలేరు. ఏడు సంవత్సరముల బాలుడెక్కడ? ఏడు దినములు గోవర్ధన పర్వతమును మోయుటెక్కడ? ఇది మానవ మాత్రులకు ఎట్లు సాధ్యము? అందువలన మీ మహాబలి అయిన పుత్రుని యెడ మాకు కొంచెము శంక కలుగుచున్నది. మదించిన కుంజరము కమలమును పెకలించునట్లు, బాలుడు క్రీడార్థము పిడకను ఎత్తినట్లు, ఈతడు మిక్కిలి సునాయాసముగ ఈ పర్వత రాజమును పెకలించి పట్టుకొనెను. యశోదాదేవీ! మీరు తెల్లని ఛాయారూపులు. మా నందరాజు సువర్ణ సదృశ దేహచ్ఛాయ కలిగిన మహనీయుడు. మరి ఈ బాలకునకు శ్యామల వర్ణము ఎట్లు ఉత్పన్నమయినది? ఈతని గుణగణములు గోప కులమునకు విలక్షణమయున్నది. ఈతడు క్షత్రియ వంశ సంజాతుని వలె కానపట్టుచున్నాడు. బలభద్రుడు కూడా విలక్షణుడే! కానీ ఆయన యందు దోషము పట్టలేము. ఎందుకనగా ఆతడు చంద్రవంశ సంజాతుడు. ఈ రోజు ఈ విషయము గూర్చి మీరిరువురు సత్యము పలుకని ఎడల మిమ్ములను కులబహిష్కృతులను గావించెదము. ఈ గోప కులమందు ఈ శ్యామ సుందరుని జననము ఎట్లు జరిగినది?"

గోప, గోపీ జన సందోహము యొక్క సందేహమును వినిన యశోద భయకంపిత అయినది. అంత నందరాజు ప్రశాంతముగ ఇట్లనియె. "గోప, గోపీ గణములారా! నేను ఏకాగ్రచిత్తుడనై గర్గాచార్యులు నుడివిన పలుకులు మీకు

వినిపించెదను. మీరు సావధానులై వినుడు. దీనిచే మీ మనసున ఉదయించిన చింత మరియు వ్యధ సమసిపోవును. ముందు కృష్ణ నామమునందున్న అక్షరముల వ్యవస్థను గమనింపవలసినది.

"క" కారము కమలకాంత వాచకము

"ఋ" కారము రామ బోధకము

"ష" కారము షడ్వికార గుణ ఐశ్వర్యములకు స్వామి అయిన శ్వేతద్వీప నారాయణుని శ్రీహరి వాచకము

"ణ" నారశింహ స్వరూపము

"అ" అగ్నిని కూడా పానము చేయగల (క్షరము కానిది, లేక అంతము లేనిది) అక్షర/ పురుష స్వరూపము.

" : " విసర్గ రెండు బిందువులు య్నుది. ఇది నర నారాయణులకు ప్రతీక.

ఈ ఆరు గుణములు ఎవని యందు లీనమై యున్నవో ఆతడే పరిపూర్ణ పరమాత్మ. ఆ పరమాత్మ యే కృష్ణుడు. ఈ అర్థము ప్రతిబింబించునట్లు ఆ బాలకునకు కృష్ణ నామధేయము ఈయబడినది. యుగ ధర్మానుసారము ఈయన సత్య యుగము నందు తెల్లగను, త్రేతాయగము నందు రక్త వర్ణము (ఎరుపు) గనూ, ద్వాపరమున పసుపు పచ్చగనూ, యుండును. ప్రస్తుత సమయము ద్వాపరాంతము మరియు కలియుగ సంధి కాలము. అందుచే ఈయన కృష్ణవర్ణ ప్రయుక్తుడాయెను. ఆ కారణము చే కూడా ఈయన కృష్ణ నామధేయముతో విలసిల్లు చుండును.

ప్రతి జీవి యందు అయుదు జ్ఞానేంద్రియములు, అయిదు కర్మేంద్రియములు, మరియు మనో, బుద్ధి, చిత్త, అహంకారములనెడు అంత: కరణములు యుండునని జ్ఞానులు చెప్పెదరు. వీటన్నిటి యందు అంతర్యామియై శ్రీకృష్ణ పరమాత్మయే కర్మలాచరింపచేయుచున్నాడు. అందుచే ఈయనను "వాసు దేవుడు" అని కూడ అందురు. అంతేకాక కీర్తి దేవి భవనము నందు ప్రకటిత మయిన వృషభాను నందిని అయిన శ్రీరాధాదేవికి సాక్షాత్ పతి ఈతడే! అందువలన ఈయనను "రాధాపతి" అని కూడ పిలుతురు. ఈయన సాక్షాత్ పరిపూర్ణ తమ భగవానుడు, అసంఖ్యాక బ్రహ్మాండముల కధిపతి, మరియు సర్వవ్యాపకుడు అయినప్పటికీ తన స్వస్వరూపము చే విరాజమానుడై యుండును. నందా! ఆ భగవానుడే భూతలము నందు కంసాది దుష్ఠ రాక్షసులను పరిమార్చుటకు, శిష్ఠజన రక్షణకు, భక్త పాలనకు నీ పుత్రుని రూపమున నీ ఇంట ఉదయించెను. భరత వంశీయుడవయిన నందరాజా! ఈ బాలకునకు అనంత నామములు కలవు. కొన్ని భరత వేదములకు సహితము గోపనీయములు. ఈయన లీలా విహారములచే అనేక నామములు విఖ్యాత మగును. ఈయన కర్మలు క్లిష్ఠములు, విలక్షణములు అగుచు లోకులకు విస్మయము కలిగించును.

నా పుత్రుని విషయములో నేను గర్గాచార్యుని వాక్కునకు ఎప్పుడు సందేహము నొందలేదు, ఎందుకనగా ఈ భూతలము నందు ఎవ్వరి కయిననూ వేద వాక్యము, బ్రాహ్మణ వచనము ఎల్లప్పుడు ప్రమాణము."

గోపకులు ఇట్లు బదులిచ్చిరి, "గర్గ మహాముని నీ ఇంటికి వచ్చి నామకరణము వంటి సంస్కారములు చేసినపుడు నీవు నిశ్శబ్దముగ, ఎవరికీ ఎరిగింపకుండా, బంధువులను పిలవకుండా చేసితివి. ఇట్లు ఈ విధమయిన కార్యములు చాటుమాటున జరిపించుట ఉత్తమ లక్షణము, సంస్కారము కాదు. ఇట్లు పలికి కోపోద్రిక్తులై గోపికలు వృషభాను వరుని గృహమునకు ఏగిరి.

వృషభాను వరుడు నందునకు సహాయకుడు. అయిననూ ఆ విషయమును విస్మరించి గోపకులు మిక్కిలి కోపముతో ఆయనవద్దకేగి ఇట్లనిరి."ఓ! వృషభానువరా! నీవు మా జాతి యందు ప్రధానుడవు, మరియు మిక్కిలి సంస్కారవంతుడవు. ఓ! గోపీశ్వర భూపాలా! నీవు నందుని మనజాతి నుండి భహిష్కరించవలసినది."అంత వృషభానువరుడు ఇట్లనియె "నందుడు సమస్త గోపకులమునకు మకుటము వంటివాడు. సర్వులకు ప్రియుడు మరియు నాకు పరమ మిత్రుడు. ఇంతకూ నందుడు చేసిన దోషమేమి! ఎందులకు ఆయనను వెలివేయవలసి వచ్చుచున్నది?" గోపకులు మిక్కిలి కోపోద్రిక్తులై ఇట్లనిరి "మహామతీ! నీవు నందుని బహిష్కృతుని చేయని ఎడల మేమెల్లరము నిన్ను సహితము విడిచెదము. నీ ఇంట వివాహయోగ్యమయిన కన్య యున్నది. నీవు మన జాతి యందు ప్రధానుడవయినప్పటికీ ధనమదముతో మత్తుడవై ఇప్పటి వరకూ ఏ శ్రేష్ఠవరునికి ఈ కన్యను కట్టబెట్టలేదు. అందుచే నీవు పాపము మూట కట్టుకుంటివి. మహామతీ!

ఈ రోజు నుండి నిన్ను జాతి భ్రష్టునిగ గుర్తించి మేమందరమూ నీ నుండి వేరగుదుము. లేదేని వెంతనే నందుని విడువుము! విడువుము!"

వృషభానుడు ఈ విధముగ పలికెను "గోప గణములారా! నేను ఏకాగ్ర చిత్తముతో మహామాన్యుడు, జ్యోతిషశాస్త్ర ధురంధరుడు, మనజాతి పురోహితుడు అయిన గర్గాచార్యుల పలుకులు వినిపించెదను. సావధానముగ వినవలసినది. దీనిచే మీరందరి చింత, వ్యధ దూరమగును, " అసంఖ్యాక బ్రహ్మాండములకధిపతి, లోకేశ్వరుడు, పరాత్పర భగవానుడు, శ్రీకృష్ణుడు నందనందనునిగ అవతరించెను. ఆయన తప్ప శ్రీరాధాదేవికి సరిపడు వరుడు ఈ బ్రహ్మాండమున లేడు. బ్రహ్మదేవుని ప్రార్థనానుసారము పృధివీభార హరణకు, కంసాది రాక్షసుల సంహరణకు, శ్రీకృష్ణుడు అవతీర్ణుడాయెను. గోలోకము నందు శ్రీకృష్ణుని పట్టపురాణి అయిన శ్రీరాధాదేవి నీ ఇంట కన్యారూపిణి గ అవతరించెను.

ఆ పరాశక్తిని నీ వెరగవు. నేను వీరి వివాహము జరిపించను. వీరి వివాహము భాండీరవనము నందు జరుగును. ఆ బృందావనము నందలి నిర్జన, సుందరస్థలమందు సాక్షాత్ బ్రహ్మదేవుడు వీరురువురి వివాపము జరిపించును. ఓ! గోప ప్రముఖుడా! శ్రీరాధాదేవి లోక చూడామణి శ్రీకృష్ణదేవుని అర్ధాంగి, మరియు గోలోక ధామమునకు రాణి. మీ గోపగణములందరూ కూడా గోలోకమునుండి భూతలమునకు వచ్చినవారే! సమస్త గోపికలు, గోవులు సహితము శ్రీరాధికాదేవి ఇచ్ఛ చే గోలోకము నుండి క్రిందకి దిగినవారే! ఈ విషయము శ్రీ గర్గాచార్యుల ముఖతా విన్నప్పటి నుండి నేను శ్రీరాధాదేవి విషయమై, శంకా, సందేహములు విడచి నిశ్చింతగ యుంటిని. ఆ భూతలము నందు వేదవాక్యము, బ్రాహ్మణ వచనము ప్రమాణములు. గోపకులారా! ఈ రహస్యమును మీకందరకు ఎరిగించితిని. ఇంకనూ ఏమి వినగోరు చున్నారు.?"

(గర్గసంహిత యందలి గిరిరాజ ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి గోప వివాదమను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(గోపకుల వృషభానువరుని వైభవమును ప్రశంశించుట; నందనందనుని భగవత్తత్వమును పరీక్షించుటకు ఆయనను ప్రేరేపించుట, వృషభానువరుని కన్యక వివాహ నిమిత్తమై వరదక్షిణగా అమూల్యమయిన హారములు, అనేక ముత్యములు నంద గృహమునకు పంపుట. శ్రీకృష్ణ కృపచే నందుడు వధువు కై అంతకంటె ఎక్కువ మౌక్తికరాశి తిరిగి పంపుట)

వృషభానువరుని శాంతపూరిత అనునయ వచనములచే ప్రజవాసులందరూ సంశయవిదూరులై మనసు నందు విస్మయము పొందిరి. గోపకులు "మహారాజా! మీ వాక్కు సత్యము. నిశ్చముగా ఈ రాధాదేవి శ్రీహరిప్రియ. ఆమె ప్రభావము చేతనే భూతలమందు మీ వైభవము ప్రకాశించుచున్నది. మీ వద్ద వేలకొలది దిగ్గజములు, వేగవంతములయిన అశ్వరాజములు, దేవతా విమాన సదృశములయిన సుందర రథములు, మరియు పల్లకీలు శోభించుచున్నవి. ఇవియే కాక సువర్ణ రత్నవిభూషితలయిన కోట్లాది గోవులు, విచిత్ర భవనములు, నానా విధములయిన బహుమూల్య మణి రత్నరాశులు, షడ్రపోషేత భోజన పానీయాది సర్వ విధ సౌఖ్యములు మీ గృహము నందు శోభించుచున్నవి. మీ అద్భుత బాహుబలమునకు కంసుడు సహితము పరాజితుడగును. మహారాజా! మీరు సాక్షాత్ కన్యాకుబ్జ దేశ సామ్రాట్ అయిన బలందునికి జామాత మరియు ధన సంపదయందు అపర కుబేరులు. మీతో సమానమయిన వైభవము నందరాజు వద్ద లేదు. నందుడు కర్షకుడు, గోయూధపతి మరియు దీన హృదయుడు. ప్రభూ! నంద పుత్రుడు పరిపూర్ణ భగవానుడు అయిన ఎడల మా అందరి సమక్షమున నందుని వైభవము ను పరీక్షింప వలసినది."

గోపాలుర పలుకులు వినిని వృషభాను వరుడు వారికోసమై నందుని వైభవమును పరీక్షించ దలచెను. ఆయన పెద్ద పెద్ద ముత్యముల చే కూర్చబడిన ఒకకోటి ముత్యాల హారములను పళ్ళెరములందు పేర్పించెను. అందు ఒక్కొక్క ముత్యము ఒక్కొక్క కోటి స్వర్ణముద్రల విలువ జేయును. ఆ ముత్యముల నుండి వెదజల్లుబడుచున్న కాంతి నలుదిశలా ప్రసరించుచుండెను. పెళ్ళిమాటలందు మిక్కిలి చతురత కలిగిన గోపకుల వృద్ధులకు ఆ పళ్ళెరములిచ్చి, సమస్త గోప గోపీజనము చూచుచుండగా వారిని నందుని ఇంటికి వరాన్వేషణకై పంపించెను. వారందరూ నందసభయందు ప్రవేశించి, ఆయనకు సాదరముగ నమస్కరించి ముత్యములు పళ్ళెరములను సమర్పించి ఇట్లనిరి.

"నందరాజా! నూత్న వికసిత కమలదళముల వంటి కన్నులు కలది, ముఖము నందు కోట్లాది పూర్ణ చంద్రుల కాంతితో భాసించునది. అయిన శ్రీరాధాదేవి వివాహయోగ్య అయినదని గ్రహించిన వృషభానువరుడు సుందర యోగ్య వరునికై వరాన్వేషణ జరుపుచుండెను. ఆయనకు నీ కుమారుడు మదనమోహనుడు, శ్రీకృష్ణుడు యోగ్యమయిన వరుడుగా తోచెను. నీ కుమారుడు గోవర్ధన పర్వతోద్ధరణ సమర్ధుడు, అమేయ భుజ పరాక్రమ సంపన్నుడు, ప్రచండ వీరుడు. ప్రభూ! వైశ్య ప్రముఖా! ఈ విషయములన్నిటినీ సమాలోచన చేసి వృషభాను వరుడు మమ్ములను మీ వద్దకు పంపెను. తొలుత కన్యాపక్షము నుండి పంపబడిన ఈ మౌక్తిక రాశిని స్వీకరింపవలసినది. పిదప కన్యాశుల్కముగ మీరు కూడ మౌక్తిక రాశిని ఈయవలసినది. ఇది మా వంశ సాంప్రదాయము."

ఈ ఉత్కృష్ఠ ద్రవ్యరాశి చూచిన నందుడు విస్మితుడాయెను. పిదప ఆ ముత్యాలరాశిని తీసికొని యశోదాదేవి తో సంప్రదించుటకై అంత:పురము లోనికి వెడలెను. వారిరువురు చాలసేపు తర్కించుకొని నిష్కర్షగా ఒక నిశ్చయమునకు వచ్చిరి. "ఈ మౌక్తిక రాశికి సమానమయిన ధనరాశి మనవద్ద లేదు. ఈ రోజు నలుగురులో మన పురువు దిగదుడువు అగును. మనము ఖచ్చితముగ నవ్వుల పాలగుదుము. ఇపుడు శ్రీకృష్ణ వివాహ నిమిత్తము మన కర్తవ్య మేమి?" ఇట్లు మదనపడుతున్న యశోదానందుల వద్దకు అఘమర్ధనుడు, శ్రీకృష్ణ భగవానుడు రహస్యముగ ఏతెంచి ఒక వంద హారములు తీసికొని వాటి నుండి ముత్యములు విడతీసి, ఒక్కొక్క ముత్యమును విత్తనముల వలె భూమి యందు నాటెను. ఇంతలో నందుడు హారముల లెక్కింప అందు వంద హారములు లేమిని చూచి సందేహాస్పదుడై ఇట్లు తలచెను "ప్రప్రథమముగ మన ఇంట ఇటువంటి రత్నరాశులు లేవు. ఇపుడు ఆడపెళ్ళి వారు పంపిన కానుకల యందు వంద హారములు మాయమయ్యెను. హా! హతవిధీ! మా బంధువులందరి యందు నేను గొప్ప కళంకము పొందెదను. కాని యెడల శ్రీకృష్ణ బలరాములు క్రీడా నిమిత్తము ఈ హారములను తీసికొని వెళ్ళిరా ఏమి? నేను దీనచిత్తుడనై ఈ ఇరువురి బాలకులను అడిగెదను." ఈ ప్రకారముగ నందుడు ఆలోచించి శ్రీకృష్ణుని ఆదరపూర్వకముగ ఈ ముత్యముల గూర్చి ప్రశ్నించెను. శ్రీకృష్ణుడు నవ్వుచూ "తండ్రీ! మన గోపకులమందరము కర్షకులము కర్షకులు భూమియందు వివిధ రకములయిన విత్తనములను పంటలకై నాటెదరు. కాని నేను మన పొలమునందు ముత్యముల విత్తనములను నాటితిని." అది వినిన నందుడు క్రోధితుడై శ్రీకృష్ణుని మందలించి ఆ ముత్యములను త్రవ్వి తెచ్చుటకై పొలము లోనికి వెళ్ళెను. ఆయన అచట వందలాది ముత్యములు ఫలములుగా గల సుందర మౌక్తిక వృక్షములను కాంచెను. అవి అన్నియు విశాలకాయములతో (కాండములతో), చిగురించిన ఆకులతో శోభించుచున్నవి.

ఆకాశము నందు నక్షత్రరాశులు శోభించుచున్నట్లు ఆ చెట్ల యందు కోట్లాది ముత్యముల ఫలగుచ్ఛములు ప్రకాశించుచున్నవి. అంత నందుడు శ్రీకృష్ణుని భగవానునిగా గుర్తించి, పెద్ద పెద్ద ముత్యముల గుత్తులను ఆ చెట్ల నుండి కోసి, ఒక కోటి బారువుల మౌక్తిక రాశిని బండ్లపై ఎక్కించి వరవరణకర్తలకు (పెళ్ళి పెద్దలకు) సమర్పించెను. అవి అన్నియు గ్రహించి వారు వృషభాను వరుని వద్దకు ఏగి నందుని అనుపమ వైభవమును కీర్తించిరి. ఈ విషయము సర్వము సర్వము వీక్షించుచున్న గోపగోపీజనము విస్మితులై, నందనందనుని శ్రీహరి పరమాత్మగా గుర్తించి గ్రహించిరి. వారి వారి సంశయములన్నియు భస్మీపటలము లయినవి. ఆ రోజు నుండి వ్రజవాసులందరూ శ్రీరాధాదేవి శ్రీహరి యొక్క ప్రియతమ అనియు, శ్రీకృష్ణుడు శ్రీరాధేదేవి ప్రాణవల్లభుడనియు రూఢి చేసికొనిరి. వారందరూ వృషభానువరునికి ప్రణామములు ఆచరించి తమ తమ గృహములకు మరలిరి.

నారదుడు “మిథిలాపతీ! నందనందనుడు ముత్యములు నాటిన ప్రదేశము తీర్థరాజమయిన “ముక్త సరోవరము”గ రూపాంతరము చెందినది. ఇచట ఒక ముత్యము దానమిచ్చిన ఎడల లక్ష ముత్యములు దానమిచ్చిన ఫలితము కలుగును. ఇందు సందియము లేదు. మహారాజా! నేను గిరిరాజ మహోత్సవమును వర్ణించితిని. ఈ ఆఖ్యానము భోగమోక్ష ప్రదాయకము. నీవు ఇంకనూ ఏమి వినగోరు చున్నావు?”.

(గర్గసంహిత యందు గిరిరాజ ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీహరి యొక్క భగవత్తత్వ పరీక్ష యను అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(గోవర్ధన పర్వత రాజమందలి తీర్థముల వర్ణన)

బహుళాశ్వుడు “మునీంద్రా! మీరు దివ్య చక్షు సంపన్నులు. ఈ గిరిరాజు పై, మరియు చుట్టు ప్రక్కల ఏ దివ్య తీర్థములు విలసిల్లుచున్నవి? కృపతో నాకు శెలవీయవలసినది.” నారదుడు “మహారాజా! గోవర్ధన పర్వతము స్వయముగా సర్వ తీర్థమల యందు శ్రేష్ఠమని నానుడి. బృందావనము సాక్షాత్ గోలోకమనియు, గోవర్ధనము గోలోకమునకు మకుటాయమానమని ప్రతీతి. ఈ పర్వతము సాక్షాత్ పరిపూర్ణ బ్రహ్మమయిన శ్రీకృష్ణునికి ఛత్రమై నిలిచెననగా, దీనిని మించిన తీర్థరాజము ఏముండును? భువనేశ్వరుడు, పరిపూర్ణ పరాత్పర భగవానుడు, అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి, గోలోకస్వామి, పరమపురుషుడయిన శ్రీకృష్ణుడు సమస్త గోపగోపీజనము చే ఇంద్రయాగమును మానిపించి, ఈ గిరిరాజ పూజ, సన్మానము ఆరంభింపజేసెను. ఇట్టి గిరిరాజము కన్న సౌభాగ్యశీలి ఎవరుయండును? ఏ పర్వతము నందు శ్రీకృష్ణ భగవానుడు గోపబాలురతో సదా క్రీడించుచుండునో, అట్టి గిరిరాజ మహాత్యమును వర్ణించుటకు విరించి కయిననూ అసాధ్యము. ఎక్కడ పర్వత ప్రమాణ పాపరాశులను సహితము నాశము చేయు “మానసీగంగ” విరాజిల్లు చున్నదో, స్వచ్ఛమయిన “గోవిందకుండము”, శుభ్రమయిన “చంద్ర సరోవరము” ప్రకాశించుచుండునో, ఎచట రాధా కుండము, కృష్ణ కుండము, లలిత కుండము, గోపాల కుండము, కుసుమ సరోవరము శోభించు చుండునో అట్టి గోవర్ధన పర్వత మహిమ వర్ణించుట ఎవరి వలన సాధ్యము?.

శ్రీకృష్ణుని కిరీట స్పర్శచే అచటి శిల యొకటి మకుట చిహ్న సుశోభితమయినది. ఏ పుణ్య జీవులు ఈ శిలాదర్శనము చేయుదురో వారు సాక్షాత్ దేవ శిరోమణులగుదురు. ఒక శిలపై శ్రీకృష్ణుడు చిత్ర లేఖనము చేసెను. ఈ శిల “చిత్రశిల” అను పేర ఇప్పటికీ ఆ పర్వత శిఖరము నందు దృష్టిగోచరమగును. గోప బాలకులతో క్రీడలయందు సంలగ్నుడయిన శ్రీకృష్ణ భగవానుడు ఒక శిలపై వాదనము (మృదంగము వలె వాయించెను) చేసెను. ఈ శిల పాప సమూహములను దూది పింజల వలె ఎగురగొట్లు “వాదినీ శిల” గా ప్రసిద్ధి నొందినది. శ్రీకృష్ణుడు గోపబాలకులతో కందుక క్రీడలాచరించిన స్థలమును కందుక క్షేత్ర మందురు. అచట “శక్రపదము” మరియు “బ్రహ్మపదము” అను తీర్థములు కలవు. ఎవరు ఈ తీర్థములందు ప్రణామములు ఆచరింతురో వారు వరుసగా “ఇంద్రలోకము” మరియు బ్రహ్మలోకమ” నకు ఏగెదరు.

ఏ పుణ్యజనులు ఇచ్చటి ధూళి యందు దొర్లెదరో వారు సాక్షాత్ విష్ణుపదమును పొందెదరు. మాధవుడు గోపికలు చీరలు అపహరించిన స్థలము మహా పాపహరమయిన “ఔష్ణీష తీర్థము” అను పేర ప్రసిద్ధమయినది.

ఒకొనొక సమయముందు ఒక గోపికల సముదాయము పెరుగునమ్ముటకై బయలుదేరిరి. వారి నూపురముల ఘంకారమును వినిన మదనమోహనుడు. శ్రీకృష్ణుడు వారిని అటకాయించెను. వంశీ వేత్రహస్తుడయిన శ్రీకృష్ణుడు గోపబాలురతో కలసి వారిని నలు దిక్కులా ముట్టడించి, మొహరించి వారి ఎదుట నిలబడి ఇట్లనియె. “ఈ మార్గమున పోయిడి వారెవరైననూ మాకు సుంకము చెల్లింప వలెను. అందుచే మీరు కూడ సుంకము చెల్లింపవలసినది.” అంత

గోపికలు "నీవు మిక్కిలి మోసగాడవు. ఎంత ధైర్యము? నీవు ఈ గోప బాలురుతో కలసి మా మార్గమును అడ్డగించుచున్నావు. మా మార్గమును వీడుము. లేని యెడల నీ తల్లి తండ్రులతో కలసి మిమ్ములనందరినీ కంసరాజు కారాగారములో బలవంతముగ విసిరివేయగలము. అంత శ్రీకృష్ణ భగవానుడు "అరే! కంసుని వలన భయము ఇచ్చట ఎవరికి కలదు? నేను గోవుల సాక్షిగా చెప్పుచున్నాను – మహోగ్ర దండధరుడయిన కంసుని నేను బాంధవసహితముగ చంపెదను. వానిని మధుర నుండి గోవర్ధన పర్వతము వరకు ఈడ్చివేయుదును," అని పలికి ముకుందుడు గోపబాపకులచే పాలు పెరుగులన్నింటినీ తెప్పించి నేలపై పెట్టించెను. అంత గోపికలు తమలో తాము "ఈ నందబాలుడు నిర్భయుడై, నిరంకుశడై, మోసగాని వలె ప్రవర్తించు చున్నాడు. ఈతనితో ఎన్నడు తిరిగి మాట్లాడరాదు. ఈతడు గ్రామములో యున్నప్పుడు మిక్కిలి గౌరవముగ ప్రవర్తించును. వనము నందు ఈ శూరత్వము ను చూపించుచుండును. మనము ఇప్పుడే నంద యశోదలకు ఈ విషయము నివేదించెదము", అని వారు పలికి వెడలిరి. మాధవుడు తన మిత్రులతో కలసి కదంబ, మరియు పలాశ వృక్షముల అకులు దొన్నిలుగ చేసి వానితో పెరుగంతయు తినుట మొదలిడెను. అప్పటి నుండియు అచట యున్న ఈ వృక్షముల ఆకులు దొన్నెల ఆకారము లో మారినవి. ఈ పరమపుణ్య థామము "ద్రోణ" మను పేర ప్రసిద్ధినొందెను. ఏ మానవుడు ఈ దివ్య క్షేత్ర మందు పెరుగుదానము చేసి తాను కూడా పత్రములందు పెరుగు తీసి కొని, తిని ఈ తీర్ధమునకు నమస్కరించునో ఆ పుణ్యుడు గోలోకము నుండి చ్యుతుడు కాడు. ఎక్కడ మాధవుడు కన్నులు మూసికొని తన మిత్రులతో దాగుడు మూతలు ఆడెనో ఆ ప్రదేశము "లౌకికము" అను పాపనాశన తీర్ధముగ రూపుచెందెను. శ్రీహరి యొక్క లీలలతో నిండిన "కదంబఖండ" మను తీర్ధము నందు శ్రీకృష్ణుడు ఎల్లప్పుడు లీలారతుడై సంచరించు చుండును. ఈ తీర్ధమును దర్శించినంత మాత్రమున నరుడు నారాయణుడగును. గోవర్ధన పర్వతమందు రాసలీలా సమయమున శ్రీరాధాదేవి ఎక్కడ శింగారించుకొనెనో ఆ స్థలము "శృంగార మండల" మని ప్రసిద్ధినొందినది.

శ్రీకృష్ణుడు ఏ రూపముతో గోవర్ధన పర్వతమును ఉద్ధరించెనో ఆ స్వరూపము శృంగార మండలము నందు విరాజిల్లు చున్నది. కలియుగము నందు 4800 సంవత్సరములు గడచిన పిమ్మట శృంగార మండల క్షేత్రమందలి గుహల నుండి ఎల్లరు చూచుచుండగా శ్రీహరి స్వయముగా ఆవిర్భవించును. దేవతల యొక్క అహమును చూర్ణము చేయు ఈ స్వరూపమును జనులు "శ్రీనాధుడు" అని పేర్కొందురు. గోవర్ధన పర్వత యందు శ్రీనాధుడు ఎల్లప్పుడు లీలా విహారము చేయుచుండును. మిదిలేశ్వరా! కలియుగము నందు ఎవరు తమ నేత్రములతో శ్రీనాధ దర్శనము కావింతురో వారు కృతార్ధులగుదురు.

భగవానుడు భారతదేశము నలు ప్రక్కలా క్రమముగ "జగన్నాధుడు", "శ్రీరంగ నాధుడు", "శ్రీ ద్వారకానాధుడు" మరియు "బదరీనాధు" నిగ ప్రసిద్ధమై యుండును. కానీ భారతదేశ మధ్య భాగమున "గోవర్ధన నాధుని" గ ప్రఖ్యాతి గాంచును. ఈ విధముగ భారత వర్షము నందు ఈ అయిదుగురు నాధులు దేవతా సార్వభౌములు ఈ "నాధులు" అయిదుగురు సద్ధర్మ స్వరూపమును సమర్ధించు అయిదు స్థంభములు మరియు ఎల్లప్పుడు ఆర్తజన సంరక్షణా తత్పరులు. ఈ పంచనాధ దర్శనము చే నరులు నారాయణులగుదురు. ఏ మనుష్యులు భారత వర్షపు నలు చెరుగులా యున్న నాధ దర్శనము చేసి మధ్యనయున్న గోవర్ధన నాధుని దర్శనము చేయని యెడల ఆ యాత్ర సఫలీకృతము కాదు, మరియు పలితము లభింపదు. కానీ గోవర్ధననాధుని దర్శనము చేసిన యెడల మిగిలిన నలుగురు నాధుల దర్శనఫలము లభించును.

మిథిలేశ్వరా! ఎక్కడ ఐరావతము మరియు సురభి పాద చిహ్నములు కలవో ఆ దివ్య ప్రదేశమునందు నమస్కృతు లిడిన పరమపాపి సహితము వైకుంఠ థామము చేరును. ఏ మనుష్యుడు సాక్షాత్ శ్రీకృష్ణుని హస్త, పాద ముద్రా దర్శనము కావించునో ఆతడు సాక్షాత్ శ్రీకృష్ణ థామము చేరుకొనును. ఈ తీర్ధ, కుండ, మందిరములన్నియు గిరిరాజు యొక్క దివ్యాంగములే!" అని నాదర మహర్షి ఒక్క తడవు ఆగెను.

(గర్గసంహిత యందలి గిరిరాజ ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి గిరిరాజ తీర్ధ వర్ణనమను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(విభిన్న తీర్థములందు గిరిరాజు యొక్క విభిన్న అంగముల యొక్క స్థితి, వర్ణన)

బహులాశ్వుడు "మహాభాగా! దేవర్షీ! మీరు పర, అపర, భూత, భవిష్యత్ కాలముల జ్ఞాతలయందు సర్వశ్రేష్ఠులు. ఈ గిరిరాజు యొక్క ఏఏ అంగముల యందు ఏఏ తీర్థములు విరాజిల్లు చున్నవి?"

నారదుడు "మహారాజా! ఈ తీర్థరాజము లన్నియు గిరిరాజు యొక్క అంగములే! ఎట్లు పరబ్రహ్మము సర్వత్రా నిండియుండునో అట్లే సర్వమునూ అయన అంగములే అయినట్లు భావైశ్వర్య దృష్ట్యా గోవర్ధనము యొక్క శాశ్వతాంగములను వర్ధించెదను. వినుము. "శ్రీరంగమండల" అధోభాగము నందు గోవర్ధమని ముఖారవిందము యున్నది. అచట భగవానుడు వ్రజవాసులతో కలసి అన్నకూటోత్సవము జరిపెను. "మాసనీ గంగ" గోవర్ధనుని రెండు నేత్రములు. "చంద్ర సరోవరము" నాశిక. "గోవింద కుండము". అధరము. "శ్రీకృష్ణకుండము" చిబుకము "రాధా కుండము" ఆయన జిహ్వ.

"లలితాసరోవరము" ఆయన కపోలములు. "గోపాల కుండము" చెవులు, "కుసుమ సరోవరము" కర్ణాంత భాగము. మిథిలేశ్వరా! ఏ శిలయందు కిరీటము యొక్క చిహ్నము కలదో అది గిరిరాజు యొక్క లలాటము. "చత్రశిల" ఆయన తల మరియు "వాదినీ శిల" ఆయన గ్రీవము. "కందుక తీర్థము" పార్శ్వ భాగము. "ఉష్ణీష తీర్థము" ఆయన కటి ప్రదేశము. "ద్రోణ తీర్థము" పుష్ఠము, మరియు "లౌకిక తీర్థము" ఉదరము. "కదంబ తీర్థము" హృదయ స్థలము. "శృంగార మండల తీర్థము" ఆయన జీవాత్మ.

"శ్రీకృష్ణ చరణ చిహ్నములు" మహాత్ముడయిన గోవర్ధనుని మనసు. "హస్త చిత్రము" బుద్ధి. ఐరావత చరణ చిహ్నము ఆయన చరణములుగ చెప్పబడుచున్నవి. "సురభిపాద" చిహ్నములు గోవర్ధనుని రెక్కలు. "పుంఛ కుండము" గోవర్ధనుని వాలము. "వస్తు కుండము" ఆయన బలము. "రుద్ర కుండము" క్రోధము, మరియు "ఇంద్ర కుండము" నందు కామము ఉపస్థితమై యున్నవి. "కుబేర తీర్థము" నందు ఆయన ఆలోచనా మందిరము, "బ్రహ్మ తీర్థము" నందు ఆయన ప్రసన్నత, "యమ తీర్థము" నందు ఆయన అహంకారము ఇమిడియున్నవి.

మిథిలేశ్వరా! ఇట్లు నేను నీకు గిరిరాజు యొక్క సర్వాంగ వర్ణనమును వర్ణించితిని. ఇది సమస్త పాపహరము. ఏ నర శ్రేష్ఠుడు ఈ గిరిరాజ వర్ణనము, విభూతులను వినునో ఆతడు యోగిజన దుర్లభమయిన గోలోక ప్రాప్తి నొందును పర్వతరాజులకు సార్వభౌముడయిన గోవర్ధనము సాక్షాత్ శ్రీహరి వక్షస్థలము నుండి ప్రకటమయినది, మరియు పులస్త్య ప్రజాపతి యొక్క మహిమ చే ఆయన శుభాగమనమయినది. ఆ పర్వత రాజ దర్శనము చే మనుష్యులకు ఈ లోకము నందు పునర్జన్మ కలుగదు.

(శ్రీ గర్గసంహిత యందలి గిరిరాజ ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి గిరిరాజ విభూతి వర్ణనమను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(గోవర్ధన పర్వత ప్రకటనము (ఉత్పత్తి)

బహులాశ్వుడు "దేవర్షీ! గోవర్ధనము కేవలము పర్వతా సార్వభౌమమే కాక శ్రీహరికి మిక్కిలి ప్రియమయినది. ఇటువంటి తీర్థము భూ, నాకలోకములందు లేదు అనిన అతిశయోక్తి కాదు. మహామతీ! మీరు సాక్షాత్ శ్రీహరి హృదయ స్వరూపులు. అందుచే దయచేసి ఈ గిరిరాజము శ్రీహరి వక్షస్థలము నుండి ఎట్లు ప్రకటమయ్యెనో, ఆ ఉత్పత్తికి కారణమేమో

నాకు తెలియచేయవలసినది."

నారదుడు "మహారాజా! గోలోక ప్రాకట్య వృత్తాంతమును వినుము. ఈయది శ్రీహరి యొక్క ఆది లీలలకు సంబంధించిన, మరియు మనుష్యులకు ధర్మార్థ, కామ, మోక్షములనెడు చతుర్విధ పురాషార్థ ప్రదాయకము. ప్రకృతికి పరుడై విరాజిల్లు పరిపూర్ణ భగవానుడు, శ్రీకృష్ణుడు సర్వసమర్థుడు, నిర్గుణుడు మరియు సచ్చిదానంద ఘన పరమాత్మ. ఆయన తేజము అంతర్ముఖి. ఆ స్వయం ప్రకాశ ప్రభుడు నిర్మలానంద సరోవరము నందు నిరంతరము రమించుచుండును. గణణ శీలుల యందు ప్రముఖుడు, దేవతలను సహితము నియంత్రించి శాశించు "కాలము" ఆ పరమాత్ముని యందు అసమర్థుడు. సమస్త లోకములను తన కనుసన్నలయందు ఆడించు "మాయ" సహితము ఆ పరమాత్ముని పై ఎటువంటి ప్రభావము చూపింప నశక్యురాలు. మహత్తత్వము, సత్వాది గుణత్రయములు, ఆయనను వశపరుచుకొనజాలవు. మనో, బుద్ధి, చిత్త అహంకారములు ఆయన యందు ప్రవేశింపలేవు. ఆయన తన స్వసంకల్పము చే సాకార బ్రహ్మమును తన స్వరూపము తో వ్యక్తము చేసెను.

మొట్టమొదట కమలనాళము వలె శ్వేతవర్ణుడయిన మహాకాయుడు శేషనాగుడు ప్రాదుర్భవించెను. ఆయన శరీరపు చుట్టల నడుమ సర్వలోక వందితమయిన గోలోకము ఉద్భవించెను. ఏ భక్తియుతుడయిన మానువుడు ఆ దివ్య ధామము చేరునో ఆతడు ఈ సంసారమునకు తిరిగిరాడు. అటు పిదప అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి, గోలోకనాధుడయిన శ్రీకృష్ణ భగవానుని పదకమలములనుండి త్రిపధగ అయిన గంగానది ఆవిర్భవించినది. నరేశ్వరా! అటు పిదప శ్రీకృష్ణ దేవుని ఎడమ భుజము నుండి సరిత (నదీ ప్రవాహము) లందు శ్రేష్ఠురాలైన యమునా నది ప్రాదుర్భవించినది.

ఆ నదీమతల్లి సర్వాంగ కుసుమ శోభితయై మూర్తీభవించిన మాన మర్యాదల వలె యున్నది. శ్రీహరి రెండు గుల్ఫముల నుండి హేమరత్న విరాజితమయిన రాసమండలము, నానా విధములయిన అలంకరణ సామాగ్రి యొక్క సమూహములు వెలువడినవి. అటు పిదప ముకుందుని రెండు పిక్కల నుండి సభా భవనములు, ప్రాంగణములు, వీధులు, మండపములతో నిండిన నికుంజములు ఆవిర్భవించినవి. ఈ నికుంజములు ఎల్లప్పుడూ వసంత శోభను సంతరించుకొని యుండును. అందు కోకిలల కలకూజితములు, మయూరములు క్రేంకారములు, భ్రమరముల ఘుంకారములు, నిరంతరము ప్రతిధ్వనించు చుండును. ఆ ప్రదేశమంతయు స్వచ్ఛ జలములతో నిండిన దివ్య సరోవర భరితమై ప్రకృతి యొక్క ఆహ్లాదనకు పరాకాష్ఠయై యున్నది.

భగవానుని రెండు మోకాళ్ళ నుండి వనములకు తలమానికమయిన బృందావనము, ఆయన రెండు తొడల నుండి లీలాసరోవరము ప్రాదుర్భవించినవి. ఆయన కటి ప్రదేశము నుండి దివ్యరత్న శోభితమయిన స్వర్ణభూమిక మరియు ఉదరము పై గల రోమముల నుండి మాధవీలతల సమూహము ఆవిర్భవించినవి. ఆ మాధవీలతల యందు వివిధ పక్షి జాతులు నివాస మేర్పరు చుకొని నిరంతరము తమ కుహు కుహు నాదముతో మృదు మధురముగ గానము చేయుచూ, బృందావనమునకు దివ్య శోభను చేకూర్చుచున్నవి. ఇచ్చటి లతలు ఫల, పుష్ప భారముచే ఎట్లు లజ్జా, వినయ సంపన్నలయిన ఉత్తమ కులాంగనలు అవనిత శిరస్కులై యుందురో అట్లు క్రిందకు వంగి యున్నవి. భగవానుని త్రివళీ ప్రాంతము నుండి మంద, మధుర, శీతల సమీరము, ఆయన మెడక్రింది భాగము నుండి మధుర, ద్వారక అను పురములు ప్రాదుర్భవించినవి.

శ్రీహరి యొక్క రెండు భుజముల నుండి శ్రీదామాది అష్ట పార్షదులుదయించిరి. ఆయన మణికట్టు నుండి నందుడు, కరాగ్ర భాగము నుండి ఉపనందులు ఉదయించిరి. ఆయన బాహుమూలముల నుండి అందరు వృషభానులు, రోమముల నుండి సమస్త గోప గణములు, ఆయన మనసు నుండి గోవులు మరియు ధర్మదురంధర వృషభములు ఆవిర్భవించెను. ఆయన బుద్ధి నుండి గోవులు తిను పచ్చిక మరియు పచ్చని ఆకుల చెట్లు ప్రకటితమయినవి. భగవానుని ఎడమ భుజమునుండి ఒక పరమ కాంతిస్వరూపము ఆవిర్భవించినది. ఆ కాంతి నుండి శ్రీ, లీలా, విరజ, భూదేవి మొదలగు హరి ప్రియలందరూ ప్రాదుర్భవించిరి. భగవానుని అత్యంత ప్రియతమ అయిన శ్రీరాధాదేవియే లీల లేక లీలావతిగ చెప్పబడును.

శ్రీరాధాదేవి రెండు భుజముల నుండి లలిత, విశాఖలు ఉద్భవించిరి. శ్రీరాధాదేవి రోమముల నుండి ఆమె మిగిలిన అనుచర పరివారమంతయు ప్రకటితమయ్యెను. ఈ విధముగ మధుసూదనుడు గోలోక రచన చేసెను. మహారాజా!

ఇట్లు గోలోక రచన చేసి అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి, పరాత్పరుడు, పరమేశ్వరుడు, పరిపూర్ణ భగవానుడయిన శ్రీహరి శ్రీరాధాదేవి తో సుశోభితుడై యుండెను.

ఇట్లు కాలము సాగుచుండగా ఒకానొక దినము ఒక సంఘటన జరిగెను. ఒకరోజు రాసమండల మంతయు సుందర స్త్రీ మూర్తుల నూపురముల మధురస్వనముతో మారుమ్రోగుచుండెను. అమృత వర్షము కురియు చుండెట చే ఆ ప్రాంగణము లందు ఛత్రములమర్చబడినవి. ఆ ఛత్రముల నుండి జాలువారుచున్న పెద్ద పెద్ద బిందువులు ముత్యములు వలె శోభించుచున్నవి. మాలతీ పుష్పలతల పందిళ్ళ నుండి జాలువారు మకరందము మరియు వెలివడుచున్న సుగంధము నలుదిశలా వెదజల్లబడుచున్నది. మదవతీ, మనోహారిణులయిన సుమధ్యలు వంశీ, మృదంగ, తాళ వాద్యములతో, మధుర కంఠముతో ఆలపించుచున్న కోటి మనోజ మోహనుడయిన శ్యామసుందరునితో శృంగార కటాక్ష వీక్షణ అయిన శ్రీరాధాదేవి ఇట్లనియె "జగదీశ్వరా! మీరు నా ప్రేమ యెడల ప్రసన్నులయిరేని నా మనోభిప్రాయమును వ్యక్తము చేసెదను." భగవానుడు "ప్రియా! నీ మనసునందలి ఏ కోరిక అయిననూ అడుగ వలసినది. నాకు నీ యందు గల ప్రేమ చే ఇవ్వకూడని వస్తువు సహితము ఇచ్చెదను. సంకోచము లేకుండ అడుగవలసినది."

శ్రీరాధాదేవి "ఈ బృందావనము నందలి యమునా తటియందు ఈ దివ్య నికుంజము పార్శ్వ భాగమున రాసయోగ్యమయిన, బహుసుందర, మనోహర ఏకాంత ప్రదేశమును ప్రకటితము చేయవలసినది. ఇది నా మనోరథము." భగవానుడు "తథాస్తు" అని పలికి ఏకాంత లీలా యోగ్య స్థానము కొరకు చింతించుచు సాలోచనగా తన హృదయము పైకి దృష్టి పరికించెను. అంత సమస్త గోప, గోపీ సముదాయము చూచుచుండగనే భగవానుని హృదయము నుండి మూర్తీభవించిన అనురాగము ఒక దివ్య తేజస్సు వలె బయల్వెడలి రాసమండలి యందు ప్రవేశించి ఒక పర్వతాకారము దాల్చెను. ఒక క్షణము లో ఆ పర్వతము ఒక లక్ష యోజనములు వెడల్పు, ఒక కోటి యోజనములు పొడవు, ఏబది కోట్ల యోజనముల ఎత్తు పెరిగినది. ఆ పర్వతమంతయు కణకణము రత్నధాతుమయము. సుందరమయిన జలపాతములు, విశాలమయిన గుహలు ఆ పర్వత శోభను మరింత ఇనుమడింపచేయు చున్నవి. ఆ పర్వతము సర్వము కదంబ, వకుళ, అశోక వృక్ష సమన్వితము మరియు దివ్యలతా ఆచ్ఛాదితము. మందార, కుంద, వృంద, వృక్ష సంపన్నమయిన ఆ పర్వత రాజము వివిధరకముల పక్షులకాలవాలమై నిరంతరము కలకూజితముల సుందర ధ్వనులతో మారుమ్రోగు చుండెను.

ఏబది కోట్ల యోజనముల విస్తీర్ణము నందు విలసిలుచున్న పర్వతము గొప్ప గజరాజు వలె కానపట్టుచున్నది. ఆ పర్వత రాజము ఒక్కొక్క శిఖరము కోటి యోజనములు గల వందలాది శిఖరములచే అలరారుచు అనేక సువర్ణమయ కలశములతో ఒప్పారు దివ్య హర్మ్యము వలె ప్రకాశించుచున్నది. కొందరు విద్వాంసులు ఆ పర్వతమును గోవర్ధనమని మరికొందరు శతశృంగమని పేర్కొందురు. ఈ పర్వతము మిక్కిలి విశాలము అయినప్పటికీ తన మనసునందలి ఉత్సాహము చే ఇంకనూ పెరగనారంభించెను. ఈ విపరీత చర్య గోలోకమంతటా హాహాకారములు రేకెత్తించెను. అంత శ్రీహరి త స్వహస్తములతో ఆ పర్వతమును తాడించి ఇట్లనియె "ఓరీ! ప్రచ్ఛన్న రూపముతో ఎందులకు పెరుగుచున్నావు? ఈ గోలోకము నంతయు ఆక్రమించు చున్నావు. ఆ లోకమును ఇచట ఉండనీయవా? ఏమి?" అని పలికి ఆ పర్వతమును శాంతపరిచెను. ఈ ఉత్తమ పర్వతమును కాంచిన శ్రీరాధాదేవి మిక్కిలి ప్రసన్న హృదయ యై తదుపరి ఆ పర్వత సానువుల యందలి ఏకాంత స్థలములందు శ్రీహరిని కూడి శోభించెను.

ఈ ప్రకారముగ ఈ గిరిరాజము సాక్షాత్ శ్రీకృష్ణుని వలన వ్రజ మండలమున కేతెంచెను. ఇది సర్వ తీర్థమయము మరియు సర్వదేవతా ప్రియము. నీలిమేఘ వర్ణముగల లతా కుంజ మండితమయిన ఈ శ్రేష్ఠ పర్వతము సదా నీలి మేఘము వలె శోభించుచుండెను. భారత వర్షపు పశ్చిమమున గల శాల్మలీ ద్వీపము మధ్య భాగమున ద్రోణాచలము యొక్క పత్నీగర్భ సంభూతుడై గోవర్ధనముదయించెను. పులస్త్య మహాముని ద్వారా ఈ పర్వతము భారత వర్షమున కేతెంచెను. గోవర్ధనాగమన వృత్తాంతమును నీకు ఇది వరలో వివరించితిని. ఈ గోవర్ధనము గోలోకమున వ్యాప్తి చెందిన రీతిని భూమియందు వ్యాప్తి చెందిన ఎడల దాని వలన పృధివికి మిక్కిలి కీడు జరుగును. ఇది తెలిసిన పులస్త్య మహాముని దాని నివారణార్థమై ద్రోణపుత్ర గోవర్ధనమును ప్రతిదినము క్షీణింపమని శాపమెసంగెను.

(శ్రీ గర్గసంహిత యందు గిరిరాజ ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ గిరిరాజ ఉత్పత్తి అను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(గోవర్ధన శిలాస్పర్శ చే ఒక రాక్షసుని ఉద్ధారము. దివ్య రూపధారి అయిన ఆ సిద్ధుని ద్వారా గోవర్ధన మహిమా వర్ణనము)

నారదుడు తిరిగి చెప్పదొడంగెను "మహారాజా! గోవర్ధన మహిమను తెలుపుటకు ఒక పురాతన ఐతిహాసమును వర్ణించెదను. ఈ ఆఖ్యానము శ్రవణ మాత్రమున మహా పాపములు సహితము శమించును. గౌతమీ గంగ (గోదావరి) తీరమున "విజయుడు" అను ప్రసిద్ధ బ్రాహ్మణుడు కలదు. ఆతడు ఒకానొక దినము ఋణము వసూలు చేసికొనుటకై పాపనాశని అయిన మధురాపురము చేరెను. ఆయన తన కార్యము పూర్తి అయిన పిదప తన గృహమునకు ఏగుచు మార్గమధ్యమున గోవర్ధన పర్వతము చేరి అందు ఒక గోళాకారపు రాయిని తీసికొని తన ప్రయాణమును కొనసాగించెను. ఆ ప్రదేశము అంతయు దట్టమయిన కీకారణ్యము. నెమ్మది నెమ్మదిగ ధైర్యము చిక్కబట్టుకొని ఆ వన ప్రదేశము దాటి బయటకు వచ్చెను. అంత ఆతనికి ఎదురుగా ఒక భయంకర రాక్షసుడు కానబడెను.

ఆ రక్కసుని ముఖము ఆతని హృదయ ప్రదేశము నందు కలదు. ఆ విచిత్ర రూపునికి మూడు కాళ్ళు, ఆరు భుజములు కలవు. కానీ చిత్రముగ మూడు చేతులు మాత్రమే కలవు. మిక్కిలి లావుగా యున్న పెదవులు, ఒక అడుగు పొడవున్న ముక్కు, ఏడడుగులు పొడవు గల నాలుక దర్భముల్లు వలె వాడిగా యుండి పాము జిహ్వము వలె లోనికి, బయటకు కదులు చుండెను. ఎర్రని గోళములు వంటి కన్నులు, వికృతమయిన దంతములు కలిగి ఆ రాక్షసుడు మిక్కిలి భయంకర రూపుడై, క్షుద్బాధితుడై, గుర్రు గుర్రని శబ్దము చేయుచూ ఆ బ్రాహ్మణుని ఎదుటకు వచ్చెను. ఆ బ్రాహ్మణుడు దిక్కుతోచక గిరిరాజు నుండి తీసికొనిన గోళాకారపు రాయిని ఆ రాక్షసుని పై విసిరెను. ఆ శిల తగులగనే, ఆ రాక్షసుడు దివ్యమయిన శ్యామసుందరునిగ రూపు దాల్చెను. ఆతని నేత్రములు విశాలమై ప్రఫుల్ల కమల పత్రముల వలె శోభించుచున్నవి. వనమాల, పీతాంబరము, దివ్య మకుటము, స్వర్ణ కుండలములు ప్రకాశించు చుండగా హస్తముల యందు వంశీ, వేత్రముల ధరించి రెండవ కామదేవుని వలె భాసించుచుండెను. ఇటువంటి దివ్యరూపము ధరించిన ఆ మహితాన్వితుడు తన రెండు చేతులు జోడించి బ్రాహ్మణునికి మరల, మరల సమస్కరించి ఇట్లనియె.

"బ్రాహ్మణోత్తమా! ఇతరులను సంకటముల నుండి రక్షించు పుణ్యకార్యము నందు నిమగ్నమయిన నీవు ధన్యుడవు. మహామతీ! నీవు నేడు నా రాక్షస రూపము నుండి విడిపించితివి, ఈ పాషాణస్పర్శచే నాకు కళ్యాణమయినది. నీవు వినా ఇతరులెవ్వరునూ నన్ను ఉద్ధరించుట యందు సమర్థులు కారు. బ్రాహ్మణుడు "సువ్రతా! నీ పలుకులు మిక్కిలి ఆశ్చర్య జనకములుగ యున్నవి. నిన్నుద్ధరించు శక్తి, సమర్ధత నాకు లేవు. ఈ పాషాణ స్పర్శ ఫలితము నాకు కించిత్ మాత్రము తెలియదు. దయచేసి నీవు నాకు విశదపరుచవలసినది." సిద్ధుడు "బ్రాహ్మణోత్తమా! గోవర్ధన గిరిరాజు సాక్షాత్ శ్రీహరియే! ఈ పర్వతపు దర్శన మాత్రముచే మానవులు కృతార్థులగుదురు. గంధమాదన పర్వతయాత్ర వలన మానవులకు ఎంత పుణ్యము లభించునో దానికి కోటి రెట్లు పుణ్యము గోవర్ధన దర్శనము వలన కలుగును. విప్రవరా! కేదార తీర్థము నందు అయిదు వేల సంవత్సరములు తపస్సు చేసిన పుణ్యము ఒక్క క్షణము గోవర్ధన మందు తపమాచరించిన లభించును.

మలయాచలము నందు ఒక్క బారువు బంగారము దానము చేసిన ఎంత ఫలము లభించునో దానికి కోటి రెట్లు పుణ్యము గోవర్ధనమందు ఒక్క తులము సువర్ణ దానము వలన లభించును. మంగళ ప్రస్థ పర్వతమందు అనేక సువర్ణ దానము లాచరించిన పిదప శ్రీ విష్ణు సారూప్యము ప్రాప్తించును. అటువంటి ఫలము కేవలము గోవర్ధన దర్శన మాత్రమున లభించును. ఈ గిరిరాజ సమాన పుణ్య తీర్థము వేరొకటి లేదనుట అతిశయోక్తి కాదు. ఋషభ, కూటక, కోలక పర్వతము లందు కోటి ఆవుల శృంగములకు బంగారు తొడుగులు తొడిగి ఉత్తమ బ్రాహ్మణులకు ప్రయత్న పూర్వకముగ పూజ చేసి దానమిచ్చిన ఫలితమునకు లక్ష రెట్లు పుణ్యము గోవర్ధన పర్వత యాత్రా మూలముగ లభించును. ఋష్యమూకము, సహ్యగిరి, మరియు దేవగిరి మొదలగు సంపూర్ణ పృథివీ యాత్రా ఫలితముగ లభించు పుణ్యమునకు కోటి రెట్లు పుణ్యము గోవర్ధన యాత్రా మాత్రమున సుసాధ్యమగును. ఈ గిరిరాజ సమాన తీర్థము "నభూతో న భవిష్యతి".

శ్రీశైల పర్వతమందు పది సంవత్సరములు నివశించి, అచటి విద్యాధర కుండము నందు ప్రతిదినము స్నానమాచరించు పుణ్యమనుజునకు వంద యజ్ఞములు చేసిన ఫలము లభించును. గోవర్ధన పర్వతపు పుంఛకుండము నందు ఒక్క తరి స్నానమాచరించు పుణ్యుడు కోటి యజ్ఞములు ఆచరించిన ఫలితము పొందును. ఇందు సందియము లేదు. వేంకటాచలము, వారిధారము, మహేంద్ర గిరి, మరియు వింధ్యాచలములందు చేయబడిన ఒక్క అశ్వమేధయాగ ఫలము వలన మానవుడు స్వర్లోకాధిపతి అగును.

కానీ గోవర్ధనము నందు యజ్ఞము చేసి ఉత్తమ దక్షిణలిచ్చు పుణ్యుడు స్వర్గ మస్తకము పై కాలుమోపి విష్ణు సాయుజ్యమును పొందును. ద్విజోత్తమా! చిత్రకూటము నందలి పరశ్వినీ (మందాకిని) నది యందు శ్రీరామ నవమి నాడు, పారియాత్రా పర్వతమందు వైశాఖ తృతీయ నాడు, కుకురాచలము నందు పూర్ణిమనాడు, నీలాచలము నందు ద్వాదశి నాడు, ఇంద్రనీల పర్వతమందు సప్తమినాడు చేయబడిన స్నాన, దాన, తపములు కోటి రెట్లు పుణ్యాదిక్యత నిచ్చును. అట్లే భారత వర్షము నందలి గోవర్ధనము నందు చేయబడిన స్నానాది శుభకర్మలు అనంత కోటి రెట్లు ఫలితము నిచ్చును. బృహస్పతి సింహరాశి యందు ప్రవేశించినపుడు గోదావరి యందు, కుంభరాశి యందు యున్నపుడు హరిద్వారము నందు, పుష్యమీ నక్షత్రము యున్నపుడు పుష్కర క్షేత్రమందు, సూర్యగ్రహణ కాలమున కురుక్షేత్ర మందు, చంద్రగ్రహణ కాలమున కాశీ క్షేత్రమందు, ఫాల్గుణ మాసమున నైమిశారణ్యము నందు, ఏదాదశీ పర్వదినమున సూకర తీర్ధమందు, కార్తీక పూర్ణిమ పర్వదినమున గుడ ముక్తేశ్వరము నందు, జన్మాష్టమీ తిథినాడు మధురానగరమందు, ద్వాదశీ పర్వదిన మందు ఖాండవ వనమున, కార్తీక పూర్ణిమ నాడు వటేశ్వరమను మహావట సమీపమున, మకర సంక్రాంతి సమయమున ప్రయాగ క్షేత్రమందు, వైధృతీ యోగ కాలమున బర్హిష్మతీ నగరమున, శ్రీరామ నవమి నాడు అయోధ్య యందలి సరయూ తటము నందు, శివ చతుర్దశినాడు వైద్యనాధ వనమందు, సోమవారము, అమావాస్య కలిసిన తిధినాడు గంగాసాగర సంగమందు, దశమినాడు సేతుబంధన మందు, సప్తమి నాడు శ్రీరంగము నందు చేయబడు స్నాన, దాన, జప, బ్రాహ్మణ పుజాది శుభకార్మలు కోటి రెట్లు పలితమును ఇచ్చును. వీటన్నిటికీ సమాన పుణ్యఫలము కేవలము గోవర్ధన యాత్ర ద్వారా లభించును.

మిధిలేశ్వరా! ఏ మనుష్యుడు శ్రీ కృష్ణ భగవానుని యందు మనసు లగ్నము చేసి నిర్మల "గోవింద కుండము" నందు స్నాన మాచరించునో ఆతడు శ్రీకృష్ణ సారూప్యమును పొందును. ఇందు సందేహము లేదు. గోవర్ధన పర్వతమందలి "మానసీ గంగా" తీర్థమందు మునిగిన లభించు ఫలము వేలాది అశ్వమేధ యజ్ఞములు, వందలాది రాజసూయ యజ్ఞముల వలన కూడా లభింపదు. ఇది ఎంతమాత్రము అతిశయోక్తి కాదు.

విప్రవరా! మీరు సాక్షాత్ గిరిరాజ దర్శనము, స్పర్శనము, మరియు తీర్ధ స్నానములు సలిపిరి. అందువలన ఈ భూతలము నందు మీ వంటి మహానుభావులు లేరు. మీకు విశ్వాసము కలుగని యెడల నన్ను ఒక్క మారు పరికింప వలసినది. నేను మహా పాతకుడను. అయినప్పటికీ కేవలము గోవర్ధన శిలా స్పర్శ చే శ్రీకృష్ణ భగవానుని సారూప్యమును పొందితిని.

(శ్రీ గర్గసంహిత యందలి శ్రీ గిరిరాజ ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి గిరిరాజ మహాత్యము అను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(సిద్ధుని ద్వారా తన పూర్వ జన్మ వృత్తాంతము యొక్క వర్ణనము మరియు గోలోకము నుండి అవతీర్ణమయిన దివ్యరధము పై ఆశీనుడై సిద్ధుడు గోలోకమునకు ఏగుట)

సిద్ధుని పలుకులు వినిన బ్రాహ్మణుడు మిక్కిలి విస్మితుడై గిరిరాజు ప్రభావమును తిరిగి తెలిసికొన ఇట్లు పున:ప్రశ్నించెను. "మహాభాగా! ప్రస్తతము నీవు దివ్యరూపము తో ప్రకాశించుచున్నావు. కానీ నీ పూర్వజన్మ వృత్తాంత మేమి! నీకు ఏ పాపము చేయట వలన బ్రహ్మరాక్షసత్వము సంక్రమించినది?"

సిద్ధుడు "పూర్వ జన్మము నందు నేను మిక్కిలి ధనికుడనయిన వైశ్యుడను. ధనసమృద్ధి మిక్కుటమగుటచే నాకు చిన్నతనము నుండి జూదము ఆడు దురలవాటు మొదలయినది. జూదగాంఢ్ర యందు నేను మిక్కిలి నిపుణుడను అయితిని. అంతటితో ఆగక నాకు వేశ్యాలోలత్వము, మరియు మదిరా పానము మొదలగు దురలవాట్లు కూడా అలవడినవి. అందువలన నా మాతాపితరులు, నా భార్య నన్ను మిక్కిలి అసహ్యించుకొనెడి వారు. ఒకసారి నేను తల్లిదండ్రులకు విషము నిచ్చి హత్య చేసితిని. పిదప భార్యను బయటకు తీసికొని వెళ్ళు నెపమున ఒక ఏకాంత స్థలమునకు తీసికొని వెళ్ళి ఆమెను కూడా కత్తితో పొడిచి పరిమార్చితిని. అటు పిదప వారందరి ధనము సంగ్రహించి, ఒక వేశ్యను తీసికొని దక్షిణ దిశగా ప్రయాణించితిని. ఇది కేవలము నా దుష్టత్వపు పరిచము మాత్రమే!! ఇట్లు దక్షిణ దిశగా ప్రయాణించి దారిదోపిడీ దొంగనై నిర్దయగా ప్రయాణీకులను దోచుకొంటిని. ఒకానొక దినము ఆ వేశ్యను సహితము ఒక చీకటి గొయ్యి లోనికి త్రోసి చంపితిని. నేను అప్పటికే గొప్ప బందిపోటు దొంగనైతిని. వందలాది మనుష్యులను దోచుకొని ఉరి వేసి చంపి మృత్యుదేవతకు అతిధులుగా పంపితిని. ధన లోభము చే వందలాది బ్రాహ్మణులను సంహరించితిని. క్షత్రియ, వైశ్య, శూద్ర హత్యలు వేలకొలది చేసితిని. ఒకానొక దినము మాంస భక్షణ లాలస చే మృగములను చంపుటకు వనమునకు అరిగితిని. నేను పొరపాటున ఒక విష సర్పము ను త్రొక్కుటచే అది కాటు వేయగా తక్షణము మరణించితిని. అంత భయంకర యమదూతలు, దుష్టుడను, మహాపాతకుడనైన నన్ను బంధించి, ముద్గరముల తో కొట్టి, నరకమునకు ఈడ్చి, "కుంభీపాకము" నందు పడవైచిరి. అచట ఒక మన్వంతరము శిక్షింపబడిన పిదప "తప్తసూర్మి" అను నరకమున ఒక కల్పకాలము మహా దు:ఖము అనుభవించితిని.

ఇట్లు ఎనుబది నాలుగు లక్షల నరకములందు ఒక్కొక్క సంత్సరమున చొప్పున శిక్షల ననుభవించితిని. తదుపరి కర్మాను సారము భారత వర్షము నందు పది జన్మలు పందిగనూ, వంద జన్మలు పులి గనూ, వంద జన్మలు దున్నపోతుగనూ, వెయ్యి జన్మలు సర్పయోని యందునూ, జన్మించితిని. కొందరు దుష్టులు కలసి నన్ను పరిమార్చిరి. ఇట్లు వేయజన్మలు గడిచిన పిదప ఒక జలశూన్య విపినము నందు నీకు కనబడిన విశాలకాయుడయిన బహు దుష్ట రాక్షసునిగా జన్మనందితిని. ఒకనాడు ఒక శూద్రుని ఆవహించి వ్రజమండలమునకు ఏగితిని. అచట బృందావన సమీపమున, సుందర యమునా తటమున శ్యామ సుందరులయిన శ్రీకృష్ణ పార్షదులు నన్ను చూచి కొట్టనారంభించిరి. అచట నుండి పారిపోయి పెక్కు దినములు క్షుద్బాధా పీడితుడనై వ్రజ భూమి చుట్టూ పరిభ్రమించు చుండగా నీవు కనబడి, గిరిరాజ శిలా ప్రహారము కావించితివి. బ్రాహ్మణోత్తమా! నా యందు శ్రీకృష్ణ కృప కలిగినది. అందుచే నాకు కళ్యాణమయినది."

సిద్ధుడు ఈ విధముగ తన వృత్తాంతము ముగించగనే గోలోకము నుండి ఒక విశాలరధము అవతీర్ణమయినది. ఆ తేరు సహస్ర సూర్యల పగిది భాసించుచూ, వేయి హయముల చే లాగబడుచున్నది. శుద్ధ ఘుడికలు, మంజీరముల చే అలంకృతమయిన ఆ దివ్య రధమును చూచి ఆ ఇరువురు సమస్కరించిరి. అంత సిద్ధుడు ఆ రధము నందు ఆశీనుడయిన పిదప ఆ దివ్య రధము ప్రకాశమును విరజిమ్ముచూ, ఆకాశ మార్గమున శ్రీకృష్ణ ధామము గోలోకము చేరెను. పిదప బ్రాహ్మణుడు సహితము గోవర్ధన పర్వత ప్రభావము పూర్తిగా ఎరిగిన వాడై తిరిగి గిరిరాజు గోవర్ధము వద్దకు ఏగి ప్రణామ, ప్రదక్షిణలు సలిపి తన గృహమునకు ఏగెను.

నారదుడు "మహారాజా! ఈ ప్రకారము పరమ విచిత్రము, మోక్షదాయక మయిన గిరిరాజ ఖండమును నీకు వినిపించితిని. ఈ గిరిరాజ ఖండ శ్రవణము చేసిన మహాపాపి సహితము స్వప్నము నందు కూడా ప్రచండ ఉగ్ర దండధరుడయిన యముని దర్శనము చేయడు. ఏ మనుష్యుడు గిరిరాజ యశో పరిపూర్ణుడయిన శ్రీకృష్ణ భగవానుని కేళీ రహస్యము వినునో, ఆతడు దేవరాజు ఇంద్రుని వలె ఈ లోకము నందు భోగములు అనుభవించును, మరియు నందరాజు వలె పరలోకము నందు పరమ శాంతిని పొందును.

(శ్రీ గర్గసంహిత యందలి గిరిరాజ ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి గిరిరాజ ప్రభావ వర్ణన ప్రసంగమున సిద్ధుని మోక్షమను పదకొండవ అధ్యాయము సమాప్తము)

గిరిరాజ ఖండము సమాప్తము

మాధుర్య ఖండము

ఒకటవ అధ్యాయము

(శృతిరూప గోపికల వృత్తాంతము, శ్రీకృష్ణ దుర్వాసోమునుల విషయమందు వారి సందేహము; శ్రీకృష్ణుని ద్వారా ఆ సందేహ నివారణము)

శిరము నందు మనోహర నెమలి పింఛము, చేతియందు వంశీరవము, కర్ణములందు కుండలములు, దేహము నందు పట్టు పీతాంబరము, ధరించిన నటవేషధారి శ్రీకృష్ణుని నేను నిరంతరము భజించుచున్నాను. ఎవరు అవిశి పూల కాంతితో ప్రకాశించుచున్నాడో, ఎవరు యమునా తటమున గల కదంబ వృక్ష మూలమున విరాజమానుడై యున్నాడో, ఎవరు ఎల్లప్పుడు సుందర గోపికలతో కలసి రాసలీల సలుపుచున్నాడో, అట్టి వనమాలి శ్రీకృష్ణుని యశో మంగళములు విస్తరిల్లుగాక.

బహుళాశ్వుడు "మునీంద్రా! మీరు పుణ్యపురుషులందు, పురాణ వేత్తలందు శ్రేష్ఠులు. దివ్య చతురా! గోపాల కృష్ణ చంద్రుని చరిత్రము దివ్యము, మరియు పరమాద్భుతము. శృతిరూపాది గోపికలు పూర్వమొసగబడిన వర ప్రభావము వలన శ్రీకృష్ణుని కంటె ముందుగానే వ్రజభూమి యందు ప్రవేశించిరి. వారు కృష్ణ సాహచర్యము ఎట్లు పొందిరి? వారి మనోరధములు ఎట్లు పూర్ణమయ్యెను?

నారదుడు "విదేహరాజా! శృతిరూపాది గోపికలు శేషశాయి అయిన విష్ణు భగవానుని వర ప్రభావము వలన వ్రజవాసులయిన గోప కులమునందు ఉత్తమ జన్మమందిరి. వారు బృందావనము నందు నందనందనుని మనోహర రూపమును గాంచి ఆయనను వరముగా పొందుటకు బృందావనేశ్వరి అయిన బృందాదేవి సమారాధన కావించిరి. బృందాదేవికి ఇచ్చిన వర ప్రభావము చే భక్తవత్సలుడయిన శ్రీకృష్ణ భగవానుడు శీఘ్రముగ వారి యందు ప్రసన్నుడై ప్రతిదినము వారి ఇండ్లకు రాస క్రీడా నిమిత్తమై ఏగుచుండెను. ఒకానొక రాత్రి రెండవ ఝాము గడచిన పిదప శ్రీకృష్ణుడు రాసక్రీడా నిమిత్తమై వారి ఇండ్లకు ఏగెను. ఆ సమయమున గోపికలు మిక్కిలి ఉత్కంఠతో ఆయన రాకను గమనించి ఆయనకు పరమభక్తితో పూజలొనర్చి మృదు మధురముగ ఇట్లడిగిరి "అఘనాశనా! శ్రీకృష్ణా! మా గోపాంగనలమందరమూ చంద్రుని కొరకు వేచు చకోర పక్షుల వలె మీకై వేచియుంటిమి. ఈ రోజు మీ ఆలస్యమునకు కారణమేమి! భగవానుడు "ప్రియతమలారా! ఎవరు ఎవరిని తమ హృదయమందు పొందు పరచుకుందురో వారు వారికి ఎన్నడు దూరులు కారు."

"సూర్యుడు గగనమందును, కమలము భూమి యందును యుండును. కానీ భానోదయము అయిన వెంఠనే కమలము ఉదయించును. కమలము సూర్యుని తనకు అత్యంత సన్నిహితముగ భావించును. ప్రాణ ప్రియలారా! నేడు నా గురుదేవులు దుర్వాసో మహాముని భాండీర వనమున కేతెంచిరి. నేను వారిని సేవించుటకై ఏగితిని. గురువు సాక్షాత్ త్రిమూర్త్యాత్మకము. గురువే పరబ్రహ్మము. అజ్ఞానమనెడి రేచీకటి చే దృష్టిని కోల్పోయిన అంధులకు జ్ఞానాంజనమును అలది తిరిగి భగవాన్ దర్శనమను దృష్టిని ప్రసాదించు మహితాన్వితుడు గురువు. గురువు సమస్త దేవతా స్వరూపము. ఆయనను ఎన్నడూ అవహేళన చేయరాదు. ఆయనను ఎన్నడూ సాధారణ మానవునిగ తలుప రాదు. నేను అటువంటి దుర్వాసోమునికి పూజ, సత్కారములు సలిపి, ఆయన చరణ కమలములకు ప్రణామములు కావించి మీ కడకు ఆలస్యముగ ఏతెంచితిని. గోపికలు అందరూ ఈ విషయము విని విస్మితులై ఇట్లడిగిరి "ప్రభూ! ఇది బహు ఆశ్చర్యకరము. దుర్వాసోముని పరిపూర్ణతమ పరమాత్ములయిన మీకు కూడా గురువులా? మాకు వారిని దర్శించవలెనని మిక్కిలి ఉత్సుకత కలుగుచున్నది. కానీ సమయము రాత్రి రెండు ఝాములు దాటినది. ఈ సమయము నందు వారి దర్శన ప్రాప్తి ఎట్లు కలుగును? అందునా మధ్యన విశాలమయిన యమునా నది నిలిచియున్నది. ఏ రకమయిన నావ లేక ఈ సమయమందు ఆ నదిని దాటుట ఎట్లు?"

భగవానుడు "ప్రాణప్రియలారా! మీరందరూ యమున వద్దకు ఏగి మార్గమునకై ఇట్లు వచింప వలసినది. శ్రీకృష్ణుడు బాలబ్రహ్మచారి అయిన యెడల, అట్లే పరిపూర్ణ దోషరహితుడయిన యెడల సరితల యందు శ్రేష్ఠమయిన యమునా! మాకు అవతలి గట్టుకు చేరుటకు మార్గము నీయవలసినది." ఈ పలుకులు వినిన వ్రజాంగనందరూ అనేక మధుర పదార్ధములను తీసికొని యమునా తటమున కేగి శ్రీకృష్ణ భగవానునిచే చెప్పబడిన పలుకులు తెలిపిరి. వెనువెంటనే యమున తన ప్రవాహమును చీల్చి వారికి దారినిచ్చెను. వ్రజాంగనలందరూ విస్మితులై భాండీర వనమునకు చని, దుర్వాసోమునిని గాంచి ఆయనకు పరిక్రమ కావించి, వివిధ మధుర పదార్ధములను సమర్పించిరి. వారందరూ ఒకే మారు "మహామునీ! మీరు నా పదార్ధములను తీసికొని వలసినది, నా పదార్ధము స్వీకరింప వలసినది" అని వాదులాట మొదలిడిరి. ఇట్లు వాదించుకొనుచున్న గోపకల భక్తి భావమును గ్రహించిన దుర్వాసో మహాముని వారితో సాదరముగ ఇట్లనెను "గోపికలారా! నేను కృతకృత్యుడనయిన పరమహంసను. నిష్క్రియుడను, అందువలన మీ చేతులతో మీరు నాకు తినిపించవలసినది." ఇది వినిన గోపికలు హర్షోల్లాసులై తాము తీసికొని వచ్చిన సమస్త భోగములను (భోజ్య పదార్ధములను) ఆయన నోటియందుంచిరి. ఆయన వారందరూ చూచుచుండగానే వారు తెచ్చిన సమస్త భోజ్యములను క్షణముతో భుజించెను.

గోపికలు మిక్కిలి ఆశ్చర్య చకితులై ఒకరి ముఖము నొకరు చూసుకొనిరి. వారు తీసికొని వచ్చిన సమస్త భోజన పాత్రలు ఖాళీలయినవి. అనంతరము వారు పరమశాంతుడు, భక్త వత్సలుడు అయిన దుర్వాసో మునికి ప్రణామములు గావించి ఇట్లనిరి "మహామునీ! శ్రీకృష్ణ దేవుని వాక్కులచే మాకు యమునను దాటి ఇట వచ్చుటకు దారి సుగమమయినది. తిరిగి వెళ్ళుటకు మాకు ఉపాయము బోధింప వలసినది. అంత దుర్వాసోముని "గోపికలారా! మీరు సుఖముగ వెనుకకు వెళ్ళ వలసినది. మీరు యమునను చేరినపుడు యమునానది కి ఈ విధముగ నివేదింప వలసినది "దుర్వాసో ముని ఈ భూతలమందు కేవలము దర్భగడ్డి యొక్క రసము చే జీవించుచున్న ఎడల, ఎన్నడు అన్న పానీయములు ముట్టని వ్రతము భంగము లేకుండ పాటించుచున్న యెడల సరితా శిరోమణి అయిన యమునా! మాకు దారినీయవలసినది. ఈ పలుకులు వినిన యమున మీకు తక్షణమే దారి నొసంగును."

ఇది వినిన గోపికలు ఆ ముని పుంగవునకు ప్రణామములాచరించి యమున వద్దకు వచ్చి ముని పలుకులు యధాతథముగ వర్ణించిరి. అంత యమున తిరిగి రెండుగ చీలి వారికి దారి నిచ్చెను. వారు నెమ్మదిగ శ్రీకృష్ణుని చేరిరి. కానీ ఈ విచిత్రానుభవము వారిని విస్మితులను గావించెను. తదనందరము గోపాంగనలు రాసలీల యందు శ్రీకృష్ణ ప్రభువును ఇట్లు ప్రశ్నించిరి, "ప్రభూ! మీ దయవల్ల మాకు దర్వాసో మహాముని దర్శనము కలిగినది. కానీ మీ ఇరువురి పలుకులు యొక్క సత్యసంధత మాకు సందేహాస్పదముగ యున్నది. ఎట్లు గురువులు అసత్యవాదులో అట్లే శిష్యులునూ మిధ్యావాదులు. అఘనాశనా! మీరు చిన్నతనము నుండి పర స్త్రీ వ్యామోహితులు మరియు రశిఖ శిఖామణులు. మీరు బాల బ్రహ్మచారులగుట ఎట్లు సాధ్యము? అట్లే మా ఎదుటనే మా బుట్టల యందలి మధుర పదార్ధములు సర్వమూ దుర్వాసో ముని తినియుండెను. ఆయన కేవలము దర్భగడ్డిరసము త్రాగుచు జీవితము వెలిబుచ్చు కఠోర నియమము గల మహాత్ముడు ఎట్లగును? ఇది మా అందరి హృదయములను కలచి వేయి చున్నది."

శ్రీకృష్ణుడు చిరునవ్వుతో "గోపికలారా! నేను మమతాహంకార రహితుడను. సర్వవ్యాపిని. సర్వోత్కృష్టుడను, వైషమ్య శూన్యుడను, మరియు ప్రాకృత గుణ రహితుడను. ఎల్లప్పుడూ సర్వుల యందు సమభావన కలిగి యుందును. అంతేకాక నా భక్తులు నన్ను ఎట్లు భజింతురో, నేను వారిని అట్లే అనుగ్రహించెదను. అట్లే సాధు మహాత్ములు సహితము ఎల్లప్పుడూ విషయభావనా శూన్యులు. యోగయుక్తులయిన విద్వాంసులు కర్మాసక్తులయిన (కర్మలంపటులయిన) అజ్ఞానుల యందు బేధబుద్ధి ఉత్పన్నము చేయరాదు.

వారిచేత కర్మలు చేయింపవలెను. ఏ పుణ్యజీవికి సమస్త విషయాసక్తి నశించి, సంకల్ప శూన్యుడగునో వారి కర్మలు సమస్తము జ్ఞానాగ్నియందు దగ్ధమగును (అనగా వారి కర్మలు బంధకారకములు కావు). అటువంటి జీవుని "జ్ఞాని, పండితుడు" అని పేర్కొందురు. ఎవరి మనసు నందు ఎటువంటి కోరికా లేదో, ఎవరు మనో, బుద్ధి, అహంకారములను పూర్తిగా తమ వశమునందుంచుకొనెదరో, ఎవరు సంగ్రహ పరిగ్రహణమును సంపూర్తిగా విడిచెదరో, ఇటువంటి జ్ఞానులు కేవలము శరీర నిర్వహణ కు మాత్రమే కర్మలు చేయుదురు. ఈ సంసారము నందు జ్ఞానము కంటె పవిత్ర వస్తువు లేదు. యోగసిద్ధుడయిన జీవునకు సమయానుసారము తనంతట తానే జ్ఞానోదయము కలుగును. ఎవరు

సమస్త కర్మలను బ్రహ్మార్పణము గావింతురో వారిని కమల దళములకు నీరంటనట్లు పాపములు స్పృశింపవు. అందువలన దుర్వాసోముని మీ అందరి ఆనందమునకై మీచే ఈయబడిన భోగములను భుజించెను. కానీ ఆయనకు కించిత్ మాత్రము భోజనేచ్ఛ లేదు. ఆయన తన శరీర పోషనార్ధము కేవలము పచ్చికల రసము మాత్రమే సేవించును.

(శ్రీ గర్గసంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి శృతిరూప గోపికాఖ్యానము అను మొదటి అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(ఋషిరూప గోపికల ఉపాఖ్యానము. వంగదేశము నందలి మంగళ గోపికల నంద వ్రజాగమనము. యమునా తటము నందు వారి రాసలీలా ప్రవేశము)

నారదుడు చెప్పదొడంగెను "మిధిలేశ్వరా! ఇపుడు ఋషిరూప గోపికల వృత్తాంతమును వినవలసినది. ఈ ఆఖ్యానము సర్వపాపహరము, పరమ పావనము, మరియు శ్రీకృష్ణ భగవానుని యందు అమిత భక్తి ప్రసాదితము. వంగ దేశము నందు "మంగళుడు" అను ప్రముఖ గోపకుడు యుండెను. ఆయన అమిత భాగ్యశాలి, శాస్త్రజ్ఞాన సంపన్నుడు మరియు తొమ్మిది లక్షల గోవులకు అధిపతి. ఆయనకు అయిదు వేల మంది భార్యలు కలరు. ఒకానొక సమయమున దైవయోగమున ఆయన సంపద సర్వము ఖర్వమయినది. చోరులు ఆయన గో సంపదను అపహరించిరి. కొన్ని గోవులను ఆ దేశపు రాజు అధికార బలము చే బలపూర్వకముగ హరించెను. ఇటువంటి దీన స్థితికి చేరి మంగళ గోపుడు మిక్కిలి దు:ఖించెను. శ్రీరామచంద్రుని వనవాస సమయమున దండకారణ్యము నందు వరమున బడసిన ఋషులందరూ కన్యారూపము ధరించి మంగళగోపునింట జన్మించిరి. ఈ కన్యా సమూహమును గాంచిన మంగళగోపుడు మరింత శోకసాగరమున మునిగి ఆధి వ్యాధులచే వ్యాకుల చిత్తుడయి మనమున ఇట్లు తలచెను "ఇపుడు నా కర్తవ్యమేమి! ఎక్కడకు వెళ్ళుదును? ఏమి చేయుదును? నా వద్ద ధనము, బలము, బంధువులు, ఐశ్వర్యము అన్నియును లుప్తమయినవి. నేను మిక్కిలి దీనస్థితి యందు యుంటిని. ఈ కన్యామణులు కాకతాళీయ న్యాయము చే ఈ గృహము నందు జన్మించిరి. అందువలన ఈ కన్యలను ఏదేని బలవంతుడయిన రాజునకు గానీ, మిక్కిలి ధనవంతునకు గానీ, అర్పింతును. అందువలన ఈ కన్యలయినా సుఖింతురు.

ఇట్లు నిశ్చయించుకొని ఆయన తగిన వరుని కొరకు వేచి యుండెను. ఆ సమయమున తీర్ధయాత్రలు చేయుచూ "జయుడు" అని నామధేయము గల ఒక వృద్ధ గోపకుడు మధురామండలము నుండి ఈ నగరమునకు ఏతెంచెను. ఆతడు ప్రసంగ వశమున మంగళ గోపునకు నందరాజు యొక్క వైభవమును వర్ణించెను. దీనత్వము చే మిక్కిలి పీడితుడయిన మంగళుడు తన సౌందర్యవతులయిన కుమార్తెలను నందరాజు గృహమునకంపెను. వారందరూ నంద గృహమునకు ఏగి అచట మిక్కిలి ఆదరింపబడి రత్న భూషణములచే సత్కరింపబడిరి. ఆ కన్యకలు నందుని గోష్ఠము నందు గోవుల సేవ చేయుచూ పరమ సుందురుడయిన మదన మోహనుని గాంచిరి.

వారందరికీ పూర్వజన్మ స్మృతి కలిగి, వారందరూ శ్రీకృష్ణ ప్రాప్తికై నిత్యము యమునా పూజనము చేయ మొదలిడిరి. కొంత కాలము అయిన పిదప వారికి విమలలోచన, శ్యామలాంగి అయిన యమున దర్శనమిచ్చి, వరము కోరుకొనమనెను. వారందరూ ముక్తకంఠమున "శ్రీకృష్ణుడు పతిగా కావలెను" అను వరమడిగిరి. యమున తధాస్తు అని పలికి అంతర్ధాన మయ్యెను. ఆ కన్యలందరూ ఒకనాటి రాత్రి కార్తీక పూర్ణిమా పుణ్య సమయమున రాసమండలము చేరిరి. వారితో శ్రీహరి దేవాంగనలతో పురంధరుడు విహరించునట్లు దివ్యరాసలీల గావించెను.

(శ్రీ గర్గసంహిత యందు మధురాఖండము నందలి నారద బహుళాశ్వ సంవాదము నందు ఋషిరూప గోపికల ఉపాఖ్యానము అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(మైధిలీరూప గోపికల ఆఖ్యానము. వస్త్రాపహరణ లీల మరియు వరదానము)

నారదుడు "మిధిలేశ్వరా! తదుపరి నీకు మిధిలాదేశ గోపికల ఆఖ్యానము వివరించెదను. దీని వలన దశాశ్వమేధ తీర్థము నందు స్నానము చేసిన పలితము లభించును, మరియు మిక్కిలి శ్రీకృష్ణ భక్తిని పెంపొందించును. శ్రీరామ చంద్రుని వర ప్రభావము వలన నవ నందుల ఇంట జన్మించిన మైధిలీరూప గోప కన్యలు అందరూ నందనందనుని పరమ కమనీయ రూపమునకు ముగ్ధులయి ఆయనను మోహించిరి. వారందరూ మార్గశీర్ష మాసము నందు కాత్యాయినీ వ్రతమాచరించుటకు నిశ్చయించుకొని మట్టితో ఆ దేవీ విగ్రహమును చేసి పూజించుట ఆరంభించిరి. ప్రతిదినము ఆరుణోదయ వేళ వారందరూ కలసి భగవానుని గుణగానము చేయుచూ యమునా జలములందు స్నానాదులు కావించుచుండిరి. ఒకనాటి దినము ఆ యువతీమణులందరూ తమ దుకూలము లన్నింటినీ, యమునాతీరము నందు యుంచి, జలములందు ప్రవేశించి ఒకరిపై ఒకరు జలములు ప్రోక్షణ చేసికొనుచు జల విహారము సలుపసాగిరి.

ప్రాత:కాలమున భగవానుడు శ్యామసుందరుడు అచటకు ఏతెంచి, వారి వస్త్రములు అపహరించి అచట గల కదంబ వృక్షమును ఎక్కి నిశ్శబ్దముగ కూర్చుండెను. అంత జల క్రీడలు ముగించిన గోప సుందరీమణులు తమ దుకూలములు కానక విస్మితులై అటునిటు చూచుచు చివరకు కదంబ వృక్షమున కూర్చొని యున్న మదనమోహనుని గాంచి లజ్జితులయిరి. అంత చెట్టు కొమ్మపై కూర్చొన్న శ్రీకృష్ణుడు వారితో "మీరు అందరూ ఎవరి వస్త్రములు వారు తీసికొనవలసినది" అని పలికెను. గోపికలు సిగ్గు వలన అవనిత శిరస్కులై నవ్వుచు ఇట్లనిరి "ఓ! మనోహర నంద నందనా!! గోపరత్నా! గోపాల చూడామణీ! గొప్ప ఆపదలను సహితము పరిహరించు శ్యామసుందరా! మేము మీ ఆజ్ఞను శిరసావహింతుము. మేము నీ దాసులమయినప్పటికీ వస్త్రహీనులమై ఎట్లు యుండగలము? నీవు గోపికావస్త్రాపహారి మరియు వెన్నదొంగ. వ్రజభూమి యందు జన్మించిన మహా రసికులు. భయము మిమ్ములను తాకలేదు. దయచేసి మా వస్త్రములు మాకు ప్రసాదింపవలసినది. లేని యెడల మేము మధురానరేశుని వద్ద మీ అవినయ చర్య పట్ల పిర్యాదు చేయగలము." శ్రీకృష్ణుడు "సుందర దరహాస శోభిత గోపికలారా! మీరు నా దాసిలు అయిన యెడల ఈ కదంబ వృక్షము వద్దకు వచ్చి కాలయాపన లేకుండ మీమీ వస్త్రముల ను తీసికొనవలసినది. లేనియెడల ఈ వస్త్రములన్నింటినీ తీసికొ ని నేను నా స్వగృహమునకు ఏగెదను."

అంత వ్రజవాసినులయిన ఆ గోపికలు చల్లని నీటి నుండి కంపించుచు, బయటకు వచ్చి, వినమ్రులై, తమ గుప్త స్థానములను చేతులతో కప్పుకొని శ్రీకృష్ణుని చేతుల నుండి వారి వారి వస్త్రములు గైకొని ధరించిరి. అనంతరము వారందరూ సిగ్గుపడుచు, శ్రీకృష్ణుని చూచుచు మోహితులయిరి. వారి ప్రేమాన్విత అభిప్రాయమును గ్రహించిన శ్రీహరి వారిని కరుణించి నలువైపుల నుండి దృష్టిపాతము నొనర్చి, ఇట్లనియె. "గోపాంగనలారా! మీరందరూ నా ప్రాప్తికి మార్గశీర్ష మాసము నందు కాత్యాయినీ వ్రతమాచరించిరి. అది సఫలీకృతమయినది. మీ అందరితో రాసలీల గావించెదను. మీ మనోరథము పూర్ణమగును". ఇట్లు పలికి పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీహరి వెడలెను. గోపకాంతల ఆనందమునకు అవధులు లేవు. వారందరూ హర్షోల్లాసితులై, సుందర వనములందు మందహాసము ప్రతిబించుచుండగా తమ తమ గృహములకు మరలిరి.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి మైధిలీరూప గోపికల ఉపాఖ్యానమను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(కోసల దేశపు స్త్రీలు వజ్రభూమి యందు గోపికలుగ రూపాంతరము చెందుట. శ్రీకృష్ణుని అనన్య భక్తిచే ప్రేమించుట)

నారదుడు "మిధిలేశ్వరా! తదుపరి కోసల దేశపు గోపికల వృత్తాంతమును వినవలసినది. ఈ శ్రీకృష్ణ చరితామృతము సమస్త పాపనాశనము మరియు పుణ్యజనకము. కోసల ప్రాంతపు స్త్రీలు శ్రీ రామచంద్రుని వర ప్రభావము చే వ్రజభూమి యందు తొమ్మిది ఉపనందుల ఇండ్ల యందు జన్మించిరి. పిదప వారికి వ్రజభూమి యందలి ఇతర గోపకులతో వివాహము జరిగినది. వారందరూ పూర్ణ చంద్ర బింబానలలు, రూప యవ్వన సంపన్నులు, రత్నమయ ఆభూషణా విభూషితులు, అయిన పద్మినీ జాతి స్త్రీ రత్నములు. వారి నడక హంస గమనములు, వారి విశాల నేత్రములు ప్రఫుల్ల కమలదళములను పోలి యుండెను. వారందరూ కమనీయుడు, పరమాత్ముడు అయిన నందనందనుడు శ్రీకృష్ణుని యందు మిక్కిలి దృఢమయిన ప్రేమబంధము కలిగియుండిరి. వ్రజ వీధుల యందు మాధవుడు వారి మేలి ముసుగులు లాగుచు, హాస పరిహాసములు గావించువాడు. ఈ గోప బాలికలు పెరుగు నమ్ముటకు బయలుదేరి పెరుగునకు బదులు "కృష్ణా! కృష్ణా!" అని పలుకువారు. శ్రీకృష్ణుని యందు పెరిగిన ప్రేమాసక్తి వలన వారు కుంజమండలము లందు ఆయనను వెదుకుచూ తిరుగువారు.

వారు ఆకాశము, వాయువు, అగ్ని, జలము, పృధివి, నక్షత్ర మండలము, సర్వదిశలు, వృక్షములు, మరియు సమస్త జన సముదాయము నందు కేవలము శ్రీ కృష్ణునే చూచెడివారు. మూర్తీభవించిన ప్రేమ లక్షణములు వారియందు ప్రస్ఫుటముగ కానపట్టెను. శ్రీకృష్ణుడు వారి మనసులను సంపూర్ణముగ హరించెను. వారు ప్రేమ యొక్క ఎనిమిది సాత్విక భావములతో (హృదయము నందు విచలత్వము, శరీరము నందు కంపనము, స్వేదము, రోమాంచము, కంఠమునందు గద్గదము, ముఖము నందు కాంతి తగ్గుట, నేత్రముల నుండి భాష్పములు, మరియు మరణాంతక మయిన తీయని బాధ) పరిపూర్ణముగ నిండియుండిరి. శ్రీకృష్ణుని యందు ఈ విధమయిన ప్రేమ వారిని బ్రహ్మనిష్ఠాగరిష్ఠులయిన మహాత్ముల స్థాయికి చేర్చినది. ఆ దివ్యకాంతియుతలయిన గోపాంగనలు శ్రీకృష్ణా నందము నందు సంపూర్తిగ నిమగ్నులై వ్రజ వీధుల యందు తిరుగనారంభించిరి. వారికి జడము, చేతనమను ద్వంద్వములు తెలియకున్నవి. వారు ఒకప్పుడు, జడులు, ఉన్మత్తులు, మరియు పిశాచములు వలె మౌనముగ యుందురు. మరియొక తూరి విపరీతముగ సంభాషించెదరు.

వారు స్త్రీ సహజమయిన సిగ్గు, లజ్జ, మరియు చింత మొదలగు అవస్థలను పూర్తిగా విడనాడిరి. ఇట్లు ఈ గోపాంగనలు సామాన్య సమాజ వ్యవహారములకు తిలాంజలులు వదలి, అవధూతల వలే కృతార్థులై, శ్రీకృష్ణుని యందు తన్మయలై, నిరంతరము ముకుందుని తమ హృదయము లందు బంధించిరి. వీరి తపస్సును వర్ణించుట సహస్రముఖుడయిన ఆదిశేషునకయిననూ అసాధ్యము.

విదేహరాజా! న్యాయ, వైశేషికాది శాస్త్ర దర్శనము నందు శ్రేష్ఠులు, యోగ, సాంఖ్యాది ప్రక్రియల యందు నిష్ణాతులయిన మహితాన్వితులు, శుద్ధ కర్మల ద్వారా పాప విదూరులయిన మహాత్ములు ఎట్టి పరమపదమును ప్రాప్తించెదరో అట్టి పదము కేవలము శుద్ధభక్తిచే సుసాధ్యము. ఆదిదేవుడయిన శ్రీహరి కేవలము భక్తవశుడు. నిశ్చయముగా ఈ విషయమునకు గోపికలే ప్రమాణము. వారు యోగము, సాంఖ్యము మొదలగు ఏ విధమయిన సాధనలు చేయలేదు. కేవలము నిర్మల భక్తిచే ఈ గోపాంగనలు భగవత్ స్వరూప ప్రాప్తినొందిరి.

(శ్రీ గర్గసంహిత యందు గిరిరాజ ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి కోసల ప్రాంత గోపికల ఆఖ్యానము అను నాలుగవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(అయోధ్యవాసినీ గోపికల ఆఖ్యానము. విమల మహారాజు సంతానము కొరకై చింతించుట. యాజ్ఞవల్క్య మహాముని ద్వారా ఆయనకు అనేక మంది పుత్రికలు కలుగుదురు అని ఆశ్వాసన పొందుట)

నారదుడు "మహారాజా! ఇపుడు ఆయోధ్యా వాసినీ గోపికల వృత్తాంతమును వినుము. ఈయది చతుర్విధ పురుషార్థములను ఇచ్చునది. సాక్షాత్ శ్రీకృష్ణ ప్రాప్తి యందు సర్వోత్కృష్ట సాధనము. సింధు దేశము నందు "చంపకము" అను నగరము కలదు. దానిని "విమలుడు" అను పరమ ధార్మికుడు అయిన రాజు పరిపాలించుచుండెను. ఆయన సింహ సదృశ బలశాలి, కుబేరుని తో తుల్యమయిన సంపన్నుడు, విశేషించి అత్యంత విష్ణు భక్తుడు, మరియు ప్రశాంత చిత్తుడు. ఆయన తన అనన్య భక్తిచే మూర్తీభరించిన ప్రహ్లాదుని రూపముగ కొనియాడబడెడి నాడు. ఆ భూపాలునకు ఆరు వేల మంది రాణులు కలరు. వారందరూ మిక్కిలి సుందరీమణులు కానీ దుర్భాగ్యవశమున వంధ్యలు. మహారాజు సకల సద్గుణ సంపన్నుడయినప్పటికీ సంతాన హీనత కారణమున తనకు ఏ పుణ్యవశమున సంతానము కలుగునని ఆలోచించుచు బహుకాలము గడిపెను.

ఒకనాడు ఆయన వద్దకు సర్వలోక వంద్యుడు, ముని ప్రముఖుడు, యాజ్ఞవల్క్యుడు ఏతెంచెను. మహారాజు ఆయనకు యధావిధిగా పూజ ప్రణామము లాచరించి, ఆయన ఎదుట వినీతుడై నిలిచెను. నృప శిరోమణి అయిన విమలుడు చింతా, వ్యాకుల చిత్తుడై యుండుట గమనించిన సర్వజ్ఞుడు, శాంత స్వరూపుడు అయిన యాజ్ఞవల్క్య మహాముని ఇట్లనియె "మహారాజా! నీ రాజ్యమంతయు ప్రశాంతముగ సుభిక్షముగ యున్నది కదా! అయిననూ నీవు దుర్బలుని వలె కానిపించు చున్నావు. నీ హృదయమును పీడించుచున్న చింత ఏమి? నాకు తెలుపవలసినది." అంతట మహారాజు "మహానుభావా! మీరు సర్వజ్ఞులు. మీ అనితర తపస్సంపదచే, దివ్యదృష్టిచే, సర్వమును గ్రహించగలరు. కానీ అనుల్లంఘనీయమయిన మీ ఆజ్ఞను పురస్కరించుకొని నా హృదయశల్యమును విన్నవించెదను. మునీశ్వరా! నేను సంతాన హీనత చే మిక్కిలి దు:ఖితుడనై యుంటిని. నేను సత్సంతానమును పొందుటకు ఎటువంటి తపోదానములు చేయవలెను?" విమలుని పలుకులు విని యాజ్ఞవల్క్యుడు కొంత తడవు ధ్యానమగ్నుడై భూత, భవిష్యత్, వర్తమానములను వీక్షించి ఇట్లు బదులిచ్చెను. "రాజేంద్రా! ఈ జన్మము నందు నీకు పుత్ర భాగ్యము లేదు. కానీ నీకు వేలకొలది పుత్రికలు ఉదయించెదరు." అంత మహారాజు "మునీంద్రా! పుత్రులు లేని యెడల మనుష్యులు పితృ ఋణము నుండి విముక్తులు కాలేరు."

"పుత్రహీన గృహములందు వ్యథలు ఎల్లప్పుడూ నివాసముండును. ఆ మనుష్యునకు ఇహ, పర లోకములందు సుఖలేశము సహితము లభింపదు." ఋషి "రాజేంద్రా! బాధపడవలదు. భవిష్యత్తులో శ్రీకృష్ణ భగవానుడు అవతీర్ణుడగును. నీ పుత్రికలందరినీ ఆయనకు సమర్పింపుము. నీవు దేవతా, ఋషి, పితృ ఋణము నుండి విముక్తుడవగుటయే కాక వారందరకు దుర్లభమయిన మోక్షమును పొందెదవు." యాజ్ఞవల్క్యుని దివ్యవచనములు వినిన విమలుడు మిక్కిలి ఆనందమును పొంది తిరిగి ఇట్లు ప్రశ్నించెను, "మునీశ్వరా! ఎన్ని సంవత్సరములు తరువాత ఏ దేశము, కులమునందు శ్రీకృష్ణుడు అవతరించును? ఆ సమయము నందు ఆ భగవానుని గుణ, రూప, విశేషములు ఎట్లుండును?"

యాజ్ఞవల్కుడు "మహాబాహూ! ఈ ద్వాపర యుగాంతమున, నీ రాజ్యకాలము నూట పదిహేను సంవత్సరములు గడచిన పిమ్మట యాదవ పురమయిన మధురా నగరమున యదుకుల యందు భాద్రపదమాసము, కృష్ణపక్షము, బుధవారము, రోహిణీ నక్షత్రమందు, హర్షణ యోగము, వృషలగ్నమందు నవకరణము మరియు అష్టమీ తిథి యుండగా, వసుదేవ భవనము నందు దేవకీ గర్భమున సాక్షాత్ శ్రీహరి యజ్ఞము నందు అరణి మథించినపుడు ఉత్పన్నమగు అగ్ని వలె ఆవిర్భవించును. భగవానుడు వక్షస్థలమందు శ్రీవత్సశోభితుడై, మేఘశ్యామల శరీర కాంతియుతుడై, వనమాలాలంకృతుడై, చతుర్భుజుడై, పీతాంబరధారియై, కమలనయనుడై ఒప్పారును. ఓ! మహారాజా! విమలా!! నీవు అప్పటి వరకు జీవించియుందువు. సందేహము లేదు."

(శ్రీ గర్గసంహిత యందు మాధుర్య ఖంగార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి అయోధ్యా వాసినీ గోపాంగనల ఉపాఖ్యానమను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(అయోధ్యా వాసినీ స్త్రీలు విమల మహారాజు ఇంట పుత్రికలుగ జన్మించుట. వారి వివాహ నిమిత్తము విమలుడు మధురానగరమునకు దూతను పంపుట. అక్కడ శ్రీకృష్ణుని కానక భీష్ముని ప్రశ్నించుట, మరియు భీష్ముని ద్వారా శ్రీకృష్ణుని అవతార రహస్యము తెలిసికొని శ్రీకృష్ణుని వద్దకు దూతను పంపుట)

నారదుడు "మహారాజా! సర్వజ్ఞుడు, మహాముని యాజ్ఞవల్క్యుడు ఈ విధముగ ప్రవచించి వెడలిపోయెను. తదుపరి మహారాజు విమలునికి తన రాణులందు అనేక మంది పుత్రికలు ఉదయించిరి. అయోధ్యా వాసినీ స్త్రీలు శ్రీరామ చంద్రుని వరదానము చే విమల నందినిలుగ జన్మించిరి. ఆ రాజకన్యలందరూ సుందర తరుణీ మణులు. నెమ్మదిగ కాలము గడచుచుండగా ఆ యువతీ మణులు తరుణ వయస్కులయిరి. మహారాజు విమలుడు వీరి వివాహ యోగ్యత గమనించి యాజ్ఞవల్క్యుని పలుకులు మదిని మొదలు చుండగా ఒక దూతను పిలిచి ఇట్లనెను "దూతా! నీవు శీఘ్రమే మధురా నగరమునకు ఏగి అచట శూరశేనుని పుత్రుడయిన వసుదేవుని ఇంట సుందరమయిన పుత్రుడు కలడేమో విచారించుము. ఆ యువకుడు వక్షస్థలమున శ్రీవత్సమను పుట్టుమచ్చ, నీలిమేఘము వంటి శరీరఛాయ కలిగి వనమాలా ధారియై చతుర్భుజుడై ఒప్పారుచుండును. నీవు అట్టి యువకుని కనుగొందువేని, నా సమస్త పుత్రికా రత్నములను ఆయనకు సమర్పించెను".

అంత ఆ దూత మధురా నగరమునకేగి, వివిధ రీతుల వసుదేవ సుతుని గూర్చిన సమాచారము సేకరింప మొదలిడెను. ఆతడు మధురానగరము నందలి అనేక ప్రముఖులను కలసి సంభాషించెను. వారందరూ కంస భయమున ఆ దూతను ఒక ఏకాంత ప్రదేశమునకు తీసికొని వెళ్ళి అతి రహస్యముగ ఇట్లనిరి – "వసుదేవునకు అనేక మంది పుత్రులు కలిగిరి, కానీ వారందరూ కంసుని చే చంపబడిరి. ఆయనకు ఒక కన్య కూడా ఉదయించెను. కానీ ఆమె సహితము ఆకాశమునకు ఎగసెను. వసుదేవుడు మధుర యందే నివసించుచుండెను, కానీ పుత్ర వియోగము చే మిక్కిలి దు:ఖితుడై యుండెను. ఈ సమయము నందు నీవు మమ్ములను ప్రశ్నించిన విషయములను మరెవరి వద్దనూ ప్రస్తావింప వలదు. అందరకూ కంస భయము మిక్కుటముగ కలదు. మధురాపురము నందు ఎల్లరునూ వసుదేవుని సంతానము విషయమై మౌనము వహించెదరు, ఎందుకనగా ఆతని ఎనిమిదవ సంతానము కంసుని సంహరించునని లోక ప్రతీతి."

జన ప్రాచుర్యము పొందిన ఈ విషయము లన్నియు సేకరించి, దూత చంపకపురికి తిరిగి వెళ్ళి మహారాజు విమలునికి ఈ విధముగ నివేదించెను "మహారాజా! మధుర యందు శూరపుత్రుడయిన వసుదేవుడు అవశ్యము కలడు. కానీ సంతానమును పోగొట్టుకొనిన కారణమున ఆయన అత్యంత దీనస్థితి యందు యుండెను. ఆయనకు అనేకమంది పుత్రులు కలిగిరి కానీ వారందరూ కంసుని చేత హతులైరి. ఆయనకు ఒక పుత్రిక సహితము పుట్టినది, కానీ కంసుడు సంహరించు సమయమున ఆమె ఆకాశమునకెగసి అదృశ్యమయినది. ఈ వృత్తాంతమును మధురా నగరమందు విని, నెమ్మది నెమ్మదిగ, రహస్యముగ అచట నుండి బయటకు వచ్చితిని. కానీ మార్గమధ్యమున నాకు ఒక అద్భుతము కనిపించినది. బృందావన సమీపమున, నేను సుందర కాళిందీ తీరమున సంచరించు సమయమున అకస్మాత్తుగ గోపబాలుర మధ్య ఒక అసామాన్య బాలకుని చూచితిని. ఆ బాలునకు వక్షస్థలమందు శ్రీవత్స చిహ్నము కలదు. అతడు వనమాలాయుతుడై, నీలి మేఘశ్యామల శరీరకాంతితో విరాజిల్లు చుండెను. కానీ ఆ బాలునకు కేవలము రెండు చేతులు మాత్రమే యున్నవి, చతుర్భుజుడు కాడు. మీరు వసుదేవ తనయుడగు శ్రీహరి చతుర్భుజుడని వక్కాణించిరి. నరేశ్వరా! ముని వాక్యము పొల్లుపోదు. దయచేసి నాకు తదుపరి కర్తవ్యమును సెలవీయ వలసినది."

మహారాజు విమలుడు విస్మితుడై, ఆలోచన నిమగ్నుడైయుండగా, సింధు దేశమును జయించుటకై హస్తిన నుండి భీష్ముడు విమలుని వద్దకు ఏతెంచెను. అంత విమలుడు భీష్ముని వినయముగ ఇట్లు ప్రశ్నించెను "బుద్ధిమంతుల యందు

శ్రేష్ఠుడవయిన దేవవ్రతా! భీష్మా!! పూర్వము యాజ్ఞవల్క్యముని శ్రీహరి వసుదేవ సుతుడై దేవకీ గర్భమున ఉదయించునని సెలవిచ్చెను. కానీ ఈ సమయమున అటువంటి చిహ్నము లేవియును కానరాకున్నవి. ఋషి వాక్యము అసత్యమగుట అసాధ్యము. కానీ నా కన్యలందరినీ నేను ఎవరికి కన్యాదానము చేయుదును! భీష్మాచార్యా! మీరు పరమ భాగవతోత్తములు, మరియు పూర్వాపరములను విచారించుట యందు నేర్పరులు. మీదు మిక్కిలి యవ్వన దశనుండి అమిత ఇంద్రియ నిగ్రహులు, ధనుర్ధారుల యందు అగ్రేసరులు, మరియు వసువుల యందు శ్రేష్ఠులు. అందువలన నాకు కర్తవ్యమును నిర్దేశింప వలసినది." భీష్ముడు "మహారాజా! నేను వేదవ్యాస ముని ముఖతా వినియున్న ఒక గుప్త విషయము కలదు. ఈ ప్రసంగము సర్వ పాపహరము, పుణ్యకారకము మరియు హర్ష వర్ధకము. పరిపూర్ణ భగవానుడుయిన శ్రీహరి దుష్ట శిక్షణకు, శిష్ఠ రక్షణకు, వసుదేవ గృహము నందు అవతీర్ణుడాయెను. కానీ కంసుని భయము చే వసుదేవుడు ఆ శిశువును అర్ధరాత్రి సయమమున గోకులమునకు తీసికొని వెళ్ళి, యశోదాదేవి శయ్యపై పరుండబెట్టి ఆచటగల యోగ మాయను తీసికొని వెనుకకు మధురానగరము చేరెను."

" ఈ విధముగ శ్రీకృష్ణుడు గోకులము నందు గుప్తముగ పెరుగుచుండెను. ఆయన పన్నెండు సంవత్సరముల వరకు గోకులము నందు గుప్తముగ పెరిగి అటు పిదప దైత్యుడయిన కంసుని వధించి, అపుడు వసుదేవ సుతునిగ ప్రకటింపబడును. అయోధ్యాపుర వాసినులయిన స్త్రీలు శ్రీరామచంద్రుని వర ప్రభావమున మీ పత్నుల యందు ఉదయించిరి. నీవు ప్రస్తుతము గూఢరూపమున యన్న దేవాధిదేవుడు అయిన శ్రీకృష్ణునకు నీ సమస్త కన్యలను అర్పింపుము. ఈ శరీరము కాలాధీనము. అందుచే నీవు క్షణము సహితము విలంబన చేయక వెంటనే ఈ శుభ కార్యమును నిర్వర్తింపుము." ఈ విధముగ పలికి ధర్మజ్ఞుడయిన భీష్ముడు హస్తినకు పయనమయ్యెను. అంత విమల మహారాజు నంద నందనుని వద్దకు తన దూతను పంపెను.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండాగ్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందు అయోధ్యా పుర వాసినీ గోపికల వృత్తాంతమను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(విమల మహారాజు సందేశము విని శ్రీ కృష్ణ భగవానుడు అయనకు దర్శనము, మోక్షము ఇచ్చుట, తదుపరి ఆయన పుత్రికలందరితో వ్రజభూమికి ఏగుట)

తదనంతరము విమలుని దూత వ్రజ మండలమునకు ఏతెంచి యమునా తటము నందు శ్రీకృష్ణ దేవుని దర్శించి, ఒక ఏకాంత సమయమున ఆయనకు ప్రణామములు ఆచరించి, పరిక్రమ కావించి, చేతులు జోడించి విమలుని సందేశమును వినిపించెను "ఎవరు స్వయముగ పరబ్రహ్మ పరమేశ్వరులో, సర్వులకు పరులు మరియు అదృశ్యులో, ఎవరు కేవలము సాధుపుంగవులకు మాత్రమే దర్శనీయులో, ఇటువంటి శ్రీకృష్ణ భగవానునికి నమస్కారము. ఎవరు జన్మ తీసికొన వలసిన అవసరము లేనప్పటికీ దేవతా, గో, బ్రాహ్మణ, వేద, సాధు మరియు ధర్మ పరిరక్షణకు, కంసాది దైత్యుల వధించుటకు, యదుకులము నందు ఉత్పన్నమయిన అనంత గుణసాగరుడయిన శ్రీహరికి నమస్కరించు చున్నాను. అహా! ఈ వ్రజవాసుల సౌభాగ్యమేమని చెప్పుదును? మీ తండ్రి అయిన నందరాజు కులము ధన్యము. ఈ వ్రజమండలము, బృందావనము ధన్యము. ఎందుకనగా ఇచట పరమ పురుషుడయిన శ్రీహరి ప్రకటిత మయ్యెను. ప్రభూ! మీరు శ్రీరాధాదేవి కంఠము నందలి సుందర నీలి మణిమయ హారము. మీ నిర్మల యశము సుగంధ భరిత కస్తూరి వలె సర్వ లోకములు వ్యాప్తించి ఆహ్లాదభరితమై యున్నది. మహానుభావా! మీరు సర్వ జీవుల కర్మసాక్షి, మరియు సర్వ జీవుల యందు వెలుగొందు ఆత్మజ్యోతి. అందుచే మీకు సర్వజీవుల చిత్తము లందలి అభిప్రాయములు కరతలా మలకములు. అయిననూ సింధురాజు విమలుడు ఒక పరమ రహస్యము మరియు స్వసంబంధితము అయిన ఒక విషయమును మీకు విన్నవించుటకు నన్ను

పంపెను.

సింధు దేశము నందు అమరావతి వలె శోభించు "చంపకము" అను నగరము కలదు. అద్దానిని ఇంద్రతుల్య వైభవము గల విమల మహారాజు పరిపాలించు చుండెను. ఆయన చిత్తవృత్తులన్నియును, సర్వము మీ పదార విందములయందే లగ్నమయి యున్నవి. మీ ప్రసన్నత కొరకై ఆయన అనేక తపో, దాన, యజ్ఞ, బ్రాహ్మణసేవ మరియు తీర్ధ సేవనాది కార్యక్రమములు ఆచరించెను. ఆ పుణ్య కార్యములను నిమిత్తము గా చేసికొని మా మహారాజు కు దర్శనమీయ వలసినది. అంతేకాక మహారాజునకు అనేకమంది పుత్రికలు పూర్ణ చంద్ర బింబాననలు మరియు పద్మ దళాయతాక్షిణులు కలరు. వారందరూ పరిపూర్ణ పరమేశ్వరులైన మిమ్ములను పతిగా పొందుటకు ప్రతీక్షించుచుండిరి.

ఆ రాజకుమార్తెలందరూ మిమ్ములను పతిగా పొందుటకు వ్రత నియమాది పాలనా తత్పరులై యుండుట వలన వారి తనువు, మనస్సు పూర్తిగా నిర్మల మయినది. ఓ! వ్రజపతీ! మీరు తమ దర్శనము చే వారిని పునీతులు చేసి ఆ రాజకన్యలను పరిగ్రహింప వలసినది."

దూత యొక్క విన్నపమును వినిన శ్రీకృష్ణ భగవానుడు మిక్కిలి ప్రసన్నుడై, క్షణములో దూత సహితుడై చంపకపురి చేరెను. ఆ సమయమున విమల మహారాజు ఒక గొప్ప యజ్ఞము చేయుచుండెను. ఆ ప్రదేశమంతయు వేద సూక్తములతో మారు మ్రోగు చున్నది. దూత చే సహితముగ శ్రీకృష్ణ భగవానుడు ఆకాశము నుండి అవతీర్ణుడాయెను. శ్రీ వత్స శోభితుడు, నీలిమేఘ శ్యాముడు, వనమాలాలంకృతుడు, పీతాంబరధారి అయిన కమలనయనుని చూడగనే మహారాజు విములుడు లేచి ప్రేమ విహ్వలుడై, రోమాంఛుడై, ఆయన చరణముల పై వ్రాలెను. తిరిగి లేచి రత్నమయ సువర్ణ, దివ్య సింహాసనమున ఆ భగవానుని ఆశీనుని గావించి, ఆయనను స్తోత్రము చేసి, పూజనాచరించి ఆయన ఎదుట నిలబడెను. శ్రీకృష్ణుడు గవాక్షముల నుండి వీక్షించుచున్న రాకుమార్తెలను ఒక్కమారు చూచి మేఘ గంభీర స్వరము తో ఇట్లనియె "మహామతీ! నీ మనసు నందలి ఏ వాంఛ యైననూ అడుగ వలసినది. యాజ్ఞవల్క మహాముని వచనము వలెననే నేడు నీకు నా దర్శనము అయినది."

విమలుడు "దేవదేవా! నా మనస్సు ఎల్లప్పుడూ మీ చరణార విందములందు స్థిరముగ నివసించు గాక!! ఇది వినా నాకు వేరే విధమయిన అభిలాష లేదు." ఈ విధముగ పలికి విములడు తన సమస్త, ధన, కనక, వస్తు, వాహన వైభవములను శ్రీ కృష్ణార్పితము గావించెను. తనను తాను సహితము ఆయన పదములకు బహుమతిగ అర్పించుకొనెను. తన సమస్త కార్యకలాపములను విధి విధానముగ శ్రీహరికి సమర్పించి భక్తి విహ్వలుడై శ్రీకృష్ణునికి నమస్కరించెను. జనులు జయ జయ ధ్యానములు చేయచుండగా దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. తక్షణమే విమల మహారాజునకు సారూప్య మోక్షము లభించినది. శత సూర్యుల పగిది వెలుగుచూ కామదేవుని సౌందర్యము తో వెలుగొందుచు, దిశా మండలములను ఉద్భాసితము చేయుచూ సమస్త జన సమూహము చూచుచుండగా పత్నీ సహితుడై విమల మహారాజు గరుడ ధ్వజునకు నమస్కరించి, గరుడుని అధిరోహించి వైకుంఠాలయమునకు ఏగెను. ఈ విధముగ మహారాజునకు మోక్ష ప్రధానము గావించి, ఆ రాచ కన్నియలను తీసికొని భగవానుడయిన శ్రీహరి వ్రజమండలమునకు ఏగెను. ఆ సుందరీమణులందరూ కామ్యక వనము ప్రవేశించి, అందలి స్వర్గ సౌధములందు నివసించుచూ, భగవానుని తో కందుక క్రీడలు సలుపుచూ హృదయోల్లాసితులై ఒప్పుచుండిరి.

ఎంతమంది గోపికలు కలరో అంతమంది కృష్ణ రూపములు ధరించి భగవానుడయిన శ్రీకృష్ణుడు రాసమండలము నందు వారికి మనోరంజనము కావింపదొడంగెను. ఆ రాసమండలి మందు రాసక్రీడలు యందు మునిగి తేలుచున్న రాచ కన్యల కన్నుల నుండి వెలువడిన ఆనంద భాష్పములన్నియు కలసి విమలకుండముగ రూపాంతరము చెందినది. ఇప్పటికినీ విమలకుండము ఒక ఉత్కృష్టమయిన తీర్ధరాజము. మహారాజా! ఏ మానవుడు విమల కుండమును దర్శించి, అందలి నీరు త్రాగి, అచట స్నాన పూజాదికములు సలుపునో అతని పాపములు మేరు పర్వత సమానము లైనమా అవి దగ్ధమయి, ఆ జీవి గోలోకధామము చేరును. ఏ మనుష్యుడు అయోధ్యావాసిని గోపికలు యొక్క ఆఖ్యానమును వినునో, ఆతడు యోగి దుర్లభమయిన పరమధామము గోలోకము చేరును.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందు అయోధ్యా వాసినీ గోపికల ఉపాఖ్యామను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(యజ్ఞరూప సీతాస్వరూప గోపికలు ప్రశ్నించిన పిమ్మట శ్రీరాధాదేవి శ్రీకృష్ణుని ప్రసన్నము చేసికొనుటకై ఏకాదశీ వ్రతానుష్ఠానము, మరియు అద్దాని విధి విధానములు, మహత్మ్యమును వర్ణించుట)

నారద మునీంద్రుడు "మిథిలేశ్వరా! యజ్ఞ సీతా స్వరూప గోపికలను వర్ణించెదను. వినుము. ఈ ఆఖ్యానము సర్వ పాపహారము, పుణ్య దాయకము, కామనల పాలిటి పెన్నిధి, మరియు సమస్త సన్మంగళములకు ధామము. భారత వర్షమునకు దక్షిణ దిశయందు "ఉశీనర" మను ప్రసిద్ధ దేశము కలదు. ఒకానొక సమయమున దేవరాజు ఇంద్రుడు కినుక వహించి ఆచట పది సంవత్సరములు అనావృష్టి కలుగచేసెను. ఆ దేశమున గోధనము సమృద్ధిగా గల గోపకులు అనేకులు గలరు. వారందరూ అనావృష్టి భయముచే, వ్యాకుల చిత్తులై తమ ధన, కుటుంబ సమేతులై వ్రజమండలమునకు ఏతెంచి సుందర సురమ్య యమునా తటము నందు నివసించుట ప్రారంభించిరి. శ్రీరామ చంద్రుని వర ప్రభావముచే యజ్ఞసీతలందరూ ఆ గోపకుల ఇండ్ల యందు జన్మ మొందిరి. ఆ సుందరీమణులందరూ దివ్య యవ్వన సంపన్న విభూషితులు. ఒకానొక దినము వారందరూ శ్యామసుందరుని దర్శించి, ఆయన దివ్య మోహన రూపమునకు మోహితులై, శ్రీకృష్ణ పరమాత్ముని ప్రసన్నము చేసికుందుకు ఏదేని వ్రతమును తెలుపమని అడుగుటకు శ్రీరాధాదేవి వద్దకు ఏగిరి. వారందరూ "దివ్య స్వరూపా! కమల లోచనా! వృషభాను నందినీ! శ్రీరాధా! నీవు విశ్వ మోహినివి. సంపూర్ణ శాస్త్రార్థ జ్ఞానములందు పారంగతురాలివి. దేవతలకు సహితము దుర్లభమయిన శ్రీ నంద నందనుడు నీ వశము నందుండును. అందువలన శ్రీకృష్ణుని ప్రసన్నము చేసికొందుకు ఏదేని శుభవ్రతమును తెలియజేయ వలసినది." శ్రీరాధాదేవి "ప్రియతోబుట్టువులారా! శ్రీకృష్ణుని ప్రసన్నము చేసికొనుటకు ఏకాదశీ వ్రతము ఆచరింప వలసినది. దీని వలన శ్రీహరి తప్పక మీ వశము నందుండును. సందేహము లేదు." గోపికలు "శ్రీరాధికా! సంవత్సరము నందు పూర్తిగా వచ్చు ఏకాదశుల పేర్లు ఏమి? ప్రతి మాసము నందు ఏకాదశీ వ్రతము ఏ ప్రభావము తో చేయవలెను?" శ్రీ రాధాదేవి "గోపకుమారీ మణులారా! మార్గశీర్ష మాసము కృష్ణ పక్షము నందు విష్ణు భగవానుని ముఖము నుండి ఆసురులను అంతమొందించుటకు ఏకాదశీ తిథి ఉత్పన్నమయినది. అందువలన ఏదాకశి అన్య తిథుల కంటె మిక్కిలి శ్రేష్ఠము. ప్రతి మాసము నందును ఏకాదశి మరల, మరల వచ్చుచునే యండును. ఏకాదశీ వ్రతము అన్ని వ్రతముల కంటె ఉత్తమము.

నేను మీ అందరి హితమునకై ఆ ఇరువది ఆరు ఏకాదశుల నామములు ఉటంకించెదను.

మాసము	శుక్ల ఏకాది	కృష్ణ ఏకాది
చైత్రము	కామదా	అపరా
వైశాఖము	మోహినీ	యోగినీ
జేష్ఠము	నిర్జల	కామినీ
ఆషాదము	దేవశయనీ	అజ
శ్రావణము	పవిత్ర	ఇందిర
భాద్రపదము	పద్మ	రమా

ఆశ్వాయుజము	**పాపాంకుశ**	**ఉత్పన్న**
కార్తీకము	**ప్రభోదినీ**	**సఫల**
మార్గశీర్షము	**మోక్ష**	**షట్తిలా**
పుష్యము	**పుత్రద**	**విజయ**
మాఘము	**జయ**	**పాపామోచనీ**
ఫాల్గుడము	**అమలకీ**	**పరూధినీ**

రెండు ఏకాదశీ తిథులు అధిక మాసము నందు వచ్చును. వాటినీ "సర్వ సంపద్ప్రదా" అని పేర్కొందురు. ఎవరు ఈ ఇరువది ఏకాదశుల నామముల పఠింతురో వారు పూర్ణ వర్షము ఏకాదశీ వ్రతము ఆచరించిన పలితమును పొందెదరు.

"వ్రజాంగనలారా! ఇపుడు ఏకాదశీ వ్రత నియమములకు వినవలసినది. దశమి నాడు ఒక్కపూట భోజనమునొనర్ప వలెను. ఆ రాత్రి భూశయనము చేయవలెను. జలపానము సహితము ఒక్కమారు మాత్రమే స్వీకరింప వలసినది. ఉతికిన వస్త్రములు ధరించి మనశ్శరీరముల యందు నిర్మలముగ యుండవలెను. ఏకాదశీ దినమున బ్రహ్మ ముహూర్తమున లేచి శ్రీహరి చరణారవిందములకు ప్రణామము లాచరించి శౌచకర్మములు ఆచరింప వలెను. నూతి వద్ద స్నానము నిమ్నకోటికి చెందినది. దిగుడు బావి యందు స్నానము మధ్యమము. చెరువుల యందు స్నానము ఉత్తమము. నదీ స్నానము అత్యుత్తమము. ఈ విధముగ స్నాన విధి ఆచరించిన మానువుడు క్రోధ, లోభములను విడనాడి నీచులు, పాఖండులు, అసత్యవాదులు, దురాచారులు, పరస్త్రీ లోలులు, సద్బ్రాహ్మణులను నిందించువారు, పరధానపహారులు, మొదలగు దుర్వర్తనులతో సంభాషణమును పూర్తిగా నిరోధించ వలెను. హరి మందిరమున కేశవ పూజనము చేసి, దీప దానము సలిపి, పురాణ శ్రవణము చేసి, పౌరాణికునకు దక్షిణ యెసంగి, రాత్రి అంతయు జాగరణ చేసి, ఆ సమయమున విష్ణు కీర్తన చే కాలము గడుపవలెను.

ఏకాదశీ వ్రతము చేయవలెనన్న దశమి నాడు ఈ పది పదార్థములను విడువ వలెను. "కాంస్య పాత్రలు, మాంసము, పప్పు, అరికె ధాన్యము, శనగలు, ఆకుకూరలు, తేనె, పరాయి అన్నము, రెండవసారి భోజనము, మైధునము."

ఏకాదశీ నాడు ఈ పదకొండు కార్యములు నిషిద్ధములు–"ద్యూత క్రీడ, నిద్ర, మధ్యపానము, దంత థావనము, పరనింద, చాడీలు చెప్పుట, దొంగతనము, హింస, రతి, క్రోధము, మరియు అసత్య భాషణము."

ద్వాదశి నాడు వర్జింప వలసిన పదార్థముల. –"కాంస్య పాత్రలు, మాంసము, తేనె, వంటనూనె, మిథ్యా భోజనము, అన్నము, పిట్టీ.

గోపికలు "పరమ బుద్ధిమతీ! శ్రీ రాధాదేవి! ఏకాదశీ వ్రత సమయము, మరియు ఫలితమును కూడ వర్ణింపవలసినది." శ్రీరాధ " దశమి ఏబది అయిదు ఘడియలు యున్న యెడల ఆ దినము ఏకాదశి కాదు. అటువంటి సమయమున ద్వాదశి నాడు కూడా ఉపవసించవలసినది. మదిర (సుర) యొక్క ఒక్క బిందువు గంగాజలము నందు పడిననూ ఆ జలము త్యాజ్యము. అట్లే ఒక్క క్షణము దశమి కలసిననూ ఆ ఏకాదశి త్యాజ్యము (విడిచి పెట్టవలసినది). ఏకాదశీ తిథులు ఒక రాత్రి గడచి మరుసటి దినము కొంత సమయము ఉన్ననూ, ఆ దినమునే (కొంచెము ఏకాదశి యున్న దినము) ఏకాదశిగ పరిగణింపవలెను. ముందురోజు ఉపవాస యోగ్యము కాదు.

"వ్రజాంగనలారా! నేను ఇపుడు ఏకాదశీ వ్రత ఫలమును చెప్పెదను. వినవలసినది. ఈ మహాత్మ్యము శ్రవణ మాత్రమున "వాజపేయ యజ్ఞము" చేసిన ఫలితము లభించును. ఏకాదశీ వ్రతమాచరించు మానవునకు ఎనభై ఎనిమిది వేల బ్రాహ్మణులకు భోజనమిడిన ఫలితము లభించును. సాగర వలయుత, వన సహిత వసుంధరా దానము నిచ్చుట

వలన ఎంత ఫలితము లభించునో దానికి వేయి రెట్లు ఫలితము ఏకాదశీ వ్రతాచరణము వలన లభించును. ఈ పాప పంకిలమయిన సంసార సాగరము నందు పూర్తిగా మునిగిన మానవుని ఉద్ధరణకు సర్వోత్తమ సాధనము ఏకాదశీ వ్రతాచరణము. ఏకాదశీ నాడు రాత్రి జాగరణ చేయుచూ వ్రత పాలన చేయు మానవుడు వేలకొలది పాపములు చేసినప్పటికీ యముని రౌద్రరూపము ను కాంచడు. ద్వాదశి నాడు తులసీ దళము చే శ్రీహరి పూజనమొనర్చు పుణ్య శీలునకు కమల పత్రమునకు జల మంటనట్లు పాపములు లేశమాత్రము అంటవు. వేల కొలది అశ్వమేధ యజ్ఞములు, వందలాది వాజపేయ యజ్ఞములు సహితము ఏకాదశి వ్రతము యొక్క పదహారవ వంతునకు కొరగావు. ఏకాదశీ వ్రత మాచరించు మానువుడు తన తండ్రి, తల్లి, మరియు తన భార్య వైపు పది తరములు వరకు పూర్వులను ఉద్ధరించును. ఏకాదశీ కృష్ణ, శుక్ల పక్షముల రెండింటి యందును వచ్చును. ఆ రెండింటి యందునూ ఫలితము సమానము. గోవు తెల్లగ యున్ననూ, నల్లగ యున్ననూ, ఏ రంగున యున్ననూ, వాని పాలు ఒకే విధముగ యుండును కదా!!

గోపికలారా! వందలాది జన్మముల నుండి సంక్రమించిన మేరు, మంధర, పర్వత రాశుల వంటి పాపములు ఒక ప్రక్కన, ఒక్క ఏకాదశీ వ్రత ఫలితము వేరొక ప్రక్కన ఉంచిన యెడల, ఆ పాపరాశి అంతయు భస్మమగును. ఎవరు ఏకాదశీ పుణ్యతిధిన విష్ణు భగవానుని పుణ్యకథలు వినునో ఆతడు సప్తద్వీపా వసుంధరను దానమిచ్చిన ఫలితమును పొందును. మనుష్యుడు శంఖ ద్వార తీర్ధము నందు స్నానము చేసి గదాధరుని దర్శనము చే పొందు పుణ్యము, ఏకాదశీ ఉపవాసమునకు పదహారవ వంతుకు సరికాదు. ప్రభాసము, కురుక్షేత్రము, కేదారము, బదరికాశ్రమము, కాశీ, మరియు సూకర క్షేత్రములందు చంద్ర, సూర్య గ్రహణములందు మరియు నాలుగు లక్షల మకర సంక్రాంతుల యందు చేయబడిన దానములు కూడా ఏకాదశీ ఉపవాసమునకు పరహారవ వంతునకు సమానము కాదు.

గోపికలారా! సర్పములందు శేషుడు, పక్షుల యందు గరుడుడు, దేవతల యందు విష్ణువు, వర్ణముల యందు బ్రాహ్మణులు, వృక్షముల యందు రావి చెట్టు, పత్రముల యందు తలసీదళము, సర్వశ్రేష్ఠము. అట్లే తిథుల యందు, వ్రతముల యందు ఏకాదశీ తిథి/వ్రతము సర్వోత్కృష్ఠము. మనుష్యుడు పదివేల సంవత్సరములు ఘోర తపస్సు చే ఎట్టి ఫలితము పొందునో అదే ఫలితము ఏకాదశీ వ్రతానుష్ఠానము వలన కలుగును. వ్రజాంగనలారా! ఈ ప్రకారము మీకు ఏకాదశీ వ్రతము యొక్క పలితము వివరించితిని. శీఘ్రమే మీరందరూ ఈ వ్రతానుష్ఠానము చేయవలసినది. మీరు ఇంకనూ ఏమి వినగోరుచున్నారు?”

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన శ్రీ నారద బహుళాశ్వ సంవాదము నందలి యజ్ఞసీతా ఉపాఖ్యానము మరియు ఏకాదశీ మహాత్మ్యము అను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(పూర్వ కాలమున ఏకాదశీ వ్రత ప్రభావము వలన మనోవాంఛా సిద్ధి పొందిన పుణ్యాత్ముల పరిచయము, మరియు యజ్ఞసీత స్వరూప గోపికలకు ఏకాదశీ వ్రత ప్రభావము చే శ్రీకృష్ణ సాన్నిధ్య ప్రాప్తి)

గోపికలు “వృషభాను నందినీ! సంపూర్ణ శాస్త్రముల అర్ధజ్ఞానము నందు మిక్కిలి పారంగత వయిన సుందరీమణీ!! నీవు సాక్షాత్ జ్ఞాన నిధివి. నీ వాక్కులు జ్ఞాన శిరోమణి అయిన బృహస్పతి వాక్కులు పోలియున్నవి. ఈ ఏకాదశీ వ్రతమును మున్ను ఎవరు ఆచరించిరి? మాకు ఆ విశేషములన్నియును వివరముగ తెలుపవలసినది. అంతట శ్రీ

రాధాదేవి "గోప సందరీమణులారా! వినండి. తొలుత దేవతలు పోగొట్టుకొనిన రాజ్యము ప్రాప్తించుటకు మరియు దైత్య వినాశనమునకు ఈ ఏకాదశీ వ్రతానుష్ఠానము చేసిరి. తదుపరి మహారాజు "వైశాంతుడు" తన తండ్రిని యమ లోకము నుండి ఉద్ధరించుటకు ఈ వ్రత మాచరించెను. "లుంపకుడు" అన రాజు తన పాప కర్మము చే తన రాజ్యము, కుటుంబము, మరియు బాంధవులను కోల్పోయెను. పిదప ఏకాదశీ వ్రత మహాత్మ్యము చే కోల్పోయిన వన్నిటినీ తిరిగి పొందెను. భద్రవతీ నగర రాజయిన "కేతుమానుడు" పుత్రహీనత కలిగి యుండెను. అతడును ఋషుల మాటలు విని ఏకాదశీ వ్రతము ఆచరించి పుత్రుని బడసెను. దేవపత్నులు ఒక బ్రాహ్మణ స్త్రీకి ఏకాదశీ వ్రత పుణ్యఫలము దానము చేసిరి. ఆ ప్రభావము చే ఆ మానవి ఇహమందు ధన, ధాన్య సమృద్ధిని అనుభవించి పరమందు స్వర్గసుఖములు భోగించెను. "పుష్పదంతుడు," "మాల్యవానుడు" అను ఇరువురు గంధర్వులు ఇంద్రుని శాపము చే పిశాచములయిరి. తదుపరి వారిరువురు ఏకాదశీ వ్రత మాచరించి శాప విముక్తులై తిరగి తమ గంధర్వ రూపములు పొందిరి. పూర్వకాలమందు శ్రీరామ చంద్రమూర్తి కూడా సముద్ర తరణమునకై సేతువు నిర్మించుటకు, పిదప రావణవధకు ఏకాదశీ వ్రత మాచరించెను.

ప్రళయాంతము నందు ఉత్పన్నమగు "ఆవలి వృక్షముల" నీడన కూర్చొని దేవతలు సర్వ జీవుల కళ్యాణమునకై ఈ వ్రత మాచరించిరి. అప్సరా సంపర్క దోషము నుండి విముక్తడగుటకు "మేధావి" అను పురుషుడు తన తండ్రి ఆజ్ఞచే ఏకాదశీ వ్రత మాచరించి ఆ పాపము నుండి విముక్తుడై తేజస్సంపన్నుడాయెను, "లలితుడు" అను గంధర్వుడు తన పత్నీ శాపము చే రాక్షస రూపుడయి తిరిగి ఏకాదశీ వ్రత పరిపాలన చే తిరిగి గంధర్వత్వము సంపాదించుకొనెను. ఏకాదశీ వ్రతాచరణము వలననే చక్రవర్తులు మాంధాత, సగరుడు, కుకుత్సుడు, మరియు ముచికుందుడు పుణ్యలోక ప్రాప్తి నొందిరి.

"ధుంధుమారుడు" ఆదిగ రాజ లెందరో ఏకాదశీ వ్రత మహాత్మ్యము చే సద్గతులు పొందిరి. శంకర భగవానుడు సహితము ఈ వ్రతాచరణము చే బ్రహ్మకపాలము నుండి విముక్తుడాయెను. కుటుంబ జనులచే త్యజింపబడిన పరమ దుష్టుడు, వైశ్య పుత్రుడయిన "దుష్టబుద్ధి" ఏకాదశీ వ్రతాచరణము చే భూమండలమను ఏకఛత్రాది పత్యముగ ఏలి తన పురవాసులందరితో కలసి వైకుంఠమున కేగెను. "అంబరీష" మహారాజు సహితము ఏకాదశీ వ్రతానుష్ఠానము చేసెను. దాని ఫలితముగ అప్రతి హతమయిన బ్రాహ్మణశాపము ఆయనను ముట్టుకొన లేకపోయినది. "హేమమాలి" అను యక్షుడు కుబేరుని శాపము చే కుష్టువ్యాధి గ్రస్తుడాయెను. కానీ ఏకాదశీ వ్రతాచరణము చే ఆ వ్యాధి నుండి విముక్తుడై పూర్ణ చంద్రుని భాతి కాంతిని పొందెను. "మహీజిత్" మహారాజు ఏకాదశీ వ్రత ప్రభావము చే ఒక సుందర పుత్రుని పొంది పిదప స్వయముగ వైకుంఠమునకేగెను. హరిశ్చంద్ర మహారాజు సహితము ఏకాదశీ వ్రతమాచరించి ఇహలోక సౌఖ్యము లన్నింటినీ అనుభవించి అవసాన కాలమందు తన పురజనులతో సహా వైకుంఠ ధామమునకేగెను. పూర్వకాలమందు ముచికుందుని జామాత (అల్లుడు) అయిన శోభనుడు ఏకాదశీ వ్రతమాచరించి, ఉపవాసములు చేసి, ఆ వ్రత ప్రభావము చే దేవతలతో పాటు మంధరాచలమునకు ఏగెను. ఇప్పటికినీ ఆయన తన భార్య అయిన చంద్రభాగాదేవీ సహితుడై కుబేరుని వలె భోగములు అనుభవించుచుండెను. గోపికలారా! ఏకాదశి, తిథుల యందు పరమేశ్వరి, అని తెలుసు కొన వలసినది. ఈ తిథికి సాటి వచ్చు తిథి మరియొక తిథి లేదు! లేదు!! లేదు!!!

శ్రీరాధాదేవి ముఖతా ఏకాదశీ వ్రత ప్రభావమును వినిన యజ్ఞ సీతాస్వరూప గోపికలు శ్రీకృష్ణ దర్శన లాలస చే విధి విధానముగ ఏకాదశీ వ్రతానుష్ఠానము చేసిరి. అందులకై ప్రసన్నుడైన శ్రీహరి మార్గశీర్ష పూర్ణిమ నాడు వారందరితో రాసక్రీడ సలిపెను.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి యజ్ఞ సీతాపాఖ్యానము నందు ఏకాదశీ మహాత్మ్యమను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(పుళింద కన్యా రూపిణిలు అయిన గోపికల సౌభాగ్య వర్ణనము)

నారదుడు "మహారాజా! ఇపుడు పుళింద (కోలభీల) జాతి స్త్రీలు గోపీభావ ప్రాప్తినొందిన వృత్తాంతమును నుడివెదను. వినుము. ఈయది మిక్కిలి పుణ్యజనకము, పాప హరణము, అత్యద్భుతము, మరియు శ్రీకృష్ణ భక్తిని పెంపొందించు ఉత్తమోత్తమ సాధనము.

వింధ్యాచల వనములందు కొంతమంది పుళిందులు నివాసముండిరి. వారు రణ భయంకరులు. కేవలము రాజుల ధనాపహరణమే వారి వృత్తి. అందువలన వింధ్యదేశ నరేశుడు కుపితుడై రెండు అక్షౌహిణీ సేనలు తీసికొని ఆ పుళిందులపై దండెత్తెను. పుళిందులు సహితము కత్తులు, శూలములు, పరశువులు, శక్తులు, భృశిండిలు మరియు భల్ల బాణములతో వారిని ఎదర్కొనిరి. వారి ఇరు పక్షముల మధ్య చాలాకాలము పోరు జరిగినది. పుళిందుల సేన పల్చబడెను. విజయావకాశములు సన్నగిల్లుట కాంచి వారు సహాయమునకై రహస్యముగ కంసునికి ఒక లేఖ పంపిరి. కంసుడు వారి సహాయార్థము ప్రలంభదైత్యుని పంపెను.

ప్రలంబుడు విశాలకాయుడు, మరియు భయంకరుడు. ఆతని శరీరము రెండు యోజనములు ఎత్తు యండెను. కారు మబ్బులు వంటి శరీర ఛాయ, శిరము నందు కిరీటము, కర్ణము లందు కుండలములు, మెడలో సర్పముల మాల, కాళ్ళకు కడియములు, చేతి యందు గద, నోటియందు పాము వలె ఆడుచున్న నాలుక కలిగి అతి భయంకరముగ కానపట్టు చుండెను. ఆ దైత్యుడు యుద్ధరంగమున ప్రవేశించిన తోడనే వింధ్యాదేశ సైనికుల పై పెద్ద, పెద్ద పర్వత చరియలు, వృక్షములు పడవైచి వారందరినీ నుగ్గు నుగ్గు గావించెను. ఆ దైత్యుని ఆగడములు చూడగనే వింధ్య దేశపు రాజు తన సేనా వాహినిని వెంటబెట్టుకొని వెనుకకు తిరిగి పారిపోయెను. అంత పుళిందులనందరినీ వెంటబట్టుకొని ప్రలంభుడు మధురానగరమున కేతెంచెను. ఆ పుళిందులందరూ కంసుని సేవకులయిరి. వారందరూ తమ కుటుంబములతో కామగిరి యందు నివాస మేర్పరుచుకొనిరి. శ్రీరామచంద్రుని వనవాస సమయమున ఆయనను గాంచిన పుళింద స్త్రీలు వీరి ఇండ్లయందు కన్యలుగా జన్మించిరి. వీరు అందరూ మూర్తీభవించిన లక్ష్మీస్వరూపులు. శ్రీకృష్ణ దర్శనము చే వారందరి హృదయము లందు భక్తి బీజములు అంకురించినవి.

ఆనాటి నుండి ఆ పుళిందకన్యలు ప్రేమభక్తి విహ్వాలలై, శ్రీకృష్ణ పాదరజమును తలపై నిడుకొని రాత్రింబవళ్ళు ఆయననే ధ్యానము చేయసాగిరి. అందువలన వారు కూడ రాసమండలి కేతెంచి సాక్షాత్ గోలోకాధిపతి, సర్వసమర్థుడు, పరిపూర్ణతమ పరమేశ్వరుడయిన శ్రీకృష్ణుని ప్రాప్తినొందిరి. ఈ పుళింద కన్యల సౌభాగ్యమేమని చెప్పుదును? దేవతలకు సహితము దుర్లభమయిన శ్రీకృష్ణ పాద రజము వారికి కోకొల్లలుగ లభించినది. వీరికి భగవానుని పాదపద్మరజము నందు ఎంత దృఢభక్తి కలిగిన దనిన, వారు బ్రహ్మపదము, శివస్థానము, లోక సామ్రాజాధిపత్యము, మహేంద్ర పథము, పాతాళ లోకాధిపత్యము, యోగసిద్ధి, చివరకు మోక్షము సహితము నొల్లరైరి. ఎవరు తమ స్వకర్మ ఫలము నందు విరక్తులై, నిరంతరము భగవత్ పాద పద్మముల యందు ఆసక్తియుతులై యుందురో అదియే నిరపేక్ష సుఖము. ఇది వినా మిగిలిన వేవియును సుఖము కాదు! దు:ఖదాయకమే!!

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి పుళింద ఉపాఖ్యానమను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(లక్ష్మీదేవి సఖులు వృషభానుల ఇండ్లయందు కన్యలుగ ఉత్పన్నమై మాఘమాస వ్రతము చే శ్రీకృష్ణుని ప్రసన్నుని చేసికొని భగవత్ప్రాప్తి నొందుట)

నారదుడు "మిథిలేశ్వరా! ఇక ఇతర గోపికల వృత్తాంతము సహితము వినవలసినది. ఈయది పుణ్యజనకము. పాపనాశము మరియు శ్రీకృష్ణ భక్తి వృద్ధి కారకము. వ్రజభూమి యందు ఆరుగురు వృషభానులు ఉత్పన్నమయిరి, అని చెప్పుకుంటిమి కదా! వారి నామములు "నీతివిత్, మార్గద, శుక్ల, పతంగ, దివ్య వాహన, గోపేష్టులు." వారి స్వభావము సహితము వారి నామానుసారమే యుండెడిది. శ్రీ లక్ష్మీ దేవికి యున్న అనంత కోటి చెలికత్తెల యందు కొందరు అజితపద వాసినులు, కొందరు వైకుంఠ నివాసితులు, మరికొందరు సముద్ర సంభవలైన లోకాచల వాసినులు. వారు అందరూ శ్రీహరి వర ప్రభావము వలన ఈ వృషభానుల ఇండ్లయందు కుమార్తెలుగ జన్మించిరి. వారందరూ నిరంతరము నారాయణ చరణార వింద చింతనము చేయుచూ, మాఘ మాస వ్రత మారంభించిరి. ఈ వ్రతము యొక్క ముఖ్యోద్దేశము శ్రీకృష్ణుని ప్రసన్నుని చేసికొనుట.

మాఘమాస శుక్లపక్ష పంచమి రాబోవు వసంతఋతు సూచకమునకు ప్రధమ దినము. ఆనాడు శ్రీకృష్ణ ప్రభువు వారిని పరీక్షించుటకై వ్యాఘ్ర చర్మాంబర ధారియై, జటాఝూటము దాల్చి, ఒడలంతయు భస్మము పూసికొని, యోగి వేషమున సుశోభితుడై, మురళిని వాయించుచూ, లోకులందరినీ ముగ్ధులను చేయుచూ ఈ వృషభాను కన్యకల గృహముల ముందుకు ఏతెంచెను. తరుణ వయస్కుడయిన ఈ యోగి వారి వీధుల వద్దకు వచ్చినంతనే వృషభాను కన్యలు మోహితులై, ప్రేమ విహ్వలులై, ఆయనను దర్శించుటకు బయటకు వచ్చిరి. అత్యంత సుందరుడయిన ఆ యోగి పుంగవుని గాంచి, ప్రేమానంద సాగరమున మునిగి ఆ గోపకన్యకలు తమతో తాము ఇట్లనుకొను చుండిరి, "ఈ బాలుడు ఎవరు? ఈతని ఆకృతి అచ్చము నంద నందనుని పోలి యున్నది. లేకేని ఈతడు మిక్కిలి ధనికుడయిన మహారాజపుత్రుడు అయి యుండును. తన ప్రేయసి యొక్క కటు వాక్యములచే భగ్న హృదయుడయి, విరక్తుడై, గృహమును విడచివైచి యుండును. ఏదైననేమి? ఈతడు మిక్కిలి సుకుమారుడు, రమణుడు, మరియు కామదేవుని వలె సమస్త విశ్వమును మోహింపచేయుచున్నాడు.

"అహా! ఈతని మాతాపితరులు, సోదర సోదరీమణులు ఈతని విరహమును ఎట్లు భరింపనోవు చున్నారు?" ఇట్లు తమలో తాము తర్కించి, విచారించి, గోపకన్యలందరూ గుంపులు గుంపులుగ ఆ తరుణ, మనోహర యోగి పుంగవుని చేరి ఇట్లు ప్రశ్నించిరి, "ఓ! యోగిపుంగవా!! నీ నామధేయమేమి? ఎక్కడ నీ నివాసము! నీ వృత్తి, వ్యాపారములేమి? నీవు ఏమి సిద్ధులను ప్రాప్తినొందితివి? వక్తల యందు శ్రేష్ఠుడా! మాకు సర్వము తెలుపవలసినది." అంత యోగి ఇట్లు బదులిచ్చెను "నేను యోగేశ్వరుడను. మానస సరోవరము నా నివాసము. నా నాయధేయము "స్వయంప్రకాశుడు". నేను నా శక్తిచే అకలి, దప్పికలను జయించి నిరాహారినై జీవించుచున్నాను. పరమహంసలు ఎల్లప్పుడూ ఆత్మ సాక్షాత్కారము కోసమే జీవించెదరు, (తపించెదరు). నేను సహితము ఆ సిద్ధి కోసమే పయనమగు చున్నాను. నాకు దివ్య దృష్టి ప్రాప్తించినది. నేను భూత, భవిష్యత్, వర్తమాన కాలములను ఎరుగుదును. మహా మంత్ర విద్యలయిన ఉచ్చారణ, మారణ, మోహన, స్థంభన, మరియు వశీకరణ నాకు కరతలామలకములు"

గోపికలు "మహాత్మా! నీవు బుద్ధిమంతుల యందు శ్రేష్ఠుడవు. నీకు త్రికాలముల రహస్యము అవతగమగునేని మా మనసు నందు యున్న కోరికను తెలుపవలసినది." అందులకు సిద్ధుడు "గోప కన్నియలారా! ఇది మిక్కిలి గోప్యము. ఈ రహస్యము కేవలము మీ కర్ణముల యందు మాత్రమే చెప్పదగినది. కానీ మీ ఆజ్ఞ అయిన యెడల ఆ విషయమును మీ అందరి ఎదుట చెప్పెదను."

గోపికలు "మునీంద్రా! మీరు నిజముగ యోగేశ్వరులే! మీరు త్రికాలజ్ఞులు. ఇందు సందియము లేదు. మీ

వశీకరణ విద్య చే మా మనసు నందు మేము నిరంతరము చింతన చేయు స్వామిని ఇక్కడకు తక్షణమే రప్పించిన ఎడల, అపుడు మేమందరము మీరు మంత్రజ్ఞుల యందు శ్రేష్ఠులని అంగీకరించెదము. అంత సిద్ధయోగి "వ్రజాంగనలారా! మీరు అడిగిన ప్రశ్న/విషయము మిక్కిలి దుర్లభము మరియు దుష్కరము. కానీ నేను మీ మనసు నందు నిరంతరము మెదలుచున్న వస్తువును తప్పక ప్రకటించెదను. ఎందుకనగా సత్పురుషుల వాక్కు వ్యర్థము కాదు. వ్రజాంగనలారా! చింతింపవలదు. మీరందరు కన్నులు మూసుకొన వలసినది. మీ కార్యము నిర్విఘ్నముగా పూర్ణమగును. సందేహము లేదు." అంత గోపాంగనలు తమ కన్నులను మూసికొనిరి. అంత శ్రీహరి యోగి వేషమును వదలి నందనందనుని రూపమున వారి యెదుట ప్రత్యక్షమయ్యెను. గోపికలు కన్నులు తెరచిన వెంటనే ఎదురుగ నందనందనుడు విశ్వమోహనమైన చిరునవ్వు విరాజిల్లుచూ కానబడెను. మొదట వారందరూ విస్మితులయిరి.

పిదప హర్షోల్లాసితులై, అటు పిదప తమ ప్రియ సఖుడైన మదన మోహనుని రూపమునకు ముగ్ధులై మోహితులైరి. తదనంతరము మాఘమాసము నందు మహారాసమందు పావన బృందావనాంతర్గతమున శ్రీహరి ఆ గోపంగనలతో అప్సరోభామలతో దేవరాజు ఇంద్రుడు విహరించునట్లు విహరించెను.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి రమా వైకుంఠ, శ్వేతద్వీప, ఊర్ధ్వ వైకుంఠ, అజితపద, మరియు శ్రీలోకాచల నివాసము చేయు శ్రీ లక్ష్మీసఖుల గోపరూప ప్రకటమగు ఆఖ్యానము అను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(దివ్యులు, త్రిగుణా వర్తినులయిన భూలోక గోపికల వర్ణనము మరియు గోపికలు శ్రీరాధా సహితుడై శ్రీకృష్ణుని తో హోలికోత్సవము (హోలీ పండుగ) జరుపుట)

నారదుడు "మిథిలేశ్వరా! నీకు ఇంకనూ గోపికల శుభ చరిత్రను వర్ణించు చున్నాను. వినుము. వ్రజభూమి యందు తొమ్మిది మంది ఉప నందులుంటిరని వక్కాణించితిని కదా! వారి నామధేయములు – "వీతిహోత్రుడు, అగ్నిభుక్, సాంబుడు, శ్రీకరుడు, గోపతి, శృతుడు, వ్రజేశుడు, పావనుడు, శాంతుడు." వీరు అందరూ ధన, రూప, పుత్ర సంపన్నులు, దాన పరాయణులు, సచ్ఛీలము మరియు సదాచారము కలిగిన సద్గుణ సంపన్నులు. వీరి ఇండ్ల యందు దేవతల ఆశీర్వచనము చే ఎందరో కన్యలుద్భవించిరి. వారిలో కొందరు సామాన్యులు, కొందరు దివ్యులు, మరికొందరు త్రిగుణముల చే అవృతులు. వారందరూ నానా విధములయిన పూర్వకర్మ ఫలము చే వ్రజభూమి యందు ఉత్పన్నమయిరి. వారందరూ శ్రీరాధాసఖులే!

ఒకానొక దినము హోలీ మహోత్సవము జరుగుచున్నది. అందు శ్రీకృష్ణుని ఆగమమును గమనించిన సమస్త గోపంగనలు శ్రీరాధికాదేవి తో ఇట్లనిరి, "రంభోరు! చంద్రవదనా! మధుమానినీ! లలనా! స్వామినీ! శ్రీరాధా!! మా మృదు, మధుర భాషణములను ఆలకింప వలసినది. వ్రజ భూషణుడైన నంద నందనుడు హోలికోత్సవపు విహారమునకై ఈ బరసాను పుర ఉపవనమునకు ఏతెంచెను. యవ్వన మదము చే ఆయన నేత్రములు శోభాయమానముగ ప్రకాశించుచున్నవి. ఉంగరములు తిరిగిన ఆయన నీలి కురులు కపోలములను ముద్దిడి క్రిందకు వచ్చి భూజములపై విశ్రాంతి నొందుచున్నవి. శరీరముపై పట్టు పీతాంబరము శోభించుచుండగా, అరుణ చరణారవిందములను చుట్టిన నూపురములు మధుర ధ్వనులు చేయుచూ, అందరి చూపులను ఆయన వైపు ఆకర్షించు చున్నవి. మస్తకము పై బాలభానుని పగిది కిరీటము వెలుగుచున్నది. ఆయన భుజములు యందు భుజకీర్తులు,వక్షస్థలమందు హారములు, కర్ణములందు విద్యుత్ కాంతులీను మకర కుండలములు, ధరించి యుండెను. ఆకాశము నందు ఇంద్రధనుస్సు శోభించునట్లు భూమండల మందు ఆయన కట్టిన పీతాంబరము యొక్క పచ్చని శోభ ప్రకాశించు చుండెను. హోలికోత్సవము సంర్భముగ వివిధ

రంగులు జల్లుచుండుటచే ఆయన శరీరమంతము ఎఱ్ఱని రంగుతో నిండియుండెను."

"ప్రియసఖీ!" శ్రీరాధా! మాధవుడు ఒక క్రొత్త పిచకారీ పుచ్చుకొని నిన్ను బయటకు రప్పించు అవకాశమునకై వేచియుండెను. నీవును బిడియమును, సంకోచమును, బింకమును వదలి హోలికోత్సవపు మిషన బయటకు రావలసినది. మన మందిరమున కూడా రంగులను నీటి యందు, కలిపి, వాటికి చందన, అగరు, మకరందాది సుగంధ ద్రవ్యములను అలది ఈ హోలికోత్సవమును జయప్రదము చేయవలసినది. ఓ ప్రియసఖీ!! నీవు కూడ సఖులతో కలసి శ్యామ సుందరుడున్న స్థలము నకు వేగమే వెళ్ళవలసినది. "పారుచున్న నీటియందు చేతులు శుభ్రము చేసికొన వలెను." అనెడు సామెత సర్వత్ర విదితము. ఇటువంటి సమయము మరల తిరిగి రాదు."

అంతట మిక్కిలి మానవతి అయిన శ్రీరాధాదేవి తన బిడియము వదలి, సఖీ సమేతురాలై హోలికోత్సవము నందు పొల్గొనుటకై బయలుదేరెను. నీటి యందు కుంకుమ, చందనము, ఆగరు, కస్తూరి, గోరింటాకు కలిపిన కుండలను తీసికొనిన వ్రజాంగనలు ఎఱ్ఱని చేతులతోనూ, పచ్చని వసంత శోభను మరపించు వస్త్రముల తోనూ, ఘల్లు ఘల్లు మను నూపురములు తోనూ, చిరుగంటలు చణచణలతో మ్రోగుచున్న వడ్డాణములతోనూ కనువిందు చేయుచూ కదులసాగిరి. వారందరూ గొంతెత్తి హోలికొత్సవపు గీతములను రమణీయముగ పాడు చుండిరి.

రకరకములయిన రంగుల చూర్ణములు చేతులయందు తీసికొని నలువైపులా విరజిమ్ముచూ వ్రజాంగనలు వస్త్రములనూ, భూమ్యాకాశములను సహితము ఇంద్ర ధనుసు వలె మార్చిరి. వర్షాకాలముందు మేఘముల చూట్టూ ప్రజ్వలించు విద్యున్మాలల వలె గోపాంగనలు అందరూ శ్యామసుందరుని చుట్టుముట్టిరి. తొలుత ఎఱ్ఱని కుంకుమ ఆయన ముఖమండల మంతయు పూసిరి. పిదప నానా వర్ణ మిళిత మయిన సుగంధ భరిత జలములతో ఆయనను ముంచెత్తిరి. అచట ఎంతమంది గోపికలు కలరో, భగవానుడు సహితము అన్ని రూపములు ధరించి వారితో విహరించెను. శ్రీరాధాదేవి శ్రీకృష్ణుని కన్నులకు కాటుక నకలంరించెను. శ్రీకృష్ణుడు సహితము తన సరిక్రొత్త ఉత్తరీయమును గోపికలకు బహుమతిగ ప్రసాదించెను. తదనంతరము శ్రీకృష్ణభగవానుడు నంద భగవనమునకేగెను. ఆ సమయమున సమస్త దేవతానీకము పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి హోలికోత్సవ సందర్భముగ దివ్యా దివ్య, త్రిగుణావృత్తి పరాయణులైన భూతల గోపికల ఉపాఖ్యానమను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(దేవాంగనా రూప గోపికలు)

నారదుడు "మిథిలేశ్వరా! ఇక దేవాంగనా రూప గోపికల వృత్తాంతమును నుడివెదను. వినుము. ఈయది మానవునకు చతుర్విధ పురుషార్థములను, ప్రసాదించి మిక్కిలి కృష్ణభక్తిని పెంపొందిచును. మాళవ దేశమందు దివ్యస్పతి నందుడను గోపకుడు కలడు. ఆయనకు వేయిమంది కళత్రములు కలరు. ఆయన బహు నీతిజ్ఞుడు మరియు ధనవంతుడు. ఒక పర్యాయము ఆయన తీర్థయాత్రలు చేయుచూ మధురాపురమున కేతెంచెను. అచట వ్రజాధీశ్వరుడయిని నందరాజు ఖ్యాతిని విని ఆయనను కలుసుకొనుటకై గోకులమునకు వచ్చెను. ఆయన నందరాజును కలసి, బృందావన శోభను తిలకించి, నందుని ఆజ్ఞను బడసి, అచటనే స్థిరపడి నివసింప సాగెను. ఆతడు రెండు యోజనముల భూమిని చదును చేసి అచట గోవుల కొరకై గోష్ఠిని ఏర్పరచెను. తన కుటుంబము మరియు బంధువులతో కలసి వ్రజభూమి యందు నివసించుచూ దివ్యస్పతి మిక్కిలి సుఖ సంతోషములతో నిండి యుండెను. దేవల మహర్షి ఆదేశము చే దేవాంగనలు

అందరూ ఈ దివ్యస్మృతి ఇంట గోపకన్యలుగ జన్మించిరి. వారందరూ ప్రజ్వలించుచున్న అగ్నితో సమానమయిన తేజస్సు గలవారు.

ఒకొనొక సమయమున వారందరూ శ్యామ సుందరుని దర్శించి, మోహితులై, ఆ దామోదరుని ప్రాప్తి కొరకై పరమ పవిత్రమయిన మాఘమాస వ్రతము నారంభించిరి.

వారందరూ ప్రతిదినము సూర్యోదయముననే యమునా తీరమునకు ఏగి కాళింది యందు పుణ్యస్నాన మాచరించి, ప్రేమానంద సాగరమున మునిగి విహ్వలలై, ఉచ్ఛస్వరమున శ్రీకృష్ణ లీలలను గానము చేయుచుండిరి. ఒకనాడు శ్రీకృష్ణ భగవానుడు మిక్కిలి ప్రసన్నుడై వారికడకేతెంచి “ఏదేని వరము కోరుకొనుడని” పలికిరి. “ప్రభూ!! నిశ్చయముగ మీరు యోగీశ్వరులకు సహితము పొందుటకు దుర్లభులు. మన్మధుని సహితము మోహింపచేయగల సుందరులు. వంశీధరులు. మీరు ఎల్లప్పుడు మా దృష్టి పధమున యుండెదరు గాక!” భగవానుడు “తధాస్తు” అని పలికి వారి కొరకు ఎల్లప్పుడూ తన దర్శన ద్వారమును తెరచి యుంచెను.

ఆదిదేవుడగు శ్రీహరి కేవలము భక్తికి మాత్రమే వశుడు. ఇందులకు గోపికలే ఎల్లప్పుడు ప్రమాణము. వారు ఎప్పుడూ యోగానుష్ఠానము కానీ, సాంఖ్యయోగ విచారము కానీ చేయలేదు. కేవలము శుద్ధ భక్తి, ప్రేమ భక్తి చే వారందరూ పరమ పద భగవత్ ప్రాప్తి నొందిరి.

(శ్రీ గర్గ సంహిత యందు బృందావన ఖండార్గతమయిన నాదర బహులాశ్వ సంవాదము నందలి దేవాంగనా స్వరూప గోపికల ఉపాఖ్యానమను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(కౌరవ సేనా వాహిని చే పీడింపబడిన రంగోజీగోపుడు కంసుని సహాయముతో వ్రజమండలమందు నివసించుట. జాలంధర కన్యలు పుత్రీరూపముగ వాని ఇంట ఉద్భవించుట)

నారదుడు “మిధిలేశ్వరా! ఇక జలంధరుని అంత:పుర స్త్రీలు గోపికల రూపమున జననమొందు వృత్తాంతమును వినుము. మహారాజా! వారి కర్మ కలాపము మనుష్యుల పాపములు దహించును. మహారాజా! సప్తనదీ తీరమున “రంగ పట్టణము” అను ప్రసిద్ధ నగరము కలదు. ఆ విశాల నగరము రెండు యోజనములు విస్తీర్ణము గల గోళాకార పురము మరియు సకల సంపదలకు ఆలవాలము. ఆ పురమును మిక్కిలి బలవంతుడయిన రంగోజీ యను గోపకుడు పరిపాలించు చుండెను. ఆయన ధన, ధాన్య సమృద్ధియుతుడై, పుత్ర పౌత్ర పరివేష్టితుడై, సుఖముగ యుండెను. ఆతడు హస్తినాపురాధీశు డయిన దృతరాష్ట్ర మహారాజునకు ప్రతియేటా ఒక కోటి సువర్ణ ముద్రికలు కప్పముగ కట్టువాడు. ఒకానొక సంవత్సరము సమయము మించినప్పటికీ ధన మదముచే ఉన్మత్తుడయి రంగోజీ గోపుడు కప్పము కట్టకుండెను. అంత దృతరాష్ట్రుని చే పంపబడిన పది వేల మంది యోధులు ఆ గోపుని బంధించి, దృతరాష్ట్రుని వద్దకు ఈడ్చుకొని వచ్చిరి. అంత రంగోజీ గోపునకు కారాగార శిక్ష విధింపబడినది. ఆతడు అనేక సంవత్సరములు కారాగార నందు మ్రగ్గి, కొరడా దెబ్బలు తిన్నప్పటికినీ తన లోభము వీడక మహారాజునకు కొంచెము ధనము సహితము కట్టకుండెను. ఒకానొక దినము గోపనాయకుడయిన రంగోజీ, ఆ భయంకర కారగారము నుండి తప్పించుకొని రాత్రికి రాత్రి రంగ పట్టణమునకు ఏతెంచెను.

అంత ఆ గోపుని పున: బంధించుటకు దృతరాష్ట్రుడు మూడు అక్షౌహిణీల సేనా వాహినిని పంపెను. రంగోజీ కవచము ధరించి, ధనుష్పాణియై, యుద్ధ భూమి యందు మాటి మాటికీ ధనుష్టంకారము చేయుచూ, మెరయుచున్న బాణ పరంపర వర్షము వలె కురిపించుచూ కౌరవ వాహినిని ఎదుర్కొనెను. కౌరవ యోధులు ఆతని ధనస్సును ఖండించి,

కవచమును ముక్కలు చేసి, ఆతని స్వజనమును సహితము మృత్యుముఖమునకు హారతిచ్చిరి. అంత రంగోజీ తన పురములోనికి వచ్చి, కొన్ని దినములు యుద్ధము తన పరివారము చే చేయించి, చివరకు తన మనసునందు భీతిల్లి, ఈ సమయమున తనకు శరణు ఈయగల సమర్థులెవరా అని ఆలోచించి, అతడు యాదవ రాజు కంసుని కడకు ఒక దూతను పంపెను.

ఆ దూత మధురానగరము చేరి, కంసుని రాజదర్బారు నందు ప్రవేశించి, అవనిత శిరస్కుడై, అంజలి ఘటించి, కంసునికి ప్రణామములాచరించి కరుణార్ద్రత చే గద్గదమయిన కంఠముతో ఇట్లనియె "మహారాజా! రంగ పట్టణమందు "రంగోజీ" అను ప్రసిద్ధ గోపకుడు కలడు. ఆయన గొప్ప నీతిజ్ఞుడు మరియు ఆ నగర పరిపాలకుడు. శత్రువులు ఆ నగరమును నలువైపులా ముట్టడించిరి. ఆయన మిక్కిలి చింతుతుడై అనాధయై మిమ్ములను శరణు కోరు చుండెను. ఈ భూతలము నందు దీన, దు:ఖితుల పీడను హరించుట యందు మిమ్ములను మించిన వారు లేరు. భౌమాసురాది (నరకాసుర) వీరులు సహితము ఎల్లప్పుడూ మీ గుణగానము చేయుదురు. మీరు స్వయముగ మహావీరులు, అంతేకాక ఎంతోమంది దేవ దానవ, ప్రచండ భూపాలురను యుద్ధము నందు జయించి దేవరాజు ఇంద్రుని వలె మీ రాజధానీ నగరము నందు విరాజిల్లు చున్నారు."

"ఎట్లు చకోర పక్షులు చంద్రుని, కమలముల సముదాయము సూర్యుని, చాతక పక్షులు శారదృతు మేఘముల ద్వారా వర్షింపబడు వర్షపు చినుకులను, క్షుధా బాధితులైన మనుష్యులు అన్నమును, తీవ్ర దప్పిక చే బాధింపడు ప్రాణులు జలములను కోరుకుందురో, అట్లే రంగోజీ గోపుడు శత్రువుల చే ఆక్రమింపబడి కేవలము మీ స్మరణము మాత్రమే చేయుచున్నాడు."

దూత యొక్క వచనములను వినిన దీనవత్సలుడైన కంసుడు, కోట్లాది దానవ సేనా సహితుడై రంగ పట్టణమునకు వెళ్ళుటకు నిశ్చయించెను. ఆతని మహాగజము యొక్క గండస్థలము గోమూత్రము తో మార్జనము చేయబడిన సింధూరము మరియు కస్తూరి చే అలంకరింపబడినది. ఆ దివ్య గజరాజుము వింధ్యాచలము వలె ఉత్కృష్టమై యుండి, కన్నుల నుండి మదజలము కారుచుండగా, మాటి మాటికీ మేఘ గర్జన శబ్దముతో ఘీంకరించుచున్నది. అటువంటి "కువలయాపీడము" అను దివ్య గజమును అధిరోహించి, కవచ ధారియై, చాణూర ముష్ఠికాది మల్లులు, కేశి, వ్యోమాసురుడు, వృషాసురుడు మొదలగు దైత్యయోధులు అనుసరించుచుండగా రంగ పట్టణము వైపు ప్రస్థానుడయ్యెను. అచట యాదవ కౌరవ వీరుల మధ్య బాణ, ఖడ్గ, త్రిశూల ప్రహరణము చే ఘోర యుద్ధము జరిగెను. నలుదిశలూ బాణ పరంపర సాగుచుండగా యుద్ధ రంగమంతయు అంధకార బంధురమాయెను. అంత కంసుడు ఒక విశాలమయిన గదను తీసికొని వనము నందు దావాలనము ప్రజ్వలించు నట్లు కౌరవసేన యందు చొరబడెను. ఇంద్రుడు తన వజ్రఘాతము చే పర్వతములను పిప్పి, పిప్పి చేసినటుల కంసుడు గదాధారియై కొన్ని వేల మంది కవచధారులయిన శత్రుయోధులను ధరాశయనుల గావించెను.

అతడు పాదములతో రధములను శిధిలమొనర్చి, పాశములతో హయములను హతమొనర్చి, ఒక గజమును వేరొక గజముపై ప్రహరించి సంహరించి, ఆ గజముల పాదముల బట్టి ఆకాశము కెగరవేసెను. ఆ యుద్ధ భూమి యందు వ్యోమాసురుడు గజముల దంతములు పట్టుకొని పైకెత్తి, బలముగ నేలపై విసిరి సంహరింపసాగెను. మరియొక ప్రక్క దుష్టదైత్యుడయిన వృషాసురుడు తన శృంగములతో హయసహిత రధములను సునాయాసము గ పైకెత్తి నలుదిశలా విసరివేయ మొదలిడెను. దైత్యరాజయిన కేశి తన వెనుక కాళ్ళతో రధములను హయములను నిరాటంముగ తన్నుచు వారిని అంతకునకు ఆహుతిచ్చెను. ఈ భయంకర యుద్ధము ను గాంచిన మిగిలిన కౌరవ వీరులు భీతి చెంది, ప్రాణములు అరచేత పట్టుకొని దశదిశలా పలాయనము చిత్తగించిరి.

అంత కంసుడు హర్షోల్లాసితుడై నగారాలను ధ్వనింప చేయుచూ, రంగోజీ గోపుని కుటుంబ సమేతముగ మధారాపురమునకు తీసికొని వెళ్ళెను. తమ పరాజయ వార్తను వినిన కౌరవులు క్రోధ మూర్ఛితులై, ప్రస్తుత కాలము దైత్యులకు అనుకూలముగ యుండుటచే నిశ్శబ్దముగ పరాభవముననుభవించిరి. వ్రజమండల సమీపమున "బర్హిషద్" అను ప్రసిద్ధ, మనోహర పురము యుండెను. ఆ పురమును కంసుడు రంగోజీకి బహూకరించెను. అప్పటి నుండి

రంగోజీ తన కుటుంబ సభ్యులతో కలసి ఈ బర్హిషద్ నగరము నందే నివసింపసాగెను. శ్రీహరి వరదాన ఫలితముగ జలంధరుని అంత:పుర స్త్రీలు ఈ రంగోజీ గోపుని పత్నీగర్భము నుండి కుమార్తెలుగ జననమందిరి. రూప యవ్వన సంపన్నులయిన ఈ గోప కన్యలను వివిధ గోపజనులకిచ్చి వివాహములు చేసిరి. ఈ గోపాంగనలందరూ జారభావము తో శ్రీకృష్ణ భగవానుని ప్రగాఢముగ ప్రేమించుచుండిరి. బృందావనేశ్వరుడయిని శ్యామ సుందరుడు చైత్రమాసము నందలి మహారాసము నందు వారందరితో రమణీయ బృందావనము నందు విహరించెను.

(శ్రీ గర్గ సంహిత యందు బృందావన ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి జాలంధర గోపికల ఉపాఖ్యానమను పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(బర్హిష్మతీ మొదలగు పురముల వనితలు గోపీరూపమున ఆవిర్భవించుట మరియు భగవానునితో రాస విహారము చేయుట. మాంధాత మరియు సాభరి సంవాదము నందు యమునా పంచాంగము యొక్క ప్రస్థావన.)

నారదుడు "మిథిలేశ్వరా! వ్రజభూమి యందు "శోణపురము" నేలు నందుడు మిక్కిలి ధనికుడు. ఆయనకు అయిదు వేల మంది పత్నులు కలరు. సాగర మంధన సమయమున లక్ష్మీదేవి తో పాటు ఉద్భవించిన ఆమె సఖులు మరియు ఓషధులు మత్స్యావతార నారాయణుని వర ప్రభావము వలన ఈ నందుని ఇంట కుమార్తెలుగ జన్మించిరి. అటులనే "బర్హిష్మతీ" పుర లలనామణులు పృధు చక్రవర్తి వర ప్రభావము వలన "జాతిస్మర" గోపికల రూపముతో జన్మించిరి. నర, నారాయణుల వర ప్రభావము వలన అనేక మంది అప్సరసలు సహితము గోపికలుగ జన్మించిరి. సుతల వాసినులయిన దైత్య నారీమణులు వామన దేవుని వర ప్రభావము వలన, మరియు నాగకన్యలు శేషభగవానుని వరదానము వలన వ్రజభూమి యందు ఉద్భవించిరి. దుర్వాసోముని వారందరికీ అద్భుతమయిన కృష్ణ పంచాంగమును (యమునా పంచాంగము) ప్రసాదించిరి. వారందరూ ఆ పంచాంగ ప్రభావము చే యమునా నదికి పూజలు సలిపి శ్రీపతి సారూప్యమును పొందిరి.

ఒకనాటి మాట! దివ్యమయిన యమునా తటము నందు, సుందర బృందావనమున కోకిలల కుహు కుహు రావములు, భ్రమరముల ఝుంకారములు, సారసపక్షుల తీయని పలుకులు, నలుదిశలా మారు మ్రోగు చున్నవి. పచ్చని ఆకులతో నిండి, వాసంతీలతా వృతమయిన వృక్ష సముదాయము చల్లని ఛాయను చేకూర్చుచుండెను. శీతల మంద సుగంధ వాయువు చే పరిసేవిత మయిన మధు మాసము (చైత్ర మాసము) నందు, కల్ప వృక్షముల యందు మనోహర వృక్షములుగ ప్రతీతి చెందిన కదంబ వృక్ష ఛాయల యందు మదన మోహనుడు, శ్యామసుందరుడు, శ్రీకృష్ణ భగవానుడు గోపాంగనలతో కలసి ఒక ఏకాంత ప్రదేశమున ఊయల ఉత్సవమును ఆరంభించెను. అచట ఉత్తుంగ తరంగ అయిన యమున కోలాహలము చేయుచుండెను. ప్రేమ విహ్వాలలైన గోపాంగనలు శ్రీహరి తో కలసి అచ్చట ఊయల లూగు చుండిరి. రతీదేవి తన పతి అయిన కామదేవుని తో కలసి ఎట్లు శోభించునో, అట్లే కోటి చంద్రులకాంతిని మించు కాంతిగల కీర్తికుమారి శ్రీరాధికాదేవి శ్యామసుందరుడు శ్రీకృష్ణుని తో కలసి శోభించు చుండెను.

"ఈ ప్రకారము సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుని పొందిన గోపాంగనల తపస్సును ఎట్లు వర్ణింపగలము? గోపికా రూపమున ఉత్పన్నమయిన నాగ కన్యలు మనోహర చైత్ర మాసము నందు, యమునా తటమున బలభద్ర రూపుడయిన హరి సేవ యందు ఉపస్థితులయిరి. మహారాజా! ఈ విధముగ నేను సమస్త గోపికల శుభ చరిత్రను నీకు వర్ణించి వివరించితిని. ఈ ఆఖ్యానము పరమ పవిత్రము మరియు సమస్త పాపహరము, దురిత

నివారకము. ఇంకనూ నీవు ఏమి వినదలచుకున్నావు?"

బహుళాశ్వుడు "మునీంద్రా! దుర్వాసో ముని చే ఈయబడిన యమునా పంచాంగము వలన గోపికలు గోవిందప్రాప్తి నొందిరి అని మీరు నుడివిరి. "యమునా పంచాంగము" అనగానేమి? దయచేసి నాకు వివరింపవలసినది.

నారదుడు "మహారాజా! ఈ విషయము నందు విద్వజ్జనులు ఒక ప్రాచీనేతిహాసమును ఉటంకింతురు. దీనిని వినినంత మాత్రమున సంపూర్ణ పాప నివృత్తి జరుగును. అయోధ్యా సింహాసనమును "మాంధాత" అను తేజస్వీ అయిన రాజశిరోమణి పరిపాలించు చుండెను.

ఒకనాడు ఆయన వనము నందు వేట నిమిత్తమై తిరుగుచు సౌభరి ముని ఆశ్రమమును చేరెను. ఆయన ఆశ్రమము సాక్షాత్ యమునా తటమునున్న బృందావనము నందు ఉపస్థిత మయినది. సౌభరి మునీశ్వరుడు సాక్షాత్ మాంధాత చక్రవర్తికి జామాత. అయిననూ ఆ చక్రవర్తి సౌభరి మునికి సమస్కృతులు సమర్పించి ఇట్లనియె.

భగావాన్! మీరు సర్వజ్ఞులు, పరావేత్తలందు సర్వశ్రేష్ఠులు. అజ్ఞానాంధకారము చే అంధులయిన మానవులకు జ్ఞానసూర్యులు. మహాత్మా! నాకు ఇహలోకమందు సర్వసిద్ధి సంపన్నమయిన సామ్రాజ్యము, పరలోకమందు శ్రీకృష్ణ సారూప్యము ఎట్లు ప్రాప్తించునో శలవీయ వలసినది."

సౌభరి "మహారాజా! నేను నీకు యమునా పంచాంగ వర్ణనము చేయుదును. దీనిచే నీకు సమస్త సిద్ధి ప్రాప్తి, మరియు శ్రీకృష్ణ సారూప్యము కలుగును. దీని వలన సూర్యుడు ఉదయించు స్థానము నుండి, అస్తమించు స్థానము వరకు విస్తరిల్లు సామ్రాజ్యము లభించును. అంతేకాక సాక్షాత్ శ్రీకృష్ణుని సహితము వశీభూతుని చేయగల శక్తి కలుగును.

సూర్య వంశ నరేంద్రా! ప్రతి దేవతకు పంచాంగములు (అయిదు అంగములు - కవచము, స్తోత్రము, సహస్రనామము, పటలము మరియు పద్ధతి) గలవని విద్వాంసులు తెలిపిరి.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి సౌభరి మాంధాతల సంవాదము, మరియు బర్హిష్మతీ పుర వనితలు, సుతల వాసినీ అసుర కన్యలు, నాగకన్యలు గోపికలుగ ఉత్పన్నమయిన ఉపాఖ్యానమను పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(యమునా కవచము)

మాంధాత చక్రవర్తి ఇట్లనియె "మహాభాగా! నాకు దయచేసి శ్రీకృష్ణుని పట్టపురాణి అయిన యమునా దేవి యొక్క కవచమును ఉపదేశింపవలసినది. నేను ఇద్దానిని సదా ధారణ చేయుదును.

సౌభరి "మహారాజా! యమునా కవచము మానవులను సర్వ విధముల రక్షించును, మరియు చతుర్విధ పురుషార్థములను ఒసంగును. వినుము. యమునా దేవి చతుర్భుజ.

ఆమె శ్యామ (శ్యామల వర్ణమున ప్రకాశించునది మరియు ఇరువది సంవత్సరముల వయసు గలిగిన స్త్రీ). ఆమె నేత్రములు అరవిచ్చిన కమల దళముల వలె సుందరములు మరియు విశాలములు. ఆ తల్లి రధారూఢ అయిన పరమ సుందరి. ఈ విధముగ ధ్యాన శ్లోకము పలికి పిదప యమునా కవచ ధారణ చేయవలెను.

సాధకుడు ఉదయముననే లేచి స్నానాదికములు పూర్తి చేసికొని, పూర్వాభిముఖుడై మౌనము వహించి కుశాశనము నందు కూర్చుండవలెను. పిదప కుశల చే శిఖను బంధించి సంధ్యా వందనము ఒనర్పవలెను. పిదప స్వస్తికాసనము నందు స్థిరముగ కూర్చొని కవచము పఠింపవలెను.

"యమున నా శిరసును రక్షించుగాక! కృష్ణుడు రెండు నేత్రములను, శ్యామ భ్రూమధ్యమును, నాకవాసినీ నాకమును

రక్షించుగాక! సాక్షాత్ పరమానంద రూపిణి రెండు కపోలములను, కృష్ణ వామంశ సంభూత రెండు చెవులను, సంరక్షణ చేయుగాక! కాళింది అధరములను, సూర్యకన్య చిబుకమును. యమస్వశ (యముని సోదరి) గ్రీవమును, మహానది హృదయమును, కృష్ణప్రియ పృష్ఠ భాగమును, తటినీ రెండు భుజములను సుశ్రోణి నితంబమును (పిరుదులను), చారు దర్శన కటి ప్రదేశమును రక్షించుగాక! రంభోరు రెండు ఊరువులను, అంగ ద్రిభేధిని రెండు మోకాళ్ళను, రాసేశ్వరి రెండు గుల్ఫములను (పిక్కలను), పాపహారిణి పదయుగళిని, పరిపూర్ణతమప్రియ లోపల, వెలుపల, క్రింద, పైన, అన్ని దిశలను నన్ను రక్షించు గాక!!

ఇది శ్రీయమునా దేవి యొక్క అత్యద్భుత కవచము. ఎవరు భక్తి భావముతో పదిమార్లు పఠింతురో వారు నిర్ధనులైననూ ధనవంతులగుదురు. ఎవరేని బుద్ధిమంతుడు మనుష్యుడు బ్రహ్మచర్య దీక్షచే, పరిమితాహారము స్వీకరించుచు, మూడు మాసములు ఈ కవచమును పఠించిన యెడల వానికి రాజ్యాధిపత్యము ప్రాప్తి అగును. ఇందు సందియము లేదు. ఎవరు భక్తి భావముతో రోజుకు వందమార్లు చొప్పున మూడు మాసాధికములు (మూడు మాసముల కంటే ఎక్కువ దినములు) పఠించిన యెడల వానికి ఏమి లభింపవు? ఎవరు ఉదయముననే లేచి ఈ కవచమును పఠింతురో వారికి సర్వతీర్థ స్నాన ఫలము లభించును, మరియు పరమయోగి దుర్లభమయిన గోలోక ప్రాప్తి యగును.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి యమునా కవచము అను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(శ్రీ యమునా స్తోత్రము)

మాంధాత చక్రవర్తి "మునీ శ్రేష్ఠా! సౌభరీ!! సంపూర్ణ సిద్ధి ప్రదాయకమయిన దివ్య యమునా స్తోత్రమును దయచేసి నాకు తెలుపవలసినది. అంతట సౌభరి మహాముని "మహామతీ! నీవు ఇప్పుడు సూర్యకన్య యమునా స్తోత్రమును వినవలసినది. ఈ స్తోత్రము భూతలము నందు సమస్త సిద్ధులు ప్రసాదించి ధర్మార్ధ, కామ, మోక్షములను సహితము ఇచ్చునది. శ్రీకృష్ణుని ఎడమ భుజము నుండి ఉద్భవించిన "కృష్ణా! నీకు నేను నమస్సుమాంజలులు సమర్పించుచున్నాను. ఓ! కృష్ణా! నీవు శ్రీకృష్ణ స్వరూపిణివి. నీకు మరల మరల నమస్కారము. ఓ! యమునాదేవీ! పాప పంకిలము చే కళంకము నందిన కుబుధ్ధులు, ఎల్లప్పుడూ సత్పురుషులతో కలహించు విషయ వాసనా సహితులయిన మానవులకు సహితము నీవు బృందావన ధామము ప్రసాదించెదవు. నీవు శ్రీకృష్ణ స్వరూపిణివి. ప్రళయ కాల ఉత్తుంగ, తరంగ సింధువు నందు నీవు మహామత్స్యరూపధారిణి వై విరాజిల్లు చున్నావు. నీ యొక్క ప్రతి తరంగము నందు భగవానుడు కూర్మరూపియై వసించుచున్నాడు, మరియు బిందు, బిందువు నందు గోవిందదేవుని దివ్యత్వము గోచరించుచున్నది.

తటినీ! నీవు లీలావతివి. నేను నీకు వందనము సమర్పించుచున్నాను. నీవు వర్షాకాల మేఘము వలె శ్యామల వర్ణ ధారిణివి. శ్రీకృష్ణ భగవానుని ఎడమ భుజము నుండి నీ ఉద్భవము ప్రాప్తించినది. సంపూర్ణ జలముల రూపరాశి అయిన విరాజనదీ వేగమును తలదన్ని, అత్యద్భుత వడితో నీ బ్రహ్మాండమును విడిచి దేవనగరమయిన అమరావతిని స్పృశించి, పర్వతములు, గండశైలాది దుర్గమ వస్తువులను నీ ప్రవాహ వేగము చే భేదించి ఈ భూమండల మధ్య భాగమును ప్రవేశించి నీ ఉత్తుంగ తరంగములతో పృధివి యందు ప్రవహించుచున్నావు. ఓ! యమునా!! నీ నామము దివ్యము. నీ నామ శ్రవణ మాత్రము చే పర్వతములు పోలు పాపరాశులు దగ్ధమగును. నీ నామ స్మరణ చే దండనీయుడయిన పాపి సహితము అదండనీయుడగును. నీ అఖండ నామము ఒక్క క్షణమైననూ నా వాక్మండలమందు నిలుచుగాక! నీ నామము ఒక్కమారు జపించినంత మాత్రమున నా సర్వపాపములు ఖండింపబడును. నీ సహోదరుడయిన సూర్యపుత్రుడు,

యముని నగర మందు "ప్రచండ" అను నీ నామము సదృఢముగ వెలుగుచున్నది. నీవు విషయవాసనాంధకార కూపము నుండి ఎల్లరనూ వెలికితీయు రజ్జువు. పాపరూప ఎలుకలను మ్రింగు కాలసర్పమునవు.

నీవు విరాట్పురుషుని ఉత్తరీయమును అలంకరించు నీలిపుష్ప మాలికవు లేదా అయన శిరసు నందు శోభించు నీలి మణుల మాలవు. నీవు ఆది కర్త అయిన శ్రీకృష్ణునికి అత్యంత ప్రియతమవు. అత్యంత సౌభాగ్యవతి వయిన యమునా! గోలోకము నందు కూడా నీ దర్శనము అద్వితీయము మరియు దుర్లభము. అటువంటి నీవు ఇపుడు భూతలము నందు ప్రవహించుచున్నావు. ఈ మానవుల సౌభాగ్యమేమని చెప్పుదును? వీరు అందువలన ధన్యులు. గోవుల, గోపాలుర సముదాయము తో సదా క్రీడించు కళింద నందినీ! యమునా నీ తటము నందు నీ ఉత్తుంగ తరంగములు నిరంతరము చేయు కోలాహలము నన్ను రక్షించుగాక! నీ దట్టమయిన నికుంజములందు కౌతుహలులై భ్రమరములు చేయు ఘుంకారములు, మయూరముల క్రేంకారముల, కల కూజితలముల కుహు కుహు రావములు నీ తరంగ కోలాహలము తో మిళితమై వ్రజమండలమునకు నూతన శోభను చేకూర్చుచున్నవి.

భూ మండలమునందు ఎన్ని ఇసుకరేణువులు కలవో అంతమంది వాక్ దేవతలు, శరీరము నందు ఎన్ని రోమములు కలవో, అన్ని జిహ్వలు సంతరించుకొని, పృధివీ మండలమందు సాధుమహాత్ములు ఒక్కొక్కరూ ఫణిపతి వలె వేలాది నాల్కలు దాల్చి నీ గుణ గానమును కీర్తించినప్పటికీ నీ గుణములను సంపూర్తిగ లెక్కింపలేరు.

కళిందనందిని, యమునా దేవి యొక్క ఈ దివ్య స్తోత్రమును ఎవరైననూ ఉష:కాలమున బ్రాహ్మణముఖతా విన్నప్పటికీ, లేక స్వయముగా చదివినప్పటికీ, ఈ భూతల మందు పరమ మంగళములు పొందుదురు. ఏ మనుష్యుడు నిత్యము ఈ స్తోత్రమును చింతన చేయునో, ఆతడు భగవానుని నిజధామమయిన గోలోకము చేరును.

(శ్రీ గర్గ సంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన సౌభరి - మాంధాత సంవాదము నందలి యమునా స్తోత్రమను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(యమునా పటలము మరియు పద్ధతి)

మాంధార చక్రవర్తి "మునిశ్రేష్ఠా! నిష్ఠుర కోరికలను సహితము తీర్చు యమునా దేవి పటలము (సూచిక) మరియు పద్ధతి (విధి విధానము) ను నాకు తెలియజేయవలసినది." సౌభరి మహాముని "మహామతీ! నీకు యమునా పటలము మరియు పద్దతి వివరించెను. దీని శ్రవణ, అనుష్ఠాన, జపాదుల ద్వారా మనుష్యుడు జీవన్ముక్తుడు అగును. ప్రప్రథముగ ప్రణవము (ఓం!) ఉచ్చరించి, పిదప మాయాబీజము (హ్రీం), లక్ష్మీ బీజము (శ్రీం), కామబీజము (క్లీం) లను పలికి కాళిందీ శబ్దపు చతుర్యాంత రూపమును (కాళింద్యై) పలుకవలెను. పిదిప దేవీ శబ్దపు చతుర్యాంతరూపము (దేవ్యై) పలుకవలెను – (ఓం హ్రీం శ్రీం క్లీం కాళింద్యై దేవ్యై నమ:) ఇది పదకొండు అక్షరముల మంత్రరాజము. దీనిని పదకొండు లక్షల సార్లు జపించిన యెడల మనుష్యుడు సిద్ధి పొందును. మానవుడు ఏఏ కామ్యముల కోసమై ఈ జపమాచరించెనో అవన్నియు అవశ్యము సంభవించును.

సుందర సింహాసనము నందు పదహారు దళముల పద్మమును గీసి, ఆ పద్మపు కర్ణిక యందు శ్రీకృష్ణ సహిత కాళింది ని న్యాసము చేయవలెను (స్థాపించ వలెను). ఆ పద్మపు పదహారు దళములను పదహారు నామములతో – గంగా, విరజా, కృష్ణా, చంద్రభాగా, సరస్వతీ, గోమతీ, కేశికీ, వేణీ, సింధు, గోదావరి, వేదస్మృతి, వేత్రవతి, శతద్రు, సరయు, ఋషికుల్యా, కుకుద్మినీ నామములతో పూజింపవలెను. పూర్వాది నాలుగు దిశల యందు బృందావనము, గోవర్ధనము, బృంద, మరియు తులసీ నామోచ్ఛరణము తో పూజింపవలెను. పిదప "ఓం నమో భగవత్యై కాళింది

నందిన్యై సూర్య కన్యకాయై యమభగిన్యై శ్రీకృష్ణ ప్రియాయై యూధీ భూతాయై స్వాహా!" ఈ మంత్రమును చదువుచు ఆవాహనాది షోడశోపచారములను ఏకాగ్ర చిత్తముతో అర్పింపవలెను. ఇది యమునా పటలము.

ఇక యమునా పద్ధతి (విధి, విధానము) – ఎంత వరకు పురశ్చరణ (పదకొండు లక్షల సార్లు జపము) పూర్తి కాదో అంతకాలము సాధకుడు (బ్రహ్మచర్యము పాటించి, మౌనమును అనుసరించి, జపము చేయవలసినదే!! ఆ సయమము నందు ఓట్స్ పిండి తినుట, భూశయనము, ఆకులయందు తినుట, మరియు మనసును వశమునందు ఉంచుకొనుట, అత్యంత ఆవశ్యకము. అంతేకాక అరిషడ్వర్గములను కామ, మోహ, లోభ, మద, మాత్సర్యాదులను) విడచి పరమ భక్తి భావము తో జపము చేయవలెను.

బ్రహ్మ ముహూర్తము నందు నిద్రలేచి, కాళిందీ దేవిని ధ్యానించి, అరుణోదయ వేళ నదీస్నానము చేయవలెను. త్రి సంధ్యల యందును సంధ్యావందన మాచరించ వలెను. మహారాజా! అనుష్ఠానము సమాప్తమయిన పిదప తమ పుత్రులతో కలసి యమున యందు స్నానమాచరించి పది లక్షల బ్రాహ్మణోత్తములను గంధ పుష్పాదులచే పూజించి వారికి ఉత్తమ భోజన మొసంగ వలెను. తదనంతరము వారికి వస్త్రములు, భూషణములు, సువర్ణమయ ఉత్తమ దక్షిణలచే వారిని ఆనంద పరుచవలెను. ఇందువలన నిశ్చయముగ ఫలితము సిద్ధించును."

"మహామతీ! నీకు యమునా దేవి యొక్క జప పూజనాది విధి, విధానములు అన్నియును తెల్పితిని. ఇంకనూ ఏమి వినదలచితివి?"

(శ్రీ గర్గసంహిత యందు మాధుర్య ఖండార్గతమయిన మాంధాత సౌభరి సంవాదము నందలి యమునా పటలము మరియు పద్ధతి వర్ణనమను పద్ధెనిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(యమునా సహస్రనామము (కాళిందీ సహస్రనామము)

మాంధాత చక్రవర్తి "ముని శ్రేష్ఠా! మీరు సర్వజ్ఞులు మరియు నిరామయులు. ఇప్పుడు నాకు సమస్త సిద్ధులు ప్రాప్తింప జేయు యమునా సహస్రనామమును దయచేసి ఉపదేశింప వలసినది. సౌభరి "మాంధాత నరేశా! నీకు అవశ్యము కాళిందీ సహస్రనామమును ప్రసాదించెదను. ఈయది సర్వసిద్ధి ప్రాప్తికరము, దివ్యము, మరియు శ్రీకృష్ణుని సహితము వశీభూత మొనర్చగల శక్తివంతము."

అశ్యశ్రీ కాళిందీ సహస్రనామ మహా మంత్రస్య! సౌభరిఋషి: శ్రీ యమునా దేవతా! అనుష్టుప్ చంద: మాయాబీజమితి కీలకమ్, రమా బీజమితి శక్తి: శ్రీ కాళిందీనందినీ ప్రసాదసిద్ధ్యర్థే జపే వినియోగ:

శ్యామాంబీజనేత్రం, సఘన ఘనరుచిం, రత్నమంజీర కూజిత్, కాంచీ కేయూర యుక్తం, కనక మణిమయే, బిభ్రంతి కుండలే ద్వే; భ్రాజంఛీ నీలవస్త్ర స్ఫురధి భజ జల ద్వారభాశాం మనోజ్ఞం, ధ్యాయేత్ మార్తాండ పుత్రీం, తనుకిరణచ్ఛయోద్వీప్త దీపాభిరామమ్!!

"ఎవరు శ్యామ (రమారమి ఇరువది అయిదు సంవత్సరముల స్త్రీ) అయి, తన నేత్ర శోభచే అరవిచ్చిన కమలదళ శోభను సహితము తిరస్కరించునో, ఎవరు నీలిమేఘ కాంతి గల శరీరము తో శోభించుచున్నదో, ఎవరు రత్నఖచిత నూపురములు, గలగలమని ధ్వనించు సువర్ణ ఖచిత కంకణ కేయూరములు, కర్ణముల యందు మణిమయ కుండలములు, దివ్యనీల దుకూలము పై మెరయుచున్న గజమౌక్తిక హారము ధరించుట చే మిక్కిలి మనోహరముగ దీప్తించు చున్నదో, శరీరము నుండి విరజిమ్ము చున్న కాంతి పుంజముల వలన ప్రజ్వలించు దీపమాల వలె ప్రకాశించుచున్న సూర్యనందిని అయిన యమునా దేవిని నేను ధ్యానించుచున్నాను".

ఓం కాళిందీ= సచ్చిదానంద స్వరూప కళిందనందినీ, యమునా = యముని సహోదరి, కృష్ణా = శ్యామల వర్ణినీ, కృష్ణరూపా = కృష్ణ స్వరూపిణి, సనాతనీ = ఎల్లప్పుడూ యుండునది, నిత్య, కృష్ణ వామాంశ సంభూతా = శ్రీకృష్ణుని ఎడమ భుజము నుండి ఉద్భవించినది, పరమానంద రూపిణీ = నిత్యనిరంతరానందమే స్వరూపముగ కలిగినది, గోలోక వాహినీ = గోలోకమున నివసించునది, శ్యామ = ఎల్లప్పుడూ ఇరువది అయిదు సంవత్సరములు వయస్సు కలిగిన ప్రౌఢ, బృందావన వినోదినీ = బృందావనము నందు ఎల్లప్పుడూ ఆనందము (వినోదము) పొందునది, రాధాసఖీ = శ్రీరాధాదేవి యొక్క సహచరి, రాసలీలా = రాసలీలా పరాయణి (రాసలీలయే పరమగమ్యముగ తలచునది), రాసమంగళమండినీ = రాస మండలమును అలంకృతము చేయునది, నికుంజ వాసినీ = లతా నికుంజములందు నివసించునది, వల్లీ = లతా స్వరూపిణి, రంగవల్లీ = రాస మండలము నందు ప్రకాశించు సుందరాలంకారము, మనోహరా = మనసును హరించునది (అత్యంత సుందర రూపిణి), శ్రీ = లక్ష్మీ స్వరూప, రాసమండలీ భూత = మండలాకారము లో రాసమండలమును అలంకరించునది, యూధీభూత = తన సహచరిల సమూహముతో కూడినది, హరిప్రియ = శ్రీహరికి అత్యంత ప్రియతమ, గోలోక తటినీ = గోలోక ధామము నందు విరాజల్లు నది, దివ్య = దివ్య స్వరూపిణి, నికుంజల వాసినీ = నికుంజలములందు నివసించునది, దీర్ఘా = అత్యంత పొడవయిన పరిమాణము కలిగినది (నది), ఊర్మివేగ గంభీరా = మిక్కిలి వేగవంతమయిన తరంగములు కలిగిన లోతైన నది, పుష్ప పల్లవ వాహినీ = పుష్పములు మరియు పల్లవములతో ప్రవహించు నది, ఘన శ్యామా = వర్షాకాల మేఘచ్ఛాయ కలిగినది, మేఘ మాలా = మేఘమాలా స్వరూపిణి, బలాకా = "కొంగ" వంటి స్వరూపము కలిగినది (పొడవైనది), పద్మమాలినీ = కమలముల మాలచే అలంకృతమయినది, పరిపూర్ణతమ = పరిపూర్ణముగ భగవత్స్వరూపిణి, పూర్ణ = పూర్ణ స్వరూపిణి, పూర్ణ బ్రహ్మ ప్రియ = పూర్ణ బ్రహ్మ అయిన శ్రీకృష్ణుని ప్రేయసి, పరా = పరాశక్తి స్వరూపిణి, మహావేగవతీ = మిక్కిలి వేగము కలది, సాక్షాత్ నికుంజ నిర్గతా = నికుంజ ద్వారము నుండి బయటకు వచ్చిన నది, మహానది = విశాల సరితా స్వరూపిణి, మందగతి = నెమ్మది నెమ్మదిగ ప్రవహించునది, విరాజ వేగ భేదినీ = గోలోక ధామమును చుట్టియున్న విరజానదిని భేదించునది, అనేక బ్రహ్మాండ గతా = అనేక బ్రహ్మాండముల లో వ్యాపించినది, బ్రహ్మద్రవ సమాకులా = బ్రహ్మ ద్రవము తో కలయునది, గంగా మిశ్రా = గంగానది తో మిళితమయినది, నిర్మలాభా = నిర్మలమయిన కాంతి కలిగినది, నిర్మలా = మలము (దోషము) లేనిది, సరితాంవర = నదుల యందు శ్రేష్ఠురాలు, రత్న బుద్ధీ భయతలే = రెండు ఒడ్లు రత్నమయములయిన నది, హంస పద్మాది సంకుల = హంసాది పక్షులు మరియు పద్మములాది పుష్పములతో నిండినది, నదీ = కలకలము చేయునది, నిర్మల పానీయ = స్వచ్ఛమయిన జలములు కలది, సర్వ బ్రహ్మాండ పావనీ = సమస్త బ్రహ్మాండములను పవిత్రము చేయునది, వైకుంఠ పరిఖీ భూతా = వైకుంఠ ధామమును నలువైపులా చుట్టి యున్నది, పరిఖా = మడుగు, ఆఖాతము, భూ భాగము మూడు వంతులు నీటిచే చుట్టుముట్టినది, పాప హారిణీ = పాపములను హరించునది, బ్రహ్మ లోక గతా = బ్రహ్మ లోకమును చేరినది (ప్రవేశించినది), బ్రాహ్మీ = బ్రహ్మ శక్తి స్వరూపిణి, స్వర్గా = స్వర్గలోక స్వరూపిణి, స్వర్గ నివాసినీ = స్వర్గ లోకము నందు నివసించునది, ఉల్లసంతీ = ఉత్తుంగ తరంగ, ప్రోత్పతంతీ = వేగముగ ముందుకు దూకునది, మేరుమాలా = మేరు పర్వతమును మాల వలె అలంకరించునది, మహోజ్వలా = అత్యంత ప్రకాశవంతమయినది, శ్రీగంగాభ శిఖరిణీ =గంగవంటి నదులయందు చూడామణి, గండశైల విభేధినీ = గండశిలలను భేదించునది, దేశాన్ పునంతీ = దేశములను (పృధివిని) పవిత్రము చేయునది.

గచ్ఛినీ = గతిశీల లేక గమనశీల, వహంతీ = ప్రవహించునది (ప్రవాహము కలది), భూమి మధ్యగ = భూ మధ్యమున ప్రవేశించినది, మార్తాండ తనూజ = సూర్య పుత్రీ, పుణ్యా = పుణ్య ప్రదాయినీ, కళిందగిరి నందినీ = కళింద పర్వత పుత్రీ; కళింద పర్వతము నుండి బయల్వెడలినది, యమస్వశా = యముని సోదరి, మందహాసా = చిరునవ్వులు చిందించునది, సుద్విజా = సుందరమయిన దంత పంక్తి కలది, రచితాంబరా = పృధివీ తలమును వస్త్రాచ్ఛాదనము వలె కప్పినది, నీలాంబర = నీలి వస్త్ర ధారిణి, పద్మముఖీ = పద్మ వదన (కమల వదన) చరంతీ = చరించునది, చారు దర్శనా = మనోహర సందరీ, రంభోరు = కదళీ తరువుల వంటి ఊరువులు కలిగినది, పద్మనయనా = కమల లోచన, మాధవీ = మాధవ ప్రియ, ప్రమదా = యవ్వన వతి, ఉత్తమా = ఉత్తమమయిన స్త్రీ, తపశ్చరంతీ = తపమాచరించినది (శ్రీకృష్ణ

ప్రాప్తి కొరకు) సుశ్రోణీ = సుందరమయిన పిరుదులు కలిగిన స్త్రీ, కుజన్నూపుర మేఖలా = మృదు మధురముగ ధ్వనించుచున్న నూపుర కంకణములు కలది, జలస్థితా = నీటి యందు నివసించునది, శ్యామలాంగి = నీలి వర్ణము గల అంగములు కలిగినది, ఖాండావాభా = ఖాండవ వనమునకు శోభ నిచ్చునది, విహారిణీ = విహరించునది, గాండీవి భాషిణీ = గాండీవధారి అయిన అర్జునుని తో తన తపశ్చర్య యొక్క ఉద్దేశ్యము తెలిపినది, వన్యా = ప్రవాహ వేగము కలది, శ్రీకృష్ణాంవరమిచ్ఛితి = శ్రీ కృష్ణుని పతిగా పొందు కోరిక కలిగినది, ద్వారా గమనా = ద్వారక యందు ప్రవేశించినది (ప్రవహించునది), రాజ్ఞీ = రాణి, పట్టపురాజ్ఞీ = పట్టపు రాణి, పరంగతా = పరమాత్ముని ప్రాప్తించినది.

మహారాజ్ఞీ = మాహారాణీ, రత్నభూషా = రత్నభూషణ విభూషిత, గోమతీ = గోవుల సముదాయము చే పరివేష్ఠిత మయినది లేక గోమతీ నదీ స్వరూపిణి, తీర చారిణీ = ఒడ్డు లేక చెలియలి కట్ట లేక తీరము పై ప్రవహించునది, స్వకీయ = శ్రీకృష్ణుని యొక్క వివాహిత పత్నీ, సుఖా = సుఖ స్వరూపిణి, స్వార్ధా = అన అభీష్ఠములను సాధించుకొనునది, స్వభక్త కార్య సాధినీ = తన భక్తుల కార్యములను సిద్ధింపచేయునది, నవలాంగా = వినూత్నమయిన అంగములు కలది, వరాంగా = సుందరమయిన అంగములు కలిగినది (సుందరాంగి), వామలోచనా = అలంకరింప బడిన కన్నులు కలిగినది, అజాత యవ్వనా = పుట్టుకతో యవ్వనవతి, అదీన = దీనత్వము లేనిది; ఉదార రూపిణి, ప్రధా = ప్రకాశినీ, కాంతి = కాంతి రూపిణి, ద్యుతి = తేజస్వరూపిణి, చవి = రంగు రంగుల కాంతితో ప్రకాశించునది, శుశోభ = సుందరమయిన శోభ కలిగినది, పరమా = ఉత్కృష్ఠ స్వరూపిణి, కీర్తి = యశ: స్వరూపిణి, కుశలా = చతురవతి, అజ్ఞాత యవ్వనా = తన యవ్వన ఆరంభమును ఎరుగనిది, నవోఢా = కొత్తగా పెళ్ళయిన స్త్రీ, మధ్యగ = 16–20 సంవత్సరముల వయస్సు గల స్త్రీ (బాల, యుక్త వయస్సు మధ్య గల స్త్రీ), మధ్యా = మధ్యానాయిక, ప్రోఢి = పరిపక్వత కలిగిన గౌరవింపవలసిన స్త్రీ (గౌరవింప దగిన), ప్రోఢా = సాహసము కల యుక్తవయస్సురాలైన స్త్రీ, ప్రగల్బక = ఉదాత్త చరిత్ర గల స్త్రీ, ధీర = ధైర్య శాలిని, అధీర = మెరుపు తీగ వలె చురుకు దనము కలిగినది.

ధైర్య ధరా = ధైర్య ధారిణీ, జ్యేష్ఠా = మనసు నుండి ఉదయించిన పరాశక్తి (అందరి కంటె పెద్దది), శ్రేష్ఠా = శ్రేష్ఠురాలు, కులాంగనా = కుల వధువు, క్షణ ప్రభా = విద్యుత్ ను పోలిన కాంతిమతి, చంచలా = వేగశాలిని, అర్చ్యా = పూజనీయమయిన వనిత, విద్యుత్ = మెరుపు తీగ, తడిత్ = మేఘము నందలి విద్యుల్లత, స్వాధీన పతికా =సుహృద్భావము చే పతిని వశీకరించుకున్న స్త్రీ, లక్ష్మీ = లక్ష్మీ స్వరూప, పృష్ఠా = అనుగ్రహ శాలినీ, స్వాధీన ఛతృకా = సుహృత్ భావము చే పతిని వశీకరించుకున్న వనిత, కలహాంతరితా = ప్రేమ కలహము చే పతీవియోగమును సహించు స్త్రీ, భీరు: = పిరికితనము గల స్త్రీ లేక స్త్రీ, ఇచ్చా = ప్రియుని అభిలాషను మన్నించు స్త్రీ, ప్రోక్తందితా = ప్రియుని దర్శన లాలస కలిగిన స్త్రీ, ఆకుల్ = పరిపూర్ణ ప్రేమ స్వరూపిణి, కశి పుస్థా = శయ్య పై విరాజమానమయిన స్త్రీ, దివ్య శయ్యా = శ్యామసుందరునికై దివ్యశయ్యను ఏర్పరుచు కోమలి, గోవింద హృత్ మానసా = గోవిందుని చే మనసు హరింపడిన స్త్రీ, ఖండిత = ప్రియుని విరహము చే కోపించిన స్త్రీ, అఖండ సౌభాధ్య = అఖండ సౌభాగ్య శాలినీ, విప్రలబ్ద = ప్రియుని చే మోసగింపబడిన స్త్రీ, అభిసారిక = ప్రియుని సమాగమునకై ఒకానొక సంకేత స్థలమునకు వెళ్ళు స్త్రీ, విరహార్త = ప్రియుని విరహము చే పీడింపబడుచున్న స్త్రీ, విరహిణీ, వియోగినీ, నారీ = నరావతారము తీసికొనిన శ్రీకృష్ణుని భార్య, ప్రోషిత భర్తుకా = భర్త పరదేశమునకు ఏగిన స్త్రీ, మానినీ = మానవతీ, మానదా = గౌరవమును ప్రసాదించు స్త్రీ, ప్రాజ్ఞా = విదుషీమణి.

మందార వన వాసినీ = కల్పవృక్ష వనము నందు నివసించు లలన, ఘుంకారిణీ = నడచుచు తిరుగు చున్నప్పుడు భూషణములు చప్పుడు చేయుచున్న స్త్రీ, ఘుణత్కారీ = చప్పుడు చేయు నూపురములు కలది, రణన్ మంజీర నూపురా = మ్రోగుచున్న నూపుర మంజీరములు కలది, మేఖలా = భగవంతుని తెలిసికొనినది, అమేఖలా = సాధారణ సమయము లందు వడ్డాణము ధరింపనిది, కాఛ్చీ = దివ్య పృధివీ పరిమళ, అకాఛ్చినీ = సాధారణ సమయమందు కాఛ్చీనామ ఆభూషణా రహిత, కాంచనమయీ = సువర్ణ స్వరూపిణి, కంచుకీ = బిగువయిన వస్త్రము ధరించినది, కంచుక మణీ = కంచుక మణి స్వరూపిణి, శ్రీకంఠ = సుందరమయిన కంఠము కలది, ఆఢ్యా = సంపత్తి శాలినీ, మహామణి = బహుమూల్య మణి స్వరూపిణి, శ్రీహారిణీ = మనోజ్ఞ హార ధారిణీ, పద్మహారా = కమల మాలాలంకృత,

ముక్తా = నిత్యముక్తా, ముక్త, ఫలార్చిత = ముక్తా ఫలములతో పూజింపబడునది, రత్న కంకణ కేయూర = రత్న కంకణ కేయూరములు ధరించినది, స్ఫుర ద్యంగుళ భూషణా = అందమయిన అంగుళులు కలది, దర్పణా = దర్పణ స్వరూపిణి (ప్రజ్వలిత స్వరూపిణి), దర్పణీభూతా = తన నిర్మలత్వము చే ఇతరులను దీపింపచేయునది, దుష్ఠ దర్ప వినాశినీ = దుష్టుల దూర్తత్వములను నాశము చేయునది, కంబుగ్రీవా = శంఖము వంటి కంఠము కలది, కంబుధరా = శంఖము చే నిర్మింపబడిన భూషణములు కలది, గ్రైవేయక విరాజితా = కంఠభూషణముల చే శోభించునది, తాటంక కినీ = తాటంక ధారిణీ, దంత ధరా = దంత ధారిణీ, హేమకుండల మండితా = సువర్ణ కుండలాలంకృత, శిఖాభూషా = శిఖ యందు ఆభూషణములు ధరించినది, భాల్‌పుష్పా = పాలభాగమందు పుణ్యమయ కుంకుమ ధరించినది, నాసామౌక్తిక శోభితా = ముక్కుకు ముత్యపు పుడక ధరించినది, మణి భూమి గతా = మణిమయ ధరిత్రి యందు చరించునది.

దేవీ = దివ్య స్వరూపిణి, రైవతాద్రి విహారిణీ = రైవత పర్వత మందు విహరించునది, బృందావన గతా = బృందావనము నందు ప్రవహించునది, బృందా = బృందావనము అధిష్ఠాత్రి దేవి, బృందావన లతా = బృందావనమందలి లతలతో తాదాత్మ్యము చెందునది, మాధ్వీ = మకరంద స్వరూపిణి, బృందారణ్య విభూషణా = బృందావనమును భాసింపచేయునది, సౌందర్య లహరీ లక్ష్మీ = సుందర తరంగ యుక్తమయిన లక్ష్మీ స్వరూపిణి, విశ్రాంత వాసినీ = విశ్రాంత తీర్ధ వాసినీ, కామ్యా = కమనీయ స్వరూపిణి, రమ్యా = రమణీయ స్వరూపిణి, గోకుల వాసినీ = గోకుల వాసిని, రమణస్థల సౌభాద్యా = రమణ తీర్ధ శోభను ఇనుమడింపచేయునది, మహావన మహానదీ = మహావనమును వనమునందు ప్రవహించు మహితాన్విత నది, ప్రణతీ = భక్తజన వందితా, ప్రోన్నతా = ఉత్కృష్ఠ తరంగ యుతీ, పృష్ఠా = ప్రేమానుగ్రహ పరిపుష్ఠ స్వరూపిణి, భారతీ = దివ్య జ్ఞానము నందు రమించునది, భరతార్చితా = తీర్ధరాజమయిన ప్రయాగకు అశ్రయ భూతమయినది, గోత్రా = గోవులను రక్షించునది, గంగా సాగర సంగమా = గంగ మరియు సాగరము తో సంగమించునది, సప్తాబ్ధి భేదినీ = సప్త సముద్రములను భేదించునది, లోలా = ప్రవహించుచున్న లేక డోలాయమానమైన నది, బలాత్ సప్త ద్వీప గతా = తన బలము లేక వేగము చే సప్త ద్వీపములను చేరగల్గునది, లుఠంతీ = పృధివి యందు పరుగులిడునది, శైల భిద్యంతీ = పర్వతములను భేదించునది, స్ఫురంతీ = స్ఫురణ శీల, వేగ వత్తరా = అతిశయ వేగ శాలినీ, కాంచనీ = స్వర్ణమయీ, కాంచనీ భూమి = గోలోకము నందు స్వర్ణమయ భూమి యందు ప్రవహించునది, కాంచన భూమి భావితా = స్వర్ణమయి భూమి యందు ప్రకటిత మయినది.

లోకలీలా = లోకము నందు లీలలు చేయునది, లోకాలోక చలార్చితా = లోకాలోక పర్వతము నందు పూజలందుకొను దేవత, శైలోద్గతా = (శైలము (కొండ) కాళిందీ పర్వతము నుండి ఉద్భవించినది, స్వర్గ గతా = స్వర్గము నందు ప్రవహించునది, స్వర్గార్చా = స్వర్గము నందు అర్చింపబడునది, స్వర్గ పూజిత = స్వర్గము నందు పూజింపబడునది, బృందావనీ = బృందావనాధిష్ఠాత్ర దేవి, వనాధ్యక్షా = వనమునకు స్వామిని, రక్షా = రక్షించునది, కక్షా = బృందావనమునకు మేఖలా (బెల్ట్) స్వరూపిణి, తటే పటీ = తటమునకు వస్త్రము వలె అంటుకుని యుండునది, అసికుండ గతీ = అసికుండము నందు ప్రాప్తించునది, కచ్ఛా = నదీ సారూప్యమున యున్న ఒండ్రు నేల స్వరూపిణి, స్వచ్ఛందా = స్వచ్ఛంద గామినీ, ఉచ్ఛలితా = ఛెంగు ఛెంగు మని ఎగురునది, ఆదిజ = ఆదిభూతమయిన శ్రీకృష్ణుని నుండి ఉద్భవించినది, కుహరస్థ = పాతాళము నందు విహరించునది, రధప్రస్థా = శ్రీకృష్ణుని పట్టపు రాణిగా రధమునందు ప్రయాణించునది, ప్రస్థా = ప్రస్థాన శీల, శాంతరతీ = పరమ శాంతిమయీ, ఆతురా = శ్రీకృష్ణ దర్శనము నందు ఆత్రుత కలిగినది, అంబుచ్ఛటా = జలముల తేజస్సు చే శోభించుచున్నది, శీకరాభా = పొగమంచు చే ఆవరింపబడినది, దర్దురా = నీలిమేఘ కాంతివతి; (కప్పలకు ఆశ్రయమునిచ్చునది), దర్దురీ ధరా = కప్పలధ్వని వలె వినిపించు కదిలెడు ప్రవాహము కలది, పాపాంకుశా = పాపములకు అంకుశము వంటిది, పాపసింహా = పాపముల పాలిటి సింహ స్వరూపిణి, పాపద్రుమ కుఠారిణి = పాపములనెడు వృక్షములకు గొడ్డలి వంటిది, పుణ్య సంఘా = పుణ్య సముదాయ స్వరూపిణి, పుణ్య కీర్తి = పవిత్ర కీర్తి స్వరూపిణి, పుణ్యదా = పుణ్యదాయినీ, పుణ్య వర్ధినీ = తన దర్శనమాత్రముచే పుణ్య వృద్ధి కలిగించునది, మధువన్ నదీ = మధువనము నందు ప్రవహించునది.

ముఖ్యా = అతి ముఖ్యమయిన నది, అతులా = సరిపోల్చ లేనిది, తాళవనస్థితా = తాళవనము నందు ఉపస్థిత

మయినది, కుబ్జా = వంకర తిరిగినది (నది ఎల్లప్పుడూ వంకరగా ప్రవహించును), కుముదా =దుర్గా స్వరూపిణి, అంభోజ వర్ధినీ = తన జలముల యందు కమలములను ప్రవర్ధిల్ల జేయునది, ప్లవరూపా = సంసార సాగరము నుండి తరింప జేయు నౌకా స్వరూపిణి, వేగవతీ = వేగ శాలినీ, సింహ సర్పాది వాహినీ = తన ప్రవాహ వేగము చే సింహ సర్పాది జీవులను ఈడ్చుకు పోవునది, బహుళీ = గో స్వరూపిణి, బహుదా = ఎన్నింటినో వరములను ప్రసాదించునది, బహ్వీ = బ్రహ్మ స్వరూపిణీ, బహుళా = గో స్వరూపిణి, వన వందితా = వనముల చే నమస్కరింపబడునది, రాధా కుండ కళా = తన కళలతో రాధాకుండము నందు ఉపస్థిత మయినది, ఆరాధ్యా = ఆరాధనా యోగ్యురాలు, కృష్ణ కుండ జలాశ్రితా = కృష్ణ కుండము నందు ఉపస్థిత మయినది, లలితా కుండగ = లలితా కుండము నందు ఉపస్థిత మయినది, విశాఖా = విశాఖా సఖీ స్వరూపిణి, కుండమండితా = అనేక కుండముల చే శోభించునది, గోవింద కుండ నిలయా = గోవింద కుండము నందు ఉపస్థిత మయినది, గోపకుండ తరంగిణీ = గోప కుండము నందు తరంగముల తో యుండునది, శ్రీ గంగా = గంగా స్వరూపిణి, మానసీ గంగా = మానసీ గంగా స్వరూపిణీ, కుసుమాంబర భావినీ = పుష్పమయ వస్త్ర శుశోభినీ, గోవర్ధనీ = గోవులను వృద్ధి పరచునది; గోవర్ధన పర్వతపు శక్తి, గోధనాఢ్యా = గోధన సంపన్నా, మయూర వర వర్ణినీ = నెమలి వలె సుందర వర్ణము కలది, సారసీ = సారస పక్షులకు ఆశ్రయము నిచ్చునది, నీలకంఠాభా = మయూర కంఠము వంటి దివ్య వర్ణ స్వరూపిణి, కూజత్ కోకిల పోతకీ = కోకిలల కలకూజిత ధ్వనులు వినిపించేనది, గిరిరాజ ప్రసూ: = గిరిరాజయిన కాళిందీ పర్వతము నుండి ప్రకటిత మయినది.

భూరి: = బహు వైభవ శాలిని, ఆతపత్రీ = తటము నందు నివసించు ప్రజలను పోగ (అగ్ని) నుండి రక్షించునది, ఆత పత్రిణీ = పట్టపురాణి రూపమున ఛత్రము ధరించునది, గోవర్ధనాంగకా = గోవర్ధన పర్వతము నందు విరాజమానమైనది, గోదంతీ = ఆకుపచ్చని కేసరములు పూయబడినది. దివ్యౌషధ నిధి = దివ్యమయిన ఔషధులకు ఆలవాలము, శృతి = సద్గతులకు ఆలవాలము, పారదీ = భవసాగరమును దాటించునది, శారదీ = శరత్కాల శోభా స్వరూపిణి, భృతి = పాలన మరియు పోషణకు సాధనము, శ్రీకృష్ణ చరణాకంస్థా = శ్రీకృష్ణ చరణ విరాజిత, అకామా = లౌకిక కామనా రహిత (లౌకిక కోరికలు లేనిది) కామవనాంచితా = కామ్యక వనము నందు పూజింపబడు దేవి, కామాటవీ = కామ్యక వన రూపిణీ, నందినీ = అందరినీ ఆనంద పరచే దేవి, నందగ్రామ మహీ = నందగ్రామము నందలి ధరణీ స్వరూపిణి, ధరా = పృధివీ స్వరూపిణి, భృహత్సాను ద్యుతి ప్రోతా = భృహత్సాను పర్వత శిఖర సంయుక్తము, నందీశ్వరా సమాన్వితా = నందీశ్వర పర్వత సహితము (సద్గుణములు కూడియున్నది.), కాకలి = కోకిలల కుహు కుహు నాదములతో నిండియున్నది, కోకిలా మయీ = కోకిలలతో పరివ్యాప్త మయినది, భాండీర కుశ కౌశలా = భాండీర వనము నందు కుశలచే నిండియున్నది, లోహార్గళ ప్రదా = శ్రీకృష్ణుని తన ప్రేమయనెడు లోహముతో చేయబడిన రజ్జువుతో బంధించునది, కారా = తన ప్రేమచే శ్రీకృష్ణుని ఆపి కదలకుండ చేయుదేవి, కాశ్మీర వసనా = కేసరి రంగు (ఎరుపు రంగు కలనేత) వస్త్రములు ధరించు దేవీ స్వరూపము, వృతా = శ్రీకృష్ణుని చే స్వీకరించబడినది, బర్హిషదీ = బర్హిషదీ పుర స్వరూపిణి, శోణపురీ = శోణపురీ స్వరూపిణి, శూరక్షేత్ర పురాధికా = శూరక్షేత్ర పురము కంటే అధికమయిన మహాత్మ్యము కలిగినది, నానాభరణ శోభాఢ్యా = వివిధాభరణ శోభా సంపన్న, నానావర్ణ సమన్విత = అనేక రంగులతో కూడియున్నది.

నానా నారీక దంబాఢ్యా = నానా విధములయిన (దేవ, మనుష్య, నాగ, యక్ష) స్త్రీ సమూహములచే పరివేష్ఠిత మయినది, నానా రంగ మహీరూహా = తటము నందు వివిధ రంగుల వృక్షముల చే శోభించునది, నానా లోక గతీ = వివిధ లోకములు ప్రవేశించినది, అభ్యార్చి = అన్ని వైపులా తన తేజోరాశిని నింపునది, నానా జల సమాన్విత = అనేక నదుల సమ్మిళిత జలములచే నిండినది, స్త్రీ రత్నమ్ = స్త్రీల యందు రత్నరూపిణి (మిక్కిలి శ్రేష్ఠమయినది), రత్న నిలయా = రత్నములకు నిలయమైనది, రత్నములు తాపడము చేసిన గృహము నందు నివసించునది, లలనా = స్త్రీ, శ్రీకృష్ణుని చే ఇష్టపడునది, రత్న రంజనీ = రత్నముల ద్వారా వివిధ వర్ణముల ప్రకాశమును నలువైపులా ప్రసరించునది, రంగిణీ = రాస రంగ స్థలమందు రమించునది, రంగ భూమాఢ్యా = పలురంగుల సమ్మిళతము చే కూడి యున్నది, రంగా = హర్షోల్లాసిత, రంగ మహీరూహా = రంగు రంగుల వృక్షములచే కూడినది, రాజవిద్యా = విద్యలందు ఉత్కృష్ఠ మయినది, రాజ గుహ్యా = రహస్య విద్యల యందు శ్రేష్ఠమయినది (అతి రహస్యమయినది), జగత్కీర్తి = జగత్తు చే కీర్తింపబడునది,

ఘనా = అతి గొప్పది, శ్రీకృష్ణ ప్రేమ చే ఘనీభూతమయినది, అఘనా = ప్రవహించునది, విలోల ఘంటా = కదులుచున్న ఘంట వంటి శబ్దము చేయునది, కృష్ణాంగా = శ్యామలాంగి (శ్యామల వర్ణ అంగములు కలిగినది), కృష్ణ దేహ సముద్భవా = శ్రీకృష్ణుని శరీరము నుండి ఉత్పన్నమయినది, నీల పంకజ వర్ణభా = నీలి పద్మపు కాంతి కలిగినది, నీలి పంకజ హారిణీ = నీలి కమలముల మాలా ధారిణీ, నీలాభా = నీలి వర్ణపు కాంతి కలిగినది, నీల పద్మాఢ్యా = నీలి కమలముల చే నిండినది, నీలాంభరుహ వాసినీ = నీలి కమలముల యందు నివసించు దేవి, నాగవల్లీ = తాంబూల లతా స్వరూపిణి, నాగపురీ = నాగుల నివాసము, నాగులకు ఆలవాలమయిన ప్రదేశము, నాగవల్లీ దళార్చిత = తమలపాకుల చే అర్చింపబడు దేవి, తాంబూల చర్చితా = తాంబూలము చే రంజితమయిన మోవి కలది, చర్చా = కస్తూరి, చందనాది ఆలేపనములు అలదుకున్నది, మకరంద మనోహరి = పుష్ప మకరందము చే మనసును హరించునది.

సకేశరా = కేసర సహితమయినది, కేశారిణీ = కేసర ధారిణి, కేశ పాశాభి శోభితా = కేశ పాశము చే శోభించునది, కజ్జలాభా = నల్లని కాటుక కాంతిని వెలయించుదేవి, కజ్జలాత్వా = కన్నుల యందు నల్లని కాటుక దిద్దబడిన దేవి, కజ్జలీ = నల్లని కాటుక వంటి దేవి స్వరూపము, కలితాంజనా = నేత్రములందు అంజనము (కాటుక) ధరించిన దేవత, అలత్త చరణా = పాదములకు ఎర్రని పారాణి ధరించిన దేవి, తామ్రా = తామ్ర వర్ణిని, లాలా = లాలనీయ (లాలింపబడు దేవి), తామ్రీకృతాంబరా = రాగి రంగుగల వస్త్రము ధరించు దేవి, సింధూరితా = పాపడి యందు సింధూరము ధరించు దేవి, అలిప్తవాణి = దోషము లేని పలుకులు కలిగినది, సుశ్రీ = ఉత్తమ శోభాయుతమయిన స్త్రీ, శ్రీఖండ మండితా = చందనము చే అలంకృతమయిన దేవి, పటీర పంకవసనా = చందనమలదిన వస్త్రము ధారణ చేయు స్త్రీ, జటామాంసీ = కస్తూరి వేరు రూపమున ప్రకాశించు దేవి, స్రగంబరా = పుష్పమాలికలను వస్త్రముల వలె ధరించుదేవి, ఆగరీ = అమావాస్య వలె నల్లని దేవి, అగరు గంధత్వా = అగరు గంధము వలె శరీరము సుగంధము నిచ్చునది, తగరాశ్రితమారుతా = తగరు చక్కెర వంటి సుగంధము వీచుదేవి, సుగంధ తైల రుచిరా = సుగంధ నూనెల వంటి గంధము కలది, కుంతలారి = భృంగములు విహరించు సుగంధ కుంతలములు కలది, సకుంతలా = కుంతలముల రాశి కలది, శకుంతలా = శకుంతలా పక్షులను స్వాగతించునది, అపాంశుల = పవిత్రమయిన దేవి, పాతివ్రత్య పరాయణా = పతవ్రతా ధర్మమును ఆచరించు దేవి, సూర్య ప్రభా = సూర్యుని వంటి తేజశ్శాలిని, సూర్య కన్యా = సూర్యుని పుత్రిక, సూర్య దేహ సముద్భవా = సూర్యుని శరీరము నుండి ఉత్పన్నమయినది, కోటి సూర్య ప్రతీకాశీ = కోటి సూర్య సదృశ తేజశ్శాలినీ, సూర్యజా = సూర్యపుత్రీ, సూర్య నందినీ = సూర్యుని ఆనంద పరచునది.

సంజ్ఞా = సమ్యక్ జ్ఞానస్వరూపిణి, సంజ్ఞా సుతా = సంజ్ఞా దేవి యొక్క పుత్రిక, స్వేచ్ఛా = స్వాధీనము గల దేవి, అసంజ్ఞా = ప్రియుని ప్రేమ యందు తనను తాను మరచునది, సంజ్ఞా = చేతనా స్వరూపిణి, మోద ప్రదాయినీ = ఆనందమును ప్రసాదించు దేవి, సంజ్ఞా పుత్రీ = సంజ్ఞాదేవి సుత, స్ఫుచ చ్ఛాయా = ప్రజ్వలించుచున్న కాంతిమతి, తపతీ తాప కారిణీ = సవతి చెల్లెలు అయిన తపతీ దేవికి తాపము నిచ్చునది, సావర్ణ్యానుభవా = , దేవి = దేవతా స్త్రీ, భడవా = హయరూపిణి, సౌఖ్య దాయినీ = సుఖమును ప్రసాదించు దేవి, శనైశ్చరానుజ = శనైశ్చరుని చెల్లెలు, కోలా = జ్వాలామయి, చంద్ర వంశ వివర్ధనీ = చంద్ర వంశమును వృద్ధిపరచునది, చంద్ర వంశ వధూ: = చంద్ర వంశపు కోడలు, చంద్రా = ఆహ్లాద దాయిని, చంద్రావళీ సహాయినీ = చంద్రావళి అను సఖికి సహాయురాలు, చంద్రావతీ = చంద్ర స్వరూపిణి, చంద్రలేఖ = చంద్ర కిరణ స్వరూపిణి, చంద్రకాంత = చంద్రుని వంటి కాంతి స్వరూపిణి, అనుగా = ఎల్లప్పుడూ శ్రీకృష్ణుని అనుగమించునది, అంశుకా = ఉజ్వల వస్త్ర ధారిణీ, భైరవి = భైరవీ ప్రియ, పింగళాశంకీ = సూర్య పార్షదుడయిన పింగళుని చే భయ భీతురాలు అగు స్త్రీ, లీలావతి = అనేక విధములయిన లీలలు సలుపు స్త్రీ, అగరీమయా = అగరు సుగంధమును వ్యాప్తి చెందించు దేవి, ధనశ్రీ = ధనలక్ష్మీ, దేవ గాంధారి = సిద్ధౌషధి స్వరూపిణి (రాగ స్వరూపిణి) స్వర్మణి = స్వర్గలోకపు మణి (మిక్కిలి విలువయిన వస్తువు), గుణవర్ధినీ = గుణములును ఇనుమడింప చేయు దేవి, వ్రజమల్లా = వ్రజమండలము నందు మల్లయుద్ధ స్వరూపిణి.

ఛందకారీ = విరోధులను బంధించునది, విచిత్ర = విచిత్రమయిన శక్తి సంపన్నమయిన దేవి, జయకారిణీ = విజయమును ప్రసాదించు దేవతా స్వరూపిణి,

ఈ క్రింది నామములు అన్నియు యమునా పర్యాయ పదములయిన వివిధ రాగముల నామములు, (గాంధారీ, మంజరీ, తోడి, గుర్జరీ, ఆశావరీ, జయ, కర్ణాటీ; రాగిణీ, గౌరీ, వైరాలీ) గౌర వాటికా = తెల్లని తేజ సంపన్నిని అయిన శ్రీరాధాదేవికి ఉద్యాన రూపిణి, (చతుశ్చంద్రా; కలాహేరీ, తైలంగీ, విజయావతీ; తాలీ), తళస్వరా = తాళము వాయించుచు స్వర సూచన చేయుదేవి. గానా = గాన స్వరూపిణి, క్రియామాత్రా ప్రకాశినీ = తాళక్రియా ప్రకాశినీ, (వైశాఖీ, చంచలా, చారు, మాచారీ, ఘాఘటీ, ఘటా; వైరాగరీ, శోరటీ; ఈశా, కేదారీ, జలధారికా; కామాకరశ్రీ, కళ్యాణీ, గౌడ కళ్యాణ మిశ్రితా; రామ సంజీవని, హేలా, మందారీ, కామ రూపిణీ, సారంగి మారుతీ, హోఢా, సాగరీ, కామవాదినీ, వైభాసీ, మంగళా;) చాంద్రీ = రాసపూర్ణిమ నాటి వెన్నెల స్వరూపిణి, రాసమంగళ మండనా = రాస మండలమును ప్రకాశింప జేయునది, కామధేను: = కామధేనువు వలె కోరికలను ఈడేర్చునది, కామలతా = కామములను పూర్ణము చేయు లతా స్వరూపిణి, కామదా = మనోభీష్ఠములను తీర్చునది, కమనీయకా = తీయని మనసు కలది, కల్ప వృక్ష స్థలీ = కల్పవృక్షములకు ఆలవాలము, స్థూలా = స్థూల రూపిణి, క్షుధా = జీవుల యందలి ఆకలి రూపిణి, సౌధా నివాసినీ = భవనముల యందు నివసించునది, గోలోక వాసినీ = గోలోకము నందు నివసించునది, సుభ్రూ = సుందరమయిన కనుబొమలు కలిగినది, యష్ఠి భృత్ = వేత్ర హస్తిని, ద్వార పాలికా = ద్వారమును రక్షించునది, శృంగార ప్రకరా = అలంకరణ సామాగ్రి స్వరూపిణి, శృంగా = మన్మధ భేద స్వరూపిణి, స్వచ్ఛా = విమల స్వరూపిణి, శయ్యోపకారికా = శయ్యను సవరించు భామినీ, పార్షదా = శ్రీరాధాకృష్ణుల పార్షద స్వరూపిణి.

సుసుఖీ సేన్యా = సుందర సఖీమణులతో సేవింపబడునది, శ్రీ బృందావన పాలికా = బృందావనమును రక్షించునది, నికుంజ భృత్ = నికుంజ పోషిణి, కుంజ పుంజా = కుంజ సముదాయ స్వరూపిణి, గుంజాభరణ భూషితా = భ్రమర గుంజములచే ఆభూషిత, నికుంజ వాసినీ = నికుంజముల యందు నివసించు దేవి, ప్రోష్యా = ప్రవాసినీ (విదేశముల యందు నివసించు నది), గోవర్ధన తటౌభవా = గోవర్ధనము నందు ప్రకటింపబడినది (మానసీ గంగా) విశాఖా = విశాఖా సఖీ స్వరూపిణి, లలితా = లాలిత్య రూపిణి, రామా = మిక్కిలి రమ్య స్వరూపిణి, నీరుజా = రోగరహిత, మధుమాధవీ = వసంత ఋతువు నందలి మాధవీ లతా స్వరూపిణి, ఏకా = అద్వితీయ, నైక సఖీ = అనేక మంది సఖులచే పరివేష్ఠిత మయినది, శుక్లా = శుద్ధ స్వరూపిణి, సఖీ మధ్యా = అనేకమంది సఖుల మధ్య విరాజిల్లు దేవి, మహామనా: = విశాల హృదయము గల దేవి, శృతిరూప = వేద స్వరూపిణి, ఋషిరూపా = ఋషిరూప గోపిక, మైధిలా = మిధిలాపుర వాసినీ గోపికలు చే పరివేష్ఠిత, కౌసలాస్త్రియ: = అయోధ్యా పుర వాసినీ గోపికలు చే పరివేష్ఠిత, యజ్ఞసీతా = యజ్ఞ సీతా స్వరూపిణులయిన చే గోపికలు పరివేష్ఠిత, పుళిందికా: = పుళిందికా: = పుళింద దేశు గోపికలు చే పరివేష్ఠిత, రమావైకుంఠ వాసిన్య: = వైకుంఠ వాసినీ గోపికలు చే పరివేష్ఠిత, శ్వేత ద్వీప సఖీజనా: = శ్వేత ద్వీప వాసినులు అయిన గోపికలు చే పరివేష్ఠిత, ఊర్ధ్వ వైకుంఠ వాసిన్య: =ఊర్ధ్వ వైకుంఠ వాసినీ గోపికలు చే పరివేష్ఠిత, దివ్యాజిత పద్మాశ్రజతా: = దివ్యాజిత పదమునందలి గోపికలు చే పరివేష్ఠిత, శ్రీలోకాచల వాసిన్య: = లోకాచల వాసినీ గోపికలు చే పరివేష్ఠిత, సాగరోద్భవాశ్రీసఖ్యా = శ్రీ మహాలక్ష్మీ సఖులయిన గోపికలు చే పరివేష్ఠిత, దివ్య = దివ్యరూప గోపికలు, ఆదివ్య = మానవ రూప గోపికలు చే పరివేష్ఠిత.

దివ్యాంగ = దివ్యమయిన అంగములు కలిగినది, వ్యాప్తా = సర్వ వ్యాపినీ, త్రిగుణ వృత్తయ: = త్రిగుణాత్మక స్వరూపిణి, భూమి గోప్య = భూతలోత్పన్న గోపికలు చే పరివేష్ఠిత, దేవనార్య = దేవాంగనా స్వరూప గోపికలు చే పరివేష్ఠిత, లతా: = లతా స్వరూపిణీ గోపికలు చే పరివేష్ఠిత, ఓషధీరూప = ఓషధీరూప గోపికలు చే పరివేష్ఠిత, జాలంధర్య: = జాలంధర గోపకిలు చే పరివేష్ఠిత, సింధు సుతా: = సముద్ర కన్యకా గోపికలు చే పరివేష్ఠిత, పృధు బర్హిష్మతీ భవా: = పృధు చక్రవర్తి యొక్క బర్హిష్మతీ నగరపు గోపికలు చే పరివేష్ఠిత, దివ్యాంబరా = దివ్య వస్త్ర ధారిణీ, అప్సరస: = అప్సర గోపికలు చే పరివేష్ఠిత, సౌతలా = సుతల లోక గోపికలు చే పరివేష్ఠిత, నాగకన్యకా: = నాగకన్యా స్వరూప గోపికలు చే పరివేష్ఠిత, పరంధామ: = పరంధామ స్వరూపిణి, పరంబ్రహ్మా = పరంబ్రహ్మా స్వరూపిణి, పౌరుషా = పురుషార్ధ స్వరూపిణి, ప్రకృతి:పరా = పరాప్రకృతి స్వరూపిణి, గుణభూ: = సద్గుణములకు పుట్టినిల్లు, గీతా = ఎల్లరచే తన యశోగానమును కీర్తింపచేయునది, గుణాగణమయీ = సద్గుణ స్వరూపిణి, గుణా: = దివ్య గుణాత్మికా, చిత్ ఘనా:

= చిదానంద ఘన స్వరూపిణి, సదసన్మాలా = సదసత్ సముహాత్మికా, దృష్టి = జ్ఞాన స్వరూపిణి, దృశ్యా = దృశ్య స్వరూపిణి, గుణకరీ = గుణములకు ఆలవాలము, మహత్తత్త్వమ్ = సుబుద్ధి రూపిణి, అహంకార: = అహంకార స్వరూపిణి, మన: = మనస్వరూపిణి, బుద్ధి: = బుద్ధి రూపిణి, ప్రచేతనా = ప్రకృష్ట చేతనా స్వరూపిణి, చేత = చిత్త రూపిణి, వృత్తి = వ్యవహార రూపిణి, స్వాంతరాత్మా = నిజాంతరాత్మా స్వరూపిణి, చతుర్ధీ = జాగృత్; స్వప్న, సుషిప్తులకు అతీతముగ యున్న తురీయావస్థా స్వరూపిణి, చేత: = చిత్తరూపిణి, వృత్తి = వ్యవహార రూపిణి, స్వాంతరాత్మా = నిజాంతరాత్మా స్వరూపిణి, చతుర్ధీ = జాగృత్, స్వప్న, సుషిప్తులకు అతీతముగ యున్న తురీయావస్థా స్వరూపిణి, చతురక్షరా: = ప్రణవము, యొక్క అ,ఉ,మ: స్వరూపము, చతుర్వ్యూహ: = వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ అని నాలుగు వ్యూహముల స్వరూపిణి, చతుర్మూర్తి = ఏక, ద్వి, త్రి, చతుర్విదీ; ఈ నాలుగు రకముల ప్రాణుల గాయత్రీ స్వరూపము, వ్యోమ = ఆకాశ స్వరూపము, వాయు = వాయు స్వరూపిణి, అద: = దృశ్య ప్రపంచ రూపిణి, జలమ్ = జల రూపిణి, మహ: = పృధివీ స్వరూపిణి, శబ్ద = శబ్దరూపిణి, స్పర్శ = స్పర్శ రూపిణి, రస: = రుచి రూపిణి, గంధ: = వాసనా రూపిణి, అనేకధా = నానా రూప ధారిణి, కర్మేంద్రియమ్ = కర్మేంద్రియ స్వరూపిణి, కర్మమయీ = కర్మ స్వరూపిణీ, జ్ఞానమ్ = జ్ఞాన స్వరూపిణి, జ్ఞానేంద్రియమ్ = జ్ఞానేంద్రియ స్వరూపిణి, ద్విధా = ప్రకృతి, పురుషరూపధారిణీ త్రిధా = అక్షర, క్షర, మరియు పురుషోత్తమ అను త్రివిధ రూపిణి లేదా ఆధ్యాత్మిక, ఆదిదైవిక, ఆదిభౌతిక అను తాపత్రయ రూపిణి, ఆదిభూతమ్ = భౌతిక సృష్టి యందు వ్యాప్తి రూపిణి, ఆధ్యాత్మమ్ = సర్వుల మనసుల యందు వ్యాపించిన శక్తి స్వరూపము, అధిష్టితమ్ = సర్వరూపాధిష్ఠాత్రి, జ్ఞాన శక్తి = జ్ఞాన శక్తి రూపిణి, క్రియా శక్తి = క్రియాశక్తి స్వరూపిణి, సర్వదేవాధి దేవతా = సమస్త దేవతల అధిదేవి.

తత్వసంఘా = తత్వ సమూహ స్వరూపిణీ, విరాణ్మూర్తి = విరాట్ స్వరూపిణీ, ధారణా = ధారణా శక్తి, ధారణామయీ = ధారణా శక్తి రూపిణి, శృతి = వేద స్వరూపిణి, స్మృతి: = ధర్మ శాస్త్ర రూపిణి, వేదమూర్తి = వేదాత్మికా, సంహితా = సంహితా స్వరూపిణి, గర్గ సంహితా = గర్గ సంహితా స్వరూపిణి, పారాశరీ = పారాశర సంహితా స్వరూపిణి, సృష్టీ = సృష్టిరూపిణి, పారహంసీ = పరమహంస విద్యారూపిణి, విధాతృకా = బ్రహ్మ స్వరూపిణి, యాజ్ఞ వల్కీ = యాజ్ఞ వల్కీయ స్మృతి రూపిణి, భగవతీ = వైష్ణవ స్వరూపిణి, శ్రీ భగవతర్చితా = శ్రీ మద్భాగవతము ద్వారా పూజింపబడినది, రామాయణమయీ = రామాయణ స్వరూపిణి, రమ్యా = రమణీయ మయినది, పురాణ పురుష ప్రియ: = పురాణ పురుషుడయిన శ్రీకృష్ణుని ప్రియతమ, పురాణమూర్తి = పురాణ స్వరూపిణి, పుణ్యాంగా = పుణ్యశరీర, శాస్త్రమూర్తి = శాస్త్ర స్వరూపిణి, మహోన్నతా = పరమ ఉన్నతమయిన స్త్రీ, మనీషా = బుద్ధిరూపిణి, ధిషగా = ప్రజ్ఞారూపిణి, బుద్ధి: = మేధారూపిణి, వాణీ = వాగ్దేవతా, ధీ: = బుద్ది స్వరూపిణి, శేముషీ = జ్ఞాన స్వరూపిణి, మతి: = నిశ్చయ రూపిణి, గాయత్రి = గాయత్రి మంత్ర స్వరూపిణి, వేద సావిత్రీ = వేదోక్త గాయత్రీ స్వరూపిణి, బ్రాహ్మణీ = బ్రహ్మశక్తి, బ్రహ్మ లక్షణా = వేదమంత్రముల ద్వారా చూపబడు దేవి, దుర్గా = అచేయమయిన దేవీ స్వరూపిణి, అపర్ణా = తపస్విని అయిన పార్వతీ దేవి, సతీ = దక్షకన్య దాక్షాయణీ, సత్యా = సత్య స్వరూపిణీ, పార్వతీ = పర్వత రాజ పుత్రీ, చండికా = అసుర సంహారకా శక్తి, అంబికా = జగన్మాత, ఆర్యా = శ్రేష్ఠ స్వరూపిణి, దాక్షాయణీ = దక్షుని తనయ (సతీదేవి) దాక్షీ = దక్షపుత్రీ, దక్షయజ్ఞ విఘాసినీ = దక్షయజ్ఞ విధ్వంసినీ, పులోమజా = పులోమజుని తనయ (శచీదేవి) శచీ = ఇంద్రపత్నీ, ఇంద్రాణి = శచీదేవి (ఇంద్రుని పట్టపు రాణి) దేవీ = ప్రకాశించునది, దేవ వరార్చితా = దేవేశ్వరుడయిన ఇంద్రునికి అర్పింపబడునది, వాయునా ధారిణీ = ప్రాణాయామము చే నిరోధింపబడునది (కుండలినీ శక్తి), ధన్యా = నమస్కార యోగ్యత కలిగిన దేవి, వాయుపీ = వాయుశక్తి, వాయువేగగా = వాయువేగ గమన, యమానుజీ = యముని సోదరి, సంయమనీ = సంమయన శక్తి, సంజ్ఞా = సంజ్ఞా స్వరూపిణీ, ఛాయా = సంజ్ఞా దేవి యొక్క సవతి లేక ఛాయారూపిణి, స్ఫురద్యుతీ = అత్యద్భుత కాంతిమతి, రత్నవేదీ = రత్న వేదికా స్వరూపిణి, రత్న వృందా = రత్న సమూహ స్వరూపిణి, తారా = తారామండల స్వరూపిణి, తారాణిమ మండలా = సూర్యమండల స్వరూపిణి, రుచి = కాంతిమతి, శాంతి = శాంతి స్వరూపిణి, క్షమా = తితీక్షా స్వరూపిణి, శోభా = శోభించునది, దయా = కరుణా స్వరూపిణి, దక్షా = కుశల లేక చతురవతి, ద్యుతి: = కాంతిమతి, త్రపా = లజ్జావతి, తులతుష్టి = చప్పట్లు చరచుట చే

సంతుష్ట నొందునది, విభా = కాంతిమతి, పుష్టి = వృద్ధి రూపిణి, సంతుష్టి = సంతోషమయి, పుష్ట భావనా = సుదృఢ భావనా స్వరూపిణి, చతుర్భుజా = నాలుగు భుజములు కలది (లక్ష్మీ స్వరూపిణి), అష్ట భుజా = ఎనిమిది భుజములు కలది (సరస్వతీ స్వరూపిణి), అబలా = బల ప్రదర్శనము చేయనిది, శంఖ హస్తా = చేతియందు శంఖ ధారిణీ (వైష్ణవ మూర్తి) పద్మ హస్తా = పద్మ ధారణ చేయదేవి (లక్ష్మీదేవి), చక్రహస్తా = చక్రాయుధము ధరించు దేవి (వైష్ణవీ స్వరూపము), గదాధరా = గదా ధారిణీ, నిషంగ ధారిణీ = తూణీర ధారిణి, చర్మఖంగ పాణి = చేతి యందు డాలు ధరించినది, ధనుర్ధారీ = ధనస్సును ధరించిన దేవి, ధనుష్టంకారిణీ = ధనస్సును టంకారము చేయునది (దుర్గా స్వరూపిణి) యోధద్రీ = యోద్ధా, దైత్యోద్భట వినాసినీ = యుద్ధము నందు దైత్య ప్రముఖులను నాశనము చేయునది, రదస్థా = రథము నుండి అధిష్ఠాన మయినది (కూర్చొనినది), గరుడారూఢా = గరుడాసేన, శ్రీకృష్ణ హృదయ స్థితా = శ్రీకృష్ణుని హృదయ సింహాసనాధిష్ఠాత్రి, వంశీధరా = వంశీ ధారిణి, కృష్ణవేషా = శ్రీకృష్ణ వేషమును ధరించునది, స్రగ్విణి = పుష్పహారాలంకృత, వనమాలినీ = వనమాలాలంకృత, కిరీట ధారిణీ = కిరీటమును ధరించు దేవి, యానా = భగవాన్ ప్రీతిపాత్రురాలు, మంద మందగతి = నెమ్మది నెమ్మదిగ ప్రవహించునది, గతి = సద్గతి స్వరూపిణి, చంద్రకోటి ప్రతీకాశా = కోటి చంద్రులకు తుల్యమయిన కాంతి స్వరూపిణి, కోమల విగ్రహ:= మిక్కిలి మృదువయిన శరీరము కలిగిన దేవి, భైష్మీ = భీష్మకపుత్రి (రుక్మిణీ స్వరూపిణి), భీష్మసుతీ = భీష్మక మహారాజ పుత్రీ, అభీమా = సౌమ్య స్వరూపిణి, రుక్మిణి = శ్రీకృష్ణ భగవానుని పట్టపు రాణి, రుక్మరూపిణీ = స్వర్ణ రూపధర, సత్యభామ = ఎల్లప్పుడు సత్యముచే ప్రకాశించునది, జాంబవతీ = జాంబవతుని ద్వారా పోషింపబడిన దివ్యరూప ధారిణీ, సత్యా = సత్య స్వరూపిణీ, భద్రా = ఎల్లప్పుడు భద్రత కల్పించు దేవి, సుదక్షిణా = పరమ ఉదార స్వరూపిణి, మిత్రవిందా = మిత్రవిందా స్వరూపిణి (శ్రీకృష్ణుని అష్ట మహిషుల యందు ఒకరు), సఖీ = శ్రీ రాధా సఖీ, బృందా = బృందావన అధిదేవి, బృందారణ్య ధ్వజో ద్ర్వగా = బృందావనమునకు ధ్వజము వంటిది లేక ఊర్ధ్వ గామిని, శృంగార కారిణీ = అలంకరించుకొనుదేవి, శృంగా = శిఖర స్వరూపిణి, శృంగభూ: = శిఖర భూమి, శృంగదా = శిఖరము నందు స్థానమిచ్చునది, ఖగా = ఆకాశ చారిణి, తితీక్షా = బాధలను ఓర్చుకొను సామర్ధ్య స్వరూపిణి, ఈక్షా = దృష్టి స్వరూపిణి, స్మృతి = స్మరణ శక్తి, స్పర్ధా = సంఘర్షణ స్వరూపిణి, స్పృహా = అభిలాష స్వరూపిణి, శ్రద్ధా = ఆస్థిక్య బుద్ధి స్వరూపిణి, స్వనివృతి = నిజానంద స్వరూపిణి, ఈశా = పాలించు లేక పోషించు దేవి, తృష్ణా = కోరిక రూపిణి, భిదా = భేద స్వరూపిణి, ప్రీతి = ప్రేమ రూపిణి, హింసా = హింసా స్వరూపిణి, యాంచా = యాచనా స్వరూపిణి, క్లమా = గాభరా కలిగించునది, కృషి = కష్టించునది, ఆశా = ఆశా స్వరూపిణి, నిద్రా = నిద్రారూపిణి, యోగనిద్రా = యోగనిద్ర స్వరూపిణి, యోగినీ = యోగ (జీవ బ్రహ్మైక్య సిద్ధి) దాయిని, యుగా = యుగ స్వరూపిణి, నిష్ఠా = ఆధార స్వరూపిణి, ప్రతిష్ఠా = ఆశ్రమ స్వరూపిణి, శమిత: = శమా స్వరూపిణి, సత్వ ప్రకృతీ = సత్వగుణ మయమయిన దేవి, ఉత్తమా = ఉత్కృష్ట స్వరూపిణి, తమ: ప్రకృతి దుర్మర్షీ = తమోగుణ స్వభావము సహించునది, రజ: ప్రకృతి = రజోగుణ ప్రకృతి స్వరూపిణి, ఆనతి: = నమన శీల (సార్ధక నామ ధేయములు), క్రియా = క్రియాశక్తి, అక్రియా = నిష్క్రియా, కృతి = ప్రయత్నరూపిణి, గ్లాని = గ్లాని స్వరూపిణి (ఉపవాస ప్రక్రియల ద్వారా సంక్రమించు నిస్తేజ స్థితి), సాత్వికీ = సత్వగుణ ప్రధాన స్వరూపిణి, వృషా = ధర్మ స్వరూపిణి, సేవా = సేవా స్వరూపిణి, శిఖా = నదుల యందు చూడామణి, మణి = మణిరత్న రూపిణి, వృద్ధి: = అభ్యుదయ హేతుభూత స్వరూపిణి, ఆహుతి = ఆహ్వాన స్వరూపిణి, సుమతి = సద్బుద్ధి స్వరూపిణి.

ద్యు: = కాంతి స్వరూపిణి, భూ: = పృధివీ రూపిణి, రజ్జు ద్విదాన్నీ = రెండు తటములు కలిగినది, షడ్వర్గ = ఆరు వర్గములు కలది, సంహితా = వేద రూపిణి, సౌఖ్యదాయినీ = సర్వ సుఖములను ప్రసాదించునది, ముక్తి = ముక్తి రూపిణి, ప్రాప్తి: = శ్రేష్ఠ వాచక రూపిణి, దేశభాషా = ప్రాంతీయ భాషా రూపిణి, ప్రకృతి = ప్రకృతి రూపిణి, పింగళీద్భవా = పింగళమును నది నుండి ఉత్పన్నమయినది, నాగభాషా = సర్పములతో భాషించునది, నాగభూషా = సర్పములు ఆభరణములుగ కలిగినది, నాగరీ = చతుర, నగరీ = నగర స్వరూపిణి, నగా = గిరి రూపిణి లేక వృక్ష రూపిణి, నౌ: = నావ, నౌక, సంసార సాగరము నుండి దాటించునది, (సంసార సాగరము నుండి దాటించునది) భవన్ = నావ, నౌక, సంసార సాగరము నుండి దాటించునది, భవ సాగర సేతుకా = సంసార సాగరమును దాటుటకు వంతెన వంటిది,

మనోమయీ = మన: స్వరూపిణి, దారుమయీ = దారు రూపిణి, సైకతీ = సైకతము (ఇసుక) చే పూర్ణమయినది, సికతామయీ = సైకతము (ఇసుక) చే పూర్ణమయినది, లేఖ్యా = చిత్ర విచిత్ర గతులు కలిగినది, లేప్యా = మట్టితో చేయబడినది, మణిమయీ = మణులతో చేయబడినది, హేమ నిర్మితా = సువర్ణమయి, శైలీ = శిలానిర్మిత మయినది, శైలభవా = పర్వతము నుండి ప్రకటిత మయినది, శీలా = మంచినడవడి కలిగినది, శీకరాభా = శీతలజల కణముల యుక్తము.

చలా = చలన స్వరూపిణి, అచలా = అచల స్వరూపిణి, అస్థితా = అస్థిరమయినది (కదులునది), సుస్థితా = సుస్థిరమయినది, తూలి = తూలికా (మెత్తని, పలుచని), వైదికీ = వేదోక్త పద్ధతి, తాంత్రికీ = తాంత్రిక పద్ధతి, విధి = విధి వాక్య స్వరూపిణి, సంధ్యా = రేయింబవళ్ళ సంధి సమయము, సంధ్యా భ్రవసనా = సంధ్యాకాలపు మేఘము వలె ఎర్రని వస్త్రము ధరించినది, వేదసంధి = వేద మంత్ర సహిత, సుధామయి = అమృతమయీ స్వరూపిణి, సాయంతినీ = సాయంకాలపు శోభా స్వరూపిణి, శిఖా = జ్వాలామయీ స్వరూపిణి, అవేద్యా = అభేద్యనీయ స్వరూపిణి, సూక్ష్మ = సూక్ష్మరూపిణి, జీవకళా = జీవరూప భగవత్కళ, కృతి = సంగీత స్వరూపిణి, ఆత్మ భూతా = సర్వుల ఆత్మ రూపిణి, భావితా = భావనా స్వరూపిణి, అణ్వీ సూక్ష్మ రూపిణి, ప్రహ్వీ = వినయ శీల, కమల కర్ణికా = హృదయ కమల కర్ణికా వాసినీ, నీరాజనీ = ఆరతి స్వరూపిణి, మహావిద్యా = బ్రహ్మ వి ద్యా స్వరూపిణి, కందళీ = సుఖాంకుర స్వరూపిణి, కార్యసాధనీ = భక్తా భీష్టములను సిద్ధింపజేయునది, పూజా = అర్చనా స్వరూపిణి, ప్రతిష్ఠ = స్థాపన స్వరూపిణి, విపులా = సమృద్ధి రూపిణి లేక పృధివీ రూపిణి, పునంతీ = దేనినయిననూ పవిత్రము చేయుదేవి, పాంలౌకికీ = పరలోక హితకారిణీ, శుక్లశక్తి: = తెల్లని శంఖరూపిణి.

మౌక్తికా = ముత్య రూపిణి, ప్రతీతి = నమ్మదగిన దేవత, పరమేశ్వరి = పరంధామ రూపిణి, విరజా = నిర్మలా, ఉష్ణిక్ = వైదిక ఛంద స్వరూపిణి, విరాట్ = విరాట్రూపిణి, వేణీ = త్రివేణీ రూపిణి, వేణుకా = వంశీ రూపిణి, వేణునాదినీ = మురళీనాదము చేయు దేవి, ఆవర్తినీ = భ్రమర యుక్త, వార్తికదా = వార్తిక స్వరూపిణి, వార్త = విషయ స్వరూపిణి, వృత్తి = జీవ స్వరూపిణి, విమానగా = విమానము పై విహారము చేయునది, రాసాఢ్యా = రాస సఖ సంపన్న, రాసినీ = రాస పరాయిణీ, రాసా = రాస స్వరూపిణి, రాసమండల వర్తినీ = రాసమండల మందు సంచరించునది, గోప గోపీశ్వరీ = గోప, గోపీజనము చే ఆరాధింపబడు దేవి, గోపీ = గోపికారూపిణి, గోపీ గోపాలవందితా = గోపాల బాల, బాలికల చే నమస్కరింప బడునది, గోచారిణీ = తన తటము నందు గోవుల సంచరించుటకు దారి నిచ్చునది, గోపనది = గోపాలురనది, గోపానంద ప్రదాయినీ = గోపాలురకు ఆనంద దాయినీ, పశువ్యదా = పశువులకు హితమగు గ్రాస ప్రదాయినీ, గోపసేవ్యా = గోపాలకులచే సేవింపబడునది, కోటిషోగోగణావృతా = కోట్లాది గో సముదాయములచే పరివేష్ఠిత, గోపానుగ = గోప గోపీ జనులచే అనుగమించునది, గోపపతీ = గోపాల యుక్త రూపిణీ, గోవింద పద పాదుకా = గోవింద చరణ పాదుకా స్వరూపిణి, వృషభాను సుతీ = వృషభాను నందిని అయిన శ్రీరాధాదేవి కి అభిన్న, రాధా = శ్రీకృష్ణారాధ్య అయిన శ్రీరాధా, శ్రీకృష్ణ వశకారిణీ = శ్రీకృష్ణుని వశము చేసికొను దేవి స్వరూపిణి.

కృష్ణ ప్రాణాధిక = శ్రీ కృష్ణునికి ప్రాణాధికముయిన ప్రియతమ, శశ్వత్ రసికా = నిత్య రశికా, రసికేశ్వరీ = రసికులకు ఈశ్వరీ.

ఈ క్రింది వన్నియు వివిధ నదుల నామములు (అవటీదా; తామ్రపర్ణీ; కృతమాలా, విహాయశీ, కృష్ణా, వేణీ, భీమరధీ, తాపి, రేవా, మహాపగా (మహానది), వైయాసకీ, కావేరి, తుంగభద్రా, సరస్వతీ, చంద్రభాగా, వేత్రవతి, ఋషికుల్యా, కుకుద్మినీ, గౌతమీ, కౌశికీ, సింధు, బాణగంగ (అర్జునుని బాణము తో బయటకు వచ్చిన గంగ), అతి సిద్ధిదా = అత్యంత సిద్ధి ప్రదాయినీ, (గోదావరీ, రత్నమాలా, గంగా, మందాకినీ, బలా), స్వర్ణదీ = సర్గలోకపు గంగ, జాహ్నవీ = జహ్నునందినీ, వేలా = వేలానది, వైష్ణవీ = విష్ణు కుల్యా, మంగళా మయీ = మంగళములకు ఆలవాలము, బాలా = బాలానది, విష్ణుపదీ = గంగ, సింధు సాగర సంగత = గంగా సాగర సంగమ స్వరూపిణి, గంగా సాగర సంగమ సౌభాద్యా = గంగా సాగర సంగమ శోభా సంపన్న, సముద్రీ = సముద్ర ప్రియ, రత్నద = రత్న ప్రదాయినీ, ధునీ = నదీ రూపిణి లేక జ్వాలా రూపిణి, భాగీరథీ = భగీరధుని చే భూమికి దింపబడినది (గంగ), స్వర్గ నీభూ = గంగాదేవిని ప్రకటించిన

భూమి, శ్రీ వామన పదాచ్యుతీ = శ్రీ వామనమూర్తి పదముల నుండి పడినది, లక్ష్మీ = లక్ష్మీ స్వరూపిణి, రమా = పద్మా, రమణీయా = సుందర లేక రమణీయ యుక్త, భార్గవీ = భృగుపుత్రీ, విష్ణు వల్లభా = విష్ణు ప్రియ, సీతా = సీతా స్వరూపిణి, అర్చి: = అగ్నిజ్వాలా రూపిణి, జానకీ = జనక నందినీ, మాతా = జగజ్జననీ.

కళంకరహిత = నిష్కళంకా, కళా = భగవత్కళా రూపిణి, కృష్ణ పాదాబ్జ సంభూత, సర్వ = సర్వ స్వరూపిణి, త్రిపథగామినీ = త్రిపథగ (గంగ), ధరా = ధరిత్రీ స్వరూపిణి, విశ్వంభరా = విశ్వమును పాలన, పోషణ చేయు దేవి, అనంతా = ఆద్యంతము లేనిది, భూమి: = ఆధార స్వరూపిణి, ధాత్రి = భూ స్వరూపిణి, క్షమామయి = క్షమా స్వరూపిణి, స్థిర = స్థిరమయిన దేవి (స్థిత స్వరూపిణి), ధరిత్రి = ధారణ చేయునది, ధరణీ = లోక ధారిణీ, ఉర్వి = భూమి, శేష ఫణ స్థితా = శేషనాగ ఫణముల యందు స్థితిగత మయినది, అయోధ్యా = యుద్ధము చేయ శక్యము కాని పురము, రాఘవ పురీ = రాఘవుని పురము, కౌశికీ = కుశిక వంశజ, రఘు వంశజ = రఘుకులీత్పన్న, మధురా = మధుర మయినది లేక మధురా పుర స్వరూపిణి, పంథా = మార్గ స్వరూపిణి, యాదవీ = యదువంశనగర రూపిణి, ధృవ పూజితా = ధృవుని చే పూజింపబడినది, మయాయు: = మయునికి ఆయు: ప్రదాయినీ, బల్వనీలోదా = బిల్వము వలె నీలిరంగు జలములు కలది, గంగా ద్వారా వినిర్గతా = గంగా ద్వారము నుండి బడల్వెడలినది, కుశావర్తమయీ = కుశావర్తము అను తీర్థ స్వరూపిణి, ధ్రైవ్యా = ధీవక్తయుక్త స్వరూపిణి, ధృవ మండల మధ్యగా = ధృవ మండల మధ్యము నుండి వెలువడినది, కాశీ = ప్రకాశించునది, శివపురీ = శివుని నగర స్వరూపిణి, శేషా = శేషరూపిణి, వింధ్యా = వింధ్యా స్వరూపిణి, వారాణసీ = కాశీపుర రూపిణి, శివా= భవానీ స్వరూపిణి, అవంతికా = ఉజ్జయినీ పుర వాసినీ, దైవపురీ = దేవ నగరీ, ప్రోజ్వలా = ప్రకృష్ఠ శోభా సహిత స్వరూపిణి, ఉజ్జయినీ = ఉజ్జయిని పుర రూపిణి, జితా = ఆక్రమించునది, ద్వారవతీ = ద్వారకా పురీ స్వరూపిణి, ద్వారకామా = ద్వారము యొక్క కామనలను పూర్ణము చేయునది, కుశభూతా = దర్భలు ప్రకటింపబడు స్థాన స్వరూపిణి, కుశస్థలీ = ద్వారకానగర రూపిణి, మహాపురీ = మహానగరీ స్వరూపిణి, సప్తపురీ = సప్తపుర స్వరూపిణి, నంది గ్రామ స్థల స్థితా = నందిగ్రామ స్థలమందు యున్న నది (సరయూ), శాలగ్రామ శిలాదిత్యా = శాలిగ్రామ శిలోత్పత్తి స్థాన స్వరూపిణి (గండకీ నది), శంబలా గ్రామ మధ్యగా = శంబలా గ్రామము నందు మధ్యగా ప్రవహించునది, వంశ గోపాలినీ = వంశ గోపాల మంత్ర యుక్త, క్లిప్తా = మిక్కిలి స్వచ్ఛమయినది, హరి మందిర వర్తినీ = హరి మందిరమున విరాజిల్లునది, బర్హిష్మతీ, హస్తిపురీ, శుక్రప్రస్థ నివాసినీ = బర్హిష్మతీ మరియు హస్తినాపుర స్వరూపిణి, దాడిమీ = దాడిమ ఫల స్వరూపిణి, సైంధవీ = సింధు ప్రియా, జంబూ = జంబూనదీ స్వరూపిణి, పౌష్కరీ = పుష్కర ద్వీప సంబందినీ, పుష్కర ప్రసూ: = పుష్కరోత్పత్తి స్థానము, ఉత్పలావర్త గమనా = ఉత్పలావర్త తీర్థ గామినీ, నైమిషీ = నైమిశారణ్య నివాసినీ, అనిమిష ధృతా = దేవతల చే పూజింపబడునది, కుర జాంగాల భ్రూ = కురు జాంగాల దేశము నందు ప్రకటింపబడునది, కాళీ = కృష్ణ వర్ణినీ.

హైమవతీ = హిమాలయము నుండి ఉత్పన్నమయినది, ఆబ్రుదీ = అబూ క్షేత్రము నుండి ప్రకటితమయినది, బుధా = విదుషీ, శూకర క్షేత్ర విదితా = శూకర క్షేత్రమందు ప్రసిద్ధి నొందినది, శ్వేత వరాహ ధారితా = శ్వేత వరాహము చే ధరింపబడినది, సర్వతీర్థమయీ = సర్వ తీర్థ స్వరూపిణి, తీర్థా = తీర్థ భూతా, తీర్థానాం తీర్థకారిణీ = తీర్థములను తీర్థములుగా చేయు దేవీ స్వరూపిణి, హారిణీం సర్వదోషాణాం = సర్వ దోషములను హరించు దేవీ స్వరూపిణి, దాయినీ సర్వసంపదా = సర్వ సంపదల ప్రదాయినీ, తేజసామ్ = తేజస్సును ఇనుమడింపచేయు దేవి, సాక్షాత్ = ప్రత్యక్షముగ ప్రకటితమయినది, గర్భవాస నికృంతనీ = గర్భ నరము నుండి రక్షించునది, గోలోక ధామ్ = గోలోకపు ప్రకాశ రూపిణి, ధనినీ = ధన సంపన్న, నికుంజ నిజ మంజరీ = నికుంజములందు తన లతాస్వరూపముతో నివసించునది, సర్వోత్తమా = అన్నిటి కంటె ఉత్తమ మయినది, సర్వ పుణ్యా = మిక్కిలి పుణ్య శాలిని, సర్వ సౌందర్య శృంఖలా = సకల సౌందర్యములను బంధించి యుంచునది (సర్వ సౌందర్యయుక్త), సర్వ తీర్థోగతా = సర్వ తీర్థముల యందు ఉత్కృష్టా, సర్వ తీర్థాది దేవతా = సంపూర్ణ తీర్థముల అధి దేవత.

కాళింది సహస్రనామ వర్ణనము యశ: కారకము మరియు కామ్యక పూరకము; ఇది పాపహారిణి, పుణ్యదాయినీ, మరియు ఆయు: వృద్ధి కారకము. దీనిని రాత్రి పఠించితి రేని చోర భయము ఉండదు. ప్రయాణము నందు రెండు

మార్లు పఠించితి రేని దారిదోపిడీ దొంగల భయము యుండదు. ఎవరేని తదియ నుండి పూర్ణిమ వరకూ (శుక్ల పక్షము నందు) ప్రతి దినము యమునాదేవిని ధ్యానించి, భక్తి భావము తో పదిమార్లు ఈ సహస్రమును పఠింతురేని రోగులు రోగవిముక్తులు అగుదురు. ఖైదీలు కారాగార విముక్తులు అగుదురు. గర్భిణులు పుత్రుని పడసెదరు. విద్యార్థులు పండితులగుదురు.

మనుష్యులకు మనసు నందు గల మోహన, స్థంభన, వశీకరణ, ఉచ్చాటన, మరణ, శోషణ, ఉన్మాదన, తాపన, నిధి దర్శనాది కోరికలన్నియు ఈడేరును. బ్రాహ్మణుడు బ్రహ్మ తేజస్సును, క్షత్రియుడు పృధివ్యాధి పత్యము, వైశ్యునికి ధనాభివృద్ధి, శూద్రుడు నిర్మల మనస్కుడు అగును. ఎవరు ప్రతిదినము పూజా సమయమందు ఆ సహస్రనామ పారాయణ చేసినట్లయిన, వారికి తామరాకును నీరంట నట్లు పాపస్పర్శ కూడా కలుగదు. ఎవరు ఒక సంవత్సర కాలము యమునా పటలము, పద్ధతి విధి విధానముగ పాటించి పిదప ఈ సహస్రనామమును వందసార్లు పారాయణ చేసి పిదప స్తోత్రము, కవచము పఠించితి రేని వారికి సప్తద్వీపా వసుంధరా రాజ్యప్రాప్తి కలుగును. ఇందు సందేహము లేదు. ఎవరు కాళింది యందు భక్తి తత్పరులై నిష్కామభావనతో ఆ సహస్రమును పఠించెదరో ఆ పుణ్యాత్ములు ధర్మార్థ కామములను బడసి ఈ జన్మము నందే జీవన్ముక్తులగుదురు. ఎవరు ఈ ప్రసంగమును పఠించెదరో వాకు నికుంజభరితమై, భ్రమరములు ఘంకారములతో నిండిన లతా సముదాయ విలసిత బృందావనము తో నిండిన గోలోక ధామమును చేరెదరు.

(శ్రీ గర్గసంహిత యందలి మాధుర్య ఖంగార్గతమయిన సౌభరి-మాంధాత సంవాదము నందలి యమునా సహస్రనామ వర్ణనమను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(బలభద్రుని చే ప్రలంభుడు వధింపబడుట మరియు పూర్వజన్మ వృత్తాంతము)

నారదుడు "మహారాజా! ఈ విధముగ యమునా సహస్రనామమును ఆలకించిన పిదప శూరభూపాల శిరోమణి అయిన మాంధాత చక్రవర్తి సౌభరి మహర్షికి వందనములు ఒనర్చి అయోధ్యకు తిరిగి వెళ్ళెను. నీకు సమస్త పాపహరము మరియు పుణ్యదాయకము అయిన సర్వ గోపికా చారిత్రమును ఎరిగించితిని. నీవు ఇంకనూ ఏమి వినదలుచుకుంటివి?" బహుళాశ్వుడు "మహామునీ! నేను మీ దివ్య ముఖారవిందము నుండి వెలువడిన మహా పాప నాశకమయిన యమునా పంచాంగము ను వింటిని. ఇంకనూ గోలోకాధిపతి అయిన శ్రీకృష్ణుడు బలరాముని తో కలసి చేసిన లీలలను వినవలెనని నా మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. అందువలన ఆ లీలలను దయచేసి తెలుపవలసినది."

నారదుడు "మహారాజా! ఒకానొక దినము శ్రీకృష్ణ బలరాములిరువురు గోప బాలకుల సహితులై గో సంరక్షణ చేయుచూ యమునా తటమందలి భాండీర వనము నందు బాలోచిత క్రీడలు సలుపు చుండిరి. బాలకుల చే వాహన క్రీడలాడుచూ, మనోహర గోప సముదాయమును రక్షించుచూ, శ్రీకృష్ణుడు వన విహారము చేయుచుండెను. ఆ రోజు క్రీడయందు కొంతమది బాలురు మిగిలిన బాలురను తమ భుజముల పై ఎక్కించుకొని మోయసాగిరి. ఆ సమయము న కంసుని పనుపున పంపబడిన ప్రలంభాసురుడు గోపరూపము ధరించి వారితో కలిసెను. ఇతర గోప బాలకులు వానిని గమనించ లేదు. కానీ దేవదేవుడయిన శ్రీకృష్ణ భగవానుని ముందు ఆ రక్కసుని మాయాజాలము నిలువలేదు. ఆ రోజు ఓడిపోయిన వారు గెలిచిన వారిని మోయవలెను. బలరాముని పక్షము నెగ్గినది. కానీ ఎవరునూ బలరాముని తమ మూపుపై నెక్కించుకొనుటకు సాహసింపలేదు. అంత మాయా గోప వేషమునున్న ప్రలంబుడు బలభద్రుని తన మూపుపై ఎక్కించుకొని యమునా తటము నందు నడువసాగెను. అంతకు ముందు నిర్ణయించుకున్న స్థానము వరకును ఓడిన వారు ప్రత్యర్థులను మోయవలెను. కానీ ప్రలందుడు అంతటితో ఆగక బలదేవుని మధురా నగరమునకు తీసికొని

వెళ్ళవలెనని మదిలో నిర్ణయించుకొని ముందుకు సాగుచుండెను. అంతలో ప్రలంబుని శరీరము నల్లని మబ్బుల ఛాయ తో మారి భయానకమయిన తన స్వస్వరూపమును ధరించెను, పర్వత కాయుడాయెను.

ఆ మహాదైత్యుని మూపుపై కూర్చొని యున్న బలదేవుని కర్ణకుండలములు ముందుకు, వెనుకకు ఊగుచున్నవి. దృశ్యము ఎట్లున్నదనగా ఆకాశము నందు పూర్ణ చంద్రుడు ఉదయించి నట్లుగా యున్నది; మేఘములు వెనుక విద్యులత్కాంతులీను మెరుపు తీగల వలె కానపట్టు చున్నది. ఆ భయానక రాక్షసుని చూచుట తోడనే మహాబలి అయిన భలభద్రునకు క్రోధముద్భవించినది. అంతట ఇంద్రుడు వజ్ర ప్రహారము చేసినటుల తన పిడికిలి బిగించి ఆ దైత్యుని తలపై బలమయిన తన ముష్ఠిఘాతమును ప్రహరించెను. ఆ దైత్యుని తల వ్రజఘాతము ను తినిన పర్వతము వలె వేయి వ్రక్కలై పగులగా ప్రలంబుడు పృథివిని కంపింపచేయుచూ క్రిందపడి ధరాశయనుడాయెను. ఆతని శరీరము నుండి ఒక దివ్య జ్యోతి వెలువడి బలరాముని యందు ప్రవేశించెను. దేవతలు పుష్పవృష్ఠి కురిపించిరి. భూమ్యా కాశము లందు జయజయ ధ్వానములు చెలరేగినవి.

అంత బహాళాశ్వుడు "మహర్షీ! ఈ రణ దర్మధుడు అయిన ప్రలంబుడు పూర్వజన్మ మందు ఎవరు! ఈతనికి బలదేవుని వలన ఎందు వలన ముక్తి లభించినది?".

నారదుడు "మహారాజా! ఒకప్పుడు యక్ష రాజైన కుబేరుడు తన చైత్ర రథ వనమందు శివపూజకై చిన్న పూల తోటను ఏర్పరుచుకొనెను. పూల రక్షణకై అన్ని వైపులా యక్షులను కాపలా పెట్టించెను. అయిననూ సుందర పుష్పములు ఆ పుష్పనాటి నుండి తస్కరింపబడెడివి. అది చూచిన కుబేరుడు కుపితుడై "ఈ పూలను ఏ యక్ష, మనుష్య, దేవత అయిననూ ఇకపై దొంగలించిన యెడల వారు నా శాప ప్రభావమున భూలోకము నందు రాక్షస జన్మ నెత్తెదరు." అని శాపమిచ్చెను. అంత "హుహు" అను గంధర్వుని సుతుడు "విజయ" నామధేయడు తీర్థము లన్నియు సేవించుచూ, వీణా వాదనము కావించుచూ, విష్ణు భగవానుని గుణగుణములు కీర్తించుచూ, చైత్రరథము ప్రవేశించెను. పాపము ఆ గంధర్వునికి కుబేరుని శాపము తెలియక ఆ పూదోటలోని కొన్ని పుష్పములను కోసెను. తక్షణము ఆతనికి గంధర్వ రూపము పోయి అసురునిగ రూపాంతరము చెందెను. అంతట ఆ గంధర్వ సుతుడు వెంటనే కుబేరుని సన్నిధికి యేగి చేతులు జోడించి, నెమ్మదిగ శాపవిమోచనమునకై ప్రార్థించెను. అంతట కుబేరుడు ప్రసన్నుడై "బుద్ధిమంతుడా! నీవు విష్ణు భక్తుడవు మరియు శాంత చిత్తుడవు. అందుచే శోకింపవలదు. ద్వాపర యుగాంతమున యమునా తటము నందు భాండీరవనమున బలదేవుని చేతిలో నీకు ముక్తి కలుగును.

ఇందు సందేహము లేదు. ఈ "హుహు" తనయుడగు "విజేయుడే" ప్రలంబుని గా జనన మంది, కుబేర వరము చే పరమ మోక్షము ను పొందెను.

(శ్రీ గర్గసంహిత యందలి మాధుర్య ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి ప్రలంబవధ యను ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు గోవులను, గోపబాలురను దావానలము నుండి రక్షించుట మరియు విప్ర పత్నులకు దర్శనమిచ్చుట)

నారదుడు "మహారాజా! తదనంతరము బలరామ సహిత గోపబాలురందరూ క్రీడాసక్తులై వివిధ క్రీడల యందు నిమగ్నులై గోవుల మాట మరచిరి. అంత గోవులు నెమ్మది నెమ్మదిగ గ్రాసము నారగించుచూ వనాంతరాళమున

ప్రవేశించినవి. కొంత సేపటికి గోప బాలురు గోవులను కానక దట్టమయిన ముంజు గడ్డి మయమయిన వనము నందు ప్రవేశించిరి. అంతలో వారి చుట్టూ ప్రళయాగ్ని కీలక దావానలము ప్రజ్వరిల్లి వారిని చుట్టుముట్టెను. ఆ సమయమున బలరామ సహిత గోపబాలురు, గోవులు శ్రీకృష్ణుని శరణాగతి చేసి "పాహి" "పాహి" అని ప్రార్థించిరి. తన సఖులందరూ దావాగ్ని యందు చిక్కుకొనుట చూసిన యోగేశ్వరేశ్వరుడు, శ్రీ కృష్ణుడు వారికి అభయము నిచ్చి, ఆశ్వాశించి ఇట్లనియె, "మిత్రులారా! భయపడవలదు. మీరందరూ కన్నులను మూసికొనవలసినది." అంత వారందరూ కన్నులు మూసుకొనగా దేవతలు అందరూ చూచుచుండగా భక్తపరాధీశుడు, దయాసముద్రుడు, పరమాత్ముడు, శ్రీకృష్ణుడు ఆ ప్రళయాగ్ని కీలక దావానలమును నోరు తెరచి అవలీలగా త్రాగెను. పిదప గోవులను, గోపబాలకులను తీసికొని అశోకవనము చేరెను.

అంత బలరామ సహిత గోపబాలురు శ్రీకృష్ణుని చూచి చేతులు జోడించి "ప్రభూ! ముకుందా! మేమందరమూ మిక్కిలి క్షుదార్తులమై యున్నాము." అంత భగవానుడు వారిని అచటికి దగ్గరలో జరుగుచున్న అంగిరస యజ్ఞము వద్దకు పంపెను. వారందరూ యజ్ఞవాటికకు ఏగి, నమస్కరించి వినయముతో ఇట్లు పలికిరి "బ్రాహ్మణోత్తములారా! గోపబాలురు, బలరాముని తో సహితుడై వ్రజరాజ నందనుడైన శ్రీకృష్ణుడు గోరక్షణ చేయుచూ ఈ ప్రదేశమునకు ఏతెంచెను. ప్రస్తుతము వారందరూ క్షుధార్తులై యున్నారు. అందువలన సఖసహితుడైన మదన మోహనునకు దయచేసి భోజనమును ఈయవలసినది." కానీ ఆ బ్రాహ్మణులు వారి విన్నపమును మన్నింపక మిన్నకుండిరి. గోపబాలకులు నిరాశతో వెనుకకు వచ్చి శ్రీకృష్ణునితో ఇట్లు మొరపెట్టిరి, "ప్రియసఖా! నీవు కేవలము వ్రజమండలమునకు ప్రభువువు. నీ ఆజ్ఞ కేవలము ఈ గోకులము నందే జరుగును. నీవు సూర్యసమాన ప్రచండ దండధారివి. అయినప్పటికీ మధురా పురమునందు నీ ప్రభవము చెల్లదు."

అంత శ్రీకృష్ణుడు వారిని ఊరడించి, ఆ పట్టు గోపబాలకులను బ్రాహ్మణ పత్నుల వద్దకు పంపెను. ఈ సారి గోపబాలకులు యాగశాల ప్రవేశించి, బ్రాహ్మణ పత్నులను చేరి, నమస్కరించి ఇట్లనిరి "బ్రాహ్మణ దేవీ స్వరూపిణులారా! గోపబాలురు మరియు బలరామసహితుడై వ్రజరాజనందనుడు ఈదరి కేతెంచెను. ఆయనకు ఆకలి వేయుచున్నది. సఖుల సహితముగ ఆ నందనందనునికి భోజనము నీయవలసినది. శ్రీకృష్ణ శుభాగమన వార్త వినినంతనే ఆ బ్రాహ్మణ పత్నుల మనసులందు శ్రీకృష్ణ దర్శన లాలస ఉద్భవించెను. వారు విభిన్న పత్రములు యందు భోజనసామాగ్రి నిడుకొని, లోకమర్యాదను అతిక్రమించి శ్రీకృష్ణ భగవానుని కడకు ఏగిరి. సుందర యమునా తటమునందు, రమణీయ అశోకవని యందు విప్రపత్నులు తాము మున్ను వినిన విధముగ శ్రీహరి దివ్యరూపమును కాంచిరి. ఆ దర్శనమును పొంది బ్రాహ్మణపత్నులు, యోగులు తురీయావస్థయందు రమించు రీతిని పరమానంద నిమగ్నలైరి.

అంతట భగవానుడు "విప్రపత్నులరా! నా దర్శనార్థము విచ్చేసిన మీరందరూ ధన్యులు. మీరు తొందరగా మీ ఇండ్లకు వెళ్ళవలసినది. మీ పతులు మిమ్ములను సందేహింపరు. మీ కారణముగ (ప్రభావము చే) మీమీ పతిదేవులందరూ ఈక్షణమే యజ్ఞఫలమును పొంది, నిర్మలులై మీతో సహితముగ ప్రకృతికి పరమయిన పరమధామము గోలోకమును చేరెదరు. అంతరము శ్రీహరికి నమస్కరించి బ్రాహ్మణ పత్నులు యజ్ఞశాలకు తిరిగి వెళ్ళిరి. వారిని చూడగనే బ్రాహ్మణులందరూ తమ తప్పిదమును తెలిసికొని తమను తామ అసహ్యించుకొనిరి. వారందరూ కంస భయమున శ్రీకృష్ణుని చూచుటకు వెళ్ళకుండిరి. మిధిలేశ్వరా! శ్రీకృష్ణుడు, బలరాముడు, గోపబాలురు, ఆ దివ్యాన్న పదార్ధములను భుజించి, గోసహితులై బృందావనమున కేగిరి.

(శ్రీ గర్గసంహిత యందలి మాధుర్య ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "దావాలనము నుండి గోవులను, గోపబాలురను రక్షించుట మరియు విప్రపత్నులకు దర్శనము నొసంగుట అనెడు ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు నందుని వరుణ లోకమునుండి వెనుకకు తీసికొని వచ్చుట మరియు గోప, గోపీ జనమునకు వైకుంఠ దర్శనము చేయించుట)

నారదుడు "మిథిలేశ్వరా! ఒకానొక దినము నందుడు ఏకాదశీ వ్రతమాచరించి, ద్వాదశి నిశీథకాలమందు గోపబాలుర సహితుడై, నదీ స్నాన నిమిత్తుడై యమునా నది యందు దిగెను. అచట జలాధి దేవత అయిన వరుణుని సేవకుడు ఒకడు నందుని పట్టుకొని వరుణ లోకమునకు తీసికొని పోయెను. గోప బాలురు అందరూ పెద్ద పెట్టున రోదించుట మొదలుపెట్టిరి. అంతట వారందరినీ సమాధానపరచి, భగవానుడు శ్రీకృష్ణుడు, వరుణపురి ప్రవేశించి కుపితుడై ఆ పురద్వారము భస్మీపటలము కావించెను. కోట్లాది సూర్య తేజస్సనూనుడయిన శ్రీహరిని కాంచి వరుణుడు భయభ్రాంతుడై, నమస్కరించి, ప్రదక్షిణలు కావించి, చేతులు జోడించి ఇట్లనియె. "శ్రీకృష్ణ చంద్రునకు నమస్కారము. పరిపూర్ణ పరమాత్ముడు, అసంఖ్యాక బ్రహ్మాండములకు కర్త, భర్త, అయిన గోలోకాధిపతికి నమస్కారము. నా యొక్క ఒకానొక మూర్ఖసేవకుడు మొదటిసారి మిమ్ములను అధిక్షేపించెను. ఆతని నిమిత్తమై మీరు నన్ను క్షమింపవలసినది. పరేశా! భగవాన్! నేను మిమ్ములను శరణు జొచ్చు చున్నాను. నన్ను రక్షించండి! రక్షించండి!!.

అంత శ్రీకృష్ణుడు ఈ ప్రార్ధన విని ప్రసన్నుడై జీవించిన తన తండ్రిని తీసికొని బంధుజనులందరూ సంతోషించు చుండగా తిరిగి వ్రజభూమి చేరెను. నందరాజు ముఖతా శ్రీకృష్ణుని ప్రభావమును వినిన గోప గోపీ జనసముదాయము నంద నందునుని ఇట్లు ప్రార్ధించిరి, "ప్రభూ! ఒకవేళ మీరు లోకపాలురకు సహితము వందనీయులయిన సాక్షాత్ పరమాత్ములయిన యెడల మా కందరకు వైకుంఠ దర్శనమును అనుగ్రహింపవలసినది." అంతట శ్రీకృష్ణుడు వారందరినీ తీసికొని వైకుంఠ ధామము చేరెను. అచట జ్యోతిర్మండల మధ్యమున విరాజిల్లుచున్న తన స్వస్వరూప దర్శనమును వారికి అనుగ్రహించెను. ఆయన సహస్రభూజుడై, సహస్రపాదుడై, కిరీట కుండల సమన్వితుడై భవ్య రూపము తో ప్రకాశించుచుండెను. శంఖ, చక్ర, గదా, పద్మ సహితుడై, వనమాలా విరాజితుడై యుండెను. అసంఖ్యాక సూర్య సమాన తేజోసమన్వితుడై శేషనాగము పై పవ్వళించి యుండెను. చామరములు వీచుచుండుట చే ఆయన కాంతి, శోభ మరింత ఇనుమడింప చేయబడు చుండెను. బ్రహ్మాది దేవతలు ఆయనను సేవించుచుండిరి.

ఇంతలో గదాధరులయిన భగవానుని పార్షదులు వారందరినీ ఒక దరికి చేర్చి, భగవానునికి ప్రణామములాచరింప జేసి వారిని ప్రయత్న పూర్వకముగ (బలవంతముగ) దూరముగ నిలుచుండబెట్టి ఇట్లనిరి "వనచరులారా! వీరందరూ మౌనమును ఆశ్రయింప వలసినది. ఇచట వక్తాభావమును ప్రదర్శింపవలదు. మాట్లాడవలదు. మీరు ఇంతకు పూర్వము శ్రీహరి స్థానమును చూడలేదా ఏమి? ఇచట దేవాధిదేవుడయిన సాక్షాత్ పరమాత్ముడు కొలువై యున్నాడు. వేదము ఆయన గుణములను ను కీర్తించుచున్నది." ఈ విధముగ కఠినముగ పలికిన పలుకులు విని గోపగోపీ జనము మౌన ముద్రాంకితులయిరి. పిమ్మట వారు తమలోతాము "అరే! ఈ సింహాసనాధీశుడు కేవలము మన శ్రీకృష్ణుడే!! మనము ఇంత సమీపమున యున్నప్పటికీ మనము క్రింద, ఆయన పైన ఉన్నాడు. మనతో ఒక్క క్షణము సహితము మాటలాడలేదు. అందువల్లే వ్రజభూమిని మించిన శ్రేష్ఠ లోకము మరియొకటి లేదు. ఎందుకనగా వ్రజభూమి యందు ఈతడు మన సోదరుడు, బంధువు, స్నేహితుడు, అన్నీ అయి మనతో ఎల్లప్పుడూ సంభాషించు చుండును. వారందరూ ఇట్లను కొనుచుండగా తిరిగి క్షణములో వారు వ్రజభూమిని చేరిరి.

(శ్రీ గర్గసంహిత యందలి మాధుర్య ఖంగార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందాది ప్రభృతులకు వైకుంఠ దర్శనమను ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ఇరువది మూడవ అధ్యాయము

(అంబికావనము నందు నందుని కొండ చిలువ నుండి రక్షించుట

మరియు సుదర్శనుడను విద్యాధరుని ఉద్ధరించుట)

నారదుడు “నరేశ్వరా! ఒకానొక సమయమున వృషభాను మహారాజు, ఉపనందాది ప్రముఖులను తోడ్కొని రత్నరాశులు నిండిన బండ్లయందు ప్రయాణము చేసి అంబికావనమునకు ఏగిరి. అచట భద్రకాళీ, పశుపతులను విధి విధానముగ అర్పించి, బ్రాహ్మణులకు సమృద్ధిగా దానము లర్పించి, రాత్రి సమయమున యమునా నదీ తీరమున నిద్రించిరి. అంత ఆ నిశీథ సమయమున ఒకానొక భయంకర సర్పము నందుని పాదము పట్టుకొని మింగుటకు యత్నించెను. నందుడు భయవిహ్వలుడై “కృష్ణా! కృష్ణా” అని ఎలుగెత్తి పిలుచుట ప్రారంభించెను. ఇంతలో గోపబాలురు మండుచున్న కట్టెలతో ఆ సర్పమును బలముగా కొట్టుట ప్రారంభించిరి. అయిననూ ఆ సర్పము నందుని పాదము విడువదాయెను. అంతట లోకపావనుడు, ముకుందుడు తన పాద ప్రహారము చే ఆ అజగరమును చంపెను. తక్షణమే విగత జీవి అయిన ఆ సర్పము నుండి కృతకృత్యుడయిన ఒక దివ్య విధ్యాధరుడు ఆవిర్భవించెను.

ఆతడు శ్రీకృష్ణునకు సమస్కరించి, పరిక్రమ కావించి, చేతులు జోడించి ఇట్లనియె “ప్రభూ! గోలోకనాధా! సర్వాంతర్యామీ! అనాధనాధా! నన్ను “సుదర్శనుడు” అని పిలుతురు. నేను మున్ను ఒక విద్యాధర ప్రముఖుడను. నాకు నా బలము నందు మిక్కిలి గర్వాతిశయము యుండెడిది. ఒకనాడు నేను అష్టావక్ర మహర్షిని కాంచి, ఆయనను అవహేళన కావించితిని. ఆయన కుపితుడై “దుర్బుద్ధీ! నీవు సర్పమునవు కమ్ము” అని శపించెను. మాధవా! నీ కృప చే ఈనాడు నేను శాప విముక్తుడనైతిని. మీ చరణముల పరాగము, మరియు మకరందము శోకి తిరిగి నేను నా స్వస్వరూపమును పొందితిని. భూతల భూరి భార హరణకై అవతీర్ణులయిన భగవానుడయిన భువనేశ్వరునకు నమస్కరించుచున్నాను.” ఇట్లు ముకుందుని స్థుతించి, నమస్కరించి సుదర్శనుడు సర్వోపద్రవ రహితమయన వైకుంఠమునకు ఏగెను. ఆ సమయమున నందాది గోపకులు శ్రీకృష్ణుని పరమేశ్వరునిగ గ్రహించి విస్మితులై తిరిగి అంబికా వనము నుండి బృందావనము చేరిరి.

నారదుడు “మహారాజా! నీకు పుణ్యజనకము, పాపహరణము అయిన పావన శ్రీకృష్ణచరిత్రను వినిపించితిని. నీవు ఇంకనూ ఏమి వినదలచుకుంటివి? బహుళాశ్వుడు “ఆహా! శ్రీ కృష్ణ చరితము అత్యద్భుతము నాకు వినిన కొలది ఇంకనూ వినవలెనన్న కోరిక ఇనుమడించు చున్నది. వ్రజేశ్వరుడయిన పరమాత్మ శ్రీహరి బృందావనము చేరిన పిదప ఇంకా ఏ లీలలు కావించెను? దయచేసి నాకు వినిపించవలసినది.

(శ్రీ గర్గసంహిత యందలి మాధుర్య ఖండార్గతమయిన సుదర్శనోపాఖ్యానము అను ఇరువది మూడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది నాల్గవ అధ్యాయము

(అరిష్టాసుర, మరియు వ్యోమాసుర వధ మరియు మాధుర్య ఖండ ఉపసంహారము)

నారదుడు “మహారాజా! ఒకానొక దినము శ్రీకృష్ణభగవానుడు, బలరాముడు, గోపబాల సహితులై, దాగుడు మూతలు ఆడుచుండిరి. అచటకు “వ్యోమాసురుడు” అను కంసానుచరుడు ఏతెంచెను. ఆ క్రీడ యందు కొందరు మేకలుగనూ, మరికొందరు ఆ మేకలను అపహరించుచు దాచివేయు దొంగలగనూ ప్రవర్తించెను. వ్యోమాసురుడు గోప బాలుని వలె ఆడుచూ అనేకమంది గోపబాలురను అపహరించి పర్వత గుహల యందు దాచి వారి ముఖ ద్వారమును

శిలలతో కప్పివైచెను. ఆ మహాబలుడు మయాసురుని పుత్రుడు. ఇది గమనించిన మధుసూదనుడు ఆతని రెండు భుజములు పట్టుకొని త్రిప్పి నేలపై విసరెను. అంతట ఆ మహాదైత్యుడు అంతమొంది అతని శరీరము నుండి ఒక దివ్యజ్యోతి వెలువడి నలు దిశలనూ ప్రకాశింపచేయుచూ కదిలి శ్రీకృష్ణుని యందు లీనమయ్యెను. అంత భూనభోంతరాళమున యందు జయజయ ధ్యానములు వెల్లివిరిసినవి. పుష్పవృష్టి కురిసినది.

బహుళాశ్వుడు "మహాత్మా! ఈ వ్యోమాసురుడు పూర్వ జన్మము నందెవరు? ఈ పుణ్యాత్ముడు ఎట్లు పరమాత్ముని యందు లీనమయ్యెను?".

నారదుడు "మహారాజా! కాశీ పట్టణమును "భీమరధుడు" అను మహారాజు పరిపాలించు చుండెను. ఆయన నిరంతర దానశీలి, యజ్ఞకర్త, వియనశీలి, గొప్ప ధనుర్ధారి, మీదు మిక్కిలి విష్ణు భక్తిపరాయణుడు. ఆయన తన కుమారునికి పట్టాభిషేకము చేసి, స్వయముగ మలయాచలమునకు ఏగి ఒక లక్ష సంవత్సరములు తీవ్ర తపమాచరించెను. ఒకనాడు ఆయన ఆశ్రమము నకు పులస్త్య మహర్షి శిష్య సమేతుడై ఏతెంచెను. ఆయనను చూచినప్పటికీ భీమరధుడు లేవలేదు, పలకరింప లేదు, అర్ఘ్య పాద్యాదులు సమర్పించలేదు. అంత పులస్త్యుడు ఆగ్రహించి "ఓ దుష్ట భూపాలా! నీవు రాక్షసుడవు కమ్ము" అని శపించెను. అంతట భీమరధుడు దీన వదనుడై ఆయన చరణముల పై వాలి శరణాగతి నర్థించెను. అంత ముని శ్రేష్ఠుడు, దీన వత్సలుడైన పులస్త్యుడు "ద్వాపరాంతమున మధురాజనపద మందలి పవిత్ర వ్రజమండలము నందు శ్రీకృష్ణభగవానుని చేతియందు నీకు మరణము సంభవించును.

దాని ఫలితముగ నీకు యోగి జనులకు సహితము లభ్యము కాని ముక్తి లభించును. ఇందు సందేహము లేదు. ఆ భీమరధ మహారాజే మయ పుత్రుడయిన వ్యోమాసురునిగ జన్మించి శ్రీకృష్ణుని చేతిలో మృతి నొందుట వలన మోక్ష ప్రాప్తి నొందెను.

మరియొక దినము గోపాల బాలుర మధ్యకు మహా బలిష్ఠుడు అయిన అరిష్ఠుడు ఏతెంచెను. ఆతడు తన భయంకర సింహనాదము చే భూ, నభోంతరాళమును వణికించుచూ, తన శృంగముల చే పర్వత శిఖరములను పిండి పిండి కావించుచూ, బృందావనమును భీభత్సము కావింప మొదలిడెను. వానిని చూచి గోప, గోపీ సముదాయములు నలు దిక్కులకు పరుగులిడసాగిరి. అంత దైత్యనాశకుడు అయిన గోవిందుడు వారందరికీ భయపడవలదని అభయమిచ్చి, ముందుకు వచ్చి, ఆ దైత్యుని రెండు శృంగములు పట్టుకొని వెనుకకు త్రోసెను. అరిష్ఠుడు సహితము ముకుందుని రెండు యోజనములు వెనుకకు త్రోసెను. అంతట శౌరి ఆ రక్కసుని తోక పుచ్చుకొని గిరగిరా త్రిప్పి బాలకుడు కమండలమును భూమిపై విసురునట్లు బహు వేగముగ భూమిపై విసరెను. క్రింద పడిన అరిష్ఠుడు క్రొధ తామ్రాక్షుడై తిరిగి లేచి తన శృంగములతో ఒక ఎర్రని శిలను పైకి లేపి శ్రీకృష్ణునిపై విసరెను. ముకుందుడు ఆ శిలాఖండమును ఒడుపుగా పట్టుకొని తిరిగి ఆ రక్కసునిపై విసరెను. ఆ బలమయిన దెబ్బకు రక్కసుడు ఒక్కమారు చతికిల పడి, తిరిగి లేచి తన శృంగములచే పృధివిని ప్రహరించెను. అంత భూగర్భ జలముపైకి ఉబికి వచ్చుట ఆరంభించెను. అంత శ్రీహరి ఆ దైత్యుని రెండు శృంగములు పట్టుకొని ప్రభంజనము కమలమును పట్టుకొని పెకలించి విసురునట్లు గిరగిరా త్రిప్పి వేగముగ భూతలముపై విసరెను.

అంతలో ఒక చిత్రము జరిగెను. ఆ మహా వృషభము తన వికృతాకారము విడచి దివ్య బ్రాహ్మణ రూపము ధరించి శ్రీకృష్ణుని చరణార విందములపై వ్రాలి గద్గగ స్వరముతో ఇట్లనెను, "భగవాన్! నేను మహానుభావుడయిన బృహస్పతికి శిష్యుడను. వరతంతు నామధేయుడను. నేను ఆయన వద్దకు విద్యాభ్యాసమునకరిగితిని. ఒకాకొన దినము మూఢుఢనై, నా పాదములను గురువులవైపు జాపి ఎదురుగ కూర్చొంటిని. అందుకు ఆయన కోపించి "ఓరీ! నీవు నా ఎదుట ఎద్దువలె కాళ్ళు జాపితివి కావున నీవు ఎద్దువగుదువు" అని శపించెను. ఇందువలన నేను వంగ దేశము నందు

ఎద్దు వలె సంచరింప సాగితిని.

అసురుల సాంగత్యము చే మిక్కిలి అసుర భావములు పొడసూపినవి. మీ ప్రసాదము చే నా వికృత రూపమును మరియు అసుర భావము నుండి విముక్తుడనైతిని. శ్రీకృష్ణునునకు, వాసుదేవునకు, ప్రణతజన క్లేశనాశకునకు, గోవిందునకు పున: నమస్కరించు చున్నాను," ఈ విధముగ పలికి బృహస్పతి శిష్యుడయిన వరతంతువు దివ్య విమానా రూఢుడై దివ్య లోకములకు వెడలెను.

నారదుడు "మహారాజా! ఈ విధముగ నీకు దివ్య మాధుర్య ఖండము వినిపించితిని. ఈయది పుణ్యదాయకము, పాపనాశకము మరియు శ్రీకృష్ణ ప్రాప్తికి ఉత్తమ సాధనము. దీనిని ఎల్లప్పుడూ పఠించువారలకు సమస్త కామనలను ఈడేర్చును. నీవు ఇంకనూ ఏమి వినదలుచు కుంటివి?".

(శ్రీ గర్గసంహిత యందలి మాధుర్య ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి వ్యోమాసుర, అరిష్టాసుర వధ అను ఇరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

మాధుర్యఖండము సమాప్తము

మధురా ఖండము

ప్రథమ అధ్యాయము

(కంసుడు నారదుని ద్వారా బలరామ కృష్ణుల గూర్చి తెలిసికొని, వారిని శత్రువులుగ పరిగణించి దేవకీ వసుదేవులను కారాగారము నందుంచుట. అన్నదమ్ములిరువురినీ సంహరించుటకు యోచన చేసి వారిరువరిని మధురాపురమునకు తోడ్కొని వచ్చుటకై అక్రూరుని నంద వ్రజమ పంపుట)

వసుదేవ సుతమ్ దేవం
కంస చాణూర మర్ధనమ్
దేవకీ పరమనందమ్
కృష్ణం వందే జగద్గురుమ్ ॥

ఎవరు వసుదేవునికి పుత్రునిగా ప్రకటమయ్యెనో, ఎవరు కంస, చాణూరులను మర్దించెనో, ఎవరు దేవకీదేవి కి పరమానంద కారకుడో, అట్టి జగద్గురుడయిన శ్రీకృష్ణ భగవానునికి నేను వందనములిడు చున్నాను.

బహుళాశ్వుడు "మహామునీ! శ్రీకృష్ణ భగవానుడు మధుర యందు ఏఏ లీలలు కావించెను? ఆయన కంసుని ఎందుకు మరియు ఎట్లు సంహరించెను? ఈ వృత్తాంత మంతయు నాకు విశదముగ వివరింపవలసినది." నారదుడు "నృపేశ్వరా! ఒకనాడు నేను సాక్షాత్ పరమాత్ముడయిన శ్రీహరి చే ప్రేరేపితుడనై (మనసు నందు) దైత్య వధోద్యమమును మరింత ముందుకు తీసికొని పోవుటకై, ఉత్కృష్ఠ పురమయిన మధురానగరమును చేరి కంసుని రాజ్యసభ యందు ప్రవేశించితిని. ఆ నిండు పేరోలగమున కంసుడు ఇంద్రుని నుండి బలాత్కారముగ తీసికొని వచ్చిన సింహాసనము పై శ్వేత ఛత్ర ఛాయ యందు, సుందర లలనామణులు వింజామరలు వీచుచుండగా విరాజమానుడై యుండెను. ఆతడు తన స్వీయ బలము, పరాక్రమము మరియు క్రూరత్వము కారణమున భయంకర విష సర్పము వలె దుస్సహుడై గోచరించుచుండెను. ఆతడు నన్ను చూచినంతనే స్వాగత సత్కార పూజాదికములు గావించెను. అంతట నేను (నారదుడు) "మధురా నరేశా! ఇత: పూర్వము నీ చేతిలో సంహరింపబడక ఆకాశమునకు ఎగసిన బాలిక దేవకీ తనయ కాదు. ఆమె యశోద పుత్రి. ఈ దేవకీ యందే శ్రీకృష్ణుడు ఉత్పన్నుయాయెను. మరియు రోహిణీ గర్భమందు బలరాముడు ఉదయించెను. వసుదేవుడు తన ఇరువురు పుత్రులను నీ భయము చే వారసత్వముగ నందుని ఇంట పెంచుచుండెను."

"పూతన నుండి అరిష్టుని వరకూ ఎందరెందరు బలశాలులైన దైత్యులు సంహరింపబడిరో వారందరూ వనము నందు ఈ సోదరులిరువురు చేతనే తుదముట్టింప బడిరి. వారిరువురు నీకు సహితము మృత్యుప్రాయులని లోకోపవాదు నడుచుచున్నది." నాచే ఈ విషయమును వినిన కంసుడు కోపముతో కంపించి, శూర నందనుడయిన వసుదేవుని ఆ సభయందే సంహరించుటకు ఖడ్గము దూసెను, కానీ నేను ఆ భోజ మహీపతిని నివారించితిని. అంతట ఆ దుష్టుడు దేవకీ వసుదేవులను ధృఢ సంకెలలతో బంధించి కారాగారము నందు పడవైచెను. తదనంతరము నేను కంసునికి యుక్త వచనములు బోధించి వెడలితిని.

తదనంతరము కంసుడు బలరామ కృష్ణులను సంహరించుటకు దైత్య ప్రవరుడయిన "కేశి" ని పంపించెను. తదుపరి బలశాలులయిన చాణూరాది మల్లులను, కువలయాపీడమను మదగజమును ఆయత్తపరచి, తన కార్య భారమును కుశలముగ కూర్చు ఇతర మంత్రులతో, మిత్రులతో కలసి ఇట్లు సమాలోచన కావించెను. "ఓ! కూటా! తోశాలా! మహాబలీ! చాణూరా!! శ్రీకృష్ణ బలరాములు నా పాలిట మృత్యురూపులని తోచుచున్నది. ఈ విషయము నారద మహర్షి నాతో ఉటంకించెను. వారిరువురు ఇచటకు వచ్చుట తోడనే మీరందరూ మల్లయుద్ధము చేసి వారిని సంహరింప వలసినది. అందువలన మల్లయుద్ధావరణమును సుందరముగ అలంకరింపవలసినది. రంగస్థల మఖప్రదేశమున మదమత్త కువలయాపీడము నుంచి, నా శత్రువులు వచ్చిన వెంఠనే వారిపై పురికొల్ప వలసినది. కార్యాకర్తలారా! జాగరూకతతో

వినిండి! రాబోవు చతుర్దశి శాంతి కొరకు ధనుర్యాగమును చేసెదము. అమావాస్య నాడు మల్లయుద్ధము జరుప వలసినది."

కంసుడు వారితో ఇట్లు పలికి పిదప మిత్రుడయిన అక్రూరుని పిలచి, వానిని ఒక ఏకాంత ప్రదేశమునకు కొనిపోయి ఇట్లు ప్రియ భాషణము చేయదొడండెను "మిత్రమా! నీకు నాకు మిక్కిలి గౌరవింపదగిన మంత్రివి. అందుచే నాచే పలుకబడుచున్న ఉత్తమ భాషణము వినవలసినది. రేపు ఉదయమే నీవు నంద వ్రజమునకు ఏగవలసినది. లోకులు వసుదేవుని తనయులు ఇరువురు అచటనే పెరుగుచుండిరని పలుకుచుండిరి. వారిరువురు నాకు శత్రువులని దేవర్షి నారుదుడు నిష్కర్మగా వక్కాణించెను. గోప గణములు నందుని తో సహా బహుమతులు తీసికొని ఇచటకు రావలసినది. మధురా నగర సందర్శనార్థమై ఆ బాలకుల నిరువురినీ కూడా తొడ్కొని రావలసినది. వారు ఇచటకు వచ్చిన తక్షణము వారిని గజము చే కానీ, మల్లుర చే కానీ వెంటనే వధింప చేయుదును."

"అనంతరము వసుదేవునకు సహాయము కావించిన నంద, ఉపనంద, వృషభాను వరులను సహితము ముక్కలు ముక్కలు గావించెదను. పిదప వసుదేవుని, ఆతని సహాయకుడయిన దేవకుని, రాజ్యాధికారము వాంచించుచున్న నా ముదుసలి తండ్రి ఉగ్రసేనుని సహితము సంహరించెదను. ఈ కార్యము పూర్తి అయిన పిదప సమస్త యాదవులను హతమార్చెదను. ఇందు ఇసుమంత సందియము లేదు. మంత్రి వరేణ్యా! వీరందరూ కూడా మనుష్యరూపము లో ప్రకటితమయిన దేవతలు."

"చంద్రావతి పతి అయిన మహాబలుడు "శకుని" నాకు పరమ మిత్రుడు. అంతేకాక భూతసంతాపుడు, హృష్టుడు, వృకుడు, సంకరుడు, కాలనాభుడు, మహానాభుడు, హరిశమశ్రుడు, సహితము నా మిత్రులు మరియు నాకై ప్రాణము లర్పించుటకైననూ కృతకృత్యులయిన వారు. జరాసంధుడు సాక్షాత్ నా మామగారు. ద్వివిదుడు నా సఖుడు. బాణాసుర, నరకాసురులు నాయందు సౌహార్ద్రత కలిగి యున్నవారు. వీరందరూ ఈ పృధివిని జయించి, ఇంద్రసహిత దేవతలను బంధించి, కుబేరుని మేరు పర్వత కంధరములందు పడవైచి, మూడు లోకములను పరిపాలించెదరు. మంత్రివర్యా! నీవు నీతిజ్ఞులయిన విద్వాంసుల యందు శుక్రాచార్య సముడవు, మరియు చతురత కల మాటలాడుట యందు బృహస్పతి సముడవు. అందువలన ఈ కార్యమును సఫలీకృతము చేయుటకు నీవే సమర్ధుడవు."

అక్రూరుడు "యదుపతీ! నీవు నీ మనోరథ మహా సాగర చిత్రణ కావించితివి. దీనికి దైవము తోడగునేని ఈ కార్యము గోష్పదమును దాటునంత సులభమగును. కాదేని మహాసాగరమును దాటునంద దుష్కరమగును." కంసుడు "బలవంతుడయిన మనుష్యుడు భగవంతుని వదలి కార్యమును కావించును. బలహీనుడు మాత్రమే భగవంతుని అర్థించి కూర్చొండును. కర్మయోగి అయిన పురుషుడు కాల స్వరూపుడయిన శ్రీహరి ప్రభావము చే శాంతుడై యుండును." మంత్రి ప్రవరుడయిన అక్రూరుని తో ఈ భాషణమును సలిపి కంసుడు కొంచెము కోపించి సభాస్థలిని వీడి తన అంత:పురమునకు ఏగెను.

(శ్రీ గర్గసంహిత యందలి మధురా ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి "కంసుని మంత్రణ" మను ప్రధమోధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(కేశి వధ)

నారదుడు "మిథిలేశ్వరా! మధురాపురము నందు ఈ మంత్రాంగమంతయు నడుచుచుండగా కంసుని చే పంపబడిన మదోత్తమ మహాసురుడు "కేశి" ఒక భయంకర హయ రూపమును ధరించి రమణీయ బృందావనము చేరి మేఘ గర్జన కావించెను. ఈ మహాహయము గిట్టల ఘాతములకు పెను వృక్షములు సహితము పెకలింపబడు చుండెను. తోక

విదిలించునపుడు మేఘములు ఛిన్నాభిన్నమగుచుండెను. మిథిలేంద్రా! ఆ హయము యొక్క వేగము దుస్సహము. ఈ భీకర హయమును చూడగనే గోప గోపీ సముదాయము మిక్కిలి భయము చే వ్యాకులురై శ్రీ కృష్ణ భగవానుని శరణు జొచ్చిరి. పాపులకు, పాపములకు పీడన మొనర్చు భగవానుడు వారందరికీ "భయపడవలదు" అని అభయమిచ్చి, సడుముకు పీతాంబరమును బిగించి ఆ మహాదైత్యుని అంతమొందించుటకు సమకట్టెను.

అంత "కేశి" తన పాదములతో శ్రీహరిని బలముగ ప్రహరించెను. కేశి తన పద ఘట్టములతో ధరణిని కంపింప చేయుచూ, రోదశీ మండలమును తన గర్జనలతో ఝూర్ణిల్ల జేయుచుండెను. అంత ప్రచండ వాయువు కమలమును విదిలించునట్లు శ్రీకృష్ణుడు ఆ దైత్యుని రెండు పాదములు పట్టుకొని బలముగ ఒక యోజనము దూరము విసరెను. కేశి తిరిగి లేచి కోపోద్రిక్తుడై ముందుకు వచ్చి తన తోకతో శ్రీహరిని ప్రహరించెను. అంత ముకుందుడు ఆ తోకను పట్టుకొని గిరగిరా త్రిప్పి ఆకాశము పై వంద యోజనములు విసరెను. అంత ఎత్తునుండి క్రిందపడిన వెంటనే కేశి వ్యాకులత పొంది, అంతలోనే తేరుకొని, మేఘ గర్జన చేయుచూ, ఆయా లోకములను కంపింప జేయుచూ, జూలును మాటిమాటికీ విదిలించుచూ, తన పాదములతో పృదివిని చూర్ణము చేయుచూ తిరిగి శ్రీకృష్ణుని ముందుకు ఏతెంచెను. అంత కేశిపై ముకుందుడు ఒక ముష్టిఘాతము ప్రహరించెను. ఆ ఘాతమునకు కేశి రెండు ఘడియలు మూర్ఛితుడై, తిరిగి లేచి, శ్రీకృష్ణుని మెడను తన నోటి యందు ఇరికించుకొని, ఆకాశ మార్గమున లక్ష యోజనములు ఎగిరెను. అక్కడ ఆకాశ మార్గమున వారిరువురి నడుమ భయంకరమయిన ద్వంద్వ యుద్ధము జరిగెను. కేశి తన పాదములతో, దంతములతో, బలమయిన మెడతో, విసురయిన తోకతో తిరిగి, తిరిగి ప్రహారము చేయనారంభించెను.

శ్రీహరి వానితో కొంత సమయము క్రీడలు సలిపి పిదప బాలుడు కమండలమును విసురునట్లు ఆ దైత్యుని ఆకాశము నుండి క్రిందకు విసరెను. పిదప తన బలమయిన హస్తమును ఆ అసురుని ముఖమండలమున జొనిపి, ఆతని ఉదరము చేరి ఔషధమునకు నయము కాని రుగ్మత వలె పెరగనారంభించెను. దానిచే ఆ మహాసురుని ప్రాణ వాయువులు అడ్డగింపబడి, ఆతడు గిలగిలా తన్నుకొని, కడుపుబ్రద్దలుకాగా తక్షణమే మరణించెను.

ఆమహాకాయము నుండి కిరీట కుండల మండితుడయిన ఒక దివ్యరూప ధారి ప్రకటితుడై శ్రీకృష్ణభగవానునికి సాంజలి బంధకముగ నమస్కరించి ఇట్లనియె "మాధవా! నేను "కుముద" నామధేయుడును. ఇంద్రుని అనుచరుడను. నేను మిక్కుటమయిన బల, రూప, తేజస్సులు కలిగి ఇంద్రుని కి ఛత్రము పట్టువాడను పూర్వకాలమందు వృత్తాసుర వధానంతరము ప్రాప్తించిన బ్రహ్మహత్యాపాతక విదూరణకై మహేంద్రుడు అశ్వమేధ యాగము సంకల్పించెను. ఆ యాగమునకై కొనిరాబడిన అశ్వము శరీరమంతయూ తెల్లగనూ, కర్ణములు నల్లగనూ యుండి మనోవేగమున పోగల శీఘ్రగతి కలిగియుండెను. ఆ అశ్వమును చూడగనే ఆ హయమును అధిరోహించ వలెనన్న కోరిక జనించి, ఆ అశ్వమును హరించి, దాని నధిరోహించి అతల లోకమునకు ఏగితిని. అంత మహా దుష్టుడనైన నన్ను మరుద్గణములు పాశముచే బంధించి ఇంద్రుని వద్దకు తీసికొని వచ్చిరి. అంత పాకశాశనుడు ఆగ్రహించి "దుర్బుద్ధీ! నీవు రాక్షసుడవు కమ్ము. భూతలమున రెండు మన్వంతరములు వరకూ అశ్వ రూపమున యుండుము" అని శపించెను.

అప్పటి నుండియు ఈ దుస్థితి యందు యుంటిని. మీ పవిత్ర స్పర్శచే ఆ శాపము నుండి నేడు విముక్తడనైతిని. నన్ను మీ కింకరునిగ చేసికొన వలసినది. నా మనస్సు మీ పాదపద్మముల యందు అనురక్తమయినది. మహాప్రభూ! మీరు సమస్త లోకములకు సాక్షీభూతులు. భగవానుడయిన శ్రీహరికి నమస్కరించుచున్నాను."

మిథిలేశ్వరా! ఈ విధముగ పరమేశ్వరుని స్తుతించి, పరిక్రమ కావించి, కుముదుడు అత్యంత ప్రకాశవంతమయిన విమానారుఢూడై దిశా మండలములను దేదీప్యమానముగ ఉద్దీపన కావించుచూ వైకుంఠమునకు ఏగెను.

(శ్రీ గర్గసంహిత యందలి మధురా ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి "కేశి వధ" అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(అక్రూరుని నందవ్రజాగమనము; మార్గ మధ్యమున శ్రీకృష్ణ, బలరాముల తో మైత్రి; వారితో కలసి నంద భవనమున ప్రవేశించుట; శ్రీకృష్ణుని తో సంభాషించి మధురాగమనమును నిశ్చయించుట; శ్రీకృష్ణుని మధురాయాత్రా విషయము నలుదిశలా విస్తరిల్లుట మరియు గోపికలు విరహము చే ఉద్విగ్నులగుట)

నారదుడు "మిథిలేంద్రా! అక్రూరుడు కంసుని కార్యము నిర్వర్తించుటకై మిక్కిలి ఆనందముతో రథారూఢుడై నందవ్రజము చేరెను. ఆతడు పరమ శ్రీకృష్ణ భక్తుడు. మార్గమధ్యమందు పరమ బుద్ధిమంతుడయిన అక్రూరుడు ఈ విధముగ తలచెను "ఆహా! నేన పుట్టినదాదిగా ఏ పుణ్యకార్యములు ఆచరించితిని! నిస్వార్ధ భావముతో ఏ దానములు సలిపితిని! ఏఏ ఉత్తమ యజ్ఞములు చేసితిని! ఏ దివ్య తీర్ధములకు చనితిని? ఏ పుణ్య భాగవతోత్తములను పూజించితిని? పూర్వ జన్మము నందు ఏతపమాచరించితిని? నిష్కల్మష భక్తి భావము చే ఏ మహితాన్వితమయిన మునీశ్వరులను సేవించితిని! అందువలన నేడు దుర్లభమయిన శ్రీహరి దర్శనము కలుగుచున్నది. భగవానుడయిన శ్రీహరి ఎవరి నేత్రములకు గోచరమగునో వాని జన్మము ధన్యము. ఈనాడు శ్రీకృష్ణ దర్శనము చే నేను సర్వ విధములుగ కృతార్ధుడనగుదును."

ఇట్లు అనేక విధములుగ శ్రీకృష్ణ చింతన చేయుచూ, ఉత్తమ శకునములును గాంచుచూ, గోధూళి వేళకు గాందినీ నందనుడయిన అక్రూరుడు నెమ్మది నెమ్మదిగ నంద గోకులము ప్రవేశించెను. ఆయనకు యవ, అంకుశాది గుర్తులు గల శ్రీకృష్ణ పాద ముద్రికలు బృందావన ధూళి యందు ప్రస్ఫటముగ కనిపించెను. శ్రీకృష్ణ దర్శనమునకై అత్యంత ఉత్కంఠతో ఎదురు చూచుచున్న అక్రూరునకు ఈ చిహ్నములు కనిపించగనే భక్తిచే ఆనంద విహ్వలుడై, కన్నుల వెంట ఆనంద భాష్పములు ప్రవహించు చుండగా రథము నుండి స్వర్ణ దండము వలె భూమి పై బడి ఆ భగవత్ పాద పద్మాంకిత మయిన ధూళి యందు పొర్లుట నారంభించెను. మిథిలేశ్వరా! ఎవని హృదయము నందు భగవద్భక్తి జాగృతమగునో వానికి బ్రహ్మలోక పర్యంతము గల సుఖములన్నియు తుచ్ఛములగును. తదనంతరము తిరిగి రథారూఢుడై అక్రూరుడు నందవ్రజము చేరి బలరామసహితుడై శ్రీకృష్ణుడు తన వైపు వచ్చుచుండుట కాంచెను.

ఆ పురాణ పురుషులిరువురు శ్యామల గౌర వర్ణులు. అరవిచ్చిన కమల దళాయతాక్షులు. మార్గము నందు వారురువురు ఇంద్రనీల మరియు హారకమణి (స్వర్ణ మణి) శిఖరముల వలె గోచరించు చుండిరి. వారి కిరీటములు బాలసూర్యుల వలె, దుకూలములు విద్యుత్ కాంతి వలె ప్రకాశించు చుండెను. శ్రీకృష్ణ ప్రభువు వర్షాకాల నీలిమేఘ కాంతితో ప్రకాశించు చుండగా, బలదేవుడు శరత్కాల మేఘము వలె శోభిల్లుచుండెను. వారిరువురినీ వీక్షించిన తక్షణమే అక్రూరుడు రథము నుండి దిగి వారి చరణారవిందములందు వినమ్రుడై వ్రాలెను. ఆతని ముఖము నేత్రముల నుండి జాలువారుచున్న ఆనంద భాష్పముల చే కప్పబడి, శరీరమంతయు రోమాంఛిత మయ్యెను. ఆతనిని చూచి పరమేశ్వరుడు, పరంధాముడు, భక్త పరాధీనుడు, ఆశ్రిత భక్త వత్సలుడు, నిరంతర నిజభక్త, హృదయనివాసుడు, మహానుభావుడు శ్రీకృష్ణుడు తన రెండు చేతులతో ఆతనిని పైకి లేవనెత్తి, తన హృదయమునకు హత్తుకొనెను. ఈ విధముగ అక్రూరుని అనుగ్రహించి భ్రాతృసహితుడై శ్రీకృష్ణుడు ఆతనిని సాదరముగ తన గృహమునకు తీసకొని పోయి, ఆసనము నిడి అతిథి సత్కారములు సలిపి ఒక గోవును బహూకరించెను.

పిదప ప్రేమపూర్వకమైన వాతావరణము నందు భోజనాది కార్యక్రమములు అయిన పిదప తిరిగి అక్రూరుని సుఖాశీనుని గావించిరి. అనంతరము నందుడు అక్రూరుని హస్తములు తోడ్కొని, తన హృదయమునకు హత్తుకొని ఇట్లనియె "మిత్రమా! నీవు కంసుని పరిపాలన యందు ఎట్లు జీవించుచున్నావు? ఆ లజ్జా విహీనుడు తన సోదరి చిన్నారి శిశువులను హతమార్చెను. ఆతడు ఇతరుల పట్ల దయతో ఎట్లు వ్యవహరించును!" అనంతరము నందుడు తన అంత:పురము ప్రవేశించెను. పిదప ఏకాంతమున శ్రీకృష్ణుడు తన నిజమాతా పితరుల కుశల మరసి, యాదవ బంధువుల పరిస్థితిని గూర్చి ప్రశ్నించెను. కంసుని విపరీత కృత్యములన్నింటి గూర్చి కూలంకషముగ చర్చించెను.

అక్రూరుడు అన్ని విషయములను ఎరింగించి "దేవా! నిన్న మొన్నటి కృత్యము నెరింగించెదను. "భోజరాజు అయిన కంసుడు తన కరవాలము దూసి వసుదేవుని సంహరించుటకు సమాయత్తుడయ్యెను. కానీ నాదర మహర్షి భోదచే ఆ అకృత్యము నివారింపబడినది. సమస్త యాదవ బంధు బాంధవులు మిక్కిలి దు:ఖితులై, భయ విహ్వాలులై యున్నారు. ఎందరో యాదవులు కంసుని భయముచే కుటుంబ సహితులై దూరదేశములందు నివసింపసాగిరి. దేవా! ఆతడు ప్రస్థుతము యాదవకుల నాశమునకు, దేవతలపై దండెత్తుటకు ఉపక్రమించుచున్నాడు."

ఆతడు ఇంకనూ క్రూర, నీచ కార్యములు చేయుటకు సమాయత్తుడగుచున్నాడు. జగత్కళ్యాణమునకై మీరిరువురు అచటికి రావలసి యున్నది. మీరిరువురు ఈ కార్యమును సాధింపని ఎడల సత్పురుషులకు రక్షణ లేదు." ఈ విధముగ పలికిన అక్రూరుని పలుకులు విని, నందుని సంప్రదించి, శ్రీకృష్ణుడు గోపకులతో ఇట్లనియె.

"ప్రియ బంధువులారా! వృద్ధ గోపకుల సహితులమై నేను, బలరాముడు, మరియు నందరాజు మధురాపురమునకు చనెదము. మాతో నంద, ఉపనంద, వృషభాను ప్రభృతులు సహితము రేపటి ప్రాత:కాలము మధురాయాత్ర సాగింతురు. మీరందరూ పాలు, పెరుగు, నేయి మొదలగు గోరసములు సమకూర్చవలసినది. అంతేకాక అచట కంస మహారాజునకు ఈయ వలసిన అమూల్య వస్తువులు సహితము బండ్ల యందు ఉంచ వలసినది. మా అందరి ప్రయాణమునకు కావలసిన రధములను సహితము సమాయత్త పరుచవలసినిది".

ఈ వాక్యములను వినిన కార్య కుశలురైన గోపకులు ఇంటింటికి ఏగి తాము వినిన, తెలిసికొనిన విషయములను అందరకూ వినిపించిరి. ఈ విషయము వినిన గోపికలు హృదయములు ఉద్విగ్నమయినది. వారందరూ గృహముల యందు సమావేశమై పరస్పరము ఈ విషయమునే చర్చించుట ప్రారంభించిరి. ఈ వార్త కార్చిచ్చు వలె వ్యాపించి చివరకు వృషభానువరుని గృహమునకు సైతము చేరినది. "నా ప్రియతముడు వెడలుచున్నాడు" అను సమాచారము అకస్మాత్తుగా వినినంతనే వృషభాను నందిని మిక్కిలి దు:ఖితయై ప్రభంజనము చే మొదలు తెగిన కదళీతరువు వలె భూమిపై వ్రాలి మూర్చిల్లెను. గోపికల ముఖములు మ్లానమయ్యెను. కేశపాశములు విడివడి, వాని యందు బంధింపబడిన పుష్పములు నేలరాలెను. గోపికలందరూ చిత్తరువుల వలె నిశ్చేష్టితులైరి. కొందరు గోపికలు తమ గృహముల యందు "శ్రీకృష్ణ, గోవింద, హరే, మురారే" అని కీర్తించుచూ, గృహ కృత్యములన్నియు విస్మరించి, యోగుల వలె ధ్యానమగ్నులయిరి. కొందరు సమర్ధవంతమయిన గోపికలు ఒకచోట గుమిగూడి పరస్పరము గద్గద కంఠలై నేత్రముల నుండి అశ్రుధారలు ప్రవహించు చుండగా ఇట్లు ప్రవచించిరి "ఆహా! నిర్మోహులయిన జనుల రీతి విచిత్రముగ యుండును. అది వివరించుటకు వీలుకానిది. ఈ నిర్మోహులు నోటితో మాట్లాడుదురు. కానీ వారి హృదయ భావన వేరుగా యుండును. వారి మనో భావములు దేవతలు సహితము పసిగట్ట అసమర్ధులై యుందురు."

ఇంక మనుష్యుల మాటలు చెప్పనేల? రాస క్రీడలందు మనకు చేసిన బాసలన్నియునూ అడియాసలు చేసి, అందరనూ అనాథలను చేసి ఈ మదన మోహనుడు వెళ్ళిపోవుటకు ఉద్యుక్తుడగుచున్నాడు. మన ప్రాణ వల్లభుడు మధురాపురము వెడలిన పిదప మనకు ఏమి సుఖము యుండును?"

(శ్రీ గర్గసంహిత యందు శ్రీ మధురా ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి "అక్రూరాగమనము" అను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు గోపికల ఇండ్లకు ఏగి వారిని స్వాంతన పరచుట మరియు మార్గ మధ్యమున రధమును అడ్డగించిన గోపాంగనలను సముదాయించి మధురకు ప్రస్థాన మగుట)

నారదుడు "మహారాజా! గోపికలు ఈ విధముగ తమలో తాము తర్కించుచు, సంభాషించుచుండగా వారి విరహ క్లేశమును ఎరిగిన పరమాత్ముడు శ్రీకృష్ణుడు స్వయముగ వారందరి ఇండ్లకూ వెళ్ళెను. ఎంతమంది గోపికలు

కలరో, గోవిందుడు సహితము అన్ని రూపములు ధరించి వారందరినీ నెమ్మదిగ సమాధాన పరచెను. ఆయన శ్రీరాధాదేవి గృహము ప్రవేశించి అచట చెలికత్తెలతో పరివేష్ఠితయై మూర్ఛితురాలైన శ్రీరాధాదేవిని కాంచెను. అంతట ఆయన మృదు మధురముగ మురళీనాదము కావించెను. వంశీనాదము వినినంతనే శ్రీరాధాదేవి కన్నులు తెరచి ఎదురుగ యున్న గోవిందుని కాంచెను. ఎట్లు కమలము తన కుల వల్లభుడయిన ఆదిత్యుని దర్శించగనే ప్రసన్నమగునో, అట్లే పద్మినీనాయిక అయిన శ్రీ రాధాదేవి తన ప్రాణ వల్లభుని ఎదురుగ కాంచి ఆనంద నిమగ్నయై, లేచి, సాదరముగ ఆహ్వానించి ఆ సమయమునందు ఆశీనుని గావించెను.

కమలనయన, పద్మముఖి అయిన శ్రీరాధాదేవి కన్నులు అశ్రుపూరితములయి, భాష్పవర్షము కురిపించు చుండెను. ఆమె అత్యంత దీనురాలై దు:ఖించుచుండగా, భగవానుడు మేఘ గంభీర స్వరముతో ఇట్లనియె. "భద్రా! శ్రీరాధికా! నీవు ఎందులకు ఉదాశీనత తో యున్నావు? విచారింపవలదు. నీవు కూడా నా మధురాయాత్రా ఫలితముగ విరహము చే వ్యాకుల చిత్తవు కాలేదు కదా! బ్రహ్మదేవుని ప్రార్ధనానుసారము పృథివీ భారము తగ్గించుటకు, కంసాది దురాత్ములను సంహరించుటకు, మన మిరువురము ఈ ధరణి యందు అవతీర్ణులమైతిమి. నేను నా అవతార సిద్ధికై మధురాపురమునకేగి భూభారణోద్ధరణము అయిన పిదప నిన్ను చేరెదను." జగదీశ్వరుడయిన శ్రీహరి పలుకులు వినిన వియోగ విహ్వల శ్రీరాధాదేవి దావానలము చేదగ్ధమయిన లత వలె కంపించి, రోమాంచయై, మూర్ఛిల్లి, తిరిగి లేచి తన ప్రాణవల్లభునితో ఇట్లనియె "ప్రాణనాథా! మీరు పృథివీభార హరణమునకై మధుర అవశ్యము వెళ్ళవలసినది. కానీ నా ప్రతిజ్ఞ కూడా వినవలసినది. మీరు వెళ్ళిన తక్షణమే నేను ఈ శరీరమును ధరింపలేను. మీరు నా ప్రతిజ్ఞను లెక్కజేయరేని వెంతనే హతశేషురాలినగుదును. నా ప్రాణములు నా అధరములు నుండి వెలువడుటకు ఆత్రుత చెందుచున్నవి. అవి కర్పూర కణము వలె వెంతనే ఎగిరి పోవును."

భగవానుడు "శ్రీరాధికా! నేను వేద స్వరూపమయిన నా వాక్కును వెనుకకు తీసికొనగలను. కానీ భక్తుల వచనమును అవహేళన చేయు శక్తి నాకు లేదు. పూర్వకాలమందు జరిగిన కలహ కారణమున శ్రీదాముని చే ఈయబడిన శాప కారణమున మన ఇరువురికి వంద సంవత్సరములు, వియోగము తప్పదు, ఇందు సందేహము లేదు. కళ్యాణీ! శ్రీరాధికా! శోకింపవలదు. నాచే నీకు ఈయబడిన వరమును స్మరింపుము. ప్రతి మాసము నందునూ వియోగ దు:ఖ శాంతి కొరకై నీకు ఒక దినము నా దర్శనము ప్రాప్తించును." శ్రీరాధికా "శ్రీహరి! ప్రతి మాసము నందునూ నీ దర్శనము కలుగదేని నేను భరింపశక్యము గాని దు:ఖము చే ప్రాణ త్యాగము చేయుదును. లోకాభిరామా! జనభూషణా! విశ్వదీపా! మదనమోహనా! జగత్తు యొక్క పాపమును హరించుస్వామీ! ఆనంద కందా! యదుకుల నందనా! నందకిశోరా! నీ ప్రతి మాసాగమనము గూర్చి నా ఎదుట ప్రతిజ్ఞ చేయవలసినది." అంత శ్రీహరి "శ్రీరాధికా! గోవుల పై ఆన! నీ వియోగము నందు ప్రతి మాసము ఒక దినము నీకు దర్శన మిచ్చుటకు ఏతెంచెదను. నా ఈ శపధమును శంకింపవలదు."

"ఎవరు పరుల నుండి ఏమియు ఆశింపక నిశ్చల భావముతో మైత్రి సలిపెదరో ఆ జీవులు ధన్యులు. ఎవరు మైత్రినెరపి కపటము చేయుదురో వారు స్వార్ధరూప లంపటులు, నటులు మాత్రమే! ఎట్లు కర్మేంద్రియములు రస, రూప, గంధ, స్పర్శ, శబ్దములను గ్రహింపనేరవో, అట్లే సకాములయిన జీవులు నిరపేక్ష సుఖము లేక నిర్గుణ, గూఢ, పరమ సుఖమును కించిన్మాత్రము తెలియనేరరు. సమవర్తులై, జితేంద్రియులై ఆపేక్షారహితులై యుండు మహా యోగి పుంగవులు మాత్రమే కామనారహితమయిన నా పరమ సుఖానుభవమును పొందెదరు. భామినీ! సర్వ మనోభావములు పారస్పరికము (పరస్పరము ఒకరి యందు ఒకరికి గల ఆపేక్ష మూలమున పొందునవి) అందువలన ఎవరికినీ ఒకరి వైపు నుండి మాత్రమే ప్రీతి యుండదు. ఇరువైపుల నుండి ప్రీతి యుండును. సర్వులకు వారి వారి నుండి నాపై ప్రేమ కలిగి యుండవలెను. ఈ భువన బ్రహ్మాండముల యందు "ప్రేమ"కు సమానమయిన వస్తువు వేరొకటి లేదు! లేదు!!!"

"శ్రీరాధికా! పూర్వము భాండీర వనము నందు ఎట్లు నీ మనోరథము సఫలమైనదో, అట్లే తిరిగి జరుగును. సత్పురుషులు ఏ కారణరహిత, నిష్కలంక ప్రేమను ఆశ్రయించెదరో దానినే సంతజనులు "నిర్గుణ" మని పేర్కొందురు. శ్రీరాధికా! పాలు, వాని తెల్లదనము వలె మన మిరువురినీ విడదీయుట అసంభవము. ఎవరు మనను ఇట్లు ఒక్కటిగా తలంచి నిష్కామభావముతో భజింతురో వారికి ఆ భావము చే నిష్కళంక భక్తి ఉత్పన్నమై నా ఉత్కృష్ఠ బ్రహ్మపదము

ప్రాప్తించును."

"ఎవరు మన ఇరువురి యందు భేదబుద్ధిని చూపుదురో (ఇరువురినీ వేరు వేరుగా తలచెదరో) ఆ కుబుద్ధులు సూర్య చంద్రులున్నంత కాలము కాలసూత్ర నరకము నందు పడి దు:ఖము పొందెదరు." నీతి కుశలుడయిన శ్రీకృష్ణ భగవానుడు ఈ విధముగ శ్రీరాధాదేవికి; ఇతర గోపికలకు ఆశ్వాశనము నొనర్చి, నంద భవనమునకు ఏతెంచెను. పిదప సూర్యోదయమయిన పిదప నందాది గోపప్రముఖులు బండ్లపై బహుమతులను సమకూర్చుకొని, రథారూఢులై మథారాపురమున కేగిరి. బలరామ, కృష్ణులను అక్రూరుడు స్వయముగ తన రథము నందు ఆశీనుల గావించి మథురాపుర ప్రస్థానము కావించెను. మార్గమధ్యము నందు కోట్లాది గోపికలు క్రోధ, మోహములచే విహ్వలులై, అక్రూరుని క్రూరుడని నిందించుచూ, కటు కటు వచనములతో సంభోదించుచూ, ఆతని రథమును నలు వైపులా చుట్టుముట్టిరి. శ్రీకృష్ణ విరహము చే విహ్వలలైన గోపికలు అక్రూరుని రథమును, హయములను, సారథినీ దండములతో ప్రహరించుట ప్రారంభించిరి. దానితో హయములు మార్గము తప్పి అటు, నిటు పరుగులిడుట ప్రారంభించినవి. సారథి క్రిందపడెను. స్త్రీలకు లోక మర్యాద అయిన లజ్జను విడనాడి గోపికలు బలరామ కృష్ణులు చూచుచుండగా అక్రూరుని రథము నుండి క్రిందకు లాగి హింసింపనారంభించిరి. అంత బలరామ కృష్ణులు అక్రూరుని ఆ గోపికా సముదాయము నుండి రక్షించిరి. అంత శ్రీకృష్ణుడు "వ్రజాంగనలారా! మీరు చింతింపవలదు. నేను ఈ రోజు సాయంసంధ్యా సమయమునకు తిరిగి వచ్చెదను. మీరు అక్రూరుని ఎదుట మమ్ములను నవ్వుల పాలు కావింపవలదు." ఈ విధముగ పలికి శ్రీకృష్ణుడు అక్రూర బలరామ సహితుడై, వేగవంతములయిన హయములు చే లాగబడుచున్న రథము నందు మథారాపురమునకేగెను. ఎంత వరకు రథము, కేతనము, హయముల నుండి రేగిన ధూళి కనపించినదో అంత తడవు ఆ గోప భామినులందరూ చిత్తరువుల వలె అచటనే స్థంభీభూతులైరి. కానీ ముకుందుని వచనములు తలచుకొని ఆయనతో పునర్మిళినమగు ఆశ చిగురించగా నెమ్మదిగ, భారముగ వెనుదిరిగిరి.

(శ్రీ గర్గసంహిత యందు శ్రీ మథురా ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి "శ్రీకృష్ణుని మధురాయానమను" నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఐదవ అధ్యాయము

(అక్రూరునికి శ్రీకృష్ణుని పరబ్రహ్మ స్వరూప సాక్షాత్కారము మరియు అక్రూరస్తుతి; శ్రీ కృష్ణుడు గోపబాలకుల సహితుడై మధురాపుర దర్శనమున కేగుట, మధురానగర స్త్రీలు ఆయనను చూసి మోహితులగుట, భగవానుడు ఒక రజకుని ఉద్ధరించుట)

నారదుడు "మహారాజా! శ్రీకృష్ణుడు అధిరోహించిన రథము బలరామ అక్రూరుల సహితముగ మధురా నగరపు ఉపవనము వద్దకు చేరినది. అంత శ్రీకృష్ణుడు రథము దిగి శుద్ధమయిన యమునా జలములు త్రాగి సేద తీర్చుకొని తిరిగి రథమారోహించెను. అంత అక్రూరుడు సాయంసంధ్యాది నిత్య, నైమిత్తిక కర్మాచరణమునకై యమునా జలములందు ప్రవేశించెను. యమున అగాధమయిన లోతైనది మరియు పెద్ద పెద్ద తరంగములతో నిండి యుండునది. అక్రూరుడు ఆ జలముల యందు బలరామ కృష్ణులను కాంచెను. ఆతడు అత్యంత చకితుడై వెనుకకు తిరిగి చూడగా రథము నందు సోదరులు ఇరువురు కానబడిరి. తిరిగి జలములపై దృష్టి సారించగా, అందు బలదేవుడు శేషరూపమున చుట్టలు, చుట్టుకొని కూర్చొని యుండెను. ఆయన ఒడిలో పరమ ప్రకాశమానము, లోకవందితము అయిన గోలోకము, గోవర్ధనము, యమునానది, రమణీయ బృందావనము, అసంఖ్యాక సూర్యకాంతి నిండిన జ్యోతిర్మయ మండలము కానబడెను. ఆ జ్యోతిర్మండల మధ్య భాగమున రాసమండలార్గతమున కోట్లాది కామదేవుల సౌంర్యమును తిరస్కరించు సాక్షాత్ పరిపూర్ణ

భగవానుడు, పురుషోత్తముడు, శ్రీకృష్ణుని పరమాత్మ గా ఎరిగి (గ్రహించి) ఆయనకు తిరిగి తిరిగి నమస్కృతులు అర్పించి, చేతులు జోడించి, హర్షాతిరేకము చే ఆయనను ఇట్లు స్థుతించుట ప్రారంభించెను. "అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి, గోలోక ధామము యొక్క స్వామి, పరిపూర్ణ భగవానుడయిన శ్రీకృష్ణునికి నమస్కారము. ప్రభూ! మీరు రాధా ప్రాణ వల్లభులు, వ్రజాధీశులు, నందనందనులు, మరియు యశోదా మాతకు మిక్కిలి మోదము కలిగించువారు. మీకు నమస్కారము. దేవకీపుత్రా! గోవిందా! వాసుదేవా! జగదీశ్వరా! యదుకుల తిలకా! జగన్నాథా! పురుషోత్తమా! మీకు నమస్కారము. ప్రభూ! నా వాణి ఎల్లప్పుడూ మీ గుణగానము చేయుగాక! నా చెవులు ఎల్లప్పుడూ మీ కథామృతమును వినుగాక! నా భుజములు మీ ప్రసన్నత కొరకై కార్యక్రమములు సలుపుగాక! నా మనసు ఎల్లప్పుడూ మీ చరణారవింద చింతనా పరమై యుండుగాక! నా నేత్ర ద్వయము ఎల్లప్పుడూ మీ దివ్యరూప సందర్శనము చేయుగాక!"

ఇట్లు చకితుడై అక్రూరుడు భగవానుని వైభవమును వీక్షించుచూ, ఆయనను స్థుతించుచుండగా అకస్మాత్తుగా భగవానుడు అంతర్ధానుడయ్యెను. అంత అక్రూరుడు ఆయనకు మనసులో వందనము లిడి, తన నిత్యకర్మలు పూర్ణము కావించి, శ్రీకృష్ణుని పరబ్రహ్మ తత్వము నెరింగి విస్మితుడై తిరిగి రథమారోహించెను. అంత గంభీర నాదము చేయు వేగవంతములయిన హయముల సాహాయ్యమున చీకటి పడుచుండగా వారందరూ మధురానగరమున కేతెంచిరి. అచట గల ఉపవనము నందు ఉపస్థితుడయిన నందుని కాంచి శ్రీకృష్ణుడు మందహాసము చేయుచూ మేఘ గంభీర స్వరమున అక్రూరుని తో ఇట్లనియె "మహానుభావా! ఇక మీరు మీ రథము తో మధురకు వెళ్ళవలసినది. నేను వెనుక గోప బాలుర తో వచ్చెదను." అక్రూరుడు "దేవదేవా! జగన్నాథా! గోవిందా! పురుషోత్తమా! ప్రభో! మీరు మీ సోదర మిత్ర సహితులై మా ఇంటికి రావలసినిది. జగత్పతీ! మీ చరణారవింద ధూళి చే మా గృహమును పవిత్రము కావింపవలసినది. నేను మీరు రాకుండా మా గృహమునకు వెళ్ళలేను." భగవానుడు "అక్రూరా! నేను యదువంశ వైరి అయిన కంసుని పరిమార్చి, బలరామ, గోపబంధు సహితుడనై అవశ్యము మీ గృహాగమనము గావించి మిమ్ములను ఆనంద పెట్టెదను." శ్రీకృష్ణ భగవానుడు ఆ రాత్రి అచటనే ఉండిపోయెను. అ క్రూరుడు కంసునికి శ్రీకృష్ణాగమన వార్త నివేదించి తన నిజ గృహమునకు అరిగెను.

మరునాడు శ్రీకృష్ణుడు బలరామ, గోపబాల సహితుడై మధురా పుర సందర్శనార్ధమై బయలుదేరు చుండగా ఆయనతో నందుడిట్లనియె "వత్సా! మధురా పురమును చూచి మీరందరూ జాగ్రత్తగా తిరిగి రావలసినది. ఇది నందవ్రజము కాదు. ఇది భయంకర కంస రాజ్యము." శ్రీ కృష్ణుడు "అటులనే" అని పలికి గోప వృద్ధులు, మరియు ఇతన గోపబాలురతో కలసి మధురా పురమున కేగెను. మధురాపురము దుర్గముల తో చుట్టబడి, అంబరచుంచిత రత్నఖచిత మందిర ప్రాసాదములతో కూడి అమరావతి వలె శోభిల్లు చుండెను. యమునా తటము లందు రత్నములతో నిర్మింపబడిన మెట్లు కలవు. ఆ మెట్లను తాకుచున్న యమునా తరంగములు చూడముచ్చట కొలుపుచున్నవి. వాటన్నిటినీ మించి మధురాపురమున నివసించుచున్న దివ్యనరనారీమణులచే ఆ నగరము కుబేరుని అలకాపురమును తలపించుచున్నది. ఇట్లు మధురాపురమున నివసించు ధనికుల సుందర గృహములు కాంచుచూ శ్రీకృష్ణుడు గోపబాలుర సహితుడై నెమ్మది నెమ్మదిగ రాజమార్గము ప్రవేశించెను. వసుదేవ నందనుడు శ్రీకృష్ణుడు వచ్చెనన్న వార్త వినిన మధురాపుర వనితలు ఆయన గూర్చి అనేక విధములుగ వినిన వారై తమ గృహ కార్యములు, శిశువులను సహితము విడచి నదులన్నియు సముద్రము వైపు ప్రవహించునట్లు ఆయనను చూచుటకు పరుగులు పెట్టిరి.

కొందరు స్త్రీలు తమ మందిరముల నుండి, కొందరు తమ గవాక్షములకున్న తెర వెనుక నుండి, కొందరు తమ గోడల పై భాగము నుండి, కొందరు తమ గృహముల తలుపులు తెరచుకొని సింహద్వారముల నుండి బయటకు వెడలి ఆయనను దర్శింపసాగిరి. భగవానుని చంచలమయిన ముంగురులు కొంత భాగము ఫాలభాగము పై పడుచుండగా ఆయన సర్వజనులను మోహింపచేయు చుండెను. మిగిలిన కేశములు కిరీటము చే కప్పబడి వెనుకనున్న మెడపై వ్రాలి సందడి చేయు చుండగా ఆయను వెనుకనుండి చూచిన జనులు సహితము మోహితులైరి. ఆయన పీతాంబరము నడుము వద్ద కట్టబడి మిగిలిన పీతాంబరము కాళ్ళను కప్పుచుండగా అయ్యది నీలి మేఘమును కప్పిన విద్యుత్కాంతి వలె మెరయుచుండెను. ఆ సమయమున ఆయన ఒక చేతియందు కమలమును, వక్షస్థలమందు వైజయంతీ మాలను

ధరించియుండెను. కర్ణములకు నవీన మకర కుండలములు, భుజములకు బాలసూర్యుని భాతి భాసించుచున్న సువర్ణ భుజ కీర్తులు ధరించి నడచి వచ్చుచున్న అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి, పరాత్పరుడయిన భగవానుని, వసుదేవ నందనుని, శ్రీకృష్ణుని కాంచి సమస్త మధురాపుర వాసినులు ముగ్ధులై, మోహితులైరి.

నగర మానినులు ఈ విధముగ పలుక నారంభించిరి "అహో! ఈ నందనందనుడు నివసించు బృందావనము ఎంత మనోహరముగ యుండునో కదా! ప్రతి దినము ఈ రమణీయ దివ్య రూపమును కాంచు సమస్త గోపగణములు ధన్యులు. రాస మండలమునందు మరల మరల ఈతని అధరామృతమును గ్రోలు గోపాంగనలు కూడ ధన్యులు. ఈ దివ్యానుభవము పొందుటకు వీరు ఏమి పుణ్యము చేసిరో కదా!"

ఆ రాజ మార్గము నందు ఒక రజకుడు పోవుచుండెను. ఆతడు మిక్కిలి గర్విష్ఠి. గోప బాలకుల అనుమతితో శ్రీకృష్ణుడు ఆతని తో ఇట్లనియె "ఓ! బుద్ధిమంతుడవయిన మిత్రమా! మాకు కొన్ని సుందర వస్త్రముల నీయవలసినది. నీవు అట్లు చేసినచో నీకు మిక్కిలి కళ్యాణమగును. ఇందు సందేహము లేదు." ఆ రజకుడు కంసుని సేవకుడు, మరియు మిక్కిలి దుష్టుడు. శ్రీకృష్ణుని పలుకులు వినినంతనే ఆతడు నెయ్యి చే ప్రజ్వలింపబడిన అగ్ని వలె మండిపడి ఇట్లనియె "అరే! మీ తాత తండ్రులు ఈ రకమయిన వస్త్రములు ధరించినారా? వనచరులయిన గోపకులారా! జీవితము నందు ఇచ్ఛయుండెనేని మీరు అందరూ వెంటనే నగరము వీడవలసినది. లేని యెడల వన చరులయిన మీరందరనూ కారాగార వాసులను గావించెదను." శ్రీకృష్ణుడు ఆ విపరీత భాషితుడయిన రజకుని తన కరాగ్రముచే చిన్నగా ప్రహరించెను. తక్షణమే రజకుడు మరణించి ఆతని నుండి ఒక జ్యోతి వెలువడి శ్రీ కృష్ణుని యందు లీనమయ్యెను.

అది చూచిన తక్షణమే ఆ రజకుని సేవకులందరూ తమ బట్టల మూటలను అక్కడికక్కడే వదలి వాయువేగమునకు పటాపంచలగు శరత్కాల మేఘముల వలె నలుదిశలకు పారిపోయిరి. శ్రీకృష్ణ బలరాములు తమకు నచ్చిన వస్త్రములు తీసికొనిరి. మిగిలిన గోప బాలకులు మరియు మార్గమునున్న యాత్రీకులు మిగిలిన వస్త్రములను తీసకొనిరి. ఆ వస్త్రములను ఎట్లు కట్టుకొనవలెనో తెలియని గోపబాలురు శ్రీకృష్ణ బలరాములను చూచి అస్తవ్యస్తముగ తమ వస్త్రములు ధరించిరి. ఇంతలో ఒక గోపబాలుడు చిత్ర విచిత్ర వర్ణములు గల వస్త్రములు ఏరి శ్రీకృష్ణ బలరాములకు ధరింప జేసెను. అన్య బాలకులు సహితము యధోచితముగ వస్త్రములు ధరించి శ్రీకృష్ణుని పురర్ధర్శించిరి. తనను వస్త్రముల చే అలకంరించిన గోప బాలునకు శ్రీకృష్ణుడు తన సారూప్యము అనుగ్రహించెను. బలదేవుడు ఆతనికి బలము, ఐశ్వర్యము, ధనము ప్రసాదించెను.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "శ్రీకృష్ణుని మధురా ప్రవేశము" అను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(సుదాముడను మాలాకారుని, కుబ్జను కరుణించుట, ధరుర్భంగము మరియు మధురాపుర వాసినులపై శ్రీకృష్ణుని మధుర మోహన రూప ప్రభావము)

నారదుడు "మహారాజా! తదనంతరము శ్రీకృష్ణ బలరాములు గోపబాలకుల సహితులై "సుదాముడు" అను మాలాకారుని ఇంటికి వెడలిరి. ఆ సోదరులిరువురినీ చూచుట తోడనే సుదాముడు వినయము తో నిలబడి వారిని పూల సింహాసనము పై ఆశీనులు చేసి, చేతులు జోడించి, నమస్కరించి గద్గదమయిన వాక్కుతో ఇట్లనియె "దేవా! మీ శుభాగమనము చే నేడు నా కులము, మరియు గృహము ధన్యమైనవి. నేను నా మాతా, పితా, భార్యల వైపు ఏడు తరములు వైకుంఠమునకు ఏగినవి అని తలచుచున్నాను. మీ ఇరువురు పరిపూర్ణ పరమేశ్వరులు మరియు భూతల

భారహరణమునకై యదుకులమందు అవతీర్ణులయిరి. ఈ దీనాతి దీనుని ఇంటికి ఏతెంచిన జగదీశ్వరులయిన మీరిరువురు సోదరులకు నమస్కారము." ఈ విధముగ పలికి సుదాముడు పుష్ప హారములు మరియు మకరందము వారికి నివేదించెను. శ్రీకృష్ణుడు బలరామ సహితుడై వాటిని స్వీకరించి, మాలలు ధరించి, మిగిలిన గోపబాలకులకు సహితము వాటిని పంచి, మందహాసము చేయుచూ సుదామునితో ఇట్లనియె "సుదామా! నీకు ఎల్లప్పుడూ నా చరణారవిందములందు గురుతర భక్తి యందును. నీకు ఎల్లప్పుడూ నా భక్తుల తోడి సంగము కలుగును. నీకు ఈ జన్మము నందే నా సారూప్యము ప్రాప్తించును. పిదప బలదేవుడు ఆతనికి "నీ కులమందు సంపద ఎల్లప్పుడూ వృద్ధి పొందును," అని వరమిచ్చెను. అచటి నుండి వారు వేరొక వీధి లోనికి వెళ్ళిరి.

వారికి మార్గమధ్యమందు ఒక కమలనయన కానబడెను. ఆమె ఒక చందనాను లేపనములు గల ఒక పాత్రను తోడ్కొని పోవుచుండెను. ఆ స్త్రీ యుక్త వయస్కురాలైనప్పటికీ శరీర మంతయు వంకరగ యుండి త్రిభంగియై ఒప్పారెను. మాధవుడు ఆమె తో "సుందరీ! నీవు ఎవరు? నీవు ఎవరి ప్రియతమవు? ఈ చందనానులేపనములు ఎవరి కొరకు తీసికొని పోవుచున్నావు? మా ఇరువురికీ ఈ చందనమును ఈయవలసినది. అందుచే నీకు మిక్కిలి కళ్యాణమగును." అంత ఆ సైరంధ్రి "సుందర శిరోమణీ! నేను కంసుని దాసిని. "కుబ్జ" నామధారిణిని. నా చేత తీయబడిన గంధమనిన భోజరాజయిన కంసునికి మిక్కిలి ప్రీతి. మిమ్ములను చూచిన దాది ఏనుగు తొండముల వంటి మీ బాహు ద్వయముపై నా మనస్సులగ్నమగుచున్నది. మీ సోదరులు ఇరువురి కంటెను ఈ చందన లేపనమునకు యోగ్యులు వేరొకరు లేరు.

"మీరిరువురు కంటెనూ సుందర స్వరూపులు త్రిభువనముల యందు యుండరు." ఈ విధముగ పలికి కుబ్జ హర్షాతిరేకము చే శ్రీకృష్ణ బలరాములకు స్నిగ్ధాది లేపనములు బహూకరించెను. ఆ అంగరాగముల చే వారిరువురు మిగుల ప్రకాశించుచుండిరి. మిగిలిన వ్రజబాలకులు సహితము కొంచెము కొంచెము అంగరాగములు అలదుకొనిరి. కుబ్జ తన శరీరము నందు మూడు చోట్ల వంకరగా యుండెడిది. అని చెప్పుకొంటిమి కదా? అంత సర్వవ్యాప్తి అయిన శ్రీకృష్ణుడు తన చరణముల చే ఆమె పాదములను అదిమి, రెండు వేళ్ళచే ఆమె చుబుకమును పట్టి, లోకులందరూ చూచుచుండగా ఆమె మూడు వంకరలను సరిజేసి నిటారుగా నిలిపెను. తక్షణము కుబ్జ నిటారుగ నిలిచి అత్యంత రూప యవ్వన సంపన్న తన్వంగీ తరుణి గా రూపాంతరము చెందెను. ఆ సమయమున ఆమె దేవాకాంతలయిన రంభాది అప్సరసలను మించిన సౌందర్యరాశిగా ప్రకాశించుచుండెను.

ఆమె హృదయము కామ భావన చే నిండి ఆమె శ్రీకృష్ణుని వస్త్రము పట్టి ఇట్లనియె "సుందర ప్రవరా! నా యందు దయదలచి నీవు శీఘ్రమే మా ఇంటికి రావలసినది. నేను నిన్ను విడువలేను. నీవు సర్వుల మనస్సులనూ ఎరుగుదవు. రశిక శిరోమణీ! నీవు నా మనసును మిక్కిలి వేగముతో మథించుచున్నావు." ఇవి అన్నియు గమనించుచున్న గోపబాలకులు మిక్కిలి ఆశ్చర్యపడి, కరతాళధ్వనులు, చేయుచూ కుబ్జను హేళన చేయసాగిరి. బలదేవుడు మాత్రము నిష్పక్షముగ ఆ సంఘటనను కాంచుచుండెను. తనను ఇంటికి పిలుచుచున్న స్త్రీ యొక్క ప్రార్థనను ఆలకించిన శ్రీకృష్ణ భగవానుడు ఇట్లనియె "ఆహా! అపరిచిత వ్యక్తులను సహితము తమ ఇంటికి ఆహ్వానించు సౌమ్య స్వభావులున్న ఈ మధురాపురి ధన్యమైనది. సుందరీ! నేను మధురాపుర దర్శనానంతరము అవశ్యము నీ గృహమునకు ఏతెంచెదను." ఇట్లు సౌమ్యముగ నుడివి తన వస్త్రమును ఆమె చేతి నుండి తీసికొని భగవానుడు రాజదర్శనార్థము తన నడక సాగించెను.

ఆ మార్గము నందు మిక్కిలి ధన, బుద్ధిశాలులైన వైశ్యులు నివసించుచుండిరి. వారందరూ మాధవునకు పానీయము, పుష్పములు, అత్తరు, పాలు, ఫలములు ఇచ్చి పూజించి ఆయనను ఉత్తమాసనమందు ఆశీనుని గావించి ఆయన చరణార విందములకు ప్రణామములు గావించిరి. తదుపరి వైశ్యులు "దేవా! మీరు ఇచ్చట రాజ్యస్థాపన గావించితిరేని మా వంటి ఆత్మీయులను తప్పక గుర్తించుకొన వలసినది. మేము మీ జనులము. రాజ్యము లభించిన పిదప ఎవరు ఎవరినీ పట్టించుకొనరు." అంత అచ్యుతుడు మందహాసము చేయుచూ ధరుర్యాగ స్థలము గుర్చి ప్రశ్నించెను. వైశ్యులు ధనుస్సు భగ్నమగునని భగవానునికి ఆ స్థలము గూర్చి చెప్పరైరి.

భగవానుని గుణ రూప మాధుర్యములచే మోహితులైన మిగిలిన మధురా వాసులు ఆయనకు ధనుర్యాగ స్థలమును

చూపిరి. శ్రీకృష్ణుడు వారు చూపిన మార్గము ననుసరించి ధనుశ్శాలా ప్రవేశము కావించెను. ఆయన తన సమవయస్కులతో మైత్రి గావించుచూ, ముందుకు సాగి స్థాపించబడిన బృహద్ధనువును గాంచెను. ఆ ధనువుపై చిరుగంటలు చిత్రింపబడినవి. అది ఇంద్రధనుసు వలె ప్రకాశించుచూ ఏడు తాడిచెట్లు పరిమాణమంత ఎత్తు యండెను. ఆ ధనువును కదిలించుటకు ఐదు వేల మంది యోధులు కావలెను. అది ఎనిమిది ధాతువులతో నిర్మితమై ఒక లక్ష బారువుల బరువు యుండెను. ఆ ధనువు చతుర్దశీ తిథి యందు పురవాసులచే పూజింపబడి యజ్ఞశాల యందు స్థాపించబడెను.

పూర్వకాలమందు భృగుకుల సంకులుడయిన పరశురాముడు యదు మహారాజుకు ఆ ధనస్సును బహూకరించెను. చుట్టల చుట్టుకొని యున్న శేషనాగము వలె యున్న ఆ మహాధనువును ముకుందుడు వీక్షించి, లోకుల వారించుచున్ననూ వారిని లక్ష్య పెట్టక, పురవాసులందరూ చూచుచండగనే ఆ ధనువును అవలీలగా ఎత్తి సంధించెను. పిదప దుర్వార బలముతో నారిని ఆకర్ణాంతము లాగి ఏనుగు చెరకుగడను విరుచునట్లు ఆ ధనువును మధ్యకు రెండు ముక్కలుగ విరచెను. ఆ సమయమున ఒక మహానాదము దనుష్ఠంకారము చేతనూ, ధనస్సు విరుగుట చేతనూ వెలువడి భూమి, మరియు ఊర్ధ్వ, అధో లోకములు కంపించెను. దిగ్గజములు విచిలితములయినది. తారలు నేల రాలినవి భూతలమున నివసించు జనులందరూ ఆ మహాధ్వని చే కొంతసేపు బధిరులు అయిరి. ఆ శబ్దము రెండు ఘడియల పాటు కంసుని హృదయమును విదీర్ణము కావించెను.

ఇంతలో ధనస్సునకు కాపలాయున్న కంసుని అనుయాయులు, ఆతతాయిలు మండిపడి శ్రీకృష్ణుని బంధించుటకు ఉద్యక్తులయిరి. అది గమనించిన బలరామ కృష్ణులు విరిగిన ధనస్సు యొక్క రెండు ముక్కలను తీసికొని దుర్మధులయిన కంస సేవకులను ప్రహరించిరి. అతి కఠినమయిన ధనస్సుఖండము యొక్క ప్రహరణముచే కొందరు మూర్ఛితులైరి. కొందరికి కాళ్ళు విరిగినవి. కొందరికి బాహువులు ఖండిపబడినవి. ఈ విధముగ అయిదు వేల మంది దైత్యశూరులు నిహతులైరి. సమస్త మధురాపురము నందు అలజడి మొదలైనది. చాలామంది ఆ ఘటనను కాంచి కాలికి బుద్ధిచెప్పిరి. నగరమంతయు కోలాహలముగ యుండి నగరవాసులు మిక్కిలి భయభ్రాంతులైరి. భోజరాజయిన కంసుని సభామండపపు ఛత్రము అకస్మాత్తుగా విరిగి క్రింపడెను.

సాయం సమయమున శ్రీకృష్ణ, బలరామ, గోపబాలురు యాగశాల నుండి నందుని వద్దకు వచ్చుసరికి నందుడు అత్యంత భయభ్రాంతుడై యుండెను. కానీ గోవిందుని అత్యద్భుత సుందర రూపమును తిలకించిన మధురా వనితలు మిక్కిలి మోహితులైరి. వారి వస్త్రములు క్రిందకి జారినవి. సాధారణముగ పైకి ఎగురు ముంగురులు క్రిందకు వాలినవి. హృదయము నందు కామజనితమయిన తీయని బాధ మొదలై వారిలో వారిట్లు సంభాషించుకొనిరి. "కోట్లాది కామదేవుల సౌందర్యము కలిగిన శ్రీహరి మిక్కిలి ఉత్సాహము తో మధురాపురమంతయు కేళీవిహారము కావించెను. ఆయనను చూచిన సమస్త యువతీజనముల అంగముల యందు అనంగుడు మన్మథ తాపము రేకెత్తించెను. కొందరు చతురవతులు "ఏమీ! ఈ మధురాపురి యందు అనంగ మోహనుడైన శ్రీకృష్ణుని సర్వాంగములను గుచ్చిగుచ్చి చూడు స్త్రీ రత్నములు లేరా! మనమందరమూ ఆ పరమానందమయ సర్వాంగ సుందరుని శ్రీకృష్ణుని కన్నులతో తేరిపార చూడలేదా? సఖీ! ఎవరు ఎవరికైనా ఒక్క అంగము నందు సౌందర్య మాధుర్యమును ప్రకటించెనేని వారి నేత్రములు గాలి పటముల వలె ఎగిరి పడును. కానీ ఒకని సర్వాంగములు అతి సుందరములు అయిన ఎడల ఆ సౌందర్యమును కేవలము నేత్రములతో ఒక్కసారి ఎట్లు చూడగలము? నందనందనుని అంగములన్నియు సుందరములు. ఆయనను ఎక్కడ చూచిననూ అది పరమ సుఖదాయకమై అచట నుండి దృష్టి వెలువడి వచ్చుట లేదు. ఆతడు లావణ్య మహాసాగరుడు. ఆయన యందు మన మనస్సులన్నియు పూర్తిగా మునిగిపోయినవి." మిథిలేశ్వరా! మధురానగరము నందు ఉదయము ముకుందుని దర్శించిన స్త్రీలకు రాత్రి స్వప్నము నందునూ ఆయనే కనపడెను. మరి రాసమండల మందు రాసలీల గావించిన గోపాంగనలు ఆయన మధుర మనోహర రూపమును నిరంతరము స్మరణ చేయకుండ ఎట్లు ఉండగలరు?

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీకృష్ణుని మధురా దర్శనమను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(మల్లయుద్ధ క్రీడోత్సవ ఆరంభము, రంగ ద్వారము నందు కువలయాపీడ వధ; శ్రీకృష్ణ బలరాములు చాణూర ముష్ఠికులతో మల్ల యుద్ధమునకు సంసిద్ధులగుట)

నారదుడు "మహారాజా! రజక మస్తక భేదనము, ధనుర్భంగము, మరియు ధనురక్షకుల సంహారము మొదలగు వార్త (విశేషములను) వినిన కంసుడు మిక్కిలి భయ కంపితుడాయెను. తత్కాలమే అతనికి అనేక దుశ్శకునములు కానపట్టెను. ఆతని ఎడమవైపు అంగములు అదిరినవి. స్వప్నము నందు అంగభంగ మయినట్లు కనిపించెను. దానితో రాత్రంతయూ కంసునికి కునుకు పట్టదాయె. ఆతడు స్వప్నమునందు ప్రేతముల చే లాగబడినట్లు, శరీరమంతయు తైలము పూయబడినట్లు, నగ్నముగా యుండి జపాకుసుమ మాలాధారియై దున్నపోతునెక్కి దక్షిణ దిశగా పయనించి నట్లు కలగనెను. ప్రాత:కాలమయినంతనే కంసుడు కార్యకర్తల నందరినీ పిలచి మల్లక్రీడా మహోత్సవము ఆరంభింపచేయమని అనుజ్ఞ నొసంగెను.

సభామండపమునకు ఎదురుగ ఒక విశాల ప్రాంగణమందు రంగభూమి ఏర్పాటు చేయబడెను. ఆ ప్రాంగణమందు ముత్యములు వరుసలు కూర్చబడిన మిలమిల మెరయుచున్న చాంధలరీలు వ్రేలాడదీయబడిన బంగారు స్థంభములు నాటబడెను. సువర్ణమయ ఆశీనములు, సుందర సోపానములు, ఆ ప్రాంగణము చుట్టూ కట్టబడి, రంగస్థలమును దేదీప్యమానముగ ప్రకాశింపచేయుచుండెను. కంస మహారాజుకు ఒక ఎత్తైన రత్నమయ మంచె ఏర్పాటు చేయబడి, దానిపై అత్తరు, పన్నీరు చిలకరింపబడి, ఆపై ఇంద్రుని దివ్య సింహాసనము అమర్చబడెను. ఆ సింహాసనము పై ఆఛ్ఛాదము, సుందర దుకూలములు పరుపబడినవి. చంద్రమండల సన్నిభమయిన దివ్య ఛత్రము, మణుల పిడి గలిగి హంసతూలికలు చే చేయబడిన వింజామరలు అమర్చబడిన విశ్వకర్మ వినిర్మితమయిన పది అడుగుల ఎత్తైన ఆ సింహాసనము మిక్కిలి చిత్తాకర్షకమై యుండెను. ఆ సింహాసనము నందు ఆశీనుడయిన కంసుడు పర్వత శిఖరమందు కూర్చొని యున్న మృగరాజు వలె శోభిల్లుచుండెను. ఆ రంగభూమి యందు గాయక వైతాళికులు పాడుచుండగా వారాంగనలు నృత్యము చేయుచుండగా, మృదంగ, భేరీ, పటాహ, తాళ వాద్యములు మ్రోగుచుండెను. చిన్న చిన్న సామంత రాజులు, మండలాధిపతులు, జానపదులు, ధనికులయిన నాగరికులు, ఇట్లు ఎవరికి వారు వేరువేరుగా కూర్చొని మల్లయుద్ధము వీక్షించు చుండిరి. చాణూర, ముష్ఠిక, కూట, శాల, తోశాలాది మల్లులు తమ వ్యాయాయ పరికములతో అభ్యాసము చేయుచూ పరస్పరము ముష్ఠి యుద్ధము చేయుటకై సంసిద్ధులగు చుండిరి.

కుంసుని ద్వారా పిలిపింపబడిన నందాది ప్రభృతులు తమ శిరస్సులు వంచుకొని, మహారాజునకు బహుమతులర్పించి, వారికి ఏర్పరుపబడిన స్థానములందు నిశ్శబ్దముగ కూర్చుండిరి. అచట భోజరాజైన కంసునికై జరాసంధ, బాణాసుర, నరకాసురుల చే పంపబడిన బహుమతులు సహితము ప్రదర్శింపబడినవి. ఇతర శంబరాది భూపాలురు సహితము పంపిన బహుమతులు సహితము పెట్టబడినవి. తమ మాయచే చిన్న చిన్న బాలకుల వలె వేషధారణ గావించిన బలరామ కృష్ణులు వివిధ మల్లుర మల్లయుద్ధ విశేషములు తిలకించుటకై రంగశాలా ప్రవేశము గావించిరి. రంగస్థల ద్వారమందు "కువలయాపీడము" అను మహాగజము నిల్చొని యుండెను. ఆ మహానాగము యొక్క కుంభస్థలము గోమూత్రము తో తడిపిన సింధూరము మరియు కస్తూరితో చిత్ర, విచిత్రముగ అలంకరింప బడెను. రత్నమయ కుండల మండిత అయిన ఆ మహామత్త గజరాజము యొక్క గండస్థలము నుండి మదజలధార కారుచుండెను.

ద్వారమునకు అడ్డముగ యున్న మహాగజమును కాంచి శ్రీకృష్ణ భగవానుడు మావటితో "ఓరీ! ఈ గజమును దూరముగ త్రోలి నాకు లోనికి పోవుటకు మార్గము నీయుము. లేని యెడల నిన్నూ, ఈ గజమునూ భూమిపై పడవేయుదును." అంత కుపితుడయిన మావటి దిశలను దద్దరిల్లజేయు ఆ మహాగజమును నందనందనుని పై ఆక్రమించుటకు ముందుకు

త్రోలెను. గజము తన తొండముతో శ్రీహరిని పట్టుకొని పైకి లేవనెత్తెను. అంత ముకుందుడు తన భారమును అధికము చేసి, ఆ తొండము నుండి విడవడి బయటకు వచ్చెను. బృందావన నికుంజముల యందు దాగుడు మూతలాడు విధముగ మాధవుడు అటునిటు తిరుగుచూ నెమ్మదిగ ఆ మహానాగము యొక్క కాళ్ళ నడుమ దాగుకొనెను. కానీ ఆ గజము తొండముతో అచ్యుతుని పట్టుకొన ప్రయత్నించెను. శ్రీహరి తన రెండు చేతులతో ఆ తొండమును చరిచి వెనుకవైపు వెళ్ళు ప్రయత్నము చేసెను. ఇంతలో గజము ప్రక్కలకు కదిలి శౌరిని ప్రహరింప ప్రయత్నించెను. అంత కేశవుడు ముందుకు వచ్చి తన చేతులతో ఆ మహానాగము యొక్క కుంభస్థలిపై బలముగ ప్రహరించి ముందుకు పరుగెత్తెను. అంత ఆ కుంజరాజము బలానుజుని వెనుక పరుగెత్తెను. ఆ సమయమున మధురాపురి అంతయు ఆక్రోశములు చెలరేగెను. ఇంతలో శ్రీహరి వెనుతిరిగి ఆ ఏనుగు వెనుకవైపు వచ్చెను. అచట మహాబలి అయిన బలదేవుడు తన ప్రచండ బాహుబలము తో గరుడుడు సర్పమును పట్టునట్లు ఆ గజము యొక్క పుచ్ఛమును పట్టుకొని వెనుకకు లాగెను. అంత శ్రీకృష్ణుడు నవ్వుచూ తన రెండు చేతులతో ఆ దంతి యొక్క దంతములు పట్టి ముందుకు లాగెను. ఈ ఇరువురి సోదరుల మధ్య ఆ మహాగజము మిక్కిలి వ్యాకులత పొందెను. ఇంతలో ఏడుగురు మావటులు ఆ గజము నధిరోహించిరి.

ఈ కోలాహలము ఇట్లు చెలరేగు చుండగా శ్రీకృష్ణుని పరిమార్చుటకు ఇతర మావటులు మూడు వందల ఏనుగులు అచటికి తీసికొని వచ్చిరి. మావటుల అంకుశ ఘాతములు తినిన కువలయాపీడము తిరిగి ముకుందుని వైపు పరుగుతీసినది. అంత బలదేవుడు చూచుచుండగా ముకుందుడు ఆ ఏనుగు తొండమును పట్టి గిరగిరా త్రిప్పి బాలుడు కమండలమును నేలపై విసురునట్లు బలముగ నేలపై విసరెను. దాని నధిరోహించిన ఏడుగురు మావటులు నేలపై పడిరి. అచట యున్న సాధుపురుషులు చూచు చుండగనే మహానాగము ప్రాణశూన్యమై దాని నుండి ఒక దివ్య జ్యోతి వెలువడి మేఘశ్యాముని యందు వినీల మయ్యెను.

అనంతరము భగవానుడు శ్రీకృష్ణుడు, మహాబలి అయిన బలరాముడు ఆ ప్రాణశూన్యమయిన మహాగజము యొక్క దంతములు పెరకి సింహపు కూనల వలె విజృంభించి మిగిలిన మావటులను ఆ దంతముల తో ప్రహరించి యమునికి అతిధులగావించిరి. హతశేషులయిన మావటులు వర్షాకాలానంతరము మేఘములు దాగుకొను పగిధి పరుగులెత్తి ఎచ్చటనూ కానరారైరి. ఈ ప్రకారము కువలయాపీడ వధానంతరము శరీరము నందు మదగజము యొక్క రక్తపు బిందువులు వింతకాంతి తో శోభించు చుండగా, గోపబంధుగణము, చుట్టూయున్న నాగరికులు జయజయ ధ్వానములు చేయుచుండగా శ్రీకృష్ణ బలరాములిరువురు ఠీవిగా రంగస్థల ప్రవేశము గావించిరి. ఆ సమయమున అధిక పరిశ్రమ కారణమున వారి ముఖములు ఎఱ్ఱబడి యుండెను. వారిరువురి హస్తముల యందు విరిగిన ఏనుగు దంతములుండెను. వారిరువురు నలుదిశలా ఒక్కమారుగా విస్తరిల్లు అనిల, అనలులుగా శోభిల్లుచూ రంగ ప్రవేశము చేసిరి. వారిరువురు ఏక కాలమున పలువురకు పలు రకములుగ కనిపించిరి. మల్లులకు మహామల్లుల వలెనూ, నరులకు నరేంద్రుని వలెనూ, నారీ మణులకు కామదేవుని వలెనూ, గోప గణములకు వ్రజనాధుని గనూ, తల్లిదండ్రులకు పుత్రుల వలెనూ, దుష్టులకు దండధారి అయిన యముని వలెనూ, కంసునికి తనకు ఆసన్నమయిన మృత్యువు వలెనూ, జ్ఞానరూపులకు విరాట్ బ్రహ్మగనూ, యోగశిరోమణులయిన మహాత్ములకు పరతత్వము గనూ ఏక కాలమందు కానిపించిరి. ఇతర లోకులు కూడా భగవానుని తమ తమ భావనానుసారముగ విభిన్న రూపములతో వీక్షించిరి. కువలయాపీడ వధా వృత్తాంతమును ఆలకించిన కంసుడు మహాబలులైన తన బాల బంధువులను చూచి భయభీతుడై సింహాసనము నుండి పైకి లేచెను. కంస భయముచే కూర్చొనియున్న ఇతర జనులు మనసునందు అత్యంత హర్షోల్లాసితులై ఇంద్రుని చూచు చకోరములు వలె బలరామ కృష్ణుల చూచి పరమానంద మగ్నులైరి.

నాగరికులు ఒకరి చెవులలో ఒకరు రహస్యముగా ఇట్లను కొనిరి, “వీరిరువురు వసుదేవ నందనులు, పరమపురుషుడయిన పరమేశ్వర స్వరూపములు, ఆహా! వ్రజమండలము అత్యంత రమణీయము మరియు శ్రేష్ఠతమము. అక్కడ సాక్షాత్ ఈ మాధవుడు తిరుగాడెను. ఈతని దుర్లభ దర్శనమును పొంది మనము కూడా కృతార్థులమైతిమి. ఈ విధముగ లోకులు, నాగరికులు వివిధ రీతుల శ్రీహరిని ప్రస్తుతించు చుండగా, బాజా భజంత్రీలు మ్రోగు చుండగా చాణూరుడు బలరామ కృష్ణుల చేరి ఇట్లునియె “ఓ! రామకృష్ణులారా! మీరిరువురు మహాబలవంతులు. అందువలన

మహారాజు యెదుట మీ బలప్రదర్శన చేయవలసినది. యదుకుల తిలకుడయిన కంసుడు ప్రసన్నుడయిన ఎడల మీకు, మాకు కూడా భూరి బహుమతులొసంగును. అంత కృష్ణుడు "చాణూరా! మహారాజు యొక్క కృపాప్రసాదము వలననే మొదటి నుండియు మాకు మంచి జరుగుచున్నది. కానీ ఒక్క విషయము జ్ఞప్తిన ఉంచుకొనవలసినది. మేము బాలురము. మాతో సమానమయిన బలసంపన్నులయిన బాలుర తోడనే మేము మల్లయుద్ధము చేయుదుము. మీ వంటి బలాఢ్యుల తో కాదు. అధర్మ యుద్ధము కూడనిది కదా!".

చాణూరుడు "మీరిరువురు బాలురు కాదు. బలవంతుల యందు బలిష్ఠులు. ఎందుకనగా సహస్ర కుంజరముల బలము గల కువలయాపీడమును మీరిరువురు క్రీడ భాతి అతి సునాయాశముగ సంహరించిరి." చాణూరుని పలుకులు వినిన అఘమర్ధనుడు శ్రీకృష్ణుడు తాను చాణూరుని తోనూ, బలరాముడు ముష్టికుని తోనూ మల్లయుద్ధమారంభించిరి.

వారు నొకరినొకరు భుజములతో పట్టుకొని ముందుకు వెనుకకూ లాగుచూ త్రోసికొని చుండిరి. చూచువారలకు వారు రెండు మదపు టేనుగులు పెనుపెక్కిన విజయకాంక్ష తో ఒండోరులతో ఢీకొను చున్నట్లుండెను. శ్రీహరి చాణూరుని రెండు చేతులతో ఎత్తి ఆతని దేహ భారమును బ్రహ్మదేవుడు పుణ్యాత్ముల పుణ్యభారమును తూచినట్లు తూచెను. అటు పిదప మహావీరుడయిన చాణూరుడు శ్రీహరిని ఒక్క చేతితో నాగరాజైన శేషుడు తన పడగపై భూమిని ఎత్తునట్లు లీలాపూర్వకముగ ఎత్తెను. శ్రీకృష్ణుడు వదిలించుకొని క్రిందకు దుమికి చాణూరుని మెడ మరియు కటి ప్రదేశమును పట్టి పైకెత్తి భూమి పై విసరెను. ఒకవైపు శ్రీకృష్ణ చాణూరులు, మరియొక వైపు బలరామ ముష్టికులు పరస్పరము చేతులతో, కాళ్ళతో, మోకాళ్ళతో, భుజములతో, వక్షస్థలముతో వ్రేళ్ళతో, పిడికిటి పొట్లతో భీకరముగ ముష్టియుద్ధము కావించు చుండిరి.

బలరామకృష్ణుల ముఖము లందు సంకులసమరము చే ఉదయించిన స్వేద బిందువులను గవాక్షము నుండి వీక్షించిన రాజ పరివార స్త్రీ సందోహము దయార్ద్ర హృదయలై ఇట్లనిరి "ఆహా! రాజ సమక్షముననే ఇంతటి అధర్మము జరుగుచున్నది కదా! వజ్రసమాన సుధృఢ శరీరులయిన పహిల్వాను లెక్కడ? కుసుమ కోమల శరీరులైన రామకృష్ణులెక్కడ? మన మధురావాసులెంత అభాగ్యులు! ఇన్ని దినములయిన పిదప మనము వీరి దర్శన మయినది. కానీ ఈ యుద్ధమునందు కదా! వనవాస గోపికలు, గోపకుల సౌభాగ్యము అత్యంత ఉత్కృష్టము. ఎందుకనగా వారు రాస రస మండలమందు బలరామ కృష్ణ దర్శనము చేసెడివారు. ఆశ్చర్యకరమయిన విషయమేమనగా ఈ దుష్టచిత్తుడయిన మహారాజునకు ఎదురు చెప్పనెవ్వరునూ సమర్ధులు గారు. అందువలన మన పూర్వపుణ్య బలవశమున ఈ సోదరులిరువురు శీఘ్రమే తమ శత్రువులపై విజయము పొందవలెనని కోరుకొందము."

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి "మల్లయుద్ధ వర్ణనము"అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(చాణూర, ముష్టికాది మల్లులు మరియు కంసుడు అతని సహోదరుల వధ)

నారదుడు "మహారాజా! ఇవన్నియు వీక్షించుచున్న నందుని హృదయము ద్రవించినది. శ్రీకృష్ణ భగవానుడు ఆయన స్థితి గ్రహించి, మధురా వనితల హృదయము లాకళించి శత్రువులను సంహరించుటకు నిశ్చయించి యుద్ధము నారంభించెను. చాణూరుని భుజములు పట్టుకొని పైకెత్తి ప్రభంజనము కమలమును విసురునట్లు ఆకాశము పైకి విసరెను. అతడు వేగముగ తిరిగి భూమిపై పడెను. అయిననూ ఆ వీరుడు మరల లేచి ముకుందుని పై ముష్టిఘాతము ప్రహరించెను. కానీ మాధవుడు విచిలితుడు కాలేదు. తిరిగి చాణూరుని పట్టి బలముగ భూమిపై విసరెను. దానితో

చాణూరుని దంతములు భంజింపబడి దంతహీనుడాయెను. అంత ఆ మదోత్మత్తుడయిన మల్లుడు నెమ్మదిగ లేచి శ్రీకృష్ణుని వక్షముపై తన రెండు చేతులతో ప్రహరింప సంకల్పించెను. అంత శ్రీహరి వాని రెండు బాహువులను పట్టుకొని కుంసుని ముందుకు ఈడ్చుకొని పోయి అచట అందరూ చూచుచుండగనే అతి వేగముగ గుండ్రముగ త్రిప్పి, త్రిప్పి బాలుడు కమండలమును విసురునట్లు నేలపై విసరెను. ముకుందుని ఈ ప్రహారము చే చాణూరుని మస్తకము ముక్కలాయెను. ఆతడు తక్షణమే రక్తము కక్కుకొని మరణించెను.

ఈ విధముగనే బలదేవుడు సహితము రణదుర్గముడయిన ముష్ఠికమల్లుని మణములు వద్ద గరుడుడు సర్పమును పట్టుకొనునట్లు పట్టి ఆకాశమున కెగురవేసెను. ముష్ఠికుడు వేగముగ క్రిందపడి నోటినుండి నెత్తురు కక్కుకొని కాలధర్మము చెందెను. తదుపరి కూటుడు ముందుకురికెను. ఇంద్రుడు వజ్రము చే పర్వతములు రెక్కలు తెగనరుకునట్లు ఒక్క ముష్ఠి ఘాతము తో బలదేవుడు కూటుని ధరాశయనుని గావించెను. గరుడుడు తన వాడి ముక్కుతో సర్పమును గాయపరుచునట్లు నందనందనునుడు ఒక్క దెబ్బతో శాలుని మట్టి కరిపించి మదగజము వృక్షమును చీల్చునట్లు వానిని రెండుగా చీల్చి కంసుని ఎదుట పడునట్లు విసరెను. ఈ విధముగ మల్లులందరూ ఒకరి వెంట ఒకరు బలరామ కృష్ణులకు ఎరుర్కొని, అశువులు బాసి, సత్పురుషులందరూ చూచుచుండగనే వారి వారి శరీరముల నుండి దివ్య జ్యోతులు వెలువడి శ్రీకృష్ణ భగవానుని యందు లీనమయ్యెను. ఈ విధముగ అనేక మంది మల్లులు బలరామ కృష్ణులచే వధింపబడుట చూచి మిగిలిన మల్లులు వ్యాకుల చిత్తులై తమ ప్రాణములు కాపాడుకొందుకు పారిపోవ సమకట్టిరి.

అంత శ్రీకృష్ణుడు శ్రీదామాది గోపబాలురందరినీ కూడకట్టుకొని ఆ మిగిలిన మల్లురతో మల్లయుద్ధము ఒక క్రీడగా ఆడుట ప్రారంభించెను. కిరీట కుండల ధారులయిన శ్రీకృష్ణ బలరాములు గోపబాలకులతో మల్ల క్రీడలాడుట వీక్షించిన మధురాపురవాసులు విస్మయముతో చకితులై బాజా భజంత్రీలు మ్రోగింపనారంభించిరి. కంసుడు తక్క మిగిలిన వారందరూ జయజయ ధ్వానములు చేయుచుండిరి.తన పరాజయమును చవిచూచిన కంసుడు కోపోద్రిక్తుడై అదురుచున్న పెదవులతో భజంత్రీలను ఆపమని ఆజ్ఞాపించెను. పిదప "వసుదేవ సుతు లిరవురు కుబుద్ధులు. కూట నీతిజ్ఞులు. వీరిని వెంటనే నగరము నుండి భహిష్కరింపవలసినది. వ్రజవాసుల సర్వ సంపదనూ హరించి దుర్బుద్ధి అయిన నందుని వెంటనే కారాగారవాసుని కావింపవలసినది. నా తండ్రి, మిక్కిలి దుర్బుద్ధి, మానహీనుడయిన ఉగ్రసేనుని శిరము ఖండింప వలసినది. పృథివీతలమునందు ఎక్కడెక్కడ వృష్ణి వంశజులయిన యాదవులు కలరో వారందరినీ దేవతాంశలుగ గుర్తించి, వారందరినీ సంహరింప వలసినది."

ఈ విధముగ కంసుడు ప్రేలుచుండగా యదునందనుడు శ్రీకృష్ణుడు కోపించి, ఎగిరి కంసుని వద్దకు చేరెను. మూర్తిభవించిన మృత్యువు వలె తన ఎదరుగ వచ్చిన శ్రీకృష్ణుని చూచి మదోన్మత్తుడయిన కంసుడు డాలు, కరవాలమును చేతి లోనికి తీసికొనెను. గరుడుడు సర్పమును బంధించినట్లు ఖడ్గధారి అయిన కంసుని రెండు భుజములనూ తన రెండు చేతులతో ఒడిసి పట్టెను. అంత కంసుని చేతులనుండి డాలు, మరియు చంద్రహాసము జారి పడెను. అయిననూ బలశాలి అయిన కంసుడు పుండరీకనాగము గరుడుని దవడల నుండి బయటకి వచ్చునట్లు కృష్ణుని పట్టునుండి వెలువడెను. ఆ వీరులు ఇరువురు ఒక ఉన్నతాసనము వద్ద పర్వత శిఖరము పై పోరాడుచున్న రెండు సింహముల వలె కానపట్టిరి. కంసుడు బలముగా విదిలించుకొని వంద అడుగులు ఆకాశము నందు ఎగరెను. శ్రీకృష్ణుడు సహితము పైకి ఎగిరి ఒక గండభేరుండము మరియొక గండబేరుండమును ఎదుర్కొను నట్లు కంసునెదిరించెను. ప్రచండ దైత్య పుంగవుడయిన కంసుని రెండు భుజములు పట్టుకొని త్రిలోకములకాలవాలమయిన శ్రీహరి విపరీత వేగముతో త్రిప్పనారంభించెను. త్రిప్పి త్రిప్పి తిరిగి కంసుడు యున్న ఉన్నతాసనము పైకి విసరెను. ఆ వేగమునకు ఆ సభాస్థలి అంతయు మెరుపులచే ధ్వంసమగు వృక్షము మాదిరి ముక్కలు ముక్కలయి ధ్వంసమయ్యెను. కానీ వజ్రకాయుడగు కంసుడు క్రింపపడిననూ

కొంచెము వ్యాకులత పొంది, తిరిగి ధైర్యము తెచ్చుకొని శ్రీకృష్ణుని తో పోరుకు సంసిద్ధుడాయెను. ముకుందుడు తిరిగి కంసుని క్రిందకు విసరి అతని వక్షస్థలము పై నిలబడి ఆతని కిరీటమును తన్నెను. అంత కంసుని కేశములు పట్టి ఉన్నత సభాస్థలినుండి రంగస్థలము పైకి పర్వత శిఖరము నుండి బరువయిన శిలాఖండమును విసురునట్లు విసరెను. పిదప సర్వాధారుడు, అనంత పరాక్రముడు, ఆది మధ్యాంతరహితుడు, సనాతన భగవానుడు శ్రీకృష్ణుడు రంగభూమిపై పడియున్న కంసుని మీదికి దూకెను. కంసుడు మరణించెను.

వారిద్దరూ పడుటచే రంగస్థల మండపమంతయు తక్కెడ వలె లోటువారెను. రెండు ఘడియల వరకూ భూమి కంపించుచునే యుండెను. శ్రీకృష్ణుడు మరణించిన కంసుని శవమును ముదించిన సింహము గజరాజును ఈడ్చునట్లు సర్వులూ చూచుచుండగనే ఆ రంగస్థలమంతము ఈడ్చెను. ఆ సమయమున సామంత రాజులందరూ హాహాకారములు చేయుచూ నలుదిశలా పరుగులెత్తసాగిరి. మహాబలుడయిన కంసుడు వైరభావమున శ్రీకృష్ణుని నిరంతరము భజించుచూ భ్రమర కీటక న్యాయము ద్వారా భగవానుని సారూప్యము పొందెను.

కంసునికి ఎనిమిది మంది సోదరులు కలదు. వారందరూ మహా బలిష్ఠులు. వారు వరుసగా సుహృత్, సృష్ఠి, వ్యగ్రోధ్, తుష్ఠిమాన్, రాష్ట్రపాలక్, సునామా, శంక, కంకు లనెడివారు. వారందరూ కంసుడు పరమపదించుట కాంచి క్రోధోద్రిక్తులై అధరములు వణకు చుండగా చంద్రహాస హస్తులై శ్రీకృష్ణుని సంహరించుటకు ముందుకురికిరి. వారందరినీ గమనించిన రోహిణీ నందనుడు బలరాముడు ఒక ముద్గరమును చేతిలోనికి తీసికొని సింహము వేటకు వెళ్ళునపుడు చేయు గర్జన వలె ఒక మహా భయంకర సింహనాదము కావించెను. ఆ సింహనాదమును వినిన కంస సోదరులు మిక్కిలి భయాతురులైరి. కరవాలములు క్రిందికి జారినవి. అయినప్పటికీ వారందరూ బలరాముని చుట్టుముట్టి కుంజర యూదము పర్వతమును తమ తొండముతో కొట్టినట్లు తమ ముష్ఠి ఘాతములతో ఆయనను ప్రహరించుట ప్రారంభించిరి.

బలదేవుడు మొదట సృష్ఠి, సునాములను ముద్గరముతో కొట్టి సంహరించెను. వ్యగ్రోధుని భుజములు పట్టి పారవైచి ధరాశయనుని కావించెను. కంకుని ఎడమ చేతితో కొట్టి చంపెను. మాధవుడు తుష్ఠిమానుని ఎడమకాలు తోనూ, రాష్ట్రపాలుని కుడికాలు తోనూ తన్ని వారిరువురినీ యమలోకమునకు అతిధులుగ పంపెను. ఈ విధముగ సుడిగాలి నందలి ప్రభంజన వేగము చే పెరికివేయబడిన వృక్షములు వలె ఎనిమిది మంది కంస సోదరులు సంహరింపబడిరి. వారందరి నుండి జ్యోతులు వెలువడి భగవానుని యందు లీనమయ్యెను. ఈ సమయము నందు దేవ దుంధుభులు మ్రోగినవి. నలుదిశలా జయజయ ధ్వానములు పెల్లు బికినవి. దేవతలు నందనవన పుష్పవృష్ఠి కురిపించిరి. విద్యాధర, గంధర్వాంగనలు సంతోషాతిశయము తో నృత్యము చేసిరి. బ్రహ్మాది దేవతలు మరియు దివ్య మహర్షి సంఘములు, సిద్ధ, సాధ్య, గంధర్వ, కింపురుషాది దేవతా సంఘములు విమానములతో భగవద్దర్శనమునకు ఏతెంచిరి.

వారందరూ వేదోక్త మంత్రపఠనము గావించుచూ, శ్రీకృష్ణ బలభద్రులను స్థుతించిరి. తదనంతరము కంసుని రాణులయిన అస్తి, ప్రాప్తి మొదలగు వారు తమ హస్తములతో వక్షస్థలమును కొట్టుకొనుచూ తమ భవనముల నుండి బయటకు వచ్చి, వైధవ్యము కారణముగ పరమ దు:ఖితులై రోదింపసాగిరి. వారందరూ ఒక్కమ్మడిగా ఈ విధము పలికిరి, "హే! నాధా! యుద్ధపతీ! మహాబలీ! మహావీరా! నీవు ఎక్కడకు ఏగితివి? నీవు త్రిభువన విజేతవు. దేవతలకు సహితము దుర్జయుడవు. నీవు మిక్కిలి నిర్దయుడవై నీ చెల్లిలి పిల్లలను, పసికూనలను సంహరించితివి. అంతేకాక పది దినములు కంటె తక్కువ వయసున్న అనేక మంది చిన్నారులను పొట్టన పెట్టుకొంటివి. ఆ ఘోర పాపము కారణముగ నీకీనాడు ఈ దుస్థితి కలిగినది."

ఈ విధముగ కన్నీరు మున్నీరుగ రోదించుచున్న రాజపత్నులను ఊరడించి, లోకబాంధవుడయిన శ్రీకృష్ణ భగవానుడు యమునా తటము నందు శ్రీఖండ చందనయుక్త చితిని పేర్పించి, మరణించిన తన మేనమామలందరినీ పారలౌకిక కర్మములాచరించెను.

(శ్రీ గర్గ సంహిత యందు మధురా ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి కంస వధ అను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(శ్రీకృష్ణుని ద్వారా దేవకీ వసుదేవుల విముక్తి, శ్రీకృష్ణ బలరాముల గురుకుల విద్యాభ్యాసము, మరియు గురుదక్షిణగ మరణించిన గురుపుత్రుని తీసికొని వచ్చుట. అక్రూరుని హస్తినకు పంపుట మరియు కుబ్జ మనోరధమును ఈడేర్చుట)

నారదుడు "మహారాజా! తదనంతరము శ్రీకృష్ణుడు బలదేవ సహితుడై వృష్ణి వంశజులైన దేవకీ వసుదేవుల వద్దకు ఏతెంచెను. తమ పుత్రద్వయమును చూడగనే గరుడాగమనము అయిన వెంతనే విడువడు నాగపాశబంధము వలె వారి బంధనములు స్వయముగ విడినవినవి. శ్రీకృష్ణుడు జ్ఞాన యోగులవలె ప్రకాశించుచున్న తన మాతాపితరులను జూచి బలపూర్వకముగ జగత్తును మోహింపజేయు తన విష్ణుమాయను ప్రసరించెను. వెంతనే వారిరువురు మాయామోహావేశపరులై అశ్రువులు కార్చురూ తమ పుత్రద్వయమును అక్కున జేర్చుకొనిరి. వృష్ణి వంశీరత్న మయిన శ్రీకృష్ణుడు వారివురినీ ఆశ్వాశించి తన తాత అయిన ఉగ్రసేనుని తిరిగి రాజుగ ప్రతిష్ఠించెను. కంసుని భయము చే దూరదేశములకు కాందిశీకులై పారిపోయిన యాదవులందరినీ సాదరముగ ఆహ్వానించి వారికి మధురాపురమున నివాసమేర్పరిచెను. పిదప నందునికి ప్రణామములాచరించి తన మాయాజాలము చే ఆయనను సహితము సమ్మోహితుని గావించి ఇట్లనియె

"తండ్రీ! మీరు కూడా మధురాపురి యందు నివసించవలసినది. కానీ మీ మనసు యందు ఇచట నుండి వెళ్ళవలెనన్న కోరిక యున్న ఎడల తప్పక వెళ్ళవలసినది. నేను యదుకుల వంశస్థుల వ్యవస్థను అంతయును చక్కబరిచి అన్నగారైన బలరామునితో సహితుడనై తిరిగి వచ్చెదను. నందుడు ఈ విధముగ బలరామ కృష్ణులచే పూజింపబడి, వసుదేవుని ప్రేమమీర కౌగలించుకొని వ్రజభూమికి అరిగెను. పూర్వము వసుదేవుడు శ్రీకృష్ణుని జన్మనక్షత్రమందు పది లక్షల గోవులు దానము చేయదునని సంకల్పించిన విషయమును జ్ఞప్తికి తెచ్చుకొని తను అనుకున్న విధముగ గోవులను పుష్పమాలాలంకృతలను చేసి బ్రాహ్మణులకు దానము నిచ్చెను. పిదప శ్రీగర్గాచార్యులను రావించి దుర్మజ్ఞుడయిన వసుదేవుడు శ్రీకృష్ణ బలరాములకు యజ్ఞోపవీత సంస్కారములను కావించెను. తదనంతరము సమస్త విద్యాధ్యయనమునకై భగవత్సరూపులైన శ్రీకృష్ణబలరాములు సాధారణ బాలకుల వలె గురువు "సాందీపని" వద్దకు ఏగిరి. తమ గురువనకు ఉత్తమమైన సేవ చేయుచూ అతి కొలది దినములలో సమస్త విద్యలనూ నేర్చి విద్వాంసుల యందు శిరోమణులుగ ప్రకాశించిరి.

తదుపరి వారిరువురు చేతులు జోడించి గురుదక్షిణ నొసగుటకై ఉద్యక్తులయిరి. అంతట సాందీపని మహర్షి గురుదక్షిణగా మరణించిన తన పుత్రుని తెమ్మని అడిగెను. అపుడు ఆ అపూర్వ సోదరులిరువురు వలసిన సామాగ్రిని ఒక రథము నందు ఉంచుకొని, మనో, బుద్ధి, అహంకారములను, ఇంద్రియములను వశము నందుంచుకొని ప్రభాస క్షేత్రమున సాగర సమీపమునకు ఏగిరి. వారిరువురు అరివీర భయంకర పరాక్రమోపేతులు. వారి ఆగమమును తెలిసికొన్న సముద్రుడు తక్షణమే కంపించుచూ పైకి లేచి దివ్య రత్న రాశులను బహుమతులుగ పట్టుకొని చేతులు జోడించి వారి పాదములపై వ్రాలెను. అంతట భగవానుడు "సముద్రా! నీవు నీ ప్రచండ తరంగముల పటాటోపము చే మా గురుపుత్రుని అపహరించితివి. వానిని శీఘ్రమే తెచ్చి ఈయవలసినది." అంతట సముద్రుడు "భగవాన్! దేవదేవేశా! నేను ఆ బ్రాహ్మణబాలుని అపహరింపలేదు. ఆతనిని శంఖరూప ధరుడయిన "పంచజనుడు" అను దైత్యుడు హరించెను. అతడు మిక్కిలి బలిష్ఠుడు, ఎల్లప్పుడూ నా ఉదరమున నివసించుచూ దేవతలకు సహితము కంటక ప్రాయుడైనాడు. ఆతనిని మీరే జయింప వలసినది."

సముద్రుని పలుకులు వినిన ముకుందుడు నడుమునకు దట్టీ బిగించి, భయంకర ఘోష కావించు సాగరమందు

దుమికెను. త్రిలోక భారము ధరించు శ్రీకృష్ణుడు దూకగనే వజ్రకూట పర్వతము చే మథించునపుడు కంపించునట్లు సాగరము సమస్తము కంపించెను. అంత వీరుడయిన పంచజనుడు శ్రీకృష్ణుని ఎదుర్కొనుటకు మందుకు వచ్చెను. తొలుత పంచజనుడు తన చేతి యందలి శూలమును మాధవుని పై విసరెను. మాధవుడు ఆ శూలమును ఒడుపుగా చేజిక్కించుకొని తిరిగి ఆ దైత్యుని పై ప్రయోగించెను. ఆ ఘాతమును తినిన పంచజనుడు కొంత తడవు మూర్ఛితుడై, క్రిందబడి, తిరిగి లేచి భయంకర విషసర్పము తన ఫణము చే గరుడుని కాటు వేసినటుల శ్రీహరి శిరస్సును ప్రహరించెను. అంత శ్రీహరి కుపితుడై ఆ దైత్యుని శిరస్సుపై ముష్ఠిఘాతము ప్రహరించెను. దానిచే పంచజనుని శిరము ముక్కలై గతశేషుడాయెను. ఆతని నుండి వెలువడిన దివ్యజ్యోతి శ్రీకృష్ణుని యందు లీనమయ్యెను. ఈ విధముగ పంచజనుని వధించి, ఆతని శరీరము నుండి ఉత్పన్నమయిన శంఖమును (పాంచ జన్యము) తీసికొని, మహాసాగరము నుండి బయల్వెడలి శ్రీహరి తన రథమును ఆరోహించెను. పిదప ఆ సోదరులిరువురు వాయువేగముతో ఆ రథము నందు ప్రయాణించి యమపురి అయిన "సంయమనీపురము" చేరి పాంచజన్యమును పూరించిరి. ఆ శంఖధ్వని మేఘగర్జన వలె లోక ప్రచండముగ యమపురి అంతయు ప్రతిధ్వనించెను. ఆ భయంకర నాదము వినిన యముడు తన సదస్యుల తోడి కంపించెను. యమపురికి యున్న ఎనుబది నాలుగు లక్షల నరకముల యందు పడియున్న పాపాత్ముల ఎవరి చెవి యందు పాంచజన్య ధ్వని వినబడినదో వారందరూ తక్షణము మోక్షమును పొందిరి.

యముడు ఆ క్షణమే పూజాది ద్రవ్యములను తీసికొని శ్రీకృష్ణ బలరాముల కెదురేగి వారి చరణముల పై వ్రాలి ఈ విధముగ పలికెను. "హే! ప్రభో! శ్రీహరీ! కృపాసింధూ! మహాబలీ! బలరామా!! మీరిరువురు అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి అయిన పరమేశ్వరుని ప్రతిరూపములు, దేవతా పురుషులు, సర్వ శ్రేష్ఠులు, సర్వేశ్వరులు, పురాణపురుషులు మరియు సంపూర్ణ జగదీశ్వరులు. మీకు నేను ఏ విధముగా సేవ చేయగలను?. ఆజ్ఞాపించవలసినది." శ్రీకృష్ణుడు "మహామతీ! లోకపాలా! యమరాజా! మా గురుపుత్రుని మాకు ఈయవలసినది. నా ఆజ్ఞను శిరసావహించి ఎల్లప్పుడూ న్యాయమయిన రీతిని పరిపాలింప వలసినది." యముడు గురుపుత్రుని తీసికొని ముకుందున కప్పగించెను. బలరామ కృష్ణులా బాలుని తీసికొని అవంతికా పురమున కేగి, గురువునకు సమర్పించి, గురు దేవునికి సాంజలి బంధకముగ సమస్కృతులు సమర్పించి, రథమారోహించి మధురాపురమునకు ఏగిరి. అచట యదువంశీయులందరూ వారిని మిక్కిలి ఆదరాభిమానములతో సన్మానించిరి.

కారణములకు కూడ కారణభూతుడతయిన శ్రీకృష్ణ భగవానుడు ఒకనాడు బలరామసహితుడై అక్రూరుని ఇంటికి ఏగెను. అక్రూరుడు వెంటనే లేచి, మిక్కిలి ప్రసన్నుడై, ఆయనను హృదయమునకు హత్తుకొని, ఆశీనుని గావించి షోడశోపచారాది పూజను నిర్వర్తించి, చేతులు జోడించి ఎదుట నిలచెను. అతని మనోరథము పూర్ణమయ్యెను. కన్నుల నుండి ఆనంద భాష్పములు జాలువారు చుండగా అక్రూరుడు ఇట్లనియె "ప్రభూ! మార్గమధ్యమందు నేను తలచినది, పలికినది, అవన్నియు మీరిరువురు పూర్ణము కావించిరి. మీకు నమస్కారము. మీరురువురు సమస్త లోకముల యందు సర్వాంగ సుందరులు. జనభూషణులందు సహితము ఉత్తములు. సర్వ లోకములను బాహ్యాంతరములందు ప్రకాశము చేయు పురాణపురుషులు. ఈ సమయమున గో, బ్రాహ్మణ, సాధు, వేద, ధర్మ, దేవతా పరిరక్షణకై అవతరించిన అవతార మూర్తులు. పరిపూర్ణ తేజస్వరూపులైన మీరిరువురు కంసాది దైత్య వినాశనమునకు గోలోక ధామము నుండి భూతలమునకు అవతీర్ణులైరి. నేను నిత్యము, నిరంతరము, మీకు ఇరువురికి ప్రణామములాచరించుచున్నాను."

అంత శ్రీకృష్ణ భగవానుడు "మీరు పెద్దలు మరియు ధైర్య పరాయణులు. మీ ముందు నేను బాలకుడను. మహామతీ! సాధుపురుషులు ఎన్నడూ తమను తాము గొప్పగా తలంచరు. దానపతీ! పాండవుల కుశల సమాచారములు అరయుటకు మీరు వెంటనే హస్తినాపురమునకు వెళ్ళి, వారందరినీ కలసి వారి సమాచారమును తీసికొని రావలసినది." ఈ విధముగ సంభాషించి సమస్త కార్యాచరణ దక్షుడయిన శ్రీకృష్ణ భగవానుడు బలరామ సహితుడై వసుదేవుని భవనమునకు తిరిగి వచ్చెను.

తదనంతరము తనచే ఇవ్వబడిన వాగ్దానమును పురస్కరించుకొని శ్రీకృష్ణ భగవానుడు ఉద్ధవుని తీసికొని కుబ్జ యొక్క గృహమున కేగెను. శ్రీకృష్ణాగమనమును గమనించిన పరమ సుందర రూపిణి అయిన కుబ్జ వెంటనే పరమ భక్తి

భావముతో అర్ఘ్య పాద్యాది ఉపచారములు సల్పి తన ప్రాణ వల్లభుని పూజించెను. కుబ్జ యొక్క గృహమంతయు రత్నములు తాపడము చేయబడిన సువర్ణ కుడ్య ప్రాకారముల తో నిండియుండెను. ఆ పరమ రూపవతి అయిన కుబ్జా సహితుడయిన శ్రీకృష్ణ భగవానుడు వైకుంఠము నందు రమాసహితుడైన విష్ణువు వలె భాసిల్లెను. సాక్షాత్ పరిపూర్ణ భగవానుని పతిగా పొందిన ఈ సైరంధ్రి యొక్క తపము ఏమని చెప్పుదును? లీలా పూర్వకముగ శరీరమును తీసికొనిన భగవానుడు కుబ్జ భవనము నందు ఎనిమిది దినములు గడిపి తొమ్మిదవ రోజు తిరిగి వసుదేవ గృహమునకు ఏతెంచెను.

మహారాజా! మధురయందు ఈ విధముగ జరిగిన శ్రీకృష్ణ చరిత్రము సమస్త దురిత హారకము, పుణ్యదాయకము మరియు ఆయు:వృద్ధి కారకము. ఈయది చతుర్విధ ఫల పురుషార్థ దాయకము మరియు సాక్షాత్ శ్రీకృష్ణుని సహితము వశీకరించునది.

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి యదుసౌఖ్యమను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(చాకలీ, దర్జీ, సుదాముల పూర్వ జన్మ వృత్తాంతమును ఎరిగించుట)

బహులాశ్వుడు "దేవర్షీ! మీ ముఖతా శ్రీకృష్ణ భగవానుని పావన చరిత్రను వినుచుంటిని. కానీ నాకు తృప్తి కలుగుట లేదు. ఇంకనూ దివ్యమయిన కృష్ణ చరిత్ర వినవలెనని మనస్సు ఉవ్విళ్ళూరుచున్నది. దప్పికతో దుర్భరపీడను అనుభవించు జీవికి ఎట్లు జలపానము చేయవలెనన్న ఇచ్ఛ యుండునో, అట్లే నేడు నా మనస్సు సహితము శ్రీకృష్ణ కథామృతము వినవలెనని ఇచ్ఛగించు చున్నది. స్వామీ! మీరు కంసుని జన్మ, కర్మ వృత్తాంతములను నుడివిరి. "కేశి" మొదలగు మహా దైత్యుల పూర్వ జన్మ వృత్తాంతములను సహితము సెలవిచ్చిరి. ఇపుడు శ్రీకృష్ణుని యందు లీనమయిన జ్యోతి గల రజకుని వృత్తాంతము దయచేసి వివరింపవలసినది. ఆతడు పూర్వజన్మమందు ఎవరు? శ్రీహరి ఆతనిని ఎందువల్ల వధించెను?"

నారదుడు "విదేహరాజా! త్రేతాయుగము నాటి మాట. అపుడు ఆయోధ్యాపురమును శ్రీరామ చంద్ర ప్రభువు పరిపాలించుచుండెను. ఆ సమయము నందు ప్రజాభిప్రాయము సేకరించుటకు గుప్తచరులు నియమింపబడిరి. ఒకనాడు ఈ గుప్తచరులు విచునుండగా ఒక చాకలివాడు తన భార్యతో ఇట్లనియె "నీవు దుష్టురాలివి. నీవు ఇతరులు ఇంటియందు కొంతకాలము నివసించి వచ్చితివి. అందువలన నేను నిన్ను స్వీకరింపను. స్త్రీ లోభము చే రాజైన రామచంద్రుడు సీతను తెచ్చుకొని కాపరము చేయవచ్చుగాక! నేను నిన్ను స్వీకరింపజాలను." ఈ విధముగ అనేకమంది లోకుల నుండి ఈ ఆక్షేపణలను వినిన రాఘవేంద్రుడు లోకోపవాదమునకు జడిసి తక్షణము సీతా పరిత్యాగము కావించెను. రఘుకుల తిలకుడయిన శ్రీరామచంద్రుడు ఆ చాకలి వానిని శిక్షింప నిచ్ఛగించ లేదు. ఆ రజకుడే ద్వాపరాంతమున తిరిగి చాకలివానిగా మధురాపురి యందు జన్మమందెను. సీతాదేవి పట్ల ఆతడు పలికిన కువాక్యములు శాంతికై శ్రీహరి స్వయముగ ఆతనిని శిక్షించి మోక్షమును ప్రసాదించెను.

బహులాశ్వుడు "మునిశ్రేష్ఠా! శ్రీకృష్ణ భగవానుడు తన సారూప్యమును ప్రసాదించిన దర్జీ (శ్రీకృష్ణ బలరాములకు దుస్తులు ధరింపచేసిన గోపబాలకుడు) ఎవరు?" నారదుడు "పూర్వము మిథిలాపురి యందు ఒక దర్జీ నివసించుచుండెను. ఆతడు శ్రీహరి యొక్క పరమభక్తుడు. ఆతడు శ్రీరామ వివాహ సమయమున సీరధ్వజ మహారాజు (జనకుడు) ఆజ్ఞ ప్రకారము శ్రీరామలక్ష్మణులకు పెండ్లి కొడుకులను చేయుటకు వలయు సొగసయిన వస్త్రములను కుట్టెను.

ఆ వస్త్రములు బంగారముతో నేయబడినది. కోట్లాది కామదేవుల వలె ప్రకాశించు లావణ్యమూర్తులయిన

రామలక్ష్మణులను చూచి మనసునందు తాను స్వయముగ వారికి వస్త్రములు కట్టవలెనన్న కోరిక కలిగెను. శ్రీరఘునాథుడు సర్వజ్ఞుడు. ఆయన ఆ దర్జీవానికి ఆ క్షణమునే "ద్వాపరాంతమున వ్రజమండల మందు నీ మనోరథము పూర్ణమగును. అని వరమిచ్చెను. ఆతడే శ్రీరామచంద్రుని వరదానము వలన మధురయందు దర్జీగా జన్మించి శ్రీకృష్ణబలరాములకు వేషరచన కావించి సారూప్య ప్రాప్తినొందెను."

బహుళాశ్వుడు "మహామునీ! సుదామ మాలి ఇంటికి స్వయముగా శ్రీకృష్ణ బలరాములు వెళ్ళిరి. ఆతడు ఏ పుణ్యకార్యమాచరించెను?" నారదుడు "మహారాజా! ధనపతి అయిన కుబేరునికి "చైత్రరథము" అను సుందర వనము కలదు. ఆ వనమందు పూల సంరక్షణకై "హేమమాలి" అను అనుచరుడు నియోగింపబడెను. ఆతడు పరమ విష్ణుభక్తుడు, భజన తత్పరుడు, శాంతుడు, దానశీలుడు మరియు సత్సంగి. ఆతడు శ్రీకృష్ణ ప్రాప్తికై దేవతా పూజనము కావించెను. ఆతడు అయిదు వేల సంవత్సరములు ప్రతి దినము మూడు వందల కమలములతో శంకరుని పూజించు చుండెను. ఒకనాడు పరమ కరుణానిధి, త్రినేత్రధారి, అయిన శంకర భగవానుడు ఆ మాలి యందు అత్యంత ప్రసన్నుడై, ఆతని ఎదుట ప్రత్యక్షమై వరము కోరుకొనమనగా, హేమమాలి మహాదేవునికి ప్రదక్షిణ పూర్వకముగ ప్రణామములు ఆచరించి, తలను వంచి ఇట్లనియె" భగవాన్! పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుడు ఒకనాడు నా ఇంటికి ఏతెంచగా నేను ఈ చర్మ చక్షువులతో ఆయనను దర్శింపవలెను. ఇది నా మనోవాంఛ మీ వరదానము చే నా ఇచ్ఛ పూర్తి కావలెనని నా అభిలాష". అంతట శంకరభగవానుడు "హేమమాలీ! ద్వాపరాంతమున మధురాపురమందు నీ మనోరథము సఫలమగును. ఇందు సందేహము లేదు. శంభుని వరప్రభావము వలన హేమమాలి సుదామునిగ జన్మించి మాలాకారుడయ్యెను. అందువలననే సాక్షాత్ బలరామకృష్ణులు ఆతని గృహమునకు ప్రయత్నపూర్వకముగ వెడలిరి.

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి రజక, దర్జీ, సుదాముల ఉపాఖ్యానమను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(కుబ్జ మరియు కువలయా పీడము యొక్క పూర్వజన్మ వృత్తాంతము)

బహుళాశ్వుడు "దేవర్షీ! దేవతలకు సహితము దుర్లభుడయిన శ్రీకృష్ణుని మోహింపచేయగలిగిన శక్తి కలుగుటకు పూర్వజన్మమందు సైరంధ్రీ ఏమి తపము ఆచరించెను? నారదుడు "మహారాజా! కోట్లాది కామదేవుల మించిన సుందరుడయిన శ్రీరామచంద్ర ప్రభువు సీతాలక్ష్మణ సమేతుడై పంచవటి యందు నివసించునపుడు "శూర్పనఖ" అను దైత్య వనిత ఆయనను చూచి అత్యంత మోహిత అయ్యెను. కానీ రాక్షసి రాముడు ఏకపత్నీవ్రతుడు అనియు, అందువలన ఏ ఇతర స్త్రీ యందు ఆయనకు మోహము జనింపదని నిశ్చయించుకొని, క్రోధ పరవశయై, సీతాదేవిని భక్షించుటకు పరుగెత్తెను. అంత శ్రీరామ సోదరుడగు లక్ష్మణుడు కుపితుడై ఆమె నాసికా కర్ణములు కోసి శిక్షించెను. పిదప శూర్పణఖ లంకకు జేరి, రావణునికి ఈ వృత్తాంతమంతయు వినిపించి, ఖిన్నురాలై పుష్కర తీర్థమునకేగి అచట నీటియందు ప్రవేశించి పది వేల సంవత్సరములు శంకర ప్రీతికై తీవ్ర తపమాచరించెను. ఆతపస్సుకు సంతోషించిన దేవాధిదేవుడు ఉమాపతి ప్రత్యక్షమై వరము కోరుకొనమనగా శూర్పనఖ "దేవాధిదేవా! మీరు సమస్త కామనలను పరిపూర్ణము చేయగల సమర్థులు. సత్పురుషులకు ప్రియుడయిన శ్రీరామచంద్రమూర్తిని భర్తగా అనుగ్రహింప వలసినది." అంత శంభుడు "దానవీ! ఈ వరము ప్రస్తుతము సఫలము కాదు. కానీ ద్వాపరాంతమున మధురాపురి యందు నీ మనోరథము సఫలీకృతమగును. ఆ ఇచ్ఛారూప ధారిణి అయిన శూర్పనఖయే కుబ్జగా జన్మించి శ్రీకృష్ణ ప్రేయసి అయినది.

బహుళాశ్వుడు "మహర్షీ! కువలయాపీడము పూర్వజన్మమందు ఎవరు? ఎందువలన కుంజరయోని యందు

జన్మించినవలసి వచ్చినది? ఏ పుణ్య ప్రభావము చే శ్రీహరి యందు లీనమయినది?" నారదుడు "బలి చక్రవర్తికి అమిత బలవంతుడు, విశాలకాయుడు అయిన పుత్రుడు యుండెడివాడు. "మందగతి" వాని నామధేయము. ఆతడు సమస్త శస్త్రధారులందు శ్రేష్ఠుడు, మరియు లక్ష ఏనుగుల బలశాలి. ఒకనాడు ఆతడు శ్రీరంగనాధుని రథయాత్రా నిమిత్తమై గృహము నుండ వెలువడి జనసమ్మర్ధము తో కలసెను. ఆతడు జన సముదాయమును లక్ష్యపెట్టక మందబుద్ధి అయిన ఏనుగు వలె, తన భుజములతో ఎల్లరునూ ప్రహరించుచూ, వేగముగ ముందుకు పోవుచుండెను. మార్గము నందు ఆతని మూర్ఖత వలన పరమ తపోనిష్ఠాగరిష్ఠుడు, బహు వృద్ధుడు అయిన "త్రిత మహర్షి" ని క్రింద పడవేసెను.

అంత మహర్షి కోపించి "దుర్మతీ! నీవు ఏనుగు వలె మదోన్మత్తుడవై రంగయాత్ర యందు జనులను క్రింద పడవేయుచున్నావు. అందువలన ఏనుగు వై చరింపుము," అని ఆ బలి కుమారుని శపించెను. తక్షణము దైత్య కుమారుడు తేజో విహీనుడై శరీరము కుంచించుకొని క్రిందపడెను. ఆ దివ్య మునీంద్రుని ప్రభావమెరిగిన బలిపుత్రుడు చేతులు జోడించి. ప్రదక్షిణ సహిత ప్రణామములాచరించి ఇట్లు ప్రార్థించెను. "ఓ! మునీశ్వరా! కృపాసింధూ! మీరు ద్విజుల యందు శ్రేష్ఠులయిన యోగీంద్రులు. మహాప్రభూ! నేను నేటి నండి ఎన్నడునూ మీ వంటి మహాత్ములను అవహేళన చేయరాదు. బ్రహ్మ స్వరూపా! మీ వంటి మహానుభావులు శాపమును, తిరిగి అనుగ్రహమును ప్రసాదించుటకు సమర్థులు. నాకు ఈ గజ జన్మము నుండి ఎప్పుడు విముక్తి లభించును?" ఈ విధముగ దైత్యసూనుని ప్రార్థన వినిన "త్రిత" మహర్షి కరుణించి ఇట్లనియె "దైత్యరాజా! నా వాక్కు వ్యర్థము కాదు. అంతేకాక నీ భక్తికి నేను ఎంతో ప్రసన్నుడనైతిని. అందువలన దేవతలకు సహితము దుర్లభమయిన ఒక దివ్య వరము నీకు ప్రసాదించెదను. నీకు మధురానగరము నందు శ్రీహరి చేతిలో మరణించునట్లు వరమొసంగెదను. దు:ఖింపవలదు." ఆ మందగతి యే వింధ్య పర్వతమందు పదివేల ఏనుగుల బలముగల కువలయాపీడము గ ప్రసిద్ధినందినది. మగధరాజైన జరాసంధుడు ఒక లక్ష ఏనుగుల సమాయము చే దానిని బంధించెను. ఆతడు తన కుమార్తెల వివాహ సమయమున కట్నముగ ఆ కుంజరమును కంసునికి బహూకరించెను. త్రిత మహర్షి శాపానుగ్రహనుసారము ఆ గజరాజము నందలి తేజము శ్రీకృష్ణుని యందు లీనమయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి కుబ్జ, కువలయాపీడ పూర్వజన్మ వృత్తాంతమును పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(చాణూరాది మల్లులు, కంసుని సోదరుల మరియు పంచజన దైత్యుని పూర్వ జన్మ వృత్తాంత వివరణము)

బహుళాశ్వుడు "మునీంద్రా! చాణూరాది మల్లులు పూర్వజన్మము నందు ఎవరు? వారు మధురాపురమున కేతెంచి సాక్షాత్ శ్రీకృష్ణ పరమాత్ముని చే పరిమార్చబడిరి. వారి పూర్వ జన్మ పుణ్యము ఇట్టిదని ఎట్లు వర్ణింపగలను?" నారదుడు "మహారాజా! పూర్వకాలము నందు అమరావతీ పురమందు "ఉతథ్యుడు" అను మహాముని నివసించుచుండెను. ఆయనకు మన్మథుని వంటి అయిదుగురు పుత్రులు ఉదయించిరి. వారు మునియోచిత విద్య, స్వాధ్యాయములు విడనాడి బలిపురమున కేగి, మదోన్మత్తులై మల్లయుద్ధము నేర్చుకొన నారంభించిరి. తన పుత్రులు బ్రాహ్మణోచిత కర్మలు మాని, కర్మభ్రష్టులై, వేదాధ్యయన రహితులై, మదోన్మత్తులై యుండుట గాంచి ఉతథ్యముని కుపితుడై ఇట్లనియె "శమ, దమ, శౌచ, క్షమ, సరళత, జ్ఞానము, విజ్ఞానము, ఇవి బ్రాహ్మణులకు స్వధర్మములు. "శౌర్యము, తేజము, యుద్ధభూమి యందు వెనుదిరకకుండుట, దానము, ఐశ్వర్యము – ఇవి క్షత్రియోచిత ధర్మములు. "కృషి, గోరక్ష, వాణిద్యము"– ఇవి వైశ్య ధర్మములు. దుర్జనులారా! మీరు బ్రాహ్మణ పుత్రులై యుండియూ బ్రాహ్మణోచిత కర్మములు విస్మరించి క్షత్రియో

చితములయిన మల్లయుద్ధాది కార్యములు చేయుచున్నారు. అందుచే మీరు భారత భూమి యందు మల్లురుగా పుట్టి అసుర సంగము చే దుర్జనులగుదురు గాక!" ఆ ఉతథ్య పుత్రులే ఈ మల్లురు గా జనన మందిరి. కానీ శ్రీకృష్ణ శ్పర్శా మాత్రమున మోక్షమందిరి. ఈ విధముగ చాణూర, ముష్టిక, కూట, శాల, తోశాల పూర్వ జన్మ చరిత్రను నీకు ఎరిగించితిని."

బహుళాశ్వుడు "మహామునీ! కంసుని సోదరులైన కంక, వ్యగ్రోధారి ఎనిమిది మంది యోధులు పూర్వజన్మమందు ఎవరు? వారు కూడా మోక్షమందిరి కదా!" నారదుడు "మహారాజా! పూర్వకాలమందు కుబేరుని రాజధాని అయిన అలకాపురి యందు "దేవయక్షుడు" అను యక్షుడు నివసించువాడు. ఆతడు స్వతహాగా జ్ఞాని, శివభక్తుడు, మరియు జ్ఞానపరాయణుడు. ఆతనికి ఎనిమిది మంది పుత్రులు కలరు. వారు వరుసగా "దేవకూట, మహాగిరి, గండ, దండ, ప్రచండ, ఖండ, అఖండ, పృధు" అనువారు. ఒకనాటి దినము ఆరుణోదయ వేళ శివపూజకై సహస్ర పుండరీక పుష్పమును తెచ్చుటకై తండ్రి ఆజ్ఞను బడసి ఆ పుత్రులందరూ బయలుదేరిరి. వారు భ్రమరముల ఘంకారయుక్తమయిన సహస్రకమల పుష్పమును తీసికొని వచ్చి, ఆ పుష్పగంధము చే ఆకర్షింపబడి దానిని మనసారా ఆఘ్రాణించి తమ తండ్రికి సమర్పించిరి.

పుష్పోచ్ఛిష్టత దోషము చే ఆ మూఢ యక్షులు మూడు జన్మలు అసుర యోనుల యందు జన్మించి బలదేవుని కళ్యాణ కరముల యందు మరణించి ముక్తి నొందిరి.

బహుళాశ్వుడు "దేవర్షీ! శంఖరూప దైత్యుడయిన పంచజనుడు ఎవరు? ఆతని అస్థిక అయిన శంఖము సాక్షాత్ శ్రీకృష్ణుని కరకమలమందు ఎట్లు ఉపస్థిత మయినది?" నారదుడు "విదేహరాజా! పూర్వకాలము నుండి ఈ చక్రాది ఆయుధములు త్రిలోకనాథుడయిన విష్ణుదేవునికి ఉపాంగములు అయినవి. అవన్నియు ఆయన తేజస్సు చే నిండియుండినవి. వాటన్నిటి యందు పాంచజన్యము మిక్కిలి ఉన్నత పదవిని అధిరోహించినది. ఎందుకనగా ఆ శంఖము ఆయన అధరామృతమును సహితము పానము చేయునది. ఒకానొక దినము ఆ శంఖరాజమునకు మిక్కిలి అహంకార ముదయించి ఇట్లనియె "నా కాంతి రాజహంస వలె స్వచ్ఛమయినది. నన్ను సాక్షాత్ శ్రీహరి తన హస్తము నందు ధరించును. నేను దక్షిణావర్త శంఖమును, మరియు యుద్ధ విజయ ప్రాప్తానంతరము శ్రీకృష్ణుడు నన్ను మాత్రమే పూరించును. శ్రీకృష్ణ భగవానుని అధరామృతము క్షీరసాగర కన్యక అయిన లక్ష్మీదేవికి సహితము దుర్లభము. నేను మాత్రము నిరంతరము పానము చేయుచుందును." ఇట్లు గర్వించుచున్న పాంచజన్యమును చూచి శ్రీలక్ష్మీదేవి క్రోధితయై ఇట్లు శపించినది "దుర్మతీ! నీవు దైత్యుడవు కమ్ము". ఆ శంఖరాజమే సాగరము నందు పాంచజన్య దైత్యుడయినది. (పంచజన). కానీ వైరభావము చే పున: శ్రీహరి కరకమలమునలంకరించెను. ఆతని జ్యోతియు శ్రీహరి యందు విలీనమై ఆయన కరకమలమందు ఇప్పటికీ శోభించుచుండెను. ఆ శంఖరాజము యొక్క సౌభాగ్యము అద్వితీయము మరియు అద్భుతము."

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండాంర్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి చాణూరాది మల్లులు, కంస సోదరులు, పంచజన దైత్య పూర్వ జన్మో పాఖ్యానము అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(శ్రీకృష్ణుని ఆజ్ఞచే ఉద్ధవుడు వ్రజభూమికి ఏగి శ్రీదామాది శ్రీకృష్ణ సఖులకు వారి విరహము చే శ్రీకృష్ణుని దు:ఖమును నివేదించుట)

బహుళాశ్వుడు "మునిశ్రేష్ఠా! తన కుటుంబీకులను, బంధువులను మధురాపురి యందు సర్వులనూ, సర్వమునూ సరిజేసి యదుకుల తిలకుడిన శ్రీకృష్ణుడు ఇంకా ఏమి ఘనకార్యములు ఆచరించెను?" నారదుడు "మహారాజా! పరిపూర్ణతమ భగవానుడు, భక్తవత్సలుడయిన శ్రీకృష్ణుడు దు:ఖితులైన, గోపగోపీ గణములతో నిండిన గోకులమును స్మరించి, తన

సఖుడు, భక్తుడయిన ఉద్దవుని పిలచి ప్రేమ గద్గద స్వరము తో ఇట్లనియె "సఖా! లతా నికుంజాలంకృతము, గోవర్ధన, యమునా తటముల సహితము, గోపగోపీ జన నివాసము అయిన గోకులమునకు ఏగి నా సందేశము నిండిన పత్రములను నందునికి, యశోదామాతకు నీ చేతులతో ఈయవలసినది. శ్రీరాధాదేవికి ఆమె సుందరమందిరమున కేగి నా మూడవ సందేశ పత్రమును స్వయముగ ఈయవలసినది. నా నాల్గవ సందేశపత్రమును నా సఖులయిన గోపబాలకులకు అందివ్వ వలసినది. అట్లే అత్యంత మోహితులయిన గోపాంగనలకు సహితము వేరువేరుగా నా సందేశ పత్రములు ఈయవలసినది."

"నా తండ్రి అయిన నందరాజు మిక్కిలి దయాళువు. ఆయన మనస్సు ఎల్లప్పుడూ నా యందే లగ్నమయి యుండును. నా తల్లి యశోద నన్ను అతి తొందరగా తన యెద్దకు రప్పించుకొనుటకు ఎల్లప్పుడూ నా నామస్మరణ చేయుచుండును. నీవు నీతిశాస్త్ర కోవిదుడవు. నీ సుమధుర వాక్కులచే వారిరువురికినీ నా యందు ప్రీతి కలిగించుము. నా ప్రాణ వల్లభ అయిన శ్రీ రాధికాదేవి నా విరహము చే మిక్కిలి వ్యాకుల చిత్తయై యుండును. నా విరహము చే జనించిన మోహావేశము చే సర్వ జగత్తును శూన్యముగ భావించును. వారందరికీ నా వియోగము చే మిక్కిలి మానసిక వ్యధ కలుగుచున్నది. నీవు నా సందేశము ద్వారా వారందరినీ శాంత పరుచుము. నీవు మిక్కిలి సంభాషణా చతురుడవు. సుదామాది గోపబాలురు నా ప్రాణసఖులు. వారు కూడా మిత్ర వియోగము చే వ్యాకులురై యున్నారు. నీవు వారందరికీ మిత్రుని వలె సుఖము నీయవలసినది. నేను కొలది సయములో వ్రజభూమికి ఏతెంచెదను. గోపాంగనలు సహితము నా యెడ వియోగము చే వ్యాకులచిత్తులయిరి. వారి మన: శరీర ప్రాణము లన్నియు ఎల్లప్పుడూ నా యందే నిక్షిప్తమై యుండును. మంత్రివర్యా! వారు నా కొరకై ఇహపరములన్నియు త్యజించిరి."

అట్టి అబలల భరణ, పోషణ నేను ఎట్లు స్వీకరింపకుండ ఉండగలను? ఉద్దవా? నేను వ్రజభూమిని విడుచువేళ వారు ప్రాణత్యాగమునకై సిద్ధపడిరి. వారు ఇప్పటికీ మిక్కిలి కష్టముతో ప్రాణములు నిలువరించుకొనుచున్నారు. వారికి నా వియోగము ద్వారా కలిగిన మానసిక వ్యధను నీ సందేశ వచనముల ద్వారా తొలగించుము. ఎందుకనగా నీవు భాషా పరిజ్ఞానము నందును, సంభాషణా చతురత యందునూ ఉత్తమోత్తముడవు. సఖా! నేను మొట్టమొదట మధురాపురమునకు ఏతెంచిన గంటలు మ్రోగుచున్న దివ్య రథమును అధిరోహించి నా రూపమును ధరించి, పీతాంబరము, వైజయంతీమాల, సహస్రదళ పద్మము, దివ్య రత్నాలంకృత కుండలములు, కోటి బాలసూర్యులు పగిధి భాసించు పసిడి కిరీటమును ధరించి, నా ఉచ్ఛ స్వరము చే వాయింపబడు దివ్య వంశీరవము మరియు పుష్పాలంకృతమయిన వంశీ రవపు ఒర కూడా తీసికొని పొమ్ము. నా వలె నెమలి పింఛమును అలంకరించుకొని, సుగంధ చరిత చందనమును అలదు కొని మధురనాదము నొసగు నూపురములను ధరించి, సర్వము నా వలె రూప ధారణము చేసి వెంతనే వ్రజభూమికి వెళ్ళవలసినది."

శ్రీకృష్ణుని దివ్య భాషణమును వినిన ఉద్దవుడు ఆయన అజ్ఞను ఔదల దాల్చి, ఆయనకు పరిక్రమ కావించి, రథమధిరోహించి వెంతనే వ్రజభూమికి పయనమయ్యెను. అచట దివ్య భూషణ ధారలయిన కోట్లాది గోవులు శ్వేత పర్వతముల వలె ప్రకాశించు చుండెను. అవన్నియు శుద్ధ దుగ్ధము నిచ్చు దివ్య గోవులు. మంచి శీలము, రూపము, ప్రవర్తన కలిగి దూడల సహితలై నల్లని పుంఛము, గళము నందు గంటలు, కాళ్ళకు మంజీరములు, కింకిణీలు కలిగి దివ్య గమనము కలిగియున్నవి. కొన్ని గోవులు సువర్ణ వర్ణలై, శృంగములకు బంగారపు తొడుగులు కలిగి, మెడలందు దివ్యహార ధారణ చేసి యుండెను. కొన్ని ఆవులు ఎరుపు, పసుపు, తామ్రవర్ణము, ఆకుపచ్చ, మేఘపు వర్ణము కలిగి యుండగా, కొన్ని గోవులు రంగు రంగుల వర్ణ మిశ్రమము తో యుండెను. కొన్ని ఆవులు ధూమ్ర వర్ణము లోనూ, కొన్ని కోకిలలను మించిన నలుపు రంగులోనూ, గోచరించుచున్నవి. ఇవన్నియు సముద్రము వలె లెక్కలేనన్ని పాలు ఈయగల సమర్ధవంతములు. వాని శరీరము నందు సుందర స్త్రీలచే బుజ్జగింపబడిన ఛాయలు కలవు. హరిణముల వలె గంతులు వేయుచున్న లేగ దూడలచే పరివేష్ఠితములైన ఆ గోవులు మరింత శోభాయమానముగ ప్రకాశించుచున్నవి. గోవుల మందలను గోపాలకులు పరిరక్షించుచుండిరి. వారి హస్తములు యందు దండము మరియు వంశీరవములు విరాజిల్లు చున్నవి. వారందరూ శ్యామల వర్ణముతో ప్రకాశించుచూ, సర్వులను మోహింపచేయు రాగములలలో శ్రీకృష్ణ లీలలను ఉచ్ఛస్వరముతో గానము చేయుచుండిరి. వారందరూ దూరము నుండి ఉద్దవుని చూచి, శ్రీకృష్ణుడని భ్రమించి శ్రీకృష్ణ

దర్శన లాలస చే పరస్పరము ఇట్లు సంభాషించు చుండిరి.

"మిత్రులారా! నందనందనుడు వచ్చుచున్నాడు. సందేహము లేదు. నీలిమేఘ శరీరకాంతి, పీతాంబరము, గళము నందు వైజయంతీమాల, కర్ణములకు రత్నమయ కుండలములు, వక్షము నందు కౌస్తుభము, చేతులకు కడియములు, హస్తము నందు సహస్రదళ పద్మము, శిరము నందు కోట్లాది సూర్యకాంతిని పోలు కిరిటము ధరించి, అవే హయములు పూన్చిన కింకిణీజాల మండిత తేరునెక్కి వచ్చుచున్నాడు. ఆ రథము నందు బలదేవుడు లేడు. కేవలము నందనందనుడే వచ్చు చున్నాడు."

నారదుడు "విదేహరాజా! ఈ విధముగ భాషించుచున్న శ్రీదామాది గోపబాలకుల వద్దకు శ్రీకృష్ణాకృతి దాల్చిన ఉద్ధవుడు ఏతెంచెను. ఆతనిని చూచి వారు "ఈతడు ఎవరు? అచ్చము శ్రీకృష్ణుని వలె ఆకృతి ధరించెను. కానీ శ్రీకృష్ణుడు కాడు." ఇట్లు పలుకుచున్న గోప బాలురకు నమస్కరించి, వారిని హృదయమునకు హత్తుకొని ఉద్ధవుడు తన స్వామి అయిన శ్యామ సుందరుని గూర్చి పలుకుట ప్రారంభించెను.

"శ్రీదామాది గోప బాలకులారా! ఇది మీ కొరకై శ్రీకృష్ణుని చే ఈయబడిన పత్రము. సందేహము లేదు. దీనిని తీసికొనవలసినది. శోకింప వలదు. శ్రీహరి కుశలముగ యున్నాడు. ఆ భగవానుడు యాదవుల మహత్కార్యము సిద్ధింప జేసి కొలది దినములలో బలరామ సహితుడై మీ వద్దకు వచ్చును." శ్రీకృష్ణుని పత్రము తీసికొని, పఠించి వ్రజ బాలకులు భాష్పములు రాల్చుచూ గద్గద కంఠలై ఇట్లనిరి.

"ఓ! సంచారీ! నిర్మోహుడయిన నందనందనుని యందే మా తనువు, ధనము, బలము, వైభవము, సమస్తాంత: కరణము లగ్నమయి యున్నవి. శ్రీకృష్ణుని వినా ఈ వ్రజభూమి యే కాదు సమస్త సంసారము (ప్రపంచము) మాకు మిక్కిలి శూన్యముగా తోచుచున్నది. శ్రీకృష్ణ విరహము చే మాకు అందరకూ క్షణమొక యుగము వలెనూ, ఘడియ మన్వంతరము వలెనూ, ప్రహర కల్పము వలెనూ, దినము పరార్థము వలెనూ గడుచుచున్నది.

ఉద్ధవా! మేము రేయింబవళ్ళు ఆయనను మరువజాల కున్నాము. మా జీవనము నందు శ్యామ సుందరుడు మా నుండి వెడలెనన్న దుర్ఘటన ప్రాప్తించినది. మేము మిత్రత ద్వారా ఆయనను ఎప్పుడో అపరాధము చేసి యుందుము. అందువలననే మా వనవాసీయుల మనస్సులను ఆయన హరించెను."

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండాంర్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి "ఉ ద్ధవాగమనము" అను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(ఉద్ధవుని చే శ్రీకృష్ణ సఖుల ఆశ్వాసనము. నంద, యశోదలతో సంభాషణము; వారిరువురి ప్రేమ, భక్తి చే చకితుడై వారికి ఉద్ధవుడు శ్రీకృష్ణ చరిత్ర వినిపించుట)

నారదుడు "మహారాజా! ఈ విధముగ శ్రీకృష్ణ విరహము చే వ్యాకుల చిత్తులయిన గోపబాలకులు భాషించిన పిదప ప్రేమ భక్తుడయిన ఉద్ధవుడు ఇట్లనియె "వ్రజవాసులారా! నేను శ్రీకృష్ణ దాసుడను. నేను ఆయనకు ప్రేమపాత్రుడయిన ఏకాంత భక్తుడను, సేవకుడను. ముకుందుడు మీ కుశలమరయుటకై నన్ను తొందరగా పంపెను. నేను తొందరగా మధురాపురమున కేగి ఆయనకు మీ విరహవేదనను నివేదించి, భాష్పములు జాలువారుచుండగా ఆయన పాదములు పట్టి ఆయనను తీసికొని మీ కడకు వచ్చెదను. ఇది నా ప్రతిజ్ఞ. ఇందు అసత్యము లేశ మాత్రము లేదు. గోపగణములారా! మీరు శంకింపక ప్రసన్నులై యుండుడు. అతి తొందరలో శ్రీవల్లభుడయిన శ్రీహరిని దర్శించెదరు." ఈ విధముగ వారందరినీ ఆశ్వాసించి, వారందరితో కలసి రథము నధిరోహించి నందవ్రజము ప్రవేశించెను. ఉద్ధవుని ఆగమన వార్త

వినిన నందుడు శీఘ్రమే బయటకు విచ్చేసి, ప్రసన్నతా పూర్వకముగ ఆయనను ఆలింగనము చేసికొని, హర్షోల్లాసితుడై ఆయనకు స్వాగత సత్కారము లాచరించెను. ఉద్దవుడు భోజనానంతరము శాంతభావుడై యున్న తరుణమున నందుడు ఆశీనుడై ఇట్లనియె.

"మహామతీ! ఉద్దవా! నా మిత్రుడు వసుదేవుడు పుత్ర సహితముగ కుశలముగ యున్నాడా? కంసుని మరణానంతరము యాదవ శిరోమణులందరకూ సుఖశాంతులు ప్రాప్తిల్లినవి. బలరామ సహితుడైన మాధవుడు ఎప్పుడయినా తన తల్లినయిన యశోదను తలచుకొనుచున్నాడా? ఇచ్చటి గోపబాలురను, గోవర్ధనమును, యమునా తటమును, గోసముదాయమును, వ్రజభూమిని, బృందావనమును స్మరించుచున్నాడా? ఎర్రని దొండపండ్ల వంటి పెదవులు, కమలనయనములు గల శ్రీకృష్ణుడు బలరామ సహితుడై గోపబాలురతో ఆడుచుండుట ఈ కనులతో నేను మరల చూడగలనా! ఈ కుంజనికుంజములు, యమునానది, గోవర్ధన పర్వతము, బృందావనము, ఇతర వనములు, ఇల్లు, లతా, వృక్షములు, గోవులు, ఈ సంసారము అంతయు ముకుందుని వినా విషతుల్యమై తోపుచున్నది. కమలదళ సమానమయిన విశాలనేత్రమలు గల శ్రీకృష్ణుడు లేని జీవితము, భోజనము, శయనము ధిక్కారము (ఛీత్కారము)."

"చంద్రుని నుండి దూరమయిన చకోరపక్షి వలె నేను శ్రీకృష్ణాగమనమునకై అత్యంత ఆశతో జీవించుచున్నాను. మహామతీ! నేను శ్రీకృష్ణ, బలరాములను పరాత్పర పరమేశ్వరులుగ భావించుచున్నాను. దేవతల ప్రార్ధన పై ఆ పరాత్పరుడు భూతలిపై భక్తజన సంరక్షణకు స్వేచ్ఛగా అవతరించెను."

ఈ విధముగ పరమేశ్వరుడయిన శ్రీహరిని అనేక విధములుగ స్మరించి చివరకు తలగడ యందు ముఖము నుంచి నిశ్శబ్దముగ నందుడు మౌనము వహించెను. ఉత్కంఠ చే ఆయన శరీరము రోమాంఛమైనది. శ్రీ కృష్ణ సఖుడయిన ఉద్దవుడు చూచుచుండగా నందుని కన్నులనుండి కారిన అశ్రుధారలు తలగడను, పరుపును జలమయమొనర్చి ప్రాంగణము నందు కాలువలా పారమొదలిడెను.

మధురాపురము నుండి ఉద్దవుడు ఏతెంచెనన్న వార్త వినిన యశోద తొందరగ తలుపు సందుల వద్దకు వచ్చి, నంద, ఉద్దవుల మద్య జరుచున్న తన పుత్రుని చర్చను వినసాగెను. ఆ సమయమున పుత్ర వాత్సల్యము చే ఆమె స్థనముల నుండి దుగ్ధమావిర్భవించి, కన్నులనుండి భాష్పములుబికెను. అంత యశోదామాత పుత్రస్నేహమున సిగ్గు విడచి, ఉద్దవుని వద్ద కేతెంచి కుశల మంగళములు స్వయముగ అరయుట నారంభించెను. ఆమె స్థితియు నందుని స్థితి వలెనే యున్నది. యశోదామాత ఇట్లనియె "ఉద్దవా! కృష్ణుడు నన్నుగానీ, తన తండ్రి అయిన నందరాజును కానీ ఎప్పుడయినా తలచుకొను చున్నాడా? ఆతని సోదరుడు సన్నందుడు ఆతనిని చూచుటకు అత్యంత ఉత్సుకతతో యున్నాడు. ఆతనిని స్మరించు చున్నాడా? నందవ్రజమందు తొమ్మిది మంది నంద, ఉపనందులు, ఆరుగురు వృషభానులు కలరు. వారినెవరినైననూ కృష్ణుడు తలచు కొనుచున్నాడా? ఎవరి ఒడియందు కూర్చొని ఆతడు వన, వనములందు బాల క్రీడలాడెనో, ఎవరితో కందుక క్రీడ క్రీడించెనో, ఆ గోపబాలకులను ఒక్క సారయిననూ స్మరించుచున్నాడా? నా జీవితము నందు నాకు ఒక్కసారి మాత్రమే పుత్ర సౌభాగ్యము కలిగెను. నాకు ఎందరో పుత్రులు లేరు. ఆ ఒక్క పుత్రుడు సహితము ఈ దీనదు:ఖిత అయిన తల్లిని వదలి వేరొక దిశకు వెళ్ళిపోయెను. మహానుభావా! ఆశ్చర్యకరమయిన విషయము వినుము "ప్రేమించువారలకు కష్టములు అనివార్యము." మానదా! నేను నా పుత్రుని వినా ఎట్లు జీవింతును? ఏమి చేయుదును? "అమ్మా! నాకు పెరుగు నిమ్ము. నాకు తాజా వెన్ననిమ్ము." అని హఠము చేయు నా చిన్ని కృష్ణుడు మధ్యాహ్నము ఎట్లు భోజనము చేయుచున్నాడు? నా చిన్ని పాపడు ఈ వ్రజవాసులందరికీ జీవనాధారము, వ్రజము యొక్క ధనము, యదుకులమునకు దీపము. తన బాల లీలల చే సర్వుల మనస్సులను మోహింపచేయువాడు. ఆతని లాలన, పాలన లో ఇన్ని సంవత్సరములు ఒక్క క్షణము వలె గడిచినవి. కానీ ఇపుడు నందనందనుని వినా దినమొక యుగముగా గడచుచున్నది."

ఏ కృష్ణయ్యను నేను దూడలను మేపుటకు గ్రామ సరిహద్దులకు, యమునా తటమునకు సహితము పంపనైతినో,

అతడే మధురానగరమునకు వెడలిపోయెను. ఓ! మోహన్! అని దూరము నుండి పిలచి, ఒడిలోనికి తీసికొని, మిక్కిలి ముద్దు జేయుచూ నందరాజు, ఈనాడు వ్యవసాయము విడచి శోకసముద్రమున మునిగిపోయెను. ఒకనాడు పెరుగుకుండ బ్రద్దలు కొట్టెనని దయాహీననైన నేను, నా ముద్దుల పుత్రుని రజ్జువు చే బంధించితిని. ఈనాడు ఆ క్రూరత్వమును గుర్తుకు తెచ్చుకొని శోకమున మునుగుచున్నాను. ఈ ప్రాంగణము, సభా మండపము, ఇల్లు, సరోవరములు, వీధులు, వ్రజభూమి, మందిరోపరిభాగములు, సర్వము శూన్యములైనవి. ముకుందుని వినా ఈ జగత్సర్వము విషతుల్యముగ యున్నది. కృష్ణుడు లేని ఈ జీవితము వ్యర్థము." నంద యశోదల ఉత్కృష్టకోటికి చెందిన ప్రేమను గమనించిన ఉద్దవుడు అత్యంత ఆశ్చర్యచకితుడాయెను. ఆయనకు తన యందుగల కించిత జ్ఞాన గర్వము సర్వము ఖర్వమైనది.

ఉద్దవుడు "ఆహా! మహాప్రభూ! నందరాజా! తల్లీ! యశోదామాతా! నా శరీరము నందు ఎన్ని రోమములు కలవో అన్ని జిహ్వలు చేసికొని వాటి ద్వారా మీరిరువురి మహత్వమును కొనియాడదలచిన ఎడల, ఇంకనూ మీ మహత్యమును పొగడుట యందు నేను అసమర్థుడనగుదును. మీరిరువురు పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుని యందు ప్రకటించిన భక్తి అనన్య సామాన్యము మరియు కొలువ నశక్యము. మీరిరువురికి ప్రాప్తించిన ప్రేమభక్తి. ఏ తపస్సు, దానము, సాంఖ్యము, యోగము చేత కూడా సౌలభ్యము కాదు. నంద, యశోదలారా! మీరు శోకింపవలదు. ఈ పత్రములు రెండు తీసికొన వలసినది. ఇవి నిస్సందేశముగ శ్రీకృష్ణుని చే పంపబడినవి. శ్రీకృష్ణుడు తన అన్న అయిన బలరాముని తో యదుపురి యందు కుశలముగ యున్నాడు. యాదవుల మహత్కార్యము పూర్తి అయిన పిదప బలరామ సహితుడై భగవానుడు మీ యొద్దకు కొలది సమయములోనే రాగలడు. మీరిరువురు శ్రీకృష్ణుని పరిపూర్ణతమ పరమాత్మగా గుర్తింపవలసినది. ఆయన కంసాది దుష్టులను హతమార్చుటకు, శిష్టులను రక్షించుటకు మీ ఇంట అవతీర్ణుడాయెను. బలరామ సహితుడైన శ్రీహరి తను పుట్టిన నాటి నుండి తన అత్యద్భుత లీల మొదలుపెట్టెను. పూతనా ప్రాణహరణము, శకటాశుర భంజనము, తృణావర్తుని నిర్జనము, యమళార్జున భంజనము, తన నోటియందు యశోదామాతకు విశ్వరూప సందర్శనము, మొదలగువని ఆయన చేసిన కొన్ని అలౌకిక లీలల దుష్టాంతము. బృందావనము నందు ఆవు దూడలను మేపుచూ గోపబాలకుల చూచుచుండగా ఆ పరమాత్ముడు బకాసుర, వత్సాసుర, అఘాసుర, ధేనుకాసురులను పరిమార్చెను. కాళీయుని మదమడచెను. దావానలమును త్రావెను. తదుపరి బలదేవుడు ప్రలంబుని హతమార్చెను. మీరందరూ చూచుచుండగా గజరాజు కమలమును తన తొండముతో ఎత్తునట్లు గోవర్ధనమును లీలాపూర్వకముగ పెకిలించి, చేతిపై నిలిపెను. ఆ జగదీశ్వరుడు శంఖచూడుని నుండి చూడామణిని గ్రహించెను.

అరిష్టాసురుని హతమార్చెను. కేశిని కాలగతి యందు కలిపెను. వ్యోముని ముష్టిఘాతము చే యమాంత:పురమునకు అతిథి గావించెను. మహామతులారా! ఈ విధముగనే మధర యుందునూ తన విచిత్ర పరాక్రమము ప్రకటము చేసెను. కంసుని రజకుడు మిక్కిలి గర్వోపేతుడై యుండెడివాడు. ఒక్క అరచేతి చరుపుతో వారి పని బట్టెను. కంసుని ప్రచండ ధనువును ఏనుగు చెరకుగడను విరుచునట్లు రెండు ముక్కలు గావించెను. వెయ్యి ఏనుగులు బలముగల కువలయాపీడమను బృహద్గజమును తొండము పట్టి, గిరగిరా త్రిప్పి నేలపై పడవైచి పరిమార్చెను. "చాణూర, ముష్టిక, కూట, శాల, తోశాలురను" ను భయంకర మల్లులను భూ శయనుల గావించెను. మదమత్త దైత్యుడగు కంసుడు లక్ష ఏనుగుల సమమయిన బలశాలి. కానీ శ్రీకృష్ణుడు వానిని సభాస్థలి యందు పైకిలేపి, భుజములు పట్టి, త్రిప్పి, బాలుడు కమండలమును విసురునట్లు భూమిపై విసరెను. పిదప గజముపై లంఘించు పంచాస్యము వలె కంసుని పై దూకి సంహరించెను. కంకాది కంస సోదరులను బలదేవుడు ముద్గరము చే ప్రహరించి మృగరాజు అనేక మృగములును ఒకేసారి అంతకపురి కంపునట్లు హతశేషులకావించెను. గురుదక్షిణ గావించుటకై శ్రీహరి సాగరమందు దుమికి పంచజనుని సంహరించెను. నందయశోదలారా! ఈ అద్భుత కార్యములు శ్రీకృష్ణునికి తక్క మిగిలిన వారికి సాధ్యమా! అట్టి శ్రీహరికి నమస్కరించు చున్నాను.

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి నందరాజ-ఉద్దవ సమాగమమను అను పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(గోపాంగనలతో ఉద్ధవుడు కదళీవనమున కరుగుట. శ్రీహరిని స్థుతించి శ్రీకృష్ణుని ద్వారా ఈయబడిన పత్రములు నందించుట)

నారదుడు "మహారాజా! ఈ విధముగ శ్రీహరి చరిత్రను చర్చించుచున్న ఉద్ధవ నందాదులకు ఈ రేయి ఒక్క క్షణము వలె గడచెను. సర్వుల హర్షమును పెంపొందించు వాడగుటచే శ్రీహరికి "క్షణదా" –"ఆనంద దాయకుడు" అను నామము సార్థకమయ్యెను. బ్రహ్మ ముహూర్తము ఆసన్నమవగనే గోపాంగనలందరూ లేచి, కాలకృత్యములు తీర్చుకొని, తమ తమ ద్వార ప్రాంగణములను తుడచి, అచట వెలుగులు చిమ్ముచున్న దీపములు పెట్టిరి. పిదప తమ చేతులను, కాళ్ళను శుభ్రపరచుకొని కవ్వమునకు రజ్జువు తగిల్చి పెరుగును చిలుకుట ప్రారంభించిరి. దధి మంధనమందు త్రాడును లాగుట చే హార కేయూరములు చిత్ర విచిత్ర ధ్వనులు చేయుచున్నవి. పుష్పములు శిరోచంధనము నుండి జారుచూ, కుండలులు చెవులకు కదులుచూ వినూత్న శోభను కలిగించు చున్నవి. ఆ చిగురుబోడులందరూ చంద్ర ముఖులు, కమలనయనలు, మరియు చిత్ర విచిత్ర వర్ణముల దుకూలములు ధరించుటక చే మరింత మనోహరముగ కానపట్టు చుండిరి. ప్రతి గృహము నందు బలరామ కృష్ణుల మంగళమయ చరిత్రను గీతములుగ పాడుచుండిరి.

గోష్ఠముల యందు సుందర గోవులు అటు నిటు తిరగాడుచూ "అంభా" రావములు కావించుచుండెను. వాడవాడల యందు దధి మంధన శబ్దము మిశ్రితమయిన గోపాంగనల గీతానాదమును వినిన ఉద్ధవుడు విస్మితుడై "ఆహా! ఈ నంద నగరమున సర్వత్రా భక్తిదేవి నృత్యము సలుపుచున్నది." ఈ విధముగ తలచుచూ ఆతడు గ్రామమునకు వెలుపల యున్న యమునా తటమునకు స్నానాదికములు పూర్తి చేసికొనుటకై వెడలెను. ఆ సమయమున ఉద్ధవుని రధమును అవలోకించిన గోపాంగనలు ఈ విధముగ పలికిరి "సఖులారా! ఈ రథమెవ్వరిది? నూత్న కమలదళ లోచనుని మధురాపురమును చేకొనిపోయిన క్రూరుడయిన అక్రూరుడు తిరిగి రాలేదు కదా? ఎట్లు కద్రువ జగత్తునందు జీవులను చంపుటకు లేక భయపెట్టుటకు విషధరయుక్తమయిన పన్నగములకు జన్మనిచ్చినదో అట్లే సత్పురుషులకు తీవ్రతాపము కలిగించుటకు ఈ అక్రూరుని తల్లి ఒక దుస్సమయమున ఈతనికి జన్మ నిచ్చినది. కంసుని స్వార్ధసేవకుడు మరియు కంసుని మిక్కిలి నిర్దయుడయిన సఖుడు ఈ వ్రజమండలమునకు తిరిగి ఎందుకేతెంచెను?

"ఈ దుష్టుడు ఈనాడు మన ప్రాణులన్నింటినీ హరించును". ఇట్లు పలుకుచూ రథ సారధిని రెండంగుళులతో పీడించి గోపాంగనలు ఇట్లు ప్రశ్నించిరి "ఈ రథమెవ్వరిది? వేగమే తెలుపవలసినది." అంత సారధి భయభ్రాంతుడై, అవాక్కయి నిలుచుండెను. ఇంతలో ఆతనికి ఉద్ధవుడు రథముకడకు అరుగుచూ కానబడెను. ఉద్ధవుని దేహకాంతి మేఘవర్ణము వలెనూ, నయనములు విరిసిన విశాల తామరదళములు వలెనూ, గళమున వైజయంతీమాల, హస్తము నందు సహస్రకమలము, కరమందు వంశీధరము, మరియు దండము, శిరముపై కోట్లాది బాలసూర్యుల వలె తేజరిల్లు కిరీటము, వక్షస్థల మందు కౌస్థుభము, కర్ణములకు కపోలతలములను ప్రకాశింపచేయు రత్నమయ కుండలములు చే ప్రకాశించుచూ ఉద్ధవుడు వారివైపు నడచి వచ్చుచుండగా అందరి దృష్టి అటు వైపు మరలెను. ఆతని నడక, నడత, ఆకృతి, శోభ, శరీరము, మందహాసము, మధురస్వరము, సర్వము శ్రీకృష్ణుని వలె యుండెను. ఆతనిని చూచి గోపికలు చకితులై ఆతనిని గోవింద సఖునిగా తెలిసికొని ఆతని వద్దకు వెళ్ళిరి.

శ్రీకృష్ణుని సందేశము తెచ్చెనని తెలిసికొని గోపికలందరూ ఆతని యెడల మిక్కిలి ఆదరమును చూపి మధుర వచనములు పలికి, సత్పురుషుల పెన్నిధి అయిన గోవిందుని కుశల మరయుటకు ఆతనిని తమతో కలిపి వృషభానునందిని శ్రీరాధాదేవి నివసించుచున్న కదళీవనము నందలి నికుంజముల చెంతనున్న అంతరంగ భవనమునకు తీసికొని వెళ్ళిరి. అచట శ్రీరాధాదేవి శ్రీకృష్ణ విరహము చే శ్రీకృష్ణ రహిత ప్రపంచమును శూన్యముగా భావించుచూ జీవించుచున్నది. పూర్వము ఈ కదళీవనము నందలి భవనము కోమల కదళీ పత్రముల యందు చిలకరింపబడిన చందనము చే శీతల మేఘమందిరము వలె భాసించుచూ, యమునా ఉత్తుంగ తరంగముల నుండి వీయు శీతల వాయువుల చే సాక్షాత్

సోముని ఘనీభవించిన సుధారాశియా అన్నట్లు యుండెడిది. అటువంటి కదళీవనము సర్వమూ శ్రీరాధాదేవి యొక్క విరహాగ్ని చే దగ్ధమయినది. కేవలము మధుసూదనుడు తిరిగివచ్చుచున్న ఆశతో శ్రీరాధాదేవి ఇంకనూ శరీరము తో యున్నది. శ్రీకృష్ణ సఖుడు ఉద్ధవుడు వచ్చెనన్న వార్త వినిన శ్రీరాధాదేవి తన సఖులచే, అన్న, పాన మధుపర్కాది మంగళమయ వస్తువులు అయనకు అర్పించి సాదర స్వాగత సత్కారములాచరించెను. ఆ సమయమున ఆమె నిరంతరము శ్రీకృష్ణ నామము ఉచ్చరించుచూ, శ్రీకృష్ణ వియోగము చే ఖిన్నురాలై అమావాస్య నాటి చంద్రుని వలె క్షీణించి యుండెను. ఆ సమయమున ఉద్ధవుడు ఆమెకు ప్రదక్షిణ నమస్కృతులాచరించి ఇట్లు పలికెను. "శ్రీరాధాదేవీ! శ్రీ కృష్ణుడు పరిపూర్ణ భగవానుడు మరియు మీరు పరిపూర్ణ భగవతి. శ్రీకృష్ణుడు నిత్య లీలా పరాయణుడు, మీరు ఆ కృత్యమును నిర్విఘ్నముగ అమలు చేయు నిత్య లీలావతి."

"శ్రీకృష్ణుడు ఐశ్వర్యవంతుడు, మీరు ఐశ్వర్యము. శ్రీకృష్ణుడు నిత్య సనాతన బ్రహ్మ, మీరు ఆయన నిత్యనిరంతర శక్తి అయిన సరస్వతి. శ్రీకృష్ణుడు శివుడు, మీరు శివాని, శ్రీకృష్ణుడు విష్ణువు, మీరు ఆయన శక్తి స్వరూపమయిన వైష్ణవి! ఆది దేవత అయిన శ్రీహరి కౌమారులైన సనక, సనందన, సనాతన, సనత్కుమారులు, మీరు జ్ఞానమయమయిన శుభస్మృతి. శ్రీహరి ప్రళయకాల జలముల యందు క్రీడించు యజ్ఞ వరాహము, మీరు వసుధ. శ్రీహరి మనసు చే నారదుడు అయినపుడు మీరు ఆయన ధరించు వీణ (మహతి), శ్రీహరి ధర్మ నందనులైన నర నారాయణులైనపుడు మీరు జగత్తు నందు శాంతి స్థాపించు శాంతిరూపిణి. శ్రీకృష్ణుడే సాక్షాత్ కపిలుడు, మీరు సిద్ధసేవిత అయిన సిద్ధి. శ్రీకృష్ణుడే మహా మునీశ్వరుడయిన దత్తాత్రేయుడు, మీరు అనఘలక్ష్మీ స్వరూపులు. శ్రీహరి యజ్ఞము, మీరు దక్షిణ. ఆయన వామనుడయినపుడు మీరు ఆయన శక్తి అయిన జయంతీ. శ్రీహరి సమస్త రాజ్యాధిపతి అయిన పృథు చక్రవర్తి అయినపుడు మీరు ఆయన సతీమణి అర్చిస్సు. శ్రీహరి శంఖాసుర సంహారమునకై మత్స్యావతారము స్వీకరించినపుడు మీరు శృతిరూప. మంధరా చలము చే సముద్ర మథనము గావింపబడినపుడు శ్రీహరి ఆదికూర్మరూపము ధరించెను. మీరు వాసుకి యందు శుభదాయిని అయిన శక్తిరూపముగ ప్రకటితమయిరి. శుభే! పరమేశ్వరుడయిన శ్రీహరి జగత్తు యొక్క రోగములు హరించుటకై ధన్వంతరి గా ఆవిర్భవించినపుడు మీరు దివ్య సుధామయములయిన ఓషధులుగా అవతరించిరి. శ్రీహరి నృశింహరూపమున ఆవిర్భవించినపుడు మీరు నిజభక్తవత్సల లీలగా ప్రకటితమయిరి. శ్రీకృష్ణుడు మోహినీరూపము దాల్చినపుడు మీరు ఆయన యందు విశ్వమోహినిగా విలసిల్లిరి. శ్రీహరి వామనావతారము స్వీకరించినపుడు మీరు భక్త జనుల చే కీర్తింపబడి కీర్తిరూపిణిగా ప్రకటితమయిరి. శ్రీకృష్ణుడు భృగు నందనుడయిన పరశురామునిగ అవతరించినపుడు మీరు ఆయన ధరించిన కఠోర పరశువుగా ఆవిర్భవించిరి. శ్రీకృష్ణుడు రఘుకుల తిలకుడయిన శ్రీరామ చంద్రునిగ అవతీర్ణుడయినపుడు మీరు జనక నందినిగ దృష్టిగోచరమైరి. శాంగధన్వ శ్రీహరి బాదరాయణ వ్యాసునిగ అవతరించి నపుడు మీరు వేదాంత తత్వమును విశదరపరచు దేవవాణి రూపమున ఆవిర్భవించిరి. వృష్ణికుల తిలకుడయిన మాధవుడు సంకర్షణ రూపము స్వీకరించినపుడు మీరే బ్రహ్మభవ స్వరూపిణి అయిన రేవతీదేవిగా ఆయన సేవ యందు విరాజమానమగుదురు. శ్రీహరి అసురులను మోహింపచేయు బుద్ధావతారము స్వీకరించునపుడు మీరు విశ్వ జనమోహిని అయిన బుద్ధిరూపమున దృష్టిగోచమగుదురు. శ్రీహరి ధర్మ పాలకుడయిన కల్కిరూపము ధరించినపుడు మీరు కృతిరూపిణి గా వెలుగొందుదురు. చంద్రమండలము నందు శ్రీకృష్ణుడు చంద్రుడు. మీరు చంద్రికారూపిణి అయిన వెన్నెల. ఆకాశము నందు సూర్యుడు కృష్ణుడు. మీరు అయిన వెలువరించు ప్రభారాశి.

యాదవేంద్రుడయిన శ్రీకృష్ణుడే ఇంద్రుడు. ఇంద్రాణి అయిన శచీ స్వరూపమే మీరు. పరమేశ్వరుడయిన శ్రీకృష్ణుడే హిరణ్యరేతుడయిన అగ్ని. మీరే హిరణ్మయి అయిన పరాశక్తి. శ్రీకృష్ణుడే రాజరాజైన కుబేరుడు, మీరే ఆయన నిధుల యందు విరాజిల్లు నిధేశ్వరి. సాక్షాత్ శ్రీహరి యే క్షీరసాగరము. మీరు అంది శుక్లవర్ణ తరంగమాల. ఎప్పుడెప్పుడు శ్రీహరి దేహధారణ చేసి అవతారమును స్వీకరించునో అప్పుడప్పుడు మీరు ఆయన అనురూప శక్తిగా ప్రకటితమగుదురు. సాక్షాత్ శ్రీహరి యే జగత్తు. మీరు అందలి బ్రహ్మమయ చైతన్య శక్తి. ఇప్పుడు కూడా శ్రీహరియే వ్రజరాజ నందనుడు. మీరు వృషభాను నందిని. మీరిరువురు జగత్తు యందు సుఖశాంతుల స్థాపనకై నానా క్రీడాకృత్యములు ద్వారా సత్వమయ లీలా ప్రకటనము చేయుదురు. శ్రీ కృష్ణుడే పురాణపురుషుడు, అయిన పరబ్రహ్మము. మీరు ఆయన ఇచ్ఛా స్వరూపిణి

అయిన లీలాశక్తి. మీరిరువురి విగ్రహములు ఎల్లప్పుడూ సంయుక్తముగ యందును, విడదీయరానివి. మీరిరువురికి (రాధాకృష్ణులకు) నా నమస్కారము. శ్రీరాధికాదేవి! మీరు శోకింపవలదు. మీ ప్రాణనాథునిచే ఈయబడిన పత్రమును స్వీకరింపవలసినది. ఆయన సందేశము "కొన్ని దినములు మధురా నగరము నందుండి, అచటి కార్యములు చక్కబెట్టి పిదప బృందావనము తప్పక వచ్చెదము." "గోపికలారా! శ్రీకృష్ణుని చే ఈయబడిన వందలాది పత్రములు సహితము తీసికొనవలసినది". అని పలికి శ్రీకృష్ణుని చే పంపబడిన పత్రములను గోపికాయూధము లందరికీ ఉద్ధవుడు అర్పించెను.

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి "ఉద్ధవుని ద్వారా శ్రీరాధికా దర్శనము" అను పదహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(ఉద్ధవుని ద్వారా శ్రీరాధికాదేవి మరియు ఇతర గోపాంగనలు ఆశ్వాశింపబడుట)

నారదుడు "మహారాజా! శ్రీరాధికాదేవి ఆ పత్రము తీసికొని తొలుత మస్తకము పై పెట్టుకొని, తదుపరి కనులకు అద్దుకొని పిదప హృదయమునకు హత్తుకొనెను. తదనంతరము ఆ పత్రమును చదువుకొని శ్రీకృష్ణ చరణారవిందములను స్మరించి అత్యంత ప్రేమాతృత చే కన్నుల వెంట భాష్పధారలు రాలుచుండగా ఆ తల్లి ఉద్ధవుని ఎదుట మూర్ఛిల్లెను. అంత చుట్టూ పరివేష్ఠితులయిన చెలికత్తెలు చందనాగరు కస్తూరి కలిపిన నీటిని మరియు పుష్పరసమును ఆమెపై చిలికి పరిచర్యలాచరించిరి. అంతట శ్రీరాధాదేవికి తిరిగి చేతన కలిగినది. కమల లోచన అయిన శ్రీరాధాదేవి ఇట్లు వియోగ దు:ఖసాగరమున మునుగుట అవలోకించిన ఉద్ధవ, గోపాంగనల నేత్రములు నుండి అవిరళముగ భాష్పధారలు కార నారంభించెను. వారందరి కన్నుల నుండి వెలివడిన భాష్పధారలు చే తక్షణమే కల్హార పుష్ప శోభితమయిన లీలా సరోవరమేర్పడినది. ఏ మానవుడు ఈ లీలా సరోవరమును దర్శించి ఈ జలమును త్రాగి, ఇందు స్నానమాచరించి ఈ ఆఖ్యానమును ఆలకించునో ఆతడు కర్మ బంధము నుండి విడవడి శ్రీకృష్ణ ప్రాప్తి నొందును.

అటు తరువాయి ఉద్ధవుని చే గోవింద పునరాగమనమును గూర్చిన శుభవార్తను వినినంతనే గోపాంగనలు గోవిందుని కుశల మంగళములు అరయుట నారంభించిరి. శ్రీరాధాదేవి "ఉద్ధవా! మేఘ సమానమయిన నీలికాంతిగల ఆనందప్రద, వ్రజరాజనందనుని దర్శనము నేను ఎన్నడు చేయుదును? మయూరము మేఘమాలికకై, చకోరము చంద్రునికై, ఎట్లు అత్యంత ఉత్కంఠతో ఎదురు చూచునో అట్లే నేనునూ ఆయన కొరకు ఎదురచూచు చున్నాను. ఏ దుస్సమయము నందు నాకు ఆ మహానుభావుని తో వియోగము ఏర్పడినదో అప్పటి నుండియు నాకు క్షణమొక కల్పము వలె తోచుచున్నది. గోవింద చరణయుగళి లభించని ఈ రాత్రి చతుర్ముఖ బ్రహ్మ యొక్క ద్వితీయ పరార్ధము కంటె ఎక్కుడగ కానపట్టుచున్నది. ఉద్ధవా! తిరిగి ఎప్పుడయినా ఈ వ్రజభూమి యందు శ్యామసుందరుడు కాలుపెట్టునా? ఆతడు మధుర యందు ఏ విధమయిన కార్యములు చేయుచున్నాడు? నాకు తొందరగా చెప్పవలసినది. ఈ నాటి వరకూ నా ప్రాణములు మిక్కిలి ప్రయాస చే నిలిచి యుండినవి. ఆతని అబద్ధపు బాసల చే నా ప్రాణములు హఠాత్తుగ ఎగిరిపోవును. ఈ రోజు నిన్ను చూచిన పిదప క్షణకాలము నా హృదయము శాంతి నొందినది.

పూర్వకాలము లంక యందు హనుమంతుని చూచి జనకనందిని అయిన సీత ఎట్టి ఆనందము పొందినదో, అట్లే నేనునూ నిన్ను చూచిన పిదప అదే ఆనందమును అనుభవించితిని. ఎన్నో ఆశలు రేపి, ఎన్నో బాసలు చేసి, వాటన్నిటినీ మరచి శ్యామసుందరుడు మధుర వెళ్ళిపోయెను. అందుచే ఆతని చే వ్రాయబడిన ఈ పత్రమును నేను సత్యమని నమ్మలేను. నీవు స్వయముగా ఆయనను ఇచటకు తీసికొని రమ్ము. ఉద్ధవుడు "శ్రీరాధాదేవి! నేను అవశ్యము

మధురాపురమున కేగి మీ మహావిరహ దు:ఖమును ఆయనకు నివేదించెదను. నా భాష్పధారల చే ఆయన చరణములను కడిగెదను. ఏది ఏమైననూ శ్రీహరిని మధురాపురము నుండి ఇచటకు తీసికొని వచ్చెదను. ఇది మీ పాదములపై ప్రమాణము. మీరు దయచేసి శోకపడవలదు." తదనంతరము శ్రీరాధాదేవి మిక్కిలి ప్రసన్నయై చంద్రుని ద్వారా ఆమెకు ఈయబడిన రెండు చంద్రకాంత మణులను నంద నందనునికి ఈయమని ఉద్ధవునికి అర్పించెను.

తదుపరి శ్రీరాధాదేవి తన ప్రాణవల్లభునికై, మున్ను శ్రీకృష్ణ సంకల్పము చే ప్రకటితమయిన ఛత్రము, దివ్య సింహాసనము, రెండు మనోహరమయిన చామరములు ఇచ్చెను. ఇంతేకాక ఉద్ధవునకు "ఉద్ధవా! నీవు మిక్కిలి జ్ఞాన, ఐశ్వర్య సంపన్నుడవగుదువు. ఉపదేశ గురువు లందరికీ కూడా ఉపదేశ గురువువు అగుదువు. అంతేకాక నీకు నిరంతరము శ్రీకృష్ణ సాహచర్యము లభించును," అను అద్భుతమయిన వరముల నిచ్చెను. ఈ విధముగ శ్రీరాధాదేవి ఉద్ధవునకు నిర్గుణ భావ సంపన్నమయిన ప్రేమ, భక్తి, జ్ఞాన విజ్ఞాన వైరాగ్యము ప్రసాదించెను. శ్రీహరి చంద్రచూడ యక్షుని సంహరించి ఇచ్చిన చూడామణిని చంద్రానన అను గోపిక ఉద్ధవునకు సమర్పించెను. ఈ విధముగ అన్య గోపికలు అందరూ మహాత్ముడయిన ఉద్ధవుని చేతిలో అభూషణముల రాశిని పోసిరి.

ఉద్ధవుని శుభవాచకములు విని శ్రీరాధాదేవి అత్యంత ప్రసన్న అయిన పిదప సభామండపము నందు సుఖాసీనుడై యున్న ఉద్ధవుని వద్ద కూర్చొని వివిధ గోపికలు వేరువేరుగా ఇట్లు ప్రశ్నించిరి, "మహానుభావా! ఉద్ధవా! శ్రీకృష్ణుడు ఎవరెవరికి లిఖిత పత్రములు పంపెను? మాకు కూడా ఏదేని సందేశమును పంపెనా?మీరు ఉత్తములు యందు ఉత్తములు. సాక్షాత్ శ్రీకృష్ణసఖులు. ఆయన వలెనే రూపుదిద్దుకున్నవారు. ఆయన మాకై నుడివిన సందేశములు తెలుపవలసినది." ఉద్ధవుడు "గోపాంగనలారా! ఎట్లు దేవదేవుడయిన శ్రీకృష్ణుని మీరు నిరంతరమూ తలచుకొనుచున్నారో, అట్లే ఆయన కూడా మిమ్ములను అట్లే తలచుకొనుచున్నాడు. నిస్సందేహముగ నా ఎదుట సహితము మిమ్ములనే తలుచుకొని యున్నాడు. నేను శ్రీహరి యొక్క ఏకాంత సేవకుడను."

ఒకనాడు ఆయన మిమ్ములనందరినీ, స్మరించుచూ, నన్ను పిలచి తన మనసు నందలి సందేశమును ఇట్లు పంపెను. "విషయాసక్తమయిన మనస్సు బంధకారము. అదే మనసు పరమ పురుషుడయిన నా యందు ఆసక్తమయనేని మోక్ష కారక మగును. ఈ విధముగ జ్ఞానులు మనస్సునకు బంధ, మోక్ష కారణములు తెలిపెదరు. మనుష్యుడు పృథివి యందు మనస్సును జయించి, అసంగుడై, ఆసక్తి శూన్యుడై చరించ వలెను. వివేకవంతమయిన జీవి నిర్మల అధ్యాత్మ యోగము చే నన్ను (సాక్షాత్ పరాత్పర బ్రహ్మమును) సర్వ వ్యాప్తిగా తెలుసుకొనునో ఆతడు మనసు నుండి రాగము (ఇష్టము/ప్రేమ/ఆసక్తి) ని త్యజించును. మేఘము సూర్యుని వలనే ఉత్పన్నమగును. ఎంతవరకూ ఆ మేఘము సూర్యునికి, దర్శించువానికి మధ్య అడ్డుపడునో అంతవరకు జీవులు సూర్యుని కానలేరు. అట్లే ఎంతవరకూ అంత:కరణమునకు, ఆత్మకు మధ్య రాగద్వేషములనెడు ఆవరణ యుండునో అంత వరకూ ఆత్మ దర్శనము కాదు. వ్రజాంగనలారా! స్థూలదృష్టి చే నేను దూరముగ యున్నాను. కానీ తత్వదృష్టి చే మన ఇరువురి నడుమ దూరము (భేదము) లేదు. అందువలన నా వియోగమే నా ప్రాప్తి సాధనముగ తీసికొన వలసినది. సాంఖ్యయోగము చే ఏ పదము ప్రాప్తించునో యోగ సాధన ద్వారా కూడా అదే ఫలము ప్రాప్తించును.

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి "ఉద్ధవుని ద్వారా శ్రీ రాధాదేవి మరియు గోపికల ఆశ్వాసము అను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(శ్రీకృష్ణుని స్మరించుచూ శ్రీ రాధ మరియు గోపికల కరుణాపూరిత ఆక్రందన)

నారదుడు "శ్రీకృష్ణుని సందేశమును వినిన గోపికలు అశ్రువులు చిందించుచూ, గద్గద కంఠముతో ఇట్లనిరి.

గోలోకవాసినీ గోపికలు "ఉద్ధవా! మొదట ప్రియజనుల నందరినీ విడచి ముకుందుడు పరదేశమునకు ఏగెను. అచట నుండి తన కుశలమును గూర్చి లేఖను పంపెను. ఆహా! నిర్మోహత్వము ఎంత బలమయినది?

ద్వారపాలికా గోపికలు "సఖులారా! చంద్రునికి చకోరములందు, సూర్యునికి కమలమందు, కమలములకు భ్రమరముల యందు, మేఘమునకు చాతక పక్షులందు ఎంతమాత్రము ప్రేమయుండదు. అట్లే శ్యామసుందరునికి మనపై ఇసుమంత ప్రేమయు లేదు."

శింగారధారణ చేయు గోపికలు "సఖులారా! చంద్రుడు చకోరములకు మిత్రుడు. కానీ వాని భాగ్యమందు అగ్నికణములే వ్రాయబడి యున్నవి. విధాత ఎవరి భాగ్యమందు ఏమి వ్రాసినో అది అట్లే జరుగును."

శయ్యాపచారికలయిన గోపికలు "వ్యాధుడు మృగములను సంహరించి వాని మాంసమును ఆతురుడై గైకొనును. కానీ తన కటాక్ష వీక్షణముల చే ప్రియజనులను గాయపరచి తుదకు వారిని ఒక్కమారు కూడా స్మరించని నిర్మోహుని గూర్చి ఏమనగలము? మిక్కిలి ఆశ్చర్యము కదా!"

పార్షద గోపికలు "విరహ జనిత దు:ఖమును వేరొక విరహిణి యే తెలుసుకొన గలుగును. వేరొక రెవరూ ఆ దు:ఖమును అర్ధము చేసికొన లేరు. ఎవరికేని ముల్లు గ్రుచ్చ కొనినచో, ఆ బాధ వేరొక గుచ్చుకొనిన వానికి మాత్రమే తెలియనగును. ఎన్నడూ ముల్లు వలన బాధపడని వానికి ఎట్లు తెలియును?"

బృందావన పాలికా గోపికలు "నిష్కామ ప్రేమ వలన కలుగు సుఖము నిష్కామ ప్రేమయే తెలిసికొనును. ఇతరు లెవ్వరునూ ఆ ప్రేమను అర్ధము చేసికొనలేరు. ఎవరు కామన లేక ప్రత్యేకమయిన కోరికతో ఒకరిని వాంఛించినచో వారు నిష్కామ ప్రేమను ఎట్లు తెలిసికొనగలరు? కర్మేంద్రియములకు రసానుభవము సాధ్యమా? శక్యమా?"

గోవర్ధన వాసినీ గోపికలు "పుర వనితలతో ప్రేమ కలాపములు సాగించు ముకుందుడు ఇపుడు సైరంధ్రీ నాయకుడయ్యెను. అటువంటి వానికి పర్వత వన వాసినులయిన స్త్రీలతో పని ఏమి? ఈ విషయము నందు అధికముగ మాట్లాడుట కూడ వ్యర్థము."

కుంజవిధాయిక గోపికలు "పూతేనియలు వ్రాలి మత్తెక్కిన మధుపముల ఘంకారములు చేయుచున్న మాధవీలతా సమూహములు నుండి, ఎల్లప్పుడూ మన కన్నులలో నివసించు ముకుందుని కధను వినుచున్నాము."

నికుంజ వాసినీ గోపికలు "(బృందావనము నందు మెల్లమెల్లగా సంచిరించు నందనందనుని మేము (మనము) భజించుచున్నాము) బృందావనము నందు మత్తెక్కిన మధుప సముదాయము నిండిన యమునా తటమున కదంబ కుంజరములందు బలరామ, గోపబాల, గోసమూహములతో మెల్లమెల్లగా సంచరించు నందనందనుని మేము (మనము) భజించు చున్నాము."

యమునా యూధము తో సమ్మిళితమయిన గోపికలు "ఈనాడు మధురాపురి స్త్రీలకు పట్టిన సద్గతి ఒకనాడు మనకు కూడ పట్టును. వ్రజాంగనలారా! శోకింపవలదు. ఎవరికీ ఎల్లప్పుడూ జయము లేక పరాజయము కలుగదు. విధాత హృదయము నందు దయాలేశము కొంచెము కూడా లేదు. ఎట్లు బాలకుడు తన ఆటబొమ్మలను విడదీసి మరల కలుపునో అట్లే విరించి సహితము సమస్త భూతములనూ కలిపి విడదీయు చుండును. పూర్వము వక్రాంగ (గూని) యున్న స్త్రీ, నేడు సర్వాంగసుందరి అగును. దాసి కులీనగనూ, కురూపి రూపవతిగనూ ప్రకాశించవచ్చు. నాలుగు దినములు గడవగనే వారు (మధురాపుర స్త్రీలు) తమ విజయ నగారాను మ్రోగించు చున్నారు."

విరజాయూధ గోపికలు "ఏ యువతి హస్తము ఎల్లప్పుడూ ప్రియుని హస్తము నందు యుండదు. వనమందు ఎల్లప్పుడూ వసంత ఋతువు యుండదు. ఎవరూ ఎల్లప్పుడూ యుక్త వయస్కులుగ యుండరు. దేవరాజైన ఇంద్రుడు సహితము ఎల్లప్పుడూ రాజ్యము నేలడు. నాలుగు దినములు వారిని గొప్పగా తలచుకొననీ!!"

లలితా యూధ గోపికలు "మంధర కూడ వక్రాంగనయే! (గూని గల స్త్రీ). అయోధ్యా పురి యందు శ్రీరామ చంద్రుని పట్టాభిషేకమును ఆపి వేయించినది. ఆ కుబ్జ యే ఇపుడు మధురానగరమునకు దిగి వచ్చినది. గోపికలారా! కుబ్జ ఏ కార్యము చేయదు? (చేయలేదు?)"

విశాఖాయూథ గోపికలు "ఎవరు ఉదయము గోవులను మేపుటకు గోప బాలక సహితుడై వనమునకు ఏగునో, తిరిగి వచ్చునపుడు తన వంశీనాదము చే గ్రామస్థులందరికీ తన ఆగమనమును సూచించునో, ఎవరు మదించిన ఏనుగువలె నడుచుచుండునో అట్టి నందనందనుని మనము వెనుకకు పిలువలేము."

మాయాయూథ గోపికలు "ఇరుకయిన వీధులలో హఠాత్తుగా మన పమిటను పట్టుకొని, లాగి, మన భుజములు పట్టుకొని, హృదయమునకు హత్తుకొని ఒకేమారు హర్షాల్లోందళనములు కలిగించు శ్రీహరిని తిరిగి మనము వెనుకకు మన ఇండ్లకు ఎప్పుడు తీసికొని వెళ్ళగలము?"

షోడష సఖులు "వనము నందు మధురమయిన ప్రేమను పెంపొందిచు సుమధుర వంశీరవమును వినిన మా కర్ణములు ఈ సంసార గీతములు వినజాలవు. ఈ సంసార గీతికలు కాకులు "కావు కావు" మను కఠోరమైన రోదన వలె వినిపించు చున్నవి."

ముప్పది రెండు సఖులు "మిత్రులను ప్రేమ తోనూ, శత్రువులను నీతి (తెలివి తేటలతోనూ), లోభిని ధనము తోనూ, బ్రాహ్మణుని ఆదరము తోనూ, గురువును పలుమార్లు ప్రణామము తోనూ, రసికుని మోహము తోనూ వశమొనర్చు కొనవచ్చు. కానీ నిర్మోహి (దేని యందూ మోహము లేని వానిని) ఏ విధముగ వశము చేసికొనగలము?"

శృతిరూప గోపికలు "ఎవరు జాగ్రదాది అవస్థల యందు వ్యాప్తి నొందియు వారి కంటె పరుడో, ఎవరు జగత్తుకు కారణభూతుడయ్యునూ వాని కంటె వాస్తవమునకు అహేతుడో, ఎవని ప్రేరణ చే సమస్త గుణములు తమ తమ విషయముల వైపు ప్రవహించు చుండునో, అట్టి పరమాత్మకు నమస్కరించుచున్నాము. ఎట్లు అగ్ని నుండి వెలువడిన నిప్పు కణములు తిరిగి అగ్నియందు ప్రవేశింప జాలవో, అట్లే మహత్తత్త్వము, ఇంద్రియ సముదాయము, ఇంద్రియాధిష్ఠాతలయిన దేవతానీకము ఎవని యందు ప్రవేశింపజాలరో, అట్టి పరమాత్మునకు తిరిగి నమస్కరించు చున్నాము."

ఋషిరూప గోపికలు "బలిష్ఠుల యందు అత్యంత బలిష్ఠమయిన కాలము యొక్క శాసనము ఎవని యందు చెల్లదో, మాయ సహితము ఎవనిని వశీభూతమొనర్పజాలదో, వేదము సహితము తన వాక్యముల ద్వారా ఎవనిని అర్థము చేసికొనజాలదో అట్టి అమృత స్వరూపుని, శుద్ధ ప్రశాంత పరాత్పర పూర్ణ బ్రహ్మమును మేము శరణుజొచ్చు చున్నాము".

దేవాంగనా స్వరూప గోపికలు "ఏ పరమేశ్వరునికి అంశాంశ, అంశ, కళ, ఆవేశ, మరియు పూర్ణావతారములు కలవో, ఎవరి వలన ఈ జగత్తు యొక్క సృష్టి, స్థితిలయములు కలుగు చున్నవో, పూర్ణమునకు సహితము పరమైన పరిపూర్ణ పరమాత్మఅయిన శ్రీకృష్ణ భగవానునికి ప్రణామములు అర్పించుచున్నాము."

యజ్ఞ సీతా స్వరూప గోపికలు "ఈ శ్యామ సుందరుడు నికుంజలతలకు కుసుమాకరుడు, శ్రీరాధాదేవి యొక్క హృదయ విభూషణుడు, రాసమండలాధిపతి, వ్రజమండలేశ్వరుడు, సమస్త బ్రహ్మాండముల పరిపాలకుడు."

రమా వైకుంఠ నివాసినీ గోపికలు "ఎవరు సమస్త గోపీయూథములను అలంకరించి అలరించెనో, తన చరణముల చే బృందావనమును, తన కరము చే గోవర్ధన గిరిరాజమును ఆభూషించెనో, ఎవరు సంపూర్ణ లోకాభ్యుదయమునకై భూమండలము నందు అవతీర్ణుడాయెనో, ఎవరు మదించిన కుంజనమును పోలు భుజశాలియో, ఎవరు నిరంతర లీలా విలాసుడో, అట్టి శ్యామ సుందరుని భజించుచున్నాము."

శ్వేత ద్వీప సఖులు "బాలకుడు ఎట్లు పుట్టగొడుగులను శ్రమ లేకుండా పెకలించునో, ఎట్లు మదించిన ఏనుగు తొండముతో సునాయాసముగ కమలమును వెలికిదీయునో, క్రీడా సదృశముగ అట్లే పర్వతమును తన చేతితో ఎత్తి అద్భుతముగ శోభించు నట్టి కృపానిధానుడయిన వ్రజరాజ నందనుని మేము ఎప్పటికీ మరువలేము."

ఊర్ధ్వ వైకుంఠ వాసినీ గోపికలు "మా నేత్రములు శ్యామల వర్ణము లగుట వలన సర్వ జగత్తు మాకు శ్యామసుందర మయముగా కానపట్టు చున్నది. మాకు వేరొకటి కనబడుట లేదు. అందువలన ఆయన యందు లీనమగు కార్యము ఎట్లు పొసగును?"

లోకాచల వాసినీ గోపికలు "స్నేహపాశము మిక్కిలి ధృఢమయినది. అది తెగిపోవునది, లేక కత్తిరింపబడునది కాదు. మనము ఆ పాశమును తెగగోట్టలేము. శ్రీహరి వినా వేరెవరూ ఆ కార్యము చేయలేరు. ఆయన ఒక్కడు మాత్రము

గరుడుడు నాగపాశమును ఛేదించు రీతిని ఈ స్నేహ పాశమును త్రెంచుకొని మధురాపురమునకు వెళ్ళిపోయెను."

అజిత పదాశ్రిత గోపికలు "మా నేత్ర ద్వయము శ్రీ కృష్ణుని యందే లగ్నమయినది. అవి దశదిశలు పరుగెత్తి నప్పటికీ కమలమును మరిగిన మధుపము ఇతర పుష్పముల నేరనట్లు, ఏ విషయ వాంఛల యందు తగులు కొనవు."

శ్రీ సఖులు "లోకులు తమ లోభత్వము చే యశస్సును, క్రోధము చే గుణ సమూహమును, దుర్వ్యసములచే ధనమును, కపటత్వము చే మైత్రిని పోగొట్టుకొందురు."

మిధిలావాసినీ గోపికలు "ధనము నిచ్చి శరీరమును రక్షింపవలెను, శరీరము ను ఇచ్చి ప్రతిష్ఠను రక్షించుకొనవలెను. మిత్రుల కార్యసిద్ధికి అవసరమయినచో ధన, తను, ప్రతిష్ఠలను త్యాగము చేయవలెను."

కోసల ప్రాంత వాసినీ గోపకలు "వియోగ జనిత దు:ఖము జీవాత్మకు వినా వేరెవరికీ తెలియదు. కానీ ఆ జీవాత్మకు అద్దానిని వివరించుటకు సమర్ధత లేదు, ఎందుకనగా పలుకునది వాణి, కానీ ఆ వాణి కి వియోగ దు:ఖానుభవము లేదు. బాణ ఘాతముల చే ఎవని హృదయమయిననూ విదీర్ణమవ వచ్చును, కానీ ఎవరికినీ ప్రియా వియోగము ప్రాప్తింపకుండు గాక!".

అయోధ్యా వాసినీ గోపికలు "మొదట మనందరినీ నిరాశ పరిచి మధురాపురమున కేగెను. పిదప తన కుశలము తెలుపుచూ పత్రము పంపించెను. ఆహా! నిర్మోహుల చిత్తము విచిత్రము కదా!"

సుతల వాసినీ గోపికలు "బలి చక్రవర్తి మిక్కిలి భగవద్భక్తుడు, సత్య పరాయణుడు, మహా దానశీలి. ఆయన నుండి పూజా బహుమతులు గైకొని ఆయనను బంధనము కావించెను. అట్టి కపట బ్రహ్మచారి, వామన రూపుడయిన శ్రీహరిని శ్రీలక్ష్మీదేవి కానీ, ఇతర భక్తజనులు సహితము ఎట్లు పూజించు చున్నారు?"

జాలంధర గోపికలు "పూర్వకాల మందు అసుర శ్రేష్ఠుడు, భక్త ప్రవరుడు, కయాధు కుమారుడయిన ప్రహ్లాదునకు ఎన్నో కష్టములు పడవలసి వచ్చెను. ఆప్పుడెప్పుడో తరువాత ఈయన నృశింహరూపము ధరించి సహాయపడెను. ఈయన నిష్ఠురమునకు పరాకాష్ఠ".

భూగోపికలు "నిర్దయులయిన జనుల పోకడ విచిత్రముగ యుండును. అది చెప్ప యోగ్యము కాదు. వారు నోటితో ఒకటి మాట్లాడుదురు. కానీ హృదయముతో వేరొకటి యోచింతురు. అట్టి వారిని దేవతలు సహితము అర్ధము చేసికొనలేరు. ఇక మానవుల మాటేటికి?"

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీకృష్ణుని జ్ఞాపకము తో గోపికల భాషణము అను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(గోపికల ఆక్రందన మరియు వారి నుండి శెలవు తీసికొని ఉద్ధవుడు మధురాపురికి ఏతెంచుట)

బర్హిష్మతీ పురపు గోపికలు "ఆహా! ప్రళయకాల సముద్ర జలముల నుండి కృపాసింధువై మహాత్ముడయిన శ్రీహరి వరాహరూప ధారియై వసుంధరను ఉద్ధరించెను. అదే పృధివిని సంహరించుటకు ఆదిరాజైన పృధువు రూపమున వెంబడించెను. దయాళు వయ్యునూ నిర్దయుడయ్యెను. కృప, కఠినత్వము రెండునూ ప్రకటించుట శ్రీహరి స్వభావము."

లతారూప గోపికలు "పూర్వకాలమందు సముద్ర మధన ఉత్పన్నమయిన విశ్వవైద్యుడు ధన్వంతరి అమృతకలశ హస్తుడై ఉద్భవించి నప్పటికీ, ఆయన ఆ అమృతమును ఎవ్వరికీ ఈయలేదు. ఆ అమృతము కొరకై దేవదానవులు యుద్ధము నారంభించినపుడు, కలహ ప్రియుడయిన శ్రీహరి స్వయముగ మోహినీరూపము ధరించి కేవలము దేవతలకు

మాత్రమే ఆ సుధను పంచెను."

నాగేంద్ర కన్య రూప గోపికలు "దండకారణ్యము నందు శ్రీరామ రూపమునున్న శ్రీహరిని చూచి శూర్పణఖ మోహించి, ఆయనను పతిగా చేసికొనవలెనని సమీపించినది. కానీ ఈయన లక్ష్మణ సహితుడై ఆ అమాయకురాలి నాశికా కర్ణములను త్రుంచి కురూపిని గావించెను. ఇదేమి నిష్ఠురత? ఆ పడతి ఈయనకు ఏమి హాని చేసినది?"

సముద్ర కన్యకా గోపికలు "ప్రతి దినము వేలాది గృహములు జొచ్చి, కోట్లాది జనులకు సుఖ దు:ఖముల నిచ్చు చంచల అయిన శ్రీలక్ష్మీదేవి, శ్రీహరి వద్ద పతివ్రతయై సుశీల యై నిలచినది. ఇది ఎట్లు జరిగినది? ఏమి ఆశ్చర్యము?"

అప్సర రూప గోపికలు "సఖులారా! ఈయనను వలచుట చే రావణ సోదరి నాసికా కర్ణములను పోగొట్టుకొనినది ఆమె విషయము వదలండి. ఈయన మనందరి పై మిక్కిలి కృప జూపించెను. ఎందుకనగా మన నాసికా కర్ణములు స్థిరముగ యున్నవి."

దివ్యరూప గోపికలు "ఈయన బలి చక్రవర్తి నుండి పూజలందుకొని ఆయనను బంధించిన దయాళువు. ముక్తి నాధుడయినప్పటికీ బలిని క్రిందనున్న సుతల లోకమున పారవైచెను. ఈయన ప్రవర్తన ఆశ్చర్య జనకము."

అదివ్య గోపికలు "పూర్వకాలమందు మనువు తన పత్ని అయిన శతరూపతో శాంత భావము తో తపమాచరించు చుండెను. వారికి దైత్యులు మిక్కిలి కష్ఠములు కలిగించిరి. అనంతరము దయానిధి అయిన శ్రీహరి ఏతెంచి వారిని రక్షించెను. తొలుత దు:ఖములిచ్చుట, తరువాత అశ్రువులు తుడుచుట ఈయన స్వభావము."

సత్వ వృత్తి గోపికలు "బాల భక్తులయిన ప్రహ్లాద ధృవాదులు తొలుత మిక్కిలి కష్ఠములు అనుభవించిన తరువాతే దయాళువై శ్రీహరి తన కృపా ప్రసారము చే వారిని రక్షించెను. ఈ దీనవత్సలుడయిన ప్రభువు తొలుత ఎవరినీ రక్షింపడు. కష్ఠములు అనుభవించిన తరువాతనే తన ఆగమనమును ప్రకటించి రక్షించును."

రజోగణ వృత్తిరూప గోపికలు "రుక్మాంగద, అండరీష, హరిశ్చంద్రాది సాధుశిరోమణులైన నరేశ్వరులను సహితము నిశితముగ పరీక్షించి తదనంతరమే తన భగవత్ సమృద్ధిని ప్రసాదించెను. ఇప్పుడు కూడా ఆయన మనను పరీక్షించుచున్నాడేమో!!"

తమోగుణవృత్తి రూపగోపికలు "మోసగాడైన శ్రీహరి పూర్వము బృందాదేవిని మోసగించెను. ఎవరు చేసిన కర్మ వారికే తగులునట్లు, ఆతనినే మోసగత్తె అయిన కుబ్జ మోసపుచ్చెను. కరవాలము, కపటత్వము రెండునూ ఒక ప్రక్క వంకరగ యుండి ఎల్లరకూ గాయములు మాత్రమే చేయును. శ్రీకృష్ణుని రాకకై ఎదురు చూచుచూ, చూచుచూ, మన కన్నులు దుర్భర దు:ఖమును అనుభవించుచున్నవి. ఆయన వచ్చునన్న వ్యవధి వామనుని పాదము వలె పెరిగి పెరిగి పెద్దదగు చున్నది. హృదయము శిధిలమగు చున్నది. పాదములు డస్సిపోయినవి. హా! హతవిధీ!! తిరిగి ఉష:కాలమందు దివ్యాభరణ భూషితుడయిన నంద నందనుని ఎప్పుడు చూసెదము?"

ఈ విధముగ శ్రీకృష్ణ చింతన చేయుచూ, గోపికలు ఉత్కంఠితలై, రోదించుచూ, మూర్ఛితులైరి. నీతికోవిదుడు, వాగ్విదాంవరుడు అయిన ఉద్ధవుడు వారందరినీ ఆశ్వాశించి, వేరు వేరుగా వారందరినీ బుజ్జగించి శ్రీరాధాదేవితో ఇట్లనియె "ఓ! పరిపూర్ణతమా! శ్రీకృష్ణ స్వరూపా! వృషభాను నందినీ! నేను తిరిగి వెళ్ళుటకు అనుజ్ఞ నీయవలసినది. వ్రజేశ్వరీ! మీకు నమస్కృతులు సమర్పించుకొనుచున్నాను. శుభానన! శ్రీకృష్ణ ప్రభువు పంపిన పత్రమునకు ప్రత్యుత్తరమును ఈయవలిసనది. దాని ద్వారా శీఘ్రముగ ఆయన చరణములకు ప్రణామములు కావించి ఆయనను మీ వద్దకు తీసికొని వచ్చెదను." తదనంతరము శ్రీరాధాదేవి పత్రరచనకై లేఖిని చేపట్టి ప్రత్యుత్తరమునకై చింతించుచూ అశ్రుపూర్ణ అయినది.

శ్రీ రాధాదేవి ఎప్పుడెప్పుడు హస్తము లోనికి పత్రమును తీసికొనినదో, వెంతనే తన నేత్రముల నుండి జాలువారుచున్న అశ్రుకణముల చే పత్రములు ఛిద్రములాయెను. శ్రీకృష్ణ లాలస చే అశ్రువులు జాలువారుచున్న కమలనయన అయిన శ్రీరాధాదేవిని ఉద్ధవుడు మిక్కిలి విస్మితుడై అవలోకించి ఇట్లనియె "శ్రీ రాధాదేవి! మీరు ఎట్లు వ్రాయుటకు ప్రయత్నించుచున్నారో, ఈ విషయమంతయూ మీరు వ్రాయకుండగనే నేను శ్రీకృష్ణ ప్రభువుకు నివేదించెదను. ఉద్ధవుని సుభాషితమును వినిన శ్రీరాధాదేవి తక్షణమే బాధారహితయై సమస్త గోపికలతో కలసి ఉద్ధవుని పూజించెను. తదుపరి పరాదేవి, రాసేశ్వరీ, శ్రీరాధికా దేవికి ప్రదక్షిణ సహిత ప్రణామములాచరించి, గోపికా గణములకు వీడ్కోలు పలికి,

అందరికి తిరిగి తిరిగి శిరము వంచి, ప్రణామములాచరించి, రత్నభూషణ భూషిత అయిన దివ్యాదరమునందు ఉద్ధవుడు ఆరూఢుడైయ్యెను. మున్ను ఆయనకు తన బుద్ధి, జ్ఞానములందు మిక్కిలి అభిమానము, అహంకారము యుండెడిది. అవి సర్వమూ పటాపంచలయినవి. ఆయన సంధ్యా సమయమునకు నందుని వద్దకు తిరిగి వచ్చి, మరునాడు సూర్యోదయ సమయమున యశోదాదేవికి నమస్కరించి, నందుని ఆజ్ఞను బడసి, క్రమముగ నవనందులనూ, వృషభానులనూ, ఉపనందులనూ, ఇతర గోపజనములనూ, సంపూర్ణముగ శ్రీకృష్ణ సఖులందరినీ, వేరువేరుగా కలసి, వందనములిడి, వీడ్కోలు పలికి రథమారోహించి అక్కడ నుండి బయలుదేరెను. సమస్త గోప గోపీ జన సముదాయము, ఆయన వెనుక చాలా దూరము వరకూ అనుసరించిరి. ఉద్ధవుడు వారందరినీ స్నేహపూర్వకముగ వెనుకకు మరలించి మధురాపురికి చనెను. ఆ సమయమున శ్రీకృష్ణ ప్రభువు మనోహర యమునా తటమున అక్షయ వటవృక్ష ఛాయలో ఏకాంతముగ కూర్చొని యుండెను. బుద్ధిమంతుల యందు శ్రేష్ఠుడు అయి ఉద్ధవుడు కన్నుల వెంట ఆనంద భాష్పములు జాలువారు చుండగా శ్రీకృష్ణుని గాంచి ప్రదక్షిణ ప్రణామము లాచరించి, ప్రేమాస్పద గద్గద కంఠముతో ఇట్లనియె "మహాప్రభో! మీరు సర్వసాక్షి. మీకు నేను చెప్పగలవాడను కాను. మీరు దయచేసి శ్రీ రాధికాదేవికి, ఇతర గోప గోపీగణములకు కళ్యాణము కావించుటకై మీ దివ్య దర్శనమును ప్రసాదింపవలసినది. "నేను దేవదేవేశ్వరుడయిన శ్రీ కృష్ణుని మీ వద్దకు తీసికొనివచ్చెదనని "ప్రతిజ్ఞ చేసితిని. కృపానిధీ! నా వచనమును సత్యము చేయవలసినది. హే! భక్తవత్సలా! దీనబంధూ! మీరు ఎట్లు రుక్మాంగద, ప్రహ్లాద, బలి, ఖట్వాంగ, అంబరీష, ధృవాది భక్తుల ప్రతిజ్ఞలను నిజము చేసిరో అట్లే నా ప్రతిజ్ఞను కూడా వమ్ము కాకుండా కొమ్ముకాయవలసినది. నన్ను రక్షించండి! మహాప్రభో! నన్ను రక్షించండి!!

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి గోపికల భాషణము మరియు ఉద్ధవుని మధురా ప్రయాణమను పద్ధెనిమిదవ అధ్యాయము సమాప్తము)

పందొమ్మిదవ అధ్యాయము

(శ్రీకృష్ణుని ఉద్ధవ సహితుడై వ్రజభూమి యందు ప్రత్యాగమనము. గోవులు యమునా తటమందు ఆయన రథమును నలువైపులా ముట్టడించుట. గోపకులతో శ్రీకృష్ణుడు ముచ్చటించుట. నంద వ్రజము నందు యశోదానందులు, గోపగోపీ సహితులై మేళతాళములతో శ్రీకృష్ణునికి ఎదుర్కోలు పలకి ఆయనతో కలసి నందవ్రజము చేరుట)

నారదుడు "మహారాజా! ఈ విధముగ పలికిన భక్తుడయిన ఉద్ధవుని పలుకులు విని, భక్తవత్సలుడయిన అచ్యుతుడు తన చే ఈయబడిన వచనమును జ్ఞప్తికి తెచ్చుకొని వ్రజభూమికి వెళ్ళుటకు నిశ్చయించెను. సమస్త కార్యభారమునూ సమర్ధవంతముగ నిర్వహించుటకు బలదేవుని మధుర యందే వదలి, వాయువేగ, మనోవేగ గమనము గల జవనాశ్వములు పూన్చిన సువర్ణ జటిత, కింకిణీ జాలమండిత, భానుతుల్య తేజము గలిగిన తేరునందు ఉద్ధవ సహితుడై, శ్రీకృష్ణ భగవానుడు భక్తులకు దర్శనమిచ్చుటకై నంద వ్రజమునకు పయనమయ్యెను. ఆ మహానుభావుడు గోవర్ధనము, గోకులము, బృందావనములను దర్శించుచూ యమనా తటమును చేరెను. వ్రజేశ్వరుడయిన శ్రీకృష్ణుని చూచుట తోడనే కోట్లాది గోవులు నలువైపుల నుండి పరుగులెత్తుచూ వచ్చి ఆయన రథమును చుట్టిముట్టినవి.

శ్రీహరి యందు ప్రేమ చే వాటన్నిటి పొదుగుల నుండి దుగ్ధధారలు ప్రవహించ నారంభించెను. గోవులన్నియు చెవులు నిక్కబెట్టి, తోకలు ఎత్తి "అంభా" రావము కావింపమొదలిడెను. వాటితో పాటు దూడలు కూడా ప్రస్తుతించెను. ముఖము నందు గ్రాసము నిండి, కన్నులనుండి ఆనంద భాష్పములు స్రవించుచుండెను. వాటన్నిటి వ్యథ, వేదన దూరమయ్యెను. శరత్కాల మేఘములు అరుణుడు, హయముల సహిత సూర్యరథమును ఎట్లు కప్పివేయునో, అట్లే

శ్రీకృష్ణుని చూసినంతనే కోట్లాది గోవులు ఆ రథమును పూర్తిగా చుట్టుముట్టెను. శ్రీకృష్ణ భగవానుడు వాని నన్నిటినీ పేరుపేరునా పిలుచుచూ, తన శ్రీ హస్తము చే వాటి సర్వాంగములనూ నిమురుచూ ఆనంద పరవశుడాయెను.

గోవులన్నియు ఆయన సమీపమునకు పోవుట చూచిన శ్రీదామాది గోపసఖులు తమలోతాము ఇట్లనుకొనుచుండిరి, "సఖులారా! వాయువేగ సమాన్వితము, శతసూర్య శోభాన్వితము, కాంస్య పత్ర ధ్వని చేయగలది, ధ్వజ కలశ సహితము, వందలాది అశ్వములు పూన్చినది అయిన అదరము ఎందువలన వేలాది గోవులచే పరివేష్ఠిత మయినది?"

గోవుల ఆనందము సూచించునదేమనగా ఈ తేరునందు వేరొకరు లేరు, ఖచ్చితముగా సాక్షాత్ నందనందనుడే వచ్చుచున్నాడు. మన కుడి భుజములు అదురుచున్నవి. ఆకాశమున మనపై నీలకంఠ పక్షి సంతోషముగ తిరుగుచున్నది." పరస్పరము ఇట్లు సమాలోచన చేసి గోపబాలకులు సహితము అచటకు చేరిరి. గోపబాలకులు, సాధారణ జనులు తాము పోగొట్టుకున్న గొప్ప వస్తువు తిరిగి దొరికినపుడు ఆ వస్తువును ఎట్లు చూచెదరో, అట్లే తమ మిత్రుడయిన శ్రీకృష్ణుని కాంచిరి. వారిని చూచుట తోడనే పరిపూర్ణ భగవానుడైన శ్రీ కృష్ణుడు రథము నుండి క్రిందకు దుమికి, వారికి ఎదురు వెళ్ళి, కన్నుల వెంట అశ్రుధారలు. కారుచుండగా వారందరినీ వేరువేరుగా, పేరుపేరునా పిలిచి తన హృదయమునకు హత్తుకొనెను. ఆహా! ఈ భూతలము నందు భక్తి యొక్క మహాత్యమును వర్ణించుట ఎవరి తరము? మిధిలేశ్వరా! ఆ గోపబాలురు సహితము ఆనంద భాష్పములు రాల్చుచూ వెక్కి వెక్కి రోదించుట ఆరంభించిరి. వారందరూ కృష్ణ వియోగము చే ఎంత విహ్వలులైరంటే, ఆయనను చూచిననూ మాట్లాడుటకు అసమర్థులైరి. ఆ ప్రేమానందము నందు పూర్ణముగ మునిగిన తన సఖులను శ్రీ కృష్ణ భగవానుడు తన మధుర వచనములు చే ఆశ్వాశించి, ఉద్ధవుని కొందరు గోపబాలురతో నంద వ్రజము కేగి తన ఆగమన వార్తను వారికి తెలియపరచమని పంపగా, ఉద్ధవుడు నంద వ్రజమున కేగి "శ్రీకృష్ణుడు వచ్చుచున్నాడు" అను వార్తను నలువైపులా చాటెను. గోప వల్లభుడు, నందనందనుడు, శ్రీకృష్ణ భగవానుని ఆగమన వార్త వినిన సమస్త గోపకులము సర్వానంద భరితమయ్యెను. ఆయనను సముచితముగ ఆహ్వానించుటకు భేరీ, మృదంగ, పటహాది మేళతాళముతో మధుర గానము చేయుచూ వారందరూ బయలుదేరిరి. బ్రాహ్మణులు వేదమంత్రములు ఉచ్చరించుచూ పూర్ణ కులశము తో ఎదురేగిరి. లాజలు, దర్భలు, మంగళమయ వస్తువులతో మిశ్రితమయిన గంధము, అక్షతలు తీసికొని యశోదా నందులు బయలుదేరిరి. గండస్థలము సింధూర రంజితము, మరియు సువర్ణ శృంఖలములు చే కట్టబడిన మదించిన కుంజరముపైఆశీనుడై వృషభాను వరుడు తన ధర్మపత్ని అయిన కళావతితో కలసి ఆచటకు ఏతెంచెను. నంద, ఉపనంద, వృషభాను, యువక, వృద్ధ, బాల గోపగణము లందరూ హస్తములు యందు పూలమాలలూ, వంశీ, పుష్పగుచ్ఛములు, నెమలి పింఛములతో చేయబడిన వింజామరలు, ధరించి నగరమునకు వెలుపల కేతెంచిరి. గోప బాలకులందరూ శ్రీకృష్ణ దర్శన లాలసులై, హస్తము లందు వంశీ వేత్ర ధారులై, అడవి పంది కోరలు ధరించి, పచ్చని పట్టు పీతాంబరములు కట్టి, హర్షోల్లాసముతో నందనందనుని గుణగానము చేయుచూ, ఆనంద తాండవము గావించుచుండిరి. శ్రీ రాధికాదేవి తన చెలుల ద్వారా శ్రీకృష్ణాగమన వార్తను విని, మహానందముతో, మహోత్సాహముతో శయ్యను వీడి తన దివ్యాభరణముల నన్నింటినీ, పద్మము సుగంధమును వెదజల్లు నట్లు తన సఖులందరినీ పంచిపెట్టెను. గోపాంగనలతో, ఎనిమిది, పదహారు, ముప్పదిరెండు మరియు రెండు యూధములు సఖులతో శ్రీరాధాదేవి మనోహరమయిన శిబికనధిరోహించి శ్రీధరుని దర్శనమునకు ఏగెను.

అట్లే కోట్లాది గోపికలు తమ గృహ కార్యముల నన్నింటినీ ఎక్కడి కక్కడే వదలి ఎగుడుదిగుడుగా వస్త్ర భూషణములు దాల్చి అచట కేతెంచిరి. ముకుందుని యందు ప్రేమ చే వారందరూ వాయువేగమున కదులుచుండిరి. ఆ సమయమున వ్రజమండల మందలి ప్రతి వృక్ష, గో, మృగ, పశు, పక్షి గణములు సహితము శ్రీకృష్ణ భగవానుని కాంచుటకు ఆత్రుతతో వేచియున్నవి.

శ్రీకృష్ణుడు తన దోసిలితో అంజలి ఘటించి యశోదా నందులకు ప్రణమిల్లెను. చిరకాలము తరువాత తమ పుత్ర దర్శనమగుట చే యశోదా నందులు ఆనందభరితులై శ్రీకృష్ణుని భుజములు పట్టుకొని, బలముగ హృదయమునకు అదుముకొని, ఆనందభాష్పముల చే ఆయనను అభిషేకించిరి. యశోదానందుల చిరకాల వాంఛ అప్పటితో తీరెను. నంద, ఉపనంద, వృషభాను మరియు ఇతర గొప్ప, మరియు వృద్ధ గోపకులకు శ్రీకృష్ణుడు ప్రమాణము లాచరించి, వారి

ఆశీర్వాదములు స్వీకరించి, తన సమవయస్కులను ఆలింగనము చే గౌరవించి, తన కంటె పిన్న వయస్కులతో కరచాలనము చేసి వారందరితో ఆశీనుడయ్యెను. తదనంతరము నంద యశోదలను ఒక గజరాజము పై ఆశీనులను జేసి, తాను స్వయముగ రథారూఢుడై, నంద, ఉపనందాది గోపకులందరితో కలసి నందరాజనగర ప్రవేశము కావించెను. ఆ సమయమున దేవతలు పుష్పవృష్టి కురిపించిరి, పురవాసినులయిన గోపాంగనలు లాజలుజల్లిరి. శ్రీహరి తన గృహమును చేరగనే గోపకులు మంగళకరమయిన జయజయధ్వానములు గావించిరి. ఆ సమయమున ఆర్తగోపగణము "నాయనా! నీ సఖుడయిన ఉద్ధవుడు పరమధన్యుడు. ఎందుకనగా ఈతడు మా గోపగణము అంతటికీ జీవన భూతుడువయిన నీ దర్శనమును గావించెను." నారదుడు "నృపేశ్వరా! నీకు పరమపుణ్యకరమయిన శ్రీహరి యొక్క పునరాగమన వృత్తాంతమును వినిపించితిని. ఇది (ఈ శ్రీహరి దివ్య చరితామృతము) దేవాసురులకు సహితము కళ్యాణప్రదము."

(శ్రీ గర్గ సంహిత యందు మధురాఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి "శ్రీకృష్ణుని వ్రజాగమన మహోత్సవము అను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు కదళీవనము నందు శ్రీ రాధా, గోపికలను కలియుట, రాసోత్సవము, రోహితాచలమందు ఋభు మహాముని మోక్షము)

బహుళాశ్వుడు "మహామునీ! సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుడు వ్రజమండలమునకు ఏతెంచిన పిదప ఏఏ లీలలు కావించెను? శ్రీ రాధాదేవి మరియు గోపికలకు ఏ విధముగ దర్శన మిచ్చెను? గోపికల మనోరథము పూర్ణమయిన పిదప ఎట్లు మధురాపురమునకు తిరిగి వెళ్ళెను? విప్రేంద్రా? మీరు పరావరవేత్తలందరి యందునూ పరమ శ్రేష్ఠులు. దయచేసి ఈ వృత్తాంతమును అంతయునూ నాకు విశదీకరింప వలసినది." నారదుడు "సంధ్యాకాలమందు శ్రీరాధాదేవి సంకేతమును పురస్కరించుకొని శ్రీకృష్ణుడు ఎల్లప్పుడూ శీతలముగ యుండు కదళీవనమున ఒక ఏకాంత ప్రదేశమునకేగెను. అచట యమునా నదిని తాకి వచ్చుచున్న చల్లని వాయు తిమ్మెరలు మంద మందముగ చందన సుగంధాది ద్రవ్యముల పరిమళమును మోయుచూ సర్వులనూ మోహ పరవశులను చేయుచున్నవి. పూర్ణిమా సుధాకరుడు చల్లని, తెల్లని, వెన్నెల యను సుధావృష్టిని కురిపించుచుండెను. అటువంటి కదళీవనము సహితము శ్రీ రాధాదేవి యొక్క విరహాగ్ని చే భస్మీపటలము అగుచున్నది. శ్రీకృష్ణుని తిరిగి కలియునను ఒక్క ఆశా కిరణము చే ఆమె నిరంతరమూ రక్షింప బడుచున్నది. ఆచటకు వేలాది గోపికలు శ్రీరాధాదేవి తో కలసి ఏతెంచిరి.

వారందరూ శ్రీ రాధాదేవికి "మాధవుడు వచ్చుచున్నాడు" అని నివేదించిరి. ఆ మాట వినినంతనే సఖులతో కూడియున్న వృషభానుపుత్రి, శ్రీరాధాదేవి వెంతనే లేచి శ్రీకృష్ణుని స్వాగతించుటకు ముందుకు నడచినది. ఆమె శ్రీకృష్ణుని ఆసీనుని గావించి అర్ఘ్య, పాద్య, ఆచమనాదులు సమర్పించి మనోహర ఉపచారములు కావించెను. మిక్కిలి చతుర అయిన శ్రీ రాధికాదేవి శ్రీకృష్ణుని కుశలము గూర్చి సాదరముగ ప్రశ్నించెను. కోటి కోటి తరుణ కందర్ప లావణ్యమును సహితము తిరస్కరించు సౌందర్యమూర్తి అయిన శ్రీహరిని గాంచి శ్రీరాధాదేవి తన హృదయమునున్న శోకభారమును బ్రహ్మబోధ అయిన పిదప గుణముల తాదాత్మ్యమును విడచు జ్ఞాని వలె విడచిపెట్టెను. కీర్తికుమారి అతి ప్రసన్నయై శింగారించుకొనెను. ఆమె శ్రీకృష్ణుడు పరదేశమునకు ఏగి నప్పటి నుండి చందనాది అలకంరణము, సాదుష్ఠ భోజనము, తాంబూల చర్వణము, మరియు హంసతూలికా తల్పమందు శయనములను విసర్జించినది. పరిపూర్ణ భగవానుని ప్రియతమ ఆనందాశ్రువులు కనులనుండి ధారాపాతమై ప్రవహించు చుండగా గద్గద వాణితో ఇట్లనియె.

"ప్రియా! యాదవపురి అయిన మధుర ఎంతోదూరము కాదే! అయిననూ ఇంతవరకూ రాకపోవుటకు కారణమేమి?

అచట నీవు చేయుకార్యము లేవి? నేను నా ఏకాంత దు:ఖమును ఎట్లు తెలుపుదును? నీవు సర్వసాక్షివి. నీకు తెలియనిది లేదు. సౌదాసుని రాణి మదయంతి, నలుని ప్రియభార్య అయిన దమయంతి, మిధిలారాజ నందిని అయిన సీతాదేవి, వారెవరూ ఇచట లేరు. మరి ఎవరి వద్ద నా గోడు మొరపెట్టుకొనవలెను? ఈ గోపాంగనల పరిస్థితి నా కంటే ఆధ్యాన్నముగ యున్నది. వారు సహితము దు:ఖ నివృతి పట్ల నిపుణత లేనివారు. చకోరము శరత్కాల మేఘము కొరకూ, మయూరము వర్షాకాల మేఘము కొరకూ, ఎట్లు అర్రులు చాచునో అట్లే బృందావన చంద్రుడవయిన నీ కొరకు నేను ఉత్కంఠితనై యున్నాను. నీ సఖుడయిన ఉద్దవుడు ధన్యుడు. ఆయన నీ దర్శనము చేయించెను."

ఈ విధముగ పలుకుచూ రోదించుచున్న శ్రీలక్ష్మీ స్వరూప అయిన శ్రీరాధాదేవిని కాంచి శ్రీకృష్ణుని అంగాగములు కరుణా తరంగితమయినవి. ఆయన నేత్రముల నుండి సహితము అశ్రుధారలు ప్రవహించినది. ఆయన తక్షణమే ఆమె భుజములు పట్టి తన వైపు లాగుకొని హృదయమునకు హత్తుకొనెను. శ్రీకృష్ణ భగవానుడు "శ్రీరాధా! శోకింపవలదు. నేను నీ ప్రేమ వలననే (కోసమే) వ్రజభూమికి ఏతెంచితిని. మన మిరువురము వేరుకాదు. పాలు, వాని ధవళత ఒక్కటైనట్లే మన తేజస్సు కూడా ఒకటే! నేను ఎచట యున్ననూ అచట నీవు కూడా విరాజమాన మగుదువు. మన వియోగము సాధ్యము కానిది. నేను పూర్ణ బ్రహ్మమును. నీవు పరాశక్తివి. మన ఇరువురి మధ్యా వియోగము అనునది మిధ్యాజ్ఞానము. వరాననా! ఈ సూక్ష్మత్వమును తెలిసికొనుము-ఆకాశమున విహరించ వాయువు సర్వత్రా వ్యాపించి యుండును. అట్లే జలము సూక్ష్మరూపముతో సర్వత్రా వ్యాపించి యుండును. కాష్ఠము నందు అగ్ని యున్నట్లు, లోపల, వెలుపల యున్న భూమి కూడ సర్వత్రా వ్యాప్తి చెందియున్నది. అట్లే నేనునూ నిర్వికార భావముతో సర్వవ్యాప్తి నై యున్నాను. ఎట్లు జలము వివిధ రంగులతో కూడిన దయినప్పటికీ, వాని నుండి వేరుగా యుండును. అట్లే నేనునూ త్రిగుణాత్మక భావ సంపర్కముతో ఉన్నట్లు కనిపించినప్పటికీ నేను ఎన్నడూ అసంపర్కుడనే!!! ఈ విధముగ నీవు నా స్వరూపమును చూచుట ప్రారంభించి అర్ధము చేసికొనుము. దానిచే నీకు ఎల్లప్పుడు ఆనందము కలుగును. సుముఖీ! కేవలము "నేను" "నాది" అను రెండు భావనల ద్వారా ఈ చరాచర జగత్తునందు ద్వైత కల్పన జరుగుచున్నది. సూర్యుని వలన ఉత్పన్నమయిన మేఘము సూర్యుని పధమునకు అడ్డుగా వచ్చినప్పుడు, సూర్యుడు అదృశ్యుడగును. అట్లే ప్రాకృతిక వస్తువులు పరదావలె నిలిచినపుడు తన స్వస్వరూప మయిన పరమాత్మను చూచుట జీవాత్మకు అశక్యమగును."

"ఈ త్రిగుణముల అవరణ పూర్తిగా తొలగిన పిదప మాత్రమే పరమాత్మ సాక్షాత్కారము జరుగును. మనస్సు, గుణములు ప్రాకృతిక విషయ వాంఛల యందు అసక్తమయిన చో అది బంధకరము. అదే మనస్సు పరమ పురుషుడయిన పరమాత్మ యందు సంలగ్నమయినేని అదే మోక్షకారకమగును. ఈ విధముగ మనసునకు బంధమోక్షములు కారణములు తెలుపబడినవి. అందువల్ల మనస్సును జయించి భూతల మందు అసంగముతో జీవించవలెను. లోకము నందు మనోసంబంధములు ఇరువైపుల నుండి యుండును. ఒకవైపు నుండి యుండదు. ఉండలేదు. కానీ నిష్కళంక ప్రేమ అట్లుకాదు. ప్రేమతో ఎవరినైననూ, ఎంతైననూ ఒక వైపునుండి ప్రేమించవచ్చు. దానికి అవధులు లేవు. నీవు నా యందు అటువంటి నిష్కలంక ప్రేమను పెంపొందించు కొనుము. నన్ను పొందుటకు ఈ సృష్టియందు నిష్కళంక ప్రేమను మించిన సాధనము మరియొకటి లేదు."

మాధవుని దివ్య వచనములను వినిన శ్రీరాధాదేవి గోపికా సహితురాలై శ్రీకృష్ణుని సంపూర్తిగా పూజించెను. తదనంతరము కార్తీక పూర్ణిమ నాటి రాత్రి యందు శ్రీరాధికా గోపికల సహితుడై మాధవుడు రాసమండలమందు ఉపస్థితుడై మురళిని వాయింప నారంభించెను. యమునా తటము నందు రాస రంగభూమి యందు వ్రజాంగనలు, రాధాసహితుడయిన మురహరి అందరూ మనోహరముగ శోభించుచుండిరి. రాసము నందు ఎంతమంది గోపికలు గలరో, అంతమంది శ్రీకృష్ణుల రూపము ధరించి బృందావనాధీశుడయిన శ్రీహరి దివ్య బృందావనమందు విహారము గావించెను. వారి చరణముల యందలి నూపుర మంజీరములు చిత్ర విచిత్రముగ మ్రోగుచుండెను. నీలి మేఘకాంతిశాలి అయిన శ్రీహరి నటవర వేషమున సుశోభితుడై యుండెను. వక్షము నందు అత్యంత ప్రకాశవంతమయిన కౌస్తుభమణి, కర్ణములకు కుండలములు, ప్రకాశించుచుండగా ఆయన రాధా సహితుడై రతీమన్మధుల వలె వెలుగొందిరి. స్వర్గము నందు శచీ పురంధరులు, ఆకాశము నందు చపలా మేఘములు ఎట్లు ప్రకాశించెదరో, అట్లే బృందవనము నందు

శ్రీరాధా మాధవులు విరాజిల్లు చుండిరి.

ఆ శ్రీపతి బృందావనము, యమునాతీరము వనములు, ఉపవనము శోభను ఇనుమడింప చేయుచూ గోపీ సముదాయము తో గోవర్ధన పర్వతము పైకి ఏగెను. ఇంతలో ఒక విత్రము జరిగెను. శతయూధ గోపికలకు తమయందు అహంకార ముదయించెను. ఇది గమనించిన శ్రీహరి శ్రీరాధా సహితుడై హఠాత్తుగా అచట నుండి అంతర్ధానుడయ్యెను. ఆయన గోవర్ధనమునకు మూడు యోజనముల దూరమున గల చందన భరితమయిన రోహితాచలమున కేగెను.

ఆయన శ్రీరాధా సహితుడై అచటనున్న సుందర కుంజ నికుంజనములను దర్శించుచూ, సరస సల్లాపములు సలుపుచూ, సువర్ణ రంజితమయిన, మృదులతల కాలవాలమయిన పర్వత సానువుల యందు విహరించ నారంభించెను. అచట బదరీనాధుని చే నిర్మింపబడిన రమణీయమయిన సరుస్సు గలదు. (దేవ సరోవరము). అందు మత్స్యములు, కచ్ఛపములు, మొసళ్ళు మొదలగు జలచరములు, హంస, కారండవ, సారసాది జల పక్షులు విహరించుచున్నవి. భ్రమరములు ఘంకారము చేయుచున్న సహస్రదళ పద్మములతో ఆ సరస్సు శోభిల్లుచున్నది. ఆ తటము నందు కమల సుగంధ భరితమయిన వాయువు మంద మందముగ వీచుచూ వాతావరణమంతయు మిక్కిలి ఆహ్లాద కరముగ యున్నది. ఆ తరుణమున రమాస్వరూప అయిన శ్రీ రాధికా సహితుడై శ్రీ కృష్ణుడు ఆ సరోవరపు ఒడ్డున కూర్చుండెను.

అచటనే ఋభు మహర్షి అరువది ఆరువేల సంవత్సరముల నుండి నిరాహారియై, నిర్జలుడై యుండి శాంత భావముతో నిరంతర శ్రీ కృష్ణ తత్పరుడై ఒంటికాలిపై నిలుచుని తపమాచరించు చుండెను. శ్రీరాధా కృష్ణులు ఆయనను చూచిరి. శ్రీ రాధాదేవి "ఈయన ఎవరు?" అని ప్రశ్నించగా శ్రీహరి " ప్రియా! ఈయన మన భక్తుడు. ఈతని మహతత్వమును పెంపొందించుము. ఆ మహాముని యొక్క భక్తిని గమనించుము," అని పలికి ఉచ్ఛస్వరము చే "ఓ! ఋభూ! అని పిలిచెను. కానీ ఆముని తురీయావస్థ యందు అలౌకికానందము ననుభవించు చుండుట చే ఆ శుభ వచనము వినలేదు. అంత శ్రీహరి కొలది కాలము ఆ ముని హృదయము నుండి బయల్వెడలెను. మహర్షి తన హృదయము నందు శ్రీకృష్ణుని కానక అత్యంత విస్మితుడై రెండు కన్నులూ విప్పి, ఎదురుగా ఉపస్థితులై, దశదిశలా ప్రకాశింపజేయుచున్న శ్రీరాధాకృష్ణులను కాంచెను. పరమ హరిభక్త పరాయణుడయిన ఆ మహర్షి వెంటనే లేచి శ్రీ రాధాకృష్ణులకు నమస్కరించి, పరిక్రమ కావించి, శిరస్సు వంచి, వారి పాదములపై బడెను. తదుపరి అత్యంత గద్గద వాణితో ఇట్లనియె "శ్రీ రాధాకృష్ణులకు సమస్కారము. మీరిరువురు భూభార హరణమునకు అవతీర్ణులై నాకు శాంతి ప్రసాదించుటకు ఇచ్చటకు విచ్చేసిరి. పరిపూర్ణతములయిన మీరిరువురికి నమస్కారము. ఘనశ్యామునకు, శ్యామాకు, రాసేశ్వరీ, రాసేస్వరులకు, గోలోకాతీత లీలా విలాసిని, లీలావతి శ్రీ రాధకు మరల, మరల నమస్కారము. అసంఖ్యాక బ్రహ్మాండాధిపతీ, సతులకు నమస్కారము." ఈ విధముగ పలుకుచూ; కన్నుల నుండి ఆనంద భాష్పములు రాల్చుచూ, వారిరువురి పాదములపై బడి ప్రాణత్యాగము చేసెను. ఆ సమయమున ఆయన శరీరము నుండి దశ సూర్యుల కాంతి వెలువడి దిశలను ప్రకాశింపజేయుచూ శ్రీకృష్ణుని యందు లీనమయ్యెను. ఆ మునీంద్రుని ప్రేమ భక్తి కి మిక్కిలి సంతుష్టుడయిన శ్రీహరి తన కన్నుల నుండి అశ్రువులు కార్చుచూ ప్రేమాతిశయముతో ఆ మునీంద్రుని పిలచెను.

అంతట శ్రీ ఋభు మహర్షి శ్రీకృష్ణుని సారూప్యుడై ఆయన పాదములు నుండి తిరిగి ఉద్భవించెను. ఆ సమయమున ఆ ముని కోట్లాది కందర్ప సౌందర్యాతిశయము కలిగి యుండి, మిక్కిలి వినయముతో, అవనిత శిరస్కుడై నిలుచుండెను. కరుణానిధి అయిన శ్రీకృష్ణుడు ఆ మునీంద్రుని భుజములు పట్టుకొని, హృదయమునకు హత్తుకొని, ఆశ్వాశించి, తన దివ్య కళ్యాణమయ హస్తమును ఆయన మస్తకము పై నుంచెను. తదుపరి ఈ మునీంద్రుడు శ్రీ రాధాకృష్ణులకు ప్రమాణ పరిక్రమలు కావించి ఒక మనోహర దివ్య విమానము నధిరోహించి, దిశలను తన తేజస్సుతో ప్రకాశింప జేయుచూ గోలోక థామమునకు చనెను. ఋభు మహర్షి పరాముక్తిని కాంచిన వృషభాను నందిని విస్మయమెంది శ్రీకృష్ణుని ఇట్లు ప్రశ్నించెను.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖంగార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి ఋభు మోక్షము అను ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(శ్రీకృష్ణుని ద్రవరూప ప్రసంగమందు నారదుని ఉపాఖ్యానము)

శ్రీ రాధాదేవి "మాధవా! ఈ మునీంద్రుడు నీపై అమిత ప్రేమ కలిగిన భక్తుడు. అందువల్ల ఈ ముని శ్రేష్ఠుడు ధన్యుడు. ఈతడు నీ సారూప్యమును పొందెను. మరియు నీవునూ ఈతని కొరకై అశ్రుధారలు కార్చితివి. పాపనాశనా! ఈ దివ్యుని తపోమహిమ చే ఈతని శరీరము ఇంకనూ అత్యంత నిర్మలముగ యున్నది. అందువలన ఈ శరీరమునకు దహన సంస్కారములు కావింపవలసినది." శ్రీ రాధాదేవి ఈ విధముగ పలుకుచుండగనే, ఆ మహర్షి శరీరము ఒక నది రూపముగ మారి ప్రవహింప ఆరంభించినది. రోహితా చలమందు ఆ నది ఇప్పటికీ కానపట్టు చున్నది. ఒక మహర్షి శరీరము నదిగా మారుట గమనించిన శ్రీ రాధాదేవి విస్మితయై నందరాజ తనయునితో ఇట్లనియె "శ్యామసుందరా! ఈ మహర్షి శరీరము నదిగా ఎట్లు మారినది? దయచేసి నా సంశయమును తీర్పవలసినది." భగవానుడు "రంభోరూ! ఈ మునీశ్వరుడు ప్రేమలక్షణ భక్తి సంయుక్తుడు. అందువలన ఈతని శరీరము ద్రవీ భూతమయినది. ఇంతకు మున్ను నా శరీరము సహితము ఎట్లు ద్రవీభూతమయినదో, అట్లే మనమిరువురము వర మొసగుటకు ఏతెంచుట గమనించిన మునీంద్రుడు అత్యంత హర్షోల్లోసాహితుడై (హర్ష, ఉత్సాహ, ఉల్లాస హితుడై) ద్రవీభూతుడాయెను.

శ్రీరాధాదేవి మిక్కిలి విస్మితయై "దేవదేవా! దయానిధీ! నీవు ఎప్పుడు, ఎట్లు ద్రవీభూతుడవయినావు? ఈ విషయము నాకునూ విచిత్రముగ తోచుచున్నది. నాకు ఈ వృత్తాంతమును విస్తారముగ వివరింపవలసినది. భగవానుడు "ఈ విషయమునకై ఒక ప్రాచీన ఆఖ్యానము యున్నది. దీనిని వినినంత మాత్రమున పాపములు సర్వ నాశనమగును. పూర్వకాలమందు చతర్ముఖ బ్రహ్మ నా నాభికమలము నందు ఉదయించి ప్రాకృతిక జగత్తును సృష్టించుట నారంభించెను. ఆతడు తన తపస్సు మరియు నా వరదానము చే అత్యంత శక్తిశాలిగ యుండెను. ఒకానొక సమయమున సృష్టికర్త అయిన బ్రహ్మదేవుని ఒడియందు ఒక సుందర పుత్రుడు "నారదుడు" ఉదయించెను. ఆతడు నా భక్తులయందు ఉత్తముడై, త్రిలోక సంచారియై సర్వ లోకములు భ్రమణము చేయుచూ నా నామ, పద, కీర్తన విస్తరిల్లజేయుచుండెను.

ఒకనాడు బ్రహ్మదేవుడు నారదుని గాంచి "మహామతీ! ఈ వ్యర్థ సంచారమును ఆపి సృష్టి చేయవలసినది." ఆ పలుకులు విని జ్ఞాన మార్గ పరాయణుడయిన నారదుడిట్లనియె "తండ్రీ! నేను సృష్టి చేయజాలను. ఎందుకనగా అయ్యది శోక మోహములను కలుగజేయును. నేను కేవలము శ్రీహరి యందు భక్తి, ఆయన పై కీర్తన చేయుదును. మీరు కూడ సృష్టి వ్యాపారము చే మిక్కిలి వ్యాకులు లగుచున్నారు. అందువలన మీరు సహితము సృష్టికర్మ విరమించుకొన వలసినది." అంత బ్రహ్మదేవుడు కుపితుడై "దుర్మతీ! నీవు ఒక కల్పము వరకూ గంధర్వుడవై పూర్ణముగ భోగలాలసుడవు కమ్ము" అని శపించెను. శ్రీరాధాదేవీ! ఈ విధముగ శపించబడిన నారదుడు "ఉపబర్హణుడను" గంధర్వ చక్రవర్తిగ జన్మించి, దేవలోకమందు గంధర్వ రాజ్యపదవిని ఆధిరోహించెను. ఒకనాడు సుందర స్త్రీ పరివృతుడయిన ఉపబర్హణుడు బ్రహ్మలోకమున కేగి స్త్రీ సంగము నందు మనసుయున్న కారణమున "భేతాళ గీతములు" ఆలపించెను. అంత బ్రహ్మదేవుడు తిరిగి కుపితుడై "మూర్ఖుడా! నీవు శూద్రుడవు కమ్ము" అని శపించెను. ఈ విధముగ ఆతడు దాసీ పుత్రుడై జన్మించి తిరిగి సత్సంగ కారణమున తిరిగి బ్రహ్మ పుత్రత్వమును పొందెను. తిరిగి భక్తి భావము చే ఉన్మత్తుడై త్రిభువన సంచారము చేయుచూ విష్ణుపద కీర్తన చేయసాగెను. నారద మునీంద్రుడు వైష్ణవుల యందు శ్రేష్ఠుడు, నాకు అత్యంత ప్రియుడు, మరియు జ్ఞానసూర్యుడు. ఆతడు నిరంతరము నాయందు మనసు లగ్నము చేయు పరమ భాగవతోత్తముడు."

ఒకానొక దినము గాన తత్పరుడయిన నారదుడు సంచారము చేయుచూ "ఇలావృత్త ఖండమున" కేగెను. అచట జాంబూఫల రసము చే ప్రకటమయిన శ్యామల వర్ణ జాంబూనది ప్రవహించుచున్నది. అంతేకాక అచట జాంబూనదమను సువర్ణము సహితము ఉత్పన్నమగును. ఆ దేశము నందు రత్నమయ ప్రాసాదయుక్తము, మరియు దివ్యమయిన స్త్రీ పురుషులు నివసించు "వేదనగరమ"ను నగరము కలదు. కానీ చిత్రమేమనగా అచటి పురజనులందరూ

వికలాంగులై యుండిరి. వారందరికీ కాళ్ళు, వ్రేళ్ళు, గోళ్ళు, ఉదరపు క్రింద భాగము లేక, భుజహీనులై, హస్త హీనులై వివిధ రకములయిన వికలాంగత్వము తో బాధపడు చుండిరి. ఈ విధముగ అంగభంగమయిన జనులను నారదుడు అవలోకించి "అహా! ఇది ఏమి చిత్రము? మీరందరి ముఖములు పద్మములు పోలియున్నవి. మీ వస్త్రములు మరియు శరీరములు దివ్యములు. మీరు దేవతలో, ఉపదేవతలో, లేక ఋషి శ్రేష్ఠులో అయి యుండవలెను. మీరు రమణీయ సంగీతము నందు సంలగ్నులై యున్నారు. మీ కందరకు అంగభంగ మెట్లైనది? దయచేసి తెలుప వలసినది." అంత వారు దీన వదనులై ఇట్లనిరి "మహామునీ! మేము రాగములము. వేదపుర నివాసులము. మాకు అంగభంగ మెట్లైనదో తెలిపెదము. హిరణ్యగర్భ బ్రహ్మదేవునికి "నారదుడు" అను పుత్రుడు కలిగెను. ఆతడు ఉన్మత్తుడై నిషిద్ధ సమయములందు ధృవ పదములు గానము చేయుచూ తిరుగు చుండెను.

"వాని యొక్క స్వర, తాళ రహిత, సమయ రహిత గానము చే మాకందరకూ అంగభంగ మయినది." అది విన్నంతనే నారదునికి గర్వభంగమై ఆతడు రాగములతో ఇట్లనియె "రాగ గణములారా! నారద మునికి ఏ ప్రకారముగ స్వరయుక్తమయిన రాగ తాళముల జ్ఞానము లభించును?" రాగములు "సాక్షాత్ వైకుంఠనాధుని ప్రియభార్యల యందు ముఖ్యురాలైన సరస్వతీదేవి నారదునికి బోధించిన ఎడల ఆ ముని ఏ రాగము ఏ సమయమందు ఏ తాళ సహితముగ గానము చేయవలెనో తెలిసికొనును."

ఈ విధముగ రాగములు హృదయమును గ్రహించిన దీన వత్సలుడయిన నారదుడు సరస్వతీ కృపా కటాక్ష సిద్ధికై "శుభ్రగిరి" చేరి అచట ఒక వంద దివ్య సంవత్సరములు దుష్కర తప మాచరించెను. ఆతడు జలపానములను వర్జించి, సరస్వతీ ధ్యానము నందు మునిగి పోయెను. నారదుని దివ్య తపము చే "శుభ్రగిరి" అప్పటి నుండి "నాదరగిరి" గా ప్రసిద్ధి నొందెను. పర్వతమంతయు ఆయన తపస్సుచే పవిత్రమాయెను. ఆ సమయమున సాక్షాత్ వాగ్దేవత అయిన సరస్వతీదేవి ప్రత్యక్షమయ్యెను.

అంత నారదుడు లేచి ప్రదక్షిణముగా పరిక్రమణము ఆచరించి ఆ దేవి యొక్క గుణ, రూప, మాధుర్యములను ఈ విధముగ కీర్తించెను "బాల సూర్య తేజస్సుతో దీపించు కిరీట, కేయూర, కుండలముల తో ప్రకాశించునది, ఘల్లు ఘల్లు మను నూపుర రవములతో రంజిల్లునది, కోటి పూర్ణ చంద్రుల మించిన దివ్య ముఖారవిందము కలది, అయిన సరస్వతీ దేవికి నమస్కరించుచున్నాను. చంచల చరణ, చంపుటములు గల కలహంస పై విహరించునది, అనేక నిర్మల ముత్యముల హారములు ధరించునది, సౌభాగ్యశాలిని అయిన సరస్వతీ దేవికి ప్రణామములాచరించుచున్నాను. ఎవరు తన చతుర్ హస్తముల యందు వరద, అభయ ముద్రలు, వీణా పుస్తకములు ధరించునో, అట్టి జగన్మాత, బ్రహ్మమయీ, శుభదాయినీ మరియు మనోహర అయిన సరస్వతీ దేవికి ప్రణమిల్లు చున్నాను. శ్వేతవర్ణ కెరటముల వంటి తెల్లని దుకూలములు కట్టిన, మంగళ స్వరూపిణి అయిన సరస్వతీ మాతా! నాకు తాళ స్వర జ్ఞానము ప్రసాదింపవలసినది. అందువలన నేను సర్వోత్కృష్ఠ రాస మండలమందు అద్వితీయ సంగీతజ్ఞుడ నగుదును."

శ్రీ కృష్ణుడు "శ్రీరాధికా! నారదుని చే చేయబడిన ఈ సరస్వతీ స్థుతి అజ్ఞానమును నాశనము చేయునది. ఎవరు ప్రతి దినము లేచి ప్రాత: సమయమున ఈ స్థోత్రమును పఠించెదరో వారు ఈ లోకమున మిక్కిలి విద్యాధికులగుదురు."

ఈ స్థవము చే మిక్కిలి ప్రసన్న అయిన వాగ్దేవత మహాత్ముడయిన నారదునికి భగవద్దత్తము, స్వరబ్రహ్మ విభూషితము అయిన ఒక వీణను (మహతి) ప్రసాదించెను దానితో పాటు రాగ రాగిణులు, వాని పుత్రులయిన దేశ కాలాది భేదములు, తాళ, లయ, స్వర భేదముల, జ్ఞానమును ప్రసాదించెను. ఏబది ఆరు కోట్ల భేదములు, అసంఖ్యాక అవాంతర భేదములు, నృత్య, వాదన, మూర్చన మొదలగు సమస్త జ్ఞానమును నారదునికి సాంగోపాంగముగ ప్రసాదించి, స్వర గమ్య సిద్ధ పదముల ద్వారా నారదునికి శిక్షణ నిచ్చెను. ఈ విధముగ నారదునికి సంగీత శిక్షణ నిచ్చి, రాసమండలమునకు ఉపయుక్తమగు అద్వితీయ రాగోద్భావకుని కావించి, సరస్వతీ దేవి తన స్వలోకమునకు అరిగెను.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండాగ్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి నారదోపాఖ్యానము అను ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(నారదుడు అనేక లోకముల తిరుగుచూ గోలోకమునకేగి శ్రీకృష్ణ భగవానుని సమక్షమున తన సంగీత కళా చాతుర్యమును ప్రదర్శించుట. శ్రీకృష్ణుడు ద్రవరూపుడగుట)

భగవానుడు "శ్రీరాధా! ఈ రాగరూప మనోహరమయిన దివ్య గుహ్య సంగీత జ్ఞానమును ఎవరికి ఉపదేశింపవలెనని తనలో తాను తర్కించుకొనుచూ నారదుడు గంధర్వలోకము చేరెను. అచట "తుంబురుడు" అను గంధర్వుని తన శిష్యునిగా చేసికొని నారదుడు మధుర స్వరముతో వీణాయుక్తుడై నా గుణగానము చేయనారంభించెను. అంతట ఆయన హృదయము నందు ఒక జిజ్ఞాసమంకురించెను." ఈ సంగీతమును వినుటకు పాత్రులెవ్వరు? ఎవని ఎదుట నేను ఈ గానము చేయవలెను?" అని ఆలోచించి తొలుగ దేవలోకమునకేగి ఇంద్రుని ఎదుట గాన మారంభించెను. కానీ ఇంద్రుడు ఆ దివ్యానందమును అనుభవింపకుండుట గమనించి రాగ రాగిణిలు నిరూపణమునకై తుంబుర సహితుడై సూర్య లోకమున కేగెను. కానీ సూర్య భగవానుడు, ఆదిత్యుడు ఎప్పుడూ పరుగులెత్తుట గమనించి, తన ఆలోచన విరమించి ఆచట నుండి కైలాసమున కేగెను. అచట మహాదేవుడయిన పరమశివుడు, భూతనాధుడు, నిశ్చల ధ్యానమగ్నుడై యుండుట గమనించి, అచటనుండి బ్రహ్మ లోకమున కేగెను. అచట సృష్టికర్త అయిన బ్రహ్మ సృష్టిరచన యందు నిమగ్నుడై, వ్యగ్రుడగుట కాంచి ఆచటి నుండి వైకుంఠ ధామమున కేగెను. అచట భక్త వత్సలుడు, విష్ణు భగవానుడు తన భక్తులను రక్షించుటకై పరుగులెత్తుట కాంచి అచటి నుండి నారదుడు తుంబుర సహితుడై ఇతర ప్రదేశముల కేగెను.

శ్రీకృష్ణుడు "వృషభాను నందినీ! సంతజనులు త్రిలోకముల వెలుపల, లోపల కూడా తిరుగగలరు. కర్మలంపటులు అటువంటి గతి నందలేరు. నారద మునీంద్రులు కోట్లాది బ్రహ్మాండ సమూహములను లంఘించి, గోలోక ధామము ప్రవేశించెను. ఉత్తుంగ తరంగిత అయిన విరజానదిని దాటి, భ్రమర గుంజిత రమణీయము, సదా వసంత ఋతు యుక్తమయిన బృందావనము చేరెను. ఆచటి దివ్య మంద మారుతము చే సంతుష్టుడై, అచటి నుండి గోవర్ధన పర్వత దర్శనము గావించి, నా నికుంజ ప్రవేశము చేసెను. నికుంజ ద్వారమున సఖులు "మీరిరువురెవరు ఎవరు? ఎక్కడనుండి ఏతెంచిరి? ఇచట మీ కార్యమేమి?" అని ప్రశ్నించిరి. అందుకు వారు "సందరీమణులారా! మేము గాన విద్యా విశారదులము, గాన కుశలురము. సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీ రాధావల్లభుడు శ్రీకృష్ణునునకు మా గానము వినిపించుటకు ఏతించితిమి."

"మేము వంది జనములందు ఉత్తములము. మా వచనములను శ్రీకృష్ణ భగవానునికి నివేదించ వలసినది." అంత వారిరువురినీ శ్రీకృష్ణ ప్రభువు ఆజ్ఞ మేరకు శ్రీకృష్ణ నికుంజము నందు ప్రవేశపెట్టిరి. ఆ ఆంగనమంతయూ కౌస్థుభ మణి పరివేష్టితమై మనోహరమయిన వింజామరలు కదలాడుచుండగా, మెరయుచున్న ముత్యాల జల్లులు కూర్చబడిన ఛత్రములు పట్టిన కోట్లాది దివ్య సఖులచే నిండి కోటి సూర్య కాంతితో తేజరిల్లు చుండెను. అందు మహా పద్మమయాసనమందు శ్రీరాధాదేవి సహితుడై శ్రీకృష్ణ ప్రభువు వారికి దర్శనము నిచ్చెను. విరిరువురు శ్రీరాధాకృష్ణులకు పరిక్రమ ప్రమాణములాచరించి శ్రీకృష్ణాజ్ఞచే ఆశీనులై ఆయనను స్థుతించి ఆయన గుణగానము చేయుటకు ఉద్యుక్తులయిరి. దేవదత్తమయిన స్వరామృత వీణను మీటుచూ తుంబుర సహితుడయిన నారదుడు తన అద్వితీయ గాన కళా కౌశలమును ప్రదర్శించెను. నేను (శ్రీకృష్ణుడు) అత్యంత సంతుష్టుడనై వీణా మధురిమ యందు లీనమై, శిరసునూపుచూ, ఆ అనిర్వచనీయమయిన ప్రేమభక్తికి వశీభూతుడనై నన్ను నేను సమర్పించుకొని జలరూపధారి నైతిని. నా దివ్య శరీరము నుండి వెలువడిన జలమును "బ్రహ్మ ద్రవము" గా లోకులు నెరుంగదొడగిరి. ఈ ద్రవము నందు కోటి, కోటి బ్రహ్మాండములు తేలియాడుట నారంభించి, ఇంద్రాయణ ఫలరూపమున వ్యక్తమయినవి."

"శ్రీరాధా! ఈ బ్రహ్మాండము "పృశ్నిగర్భ" మను పేర ప్రసిద్ధి కెక్కినది, ఎందుకనగా ఇది నా త్రివిక్రమావతారము నందు నా పాద ఘాతము చే భేదనమొందినది. ఈ భేదనము చే బ్రహ్మద్రవము ఈ బ్రహ్మాండమున ప్రవేశించినది. ఆ జలమునే పూర్వులు పాపహారిణీ, స్వర్ధునీ, గంగ లని నుడివిరి. ఈ గంగ ఏ ద్యులోకమున "మందాకినీ" అనియు, భూతలమున "భాగీరథి" అనియు, పాతాళమున "భోగవతి" అనియు ప్రసిద్ధి నొందినది. ఒక గంగ యే త్రిపథగామిని యై మూడు నామములతో విఖ్యాతి నొందినది. వినీతుడై పవిత్ర భావము తో ఇందు స్నానమాచరించు పుణ్యులకు అడుగు అడుగునకూ ఒక అశ్వమేధ, రాజసూయ యాగ ఫలితము లభించుచుటలో అతిశయోక్తి ఎంతయునూ లేదు. ఎవరు వందలాది యోజనముల దూరము యున్ననూ "గంగ-గంగ" అని ఉచ్చరించినంత మాత్రమున వాని సర్వ పాపములు పరిత్యజింపబడి, ఆతడు విష్ణులోకము కేగును. కలియుగము నందు గంగా దర్శనము చే వంద జన్మలు, జల పానము చే రెండు వందల జన్మలు, స్నానము చే వేయి జన్మలు పాప పరిహారమగును. గంగా దర్శనము చేయువాని జన్మ ధన్యము, లేని యెడల వ్యర్థము."

"రంభోరూ! శ్రీరాధా! ఎట్లు విరజ నీ యందలి భయముచే ద్రవరూపమును ప్రాప్తించినదో, ఎట్లు విరజ యొక్క ఏడుగురు పుత్రులు ఏడు సముద్రములుగ ద్రవీభవించిరో, ఎట్లు విష్ణువు "కృష్ణానది" స్వరూపుడయ్యెనో, ఎట్లు మహాదేవుడు, శివుడు "వేణీ" నదిగ మారెనో, ఎట్లు బ్రహ్మ "కుకుద్మినీ గంగ" గా రూపుదాల్చినో, ఎట్లు అప్సరసలు "గండకీ" నదిగా రూపాంతరము చెందిరో, అట్లే ఈ ఋభువునూ బ్రహ్మీభావ ప్రాప్తినొందెను. ఇది కేవలము ఋభుని ప్రేమ లక్షణ భక్తి భావము చే సంభవమయ్యెను. ఏ మనుష్యుడు ఈ పాపహారకమయిన ఋభు పవిత్ర చరిత్రను శ్రవణము చేయునో ఆ పుణ్యజీవి లోకములను లంఘించి నీ గోలోక ధామము చేరును."

నారదుడు "మహారాజా! ఈ విధముగ శ్రీహరి శ్రీరాధాదేవికి ఋభు చరిత్రను తెలిపి పిమ్మట వారిరువురు ఆ ఆశ్రమము నుండి మాలతీ వనమున కేగిరి. తదనంతరము గోపికల విరహ వేదన తెలిసి, భక్త వత్సలుడయిన శ్రీకృష్ణుడు శ్రీరాధాసహితుడై తిరిగి యమునా తటమున కేతెంచెను. తక్షణమే సమస్త గోపికల వ్యధ, వేదన దూరమయ్యెను. మెరుపుతీగలు మేఘములను హత్తుకొనునట్లు వారు ఘనశ్యాముని తమ హృదయములకు హత్తుకొనిరి. అనంతరము శ్రీహరి సుందర యమునా తటము నందు సుమధుర వంశీనాదము చేయదొడంగెను. భగవానుని మధుర రాగముచే గోపికలు మూర్ఛిల్లిరి. నదీ గమనము ఆగెను. పక్షులచలములయినవి. సమస్త దేవతలు మౌనులయిరి. దేవనాయకులు స్థబ్దులయిరి. వృక్షముల నుండి మధువు పారుట మొదలిడెను. సర్వ జగత్తు నిద్రయందు నిమగ్నమయ్యెను. నిశీధి వేళ యందు రాసము గావించి, శ్రీరాధిక మరియు గోపికల మనోరధము పూర్ణము గావించి బ్రహ్మ ముహూర్తమందు శ్రీకృష్ణుడు నంద భవనమునకు ఏతెంచెను. గోపికలతో, శ్రీరాధికాదేవి తన ఆనందమయ మనోరధము పూర్ణము గావించుకొని వృషభాను వరుని సుందర మందిరమునకు ఏగెను.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖంగార్గతమయిన నాదర బహులాశ్వ సంవాదము నందలి నారదోపాఖ్యానము అను ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ఇరువది మూడవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు వ్రజభూమి నుండి మధురా పురమునకు పునరాగమనము)

నారదుడు "మహారాజా! ఈ విధముగ శ్రీకృష్ణుడు వ్రజభూమి యందు అనేక దినములుండి, అందరినీ తన దర్శనము చే కటాక్షించి, మధురాపురమునకు ఏగుటకు ఉద్యక్తుడాయెను. నవ నందులు, నవ ఉపనందులు, ఆరుగురు

వృషభానులు, మరియు వృషభానువరుడు, నందరాజాది ప్రముఖులను, కళావతీ, యశోదా, మరియు ఇతర గోపాంగనలను, విడివిడిగా కలసి, జ్ఞానాశ్వాశనముల నొసంగి, వారికి వీడ్కోలు పలికి చంచలాశ్వములు పూన్చిన తన రథము నధిరోహించి, మధురానగరమున కేగుటకై నంద వ్రజము నుండి బయల్వెడలెను. ఆయన వెనుక చాలా దూరము వరకూ జనులు వెళ్ళిరి. వారు మాధవుని విరహము తాళజాలకుండిరి. ఎవరికైననూ భూమండలమందు ఒక్క పర్యాయము విష్ణు దర్శనము కలిగెనేని ఆయనను విడచుట దుస్సహము కదా! మరి ప్రతిదినము ఆయన దర్శనము చేయువారలకు ఆయన విరహము ఎంత దు:ఖతరము? అది వర్ణనాతీతము.

మూయలేని కనులతో శ్రీధరుని, ముఖార విందమును అవలోకించుచూ సమస్త వ్రజవాసులు, స్నేహ సంబంధ కారణమున పరమ విహ్వాలులై ఇట్లనిరి "శ్రీకృష్ణా! నీవు తొందరగా తిరిగి వచ్చి మమ్ము రక్షింపవలసినది. పూర్వకాల మందు దేవతలచే అమృత పానము చేయించినటుల మాకు నీ దర్శన సుధాపానమును కావింప వలసినది. మహాప్రభూ! కేవలము నీవు మాత్రమే యశోదానందులకు ఆనంద ప్రసాదుడవు మరియు వ్రజవాసుల జీవనాధారము. నీవు మాత్రమే వ్రజవాసుల యొక్క నిధి, గోపకులదీపకుడవు మరియు మహాపురుషుల మనసును సహితము మోహింపచేయు మదన మోహనుడవు. తాపాగ్నిచే జ్వలించుచున్న జీవులకు శీతల జలము లభ్యమయినపుడు, మిక్కిలి శీతల పీడితులయిన ప్రాణులకు ఉష్ణము ప్రాప్తించినపుడు, జ్వరార్తునకు సరియైన ఔషధము లభించినపుడు, మరణము ఆసన్నమయిన మానవునకు అమృతము ఉపయుక్తమయినపుడు ఎట్లు వారి ప్రాణములు నిలుచునో, అట్లే సమస్త వ్రజవాసులకు నీ దర్శనము చేతనే ప్రాణములు నిలుచును. అందువలన నీవు ఇచటనే యుండవలసినది. ఈ విషయము నందు ఏమి/ఎంత చెప్పిననూ లాభము ఏమున్నది?"

మా ఇహ, పూర్వ జన్మములందు లవలేశమయిన పుణ్యము యున్న ఎడల, దాని ఫల స్వరూపము చే మా చిత్తము లెల్లప్పుడూ నీ చరణారవిందములందు సులగ్నమగునట్లు ఆశీర్వదింపుము. ఎవరి చిత్తము నీ పాదాబ్జముల యందు లగ్నమైయుండునో, వారు నీకు అత్యంత ప్రీతిపాత్రులు. నీవు ప్రకృతికి పరుడవయిన నిర్గుణుడవయిన్పటికీ నీ భక్తుల కోసమై సగుణరూపుడవగుచున్నావు. నీకు లక్ష్మీ, బ్రహ్మ, శివాది దేవతల కంటె నీ భక్తుల యందే ప్రీతి. ఎవరు బ్రహ్మ పదము వంటి కోరికలను వదలి భక్తవత్సలుడవయిన నిన్ను నిష్కామభావముచే నిరంతరము భజింతురో, ఆ భక్తియుతులు మాత్రమే శాంతి మరియు నిరపేక్ష సుఖమును పొందెదరు." ఈ విధముగ పులకుచూ వారందరూ శ్రీ కృష్ణుని వీక్షించుచూ, ఆనందాశ్రువుల యందు మునిగి రోదించసాగిరి. వారి విహ్వలతను కాంచిన భక్తవత్సలుడు భగవానుడు శ్రీకృష్ణుని నేత్రముల నుండి అశ్రుబిందువులు అంకురించెను. భగవానుడు ఆ విరహ విహ్వల గోపాలురతో ఇట్లనియె "వ్రజవాసులారా! మీరందరూ నా ప్రాణ ప్రియులు. నా శరీరము అన్యత్రాయున్ననూ, నా హృదయము ఎల్లప్పుడూ మీ కడనే యుండును. నేను ప్రతిమాసము మిమ్ములను చూచుటకు, దర్శనమిచ్చుటకు అవశ్యము ఏతెంచెదను. ఇది నా ప్రతిజ్ఞ. నేను మనసుతో ఎల్లప్పుడూ మీకు అతి చేరువలో యందును. మనసే సర్వమునకు కారణభూతము. ఓ! గోపగోపీజనులారా! యాదవులతో యుద్ధ మొనరించుటకు జరాసంధుడు మోహరించి యుండెను. అందువలన యదు వంశీయులకు సహాయభూతుడనై యుండుటకు నేను వెళ్ళుచున్నాను. శోకింపవలదు. "ఈ విధముగ గోపకులను వివిధరీతుల ఆశ్వాసించి, యశోదానందులను, శ్రీదామాది సఖులను వేరొక రథముపై ఆరూఢులను చేసి వెనుకకు పంపి, తాను ఉద్ధవుని తో వేరొక తేరునధిరోహించి కార్యకారణ భగవానుడు మధురకు చనియెను. ఆయన రథము, హయములు, పతాకము, ధూళి కనిపించినంత వరకూ, అదే దిశను ఆశగా చూచుచూ వ్రజవాసులందరూ అక్కడే నిలబడి పిదప వెనుకకు తిరిగిరి. శ్రీకృష్ణ పరమాత్మ ఈ ఉత్తమ చరిత్ర మనుజుల మహాపాపములను సహితము హరించును. ఏ భక్తవరుడు భూతలమందు ఈ వృత్తాంతమును ఆలకించునో, అట్టి ఉత్తమోత్తముడు తప్పక గోలోక ధామము చేరును.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ కృష్ణా గమనము అను ఇరువది మూడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది నాల్గవ అధ్యాయము

(బలదేవుని చే కోల దైత్యుని వధ; బలదేవుని గంగాయాత్ర; మాండూక దేవుని కి వర ప్రదానము మరియు భవిష్యత్ సూచన; గంగా తీర్థముల యందు స్నానదానములు పూర్తిచేసి తిరిగి మధురాపురము ప్రవేశించుట)

బహుళాశ్వుడు “మహామునీ! గోప గోపీ సముదాయమునకు దర్శనమిచ్చి శ్రీకృష్ణుడు తిరిగి వచ్చిన పిదప మధురాపురి యందు ఆ దివ్య సోదరులు ఏఏ లీలలు గావించిరి? శ్రీకృష్ణ బలరాముల చరిత్ర మధురాతి మధురము. పుణ్య ప్రదము. పాప హరణము. చతుర్విధ పురుషార్థ ప్రదాయకము.”

నారదుడు “మహారాజా! ఇపుడు శ్రీకృష్ణ బలరాముల వేరొక వృత్తాంత వర్ణనము కావింతును. వినుము. ఒకనాటి ఉదయము “కోలుడు” అను దైత్యుని చే పీడింపబడుచున్న కేశారని పురపు (కౌసాంబీ) జనులు, నాగరికులు, బ్రాహ్మణ సహితులై, దీనులై మధురాపురమున కేతెంచిరి. ఆ సమయము నందు రోహిణీ నందనుడు, బలరాముడు వేగవంతమయిన అశ్వము నదిరోహించి, కొలది మంది జనులతో వేట నిమిత్తమై నగరము వెలుపల కేగుచుండెను. మార్గమధ్యము నందు కేశారని పురపు వాసులు ఆయనను చూచి, ప్రణామములు గావించి, విధి విధానముగ పూజించి, ఆయన పదముల పై వ్రాలి గద్గద స్వరముతో ఇట్లు విన్నవించిరి. “మహాబాహూ! బలరామా! మహాబలీ! దేవదేవా!! మేమందరమూ కోలదైత్యుని చే పీడింపబడి మిమ్ములను శరణుజొచ్చు చున్నాము. కోలుడు కంసుని సఖుడు. ఆ మహాబలుడు కౌశాంబీ మహారాజును ఓడించి, ఆయన రాజ్యమును చేజిక్కించుకొని పరిపాలించు చుండెను. కౌశాంబీ మహారాజు ఆ దైత్యుని యందు భీతి చే గంగా తటమున కేగి జితేంద్రియుడై, తన రాజ్యప్రాప్తికై, మీ పద కమలములను భజించుచున్నాడు. ఆ ప్రభువు మమ్ములను కన్న బిడ్డల వలె పరిపాలించెను. ఆయన సంరక్షణ యందు మేము ఎంతో సుఖముగ యుంటిమి. ఇపుడు దుష్టకోలుడు మమ్ములను నిరంతరము బాధించుచున్నాడు. మహాబలీ! మీరు త్రిలోకవిజయుడయిన కంసుని పరిమార్చిరి. కానీ కోలుడు బ్రతికి యున్నంతవరకూ కంసుడు జీవించియే యున్నాడని తలుపవలయును. మీరు ప్రకృతికి పరులయినప్పటికీ భక్తరక్షణకై సగుణరూపము స్వీకరించి యున్నారు. మహాప్రభూ! మీరు మా కౌశాంబీ మహారాజునకు సహాయ మొనర్చ వలసినది.”

ఆ వచనములు వినిన బలరాముడు తక్షణము గంగా యమునా మధ్యన గల కౌశాంబీ నగరమునకు ఏగెను. బలరాముడు యుద్ధ సన్నద్ధుడై ఏతెంచెనన్న వార్త వినిన ప్రచండ పరాక్రముడు కోలుడు పది అక్షౌహిణీ సేనా వాహినిని తీసికొని నగరము వెలుపల కేతెంచెను. ప్రళయకాల సముద్ర ఘోష వలె గర్జించుచూ ఆ సేన ఒక నదీ ప్రవాహము వలె వచ్చుచున్నది. చంచలముగ యున్న హయములే ఆ నది యందలి ఉత్తుంగ తరంగములు. రథ, గజములే అందలి మకర, తిమింగలాది జలచరములు. వీరయోధులే (పదాతి సైన్యము) ఆ తరంగములు నండి ఎగసిపడు జల రేణువులు. ఆ సేనా వాహినిని చూచి బలదేవుడు హలమును బిగించి, హలాగ్రము చే ఆ సేనా వాహినిని ఈడ్చి, ముసలముల ప్రహారము చే నుగ్గు నుగ్గు గావింప మొదలిడెను. ఆయన తీవ్ర ప్రహారములచే చతురంగ బలములు రణభూమి యందు మగ్గిన తాటిపండ్ల వలె పడి దరాశయన మయ్యెను. కోట్లాది సేనావాహిని అంతయు తుత్తునియలు కావింపబడెను. మిగిలిన వీరులందరూ భీరులై పలాయనము చిత్తగించిరి. కోలుడు శస్త్రధారియై ఒంటరిగా బలరాముని తో కదన మారంభించెను.

దైత్యుడు బలరాముని వైపు తన కుంజరమును ఉసికొల్పెను. ఆ గజరాజు కుంభస్థలి గోమూత్రముచే శుద్ధి చేయబడిన సింధూరము మరియు కస్తూరి చే పత్రరచన చేయబడి, కటిబంధము రత్నఖచిత స్వర్ణ సంకెలతో కావింపబడెను. గండ స్థలము నుండి మదజలము కారు చుండెను. ఆ మహాగజము చతుర్దంతియై, కదలుచున్నపుడు భయంకర ఘంటారావము చేయుచుండెను. ఆ మదగజము శరీరము ప్రశయకాల మేఘ సన్నిభమై, అత్యంత నల్లగ ప్రకాశించుచూ, పర్వతాకారము తో అతి భయంకరముగ శోభిల్లుచుండెను. కోలదైత్యుడు తీక్షణమయిన అంకుశము తో ఆ మహాకుంజరపు కర్ణముపై ప్రహరించెను. ఆ విధముగ ప్రబోధితమయిన ఆ మహానాగము తనపైకి పరిగెత్తుట గమనించిన బలదేవుడు

తన ముసలము తో ఆ మదగజముపై ఇంద్రుడు పర్వతముల పై వజ్రాయుధమును ప్రయోగించునట్లు ప్రహరించెను. ఆ ఘాతమునకు ఆ మదపుటేనుగు రోకలిపోటుకు మృచ్ఛకటకము బ్రద్దలగునట్లు ఛిన్నాభిన్నమయ్యెను. కోలుని ముఖము వరాహముఖమును పోలియుండును. ఎర్రని నేత్రములు కల కోలుడు క్రిందపడెను. తిరిగి లేచి బలదేవుని పై పదునైన శూలము విసరెను, కాని బలదేవుడు దానిని తన ముసలము చే ముక్కలు ముక్కలు గావించెను. అంత ఆ దుష్టదైత్యుడు వేయి బారువులు బరువు గల గదను తీసికొని బలదేవుని వక్షస్థలము ను భేదించుటకు ప్రయత్నించెను. ఆ ఘాతమును ఓర్చి సంకర్షణుడు కోలుని శిరముపై బలముగ ముసలము తో ప్రహరించెను. కొలుని శిరము ముక్కలై రణభూమి యందు పడెను. అయిననూ తిరిగిలేచి బలదేవుని బలముగా ముష్టిఘాతముతో బాధించి అంతర్ధానుడై దైత్యమాయను ప్రయోగించెను.

అంతట జపాపుష్పముల వంటి ఎర్రని రక్త బిందువులు వర్షపు ధారలుగ కురియు నారంభించెను. అటు పిదప ఆ కాలమేఘములు అసహ్యకరమయిన వస్తువులయిన మాంసము, మూత్రము, మదిర, అమేధ్యము, క్రొవ్వు, మజ్జ మొదలగునవి వర్షింపనారంభించెను. ఈ విపరీత వృష్టి చే అన్నివైపులా హాహాకారములు చెలరేగినవి. ఆ దైత్యుని ద్వారా ప్రయోగింపబడిన మాయను ఛేదించుటకు, శ్రీకృష్ణానుజుడు, బలదేవుడు తన ముసలమును విసరెను. ఆ ముసలము సమస్త శస్త్రా స్త్రములను ఛేదించునది, మరియు సుదృఢమైన అష్టధాతు నిర్మితమయినది. అది వంద యోజనములు నిడివి కలిగి ప్రళయాగ్ని వలె ప్రజ్వరిల్లు చున్నది. ఆ ముసలము ఆకాశమునకేగి సమస్త మేఘరాశిని విదీర్ణము కావించినది. ఇంతలో బలదేవుడు తన హలాయుధమునెత్తి ఎల్లరునూ క్రిందికి ఈడ్చి, నిహతులను గావించెను. ఆ దైత్యుని మాయ నాశనమగుటచే కోలుడు కానబడెను. అంత బలరాముడు తన ఉద్దండ బాహు దండముల చే కోలుని భుజములను పట్టి బాలకుడు దూదిపింజను పట్టినట్లు పట్టి, త్రిప్పి త్రిప్పి బలముగ నేలపై విసరెను.

ఆ దైత్యుని పతనము చే సాగర, వన, పర్వత సహితమయిన వసుంధర ఒక ఘడియ సేపు కంపించెను. దైత్యుని దంతములు విరిగి, నేత్రములు బయటకు వచ్చి, మూర్ఛితుడై మృత్యువున కతిథి అయ్యెను. ఈ సమయమున ధరణీ, స్వర్గములందు జయ జయ ధ్వానములు మిన్నుమట్టెను. దేవ దుందుభులు మ్రోగి పుష్పవృష్టి కురిసినది. ఈ విధముగ శ్రీకృష్ణానుజుడు కోలుని సంహరించి, కౌశాంబీ పురమును తిరిగి కౌశారిని మహారాజునకు తిరిగి సమర్పించి గర్గాచార్యాది ప్రముఖుల తో భాగీరథి యందు స్నానాదులాచరించుటకు ఏగెను. అయన చే కావింపబడిన ఈ కార్యము కేవలము లోకసంగ్రహార్ధమే!

గర్గాది ఆచార్యలు మంగళమయ వేద మంత్రోచ్ఛారణ చేసి ఆయన చే గంగా స్నానము కావింపజేసిరి. అంత బలదేవుడు బ్రాహ్మణులకు ఒక లక్ష ఏనుగులు, రెండు లక్షల రధములు, ఒక కోటి హయములు, వంద కోట్ల అధిక క్షీరము ను స్రవించు గోవులు, వంద కోట్ల బారువుల రత్న సువర్ణములు దానము చేసి మధురాపురమున కేగెను. బలదేవుడు గంగానది యందు స్నానమాచరించిన ప్రదేశము "రామతీర్ధము" అనుపేర ప్రసిద్ధి నొందినది. ఏ మనుజుడు కార్తీక మాసము నందు లేక కార్తీక పూర్ణిమ నాడు రామ తీర్ధము నందు స్నానమాచరించెనేని ఆతనికి హరిద్వార స్నానము కంటె వంద రెట్లు పుణ్యాధికము లభించును. బహుళాశ్వుడు "మహామునీ! రామతీర్ధము కౌశాంబికి ఎంత దూరమున కలదు?"

నారదుడు "మహారాజా! రామతీర్ధము కౌశాంబికి ఈశాన్యమున నాలుగు యోజనములు దూరమున, శూకర క్షేత్రమునకు వాయువ్యమున నాలుగు యోజనములు దూరమున, కర్ణ క్షేత్రమునకు ఆరు క్రోసులు, నలక్షేత్రమునకు ఆగ్నేయముగ అయిదు క్రోసులు దూరముననూ, వృద్ధకేశి, సిద్ధ పీఠము మరియు బిల్వకేశ వనమునకు పూర్వదిశగా మూడు క్రోసుల దూరమున యున్నది.

పూర్వము వంగదేశమును "ధృడాశ్వుడు" అను మహారాజు పరిపాలించుచుండెను. ఆతడు రోమశ మహర్షి కురూపమును గాంచి ఎల్లప్పుడూ హేళన చేయువాడు. ఒకసారి ఆ మహాముని క్రుద్ధుడై "ఓరీ! దుష్టుడా! నీవు వికృతమయిన శూకర ముఖుడయిన అసురుడవు కమ్ము" అని శపించెను. ఆ విధముగ ధృడాశ్వ మహారాజు "కోలుడు" అను శూకర ముఖాసరునిగా మారెను తదుపరి బలదేవుని చే పరిమార్చబడుట చే కోలుడు పరమ మోక్షము పొందెను.

అనంతరము బలరాముడు ఉద్దవాది ముగ్గురు మంత్రులచే పరివేష్ఠితుడై "జహ్ను తీర్ధము"న కేగెను. ఆ పవిత్ర స్థలి యందు జహ్నుమహర్షి కుడి కర్ణము నుండి గంగాదేవి ప్రాదుర్భవించెను. ఆ బ్రాహ్మణ శిరోమణి జహ్నువు యొక్క

నామము నుండి గంగాదేవి "జాహ్నవి" గా ప్రసిద్ధిచెందెను. అచట తిరిగి బ్రాహ్మణులకు దానము లొసగి ఆ రాత్రి వారందరూ అచటనే నిద్రించిరి. అచట నుండి పశ్చిమము నకు పయనించి పాండవులకు అత్యంత ప్రియమయిన "ఆహార స్థానము" అను ప్రదేశమును చేరిరి. అచటనూ బ్రాహ్మణులకు మృష్టాన్న భోజనము, మరియు తగిన దానములు సమర్పించి తిరగి పయనమై మాండూకదేవుని వద్ద కేగిరి.

మాండూకదేవుడు అనంతుని కృపా కటాక్ష సిద్ధికై కఠోర తపమాచరించెను. ఆయన కొరకై బలదేవుడు తనవారితో కలసి అచటకేగెను. ఆయన శిరస్సు పైకెత్తి, ఏక పాదము పై నిల్చొని, నిశ్చల నిమీలిత నేత్రుడై, హృదయము నందు బలదేవుని కాంచుచూ, బలభద్రుని నిజ దర్శన కాంక్షియై తీవ్ర తపమాచరించు చుండెను. బలదేవుడంత మాండూకదేవుని హృదయము నుండి బయటకు కదలెను. వెంఠనే మాండూకుడు కన్నులు తెరచి తన ఆరాధ్య దైవమయిన అనంతుని ఎదురుగ కాంచెను. బలదేవుడు వనమాలా విరాజితుడై, ఏక కర్ణమందు కుండల ధారియై, మిక్కిలి గౌరవర్ణుడై, తాళ చిహ్నాంకితమయిన రధము నుండి ఆరూఢుడై యుండెను. మాండూకుడు అనంతదేవుని దర్శించి మిక్కిలి భక్తితో ఆయన పాదములపై పడెను. సంకర్షణుడు ఆతని మస్తకముపై తన సుహస్తమునుంచి, ఏదేని వరము కోరుకొన మనెను.

అంత మాండూకుడు "స్వామీ! మీరు నాయందు ప్రసన్నులు అయిన యెడల, నేను మీ అనుగ్రహమునకు పాత్రుడయిన ఎడల, శ్రీశుకదేవుల ముఖార విందము నుండి వెలువడినది, సమస్త కలిదోష నివారిణి అయిన భాగవత సంహితను నాకు ప్రసాదింపవలసినది." బలదేవుడు "అనఘా! నీకు ఉద్ధవుని ద్వారా భాగవతము ప్రాప్తించును కలి యుగము నందు భాగవత కీర్తన సర్వాధిక మహత్యమును ప్రసాదించును." మాండూకుడు "స్వామీ! ఉద్ధవునకు భాగవతసుధ వినిపించు అధికారము భగవానుడు ఎట్లు/ఎందువలన ప్రసాదించెను? మరియు నాకు ఉద్ధవుని తో సంయోగము ఎప్పుడు కలుగును? దయచేసి నా సందేహ నివృత్తి కావింపవలసినది."

బలదేవుడు "మాండూకా! నేను పరమ గోప్యము, మహాఅద్భుత రహస్యమును నీకు చెప్పుచున్నాను. ఇపుడు కూడా ఉద్ధవుడు విరాజమానుడైయున్నాడు. నీవు ఆతని దర్శనము కావింప వలసినది. ఈతని ఉత్తము దర్శనము నీకు పరమార్ధమును ప్రసాదించును. కానీ ఈనాడు తీర్ధయాత్రావసరమున ఇపుడు నీకు ఉపదేశము కాదు. కానీ నీకు ఎట్లు భాగవత సంహితా ఉపదేశము జరుగునో చెప్పెదను. వినుము. ఈతడు (ఉద్ధవుడు) సంహితా జ్ఞాన స్వరూపుడు. నందాది వ్రజవాసులు, మరియు గోపాంగనలు ప్రీతి కొరకు శ్రీకృష్ణ భగవానుడు ఉద్ధవుని తన ప్రతినిధిగా పంపెను. భగవానుడు ఉద్ధవునకు తన రూపము, సాధన సంపత్తి, తన స్వభావము, భగవత్తత్వము, గుణములు సహితము అర్పించెను. శ్రీకృష్ణుడు ఉద్ధవుని తనను గా తలెచెను. శ్రీకృష్ణుడు తన అంతరంగిక రహస్యములు ఉద్ధవునికి తప్ప వేరొకరికి ఈయలేదు. ఆయన ఉద్ధవుని యందు తన అభిన్నతను ప్రకటించెను. వ్రజవాసులు సహితము ఈతనిని సాక్షాత్ శ్రీకృష్ణునిగా పూజించిరి. ఈతడు వసంత, గ్రీష్మ ఋతువులందు వ్రజభూమి యందు సంచరించి, శ్రీరాధాదేవికి మరియు శ్రీరాధాకుండము వద్దగల లోకులకు శాంతిని ప్రసాదించెను. అంతేకాక ఈతడు గోవులకు, నందాది గోపులకు, యశోదాది గోపాంగలనకు కూడా "వియోగార్తిహారి" గా ప్రసిద్ధి నొందెను. ఈతడు మంత్రుల యందు కుశలుడు, మరియు పార్షదులందు అగ్రగామి. భగవానుడు తన అవతార పరిసమాప్తి వేళయందు ఉద్ధవునకు తన పరమాద్భుత తేజమును సహితము ప్రసాదించును. అందువల్ల ఈతడు ముద్రికాధారి (భగవంతుని గూర్చి ఏ విధముగ నైననూ ప్రవచించు అధికారము కలవాడు) యై వెలుగొందును. ఈతడు బదరికాశ్రమము నందు విరాజమానుడై ధర్మనందనునకు భగవద్రహస్య భోదన గావించును. అర్జునాది ప్రభృతులకు భగవద్వియోగము చే కలుగు విపరీత పీడా నివారణమును ఉద్ధవుడే కావించును. మధుర నందు వజ్రనాభుడు యాదవులకు ఉత్తరాధికారి అగును.

శ్రీకృష్ణ పౌత్రులకు, మరియు ఆయన మహారాణులకు కలుగు భగవద్వియోగ వేదనను దూరము చేయు కార్యమునకు ఉద్ధవుడే నియుక్తుడగును. కౌరవ కులమందు "పరీక్షిత్" అను విఖ్యాతుడగు రాజు ఉదయించును. ఆతనికి జనమే జయుడు అను అత్యంత తేజస్వీ అయిన తనయుడు కలుగును. ఆతడు తన పిత్రు శత్రువయిన "తక్షక" నాగ కుల నాశనమునకై సర్పయాగ మొనరించును. ఇందు సందేహము లేదు. ఆతనికి కూడా సమస్త యజ్ఞ సామాగ్రి ఉద్ధవుని వలననే ప్రాప్తించును. ఆ సమయము నందు దివ్య భాగవత పురాణ శ్రవణమగును. అందు ఉత్తమ సాత్విక ప్రవృత్తి గల జనులు పాల్గొందురు. భగవద్భక్తులందు శ్రేష్ఠుడు, బ్రహ్మర్షి, అయిన ఆస్తీకుని ద్వారా సర్పయాగము ఆపబడును. జనమేజయ మహారాజు ఋత్విక్కులకు పూజన మొనర్చి వంద గ్రామములు అగ్రహారములుగ దానమిచ్చును.

తదనంతరము ఆచార్య ప్రవరుడయిన శ్రీ ప్రసాదుని ఆజ్ఞ మేరకు జనమేజయ మహారాజు సూకర క్షేత్రమున కేగి ఒక మాసము అచట నివసించును. ఆ తీర్థము నందు అనేక విధములయిన గోవులు, గజములు, హయములు, రత్నములు, దివ్య వస్త్రములు, అనేక రకములయిన మృష్టాన్న భోజనములు దానము నిచ్చును. అనంతరము ఆచార్య సహితుడై అచటి నుండి బయలుదేరి గంగాతటము నందలి తీర్థములన్నింటినీ సేవించుచూ, సత్పురుషులకు నిలయమయిన "శయాన నగరము"న కేతెంచును. అచటనే గుర్వాజ్ఞను సేకరించి, అశ్వమేధయాగమును దిగ్విజయముగ పూర్తి గావించి ఏక ఛత్రాదిపత్యము గ రాజ్యమును పాలించును. పిదప గురుదేవుని శరణుజొచ్చి శయాన నగరము నుండి "తూర్పునకు పయనించి రమణీయ గంగాతటి యందు ఏకాంతవాసి యై తీర్థసేవనము చేయును. అచట ధార్మికులయిన మనుజుల యందు భవరోగ వినాశిని అయిన భాగవత కథ జరుగును. ఆ పూర్ణ సమాజము నందు నీవు కూడా పాల్గొని భాగవత శ్రవణము చేయుదువు. అది వినిన పిదప నీకు నిర్మల పద ప్రాప్తి కలుగును. నీవు నా కొరకు తపించితివి. అందువల్ల నీకు ఈ రహస్యమును వెల్లడించితిని. ఈ విధముగ మాండూకదేవునకు వరమొసంగి సేవక సహితుడై బలదేవుడు నిష్క్రమించెను.

శుద్ధ శయాననగర ఈశానము నందు గంగాతటము నందు ఒక రమణీయ స్థానము కలదు. అది కంటక తీర్థమునకు ఉత్తరముననూ, పుష్పవతీ నదికి దక్షిణము గనూ, ఒక క్రోసెడు విస్తీర్ణము నందు కలదు. ఆచట యుండి బలదేవుడు మిక్కిలి ప్రసన్నుడై పదివేల హయములు, వంద రథములు, ఒక వేయి గజములు, పది వేల గోవులు దానముగ సమర్పించెను. అచటకు సమస్త దేవతలు, ఋషులు మునులు కూడా ఏతెంచిరి.

వారందరూ సంకర్షణుని పూజించి ఇట్లు స్థుతించిరి, "ఓ! హలాయుధా! మహాప్రభూ! మీరు కోలదైత్య, మరియు గార్ధభాసుర వినాశకులు. ముసలాస్త్రధారా! సౌందర్యస్వరూపా! తాళధ్వజ ధారకా! మీకు నమస్కారము." ఇట్లు స్థుతించు చున్న వారిని అందరినీ చూచి సంకర్షణ భగవానుడిట్లనియె" మీ మీ అభీష్ఠములు తెలిపి వరములు కోరుకొనవలసినది." బ్రహ్మర్షి దేవతలు ఇట్లనిరి "భగవన్! ఎప్పుడెప్పుడు మేము ఆపదలయందు పడి మీ చరణములను స్మరించెదమో అప్పుడప్పుడు మీ ఆజ్ఞచే మా బాధలు నశించుగాక!". బలదేవుడంత "ఎప్పుడెప్పుడు మీరు నన్ను శరణుజొచ్చి స్మరించెదరో అప్పుడు తప్పనిసరిగా ఈ కలియుగమందు రక్షించెదను. ఇది నా శపథము! అంతేకాక ఈ స్థలమందు ముని జనులు నన్ను పూజించి వరప్రాప్తి నొందిరి. అందుచే ఈ ప్రదేశము "సంకర్షణ స్థానము" అను పేర ప్రసిద్ధి నొందును. ఈ స్థలమందు ఎవరు గంగా స్నానము చేసి దేవతాపూజ, బ్రాహ్మణులకు దానము, భోజనము, విష్ణుపూజ చేయుదురో వారి జీవనము భూతలము నందు సఫలమగును. వారు దేవతా లోకముల కేగుదురు. వారి మనసునందు గల అభీష్ఠసిద్ధి తప్పక కలుగును." తదుపరి బలరాముడు తన వారితో కలసి మధురకు మరలెను. కోల రాక్షసుని వధ, పిదప గంగాస్నానాది కృత్యములు కేవలము ఆయన లోక సంగ్రాహార్థము ప్రాయశ్చితముగ కావించెను. ఏ మనుజుడు బలరాముని ఈ వృత్తాంతములు వినునో ఆతడు సమస్త పాపముల నుండి ముక్తుడై పరమగతి ప్రాప్తినొందును.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి "కోల దైత్య వధ" అను ఇరువది నాలుగవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఐదవ అధ్యాయము

బహుళాశ్వుడు "మునీంద్రా! భగవానుడు నిత్యము నివసించు మధురాపురి ధన్యము. ఈ మధుర యొక్క దేవత ఎవరు? ద్వారపాలకులెవరు? దీని రక్షకులెవరు? చారులెవరు? మంత్రిప్రవరులెవరు? ఏ ఏ మనుజులు ఈ దివ్యపురి యొక్క సేవనము చేసిరి? దయచేసి నాకు వివరింప వలసినది." నారదుడు "మహారాజా! సాక్షాత్ పరిపూర్ణ భగవానుడయిన శ్రీహరి యే మధురాపురికి దేవత. కేశవ దేవుడు అచటి క్లేశనాశకుడు. భగవానుడు ఒక పర్యాయము తన "వరాహమూర్తి"

ని కపిలుడు అను బ్రాహ్మణునకు ప్రసాదించెను. కపిలుడు ప్రసన్నుడై అద్దానిని దేవరాజైన ఇంద్రుని కిచ్చెను. సమస్త లోకములను రోదింపచేయు రాక్షసరాజు రావణుడు దేవతలను జయించి ఆ మూర్తిని స్థవనము చేసి, పుష్పక విమానమందుంచి, లంకకు తొడ్కొని పోయెను. రాఘవేంద్రుడయిన శ్రీరామచంద్రుడు రావణుని జయించి ప్రయత్నపూర్వకముగ ఆ మూర్తిని ఆయోధ్యాపురికి తెచ్చి ప్రతిదినము పూజింపసాగెను. తదుపరి ఆయన సోదరుడు శత్రుఘ్నుడు ఆయనను పూజించి ఆయన ఆజ్ఞచే ఆ వరాహ విగ్రహమును మధురాపురికి తెచ్చి, మిక్కిలి భక్తి శ్రద్ధలతో ప్రతిష్ఠించి అర్చింపనారంభించెను. అప్పటి నుండియు మధురా వాసులందరూ వరదాయకుడయిన వరాహదేవుని పూజింపనారంభించిరి. ఆ కపిల వారాహుడే శ్రేష్ఠ మంత్రిగా భావింపబడెను.

“శివ భగవానుడు భూతేశ్వర నామముతో క్షేత్ర పాలకునిగా యుండెను. ఆయన పాపులను దండించుచూ, భక్తి కోరువారికి మంత్రోపదేశము కావించుచుండును. మహా విద్యా స్వరూపిణి, దుష్కర కష్టములను దూరమొనర్చు చండికాదేవి సింహారూఢయై మధురాపురమును రక్షించుచుండును. నేను (నారదుడు) మధురా పురమున గూఢచారిని. నలువైపులా జనులను నిశితముగ గమనించుచూ, ఎల్లరి కార్యములనూ శ్రీకృష్ణునకు నివేదించెదను. మధురనందు మరణించు జనులను తీసికొని పోవుటకు శ్యామలవర్ణులు, చతుర్భుజులు అయిన శ్రీకృష్ణ పార్షదులు విమానముల యందు పయనించు చుందురు. దర్శన మాత్రము చే మనుజులను కృతార్థులను గావించు మధురాపురి సాక్షాత్ శ్రీకృష్ణుని నుండి ప్రకటమయినది. పూర్వకాల మందు బ్రహ్మదేవుడు మధురాపురికి ఏతెంచి వంద దివ్య సంవత్సరములు నిరాహారియై కఠోర తపమాచరించెను.”

అందువలన ఆ పుణ్యుడు పరమ పవిత్రుడాయెను. ఆ సమయమున ఆయన పరబ్రహ్మమయిన శ్రీహరి నామము జపము చేయుచుండుట చే “స్వాయంభువ మనువు” వంటి లబ్ధ ప్రతిష్ఠుడయిన సుపుత్రుడుదయించెను. సతీపతి అయిన భూతేశుడు, మధువనము నందు వంద దివ్య సంవత్సరములు తపమాచరించి మధురా మండలమునకు క్షేత్రపాలకుడు కాగలిగెను. నేను సహితము శ్రీకృష్ణుని కృపా కటాక్షముల చే మధురామండల గూఢచర్యము వహించుచున్నాను. ఈ విధముగనే దుర్గాదేవి సహితము మధురకు వెళ్ళి శ్రీకృష్ణుని సేవించుచున్నది. ఇంద్రుడు మధుర యందు తపమాచరించి ఇంద్రపదవినీ, సూర్యుడు తపము చేసి వైవశ్వత మనువును పుత్రునిగనూ, కుబేరుడు అక్షయనిధులనూ, వరుణుడు పాశములనూ, ధృవుడు మధువనమందు తపమాచరించి సంయక్ ధృవపదమును ప్రాప్తించిరి.”

“ఇచటనే తపమాచరించి అంబరీషుడు మోక్షమునూ, శ్రీరాముడు అక్షయశక్తినీ, లవణాసుర విజయమును పొందిరి. రఘు మహారాజు, చిత్రకేతు మహారాజులు కూడా ఇచటి తమ తపము చే తమ అభీష్ఠ సిద్ధి నొందిరి. ఈ మధువనము నందే తపమాచరించి మహాబలి అయిన “మధువు” అను అసురుడు మాధవ మాసమందు మధుసూదన మాధవుని తో యుద్ధ మొనర్చెను. సత్పురుషులెందరో మధువనమున కేతెంచి, తపమాచరించి యోగసిద్ధిని బడసిరి. అనేక మంది ఋషులు ఇచట తపమాచరించి సర్వతోముఖ సఫలతను పొందిరి. గోకర్ణుడు అను వైశ్యుడు తపము చేసి మహానిధిని పొందెను. ఈ శుభవనము నందే లోకకంటకుడు రావణుడు తపమాచరించి, తత్ఫలితముగ దేవతలపై విజయము, దానవాధిపత్యము, పొంది, మందిర నిర్మాణము గావించి లంకయందు పతిష్ఠించెను. హస్తినాపుర చక్రవర్తి అయిన శంతన మహారాజు ఈ వనము నందే తపస్సు చేసి అత్యంత సాధు శిరోమణి, మరియు తత్వార్థసాగర కర్ణధారి అయిన “భీష్ముని” పుత్రునిగ పొందెను.”

బహుళాశ్వుడు “మహామునీ! మధురాపుర మహత్త్యమును నాకు తెలుపవలసినది. అచట నివసించు సజ్జనులు ఎటువంటి ఫలితమును పొందెదరు?” నారదుడు “మహారాజా! ఆదియుగ మందు వరాహ స్వామి ఉత్తుంగ తరంగిత అయిన మహాసాగర జలములందు మునిగిన వసుంధరను, మదపుటేనుగు కమలమును పెకలించునట్లు, ఉపరితలమునకు తీసికొని వచ్చినపుడు మధురా మహాత్త్యమును ఈ విధముగ వర్ణించెను. “ఏ మనుజులు “మధుర” అను నామమును పలికెదరో వారు భగవన్నామోచ్చారణ చేసిన ఫలితములను పొందెదరు. “మధుర” స్పర్శ పొందినంతనే సాధు, సంత జనులను స్పర్శించిన ఫలితము నొందెదరు. మధురయందు నివసించు ఏదేని గంధమును అఘ్రాణించినచో వారు భగవత్ చరణారవిందములనుండి ఉత్పన్నమగు తులసీ సుగంధ ఘ్రాణ ఫలితము నొందెదరు.

“ఎవరు “మధుర” అను నామము వినెదరో వారు శ్రీకృష్ణ కథామృత శ్రవణ ఫలితము నొందెదరు. మధురను

దర్శించు మానవులు శ్రీకృష్ణ దర్శన ఫలప్రాప్తి నొందెదరు. ఇచట ఎవరు తమ కొరకు వండుకొని ఆహారము తినినప్పటికీ, లక్ష్మీపతికి నైవేద్య మొసగిన ప్రసాదమును స్వీకరించిన ఫలితము నొందెదరు. ఎవరు తమ స్వ హస్తములతో ఏ కార్యము ఆచరించినప్పటికీ వారు సాక్షాత్ శ్రీహరికి సేవ చేసిన ఫలితము నొందెదరు. అచట అటునిటు తిరుగు వారలకు తీర్థయాత్రా ఫలితము లభించును. అంతేకాదు మహారాజా! వినుము!! సజ్జనులయిన రాజాధిరాజులను నాశనము చేయు దుష్టులు, సగోత్ర ఘాతకులు, మూడు లోకములను ప్రయత్న పూర్వకముగ నష్ట మొనరించుచూ, కష్టములు కలిగించు మహాపాపులు సహితము, మధురానగరము నందు నివసింతురేని వారు సహితము యోగీశ్వరుల గతినొందెదరు."

"ఎవరు మధువనమున కేగరో, వారి పాదములు; ఎవరు మధు వనమును చూడరో వారి నేత్రములు, ఎవరు మధువనమను నామము వినరో వారి కర్ణములు, ఎవరు మధురానామము పలుకరో వారి వాణి (జిహ్వ), తుచ్ఛములు, మరియు దూష్యములు. విదేహరాజా! మధువనమందు పదునాల్గు కోట్ల వనములు, తీర్థములు కలవు. ఇవి అన్నియు మోక్షదాయకములే! నేను "మధురా" నామోచ్చారణము చేసి మధురకు సమస్కరించుచున్నాను. అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి అయిన శ్రీకృష్ణ భగవానుడు అవతరించిన మహాపురి మధురాపురి కి ప్రణామములర్పించుచున్నాను. ఇక వేరే పురముల, నగరముల మాటదేనికి? మధుర సమస్త పాపహారిణి. "మధుర" నామ ఉచ్ఛరణ మే ముక్తిని ప్రసాదించును. ఈ నగరపు వీధి వీధులు సహితము ముక్తిదాయకములు. ఇన్ని విశేషముల కారణమున మధురాపురి శ్రేష్ఠమని విద్వాంసులు నుడివెదరు. ఈ భూతలమందు "కాశీ" మొదలగు పురములు కూడా మోక్షదాయకములే! కాని వాటన్నిటి యుందునూ మధురాపురము ధన్యము. ఎందుకనగా ఇచట జన్మము. మౌంజీ వ్రతము (ఒడుగు), మృత్యువు మరియు దహన సంస్కారము ఈ నాలుగు సంస్కారములు సహితము ముక్తిని ప్రసాదించును. సమస్త పురములకు ఈశ్వరీ, వ్రజేశ్వరీ; తీర్థేశ్వరీ; తపోయజ్ఞముల నిధీశ్వరీ, మోక్షదాయినీ, పరమ ధర్మ ధురంధర అయిన శ్రీకృష్ణపురి మధురాపురికి నమస్కరించుచున్నాను."

"విదేహరాజా! ఏ మానవుడు ఒక్కసారి శ్రీకృష్ణుని యందు మనస్సు లగ్నము చేసి ప్రపంచము నందు ఎక్కడ నివసించుచున్ననూ ఈ మధురా మహాత్మ్యమును వినినచో వారు మధురా పరిక్రమ ఫలితమును పొందెదరు. ఇందు సందేహము లేదు."

విదేహరాజా! ఎవరు మధురాఖండమును పూర్ణముగ వినిననూ, గానము చేసిననూ, పఠించిననూ, వారికి సర్వ సమృద్ధులూ, సిద్ధులూ స్వభావ సిద్ధముగ ప్రాప్తించును. ఎవరు వైభవమును కాంక్షింతురో వారు నియమపూర్వకముగ యుండి మధురాఖండము ఇరువది యొక్క సార్లు శ్రవణము చేసిన ఎడల వారి ఇండ్ల ద్వారముల యందు గజముల హేల నిరంతరము వినిపించును. (అత్యంత ఐశ్వర్యశాలి అగును). దీనిని చదివి, వినిపించు బ్రాహ్మణుడు విద్వాంసుడగును, క్షత్రియుడు విజయము పొందును, వైశ్యుడు నిధులను, శూద్రుడు శుద్ధుడగును. స్త్రీ పురుషులు ఇరువురికి దుర్లభ మనోరథములు సహితము పూర్ణమగును. ఎవరు ఏ విధమయిన కోరికా లేక భగవానుని మనసు నందు నిడుకొని భూతలము నందు భక్తి భావముతో ఈ మధురా ఖండమును లేక మధురా మహాత్మ్యమును వినెదరో వారు విఘ్నముల నుండి విజయము పొంది స్వర్గాది లోకములు కూడా లంఘించి గోలోక ధామము చేరెదరు.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి "మధుర మహాత్మ్యము" అను ఇరువది అయిదవ అధ్యాయము సమాప్తము)

మధురా ఖండము సమాప్తము

ద్వారకా ఖండము

ఒకటవ అధ్యాయము

(జరాసంధుని విశాలసేన చే మధురాపురాక్రమణము, శ్రీకృష్ణ బలరాముల ద్వారా ఆ సేనావాహిని సంహారము, మగధాధీధుని పరాజయము మరియు బలరామ కృష్ణుల విజయోత్సవము)

కృష్ణాయ వాసుదేవాయ దేవకీ నందనాయచ
నందగోప కుమారాయ గోవిందాయ నమోనమ:

దేవకీ వసుదేవుల నందనుడయినప్పటికీ, నందగోప సుతుడయిన సచ్చితానంద స్వరూపుడు గోవిందునకు మరల మరల నమస్కరించుచున్నాను.

బహుళాశ్వుడు "బ్రహ్మన్! నేను మీ ముఖార విందము నుండి అత్యద్భుతమయిన మధురా ఖండమును వినియుంటిని. ఇపుడు పూర్ణముగ శ్రీకృష్ణ చరితామృతము చే నిండిన ద్వారకా ఖండమును దయచేసి తెలుపవలసినది. శ్రీరమా వల్లభుడయిన శ్రీకృష్ణునికి ఎంతమంది పత్నులు, పుత్ర పౌత్రులు కలిగిరి? మహామతీ! ఆయన మధురను వదలి ద్వారక యందు నివసించుటకు కారణమేమి! ఈ విషయ వృత్తాంతమంతయు నాకు తెలుపవలసినది."

నారదుడు "మిథిలేశ్వరా! మహాబలి అయిన కంసుడు మరణించినపుడు ఆతనికి ఇరువురు రాణులు కలరని విని యుంటిమి కదా! వారు "ఆస్తి," "ప్రాప్తి" అను ఇరువురు అతివలు జరాసంధుని అనుంగు పుత్రికలు. వారిరువురు మిక్కిలి దు:ఖితులై తండ్రి వద్ద తమ గోడును విన్నవించుకొనిరి. వారి ముఖతా కంసుని మరణ వార్త వినిన జరాసంధుడు మిక్కిలి కుపితుడై ధరాతలమును యాదవ వంశ శూన్యము కావించుటకు కంకణము కట్టుకొనెను. ఆతడు పదమూడు అక్షౌహిణిల సేన తీసికొని మధురాపురము చుట్టూ మోహరించెను. మహాసాగరము వలె ఘోషించుచున్న సేనా వాహినిని చూచి భయభ్రాంతులైన ప్రజలను గమనించి రాజసభ యందు బలరాముని చూచి శ్రీకృష్ణుడిట్లనియె.

"అన్నయ్యా! బలరామా! ఈ జరాసంధుని సేనా వాహినిని నిస్సందేహముగ నష్టపరుప వలెను; కానీ ఈ మగధ నరేశ్వరుని మటుకు ప్రాణములతో విడువవలెను. ఈతడు తిరిగి సేనా వాహినిని ప్రోగుపరచి తిరిగి దండయాత్ర కావించును. జరాసంధుని నిమిత్తముగ చేసికొని ఈ ధరణీ మండలము నేలుచున్న, భూ భారముగ యున్న దుష్ట నరేశుల నందరినీ ఇక్కడ నివసించుచునే సంహరించెదను. సాధు పురుషులకు ప్రియము నొనర్చెదను." మహారాజా! శ్రీకృష్ణ ప్రభువు ఇట్లు పలుకు చుండగనే వైకుంఠము నుండి సర్వులూ చూచుచుండగా రెండు రథములు అవతీర్ణమయినవి. ఆ రథములందు ఆశీనులై శ్రీకృష్ణ బలరాములు అతి కొద్ది యాదవ సేనను తీసికొని నగరము వెలుపలి కేతెంచిరి. దేవతలందరూ ఆకాశమున నిలబడి చూచుచుండగనే యాదవ మాగధుల మధ్య అద్భుత రోమాంచమయిన తుముల యుద్ధము ఆరంభింపబడినది.

"మొట్టమెదట మాగధుడు జరాసంధుడు పది అక్షౌహిణిలు సేనా వాహినిని తీసికొని శ్రీకృష్ణుని ఎదిరించెను. దృతరాష్ట్ర పుత్రుడు దుర్యోధనుడు అయిదు అక్షౌహిణుల సేనతో జరాసంధునికి సహాయముగ ఏతెంచి యాదవులతో యుద్ధమొనర్చ సమకట్టెను. వింధ్య నరేశుడు అయిదు అక్షౌహిణుల తోనూ, వంగదేశపు రాజు మూడు అక్షౌహిణులతోనూ కూడా అరుదెంచి జరాసంధునికి బాసటగా నిలిచిరి. మిథిలేశ్వరా! అ విధముగ జరాసంధునికి సహాయముగ వచ్చిన నృపతులు తమ ప్రాణములను ఫణముగ పెట్టి పోరాడిరి."

"శత్రుసేనల చే విడువబడిన బాణ వర్షము చే ఆకాశము నందు అంధకారము అలముకొనెను. అది గమనించిన శ్రీకృష్ణ భగవానుడు తన అద్వితీయ శార్ఙ్గ ధనువును టంకారము చేసెను. ఆ గంభీర నాదము చే ఏడు ఊర్ధ్వ, అధో లోకములు సహితముగ బ్రహ్మాండము దద్దరిల్లినది. దిగ్గజములు విచిలితము లయినవి. భూమి కంపించినది. ఆ ధనుష్టంకారము వినినంతనే శాత్రవసేనావాహిని సర్వము బధిరులయిరి. హయములు పథము తప్పి, యుద్ధభూమిని వదలి పారిపోయినవి. గజములు గతి తప్పి క్రిందబడినవి. జరాసంధుని సర్వసేనలూ ఆ టంకార ధ్వని వినినంతనే భయవిహ్వాలులై రెండు క్రోసులు వెనుకకు పరుగెత్తి అక్కడ నిలిచినవి. విద్యుత్ కాంతులీను శార్ఙ్గ ధనువు చే మాటిమాటికీ

టంకారము కావించుచూ శ్రీహరి తన బాణ సమూహముల చే ప్రత్యర్థి సేనలను పూర్తిగా ముంచెత్తెను. మహారాజా! ఆ బాణ సమూహములు రథములను చూర్ణము గావించెను. ఇరుసులు ముక్కలు ముక్కలైనవి. రథముల యందలి రథి మరియు సారథులు అందరూ ధరాశయనులైరి. గజారోహులచే నడపబడుచున్న గజములు పీనుగులైనవి. హయములు కంఠములు ఖండింపబడినవి. పదాతుల శిరములు, వక్ష స్థలములు భేదింపబడినవి, కవచములు పిట్లి వారందరూ అంతక దేవునికి అతిథులైరి."

అత్తరి అనేకమంది రాకుమారుల శరీరములు, శిరములు ఖండింపబడి కొందరు ఊర్ధ్వముఖులై, కొందరు అధోముఖులై చిందరవందరగా ధరిత్రి పై బడిరి. ఒక్క ముహూర్త కాలముతో ఆ యుద్ధ భూమి యందు వంద క్రోసుల పొడవు గల రుధిర ప్రవాహము ఆవిర్భవించెను. ఆ రుధిర సరిత యందు మరణించిన మహా గజములు మొసళ్ళవలెనూ, ఒంటెలు కచ్ఛపముల వలెను, రథములు శిశుమారముల వలెనూ, కేశములు నాచు వలెనూ, తెగిపడిన భుజములు సర్పముల వలెనూ కానపట్లు చున్నవి. అంతేకాక ఖండింపబడిన కాళ్ళు, చేతులు చేపల వలెనూ, కిరీట, కంకణ, హారములు ఆ నది యందలి రాళ్ళ వలెనూ గోచరించుచున్నవి. అస్త్ర శస్త్రములు గులకరాళ్ళ వలెనూ, శంఖ, చక్ర, చామర, ధ్వజములు ఇసుక వలెనూ ప్రతీతి చెందుచున్నవి. రథముల యొక్క ఇరుసుల చే ఉత్పన్నమగు ధ్వని భ్రమరగీతము వలె యుండగా, రెండు సేనలు రెండు (చెరియొక) చెలియలి కట్టవలె ఆ సమరాంగణము అంతయూ భాసించుచున్నది. ఈ విధముగ ఆ భయంకర రుధిర సరిత వంద యోజనముల విస్తీర్ణయై వైతరణి వలె భయము గొల్పుచున్నది. ప్రమదులు, భైరవ, భూత, భేతాళ, యోగినీ జనములు అట్టహాసములు కావించుచూ రణభూమి యందు వికృతముగ నాట్యము చేయ నారంభించిరి. ఆ భూత భేతాళులు పుర్రెల యందు రక్తమును తీసికొని త్రాగుచూ, శంకర భగవానునికి ప్రీతిగా పుర్రెల మాల కట్టుటకై పుర్రెలను సంగ్రహించుచుండిరి. వందలాది ఢాకినీ గణపరివేష్టితయై భద్రకాళి అచటి వేడివేడి రక్తమును సేవించుచూ వికటాట్టహాసము కావించుచున్నది.

స్వర్గ, గంధర్వ, విద్యాధర కాంతలు, అప్సరోభామలు క్షత్రియయోచిత ధర్మ యుద్ధము నందు అసువులు బాసిన వీరయోధులను తమ పతులుగ స్వీకరించుట నారంభించిరి. ఈ విధముగ వీర స్వర్గమునకు ఏగుచున్న యోధులను చేజిక్కించుకొనుటకై ఆ పడతులు పరస్పరము కలహింప నారంభించిరి. వారు "ఈతడు నాకు మాత్రమే సరి" అని ఒకరు పలుకగా, వేరొకరు "ఈతనికి నేను మాత్రమే సరి" అని బదులిచ్చుచూ వివాదగ్రస్థులగుచుండిరి. కొందు ధర్మ పరాయణులయిన వీరులు సమరాంగణము నందు మడుమ త్రిప్పక కదన మొనరించిన కారణమున, వారు సాక్షాత్ మార్తాండ మండలమును భేదించుకొని తిన్నగా విష్ణు లోకమున కేగుచుండిరి. శేషించిన సేనలను బలదేవుడు హలము తో లాగి, ముసలము తో మోది సంహరించెను. ఈ విధముగ జరాసంధుని సేన అంతయు నిహతులవగనే దుర్యోధన, వంగ, వింధ్యాదీశులు భయభీతులై పలాయనము చిత్తగించిరి.

అంత పదివేల ఏనుగుల బలశాలి, మహా పరాక్రమ వంతుడు అయిన జరాసంధుడు రథారూఢుడై బలదేవుని ఎదురుగ సంగ్రామము నందు నిలబడెను. యదు శ్రేష్ఠుడయిన బలరాముడు తన హలాయుధముతో సుందరమయిన జరాసంధుని రథాగ్రమము పట్టి, క్రిందకు పడవైచి, ముసలము తో చూర్ణము కావించెను. హయ, సారథులు సహితము నిహతులగుటచే రథహీనుడై, జరాసంధుడు శస్త్రాస్త్రములను వదలి బలదేవుని తన రెండు చేతులతో బంధించెను.

అంత వారిరువురి నడుమ ఘోర యుద్ధ మారంభమయ్యెను. ఆకాశము నందు దేవతలు, భూతలమందు మానవులు విస్మితులై చూచుచుండగా ఆ మహా బలశాలురు ఇరువురూ మల్లయుద్ధములో రెండు బలిష్ఠమయిన సింహముల వలె తలపడుచుండిరి. వారు వక్షములతో, శిరముతో, భుజములతో ప్రహరించుకొనుచూ, మరల మరల ఒకరి పాదముల మరొకరు పట్టుకొని క్రింద పడవేయుచూ పోరాడుచుండిరి. వారిరువురి ద్వంద్వ యుద్ధముచే అచటి భూ మండలమంతయు కంపింప నారంభించినది. ఇంతలో బలదేవుడు జరాసంధుని భుజములు పట్టి, బలముగా బాలుడు కమండలమును విసురునట్లు ధరణిపై విసరెను. అంత ఆతనిపై దూకి, క్రోధ తామ్రాక్షుడై ఆతనిని సంహరింప సంకల్పించి, రోషముతో ముసలమును చేతిలోనికి తీసికొనెను. అది గమనించిన పరిపూర్ణ పరమాత్ముడు, ముకుందుడు బలదేవుని వారించగా బలదేవుడు జరాసంధుని విడచిపుచ్చెను. మాగధుడు మిక్కిలి లజ్జితుడై, అవనిత శిరస్కుడై, తన శిబిరమునకు చని,

పరాభవ దు:ఖము చే తపస్సు చేయుటకు వనమున కేగుటకు సంకల్పించెను. అంతట ఆతని మంత్రులు వారించుటచే తపస్సు విరమించి మగధ దేశమునకు తిరిగి పయనమయ్యెను. ఈ విధముగ మధుసూదన మాధవుడు జరాసంధునిపై విజయము ప్రాప్తించెను. యుద్ధములో లభించిన ధన, ఐశ్వర్యములను, వైభవములను చేజిక్కించుకొని, సమరమున తనకు సహకరించిన యాదవులను ముందుంచుకొని, బలదేవ సహితుడై పరిపూర్ణతమ భగవానుడు శ్రీకృష్ణుడు వందిమాగధులు, సూతులు తమ విజయవర్ణనము గానము చేయుచుండగా, బ్రాహ్మణోత్తములు వేద మంత్రములు ఉచ్ఛరించుచుండగా, శంఖ దుందుభీనాదములు మిన్నుముట్టుచుండగా, అత్యంత వైభవముగా మధురాపురి ప్రవేశించెను. మార్గము నందు జనులు మంగళకర వస్తువులయిన పేలాలు, పుష్పములు, వారిపై జల్లుచుండిరి. ఈ విధముగ పూర్ణకుంభము తో ఆహ్వానింపబడిన పీతాంబరధారి, శ్యామసుందర విగ్రహులడు, శభాంగ శోభితుడు, గరుడ ధ్వజుడయిన భగవానుడు కృష్ణుడు తాళధ్వజుడయిన బలదేవ సహితుడై, మందహాసము చిందించుచూ మహారాజైన ఉగ్రసేనుని కడకేతెంచి తమచే తేబడిన ధనైశ్వర్యమంతయూ మహారాజున కర్పించెను.

(శ్రీ గర్గసంహిత యందు మధురా ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి "జరాసంధ పరాజయము" అను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(మధురపై, జరాసంధ, కాలయవనుల ఆక్రమణ, శ్రీకృష్ణ భగవానుడు యుద్ధము విరమించి ఒక గుహయందు ప్రవేశించుట, ముచికుందుని ద్వారా కాలయవనుడు దగ్ధమగుట; ముచికుందునికి వరమొసంగి బదరికాశ్రమమునకు పంపుట; మ్లేచ్ఛ సేనా సంహారము; జరాసంధుని ఎదుట వెనుదిరిగి ప్రవర్షణ గిరి చేరి అచట నుండి ద్వారకకు చేరుట; జరాసంధుడు ప్రవర్షణ గిరికి మంటబెట్టుట)

నారదుడు "మహారాజా! పై సంఘటన జరిగిన కొంత కాలమునకు జరాసంధుడు మరియొక పదమూడు అక్షౌహిణుల సేనను తీసికొని మధుర పై దండయాత్ర కు వచ్చెను. కానీ ఆతడు ముకుందుని చేతిలో తిరిగి పరాజయము పాలయ్యెను. శ్రీకృష్ణుని దివ్య ప్రభావము చే యాదవులకు నిరంతర అభ్యుదయము ప్రాప్తించినది. వారు తమ సేనావాహినిని మిక్కిలి బలపరచుకొని శత్రువులకు సింహ స్వప్నమయిరి. కానీ కొంతమంది మందబుద్ధులు తమ కుబుద్ధిని, బుద్ధిహీనతను వీడరు. ఈ విధముగ జరాసంధుడు మధురను జయించుటకు పదిహేడు మార్లు ఏతెంచెను. ప్రతీసారీ అనేక అక్షౌహిణీల సేనతో ఏతెంచెడివాడు కానీ బలరామ కృష్ణుల పరిక్రమాటోపమునకు నిలువలేక పరాజితుడయ్యెను. ఈమారు పద్దెనిమిదవ సారి తిరిగి మధురాక్రమణకు యోచించు చుండగా ఒక చిత్రము జరిగినది. నా (నారదుడు) చేత ప్రేరేపితుడయిన కాలయవనుడు ఒక మ్లేచ్ఛ సైన్యము చే పరివేష్ఠితుడై మధురా పురమును ఆక్రమించుటకు కదిలెను. అదే తగిన సమయమని తలచి జరాసంధుడు రెండవ వైపు నుండి తన సేనలతో మధురను ముట్టడించెను. ఒక ప్రక్క అత్యంత క్రూరులయిన మ్లేచ్ఛ సైన్యము, మరియొక్క ప్రక్క జరాసంధుని సైన్యము చే ముట్టడింపబడుటచే భయభ్రాంతులైన మధురా పుర వాసులను కాంచి శ్రీకృష్ణుడు బలరామ సహితుడై ఈ సంకటము నుండి బయట పడుటకు తీవ్రముగ ఆలోచించించెను. తన సజాతి బంధువులను రక్షించుటకు మాధవుడు ఒక యోచన చేసెను. ఉత్తుంగ తరంగ వలయమయిన సాగర మధ్యమున ఒక్క రాత్రిలో ముకుందుడు విశ్వకర్మ చే ద్వారకా దుర్గ నిర్మాణము కావించెను. విశ్వకర్మ అష్ఠ దిక్పాలకుల సిద్ధులను మేళవించి, వైకుంఠ వైభవమును రంగరించి శత్రుదుర్భేద్యము, అత్యంత మనోహరము, వైకుంఠ సదృశము అయిన ద్వారకాపురి నిర్మాణము కావించెను.

శ్రీహరి తన యోగశక్తి, చే సమస్త మధురా వాసులను ద్వాకర యందు ప్రవేశము కావించెను. పిదప బలదేవుని

ఆజ్ఞను బడసి, సమస్త అస్త్ర శస్త్రములను విడచి మధురాపురి బయటకు వెడలెను. నాచే (నారదుని చే) తెలుపబడిన చిహ్నముల చే ఆయనను శ్రీకృష్ణుని గా గ్రహించి, ఆయన నిరాయుధుడు గ యుండుట గమనించి, తానునూ నిరాయుధుడై, శ్రీహరి తో పోరు సల్పుటకు దుష్టుడు అయిన కాలయవనుడు ముందుకునడచెను. అంత శ్రీహరి యుద్ధవిముఖుడై పారిపోవుట ప్రారంభించిను. మహా యోగులకు సహితము దుర్లభుడయిన శ్రీహరిని బంధించుటకు కాలయవనుడు అయనను వెంబడించెను. మాధవుడు ఎప్పుడూ ఒక్క అడుగు దూరము ముందుండి, పరుగులిడుచూ కాలయవనుని దూరముగ యున్న శ్యామలాచలము వద్దకు తీసికొని వెళ్ళి ఆచటగల ఒక కంధకము (గుహ) నందు దూరి అదృశ్యుడాయెను. ఆ గుహ యందు మాంధాత చక్రవర్తి జేష్ఠ కుమారుడయిన ముచి కుందుడు గాఢముగ నిద్రించుచుండెను. ఆతడు పూర్వకాలమందు దేవదానవ సంగ్రామమున దేవతా సంరక్షణము కావించు చుండెను. నిరంతము అప్రమత్తుడై యుండుట చే ఆయనకు నిద్ర మిక్కిలి కరువాయెను.

ఆ కదనమంతరించిన పిదప దేవతలు ప్రసన్నులై వరము కోరుకొనమనిరి. ఆపుడు రాజేంద్రుడు ముచికుందుడు "నేను మిక్కిలి బడలి యుంటిని. నాకు నిద్ర అత్యావశ్యకము. నేన నిద్రించి లేచినపుడు నాకు సాక్షాత్ శ్రీహరి దర్శనము కావలెను. ఎవరు నాకు బలవంతముగ నిద్రాభంగము కావించెదరో, వారిపై నా దృష్టి పడిన తక్షణము ఆతడు భస్మము కావలెను." దేవతలు "తథాస్తు" అని దీవించిరి. అంత ముచికుందుడు పూర్వకాలమున సత్యయగమందు నిద్రకు ఉపక్రమించెను. ఇపుడు ద్వాపరాంతము.

కాలయవనుడు శ్రీకృష్ణుని వెనుకనే ఆ గుహప్రవేశము కావించి, పీతాంబరము కప్పుకొని నిద్రించుచున్న ముచికుందుని శ్రీకృష్ణుడని భ్రమించి, క్రోధోద్రిక్తుడై తన కాలితో బలముగ ముచికుందుని ప్రహరించెను. ముచికుందుడు నిద్రాభంగము కాగా కన్నులు తెరచి, నెమ్మది నెమ్మదిగ చూట్టూ చూచి తన ఎదుట మూర్తీభవించిన క్రోధము వలె వణకుచున్న కాలయవనుని కాంచెను. ముచికందుడు అగ్రహోదగ్రుడు అయ్యెను. ఆయన దృష్టి కాలయవనుని పై పడగనే దుష్ట మ్లేచ్ఛుడు భస్మీభూతుడాయెను. మ్లేచ్ఛుడు భస్మీభూతుడవగనే పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీహరి బుద్ధిమంతుడయిన ముచికుందునకు తన స్వస్వరూప దర్శనము కావించెను. భగవానుడు ఆ సమయమున కోట్లాది సూర్యకాంతితో జ్వాజ్వల్యమానముగ ప్రకాశించుచున్న జ్యోతిర్మయ మండలార్గతమున విరాజమానుడై యుండెను.

మస్తకమందు కిరీటము, కర్ణములకు కుండలములు, బాహువులకు భుజకీర్తులు, పాదములకు నూపురములు, వక్షము నందు శ్రీవత్సము, శోభించుచుండగా చతుర్భుజుడై, కమలదళ నేత్రయుతుడై, వనమాలా విరాజితుడై, కోట్లాది కామదేవులను తలదన్ను లావణ్యముతో నీలిమేఘశ్యాముడై ప్రకాశించుచుండెను. ఆ మహానుభావుని కాంచి ముచికుంద మహారాజు హర్షోల్లాసితుడై, చేతులు జోడించి ఇట్ల స్థుతించెను. "మహానుభావా! మీరు దేవకీ వసుదేవ నందనులు అయినప్పటికీ నందగోప తనయులుగ ప్రసిద్ధులు. ఆ సచ్చితానంద స్వరూపుడయిన గోవిందునకు నమస్కారము. ఎవరు కమల మాలాలంకృతుడో, ఎవని నాభి నుండి బ్రహ్మాండ కమలోత్పత్తి అయినదో, ఎవని నేత్రములు ప్రఫుల్ల కమల దళముల వలె విశాలమయినవో, ఎవని చరణములు సహితము కమలములను తిరస్కరించు సుకుమారముగ యుండునో, అట్టి శుద్ధ, బుద్ధ, పరబ్రహ్మ, పరమాత్మ అయిన శ్రీకృష్ణుని కి నమస్కారము. ఎవరు ప్రణత జనులకు క్లేశనాశకుడో, ఎవరు సహస్ర (అనంత) మస్తక, నేత్ర, భుజ, బాహు, ఊరు, చరణములు కలవాడో, ఎవరు అనంతమయిన నామములు కలవాడో, ఎవరు సహస్రకోటి యుగముల ధారణ చేయునో, అట్టి సనాతన భగవానుడయిన శ్రీకృష్ణునికి మరల మరల నమస్కరించుచున్నాను. మహాప్రభూ! ఈ సంసారము నందు నా అంత పాతకుడు, మీ అంత పాపహరణుడు లేరు. అందువల్ల జగన్నాధా! మీ ఇచ్ఛానుసారము నాపై కృప జేయవలసినది."

ఈ విధముగ ముచికుందుని చే స్థుతింపబడిన పరమానంద స్వరూపుడు శ్రీకృష్ణుడు తన భక్తుని గా తెలిసికొని గంభీరమయిన వాణి తో ఇట్లనియె "రాజసింహా! నీవు ధన్యుడవు. నిరపేక్షమయిన దివ్య భక్తిభావ యుక్తమయిన నీ విమల బుద్ధి సహితము ధన్యము. నీవు ఇప్పుడే బయలుదేరి నా ధామమయిన బదరిక ఆశ్రమమునకు ఏగుము. అచట తపమాచరించి రెండవ జన్మయందు శ్రేష్ఠ బ్రాహ్మణ జన్మ స్వీకరింపుము. ఆ జన్మ యందు ప్రేమలక్షణ భక్తియుతుడవై, ప్రకృతికి పరమయిన తిరిగిరాని నా దివ్య ధామమును చేరెదవు." ఈ విధముగ శ్రీహరి నుండి ఆజ్ఞగైకొని తిరిగి

ఆయనకు నమస్కరించి, స్తుతి, వందన, పరిక్రమ కావించి, నఖశిఖ పర్యంతము శ్రీకృష్ణ ప్రేమచే విహ్వలుడై, ముచికుందుడు ఆ గుహా ద్వారము నుండి బయటకు వచ్చెను. ద్వాపరమునందు కనిష్ఠాకృతి గల మనుష్యులు కొన్ని తాడిచెట్ల పరిమాణము గల ముచికుందుని కాంచి భయభీతులై పరుగులెత్తిరి. వారిని చూచి, భయపడవలదు అని అభయమిచ్చి, ముచికుందుడు ఉత్తర దిశగా పయనించెను. ఈ విధముగ ముచికుందునికి అభయ దానమొసంగి, భగవానుడు మ్లేఛ్ఛులచే ముట్టడించిన మధురానగరమున కేతెంచి సమస్త మ్లేచ్ఛ సేనా వాహినిని ఛిన్నాభిన్నము కావించి వాని ధనమును హరించి, వారిని సంహరించెను.

మగధరాజైన జరాసంధుడు పదునెనిమిదవసారి యుద్ధమునకు సమాలోచన చేయుచుండెనని చెప్పుకుంటిమి కదా! ఆతడు యుద్ధ ముహూర్తమునకై బ్రాహ్మణులను పిలచి ఇట్లనియె "బ్రాహ్మణులారా! ఈ సారి వసుదేవుని జయించి విజయుడనై తిరిగి వచ్చితినేని, నా జీవితకాల పర్యంతము మీ అధీనుడనై మిమ్ములను పూజింతును. లేని యెడల మిమ్ముల నందరినీ వధింతును. నేను తిరిగి వచ్చువరకూ మీరందరూ కారాగారమున యుండవలసినది. ఇందు సందేహము లేదు." ఈ విధముగ పలికి ఈ సారి ఇరువది మూడు అక్షౌహిణీల సైన్యము తీసికొని మధురాపురము పై దండెత్తెను. మాగధ బ్రాహ్మణులు ప్రాణములు కాపుడుటకై భగవానుడు తన భగవత్తత్వమును విడచి సాధారణ మానవుని వలె బలదేవ సహితుడై, తన నగరము నుండి బడల్వెడలి కాలినడకన పరుగిడసాగెను. వారిరువురు పారిపోయినట్లు నటించుట గాంచి జరాసంధుడు వికటాట్టహాసము చేయుచూ తన సేనా వాహిని చే వారిని వెంబడించెను. ఆ సోదరులిరువురు దక్షిణ దిశగా పయనించి ప్రవర్షణగిరి చేరిరి. వారిరువురు ఆ పర్వతము పై యున్నారని గ్రహించి జరాసంధుడు ఆ గిరి చుట్టూరా యున్న అడవికి నిప్పు అంటించి మంటబెట్టెను. ఆ పర్వతమంతయు దగ్ధమయ్యెను. అంత శ్రీకృష్ణ బలరాములు పన్నెండు యోజనముల ఎత్తుయున్న ప్రవర్షణ గిరి నుండి క్రిందికి దుమికి, శత్రువులకు చిక్కకుండా ద్వారక చేరుకొనిరి. మగధ రాజైన జరాసంధుడు శ్రీకృష్ణ బలరాములు మరణించిరని తలచి, తన విజయనగారాను మ్రోగించుచూ, ఆనందముగ తన రాజధానికి తరలి వెళ్ళెను. అంత కారాగృహమునయున్న బ్రాహ్మణోత్తములను విడిపించి, భక్తితో పూజించి "సద్బ్రాహ్మణులు సహాయకులుగ యున్నప్పుడు పరాజయము అసంభవము" అని పలికెను.

(శ్రీ గర్గసంహిత యందు ద్వారకా ఖండమందలి నాదర బహులాశ్వ సంవాదము నందు "ద్వాకరావాస కథనము" అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(బలదేవుని రేవతీ దేవితో కళ్యాణము)

నారదుడు "మహారాజా! ఈ ప్రకారముగ నీకు భగవానుడు ఎట్లు ద్వారకావాసుడయ్యెనో వివరించితిని. ఇపుడు పరమేశ్వరుడు బంధువుల వివాహాది వృత్తాంతము ను వినిపించెదను. మొదట బలభద్రుని వివాహ వృత్తాంతమును వినుము. ఈయది సమస్త దురిత నివారణము, మరియు ఆయు:వృద్ధి కారకము. పూర్వకాలము నాటి మాట. సూర్య వంశము నందు మహానుభావుడయిన "ఆనర్తుడు" అను మహారాజు ఉదయించెను. ఆయన ఉత్తుంగ తరంగములతో ఘోషించు సాగర తటమును రాజధాని గ చేసికొని ఆనర్త దేశమును ఏలుచుండెను. ఆయనకు సకల సద్గుణ నిధి, చక్రవర్తి లక్షణాంకితుడు అయిన "రైవతుడు" అను పుత్రుడుదయించెను. ఆయన "కుశస్థలీ" పురమును నిర్మించి, దానిని రాజధానిగ చేసికొని రాజ్యమేలు చుండెను. రైవతునకు వందమంది పుత్రులు మరియు "రేవతీ" అను సుందర కన్యక జన్మించిరి. ఆమె సర్వోత్తముడు, చిరంజీవి అయిన సుందర పురుషుని వివాహము చేసికొనివలెనని కోరినది. పుత్రికా వరాన్వేషణము నకై రైవతుడు పుత్రికా సహితముగ రథమారోహించి భూ ప్రదక్షిణ మాచరించి, అందు సరి అయిన వరుని కానక తన యోగ బలము చే బ్రహ్మ లోకమున కేగి వరుని నిమిత్తమై విరించి పదములపై వ్రాలెను. ఆ

సమయమున బ్రహ్మ సభయందు పూర్వ చిత్త అను అప్సరస గానము చేయుచుండుట చే కొంత తడవు నిశ్శబ్దముగా రైవతుడు పుత్రికా సహితుడై కూర్చొండెను. పిదప బ్రహ్మదేవుని ఆశ్రయించి ఇట్లు నివేదించెను.

"మహాప్రభో! మీరు పురాణ పురుషులు. మీ నుండియే ఈ విశ్వ వృక్షమునకు అంకురముద్భవించినది. మీరు పరమేశ్వర రూపులు, మరియు ఈ పరమోత్కృష్ట స్థానమును వెలసి జగత్తు యొక్క సృష్టి, స్థితి, లయలను గావించుచున్నారు. దేవా! సంసారమంతయు మీ శరీరము. వేదము ముఖము. ధర్మము హృదయము. అధర్మము పృష్ఠభాగము. మనువు బుద్ధి. దేవతలు అంగములు. అసురులు పాదములు. మీరు ఈ విశ్వము నంతయు కరతలామలకముగ దర్శించుచూ, సారధి రధమును అభీష్ఠ మార్గము నందు నడుపునట్లు, ఈ సంసార రధమును త్రిగుణాత్మక సత్వ, రజస్, తమో గుణముల విషయములందు సమర్ధవంతముగ నియంత్రించు చున్నారు. మీరు ఏకమాత్ర అద్వితీయులు. సాలీడు ఎట్లు తన నోటి నుండి దారము వెలువరించి గూడుకట్టి గ్రసించునో, అట్లే మీరు కూడా ఈ మహా సంసారమును సృజించి, పిదప సమయాసన్నమయిన పిదప ఆ సర్వమునూ గ్రసించెదరు.

సాక్షాత్ మహేంద్రుని నివాసస్థానమయిన స్వర్గము కూడా మీ వశము నందు యుండెనన, భూలోక సార్వభౌముల మాట చెప్పనేల! మీరు ఎల్లప్పుడూ పరమోత్కృష్ఠమయిన సత్యలోకము నందు స్థితిగతులై యందురు. అనంత గుణశీలులయిన మీకు నమస్కారము. ఓ! విధీ! మీరు త్రిలోకములకు పితామహులు మరియు స్వయంభువు. అందువలనే మిమ్ము "సురజేష్ఠుని" గ పేర్కొందురు. మీరు సర్వమును ఎరుంగుదురు. అందుచే నా పుత్రిక కోసమై ఒక దివ్యమయిన సర్వసద్గుణ సంపన్నుని, చిరంజీవిని వరునిగ ప్రసాదింపవలసినది."

అంత చతుర్ముఖ బ్రహ్మ మందహాసము చేయుచూ ఇట్లనియె "మహారాజా! కాలచక్రము అతి బలీయము, మరియు వేగవంతము. నీవు ఇచట వేచియున్న కాలమున ఇరువది ఏడు చతుర్యుగములు గడచినది. మర్త్యలోకమందు నీ సోదర, బంధు, పుత్ర పౌత్ర సహచరులు ఎవరునూ ప్రస్తుతము లేరు. నీ పౌత్రాదుల గోత్రనామములు అంతరించినవి. అందువల్ల శీఘ్రమే భూతలమున కేగి సర్వశ్రేష్ఠుడు, సనాతన పురుషుడు అయిన బలరామునికి ఈ కన్యా రత్నమును సమర్పింపుము. సాక్షాత్ గోలోకాధిపతులయిన బలరామ కృష్ణులు భూభార హరణమునకై ఇపుడు అవతీర్ణులయిరి. అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి అయినప్పటికీ భక్తవత్సలుడయిన శ్రీహరి వసుదేవ నందనునిగ యదువంశీయులతో ద్వారక యందు విరాజమానుడై యున్నాడు. "బ్రహ్మ దేవుని వాక్కులు వినిన రైవతుడు వినమ్రుడై ఆయనకు నమస్కరించి, వెంటనే తన పుత్రికను తీసికొని, ద్వారకకు వచ్చి, తన సుపుత్రిని బలదేవునకిచ్చి వివాహము కావించి, కట్నముగ ఒక వేయి అశ్వములు పూన్చినది అయిన దివ్య రధమును బహూకరించెను. బ్రహ్మ దేవుని చే ఈయబడిన దివ్య వస్త్ర భూషణములు సహితము వధూవరుల కిచ్చి, రైవతుడు తపము చేసికొనుటకు బదరికాశ్రమమునకు వెడలిపోయెను. ఆ సమయమున ప్రతి గృహమందు ఆనంద వేడుకలు చెలరేగినవి. బలదేవుడు తన రాణి అయిన రేవతిదేవి తో కూడి మిక్కిలి శోభించెను. ఈ బలభద్ర కళ్యాణ గాధను వినిన మానవులు సమస్త దురితదూరులై, పరమ సిద్ధిని పొందెదరు.

(శ్రీ గర్గసంహిత యందు ద్వారకా ఖండాంతర్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి "బలదేవ వివాహ మహోత్సవము" అను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(శ్రీకృష్ణునకు శ్రీ రుక్మిణీదేవి సందేశము, బ్రాహ్మణ సహితుడై శ్రీకృష్ణుడు కుండినపురమున కేగుట; కన్యావరులకు మంగళాచరణములు; శిశుపాల సహితులై వచ్చిన మగ పెళ్ళివారికి విదర్భరాజు భీష్మకుడు విడిదినిచ్చుట)

నారదుడు "మిధిలేశ్వరా! ఇపుడు శ్రీకృష్ణ పరమాత్ముని వివాహ వృత్తాంతమును వినుము. ఈయది పాపహరణము, పరమ పుణ్య జనకము మరియు ధర్మార్ధ కామ మోక్షములను చతుర్విధ ఫల పురుషార్ధ దాయకము. విదర్భ దేశమును కుండిన పురమును రాజధానిగ చేసికొని ప్రతాపవంతుడు, శ్రీయుతుడు, ధర్మవేత్తల యందు శ్రేష్ఠుడయిన "భీష్మకుడు"

అను మహారాజు పరిపాలించు చుండెను. ఆయనకు లక్ష్మీదేవి అంశచే రుక్మిణి అనుబాలిక జన్మించినది. ఆ సుకుమారి కోటి పూర్ణచంద్రులకు తలదన్ను సుందరీమణి. ఆ తరుణి ఒకనాడు నా (నారదుని) ముఖతా శ్రీహరి యొక్క అలౌకిక గుణ వర్ణనమును వినినదై శ్రీకృష్ణభగవానుని పతిగా పొందవలెనని నిశ్చయించుకొనినది. అట్లే నా ద్వారా (నారదుని ద్వారా) రుక్మిణీ దేవి యొక్క గుణ, రూప, సౌశీల్యములను వినిన మాధవుడు కూడా ఆమెను తనకు తగిన పత్నిగా తలచి ఆమెను వివాహము చేసికొనుటకు మనమున సంకల్పించెను.

మహారాజైన భీష్మకుడు సహితము రుక్మిణీదేవి కి శ్రీకృష్ణుడు తగిన వరుడని సమ్మతించెను. కానీ యువరాజైన రుక్మి తండ్రిని నిలువరించి, శ్రీకృష్ణ శత్రువయిన శిశుపాలుడు శ్రీరుక్మిణికి తగిన వరుడని తలంచెను. మిథిలేశ్వరా! అందుచే శ్రీరుక్మిణీదేవి మిక్కిలి దు:ఖితయై ఒక సద్బ్రాహ్మణుని దూతగా శ్రీకృష్ణుని వద్దకు పంపెను. ఆ బ్రాహ్మణుడు ద్వారకాపురికి ఏగగా, శ్రీకృష్ణుడు ఆయనను స్వాగతించి, అతిథి సత్కారములు సలిపి, మృష్టాన్న భోజనము నిడి, అపుడు కుశల సమాచారములు అరసెను. బ్రాహ్మణుడు! ఆయన ఆజ్ఞను బడసి శ్రీరుక్మిణీదేవి ఆయనకు వ్రాసిన లేఖను వినిపించెను, "స్వస్తిశ్రీ నిత్యానంద మహాసాగర శ్రీమద్దివ్య పరిపూర్ణ, వసుదేవ నందనుడయిన శ్రీకృష్ణా! కుండిన పురవాసిని అయిన రుక్మిణీ దేవి యొక్క కోటి కోటి ప్రణామములు స్వీకరింపవలసినది. మేము కుశలము, మీరు కుశలము అగుగాక! శ్రీ నారదుల వారి వాణిచే మీరు ప్రకృతికి పరులయిన పరమేశ్వరులని తెలిసినది. మీరు సర్వజ్ఞులు అయిననూ ఒక్క రహస్యమును వినిపించుచున్నాను."

"మహామతీ! నన్ను మీ అంశగా తలచి మీ అర్థాంగి గా స్వీకరింపవలసినది. ఒక వేళ చేదిరాజయిన శిశు పాలుడు నా హస్తమును గ్రహించినచో సింహపుకూడును వ్యర్థ మృగము ఎత్తుకొని పోయినదని తలుపవలెను. ఒకవేశ మీరు నీవు కుండినపుర దుర్గమున యుండెదవు. నిన్ను నేను ఎట్లు తీసికొని వెళ్ళగలను! అని ఆలోచించిన ఎడల ఇంకొక విషయము విశద పరచెదను. మా కులా చారము ప్రకారము వివాహమునకు ఒకరోజు మందు రాకుమారి కులదేవత యొక్క మందిరమునకు వెళ్ళవలెనను అచారము కలదు. అందువలన మీరు నన్ను ఆచట నుండి తీసికొని వెళ్లవలసినది."

మహారాజా! బ్రాహ్మణుని ముఖతా రుక్మిణీదేవి యొక్క ఆంతర్యమును వినిన ముకుందుడు తన సారధి అయిన దారుకుని వెంటనే తన రథము సిద్ధము చేయమని ఆజ్ఞాపించెను. సువర్ణ రత్న జటిత దివ్య రథము ఆ ముందురోజు రాత్రి వైకుంతము నుండి అవతీర్ణమయినది. దారుకుడు ఈ తేరునకు "శైబ్య, సుగ్రీవ, మేఘపుష్ప, వలాహక" ములను దివ్య హయములను పూన్చి, సిద్ధము చేసెను. వేలాది సూర్యుల కాంతితో మెరయుచున్న ఆ దివ్య ఆదరము నందు ఆ బ్రాహ్మణుని తన చేతులతో ఆశీనుని గావించి స్వయముగ సారథియై తన శ్రీ చరణములను మోపి విదర్భ దేశమునకు చనెను.

శ్రీకృష్ణుడు ఒంటరిగా రాజమండలము నుండి రాచ కన్నియను తెచ్చుటకు ఏగెనన్న సమాచారము వినిన బలదేవుడు యుద్ధ కాంక్ష కలిగి, తన సోదరుని రక్షణకై సుశిక్షుతులైన యాదవ సైన్యమును తీసికొని శీఘ్రమే వెనుక తాను బయలుదేరెను. ప్రాత:కాల వేళకు బ్రాహ్మణ సహితుడై శ్రీకృష్ణుడు కుండినపురపు ఉపవనము చేరి, ఒక చింతచెట్టు క్రింద రథమునాపి, హయములను విప్పి, గ్రాసమునిడి కూర్చుండెను. అచటి నుండి సుందరమయిన కుండిన నగరము కానపట్టు చున్నది. ఆ నగరము బలిష్ఠమయిన దుర్గములతో నిండి ఏడు యోజనముల గోళాకార భూమియందు ఉపస్థితమయినది. ఆ నగరము చుట్టునూ నీటితో నిండిన లోతైన మూడు కందకములు యున్నవి. అవి ఒక్కొక్కటి నూరు ధనువుల వెడల్పు కలిగి యుండి దర్గమములు, దర్లంఘ్యములై యున్నవి. ఆ దుర్గపు గోడలు ఏబది అడుగులు ఎత్తు కలిగి యుండెను. నగరమంతము మిక్కిలి సుందర భవన సముదాయము తో నిండి శోభించుచున్నది. ఆ దివ్య భవనముల పై సువర్ణ కలశములు ఉద్భాసితమై, వానిపై రంగురంగుల పతాకములు రెపరెపలాడుచున్నవి. ఆ ప్రదేశమంతయు నెమలి, మరియు పావురముల గుంపులతో శోభిల్లుచున్నది.

శిశుపాలునికి తన కన్యను ఈయ నిశ్చయించిన భీష్మక మహారాజు రత్నమండలమందు వివాహసామాగ్రినంతటినీ సంగ్రహించి యుంచెను. సుందర గాయనీ మణుల చే కీర్తింపబడుచున్న మంగళా చరణముల చే రాజమందిరమందు ఉపస్థిత అయిన శ్రీరుక్మిణీదేవి పచ్చని పైరుతో నిండిన భూకాంత వలె శోభించుచున్నది. అధర్వ వేద మంత్రముల

ద్వారా విద్వాంసులు శ్రీరుక్మిణీదేవిని స్నానము చేయించి, రత్నమయ వస్త్రాభూషితను గావించి, వేదమంత్రముల ద్వారా శాంతి కర్మ చేసి, రక్షాబంధనము కట్టిరి. మహా మనస్వి అయిన భీష్మకుడు ఆ బ్రాహ్మణులకు లక్ష బారువుల బంగారము, రెండు లక్షల బారువుల ముత్యములు, వేయి బారువుల వస్త్రములు అరువది కోట్ల గోవులు దానమొసెంగెను.

ఇదే విధముగ దమఘోష పుత్రుడయిన శిశుపాలునకు సహితము బ్రాహ్మణులు పరమశాంతిని కావించి రక్షా బంధనమును కట్టిరి. బ్రాహ్మణుల ద్వారా శిశుపాలునకు మంగళ స్నానము చేయించి పచ్చని పీతాంబరము కట్టి అలంకరించిరి. శిరముపై కిరీటమును పెట్టి, దానిపై దండలు చుట్టి, హార, కంకణ కేయూర, భుజదండములు తొడిగి, శిశుపాలుని మంగళ ద్రవ్యములయిన గంధ, పుష్ప, అక్షతలతో పూజించి, లాజలతో పెళ్ళి కొడుకుగా అలంకరించి, ఒక గొప్ప కుంజరమును అధిరోహింప జేసి, దమఘోషు తనయుని పెళ్ళి ఊరేగింపు బయలుదేరెను. వారి వెంట జరాసంధుడు, సాళ్వుడు, దంతవక్త్రుడు, విధూరదుడు, పౌండ్రకుడు నలు ప్రక్కలా, రక్షకులై బయలుదేరిరి. మహాబలి అయిన దమఘోషుడు తన విశాల సేనా సహితుడై, ఉచ్ఛ స్వరము తో నగారాలు మ్రోగుచుండగా అట్టహాసముగ కుండిన పురము బయలుదేరెను. ఇంతలో శ్రీకృష్ణుని చే కన్యాపహరణము జరుగుచున్న వార్త సూచాయగా తెలిసికొన్న చాలామంది రాజులు తమ సేనలతో శిశుపాలునికి మద్దతుగా కుండిన పురము ఏతెంచిరి.

భీష్మకుని ఎరుర్కొలుగ దమఘోషుని, ఆయన వెంట వచ్చిన రాజులను, సైన్య పరివారములకు ఎదురేగి విధి విధానముగ పుజించి సర్వులను సుతిమెత్తని కాశ్మీర కంబళులతో కప్పి, గౌరవించి, సాగరోత్పన్నములయిన ధగ ధగ మెరయుచున్న దివ్య కాంతులీనుచున్న సుందర దివ్యారుణ రత్నములచే మండితులను గావించి, అందరినీ తెల్లని వెన్నెల వంటి ముత్యాల హారముల తో సత్కరించి, సుగంధ యుక్త పుష్పరసము, అత్తరు కలిపిన పన్నీటిని చిలకరించి మగ పెళ్ళివారందరినీ స్వాగతించెను.

ఆ సమయమున విదర్భ దేశాధీశుడు ఆహ్వానితులైన రాజులందరకూ పరివార సమేతముగ, మర్యాద పూర్వకముగ సముచిత విడుదులు ఏర్పరిచి పూజించెను. ఆనాడు వివిధ రాజుల విడుదుల యందు మృదంగ ధ్వనుల మధ్య వారకాంతల నృత్య ప్రదర్శన జరిగెను.

(శ్రీ గర్గసంహిత యందు ద్వారకా ఖండమందలి నాదర బహులాశ్వ సంవాదము నందు "కుండిన పుర యాత్ర" అను నాలుగవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(శ్రీ రుక్మిణీదేవి చింతించుట; బ్రాహ్మణుని ద్వారా శ్రీ కృష్ణాగమన సమాచారము విని ప్రసన్నత నొందుట; భీష్మకుని ద్వారా బలరామ కృష్ణుల సత్కారము; పురవాసుల కోరిక; శ్రీరుక్మిణీదేవి కులదేవిని పూజించి ప్రార్థించుట; సౌభాగ్యవతులయిన స్త్రీలచే శ్రీరుక్మిణీదేవి ఆశీర్వదింపబడుట)

నారదుడు "మహారాజా! శ్రీకృష్ణ పరమాత్ముని చరణారవిందములను ధ్యానము చేయుచూ కమలలోచన అయిన భీష్మకకుమారి శ్రీ రుక్మిణి ఆయన లేని జీవితము వ్యర్థముగ తలచినది. ఆమె నిరంతరము ముకుందుని చింతించుచూ తనలో తాను ఇట్లు తలంచెను. "ఆహా! నా వివాహ మూహూర్తమునకు ఇంక కేవలము ఒక్క రాత్రియే యున్నది కానీ నా ప్రియతముడు శ్రీకృష్ణుడు అరుదెంచలేదు. ఆయన వద్దకు వెళ్ళిన బ్రాహ్మణదేవుడు సహితము ఇంకనూ తిరిగిరాలేదు. విధాతా! దీనికి కారణమేమి! యదుకుల తిలకుడు, దేవేశ్వరుడు శ్రీకృష్ణుడు నా యందు దోషమరసి విముఖుడు కాలేదు కదా? విధాతా! ఇపుడు నా కర్తవ్యమేమి? నా వంటి అభాగ్యురాలికి విధాత అనుకూలుడు కాదేమో? భగవానుడయిన చంద్రశేఖరుడు, మరియు మహానుభావుడయిన గణేశుడు సహితము ప్రతికూలురు వలె యున్నారు. భగవతి గౌరీదేవి

సహితము నా నుండి ముఖము త్రిప్పుకొనినది. గో, బ్రాహ్మణులు సహితము ప్రస్తుతము నా యందు దయమాలి యున్నారు. హా! హతవిధీ!!".

ఈ విధముగ వివిధ రీతుల మనసున తలపోయుచూ విదర్భరాజ తనయ తన రాజప్రసాదపు శిఖర గవాక్షము నుండి శ్రీకృష్ణుడేతెంచు రహదారిని గమనించుచుండెను. ఇంతలో మంగళ సూచకముగ శ్రీ రుక్మిణీదేవి ఎడమ భుజము అదిరినది. అదియే ఆమె చింతకు సమాధానము. కాలగమనము ఎరిగిన సర్వమంగళ, భీష్మకనందిని తన అంగ స్ఫురణచే మిక్కిలి ప్రసన్న అయ్యెను. అదే సమయమున శ్రీకృష్ణ సందేశమును తెచ్చిన బ్రాహ్మణుడు అచటకు ఏతెంచెను. ఆయన శ్రీరుక్మిణీదేవికి శ్రీకృష్ణాగమన శుభవార్త మరియు యాత్రా విశేషములన్నియు సమగ్రముగ తెల్పెను. భీష్మకకుమారి మిక్కిలి హర్ష, ఉల్లాసితయై ఆయన పదములపై వ్రాలి ఇట్లనియె.

"విప్రవర్యా! నేను మీ వంశము నుండి ఎన్నడూ దూరము కాను (మీ వంశము మరియు కులపరంపర నందు ఎల్లరూ ధనధాన్య సమృద్ధులై యుందురు.) ఇది నా ప్రతిజ్ఞ." విదర్భ దేశాధీశుడు తన కన్య వివాహ వేడుకలను దర్శించుటకు శ్రీకృష్ణ బలరాములు ఏతెంచితిరన్న వార్త వినిన వెంతనే, బ్రాహ్మణ సహితుడై వారిని ఆహ్వానించుటకు ఎదురేగెను. ఆయనకు వారి ప్రభావము నందు పరిపూర్ణ జ్ఞానము కలదు. మంగళకరమయిన గంధాక్షతలు, వస్త్రములు, రత్నరాశులు పాత్రలయందు నిడుకొని మధుపర్కములుంచిన అనేక కలశములను అలంకరించి భీష్మకుడు పరమేశ్వర స్వరూపులైన శ్రీకృష్ణ బలరాములను విధివిధానముగ పూజించెను. అటుపిమ్మట ఆయన ఖిన్నుడై తన మనసునందు ఆ జగదీశ్వరునకు నేను నా కన్యను ఎందుకు ఈయలేదు అని తర్కించి, ఖేదపడి వారిరువురికి ఆనందవనము నందు విడిది ఏర్పాటు చేసి తన భవనమునకు ఏగెను.

మూడు లోకముల లావణ్యనిధి అయిన పరమేశ్వరుడు, వసుదేవ నందనుడు, శ్రీకృష్ణుడు కుండినపురము ఏతెంచెనన్న వార్త వినిన పురవాసులు ఆచటకేతెంచి తమ నేత్రముల చే ఆయన ముఖారవింద మకరందమును గ్రోల నారంభించిరి. వారందరూ పరస్పరమూ ఇట్లు సంభాషించుకొను చుండిరి, "బంధువులారా! మన రుక్మిణీదేవి ఈ శ్రీకృష్ణుని పత్ని అగుటకు యోగ్యురాలు. వేరొకరికి కాదు. ఆ పురవాసులందరూ శ్రీరుక్మిణీకృష్ణుల వివాహమవవలెనని వాంఛించి, విరించిని ప్రార్థించి, తమ పుణ్యముల నన్నింటినీ ధారపోసి తిరిగి ఇట్లు తలపోసిరి. "శ్రీరుక్మిణీ కృష్ణులకు వివాహమయ్యేనేని ఈయన అప్పుడప్పుడు ఇది అత్తవారిల్లు అగుటవలన వచ్చుచూ యుండును. అపుడు మనమందరమూ ఈయనను దగ్గరనుండి దర్శించి కృతకృత్యులమయ్యెదము. ఈయనను దర్శింపని దీర్ఘకాలిక జీవితము దూష్యము."

కుండినపురవాసులు ఈ విధముగ తలచుచుండగా, అదే సమయమున శ్రీరుక్మిణీదేవి గిరిరాజనందిని అయిన పార్వతీదేవిని పూజించుటకు సఖుల సహితయై బయటకు బయలుదేరెను. ఆమె హృదయమంతయు శ్రీకృష్ణునిచే నిండియుండెను. ఒక ప్రక్క భేరీ, మృదంగ, దుంధుభీ ధ్వనులు మిన్నుముట్టు చున్నవి. వందిమాగధులు, గాయక, వైతాళికులు యశోగానము సలుపుచుండిరి. వారాంగనలు మనోహర నృత్యము చేయుచుండిరి. వీటన్నిటితో పాటు మంగళకరమయిన జయజయ ధ్వానములు మారుమ్రోగుచున్నవి. లక్ష్మీ స్వరూపిణి అయిన శ్రీరుక్మిణీదేవి కోటి పూర్ణ చంద్ర నిభాననయై వెలుగొందుచున్నది. బాలసూర్యుని పగిది భాసించు కుండలాలంకృత అయిన శ్రీరుక్మిణీదేవి నడచుచుండగా, పార్శ్వమున చెలులు శ్వేత ఛత్రమును పట్టి, వింజామరలు, చామరములతో వీచుచు ఆమె సేవ యందు సంలగ్నులయిరి.

తమ ఒరలనుండి విచ్చుకత్తులు బయటకు తీసి, సాయుధ పాణులై, అప్రమత్తులై, వీరయోధులు నలువైపులా రక్షించుచుండిరి. వీరందరికీ కొలది దూరము లో రథ, గజ, హయములపై సాయుధులై కొంతమంది సైనికులు రాజకుమార్తె రక్షణకై అప్రమత్తులై యుండిరి. పార్వతీమందిరము చేరిన శ్రీరుక్మిణీదేవి శాంత చిత్తయై, శుద్ధభావముతో తన పాద, హస్తములను ప్రక్షాళనమొనర్చి, మౌనముగ దేవికడకేగి, చేతులు జోడించి భవభీతిహారిణి అయిన భవానీదేవిని ఇట్లు ప్రార్థించెను, "తల్లీ! దుర్గాదేవి! గణేశ, కార్తికేయాది సంతానము తో ఎల్లప్పుడూ శోభించు శుభకారిణీ! శివా!! భవానీ!!! నీకు ప్రణామములు అర్పించుచున్నాను. ప్రకృతికి పరమయిన పరమేశ్వరుడు శ్రీకృష్ణభగవానుని నాకు పతిగా అనుగ్రహింపుము." అంత చుట్టూ యున్న చెలికత్తెలు "శుభే! నీవు ఈ విధముగ పలుకుట తగదు. చేదిరాజయిన శిశు

పాలునికై వరము నడుగుము” అని పలికిరి. ఈ విధముగ పలుకుచున్న చెలికత్తెలచే పరివేష్ఠిత అయిన శ్రీరుక్మిణీదేవి తిరిగి ఈ విధముగ ప్రార్థించెను. “ఈ చెలులు బాలికలు. ఏమియును తెలియనివారు. వారి పలుకులు లక్ష్య పెట్టవలదు.” ఈ విధముగ పలికి శ్రీరుక్మిణీ దేవి గంధాక్షతలు, ధూప, ఆభూషణ పుష్పహారములు, దీపములు, అటుకులు మొదలయిన భోగములు, వస్త్రములు, ఫలములు, చెరకు మరియు తాంబూలాది పవిత్రవస్తువులు పార్వతీదేవికి అర్పించి, మిక్కిలి భక్తి భావముతో భవానీదేవిని పూజించెను. తదనంతరము దేవికి ప్రణామము లాచరించి అనేక భూషణములను సౌభాగ్యవతులైన స్త్రీలకు దానమొనర్చి, వారిని సహితము పూజించి నమస్కృతులాచరించెను. ఆ సంపూర్ణ సౌభాగ్యవతులైన స్త్రీలందరూ శ్రీరుక్మిణీదేవికి వరమునిచ్చి ఆశీర్వదించి ఇట్లనిరి “రాజకుమారీ! నీ రూప సౌందర్యములు మహారాణి శతరూప వలె అక్షయమగు గాక! నీ శీల స్వభావములు గిరిరాజనందిని అయిన ఉమాదేవి వలె శోభిల్లుగాక! నీ యందు పతిసేవా భావము అరుంధతి వలెనూ, క్షమాగుణము జనకనందిని జానకి వలెనూ, వర్ధిల్లుగాక! నీ సౌభాగ్యము యజ్ఞపత్ని దక్షిణ వలెనూ, నీ ఉత్తమ వైభవము శచీదేవికి వలెనూ వెలయుగాక! నీ వాణి సరస్వతీ సదృశము మరియు నీ పతిభక్తి పరమ భాగవతోత్తముల హరిభక్తి వలెనూ దీపించు గాక!

(శ్రీ గర్గసంహిత యందు ద్వారకా ఖండమందలి నాదర బహుళాశ్వ సంవాదము నందు “శ్రీరుక్మిణీ నిర్గమణమను” అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(శ్రీకృష్ణుని ద్వారా శ్రీరుక్మిణీదేవి అపహరణము, మరియు యాదవ వీరులతో సంగరమందు ప్రత్యర్థుల పరాజయము)

నారదుడు “మహారాజా! ఈ విధముగ బ్రాహ్మణ పత్నుల శుభాశీర్వాదము చే మిక్కిలి ఆనందించి మరల మరల వారికి, పార్వతీదేవికి నమస్కరించి మౌనవ్రతము వీడి రుక్మిణీదేవి తన సఖులతో కలసి ఆలయము వెలుపలికి వచ్చెను. ఆ సమయమున ఒక విచిత్రము జరిగెను. కోటి చంద్ర ప్రభానన అయిన శ్రీరుక్మిణీ దేవిని చూడగనే ఆమెను రక్షించుటకై రథ, గజ, హయ, పదాతి దళమందలి వీర సైనికుల మనస్సు డోలయమానమై, కామదేవుని ధనుర్బాణములచే ప్రహరింపబడి, కామమోహితులై, సమస్త సేనావాహిని తమ తమ ఆయుధములను విడచి నేలపై బడి మూర్ఛితులైరి. ఆ సమయమున అకస్మాత్తుగా అచటకు చిరుగంటలు, మంజీరముల సవ్వడి చేయుచుండగా, వైకుంఠము నందలి “నైశ్రేయశము” అను వనము నుండి ఉద్భూతమయిన అశ్వములు పూన్చబడి, రెపరెపలాడుచున్న గరుడపతాకాలంకృతమయిన, వాయుసమాన వేగము గల రథమునందు దారుక సహితుడై, పెను తుఫాను కదళీవనములను నేలమట్టము గావించునట్లు, ప్రత్యర్థి సేనలను చీల్చుకొని శ్రీకృష్ణ ప్రభువు ఏతెంచెను.

శత్రువులు చూచుచుండగా, ఆయన ఆ స్త్రీ సముదాయము ను చేరి, భీష్మకనందిని శ్రీరుక్మిణీదేవిని తన తేరుపై నెక్కించుకొని, గరుడుడు దేవతలు చూచుచుండగా సుధాభాండమును చేజిక్కించి కొన్నట్లు ఆ రాజకన్యను అపహరించి వెడలిపోయెను. ఆ సమయమున శ్రీకృష్ణ ప్రభువు శస్త్రముల యందు శ్రేష్ఠమయిన శాంగ ధనువును చేపట్టి, మాటిమాటికీ ధనుష్టంకారము చేయుచూ తిరిగి తన సేన యందు ప్రవేశించెను. ముకుందుడు తిరిగి తన సేన యందు రాగానే దేవ దంధుభులు మ్రోగినవి. యాదవులు జయజయ ధ్వానములు కావించిరి. సిద్ధులు, సిద్ధ కన్యకలు, మరియు దేవతానీకము హర్షోల్లాసితులై శ్రీకృష్ణుని రథముపై నందన వన పుష్పములు వర్షముగ కురిపించిరి. మృగరాజు వేటాడిన పిదప నక్కలు బిక్కు బిక్కుమని చూచుచుండగా, తన భాగము గ్రహించి ఎట్లు నిర్భయముగ వెడలునో, అట్లే శ్రీకృష్ణుడు రుక్మిణీ సహితుడై, బలరాముని కూడి నెమ్మది నెమ్మదిగ ఇచటి నుండి ద్వారకాపురికి పయనమయ్యెను.

శ్రీరుక్మిణీదేవి అపహరణమయిన వెంటనే ఆ ప్రదేశమంతయు గొప్ప కోలాహలము చెలరేగెను. రక్షక సైనికులు వారిలో వారు ద్వంద్వ యుద్ధమును ఆరంభించిరి. జరాసంధుని పక్షమున వచ్చిన అనేకమంది నృపతులు ఈ ఘటనను మిక్కిలి పరాభవము గ భావించి తమలో తాము ఇట్లనుకొనిరి. "ఆహా! ఇయ్యది మన యెడ ధిక్కారము. మహా ధనుర్ధారులమయిన మన యశస్సును జంబుకములు సింహపు యశస్సును హరించునట్లు ఈ గోపాలకులు హరించిరి. ఇంతకు మించిన పరాభవము, పరాజయము మనకు ఏమి యుండును?". ఈ విధముగ పలికి ద్యూత క్రీడలను విడచి, ఖడ్గకవచములు ధరించి, తమ సేనలను పురికొల్పి సంగ్రామమునకు సిద్ధపడిరి.

క్రోధోద్రిక్తుడయిన పౌండ్రకుడు రెండు అక్షౌహిణీల సేన తోనూ, విధూరధుడు మూడు అక్షౌహిణీల సేనతోనూ, దంత వక్రుడు అయిదు అక్షౌహిణుల సేనతోనూ రాజపుర స్వామి అయిన సాళ్యుడు మూడు అక్షౌహిణిల సేనతోనూ, మహాబలుడయిన జరాసంధుడు పది అక్షౌహిణుల సైన్యము తోనూ యాదవులతో సమరమునకు నడుము కట్టిరి. చేదిరాజయిన శిశుపాలునికి పక్షమునున్న వేలాధి యోధులు సహితము శ్రీకృష్ణుని ఎదుట టంకారములు చేయుచూ మోహరించిరి. ప్రళయకాల సాగరము వలె మహా భీకరముగ యున్న శాత్రవ సేనా వాహినిని చూచి, దానిని దాటుటకు యాదవ వీరులు శ్రీకృష్ణుని కడకు ఏతెంచిరి. వారికి నావ, సరంగు, ఇరువురు శ్రీకృష్ణుడే!!

అటుపిమ్మట ఇరుపక్షములకు దేవదానవ సంగ్రామము వలె గొప్ప తుముల యుద్ధము ఆరంభమయ్యెను. ఆ సంగ్రామము నందు రధికులు రధికుల తోడనూ, పదాతులు పదాతుల తోడనూ, అట్లు ఎవరికి చెందిన ప్రత్యర్ధులతో వారు సంగర మారంభించిరి. బాణ పరంపరల చే ఆ ప్రదేశమంతయు అంధకార మావరించెను. ఆ సమయమున శ్రీరుక్మిణీదేవి భయభీత ఆగుటచే, భగవానుడు ఆమెకు భయపడవలదని అభయదాన మిచ్చెను.

బలదేవుని కనిష్ఠ సోదరుడయిన గదుడు తన ధనువును ఎక్కుపెట్టి వనమును దావానలము దహించినట్లు శాత్రవ సంహారము కావించెను. గదుని బాణ ఘాతముల చే కవచములు పిట్లబడి, రధసారధులు, హయములు సంహరింపబడి యోధులు ఛిన్నాభిన్నమయిరి. పదాతుల కాళ్ళు నరుకబడినవి. అశ్వారూఢుల శరీరములు రెండు ముక్కలై హయముల సహితముగ ధరాశయనులైరి. గజముల కుంభ స్థలములు పగిలి కూష్మాండముల ముక్కల వలె కుంజరములు వ్రక్కలయినవి.

గదుని ధనుర్విద్యా పాండిత్య మహిమ చే శాత్రవ సమూహములు కకావికలై భీతిల్లి పారిపోయినది. అది చూచిన గదాయుద్ధ విశారదుడు శాల్వుడు తన బలమయిన గదను గదునిపై ప్రహరించెను. ఆ ఘాతము చే వ్యాకులుడయిన ధనుర్యుద్ధా విశారదుడు గదుడు కొంత తడవు భూమిపై బడి, తిరిగి తేరుకొని బలదేవుని చే ఈయబడిన గదను చేతిలోనికి తీసికొనెను. ఆ గద లక్ష బారువుల బరువు గలదై, "కౌమోదకీ" గదకు సమానమయిన ధృఢత్వము కలిగినది. ఆ భయంకర శస్త్రముతో గదుడు ఇంద్రుడు పర్వతములపై వజ్రాయుధమును ప్రహరించునట్లు శాల్వుని పై ప్రహరించెను. ఆ ప్రహారము చే సాల్వుడు క్రిందపడెను. దీనిని గమనించిన జరాసంధ, విధూరధ, పౌండ్రక, దంతవక్రులు భయంకర రోషావేశముతో గదుని చుట్టుముట్టిరి.

పౌండ్రకుడు కటు వచనముల చే మిత్రుల సంబంధము నష్టపరుచునట్లు పది తీక్షణ బాణములతో గదుని పతాకము పడగొట్టెను. తదుపరి దంతవక్రుడు తన గదా ఘాతము చే గదుని రధమును దండము తో సుందర మృచ్ఛ ఘటమును బ్రద్దలు కొట్టినట్లు నుగ్గు నుగ్గు గావించెను. జరాసంధుడు గదుని రధాశ్వములను సంహరింపగా, విదూరధుడు ఆతని సారధిని హతము చేసెను.

ఇది అంతయూ దూరము నుండి గమనించుచున్న బలదేవుడు ముసలాయుధుడై పరుగు పరుగున వచ్చి కృద్ధుడై, దంతవక్రుని వికార ముఖమును తన ముసలముతో బలముగ ప్రహరించెను. ఆ సమరాంగణము నందు ఆ సమయమున దంతవక్రుని ముఖము నందు మచ్చుకు ఒక్క దంతము సహితము మిగలక అన్నియు భూమిపై రాలినవి. అంత రుక్మిణీ సహితుడైన దైత్యనాశకుడు శ్రీకృష్ణుడు హసీ భూతుడయ్యెను. బలదేవుడు క్రోధతామ్రాక్షుడై ముసలము తో మిగిలిన ముప్వురినీ ప్రహరించెను. ఆ ముగ్గురూ రక్తము కక్కుకొని ఒడలందు రుధిరము స్రవించు చుండగా ధరణి పై బడి మూర్ఛితులయిరి. తదుపరి మిగిలిన సేనా వాహినిని హలము చే పట్టి, ఈడ్చి, ముసలము తో ప్రహరించి సమస్త సేనా

వాహినిని ధరాశయనుల కావించెను. ఆ సమయమున సమరాంగణము నందు పది యోజనముల దూరము రథ, గజ, హయ, పదాతి దళములు పూర్తిగా క్షతగాత్రులయిరి. రథములు చూర్ణమయినవి. చావగా మిగిలిన జరాసంధాది మహీపతులు ప్రాణములు అరచేత పట్టుకొని పలాయనము చిత్తగించి శిశుపాలుని కడకు ఏగి ఇట్లనిరి.

"పురుషసింహమా! నీవు ఈ పరాభవమును మనసులో పెట్టుకొనకుము. ఈ వివాహము అవ్వకున్ననేమి? ఈ భూతలమున వంద వివాహములు చేసికొనవచ్చు. మేమందరమూ ఈ రోజే ద్వారకకు ఏగి శ్రీకృష్ణ బలరాములను బంధించి, సముద్రపు దకూలము ధరించిన ధరిత్రిని యాదవ శూన్యము గావించెదము. ఈ ప్రకారముగ బీరాలు పలికిన తన మిత్రుల ప్రభోదమును వినిన శిశుపాలుడు తన రాజధాని అయిన చంద్రికాపురమునకు ఏగెను. చావగా మిగిలిన మహీపతులు బ్రతుకు జీవుగా అనుకొని తమ తమ రాజ్యముల కేగిరి.

(శ్రీ గర్గసంహిత యందు ద్వారకా ఖండమందలి నాదర బహుళాశ్వ సంవాదము నందు "శ్రీరుక్మిణీ హరణము, మరియు యుదవంశీయుల విజయము" అను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(శ్రీకృష్ణుని చేతిలో రుక్మి పరాజయము మరియు ద్వారక యందు శ్రీరుక్మిణీ కృష్ణుల కళ్యాణము)

శ్రీరుక్మిణీదేవి అపహరణ వార్తనూ, తన మిత్రుల పరాజయ వృత్తాంతమునూ వినిన భీష్మక పుత్రుడు రుక్మి సమస్త భూపాలురు చూచుచుండగా "భూపాలురలారా! నేను శ్రీకృష్ణుని సంహరించి, శ్రీ రుక్మిణీ దేవిని వెనుకకు తీసికొని రాకుండా తిరిగి కుండిన పుర ప్రవేశము చేయను, అని భీషణ ప్రతిజ్ఞ నొనరించెను. ఈ విధముగ పలికి ఆ వీరుడు నీలి మేఘఛాయ కలిగిన దివ్య కవచము, సింధు దేశపు శిరస్త్రాణము, సౌవీర దేశము నందు చేయబడిన దివ్య ధనస్సు; లాట దేశమున తయారుచేసిన రెండు తూణీరములు, మ్లేచ్ఛ దేశమున చేయబడిన చంద్రహాసము, కుటజ దేశమున తయారయిన డాలు, గుజరాతునందు నిర్మింపబడిన గద, బంగాళము, కొంకణ దేశములందు చేయబడిన చేతి తొడుగులు, రత్నమయ కిరీట కుండలములు ధరించి చంచల హయములు పూన్చిన రథము నధిరోహించి, రెండు అక్షౌహిణీల సేనావాహిని తీసికొని, రుక్మి యుద్ధమునకు బయలుదేరెను.

పరాజితులయిన శత్రువులు తిరిగి వచ్చుచున్నారన్న విషయమును గ్రహించిన బలరాముడు తిరిగి యదుసేనలను తీసికొని వారిని ఎదిరించెను. రుక్మి మాటిమాటికీ కటువచనములు, నిందావాక్యములు పలుకుచూ శ్రీకృష్ణుని చేరి "ఓరీ! నిలువుము. జీవితము నందు ఇచ్ఛ కలిగెనేని నా సోదరిని విడిచిపుచ్చుము. లేని ఎడల ఇప్పుడే సేనా సహితముగ నిన్ను యమపురికి పంపించెదను. మీ కులమంతయు యయాతి శాపగ్రస్తులు, మరియు నీవు గొల్లల అవశిష్ఠము తినెదవు. నీవు ఎల్లప్పుడూ జరాసంధుని భయము చే బ్రతుకుచూ, కాల యవనునికి పృష్ఠ బాగము చూపించి పరుగెత్తిన వీరుడవు." ఈ విధముగ పలికి ఆతడు తన తూణీరము నుండి ఒక తీక్షణ బాణమును సంధించి, ఆకర్ణాంతము లాగి శ్రీకృష్ణుని వక్షముపై వేసెను. ఆ బాణము వేగముగ వచ్చుట గమనించిన శ్రీకృష్ణుడు నేర్పుగ తప్పుకొని గరుడుడు సర్పమును పట్టినట్లు ఒక తీవ్ర సాయకముతో టంకారము చేయుచున్న రుక్మి ధనస్సు యొక్క అల్లె త్రాటిని ఖండించెను. రుక్మి తిరిగి స్వర్ణ భూషితమయిన వేరొక అల్లెత్రాడు బిగించి, మహావేగము తో పది తీవ్ర నాచారములు వైచి ముకుందుని గాయపరచెను.

అంత శ్రీహరి తన అమోఘ బాణ పరంపర చే రుక్మిని క్షతగాత్రుని కావించి, ఒకే ఒక్క బాణముతో జ్ఞానము చే త్రిగుణాత్మకమయిన సంసారబంధము తొలగునట్లు, రుక్మివిల్లు విరచెను. ధనస్సు విరుగుట చే విదర్భ రాజకుమారుడు మొరయుచున్న ఒక మహాశక్తిని చేతిలోనికి తీసికొని, దానిని మధుసూదనుని పైకి విసరెను. భగవానుడు గదాగ్రజుడు

తన కౌమోదకీ గదను తీసికొని ఆ శక్తిపై ప్రయోగించెను. కౌమోదికి పైకి వచ్చుచున్న ఆ శక్తిని రెండు ముక్కలుగ విరచెను. ఖండింపబడిన ఆ శక్తి యొక్క శకలములు రుక్మి సారథిపై బడి ఆతడు మరణించెను. కౌమోదకీ గద అంతటితో ఆగక రుక్మి రథము పై బడి ఆ అదరమును హయముల సహితముగ చూర్ణము చేసెను. రుక్మి తన యొద్ద యున్న గదను ప్రయోగింపగా చక్రి తన చక్రముతో అద్దానిని చూర్ణము కావించెను. అంతట రుక్మి తన వద్ద గల బంగాళదేశమున తయారయిన భయంకరమయిన పరిఘను ముకుందుని భుజముపై ప్రయోగించెను. అయ్యది ముకుందుని భుజమును బలముగ తాకినప్పటికీ పుష్పమాల గజరాజును గాయపరుచలేనట్లు ఆ ఘాతము మధుసూదనుని ఇసుమంతయు గాయపరుచలేదు. అచ్యుతుడు అదే పరిఘను తీసికొని తిరిగి రుక్మిపై ప్రయోగించెను. ఆ ఘాతమునకు రుక్మి మిక్కిలి వ్యాకులుడయ్యెను.

రుక్మి డాలు, ఖడ్గము తీసికొని వసుదేవ నందనునిపై ద్వంద్వ యుద్ధమునకు దిగెను. భగవానుడు సహితము తన చంద్రహాసము తో ఆతని డాలు ఖడ్గములను ముక్కలు ముక్కలు కావించెను. అంత తన కరవాలముతో ఆతని కవచమును, శిరస్త్రాణములను ఒలిచి, ఆతని చేతికి యున్న తొడుగులను సహితము కత్తిరించెను. అంత రుక్మిని భుజములు పట్టి, త్రిప్పి, విసురుగ నేలపై పడవైచి సింహము వేటాడునపుడు మృగములపై లంఘించు రీతిని ఆతనిపై దూకి తన నందక ఖడ్గమును చేతిలోనికి తీసుకొనెను. తన కళ్ళ ఎదుట తన సోదరుడు మరణింపబోవుట కనిన సాధ్వి, శ్రీరుక్మిణి తన పతి పాదములపై బడి ఇట్లనియె “అనంతా! దేవేశ్వరా! జగన్నివాసా! యోగేశ్వరా! మీ శక్తి అచింత్యము. మీరు ఆ జగత్పాలకులు. కరుణాసాగరా! శాలవృక్షముల వంటి విశాల భుజులయిన మీకు నా సోదరుని వధించుట ఉచితము కాదు.”

భీష్మకకుమారి ఈ విధముగ దు:ఖించుట చే ముఖము చిన్నబోయి, కంఠము గద్గదమయినది. తన ప్రియసతిని ఈ విధముగ ఈ అవస్థ యందు తిలకించిన శ్రీకృష్ణుడు రుక్మిని సంహరించుట మాని, ఆతనిని రథ చక్రమునకు కట్టి, తన నిశిత కరవాలము చే రుక్మి సగము తల వెంట్రుకలు, మీసము, గడ్డము గొరిగి విడచివైచెను. ఇంతలో బలరాముడు తన రెండు అక్షౌహిణుల సేనతో అచటికి ఏతెంచెను. ఆతడు కురూపము తో యున్న రుక్మిని చూచి దయతలచి, కట్లు విడిపించి శ్రీకృష్ణుని ఈ విధముగ మందలించెను.

“కృష్ణా! నీ కిది తగదు. నీవు చేసిన ఈ కర్మ లోకనిందితము. నీ భార్య వైపు బంధువులను ఈ విధముగ పరిహసింపవలదు. తన సోదరుని ఈ విధముగ కాంచి రుక్మిణిదేవి నిన్ను గూర్చి ఏ విధముగ తలంచును?” ఇట్లు శ్రీకృష్ణుని మందలించి శ్రీరుక్మిణీదేవి వైపు తిరిగి “కళ్యాణీ! శోకింపకుము. శుచిస్మితా! స్వస్థత పొందుము. ఆర్యకుమారీ! మహామతీ! ప్రియా ప్రియములు ప్రాప్తించునపుడు అవి కేవలము కాల ప్రభావములని తలుపవలెను. ఒక రేణువు ఎట్లు వాయువు యొక్క అధీనము నందుండునో అట్లే సర్వ జగత్తు కాలాధీనము. ఆ కాలమే విష్ణువు అని తెలిసికొనుము. “నేను” “నాది” ఇవి రెండే ఈ జగత్తుయందు బంధకారకములు. అహంకార మమకార రాహిత్యమే మోక్షము. ఇందు సందేహము లేదు. సుఖ దు:ఖములకు కారణము వేరొకటి లేదు. ఈ జగత్తు అంతయు భ్రమయే! శత్రు, మిత్ర, తటస్థులందరూ (అంతయూ) లోకుల అజ్ఞానము వలననే జరుగుచున్నది.” ఈ విధముగ బలదేవుడు సర్దిచెప్పిన పిమ్మట భీష్మక పుత్రుడు వైషమ్యమును వీడి వెడలిపోయెను. శ్రీరుక్మిణీ దేవియునూ ప్రసన్నత నొందినది. రుక్మి మనోరథము వ్యర్థమయినది.

శ్రీకృష్ణ బలరాములచే విడచిపుచ్చిన పిమ్మట రుక్మివగచి, తన వికార రూప వృత్తాంతమును జ్ఞప్తికి తెచ్చుకొని తపశ్చర్యకు పోవుటకు సమాలోచన చేసెను. కానీ మంత్రులందరూ సముదాయించిన పిదప ఆ ఆలోచనను విరమించు కొనెను. పిదప తన నివాసమునకై “భోజకటకము” అను ఉత్తమనగరమును నిర్మించుకొని, ఇక తన జీవితములో కుండిన పురము నందు కాలుమోపలేదు. శ్రీకృష్ణ బలరాములు శ్రీరుక్మిణీదేవిని, యాదవ యోధులను తీసికొని తమ విజయనగారాను మ్రోగించుచూ, ద్వారకకు తిరిగి వచ్చిరి. ఆచట మహోత్సవము జరిగినది.

మార్గశీర్ష మాసము నందు శ్రీహరి వైదిక విద్యానుసారము రుచిరముఖి అయిన శ్రీరుక్మిణీదేవిని శాస్త్రోక్తముగ వివాహము చేసికొనెను. శ్రీరుక్మిణీదేవి శ్రీకృష్ణ పత్నిగా అరుదెంచిన పిదప ద్వారకాపురి అమరావతి వలె శోభిల్లెను.

భీష్మక నందినీ వివాహఘట్టమును ఎవరు భక్తితో పఠించినా, వినిపించినా వారు ఇహలోకమునందు వైభోగపేతముగా జీవించి దేహావసాన సమయమున మోక్షగాములగుదురు.

(శ్రీ గర్గసంహిత యందు ద్వారకా ఖండమందలి నాదర బహుళాశ్వ సంవాదము నందు శ్రీ రుక్మిణీ వివాహము (కళ్యాణము) అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(శ్రీకృష్ణుని పదహారువేల నూట ఎనిమిది రాణులతో వివాహము మరియు వారి సంతాన వర్ణనము. ప్రద్యుమ్నుని ప్రాదుర్భావము మరియు రతి, రుక్మపుత్రికలతో ఆతని వివాహము)

నారదుడు "మిథిలేశ్వరా! ఇపుడు శ్రీకృష్ణుని అన్యపత్నుల వృత్తాంతమును వివరించెదను. ఈయది పాపహరణము, పుణ్య దాయకము మరియు ఆయు:వృద్ధికి సర్వోత్తమసాధకము. యాదవుల యందు సత్రాజిత్తు అను ప్రసిద్ధుడు కలడు. ఆయనకు సాక్షాత్ సూర్య భగవానుడు "శ్యమంతకము" అను దివ్య మణిని బహూకరించెను. శ్రీకృష్ణుడు ఆ మణిని ఉగ్రసేన మహారాజుకు ఇమ్మని సత్రాజిత్ ను ప్రేరేపించెను. కానీ సత్రాజిత్తు ద్రవ్య లోభము చే అందుకు నిరాకరించెను. ఎందుకనగా ఆ మణి దినమునకు ఎనిమిది బారువుల బంగారము నిచ్చునది. ఒకనాడు సత్రాజిత్తు సోదరుడు ప్రసేనుడు ఆ మణిని ధరించి సింధు దేశపు గుర్రము నెక్కి అరణ్యమునకు వేట కరిగెను. అచట ఒక సింహము ప్రసేనుని చంపి ఆ మణిని చేజిక్కించుకొనెను. ఆ సింహమును జాంబవంతుడు సంహరించి ఆ మణిని తీసికొనితన గుహకేగెను.

సత్రాజిత్తు "శ్రీకృష్ణుడు నా సోదరుని హతమార్చి, శ్యమంతక మణిని చేజిక్కించుకొనెను." అని లోకుల యందు ప్రచారము చేసెను. అంత భగవానుని పై నిందా కళంకమంకురించినది. దానిని బాపుకొనుటకై శ్రీకృష్ణుడు కొందరు నాగరికులను వెంటబెట్టుకొని, వనమున కేగి అచట ప్రసేనుని, ఆతని హయము యొక్క మృత కళేబరములను చూచి, తిరిగి గాలించి కొంత దూరము లో ఒక మృత సింహమును గాంచి, అక్కడి కాలి గుర్తులు బట్టి నెమ్మదిగ వెదకుచూ ఋక్షరాజు జాంబవంతుని గుహ ప్రవేశించెను. అచట మణిని కని, జాంబవంతుని తో ఇరువది ఎనిమిది రోజులు ద్వంద్వ యుద్ధమొనర్చి, జాంబవంతుని ఓడించెను. అంత ఆ ఋక్షరాజు తన సుందర తనయ "జాంబవతి" ని మణి సహితముగ ముకుందుని చేతిన పెట్టెను. ముకుందుడు వానిని గ్రహించి, మణిని తీసికొని వచ్చి, సత్రాజిత్తున కిచ్చి తన కళంకమును బాపుకొనెను. ఆ చర్య చే సత్రాజిత్తు లజ్జితుడై, తన కులమందు తన ప్రతిష్ఠను తిరిగి ఇనుమడింపజేసి కొనుటకై, తన కుమార్తెను "సత్యభామ" ను మణితో సహితముగ శ్రీకృష్ణున కర్పించెను. తదనంతరము బంధువత్సలుడయిన శ్రీకృష్ణుడు పాండవులకు సహాయమొనర్చుటకై ఇంద్ర ప్రస్థమునకు ఏగెను. ఆయన నాలుగు నెలలు అచటనే గడిపెను.

ఆయన ఒకనాడు తన ప్రియసఖుడయిన అర్జునునితో కలసి రథారూఢుడై సుందర యమునా తీరమునకు వేటకు బయలుదేరెను. అచట సాక్షాత్ "కాళిందీ దేవి" (యమున) శ్రీకృష్ణుని పతిగా పొందుటకు తీవ్ర తపమాచరించుచున్నది. పాండవ మధ్యముడు అర్జునుడు శ్రీకృష్ణునకు ఆమెను చూపెను. భగవానుడు అంత ఆమెను ఆచటనుండి ద్వారకకు తీసికొని వచ్చి పరమ వైభవముగ వివాహము చేసికొనెను. అవంతీ నరేశునకు అద్భుత రూప లావణ్యరాశి అయిన "మిత్రవింద" అను పుత్రిక కలదు. శ్రీకృష్ణ భగవానుడు ఆమెను కూడా రుక్మిణీ దేవి వలె స్వయంవరమున మిగిలిన వారికి ఓడించి, తీసికొని వచ్చి వివాహము చేసికొనెను. నాగ్నజిత్తు మహా రాజునకు "సత్య" (నాగ్నజితి) అను పుత్రికా రత్నము కలదు. ఆమె వివాహమునకు మహారాజు ఒక వరపరీక్ష నుంచెను. ఆయన వద్ద ఏడు పెను ఎద్దులు యుండెను. ఒకేసారి ఎవరు ఆ ఏడు ఎద్దులతో పోరాడి ఓడించెదరో ఆ వీరునికి మాత్రమే తన కుమార్తె నిచ్చెదనని ప్రతిజ్ఞ చేసెను. శ్రీకృష్ణ భగవానుడు సర్వులు చూచుచుండగా సునాయాసముగ వానిని ఓడించి నాగ్నజితిని హస్తగతము చేసికొని

వివాహమాడెను.

కేకేయ రాజకుమారి "భద్ర" సహితము పరమ శ్రీకృష్ణ భక్తురాలు. ఆమె ఇచ్ఛానుసారము ముకుందుడు ఆమెను గైకొని ద్వారకకు తీసికొనివచ్చి కాళిందివలెనే ఆమెనూ వివాహము చేసికొనెను. భృహత్సేన మహారాజునకు "లక్షణ" అను సుకుమారి అయిన పుత్రిక కలదు. ఆమె సర్వ లక్షణ లక్షిత మరియు శుభసంపన్న. ఆమె స్వయంవరము నందు మత్స్యయంత్రము పరీక్షగా పెట్టబడినది. శ్రీకృష్ణుడు ఆ మత్స్య యంత్రమును భేదించి, శత్రువులను మట్టికరిపించి లక్షణను చేజిక్కించుకొని పాణిగ్రహణము కావించెను.

నరకాసురుడు పదహారువేల ఒక వంద మంది రాకుమార్తెలను బంధించి కారాగృహ వాసులను కావించెను. శ్రీకృష్ణుడు నరకాసురుని వధించి, వారందరినీ విడుదల కావించెను. వారందరూ ఏకగ్రీవముగ మదన మోహనుని పతిగా వరించిరి. వారందరినీ కూడా ద్వారకకు తీసికొని వచ్చి ఒకే ముహూర్తమున వివిధ భవనములందు అన్ని రూపములు ధరించి విధి విధానముగ అందరినీ పరిణయమాడెను. ఈ విధముగ శ్రీకృష్ణునికి పదహారువేల నూట ఎనిమిది మంది భార్యల యందు ఒక్కొక్కరికి పది మంది పుత్రులు కలిగిరి. వారందరూ గుణముల యందు పితృసమానులే! భీష్మకతనయ రుక్మిణి యందు మొట్టమెదట ప్రద్యుమ్నుడు ఉదయించెను. అతడు కామదేవుడు మన్మధుని అవతారము. ఆతడు తండ్రివలెనే సర్వ శుభలక్షణ సంపన్నుడు. నిర్దయుడయిన శంబరాసురుడు పది దినముల పసిగుడ్డును సూత గృహము నుండి అపహరించి సముద్రమున పడవైచెను. అచట ఆ పసిబాలుని ఒక మత్స్యము మ్రింగినది.

ఆ బాలుడు ఆ మత్స్యపు ఉదరమున ప్రవేశించెను కానీ మరణింపలేదు. మత్స్యకారులు ఆ చేపను పట్టి శంబరాసురుని పాకశాల యందు ఈయగా, వంటవారు దానిని కోసిరి. ఆ మత్స్యపు ఉదరమున వారికి ఆ పసిబాలడు కానబడెను. మదనుని పత్ని అయిన రతీదేవి మాయాదేవి రూపమున ఆ శంబరుని పాకశాల యందు యున్నది. ఆమె ఆ బాలుని పెంచి యుక్త వయసు వచ్చిన తరువాత ఆతనికి శంబరుని గూర్చి తెలిపెను. ప్రద్యుమ్నుడు అంత శంబరుని సంహరించి, భార్యా సహితుడై తిరిగి ద్వారకకు ఏతెంచెను. ఈ ప్రద్యుమ్న చరిత్రము మిక్కిలి విచిత్రము మరియు అద్భుతము. శ్రీకృష్ణపుత్రుడు మహారధి ప్రద్యుమ్నుడు భోజకటకము నకు ఏగి తన మేనమామ రుక్మి కుమార్తెను స్వయంవరము నందు హరించి పెండ్లాడెను. ప్రద్యుమ్నునకు అనిరుద్ధుడను పుత్రుడు కలిగెను. ఆతడు పదివేల ఏనుగుల బలశాలి. ఆతడు చతుర్ముఖ బ్రహ్మదేవుని అవతారముగ తలువబడెను. ఆతని దేహకాంతి శరత్కాల ప్రఫుల్ల నీలికమలము వలె ప్రకాశించుచుండెడిది."

నారదుడు "మహారాజా! ఈ విధముగ నేను భగవానుని చతుర్వ్యూహ అవతారములను మరియు ఆయన వివాహ సంబంధ విచిత్ర వృత్తాంతమును నీకు ఎరింగించితిని. ఈయది పుణ్యదాయకము, పాపహరణము, మరియు ఆయు:వృద్ధి కారకము.

(శ్రీగర్గ సంహితయందు ద్వాకకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "శ్రీకృష్ణుని సమస్త రాణుల పరిణయ వర్ణన" అను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(ద్వారకాపురి ధరిత్రిపై ఏతెంచుటకు కారణము; మహారాజు ఆనర్తుని తపశ్చర్య; ఆయన యందు శ్రీకృష్ణ భగవానుని కృప)

బహుళాశ్వుడు "మహామునీ! త్రిలోక విఖ్యాతమయిన "ద్వారకాపురి" ధన్యము. మహానుభావా! ఆ పురి సాక్షాత్ శ్రీకృష్ణ భగవానుని శరీరము నుండి ప్రకటితమయినది. అని మీరు శలవిచ్చిరి. అది ఎపుడు జరిగినది? ఆ వృత్తాంతమును దయచేసి తెలుపవలసినది." నారదుడు "మహారాజా! నీవు మిక్కిలి పుణ్యశీలుడవు. ద్వారకా గమన వృత్తాంతము లోక

ఘాతుక పాతకములను సహితము హరించును."

ఒకనాటి మాట. మనువుకు "శర్యాతి" అను పుత్రుడు కలడు. ఆతడు మేటి చక్రవర్తి. ఆతడు పదివేల సంవత్సరములు పుడమిని ధర్మ పూర్వకముగ పరిపాలించెను. ఆయనకు క్రమముగ ముప్వురు పుత్రులు ఉదయించిరి. వారు వరుసగా ఉత్తానబర్హి, ఆనర్తుడు మరియు భూరిషేణుడు. శర్యాతి తన పాలనానంతరము తన రాజ్యమును మూడుగా విభజించి తూర్పు భాగమును ఉత్తాన బర్హికి, దక్షిణమును భూరిషేణునికి, పశ్చిమభాగమును ఆనర్తునకు ఇచ్చెను. ఆ సమయమున ఆతడు తన పుత్రులతో "నాయనలరా! ఈ పృధివి అంతయు నాది. నేను బలిష్ఠుడనై రాజ్యములు అన్నియు జయించి, అర్జించి, మిక్కిలి ధర్మముగ పరిపాలించితిని. మీరు కూడ అట్లే ధర్మ పరిపాలన చేయవలసినది. ఇది వినిన మధ్యముడు ఆనర్తుడు జ్ఞానికనుక చిన్నగా మందహాసము చేయుచు ఇట్లనియె "మహారాజా! ఈ పృధివి మీది కాదు. మీరు మీ బలము చే ఆర్జింపలేదు, జయింపలేదు, పాలించలేదు. సర్వులలో బలిష్ఠుడు శ్రీకృష్ణ భగవానుడు. ఈ పృధివి సహితము ఆయనదే! ఆయనే ఈ పృధివికి పాలకుడు మరియు ఆయన తేజస్సు తోనే ఈ పృధివి (వసుంధర) ఆర్జింపబడినది. సృష్టి యందు శ్రీహరి సమాన బలిష్ఠుడు వేరొకడు లేడు. ఆ భగవానుడే తన నుండి ఈ జగత్తును సృష్టించి, పోషించి, నాశము చేయుచున్నాడు. ఆయనే పరబ్రహ్మ పరమాత్మ, మరియు గణనము చేయువారల యందలి గరిష్ఠుడయిన కాలము. ఆయన సర్వజీవుల అంతరమున యుండి అందరికి అస్థిత్వము కలిగించు ఆశ్రయుడు. ఆయన యొక్క శాశనము చే వాయువు కదలాడును, సూర్యుడు తాపము కలుగజేయును, పర్జన్యుడు వర్షించును, మృత్యువు హరించును. అట్టి పరిపూర్ణ పరమేశ్వరుడయిన శ్రీకృష్ణుని భక్తిపూర్ణ హృదయముతో అహంకారశూన్యులై భజింపవలసినది".

శర్యాతి చక్రవర్తి స్వయముగ జ్ఞాని అయినప్పటికీ తన కుమారుని వాగ్బాణములు సూటిగా తగిలి ఆయన అహమును గాయపరిచినవి. అంత ఆయన కోపోద్రిక్తుడై, పెదవులు అదురుచుండగా తన పుత్రుడయిన ఆనర్తునితో ఇట్లనియె "ఓరీ! మూర్ఖుడా! నా నుండి దూరముగ పొమ్ము. బాలుడివై యుండి గురువు వలె ఉపదేశము చేయుచున్నావు. నా రాజ్యము ఎంతవరకు యున్నదో అంత దనుక భూమిపై నీవు నివసింపవలదు. నీ సర్వ సహాయకుడయిన శ్రీహరి నీ కొరకు క్రొత్త భూభాగమును సృష్టించునేమో చూతము," అని క్రోధావేశము తో అపహాస్యము చేసెను. అంత అభిమానశీలుడయిన ఆనర్తుడు "మహారాజా! ఎంత వరకూ మీ రాజ్యము కలదో అందు నేను నివసింపను." పిత్రాజ్ఞ చే భహిష్కరింపబడిన ఆనర్తుడు ఆయనకు వీడ్కోలు పలికి సముద్రము నందు ప్రవేశించి పదివేల సంవత్సరములు తీవ్ర తపమాచరించెను. ఆనర్తుని ప్రేమలక్షణ భక్తికి ప్రసన్నుడైన భగవానుడు శ్రీహరి తన స్వస్వరూపము తో ప్రత్యక్షమై వరము కొరుకొనమనెను.

ఆనర్తుడు వెంటనే లేచి, ప్రేమ విహ్వలుడై, రోమాంఛితుడై భగవానుని చరణారవిందముల పై వ్రాలి ఇట్లనియె "మహాప్రభూ! సమస్త హృదయ వాసుడయిన వాసుదేవునికి నమస్కారము. సమస్తాకర్షణ శక్తికి అధిష్ఠాత్రు దేవత వయిన సంకర్షణునికి నమస్కారము. సాధుసంత పురుషులకు పాలకులయిన మీకు నమస్కారము. కామావతారముయిన ప్రద్యుమ్నునికి, బ్రహ్మావతారమయిన అనిరుద్ధునికి నమస్కారము. మహానుభావా! నా తండ్రి నన్ను దేశ భహిష్కృతుని కావించెను. నేను మిమ్ములను శరణు వేడుచున్నాను. నాకు ఏదేని భూ ప్రదేశములను నివాసముగ ఈయవలసినది. ధృవుడు సహితము ఏ భగవానుని కృపాకటాక్ష వీక్షముల చే ప్రజాపతిత్వమును పొందెనో, అట్టి క్లేశ నాశకునికి మరల మరల నమస్కరించుచున్నాను."

ఆనర్తుని దుస్థితిని ఎరింగిన దీనవత్సలుడు భగవానుడు ప్రసన్నుడై మేఘ గంభీర వాణితో ఇట్లనియె "నరేశ్వరా! ఇక ఈ లోకమునందు వేరొక భూమి లేదు. కానీ పరంతపా! నీ భక్తి చే నేను సంతుష్ఠుడనైతిని. అందువలన నీ ప్రతినను నెరవేర్చుటకై నా దివ్యలోకమమయిన వైకుంఠధామము నుండి ఒక వంద యోజనములు చదరపు విస్తీర్ణము గల భూభాగమును నీకు ప్రసాదించెదను. అది అత్యంత నిర్మలము మరియు శుభప్రదము. ఈ విధముగ పలికి శ్రీహరి తన వైకుంఠ థామము నుండి వంద చదరపు యోజనముల భూభాగమును పెళ్ళగించి తెచ్చి ఉత్తుంగ తరంగములతో ఘూర్ణించుచున్న సముద్రము నందు సుదర్శనుని పునాదిగా చేసి దానిపై ఈ భూభాగమునుంచెను. ఆనర్త మహారాజు ఈ భూభాగమును రాజధానిగా చేసికొని ఒక లక్ష సంవత్సరములు తన పుత్ర పౌత్రులతో కూడా రాజ్యము చేసెను.

ఆ రాజ్యము నందు వైకుంఠ భోగములు నిండియుండెడివి. ఆ దేశము ఆయన పేరు మీదుగా ఆనర్త దేశము అని ప్రసిద్ధి నొందినది. ఈ సమాచారము వినిన ఆనర్తుని తండ్రి శర్యాతి మహారాజు మిక్కిలి విస్మితుడాయెను.

పూర్వకాలమందు శ్రీశైలమునకు ఒక పుత్రుడు యుండెడివాడు. ఆతడు రైవతుని చే పెకలింపబడి ఆనర్త దేశమందు ప్రతిష్ఠింపబడుటచే రైవత పర్వతమును పేర ప్రసిద్ధినొందెను. రైవత మహారాజు కుశస్థలీపుర నిర్మాణ మొనర్చి అచట అనేక సంవత్సరములు రాజ్యపరిపాలన కావించెను. ఆతడే తన కన్యక అయిన "రేవతి" తో బ్రహ్మలోకమున కేగెను. ఆ వృత్తాంతమును మనము మునుపు ముచ్చటించుకొంటిమి కదా! ఇందువలన పరమ పుణ్య ప్రదమయిన ద్వారకను దేవతలు పరమ మోక్ష ద్వారముగ పేర్కొందురు. ఈ ఆఖ్యానము మిక్కిలి పుణ్యకారకము మరయు పాపనాశకము.

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "ద్వారకాపురి పృధివి పై ఉదయించుటకు కారణము" అను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యయము

(ద్వారకాపురి, గోమతీ, చక్రతీర్ధ మహాత్మ్యము; కుబేరుని వైష్ణవ యజ్ఞమందు దుర్వాసోముని ద్వారా ఘంటానాదుడు మరియు పార్శ్వమోళి శపింప బడుట)

బహుళాశ్వుడు "మునీంద్రా! పరమకళ్యాణకరమయిన ద్వారకా పురి సర్వతీర్ధమయము. అందుగల ముఖ్యతీర్ధములను దయచేసి నాకు తెలుపవలసినది." నారదుడు "మహారాజా! ద్వారక నుండి ప్రభాసతీర్ధము వరకు గల తీర్ధ భూమి సర్వము యజ్ఞభూమి. అదియే మోక్షదాయకమయిన ద్వారక. అయ్యది వంద యోజనముల విస్తీర్ణము కలది. ద్వారకను దర్శించిన నరుడు నారాయణుడగును. ద్వారక యందు ఒక పురుగు సైతము మరణించెనేని అది చతుర్భుజములు కలిగిన నారాయణ స్వరూపముగ రూపుదాల్చి వైకుంఠ ధామమునకు ఏగును. ఎవరు ద్వారకను గూర్చి వినునో, ఆ నామము ఉచ్చరించునో, ఎవరు ద్వారకా దర్శనము చేయునో, అంతేకాక ఆచట దర్శన స్నానాదికములు పూర్తి అయిన పిదప అతి కొంచెమైననూ దానమొనర్చునో వారు మరణించిన పిదప పరమగతి ప్రాప్తి నొందెదరు.

ఒకానొక సమయమున రైవతుడు భక్త్యావేశముతో ప్రేమాస్పదుడై యుండగా ఆయనకు శ్రీహరి తన స్వస్వరూపమును దర్శింపజేసెను. ఆ సమయమున భగవానుని కన్నులనుండి ఆనందభాష్పములు జాలువారినవి. భగవానుని కన్నుల నుండి ఆవిర్భవించిన అశ్రుబిందువులు ఒక మహా నదిగా మారి "గోమతీ" నదిగా ప్రకటిత మయినది. ఆ దివ్య సరితా దర్శన మాత్రము చే బ్రహ్మ హత్యాది పాతకములు తుడిచిపెట్టుకొని పోవును. ఏ మానవుడు గోమతీ తట రజమును శిరమున ధరించునో తక్షణమే వంద జన్మల పాపము నశించును. మానవుడు ఏ చోట స్నానము చేయుచున్ననూ గోమతీ నామము ఉచ్ఛరించినంత మాత్రమున నిస్సందేహముగ గోమతీ నదీ స్నాన ఫలితమును పొందును. విదేహరాజా! సూర్యుడు మకర రాశి యందు ప్రవేశించినపుడు మాఘ మాసము నందు ప్రయాగ లో త్రివేణీ సంగమము నందు స్నానము చేసిన ఎడల వంద అశ్వమేధ యాగములు చేసిన ఫలము లభించును. కానీ అదే స్నానము గోమతి యందు చేసిన యెడల సంగమ స్నానమునకు వేయిరెట్లు అధికఫలము లభించును. గోమతీ మహాత్మ్యమును నుడువుటకు సాక్షాత్ చతుర్ముఖ బ్రహ్మదేవుడు సహితము అసమర్ధుడు.

గోమతి యందలి చక్రతీర్ధము నందు ఏఏ పాషాణములు కలవో అవన్నియు సుదర్శనచక్ర భావప్రాప్తి నొందును. అందువలన వాటిని తప్పక పూజింపవలసినది. చక్రచిహ్నాయుక్తమయిన చక్రతీర్ధము నందు ద్వాదశి నాడు స్నాన మొనర్చిన మానవుడు పాపభాజనుడైనప్పటికినీ, చక్రపాణి పదము ప్రప్తించును. కోట్లాది జన్మల సంచిత పాపము చే పతితుడయిన పాతకుడు కూడా చక్రతీర్ధ సోపానముల వద్దకు అరుదెంచెనేని అతడు మోక్షపధమునకు ఆరూఢుడగును.

బహుళాశ్వుడు "మహామతీ! చక్రతీర్ధమునకు ఆ శుభనామము ఎట్లు కలిగెను? ఈ తీర్ధము అత్యంత పుణ్యతీర్ధము ఎట్లయ్యెను?" నారదుడు "ఈ విషయమును వివరించు ఒక ప్రాచీన ఇతిహాసము కలదు. ఈయది శ్రవణ మాత్రము చే

సర్వ పాపములు దగ్ధమగును. ఒకనాటి మాట! అలకాపురాధీశుడు, ధర్మాత్ముడు, రాజాధిరాజు, నిధిపతి, కుబేరుడు కైలాసమునకు ఉత్తర తటమున వైష్ణవ యజ్ఞమారంభించెను. ఆ యజ్ఞము నందు సాక్షాత్ త్రిమూర్తులు, అష్ట దిక్పాలకులు, మహేంద్రుడు, పృధివీ, సిద్ధ, సాధ్య, యక్ష, గంధర్వ, అప్సరసలు అందరూ పాల్గొనిరి. సమస్త మహర్షి, బ్రహ్మర్షి, గణములు సహితము పాలుపంచుకొనిరి. ఆ దివ్య యజ్ఞమందు వివిధ దేవతా గణములకు వివిధ కార్యములు అప్పగింప బడినవి.

ఆ సమయము నందు కుబేర పుత్రుడయిన నలకూబరుడు ధనాధ్యక్షునిగనూ, వీరభద్రుడు యజ్ఞ రక్షకునిగనూ, సత్పురుషుల సేవ యందు గజాననునీ, సమస్త మరుద్గణములుకు వంటశాల యాజమాన్యము, ధర్మ పరాయణుడైన కార్తికేయునకు అతిధిజన స్వాగత సత్కారములు, సంపూర్ణ శాస్త్ర విద్యా విశారదుల యందు శ్రేష్ఠులయిన "ఘంటానాద, పార్శ్వమౌళి" లను కుబేర సచివులిరువురిని దానాధ్యక్షులుగనూ నియోగింపబడిరి. ఈ విధముగ ఆ మహాయజ్ఞము విధి విధానముగ, పరమ వైభోగపేతముగ పూర్తి కావింపబడినది. యజ్ఞాంతమందు కుబేరుడు అవభృత స్నాన మాచరించి దేవతలకు, బ్రాహ్మణులకు యోగ్యమయిన బహుమతులు, దక్షిణలు ఇచ్చెను. ఈ విధముగ వైభవముగ యజ్ఞము ముగిసి సర్వులు సంతుష్ఠులయిన సమయమున దండ, ఛత్ర జటాజూటధారి అయిన దుర్వాస మహాముని అచటకు ఏతెంచెను. ఆయన స్వభావ రీత్యా కోపిష్ఠి. ఆయన పావుకోళ్ళు ధరించి, కడుపు బాగుగా లోనికి పోయి, ముఖమునందు మీసములు, గడ్డము బాగా పొడవుగా యుండి, కుశాశనము, సమిధలు, జలపాత్ర పట్టుకొని మృగ చర్మధారియై అచటకు వేంచెసెను. అక్కడకు వేంచేసిన మహర్షిని చూచి కుబేరుడు మనసునందు కొంచెము భయభీతుడై, అత్యంత భక్తి ప్రపత్తులతో ప్రదక్షిణ ప్రణామములాచరించి, చరణముల పైబడి ఇట్లనియె "బ్రహ్మన్! మీ పదములపై వ్రాలుట చే నా జన్మము సఫలమూ, మా భవనము సార్ధకము అయినవి. మీ ఆగమనము చే ఈ యజ్ఞము సహితము సఫలమయినదని తలుచుచున్నాను." ఈ విధమయిన ప్రీతి కరములయిన పలుకులచే దుర్వాసోముని ముదమునొంది ఇట్లనియె "రాజరాజా! నీవు ధర్మాత్ముడవు, దానశీలుడవు, మరయు మీదు మిక్కిలి బ్రాహ్మణ భక్తుడవు. నీవు శ్రీ విష్ణు భగవానునికి ప్రీతి కలిగించు వైష్ణవ యజ్ఞమును ఆచరించితివి. ప్రభూ! వైశ్రవణా! నేను నిన్ను ఎన్నడూ ఏదియునూ అడుగలేదు. కానీ నేడు నిన్ను దానశిరోమణిగా తలంచి యాచించుచున్నాను నీవు నా యాచనము సఫలము చేసిన ఎడల నీకు ఉత్తము వరము ఒసంగుదును. లేని యెడల భయంకర శాపముచే నిన్ను దగ్ధమొనర్చెదను. త్రిలోకముల యందలి సర్వ నిధులు నీ ఇంటి యందు కలవు. అవి అన్నియు నాకు సమర్పింపవలసినది. అందువలన నాకు మంచి జరుగును. నేను ఆ నిధుల కొరకై ఇచటకు ఏతెంచితిని."

అదివినిన కుబేరుడు "మహాప్రభూ! దయచేసి సర్వమూ తీసికొన వలసినది." అని నిధిపతి సర్వమునూ దాన మొసంగుటకు సంసిద్ధుడాయెను. కానీ దానాధ్యక్షులయిన ఘంటానాద, పార్శ్వ మౌళిలు, లోభముతో మోహితులై కుబేరుని తో ఇట్లనిరి. "మహాప్రభూ! ఈ బ్రాహ్మణుడు ఏకాంతవాసి, మరియు లోభి. ఈతనికి ఒక లక్ష దివ్య దీనారములనిచ్చి పంపవలసినది. ఈ పలుకులు వినిన దుర్వాసో మహాముని అగ్రహోదగ్రుడై, భృకుటి ముడిచి, రోషతామ్రాక్షుడై నిలచెను. ఆయన చర్యకు బ్రహ్మాండమంతయు వణికినది. అంత కుబేరుడు ఆయన పాదములపై బడెను. అంత ఆ మహాముని కుబేరుని క్షమించి ఆతని మంత్రులను వీక్షించి ఇట్లనియె.

"దుష్టుడా! ఘంటానాదా! నీ బుద్ధి పాపము నందు నెలకొని యున్నది. నీవు అత్యంత లోభివి. మొసలి వలె ధనము గ్రహణము చేసి యుందువు. పాపాత్ముడా! నీవు మొసలివి కమ్ము!.

"పాపాచారుడా! పార్శ్వమౌళీ! నీవు ధనలోభము, మరియు ధనమదము చేనిండి కుంజరము వలె ప్రేరణ కావించు చున్నావు. అందుచేత నీవు ఏనుగువు కమ్ము. ఇట్లు వీరిరువురికి శాపము నొసంగి కుబేరుని నుండి నిధులను పొంది, ధనపతికి మిక్కిలి దుర్లభమయిన వరమొసంగెను. "వైశ్రవణా! ఈ దాన ఫలితముగ నీ నిధులు ద్విగుణీకృతమగు గాక!" ఈ విధముగ పలికి తన నిధులను గైకొని అచటనుండి వెడలెను. ఆహా! పరమ తేజస్వులయిన మహర్షుల బలము ఎంత అద్భుతము?"

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి "చక్రతీర్థ మహాత్మ్యము" అను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(మకరము, గజములుగ మారిన సచివుల పోరాటము
మరియు శ్రీహరి ద్వారా వారి ఉద్ధరణ)

నారదుడు "దుర్వాసోముని శాపము చే కుబేర మంత్రులిరువురు ఖిన్నులై, మిక్కిలి దు:ఖితులై యుండిరి. ఆ యజ్ఞము నందు సాక్షాత్ విష్ణుభగవానుడు సహితము యుండెను. వారిరువురు ఆయనను శరణము నొందిరి. అంత శ్రీహరి "నా అర్చనా యుక్త యజ్ఞమందు మీరిరువురు దు:ఖమొందవలసి వచ్చెను. బ్రాహ్మణ వాక్యము దాటు శక్తికానీ, మార్పుచేయు శక్తి కానీ నాకు లేదు. మీరిరువురూ ఆ జంతు జన్మము నెత్తవలసినదే! మీరిరువురకు ఎప్పుడు యుద్ధము సంభవించునో అపుడు నా కృపచే మీకు శాప విమోచనము కలిగి మీ పూర్వరూపములు పొందెదరు." శ్రీవిష్ణు భగవానుడు ఇట్లు పలుకగనే వారిరువురు మకర కుంజర రూపములు ధరించిరి, కానీ వారికి పూర్వజన్మ స్మృతి కలదు. ఘంటానాదుడు మకరమై వందల ఏండ్లు గోమతీ నదియందు నివసించెను. ఆతడు మిక్కిలి వికృత, భయంకర రౌద్రరూపము ధరించి యుండెను. పార్శ్వమౌళి రైవత పర్వతారణ్యముల యందు చతుర్దంతి కుంజరముగ రూపాంతరము చెందెను. శరీరము కాటుక వలె నల్లగా యుండి, మూపు నూరు ధనువుల ఎత్తు యుండి ఆ కుంజరము వనమంతయూ నిర్భయముగ తిరుగుచుండెడిది.

ఒకనాటి వైశాఖ మాసమందు ఆ గజరాజు తన పర్వత కంధరముల నుండి బయటకు వచ్చి, తన గణములతో నెమ్మదిగ ప్రవహించుచున్న గోమతీ నది యందు స్నానార్థమై ప్రవేశించెను. చాలాసేపు ఆ జలముల యందు క్రీడించి, తన దంతములు, తొండముచే శిశునాగములను స్నానము చేయించుచూ ఆనందించు చుండెను. ఆ సమయమున దైవ ప్రేరణ చే మహా బలిష్ఠమయిన మకరము కుంజరము యొక్క పాదమును పట్టుకొని నీటి లోనికి లాగెను. వారిరువురి మధ్య సంగ్రామము నందు మిగిలిన కుంజరములు సహాయము చేయుటకై అసమర్థులై యుండెను. ఈ విధముగ మకర కుంజరములు ఏబదిఐదు సంవత్సరములు తీవ్ర సంగ్రామ మొరర్చెను. ఆ సంగ్రామము సత్పురుషుల మధ్యన జరుగుచున్నది.

ఈ విధముగ కాల పాశమునకు వశీభూతులై తీవ్ర కష్టమునకు లోనైన కుంజరమునకు పూర్వ జన్మ స్మృతి కలిగి ప్రేమ లక్షణ భక్తి చే శ్రీహరి చరణారవిందములను ఆశ్రయించెను.

అంత ఆ గజేంద్రుడు ఈ విధముగ మొరపెట్టెను "శ్రీకృష్ణా! అర్జున సఖా! శ్యామసుందరా! దేవేశా! మీకు నమస్కారము, పరమపావనా! పుణ్యకీర్తి స్వరూపా! పాపపాశము నుండి నన్ను రక్షింపవలసినది! రక్షింప వలిసినది! ఈ విధముగ మకరము చే పీడింపబడుచూ, తన స్మరణ చేయుచున్న కుంజరమును రక్షించుటకు విష్ణు భగవానుడు మిక్కిలి వేగముగ గరుఢారూఢుడై ఏతించి, తన సుదర్శన చక్రాయుధము చే మకర మస్తకమును ఖండించెను. పిదప ఆ సుదర్శన చక్రము పెద్దగా ధ్వని చేయుచూ గౌమతీ కుండమున పడినది. అందుచే అచ్చటి పాషాణములన్నియునూ, చక్రాంకితములయినవి. ఆ దివ్య చక్ర నేమిచే అచట "చక్ర తీర్ధము" ఏర్పడినది. మస్తకము ఖండింపబడుట చే మకరము, శ్రీకృష్ణ దివ్యానుగ్రహము చే కుంజరము తమ పూర్వ రూపములు పొందినవి. అంత కుబేర సచివులిరువురు శ్రీహరికి ప్రదక్షిణ పూర్వక ప్రమాణములిడి తిరిగి తమ యధా స్థానములకరిగిరి. దేవతలు పుష్పవృష్ఠి కురిపించిరి. భగవానుడు తిరిగి తన ధామమునకు ఏగెను.

ఏ మానువుడు ఈ చక్ర తీర్ధ వృత్తాంతమును వినునో ఆతడు చక్రతీర్ధ స్నాన ఫలితము నొందును. ఇందు సందేహము లేదు. ఏ మానవుడు ఏకాగ్ర చిత్తుడై ఈ పుణ్య మయ వృత్తాంతమును వినునో ఆతని దుస్వప్నములు నాశనమై సత్ స్వప్నములు కానిపించును.

(శ్రీగర్గ సంహితయందు ద్వాకకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "మకర కుంజరముల శాప విమోచనము" ను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(త్రిత మహాముని శాపము చే "కక్షీవానుడు" శంఖరూపుడగుట మరియు శ్రీకృష్ణుని చే ఆతని ఉద్ధారము)

నారదుడు "మహారాజా! ద్వారక యందు శంఖోద్ధారము అను తీర్ధము కలదు. అయ్యది అన్ని తీర్థముల యందు ప్రధానమయినది. ఏ మనుష్యుడు ఈ తీర్థము నందు స్నానమాచరించి సువర్ణదానము చేయునో ఆతడు సర్వోపద్రవములు దాటి విష్ణులోకము చేరును. ఒకానొక సమయమున పరమ ప్రశాంత చిత్తుడు, శ్రీకృష్ణ భక్తుడు అయిన "త్రిత" మహర్షి తీర్ధ యాత్రా వశమున వివిధ తీర్ధ సేవనము చేయుచూ ఆనర్త దేశమేతెంచెను. అచట గల ఒక మనోహర సరోవరమును గని, అందు స్నానమాచరించి శ్రీహరిని పూజించెను. ఆయన శిష్య గణములందు "కక్షీవానుడు" అను శిష్యుడు కలడు. ఆ పూజయందు మునియొక్క సుందరలక్షణ సంపన్నమయిన శంఖమును లోభము చే కక్షీవానుడు అపహరించెను. తన పూజా శంఖము అపహరింపబడుట గమనించి త్రిత మహర్షి "నా శంఖమును అపహరించిన దుష్టుడు అవవ్యము శంఖమగు గాక!" అని శపించెను. తక్షణము కక్షీవానుడు శంఖరూపుడై క్రిందబడెను.

అంత ఆతడు తన గురుచరణములపై బడి రోదించి ఇట్లనియె "భగవాన్! నన్ను దయచేసి రక్షించండి." అంత త్రిత మహర్షి శీఘ్రమే శాంతుడై ఇట్లనియె "దుర్బుద్ధీ! ఎంతపని చేసితివి? నా వాక్కు వమ్ము కాదు. నీవు చేసిన శంఖాపహరణ పాపమునకు శిక్ష నీ వనుభవింప వలసినదే! నీవు ఇక్కయే యుండి శ్రీకృష్ణ చరణ కమలములను భక్తితో చింతించుచుండుము. అదియే నిన్ను ఉద్ధరించును." అట్లు పలికి త్రిత మహర్షి నిష్క్రమించెను. కక్షీవానుడు శంఖరూపమును ధరించి, ఆ సరస్సు లోనికి దూకి అచటనే పరమ పావనమయిన శ్రీకృష్ణనామ స్మరణ చేయుచూ వంద సంవత్సరములు గడిపెను. తదనంతరము భక్తవత్సలుడయిన పరిపూర్ణ భగవానుడు శ్రీకృష్ణుడు అచటికి వచ్చి తన మేఘ గంభీర ధ్వనితో "భయపడవలదు" అని అభయమిచ్చెను.

అంత శంఖుడు తలపైకెత్తి "దేవదేవా! జగత్పతీ! నన్ను రక్షించండి! రక్షించండి! అని మొరపెట్టెను. అంత సర్వ సమర్ధుడు, కృపా పరాయణుడు, శ్రీకృష్ణుడు పూర్వము గజరాజును ఉద్ధరించిన యటుల తన దివ్య హస్తము తో శంఖుని పైకి తీసెను.

ఆయన దివ్య స్పర్శ తగిలిన వెంఠనే శంఖుడు దివ్య రూపము ధరించి, చేతులు జోడించి, నమస్కరించి ఇట్లు స్థుతించెను, "వాసుదేవా! గోవిందా! పురుషోత్తమా! దీన వత్సలా! దీననాథా! ద్వారకా నాథా! పరమేశ్వరా! మీకు మరల మరల ప్రణామములు. మహాప్రభూ! మీరు ధృవునికి ధృవపధము నొసంగిరి; ప్రహ్లాదుని పీడను హరించిరి; గజరాజునుద్ధరించిరి. బలి పురస్కారమును సహితము స్వీకరించిరి. అటువంటి మీకు నమస్కారము. ద్రౌపదీ వస్త్రాపహరణ సమయమున ఆమె శీలమును కాపాడిరి. విషము, అగ్ని, వనవాసము మొదలయిన క్లేశముల నుండి పాండవులను నిరంతరము కాపాడిన మీకు నమస్కారము. యదుకుల రక్షకులు మరియు గోపగోపీ జనమును ఇంద్రుని వజ్రము నుండి కాపాడిన మీకు నమస్కారము. గురువునకు, దేవకీ మాతకు, బ్రాహ్మణునికి పోయిన పుత్రులను తీసికొని వచ్చిన మీకు మరల మరల నమస్కారము. జరాసంధుని కారాగారము నండి అనేక మంది రాజులను రక్షించిన దీన వత్సలులు, నృగ మహారాజును ఉద్ధరించిన ఉదారులు, సుదాముని దీనతను దూరమొనర్చిన మహానుభావులు అయిన మీకు నమస్కారము. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ రూపముల చే ప్రకాశించు మీ వ్యూహ చతుష్టయమునకు నమస్కారము. దేవా! మీరే నా మాతా, పితా, బంధు, సఖ, విద్యా, ధన మరియు సర్వస్వము. ఈ విధముగ శ్రీహరిని స్థుతించి, ప్రేమపూరితుడయిన కక్షీవానుడు ఒక శ్రేష్ఠ విమానము నధిరోహించి యాదవులందరూ చూచుచుండగా వందలాది సూర్య తేజస్సుతో ప్రకాశించుచూ, దశదిశలనూ ఉద్భాసితము చేయుచూ, సమస్త ఉపద్రవ రహితమయిన

వైకుంఠము చేరెను. శ్రీహరి శంఖుని ఉద్ధరించిన సరోవరమే "శంఖోద్ధార తీర్థము" గా ప్రసిద్ధినొందెను. ఏ పుణ్యశీలుడు ఈ శంఖోద్ధారమను ఉపాఖ్యానమును శ్రవణము చేయునో ఆతడు శంఖ తీర్థమందు స్నానము చేసిన ఫలితము నొందును. ఇందు సందేహము లేదు."

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "శంఖోద్ధార తీర్థ మహాత్మ్యము" అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(ప్రభాస, సరస్వతీ, బోధపిప్పలము మరియు గోమతీ సింధు సంగమ మహాత్మ్యము)

నారదుడు "మహామతీ! విదేహరాజా! ఇపుడు నీకు ప్రభాస తీర్థ మహాత్మ్యము విశదీకరించెదను. వినుము. ఈయది పుణ్యకారకము, పాపనాశకము, మరియు తేజస్సును వృద్ధి నొందించునది. రాజా! బృహస్పతి సింహ రాశి యందు ప్రవేశించునపుడు గోదావరి యందునూ, బృహస్పతి కుంభరాశి యందు ప్రవేశించినపుడు హరిద్వారము నందునూ,సూర్యగ్రహణ కాలమున కురుక్షేత్రము నందునూ, చంద్రగ్రహణ సమయమందు కాశీ క్షేత్రమున స్నానము చేసిన ఎడల ఎంత పుణ్యము లభించునో దానికి వందరెట్లు పుణ్యము ప్రభాస క్షేత్రమందు ప్రతిదినము స్నానమాచరించుట వలన లభించును. దక్షశాపము చే "రాజయక్ష్మ" రోగ పీడితుడయిన చంద్ర భగవానుడు ఎక్కడ శాప విముక్తి పొంది తన కళలను తిరిగి పొందెనో ఆ దివ్య ప్రదేశమే "ప్రభాస తీర్థము". ఈ తీర్థము నందు పరమ పుణ్యమయ పశ్చిమ వాహిని సరస్వతీ నది ప్రవహించుచున్నది. ఆ జలముల యందు స్నాన మాచరించిన పరమ పాపి సహితము బ్రహ్మ మయుడు అగును.

రాజా! ఈ సరస్వతీ తటము నందు "బోధ పిప్పలము" అను ప్రసిద్ధ తీర్థము కలదు. ఇక్కడనే శ్రీకృష్ణ భగవానుడు ఉద్ధవునకు పరమ కళ్యాణ భగవద్ధర్మములను ఉపదేశించెను. ఈ బోధ పిప్పలమును యథావిధిగ పూజన మొనర్చి, శిరసు వంచి, ఎవరు స్పర్శించి పిదప భాగవత పురాణమును వినెదరో, లేక మనసున సంశయము లేకుండా మౌనముగ భాగవతము నందలి అర్ధ శ్లోకమును గానీ, పావు శ్లోకమును గానీ పఠించిన ఎడల ఆ మానవునికి విష్ణుపదము కరతలామలకమగును. ఎవరు ప్రభాస తీర్థమందు భాద్రపద పూర్ణిమ యందు స్వర్ణసింహాసనము నందు భాగవత పురాణమును యుంచి దానమొనర్చిన ఎడల వారు పరమగతి ప్రాప్తి నొందెదరు. ఏ మనుష్యులు ఎన్నడునూ భాగవతపురాణమును వినరో, ఎవరు పరమ పురుషుడయిన శ్రీహరిని ఆరాధించరో, ఎవరు అగ్ని ద్వారా ఆహుతులు సమర్పించరో వారి జన్మ వ్యర్థము.

ద్వారక యందు గోమతీ సాగర సంగమము కలదు. ఈయది తీర్థ రాజములన్నింటి యుందునూ శ్రేష్ఠమయినది.

ఇక్కడ స్నానమాచరించిన మానవుడు తప్పక వైకుంఠ ధామము చేరును. గంగాసాగర సంగమమందు స్నానమాచరించిన ఎడల వంద అశ్వమేధ యాగములు చేసిన ఫలము లభించును. కానీ గోమతీ సాగర సంగమ స్నాన ఫలితము అద్దానికి వేయి రెట్లు అధికము. దీని విషయమై ఒక పురాణేతిహాసము కలదు. దీనిని విన్నంతనే మనుష్యుడు మహాపాతక విముక్తుడగును.

పూర్వకాలమందు హస్తినాపురమున "రాజమార్గపతి" అను ఒక శ్రేష్ఠుడయిన వైశ్యుడు నివసించెడి వాడు. ఆయన గౌరవనీయుడు మరియు భూతల కుబేరుడు. కాల ప్రభావమున ఆతడు వేశ్యాలోలుడై విట సంఘము నందు బహు చతురుడుగ పేరు పొందెను. ఆతనికి ద్యూత క్రీడ యందు మిక్కిలి వ్యామోహము కలిగి కాలక్రమమున లోభ, మోహ, మదములు పెరిగి మిక్కిలి ఉన్మత్తుడాయెను. పిదప దుస్సంస్కరణల చే ఆ వైశ్యుడు మిక్కిలి దుష్టుడై, ఎల్లప్పుడూ అసత్యము

లాడుచూ, కూడని కర్మములాచరించుట మొదలిడెను. ఆతడు ఎన్నడునూ బ్రాహ్మణులకు, దేవతలు, పితరులకు సహితము ఒక్క రూక కూడ దానము సమర్పించలేదు. ఎక్కడేని భగవత్కథ, జరుగునేని, ఆతడు మొగము త్రిప్పుకుని తొందర తొందరగ అచటి నుండి వెళ్ళిపోయెడి వాడు.

ఆతడు తన మాతా పితరులను సేవింపలేదు. పుత్రులకు ధనము నీయలేదు. ఎంత నీచమునకు దిగజారెనన, తన ధర్మపత్నిని సహితము విడచి, ఆమె నుండి దూరముగ నివసింప సాగెను. వేశ్యాగమనము చే సగము ధనము, చోరులచే మిగిలిన ధనము హరింపబడగా, మిగిలిన అతికొద్ది ధనము వ్యసనములతో పొగొట్టుకొనెను. పుణ్యము చే ధనవృద్ధి అగును. పాపము చే నిశ్చయముగ నష్ఠము జరుగును. ఈ విధముగ విపరీత వేశ్యాలంపటుడయిన ఆ దుష్ఠవైశ్యుడు హస్తిన యందు దొంగతనము చేయుట ప్రారంభించెను. ఆ సమయము నందు శంతన మహారాజు రాజ్యపాలన కావించుచుండెను. మహారాజు ఆ చోరుని బంధించి రాజ్య భహిష్కరణ శిక్షను విధించెను. ఆతడు అడవి యందు పడి, అచటి మృగములను హింసించుచు నివసించుచుండెను. ఇంతలో అచట అనావృష్ఠి కారణమున దుర్భిక్ష మేర్పడెను. అంత వైశ్యుడు పశ్చిమము వైపు ప్రయాణించెను. ఆ అరణ్య మార్గమున ఆ దుష్ఠ నిర్భాగ్య వైశ్యుడు ఒక సింహము పాలబడి పరమపదించెను. అంత యమదూతలు వచ్చి, తమపాశముల తో పట్టి, అధోముఖుని చేసి భయపెట్టుచూ నరకమార్గమున తీసికొని పోవు చుండిరి. ఇంతలో ఒక గ్రద్ద అచట వ్రాలి ఆతని దేహము నందలి భుజము యొక్క మాంసమును పీకి, తినుటకు తన చంపుటములతో పట్టి ఎగరెను. ఇంతలో మాంసము దొరకని ఇతర గృధ్రములు ఈ గ్రద్ద పై బడి ఈ మాంసఖండమునకై పొట్లాడు చుండెను. ఆ సమయమందు వేరొక బలమయిన గ్రద్ద తన వాడి గోళ్ళతో మొదటి గ్రద్ద ముఖమును చీరెను. దానిచే మిక్కిలి బాధ కలిగి తన చంపుటములు మధ్యమున్న మాంస ఖండమును వదలుటచే అయ్యది గోమతీ సాగర సంగమము నందు పడెను. ఆ మాంసఖండము ఆ నీటియందు మునగగనే యమదూతల నుండి ఆకస్మికముగ వైశ్యుడు విముక్తుడై, చతుర్భుజుడై సుందర రూపము ధరించి, దేవతగా పరిణమించి, యదదూతలు చూచుచుండగనే దివ్య విమానారూఢుడై సర్వదిశలనూ ప్రకాశము గావించుచూ శ్రీహరి పరమధామము చేరెను. ఏ మానవుడు ఈ గోమతీ సాగర సంగమ మహాత్మ్యమును వినునో, ఆతడు సమస్త దురిత దూరుడై విష్ణు సాయుజ్యమును పొందును.

(శ్రీగర్గ సంహితయందు ద్వాకకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "ప్రభాస, సరస్వతీ, బోధపిప్పల, గోమతీ సింధు సంగమ మహాత్మ్యము" అను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(ద్వారక యందు సముద్రము మరియు రైవత పర్వత మహాత్మ్యము)

నారదుడు "నరేశ్వరా! ఇపుడు ద్వారక యందలి సముద్రము యొక్క మహాత్మ్యమును వర్ణించెదను. వినుము. ఈయది మిక్కిలి పుణ్యకారకము, పాపనాశకము, మరియు తీర్థ స్నాన ఫలమును ప్రసాదించును. మహీపతీ! ఎవరు వైశాఖ మాసము నందలి పూర్ణిమ నాడు వ్రతియై, విధి విధానముగ నదీపతి అయిన సముద్రమునకు పూజన, నమస్కారములు సలిపి రత్నములు దానమిచ్చెదరో, వారి శరీరము నందు త్రిమూర్తులు నివసించుట మొదలిడుదురు. అటువంటి వాని దర్శనమాత్రమున మనుష్యులు కృతార్థులగుదురు. అంతేకాక అటువంటి మానవుని ఎవరు స్పర్శింతురో, వారివారి బ్రహ్మహత్య మొదలగు పాతకములు సహితము పటాపంచలగును. ఆ పుణ్యశీలి ఎక్కడకు వెళ్ళునో అచటి భూమి సహితము మంగళమయమగును. జగత్ వధ కావించిన పరమ పాపాత్ములు సహితము ఇటువంటి పుణ్యశీలుని కాంచినచో ఆ పాపి మరణానంతరము అతని పాపములు పరిహరింపబడి మోక్షగామి అగును.

మానదా! ఇపుడు రైవత పర్వత మహాత్మ్యము వినుము. ఈయది పాపహరణము, పుణ్యకారకము మరియు భోగ మోక్ష దాయకము, గౌతమ మహర్షికి "మేధావి" అను పుత్రుడు కలదు. అతడు బుద్ధిమంతుడు మరియు మిక్కిలి విష్ణుభక్తుడు . ఆతడు వింధ్యాచలము నందు పది లక్షల సంవత్సరములు తీవ్ర తపమాచరించెను. ఇంతలో ఆయన వద్దకు "అపాంతరతముడు" అను ఋషి ఏతెంచెను. కానీ తీవ్ర తపస్వి అయిన మేధావి అయనను చూచి లేవలేదు. అంత అపాంతరతముడు కోపించి "సాధు సంతపురుషుల యందు భక్తిలేని పాపాత్ముడా! నీకు తపస్సు యందు అమిత గర్వము కలదు. నీ స్థితి పర్వతము వలె తమోమయము. అందువలన దుర్మతీ! నీవు ఇక్కడనే పర్వతమగుము," అని శపించి వెడలి పోయెను. మేధావికి శైలభావము ప్రాప్తించి శ్రీశైల పర్వతమునకు పుత్రునిగ ఉదయించెను. కానీ ఆయన పూర్వ జన్మమందు మహా బుద్ధిమంతుడు, తపశ్శాలి, మీదు మిక్కిలి గొప్ప విష్ణుభక్తుడు అగుటచే ఆయనకు తన పూర్వ జన్మ జ్ఞప్తికలదు. ఒకనాడు నా (నారదుడు) ముఖతా ద్వారకాపురి మహాత్మ్యమును వినినవాడై శైలపుత్రుడు ఇట్లనియె "మహామునీ! మీరు దీనవత్సలులు. అందువలన మీరు శీఘ్రముగ రైవతుని వద్దకు ఏగి ఆయనతో నా ప్రార్థన విన్నవించవలసినది, "ఓ! మహాబలీ! రైవతా! నా ఎడల మీరు ప్రీతినందిరేని నన్ను శీఘ్రమే ఇచటి నుండి ద్వారకాపురి తీసికొని వెళ్ళవలసినది." విష్ణు భక్తులకు శాంతిని ప్రసాదించుట నా కర్తవ్యము.

అందువలన నేను శీఘ్రమే రైవతుని వద్దకు ఏగి పర్వతపుత్రుని వినతిని వినిపించితిని. అంత రైవతుడు మిక్కిలి ప్రసన్నుడై ఇట్లనియె "మునీంద్రా! ఇచట పర్వతములేవియును లేవు. అందుచే ఆ పర్వతము యొక్క రెండు భుజములు పట్టుకొని పైకెత్తి, ద్వారకకు తెచ్చి ప్రతిష్ఠించెదను." ఇట్లు ప్రతిజ్ఞ చేసి రైవతుడు శ్రీశైల పుత్రుని వద్దకు వచ్చు సమయమునకు మునుపే నేను శ్రీశైల పర్వతము వద్దకేగి నేను కలహభోజనుడను గావున ఆయనకు తన పుత్రుడు తస్కరింపబడునని తెలిపితిని.

అంత శ్రీశైల పర్వతము హిమాలయము మరియు సుమేరు పర్వతములు కడకేగి పుత్ర వ్యామోహమున వ్యాకులుడై ఇట్లనియె "మహానుభావులారా! దైవము నాకు ఒక్క పుత్రుని ప్రసాదించినది. నాకు ఎంతోమంది పుత్రులు లేరు. ఆ ఒక్క పుత్రుని తనతో తీసికొని పోవుటకై మహాబలి అయిన రైవతుడు ఏతెంచెను. మహాబలుడయిన ఆ మహారాజు కారణమున నా కుమారుడు విదేశములకు ఏగుచున్నాడు. అందుచే నేను మిమ్ములను శరణు జొచ్చుచున్నాను. మీరిరువురు కలసి నా పుత్రుని నాకు ఇప్పించవలసినది."

జాతి పక్షపాతమున సుమేరు హిమాలయములు అనేక ఇతర పర్వతములను కూడగట్టుకొని యుద్ధ సన్నద్ధులైరి. ఇంతలో హనుమంతుడు ద్రోణగిరిని పెకలించినటుల, రైవతుడు తన చేతులతో ఆ శైల పుత్రుని భుజములు పట్టుకొని పైకిలేపి తన భుజములు యందు నిడుకొని తిరిగి వెళ్ళుటకు సంసిద్ధుడగుచూ వెనుకకు తిరిగి అసంఖ్యాక పర్వత సైన్యమును చూచెను. వారిని చూడగనే మహారాజు ఉచ్చ స్వరమున వికటాట్టహాసము చేసెను. ఆ అట్టహాసము చే భూ నభోంతరాశములు పిక్కటిల్లెను. ఆ యోధుల సమస్త శస్త్రాస్త్రములు క్రిందపడినవి. అంత ఆ పర్వతులు శైలపుత్రుని ఎత్తుకొని తీసికొని పోవుచున్న రైవతుని మోకాళ్ళను, వ్రేళ్ళను పొడవ నారంభించినవి. అయిననూ రైవతుడు లక్ష్యపెట్టక ముందుకేగెను. రైవతుని పై పర్వతములు ఆక్రమణను నా (నారదుడు) ద్వారా వినిన భక్తవత్సలుడయిన శ్రీహరి తన భక్తుని సహాయార్థమై ఆచటికి ఏతెంచి, మహారాజునకు అభయమిచ్చి, తన తేజస్సును ఆయన యందు నింపి అంతర్థానుడయ్యెను. అంత రైవతుడు శ్రీహరి తేజస్సు చే మిక్కిలి బలవానుడై ఒక చేతితో శైలపుత్రుని ఎత్తి, రెండవ చేతితో సుమేరు పర్వతముపై ముష్టి ఘాతములు ప్రహరించెను. అది పురంధరుని వజ్ర ఘాతము కంటె బలమయినది అగుటచే సుమేరువు వ్యాకులుడై క్రిందపడెను. పిదప హిమాలయమును సహితము ముష్టి ప్రహరణము కావించి, వింధ్యాది పర్వతములను చూర్ణము కావించెను.

వింధ్యాది పర్వతములు రైవతుని అఘాతము చే భయభీతులై దిశదిశలా పలాయనము చిత్తగించిరి. ఈ ప్రకారముగ పర్వతములపై విజయము సాధించిన పర్వత దేహుడు రైవతుడు విజయగర్జన చేయుచూ, శైలపుత్రుని ఆనర్త దేశము నందు స్థాపించెను. అంత ఆ శ్రీశైల పుత్రుడు రైవత మహారాజు నామము పై "రైవతగిరి" అను పేర ప్రసిద్ధి నొందినది. ఈ పర్వతము ఇప్పటికీ ద్వారక యందు విరాజమానమై యున్నది. దీని దర్శన మాత్రము చే బ్రహ్మ హత్య పాతకము

సహితము విమోచన మగును. దీని స్పర్శ మాత్రమున వంద యజ్ఞములు పుణ్యము లభించును. ఈ పర్వతమునకు పరిక్రమాచరించి, అవనిత శిరస్కుడై నమస్కరించి పిదప ఒక బ్రాహ్మణునికి భోజన మిచ్చితిరేని ఆ మానవునకు విష్ణు సాయుజ్యము ప్రాప్తించును.

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "ద్వారకా సముద్రము మరియు రైవతాచల మహాత్మ్యము" అను పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(యజ్ఞ తీర్థము, కపిండక తీర్థము; వృషకూపము; గోపీతీర్థము, మరియు గోపీ చందన మహిమ. ద్వారకా మృత్తిక చే ఒక మహాపాపి యొక్క ఉద్ధారము)

నారదుడు "మహారాజా! పూర్వకాల మందు రైవత మహారాజు రైవతపర్వతమందు ఒక యజ్ఞశాల నిర్మించెను. అచట ఎవరేని మనుజులు ఒక యజ్ఞము చేసిన ఎడల ఆతనికి ఒక కోటి యజ్ఞముల ఫలము లభించును. అచటనే "కపి టంక" మను ఒక దివ్య తీర్థము కలదు. ఒక మహా వానరము హతమార్చబడుటచే అద్దానికి కపిటంక మను నామధేయము ఉద్భవించినది. రైవతగిరి యందు ఈ తీర్థము సర్వపాప నాశకము. నరకాసురునకు "ద్వివిదుడు" అను దుష్ఠ వానర సఖుదు కలడు. అతనిని బలదేవుడు వజ్రాయుధము వంటి తన ముష్ఠి ఘాతము చే హతమార్చెను. ఆ దుష్ఠకపి పరిమార్చబడిన స్థలమే కపిటంక మను పేర ప్రసిద్ధి నొందినది. ఈ వానరుడు సత్పురుషులను అవహేళన చేయువాడు. కానీ ఆతడు బలదేవుని చే పరిమార్చబడిన పిదప మోక్షమున కేగెను. ఈ తీర్థము నందు స్నానమాచరించుటకు దేవతలు సహితము వచ్చుచుందురు.

"కలవింక" తీర్థయాత్ర చేయుటచే కోటి గోదాన ఫలము లభించును. దీనికి రెట్టింపు ఫలము "దండకారణ్య" యాత్ర చే లభించును. దీనికి నాలుగింతలు ఫలితము "శైంధవారణ్య" యాత్ర చే లభించును. దీనికి ఐదు రెట్లు ఫలితము "జంబూమార్గ" యాత్రచే కలుగును. దీనికి పదింతల ఫలితము "పుష్కర తీర్థ" వనయాత్ర చే లభించును. దానికి పదింతల పుణ్యము "ఉత్పలావర్త" తీర్థయాత్ర చే కలుగును. దానికి పదింతల పుణ్యము "నైమిశారణ్య" యాత్ర చే లభించును. దానికి వంద రెట్లు పుణ్యము "కపిటంక" తీర్థ స్నానము చే లభించును.

ద్వారక యందు "నృగ కూపము" అను బావి కలదు. ఇది తీర్థముల యందు సర్వోత్తమము. దీని దర్శన మాత్రము చే బ్రహ్మ హత్యాది పాతకములు నశించును. నృగ మహారాజు తెలియక ఒకనాడు ఒక బ్రాహ్మణునికి దానమిచ్చిన గోవును మరియొక బ్రాహ్మణునకు దానమిచ్చెను. ఆ పాపము చే నృగుడు ఊసరవెల్లి రూపము ధరించి ఆ కూపము నందు పడియుండవలసి వచ్చెను.

దానశీలురలో సర్వోత్తముడని కీర్తింపబడిన "నృగ మహారాజు" సహితము ఒకానొక చిన్న తప్పిదము చే నాలుగు యుగములు అంధ కూపము నందు పడియుండెను. తదుపరి శ్రీకృష్ణ భగవానుడు సత్పురుషులు చూచుచుండగా ఆ నృగ మహారాజును ఉద్ధరించెను.

తక్షణమే "నృగ కూపము" తీర్థ స్థాన మయ్యెను. ఏ మనుజుడు కార్తీక పూర్ణిమ యందు ఈ కూపము యొక్క నీటిచే స్నానమొనర్చునో అతని కోటి జన్మల పాపము నిర్మూలింపబడును. అచట ఎవరు ఒక గోవును దానమిచ్చెదరో వారు ఒకకోటి గోవులు దానమిచ్చిన ఫలితము నొందెదరు.

మహారాజా! ఇపుడు "గోపీభూమి" మహాత్మ్యమును వినవలసినది. దీనిని వినినంతనే కర్మబంధ విముక్తి కలుగును. ఇచట గోపికలు నివసించు చుండెడివారు. అందువలననే ఈ స్థానమునకు "గోపీభూమి" అను నామధేయము కలిగినది.

ఇచట గోపికల అంగరాగముల చే ఉత్పన్నమగు గోపీచందనము లభ్యమగును. ఎవరు తమ అంగములందు గోపీ చందనమును అలదు కొందురో వారు గంగాస్నాన ఫలితము నొందెదరు. ఎవరు ప్రతిదినమూ గోపీ చందనమును తిలకముగ ధరించెదరో వారు ప్రతిదినము అనేక పుణ్య నదుల యందు స్నానము చేసిన ఫలితము నొందెదరు. అంతేకాక ఒక వెయ్యి అశ్వమేధ యాగములు, ఒక వంద రాజసూయ యాగములు, సమస్త తీర్థ సేవనము, అనేక దాన వ్రతానుష్ఠాన ఫలితమును పొందెదరు. ఇందు సందేహము లేదు. గంగానదీ తటమునయున్న మట్టికన్న ద్విగుణీకృత పుణ్య ఫల దాయిని చిత్రకూడ రజము. దానికి పది రెట్లు పుణ్యదాయిని పంచవటీ రజము. దానికి వంద రెట్లు పుణ్య ప్రదము గోపీచందన ధారణము. గొపీచందన రజము కేవలము బృందావన రజము సుమా! ఎవరు తమ శరీరము నందు గొపీచందనము అలదు కొందురో వారి కడకు యముడు కూడా చేరలేడనిన యమదూతల సంగతి చెప్పనేల! గోపీచందనము ధారణ చేయు మనుష్యుడు పాపి అయినప్పటికీ అంత్య కాలమందు ప్రాకృతిక గుణములు ప్రవేశింపలేని గోలోకము చేరును.

ఒకనాటి మాట! సింధు దేశమును "దీర్ఘబాహు" అను మహారాజు పరిపాలించుచుండెను. ఆతడు దుష్టాత్ముడు, వేశ్యాలోలుడు, మరియు అన్యాయ వర్తనుడు. అతడు వందలాది బ్రహ్మహత్యా పాతకములు నొనర్చెను. ఆ దురాత్ముడు పదిమంది గర్భవతులను సహితము సంహరించెను. ఆతడు వేటకేగునపుడు తన శర పరంపరచే కపిల గోవులను సహితము హతమార్చెడి వాడు. ఒకానొక దినము ఆ దుష్ట నరేశుడు మంత్రి సహితుడై వనము నందు వేటకై వెడలెను.

రాజ్య లోభము చే ఆతని మంత్రి ఒక నిశిత కరవాలము చేతబట్టి ఆ మహారాజును హత్య కావించెను. ఆ నరేశుడు మృత్యు ముఖమున ప్రవేశించి నంతనే యమభటులాతనిని బంధించి యమపురికి తీసకొని పోయిరి. ఆ ఖలుని చూచి యముడు చిత్రగుప్తుని "ఈతనికి వలయు శిక్షలేవి?" అని ప్రశ్నించెను.

చిత్రగుప్తుడు "మహాప్రభూ! ఈతనిని ఎనుబది నాలుగు లక్షల నరకముల యందునూ వరుసగా పడవైచి, సూర్య చంద్రులున్నంత కాలము నరక యాతనలను అనుభవింప జేయవలెను. ఈతడు భారత వర్షము నందు పుట్టినప్పటికీ ఒక్క పుణ్య కార్యమైననూ ఆచరింప లేదు. ఈతడు పదిమంది గర్భవతులనూ, అసంఖ్యాక కపిల గోవులనూ పరిమార్చెను. వేలకొలది వనచరములను సహితము సంహరించెను. అంతేకాక అనేక దేవ, బ్రాహ్మణ నింద నొనర్చిన మహాపాపి ఈతడు."

అంత యమభటులు వెయ్యి యోజనముల విస్తారము గల కుంభీపాక నరకము నందు పడవైచుటకు తీసికొని వెళ్ళిరి. అందలి నూనె కళ పెళ లాడుచూ మరుగుచున్నది. యమదూతలు ఆ పాపిని అక్కడి కుంభీపాకము నందు పడవేయగా, ప్రళయాగ్ని కీలకమగు ఆ తైలము శీతలముగ మారెను. ఈ విచిత్ర ఘటనను కాంచిన దూతలు ఈ విషయములను యమునికి నివేదించిరి. చిత్రగుప్త సహితుడై యముడు అచటికి ఏతెంచి ఈ విచిత్రమునకు కారణమేదియో తెలియక యోచన లో పడెను. ఇంతలో అచటికి వ్యాసదేవుడు ఏతెంచెను. యమధర్మరాజు ఆయనను యధావిధిగా పూజించి ఇట్లడిగెను "భగవాన్! ఈ పాపి ఇంతకు మున్ను ఏ పుణ్య కార్యములు ఆచరించలేదు. అందువల్ల వీనిని భుగ భుగ మను పొంగు కుంభీపాకమందు పడవేయుట జరిగినది. కానీ విచిత్రముగ ఈతడు పడుట తోడనే ఆ తైలమంతయు శీతలముగ మారినది. దీనికి కారణమేమి! ఈ సందేహము చే నా చిత్తము ఖేదము నొందుచున్నది."

వ్యాసుడు "యమధర్మరాజా! పాప పుణ్యముల గతులు మిక్కిలి సూక్ష్మ మయినవి. దైవ యోగము వలన ఈతనికి పరమ పుణ్యము ప్రాప్తించెను. అది నుడివెదను. వినుము."

"ఈ పాపి ఎక్కడ మృత్యువునొందెనో, అచట ఎవరి చేతినుండో ద్వారకా మృత్తిక పడియుండెను. ఈ మృత్తికా ప్రభావము చే ఈ పాపి శుద్ధుడయ్యెను. ఎవని అంగములందు గోపీ చందనము గోపీ చందనము లేపనము చేయబడునో ఆతడు నరుల నుండి నారాయణుడగును. ఆట్టి మానవుని దర్శన మాత్రమున బ్రహ్మ హత్యాది పాతకములు పటాపంచలగును."

ఇది వినిన యమధర్మరాజు ఆ రాజును పిలిచి ఆతనిని ఇచ్ఛానుసారము ప్రయాణము చేయగల విమానము నందు కూర్చుండ బెట్టి, ప్రకృతికి పరమయిన వైకుంఠ ధామమునకు పంపించెను. నారదుడు "మహారాజా! ఇది గోపీచందన మహాత్మ్యము. ఏ పుణ్యశీలుడు గోపీచందన మహాత్మ్యము ను వినునో ఆతడు శ్రీకృష్ణ ధామమును చేరును."

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "కపిటంక, నృపకూప, గోపీభూమి మహాత్మ్యము వర్ణనము" అను పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(సిద్ధాశ్రమ మహిమా ప్రసంగ వశమున శ్రీరాధా, గోపికలతో శ్రీకృష్ణుడు మరియు ఆయన పదహారు వేల రాణుల సమాగమము)

నారదుడు "విదేహరాజా! ఇపుడు సిద్ధాశ్రమ మహాత్మ్యము ను వినుము. ఏ తీర్ధ స్మరణ మాత్రమున సమస్త పాపములు నశించునో, ఈ తీర్ధ స్పర్శ మాత్రమున ఎన్నటికీ శ్రీహరి వియోగము కలుగదో ఆ పుణ్య తీర్ధమునే పురాణ వేత్తలు "సిద్ధా శ్రమము" అని పిలిచెదరు. ఈ తీర్ధ దర్శనము చే సాలోక్యము, స్పర్శనము చే సామీప్యము, స్నానమాచరించుట చే సారూప్యము, అచట నివసించుట చే సాయుజ్య మోక్షమును జనులు పొందెదరు. ఒకనాడు శ్రీరాధాదేవి తన సఖి అయిన చంద్రానన ముఖతా ఈ తీర్ధము యొక్క విశిష్ఠత విని శ్రీకృష్ణ వియోగ అయిన శ్రీరాధాదేవి ఈ తీర్ధము నందు స్నానము చేయు సంకల్పించెను. వైశాఖ మాసమందు సూర్య గ్రహణ పర్వదినమునకు తన సమస్త గోపీ యూధములతో ఈ పుణ్య తీర్ధమున కేగుటకు శ్రీరాధాదేవి నిశ్చయించెను. అప్పటికి శ్రీదాముని శాపము చే శ్రీకృష్ణ వియోగమందు వంద సంవత్సరములు గడచిపోయినది.

శ్రీరాధాదేవి శిబిక యందు ఆరూఢయై, ఛత్ర చామరములు వీచుచుండగా, సఖీ సమేతముగ సిద్ధాశ్రమ మహా తీర్ధమునకు చనెను. అదే సమయమున అచటకు శ్రీకృష్ణ భగవానుడు తన పదహారు వేల రాణులతో, యాదవ గణ పరివేష్ఠితుడై తీర్ధయాత్రకై అచటకు ఏతెంచెను. అచట కోట్లాది గోపికలు తమ చేతుల యందు అస్త్ర శస్త్రధారులై, ఆ సిద్ధాశ్రమమునకు అన్నివైపులా సాయుధులై శ్రీరాధాదేవి ఆజ్ఞమేరకు అప్రమత్తులై రక్షించుచుండిరి. గోపికల వంద యూధములు సహితము మిక్కిల శక్తిశాలురు. ఆ గోపికలు సహితము చేతులయందు వేత్రధారులై అప్రమత్తముగ యుండిరి. ద్వారకా వాసుల స్నానార్ధమై ఆచటకు ఏతెంచిరి, కానీ ఆ గోపికాయుధములు వేత్రహస్తులై వారిని వెడలగొట్టిరి. ఆ సమయమున శ్రీకృష్ణుడు తన పదహారు వేల రాణుల సహితుడై అచటకు ఏతెంచెను. ఆయన రాణులు ఆయనను ఇట్లు ప్రశ్నించిరి "దేవకీ నందనా! మీరు సర్వజ్ఞులు. ఈ స్నానమాచరించుచున్న స్త్రీ ఎవరు? ఈమె వైభవము అద్భుతము. ఈమె యందటి గౌరవము చే సమస్త యాదవ పుంగవులు భయభీతులై నిలిచి యుండిరి. ఈమె ఎవరి ప్రియతమ? ఈమె నామ ధేయమేమి?" ఈమె ఎక్కడ నివసించును?".

అంత శ్రీకృష్ణ పరమాత్ముడు "మానినీ మణులారా! ఈమె వృషభాను పుత్రి, కీర్తినందినీ శ్రీరాధాదేవి! సంపూర్ణ వ్రజేశ్వరీ, గోపాంగనల స్వామిని మరియు నా ప్రాణ వల్లభ! ఈమె వ్రజభూమి నుండి గోపాంగనా సహితయై సిద్ధాశ్రమము నందు స్నానామాచరించుటకు ఏతెంచినది." శ్రీకృష్ణుని పలుకులు విని తన రూప, యవ్వన, సౌందర్యముల యందు మిక్కిలి గర్వము గల సత్యభామా దేవి తన సవతులతో నెమ్మదిగ ఇట్లనియె "ఏమేమీ! ఈ రాధాదేవి రూపవతియా? నేను కానా? పూర్వకాలమందు ఎందరో పురుషులు నన్ను కోరిరి. నేను ఎల్లప్పుడు నా రూప, సౌందర్య ఔదార్యముల వలన అందరిచే పూజింపబడుచున్నాను. సఖులారా! నా రూప సౌందర్యముల కారణమున నే శతధన్వుడు హతుడయ్యెను. అక్రూర, కృతవర్మలు యదుపురము నుండి పలాయనము ఒనరించిరి. ఏ శ్యమంతక మణి ప్రతిదినము ఎనిమిది

బారువుల బంగారము నిచ్చునో, ఏ మణి మూలముగ దుర్భిక్షము, దుర్భర వ్యాధులు అంకురింపవో, ఏ మణి కారణముగ ఆది వ్యాధులు, అమంగళములు, మాయావులు, సర్పములు సోకవో, అ శ్యమంతక మణిని నా పిత్రుదేవులు నా కళ్యాణ మందు కట్నముగా శ్రీకృష్ణునకు సమర్పించిరి. ఆ మణి ఇప్పటికీ "నా" గృహమున అద్భుత వైభవమును ప్రకటించుచున్నది."

"నేను నా అమిత ప్రేమ చే శ్రీకృష్ణుని వశీభూతుని చేసికొని యుంటిని. ఆయనతో పాటు గరుడుని అధిరోహించి సంచరించుచూ యుండెదను. ప్రాగ్జ్యోషిత పురము నందు నరకాసుర యుద్ధమందు స్వయముగ నేను పాల్గొంటిని. నా దయ చే మీరందరూ విడిపింపబడి శ్రీకృష్ణునికి రాణులుగ భాసించుచుండిరి. ఇందు సందేహము లేదు. నా మాట వలననే శ్రీకృష్ణుడు ఇంద్రునికి ఛత్రము, దేవమాత అదితికి కుండలములు తిరిగి ప్రసాదించెను. నరకాసురుని గజబలము నందు ఐరావత వంశము నందు ఉత్పన్నమయిన గొప్ప గజరాజులు యండెను. నా ఇచ్ఛ వలన శ్రీకృష్ణుడు వాటిని ద్వారకకు తీసికొని వచ్చెను. నా మూలముననను దేవరాజైన ఇంద్రునికి శ్రీకృష్ణునితో సంగరము కావింపవలసి వచ్చెను. నా ద్వారము నందు వృక్షరాజైన పారిజాతము ప్రతిష్ఠింపబడినది. నేను నా పతివ్రతా ధర్మము చే శ్రీకృష్ణుని సంపూర్ణముగా నా వశము నందు యంచుకొని యున్నాను. నేను నా సమస్త సామాగ్రి సహితముగ శ్రీకృష్ణుని నారద మహర్షికి దానమొసంగితిని. నా అంతటి గౌరవ వైభోగములు ఏ ఇతర స్త్రీలకు లభ్యము కావు! అంతేకాదు. రూప, సౌందర్య ఉదారతల యందు నాకు తుల్యమయిన స్త్రీ వేరొకరు లేరు!! ఇంక ఈ రాధాదేవి గూర్చి చెప్పనేల! ఎవని రూప లావణ్యముల కోసమై చేదిరాజు శిశుపాలుడు మొదలయిన రాజులు యుద్ధమొనర్చిన రుక్మిణీ దేవి సౌందర్య హీనయా?

"సొదరీ! శ్రీరుక్మిణీ! నీవు సౌందర్యవతివి కావా! సఖులారా! ఆ రాధ ఒక సామాన్య గోపకన్య. మరి మనమందరమూ రాకుమార్తెలము. మనమందరము ధన, మాన్య, మానవతుల యందు శ్రేష్ఠులము." మిథిలేశ్వరా! సత్యభామ పలికిన పలుకులు విని రుక్మిణీ అదిగా గల రాణులందరి యందు అహంకారము పొడసూపినది. వారందరికీ కుల, కౌశల, ధన, రూప, యవ్వన మందు గర్వము అంకురించెను. అంత వారందరూ శ్రీకృష్ణ భగవానునితో ఇట్లనిరి, "ప్రభూ! తొలుత నీవు శ్రీరాధాదేవి యొక్క రూపమును వర్ణించితివి. మీరిరువురు ఒకరి యందు ఒకరు అనురక్తులు. ఈనాడు మాకందరకూ మీ వ్రజవాసినీ ప్రియతమ అయిన శ్రీరాధాదేవిని దర్శింపవలెనను కోరిక ఉదయించినది. దయచేసి మా కోరికను ఈడేర్చవలసినది.

శ్రీకృష్ణ ప్రభువు "తథాస్తు" అని పలికి తన పట్టపు రాణులను పదహారు వేల నూట ఎనిమిది మందిని కూడి శ్రీరాధాదేవి దర్శనమునకు ఏగెను. అచట స్వర్ణమయమయిన శిబిరము కలదు. ఆ శిబిరము ధ్వజ పతాకపు రెపరెపలచే శోభించుచున్నది. ఆ సుందర శిబిరము పూర్ణచంద్రుని తలదన్ను చాందలరీలతోనూ, ముత్యాల పరదాల తోనూ, స్వచ్ఛ వస్త్రముల ఆ స్తరణములు తోనూ, నలుదిశలా అత్తరు మరియు మాలతీ మకరంద సుగంధముల తోనూ, భ్రమరముల ఘంకారముల తోనూ నిండియున్నది.

తన చిత్తమును సంపూర్ణముగ శ్రీకృష్ణుని యందు లగ్నము చేసిన మహారాజ్ఞి, శ్రీరాధాదేవి అందు విరాజమానమై యున్నది. శ్వేత హంసల వంటి వింజామరలు చేతబట్టి, చెలికత్తెలు సేవ చేయుటకై ఆమె కనుసన్నల యందు నిలిచి యుండిరి. కొందరు చెలికత్తెలు ఆమెకు శ్వేత ఛత్రము పట్టిరి. కొందరు ఆమె కూర్చొని యున్న ఉయ్యాలను సున్నితముగ ఊపుచుండిరి. ఆమె కర్ణముల యందు బాలభానుని తేజస్సును వెదజల్లుచున్న కుండలములు విరాజిల్లుచ్నువి. ఆమె ధరించిన మాల విద్యుత్ తీగవలె ధగ ధగ మెరయుచున్నది. ఆమె శుభాంగముల నుండి కోటి పూర్ణచంద్రుల కాంతి వెలువడుచున్నది. ఆమె మిక్కిలి కోమలాంగి. తన పాదాంగుళముల అగ్ర భాగము చే పుష్పాచ్ఛాదిత మయిన భూమిపై తన కోమల చరణార విందములను నెమ్మదిగా మోపుచున్నది.

ఇటువంటి శ్రీరాధాదేవి రూపమును దూరము నుండి కాంచిన శ్రీకృష్ణ పత్నులు మోహితులై మూర్ఛిల్లిరి. ఆ మహాసాధ్వి యొక్క తేజస్సు మందు శ్రీకృష్ణ పత్నులు సూర్యుని ముందు తారల వలె వెలవెలబోయిరి. వారి అందరి సౌందర్యాతిశయము లుప్తమయినది.

వారందరూ పరస్పరము ఇట్లనుకొను చుండిరి "ఆహా! ఇటువంటి అద్భుత రూపము మూడు లోకముల యందు మరియొకటి యుండదు. మనము ఆమె అద్వితీయ రూపము గూర్చి ఎట్లు వినియుంటిమో, ఈ శుభానన అట్లే యున్నది. ఈ విధముగ పలుకుచూ శ్రీకృష్ణుని మందుంచుకొని వారందరూ నెమ్మదిగ శ్రీరాధాదేవి కడకు ఏగిరి. గోపంగనా, రాజకుమార్తెల చూపులు కలసినవి.

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "శ్రీరాధాదేవి దర్శనము" అను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(సిద్ధాశ్రమము నందు శ్రీరాధా మాధవుల కలయిక,
శ్రీరాధాదేవి శ్రీకృష్ణ పత్నులను సత్కరించుట)

తన పట్టపు రాణుల సహితుడై ఏతెంచిన శ్రీకృష్ణ ప్రభువును చూడగనే గోపాంగనలందరూ లేచి హర్షోల్లాసము తో జయజయ ధ్వానములు కావించిరి. శ్రీరాధాదేవి సహితము లేచి, చేతులు జోడించి, శ్రీహరికి పరిక్రమ కావించి, తన కమల నేత్రముల నుండి ఆనంద భాష్పముల జాలువారు చుండగా, శ్రీకృష్ణుని ఒక స్వర్ణ సింహాసనము నందు ఆశీనుని కావించెను. ఆ స్వర్ణ సింహాసనపు కాళ్ళకు శ్యమంతక మణులు, పార్శ్వ భాగమున చింతామణులు, మధ్య భాగమున పద్మరాగ మణులు తాపడము చేయబడి, చంద్రమండల సన్నిభమై గోళాకారమున యుండి, పారిజాత పుష్పముల చే అలంకరింపబడి, అమృత వర్షిణి అయిన ఛత్రము చే ఆచ్ఛాదింపబడినది. పాదపీఠము కౌస్తుభమణుల చే అలంకరింపబడి యున్నది.

ఇట్లు శ్రీకృష్ణ భగవానుని సింహాసనాదిష్ఠుని గావించి, చిరునవ్వుల చిందించుచూ ఇట్లనియె "మహాప్రభూ! నేడు నా జన్మ ధన్యము అయినది. నా తప: ఫలము సిద్ధించినది. నీ ఆగమనము చే నా ధర్మ కర్మములు సఫలములైనవి. ఈ సిద్ధాశ్రమ స్థానము ధన్యము. ఎందుకనగా దీనిచే నా మనోరథము అద్భుతముగ సఫల మయినది. స్వామీ! నీను నీయెడ కొంచెము కూడా భక్తిని చేయలేదు. నీవు భక్త సహాయకుడవు. దేవా! నీవు నా సహాయము కొరకై ఎందరో అసురులను పరిమార్చితివి. త్రిలోక విజయుడగు కంసుడు కూడ భయము నొందు శంఖుచూడుని నా కొరకై సంహరించితివి. శ్రీహరీ! నా యందలి ప్రేమచే వ్రజమండల మందు దేవలోక వైభవమును నింపితివి. దేవా! నీవు ఇంద్రుని అభిమానమును భంగ మొనర్చి నాకు ప్రియము చేకూర్చుటకై గోవర్ధనమును ఎత్తి వ్రజభూమిని రక్షించితివి. రాస మండలమందు గోపికలు నిన్ను యదేచ్ఛగా కౌగలించుకొనిరి. దేవా! నీ చారిత్ర్యము నరలోకము నందు అపహాస్యము! చిత్రము కదా!!

ఈ విధముగ పలికి శ్రీరాధాదేవి చంద్రానన యొక్క ప్రేరణ చే శ్రీకృష్ణుని రాణులవైపు దృష్టి సారించి, వారందరినీ మిక్కిలి ఆదరముతో ఆహ్వానించి, సమ్మానించెను.

రుక్మిణీ, జాంబవతీ, సత్యభామ, నాగ్నజితి, భద్ర, లక్షణ, కాళింది, మిత్రవిందలనూ, మరియు ఇతర పదహారు వేల మంది ఇతర రాణులను ప్రేమానందమయి శ్రీరాధాదేవి భుజములు పట్టి, గాఢముగ కౌగిలించుకొని ఇట్లనియె "సోదరీమణులారా! చంద్రుడు ఒక్కడే! కానీ ఆయన స్నేహము వాంఛించు చకోరములు అనేకము. సూర్యడు ఏకమాత్ర స్వరూపుడు. ఆయనను చూచువారలనేకులు. అట్లే శ్రీకృష్ణ పరమాత్ముడొక్కడే! కానీ ఆయన యందు భక్తిని ప్రకటించు స్త్రీలమయిన మనమందరము అనేకలము. కమలము యొక్క ప్రభావము మధుపమునకే ఎరుక. ఎట్లు విద్యా ప్రభావము విద్వాంసులకు, కావ్యము యొక్క ఘనత కవీంద్రునకు, రస ప్రభావము రసికునకు, తెలియునో, అట్లే ఈ భూతలమందు శ్రీకృష్ణుని ప్రభావము యదార్ధముగ శ్రీకృష్ణ భక్తుడు మాత్రమే తెలిసికొను."

శ్రీరాధాదేవి దివ్య వచనములను వినిన పిదప సపత్నులగూడి భీష్మక నందిని అయిన శ్రీరుక్మిణీదేవి ఇట్లనియె "శ్రీరాధా! వృషభాను నందినీ! నీవు ధన్యురాలివి. నీ భక్తిచే ఈ శ్రీకృష్ణుడు ఎల్లప్పుడూ నీ వశము నందుండును. మూడు లోకముల యందునూ ఎవని కథామృతమును ఎల్లప్పుడూ వినుచుందురో అట్టి శ్రీకృష్ణ భగవానుడు దివారాత్రములు నీ గురించి చెప్పుచుండును. శ్రీహరి యందలి నీ భక్తిని గూర్చి ఎట్లు వింటిమో అట్లే కంటిమి. నీకు లోకము నందు అసాధ్యము లేదు. నీవు శీఘ్రముగ మా శిబిరమునకు రావలసినది. మేమందరమూ నిన్ను ఆహ్వానించుటకే ఇచటకు ఏతెంచితిమి," ఈ విధముగ పలికి భీష్మక నందిని శ్రీరుక్మిణీదేవి శ్రీరాధాకృష్ణులను అత్యంత ఆదరము తో తన శిబిరమునకు తోడ్కొని పోయెను.

ఆ శిబిరము "సర్వతోభద్రము" అను నామము కలిగినది, మరియు కమల కేసరముల సువాసనలతో నిండినది. అందు బంగారు శయ్యనందు, శిరీష పుష్ప కోమలత్వము గల ఆస్తరణము పరచి, తలగడలు అమర్చి, వివిధ కుసుమ మాలలు, వస్త్రములు, మరియు శింగార సామాగ్రినమర్చి, శ్రీరాధాదేవిని విధి విధానముగ పూజించి అత్యంత సుఖముగ విశ్రమింపజేసెను. పిదప మిగిలిన వంద యూథముల గోపాంగనలందరినీ మరల మరల పూజించెను. తదుపరి ఆ కృష్ణ ప్రియలందరూ పరస్పరము సంభాషించుకొనిరి. ఈ విధముగ కొంత సమయము గడచిన పిదప శ్రీకృష్ణ పత్నులందరూ శ్రీరాధాదేవికి, గోపాంగనలందరకూ వీడ్కోలు పలికి తమ తమ శిబిరములకు అరిగిరి. అంత శ్రీరుక్మిణీదేవి శ్రీకృష్ణుని చేరి ఆయన ఇంకనూ మెళకువగ యందుట గమనించి ఇట్లనియె. "స్వామీ! మీరు ఇంకనూ నిద్రింపకుండుటకు కారణమేమి?"

అంత భగవానుడు "శుభ్రా! నీవు శ్రీరాధాదేవిని, గోపాంగనలనూ, ప్రేమాస్పదమయిన వాక్కులతో అలరించి, ఆశ్వాశించి, వ్రజేశ్వరి అయిన శ్రీరాధాదేవిని మిక్కిలి భక్తితో పూజించితివి. వారు నీ యందు మిక్కిలి ప్రసన్నులయిరి. కానీ ఒక్క విషయము నందు నీవు విఫలమయితివి. ప్రతి దినము నిద్రించుటకు ముందు శ్రీరాధాదేవి ఉత్తమ గోదుగ్ధము ను త్రాగును. ఈ రోజు ఆమె గోక్షీరపానము చేయక పోవుట చే నిద్రించుట లేదు. అందువలన నేనునూ నిద్రకు దూరమయితిని."

పతిదేవుని ఈ పలుకులు వినిన పరమ పతివ్రతాశిరోమణి అయిన శ్రీరుక్మిణీదేవి వెనువెంటనే గోక్షీరము తీసికొని, తన సవతుల సహితయై, పరమాదరము చే శ్రీరాధాదేవి కడకు ఏగెను. ఒక బంగారపు పాత్ర యందు గోరు వెచ్చని పాలను శ్రీరుక్మిణీదేవి శ్రీరాధాదేవి చే మిక్కిలి ప్రేమతో త్రాగించెను. పిదప ఆమెకు తాంబూలము నిచ్చి, సత్యభామాది సవతులతో కలసి శ్రీరుక్మిణిదేవి తన శిబిరమునకు అరిగెను.

తదనంతరము శ్రీరుక్మిణీ దేవి శ్రీకృష్ణుని కడకేగి తమ ద్వారా శ్రీరాధాదేవికి కావింపబడిన దుగ్ధసేవను గూర్చి వర్ణించి పిదప శ్రీకృష్ణుని చరణారవింద సేవ యందు నిమగ్నమయ్యెను. ఆ సాధ్వి నిరంతరము తన కోమల కరపల్లవముల చే శ్రీకృష్ణుని పాద సంవాహము చేసెడిది. అట్లే ఆమె ఆ దినము పాద సంవాహము చేయుచూ శ్రీకృష్ణుని పాదముల యందలి చర్మము కమిలి బొబ్బలెక్కి యుండుట గమనించి, ఆశ్చర్య చకితయై ఇట్లు ప్రశ్నించెను. "ప్రభూ! మీ పాదముల బొబ్బలెక్కుటకు కారణమేమి? ఇది ఈ రోజే జరిగినట్లు యున్నది. అంత శ్రీకృష్ణుడు శ్రీరాధికా దేవి యొక్క భక్తిని ప్రకాశింప జేయుటకై మొత్తము పదహారు వేల మంది పత్నులను రావించి ఇట్లనియె.

"శ్రీ రాధికాదేవి హృదయార వింద‌ము నందు నా చరణారవిందములు ఎల్లప్పుడూ విరాజమానమై యుండును. ఒక్క నిమిషము మాత్రము వదలకుండా తన ప్రేమ పాశము చే బంధించుట చే నేను శ్రీరాధాదేవి హృదయము నందే నివసించుచున్నాను. ఈనాడు మీచే ఈయబడిన వేడి పాలు త్రాగుటచే ఆమె హృదయము నందలి నా పాదములు కమిలి బొబ్బలెక్కినవి."

శ్రీకృష్ణుని పలుకులు వినిన శ్రీరుక్మిణి ఆదిగా గల శ్రీకృష్ణ పత్నుల విస్మితులై మిక్కిలి ప్రేమతో ఆయన పాదములు నొత్తసాగిరి. వారు తమలో తాము "శ్రీరాధాదేవికి శ్రీకృష్ణుని యందు గల భక్తి అత్యుత్తమము కోటికి చెందినది. ఆమెకు సమానమయిన స్త్రీ ఎవరునూ, ఎందునా లేరు. ఈ భూతలమందు శ్రీరాధాదేవి అద్వితీయ నారీ రత్నము."

(శ్రీగర్గ సంహితయందు ద్వాకకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీరాధాదేవి యొక్క ప్రేమ ప్రకాశమను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(సిద్ధాశ్రమము నందు గోపాంగనలు, పదహారు వేల మంది రాణులతో శ్యామసుందరుని రాసక్రీడ. శ్రీరాధాదేవి బృందావన రాసక్రీడ యొక్క ఉత్కృష్టతను ప్రతిపాదించుట)

నారదుడు "మహారాజా! శ్రీరాధాదేవి మరియు గోపాంగనలు ఉత్కృష్ట ప్రేమను ఎరింగిన శ్రీరుక్మిణీదేవి ఆదిగా గల శ్రీకృష్ణ పత్నులందరూ రాస క్రీడను చూచుటకు ఉత్సుకులై శ్రీకృష్ణుని తో ఇట్లనిరి "శ్యామసుందరా! నీ యందు ప్రేమభక్తి కలిగిన ఈ గోపాంగనలు ధన్యులు. ఎందుకనగా వారు రాసరంగమందు నీతో సమ్మిళిత మయిరి. వీరి తపమును ఎవరు వర్ణింపగలరు? మాధవా! ప్రభో! నీవు దయచేసి మా ప్రార్ధనలను స్వీకరించి, బృందావనము నందు నీవు సలిపిన రాసక్రీడను మాకు చూపించవలసినది. నీవు, మేము, శ్రీరాధాదేవి, గోపాంగనలు, ఎల్లరము ఇచటనే ఉపస్థితులమై యుంటిమి. అందువలన రాసక్రీడ ఇచట సలుపుటయే ఉచితము. మా మనోరథమును పూర్ణము కావింపవలసినది. జగన్నాథా! ప్రాణవల్లభా!! మాకు వేరే విధములయిన మనోరథములు లేవు." అంత భగవానుడు మందస్మితుడై తన వచనముల ద్వారా అందరినీ మోహింపజేయుచూ ఇట్లనియె.

"అంగనలారా! రాసేశ్వరి అయిన శ్రీరాధాదేవి మనసునందు కూడా ఇట్టి ఇచ్ఛ కలిగెనేని అపుడు రాసము జరుగును. అందువలన మీరందరూ వెళ్ళి ఆమెను అడుగ వలసినది." అంత శ్రీరుక్మిణీ ఆదిగా గల సతులందరూ వెళ్ళి చిరునవ్వు తో శ్రీరాధాదేవిని ఆశ్రయించి ప్రేమపూరిత వాక్కులతో ఇట్లనిరి "రంభోరూ! చంద్రవదనా! వ్రజేశ్వరీ! రాసేశ్వరీ! ప్రియతమా! సఖీ! శీల స్వరూపిణీ! కీర్తి దేవి యొక్క కుల కీర్తిని ఇనుమడింపచేయు శుభాంగీ! మేమందరము నీ సఖులము. నిన్ను ఒక విషయము అడుగుటకు ఇచటకు ఏతెంచితిమి. రాసేశ్వరుడయిన శ్రీకృష్ణుడు, రాసేశ్వరి అయిన నీవును ఇరువురు ఇచటనే కలరు. మేము కూడా ఇచటనే యుంటిమి. అన్ని రకములుగ రాసము ఆస్వాదించుటకు నీవు ఇచట రాసక్రీడ సలుపవలసినది. ఇయ్యది మా అందరకు మిక్కిలి ప్రియమయినది." శ్రీరాధాదేవి ఇట్లు బదులిచ్చెను. "సత్పురుషుల యందు కృపను వర్షించు రాసేశ్వరుడు, శ్యామ సుందరుడు రాస క్రీడ సలుప దలచినచో తప్పక రాసము జరుగును. నా ప్రియతమ సఖులారా! మీరందరూ పరమ సేవ, శుశ్రూష, మరియు పరాభక్తి చే ఆయనను పూజించి వశము చేసికొన వలసినది."

అంత సఖులు ఆమెకు శ్రీకృష్ణుని పలుకులు వినిపించగా, ఆమె అతి ప్రసన్నయై, "తథాస్తు" అని పలికెను. పిదప వైశాఖ పూర్ణిమ రోజున పుణ్యతీర్థమయిన సిద్ధాశ్రమము నందు రాత్రి ప్రథమ ప్రహరము నడుచుచుండగా, పున్నమి వెన్నెల నలుదిశలా పిండారబోసినట్లు ప్రకాశించుచుండగా, రాస క్రీడారంభము జరిగెను. రాసేశ్వరుని ఆనంత ప్రాప్తికై శ్రీరాధాదేవి సిద్ధపడెను; మరియు ఆమె కొరకు మాధవుడు సహితము సిద్ధపడెను. ఎంతమంది గోపాంగనలు, రాజకన్యలు కలరో, అంతమంది శ్రీకృష్ణులు ఉత్పన్నులై, ప్రతి ఇద్దరు అంగనల మధ్య శ్రీకృష్ణుడు పత్యక్షమయ్యెను. మృదంగ, తాళ, వేణు నాదముల మధ్య, సుందర గీతములు గానము చేయుచుండగా, నూపుర, కంకణ, కేయూర ఆభూషణముల ధ్వని వాటితో కలసి ఒక దివ్య మహాశబ్దము సర్వత్రా వ్యాపించెను.

మహారాజా! కోట్లాది కామదేవుల లావణ్యమును తిరస్కరించు వనమాలాధారి, కిరీట కుండలాలంకృతుడు, భుజదండమండితుడు, పీతాంబరధారి, శ్యామ సుందరుడు, రాసేశ్వరి శ్రీరాధికా సహితుడై గానము చేయదొడంగెను. తారాగణ సహితుడైన చంద్రుడు ఎట్లు శోభించునో అట్లే, ఈ తరుణీమణుల సహితుడైన శ్రీకృష్ణుడు శోభించు చుండెను. ఈ విధముగ ఆ మహానందమయమయిన సంపూర్ణ నిశా సమయము సర్వమూ ఒక్క క్షణము వలె గడచెను. ఈ రాసమండల శోభను తిలకించిన శ్రీరుక్మిణీదేవి ఆదిగా గల పట్టపురాణులు మహదానందమును పొందిరి. రాసము సమాప్తి అయిన పిదప రాణులందరూ పరిపూర్ణ పురుషోత్తముడయిన ముకుందుని చేరి ఇట్లనిరి.

"మహాప్రభో! రాసరంగమందు మీ రూప మాధుర్యమును చూసి జ్ఞాని బ్రహ్మానందమున మునుగు రీతిని మేము ఆత్మానందమున నిమగ్న మయితిమి. ఇటువంటి రాసము మరెక్కడా జరిగియుండదు. ఇందు మీరు, మేము (పదహారు వేల కృష్ణ పత్నులు, అష్ఠ మహిషులు, వందయూధముల గోపాంగనలు, సమ్మిళితమయితిమి. ఈ రకమయిన రాసము బృందావనమున కూడ జరిగి యుండదు." ఈ విధమయిన గర్వోప పేతమయిన పలుకులు విని శ్రీకృష్ణుడు మందహాసము చేసి "ఇచటి రాసము ఉత్కృష్ఠమా? లేక బృందావన రాసము గొప్పదా? ఈ ప్రశ్నను శ్రీరాధాదేవిని ఆడుగ వలసినది" అని పలికెను. అపుడు సత్యభామాది కృష్ణపత్నులు శ్రీరాధాదేవి కడకేగి ఈ విషయమును గూర్చి అడిగిరి. అంత శ్రీరాధాదేవి మందస్మితయై ఇట్లు పలికెను "సఖులారా! అనేకమంది సుందర వనితలతో కూడిన ఆ రాసము చాల గొప్పది. కానీ బృందావనమందు జరిగిన రాసలీల తో సమానమయినది మరి ఎక్కడా, ఎప్పుడూ జరుగలేదు.

"దివ్య వృక్షములు, ప్రేమభారము చే క్రిందికి దిగియున్న లతా సమూహములు, మధుమత్త మధుపములతో కూడిన బృందావనము ఇచట లేవు. పుష్ప సమూహములతో ప్రవహించుచూ, పుష్పాలంకృతమయిన, నల్లని పటము వలె కానిపించు యమునా నది ఇచట కానరాదు. పుష్ప భారము చే క్రిందకి వంగిన సుగంధ భరిత మాధవీలతా కుంజములు కనిపించవు. ప్రేమ పరవశులయిన పక్షులు కిలకిలా రావములు ఇచట వినిపించుట లేదు. చంచల భ్రమర యుక్తములయిన కుంజములు, సుందర మందిర మండిత నికుంజములు ఇచట కనిపించుట లేదు. కమల పరాగము నిండిన శీతల సుగంధ మండిత మంద వాయువులు వీచుట లేదు. ఎత్తైన మనోహర శిఖరములతో శోభించుచూ, సర్వత్రా ఫల పుష్పాదుల చే నిండిన కంధరములతో నిండిన గోవర్ధన పర్వతము దృష్టి గోచరము కాకున్నది. రమణీయ యమునా తటమందు వంశీ వేత్రహస్తుడై నటవర వేషధారి అయిన మదన మోహనుడు ఇచట కానరాకున్నాడు. ఇచట శ్రీకృష్ణుని కొరకై వనమాల మరియు శింగార సామాగ్రి ఎచట యున్నది?"

"శ్యామ సుందరుని నల్లని ఉంగరములు తిరిగిన సుగంధ యుక్త కేశములు ఎక్కడ కనిపించుచున్నవి? శ్రీకృష్ణుని స్నిగ్ధ కపోలములపై కుండలముల కాంతి ఎక్కడ అగుపించుచున్నది? ఈ ప్రేమ పూర్వక నిరీక్షణము, ఆ ముఖపత్ర రచన, సుఖస్పర్శ; హర్షోల్లాసము, ఇచట ఎక్కడయిననూ కనగలుచున్నామా? కామదేవుని తీక్షణ బాణములను తిరస్కరించు చూపులచే ప్రకటితమగు కటాక్షపాత జనిత ఆనందము ఇచట లభించుచున్నదా? రెండు చేతులతో ఒకరినొకరు పట్టుకొని లాగుట, ఒకరి చేతిలో వేరొకరు చేయివేయుట, నికుంజములందు దాగుట, దాచుట, ఎదుట ఉన్నప్పటికీ లేనట్లు నటించుట, ఈ లీలలేవియునూ ఇచట లేవు. లుప్త మయినవి. ఇచట వంశీ వేత్రములను దొంగలించుట, చీరలను, ఎత్తుకొని పోవుట సంభవము కాదు. ప్రేమాతిశయము చే రెండు భుజములనూ పరస్పరము పట్టుకొని హత్తుకొనుట, మరల మరల ఒకరినొకరు పట్టుకొనుట, దాగుడు మూతలాడుట, శ్యామ సుందరుని హస్తములపై చందనము అలదుట, ఆ కార్యములన్నియు ఇచట ఎట్లు సంభవము? ఎక్కడెక్కడ ఏఏ లీలలు జరిగినవో, అవి అక్కడక్కడ మాత్రమే శోభించును. ఎటచ బృందావనము లేదో అచట నా మనసుకు శాంతి లేదు.

ఈ విధముగ పలికిన శ్రీరాధికాదేవి పలుకులు ఆలకించి శ్రీకృష్ణ పత్నులు తమ రాస సంబంధిత అభిమానమును వర్జించిరి.

ఈ విధముగ సిద్ధాశ్రమము నందు రాసక్రీడ పరిసమాప్తి గావించి గోపాంగనా, శ్రీరాధికా మరియు తన రాణుల సహితుడై శ్రీకృష్ణుడు ద్వారకా నగరము ప్రవేశించెను. ఆచట శ్రీరాధికాదేవి నివసించుటకు ఒక సుందర మందిరమును నిర్మించి, సమస్త గోపాంగలనకు కూడా సుఖపూర్వక వ్యవస్థను ఏర్పరిచెను.

నరేశ్వరా! ఈ సిద్ధాశ్రమ గాధ సమస్త పాప హారకము, పుణ్య కారకము మరియు మోక్షదాయకము.

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "రాసోత్సవము" అను పద్దెనిమిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(లీలాసరోవరము, హరి మందిరము, జ్ఞాన తీర్థము, కృష్ణ కుండము, బలభద్ర సరోవరము, దానతీర్థము, గణపతి తీర్థము, మాయా తీర్థము మొదలగు తీర్థముల వర్ణనము)

నారదుడు "మహారాజా! ద్వారావతీ మండలము ఒక వంద యోజనముల విస్తీర్ణము కలది. దాని పూర్ణ పరిక్రమ నాలుగు వందల యోజనములు. అందు మధ్యభాగమున పన్నెండు యోజనముల విస్తీర్ణమున శ్రీకృష్ణ నిర్మితమయిన దుర్గము యున్నది. దానికి వెలుపల తొంబది క్రోసుల దూరమున మరియొక దుర్గము, దానికి వెలుపల రెండు వందల క్రోసుల దూరమున మూడవ దుర్గము సంఘటితమై యున్నది. ఇవన్నియు శత్రు దుర్భేద్యములు. వీటి అన్నిటికీ లోపల రత్నమయ ప్రాసాదములతో నిండిన తొమ్మిది లక్షల విచిత్ర మందిరములు కలవు. అందు శ్రీరాధామందిర ద్వారమున సమస్త తీర్థముల యందు ఉత్తమమయిన "లీలా సరోవరము" కలదు. అయ్యది సాక్షాత్ గోలోకము నుండి దిగి వచ్చినది. ఎవరు ఈ సరోవరము నందు స్నానము చేసి, వ్రతధారణము సలిపి, ఏకాగ్ర చిత్తులై, అష్టమీ తిథియందు సువర్ణ దానము చేసి ఈ తీర్థమునకు నమస్కరించెదరో, ఆ జీవి తన కోటి జన్మములందు ఆచరించిన పాపములు భస్మీ పటలమగును. ఇందు సందేహము లేదు. ఆ జీవి ప్రాణావసాన సమయమున గోలొకము నుండి సహస్ర సూర్యుల వలె వెలుగు దివ్య విమానము వచ్చును. ఆ జీవుడు పది కామదేవుల సమాన లావణ్యశాలియై, రత్నమయ కుండలముల ధరించి, పీతాంబరధారియై, వనమాల ధరించి, శ్యామలకాంతి శోభితుడై, వేల సూర్యుల పగిధి భాసించుచూ వేలాది పార్షదుల చే సేవింపబడుచూ, దివ్యరూపుడగును. ఆతని ఇరువైపులా వింజామరలు వీచుచుండగా, సర్వులు జయజయ ధ్వానములు కావించుచుండగా, ఆతడు ఆ దివ్య విమానము అధిరోహించి గోలోక ధామమునకు ఏగును.

మహారాజా! ఇపుడు అన్య తీర్థముల వర్ణనము వినుము. ఈ దివ్య పురమున పదహారు వేల నూట ఎనిమిది తీర్థములు, అన్నియును శ్రీకృష్ణ పత్నుల భవనముల ఎదుట కలవు. ఎవరు ఈ తీర్థములకు ప్రదక్షిణ ప్రణామము లాచరించి ఈ జ్ఞాన తీర్థములందు మునిగి, పారిజాతములను స్పర్శించునో ఆ మనుజునకు తక్షణము భక్తి, జ్ఞాన, వైరాగ్యములు ప్రాప్తించును. ఆ జీవుల హృదయము లందు శ్రీకృష్ణుడు ఎల్లప్పుడూ ప్రసన్న చిత్తుడై నివసించును.

సమస్త సిద్ధి, సమృద్ధులు వారి సేవ యందు ఉపస్థితమై యుండును. ఎవరు శ్రీహరి మందిరమును దర్శించెదరో, వారు ముక్తులు, కృతార్థులు అగుదురు. వారికి వినా వేరు వైష్ణవులు యుండరు. ఈ భగవానుని మందిరము అయిదు యోజనముల విస్తీర్ణము కలది. అచటి నుండి నూరు ధనువుల దూరమున "శ్రీకృష్ణ కుండము" కలదు. ఇయ్యది సాక్షాత్ శ్రీకృష్ణ తేజము చే ఉద్భవించినది. ఈ కుండము నందు స్నానమొనర్చి జాంబవతీ నందనుడయిన సాంబుడు తన కుష్ఠురోగము నుండి విముక్తుడాయెను. ఈ కుండ దర్శనము చే మానవుడు సంపూర్ణ పాప విముక్తుడు అగును.

అచటి నుండి తూర్పున పదునెనిమిది అడుగుల దూరము ఉత్తమ దర్శనము, పాపనాశకము అయిన "బలభద్ర సరోవరము" కలదు. మహాబలుడయిన బలదేవుడు పృథివీ పరిక్రమ ఆచరించి ఇచట యజ్ఞము చేసెను. అచటనే ఈ సరోవర నిర్మాణము కావించి, రేవతీసహితుడై అచటనే విరాజమానుడయ్యెను. ఇందు స్నాన మాచరించుటచే మానవుడు సమస్త దురితదూరుడై పృథివీ పరిక్రమా ఫలితము నొందును.

మహారాజా! ఈ భగవాన్ మందిరమునకు దక్షిణ దిశగా ఒక వెయ్యి ధనువుల దూరమున గణనాథుని మహాతీర్థము కలదు. తన పుత్రుడయిన ప్రద్యుమ్నునికి జన్మనిచ్చిన పిదప పది దినములు గడవకుండా ఆతడు అపహరింపబడెను. ఆ సమయమున శ్రీరుక్మిణీదేవి ఇచట గణేశ పూజానుష్ఠానము ఆచరించెను. ఆదియే "గణనాథ తీర్థము". ఎవరు ఇచట స్నానమాచరించి సువర్ణ దానము చేయుదురో వారు పుత్రప్రాప్తి మరియు వంశాభివృద్ధి నొందెదరు.

మహారాజా! భగవానుని మందిరమునకు పశ్చిమ దిశగా రెండు వందల ధనువుల దూరమున పరమ

మంగళకరమయమయిన "దాన తీర్థము" కలదు. ఎవరు శ్రీకృష్ణ చంద్రుని ప్రసన్నార్ధము ప్రతి దినము అచట దానమొనరించెదరో వారు ఉత్తమ పుణ్య భాగస్వాములగుదురు. విదేహా రాజా! ఈ తీర్థము నందు స్నాన మొనర్చి, ఎవరు రెండు తులముల బంగారము, ఎనిమిది పలముల వెండి, వంద పట్టు వస్త్రములు, మరియు వేలాది మొహరులు, నవ రత్నములు దాన మొనర్చెదరో అ శ్రేష్ఠ మానవునకు లభించు పుణ్య ఫలితమును వర్ణించెదను. వినుము.

"ఒక వెయ్యి అశ్వమేధ యాగములు మరియు వంద రాజసూయ యాగములు వలన లభించు పుణ్యము దానతీర్థ ఫలము నందు పదహారవ వంతుకు సరిగాదు.

బదరికాశ్రమ యాత్రా ఫలితము, సూర్యుడు మేషరాశి యందు సంచరించు సమయమున సైంధవారణ్య యాత్రా ఫలితము, సూర్యుడు వృషభరాశి యందు సంచారము చేయు సమయమున ఉత్పలావర్త తీర్థ యాత్ర చేసి, రెండు తీర్థముల యందు స్నాన దానములచే లభించు పుణ్యమునకు ఒక లక్ష రెట్లు ఎక్కువ పుణ్యము లభించును. ఎవరు దాన తీర్థము నందు ప్రతి దినము చొప్పున ఒక మాసము సమయము స్నానమాచరించునో ఆ జీవునికి లభించు అనంత పుణ్యమును లెక్కించుటకు చిత్రగుప్తుని కి సహితము శక్యము కాదు. ఈ తీర్థము యొక్క మహాత్మ్యమును వర్ణించుటకు చతుర్ముఖ బ్రహ్మదేవుడు కూడ అసమర్ధుడు అగును."

"దానము నందు అశ్వదానము ఉత్తమము. దాని కంటె గజదానము, దాని కంటె రధదానము, దానిని మించి భూదానము ప్రసస్తము. భూదానము కంటె అన్నదాన ఫలితము అధికతరము. అన్నదానము నకు మించిన వేరొక దానము లేదు, మరియు ఉండబోదు. ఎందువలననగా దేవతలు, ఋషులు, పితరులు మరియు భూతములు సహితము అన్నదానము చేతనే సంతృప్తులగుదురు. ఏ మనుష్యుడు దాన తీర్థము నందు అన్నదానము చేయునో ఆతడు మూడు ఋణముల నుండి (దేవతా, పిత్రు, ఋషి గణములు) విముక్తుడై విష్ణుదేవుని పరమ ధామమును చేరును."

రాజేంద్రా! "ఇట్లు ఆచరించిన మానవుడు తన మాతృ, పిత్రు, భార్య వైపు పది తరములను ఉద్ధరించును. దాన తీర్థమందు దాన మాచరించు పుణ్య జీవులు మరణానంతరము చతుర్భుజ దివ్య రూపము ధరించి, గరుడ ధ్వజము రెపరెప లాడుచుండగా, వనమాల, పీతాంబరధారులై విష్ణు దేవుని ధామమున కేగుదురు."

మహారాజా! భగవానుని మందిరమునకు ఉత్తర దిశగా అరక్రోసు దూరమున మాయా తీర్థమున్నది. అచట చండ ముండాసురులను వినాశ మొనర్చిన దుర్గతి వినాశిని, సింహ వాహిని (వాసిని), భద్రకాళి, దుర్గ నిత్యము విరాజమానమై యుండును.

శ్రీకృష్ణ భగవానుడు శ్యమంతక మణి కోసమై జాంబవంతుని గుహ యందు ప్రవేశము చేసినప్పుడు దేవకీదేవి తన పుత్రుని మంగళము కొరకై ఈ దుర్గాదేవినే శ్రేష్ఠ ఫలముల ద్వారా పుజించెను. ఈ పూజా ప్రభావము చేతనే శ్రీకృష్ణుడు జాంబవతీ, శ్యమంతక సహితుడై ఆ గుహ నుండి బయటకు రాగలిగెను. ఈ సుప్రసిద్ధ మాయాతీర్థము సేవించు వారలకు ఉత్తము ఫలితములనిచ్చును. ఏ మానవుడు ఈ మాయా తీర్థమందు స్నానమాచరించి, మాయాదేవిని పూజించునో ఆతడు తన సంపూర్ణ మనోరధములను ప్రాప్తినొందును.

(శ్రీగర్గ సంహితయందు ద్వాకకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "లీలా సరోవరము, హరిమందిరము, జ్ఞాన తీర్థము, కృష్ణకుండము, బలభద్ర సరోవరము, దానతీర్థము, గణపతి తీర్థము, మరియు మాయాతీర్థము" ల మహాత్మ్యమను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(ఇంద్ర తీర్థము, బ్రహ్మ తీర్థము, సూర్య కుండము, నీలలోహిత తీర్థము, సప్తసాముద్రిక తీర్థము, మరియు వాని మహాత్మ్యము)

నారదుడు "విదేహరాజా! ద్వితీయ దుర్గపు పూర్వార్ధమున పరమ పుణ్య మయమయిన "ఇంద్ర తీర్థము" కలదు.

ఇది అభీష్ఠ భోగములను ప్రసాదించునది. ఈ తీర్థ మందు స్నానమాచరించిన మానవుడు ఇంద్రలోకమున కేగి ఇంద్రుని వంటి ఉజ్వల వైభవమును ప్రాప్తినొందును. ఈ ప్రాకారపు దక్షిణ ద్వారమున "సూర్యకుండము" కలదు. ఇచటనే సత్రాజిత్తు శ్యమంతక పూజన మొనర్చెను. ఎవరు ఈ సూర్యకుండమున స్నానమాచరించి పద్మరాగ మణిని దానమొనర్చునో ఆతడు సూర్య సమాన తేజస్సు కలిగిన తేరు నధిరోహించి సూర్య లోకమున కేగును. ఈ ప్రాకారపు పశ్చిమ ద్వారము వద్ద "భహ్మ తీర్థము" అను విశిష్ఠ తీర్థము కలదు. ఏ బుద్ధిమంతుడయిన మానవుడు ఈ తీర్థము నందు స్నానమాచరించి స్వర్ణ పాత్ర యందు పాయసమును పోసి దానము చేసిన ఎడల ఆ పుణ్యమును వర్ణించెదను. వినుము.

ఆ మానవుడు భ్రహ్మఘాతి, మాతృ, పితృ ఘాతులు మరియు ఆచార్య వధ కావించిన పాపులు అయినప్పటికీ, వారు ఇంద్ర లోకమునకేగి, అచట భ్రహ్మమయ శరీరమును ధరించి, పూర్ణచంద్ర సమాన తేజస్సుగల విమానము నెక్కి భ్రహ్మ థామమునకు ఏగుదురు. అట్లే ఈ ప్రాకారపు ఉత్తర ద్వారము వద్ద "నీలలోహిత క్షేత్రము" కలదు. అచట సాక్షాత్ మహాదేవుడు నీలలోహితుడు విరాజితుడై యుండును. ఈ తీర్థమునందు సమస్త దేవతలు, మునులు, సప్తర్షులు, మరియు సంపూర్ణ మరుద్గణములు నివసించెదరు. ఈ తీర్థ మందు ప్రయత్న పూర్వకముగ నీలలోహితుడను శివ లింగమునకు పూజన మొనర్చి, లోక కంటకుడగు రావణుడు అనుపమ ఐశ్వర్య ప్రాప్తి నొందెను. కైలాస యాత్ర చే మనుజుడు ఎట్టి పుణ్యమును పొందునో అంతకు వందరెట్లు పుణ్యము నీలలోహితుని దర్శన మాత్రమున పొందెను. ఏ మానవుడు మూడు దినములు నీలలోహిత కుండము నందు స్నాన మొనర్చునో అతడు వేలాది పాపకర్మలు చేసినప్పటికీ, శివలోకము (కైలాసము) చేరును. అచట మరొక తీర్థము "సప్త సాముద్రకము" లేక "సప్త సాగర తీర్థము" కలదు. అచట స్నానమాచరించు మానవులు సప్త సాగరములందు స్నానమాచరించిన పుణ్యమును పొంది పాప సమూహముల నుండి విముక్తులగుదురు.

ఈ తీర్థమునకు ఇరువైపులా భగవానులైన "విష్ణు, భ్రహ్మ, శివ, ఇంద్ర, వాయు, యమ, సూర్య, పర్జన్య, కుబేర, సోమ, పృధివీ, అగ్ని, మరియు జలములకు స్వామి అయిన వరుణుడు నివసించు చుందురు. నరేశ్వరా! భ్రహ్మాండము నందు గల ఏడు కోట్ల తీర్థములు ఈ సప్త సాముద్రిక తీర్థమందు నివాసము యుండును. ఏ మానవుడు ఈ తీర్థ మందు స్నాన మాచరించి, ఈ తీర్థమునకు పరిక్రమ కావించునో ఆ జీవునకు సమస్త ద్వారకా యాత్రా ఫలితము లభించును. సప్త సాముద్రిక తీర్థ యాత్ర కావింపక చేయు ద్వారకా యాత్ర నిష్ఫలము. దేవతలు సప్త సాముద్రక తీర్థమును సాక్షాత్ విష్ణు స్వరూపముగ భావింతురు.

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి "ఇంద్ర తీర్థము, భ్రహ్మ తీర్థము, సూర్య కుండము, నీలలోహిత తీర్థము, మరియు సప్త సాముద్రక తీర్థ మహాత్మ్యమను ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(తృతీయ దుర్గ ద్వారమున దేవతల దర్శనము, పూజా మహిమ మరియు పిండారక తీర్థ మహాత్మ్యము)

నారదుడు "మహారాజా! తృతీయ దుర్గ పూర్వ ద్వారమున అంజనానందనుడు, మహాబలుడు, "శ్రీ ఆంజనేయ మహా ప్రభువు" నిరంతరము, అహర్నిశలు కాపలా కాయుచుండును. ఏ మానవుడు అచటగల భగవద్భక్తుడు, మహాబలి అయిన హనుమంతుని దర్శించునో ఆతడు అంజనా నందనుని వలె మహాభక్తుడు అగును. అదే విధముగ దక్షిణ ద్వారమును "సుదర్శనుడు" రేయింబవళ్ళు సంరక్షించుచుండును. ఈ సుదర్శనుని చిత్తము ఎల్లప్పుడూ శ్రీకృష్ణుని యందే లగ్నమయి యుండును. ఈయన దర్శన మాత్రము చే మానవుడు శ్రీహరి యొక్క ఉత్తమ భక్తుడగును. సుదర్శన చక్రము ఆ భక్తుల సహితము నిరంతరము రక్షించుచుండును. అట్లే పశ్చిమ ద్వారమును బలవానుడగు ఋక్షరాజు "జాంబవంతుడు"

రక్షించు చుండును. ఆతడు నిరంతరము భగవద్భజన యందు పరాయణుడై యుండును. ఈ మహాబలి జాంబవంతుని దర్శించుట చే మానవుడు సహితము చిరంజీవియై, హరి భక్తుడై భాసించును. ఇట్లే ఉత్తర ద్వారమును "విష్వక్సేనుడు" రక్షించు చుండును. ఆయన సాక్షాత్ శ్రీకృష్ణుని హృదయము. ఈయన దర్శన మాత్రముచే మానవుడు కృతార్థుడగును.

ఈ దుర్గమునకు వెలుపల "పిండారక తీర్థము" కలదు. దీని మహిమను వర్ణించెదను. ఓ! రాజ శిరోమణీ! ఈ తీర్థ మహాత్మ్యమును మిక్కిలి శ్రద్ధతో వినుము. ఈ తీర్థపు స్మరణ మాత్రమున గొప్ప పాపములు సహితము పటాపంచలగును. సముద్ర మధ్యమున రైవత పర్వతమునందు ఈ పిండారక క్షేత్ర మున్నది. ఈయది తీర్థములందు ఉత్తమము మరియు అర్థసిద్ధికి ద్వారము. ఈ తీర్థము నందే మహాబలి అయిన యాదవ రాజు ఉగ్రసేనుడు పరిపూర్ణ భగవానుడయిన శ్రీకృష్ణుని ఆజ్ఞను బడసి, యజ్ఞములందు ఉత్తమమైన రాజసూయమును అనుష్ఠించెను. ఉగ్రసేన మహారాజు యొక్క ఆ ఉత్తమ యజ్ఞమందు సమస్త తీర్థములు పిండీ భూతమయిన (సూక్ష్మ రూపము) కారణమున ఈ తీర్థము "పిండారకము" అను పేర ప్రసిద్ధి నొందినది.

ఏ మానవుడు ఈ తీర్థమందు స్నానమాచరించునో ఆతడు తక్షణమే రాజసూయ యజ్ఞ ఫలితమును పొందును. ఏ మానవుడు మూడు దినములు ఈ తీర్థ మందు స్నానమాచరించి, వ్రతపాలన మొనర్చి, ఏకాగ్రచిత్తుడై, బ్రాహ్మణులకు సువర్ణ దానము సమర్పించి, వారి పాదములకు ప్రణిపాత మొనర్చునో, ఆ మానవుడు నరపతి (మహారాజు) అగును. ఇందు సందేహము లేదు. ఆతడు అనుదినము తన వందిజనుల ద్వారా తన యశోగానము వినుచూ, సువర్ణ, రత్న, ఉత్తమాస్తరణములచే సంపన్నుడగును. చంద్రముఖలయిన లలనామణులు ఆతనికి సేవ చేయుచుందురు. ఆతడు మహా బలవంతుడై, నిత్యపుష్టితో యుండును. ఆతని సింహ ద్వారములందు దివారాత్రములు దుంధుభులు మ్రోగుచుండును. ఆతని ప్రాంగణములందు హయములు సకిలించుచూ, గజములు ఘీంకరించుచూ, అనేక మంది రాజుల మకుటములు అవనితములై యుండును. ఆతని రత్నమయ మందిరములపై పతాకములు రెపరెపలాడుచుండును. ఆతని ద్వారములందు సామంతులు అధిరోహించి వచ్చిన మదగజముల స్వేదము పై భ్రమరములు ఘుంకారము చేయుచుండును. పిండారక క్షేత్రమందు స్నానము చేయక ఈ లోకము నందు రాజ్యప్రాప్తి కలుగదు, మరియు పాపాత్ముడయిన మనుజుడు సహితము ఇందు స్నానమాచరించుట చే అంతము నందు మోక్షము ప్రాప్తించును.

పిండారక క్షేత్ర మందు స్నానమాచరింపక ఎవరికినీ శుభములు ప్రాప్తింపవు. ధర్మ, కర్మ రక్షణ జరుగదు. మనుజుడు వియోగ దు:ఖమును సహింపలేడు. ఇందు స్నానమాచరించుటచే మనుజుడు యోగి అగును. ఉత్తమ భోగ సంపన్నుడగును. రోగములు దరికి చేరవు. విదేహరాజా! వైశాఖ మాసమందు ఎవరు ద్వారకా పరిక్రమ కావించి అద్దానికి నమస్కరించెదరో వారికి ఇహపరలోక సిద్ధులు కరతలామలకములగును. ఎవరు చైత్రమాస పూర్ణిమ నుండి వైశాఖ పూర్ణిమ వరకూ ద్వారకా యాత్ర సలిపి, ప్రతి దినము తీర్థ స్నానము, భూశయనము, శౌచాచారము, మౌన వ్రతము, నవాన్న భోజనము మొదలగు నియమములను పాటించెదరో, వారికి కలుగు పుణ్యమును తెలుపుటకు చతుర్ముఖ బ్రహ్మ దేవునికి సహితము శక్యము కాదు. వర్షధారలను లెక్కింప వచ్చునేమో గానీ, శ్రీకృష్ణపురి అయిన ద్వారకా యాత్ర చే కలుగు పుణ్యపరిగణము లెక్కింపలేము. తిథుల యందు ఏకాదశి, సర్పముల యందు శేషుడు, పక్షుల యందు గరుడుడు, ఇతిహాసములందు మహాభారతము, దేవతల యందు దేవాధిదేవుడు వాసుదేవుడు, ఎట్లు శ్రేష్ఠులో, అట్లే సంపూర్ణ క్షేత్రముల యందు, పురముల యందు ద్వారకా పురి అత్యంత ప్రసస్తము. ఆకాశము నందలి మేఘమాల సౌదామిని చే ఎట్లు శోభించునో అట్లే వైకుంఠ లీలాధికారిణి అయిన కుశస్థలీపురము (ద్వారకా) యదుమండలి చే అట్లే శోభించు చున్నది.

"ఈ పురి ధన్యము, ఎందుకనగా ఇందు సాక్షాత్ పరమపురుషుడు శ్రీహరి చతుర్వ్యూహ ధారణ చేసి విరాజిల్లెను. ఎవరు ఉగ్రసేనుని రాజాధిరాజుగ ప్రకటించెనో, అట్టి శ్రీకృష్ణునకు మరల మరల నమస్కారము. విదేహరాజా! భగవానుడు తన నిజ నివాసమునకు ఏగినపుడు ఈ పురమును సముద్రుడు ముంచెత్తెను. కేవలము శ్రీకృష్ణుని దివ్య మందిరావశిష్ఠము మాత్రమే మిగులును. అందులో భగవానుడు సదా నివాసముండును. కలియుగ మందు ఇచట నివసించు లోకులు ప్రతిదినము నిరంతర సాగర ఘోష యందు శ్రీకృష్ణుని చే చెప్పబడిన ఈ పలుకులు వినెదరు. "బ్రాహ్మణుడు విద్వాంసుడైననూ,

మూఢుడు అయిననూ ఆతనిని నా శరీరము అని తెలియుము. ఎవరు బ్రాహ్మణుడై సముద్ర తటము నుండి అగాధ జలరాశి యందు ప్రవేశించి, అచటి నుండి పరమేశ్వరుని ప్రతిమనుతెచ్చి, స్థాపించి, విశాల మందిరమును నిర్మించునో ఆతడు సాక్షాత్ సూర్యుడే! నరేశ్వరా! కలియుగము నందు ఏ భక్తజనులు ద్వారకానాథుని స్వస్వరూపమును దర్శించెదరో వారు యోగీశ్వరులకు సహితము దుర్లభమయిన విష్ణు పథమును చేరెదరు."

"నేను నీకు శ్రీకృష్ణపురి ద్వారకా మహాత్మ్యమును వర్ణించితిని. దీనిని ఎవరు భక్తి భావముతో వినినా, వినిపించినా ద్వారకా నివాస ఫల ప్రాప్తి నొందును."

శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "పిండారక తీర్థ మహాత్మ్యము" అను ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(సుదామా బ్రాహ్మణుని ఉపాఖ్యానము)

నారదుడు "మహరాజా! పూర్వము శ్రీకృష్ణ భగవానునికి "సుదాముడు" అను ఒక బ్రాహ్మణ సఖుడు యుండెడివాడు. అతడు తన ధర్మపత్ని అయిన "సత్య" సహితుడై తన పురమున నివసించుచుండెను. సుదాముడు వేద వేదాంగ పారగుడు మరియు వైరాగ్యవంతుడు; కానీ మిక్కిలి ధనహీనుడు. ఆతడు తన అనుకూల వతి అయిన పత్నీ సహితుడై అయాచితముగ వచ్చిన ధనముతో కుటుంబ పోషణ మొనర్చుచుండెను. సుదాముడు దరిద్రము తో దు:ఖించుచున్న తన భార్యతో ఇట్లనియె "పతివ్రతా! ద్వారకాధీశుడయిన శ్రీకృష్ణుడు నా మిత్రుడు. సాందీపని మహర్షి గురుకులము నందు నేను ఆయనతో కలసి విద్యాభ్యాస మొనర్చితిని. కానీ శ్రీకృష్ణుడు వృష్ణి, అంధక, భోజ కులాధీశ్వరుడయిన పిదప ఆయనను కలియుట కుదరలేదు. అతడు త్రిలోకాధీశ్వరుడు, దు:ఖహారి మరియు దీనవత్సలుడు."

పతివ్రత అయిన సత్య చిరిగిన వస్త్రములు ధరించి, మిక్కిలి దుర్భిక్ష పీడితయై, రద్ధ కంఠముతో పతిదేవుని తో ఇట్లనియె "బ్రహ్మన్! సాక్షాత్ శ్రీపతి, హరి మీ సఖుడైనచో మనకీ దారిద్ర్యమేల? లోకులు ద్వారక కేగి, కమలాపతి దర్శనము చేసి ధనవంతులై తిరిగి వచ్చుచున్నారు. మీరు మాత్రము ఎందుకు పోరాదు? దయచేసి వెళ్ళవలసినది. సుదాముడు "సఖీ! నేను సర్వులకూ బోధింతును. నేడు నీవు నాకు బోధించుచున్నావు. నేడు నీవు ఒక విద్వాంసుడయిన బ్రాహ్మణుని బిచ్చమెత్తి ధనప్రాప్తి నొందమని ఉపదేశించుచున్నావు." సత్య "స్వామీ! మీ సఖుడు లక్ష్మీపతి. ఆయన మనకు కడు దూరమున కూడలేదు. ఒక్కమారు ఆయన వద్దకు వెళ్ళవలసినది. ఆయన మన దు:ఖ దారిద్ర్యములను నశింపజేయును. ఈ దుర్భర దు:ఖ దారిద్ర్యములను అనుభవించుచూ మన జీవితకాలము చెల్లిపోవుచున్నది. స్వామీ! అటువంటి కృపానిధి, దాత మీకు మిత్రుడై యుండగా కూడా ఇదియే ఫలితమా?" సుదాముడు "భద్రా! విధాత మన నుదిటిన ఏ రాత రాసెనో అట్లే జరుగను. ఎవరిని దర్శించినంత మాత్రమున ఏమి జరుగును? ఇంటియందు యుండి శ్రీహరిని ధ్యానించుట శ్రేష్ఠము. ఎవని గృహ ద్వారములందు మహారాజులకు, దేవ, గంధర్వ, కిన్నెరలకు సహితము ప్రవేశము లేదో అటువంటి ప్రదేశమున నా వంటి దీనునికి ఎట్లు ప్రవేశము లభించును?"

సత్య "ప్రియా! ఆయన ఆజ్ఞలేక దేవ, గంధర్వ, కిన్నెరలు ఎవరును ప్రవేశింప లేరు. కానీ హరి సర్వాంతర్యామి. ఆయన తన దూతను పంపి మిమ్ములను తన వద్దకు పిలిపించుకొనును." సుదాముడు "భామినీ! నా మాట వినుము. శ్రీకృష్ణుడు అవశ్యము పరమ దయాళువు. కానీ విపత్తి సమయమున ధనవంతుడయిన మిత్రుని వద్దకు ఏగుట సముచితము కాదు. అంతేకాక ఇంతకాలమయిన పిదప నా అంతరంగ అనుంగు మిత్రుని చూచి ఏమి యాచించగలను? లోభ రహితముగ యుండిననే ప్రేమ స్థిరముగ యుండును. యాచన చే ప్రేమ నిలువదు." సత్య "బ్రహ్మన్! మీరు దు:ఖ

దారిద్ర్యములను నశింపచేయు మాధవుని దర్శించండి. ఏమియును అడుగవద్దు. ఆయన అంతట ఆయనే మీకు వలయునది ఇచ్చును."

ఈ విధముగ ధర్మపత్ని చే అనేక విధములుగ నచ్చజెప్పబడిన పిదప సుదాముడు తనయందు ఇట్లు తర్కించెను. "ఈ విధముగ నైననూ నా మిత్ర దర్శనమను పరమ లాభము కలుగును. కానీ ఆయనకు ఏమి ఈయగలను? దారిద్ర్యమున ఏమియును ఈయగల శక్తి నాకు లేదు. అందువల్ల మిక్కిలి లజ్జితుడనగుచున్నాను." తన పతి ముఖము నుండి ఈ విషయమును వినిన సత్య పొరుగింటి నుండి నాలుగు పిడికిళ్ళ అటుకులు అడిగి తెచ్చి, ఒక పాతగుడ్డ యందు మూటకట్టి, తన పతిదేవుని కిచ్చెను. తదనంతరము సత్పురుషుడయిన సుదాముడు తన మలిన వస్త్రములు ధరించి, దుర్బల శరీరమును కదల్చి, అటుకుల మూట తీసుకొని, మనసున భగవానుని స్మరించుచు, నెమ్మదిగ ద్వారకా నగరమునకు బయలుదేరెను.

బ్రాహ్మణుడు నౌక నెక్కి సముద్రమును దాటి, స్వర్ణమయ మయిన ద్వారకాపురి కాంచెను. బంగారపు భవనములపై పతాకములు ఎగురుచుండెను. మిక్కిలి క్రమములో కట్టబడిన సభా భవనులు, వాస్తుయుతముగ నిర్మింపబడిన దుర్గములు శోభించుచున్నవి. సాయుధులయిన యాదవ వీరులు అద్దానిని సంరక్షించుచుండిరి. ఆ మహానగరమును కాంచిన బ్రాహ్మణోత్తముడు లోకులను "శ్రీకృష్ణుని భవనమేది?" అని ప్రశ్నించెను అందులకు వారు "అన్ని భవనములు యందురూ శ్రీకృష్ణుడు కలడు" అని సమాధానమిచ్చిరి. అది వినిన సుదాముడు ఎదురుగ యున్న ఒక భవనము లోనికి ఏగి అచట పర్యంకము పై కూర్చొనియున్న శ్రీకృష్ణుని చూచెను. అంత ఆ బ్రాహ్మణోత్తముడు బ్రహ్మానంద భరితుడాయెను. ముకుందుడు తన చిన్ననాటి స్నేహితుని చూచిన వెంటనే లేచి, ముందుకు వచ్చి తన బలమయిన బాహువులతో బ్రాహ్మణుని బంధించి, ఆలింగనము చేసికొని, హృదయము నకు హత్తుకొని ఆనంద భాష్పములు జాలువార్చెను.

పిదప ఒక స్వర్ణపాత్ర యందలి జలముతో ఆ బ్రాహ్మణోత్తముని పాదములు ప్రక్షాళన కావించి, ఆ జలమున తన శిరసుపై జల్లుకొని తనతో పాటు శయ్యపై కూర్చుండ బెట్టుకొనెను. పిదప గంధము, చందనము, అగరు, కస్తూరి, కుంకుమ, ధూప, దీప, మధుపర్క, పక్వాన్నము ద్వారా ఆయనను పూజించెను. పిదప తాంబూలము సమర్పించి, ఆయనకు గోదానము చేసి అపుడు మలిన వస్త్రధారి, దుర్బలుడు, బక్కచిక్కి శల్యమై యున్న తన బ్రాహ్మణ మిత్రుని తన ఆగమన కారణము అడిగెను. శ్రీకృష్ణపత్ని అయిన మిత్రవింద మందస్మితయై, సుదామునికి వింజామర విసురుచూ చేవ చేయసాగెను. శ్రీకృష్ణుని పట్టపురాణులు తమలోతాము "ఈ బికారి బ్రాహ్మణుడు ఏమి తపమాచరించెను? స్వయముగ త్రైలోకనాధుడు తన పెద్దన్న గారిని సేవించునట్లు ఈతనికి సత్కారము చేయుచున్నాడు, "అని సంభాషించుకొను చుండిరి.

ఇంతలో మిత్రులిరువురు ఒకరి హస్తములు మరియొకరు పట్టుకొని తమ గురుకుల విషయములను ముచ్చటించుట మొదలిడిరి. శ్రీకృష్ణుడు "సుదామా! మనమిరువురము కలిసే విద్యా భ్యాస మొనర్చితిమి. కానీ గురుదక్షిణానంతరము మనము కలియుట కుదరలేదు. నేను జరాసంధుని భయము చే ద్వారకకు వచ్చితిని. సఖా! నీవు ఎక్కడ నివసించుచున్నావు? నీకు గుర్తున్నదా? ఒకనాడు గురుపత్ని మనలను కట్టెలు తెచ్చుటకై అరణ్యమునకు పంపినది. అచటికి వెళ్ళిన పిదప మనము భయంకర తుఫాను నందు చిక్కుకుంటిమి. సూర్యా స్తమయమై సమస్తము అంధకార బంధుర మయినది. అన్ని వైపులా జల ప్రళయము వలె జలరాశి కానపట్టినది. ఎక్కడా నేల అన్నది కానరాలేదు. మన మిరువురము ఒకరి చేతులు ఒకరు పట్టుకొని రాత్రంతయు మెరుపుల వెలుతురులో అటునిటు తిరుగాడితిమి. సూర్యోదయము అయిన పిదప మహానుభావుడయిన మన గురుదేవులు సాందీపనీ మహర్షి వనమున ప్రవేశించి, జలమున చలికి వణుకుచున్న మన విద్యార్థులందరినీ చూచి, మనందరినీ బయటకు తీసి, ఒడ్డున చేర్చి, ఇట్లనియె.

"పుత్రులారా! మీరు నా ఆజ్ఞను ఎల్లప్పుడూ పాటించెదరు. ప్రాణులకు అన్నిటికంటె ఎక్కువ ప్రియమయినది తమ ప్రాణము. మీరు మీ ప్రాణములకు తెగించి, నాకు, నా మాటకు ప్రాధాన్యత నిచ్చిరి. అందువలన నేను మిక్కిలి సంతుష్టుడనై మీకందరకు దుర్లభమయిన వరము నిచ్చుచున్నాను "మీ అభిలాష, మనోరధములు పూర్ణమగుగాక! వేద, శాస్త్ర, పురాణములు మీకు ఎల్లప్పుడూ కరతలామలకములగు గాక!" ఇట్లు పలుకుచున్నప్పుడు ఆయన కంఠము రద్ధమై, ఆయన కన్నుల నుండి భాష్పధారలు కురిసినవి."

సుదాముడు "మిత్రమా! మన గురుదేవుల కృప చే మనము సుఖముగ యున్నాము." శ్రీకృష్ణా! ముకుందా! నీవు

దేవ దేవుడవు. గురువులకు సహితము గురువువు. కోట్లాది బ్రహ్మాండములకు నాయకుడవు. అయిననూ నీవు గురుకుల వాసము చేసితివి. ఎంత చిత్రము."

సుదాముడు శ్రీకృష్ణునికి తనతో తెచ్చిన అటుకులు ఈయలేదు. కానీ సర్వాత్ముడయిన భగవంతునికి తెలియదా! భగవానుడు తనలో తాను ఇట్లు తర్కించెను. "ఈ బ్రాహ్మణునకు ధనాశ లేదు. కేవలము ముక్తి కాంక్షయే! కానీ పరమ పతివ్రత అయిన ఈతని భార్య ధనము అభిలషించు చున్నది. దానము నీయలేని ఈ దంపతికి నేను ఎట్లు ధనము నీయగలను?" ఈ విధముగ యోచన చేసి "ఈతడు నా కొరకు అటుకులు తెచ్చియున్నాడు. కానీ సిగ్గుచే ఈయలేదు. అందువలన నేను అడిగి తీసికొనెదను." ఇట్లు యోచించి భగవానుడు "మిత్రమా! నీవు నా కొరకు మీ ఇంటి నుండి ఏమి తెచ్చితివి? ప్రేమతో ఇచ్చిన దానము అణుమాత్రమైననూ మహత్వమిచ్చునుసుమా! ఏ వ్యక్తి అయిననూ పత్రము, పుష్పము, ఫలము లేక జలమును కానీ ఏదేని పదార్థమును భక్తి పూర్వకముగ ఇచ్చిన ఎడల నేను అత్యంత ఆదరణ తో తీసికొనెదను."

ఇట్లు పలికి భగవానుడు ఆ బ్రాహ్మణుని వస్త్రములు తడిమి, అందుగల అటుకుల మూటను పట్టుకొని, ముడిని విప్పి, ఆ అటుకులు తీసికొని ఇట్లనియె "సఖా! నీవు నాకు అత్యంత ప్రియమయిన వస్తువు తీసికొని వచ్చితివి. దీని వలన విశ్వరూప భగవానుడనైన నాకు తృప్తి కలిగినది. నేను గోకులము నందు ఇటువంటి శ్రేష్ఠమయిన అటుకులు యశోదాదేవి పెట్టినపుడు తినెడి వాడను. అప్పటి నుండీ ఇటువంటి అటుకులు తిను అవకాశము మరల రాలేదు." ఈ విధముగ పలికి ఒక పిడికెడు అటుకులు తిని ఇహలోక సంపత్తిని అంతయు సుదామునకిచ్చెను. రెండవ పిడికిలి తిని పాతాళ సంపత్తిని సుదామున కిచ్చుటకు ఆయత్తుడగుచుండగా, ఆయన వక్షస్థలమునున్న లక్ష్మీదేవి ఆయన హస్తమును పట్టుకొని, ఆపి ఇట్లనియె "నాథా! నా నేరము లేకుండ నన్ను మీరు ఎందుకు త్యాగము చేయుచున్నారు? ప్రభూ! ఇప్పటికి మీరు ఈ బ్రాహ్మణునకు ప్రసాదించినది చాలు. అదియే అక్షయము. దానితో ఈ బ్రాహ్మణుడు ఇంద్రతుల్యుడాయెను." కానీ సుదామునకు ఈ విషయమేదియును తెలియదాయె! భగవానుని మాయ చే ఆ సంపత్తి అంతయు సుదాముని ఇంటికి చేరెను.

సుదాముడు ఒకరాత్రి అచట గడిపి, భోజనాదులు కావించి, సుఖముగ నిద్రించి, మరునాడు శ్రీ కృష్ణునికి నమస్కరించి, తిరుగు ప్రయాణమయ్యెను. ముకుందుడు ఆయనను ఆలింగనము చేసికొని తిరుగు ప్రయాణమునకు అనుమతి నిచ్చెను. సుదాముడు సిగ్గుతో భగవానుని ఏమియు అడుగక వెనుకకు బయలుదేరెను. తిరుగు ప్రయాణమున శ్రీకృష్ణుని బ్రాహ్మణ భక్తికి మిక్కిలి సంతోషించి ఇట్లనుకొనెను." నేను దరిద్రుడయినప్పటికీ మాధవుడు నన్ను రెండు భుజములు పట్టుకొని ఆలింగనము చేసికొనెను. నా వంటి దీనుని పర్యంకము పై కూర్చొండబెట్టి ఆదరించెను. సాక్షాత్ శ్రీ రుక్మిణీ, సత్యభామలు నాకు పరిచర్యలు కావించిరి. నిర్ధనుడనయిన నేను ధనమును సంగ్రహించి భగవంతుని ఎన్నడూ మరువకుందును గాక! అందువలననే భగవానుడు కరుణ కల్గి నాకు ధనము నీయలేదు."

ఇంతలో ఆయనకు తన ధర్మపత్ని జ్ఞప్తికి రాగా "ఈమె తో ఏమి చెప్పెదను?" అని ఆలోచించి ఒక నిర్ణయమునకు వచ్చెను. "నేను నా భార్యతో ఇట్లనెదను. శ్రీకృష్ణుడు బ్రహ్మాండాధిపతి. దాత. కానీ నీ యందు కృపణుడైనాడు. ఇతరుల గృహములు రత్నరాశులతో నిండినవని మనము కోరికలు పెంచుకొనరాదు. లలాట లిఖితమును ఎవరునూ మార్చలేరు." ఈ విధముగ నిశ్చయించుకొని మనసున వివిధ రీతుల తర్కించుచూ తన పురికి ఏతెంచెను. ఇంతలో ఒక విచిత్రము జరిగినది.

అచట అనేక ద్వారములు కలిగి, పతాకములు రెవరెపలాడుచూ ఎగురుచున్న ఒక దివ్య భవనము కనిపించెను. ఆ మందిరము విచిత్ర తోరణముల తో నిండి, కలశములతో ప్రకాశించుచున్నది. ఈ పురము రెండవ ద్వారకా నగరమా అన్నట్లు భాసించుచున్నది.

సుదాముడు "ఈ భవనము ఎవరిది? ఇంతకు మున్న కానరాలేదే? ఇంత తొందరలో ఎట్లు కట్టుబడినది?" అని యోచించుచూ ముందుకు సాగుచుండెను. ఇంతలో దాస దాసీ జనము సుదాముడు ఏతెంచిన విషయము ఆయన ధర్మపత్నికి ఎరిగించిరి. ఆమె వెంటనే ఒక శిబికను గైకొని, దాస దాసీ జన సహితయై సుదాముని స్వాగతించుటకు గృహము బయటకు ఏతెంచెను. సుదాముడు స్వర్ణ రత్న విభూషిత, తరుణ రూప సంపన్న, ద్వితీయ లక్ష్మీ స్వరూపము

వలె వెలుగుచున్న తన ధర్మపత్నిని కాంచి, మిక్కిలి సంతోషించి, "ఇది అంతయు శ్రీకృష్ణ ప్రసాదము" అని వారికి తెలియజేసెను. రత్నములు, ఐశ్వర్యము, ఆసన, వ్యజన, పర్యంక, స్వర్ణ పాత్రా, తోరణ మయమయిన తన దివ్య భవనము నందు సుదాముడు పత్నీ సహితుడై ప్రవేశించెను.

శ్రీకృష్ణ కృపచే సుదాముడు కూడా తరుణ వయస్కుడు ఆయెను. ఇన్ని లభించినప్పటికీ ఆయన ఎప్పుడూ భక్తి, జ్ఞాన, వైరాగ్యములను వీడలేదు. ఆయన తన పత్నీ సహితుడై ఇట్లు యోచించెను. "ఇంత సమృద్ధి నాకు ఎట్లు కలిగినది? ఈ దేవ దుర్లభమయిన సంపద నాకు కేవలము ముకుందుని చే ఈయబడినది. ఇవన్నియు నాకు ఇచ్చినప్పటికీ, ఆయన ఒక్కమారు "నేను ఇచ్చితిని" అని అనలేదు. నా వద్ద గల కేవల అటుకులు మిక్కిలి ప్రీతితో స్వీకరించెను. జన్మ జన్మలకు నాకు ఆయనతో సఖ్యము, దాస్యము మాత్రమే కావలెను. నేను నిరంతరము ఆయన చరణకమలములను భజించి, ఈ సంసార సాగరమును దాటెదను." సుదాముడు తన మనస్సునందు ఇట్లు గట్టిగా నిశ్చయించుకొని, తన పత్నీ సహితుడై శ్రీకృష్ణుని చరణార విందములందు మనస్సును పూర్తిగా లగ్నము చేసి, సమస్త ధన సంపత్తిని బ్రాహ్మణులకు దాన మొనర్చి, భగవానుని ధామమునకు చేరెను.

"మహారాజా! ఎవరు ఈ కృష్ణ చరిత్రను వినునో, వారు దారిద్ర్యము నుండి విముక్తులై ఉత్తమ భగవద్భక్తులు ఆయ్యెదరు. నరేశ్వరా! నీకు పరమ పుణ్యకరమయిన ద్వారకా ఖండమును వినిపించితిని. ఎవరు ఈ ఖండమును ఎల్లప్పుడూ శ్రవణము చేయుదురో వారికి ఉత్తమ కీర్తి, కులము, అతిశయ భక్తి, ముక్తి మరియు రాజ్యప్రాప్తి కలుగును."

(శ్రీగర్గ సంహితయందు ద్వారకా ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి "సుదామా బ్రాహ్మణ ఉపాఖ్యాన వర్ణనము" ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ద్వారకా ఖండము సమాప్తము

విశ్వజిత్ ఖండము

ఒకటవ అధ్యాయము

(మరుత్తరాట్ ఉపాఖ్యానము)

నమో భగవత్ తుభ్యం
వాసుదేవాయ సాక్షిణే
ప్రద్యుమ్నాయనిరుద్ధాయ
నమ: సంకర్షణాయ ॥

సమస్త ప్రాణుల హృదయములందు నివసించు సర్వసాక్షి, వాసుదేవ సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ మొదలగు చతుర్వ్యూహములతో విలసిల్లు భగవానునికి నమస్కారము.

అజ్ఞాన తిమిరాంధశ్య, జ్ఞానాంజన శలాకయా
చక్షురున్మీలితం యేన తస్మైశ్రీ గురవేనమ: ॥

రేచీకటి అను రోగము వలె అజ్ఞానాంధకారము చే గ్రుడ్డివారయిన జీవులకు జ్ఞానమనెడి అంజనమును అలది పరమాత్మ దర్శనము కావించు గురుదేవునకు నమస్కరించుచున్నాను.

శ్రీగర్గాచార్యులు ఇట్లు నుడివిరి "ఈ విధముగ మీకు తెలుపబడిన శ్రీకృష్ణ చరితామృతము ధర్మార్ధ కామ మోక్షములనెడు చతుర్విధ పురుషార్ధములను ప్రసాదించునది. మీరు ఇంకనూ ఏమి వినదలచుకొనిరి?" శౌనకుడు "తపోధనా! శ్రీకృష్ణుని ప్రియభక్తుడు, మధుసూదనుని యందు ప్రగాఢ మయిన ప్రీతిని కలిగి యుండిన మిధిలేశ్వరుడు బహుళాశ్వుడు నారద మహర్షిని తిరిగి ఏమని ప్రశ్నించెను?" గర్గుడు "మునులారా! శ్రీకృష్ణ భగవానుడు మరుత్తుల అవతారమయిన ఉగ్రసేనుని యాదవుల రాజుగ గావించెనని వినిన బహుళాశ్వుడు మిక్కిలి విస్మితుడై నారద మహర్షిని ఇట్లు ప్రశ్నించెను "దేవర్షీ! ఈ మరుత్తుదెవ్వరు? ఏ పుణ్య కార్యమాచరించుట వలన ఈతడు యదు వంశమునకు మహారాజై స్వయముగ శ్రీకృష్ణ భగవానునికి సహాయకుడయ్యెను? ఈతని మహిమ అద్భుతము. దేవర్షి శిరోమణీ! ఈయన మహత్యమును దయచేసి, నాకు తెలుప వలసినది." నారదుడు "సత్య యుగమునందు సూర్య వంశపు రాజయిన మరుత్తు చక్రవర్తి ఏకఛత్రాధిపత్యముగ ఈ భూమండలమును పరిపాలించెను. ఆయన విధివిధానముగ "విశ్వజిత్ యజ్ఞము" ను అనుష్ఠించెను.

ఆయన హిమాలయమునకు ఉత్తరమున వలసిన సామాగ్రినంతటినీ ఏకత్రము గావించి, ముని శ్రేష్ఠుడయిన సంవర్తకుని ఆచార్యునిగ నియమించుకొని యజ్ఞము చేయుటకు దీక్షితుడయ్యెను. ఆ యజ్ఞమునకు అయిదు యోజనములు విస్తీర్ణము గల కుండమును నిర్మించిరి. ఒక యోజన విస్తీర్ణమున బ్రహ్మ కుండము, రెండు క్రోసుల విస్తీర్ణము గల మరి అయిదు కుండములు సహితము నేర్పరిచిరి. ఈ కుండములకు అనుగుణముగ వేదులు, తోరణములు కట్టిరి. అచటి యజ్ఞకుండమందలి స్థంభములు వెయ్యి ఏనుగుల ఎత్తు కలిగి ఆ మహా యజ్ఞ మండప మంతయు స్వర్ణమయమై ఇరువది యోజనముల విస్తీర్ణము కలిగి యున్నది. ఆ మండపమంతయు దివ్యశోభలను వెదజల్లుచున్న చాందలరీలతోను, దివ్య పుష్ప తోరణముల తోనూ, అరటి బోదెలతోను అలంకరింపబడి అత్యంత సుందరముగ విరాజిల్లు చుండెను. ఈ యజ్ఞమునకు బ్రహ్మ రుద్రాది దేవతలు తను అనుచర సహితులై ఏతెంచిరి. సమస్త ఋషిముని గణములు సహితము వచ్చిరి. ఆ యజ్ఞమును పది లక్షల హోతల, పది లక్షల దీక్షితులు, అయిదు లక్షల ఉద్గాత, ఆధ్వర్యువులు నడిపించు చుండిరి. అచటకు నాల్గు వేదములు యందు నిష్ణాతులైన వేదవేత్తలు, సర్వ శాస్త్రములను ఆపోశన పట్టిన పండితులు, కోట్లాది బ్రాహ్మణులు పాల్గొనిరి. ఆ యజ్ఞము నందు నేయి ఏనుగు తొండపు ధారలవలె అగ్నియందు ఆజ్యముగ సమర్పింపబడినది. ఆ ఘృతమును స్వీకరించి అగ్నిదేవుడు అజీర్ణగ్రస్తుడాయెను.

ఆ యజ్ఞమునందు విశ్వేదేవగణములు సభాసదులుగ యుండి ఎవరెవరికి ఏఏ భాగములను ఇవ్వవలెనని ఆదేశించు చుండిరో, ఆ భాగములను మరుద్గణములు వారి వారికి స్వయముగ సమర్పించు చుండిరి. ఆ యజ్ఞమునందు త్రిలోకములందలి సర్వ ప్రాణులు ఆకలి లేకుండ సమృద్ధిగ భుజించిరి. దేవతా సముదాయము సోమరసము త్రాగి అజీర్ణ గ్రస్తులయిరి. ఆ యజ్ఞమునకు యజమాని అయిన మరుత్త చక్రవర్తి ఆచార్యుడయిన సంవర్తునికి జంబూ ద్వీపమును దానముగ నిచ్చెను. అంతేకాక పదునాల్గు లక్షల గజములు, పదునాలుగు లక్షల బారువుల బంగారము, వంద అరబ్బుల గుఱ్ఱములు, తొమ్మిది కోట్ల బహుమూల్య రత్నములు యజ్ఞాంతమందు ఆచార్యునికి భక్తి పూర్వకముగ సమర్పించెను. భోజన, జలపాత్రలు, సమస్తము బంగారము తో చేయబడినవే! సమస్త బ్రాహ్మణులు, మరియు లోకులు అత్యంత సంతుష్టులై, సుఖులైరి. తినగా మిగిలిన సువర్ణ పాత్రలు వారందరూ పడవేయగా అది హిమాలయము సమీపమున వంద యోజనముల సువర్ణ పర్వతమయినది.

అది ఇప్పటికినీ అట్లే యున్నది. మరుత్తు చక్రవర్తి కావించిన యజ్ఞము మరెవరికైననూ అసాధ్యము. రాజేంద్రా! అటువంటి యజ్ఞము త్రిలోకములు యందును నభూతో న భవిష్యతి. ఆ దివ్య యజ్ఞపు యజ్ఞకుండము నందు సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడు శ్రీకృష్ణుడు ప్రకటితుడై మరుత్తు చక్రవర్తికి తన స్వస్వరూపమును చూపెను.

శ్రీకృష్ణభగవానుని చూచినంతనే మరుత్తుడు లేచి, చేతులు జోడించి, ఆయన చరణారవిందములందు శిరసునుంచి, మాటలురాక అట్లే యుండిపోయెను. ఆయన శరీరము రోమాంచితమై, హృదయము ప్రేమవిహ్వల మయ్యెను. తన చరణములపై బడిన మరుత్తుని గాంచి భగవానుడు మేఘ గంభీర స్వరమున ఇట్లనియె "రాజా! నీ వినయసంపత్తి నన్ను సంతుష్టుని గావించినది. నీవు నిష్కామముగ నన్ను పూజింతివి. మహామతీ! నీవు స్వర్లోక దేవతలకు సహితము దుర్లభమయిన ఏ వరమడిగిననూ నేను సత్వరము దానిని నీకిచ్చెదను. అడుగుము." మరుత్తుడు భగవానుని పలుకులు విని, చేతులు జోడించి, పరిక్రమ కావించి, వివిధ ఉపచారములు చే శ్రీహరిని పూజించి గద్గద స్వరము తో ఇట్లనియె "శ్రీ పురుషోత్తమా! మీ చరణారవిందములు మినహా వేరొక ఉత్తమ వరమును నేనెరుగను. దుర్బుద్ధులయిన నర పశువులు దాహార్తులై గంగా తీరము చేరి బావి కొరకు వెదకిరట! (అనగా నీ చరణారవిందములు ప్రాప్తించిన పిదప వేరే ఏదేని వరము కోరుకొనుట ఈ నరపశువులు లక్షణము) కానీ మీ ఆజ్ఞను గౌరవించుటకై నేను తప్పక వరము కోరుకొందును. "నా హృదయ కమలము నుండి మీ చరణారవిందములు ఎన్నటికీ దూరమవకుండు గాక! ఎందువలననగా అవి చతుర్విధ ఫల పురుషార్థములకు, సంపదలకు మూలము."

భగవానుడు "రాజా! నీ నిర్మల భక్తి ధన్యము. నీకు వరదానము అనెడు లోభము కలుగుటకు ఆస్కార మున్నప్పటికీ, నీ బుద్ధి యందు ఇసుమంత కోరిక (కామన) కలుగలేదు. అందువలన నీవు ఏదేని నీ అభీష్టమును వరముగ కోరుకొనవలసినది. ఎందుకనగా వరమునడిగి భక్తుడు సుఖపడక పోయిన చో నాకు సుఖ ముండదు." అంత మరుత్తుడు "మహాప్రభూ! నాకు వరము ఇవ్వదలిచిరేని భూతలమందు వైకుంఠ రాజ్యమును స్థాపించి, నేను భక్త జనులతో అందు నివసించుచున్న, దానికి మీరు రక్షకులుగ యుండునట్లు వరమీయ వలసినది." భగవంతుడు "వత్సా! ఈ మన్వంతరమందు పదునెనిమిది యుగములు గడచిన పిదప పద్దెనిమిదవ ద్వాపరమందు నీ మనోరథము అనాయాసముగ సఫల మగును. అంత వరకు స్వర్గభోగములు అనుభవించ వలసినది. పద్దెనిమిదవ ద్వాపరమందు నాతో పాటుగా నీవును అవతరించెదవు" అని పలికి శ్రీహరి అంతర్ధానుడయ్యెను.

ఆ మరుత్త చక్రవర్తి ఏ ఉగ్రసేనుడాయెను. శ్రీహరి స్వయముగ ఆయన చే రాజసూయ యాగము కావించెను. భగవద్భక్తులకు అసాధ్యమయిన పని (వస్తువు) ఈ ముల్లోకములలో ఏదియును లేదు. నృపోత్తమా! ఏ మానవుడు ఈ మరుత్తరాట్ చరిత్రను వినునో ఆతనికి భక్తియుక్త జ్ఞానము, వైరాగ్యము కలుగును.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి "మరుత్తుని ఉపాఖ్యానము" అను మొదటి అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(ఉగ్రసేన మహారాజు యొక్క రాజసూయ యజ్ఞ ప్రారంభము; ప్రద్యుమ్నుడు దిగ్విజయమునకై బాధ్యత తీసికొనుట; ప్రద్యుమ్నుని విజయాభిషేకము)

బహుళాశ్వుడు "మహామునీ! ఉగ్రసేన మహారాజు సుధర్మ సభ యందు శ్రీకృష్ణ భగవానుని పూజించి, చేతులు జోడించి, అవనిత శిరస్కుడై ఆయనతో నెమ్మదిగా ఇట్లనియె "భగవాన్! నారద మహర్షి ముఖతా నేను రాజసూయ యాగ ఫలమును వింటిని. మీ ఆజ్ఞ అయినచో నాకు ఆ యజ్ఞమాచరింపవలెనని యున్నది. పురుషోత్తమా! నీ చరణ సేవ చే నిర్భయలైన పూర్వపు రాజులు జగత్తును తృణ ప్రాయముగ ఎంచి తమ మనోరధ మహాసాగరమును దాటగలిగిరి" భగవానుడు "మహారాజా! యాదవేశ్వరా! నీవు ఉత్తమమయిన నిర్ణయమును తీసికుంటివి. ఈ యజ్ఞాచరణము చే నీ కీర్తి మూడు లోకముల యందునూ వ్యాప్తించును. సమస్త యాదవులు నా అంశ చే జన్మించిన వారే! వీరికి ఇహ పర లోకములు జయింపవలెనన్న కాంక్ష గలదు. వీరు నీ కొరకై దిగ్విజయ యాత్ర సలిపి శత్రువులను దునుమాడి వెనుకకు వచ్చి వారితో పాటుగా సర్వదిశలనుండి నీ కొరకు బహుమతులు, అనేక విధములయిన ద్రవ్యములు తేగలరు."

తదుపరి ఇంద్రుని చే ఈయబడిన సింహాసనారూఢుడై ఉగ్రసేన మహారాజు వృష్ణి, భోజ, అంధకాది సర్వ యాదవ వీరులను సుధర్మ సభయందు ఆహ్వానించి తాంబూలమును ఫణముగా యుంచి ఇట్లు ప్రకటించెను. "సమరాంగణము నందు జంబూ ద్వీపమునున్న నరేశ్వరులను ఎల్లరునూ ఓడించి తిరిగి రాగల ఇంద్రసమ వీరుడు ఈ సభాస్థలి యందు యున్న ఎడల ఆతడు ఈ తాంబూలమును స్వీకరింపవచ్చును." ఈ ప్రకటన వినిన సభాసదులందరూ అత్యంత నిశ్శబ్దముగ కూర్చుండిరి. కానీ శంబరారి, రుక్మిణీ నందునుడయిన ప్రద్యుమ్నుడు లేచి ఉగ్రసేన మహారాజుకు ప్రణామము లాచరించి ఆ తాంబూలము స్వీకరించి ఈ విధముగ ప్రకటించెను. "నేను జంబూ ద్వీపము నందలి సమస్త రాజలోకమును పరాజితులు కావించి బలవంతముగ వారి నుండి కప్పములు/బహుమతులు తీసికొని వచ్చెదను. ఒక వేళ నేను అట్లు చేయలేని పక్షమున నాకు పరస్త్రీ గమనము, కపిలగోవు, బ్రాహ్మణులు, గురువులు, మరియు గర్భస్థ శిశువును పరిమార్చిన పాపము సంక్రమించుగాక!"

ఈ విధముగ పలికిన పలుకులు విని సమస్త యదువీర సంఘము "సాధు, సాధు" నినాదములతో ప్రాంగణమంతయు మారుమ్రోగెను. వారందరి సమక్షమున ప్రద్యుమ్నుడు దిగ్విజయ బాధ్యత స్వీకరించెను. యదుకుల గురువయిన గర్గాచార్యులవారు ముహూర్తమును నిర్ణయించి, వేదమూర్తులయిన పండితులు వైదిక మంత్రోచ్ఛారణ చేయుచుండగా ప్రద్యుమ్నుని చేత స్నానము చేయించిరి. స్వయముగ ఉగ్రసేనుడు ఆతని లలాటమున వీరతిలకమిడి బహుమతులు నిచ్చెను. సమస్త యాదవాధిపతులు ఆయనకు సమస్కరించిరి. మహాత్ముడయిన ప్రద్యుమ్నునకు ఉగ్రసేనుడు కరవాలమును, మహాబలి అయిన బలదేవుడు కవచమును, శ్రీహరి తన శాంగ ధనువు నుండి వేరొక దివ్య ధనువును సృష్టించి దానితోపాటుగా అక్షయ తూణీరములు ప్రసాదించెను. వృద్ధ శూరసేనుడు దివ్య కిరీట కుండలములను, మనోహర పీతాంబరమును, ఛత్ర చామరములను ఈయగా, మహామనస్వి అయిన వసుదేవుడు "శత చంద్రము" అను డాలును, ఉద్ధవుడు కేసరీయుక్తమాలను" అక్రూరుడు "విజయము" అను దక్షిణావర్త శంఖమును, గర్గాచార్యుడు "శ్రీకృష్ణకవచము" అను మహామంత్రమును ప్రసాదించెను. ఆ సమయమున మరొక విచిత్రము జరిగెను. కౌతూహలులై దేవలోకము నుండి బ్రహ్మ, శివ, పురంధరులు, దేవర్షిగణ సహితులై అచటికి ఏతెంచిరి.

త్రిపురారి అగ్నివలె తేజరిల్లుచున్న త్రిశూలమును, చతుర్ముఖ బ్రహ్మ దేవుడు "పద్మరాగము" అను శిరసుపై ధరించు మణి (రత్నము) ను, వరుణుడు దేనినయిననూ బంధించగల దివ్య పాశమును, మహానుభావుడు, శివపుత్రుడు, స్కంధుడు "శక్తి" అను ఆయుధమును, వాయుదేవుడు ఒక దివ్య వ్యజనమును, యముడు అతి భయంకరమైన తన

దండమును ప్రసాదించెను.

ఆదిత్యుడు అత్యంత బరువయిన, సువర్ణమయమయిన దివ్య గద, కుబేరుడు అమూల్యము, సుందరము, దివ్యము అయిన ఒక రత్నమాలను, చంద్రుడు తన దివ్య కాంతికి సరిపోలు చంద్ర కాంత మణిని, అగ్ని దేవుడు అగ్నిశిఖవలె తేజరిల్లెడు ఒక దివ్య పరిఘను ప్రసాదించిరి.

పృథివీ దేవి దివ్యమయిన రెండు పాదుకలను, వేగశాలని అయిన భద్రకాళి ప్రద్యుమ్నునకు దివ్యమయిన మాల, శచీపతి, పురంధరుడు, దేవేంద్రుడు, ఆ శ్రీకృష్ణ తనయునికి సహస్ర శోభితమయిన విజయమును ప్రసాదించు దివ్య రత్నమయ రథమును బహూకరించిరి.

ఆ సమయమున శంఖ, దుంధుభీనాదములు మిన్ను ముట్టినవి. మృదంగ, వేణు, తాళ, వీణాది శబ్దములు ఆ నాదమును మరింత ఇనుమడింపచేసినవి. వానికి వేదమంత్ర ఘోష కూడా కూడి ఆ ప్రాంగణ మంతయు మారుమ్రోగినది. పుష్ప, ముత్యముల వర్షము కురిసినది. దేవతలు ప్రద్యుమ్నుని పుష్ప మాలాలంకృతుని గావించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహులాశ్వ సంవాదము నందలి "ప్రద్యుమ్నుని విజయాభిషేకము" అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(ప్రద్యుమ్నుని నేతృత్వము నందు దిగ్విజయ యాత్రకై బయలుదేరిన యాదవుల రథ, గజ, హయ, పదాతి సైన్య వర్ణన)

నారదుడు "తదుపరి ప్రద్యుమ్న కుమారుడు శ్రీకృష్ణ భగవానునికి, ఉగ్రసేన మహారాజుకు, మహాబలుడయిన బలభద్రునికి, కులగురువయిన గర్గాచార్యుల వారికి ప్రదక్షిణ పూర్వక నమస్కృతులాచరించి, వారి ఆజ్ఞను బడసి, రథారూఢుడై కుశస్థలీపురము నుండి బయల్వెడలెను. ఆయన వెంట ఉద్ధవాది భోజ, వృష్ణి, అంధక, మధు, శూర, దశార్హ యాదవ యోధులు వెడలిరి. ఆ వెనుక గదుడు ఆదిగా గల శ్రీకృష్ణ సోదరులు శ్రీకృష్ణుని ఆజ్ఞను బడసి తమ పుత్ర పౌత్రులతో అనుగమించిరి. అటుపిదప మహారథి అయిన సాంబుడు ఆదిగా గల శ్రీకృష్ణ పుత్రులు సహితము అనుసరించిరి. ఆ యాదవ వీరులందరూ లోహ కవచధారులై, కిరీట కుండలాలంకృతులై, తమ వెంట కోట్లాది చతురంగ బలములు వెంటరాగా ద్వారకాపురి బయటకు ఏతెంచిరి. వారి రథములు నెమలి, హంస, మీన, తాళ చిహ్న కేతనములతో, సూర్యమండల తుల్య తేజస్సుతో, చంచల జవనాశ్వములు పూన్చబడి శోభిల్లు చున్నవి. అంతేకాక ఆ అదరములు స్వర్ణకలశ మండితములై, ముత్యాలపదాలు జాలువారుచుండగా వాయువేగ గమనము కలవియై యున్నవి. ఈ విధముగ ఆ వీరులందరూ ఆ స్వర్ణ తేరులందు కూర్చొని ప్రయాణించుచూ మిక్కిలి శోభించుచుండిరి. ఆ సేన యందలి గజరాజములు నీలి పర్వతముల వలెయుండి ఎత్తైన గండమండలము నుండి మదధారలు ప్రవహించుచున్నవి. వాని ముఖమండలమందు చిత్ర విచిత్ర పత్రరచన గావింపబడి యున్నది. వాని మూపుపై ఎర్రని కంబళి పరుచబడి, శరీరము కవచములతో కప్పబడి మెడయందు గంటలు భయంకర ధ్వానములు కావించుచున్నవి. ఆ గజములు అనేక ప్రాంతముల నుండి సేకరింపబడినవి. కొన్ని భద్ర గజములు, కొన్ని భద్ర మృగ గజములు, కొన్ని వింధ్యాచలము నుండి, కొన్ని కాశ్మీర దేశము నుండి కొన్ని మలయాచలము నుండి, ఎక్కువ భాగము హిమాలయముల నుండి గొని రాబడినవి. కొన్ని మరుండ దేశము నుండి, మరికొన్ని కైలాస పర్వతారణ్యముల నుండి, కొన్ని ఐరావత కులమున, పుట్టిన కుంజరములు తీసికొని రాబడినవి. ఐరావత కుల గజములన్నియు చతుర్దంతులై, గళమున సంకెలలతో, కుంభ స్థలమునకు మూడు తొండములు కలిగి అవి భూమ్యాకాశములు యందు ప్రయాణించగల శక్తి కలిగి యున్నవి. కోట్లాది ఏనుగులు ధ్వజ

పతాకములతో శోభిల్లుచున్నవి.

ఆ కుంజరములపై దుందుభులు ఆయత్తము చేయబడినవి, వాటి వెనుక కోట్లాది కుంజరములు రత్న సమూహ మండితలై, సుశిక్షుతులైన మావటీలతో తోలబడుచున్నవి. ఆ మహాసేనాంబుధి యందు మేఘములు వలె గర్జించుచూ, తిమి, తిమింగళమల వలె ఆ గజరాజములు సంచరించుచున్నవి. అంతేకాక అవి కదులుచున్నపుడు ఆ పద ఘట్టనముల చే భూమిని కంపింప చేయుచూ, లతాకుంజములను తొండముతో పెకలించి సూర్యమండలము పైకి విసురుచూ, మదజల వర్షము చే పర్వతములను తడుపుచూ నడచుచున్నవి. అవి తమ కుంభస్థలము చే కొండలు, గుట్టలు, గండశైలములను లెక్కచేయక భేదించుచూ, శాత్రవ సేనా వాహినిని ఖండఖండములు చేయు శక్తి గలిగి యున్నవి. ఈ విధముగ ఆ భయంకర గజసేన కదలుచున్నది.

మహారాజా! ఆ గజసేన వెనుక అశ్వసేన కదిలినది. అందలి అశ్వములు కొన్ని మత్స్య, కళింద పర్వత, ఉశీనర, కోసల, విదర్భ, కురుజాంగాల దేశముల నుండి తేబడినవి. మరికొన్ని కాంభోజ, సృంజయ, కేకెయ, కుంతల దేశమున జన్మించినవి. కొన్ని దరద, కేరళ, అంగ, వంగ, వికట జనపదములందు పుట్టినవి. మరికొన్ని కొంకణ, కర్నాటక, గుజరాత, సావీర, సింధీ, పాంచాల, మరియు అబూ మండలముల నుండి కొనిరాబడినవి. మరికొన్ని కచ్ఛీ (కచ్), ఆనర్త, గాంధార, మాళవ, మహారాష్ట్ర, త్రిలింగ (తెలుగు) నేలయందు ఉత్పన్నమయినవి. కొన్ని తీర ప్రాంతముల నుండి సేకరింపబడినవి. పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుని అశ్వశాల యందలి అశ్వములు సహితము ఆ దిగ్విజయ యాత్ర యందు పాలుపంచుకొనినవి. ఆ దివ్య హయములు కొన్ని శ్వేత ద్వీపము నుండి, మరికొన్ని వైకుంఠము నుండి, కొన్ని అజితమండలము, మరియు రమా వైకుంఠలోకము నుండి ప్రాప్తించినవి. ఆ దివ్య హయములన్నియు సువర్ణమయములై, మెడ యందు స్వర్ణహారములు, శిఖ యందు మణులు, పుచ్ఛములు నెమలి పింఛము తోనూ అలంకరింపబడి, వీటన్నిటి నుండీ వెలువడుచున్న ప్రభ మిరమిట్లు గొల్పు చున్నది.

ఆ యాదవ సేన యందలి హయములు వాయు, మనో వేగములతో పయనించుచూ, అవి పరుగిడినపుడు వాని గిట్టలు భూమికి తగులక గాలి యందు తేలుచున్నట్లు యున్నవి. వాని గతి అత్యంత చంచలమై, నీటి నురగపై సహితము పరుగులెత్తగల గమన శక్తి కలిగి యున్నవి. అవి బురద నేల యందు జల ప్రవాహములందు నిరాధారముగ ఎగురుగల శక్తి కలవి. అంతేకాక ఆ హయములు పర్వత శిఖరములు, నదీలోయలు, దుర్గమ స్థానములు, ఎత్తైన ప్రాసాదములను సహితము లంఘించగల సామర్థ్యము కలిగినవి.

ఆ దివ్య హయములు నెమలి, సారస, కారండవ పక్షులను అనుకరించుచూ, నాట్యము చేయుచూ కదులుచున్నవి. కొన్ని అశ్వములు రెక్కలు గలవి, మరికొన్ని దివ్య శరీరములు కలిగినవి. కొన్ని నల్లని కర్ణములు కలిగి మనోహరాకృతి కలిగినవి. కొన్ని గుర్రములకు జూలు ఆకుపచ్చగనూ, శరీరము పూర్ణచంద్రుని కాంతితోనూ నిండియున్నది. కొన్ని అశ్వములు ఉచ్చైశ్రవ కులము నందు పుట్టినవి, మరికొన్ని ఆదిత్య దేవుని రథాశ్వమల నుండి ఉత్పన్నమయినవి. ఎన్నో గుర్రములు అశ్వనీ దేవతలచే సుశిక్షితమయినవి, మరికొన్ని ఇంద్రధనువు వలె రంగు రంగులతో శోభించుచున్నవి. ఎన్నో హయములు స్వర్ణకాంతియుతమై మరికొన్ని పద్మరాగ మణులవలె యుండి సర్వ హయసేన యు శుభ లక్షణములతో ప్రకాశించు చున్నవి. వీటితో పాటు కోటాను కోట్ల అశ్వములు కుశస్థలి పురమునకు బయటకు వచ్చినవి.

ఆ సేనయందు ఎంతోమంది యోధులు, ధనుర్విద్యా పారంగతులు, పూర్వయుద్ధములందు ఎంతో పేరు ప్రతిష్ఠలు సంపాదించుకొనిన వీరాధివీరులు కలరు. వారందరూ ప్రళయకాల సాగరము వలె ఘోషించుచుండిరి. రణభూమి యందు దిగ్గజములు వలె శాత్రవ సేనావాహినిని అతలాకుతలము చేయు శక్తి శాలుర వలె తోపించుచుండిరి. ఈ విధముగ మహాద్భుతము, భయానకము అయిన యాదవ సేనావాహిని కుశస్థలీ పురము నుండి బయల్వెడలినది. దానిని చూచి దేవాసురులు సహితము దిగ్భ్రాంతి నొందిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి "యాదవ సేనా ప్రయాణము" అను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(సేనా సహితముగ యాదవ సేనా వాహిని దిగ్విజయ యాత్ర)

నారదుడు "ఈ విధముగ సేనా సహితుడై, మహావీరులచే పరివేష్ఠితుడయిన ప్రద్యుమ్న కుమారుని అవలోకించి శ్రీకృష్ణ, బలరామ సహితుడయిన ఉగ్రసేనుడిట్లనియె "ఓ మహాప్రాజ్ఞా! ప్రద్యుమ్నా! నీవు శ్రీకృష్ణ భగవానుని కృపా కటాక్షము చే ఈ పృధివి యందు సమస్త రాజలోకమును జయించి శీఘ్రమే ద్వారకకు చేరెదవు. కానీ ఒక్క విషయము మిక్కిలి సావధానుడవై, జాగరూతక తో వినుము "ధర్మజ్ఞులు ఉన్మత్తులను, అసావధానులను, నిద్రించువారినీ, పిల్లలనూ, జడులనూ, స్త్రీలను, శరణాగతులను, రథహీనులను, భయభీతులయిన శత్రువులను ఎన్నడూ పరిమార్చరు. సంకటమున పడిన మృగముల నివారణము, కుమార్గమున సంచరించు మానవుల (దుర్మార్గుల) సంహారము రాజులకు పరమ ధర్మము. ఆతతాయులు (ఇతరులకు విషాన్నము పెట్టువారు, ఇళ్ళు తగులబెట్టువారు, పరక్షేత్రములును, పర నారీమణులను, అపహరించు ధూర్తులు) అవశ్యము వధార్హులు. సమస్త ప్రాణుల పట్ల నిర్దయతో యుండువారు. స్త్రీ, పురుష, నపుంసకులయిననూ వధార్హులు. అట్టి దుష్టులను సంహరించుట యందు రాజులకు దోషముండదు. ధర్మయుద్ధ మందు శత్రువులను చంపుటచే ప్రజాపాలకుడయిన మహీపతికి పాపము సంభవింపదు. ఆదిరాజయిన స్వాయంభువ మనువు పూర్వకాలమందు సమస్త రాజులను ఉద్దేశించి ఇట్లనియె "ఎవరు సమరాంగణమునందు నిర్భయులై మడమ త్రిప్పక ముందుకేగి ప్రాణ త్యాగము చేయుదురో, వారు సూర్యమండలమును భేదించి పరంధామమును చేరుదురు. ఏ యోధుడు క్షత్రియుడు అయినప్పటికీ యుద్ధ భయమున భీరువై వెను చూపించి తన స్వామిని ఒంటరిగ వదలి పారిపోవునో అతడు రౌరవాది నరకములందు శిక్షింపబడును. సేనను రక్షించుట రాజు యొక్క విధి. రాజును రక్షించుట సేన యొక్క కర్తవ్యము. సంకటమున పడిన రథిని రక్షించుట సూతుని కర్తవ్యము. సారథిని రక్షించుట రథికుని విధి. మీ యాదవులందరూ సర్వ సమర్థులు మరయు సేన, వాహనములతో సమృద్ధులయిరి. మీరందరూ కలసి ప్రద్యుమ్నుని రక్షించండి. ఆయన మిమ్ములను రక్షించును. గోవులు, బ్రాహ్మణులు, దేవతలు, ధర్మము వేదము, సాధుపురుషులు"–ఈ ఆరుగురు మోక్షాభిలాషులు అయిన మనుష్యులందరకూ పూజనీయులు. వేదము విష్ణుభగవానుని వాణి; బ్రాహ్మణులు అయిన ముఖము, గోవులు అయిన శరీరము. దేవతలు అయన అంగములు సాధుపురుషులు సాక్షాత్ ఆయన ప్రాణము.

"ఎవని హృదయము నందు పరిపూర్ణ భగవానుడు, భక్తవశంకరుడు అయిన శ్రీకృష్ణ భగవానుడు నివాసముండునో అట్టి వీరులకు సదావిజయ ప్రాప్తి కలుగును." సమస్త యాదవ వీరులు ఉగ్రసేన మహారాజు యొక్క ఆదేశమును శిరసావహించి, హస్తములు జోడించి, ప్రణామములాచరించిరి. అటు పిదప ప్రద్యుమ్నుడు శిరసువంచి ఉగ్రసేన మహారాజుకు, శూరసేనునకు, వసుదేవునికి, బలభద్రునికి, శ్రీకృష్ణ భగవానునుకి, కుల పురోహితుడయిన గర్గాచార్యుల వారికి ప్రణామము లాచరించెను. అటు పిదప ఉగ్రసేనుడు బలరామ, కృష్ణ సహితుడై యదుపురమున కేగెను. దిగ్విజయ కాంక్షితుడయిన ప్రద్యుమ్నుడు తన సేనా వాహినితో కలసి ముందుకేగెను.

ఆ సేనల విస్తీర్ణము చే నాలుగు యోజనములు పొడవు గల రాజమార్గము సంకుచితమయినట్లున్నది. ఆ విశాల సేనకు మందు మహాబలి అయిన కృతవర్మ, ఆయిన వెనుక దరుర్ధారుల యందు శ్రేష్ఠుడయిన అక్రూరుడు, ఆ వెనుక మంత్రి వరేణ్యుడయిన ఉద్ధవుడు, ఆ వెనుక పద్దెనిమిది మంది మహారథులు వంద అక్షౌహిణీ సేనావాహిని తో కదులు చుండిరి. ఆ మహారథులు ప్రద్యుమ్నుడు, అనిరుద్ధుడు, దీప్తిమానుడు, భానుడు, సాంబుడు, మధు, బృహర్భాను, చిత్రభాను, కృక, అరుణ, పుష్కర, దేవ బాహు, శృతదేవ, సునందన, చిత్రభాను, విరూప, కలి, న్యగ్రోధులు. ఆ వెనుక శ్రీకృష్ణ ప్రేరితులయిన గదుడు ఆదిగా గల యాదవ వీరులు పయనించిరి. భోజ, వృష్ణి, అంధక, మధు, శూరసేన, దశార్హ వంశ వీరులందరూ ఈ మహా సేన యందు సమ్మిళుతులైరి. యాదవ కులము సమస్తము ఏబది ఆరు కోట్లు. మరి భూతలమందు ఆసేనను లెక్కించుట ఎవరి తరము?

ఈ సువిశాల సేనా సహిత యాదవ నరేశుల ధనుష్టంకారములు గజేంద్రుల ఘీంకారములు, హయేంద్రుల సకిలింపులు, యోధుల కరవాలపు ఘళిపింపులు, వీరుల గర్జనలు, ఢంకల గంభీర ధ్వని, భయంకర ఉరుములతో కూడిన మేఘము వలె కానపట్టు చున్నది.

ఈ విధముగ ధరణీతలమునకు శోభనిచ్చుచూ, పృధివీ మండలమున సంచరించు యాదవ సేనా వాహిని కావించు భయంకర ధ్వని ధరిత్రిని మోయు అష్టదిగ్గజములు కర్ణములను సహితము భేదించుచున్నది. శత్రు గణముల యోధులు తమ తమ దుర్గములందు తలదాచుకొనుటకు పరుగులిడు చుండిరి. జలచరములయిన కచ్ఛపములు "ఈ ధరణీతలమున కేమైనది?" మనకు ఇప్పుడు దిక్కుఏది?" అని పరుగులిడుచూ "ఓ విధాతా! ఈ ఉపద్రవమునకు కారణమేమి? ఎప్పటికీ అచలమయిన పృధివి ఇపుడు విచిలితమగుచున్నది."

విదేహరాజా! ఈ రాజసూయము కేవలము ఒక నిమిత్తము. దీనిని ఆధారముగ చేసికొని పరమేశ్వరుడయిన శ్రీహరి భూతల భార హరణము కావించుచున్నాడు. ఈ యదుకుల మందు చతుర్వ్యూహ రూపుడయిన విరాజిల్లుచున్న అనంత గుణశాలి, పృధివీ పాలకుడయిన భగవానునికి సమస్కరించుచున్నాను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి ప్రద్యుమ్నుని దిగ్విజయ యాత్ర అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(యాదవుల కచ్ మరియు కళింగ దేశములపై విజయము)

బహుళాశ్వుడు "దేవర్షి శిరోమణీ! శ్రీహరి పుత్రుడయిన ప్రద్యుమ్నుడు క్రమముగా ఏఏ దేశములను జయించెను? ఆ వృత్తాంతమంతయు నాకు విపులముగ విశదీకరించవలసినది. అహో! శ్రీకృష్ణ భగవానుని కృప ఏమని చెప్పుదును? ఎవరు ఆయన చరితామృతమును శ్రవణ చింతనాది కార్యక్రమములు చేయుదురో ఆతడు మరియు ఆతని కులమంతయు పవిత్రము కావింపబడును. నారదుడు "మహారాజా! మంచి ప్రశ్న అడిగితివి. నీవు విమలబుద్ధివి. శ్రీకృష్ణ చరిత్ర మూడు లోకములను పవిత్రము గావించును. వర్షాకాల జలధారలను, ధరణీమండల మందలి సమస్త ధూళి కణములను లెక్కపెట్టవచ్చు నేమో కానీ, మహాత్ముడయిన శ్రీహరి యొక్క గుణ గణన ఎవరికయిననూ అసాధ్యము. రుక్మిణీ నందనుడు ప్రద్యుమ్నుడు తన నీడ యోజన దూరము వరకు విస్తరిల్లు శ్వేతఛత్రఛాయన ఇంద్రుని చేత బహూకరింపబడిన దివ్య రధమునందు అధిరోహితుడై మొదట కచ్ దేశములను జయించుటకు బయలుదేరెను. ఆ సమయమున ఆతడు త్రిపురాసుర సంహార సమయమున ధనుష్పాణి అయిన శంకర భగవానుని వలె శోభించుచుండెను.

కచ్ఛదేశపు రాజు శుభ్రుడు వేటకై కోట బయటకు ఏతెంచి సాగరము వంటి యాదవసేవా వాహినిని చూచి తన రాజధాని అయిన హేలాపురమున కేగెను. ప్రద్యుమ్నుని గజబలముల పద ఘట్టన చే ఉత్పన్నమయిన ధూళి ఆకాశమున కెగరి సర్వము అంధకార బంధురమయినది. కఛదేశ వాసీయులు మిక్కిలి భయభీతులయిరి. ఇవన్నియు గమనించిన శుభ్రుడు ఐదు వందల గజములను, సువర్ణ మాలాలంకృతములు చేసి, పది వేల గుర్రములను, ఇరువది బారువుల సువర్ణమును తీసికొని ప్రద్యుమ్నునకు ఎదురు వచ్చెను. అతడు ఈ బహుమతులు ప్రద్యుమ్నునకు అర్పించి, తన హస్తములను పుష్పమాలచే బంధన మొనర్చి, చేతులు జోడించి ఆ శ్రీకృష్ణ కుమారునకు అంజలి ఘటించెను. దీనిచే మిక్కిలి ప్రసన్నుడయిన శంబరారి ప్రద్యుమ్నుడు శుభ్రుని ఒక రత్నమాలచే సత్కరించి ఆతని రాజ్యమందు అతనిని ప్రతిష్ఠించెను. మహారాజా! సాధు పురుషుల స్వభావములిట్లే యుండును కదా! తదనంతరము ప్రద్యుమ్నుడు కళింగ దేశము వైపు తన సేనలను మళ్ళించెను. ఆ జైత్రయాత్ర యందు రెపరెపలాడుచున్న పతాకములు సందడి చేయుచుండగా మేఘమండలితో దేవరాజైన ఇంద్రుడు పయనించుచున్నట్లు యుండెను.

కళింగ భూపతి సామాన్యుడు కాదు. కళింగము గజబలమునకు ఆటపట్టు. ఆతడు తన బలమయిన గజయోధముల చే పరివేష్ఠితుడై సేనా సహితుడై ప్రద్యుమ్నుని ఎరుర్కొనెను. మాటిమాటికీ తనధనువు టంకారము చేయుచూ మహావీరుడయిన అనిరుద్ధుడు వంద బాణములతో కళింగభూపతిని, పదుల బాణములతో ఆయన చక్ర రక్షకులను, గజములను గాయపరచెను. అదిచూచి స్వపక్ష ప్రతిపక్షులు అందరూ "సాధు సాధు" నినాదములతో అనిరుద్ధుని ప్రశంశించిరి. ప్రద్యుమ్నుడు చూచుచుండగనే అనిరుద్ధుడు కార్చిచు వలె చెలరేగెను. ఆతడు తన బాణపరంపరచే ప్రత్యర్థి యోధులను తునాతునకలు గావించెను. కుంజరముల కుంభస్థలములు బ్రద్దలైనవి, అశ్వముల కాళ్ళు తెగిపడినవి, రధములు చూర్ణమయినవి. అశ్వములు మరియు వాని చోదకులు కాలగతి నందిరి. రథి మరియు సారధులు సుడిగాలి చే ఉగ్గడింపబడిన వృక్షముల వలె ధరాశయనులైరి. శత్రు సేనలు భయము చే పలాయనము ప్రారంభించినవి.

తన సేనలు పరాజయము పొందుట గమనించి తన గజము నందు ఆశీనుడయిన కళింగరాజు క్రోదోద్రిక్తుడై తన గజమును ముందుకు ఉరికించెను. ఆతని కవచము చిట్లియున్నది. ఆతడు డెబ్బది రెండు బారువుల గద తీసికొని శతృవులపై ప్రహరించుచూ, తన గజము చే శత్రువీరులను మర్దించుచూ బలశాలి అయిన కళింగ భూపతి మేఘ గర్జన చేయుచూ మందు కురికెను. ఆతడు అనిరుద్ధునకు ఎదురు వచ్చి బరువయిన తన గదతో అనిరుద్ధుని వక్షమున ప్రహరించెను. ఆ గదా ప్రహారము చే కించిత్ వ్యాకులుడై అనిరుద్ధుడు తన రధము నందు ముందుకు పడెను. అది చూచిన యాదవులు క్రోధమునకు అవధులు లేవు అంత యాదవ వీరులు భయంకర నారాచ సాయకములు ప్రయోగించి క్రౌంచ పక్షి మాంస ఖండమును చీల్చునట్లు కళింగ భూపతిని గాయపరిచిరి. ఆతడు సహితము మాటిమాటికీ ధనుష్ఠంకారము కావించుచూ శత్రువులను దునుమాడెను.

అంత బలదేవుని సోదరుడయిన గదుడు తన గదాయుధమును ఎడమ చేతిలో ప్రయోగించి కళింగ రాజ గజమును గాయపరిచి పిదప అర్ధ చంద్రాకారపు బాణమును ఆ మహా గజముపై ప్రయోగించెను. ఇంద్ర వజ్ర ఘాతము చే తునాతునకలయిన శైలఖండము వలె ఆ మహా కుంజరము ధరాశయన మయ్యెను. కళింగుడు క్రిందకు దుమికి భారమయిన తన గదను గదునిపై ప్రయోగించెను. గదుడు సహితము గదతో కళింగుని ప్రహరించెను. వారిరువురి నడుమ ఘోర యుద్ధము ఆరంభ మయ్యెను.

ఒండొరుల గదా ఘాతములు చే నిప్పురవ్వలు పైకి లేచి ఇరువురి గదలు చూర్ణమయినవి. అటు పిదప గదుడు గరుడుడు సర్పమును పట్టినట్లు కళింగుని పట్టి భూమిపై విసరెను. తన బలమయిన హస్తముచే, పిడికిలి పోట్టచే కళింగుని పొడిచి ఆతని శల్యములను చూర్ణము కావించెను. అంతట కళింగ భూపతి ప్రద్యుమ్నుని శరణువేడి ఇట్లనియె "మహాత్మా! మీరు దేవతలకు సహితము పరమేశ్వరులు. కుపిత దండధరుడయిన యముని వంటి మీ ఆక్రమణమును ఈ ధరణీ మండలమయిన ఎవరు సహింపగలరు? మీకు నా నమస్కారము" అని శరణు జొచ్చెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి కచ్, కళింగ దేశములపై విజయము అను ఐదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(ప్రద్యుమ్నుడు మరధన్వ దేశ రాజయిన గయుని ఓడించి, పిదప మాళవ, మాహిష్మతీ, పురాధీశుల నుండి యుద్ధము చేయకుండా బహుమతులు గైకొనుట)

నారదుడు "ఈ ప్రకారముగ కళింగముపై విజయము సాధించి, యాదేవశ్వరుడు మరుధన్వ (మార్వాడీ) దేశమును కార్చిచ్చు కాననమును దహించునట్లు ఆక్రమించెను. ఈ మరుధన్వాధీశుడు బలిష్ఠమయిన పర్వత దుర్గము నందు నివసించుచుండెను. ఈ విషయమును గ్రహించిన ప్రద్యుమ్నుడు ఆయన వద్దకు తన మంత్రివర్యుడు, బుద్దిమంతుల

యందు శ్రేష్ఠుడు అయిన ఉద్ధవుని దూతగా పంపెను. ఉద్దవుడు గిరి దుర్గమున కేగి "గయ" మహారాజు తో ఇట్లనియె "మహామతీ! మరుధన్వ నరేశ్వరా! ఉగ్రసేన మహారాజు జంబూద్వీపము నందలి రాజులను జయించి రాజసూయము చేయ సంకల్పించెను. అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి అయిన శ్రీకృష్ణ భగవానుడు ఆయనకు సచివుడై ఈ కార్యక్రమమును నడిపించుచుండెను. ఆయనే ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుని ఇచటకు పంపెను. మీరు మీ కులము, పురము, రాజ్యము యొక్క శుభ క్షేమములను అభిలషించెదరేని శీఘ్రమే బహుమతులు (కప్పము) తీసికొని ఆయన వద్దకు ఏగవలసినది."

ఈ విషయమును ఆకర్ణించిన మహాబలుడు "గయ" మహారాజు తన శౌర్య పరాక్రమముల చే ఉన్మత్తుడై, కొంచెము రోషభూయిష్ఠుడై ఇట్లనియె "మహామతీ! సమరము చేయకుండా బహుమతులు ఈయము. మీ యాదవులందరూ ఈ మధ్య కలిగిన వృద్ధి వలన గర్వితులైరి." ఉద్ధవుడు వెనుకకు వచ్చి సమస్త యాదవ సమక్షమున గయుని వ్యాఖ్యలను యదాతధముగ ప్రద్యుమ్ననకు నివేదించెను. ఆ క్షణముననే ప్రద్యుమ్నుడు గిరిదుర్గముపై యుద్ధము ప్రకటించెను. గజముల పద ఘట్టనలచే నగరములనూ, నాగరికులను వణికించు చుండగా రెండు అక్షౌహిణీల సైన్య సమేతుడై గయుడు యుద్ధభూమి యందు ప్రవేశించెను. రధికులు రధికుల తోనూ, గజములు గజముల తోనూ, హయములు హయముల తోనూ, వీరయోధులు పరస్పరము కరవాలములతోనూ రణము ఆరంభించిరి. తీక్షణ బాణ సమూహములు, గద, ఋష్టి, పాశము, పరశువు, శతఘ్నీ, మరియు బృశుండీ మొదలగు ఆయుధములు మరియు మరిన్ని అస్త్ర శస్త్రములు ప్రయోగించుచున్న యాదవ సేనను చూచి గయుని సైనికులు భయభీతులై యాదవుల నుండి దూరముగ తమ వాహనములు విడచి పరుగిడసాగిరి.

తన సైన్యము పలాయనమగుట కాంచిన గయుడు మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ, ఏకాకియై సమరాంగణమున ముందుకేగెను. ఇంతలో శ్రీకృష్ణ పుత్రుడయిన "దీప్తిమానుడు" తన ధనువు నుండి బాణవర్షము కురిపించుచూ గయుని రధ హయములను హతమార్చి, ఒక్క బాణముతో సారధిని నష్టపరిచి, రెండు నారాచములతో కేతనమును కూల్చెను. తదుపరి ఇరువది బాణములతో ఆతని రధమును చూర్ణము కావించి అయిదు బాణములతో కవచమును చిట్లగొట్టెను. పిదప శౌర్యశాలి అయిన దీప్తిమానుడు వంద బాణములతో గయుని ధనస్సును ముక్కలు ముక్కలు గావించెను. గయుడు వేరొక ధనువు చూపట్టి ఇరువది బాణములతో దీప్తిమానుని గాయపరచెను. మహాబలి అయిన గయుడు మేఘగర్జన గావించెను.

సమరాంగణమునందు గయుని ప్రహారము చే దీప్తిమానుడు హృదయము నందు వ్యాకులత పొంది, తిరిగి స్వస్థుడై, జ్యోతిర్మయమయిన ఒక సుదృఢ శక్తిని చేతి లోనికి తీసకొని త్రిప్పి, త్రిప్పి, మహావీరుడయిన గయునిపై ప్రయోగించెను. ఆ శక్తి గయుని హృదయమును విదీర్ణము కావించి, ఆతని రక్తమును పీల్చి, ఆతనిని యుద్ధభూమి యందు మూర్ఛితుని గావించెను. అంత దీప్తిమానుడు తన ధనువు యొక్క చివరి భాగము చే గయుని మెడను పట్టి, గరుడుడు సర్పమును ఈడ్చునట్లు ఆతనిని సమరాంగణము నందు భూమిపై ఈడ్చుచూ, ప్రద్యుమ్నుని కడకు తెచ్చి ఆయన ముందు పడవైచెను. ఆ సమయమున మానవ, దేవ దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి కురిసినది. అంత గయుడు కూడా తెలివి తెచ్చుకొని, ప్రద్యుమ్నుని కాళ్ళపైబడి పూజించెను.

భ్రమరము సుందర పుష్ప కర్ణికలపై వ్రాలునట్లుగా, అచటి నుండి ప్రద్యుమ్నుడు అవంతికా పురమునకేగెను. ఆయన ఆగమన వార్త వినిన మాళవ దేశాధీశుడు "జయసేనుడు" ప్రద్యుమ్నుని ప్రత్యేకముగ పూజించి, ఆతని ప్రభావమును ఎరిగిన వాడగుటచే, తన పరాజయమును స్వీకరించి, తన రాజ్యమునందలి జ్ఞానులను, వృద్ధులను పిలిచి వారి ద్వారా బహుమతులను యాదవ పతికి సమర్పించెను. ప్రద్యుమ్నుడు సహితము తన మేనత్త అయిన రాజాధిదేవికి ప్రణామము లర్పించి, తన మేన మరదులయిన విందాను విందులను హృదయమునకు హత్తుకొని మాళవ యోధులను సాదరముగ గౌరవించెను. అచటి నుండి ధనుర్ధారు లందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు బయలుదేరి సేనా సహితుడై సరితల యందు శ్రేష్ఠురాలైన "నర్మద" ను దర్శించెను. ఉత్తుంగ తరంగితయై, జల కల్లోలిత అయిన నర్మదానది పుష్ప సమూహములతో

ప్రవహించుచూ శింగార తిలక ధారణ చేసిన సుందర సుదతి వలె భాసించుచున్నది.

సుదృడమయిన లతలతో నిండి పుష్పశోభితములైన విశాల వృక్షముల అటునిటు ఛాయను ప్రసాదించుచుండగా మాధవ తరువులతో పరివేష్ఠితమయిన నర్మద ఆకాశగంగ వలె శోభించుచున్నది. ఆ వృక్ష ఛాయలందు శిబిరములు వైచికుని యాదవేంద్రుడు ప్రద్యుమ్నుడు దేవేంద్రుని వలె శోభించెను. మహారాజా! ఆ తరణమున మాహిష్మతీ నగరమును ఇంద్రనీల మహారాజు పరిపాలించు చుండెను. ఆయన గొప్పజ్ఞాని. ఆయన ప్రద్యుమ్నుని కడకు ఒక దూతను పంపెను. ఆ దూత ప్రద్యుమ్నుని శిబిరము ప్రవేశించి అందరూ వినుచుండగా ఇట్లనియె "ప్రభూ! హస్తినా పురాధీశ్వరుడయిన దృతరాష్ట్ర మహారాజు అత్యంత బలశాలి అయిన ఇంద్రనీల మహారాజును మాహిష్మతీ పురాధీశునిగా పట్టాభిషేకము చేసెను. అందువలన మేము ఎవరికీ బహుమతులు (కప్పములు) ఈయము. దుర్యోధనునికి స్వేచ్ఛగా మాత్రమే కప్పములు కట్టుచున్నాము. బలవంతముగా కాదు. మీరు యుద్ధము చేయవచ్చు గాక! కానీ ఆ యుద్ధము వలన ఎవరికి లాభముండదు!" ప్రద్యుమ్నుడు "దూతా! ఎట్లు మహారాజులయిన గయుడు, కళింగ భూపతులు కప్పములు కట్టిరో, అట్లే ఇక్కడి రాజులు కూడ చేయవలసినదే!! మాహిష్మతీ ప్రభువు గొప్పరాజు కావచ్చు. కానీ ఆయనకు ఉగ్రసేన మహారాజు గూర్చి తెలియదు." మాహిష్మతీ దూత వెనుకకు వెళ్ళి ఈ విషయమును రాజసభయందు అందరిముందు ప్రకటించెను. మాహిష్మతీ ప్రభువు యాదవ సైన్య ఉద్ధతిని గమనించి, తన అసమర్ధతను సహితము గుర్తించి అయిదు వేల గజములను, ఒక లక్ష గుర్రములు, పదివేల విజయశీలము లయిన రథములు, తీసికొని కోట బయటకు వచ్చి ప్రద్యుమ్నుని కలిసి కప్పముగ ఆ బహుమతులు సమర్పించెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి "మాహిష్మతీ పురము పై విజయము" అను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(గుజరాత నరేశుడయిన ఋష్యునిపై విజయము పొంది యదుసేనలు చేదిదేశపు స్వామి అయిన దమఘోషుని పై కేగుట. మహారాజు ప్రేమపూర్వకముగ యాదవులనాహ్వానింప దలచుట. కానీ యువరాజైన శిశుపాలుడు మాతా పితలను విభేదించి యాదవులతో యుద్ధము చేయుటకు సంకల్పించుట)

నారదుడు "మహా పరాక్రమ వంతుడయిన ప్రద్యుమ్నుడు మాహిష్మతీ మహారాజును ఓడించి తన విశాల సేనా సహితుడై గుజరాత నరేశునిపై దండెత్తెను. గరుడుడు సర్పమును బట్టినట్లు ప్రద్యుమ్నుడు గుర్జరాధిపతి, మహాబలుడయిన ఋష్యకుని సేనా సహితముగ చుట్టు ముట్టి ఓడించి కప్పమును గైకొనెను. అచటి నుండి చేది దేశమున కేగెను. చేది దేశపు రాజు దమఘోషుడు వసుదేవునకు స్వయానా బావమరిది. కానీ అతని పుత్రుడయిన శిశుపాలుడు గొప్ప కృష్ణ శత్రువు. బుద్ధిమంతుల యందు శ్రేష్ఠుడయిన ఉద్దవుడు దమఘోష మహారాజు వద్దకు కేగి ఇట్లనియె, "మహారాజా! ఉగ్రసేన మహారాజు రాజసూయము కావించుటకై సర్వరాజలోకమును ఓడించుచున్నాడు. అందుచేత మీరు ఆయనకు కప్పము కట్టవలసినది." ఉద్దవుని మాటు వినిన దమఘోష పుత్రుడయిన శిశుపాలుడు పెదవులు అదురుచుండగా కుపితుడై రాజసభ యందు ఇట్లనియె "ఆహా! కాలగతి దుర్లంఘ్యము. ఈ సంసారము ఎంత విచిత్రమయినది? కాలాత్ముడయిన విధాతకు ప్రాజాపత్యాదులకు వివాద మేర్పడినట్లున్నది. రాజహంస ఎక్కడ? కాకి ఎక్కడ? పండితుడెక్కడ? మూర్ఖుడెక్కడ? సేవకుని వలె పడియుండవలసిన వాడు తన స్వామి అయిన చక్రవర్తిపై ధ్వజమెత్తుచున్నాడు. యయాతి మహారాజు శాపము చే యదు వంశీయులందరూ రాజ్యభ్రష్ఠులైరి. కానీ ఈనాడు ఒక చిన్న రాజ్యమును స్థాపించుకొని, ఒక చిన్న సెలయేరు కొంచెము జలము పొంది పెల్లుబికి ప్రవహించునట్లు ప్రవర్తించుచున్నారు. ఎవరు హీన వంశమున పుట్టి మహారాజులగుదురో, మూర్ఖుని పుత్రుడై పండితుడగునో, నిర్ధనుడయిన వానికి కొంచెము ధనము ప్రాప్తించునో

అటువంటినాడు గర్వాతిశయము చే నిండి, సర్వ జగత్తును తృణప్రాయముగ కాంచును. ఉగ్రసేనుడు ఎంత కాలము నుండి రాజ్య పదవి నలంకరించెను? వసుదేవుడు ఆతనికి మంత్రిగా యుండుటచే, కేవలము అతనిచే పూజింపబడుటచే ఉగ్రసేనుడు రాజ్యాధికారము నందెను. వాసుదేవుడు జరాసంధుని భయముచే మధురను విడచి పారిపోయి సముద్రమును శరణువేడెను. ఆతడు తొలుత నందుడను గొల్ల వానికి పుత్రుడుగా చెప్పబడెను.

అతనినే వసుదేవుడు సిగ్గు, ఎగ్గు లేక తన పుత్రునిగ చేసికొనెను. వసుదేవుడు పచ్చని ఛాయా శరీరుడు. ఆతని కుమారుడు శ్యామల శరీరుడు ఎట్లయ్యెను? తండ్రియేకాదు తాత కూడా పచ్చని ఛాయాశరీరుడే? అటువంటి కులమందు ఈ వాసుదేవుని గణించుట హాస్యాస్పదము, దు:ఖకారకము. నేను ఆతని పుత్రుని ప్రద్యుమ్నుని, తదితర యాదవ సేనను ఓడించి, ద్వారకపై దండెత్తి ఈ జగతిని యాదవ శూన్యము కావించెదను." ఈ విధముగ పలికి తన ధనువును, అక్షయ తూణీరములను చేపట్టిన శిశుపాలుని చూచి దమఘోషుడిట్లనియె.

"నాయనా! నా మాట వినుము. క్రోధము వలదు. ఎవరు వెనుక ముందు లాలోచించక కార్యములు తలపెట్టెదరో వారు విజయము నొందరు. క్షమను మించిన ధర్మార్ధ కామ మోక్ష సాధనము వేరొకటి లేదు. అందువలన సామముచే కార్యము సాధింపవలసినది. సామము తో తుల్యమయిన సుఖదోపాయము మరొకటి లేదు. దానముచే సామము, సామము చే సత్కారము, సత్కారము యోగ్య గుణముల చేతనూ శోభించును. యాదవ చేది దేశస్థుల మధ్య మిక్కిలి దగ్గరి బంధుత్వము యున్నది. వాస్తవముగ నేను ఈ ఇరు రాజ్యముల మధ్య స్నేహ సంబంధములు కోరుకొను చున్నాను." బుద్ధిశాలి అయిన దమఘోషుడు ఈ విధముగ పలికినప్పటి కీ శిశుపాలుడు ఒప్పుకొనక నిశ్శబ్దముగ కూర్చొండెను.

చేది రాణి "శృతిశ్రవ" శూరనందిని. సాక్షాత్ వసుదేవుని చెల్లెలు. ఆమె శిశుపాలుని వద్దకు వచ్చి అత్యంత అనునయముగ ఇట్లనియె "నాయనా! బాధపడవద్దు. యాదవ చేది దేశముల మధ్య కలహములు అనర్ధదాయకములు. శూరనందనుడు వసుదేవుడు స్వయముగ నీ మేనమామ, మరియు ఆతని పుత్రుడు శ్రీకృష్ణుడు నీ భ్రాతృసమానుడు. ఆతని పుత్రులయిన ప్రద్యుమ్నాదులు నాచే ప్రేమించయోగ్యత కలిగిన వారు. అటువంటి ప్రియతములతో సమరము పనికిరాదు. నాయనా! నేను కూడా నీతో వచ్చి స్నేహార్ద్ర చిత్తనై యాదవులను సమాదరముగ ఆహ్వానించెదను. చిరకాలము నుండి నాకు వారందరినీ చూడవలెనని కోరికగా యున్నది. నేను అత్యంత ఉత్సాహము తో ఒక ఉత్సవము వలె వారందరినీ ఆహ్వానించెదను. ఇందువలన కలతలు ఏర్పడవు." కానీ శిశుపాలుడు "బలరామ కృష్ణులు, సమస్త యాదవులు నాకు శత్రువులు. ఎవరు నన్ను తిరస్కరించెదరో వారందరినీ నా సైనికుల ద్వారా పరిమార్చెదను. పూర్వకాలమందు రామకృష్ణులిరువురు కుండిన పురము నందు నన్ను అవహేళన కావించి నా వివాహము నడ్డుకొనిరి. వారు నా సోదరులు ఎప్పటికీకారు.

వారు నాకు పరమ శత్రువులు. ఒకవేళ మీరిరువురు (తల్లిదండ్రులు) యాదవులను సమర్ధించిన ఎడల నేను మిరిరువురినీ సహితము కంసుడు తన తండ్రిని బంధించినటుల సంకెలతో బంధించి కారాగార వాసులను కావించెదను. లేదేని మీరిరువురినీ వధించెదను. నా ప్రతిజ్ఞ మిక్కిలి కఠోరమయినది సుమా!"

శిశుపాలుని ప్రతిజ్ఞ వినిన చేది దేశాధీశుడు చేయునది లేక నిశ్శబ్దముగా కూర్చుండెను. ఉద్ధవుడు వెనుకకు వచ్చి ప్రద్యుమ్నాది వీరులకు తాను కన్నది, విన్నది పూసగ్రుచ్చినుట్లు వివరించెను. తదనంతరము శిశుపాలుని సేన "వాహినీ," "ధ్వజినీ," "పుతనా", "అక్షౌహిణీ" అను నాలుగు ప్రకారముగ విభజింప పడినది. బహుళాశ్వుడు "మహర్షీ! ఋషులు భూత, భవిష్యత్, వర్తమానములను ఎరుగుదురు. అందువల్ల ఈ వాహినీ ఆదిగా గల సేనల సంఖ్యను వివరింపవలసినది." నారదుడు "మహారాజా! వంద గజములు, పదకొండు వందల రథముల, పదివేల గుర్రములు, ఒక లక్ష పదాతి దళములు కలిపి "సేన" అనబడును. దీనికి ద్విగుణీ కృతమయినది "చతురాంగిణీ." నాలుగు వందల గజముల, పదివేల రథములు, నాలుగు లక్షల గుర్రములు, ఒకకోటి పదాతి సైన్యమును కలిపి విద్వాంసులు "వాహిని" అందురు. దీనికి ద్విగుణీకృతము "ధ్వజినీ". దీనికి ద్విగుణీకృతము "పుతనా," అని పిలువబడును. పుతనాకు ద్విగుణీ కృతము "అక్షౌహిణీ" గా పేర్కొనబడినది.

ఎవరేని సాహసికుడయిన వీరుడు కలడేని ఆతనిని "శూరుడు" గా పేర్కొందురు. ఎవరు వంద మంది శూరులను రక్షించునో ఆతడు "సామంతుడు". ఎవరు సమరము నందు వందమంది సామంతులను రక్షించునో ఆతనిని "గజీ" లేక "గజారోహి" అయిన యోధునిగా పేర్కొందురు. ఎవరు సమరాంగణము నందు తన సారధిని, హయములను రక్షించుకొనునో ఆతనిని రధి అందురు. ఎవరు తన సేనను రక్షించుకొనుచూ, శత్రు సంహారము కావించుచూ ఒక సారిగా ఒక అక్షౌహిణీ సేనతో యుద్ధము సలుపగల యోధులు "అతిరధులు" గ పేర్కొనబడుదురు."

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి "గుర్జర చేది దేశ గమనము" అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(శిశుపాల మిత్రులయిన ద్యుమాన, శక్తుల వధ)

నారదుడు "మహారాజా! శిశుపాలుడిట్లు తన మాతాపితరులను తిరస్కరించి చంద్రికాపురము నుండి బయల్వెడలెను. దుష్టుల స్వభాములిట్లే యుండును. వారితో పాటుగా వాహినీ, ధ్వజినీ, సేనా సహితులై ఆతని స్నేహితులైన ద్యుమాన్, శక్తి అను ఇరువురు అనుసరించిరి. శిశుపాలునకు "రంగ, పింగ" అను ఇరువురు మంత్రులు కూడా కలరు. వారిరువురు పుతనా మరియు అక్షౌహిణీ సేనా సహితులై బయల్వెడలిరి. శిశుపాలుని సేన ప్రశయకాల మహాసాగరము వలె ముందుకురుచుకున్నది. దానిని చూచి యుదు వంశీములు శ్రీకృష్ణ భగవానుని ఓడవలె వరించి ఆ సైన్య సాగరమును దాటుటకు సమకట్టిరి.

శిశుపాల ప్రేరేపితుడయిన ద్యుమానుడు తన వాహినీ సేనావాహినిని వెంటబెట్టుకొని యాదవులతో యుద్ధమారంభించెను. సమరాంగణము నందు ఇరువైపులా వేయబడుచున్న బాణపరంపరచే ఆకాశము ఆచ్ఛాదితమై భూమి అంధకార బంధురమైనది. అందువలన దౌడుతీయుచున్న హయములు ఎగిరి ఏనుగుల కుంభస్థలముల పైకి దూకి వానికి గాయములు కలుగజేయు చున్నవి. గాయ పడిన ఏనుగులు బాధతో ఘీంకరించుచూ, అటునిటు కలియతిరుగుచూ, శత్రు సైనికులను తమ తొండములతో పట్టి విసురుచూ రణరంగమును కకావికలు గావించుచున్నవి. ఆ కుంజరముల కుంభస్థలములపై పత్రరచన కావింపబడి, మూపుపై ఎర్రని కంబళులు కప్పబడి మనోహరముగ యున్నవి. పదాతి సైన్యము బాణములు, గదలు, పరిఘలు, ఖడ్గములు, శూలములు మరియు శక్తి మొదలగు ఆయుధముల చే నరుకబడి ధరాశయనులైరి. వారి మోకాళ్ళు, కాళ్ళు, బాహువులు, ఖండింపబడి ఛిన్నా భిన్నమయినవి. కొందరు వీరులు ఆ కుంజరములు దంతములు పట్టి పైకి ఎక్కి, అచటి మావటులను పట్టి వధించి, సింహము వలె విజృంభించి, ఆ గజారోహులను సహితము అంతమొందించిరి. మరికొందరు తమ నిశిత కరవాలములు పట్టి హయములను రెండుగా ఖండించిరి. అనేకమంది యోధులు హయముల నధిరోహించి ప్రత్యర్థుల గజబలమును దాటి శత్రు సేనలపై విరుచుకు పడి తమ ఖడ్గ ప్రహారముల చే వారిని విదీర్ణులను కావించిరి. ఆ హయారూఢులు విద్యుత్ వేగముతో ఆ హయములు నుండి క్రిందికి దూకుచూ, తిరిగి ఎక్కుచూ సంగర సంహార క్రీడ సాగించుచుండిరి.

శత్రువులు వేగముగ ఆక్రమించుట గాంచి అక్రూరుడు ముందుకు వచ్చి తన శర పరంపర చే ప్రత్యర్థి సైన్యము నందు కలవరము పుట్టించెను. ద్యుమానుడు సహితము బాణవర్షము కురిపించి వర్షాకాలమేఘములు సూర్యుని కప్పివేయునట్లు అక్రూరుని ఆచ్ఛాదించెను. అంత గాందినీ నందనుడు, అక్రూరుడు కోపోద్రిక్తుడై, ద్యుమానుని బాణ పరంపరలకు సమాధానమిచ్చి, ఆ వీరునిపై "శక్తి" ఆయుధమును ప్రహరించెను. ఆ ప్రహారముచే ద్యుమానుని అంగములు విదీర్ణములై రెండు ఘడియలు మూర్ఛితుడాయెను. పిదప తేరుకుని మహా బలవంతుడయిన శిశుపాల మిత్రుడు తిరిగి

లేచి యుద్ధమారంబించి, లక్ష బారువుల బరువు గల గదను చేతిలోనికి తీసికొని, దానితో అక్రూరుని హృదయ భాగమును ప్రహరించి, మేఘ గర్జన గావించెను. ఆ ప్రహారముచే అక్రూరుడు కొంచెము విచిలితుడయ్యెను. ఇంతలో భయంకరముగ ధనుష్టంకారము కావించుచూ యుయుధానుడు (సాత్యకి) ముందుకు వచ్చెను. ఆతడు క్రీడా సదృశముగ ఒక్క బాణముతో ద్యుమానుని సారథిని సంహరించి మరియొక బాణముతో ద్యుమానుని మస్తకమును ఖండించెను. ద్యుమానుడు మరణించుటచే ఆతని సేనలు పలాయనము చిత్తగించినవి.

తమ సేన పలాయనము కావించుట కాంచిన "శక్తి" అచటకు చేరి బుద్ధిమానుడయిన సాత్యకి పై శూలము విసరెను. సాత్యకి తన బాణ పరంపర చే ఆ శూలమును ఖండించి చూర్ణము కావించెను. అంత శక్తి ఒక పరిఘను చేత బట్టి యుయుధానుని వక్షముపై ప్రహరించెను. అంత అర్జున సఖుడు, శిష్యుడు అయిన యుయుధానుడు ఒక్క క్షణము మూర్ఛితుడయ్యెను. ఇంతలో మహాబలుడు, వీరుడు అయిన కృతవర్మ అచటకి ఏతెంచెను. అంత శక్తి కుపితుడై తన గదా ప్రహారము చే కృతవర్మ యొక్క రథమును నుగ్గునుగ్గు చేసెను. అంత కృతవర్మ క్రోధోద్రిక్తుడై శక్తిని తన రెండు చేతులతో పట్టుకొని ఒక యోజనము దూరము విసరెను. యుద్ధభూమి యందు శక్తి క్రిందబడి, పరాజితుడై ధరాశయనుడు అయ్యెను.

ఆ దుర్ఘటనను కాంచిన శిశుపాలుడు తన మంత్రులయిన "రంగ, పింగ" లను ప్రేరేపించెను. వారిరువురు వరుసగా పుతనా మరియు అక్షౌహిణీ సేనలను తీసికొని శత్రు సైన్యము నందు ప్రవేశించి శరవర్షము కురిపించుచూ యాదవ యోధులను చికాకు పెట్టసాగిరి. వారిరువురు ఆ సమయమున అగ్నికి వాయువు తోడైనదా అన్నట్లు ప్రకాశించు చుండిరి.

వారిరువురిని కాంచిన యాదవ యోధుడు, పితృతుల్య పరాక్రముడు అయిన ప్రద్యుమ్నుడు సమస్త యాదవ వీరుల సమక్షమున ఇట్లు ప్రకటించెను, "యోధులారా! రంగ పింగలను దునుమాడెదను. వీరిరువురు మిక్కిలి పరాక్రమోపేతుల వలె కానపట్టు చున్నారు," ప్రద్యుమ్నుని పలుకులు వినిన మరియొక శ్రీకృష్ణ పుత్రుడు, నీతివేత్త, మహాబాహువు అయిన "భానుడు" ఇట్లు పలికెను, "ప్రభూ! త్రిలోకములు ఒక్కసారిగా మీ సమ్ముఖమున యుద్ధమున కేతెంచిన ఎడల అపుడు మాత్రమే మీ ధనుష్టంకారము వినబడవలెను. నేను కేవలము నా కరవాలము తోనే ఈ రంగ పింగల మస్తకములను ఖండించి మీ వద్దకు ఏతెంచెదను."

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండాంర్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి ద్యుమానుడు, శక్తి అను వారల వధ అను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(భానుని ద్వారా రంగ, పింగలు వధింపబడుట; శిశుపాల ప్రద్యుమ్నుల భయంకర సమరము. చేది దేశము పై ప్రద్యుమ్నుని విజయము)

ఈ విధముగ పలికి డాలు, వంపుతిరిగిన భయంకర ఖడ్గము ధరించి మదగజము అరణ్యమున ప్రవేశించినటుల శత్రు సైన్యము లోనికి ప్రవేశించెను. తన కరవాలమును ఘుళిపించుచూ, శత్రు యోధుల భుజములు ఉత్తరించుచూ, ఎదురు వచ్చిన గజ, హయములను లక్ష్య పెట్టక వానిని సహితము తన ఖడ్గ ప్రహారము చే రెండు ముక్కలు గావించుచూ, ఏకాకియై, శత్రుసేనల మధ్య నిర్భయుడై విహరించుచుండెను. ఆయన సహాయము కేవలము కరవాలమే!! ఎట్లు మేఘమండలము చే ఆచ్ఛాదితమయిన సూర్యుడు కొంచెము సేపు కనిపించనప్పటికీ, తిరిగి తన తేజోరాశి చే ఎట్లు ప్రకాశించునో, అట్లే, భానుడు సహితము కొంత తడవు శత్రుసేనలచే చుట్టుముట్టినప్పటికీ, తన స్వవీర్యము చే వారిని దునుమాడి, మధ్యందిన మార్తాండుని వలె ప్రకాశించెను. భానుని ఖడ్గ ప్రహారముచే పగిలిన కుంజర కుంభ స్థలముల

నుండి జాలు వారిన ఆ ముత్యములు ఆ సమరాంగము అంతయు విరజిల్లుబడుచూ, పుణ్యము క్షీణించిన పిదప జ్యోతిర్మయ రూపమున మర్త్యలోకమును చేరు జీవులను తోపించుచున్నవి.

తన కేవల దృష్టిపాతము చే శత్రు సేనలను ధరాశయనుల కావించుచూ నెమ్మదిగ భానుడు రంగ, పింగలను సమీపించెను. శ్రీ కృష్ణ భగవానుడు ప్రసాదించిన చంద్రహాసమును హస్తమున ధరించి, భానుడు రంగ పింగల రథమును తునాతునకలు గావించెను. పిదప తన ఖడ్గ ప్రహారము చే వారి హయములను హతమార్చి, సారధుల మస్తకములను శరీరము నుండి వేరు పరిచి, రంగ, పింగలపై దూకెను. వారిరువురు ఖడ్గధారులై భానుని పైకి దూకిరి. వారి మధ్య భయంకర యుద్ధము కొనసాగెను. కానీ భగవద్దత్తమయిన ఖడ్గము చే రంగ పింగల కరవాలములు తునియలు గావింపబడి, వారిరువురి మస్తకములు తరబూజ ఫలముల వలె నేలపై దొర్లెను. యాదవ సైన్యము జయజయ ధ్వానములు కావించుచుండగా, సేనాపతులందరూ పలు విధములు గ ప్రశంశించుచుండగా భానుడు రంగ పింగల మస్తకములను పట్టుకొని ప్రద్యుమ్నుని కడకేతెంచెను. ఆ సమయమున మానవ, దేవ దుందుభులు మ్రోగినవి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి.

తన మంత్రులు నిహతులైరి అను సమాచారమును వినిన శిశుపాలుని క్రోధమునకు అవధి లేకుండెను. ఆతడు ఒక విజయశీల రథము నందు ఆరూఢుడై యాదవుల ఎదుటకు వచ్చెను. ఆతనిని అనుసరించి గొప్ప గజ సైన్యము నడచినది. ఆ గజములు కన్నుల నుండి మదజలము కారుచుండగా, మూపున రత్న జటిత కంబళులు పరుచబడి. కుంభస్థలములందు సువర్ణహార శోభితలై, మెడలో యున్న గంటలు యోజనముల దూరము వరకు ఘంటా నాదము చేయుచుండగా తమ పద ఘట్టన చే ధరిత్రిని కంపింప చేయుచూ, శత్రుసేనలపై అక్రమణ చేయనారంభించెను. దేవతా విమాన సదృశములయిన రథములు, వాయు సమాన వేగముగల తురంగములు, విద్యాధర సదృశ వీరయోధులు నినాదములు చేయుచుండగా, శిశుపాలుడు సమరాంగణ ప్రవేశము కావించెను.

ఈ విధముగ అట్టహాసముగ అరుదెంచుచున్న శిశుపాలుని సైన్యమును కాంచి ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు ఇంద్రదత్త అథరమును అధిరోహించి ముందునకేగి తొలుత సర్వదిశలు, భూనభోంతరాళములందు ప్రతిధ్వనించు తన శంఖమును పూరించెను. ఆ భయంకర శంఖారావము చే శత్రువుల గుండెలు కంపించినవి. శిశు పాలుని సైన్యము సహితము సామాన్యమైనది కాదు. అయ్యది గిరి దుర్గము వలె పటిష్ఠమయినది. అందు ప్రవేశించుటకు ప్రద్యుమ్నుడు బాణములతో సోపానము నిర్మించెను. ఇది గమనించిన శిశుపాలుడు తనకు దత్తాత్రేయుడ ప్రసాదించిన బ్రహ్మాస్త్రమును మంత్రించి, ధనుష్టంకారము చేయుచూ ప్రయోగించెను. ఆ అస్త్రము సర్వదిశలనూ దగ్ధము చేయుచూ యాదవ సైన్యమును చుట్టుముట్ట నారంభించెను. ఇది గమనించిన రుక్మిణీ నందునుడు తానును బ్రహ్మాస్త్రమును సంధించి ప్రత్యర్ధి యొక్క అస్త్రమును శాంతపరచెను. బ్రహ్మాస్త్రము విఫలమగుట చే శిశుపాలుడు తనకు మహేంద్ర గిరిపై జమదగ్ని నందనుడయిన పరశురాముని చే ప్రసాదించబడిన అంగారకాస్త్రమును ప్రయోగించెను. అ అస్త్ర ప్రభావము చే యాదవ సైన్యము పై అగ్ని కణములు వర్షము వలె కురియు నారంభించెను. యాదవ సైన్యము మిక్కిలి వ్యాకులత మయ్యెను. అది గమనించిన శ్రీకృష్ణ నందనుడు దివ్యమయిన పర్జన్యాస్త్రమును మంత్రించి విడిచెను. ఆ అస్త్ర ప్రభావము చే ఏనుగు తొండముల వంటి వర్షధారలు కురిసి అంగారకాస్త్రమును శాంత పరచెను. అంత శిశుపాలుడు కుపితుడై భయంకరమయిన గజాస్త్రమును ప్రయోగించెను. దాని ప్రభావము చే కోట్లాది పర్వత కాయములయిన గజములు ఉద్భవించి ప్రద్యుమ్నుని సేనలను మట్టికరిపించుట నారంభించెను. యాదవ సైన్య మందు హాహాకారములు చెలరేగెను.

అదికాంచిన యద్ధ విద్యా నిపుణుడు, సమస్త అస్త్రశస్త్ర కోవిదుడు అయిన ప్రద్యుమ్నుడు నృశింహాస్త్రమును ప్రయోగించెను. ఆ అస్త్ర ప్రభావము చే నృశింహుడు సమరాంగణము నందు ఉద్భవించి ఒక్కమారు భూనభోంతరాళములు ప్రతిధ్వనించునట్లు గర్జన చేసెను. ఆయన కంఠము నందు జూలు ప్రకాశించుచుండెను. పంజా యందలి గోళ్ళు వంకర తిరిగి వాడియై గగుర్పాటు కలిగించుచుండెను. నృశింహస్వామి ఆ సమరాంగణమంతయు కలియదిరుగుచూ, కనిపించిన హస్తిని పట్టి భక్షించుచూ, కుంభ స్థలమును బ్రద్దలు గావించుచూ, మధ్య మధ్య భయంకర సింహనాదములు గావించుచూ

గజములను మర్దించి అంతర్ధానుడయ్యెను. గజాస్త్రము సహితము వ్యర్ధము కాగా శిశుపాలుడు రోషముతో పరిఘాయుధమును చేపట్టి మహా వేగముతో ప్రద్యుమ్నుని పై విసరెను. మాధవ నందనుడు తన పై బడుచున్న పరిఘపై తనకు యమరాజు ప్రసాదించిన యమదండమును చేపట్టి ఆ పరిఘను రెండు ముక్కలు గావించెను.

అంత శిశుపాలుడు డాలు, ఖడ్గములు చేపట్టి శలభము ప్రజ్వలించు అగ్నిపై ఉరుకునట్లు ప్రద్యుమ్నునిపై కురికెను. అంత ప్రద్యుమ్నుడు తన చేతనున్న యమదండమును శిశుపాలుని ఖడ్గము పై ప్రయోగించెను. ఆ ప్రభావము చే చేదిరాజు యొక్క కరవాలము, డాలు నుగ్గు నుగ్గు అయినవి. అంత మాధవ నందనుడు వరుణ పాశములు ప్రయోగించి, దమఘోష తనయుని బంధించి, సమరాంగణమున క్రిందవైచి సర్వులు చూచుచుండగా ఈడ్చి ఈడ్చి తన కోపము చల్లారక అతని కంఠమును తెగనరుకుటకు కరవాలము నెత్తెను. అంత శ్రీ కృష్ణ సోదరుడు గదుడు పరుగు పరుగున ఏతెంచి ప్రద్యుమ్నుని భుజములు పట్టి ఇట్లనియె "రుక్మిణీ నందనా! ఈతని వధ పరిపూర్ణ పరమాత్మ అయిన శ్రీకృష్ణుని వలననే జరుగవలసి యున్నది. ఇప్పుడు నీవీ కార్యము అచరించి దేవతా వాక్కులను వమ్ము చేయరాదు."

శిశుపాలుడు బంధింపబడిన వెంటనే సేనల యందు గొప్ప కోలాహలము చెలరేగెను. ఆ సమయమున చేదిరాజు దమఘోషుడు బహుమతులు తీసకొని ప్రద్యుమ్నుని కడకేతెంచెను. నిరాయుధుడై, మంగళ ద్రవ్యములు సహితుడై ఏతెంచుచున్న వృద్ధ నరపతిని కాంచి, వెంటనే తానునూ అస్త్ర శస్త్రములను విడచి, చేదిరాజునకు ఎదురేగి, చేతులు జోడించి, ఆ వృద్ధనరపతి పాదములకు తన శిరసు తాటించి నమస్కృతులాచరించెను. దనుఘోషుడు మహాను భావుడయిన ప్రద్యుమ్నునకు ఆశీర్వచనములు కావించి గద్గద వాణితో ఇట్లనియె.

"యాదవ శిరోమణీ! ప్రద్యుమ్నా! నీవు ధన్యుడవు. నా పుత్రుని చే కావింపబడిన అపరాధములను మన్నింపవలసినది. " ప్రద్యుమ్నుడు "ప్రభూ! ఈ జరిగిన విషయమందు మరెవ్వరి దోషములు లేవు. ప్రియా ప్రియములు సర్వము కాలచోది తములు మరియు విధి నిర్ణయములు."

నారదుడు "మహారాజా! ప్రద్యుమ్నుని పలుకులు వినిన దమఘోషుడు వరుణ పాశ బద్ధుడయిన శిశుపాలుని విడిపించుకొని, తనతో పాటు వెనుకకు చంద్రికాపురమునకు ఏగెను. శ్రీకృష్ణ తుల్య పరాక్రముడయిన ప్రద్యుమ్నుని పరాక్రమాటోపమును కథలు కథలుగా వినిన నరేశ్వరులెవ్వరూ ఆయనను ఎదిరించుటకు సాహసించ లేదు. అందరూ అవనిత శిరస్కులై కప్పములు కట్టుటకు అంగీకరించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి రంగ పింగ వధ, శిశుపాలుని సమరము, చేదిదేశము పై విజయము అను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(యదవసేన కొంకణ, కుటక, త్రిగర్త, కేరళ, త్రిలింగ, మహారాష్ట్ర మరియు కర్నాటక దేశములపై విజయము నొంది కరూశదేశమున కేగుట, అచట దంతవక్త్రుని తో ఘోర యుద్ధము.)

నారదుడు "మిధిలేశ్వరా! తదనంతరము మను తీర్థము నందు స్నానమాచరించి ప్రద్యుమ్నుడు దుందుభులు మ్రోగింపచేయుచూ సేనా సహితుడై కొంకణ దేశము నకు ఏగెను. కొంకణ దేశపు మహారాజు "మేధావి" గొప్ప గదా యుద్ధ కుశలుడు. ఆతడు మల్లయుద్ధము ద్వారా ప్రత్యర్థుల బలాబలములు తెలిసికొనుటకు ఏకాకియై ఏతెంచెను. ఆతడు సేనా సహితముగ వచ్చిన ప్రద్యుమ్నునితో "యాదవేశ్వరా! నాకు మల్ల యుద్ధ భిక్ష ప్రసాదించవలసినది, "చేతనయిన నా బలమును నాశనము కావింప వలసినది." అంత ప్రద్యుమ్నుడు ఓ! మల్లుడా! ఈ భూతలమందు ఒకరి కంటె ఎక్కువ బలము, వీర్యము గల యోధులు ఎప్పుడు యుండురు. అందువలన నీవు గర్వోపవేతుడవు కారాదు. విష్ణు భగవానుని మాయ దురజ్ఞయము. మేము అనేకమంది వీరులము కలము. నీవు ఏకాకివై యున్నావు. మల్లయోధా! ఇది అధర్మము.

అందువలన నీవు వెనుకకు తిరిగి పోవలసినది." అంత మల్లుడు "మీరు వీరయోధులయినప్పటికీ నాతో యుద్ధమునకు వెనుకాడితిరేని, నా పాదముల క్రిందనుండి వెడలెదరు గాక!" ఆ పలుకులు ఆలకించినంతనే యాదవయోధులు కోపోద్రిక్తులయిరి. అంత బలదేవ సోదరుడయిన గదుడు తన గదా యుధమును ధరించి ముందుకు వచ్చెను. అంత వారిరువురి మధ్య ద్వంద్వ యుద్ధము ఆరంభమయినది.

తొలుత మేధావి తన గదతో గదుని ప్రహరించెను. అంత గదుడు ఆ ఘాతమును సహించి తన గదతో ప్రత్యర్థిని ప్రహరించెను. ఆ ఘాతము తగిలిన వెంఠనే మేధావి నేలపై బడి, నోటినుండి రుధిరము వెళ్ళిగ్రక్కుట నారంభించెను. తక్షణము యుద్ధకాంక్ష విడచి, ప్రద్యుమ్నుని కి ప్రమాణములిడి ఇట్లనియె "మహాత్మా! నేను కేవలము మిమ్ము పరీక్షించుటకు మాత్రమే ఈ కార్యమాచరించితిని. మీరు సాక్షాత్ భగవత్స్వరూపులు. మీరెక్కడ? నా వంటి ప్రాకృతిక పురుషులెక్కడ? నా అపరాధమును మన్నింప వలసినది. నేను మిమ్ములను శరణు జొచ్చుచున్నాను." ఈ విధముగ కొంకణాధీశుడు ముకుంద తనయునికి బహుమతులిచ్చి, వందనము లిడి, తన పురమున కేగెను. "కుటక" దేశాధీశుడు "మౌళి". వేట నిమిత్తమై నగరము నుండి బడల్వెడలెను. ఆతనిని జాంబవతి నందనుడు సాంబుడు పసిగట్టి బంధించెను. ఆతని నుండి కప్పము గైకొని ప్రద్యుమ్నుడు దండకారణ్యము వైపు వెడలెను.

ప్రద్యుమ్నుడు దండకారణ్యమున మునుల ఆశ్రమములు తిలకించుచూ సేనా సహితుడై క్రమముగా "నిర్వింధ్యా, ప్రయోష్ణీ, తాపి" నదులందు స్నానమాచరించి, మహాక్షేత్రమయిన శూర్పారకము చేరెను. అచట "ద్వైపాయనీదేవి" యొక్క దర్శనము కావించి, ఋష్యమూక పర్వతము యొక్క శోభను తిలకించుచూ, పర్జన్య భగవానుడు (ఇంద్రుడు) నిత్య నివాసముండు ప్రవర్షణ గిరిని చేరెను. అచట నుండి బయలుదేరి పరమ మహితాన్విత శివక్షేత్రమయిన గోకర్ణము చేరి, మహాదేవుని ఆరాధించి, తన సేనా సహితుడై త్రిగర్త, కేరళ దేశములపై విజయము సాధించుట కేగెను.

కేరళరాజు అంబష్ఠుడు నా (నారదుని ద్వారా) ప్రద్యుమ్నుని వైభవమును వినిన వెంటనే బహుమతులు అర్పించెను. అంత యాదవ సేన పరమ పుణ్య నది అయిన కృష్ణవేణి ని దాటి తమధాటిచే పైకి లేచిన ధూళి ఆకాశమును కప్పి అంధకారము కావించుచుండగా త్రిలింగ దేశమును ప్రవేశించెను. ఆ దేశమును పరిపాలించు రాజు విశాలాక్షుడు. ఆతడు తన నగరపు ఉపవనము లందు సుందరీమణులతో విహరించుచుండెను. మధుర మృదంగ నాదములు తోడుగా ఉత్కృష్ఠ గాన మాధుర్యమును అనుభవించు తరుణమున ఆయన రాణి అయిన "మందారమాలిని" ధూళి సంతమయిన ఆకాశమును చూచి ఇట్లనియె "మహారాజా" మీరు రాత్రింబవళ్ళు క్రీడా విహారము లందు మునుగుచూ ఏ రాచ కార్యములను సరకు చేయుట లేదు. దివా రాత్రములు అత్యంత కామావేశులై చంచల హృదయ లగుచున్నారు. నేను సహితము మీ సుందరవదనారవిందమును మధుపము వలె గ్రోలుచూ దు:ఖమును ఎరుగక సుఖించుచున్నాను. కానీ ఈనాడు ద్వారకాధీశు డయిన ఉగ్రసేనుని పనుపున ఆయిన చే కావింపబడుచున్న రాజసూయమును పరిరక్షించుచూ యదురాజు అయిన ప్రద్యుమ్నుడు చేదిరాజు ఆదిగా గల సమస్త రాజనీకమును ఓడించి మన వద్దకు ఏతెంచుచున్నాడు. ఆ దుందుభుల ధ్వని, ఏనుగుల ఘీంకారములు, హయముల సకిలింపులతో సమ్మిళితమై యున్నది. శాత్రవ కోదండటంకారములు ప్రశయకాల గర్జనల వలె యున్నవి. అందువలన శంబరాం అయిన ప్రద్నుమ్నుని కడకు అతి త్వరగా బహుమతులు పంపవలసినది."

తన పత్ని పలుకులు వినిన విశాలాక్షుడు ప్రసన్నుడై, బహుమతులు తీసికొని ప్రద్యుమ్నుని కడకు వచ్చి ఆయనను పూజించెను. ఈ విధముగ సమ్మానితుడై ముకుంద నందనుడు పంపా సరోవర తీర్థమందు స్నానమాచరించి మహారాష్ట్ర వైపు నడచెను. మహారాష్ట్రమును పరిపాలించు మహారాజు విమల విష్ణుభక్తుడు. అతడు అత్యంత భక్తి భావముతో ప్రద్యుమ్నునకు బహుమతులిచ్చి పూజించెను.

ఈ విధముగనే కర్ణాటకము నేలు "సహస్రజితుడు" స్వయముగా బహుమతులు అర్పించి తన శుభములు, మరియు కళ్యాణములకై జగదీశ్వరుడు, మాయావతీ వల్లభుడు అయిన ప్రద్యుమ్నుని పూజించెను. మిథిలేశ్వరా! యోగి ఎట్లు దేహాభిమానమును విడుచుటకు యత్నించునో అట్లే సాక్షాత్ పరమేశ్వరుడయిన ప్రద్నుమ్నుడు "కరూశ" దేశమును జయించుటకు ఏగెను. "మహారంగ పురము" ఆదేశపు రాజధాని. దానిని బుద్ధిమంతులందు శ్రేష్ఠుడు, సాక్షాత్ వసుదేవుని

చెల్లెలయిన "శృతదేవి" భర్త అయిన వృద్ధ శర్మ పరిపాలించుచుండెను. కాని వారి పుత్రుడయిన దంత వక్రుడు పరమ కృష్ణ ద్వేషి. అతడునూ శిశుపాలుని వలె కుపితుడై యాదవులతో యుద్ధము చేయుటకు నిశ్చయించెను. వాని మాతా పితరులు వానిని వారించుచు నిగ్రహించుటకు ప్రయత్నించిరి. కాని అసురులయందు అనురాగము గల దైత్యుడు దంతవక్రుడు "నేను యాదవులను వధించెదనని" నిశ్చయించి ఏకాకి యై లక్ష బారువులు బరువు గల గదను చేపట్టి ప్రద్యుమ్నునకు ఎదురుగ వచ్చెను.

దంతవక్రుడు నల్లని కారుమేఘ శరీర ఛాయ కలవాడు. భయంకర రూపుడు. నాలుక మెల్లిగ బయటకు వచ్చి, మెలి తిరుగుచూ లోనికి పోవుచుండును. అతడు పది తాడిచెట్లు ఎత్తు కలిగి మస్తకమందు కిరీటము, కర్ణములందు కుండలములు, వక్షమందు సువర్ణయుక్త కవచము, చేతులకు మణి మాలలు ధరించి నెమ్మదిగ ముందుకు వచ్చెను. ఆతని నూపురములు ఘల్లు ఘుల్లు మనుచుండగా ఆతని పాదతాకిటికి పుడమి కంపించుచుండగా, పర్వత శిఖరములు, ఎత్తైన చెట్లు సహితము విరుగుచుండగా బలమయిన, బరువయిన గదా ప్రహారము చే శత్రువులను ధరాశయనుల కావించుచూ సమరాంగణము నందు సాక్షాత్ యముని వలె కానపట్టుచుండెను.

ఇటువంటి దంతవక్రుని చూడగనే యాదవసేన భయముచే కొంత తడవు నిశ్చేష్టులై యుండి పిదప సేన యందు భయజనిత మహాకోలాహలము చెలరేగెను. ప్రద్యుమ్నుడు మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ పద్ధెనిమిది అక్షౌహిణీల సేనను ఆతని పైకి పంపెను. మహారాజా! కుంజర సమూహము పర్వతము చుట్టూ చేరి ప్రహరించినట్లు సమస్త యుదవసేన బాణములు, పరశువులు, శతఘ్నులు, మరియు బృశుండులతో దంతవక్రుని ప్రహరించుట ప్రారంభించిరి. వాటిని వేటినీ లక్ష్యపెట్టక భయంకర గదాధారి అయిన దంతవక్రుడు వరుసగా గజరాజుల కుంభ స్థలములను బ్రద్దలు కొట్టుట ప్రారంభించెను. కింకిణీజాల నినాదితలు, సువర్ణ సంకెల శోభితలు, చంచల ఘంటా మండితలయిన గజములను పాదములు పట్టి, సుడిగాలి పొట్టును పైకి విసురునట్లు, వందేసి యోజనములు విసరుట ప్రారిభించెను. ఆ దైత్యరాజు కొన్ని గజములను వాని తొండములు పట్టి త్రిప్పి త్రిప్పి సర్వదిశలకు విసిరివైచెను.

కొన్ని గజముల పార్శ్వముల పైననూ, కొన్నింటిని పొట్ట పైననూ, కొన్నింటిని కర్ణముల పైననూ ప్రహరించి, హింసించుచూ ఆ భయంకర దైత్యుడు కాలాగ్ని రుద్రుని వలె విజృంభింప నారంభించెను. ఆతడు ఆ మహారథుల రథములను సారథి, హయ, ధ్వజముల సహితముగ, అవలీలగా సుడిగాలి కమలములను పెరుకునట్లు పెకలించి విసురనారంభించెను. అంతేకాక హయ పదాతులను సహితము ప్రయత్నపూర్వకముగ పట్టుకొని, పైకెత్తి ఆకాశమున కెగురవేయుట ఆరంభించెను. అనేక మంది రాజకుమారులు రత్నమయ కంకణ, కేయూర, శస్త్ర సహితులై క్రిందపడుచూ, ఆకాశము నుండి క్రింద పడుచున్న తారలవలె కాన పట్టిరి. అంతేకాక వారందరి ముఖము నుండి రక్తము వెలిగ్రక్కుచుండిరి. ఆ దైత్య పుంగవుడు ప్రళయకాలమున శ్రీ వరాహ భగవానుడు తన కోరలతో సముద్ర జల రాశిని కల్లోలము కావించునట్లు యాదవ సేవ నంతటినీ మథించెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి యాదవ సేన కరూష దేశాగమనము అను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(దంతవక్త్రుని పరాజయము మరియు కరూశ దేశముపై యాదవ సేనా విజయము)

నారదుడు "ఈ విధముగ భీభత్సము కొనసాగుచుండగా శ్రీకృష్ణుని పుత్రులయిన పద్ధెనిమిది మంది మహారథులు కలసికట్టుగా ఎదిరించి దంతవక్రుని క్షతగాత్రుని గావించిరి. దంతవక్రుడు గాయపడి రక్తధారలు కారుచుండగా లక్కరంగు వేసిన ఎత్తైన భవనము వలె శోభించుచుండెను. ఆతడు శత్రువుల ఘాతములను కొంచెము సహితము లక్ష్యపెట్టలేదు.

కృతవర్మ ఆతనిపై బాణ వర్షము కురిపించెను. సాత్యకి కరవాలముతో గాయము చేసెను. అక్రూరుడు శాక్త్యాయుధమును, రోహిణీనందనుడు పారణుడు కుఠారమును ప్రయోగించిరి. కానీ రణ దుర్మధుడయిన దంతవక్త్రుడు సాత్యకిని గదతోనూ, కృతవర్మను చేతితోనూ, అక్రూరుని దండము తోనూ, సారణుని భుజములు తోనూ ప్రహరించి క్రింద పడవైచెను. వారు నలుగురు సుడిగాలి యందుపడిన వృక్షములు వలె క్రింద పడి మూర్ఛనొందిరి. అంత జాంబవతి నందనుడు సాంబుడు తన గద తీసికొని దానితో దంత వక్త్రుని గదను అదిమి ఆ గదతో దంతవక్త్రుని ప్రహరించెను. దంతవక్రుడు తన గదను వదలి, సాంబుని రెండు భుజములు పట్టుకొని రణమండల మందు క్రింద పడవైచెను. అంత సాంబుడు కుపితుడై లేచి దంత వక్త్రుని రెండు పాదములు పట్టుకొని లాగి క్రిందపడవైచెను. అంతలో ఒక విచిత్రము జరిగెను.

క్రిందపడిన దంతవక్త్రుడు తిరిగి లేచి వికటాట్టహాసము చేయ నారంభించెను. ఆ అట్టహాసమునకు భూనభోంతరాళములు అన్నియు కంపించుట ప్రారంభించెను. అంత వేయసూర్యుల తేజశ్శాలి, వేయి హయములు పున్చిన దివ్యరథారూఢుడయిన ప్రద్యుమ్నుడు అచటికి ఏతెంచెను. ఆయనను చూచి దంతవక్త్రుడు ఈ విధముగ కఠినముగ పలికెను. "మీ సమస్త యాదవులు, వృష్ణి, అంధక వంశీయులు స్వల్ప శక్తిమానులు, తుచ్ఛులు, రణభూమి నుండి పారిపోయిన భీరవులు. మీరు రాజ్య భ్రష్టులు, మరియు లజ్జా విహీనులు. నేను ఏకాకిని. మీరు బహు సంఖ్యలో యున్నారు. అయిననూ అధర్మ పద్ధతి యందు పయనించి, ధర్మ శాస్త్రోల్లంఘనము చేయు నరాధములయిన మీరు నాతో రణమాచరించిరి. నీ తండ్రి శ్రీ కృష్ణుడు నందుని ఇంట పశువుల కాపరియై యుండెను. అతడు గొల్లల ఎంగిలి తినెడువాడు. కాని ఈనాడు యాదవులందరికీ నాయకుడయ్యెను. గోపికల ఇండ్లయందు వెన్న, నెయ్యి, పాలు, పెరుగు మొదలగు గోరసములు తస్కరించువాడు. రాసమండలమందు కాముకుడై నర్తించి, నటించెను. జరాసంధుని భయముచే సముద్రమును శరణుజొచ్చెను. కాలయముని ఎదుట భీరువై పరుగులెత్తెను. కానీ ఆతడే ఈనాడు "యధునాధు" డయ్యెను. అటువంటి వానిచే ఈయబడిన స్వల్ప రాజ్యమును స్వీకరించి ఉగ్రసేనుడు ఆ అల్పాసారుని కొరకై యజ్ఞము లందు శ్రేష్ఠమయిన రాజసూయమును చేయ సమకట్టెను. సంసారము యొక్క గతి విచిత్రము. అత్యంత దుర్బలమయిన నీచ జంబుకము సింహ, వ్యాఘ్రములపై శాశనము చేయుటకు ఉద్యక్తమగు చున్నది.

ప్రద్యుమ్నుడు "ఓ! నిందకుడా! పూర్వము నీవు కుండినపురము నందు బలరామ కృష్ణులను చూడలేదు కాబోలు! సర్లే! ఈనాడు చూడవచ్చు. కరూషరాజా! మీరందరూ మా బంధువులు. అందువలన మీ యెడ నాకు యుద్ధకాంక్ష లేదు. కానీ నీవు బలపూర్వకముగ యుద్ధమారంభించితివి. ఇది నీ ద్వారా ధర్మ శాస్త్రానుమోదిత కార్యముగ ఆరంభింపబడినది. నందరాజు గూర్చి నీవు ఏమి తెలియును? ఆయన సాక్షాత్ ద్రోణుడు అను వసువు. ఆయన గోపకులమందు అవతీర్ణుడయ్యెను. గోలోకమందలి గోపాల గణములు అందరూ సాక్షాత్ శ్రీ కృష్ణుని రోమముల నుండి ఉత్పన్నమయిన వారే! గోపికలందరూ శ్రీరాధాదేవి రోమముల నుండి ఉద్భవించిన వారే! ఈ గోపాంగనల యందు కొంతమంది తమ పూర్వజన్మ ప్రభావము చే శ్రీకృష్ణ భగవానుని ప్రాప్తించుటకు ఏతెంచిన వారు.

శ్రీకృష్ణ భగవానుడు పరిపూర్ణతమ భగవానుడు. పూర్వకాలమందలి మరుత చక్రవర్తిఏ శ్రీకృష్ణ భగవానుని వరదానము వలన ఉగ్రసేనునిగ అవతరించెను. నీవు మహా మూర్ఖుడవు మరియు నిరంకుశడవు. అందువలననే గుణశాలురయిన మహా పురుషులను నిందించుచున్నావు. సింహము గ్రామ సింహములనూ, వ్యాఘ్రము జంబుకములనూ లెక్కపెట్టనటుల నీ ప్రేలాపనలను శ్రీకృష్ణ, ఉగ్రసేనులు పట్టించుకొనరు."

ప్రద్యుమ్నుని పలుకులు వినిన దంతవక్త్రుడు మిక్కిలి మండిపడి, ఒక మహాగదను తీసికొని ప్రద్యుమ్నుని రథముపై ప్రహరించి గర్జన చేయనారంభించెను. ఆ గాయముల చే హయములు పరుగులెత్త నారంభించెను. అంత ప్రద్యుమ్నుడు సహితము తన దివ్య గదాయుధమును తీసికొని దంతవక్త్రుని వక్షస్థలమున తాడించెను. ఆ ప్రహారము చే దైత్యుడు వ్యాకుల చిత్తుడయ్యెను. అంత వారిరువురి మధ్య దంద్వ యుద్ధమారంభమయ్యెను. వారిరువురు ఒకరినొకరు బలముగ ప్రహరించుచూ, రణభూమి యందు అరచుచూ, గర్జనలు చేయ నారంభించిరి. ఆ సమయమున వారిరువురు పర్వత శిఖరమున ఢీకొనుచున్న రెండు కొదమ సింహముల వలె కనపట్టిరి. అంత దంతవక్త్రుడు ప్రద్యుమ్నుని రెండు భుజములు పట్టుకొని క్రిందకు విసరెను. అంత ప్రద్యుమ్నుడు పైకిలేచి, ఆ దైత్యుని రెండు చేతులు పట్టుకొని, త్రిప్పి త్రిప్పి నేలపై

పడవైచెను.

అంత దైత్యుడు క్రిందపడి రక్తము క్రక్కుకొన నారంభించెను. ఆతని ఎముకలు చూర్ణము లాయెను. శరీరము శిథిలమయి మూర్ఛితుడయ్యెను. దంతవక్త్రుడు ఆ సమయమున ఇంద్రుని వజ్రాయుధము చే దెబ్బతిన్న పర్వతము వలె చ్యుతుడై నేలపైబడెను. ఆతని శరీరపు బరువుచే చతుస్సాగర వేలాయతమయిన వసుంధర ఒరగనారంభించెను. దిగ్గజములు విచిలితములయినవి. తారలు రాలినవి. సముద్రము కంపించినది. ఆతడు పడినప్పటి భయంకర ధ్వని చే త్రిలోకముల ప్రాణులు కొంత తడవు బధిరులైరి.

ఆ సమయమున మహారంగపుర మహారాజయిన వృద్ధశర్మ తన పట్టపురాణి అయిన శృతదేవి సహితుడై నగరము వెలుపలికి ఏతెంచి శంబరారి అయిన ప్రద్యుమ్నునకు బహుమతు లొసగి, సంధి చేసికొని, యాదవుల చే పూజింపబడి, తన పుత్రుని తీసికొని నగరము లోనికి తిరిగి వెళ్ళెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి దంతవక్త్రునితో యుద్ధము; కరూషదేశముపై విజయము అను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(ఉశీనరాది దేశముల పై ప్రద్యుమ్నుని విజయము. ప్రద్యుమ్ననకు అగస్త్యుని తత్త్వోపదేశము)

అటు పిదప ముకుంద నందనుడు దక్షిణ సముద్రము నందు స్నానమాచరించి ఉశీనర దేశమును ఆక్రమించెను. అచట కోట్లాది దివ్యగోవులు నెమ్మదిగ సంచరించుచున్నది. ఉశీనర వాసులు గోదుగ్ధమును త్రావి, తెల్లని శరీర కాంతితో శోభించుచుండిరి. వారు వెన్న బహుమతిగా గొని ప్రద్యుమ్నుని కడకు ఏతెంచిరి. వారి యందు ప్రసన్నుడై రుక్మిణీ నందనుడు వారికి రథ, గజ, హయ, రత్న, వస్త్ర, భూషణములు, అనేక ధనసంపదలు బహూకరించెను. ఉశీనర రాజధాని చంపానగరము. అయ్యది మణిరత్న సంపన్నము, మరియు మనోహరము. దానిని వీరుడు హేమాంగదుడు పరిపాలించుచుండెను. సర్పముల చే భోగవతీ పురము శోభించునట్లు, ఆ రాజ కుటుంబము చే చంపావతీ నగరము శోభించుచుండెను. ముకుందనందనుడు ఏతెంచెనన్న శుభవార్త వినినంతనే హేమాంగదుడు అనేక బహుమతులు తీసికొని శీఘ్రముగ ఆయనను కలసి ప్రణామము లాచరించెను.

ఆ మహారాజాచరించిన సత్కారమునకు సంతుష్టుడయి రుక్మిణీ సుతుడు ఆయనకు కేసరియుక్తమాలను, సహస్రదళ పద్మమును, బహూకరించెను. తదనంతరము దనుర్ధారి అయిన ప్రద్యుమ్నుడు దుందుభులను మ్రోగింప చేయుచూ సేనా సహితుడై విదర్భదేశమునకేగెను. అచట కుండిన పురాధీశుడయిన భీష్మకుడు తన మనువుని అత్యంత ఆదరముగ, ఆనందముగ తన ఇంటికి తీసికొని పోయి అనేక విధములయిన సంపదల నొసగి సత్కరించెను. అంత ఆ రుక్మిణీ నందనుడు తన తాతగారికి నమస్కరించి, అక్కడనుండి బయలుదేరి కుంతల మరియు దరదదేశముల కేగెను. మార్గమధ్యమున మలయాచల చందన వృక్షములను తాకిన గాలి వచ్చి ఆయనను సేవించుచుండగా, శ్రీఖండ, పుష్ప సుగంధము తాపము తీర్చు చుండగా ఒక అద్భుతము జరిగెను.

పరమేశ్వరునకు ప్రీతి పాత్రుడు, ఋషులకు సహితము గురువు, సాగరమును ఆపోశన పట్టిన మహానుభావుడు అగస్త్య మహర్షి అచటకు ఏతెంచెను. ఆ మహామునిని చూచి ముకుంద నందనుడు తన రెండు చేతులను జోడించి ఆయనకు భక్తితో నమస్కరించి, ఆయన పార్శ్వమున నిలుచుండెను. ఆ ముని రుక్మిణీనందనునకు శుభాశీర్వాదమును ప్రసాదించి ప్రశంసించెను.

ప్రద్యుమ్నుడు "ఓ! మునిశ్రేష్ఠా! ఈ జగత్తు దృశ్యపదార్థ నిర్మితము కావున మిధ్య. కాని ఎట్లు సత్యముగ నిరూపింపబడు చున్నది? జీవుడు పరబ్రహ్మ యొక్క అంశ కావున నిత్యముక్తుడు. అయినప్పటికీ అతడు గుణములచే ఎట్లు బంధితుడగుచున్నాడు. దయచేసి ఈ విషయము నాకు విశదీకరించవలసినది. మహాప్రభూ! మీరు సర్వజ్ఞులు; దివ్యదృష్టి సంపన్నులు, మరియు సమస్త బ్రహ్మవేత్తలందు శ్రేష్ఠులు." అగస్త్యుడు "ఓ! రుక్మిణీనందనా! నీవు సాక్షాత్ శ్రీకృష్ణ పరమాత్ముని పుత్రుడవు. అయిననూ నన్ను ప్రశ్నించుచున్నావు. నీ ప్రశ్న కేవలము లీలామాత్రము. ప్రభూ! ఎట్లు భగవానుడు లోక సంగ్రహార్ధము కర్మను ఆచరించునో, అట్లే నీవును మానవుల కళ్యాణార్ధము ఈ ప్రశ్నలను అడుగుచున్నావు. ఎట్లు జలమున ప్రతిబింబించు సూర్య బింబము మిధ్య అయినప్పటికీ సత్యము వలె కానిపించునో, అట్లే, ప్రకృతి పురుషుల ప్రతిబింబ స్వరూపమయిన జగత్తు సహితము అసత్తు అయినప్పటికీ సత్యము వలె దృష్టి గోచరమగును. ఎట్లు చంద్రబింబమందు ముఖము, రజ్జువు నందు సర్పము, ఎండమావి నందు జలము కనబడుచున్నవో అట్లే పరమాత్ముడు సత్యాది త్రిగుణముల చే బద్ధుడయినట్లు కనబడుచున్నాడు. అంత:కరణ దర్పణమునందు సత్స్వరూపము (పరమాత్మ) యొక్క ప్రతి బింబమే జీవాత్మ గా దృష్టిగోచర మగుచున్నది. అద్దము నందు ముఖము బంధితము కానప్పటికినీ, బంధితమైనట్టు కనబడును. అట్లే నిత్య ముక్తుడయిన పరమాత్మ గుణమయమయిన అంత:కరణము నందు ప్రతిబింబించుట చే బద్ధుడయినట్లు కనిపించును."

ప్రద్యుమ్నుడు "బ్రహ్మజ్ఞ శిరోమణీ! ఏ ఉపాయము చే ధృఢ వైరాగ్యమును పొంది దేహధారులయిన జీవులు మరి ఇక బంధనమునందు పడరో అది నాకు శెలవీయలవలసినది." అగస్త్యుడు "ఎవరు వివేకము నాశ్రయించి జగత్తును మనోమయము (మనో సంకల్ప మాత్రము చే ప్రకటితమయినది) అని తెలిసి కొని, నిరంతరము భగవానుని భజించునో, అతడు పరమ పదమును ప్రాప్తించును. పరమాత్మను జన్మ, మృత్యు, శోక, మోహ, బాల్య, యవ్వన, రోగ, గర్వ, మద, వ్యాధి, భయ, సుఖ, దు:ఖ, క్షుధ, రతి, మానసిక వ్యధ, మరియు భయము ముట్టుకొనలేవు. ఎందుకనగా ఆత్మ చేష్ఠ రహితము, నిరాకారము, సర్వదా అహంకార శూన్యము, శుద్ధ స్వరూపము, గుణములకు ఆశ్రయము. సాక్షాత్ పరమేశ్వరుడు మాత్రమే నిశ్చలుడు, ఆత్మద్రష్ఠ. ఆయననే మునీశ్వరులు ఎల్లప్పుడు పూర్ణుడు, మరియు జ్ఞానమయునిగా తెలియుదురు. ఆ పరబ్రహ్మ పరమాత్మను తెలిసికొని జీవుడు సుఖ పూర్వకముగ జీవించును. ఆ పరమ పురుషుడు (ఆత్మ) జగత్తు నిద్రించునప్పటికీ తాను నిద్రింపడు, ఎల్లరనూ తాను చూచుచున్నప్పటికీ తాను ఎవరికీ కనబడడు.

అగ్ని కాష్ఠము తోనూ, ఆకాశము నియమిత ప్రదేశముతోనూ, గాలి ఎగురుచున్న ధూళితోనూ రంగులు వెదజల్లుచున్ననూ స్ఫటికమణి ఆ రంగులతో ఎట్లు తాదాత్మ్యము చెందదో అట్లే పరబ్రహ్మము గుణములతో కూడినట్లున్నప్పటికీ వానితో ఎన్నడూ తాదాత్మ్యము చెందదు. కేవలము తన లక్షణముల ద్వారా, భావప్రకటనా సామర్ధ్యము మాత్రమే ప్రకటితమగు, లేక అనుభవ యోగ్యమగు అనంత, అతీత శక్తి కేవలము లౌకిక వాక్యముల ద్వారా ఎట్లు తెలిసికొనదగును? అట్టి శబ్దార్థాతీత పరబ్రహ్మకు నమస్కారము. ఈ పరబ్రహ్మమును కొందరు "కర్మ"మనియు, కొందరు "కాల" మనియు, విద్వాంసులు "కర్త" లేక "యోగి" యని పేర్కొందురు. మరికొందరు దానినే సాంఖ్యమని, బ్రహ్మమని, వేరొకరు "పరమాత్మ" లేక "వాసుదేవుడ" ని చెప్పుదురు. ప్రత్యక్ష, అనుమాన ప్రమాణముల ద్వారానూ, నిగమాగమములు, మరియు ఆత్మానుభవము చేతనూ ఆ పరబ్రహ్మ యొక్క స్వస్వరూపమును సూక్ష్మముగ విచారించి, ఈ జగత్తుయందు అనాసక్తభావము కలిగి జీవింపవలసినది. ఎట్లు ప్రవహించుచున్న నీటియందు ప్రతిబింబించుచున్న వృక్షములు కదులుచున్నట్లు కానబడునో, కన్నులు గిర్రున తిరుగునపుడు ఎట్లు ధరిత్రి సహితము తిరుగు చున్నట్లు అగుపడునో, అట్లే గుణముల భ్రమణము చే, తాదాత్మ్యము చెందిన మనోచంచలము చే, అందు స్థిరముగ యున్న ఆత్మ సహితము భ్రమించునట్లు కానపట్టును.

మహారాజా! ఎట్లు చేతిలో త్రిప్పబడుచున్న అలాత చక్రము (అగ్ని చక్రము) నందు కేవలము మండలాకారముగ

యున్న అగ్ని మాత్రమే కానబడుచునట్లు, గుణములు ద్వారా భ్రాంతియుతమయిన అజ్ఞాన మోహిత జీవము తనను తాను "నేను చేయుదును, నేనే కర్తను, ఇదినాది, ఇదినీవు, నేను సుఖముగ లేక దు:ఖముతో యున్నాను" అని భ్రమపడుచుండును. ఆ వికారము లన్నియు అజ్ఞాన జనిత ప్రకృతికి చెందినవేగానీ, ఆత్మకు సంబంధించినవి కావు. ఈ గుణముల చే సర్వజగత్తు దారముతో వస్త్రమంతయు నిండినట్లున్నది. సత్వగుణోపేతులయిన జీవులు ఊర్ధ్వ లోకమునకు, రజోగుణ స్వరూపులు మధ్య వర్తిత్వములయిన పృధివ్యాది లోకములందు తమోగుణ స్వరూపులు అధో లోకములయిన నరకాది లోకములందు ప్రవర్తిల్లెదరు. శ్రీకృష్ణ నందనా! ఎట్లు చీకటి యందు రజ్జువు సర్పము వలెనూ, దూరము నుండి ఎండమావి నీటివలెనూ భ్రాంతి కల్పించునో, అట్లే అజ్ఞాన మోహిత జీవము పరబ్రహ్మ యందు జగత్తు యొక్క భ్రాంతి కల్పించుకొనును. రాజులు రాజ్యములందు ఎట్లు మారుదురో అట్లే సుఖ దు:ఖములు జీవితము నందు వచ్చిపోవు చుండును. మాలయందలి పుష్పములు, దేహము నందలి గుణములు, దివారాత్రములు ఎట్లు స్థిరముగ నుండవో, అట్లే సుఖ దు:ఖములు సహితము అస్థిరములు. తీర్ధ యాత్రీకులు, వ్యాపార సముదాయములు, ఎట్లు స్థిరముగ ఒక చోట యుండరో, అట్లే ఈ దృశ్య ప్రపంచము సహితము, ఒకే విధముగ శాశ్వతముగ యుండదు. ఏ వస్తువునకు శాశ్వతమయిన అస్థిత్వము లేదు.

రెక్కలు వచ్చిన పిదల పక్షులకు ఎట్లుగూడు అవసరము లేదో, నదిని దాటిన పిదప యాత్రికులకు నావ యొక్క అవసరము లేదో, అట్లే జ్ఞానోత్పన్నము అయిన పిదప అభిమానము చే ఉత్పన్నమయిన లోకముతో ప్రయోజనము ఏమున్నది? సమదర్శులయిన మునులు ఈ ప్రకారముగ తమ మార్గమును నిశ్చయము చేసికొని, అసంగభావులై సంసారము నందు చరించెదరు. ఎట్లు అనేక జలపాత్రలందు ఒకే చంద్రుడు ప్రతిబింబించునట్లు, అనేక కాష్ఠ సమూహములందు ఒకే అగ్ని వ్యాప్తి చెందినట్లు, ఒకే పరమాత్మ సర్వత్రా విరాజమానుడగుచున్నాడు. మహాకాశము ఘట, మఠములకు లోపల వెలుపల ఎట్లు నిర్లిప్తముగ నిండియున్నదో, అట్లే పరమాత్మ కూడా దేహధారుల వెలుపల, లోపల నిర్లిప్తముగ విరాజమానుడగుచున్నాడు. ఎవరు శ్రీకృష్ణ భక్తులై, శాంత చిత్తులై, జ్ఞాన నిష్ఠులై, వైరాగ్య భావయుక్తులై యుందురో, వాని గుణములు జలము కమల దళములను స్పర్శించనటుల, స్పృశింపజాలవు. ఇటువంటి భక్తులు ఏ మాత్రము దేహభిమానము నొందరు. వీరు మదిరాపాన యుక్తుడయిన మానవుడు తన వస్త్రములను సహితము తెలియడో, అట్లు ఈ శుద్ధ, భక్తులు దేహాభిమానమును వీడియుందురు. రాజా! ఎట్లు సూర్యోదయపు వెలుతురులో సర్పము స్పష్టముగ కనిపించునో అట్లే జ్ఞానోదయమయిన పిదప భగవత్తత్వము సహితము అట్లే స్పష్టముగ సాక్షాత్కరించును. ఒకే విషయము వేరువేరు ఇంద్రియములు ద్వారా అనేక రూపములకు ఆశ్రయ మగుచున్నదో, అట్లే ఒకే పరబ్రహ్మము అనేక శాస్త్ర మార్గముల ద్వారా ప్రతిపాదించబడి, అనేక విధములుగ తెలియబడుచున్నది. నరేశ్వరా! ఈ పరబ్రహ్మమును కొందరు పరమ పదమని, కొందరు వైష్ణవ ధామమని, కొందరు వ్యాపక వైకుంఠమని, కొందరు "శాంత" మనీ మరికొందరు పరమకైవల్యము, అవినాశి అయిన పరమ ధామమని పేర్కొందురు. కొందరు అక్షర పదమని, కొందరు పరాకాష్ఠయని, కొందరు ప్రకృతికి పరమయిన గోలోక ధామమని చెప్పుదురు. పురాణ వేత్తలు "విశిదనికుంజమ" ని నుడువుదురు. ఈ లోకము నందు నివసించు మానవులు పరబ్రహ్మమును "భక్తి, జ్ఞాన, వైరాగ్యము" లచే మాత్రమే పొందగలరు. వేరొక మార్గము లేదు! లేదు!! లేదు!!! పరమ పురుషుడు, కైవల్యనాధుడు, పరాత్పర పురుషోత్తముడు అయిన శ్రీకృష్ణుని ధామమును మానువులు పైన చెప్పిన మార్గములు ద్వారా, కేవలము ఆయన కృప చే మాత్రమే ప్రాప్తి నొందెదరు. ఆ పరమ పదమును ప్రాప్తించిన మానవులు వెనుకకు తిరిగి రారు. ఈ భగవత్ జ్ఞానమును వినిన శ్రీకృష్ణ నందనుడు ప్రద్యుమ్నుడు రెండు చేతులు జోడించి భక్తి భావముతో నమస్కరించి మహాముని అయిన అగస్త్యుని పూజించెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహులాశ్వ సంవాదము నందలి "ప్రద్యుమ్నుని జ్ఞాన చర్చ" అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

("శాల్వము" మొదలగు దేశములు మరియు ద్వివిదుని పై ప్రద్యుమ్నుని విజయము. లంక నుండి విభీషణుడు ఏతెంచి బహుమతులు సమర్పించుట")

నారదుడు "మహారాజా! తదనంతరము ప్రద్యుమ్నుడు కృతమాలా, తామ్రపర్ణి నదుల యందు స్నానమాచరించి తన సేనా సహితుడై "రాజపురము" నకు చనెను. అచటి రాజు శాల్వుడు. అతడు నా (నారదుడు) ముఖతా యాదవుల ఆగమనము, పరాక్రమము గూర్చి విని, వానర రాజయిన ద్వివిదుని వద్దకు సహాయమున కేగెను. వీరుడయిన ద్వివిదుడు తన మిత్రునికి సహాయము కావించుటకు ఉద్యక్తుడై మనసు నందు క్రోధము పూని, ప్రద్యుమ్నుని సేనలు ఎదుర్కొందుకు ఆయత్తుడయ్యెను. ఆతడు తన పద ఘట్టనచే పృధివిని కంపింపజేయుచూ, తన దంత నఖముల ద్వారా ధ్వజ పట్టములను, పతాకములను చీల్చుచూ, రధములను ఆకాశమున విసురుచూ, గజములను ప్రహరించుచూ, హయములను భయము చే పరుగులెత్తించుచూ, వాన రోచిత కార్యముల చే సర్వులను భయభ్రాంతుల గావించెను. ఈ విధముగ భయంకర కోలాహలము చెలరేగుచుండగా ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు తన ధనువును టంకారము చేయుచూ అచటకు ఏతెంచెను. మదమత్తుడయిన ద్వివిదుడు తన వాలమును ఘుళిపించుచూ హయ సహిత రధ, ధ్వజములను కంపింప జేయ నారంభించెను. అంత ప్రద్యుమ్నుడు తన ధనువు యొక్క మెలితిరిగిన చివరి భాగము చే ద్వివిదుని మెడపట్టి క్రిందకి ఈడ్చెను. అంత కుపితుడయిన ద్వివిదుడు బలముగ ముకుందనందనునిపై ముష్ఠి ఘాతము ప్రహరించెను. అంత ప్రద్యుమ్నుడు ఒక తీవ్ర నాచారమును తన ధనువుకు సంధించి, ఆకర్ణాంతము లాగి ద్వివిదునిపై విడచెను. ఆ బాణ తీవ్రత చే ద్వివిదుడు అర్ధ పహరము ఆకాశము నందు త్రిప్పబడి వందయోజనముల దూరము నున్న లంకా నగరమందు పడెను. ఆతడు రెండు ఘడియలు అక్కడి రాక్షస సైన్యముతో రణము ఒనర్చి వానిని హతమార్చెను. ఇంతలో ఇక్కడ యదుకుల తిలకుడు ప్రద్యుమ్నుడు దుందుభినాదములు మిన్నుముట్టుచుండగా, విజయుడై శాల్వుని వద్దనుండి కప్పములు గైకొని, దక్షిణ మధురానగరము సందర్శించి త్రికూట పర్వతము వైపు చనెను. అక్కడ వానరరాజు రక్కసులతో రణమాచరించి, త్రికూటము నుండి మైనాక శిఖరమునకు, అచటి నుండి సింహళమునకు వెళ్ళి, అచటనుండి నెమ్మది నెమ్మదిగా భారత వర్షమునకు తిరిగి చేరెను. అచటి నుండి హిమాలయమునకు చని, కొన్నాళ్ళ పిదప ప్రాగ్జోషిత పురము చేరెను.

యాదవేశ్వరుడయిన ప్రద్యుమ్నుడు మల్లారదేశాధీశుడయిన రామకృష్ణుని పరాజితుని గావించి సేతుబంధ మహాక్షేత్రమున కేగెను. అచటగల ఇసుకతిన్నెలపై కూర్చొని విశాల శతయోజన విస్తీర్ణ మకరాలయమును వీక్షించుచూ సేదతీర సాగెను. అచటకు సాంబుడు ఆదిగా గల తన సోదరులను, అక్రూరాది ఇతన యాదవులను పిలిచి మహా యోగీశ్వరేశ్వరుడు అయిన ప్రద్యుమ్నుడు ఈ విధముగ పలికెను "భోజవంశ తిలకులు మరియు మంత్రివర్యులు అయిన ఉద్ధవా! పరమ తేజస్వీ అయిన లంకాపతి విభీషణుడు ఈ ద్వీపము నేలుచున్న ప్రభువు. అతడు శీఘ్రమే మనకు బహుమతులీయవలెనన్న మన కర్తవ్యమేమి?" ఉద్ధవుడు "ప్రభూ! మీరు దేవాధిదేవులు. పురుషోత్తములు. మీరు సాక్షాత్ శ్రీకృష్ణ స్వరూపులు. కానీ ఈనాడు సాధారణ మానవుని వలె నన్ను ప్రశ్నించుచున్నారు. గొప్ప యోగీశ్వరులు సహితము మీ మాయను దాటలేరు. బ్రహ్మాది దేవతలు సహితము మీ శాశనమును ఉల్లంఘింప జాలక సదా శిరోధార్యులై యుందురు. నేను మీ దాసానుదాసుడను. మీకు నేను ఎట్లు సూచన చేయగలను?"

ఉద్ధవుని సమాధానమును వినిన ప్రద్యుమ్నుడు ఒక తాళ పత్రమును తీసికొని, తన సందేశము నిట్లు లిఖించెను. "రాక్షస రాజా! నీవు భోజరాజయిన ఉగ్రసేనునికి బహుమతులీయ వలసినది. కానీ స్వబలాభిమానముచే నా మాటను లక్ష్య పెట్టని ఎడల ఈ సముద్రము పై నా బాణములతో వంతెన నేర్పరిచి సేనా సహితుడనై వచ్చి లంకపై దండెత్తెదను." ఈ తాళ పత్రమును ఒక బాణమునకు కట్టి, దానిని తన కోదండమునకు సంధించి, ఆకర్ణాంతము లాగి, ఆ బాణమును లంకవైపు విడచెను. ఆ ధనుష్టంకారము చే ఉరుములు, పిడుగుల ధ్వని వెలివడెను. ఆ ధ్వని చే పాతాళము నుండి ఊర్ధ్వ

లోకముల వరకూ కంపించెను.

ప్రద్యుమ్నుని కోదండము నుండి విడువబడిన బాణము సర్వ దిశలనూ ప్రకాశింపజేయుచూ, విద్యుత్ సమానముగ మెరయుచూ విభీషణుని సభా భవనము నందు పడెను. ఆ ధ్వని చే రాక్షసులు సర్వులు చకితులై లేచి నిల్చుండిరి. వారందరూ శర వేగముతో కవచ ధారులై, ఖడ్గ పాణులయిరి. మహాబలి అయిన విభీషణుడు ఆ బాణమునకున్న పత్రమును తీసి, చదివి విస్మితుడాయెను. ఆ సమయము నందు ఆ సభాస్థలికి మహానుభావుడు, రాక్షసగురువయిన శుక్రా చార్యుడెతెంచెను. విభీషణుడు వెంటనే లేచి, అర్ఘ్యపాద్యాదులచే పూజించి, చేతులు జోడించి ఇట్లనియె "భగవన్! ఈ బాణమెవ్వరిది? భూతలమందు ఈ భోజరాజు ఎవరు? ఆయన బలమెట్టిది? మీరు సర్వజ్ఞులు. అందువలన ఈ విషయము నాకు తెలుప వలసినది." శుక్రాచార్యుడు "రాక్షసరాజా! ఈ విషయమునకై విద్వాంసులైన పురాణవేత్తలు ఒక ఇతిహాసమును వర్ణించిరి. ఈ వృత్తాంతము మిక్కిలి పాపనాశకము. పూర్త కాలమందు బ్రహ్మ మానస పుత్రులయిన సనక సనందనాదులు లోకములన్నియు తిరుగుచు దివ్యలోకమయిన వైకుంఠమున కేగిరి. వారు అత్యంత జ్ఞానులు అయినప్పటికీ ఎల్లప్పుడూ బాలస్వరూపులు, నగ్నముగ యుండువారు.

వారిని శిశువులనుకొని వైకుంఠ ద్వారపాలకులయిన జయ విజయులు వారిని తమ దండములతో అడ్డగించిరి. కానీ ఆ మునులు విష్ణు దర్శన లాలస చే ఏతెంచిరి. వారు అడ్డగింపబడుట చే కోపించి ఆ ఇరువురు ద్వారపాలురను శపించుచూ ఇట్లనిరి, "మీరిరువురు దుష్టులు. కనుక ఆసురులగుదురు గాక! మూడు జన్మలయిన పిదప తిరిగి శు ద్ధులగుదురు? ఇట్లు శాపము పొంది వారిరువురు భువన మండలము నుండి క్రిందపడి భూమండలమందు దైత్య దానవ పూజితులైన దితి పుత్రులుగ జన్మించిరి. వారితో జ్యేష్ఠుడు హిరణ్యకశిపుడు, కనిష్ఠుడు హిరణ్యాక్షుడు. ప్రళయ జలముల నుండి ధరిత్రిని ఉద్ధరించుటకు శ్రీహరి యజ్ఞవరాహావతారము స్వీకరించెను. యజ్ఞవరాహ మూర్తి మహాబలి అయిన హిరణ్యాక్షుని తన ముష్టి ఘాతముతో సంహరించెను. కయాదు కుమారుడయిన ప్రహ్లాదునకు సహాయ మొనర్చుటకు శ్రీహరి నృశింహ రూపమున హిరణ్య కశిపుని ఉదరము చీల్చెను. ఆ సోదరులు ఇరువురు కేశినీ గర్భమందు విశ్రవసు పుత్రులుగ లోక కంటకులయిన రావణ కుంభకర్ణులుగ జన్మనొందిరి. శ్రీరామ చంద్రమూర్తి సాయకములచే వారిరువురు నీ కనుల ముందే ధరాశయనులయిరి. ఇపుడు వారికి మూడవ జన్మ గలిగినది. ఈ జన్మమందు వారు క్షత్రియ కులమందు ఉత్పన్నులై శిశుపాల దంతవక్త్రులుగ ప్రసిద్ధి నొందిరి. వారిరువురు ఈ యుగమందు సహితము అమిత బల సంపన్నులు. వారిరువురి సంహరణార్ధము సాక్షాత్ పరపూర్ణతమ భగవానుడు, అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి, పరాత్పరుడు, గోలోకనాథుడు శ్రీకృష్ణుడు యదుకులమందు అవతీర్ణుడయ్యెను. ఆ యాదవేంద్రుడు అనేక అద్భుత లీలలు గావించుచూ ప్రస్తుతము ద్వారక యందు విరాజమానుడై యున్నాడు.

యుధిష్ఠరుని మహాయజ్ఞమందు, శాల్వునితో కాబోవు యుద్ధమందు ఆయన శిశుపాల, దంతవక్త్రులను సంహరించును. ఇందు సందేహము లేదు. ఆయన సుపుత్రుడు శంబరశూనుడు ప్రద్యుమ్నుడు దిగ్విజయ యాత్రకై వెడలెను. ఆతడు జంబూద్వీపమునందలి సమస్త రాజులను జయించెను. అటుపిదప యదుకుల తిలకుడు, ఉగ్రసేనుడు రాజసూయము గావించును. అతని ధనస్సు నుండి ఏ ఈ బాణము ఇచ్చటకు ఏతెంచినది. దీనిపై ఆయన ముద్ర యున్నది. రాక్షస రాజా! ఈ దివ్య నాచారము మెరుపు కంటె ఎక్కువ వెలుగులు విరజిమ్ముచూ, పిడుగుల వంటి ధ్వని కావించుచూ, సమస్త దిగ్మండలములనూ ఉద్భాసితము కావించుచూ ఇచటకు ఏతెంచినది." రాక్షసేశ్వరుడయిన విభీషణుడు శ్రీకృష్ణుడు సాక్షాత్ శ్రీ రాముడే అని తెలిసికొని, వెంటనే బహుమతి సామాగ్రి తీసికొని ప్రద్యుమ్నుని కడకేగెను. ఆకాశము నుండి కారుమేఘ శరీర ఛాయతో ప్రకాశించు మహాకాయుడు విభీషణుడు క్రిందికి దిగి, శ్రీకృష్ణ నందనుడయిన ప్రద్యుమ్నునికి ప్రదక్షిణ ప్రణామము లాచరించి, చేతులు జోడించి, ఎదుట నిలిచి ఇట్లనియె.

"ప్రభూ! మీరు సాక్షాత్ భగవంతుడయిన వాసుదేవులు. సర్వమును సృజించిన మహనీయులు. మీరు సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులు. మత్స్య, కూర్మ, వరాహ అవతారములు దాల్చిన మహా పురుషులు. భృగుకుల తిలకులయిన పరశురాములు. నృశింహ, వామన, బుద్ధావతారులు. కలియుగము నందు సమస్త పీడా నివారణము చేయు కల్కి అవతారమును ధరించు మంగళ స్వరూపులు. ప్రభూ! మీకు మరల మరల సమస్కారము. అనేక వేల, కోట్ల నమస్కారములు."

ఈ విధముగ పలికి పుణ్య పురుషులందు శ్రేష్ఠుడయిన విభీషణుడు ప్రద్యుమ్నుని షోడశోపచారములతో పూజించెను. ఆ సమయమున ఆయన వాణి గద్గదమాయెను. దానిచే అత్యంత సంతుష్ఠుడయిన ప్రద్యుమ్నుడు ఆయనకు వైరాగ్య పూర్ణ జ్ఞానము, శాంతిదాయిని అయిన భక్తి, ప్రేమలక్షిత పరానురక్తిని ప్రసాదించెను. వాటితో పాటు పూర్వము బ్రహ్మదేవుని చే ప్రసాదించబడిన పరమ దివ్య పద్మరాగ నిర్మిత మస్తక మణి (శిరోమణి) ని, పులస్త్య పౌత్రుడయిన కుబేరుని ద్వారా ఈయబడిన, అత్యంత దీప్తి వంతమయిన రత్నమాలను, చంద్రునిచే ప్రసాదింపబడిన చంద్రకాంత మణిని, మరియు ఉత్తమ పీతాంబరమును బహూకరించెను. పిదన ప్రద్యుమ్నునికి ప్రణామములాచరించి రాక్షసరాజు విభీషణుడు తన పార్షదులతో కలసి లంకాపురికి పయనమయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి శాల్వ, మల్లార, లంకా రాజ్యములపై విజయము)

పదునాల్గవ అధ్యాయము

(సహ్యా పర్వతమందు దత్తా త్రేయుని దర్శనము మరియు ఉపదేశము; మహేంద్ర పర్వతమందు పరశురాముని చే యాదవ సేనా సత్కారము మరియు శ్రీకృష్ణ భక్తి నిరూపణము)

నారదుడు “మహారాజా! తదనంతరము శ్రీకృష్ణ నందనుడు, కామదేవ స్వరూపుడయిన ప్రద్యుమ్నుడు ఋషభపర్వతమును దర్శించి శ్రీరంగ క్షేత్రమున కేగెను. పిదప కాంచీపురమును దర్శించి సరితా శ్రేష్ఠ అయిన ప్రాచీనదిని పరామర్శించి, కావేరిని దాటి, సహ్య గిరి సమీప దేశముల వైపు వెళ్ళెను. ప్రద్యుమ్నుని అనురించుచు విశాల యాదవ సేనా వాహిని కలదు. ఆ సయమునున ఒక విచిత్రము జరిగెను. ప్రద్యుమ్నుడు తన శిబిరము వైపు జట్టు విరబోసుకున్న ఒక దిగంబర అవధూత పరుగు పరుగున వచ్చుచూ కానబడెను. ఆయన అతి ప్రసన్నుడై, బలిష్ఠ శరీరుడై యుండెను. ఆయన శరీరమంతయు ధూళి సరితయై యుండి ఆయన వెనుక చిన్న పిల్లలు అటు నిటు పరుగులాడుచూ చప్పట్లు చరుచుచుండిరి.

ఆయనను చూచి ప్రద్యుమ్నుడు “ఈ ధృఢ శరీరుడు ఎవరు? ఈతడు బాలకుని వలె, ఉన్మత్తుని వలె, పిశాచము వలె పరుగులిడుచు ఇటు వచ్చుచున్నాడు. ఈతడు లోకుల తిరస్కృతులను సహితము ఆనందముతో స్వీకరించుచున్నాడు.” అంత ఉద్ధవుడు సమాధానమిచ్చుచూ “మహారాజా! ఈయన అవధూత పరమహంస, శ్రీహరి యొక్క కళావతారమయిన సాక్షాత్ మహాముని దత్తాత్రేయుడు. ఈయన సదా ఆనంద స్వరూపుడు. ఈయన ప్రసాదము చేతనే పూర్వము కార్తవీర్యార్జునుడు, యదు మహారాజు, మరియు ప్రహ్లాదుడు పరమ సిద్ధుల నొందిరి.” ఈ విధముగ పలికిన పలుకులు విని ప్రద్యుమ్నుడు ఆ అవధూతను విధి విధానముగ పూజించి, వందనములిడి, దివ్యాసీనుని గావించి, తదుపరి ఇట్లు ప్రశ్నించెను, “భగవాన్! నా హృదయము నందు ఒక సందేహము పీడించుచున్నది. దానిని దయచేసి నివారింపవలసినది-1. జగత్తు యొక్క స్వరూపమేమి? 2. బ్రహ్మకు కూడ మార్గదర్శకు డెవరు? 3. ఆయన తత్వమేమి? వీనిని గూర్చి నాకు విపులముగా విశదీకరింప వలసినది.” దత్తాత్రేయుడు “ఎంతవరకూ అంధకారము చే వస్తువులు కనబడవో, అంతవరకూ ఒక వెలుతురు (కాగడా) అవసరము. ఒకమారు మహానందానుభూతి కలిగిన పిదప వీని ఆవశ్యకత ఏమియున్నది? తత్వజ్ఞానము అనుభవమవనంత వరకు జగత్తు కనిపించుచునే యుండును. ఒక్కమారు పరమాత్మ తత్వము ప్రాప్తించిన పిదప జగత్తుకు ప్రయోజనము లేదు. ఎట్లు దర్పణము నందు శరీరము కనపడినప్పటికీ, వాస్తవమునకు శరీరము దాని నుండి భిన్నముగ యుండును. అట్లే ప్రకృతి యందు ప్రతిబింబించు చైతన్యము జీవము. (జీవి)

కానీ జ్ఞానావలోకనము చే అది పరాత్పర పరమాత్మగా తెలియబడును. ఎట్లు సూర్యోదయమయిన పిదప సమస్త వస్తు దర్శనము అగునో, అట్లే జ్ఞానోదయము అయిన పిదప బ్రహ్మ సాక్షాత్కారము జరుగును. అటుపిదప జీవుడు ఎప్పుడూ దృష్టి గోచరము కాడు." ఈ విధముగ ఉపదేశమును వినిన ప్రద్యుమ్నుడు ఆయనకు నమస్కరించి సేనా సహితుడై ద్రవిడ దేశము ప్రవేశించి వేంకటాచలమునకేగెను. ద్రవిడ దేశాధీశుడు, రాజర్షి, ధర్మ తత్వజ్ఞుడు అయిన "సత్య వాక్కు" మిక్కిలి భక్తి శ్రద్ధలతో ప్రద్యుమ్నుని ఆదరించెను. ఆచట నుండి శ్రీశైలమునకేగి, అచటగల అద్భుత అద్వితీయ శివాలయమును గని, స్కంధస్వామిని దర్శించి, అచట నుండి పంపాసరోవనమున కేగెను. తదుపరి ద్వారకానాధుడు ప్రద్యుమ్నుడు గోదావరీ, భీమరధము, మొదలగు పుణ్యతీర్థములు దర్శించి అచట నుండి మహేంద్రగిరి కేగెను. ఆ పర్వతము నందు క్షత్రియాంతకుడు, భృగు వంశ సంజాతుడు పరశురాముడు నివసించుచుండెను.

ప్రద్యుమ్నుడు ఆయనకు ప్రదక్షిణ, ప్రణామములాచరించి ఆయన ఎదుట నిలుచుండెను. పరశురాముడు ఆ ముకుంద నందనుని ఆశీర్వదించి యాదవ సైన్యమంతటినీ తన యోగశక్తితో సత్కరించెను. వివిధ రకములయిన, మిక్కిలి రుచికరములయిన భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములతో ఏబది ఆరు వివిధ పిండి వంటలతో వారిందరికీ విందు నొసంగెను. భృగు నందనుడయిన పరశురాముడు తన యోగ శక్తితో ఈ పదార్థముల యొక్క పర్వత రాశులను సృష్టించెను. సమస్త యదుసేన తనివి తీర తినగా ఇంకనూ రాశుల కొద్దీ పదార్థములు మిగిలెను. పరశురాముని వైభవమును కాంచిన ఎల్లరును ఆశ్చర్యచకితులైరి. యాదవ సహితుడయిన ప్రద్యుమ్నుడు అందరి ఎదుటా పరశు రాముని ఈ విధముగ ప్రశ్నించెను. "భగవాన్! మీరు మా అందరకూ ఉత్తమమైన భోజనమును ఒసగిరి. సర్వ సిద్ధులూ మీకు కరతామలకములు. సమస్త హరి భక్తులు యందు శ్రీహరికి ప్రియభక్తుడెవరు? దయచేసి నాకు విశద పరచవలసినది."

పరశురాముడు "ప్రభూ! మీరు సర్వజ్ఞులు. కానీ సాధారణ మానవుని వలె ప్రశ్నించుచున్నారు. కేవలము లోకులకు జ్ఞాన మొసగుటకు మీరు సత్సంగము చేయుచూ లోకమున సంచరించుచున్నారు. ఎవరు దరిద్రుడయినప్పటికీ వస్తువుల సంగ్రహ పరిగ్రహములు చేయడో, కేవలము శ్రీహరి చరణారవింద పరాగము నందు మాత్రమే లుబ్ధుడో, ఎవని చిత్తము భగవానుని రూప సింధువు నందు మునిగి యుండునో, అతడే శ్రీహరికి ప్రియభక్తుడు. పరమేశ్వరా! ఏ మహా పురుషుడు తన మనో ఇంద్రియములను వశము నందుంచుకొనునో, సమస్త ప్రాణికోటి యందు స్నేహము దయ కలిగి యుండునో, ఎవరు శాంతుడై, దాంతుడై, సహనశీలుడై, అత్యంత కరుణకలిగి సర్వులకు సుహృదుడై, సత్పురుషుడై యుండునో అతడే శ్రీహరికి ప్రియభక్తుడై యుండును. ఆతడు తన పాద ధూళిచే సంపూర్ణ జగత్తును పవిత్రము కావించును. ఎవరు పరమేశ్వరుడయిన శ్రీహరి పాదధూళిని నిరంతరము ఆశ్రయించునో, అతడు ఇంద్ర, బ్రహ్మ, సామ్రాట్, చక్రవర్తి, రసాతలాధిపత్య పదవులను కానీ, యోగసిద్ధిని కానీ, మోక్షమును సహితము కోరడు. అతడే భగవానునికి ప్రియభక్తుడు. ఎవరు నిర్ధనుడో, తన స్వకీయ కర్మఫల విరక్తుడో, శ్రీహరి చరణారవిందాసక్తుడో, ఆ మహనీయుడు మాత్రమే భగవానుని పరమపదము చేరును. అన్యజనులు అట్టి నిరపేక్ష సుఖానుభవమును పొందలేరు. భగవానునికి ఈ సృష్టి యందు తన భక్తుల కంటె ప్రియులు వేరొకరు లేరు. భక్తులు ఆయనను అనేక విధములుగ మనసున బంధించెదరు. అందువలన సకలలోక చూడామణి అయిన శ్రీకృష్ణభగవానుడు ఎల్లప్పుడు భక్తుల వెంట పరుగులిడు చుండును. బ్రహ్మ, రుద్ర, లక్ష్మీ, బలరాములు సహితము భగవానునకు భక్తుల కంటె ప్రియులు కారు. అందువలన భగవానుడు ముకుందుడు అతిశయ భజన కావించు భక్తులకు మోక్షమైతే ఇవ్వవచ్చు గాక! కానీ భక్తి యోగము ను ప్రసాదించడు." ఈ విధముగ పలికిన పరశురామునికి నమస్కరించి ప్రద్యుమ్నుడు తూర్పుకు ప్రయాణించి గంగా సాగర సంగమ స్థలి వైపు పయనించెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి "ద్రవిడదేశముపై విజయము అను పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(ఉడీశ, డామర దేశ రాజు మరియు వంగ దేశాధిపతి అయిన వీరధన్వుడు మరియు అసమ నరేశుడు పుండునిపై యాదవ సేనా విజయము)

నారదుడు "మహారాజా! దిగ్విజియము అను కేవల కారణమును పైకి చూపించుచూ భూభార హరణము కావించుచున్న సాక్షాత్ భగవానుడు ప్రద్యుమ్నుడు తదుపరి అంగ దేశమున కేగెను. అంగ దేశాధిశుడు కేవలము అంత:పురమునకు పరమితుడై, భోగలాలసుడై వన విహారము చేయుచుండెను. యాదవులు అచటకేగి ఆతనిని ముట్టడించిరి. అంత అంగ దేశాధీశుడు లొంగి ప్రద్యుమ్నునకు బహుమతులిచ్చెను. ఉడీశ–డామరు దేశాధీశుడు, మహాబలి అయిన "బృహత్ బాహువు" ప్రద్యుమ్నునకు బహుమతులీయ నిరాకరించెను. ఆతడు తన సేనా బలము చే మత్తుడై, యుండెను. ప్రద్యుమ్నుడు జాంబవతీ నందనుడయిన సాంబుని ఆ నరపతిని ఓడించుటకు పంపెను. సాంబుడు సూర్యతుల్య తేజముగల తేరునందు ధనుర్ధారియై ఒంటరిగ ఆ కార్యము సాధించుటకేగెను. ఆ మహాత్ముడు మేఘము తుషార రాశిచే పర్వతమును కప్పునట్లు తన శరజాలము చే డామరు నగరమును కప్పివైచెను. ఆ బాణరాశి ప్రభావము చే పరాజితుడై బృహత్ బాహువు వెంటనే బహుమతులు తీసికొని ప్రద్యుమ్నుని కడకు ఏతెంచి ఆయనకు నమస్కరించి సమర్పించెను.

తదనంతరము వంగదేశాధీశుడు వీరుడు, స్వకీయ పరాక్రమము చే మదమత్తుడు అయిన వీరధన్వుడు ఒక అక్షౌహిణీ సేనా సహితుడై ప్రద్యుమ్నునికి ఎదురు నిలచెను. యాదవ సేన యందలి శ్రీకృష్ణ పుత్రుడు చంద్రభానుడు, ప్రద్యుమ్నుడు చూచుచుండగనే వీరధన్వుని ఎదుర్కొని కటువచనములతో మిత్రత్వము ఖండింపబడునట్లు వంగసేనను తృటిలో తన బాణ పరంపర చే ముంచెత్తెను. ఆతని తీవ్ర నారాచ బాణవర్షము చే గజముల మస్తకములు తెగి, వానిపైయున్న ముత్యాల హారములు నుండి ముత్యములు వేరుపడి సమరాంగణము అంతయూ వెదజల్లబడి ఆమావాస్యనాటి ఆకాశము నందలి తారల వలె భాసిల్లెను. గజ, హయ, పదాతుల శిరములు ఛేదింపబడి రణరంగమంతయు గుమ్మడి కాయ పగిలిన పిదప నలుదిశలు వెదజల్ల బడిన గుమ్మడి ముక్కలవలె రణభూమి సర్వము పీనుగుల వెంట కావింపబడెను. క్షణ కాలములో వీరధన్వుని సేన అంతయు రుధిర సరిత వలె రూపాంతము చెందెను. ఆ దృశ్యము వీరులకు హర్షము, భీరువులకు భయము గొల్పుచున్నది. మిగిలిన వీరులు ఖండింపబడిన తలలు, మొండెములు, కిరీట, కుండల, కేయూర, కంకణముల సహితులై అస్త్ర శస్త్రములు తీసకొని పరుగులిడ నారంభించిరి. యుద్ధభూమి అంతయు మహమ్మారి వలె కానపట్టు చున్నది.

ఉన్మాదులు, భేతాళులు, భైరవులు, మరియు బ్రహ్మరాక్షసులు మిక్కిలి వేగముగ అచట కేతెంచి శంకర భగవానుని గళమందలి పుర్రెల మాలలను తయారు చేయుటకు ఖండిత శిరములను ఏరుచుండిరి. ఈ విధముగ సేన సర్వము నాశనమగుట గాంచిన వీరధన్వుడు ముందుకు వచ్చి, ఒక భయంకర గదను చేపట్టి చంద్రభానుని పై ప్రహరించెను. ఆ ప్రహారము చే చంద్రభానుడు విచిలితుడు గాక తాను సహితము వేరొక గొప్ప గదను చేపట్టి దానితో వీరధన్వుని ప్రహరించెను. ఆ ఘాతమునకు పీడితుడై నోటి నుండి రక్తము క్రక్కుకొనుచు మూర్ఛితుడై, మొదలునరికిన వృక్షము వలె వీరధన్వుడు నేలపై బడెను. రెండు ఘడియలు అయిన పిదప మూర్ఛనుండి తేరుకొని బుద్ధి కలిగి ప్రద్యుమ్నునకు బహుమతులొసంగెను. ఈ ప్రకారముగ వీరధన్వుడు కప్పముగట్టి తిరిగి తన నగరమునకు వెళ్ళెను. అంత అమిత పరాక్రముడయిన ప్రద్యుమ్నుడు బ్రహ్మపుత్రా నదిని దాటి "అసమ" దేశమున ప్రవేశించెను. అచటి పరిపాలకుడయిన "బింబరాజు" ను ప్రద్యుమ్నుడు చుట్టుముట్టి, ఓడించి, కప్పము తీసికొని అచటి నుండి 'కామరూప" దేశము చేరెను.

కామరూపాధీశుడు పుండుడు గొప్ప ఇంద్రజాల విద్యా నిపుణుడు. ఆతడు తన సేనా వాహిని తోడ్కొని ప్రద్యుమ్నుని ఎదుర్కొనెను. ఆ సమయమున ఒండొరుల సేన ల నడుమ గొప్ప యుద్ధము జరిగెను. రెండు సేనల యందలి యోధులు

బాణ, కుఠార, పరిఘ, శూల, ఖడ్గ, ఋష్ఠి ఆదిగాగల ఆయుధములను చేపట్టి ఒండోరులపై ప్రయోగించిరి. పిదప పుండుడు తన మాయచే పిశాచ, నాగ, రాక్షసులను సృష్టించి వాటిని యాదవ సైన్యము పై వదలెను. పిదప సమరాంగము నలుదిశలా గుహ్యకులు, గంధర్వులు, పచ్చి మాంసమును పీక్కుతిను పిశాచములు పరుగులు తీయుచూ ఆ యుద్ధ భూమి అంతయు నిప్పు కణికలను వర్షము వలె కురిపించుట నారంభించిరి. ఒక్క క్షణములో యాదవ సేన అంతయూ భయంకర కాలకూట విషము చిమ్ముతున్న భయంకర సర్పములు ప్రత్యక్ష మయ్యెను. గాడిదల నెక్కి వికృతమయిన దంతములు, కదులు చున్న సన్నని నాలుకలు గల భయంకర రాక్షసులు యాదవ సేనను కకావికలు కావించుచూ, వారి వెంట పరుగులు తీయుచూ కానపట్టిరి. సింహముఖములు గల యక్షులు, అశ్వముఖులయిన కిన్నెరులు, తమ చేతుల యందు శూలములు ధరించి "కొట్టు" "చంపు" అను నినాదములు కావించుచూ యాదవ సేన పైబడిరి. ఆకాశమంతయు మేఘావృతమై, రణభూమి అంతయు ధూళిచే పరివృతమై అంధకార బంధుర మయ్యెను. భోజ, వృష్ణి, అంధక, మధు, శూరసేన, దశార్హ వంశయోధులు భయభీతులై తమ శస్త్రాస్త్రములను వదలివైచిరి. ఈ భయంకర పరిణామమును కాంచిన మహానుభావుడు, కోవిదుడు అయిన ప్రద్యుమ్నుడు తక్షణ నివారణార్థమై ధనుష్పాణియై బాణముల ద్వారా "సాత్విక మహావిద్య" ను ప్రయోగించెను. సూర్యుడు తన కిరణములచే మేఘ మండలమును ఛిన్నాభిన్నము చేయునట్లు ఆ బాణ సమూహములు పిశాచ, నాగ, యక్ష, రాక్షస, గంధర్వుల ఘనాంధకారమును తుత్తునియలు కావించెను.

సుడిగాలి పద్మమును పెరకి భూమిపై పారవైచినట్లు పుండుడు రథసహితముగ రెండు ఘడియలు ఆకాశమునందు భ్రమించుచూ పిదప నేలపై బడి మూర్ఛనొందెను. రెండు ఘడియలు పిదప పుండుడు మూర్ఛనుండి తేరుకొని, పరాజితుడై ప్రద్యుమ్నుని శరణుజొచ్చి బహుమతులు (కప్పములు) గ ఒక లక్ష గుర్రములు, పది వేల ఏనుగులు, సమర్పించి నమస్కృతులు గావించెను. అచటి నుండి ప్రద్యుమ్నుడు సేనా సహితుడై, శోణనది, విపాశా నదులను దాటి క్రమముగ కేకేయ దేశమున ప్రవేశించెను. కేకేయ దేశాధీశుడు మహాబలి అయిన "ధృతకేతు" మహారాజు సాక్షాత్ వసుదేవుని సోదరి అయిన శృతకీర్తి యొక్క భర్త. ఆతడు శ్రీకృష్ణ ప్రభావము నెరిగిన ప్రతిభాశాలి. ఆతడు ప్రద్యుమ్న సహిత యాదవులందరినీ మిక్కిలి భక్తి భావము తో పూజించెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండాగ్గతమందు నారద బహుళాశ్వ సంవాదము నందలి "కేకేయ దేశముపై విజయము" అను పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(మిథిలేశ్వరుడయిన ధృతి మహారాజు చే బ్రహ్మచారి రూపమునున్న ప్రద్యుమ్నుడు పూజింపబడుట, వారిరువురి శుభ సంవాదము. ప్రద్యుమ్నుడు ఆ మహారాజునకు తన నిజరూపమును దర్శింప జేసి, పూజింపబడి తిరిగి తన శిబిరమునకు ఏతెంచుట)

నారదుడు "మహారాజా! అచటి నుండి విజయనగారాలు మ్రోగింపజేయుచూ యదునందనుడు ప్రద్యుమ్నుడు మీ సుఖ సంపన్న నగరమయిన మిథిలా నగరమున కేతెంచెను. కలశమండితములయిన మిక్కిలి ఎత్తైన స్వర్ణ సౌధములు తో నిండిన మిథిలాపురిని దూరము నుండి కాంచి ప్రద్యుమ్నుడు ఉద్ధవుని తో ఇట్లనియె "మంత్రివర్యా! అనేక దివ్య మందిరములతో విరాజిల్లుచూ భోగవతీ పురమును తలపోయుచున్న ఈ నగరము ఎవ్వరిది? ఉద్ధవుడు "మహారాజా! ఈ నగరము మిథిలాధీశుడయిన జనకునిది. ఈ సమయమున ఈ పురమును విద్వాంసుడు, పరమ భాగవతోత్తముడు అయిన ధృతి మహారాజు పరిపాలించుచుండెను. ఈయన సమస్త ధర్మాత్ముల యందును శ్రేష్ఠుడు. శ్రీకృష్ణుడు ఈయనకు ఇష్టదైవము. అంతేకాక ఈయన సహితము శ్రీహరికి పరమ ప్రీతిపాత్రుడు. ఈయన పుత్రుడు బహుళాశ్వుడు పసితనము

నుండి గొప్ప భగవద్భక్తుడు. ఆయనకు దర్శన మిచ్చుటకు స్వయముగ శ్రీకృష్ణుడు ఇచటకు ఏతెంచుచుండును. రాజకుమారుడయిన బహుళాశ్వుని, బ్రాహ్మణుడయిన శ్రుతదేవుని శ్రీకృష్ణుడు సహితము ద్వారక యందు ఎల్లప్పుడు తన మనసు నందు తలచుచుండును. ప్రభూ! ఈయనను దేవేంద్రుడు సహితము ఓడింప లేడు. ఇక మానవుల మాట చెప్పనేల? ఎందుకనగా ధృతి మహారాజు పరమ భక్తితో శ్రీకృష్ణుని వశము చేసికొనెను."

ఇది వినిన ముకుంద నందనుడు ఉద్ధవుని తన శిష్యునిగా చేసికొని ధృతి యొక్క భక్తిని పరీక్షించుటకు ఆ మహారాజు దర్శనమున కేగెను. మిథిలాపురమున వీరులు కవచ, శస్త్రధారులై, మాలా తిలక ధారులై యుండిరి. వారందరూ జపమాల ద్వారా శ్రీకృష్ణ నామమును జపించుచుండిరి. ప్రతి గృహము యొక్క సింహద్వారమందు శ్రీకృష్ణుని సుందర చిత్రపటము, మరియు శ్రీహరి నామములు లిఖింపబడి యున్నవి. గృహముల గోడలపై, గద, పద్మము, దశావతారములు, శంఖచక్రములు చిత్రింపబడి యున్నవి. ప్రతి గృహ ప్రాంగణము నందు తులసికోటలు యున్నవి. ఈ విధముగ గృహములను అవలోకించుచూ గృహస్థులపై సహితము దృష్టి సారించిరి. ఆ నగర పౌరులందు జపమాలా తిలకధారులు మరియు భగవద్భక్తులు. అచ్చటి బ్రాహ్మణులు గోపీచందన ముద్రాంకితులు, ఊర్ధ్వ పుండ్రధారులు, మరియు శాంత స్వరూపులు.

వారి అంగముల యందు హరి మందిర చిహ్నములు, లలాటమునందు గదాముద్ర, శిరము నందు హరి నామము, రెండు భుజముల యందు శంఖ చక్ర, మత్స్య, కూర్మ చిహ్నములు, హృదయము నందు నందక ఖడ్గము, ముద్రింపబడి యున్నవి. ఎందరో ఇతర పౌరులు మస్తకములందు ధనుర్బాణ చిహ్నములు, హృదయములందు హల, ముసల చిహ్నములు, ధరించి యుండిరి. అచటి వీధుల యందు కొందరు భాగవతులు భాగవతమును వినిపించు చుండిరి. మరికొందరు హరి వంశము, మరియు మహా భారతమును వినిపించు చుండిరి. మరికొందరు సనత్కుమార సంహిత, వాశిష్ఠ సంహిత, యాజ్ఞవల్క్య సంహిత, పరాశర సంహిత, గర్గ సంహిత, పౌలస్త్య సంహిత, మరియు ధర్మ సంహితలను పఠించు చుండిరి. అష్టాదశ పురాణములన్నింటినీ సహితము అచటి జనులు వీధివీధులలో, ప్రతి గృహము నందునూ వినుచుండిరి. కొందరు పుణ్యులు వాల్మీకి విరచితమయిన శ్రీరామాయణ మహాకావ్యమును పఠించుచుండిరి. కొందరు శృతులను, కొందరు నాలుగు వేదములనూ స్వాధ్యాయము చేయుచుండిరి. కొందరు పరమ మంగళకారకమయిన వైష్ణవ యజ్ఞమును అనుష్ఠించుచుండిరి. ఎందరో భక్తులు "రాధాకృష్ణ", "కృష్ణ కృష్ణ" అను మంత్రములను ఉచ్చరించుచు కీర్తించుచుండిరి. మరి కొందరు హరి కీర్తన యందు తత్పరులై నాట్యము చేయుచుండిరి.

అక్కడగల అనేక మందిరములందు వీణా, మృదంగ, తాళాది మనోహర వాద్యములు తోడుగా హరి కీర్తన మృదుమధురముగ కావింపబడుచున్నది. మిథిలానగరమందలి గృహస్తులందరు ప్రేమ లక్షణ నవవిధ భక్తి కలిగి యుండిరి. ఈ విధముగ నగర దర్శనము గావించి ప్రద్యుమ్న భగవానుడు రాజద్వారము చేరి మిథిలాధీశుని దర్శనము కావించెను. ఈ రాజసభ యందు వేదవ్యాసుడు, శుక మునీంద్రుడు, యాజ్ఞవల్క్యుడు, వశిష్ఠుడు, గౌతముడు, నేను (నారదుడు) బృహస్పతి కూర్చొని యుండెను. అంతేకాక మూర్తీభవించిన వేదమూర్తులు హరినిష్ఠా గరిష్ఠులు అయిన మునులు సహితము ఆ సభ యందు ప్రస్తుతించిరి. అచట మైథిలేంద్రుడయిన ధృతి పరమభక్తిభావముతో, అనవిత శిరస్కుడై బలదేవుని పాద పద్మములను పూజించుచుండెను. ఇంతలో శిష్య సమేతముగ ఏతెంచిన బ్రహ్మచారిని గని, వెంటనే లేచి, వారికి అర్ఘ్య పాద్యాదులిచ్చి, విధి విధానముగ పూజించి, వారిని ఆశీనుల గావించి, చేతులు జోడించి, వారి ముందు నిలబడి ఇట్లనియె "భగవాన్! మీ పాద స్పర్శచే నా జన్మ సఫలమయినది. నా రాజభవనము శుద్ధము మరియు పరమోజ్వలమయినది. నేడు దేవతలు, ఋషులు, మాపితరులు సహితము శుద్ధము సంతుష్టులయిరి. భగవాన్! మీ వంటి నిర్భ్రాంతులు, సమదర్శులు అయిన సాధుపురుషులు భూతల మందు కేవలము దీన జనుల కళ్యాణార్థమే చరించుచుందురు." బ్రహ్మచారి "రాజసింహా! మీరు, మీ మిథిలాపురి, విష్ణు భక్తి పరిపూర్ణులయిన మీ ప్రజలు సర్వులూ ధన్యులు. జనకుడు "మహాప్రభూ! ఈ నగరము, ప్రజలు, గృహము, ధనధాన్యములు, ఇవేవియు నావి కావు. స్త్రీ పుత్ర పౌత్రాదులందరూ మరియు నా

సర్వము శ్రీకృష్ణ భగవానునిదే!

పరిపూర్ణ పరమాత్ముడయిన శ్రీహరి అసంఖ్యాక బ్రహ్మాండాధి పతి అయినప్పటికీ గోలోక ధామమందు విరాజమానుడై యున్నాడు. ఆ పరమాత్ముడు ఒక్కడైనప్పటికీ "వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధ" అను చతుర్వ్యూహముతో భూతల మందు ప్రకటితుడయ్యెను. మహామునీ! నేను శరీరము, వాణి, మనస్సు, బుద్ధి మరియు సమస్త ఇంద్రియములు ద్వారా ఏ పుణ్య కర్మలాచరించితినో అవన్నియు శ్రీకృష్ణ సమర్పితములే!" బ్రహ్మచారి "మహాభాగా! విష్ణుభక్త శిరోమణీ! విదేహరాజా! నీ భక్తికి సంతుష్టుడై శ్రీకృష్ణ భగవానుడు నీకు సాయుజ్య మోక్షమును ప్రసాదించును." జనకుడు "బ్రహ్మన్! నేను మీ వంటి శ్రీకృష్ణ మహాత్ముల దాసుడను. నేన నా మనసు నందు ఏ విధమయిన కోరికకు తావియ్య లేదు. అందువల్ల నేను సాయుజ్య ముక్తిని కూడా వాంఛించుట లేదు." బ్రహ్మచారి "మహారాజా! నీవు హేతురహితుడవై అహేతుక భక్తిని చేయుచున్నావు. నీ నిర్గుణ భక్తి భావము చే నిష్కాముక ప్రేమ సంపన్నుడ వైతివి. సాక్షాత్ భగవానుడయిన ప్రద్యుమ్నుడు దిగ్విజయ యాత్రకై వెడలెను. కానీ మీ ఇంటికి రాకుండుటకు కారణమేమి? నాకు సందేహము కలుగుచున్నది." జనకుడు "భగవాన్! ప్రద్యుమ్నుడు సర్వాంతర్యామి మరియ సాక్షాత్ శ్రీహరి స్వరూపము. ఆయన సర్వజ్ఞుడు, సర్వవ్యాప్తి, అయినప్పుడు ఇచట ఆయన లేడా? చెప్పవలసినది." బ్రహ్మచారి "అయితే జ్ఞాన దృష్టిచే నీవు శ్రీకృష్ణ కుమారుడయిన ప్రద్యుమ్నుని ఇచట నిరంతరము ఉపస్థితుని గావించితేని, దివ్యదృష్టి గల ప్రహ్లాద కుమారుని వలె ఇచట ఆతని ప్రత్యక్ష దర్శనము కావింప వలసినది." ఇది వినిన ధృతి మహారాజు గద్గగ కంఠుడై, ముఖమున అశ్రుధారలు కారుచుండగా ఇట్లనియె.

"నా ద్వారా ఈ భూమండల మందు శ్రీహరి భగవానుని ఎడల అహైతుక భక్తి కావింపబడిన ఎడల శ్రీహరి పుత్రుడయిన ప్రద్యుమ్నుడు నా ఎదుట ప్రత్యక్షమగు గాక! నేను శ్రీకృష్ణ భక్తుల దాసుని అయిన ఎడల, నా యందు ఆయనకు కృప కలిగెనేని, నా బుద్ధి ఎల్లప్పుడూ శ్రీహరి యందు నిలచి యుండునేని నా మనోరథము పూర్ణమగుగాక!" ధృతి మహారాజు ఇట్లు పలుకగనే ముకుంద నందనుడు ప్రద్యుమ్నుడు తన బ్రహ్మచారి రూపము వదలి తన స్వస్వరూపమున ఆయనకు సాక్షాత్కరించెను. హరిభక్తి యందు నిష్ఠకలిగిన ఉద్ధవుడు సహితము ఈ సర్వమును గాంచి చలించెను. నీలి మేఘ కాంతి శరీరము కలవాడు, ప్రపుల్ల కమల దళ నేత్రుడు, గజ కంధముల వంటి భుజాటోపుడు, జగత్తు నందలి సర్వజనుల మనసును హరించు రూప సంపన్నుడు అయిన ప్రద్యుమ్నుడు సాక్షాత్కారము నొసంగెను. శరీరముపై పీతాంబరము, నుదిటిపై నాట్యమాడు సుందర కుటిలాలకములు, శిశిర ఋతువున ఉదయించు బాలసూర్యుని సమాన కాంతియుతమైన కిరీటము, దివ్య కుండలములు, కంకణములు మరియు భజకీర్తులు ఆయన దివ్య మంగళ విగ్రహమును ఉద్భాసితము చేయుచున్నది.

జనకుడు "మహానుభావా! నా సౌభాగ్యమేమని చెప్పుదును? నేడు మీ అంతట మీరు నాకు స్వస్వరూప సాక్షాత్కారము గావించిరి. నేడు నా మహిమ కయాదు కుమారుడయిన ప్రహ్లాదుని సమముగ తేజరిల్లినది. నేను నా కుల సహితముగా నేడు కృతార్థుడనైతిని." ప్రద్యుమ్నుడు "నృపశ్రేష్ఠా! నీవు ధన్యుడవు. నీవు నా ప్రభావ మెరిగిన నిజ భక్తుడవు. నేను కేవలము నీ భక్తిని పరీక్షించుటకై ఇచటికి ఏతెంచితిని. నేటి నుండి నీకు నా సారూప్యము ప్రాప్తించును. ఈ లోకము నందు నీ ఆయుష్షు, బలము, కీర్తి, అత్యంత విస్తారమగుగాక!" తదుపరి నీ తండ్రి అయిన ధృతి మహారాజు చే పూజింపబడి భక్త వత్సలుడయిన ప్రద్యుమ్న భగవానుడు సంత సాధుపురుషులు చూచుచుండగనే తన శిబిరమునకు వెడలెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి జనకోపాఖ్యానము అను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(మగధ దేశముపై యాదవుల విజయము, మగధరాజు జరాసంధుని పరాజయము)

నారదుడు "మహారాజా! తదనంతరము మత్స్యకేతన శుశోభితుడు అయిన ప్రద్యుమ్నుడు మగధదేశముపై విజయము సాధించుటకై, తన సేనా సహితుడై గిరివ్రజపురమును ముట్టడించెను. శ్రీహరి పుత్రుడయిన ప్రద్యుమ్నుడు దిగ్విజయ యాత్రకై ఏతెంచెనన్న విషయము వినిన జరాసంధుడు మిక్కిలి కోపోద్రిక్తుడై ఇట్లనియె "యాదవులందరూ తుచ్ఛులు. యుద్ధమునకు వెనుకాడు భీరువులు. అటువంటి వారే భూతలమందు విజయ సముపార్జన కై దిగ్విజయ యాత్ర కావించుచున్నారు. వీరికి బుద్ధి నశించినది. ఈ దురాత్ముడు ప్రద్యుమ్నుని తండ్రి మాధవుడు స్వయముగా నా భయము చే మధురాపురమును వీడి సముద్రమును శరణుజొచ్చెను. ప్రవర్షణ గిరి యందు బలరామ కృష్ణులను నేను భస్మము గావించితిని. కానీ వారు మాయోపాయమును పన్ని తప్పించుకొని పోయి ద్వారక యందు నివసించుచుండిరి. నేను స్వయముగా కుశస్థలీ పురమునకు పోయి ఆ ఇరువురు సోదరులను, ఉగ్రసేనుని సహితముగ తీసికొని వచ్చెదను. చతుస్సాగర వేలా యుతమయిన ఈ ధరిత్రిని యాదవ శూన్యము కావించెదను."

ఈ విధము పలికి మహా బలవంతుడయిన జరాసంధుడు ఇరువది మూడు అక్షౌహిణీ సేనా వాహినిని తీసికొని గిరి వ్రజపురము నుండి బయల్వెడలెను. మగధ రాజునకు విశాలమయిన గజసేన అండగా యున్నది. ఆ మహాగజముల ముఖ మండలమున గోమూత్రము, సింధూరము, కస్తూరి కలిపిన పదార్ధము చే పత్రరచన కావింపబడినది. వాని గండస్థలముల నుండి మదజలము కారుచున్నది. ఆ కుంజరములు ఐరావత వంశమునకు చెందినవి అయివుండుటచే, అవి మిక్కిలి బలశాలులై, చతుర్దంతులై, అడ్డు వచ్చిన వృక్షములను సహితము సునాయాసముగ తమ తొండములతో పెరకి, విరిచి వైచుచున్నవి. వాని ఘీంకారములు భయము గొల్పుచున్నవి. ఇటువంటి దివ్య కుంజర పరివేష్ఠితుడైన మగధరాజు మేఘ పరివృతుడయిన దేవరాజు ఇంద్రుని వలె శోభించుచుండెను. అంతేకాక ఆ సేన యందు దేవతా విమానములు పోలు దివ్య రథములు, అగణిత్వము (లెక్కలేనన్ని) గ యున్నవి. ఆ తేరులందు ధ్వజములు రెపరెపలాడుచు, చామరములు వీచుచున్నవి. ఆ రథములు వాయువేగముతో పోగల, చిత్రవిచిత్ర రంగుల గల మదమత్త హయములుచే పూన్చబడినవి. ఆ హయములు సువర్ణ దండములు ముత్యాల హారములచే కట్టబడి మిక్కిలి శోభాయమానముగ యున్నవి. ఆ హయముల శిఖల యందు రంగురంగుల పక్షి ఈకల గుచ్ఛములు అలంకరింపబడినవి. పదాతులు కవచధారులై, హస్తము లందు డాలు, ఖడ్గము, ధనువులు ధరించి విద్యాధరులను మరపించు చుండిరి. వీరందరి సహాయముతో మాగధుడు సమరమునకు వెడలెను.

దుందుభుల మ్రోతలచే దిక్కులు పిక్కటిల్లు చున్నవి. ధనుష్టంకారముల మ్రోతలు చెవులను గింగిరములు పుట్టించు చున్నవి. భూమి కంపించు చున్నది. సైన్య సమూహముల కదలిక చే ధూళి పైకిలేచి ఆకాశము వరకూ వ్యాపించినది. జరాసంధుని సేనా వాహిని ప్రళయకాల సాగరము వలె ఘూర్ణిల్లుచూ భయంకరముగ తమవైపు వచ్చుట గమనించిన యాదవ సైన్యము విస్మితులైరి. కదిలి వచ్చుచున్న మాగధసేనా సాగరమును కాంచిన భగవానుడు ప్రద్యుమ్నుడు తన శంఖమును పూరించి, సేనలకు అభయము ప్రసాదించి " భయపడవలదు" అని ఆశ్వాశించెను. తదనంతరము మహాబాహువయిన సాంబుడు పది అక్షౌహిణీ సేనను తీసికొని జరాసంధుని ఎదుర్కొనెను. ఆ రణ భూమి యందు రధికులు రధికుల తోనూ, గజములు గజముల తోనూ ఇట్లు ఎవరు వారికి చెందిన యోధులతో వారు సమర మారంభించిరి. మాగధ, యాదవ సమరము దేవ దానవ సంగ్రామము వలె అద్భుతము, రోమాంఛము, మిక్కిలి భయంకరమై యుండెను. కొందరు యోధులు తమ హయములపై చరించుచూ, అటు నిటు యున్న పదాతులను పొడిచి సంహరించుచూ, గజములపైకి ఎగిరి, ఆ కుంజరముల కుంభ స్థలములపై కూర్చుని యున్న మావటులను సహితము పరిమార్చు చుండిరి. మరి కొందరు యోధులు విద్యుత్ సమాన శక్త్యా యుధములు ధరించి బలముగ శత్రువులపై విసురు చుండిరి. ఆ

శక్త్యాయుధములు బలమయిన కవచములను సహితము ఛేదించి, హృదయములను భేదించి, భూమిపై దిగబడుచున్నవి.

అనేక మంది యోధులు సమరాంగణమునందు పడియున్న రథ చక్రములను తీసికొని, వాటిని సైన్య సమూహముల పై విసురుచూ సూర్యుడు మంచును దహించునట్లు శత్రుసేనలను ఛిన్నాభిన్నము కావించు చుండిరి. మరికొందరు యోధులు ముద్గరములు, గొడ్డలి, కరవాలములు, పట్టిశములు, ఘరములు, కటారులు వంటి నిశిత శస్త్రములతో యుద్ధము చేయు చుండిరి. కొందరు వీరులు గద, తోమరము మరియు నిశిత శరముల చే హయముల, కుంజరముల మస్తకములు ఖండించుచుండిరి. వీరులపై వీరులు క్షతగాత్రులై, ధరాశయనులై పడుచుండిరి. కొందరు బాహువులు భుజములు, కంఠములు తెగిపడి, కొంతమంది యోధులు మరణించియు హయ గజములపై మోయబడుచూ, సమరాంగణమంతయు పీనుగుల పెంటయై మిక్కిలి దర్బరముగ, మహా భయంకరముగ యున్నది. గంధర్వ, విద్యాధర స్త్రీలు వీరగతిని ప్రాప్తించిన యోధులను పతులుగ పొందుటకు వేచి యుండిరి. ఈ వీర యోధుల కొరకై దేవతీస్త్రీలు కలహము కావించుచుండిరి. ఎందరో ధర్మ పరాయణులైన క్షత్రియ వీరులు ధర్మయుద్ధమందు ప్రాణ త్యాగము చేసిరి కానీ ఒక్క అడుగు వెనుకకు వేయలేదు. వారందరూ సూర్య మండలమును భేదించు కొని పరమపదమును ప్రాప్తించిరి. ఇంతలో సాంబుని వీర సైనికులు మాగధులకు యుద్ధ హెచ్చరిక కావించిరి. యాదవ సైన్యమును చూడగనే మాగధులు శ్రీకృష్ణ దర్శనము చే అశుభములు కడతేరునట్లు పలాయనము ప్రారంభించిరి.

మగధ సైన్యమందు కొందరికి కవచములు పగిలినవి. కొందరికి ధనస్సులు, ఖడ్గములు విరిగినవి. మిగిలిన సైన్యము భయభీతులై వెన్ను చూపినవి. తన సేన పలాయనమగుట కాంచిన మగధ నరేశుడు జరాసంధుడు వారిని సముదాయించి, ధనువును టంకారము గావించి "భయపడవలదు" అని అభయదానమిచ్చి తిరిగి తనసేన ప్రత్యర్థులతో పోరాటమ సాగించుటకు ప్రేరేపించెను. అదే సమయమున సమరాంగము నందు సాంబుడు సహితము అచటికి ఏతెంచి తన ధనువును ఎక్కుపెట్టి పది సాయకములు ప్రయోగించి జరాసంధుని గాయపరచెను. పిదప మరొక పది బాణములతో కల్లోలిత సాగరము వలె భయంకర శబ్దము కావించు జరాసంధుని వింటి నారిని ఛేదించెను. అంత జరాసంధుడు వేరొక ధనువు పట్టి పది తీవ్ర నాచారములతో సాంబుని వింటిని విరచెను. జరాపుత్రుడయన మాగధేశ్వరుడు నాలుగు బాణముతో సాంబుని గుర్రములను, రెండు బాణములతో ఆతని ధ్వజమును, మూడు బాణములతో ఆతని రథమును ధ్వంసము గావించి ఒక్క బాణముతో సారధిని సంహరించెను.

రథ, సారధులను కోల్పోయిన సాంబుడు క్రోధోద్రిక్తుడై వేరొక రథమారోహించి వంద సాయకములతో జరాసంధుని రథమును తునియలు గావించెను. ఆ సమయమున మిక్కిలి వేగముతో జరాసంధుడు తన రథమును వీడి ఒక గజమును అధిరోహించెను. ఆ సమయమున మగదేంద్రుడు ఐరావతమునధిష్ఠించిన మహేంద్రుని వలె భాసించెను. జరాసంధుడు మనమున మిక్కిలి కోపించి ఒక ఉన్మత్త, మదమత్త, కుంజరమును సాంబునిపై ప్రేరేపించెను. ఆ కుంజరము కాలాంతకుడయిన యముని వలె మిక్కిలి భయంకరమయినది. అద్దాని అంగాంగముల యందు విచిత్ర పత్రరచన గావింపబడెను. ఆ నగరాజము ఘీంకారము కావించుచూ సాంబుని సహితముగ ఆతని రథమును పట్టి, తొండముతో చుట్టి తొమ్మిది యోజనములు దూరము విసరెను. ఆ సమయమున సాంబుని సేనల యందు గొప్ప కోలాహలము చేలరేగెను. ఇంతలో ప్రద్యుమ్నుని సేన నుండి బలరామ సోదరుడయిన గదుడు, అంధకారమును పటాపంచలు చేయటకు సూర్యోదయమయినట్లు వేగముగ వచ్చి జరాసంధుని గజమును బలముగ తన ముష్టి ఘాతము తో ప్రహరించెను. వజ్రాయపు దెబ్బకు నిర్వీర్యమయిన పర్వతము వలె ఆ కుంజరము నీరసించి క్రిందపడి మరణించెను. అంత జరాసంధుడు ఒక బలయిన గద తీసికొని గదునిపై ప్రహరించి మేఘగర్జన కావించెను. కానీ ఆ దెబ్బకు గదుడు విచిలితుడు కాక, తానునూ ఒక లక్ష బారువుల బరువుగల వేరొక గదను తీసికొని జరాసంధునిపై ప్రహరించి సింహగర్జన కావించెను. ఆ ప్రహారమునకు బృహద్రధ కుమారుడు వ్యధితుడై, తిరిగి తేరుకొని, గదుని రెండు భుజములు త్రిప్పి పట్టుకొని ఆకాశము నందు వంద యోజనములు విసరివైచెను. గదుడు క్రింపడి, లేచి జరాసంధుని భుజములు పట్టి త్రిప్పి త్రిప్పి ఆకాశము నందు వేయి యోజనములు దూరము విసరెను.

జరాసంధుడు ఆకాశము నుండి క్రిందకి వింధ్యపర్వతము పై పడెను. తిరిగి సమరాంగణము ప్రవేశించి గదునితో

తిరిగి యుద్ధ మారంభించెను. ఇంతలో సాంబుడు తిరిగి యుద్ధభూమికి ఏతెంచి జరాసంధుని పట్టి బలముగ భూమిపై విసరెను. జరాసంధుడు తిరిగి లేచి ఒక చేతితో సాంబుని, వేరొక చేతితో గదుని ముష్టి ఘాతమములు ప్రహరించి గర్జించెను. ఆ ముష్టి ఘాతములు చే గద, సాంబులిరువురు మూర్ఛితులైరి. ఆ సమయమున యుద్ధభూమి యందు హాహాకారములు చెలరేగినవి. అంత యాదవ రాజైన ప్రద్యుమ్నుడు ఒక ఎత్తైన పతాకము గల అదరమునధిరోహించి, ఒక అక్షౌహిణీ సేనను తీసికొని అచటకు ఏతెంచెను. ఆయన తన సేనకు "భయపడ వలదు" అని అభయమిచ్చెను. ఆతనిని చూడగనే జరాసంధుడు ఒక లక్ష బారువుల గద తీసికొని యాదవ సైన్యమందు కార్చిచ్చు వలె ప్రవేశించెను. ఆతడు వీరులతో సహిత రథములను, గజములను, హయ పదాతులను, మద గజము పద్మములను పెకలించునట్లు చిందర వందర గావించెను. ఇంతలో పారిపోయిన జరాసంధుని సేన తిరిగి రణభూమికి చేరుకొన్నది. వారు యాదవ సేనను నలువైపులా చుట్టుముట్టి తీవ్ర నాచారములతో సంహరింప నారంభించిరి. ప్రద్యుమ్నుడు సహితము నిర్భయుడై మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ ప్రత్యర్థి వీరులను ధరాశయనులు కావించుచుండెను.

ఆ సమయమున ఒక విచిత్రము జరిగెను. సమస్త సత్పురుషులు చూచుచుండగా శేషుని అవతారమయిన బలభద్రుడు అక్కడ ప్రత్యక్షమయ్యెను. ఆయన కుపితుడై మగధ రాజ విశాల సేనా వాహినిని తన హలాగ్రభాగముచే ఈడ్చుచూ, తన ముసలము చే మోదుచూ మారణకాండ ఆరంభించెను. ఆయన చేతిలో దెబ్బతిని హతమార్చబడిన రథ, గజ, హయ పదాతులు దగ్గరదగ్గరగా వంద యోజనములు దూరము వరకూ పీనుగులపెంటలై పడిపోయిరి. ఆ సమయమున మానవ దేవదుందుభులు మ్రోగినవి. దేవతలు బలదేవునిపై పుష్పవృష్టి కురిపించిరి. యాదవ సేన జయజయ ధ్వానములు కావించిరి. తననంతరము ప్రద్యుమ్నుని యోధులు నిశ్చింతులై బలదేవునికి నమస్కరించిరి. ఈ విధముగ భక్తవత్సలుడు బలరాముడు మగధరాజును పరాజితుని కావించి తిరిగి ద్వారకకు వెడలి పోయెను. జరాసంధుని పుత్రుడు సహదేవుడు బుద్ధిమంతుడు మరియు ప్రద్యుమ్నుని ప్రభావము నెరిగినవాడు. ఆతడు బహుమతులుగ ఒక అరబ్బు (వంద కోట్లు) హయములు, రెండు లక్షల రథములను, అరవై వేల ఏనుగులు ప్రద్యుమ్నునికి సమర్పించి నమస్కరించెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి "మాగధ విజయము" అను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(గయ, గోమతీ, సరయు, గంగా తీర ప్రాంతము, కాశీ, ప్రయాగ, వింధ్యదేశములందు యాదవుల జైత్రయాత్ర; శ్రీకృష్ణుని పద్ధెనిమిది మంది మహారథులయిన పుత్రుల హస్త లాఘవము, మరియు వివాహము; మధురా శూరసేన జనపదములు మరియు నంద గోకులము నందు ప్రద్యుమ్నుడు సత్కరింపబడుట)

నారదుడు "మహారాజా! తదనంతరము శ్రీకృష్ణ నందనుడు తన సేనా సహితుడై గయాక్షేత్రమును దర్శించి ఫల్గునది యందు స్నానామచరించెను. అచటి నుండి తిరిగి అన్యదేశములపై విజయము సాధించుటకు యోచన చేయ నారంభించెను. జరాసంధుడు పరాజితుడయ్యెనన్న వార్తవినిన మిగిలిన భూపాలులందరూ భయార్తులై ప్రద్యుమ్నుని శరణు జొచ్చిరి. పిదప క్రమముగ "గోమతి" నది, పవిత్ర సరిత అయిన "సరయు" నదులయందు స్నానము ఆచరించి నెమ్మదిగ గంగాతీరమునున్న కాశీ నగరము చేరెను. కాశీ రాజు వారికి విరోధి, ఆతడు ఆ సమయమున వేటకు ఏగెను. అంత యాదవ సైన్యము ఆతనిని ఆ అడవి యందే బంధించి తీసకొని వచ్చిరి. ప్రద్యుమ్నుని విశాల సేనావాహినిని గూర్చి వినిన కాశీరాజు కప్పములు కట్టుటకు అంగీకరించి బహుమతులిచ్చెను. అచట నుండి ప్రద్యుమ్నుడు కోసల

రాజ్యము ప్రవేశించి అయోధ్యకు దగ్గర గల నంది గ్రామమున తన శిబిరములు దింపెను. కోసలేశ్వరుడు "నగ్నజితుడు" తత్వజ్ఞాన సంపన్నుడు. ఆయన అనేక రథ, గజ, హయములను, అనేక విధములయిన సంపదలను, ధనమును శంబరారి అయిన ప్రద్యుమ్నునకు కానుకగా ఇచ్చెను.

అంతేకాక ఉత్తర దిశకు రాజయిన "దీపతముడు", నేపాళరాజు "గజుడు", విశాల నగర (బదరీ) రాజు బర్హిణుడు వీరందరూ కూడా బహుమతులు అర్పించిరి. అచటి నుండి ప్రద్యుమ్నుడు నైమిశారణ్యము ప్రవేశించెను. అచటి పాలకుడు శ్రీకృష్ణుని ప్రభావము నెరిగిన భగవద్భక్తుడు. ఆతడు సహితము చేతుల జోడించి కప్పములు కట్టెను. తదుపరి ప్రద్యుమ్నుడు ప్రయాగకు చని, పాపనాశిని అయిన త్రివేణీ సంగమందు స్నానము ఆచరించి అనేక మహా దానములు అర్పించెను. ఆతడు అచటి బ్రాహ్మణోత్తములకు ఇరువది వేల ఏనుగులు, పది లక్షల గుర్రములు, నాలుగు లక్షలు రథములు, సువర్ణమాలలు, సుందర పట్టు వస్త్రములు, పది కోట్ల గోవులు, పది బారువుల సువర్ణము, ఒక లక్ష మత్యములు, రెండు లక్షల నవరత్నములు, పది లక్షల వస్త్రములు, రెండు లక్షల కాశ్మీరు శాలువలు బహూకరించెను.

మిధిలేశ్వరా! "కరూష" దేశాధీశుడు పౌండ్రకుడు శ్రీకృష్ణ భగవానునికి శత్రువు. కానీ ఆతడు సహితము జరాసంధ పరాజయము చే శంకితుడై ప్రద్యుమ్నుని పూజించెను. పాంచాలము మరియు కన్యాకుబ్జము నేలు రాజులు ప్రద్యుమ్నుని రాక చే భయభీతులై తమతమ దుర్గ ద్వారములు మూసి లోపల నివసింపసాగిరి. వింధ్యాదీశుడయిన "దీర్ఘ బాహువు" ప్రద్యుమ్నుని తో సంధి కొరకై ఆయన వద్ద కేతెంచి ఇట్లనియె "మీరందరూ దిగ్విజయార్థులై ఇచటకు ఏతెంచిరి. అయిననూ నా మనోరథమును పూర్ణము కావింపవలసినది. ఇందువలన నాకు సంతోషము కలుగును. జలము చే నిండిన కంచుపాత్రను బాణముతో భేదింపవలెను, కానీ ఒక్క చుక్క కూడా భూమిపై పడరాదు. అంతేకాదు బాణము సహితము ఆ పాత్రయందు ఉండిపోవలెను. పాత్ర ముక్కలు కాకూడదు. మీలో ఎవరైననూ ఈ రకమయిన హస్త లాఘవము కలవారున్నచో దానిని పరిచయము కావింపవలసినది. ఎవరు ఈ ప్రతినను పూర్ణము కావించెదరో వారికి నా కన్యలతో వివాహము కావించెదను. నేను మున్ను నారద మునీంద్రుని ముఖతా మీ యాదవుల బలపరాక్రమముల గూర్చి వింటిని." దీర్ఘబాహు మహారాజు పలికిన పలుకులు వినిన సమస్త యాదవ వీరులు విస్మితులైరి. అంత దనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు వింధ్యాదీశుని ఆశ్వాశించి "తథాస్తు" అని పలికెను.

అంత నేలపై రెండు చోట్ల రెండు బలమయిన స్థంభములు నాటబడినవి. ఆ రెండు స్థంభములును ఒక త్రాటితో కట్టి. ఆత్రాటి మధ్య భాగమున ఒక కాంస్య పాత్ర కట్టి దానిని జలముతో నింపిరి. శ్రీ కృష్ణ కుమారుడు తన ధనస్సును సారించి బాణమును సంధించి విడచెను. ఆ బాణము ఆ పాత్రను భేధించి, లోనికి ఏగి పూర్తిగా బయటకు రాకుండా ఆగెను. కంచుపాత్ర యందు నిలచిన నారాచము మేఘము వెనుక నుండి ప్రకాశించుచున్న సూర్యుని మాదిరి ప్రకాశించుచున్నది. ఆ పాత్ర పగుల లేదు, విచిలితము కాలేదు, కంపింపలేదు. ఒక్క చుక్క జలము సహితము క్రింద పడలేదు. అంత భగవానుడయిన ప్రద్యుమ్నుడు మరియొక బాణము సంధించి విడచెను. ఆ నారాచము సహితము పూర్వపు మాదిరిగ ప్రవర్తిల్లెను. తదనంతరము సాంబుడు ధనువు సారించి అయిదు బాణములు విడచెను. ఆ అయిదు సాయకములు కాంస్య పాత్ర యందు ప్రవేశించి స్థితి గతములయినవి. పిదప సాత్యకి ఒక్క బాణమును సంధించి విడచెను. కానీ ఆ సాయకము కాంస్య పాత్రను చూర్ణము కావించెను. అది చూచి యాదవ వీరులందరూ నవ్వుచూ "చాలు చాలు! నీవు భూతలమందు కార్తవీర్యార్జునుని మించిన బాణశాలివి. నీ ముందు అర్జునుడు, భరతుడు, శ్రీరామ చంద్రుడు సహితము దిగదుడుపే! నీవు కేవలము త్రిపురారి అయిన రుద్రుడవు. భీష్మ, ద్రోణ, కర్ణ మరియు పరశు రాములు సహితము నీ ముందు ఆగలేరు." తదనంతరము మరి యొక కాంస్య పాత్ర కట్టబడెను. ఈసారి దనుర్ధారు లందు శ్రేష్ఠుడయిన అనిరుద్ధుడు తన ధనువు సారించి పాత్రను జాగ్రత్తగా చూచి మిక్కిలి నేర్పుతో బాణమును విడచెను. ఆతని సాయకము ఆతని తండ్రివలెనే పాత్రను భేదించి లోనికి పోయి ఆగెను.

తదుపరి "దీప్తిమానుడు" ఆ పాత్రకు ఆయిదు హస్తముల పైన ఒక రాయిని కట్టి, పిదప ధనువు సారించి ఒక్క నారాచమును ప్రయోగించెను. ఆ బాణము ఆ పాత్ర యొక్క క్రింద భాగమును చేదించుకొని, అనిరుద్ధుని బాణమును తాకక పైకి వెళ్ళి రాయికి తగిలి వెనుకకు వచ్చి పాత్ర యందు స్థిరపడెను. కానీ బాణవేగము చే ఒక్క చుక్క నీరు

క్రిందపడలేదు. ఈ చమత్కారము గాంచి వీరులందరూ ఆతనిని ప్రశంశించిరి. తదుపరి “భానుడు” ఆ పాత్రను నిశితముగ పరిశీలించి, అందరూ చూచుచుండగనే తన నేత్రములు బంధించి (మూసికొని) బాణ ప్రయోగము కావించెను. ఆ బాణము పాత్రను ఒక్క క్షణము తల్లక్రిందరలు కావించి తిరిగి యధాస్థానము నొందెను. బాణము సహితము సగభాగము లోనికి గ్రుచ్చుకొని యుండెను. ఈ విధముగ శ్రీకృష్ణుని పద్ధెనిమిది మంది పుత్రులు తమ హస్త లాఘవమును ప్రదర్శించిరి. వారందరి బాణములు పాత్రను భేదించి లోనికి దిగినవి. ఈ అద్భుత ప్రక్రియను, చాతుర్యమును కాంచిన దీర్ఘబాహు మహారాజు మిక్కిలి విస్మితుడై ఆ పద్ధెనిమిది మందికి తన పద్ధెనిమిదిమంది కన్యలను ఇచ్చి పాణిగ్రహణము కావించెను. ఆ వివాహ సమయమందు శంఖ, దుందుభీ, భేరీ నాదములు మిన్నుముట్టెను. గంధర్వులు పాడిరి. అప్సరసలు నాట్యము కావించిరి. దేవతలు వారందరిపై పుష్పవృష్ఠి కురిపించిరి.

దీర్ఘభాహువు వారికి అరవై వేల ఏనుగులు, పది కోట్ల గుర్రములు, పది లక్షల రథములు, ఒక లక్ష దాస దాసీ జనము, ఒక లక్ష శిబికలు కట్నముగ సమర్పించెను. యదుకుల తిలకుడయిన ప్రద్యుమ్నుడు వారి నందరినీ ద్వారకాపురికి పంపించెను. తదుపరి దీర్ఘ బాహు మహారాజు అనుమతి తీసికొని ప్రద్యుమ్నుడు “నిషధ” దేశమున కేగెను. అక్కడి రాజు వీరసేనుడు. ఆయన ప్రద్యుమ్ననకు బహుమతులిచ్చెను. ఈ విధముగనే భద్ర దేశాధిపతి “భృహత్సేనుడు” పరమ శ్రీకృష్ణ భక్తుడు. శ్రీకృష్ణుడే ఆతని ఇష్టదైవము. ఆయన కూడా ప్రద్యుమ్నుని పూజించి బహుమతులిచ్చెను. పిదప ప్రద్యుమ్నుడు సేనా సహితుడై మధుర, శూరసేన, మధు అనబడు జనపదములకు ఏగెను. అక్కడ మిక్కిలి పూజింపబడి పిదప తిరిగి మధురా నగరమున కేతెంచి, పరిక్రమ గావించి నంద వ్రజము చేరెను. అచట గోప గోపీ జనమునకు, యశోదా నందులకు, వృషభాను ఉపనందులకు నమస్కరించి, భూరి బహుమతులతో సత్కరించి వారిచే అత్యున్నతముగ సన్మానింపబడెను. ఆయన కొన్ని దినములు నంద వ్రజమున నే గడిపెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండాగ్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి మధురా, శూరసేన జనపదములపై విజయము)

పంతొమ్మిదవ అధ్యాయము

(యాదవ సేనా విస్తారము. ఉద్దవుడు దూతగా కౌరవుల వద్దకు ఏగుట, ప్రద్యుమ్నుని సందేశము, వినిపించుట. కౌరవుల కటు ఉత్తరము చే కోపించి యాదవులు హస్తినపై ఆక్రమించుట)

నారదుడు “తదనంతరము మహాబాహువయిన ప్రద్యుమ్నుడు తన సేనా సహితుడై కురుదేశమున కేగెను. ఆయన సేనా వాహిని పది యోజనములు వెడల్పు, ఇరువది యోజనములు పొడవు గల ప్రదేశము నందు శిబిరములు వేసికుని యుండిరి. ధనాతురులైన వైశ్యులు దుకాణములును సహితము తెరిచిరి. ఆ దుకాణదారులందు రత్నకారులు, వస్త్రకారులు, చిత్రకారులు, కాంస్య లోహ విగ్రహములు చేయువారు, చిత్రకారులు, కుమ్మరులు, కమ్మరులు, పత్రకారులు, శస్త్ర కారులు, మాలాకారులు, రజకులు మొదలగు ఎందరో వృత్తిపనుల యందు నిమగ్నమయిన మనుజులు దృష్ఠి గోచరులైరి. అచట ఒక చోట ఇంద్రజాల ప్రదర్శన, మరియొక చోట వారాంగనల నృత్య, ప్రదర్శన, మరియొక చోట వాద్య ప్రదర్శన, ఇట్లు అనేక రకములయిన విరామ, విశ్రాంత కేళి యందు ఆసేన అంతయు మునిగి యున్నది. యాదవులకు కౌరవులు మిక్కిలి దగ్గర, ఎందుకనగా ఇరువైపులా బంధుత్వము పెనగి యున్నది. కానీ పురావాసులందు భయము నెలకొని యున్నది. లోకులు తమ ఇండ్లకు తాళము వైచి దూర ప్రదేశములు కేగుటకు ఉద్యక్తులు అగు చుండిరి. హస్తినా పురము అంతగా కోలాహలము నిండియున్నది. కౌరవ చక్రవర్తి శౌర్య, ధైర్య, బల పరాక్రమములు కలిగిన మహారాజు. అంతేకాక విశాల సామ్రాజ్యమున కధిపతి. ఆయన కూడా యాదవుల యొక్క విశాల సేనా సమూహమును కాంచి అత్యంత శంకితుడాయెను.

ప్రద్యుమ్నుడు బుద్ధిమంతులందు శ్రేష్ఠుడయిన ఉద్ధవుని హస్తినకు దూతగా పంపెను. ఆతడు హస్తినకు ఏగి కౌరవ మహీపతి ధృతరాష్ట్రుని సందర్శించెను. ధృతరాష్ట్ర మహారాజు యొక్క రాజ్య ప్రాంగణము కస్తూరి కుంకుమలచే అలంకరింపబడి, మదధారలు స్రవించు మత్తేభములు తో మండితమై యున్నది. హస్తినా పురాధీశుడయిన ధతరాష్ట్ర చక్రవర్తి సేవ యందు భీష్మ, ద్రోణ, కర్ణ, శల్య, భూరిశ్రవ, బాహ్లీక, సోమదత్త, శకుని, సంజయ, దుశ్శాశన, విదుర, లక్ష్మణ, దుర్యోధన, అశ్వద్ధామ, మరియు యజ్ఞకేతు ప్రభృతులు ఉపస్థితులై యుండిరి. వారందరూ కూడ స్వర్ణ సింహాసనాధీశులై, శ్వేత ఛత్రములు పట్టబడి, చామరములు వీచుచుండగా రాజసభ యందు శోభించుచుండిరి. ఆ సమయమున ఉద్ధవుడు ఆ సభయందు ప్రవేశించి మహారాజునకు సమస్కరించి చేతులు జోడించి ఇట్లనియె “రాజేంద్ర శిరోమణీ! ప్రద్యుమ్నుడు నా ద్వారా ఒక సందేశము పంపెను. ఆది వినవలసినది. మహారాజు అయిన ఉగ్రసేనుడు సమస్త భూపతులకు ప్రభువు. ఆయన సమస్త రాజనీకమును ఓడించి రాజసూయము కావించును.

ఆయన ద్వారా పంపబడిన రుక్మిణీ నందనుడు ప్రద్యుమ్నుడు జంబూ ద్వీపము నందలి ప్రచండ వీర నరేశ్వరులందరినీ, జయించుటకు బయలుదేరెను. ఆయన చేదిరాజు శిశుపాలుని, శాల్వుని, జరాసంధుని, దంతవక్త్రుని పరాజితులు గావించి ఇచటకు ఏతెంచెను. యాదవ కౌరవులు ఒకరి కొకరు బంధువులు. ఈ బంధువర్గము నందు ఐకమత్యము ఉండవలెను. అందువలన ఆయనకు బహుమతులు ఈయ నిరాకరించిన ఎడల యుద్ధము అని వార్యమగును,” ఇది ప్రద్యుమ్నుని సందేశము. ఒక వేళ నా వాక్కులందు పరుషములున్నచో అందుకు క్షంతవ్యుడను. దూత ఎల్లప్పుడూ నిర్దోషి. ఇపుడు మీరు ఏ విధమయిన సందేశమిచ్చిననూ దానిని వెనుకకు తీసికుని వెళ్ళి వారికి నిదేవించెదను.”

ఉద్ధవుని సందేశమును వినిన కౌరవులు క్రోధముతో ఉడికిపోయిరి. వారు తమ శౌర్య పరాక్రమములచే ఉన్మత్తులయి యుండిరి. వారి అధరములు అదురు చుండగా ఇట్లనిరి. “ఆహా! కాలగతి దుర్లంఘ్యము. జగత్తు యొక్క రీతి విచిత్రము. దుర్బలమయిన జంబుకము ఈనాడు వనమున సింహముపై ఆక్రమించుటకు యత్నించుచున్నది. ఎవరు మా సంబంధము చేతనే ప్రతిష్ఠనొందిరో, ఎవరు మా వలన రాజ్య సింహాసనమును అధిష్ఠించిరో, ఆ యాదవులు ఈనాడు పాము తనకు పాలను ప్రసాదించిన చేతిని కాటువేసినట్లు మాపై, తమ దాతలపై తలనెగురవేయు చున్నారు. సమస్త వృష్ణి వంశస్థులు పరమ భీరువులు. ఎప్పుడు యుద్ధ ప్రసక్తి వచ్చిననూ వ్యాకుల చిత్తులగుదురు. కానీ ఆ నిర్లజ్జలయిన యాదవులు మాపై శాశనము చేయుటకు సంకల్పించుచున్నారు. ఉగ్రసేనుని యందు ఏ మాత్రము బలము యున్నది. ఆతడు అల్ప వీర్యుడు. ఆతడు జంబూద్వీపము నందలి రాజులందరినీ ఓడించి, వారి నుండి కప్పములు తీసికొని రాజసూయము కావించునా? ఏమి చిత్రము! ఎక్కడ భీష్మ, ద్రోణ, కర్ణ, దుర్యోధనాది వీరాధి వీరులు ఉపస్థితులులైయుండిరో ఆచటకు ఆ దుర్బుద్ధి అయిన ప్రద్యుమ్నుడు నిన్ను మంత్రిని కావించి సందేశము పంపెనా? ఆట్లైన మా సమాధానము ఇదే? మీ కందరకు జీవితేఛ్చ మిగిలియున్న ఎడల మీరందరదూ ద్వారకాపురికి తిరిగి వెళ్ళ వలసినది. లేని ఎడల మిమ్ముల నందరినీ యమ లోకమునకు పంపెదము.”

శ్రీకృష్ణ విరోధులయిన కౌరవులు పలుకులు వినిన ఉద్ధవుడు ప్రద్యుమ్నుని వద్ద కేగి సవినయముగ సర్వమును విన్నవించెను. కౌరవుల ఉద్దతి గల వాక్కులు విని ప్రద్యుమ్నుడు రోషభూయిష్ఠుడయి, తన శాంగ ధనువును చేతిలోనికి తీసికుని ఇట్లనియె.

“కౌరవులు మనకు బంధువులు. కానీ మదము చే ఉన్మత్తులయిరి. అందువలన యోగి తన కఠోర నియమములు ద్వారా దైహిక రోగములను కృశింప జేయునట్టు నేను నా శర పరంపరచే వారికి తీవ్ర నష్టమును ఆపాదింప జేయుదును. యాదవ సైన్య సమూహము నందలి ఏ వీరుడయిననూ కౌరవుల నుండి కప్పము గొను క్రియ యందు పాలుపంచుకొనడేని వాడు మాతా పితృ ఋణము తీర్చుకొను వాడు కాడు. ఆ సమయమున భోజ, వృష్ణి, అంధకాది సమస్త యాదవ వీరులు కుపితులై హస్తినాపుర ఆక్రమణకు నడుము కట్టిరి.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి కౌరవుల దూత ప్రేషణము అను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది యవ అధ్యాయము

(కౌరవ సేన యుద్ధ భూమి కేతెంచుట, ఇరు పక్షముల తుముల యుద్ధము; ప్రద్యుమ్నుని ద్వారా దుర్యోధనుని పరాజయము)

నారదుడు "మహారాజా! ఒక ప్రక్క యాదవుల క్రోధాగ్ని ప్రజ్వరిల్లు చుండగా, సమస్త కౌరవులు సహితము తమ సేనా వాహినిని తీసికొని ప్రద్యుమ్నుని ఎదుర్కొనుటకు బయలుదేరిరి. రత్నజటిత కంబళులు కప్పబడి, బంగారు సంకెలలతో శోభించుచున్న ఆరువది వేల ఏనుగులు విజయ ధ్వజము నెగురవేయుచూ ముందుకు నడచుచున్నవి. వానిపై ప్రళయకాల కల్లోలిత సాగర ఘోష కావించుచూ గగన భేదినిలయిన గంభీర దుందుభిధ్వానములు కావించు దుందుభులు ఆ కుంజరములపై ప్రతిష్ఠింపబడినవి. ధృఢమయిన లోహ కవచములు ధరించిన రెండు లక్షల పదాతులు సమరమునకై బయల్వెడలిరి. వారి వెనుక స్వర్ణమయ కిరీట కుండల, కేయూర, కవచములు ధరించిన రెండు లక్షల గజారోహుల సేన కదిలినది. వారి వెనుక పచ్చని కవచములు ధరించి, వంపులు తిరిగిన తలపాగలు కలిగి అనేక యుద్ధములందు విజయకీర్తినొందిన వీర యోధులు రెండు లక్షల మంది కుంజరముల నధిరోహించి బయలుదేరిరి. కొందరు రక్తవర్ణ వస్త్రధారులై, రక్త వర్ణ భూషణములు దాల్చి ఎర్రని రంగు పులిమిన ఏనుగులపై ప్రస్థానము కావించిరి. కొందరు గజారోహులు నల్లని వస్త్రములు, కొందరు ఆకుపచ్చని వస్త్రములు, మరికొందరు గులాబీరంగు దుకూలములు ధరించిరి.

కోట్లాది రాజన్యకుమారులు దేవ విమానములను తలపించు తేరులందు ఆశీనులై బయల్వెడలిరి. ఆ అరదములన్నియు మిక్కిలి ఎత్తుగా యుండి, సింహధ్వజములు రెపరెపలాడు చుండెను. అంగ, వంగ, సింధు దేశములందు ఉత్పన్నమయిన మనోవేగముతో పోగల వేగము కలిగి స్వర్ణా భూషణ భూషితములైన చంచల హయములు అధిరోహించి అనేకమంది క్షత్రియ యోధులు శస్త్ర ధారులై నగరము వెలుపలికి ఏతెంచిరి. లోహ కవచములు ధరించి విద్యాధరుల వంటి యుద్ధ కుశలత గల అనేకమంది యోధుల సమూహములు నలువైపుల నుండి నగరము వెలుపలికి ఏతెంచుచుండిరి. భేరీ, మృదంగ, పటాహ, దుంధుభి మొదలగు యుద్ధ భజంత్రీలు తీవ్రముగ మ్రోగుచుండెను. వంది, మాగధ, సూత జనులు కౌరవుల యశోగానమును కీర్తించుచుండిరి. దృతరాష్ట్ర పుత్రుడయిన దుర్యోధనుడు సేనా మధ్యమున ఒక విశాల రథము నధిరోహించి మిక్కిలి శోభించు చుండెను.

ఆ తేరు చంద్రమండలము వలె భాసించుచూ, నాలుగు యోజనముల దూరము వరకూ కనిపించు ఎత్తైన ఛత్రము ద్వారా ఆచ్ఛాదింపబడిది. ఆ ఛత్రము ఆతనికి అనేక మంది రాజుల చే బహుమతి గా సమర్పింప బడినది. మణి దండములతో కూర్చబడి సుందర వింజామరలమర్చబడి ఆ తేరు మిక్కిలి సుందరముగ కానపట్టు చున్నది. ఆ అరదము శ్వేతాశ్వముల చే పూన్చబడి, సింహ ధ్వజము చే విరాజిల్లు చున్నది. దుర్యోధనుని సోదరులు సహితము వేరువేరు రథములు నధిరోహించి ఆతనిని అనుగమించు చుండిరి. భీష్మ, ద్రోణ, కృప, బాహ్లిక, కర్ణ, శల్య, సోమదత్త, అశ్వత్థామ, లక్ష్మణకుమార, శకుని, దుశ్శాసన, సంజయ, భూరిశ్రవశ, యజ్ఞకౌతులు పరివేష్ఠితులై వచ్చుచుండగా దుర్యోధనుడు మరుద్గణములు చే పరివేష్ఠితుడయిన ఇంద్రుని వలె భాసించు చుండెను. అదే సమయమున ఇంద్ర ప్రస్థము నుండి పాండవులచే పంపబడిన రెండు "పుతనా" సేన కౌరవ సహాయార్థము ఏతెంచినది.

కౌరవుల పదహారు అక్షౌహిణీ సేన కదులు చుండుట చే ధరిత్రి కంపించుచున్నది. దిశలయందు కోలాహలము చెలరేగి, రథ, గజ, హయ బలము చే రేపబడిన ధూళి ఆకాశమున క్రమ్ముటచే సూర్యుడు ఒక తారవలె కానపట్టెను. భూతల మందు అంధకారము నెలకొనెను. సమస్త దేవతా నీకము శంకితులైరి. గజముల, హయముల పదఘట్టనలచే భూమి కంపించి వృక్షములు విరిగి పడుచున్నవి. కౌరవ యాదవ సేనలు పరస్పరము యుద్ధ సన్నద్ధమయినవి. ప్రళయకాలమందు సప్త సముద్ర తరంగములు ఎట్లు ఢీ కొనుచుండునో అట్లే ఉభయ పక్షముల యోధులు ఒకరిపై ఒకరు తీవ్ర శస్త్రములు ప్రయోగించుకొనుచుండిరి. గరుడ పక్షులు మాంసఖండమునకు పోరాడు రీతిని ఉభయ

పక్షములందలి గజములు గజములతోనూ, హయములు హయముల తోనూ, రధికులు రధికుల తోనూ, పదాతులు పదాతులతోనూ సమరము కావించు చుండిరి. ఖడ్గములు, బల్లెములు, శక్తులు, పట్టిశములు, గదలు, ముద్గరములు, ముసలములు, చక్రములు, తోమరములు, శతఘ్నులు, బృశుండులు, కుఠారములు, మరియు మెరయుచున్న అస్త్ర శస్త్రములను ప్రయోగించుచూ రోషావేశముతో ఇరు పక్షములు జయేచ్ఛతో సంకుల సమరము కావించుచుండిరి.

రణభూమి యందు బాణముల ద్వారా అంధకారము ప్రబలిన కారణమున ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ దుర్యోధనునితో సమర మారంభించెను. అనిరుద్ధుడు భీష్మునితోనూ, దీప్తిమానుడు కృపాచార్యుని తోనూ, భానుడు ద్రోణుని తోనూ, సాంబుడు బాహ్లికుని తోనూ, మధు కర్ణుని తోనూ, బృహద్భానుడు శల్యుని తోనూ, చిత్ర భానుడు సోమదత్తుని తోనూ, వృకుడు అశ్వత్థామ తోనూ, పుష్కరుడు దుర్యోధన పుత్రుడయిన లక్ష్మణుని తోనూ, వేదబాహుడు శకుని తోనూ, శృత దేవుడు దుశ్శాశనుని తోనూ, సునందుడు సంజయుని తోనూ, గదుడు విదురునితోనూ, కృతవర్మ భూరిశ్రువుని తోనూ, అక్రూరుడు యజ్ఞకౌతుని తోనూ సంగ్రామము కావించు చుండిరి.

ఈ విధముగ ఇరుసేనల నడుమ భయంకర సంకుల సమరము జరుగుచుండెను. శ్రీకృష్ణ కుమారుడయిన ప్రద్యుమ్నుడు శ్రీహరి వరాహావతారమందు ప్రళయకాల సాగర జలములను తన ముట్టిచే సంక్షోభింప చేసినటుల దుర్యోధన సేనా వాహినిపై అనేక బాణ సమూహములు గుప్పించి వారిని కకావికలు గావించెను. ఆ బాణ పరంపర చే అనేక గజ హయములు మస్తకములు నేలరాలి అనేక మౌక్తికములు ఆకాశము నుండి రాలుచున్నట్లు శోభించెను. ఆ సమయమున ఆ ముకుంద పుత్రుడు అనేక రధి, సారధులను సుడిగాలి వృక్షములను విరుచునట్లు హతమార్చెను. అపుడు దుర్యోధనుడు ధనస్సు టంకారము కావించుచూ అచటికి ఏతెంచెను.

ఆతడు పది తీవ్ర నాచారములను ప్రద్యుమ్నుని పై ప్రయోగించెను. కానీ ప్రద్యుమ్నుడు అవి తనకు తగులక మునుపు మార్గమధ్యమున వాటిని ఖండించెను. అపుడు దుర్యోధనుడు ప్రద్యుమ్నుని కవచమును కేంద్రముగ చేసికొని బంగారు రెక్కలుగల పది తీవ్రసాయకములు నిశితముగ ప్రయోగించెను. అందు రెండు సాయకములు కవచమును విదీర్ణము కావించినవి. శరీరమును గాయపరచినవి. తదుపరి ఒక వేయ సాయకములు ప్రయోగించి ప్రద్యుమ్నుని వేయి గుర్రములును హతమార్చెను. మరి వంద బాణములతో ప్రద్యుమ్నుని ధనువును నారితో సహితముగ ధనస్సును సహితము విరచెను.

ప్రద్యుమ్నుడు ఆ రధమును వదలి, వేరొక రధమారోహించి శ్రీకృష్ణుడు తనకు ప్రసాదించిన విల్లును చేతిలోనికి తీసకొని, విధి విధానముగ నారిని బిగించి, ఒక తీవ్ర నాచారమును సంధించి, అకర్ణాంతము లాగి దుర్యోధనుని రధము క్రిందకు ప్రయోగించెను. ఆ బాణము దుర్యోధనుని రెండు ఘడియలు ఆకాశములో త్రిప్పెను. పసిబాలుడు కమండలమును విసురునట్లు వేరొక బాణముతో ఆ రధమును తిరిగి ప్రహరించెను. దానితో ఒక్క ఉదుటున ఆ రధము భూమిపై బడి నుగ్గునుగ్గు అయినది. అందలి సమస్త హయములు, సారధి, అశ్వములు హతమైనవి.

మహాబలుడయిన దుర్యోధనుడు మరియొక రధమారోహించి పది సాయకములతో ప్రద్యుమ్నుని గాయపరచెను. ముకుంద నందనుడు ఆ విధముగ గాయపడినప్పటికీ దానిని లక్ష్య పెట్టక, పూలదండతో కొట్టబడిన కుంజరము వలె విచిలితుడు కాజాలక శ్రీకృష్ణ దత్తమయిన దివ్య ధనువు నందు ఒక భల్లబాణము సంధించి విడచెను.

ఆ సాయకము దుర్యోధనుని మహాకాశమునందు విసరవైచెను. ప్రద్యుమ్నుని తో ప్రయోగించిపబడిన మరియొక బాణము చే రధ సహితముగ దుర్యోధనుడు మరింత దూరము కొనిపోబడెను. ఇంతలో ప్రద్యుమ్నుని మూడవ బాణము తగిలి అశ్వ, సారధి సహితముగ దుర్యోధనుని రధము ధృతరాష్ట్ర రాజ ప్రాంగణమున ఆ మహారాజు దగ్గర పడెను. ఆ బాణము ఆ పని పూర్తి కావించి తిరిగి ప్రద్యుమ్నుని అమ్ముల పొది చేరెను. క్రిందపడుట తోడనే ఆ తేరు ముక్కలయినది. దుర్యోధనుడు రక్తము క్రుక్కుకొని మూర్ఛితుడయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి యాదవ కౌరవ యుద్ధ వర్ణన మను ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(కౌవర యాదవుల మధ్య భయంకర యుద్ధము జరుగుట; బలరామ కృష్ణులు ఏతెంచి వారిరువారి మధ్య సయోధ్య సలుపుట)

నారదుడు “మహారాజా! దుర్యోధనుడు తేరు సహితముగ మాయ మగుట గమనించిన కౌరవ సేన యందు హాహాకారములు చెలరేగినవి. అంత గంగా నందనుడయిన దేవవ్రతుడు అక్కడికి ఏతెంచి, యాదవులు చూచుచుండగా మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ కార్చిచ్చు వనమును కాల్చునట్లు యాదవ సైన్యమును భస్మీపటలము కావింప నారంభించెను. భీష్ముడు సమస్త ధనుర్ధారులందు శ్రేష్ఠుడు, గొప్ప భగవద్భక్తుడు, విద్వాంసుడు, మరియు వీర సముదాయము నందు అగ్రగణ్యుడు. ఆయన రణమందు సాక్షాత్ పరశురాముని సహితము నిలువరించిన మహాయోధుడు. గౌరవర్ణుడు, శిరస్త్రాణ శోభితుడు. కేశములు దూది పింజలవలె తెల్లనయినవి. ఆయన కౌరవులకు పితామహుడయిన్పటికీ యుద్ధభూమి ప్రవేశించునంతనే పదునారేండ్ల యువకుని వలె పోరు సల్పును. ఆయన అనిరుద్ధుని విశాల సేనను సంహరించి, గజ హయముల మస్తకములు సొరకాయలు వలె ఖండించెను. ఆ సంగ్రామము నందు చేతుల యందు కరవాలములు ధరించి పోరాడుచున్న ఎంతోమంది యోధులు ఆయన బాణ ఘాతముల చే శరీరము రెండు ముక్కలై పడిపోయిరి. భీష్ముడు అంతేకాక రథముల యందలి రథి, సారథులను, హయములను హతమార్చి రథములను చూర్ణము గావించెను. అనేకమంది రాకుమారులు కాళ్ళు, చేతులు తెగి అధోముఖులై ధరిత్రి నలంకరించిరి. పదాతుల కవచములు ఛిన్నాభిన్నమై దరాశయనులైరి. క్షతగాత్రులై క్రిందపడిన రథ, గజ, హయ, పదాతులు ఖండింపబడిన వృక్షముల గల వనము వలె యుండెను. ఆ రణభూమి మూర్తీభవించిన మృత్యుదేవతను పోలి యుండెను. అస్త్ర శస్త్రములే ఆమె దంతములు, బాణములు కేశములు, రథముల ధ్వజ పతాకములు ఆమె వస్త్రములు, పడిపోయిన మహాగజములు ఆమె స్థనములు, రథముల నెట్టిక శీలలు ఆమె కుండలములు. ఈ విధముగ సమరాంగణమంతయు మిక్కిలి భీభత్సముగ, భయానకముగ యున్నది. అక్కడ మరణించిన మానవ జంతు జాలము చే రుధిర ప్రవాహమ ఒక నది వలె ప్రవహించుచూ అందు రథములు, హయములు, మనుష్యులు సహితము కొట్టుకొని పోవు చుండిరి. ఆ రక్తసరిత వైతరిణి వలె దాటుటకు నశక్యమై యున్నది. భేతాళ గణములు భైరవ నాదములు కావించుచూ పిశాచ నృత్యములు కావించుచున్నవి.తన సేన అంతయు ఈ విధముగ ధరాశయనమగుట కాంచిన మహా ధనుర్ధరుడు, రణశిరోమణి అయిన అనిరుద్ధుడు ఒక గొప్ప అదరమును అధిష్ఠించి భీష్ముని నిలువరించుటకు ముందున కేతెంచెను.

ప్రళయకాల మహాసాగరము నందు పైకిలేచు ఉత్తుంగ తరంగముల ఘాత, ప్రతిఘాత ఘోష వలె గర్జనచేయు భీష్మాచార్యుని మహాధనువు యొక్క నారిని ఒక్క బాణముతో అనిరుద్ధుడు ఖండించెను. అంత భీష్ముడు వేరొక ధనువు చేపట్టి, నారిని బిగించి, దానికి బాణము నెక్కుపెట్టి దానికి బ్రహ్మాస్త్రమును సంధించెను. అ అస్త్రము యొక్క తేజము నలు దిక్కులా ప్రకాశించుచుండెను. అది చూచిన అనిరుద్ధుడు తన సేనా రక్షణకై తాను సహితము బ్రహ్మాస్త్ర సంధనము చేసెను. ఆ బ్రహ్మాస్త్రము రెండునూ ద్వాదశాదిత్యుల వలె ఒండోరులతో యుద్ధ మారంభించెను. దానిచే మూడు లోకములు దహనము చెందునని భావించి మాధవుడు అనిరుద్ధుడు రెండు అస్త్రములను ఉపసంహరించెను. అంతేకాక భీష్మా చార్యుని హస్తము నందున్న విద్యుత్ ఘాతము వంటి ధనువును సూర్యకిరణములు మంచును మాయము చేయునట్లు ముక్కలు గావించెను. అంత భీష్ముడు లక్ష బారువుల బరువు గల గదను తీసికొని దానిని అనిరుద్ధునిపై ప్రయోగించెను. అంత అనిరుద్ధడు గరుడుడు సర్పమును తన కాళ్ళతో బంధించినంత సులభముగ ఆ వచ్చుచున్న గదను సునాయాసముగ తన ఎడమ చేతితో పట్టి, దానిని కుడి చేతికి మార్చి అదే గదతో భీష్ముని ప్రహరించెను. ఆ గదా ఘాతముతో వ్యాకులుడై, విచలితుడై, గంగా నందనుడు తన తేరునందు పడి మూర్ఛనొందెను. ఆ సమయమున ఆయన ఆయుద్ధ మండలమందు ఆకాశము నుండి జారిపడిన మార్తాండ బింబము వలె శోభిల్లెను.

అక్కడే యుండి ఆ సమరమును కాంచుచున్న కృపాచార్యుడు కుపితుడై తన వద్దనున్న శక్త్యాయుధమును అనిరుద్ధునిపై విసరెను. దీనిని కాంచిన దీప్తిమానుడు ఆ శక్తి అనిరుద్ధుని చేరక మునుపే కటు వచనముల చే మిత్రత్వము ఖండింపబడునట్లు తన నిశిత ఖడ్గము చే ఆ శక్తిని ముక్కలు ముక్కలుగా ఖండించెను. తదనంతరము రోషభూయిష్ఠుడయిన మహాబాహువు ద్రోణాచార్యుడు మరల మరల ధనుష్టంకారము కావించుచూ భానునిపై పర్వతాస్త్రము ప్రయోగించెను. ఆ అస్త్ర ప్రభావముచే పెద్ద పెద్ద పర్వతములు ప్రత్యర్ధి సేనావాహినిని చూర్ణము కావించుటకై క్రింద పడుట ప్రారంభించెను. అంత యాదవ సేన అంతయు హాహాకారములు చెలరేగినవి. అంత ముకుంద తనయుడు భానుడు వాయువ్యాస్త్రమును ప్రయోగించెను. ఆ అస్త్ర ప్రభావము చే తీవ్రమయిన సుడిగాలి రేగి పర్వతములన్నియు ఎగురగొట్టబడెను. ఇంతలో కురువృద్ధుడు బాహ్లికుడు కుపితుడై శత్రుసేనలపై ఆగ్నేయాస్త్రమును సంధించెను. ఆ అస్త్ర ప్రభావము చే ప్రత్యర్ధి సేన దావానలమందు దగ్ధమగుట ప్రారంభించెను. అంత జాంబవతీ నందనుడు సాంబుడు పర్జన్యాస్త్రము ప్రయోగించెను. ఆ అస్త్ర ప్రభావము చే జ్ఞాన మంకురించిన తోడనే అహంకారము అంతరించునట్లు ఆగ్నేయాస్త్రము చల్లారెను. ఇంతలో "మధు" తో రణమాచరించు చున్న కర్ణుడు ఇది గమనించి, ఆ సమరము మాని సాంబుని వద్ద కేతెంచి ఇరువది సాయకములు అతనిపై ప్రయోగించి మేఘగర్జన కావించెను.

ఆ బాణ తీవ్రత చే సాంబుడు రెండు ఘడియలు త్రిప్పబడి పిదప రణభూమికి ఒక క్రోసు దూరమున పడెను. ఆయన మనసు నందు కొంచెము వ్యాకులత నొంది, తిరిగి సమరాంగణమున ప్రవేశించి, కర్ణుని చేరి ఆ రాధానందునుని బలముగ ప్రహరించెను. ఆ ఘాతము చే పీడితుడై కర్ణుడు భూమిపై పడి రణరంగమందు మూర్ఛితుడయ్యెను. అంత సాంబుడు వేరొక రథము అరోహించి ఇరువది సాయకములతో శూల్యుని, అయిదు సాయకములతో సోమదత్తుని గాయపరచెను. అంతటితో ఆగక ఆతడు పదిబాణములతో గురుపుత్రుడయిన అశ్వత్థామను, పది బాణములతో లక్ష్మణకుమారుని, అయిదు బాణములతో శకునిని, ఇరువది బాణములతో దుశ్శాశనుని, ఇరువది బాణములతో సంజయుని, వంద బాణములతో భూరిశ్రవశుని, వంద బాణములతో యజ్ఞకేతువును గాయపరచి మేఘగర్జన చేసెను. జాంబవతీ తనయుని హస్త లాఘవమునకు స్వపక్ష, ప్రతిపక్ష వీరులు, సామాన్యులు సహితము ఒకేరకముగ విస్మితులయిరి. ఇంతలో భీష్ముడు మూర్ఛనుండి లేచి, ధనువు సారించి పది తీక్షణ బాణములతో సాంబుని ధనువు ఖండించెను. పిదప, భీష్మ, ద్రోణ, కర్ణులు తిరిగి చెలరేగి తీక్షణ సాయకముల ద్వారా త్రిగుణములు ప్రేరేపించినపుడు నష్టపడు జ్ఞానము వలె యాదవ సైన్యమును ఖండఖండములు కావించుట మొదలిడిరి. ఇంతలో దుర్యోధనుడు వేరొక రథము నెక్కి పది అక్షౌహిణీగల సైన్యము తీసకొని యుద్ధ భూమి నందు ప్రవేశించెను. అందుచే అక్కడ గొప్ప కలకలము చెలరేగెను.

ఆ సమయమున అకస్మాత్తుగా పురాణ పురుషులయిన బలరామ కృష్ణులు అక్కడ ప్రత్యక్షమయ్యిరి. బలదేవుని రథమందు తాళధ్వజము, శ్రీకృష్ణ భగవానుని రథము గరుడ ధ్వజము తోనూ శోభించు చున్నవి. వారిరువురు దివ్యకాంతితో సర్వ దిశలనూ దేదీప్యమానముగ ప్రకాశింపజేయు చుండిరి. దేవతలు జయజయ ధ్వానములు కావించిరి. గంధర్వులు గానమాలపించిరి. దేవ దుందుభులు మ్రోగినవి. దేవాంగనలు పుష్పవృష్టి కురిపించిరి. ఆ సమయమున యదు వంశ వీరులందరూ శ్రీకృష్ణ బలరాముల పాదములపై వ్రాలిరి. దుర్యోధనాదులు సహితము తమ శస్త్రములు వీడి ప్రణామము లాచరించిరి. సర్వులు ప్రసన్న మనస్కులై, ముకుళిత హస్తులై యుండిరి.

పరమేశ్వరుడయిన శ్రీహరి తన మదోన్మత్త పుత్రులయిన ప్రద్యుమ్నాది వీరులకు నీతిని బోధించి, భీష్మాదులకు ప్రణామము లాచరించి దుర్యోధనుని వద్దకేగి ఇట్లు సంభాషించెను. "రాజా! బాలుర వంటి బుద్ధి కలిగిన ఈ యాదవ వీరులచే కావింపబడిన కృత్యములను క్షమింపవలసినది. దయచేసి మనసు నందు పెట్టుకొనరాదు. వీరు మీ పట్ల మాట్లాడిన పరుషమయిన పలుకులు మా పట్ల యని భావింప వలసినది. ఈ భూతలమందు యాదవ కౌరవ వంశములు మధ్య కించిత్ కలహము కూడా యుండరాదు. ఈ ఇరు వంశములు జ్ఞాతులు మరియు సంబంధీకులు. మనమందరము ధోవతి, ఉత్తరీయము వలె పరస్పరము ఒకరికొకరు ప్రియమొనర్చు కొనవలెను." ఈ విధముగ నచ్చ చెప్పబడిన పిదప శ్రీకృష్ణ బలరామాదులు కౌరవులచే పూజింపబడి, సేవింపబడి, ప్రద్యుమ్నాది యాదవులతో కూడి మిక్కిలి శోభిల్లిరి.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి యాదవ కౌరవ మైత్రి అను ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(అర్జున సహితుడై ప్రద్యుమ్నుడు కాలయవన పుత్రుడయిన చండుని జయించి భారత వర్షమునకు పూర్వోత్తర దిశకు పయనించుట)

నారదుడు "మహారాజా! కౌరవులను, యదువంశీయులను శాంతపరిచి యదుకుల తిలకులయిన బలరామకృషులు పాండవులను కలియుటకు ఇంద్రప్రస్థమునకు చనిరి. శ్రీకృష్ణ భగవానుడు వచ్చుచున్నాడన్న వార్తవిని అజాత శత్రువైన ధర్మరాజు యుధిష్ఠిరుడు తన సోదర, మంత్రి, పుర ప్రముఖ పరివేష్ఠితుడై నగరము వెలుపలకేతెంచి ఆయనను ఆహ్వానించెను. శ్రీకృష్ణాగమనమును పురస్కరించుకొని పుర ప్రజలు శంఖనాదములు, దుందుభి నాదములు, వేద మంత్ర ఘోష, వేణునాద పూర్వక పుష్పవృష్టి కురిపించిరి. శ్రీకృష్ణ బలరాములను యుధిష్ఠిరుడు భుజములు పట్టుకొని, లాగి, హృదయమునకు హత్తుకొని పరమానంద భరితుడయ్యెను. ఆ సమయమున ఆయన యోగసమాధి నిష్ఠుడయ్యెను. ప్రద్యుమ్నాది శ్రీకృష్ణ పుత్రులు ధర్మరాజునకు ప్రణామము లర్పించిరి. యుధిష్ఠిరుడు వారిని చేతులు పట్టుకొని ఆశీర్వదించెను. శ్రీహరి భీమార్జునులను హృదయమునకు హత్తు కొనెను. నకుల సహదేవులు ఆయన పాదములకు ప్రణామము లాచరించిరి. బలరామ కృష్ణులు సాక్షాత్ పరిపూర్ణతమ పరమాత్మ స్వరూపములు, మరియు అసంఖ్యాక బ్రహ్మాండాధిపతులు. భగవద్భక్తుడయిన యుదిష్ఠిరుడు ఆ దివ్య సోదరులిరువురినీ ఎంతో ఆదరించెను. అటు పిమ్మట శ్రీకృష్ణుడు కొన్ని నాళ్ళు పాండవుల వద్ద గడిపి ప్రద్యుమ్నాదులను విజయ యాత్రకై పంపి తాను బలరామ సహితుడై ద్వారకకు ఏగెను."

శ్రీకృష్ణ చరితను తెలుపుచున్న నారదుడు బహుళాశ్వుని "మహారాజా! నీకు శ్రీకృష్ణ చరిత్రను వినిపించుచుంటిని. ఇంకనూ ఏమి వినదలుచు కుంటివి?" అంత బహుళాశ్వుడు "మహానుభావా! జీవన్ముక్తుడయిన జ్ఞానికి సహితము భగవత్ చరిత్ర సదా శ్రవణ యోగ్యమనిన జిజ్ఞాసువుల మాట చెప్పనేల? భగవత్ చరిత్ర అర్థార్థులకు అర్థము, ఆర్తులకు పీడా నివారణము కావించును. అంతవరకు ఏల? స్థావర జంగమాది చతుర్విధ జీవ సముదాయమునకు వాని వాని పాపములు సహితము నాశ మొనరించును. దిగ్విజయా సక్తుడయిన ప్రద్యుమ్నుడు సేనా సహితుడై ఎక్కడకు వెళ్ళెను? తిరిగి ద్వారకకు ఎట్లు ఎప్పుడు ఏతెంచెను? ఈ సర్వ వృత్తాంతమును దయచేసి నాకు తెలెపవలసినది."

నారదుడు "మహారాజా! నీవు మిక్కిలి సద్విషయము ను గూర్చి అడిగితివి. నీవు భగవత్ప్రభావము తెలిసిన జ్ఞానివి. నీవు ధన్యుడవు. ఈ భూతలమందు శ్రీకృష్ణ చరిత్ర వినగల పాత్రుడవు నీవు మాత్రమే!!".

శ్రీకృష్ణుడు ద్వారకకు ఏగిన పిదప ప్రద్యుమ్నాదు వీరులను రక్షించుటకు అజాతశత్రువు యుధిష్ఠిరుడు స్నేహవశమున తన సోదరుడు అర్జునుని వారితో పంపెను. ఎందుకనగా ఆయన ప్రద్యుమ్ననకు బాహ్యా శత్రువుల భయము కలదని ఆయన శంకించెను. తదనంతరము తన విశాల సేనా సహితుడై, అర్జునుని కూడి ప్రద్యుమ్నుడు త్రిగర్త దేశముపై దండెత్తెను. త్రిగర్త రాజు సుశర్మ శంకితుడై ప్రద్యుమ్ననకు బహుమతు లొసంగెను. పిదప మత్స్య దేశాధీశుడయిన విరాటుని చే పూజింపడి ప్రద్యుమ్నుడు సరస్వతీ నది యందు స్నానమాడి కురుక్షేత్రమును దర్శించెను. కౌశాంబీ నగర మహాపతి ప్రద్యుమ్ననకు బహుమతులీయలేదు. ఆతడు దుర్యోధన పక్షపాతి. అంత ప్రద్యుమ్నుని అనుజ్ఞనొంది మిగిలిన తొమ్మిది మంది రుక్మిణీ నందనులు......**"చారుదేష్ణ, సుదేష్ణ; చారుదేహ, సుబారు, చారుగుప్త, భద్రచారు, చంద్రచారు, విచారు"**, అనువారలు సింధీహయములు నధిరోహించి సర్వులు చూచుచుండగా కౌశాంబీ నగరమును చుట్టుముట్టిరి. వారి ప్రచండ బాణ ధాటి చే రాజధాని యందలి భవనముల శిఖరములు, ధ్వజములు, కలశములు, తోరణములు అన్నియు చూర్ణమయి వానర ప్రహరణముచే శిధిలమయిన లంకా నగరము వలె సౌభాగ్య హీన మయినది. అంతటితో బుద్ధి కలిగిన కుశాంబుడు బాణ ప్రహారముచే అంధకారమయిన నగరము నుండి బడల్వెడలి, అనేక బహుమతులు గైకొని శంబరారికి నమస్కృతులాచరించి సమర్పించెను.

అదే సమయమున సౌవీర రాజయిన సుదేవుడు, ఆభీర రాజైన విచిత్రుడు, సింధుపతి చిత్రాంగదుడు, కాశ్మీరరాజు మహౌజుడు, జాంగాల దేశాధిపతి సుమేరువు, లాక్షేశ్వరుడయిన ధర్మపతి గంధర్వ రాజు విడౌజుడు – వీరందరూ కూడా

దుర్యోధనునకు వశవర్తులే! కానీ ప్రద్యుమ్నుని భయమున వారందరూ తలలు వంచి బహుమతు లొసంగిరి. తదనంతరము తన అనన్య సేనా సమేతుడయిన మహాబాహువు ప్రద్యుమ్నుడు వీరకల్కి రూపమున అబ్రుదము మరియు మ్లేచ్ఛ దేశములపై విజయము సాధించుటకు సమ కట్టెను. కాలయవనుని పుత్రుడు, మహాబలుడయిన చండుడు ప్రద్యుమ్నుని ఆగమన వార్త విని మిక్కిలి క్రోధ భూయిష్ఠుడాయెను. ఆతడు "నా తండ్రిని హత్య గావించిన వాని పుత్రుని వధించి, తండ్రి మరణమునకు ప్రతీకారము తీర్చుకుందును." ఇట్లు మనమున తలచి పది కోట్ల మ్లేచ్ఛ సేనను తీసికొని, మదధార స్రవించుచు, గర్జన కావించు గొప్ప గజరాజు నెక్కి ఎరుపెక్కిన కన్నులతో ప్రద్యుమ్నుని ఎదుర్కొనుటకు బయలుదేరెను. చండుని ప్రేరణ చే తీక్షణ బాణవర్షము కురిపించు విశాల సేనను కాంచి ప్రద్యుమ్నుడు తన సైనికులతో ఇట్లనియె "ఎవరు శత్రుసేనను సంహరించి, శిరస్త్రాణ సహితముగ చండుని మస్తకమును నా వద్దకు తీసికొని వచ్చు వీరునికి సేన యొక్క సర్వ సేనాధిపత్యము నొసంగెదను." ఈ పలుకులు వినినంతనే గాండీవధారి, కపిధ్వజుడు, అర్జునుడు, ధనుష్టంకారము కావించుచూ ఏకాకియై శత్రుసేనల యందు జొర బడెను. రణ దుర్మదుడయిన గాండీవి ధనువు నుండి వెలువడు చున్న అగ్ని కణముల వంటి సాయకముల చే ఎదురుగ యున్న వీరుల రథములు, గజ హయములు ముక్కలు ముక్కలు గావింపబడెను.

చేతుల యందు శక్తి, ఖడ్గము, ఋష్టి, ధరించిన శత్రు సైనికులు భుజములు వరకు నరుకబడి ధరాశయనులగు చుండిరి. ఎందరో శత్రువుల కవచములు పగుల గొట్టబడి, హృదయములు విదీర్ణములయినవి. శాత్రవ సైనికుల శరీరములు ఛిన్నాభిన్నమయినవి. గజములు యుద్ధభూమి యందు భయము చే పరుగులిడుట నారంభించినవి. వాని మెడయందు గంటలు ఎక్కడెక్కడో పడిపోయినవి. అవి తమ తొండములతో సాటి గజమును సహితము త్రోసుకొని పారిపోయినవి. అర్జునుని బాణముల చే ముక్కలు గావింపబడి రథ, గజ, హయ పదాతులచే నిండిన సమరాంగణము గొడ్డలి చే నరుకబడి, గుమ్మడి చెక్కలు నిండిన పైరువలె కానపట్టు చున్నది. అంత మ్లేచ్ఛులు తమ ఆయుధముల విడచి, అత్యంత వేగముగ సూర్యకిరణముల చే విదీర్ణమయిన పొగమంచు వలె పారిపోవ మొదలిడిరి. అంత ఒక మహాగజమును అధిరోహించిన మ్లేచ్ఛరాజు చండుడు ఒక భయంకర శక్త్యాయుధమును అర్జునునిపై విసరెను. శ్రీకృష్ణ సఖుడు, మహా బలవంతుడయిన పార్థుడు తనపై విద్యుల్లత వలె వచ్చిపడుచున్న శక్తిని సునాయాసముగ గాండీవ నిర్ముక్త బాణపరంపరచే ఖండించెను. అంత రోష తామ్రాక్షుడయిన చండుడు ఒక గొప్ప ధనువును తన చేతిలోనికి తీసికొనెను. అర్జునుడు లీలాపూర్వకముగ ఆ ధనువును ఖండించెను. చండుడు వేరొక ధనువును తీసికొని ప్రళయకాల సాగరఘోష వలె ధ్వనించు గాండీవము యొక్క నారిని ఖండించెను. అంత అర్జునుడు డాల్ఖడ్గములు ధరించి ఎగిరి చండుని గజ కుంభస్థలమును ఇంద్రుడు వజ్రాయుధము చే పర్వతములను ప్రహరించునట్లు ప్రహరించెను. అగ్నిదేవ దత్తమయిన ఆ దివ్య ఖడ్గ ప్రహారము చే ఆ కుంజరము కుంభస్థలము పగిలెను. అంత ఆ మహా గజరాజము పెడబొబ్బలు పెట్టుచు భూమిపై బడి మూర్ఛనొందెను. అంత చండుడు సహితము కరవాల సహితుడై అర్జునుని ఎదుర్కొనెను. అర్జునుడు ఆ ఖడ్గ ప్రహారమును డాలుతో ఎదుర్కొని, ఆ మ్లేచ్ఛుని మెడపై తన నిశిత చంద్రహాసమును ప్రయోగించెను. అంతే!! శిరస్త్రాణ సహిత చండుని మస్తకము, వాని మొండెము నుండి వేరయ్యెను. పిదప అర్జునుడు తన గాండీవమునకు నారి బిగించి, ఒక బాణముపై చండుని శిరము నుంచి, దానిని ప్రద్యుమ్నుని వైపుకు ప్రయోగించెను.

ఆ సమయమున ఆకాశము నందు దేవ దుందుభులు మ్రోగినవి! యాదవ సైన్యము జయజయ ధ్వానములు కావించినది. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. ఆ క్షణముననే ముకుంద నందనుడు పృథానందనుని విజయధ్వజము చే విభూషితుని కావించి తన సేనకు సర్వ సేనాధిపతిగా నియమించెను. ఆ సమయమున యాదవ సేన యందలి ప్రముఖులందరూ హస్తములందు శ్వేత చామరములు పట్టి ఫల్గుణునకు విసరి మర్యాద గావించిరి.

తదుపరి అద్బుదాధీశుడు ప్రద్యుమ్నుని శరణుజొచ్చి, బహుమతులు నర్పించెను. మోరంగ మహీపతి మందహాసుడు మహాత్ముడయిన ప్రద్యుమ్నునకు కప్పము క్రింద పది లక్షల గుర్రములు, సమర్పించి నమస్కరించెను. ఈ ప్రకారము భారత ఖండ మంతటిపై విజయము సాధించి యదుకుల తిలకుడు, ప్రద్యుమ్నుడు హిమాలయపు పూర్వోత్తర దిశ వైపు ప్రస్థానము కావించెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి బహు దిగ్విజయము అను ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ఇరువది మూడవ అధ్యాయము

(యాదవ సేన బాణాసురుని నుండి బహుమతులు గైకొని అలకాపురి చనుట యాదవ యక్షుల సమరము)

నారదుడు "మహారాజా! నదీనదములు, సాగరములు సహితము ప్రతాపశాలి అయిన ప్రద్యుమ్ననకు తలలు వంచి దారినిచ్చినవి. కైలాస పర్వత పార్శ్వ భాగమున బాణాసుర నివాసమయిన శోణపురము కలదు. అచటకు యదువంశ శిరోమణి అయిన ప్రద్యుమ్నుడు ఏగెను. యదువంశీయులు పున: తన నగరమునకు ఏతెంచుట గాంచిన బాణాసురుడు క్రోధోద్రిక్తుడై పన్నెండు అక్షౌహిణీ సేనా వాహినిని తీసికొని ప్రద్యుమ్నుని ఎదుర్కొనుటకు ఉద్యుక్తుడాయెను. ఆ సమయమున త్రిశూలధారి, పురాణ పురుషుడు, నంది వాహనుడు, సాక్షాత్ మహేశ్వరుడు ఉమా సహితుడై అతని ముందు ప్రత్యక్షమై ఇట్లనియె "రాక్షసరాజా! సాక్షాత్ పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుడు అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి. గోలోకాధిపతి. త్రిమూర్తులము ముగ్గురము కూడా ఆయన అంశలమే! ఆయన ఆజ్ఞను ఎల్లప్పుడూ శిరసా వహించుచున్నాము. అటువంటప్పుడు నీ వంటి సామాన్య జనకోటి గూర్చి చెప్పనేల? ఆయన పౌత్రుడయిన అనిరుద్ధుని నీవు బంధించినపుడు ఆ మహాత్ముడు నీ భుజములు ఖండించెను. అంత తొందరగా ఆ విషయమును ఎట్లు మరచితివి? మీ దానవులందరికీ శ్రీహరి పుత్రుడు పూజనీయుడు. అనిరుద్ధుడు సాక్షాత్ నీ అల్లుడు. అందువల్ల నీకు పూజనీయుడగుటకు సందేహము లేదు. అందువలన నీకు యుద్ధము చేయుటకు నేను అనుజ్ఞ నీయుట లేదు. కానీ నా సలహా పాటింపక ఇంకనూ సమరము సంకల్పించితినేని నీ స్వబలము చే యుద్ధము చేయవలసినది. కానీ అయ్యది వ్యర్థ ప్రయాసమగును."

శంకర భగవానుడు ఈ విధముగ నచ్చచెప్పిన మీదట బాణాసురుడు అనిరుద్ధుని ఆహ్వానించి, పూజించి కట్నకానుకలు నొసగెను. పిదప సేనా సహితముగ ప్రద్యుమ్నుని అత్యంత ఆదరముతో పూజించి ఆ మహాత్మునికి పదివేల ఏనుగలును, అయిదు లక్షల రథములను, ఒక కోటి గుర్రములను సమర్పించెను. తదనంతరము రుక్మిణీ నందనుడు యక్ష గుహ్యకులు నివసించు అలకాపురి చేరెను. నంద మరియు అలకనంద నదులు ఆ పురమును కందకముల వలె పరిరక్షించు చున్నవి. ఆ నదులు రత్న ఖచిత సోపానముల చే పరివేష్ఠితములయినవి. యక్ష, కిన్నెర, విద్యాధర, సుందరీమణులు ఆ ప్రదేశము యొక్క సుందరతను మరింత ఇనుమడింపు జేయుచుండిరి. దివ్య నాగకన్యలచే సుశోభితమయిన భోగవతీ పురము వలె దివ్య గుహ్యక కాంతల చే అలకాపురి శోభించుచున్నది. కానీ కుబేరుడు ప్రద్యుమ్ననకు కప్పము లీయలేదు.

ఆయన శ్రీహరి యొక్క ప్రభావము నెరుగనివాడు కాదు. కానీ మాయ మిక్కిలి చిత్రమయినది. "నేను లోకపాలకుడను" అను అహంకారము, అజ్ఞానము ఆయనను ముంచెత్తినవి. అతి బలవంతులయిన యక్షులచే ప్రేరితుడై ఆయన సమరమునకు సమకట్టెను. ఎట్లనగా నిర్ధనునకు ధన సంపత్తి కలిగిన ఎడల అతడు సర్వ జగత్తును తృణప్రాయముగ తలచును. ఒక సామాన్యుడు భూతల మందలి నవ నిధులకు ఆధిపత్యము కలిగెనేని ఇంక వాని అహంకారమును వర్ణించుట ఎవని తరము? ఆ సమయమున కుబేరుని చే పంపబడిన "హేమ మకుటుడు" అను దూత ప్రద్యుమ్నుని కడకు వచ్చి సభ యందు అవనిత శిరస్కుడై ఇట్లనియె "మహారాజా! యదుకుల తిలకా! అలకాపురాధీశ్వరుడయిన ధనాధీశుడు, లోకపాలకుడు, రాజరాజు కుబేరుని సందేశమును వినవలసినది "ఎట్లు స్వర్గ లోకము నందు ఇంద్రుడు దేవరాజు గ కొనియాడబడునో, అట్లే భూతలమందు రాజులకు ఒక్కడయిన ప్రభువు రాజరాజు అని ప్రకటిత మగును. నా ధర్మము (శీల, స్వభావములు) మనుష్యులకు దగ్గర గావున నేను రాజరాజు పదవికి అర్హుడను. మరియు సర్వులు అట్లే నన్ను పూజించెదరు. అందువలన ఉగ్రసేనునికి నాకు బహుమతులీయ అవసరమున్నది కానీ నాకు లేదు. అందువలన నేను బహుమతులిచ్చుటకు నిరాకరించు చున్నాను. ఈయది మీకు ఇష్ఠము లేని యెడల కయ్యమవశ్యము. ఇందు సందియము లేదు."

దూత యొక్క పలుకులు వినిన రుక్మిణీ నందనుడు క్రోధ తామ్రాక్షుడయ్యెను. పెదవులు అదిరినవి. ప్రద్యుమ్నుడు ఇట్ల బదులిచ్చెను. "వృష్ణి వంశ ప్రభువు రాజులందరికీ ఇంద్రతుల్యుడు. మీ స్వామి అయిన కుబేరుడు ఆయన గూర్చి ఎరుగడు. సాక్షాత్ ఇంద్రాది దేవతలు సహితము ఆయన చరణయుగళి నందు శిరము నుంచెదరు. ఇంద్రుడు ఆ భయము చేతనే సుధర్మ సభ మరియు పారిజాత వృక్షమును అర్పించెను. వరుణుడు శ్యామకర్ణ హయముల నర్పించి ప్రణామములు చేసెను. ఈ భీరువయిన రాజరాజు నవ నిధులను బహూకరించెను. కానీ ఆ మహాబలి అయిన మహారాజు గూర్చి రాజరాజునకు తెలియదా? ఆ యాదవ రాజ్యసభ యందు అసంఖ్యాక బ్రహ్మాండాధిపతి అయిన శ్రీకృష్ణుడు విరాజిల్లుచున్నాడు. మహారాజయిన ఉగ్రసేనుడు మహాత్ముడయిన కుబేరుని కొరకు నాచారములు బహుమతిగ ఒసగమని నన్ను పంపించెను. అందువలననే నేను ఇచటకు ఏతెంచితిని; ఈ విధముగ పలికి ప్రచండ పరాక్రముడయిన ప్రద్యుమ్నుడు తన కోదండము నెత్తి, తన బాహుదండముతో నారిని ఆ కర్ణాంతము లాగి టంకారము కావించెను. ఆ నారి స్ఫోటనము చే ఉరుముల వంటి భయంకర నాదము వినిపించినది. ఊర్ధ్వ లోకములనుండి పాతాళము వరకు ఆ భయంకర రవము ప్రతిధ్వనించినది. దిగ్గజములు విచిలితములయినవి. తారలు నేలరాలినవి. భువన మండలమంతయు కంపించినది. ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు తన అమ్ముల పొది నుండి ఒక తీవ్ర నాచారమును తీసి, ధనువుకు సంధించి ఆకర్ణాంతము లాగి విడచెను.

ఆ నారాచము ద్వాదశాదిత్యుల పగిది వెలుగుచూ, సంపూర్ణ దిశామండలమును ప్రకాశిత మొనర్చుచూ పోయి గుహ్యకరాజు ఛత్రమును వింజామరలను ఖండించెను. ఈ విచిత్ర కార్యమును చూచి మాటలు రాక కుబేరుడు క్రోధోద్రిక్తుడై పుష్కక విమాన మధిరోహించి, తన సేనలను తీసికొని నగరము వెలుపలికి ఏతెంచెను. ఆయన వెంట ఆయన మంత్రులు ఘంటానాద, పార్శ్వమాళిలు, మరియు ఆయన పుత్రులు నలకూబర, మణిగ్రీవులు సేనకు అగ్ర భాగమున నిలుచుండిరి. ఆ యక్ష సేన యందు కొందరు అశ్వముఖులు, కొందరు సింహముఖులు, కొందరు శింశుమార ముఖులు, కొందరు మకరముఖులు. కొందర విచిత్రముగ సగము ఆకుపచ్చ, సగము నలుపు రంగులో యుండిరి. కొందరి కేశములు ఊర్ధ్వ ముఖముగ యున్నవి. వారందరూ మదోన్మత్తులు. పెద్ద పెద్ద దంతములు, నెమ్మదిగ లోనికి వెలుపలికి పామునాలిక వలె కదులుచున్న నాలుక, విశాల మయిన దంష్ట్రలు గలిగిన మిక్కిలి వికారముగ యుండిరి.

వారందరూ కవచ, ఖడ్గపాణులై యుండిరి. శక్తి, ఋష్టి, భృశుండి, పరిఘ మొదలగు ఆయుధములు కొందరు ధరించగా మరికొందరు దనుర్బాణములు, పరశువులు ధరించిరి. రథ, గజ, హయముల నధిరోహించి వేలాది యోధులు శంఖ, దుందుభి ధ్వనులు మారు మ్రోగుచుండగా వందిమాగధులు స్తోత్ర పాఠములు వల్లించు చుండగా వెలుపలికి అరుదెంచు చుండిరి. వారందరూ ఆ తరుణమున మేఘము వద్ద విద్యుల్లతల వలె ప్రకాశించుచుండిరి.

ఈ విధముగ మహానగరమయిన అలకాపురి నుండి కోట్లాది మదమత్తులయిన యక్షులు యుద్ధకాంక్షతో బయటకు వచ్చిరి. ఆ సమయమున వారికి విశాలమయిన ప్రమథుల సేన అండగా, సహాయముగ నిలిచినది. వారితో పాటు ఢాకినీ సముదాయములు, యాతుధాన్యులు, నిశాచరులు, భేతాళురు, వినాయకులు, కూష్మాండములు, ఉన్మాదులు, ప్రేత గణములు, మాతృకా గణములు, పిశాచములు, బ్రహ్మ రాక్షసులు, భైరవులు, వీరందరూ కూడా యక్ష సైన్య గణములకు తోడై "చంపు," "నరకు", "విసిరివెయ్యి" అని నినాదములు చేయుచుండిరి. భూమ్యాకాశములను ఆచ్ఛాదించు సంవర్తక మేఘముల వలె ఈ పిశాచ గణములన్నియు ఆవరించిరి. మయూర వాహనము పై కుమార స్వామి, మూషిక వాహనముపై గజాననుడు విఘ్నేశ్వరుడు, ఢమరుకము ధ్వనింప జేయుచూ వీరభద్రుడు వారందరికీ ముందునుండెను.

ప్రమథగణములు వారి గుణ యశస్సులు గానము చేయు చుండెను. ఈ విధముగ యాదవ యక్షుల రోమాంచమయిన తుముల యుద్ధము ఆరంభమైనది. రథికులు రథికులతోనూ, ఇట్లు ఎవరు తమకు సరియో వారితో కదనమొనర్చుచుండిరి. ఆ రెండు సైన్యములు పదముల నుండి పైకి లేచిన ధూళి సూర్య మండలము వరకు ఎగసి సూర్య భగవానుని కప్పివైచినది.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందు యక్షేశ్వరుని పై యాదవ సేన దండయాత్ర)

ఇరువది నాల్గవ అధ్యాయము

(యాదవ యక్షసేనల భయంకర యుద్ధము)

నారదుడు "మహారాజా! అస్త్ర శస్త్రముల వర్షము చే ఆ ప్రదేశమంతయు అంధకార బంధురమయినది. ఇంతలో మహాబలి అయిన మణిగ్రీవుడు తన శరపరంపర చే వైరి వాహిని యందు కటు వచనముల ద్వారా మిత్రత్వమును నాశనము చేయునట్లు భయంకర విధ్వంసము ఆరంభించెను. ఆ సమయమున సత్యభామా శ్రీకృష్ణుల పుత్రుడు, అమేయ బలశాలి అయిన చంద్రభానుడు అయిదు సాయకములు ద్వారా మణిగ్రీవుని కోదండమును ఖండించెను. పది బాణములతో రథమును భేధించి మేఘగర్జన గావించెను. అంత మణి గ్రీవుడు చంద్రభానునిపై శక్త్యాయుధమును ప్రయోగించెను. ఆ శక్తి సంపూర్ణ దిశలను దీప్తింప చేయుచూ గొప్ప ఉల్క వలె చంద్రభానునిపైకి వచ్చెను. కానీ చంద్రభానుడు లీలాపూర్వకముగ తన ఎడమ చేతితో దానిని పట్టుకొని తిరిగి మణిగ్రీవుని పై ప్రయోగించి ఆతనిని గాయపరచెను. ఆ ప్రహారము చే మణిగ్రీవుడు మూర్ఛితుడయ్యెను.

అంత నలకూబరుని చే ప్రేరితులయిన అసుర గణములు బాణములను వల వలె సంధించి వర్షాకాల మేఘములు సూర్యుని ఆచ్ఛాదించునట్లు చంద్రభానుని కప్పి వైచిరి. ఆదిగాంచిన శ్రీకృష్ణ తనయుడు దీప్తిమానుడు ఖడ్గహస్తుడై ప్రత్యర్ధి సేన యందు సూర్య కిరణములు మంచును చెల్లాచెదురు చేయునట్లు జొరబడెను. ఆ ఖడ్గ ప్రహారముల చే యక్షుల శరీరములు, మస్తకములు, కాళ్ళు, చేతులు, భుజములు, చెవులు ఛిన్నా భిన్నమయినవి. కిరీట, కుండల, శిరస్త్రాణసహిత మస్తకములు రక్త సరితయందు కొట్టుకొని పోవుచూ ఆ సమరాంగణ మంతయు మూర్తిభవించిన మృత్యుదేవత వలె యున్నది. మరణము నుండి బయటపడి గాయబడిన యక్షులు బ్రతుకుజీవుడా అనుకొనుచు పలాయనము చిత్తగించిరి. ఆ సమయమున యక్షసైన్యమంతటా హాహాకారములు చెలరేగినవి. అపుడు నలకూబరుడు కవచధారియై ఎత్తైన ధ్వజ పతాకములు గల అదరము నధిరోహించి ముందుకు వచ్చి తన సేనకు "భయపడలవలదు" అని అభయమిచ్చెను. నలకూబరుడు అయిదు బాణముల చే కృతవర్మనూ, పది బాణములచే అర్జునుని, ఇరువది బాణములతో దీప్తిమానునిపై ప్రయోగించెను. అంత మహాబలుడయిన కృతవర్మ సంపూర్ణ దిశలు దద్దరిల్లునట్లు సింహనాదము కావించి అయిదు తీవ్ర సాయకములు ద్వారా నలకూబరుని తీవ్రముగ గాయపరచెను. ఆ సాయకములు నలకూబరుని కవచమును విదీర్ణము గావించి శరీరమును గాయపరిచి భూదారము పుట్టలోనికి ప్రాకునట్లు బయటకు వచ్చి భూమిలోనికి దిగబడినవి.

కృతవర్మ యొక్క బాణ ఘాతముచే విదీర్ణుడై మూర్ఛిల్లిన నలకూబరుని ఆతని సారధి హేమమాలి రణ భూమి నుండి దూరముగ తీసికొని పోయెను. తదుపరి కుబేరుని మంత్రులిరువురు "ఘంటానాద," పార్శ్వమౌళి" లు తమ బాణ పరంపర చే ప్రచండ యుదవ సేనా వాహినిని గాయపరుచుట ప్రారంభించిరి. గ్రద్ద ఈకలు కట్టబడి వాడి మొనగలిగిన బాణములు మనో వేగముతో వారిరువురు కోదండముల నుండి వెలువడి సూర్య కిరణముల వలె సర్వదిశలు ఉద్భాసితము చేయుచున్నవి. అంత మహావీరుడయిన అర్జునుడు వారిరువురిని ఎదుర్కొని బాణములతో ఉత్తరమిచ్చెను. వారి బాణములు సంఘర్షణ చే సంగర భూమి యంతయు విస్ఫులింగములు చెలరేగినవి. కుబేర మంత్రులు ఆకాశమునందు ప్రకాశించు నక్షత్రములు మాదిరి వెలుగొందు చంచల అగ్నికణములు గల అలాత చక్రము వంటి బాణ పరంపర ప్రయోగించగా రణ దుర్మదుడయిన అర్జునుడు గాండీవ కోదండ పాండిత్యము తో వాటిని క్షణము లో భస్మము కావించెను. అంత ఆ మహాదనుర్ధరుడు రణభూమికి రెండు యోజనముల దూరమున ఒక బాణ పంజరమును నిర్మించి, తన సాయకములతో ఆ మంత్రి వర్యుల నిరువురినీ రథ సమేతముగ ఎగురగొట్టి ఆ పంజరమందు బంధించెను. యక్షగణములు వారిరువు మరణించిరని హాహాకారములు చేసిరి. ఆ సమయము నందు కోట్లాది భూత కృత్యలు సమరాంగణము నందు ప్రత్యక్ష మయినవి. కోట్లాది ఢాకినులు గజములను పట్టి విసురుట ప్రారంభించిరి. రథికులను, గుర్రములను, పదాతులను తమ నోటి యందు వైచికొని నమిలి మ్రింగుట నారంభించిరి. ఒక్కొక్క మానవుని వెనుక ఒక్కొక్క భూతము నిలుచుని యుండెను.

ప్రమధ గణములు ఖట్వాంగములతో మనుజులను మోది మోది చంపుచుండిరి. యాతుధాన్యులు నరపుంగవులను నోటి యందు వైచుకొని నములుట నారంభించిరి. భేతాళ గణములు పుర్రెలను పాత్రలుగ చేసికొని రక్తమును పానము చేయుచుండిరి. కూష్మాండ, ఉన్మాదులు ఆ యుద్ధ భూమి యందు పడియుండిన మస్తకములను సేకరించుచుండిరి. దానితో వారు మహాదేవునికి మాలకట్టుటకు ఉపక్రమించు చుండిరి. మాతృగణములు, భైరవ గణములు, బ్రహ్మరాక్షసులు ఆ సమరాంగణమునందు పడిన మస్తకములను బంతులవలె ఉపయోగించుచు, మాటిమాటికీ కాళ్ళతో తన్నుచూ, చేతలతో విసురుచూ, వికృతముగ నవ్వుచూ వికటాట్టహాసములు కావించుచుండిరి. పిశాచినులు తమ పిల్లలకు వేడి వేడి రక్తము త్రావించుచూ ఇట్లు ఆశ్వాశించు చుండిరి. "నాయనా! ఏడవకుము. మేము ఈ మానవుల కన్నులను మీచే పెరకింప జేయుదుము."

ఈ విధముగ భూతగణముల విజృంభణ గాంచిన బలదేవ సోదరుడు గదుడు ఒక బరువయిన గదను చేతిలోనికి తీసికొని భయంకర గర్జన కావించెను. అయ్యది లక్ష బారువుల బరువుగలది. ఆ భయంకర గదతో ఆతడు భూతగణములపై విరుచుకు పడి ఇంద్రుడు వజ్రాయుధముతో పర్వతములను ప్రహరించినట్లు ప్రహరించెను. ఆ గదా ఘాతములచే కోట్లాది భూతగణములు మూర్ఛితులై ధరిత్రిపై బడిరి. తన గదా ఘాతముల చే గదుడు ఢాకినుల దంతభంగము కావించెను; ప్రమధుల బాహువులు విరచెను. యాతుధాన్యుల ముఖములు ఛిన్నా భిన్నము కావించెను. ఆ గదా ఘాతముల చే ఆ ప్రేతములన్నియు ప్రళయకాలమందు వరాహ భగవానుని ముట్టె ఘాతము చే అంగభంగమై నలుదిశలకు పారిపోయిన దానవుల వలె నలువైపులకు పలాయన మొనర్చినవి. భూత గణములు పారిపోయిన పిదప మహావీరుడు వీరభద్రుడు ముందుకేతెంచెను. ఆ మహానుభావుడు బలదేవ సహోదరుని గదతో ప్రహరించెను. గదుడు ఆ గదా ఘాతమును తన గదతో ఆపి తిరిగి తన గదతో ఆయనపై ప్రహరించెను. ఇట్లు వారిరువురి మధ్య భయంకర గదాయుద్ధము సాగెను. వారిరువురి గదలు ఒకరినొకరు తాకుటచే అగ్ని కణములు చెలరేగి చివరకు చూర్ణములయినవి. అంత వారిరువురు ఒండోరులపై కేకలు వేయుచూ మల్లయుద్ధమారంభించిరి. వారిరువురు భుజములు, మోకాళ్ళు, కాళ్ళతో పొడుచుకొనుచూ, పర్వతములను ఒరులపై వైచుచూ సమరము చేయసాగిరి. ఇంతలో వీరభద్రుడు కరవీర పర్వతమును పెకలించి, వికట్టాట్టహాసము కావించుచూ గదునిపై పడవైచెను. గదుడు దానిని ఒడుపుగ పట్టుకొని తిరిగి వీర భద్రుని ప్రహరించెను. అంత గదుని రెండు భుజములు పట్టుకొని వీర భద్రుడు ఆతనిని ఆకాశము నందు లక్ష యోజనముల దూరము విసరెను. గదుడు కొంతసేపటికి క్రిందపడి, కొంచెము వ్యాకలత నొంది, సేదతీరి, పైకి లేచి వీరభద్రుని రెండు భుజములు పట్టుకొని పైకెత్తి, ఆయనను సహితము లక్ష యోజనములు దూరము విసరెను. వీరభద్రుడు కైలాస పర్వత శిఖరము నందు పడి, వ్యాకుల చిత్తుడై రెండు ఘడియలు మూర్ఛ నొందెను.

తదనంతరము శక్త్యాయుధమును పట్టి మహానుభావుడు కార్తికేయుడు యుద్ధ రంగమున ప్రవేశించెను. ఆయన అనిరుద్ధుడు, సాంబుడు వీరు ఇరువురిని కేంద్రములు గ చేసికొని తన శక్త్యాయుధమును ప్రయోగించెను. అయ్యది అనిరుద్ధుని రధమును భేదించి, సాంబుని గాయపరిచి ఆతని రధమును భేదించి, పిదప యుద్ధ భూమి యందు వేలాది కుంజరములు, లక్షలాది పదాతులను హతమార్చి మెరయుచున్న మెరుపు తీగవలె, బుసలు కొట్టుచున్న సర్పము వలె కదులుచూ భూమి యందు దిగబడెను. అంత క్రోధితుడైన సాంబుడు ధనుసు సారించి, నారిని టంకారము కావించి అమ్ములపొది నుండి ఒక తీవ్ర సాయకమును తీసెను. అది తీసినప్పుడు ఒక్క బాణమయినప్పటికీ, సంధించు సరికి వంద, నారి లాగుపుడు వెయ్యి, విడుచునపుడు లక్ష మరియు లక్ష్యము చేరు సరికి కోటి బాణములయినది. ఈ ప్రకారముగ జాంబవతీ నందనుడు శిఖిని, (నెమలి) శిఖి వాహనుడయిన కార్తికేయుని గాయపరిచి ఆయన తో పాటు కోట్లాది వీరులను విదీర్ణులను కావించినది.

కార్తికేయుడు వ్యాకుల చిత్తుడై క్షతగాత్రుడగుట గమనించిన గణేశుడు మూషిక వాహనముపై అచటి కేతెంచెను. ఆయన కుంభస్థలమందు గోమూత్రము, కస్తూరి, సింధూరము కలిపిన ఒకానొక లేహ్యము చే పత్రరచన గావింపబడి యుండెను. ఆయన సుందర వక్రతుండము కుంకుమాలంకృతమై, కపోలములు సింధూరముల తో కప్పబడి, విశాల కర్ణములు కర్పూరము తో నిండి మనోహరముగ భాసించుచుండెను. ఆయన కపోలములపై మదజలము కారుచూ, ఆ

జలముపై ఘుంకారములు కావించు మధుపములు రాగ, తాళ సహితములయిన అద్భుత సంగీతసృష్టి కావించునట్లుండెను ఆ మధుపముల చే సేవింపబడు ఫాల చంద్రధారి గణపతి అనుపమ శోభతో ప్రకాశించుచుండెను. ఆయన అంగకాంతి బాలభానుని మాదిరి ఉజ్వలముగ భాసించుచూ చేతులకు కంకణములు, మెడయందు స్వర్ణ హారములు, శిరమునందు నలుదిశలా కాంతి ప్రసరించు దివ్య మకుటము దీపిల్లుచుండగా, ఆయన ఒక్కొక్క చేతి యందు పాశ, అంకుశ, కమల, కుఠారములు ధరించి, చతుర్భుజుడై, యుద్ధకాంక్షితుడై, మహావీరులనేక మందిని తన తొండము తో బంధించి ఆకాశమున విసురుచూ, అనేక అంచులు గల పరశువుతో సమస్త శస్త్రధారులను సంహరించుచూ, రెండవ పరశురాముడా యన్నట్లు కానబడు చుండెను. ఆయన రథ, గజ, హయ పదాతి చతురంగ బలములను ధరాశయనుల కావించుచూ రథసహితముగ సాంబుని పట్టి దూరముగ విసరివైచెను. అది గాంచిన యాదవగణ సహితుడయిన ప్రద్యుమ్నుడు విస్మితుడై, తన పుత్రుడు, పరమ బుద్ధిమంతుడు అయిన అనిరుద్దునితో ఇట్లనియె.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహులాశ్వ సంవాదము నందలి యక్ష యుద్ధ వర్ణనమును ఇరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఇరువది అయిదవ అధ్యాయము

(ప్రద్యుమ్నుని యుక్తి ద్వారా గణేశుని యుద్ధ భూమి నుండి వేరు పరచి గుహ్యకులపై విజయము సాధించుట, కుబేరుడు వారికి అనేక బహుమతులిచ్చి స్తుతించుట. తిరిగి ప్రాగ్జోషిత పురమందు విరోధి వానరమయిన ద్వివిదుని కిష్కిందకు విసరి వేయుట)

ప్రద్యుమ్నుడు అనిరుద్దుని తో “నాయనా! ఈ మహాబలి అయిన గణేశుడు శ్రీకృష్ణుని అంశ. ఈయనను దేవతలు సహితము జయింపలేరనిన ఇక మనుష్యుల సంగతి చెప్పనేల? ఈయన ఏ పక్షమునుండునో వారికి పరాజయముండదు. పూర్వకాలమందు కైలాసమందు శ్రీకృష్ణుడు ఈయనకు ఆ వరము నిచ్చెను. ఈయన ఇక్కడ యుండిన ఎడల మనకు ఎన్నడూ విజయము దక్కదు. శ్రీకృష్ణ భగవానుని వరము వలన ఈయన బలము అమితమయ్యెను, కానీ దురదృష్ట వశమున ఈయన ప్రత్యర్థి వర్గము నందుండెను. అందువల్ల నీవు ప్రచండమార్జాల రూపము దాల్చి, ఈయన వాహనమయిన అనింద్యుడు అను మూషికమును నీ పూత్కారముల చే భయపెట్టి నలుదిశలా పరుగులెత్తించుము. నేను శత్రుసేనలపై విజయము సాధించు వరకు నీవు అట్లే మూషిక సహితముగ ఈ స్వామిని యుద్ధ భూమికి దూరముగ తీసికొని పోవుటకు ప్రయత్నింపుము.”

అంత అనిరుద్ద భగవానుడు ప్రచండ మార్జాల రూపము దాల్చి, వికట పూత్కారములు కావించుచు గణేశ వాహనమయిన అనింద్యునిపై దూకెను. వైష్ణవ మాయా ప్రభావము చే మార్జాలము గణేశ ప్రభువుకు కానబడకుండెను. ఆ మార్జాలము మాటి మాటికీ పూత్కారము చేయుచూ అయన తన తీవ్రమయిన నఖములచే అనింద్యుని గాయపరచుట నారంభించెను. మూషికము అ భయంకర మార్జాలమును ఆలోకించినంతనే భయవిహ్వలయై, కంపించుచూ రణభూమి నుండి బయటకు పరుగెత్త నారంభించెను. మార్జాలము స్థూలరూపము ధరించి తానునూ ఆ మూషికము వెనుక పరుగుదీసెను. గణేశుడు అనేక మార్లు తన మూషికమును వెనుకకు యుద్ధ భూమికి మరల్చుటకు ప్రయత్నించెను. కానీ ప్రచండ మార్జాల భయము చే పీడింపబడుచున్న మూషికము సమరాంగణ ప్రవేశము నొల్లలేదు. ఆ మూషికము సప్తదీపములు, సప్త సముద్రములు, దిశలు, విదిశలు, ఏడు ఊర్ధ్వలోకములు తిరుగుచు పరుగులెత్తుచునే యుండెను. కానీ దానికి శాంతిలేదు. గణేశుని మూపుపై నుంచుకొని మూషికము ఎక్కడ కేగిననూ, మార్జాలము దానిని వెంబడించెను. ఈ ప్రకారముగ మూషిక సహిత గణేశ ప్రభువు సుదూర దిశలకు ఏగుట గమనించిన ప్రమధులు విస్మితులైరి. అంత

కుబేరుడు సమరాంగణము నందు గుహ్యక సంబధమయిన మాయను ప్రయోగించెను.

ఆతడు తన దివ్య ధనువు తీసికొని, మహేశ్వరునకు నమస్కరించి మంత్ర సహితముగ కవచము ధరించి బాణసమూహములను సంధించెను. ఆ సమయమున ఆకాశము సర్వము మేఘావృతమయినది. మేఘములు భయంకరముగ గర్జించుచు విద్యుత్ మాలలను విరజిమ్ముచూ, ఉరుములు, మెరుపులు, పిడుగులతో రణరంగమంతయు ఏనుగు తొండములవంటి వర్షధారలతో నిండెను. క్షణములో సముద్రములన్నియు ఆ రణభూమిని ముంచెత్తినవి. ఈ ప్రాకృత ప్రళయ విలయమును తిలకించి యాదవులు భయవిహ్వాలులైరి. వారు అస్త్ర శస్త్రములు విడచి మాటిమాటికీ "శ్రీకృష్ణా! శ్రీకృష్ణా!" అని అరుచుచుండిరి. గుహ్యక ప్రభువు మాయచే ఏతెంచిన సముద్ర జలములను గాంచిన ప్రద్యుమ్న భగవానుడు అన్ని మాయలను నష్టపరుచు "సర్వాత్మక విద్య"ను, తలంచి, జపించి తన సాయక మధ్యమున కామరాజ బీజము (క్లీం), ముఖమున ప్రణవముతో శ్రీ బీజమును (ఓంశ్రీం) ఆవాహన చేసి ఆ బాణమును ఆకర్ణాంతము లాగి, మనమున చతుర్భుజుడయిన శ్రీకృష్ణ పరమాత్మను స్మరించుచూ విద్యుత్ సమాన టంకార ధ్వని కావించు ధనువు నుండి విడచెను. కోదండము నుండి వెలువడిన ఆ దివ్య నారాచము భూనభోంతరాళమంతయు వ్యాపించి, దానిని ఉద్భాసితము కావించుచూ గుహ్యక మాయను సూర్యుడు అంధకారమును నశింప జేయునట్లు నశింపజేసెను.

దీనిని కాంచిన రాజరాజు కుబేరుడు భయభీతుడై, యక్షుల సహితుడై సమరాంగణము నుండి పలాయన మొనర్చి తన పురమున దూరెను. దేవతలు ప్రద్యుమ్నునిపై పూలవర్షము కురిపించిరి. యాదవులు జయజయ ధ్వానములు చేసిరి. ఆ సమయమున రాజరాజు మిక్కిలి హర్షితుడై బహుమతులనిడుకొని, చేతులు జోడించి ప్రద్యుమ్నుని కడకు ఏతెంచెను. రెండు తొండములు, దాలుగు దంతములు కలిగి పర్వత సదృశములయిన రెండు లక్షల మదపుటేనుగులను, ముత్యాల తోరణములతో అలంకరింపబడి సూర్య తుల్య తేజస్సు కలిగిన పది లక్షల బంగారపు రథములు, మాణిక్య జటిత శిబికలు నాలుగు లక్షలు, పంజరము లందు బంధింపబడిన రెండు లక్షల సింహములు, ఒక్కొక్క కోటి చిరుత పులులు, గవయములు, వేట కుక్కలు, మొదలగుని కుబేరుడు ప్రద్యుమ్నునకు సమర్పించెను. అంతేకాక విశ్వకర్మ వినిర్మితమయిన "విష్ణు దత్తము" అను దివ్య విమానమును సహితము ప్రద్యుమ్నునకు బహూకరించెను. అది తొమ్మిది యోజనముల పొడవు, వెడల్పు కలిగి, ముత్యాల తోరణములు, లక్షలాది ధ్వజములు, కలశములు కలిగి ఇచ్ఛాను సారము పోగలశక్తి కలది. ఆ విమానము సువర్ణమయ శిఖరములతో శోభించుచూ సహస్ర సూర్యులవలె వెలుగుచున్నది. అంతేకాక వేలాది కల్పవృక్షములు, వందలాది కామధేనువులు, వంద చింతామణులు, పరుశవేది విద్యకల వంద పారసమణులు, వందలాది చత్రచామర సహిత స్వర్ణ సింహాసనములు, దివ్య కేసరయుక్త పద్మములు, అనేక విధములయిన ఫలములు, రత్న జటిత స్వర్ణా భరణములు, దివ్య వస్త్రములు, సుందర కంబళులు, కోట్లాది స్వర్ణ రజిత పాత్రలు అమోఘమయిన శస్త్రములు, కోటి సువర్ణ ముద్రికలు కూడా కుబేరుడు ప్రద్యుమ్నునకు బహూకరించెను. అంత రారాజు ప్రద్యుమ్నునకు ప్రదక్షిణ ప్రణామము లాచరించి ఇట్లనియె "భగవాన్! మీరు మహాత్ములు. పురాణ పురుషులు. మీకు నమస్కారము. మీరు అనాది, నిర్గుణులు, సర్వజ్ఞులు, మరియు పరమాత్ములు. ప్రకృతి, పురుషులు రెండింటినీ నియంత్రించువారు, మరియు పూర్ణ చైతన్య స్వరూపులు. మీరు శ్యామల కాంతిగల సుందరాంగులు మరియు స్వయంజ్యోతి స్వరూపులు. వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులను చతుర్వ్యూహ స్వరూపులు మరియు సాత్వత భక్త ప్రతిపాలకులయిన మీకు నమస్కారము. మీరు మదనుడు, మారుడు, కందర్పుడు, మొదలగు నామములతో ప్రసిద్ధులు. మీకు మరల మరల నమస్కారము. మహానుభావా! మీరు దర్పకుడు, కాముడు, పంచబాణుడు, అనంగుడు, శంబరారి అను నామముల ద్వారా కూడా ప్రసిద్ధినొందిరి. మహాప్రభో! మీరు మీన కేతనులు, మనోభావదేవులు, కుశుమేషులు (పూల బాణము ధరించువారు); రతీపతీ! పుష్పధన్వా, మకర ధ్వజా! మీకు నమస్కారము. జగద్విజేతా! రుక్మవతీపతీ! మీకు మరల మరల నమస్కారము. మహాప్రభో! "ఇది నాది, ఇది నీది; నేను ఈ పని చేయగలను, చేయలేను, చేయుదును; నేను సుఖముతో లేక దు:ఖముతో యున్నాను; ఈ జనులు నా సుహృదులు" ఇటువంటి పలుకులు పలుకుచూ ఈ జగత్తు అంతయు అహంకార మోహితమై యున్నది. ప్రకృతి, కాలము, అంత:కరణము, మరియు శరీరజనిత గుణములు ద్వారా శాస్త్ర విరుద్ధ కర్మలాచరించు జన సముదాయములు భ్రమ కారణమున బంధనమున పడుదురు. వీరు ఇసుకరాశి యందు జలమును, రజ్జువు నందు

సర్పమును, తమ నేత్రములతో కాంచెదరు. భ్రమను సత్యమని తలంచెదరు. నా దశ కూడా అట్టిదే!! నేను ఈనాడు నా మూఢత్వము చే మిమ్ములను అవహేళన కావించితిని. మీ మాయచే నా చిత్తము మోహితమయినది. అందువలన నాచే ఈ అపరాధము కావింపబడినది. ఎట్లు తండ్రి తనయుల అపరాధములు మన్నించునో, అట్లే నా అపరాధము మన్నింపబడును గాక! నాకు మీ చరణార విందములందు ఎల్లప్పుడూ పరాభక్తి నెలకొనును గాక! అది ఏ సర్వోత్కృష్టము. నాకు సమస్త కళ్యాణములకు ఆధారమయిన వైరాగ్య యుక్త జ్ఞానమును, మీ భక్త జనుల తోడి సంగమును ప్రసాదింపవలసినది." నారదుడు "మహారాజా! ఎవరు ప్రాత:కాలమందు లేచి కుబేరకృత ప్రద్యుమ్న స్తోత్రమును పఠించెదరో వారికి సంకట కాలమందు సాక్షాత్ శ్రీహరి సహాయ మొనరించును. ఈ విధముగ స్తుతించిన యక్షరాజైన కుబేరుని గాంచి ప్రద్యుమ్నుడు "తథాస్తు! అట్లే జరుగును," అని దీవించెను. పిదప శిరముపై ధారణయోగ్యమయిన పద్మరాగ మణిని, లీలాఛత్ర చామరములను, మణిమయ సింహాసనములు, అభయ ప్రదానమును, ప్రీతిపురస్కార రూపమున ప్రద్యుమ్నుడు కుబేరునికి ప్రసాదించెను. తదుపరి ప్రద్యుమ్ననకు పరిక్రమ కావించి రాజరాజు తన నివాసమున కరిగెను. ప్రద్యుమ్నుని ద్వార కుబేరుడు పరాజితుడయ్యెనన్న వార్త వినిన మిగిలిన రాజులు కదనము నిచ్చగించక కప్పములు కట్టిరి. తదుపరి తమ దుందుభులను మ్రోగించుచూ ప్రద్యుమ్నుడు సేనా సహితుడై ప్రాగ్జ్యోషిత పురమున కేగెను. అచటి నరకాసుర పుత్రుడు నీలుడు ముకుంద నందనునికి బహుమతులొసంగెను. ప్రాగ్జ్యోషిత పుర ద్వారమున ద్వివిదుడు అను వానరుడు నివసించుచుండెను. ఈతడు ప్రద్యుమ్నుని బాణపురుచి ఎరిగిన వాడే! అయిననూ మూర్ఖత్వమునకు అంతము లేదుకదా!! ఈతడు ఈ సేనా వాహినిని అవలోకించి రోషావేశుడై, పళ్ళు పటపట కొరికి తన వాడి గోళ్ళతోనూ, తీక్షణమయిన దంతములు తోనూ అనేకమంది వీరులను, గజ, హయములను గాయపరచెను. అతడు అనేక రథములను తన తోకతో బంధించి సముద్ర జలములందు ముంచి వైచెను. గజములను తన హస్తములచే పట్టి ఆకాశమున విసరివైచెను. ముకుంద నందనుడు ఆ వానరుడు వైరభావయుక్తుడని గ్రహంచి, తన పొదినుండి ఒక్క బాణమును తీసి తన శాంగ ధనువుకు సంధించి విడచెను. ఆ బాణము ఆ వానరుని ఆకాశము నందు కొంత సేపు త్రిప్పి పిదప కిష్కింధయందు పడవైచి తిరిగి వచ్చి ప్రద్యుమ్నుని అమ్ములపొది ప్రవేశించెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి యక్ష దేశ విజయము అను ఇరువది అయిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది అరవ అధ్యాయము

(కింపురుష వర్షము నందలి రంగవల్లీ పురమున కింపురుషుల ద్వారా హరిచరిత్ర గానము చేయబడుట. అచటి రాజు వద్ద బహుమతులు గైకొని ముందుకుపోయి, మార్గమధ్యమున శాపగ్రస్తుడయిన గంధర్వుని ఉద్ధరించుట. వసంత తిలక మహారాజయిన శృంగార తిలకుని పరాజితుని కావించి హరి వర్షమునకు ప్రస్థానము కావించుట.)

నారదుడు "మహారాజా! ఈ ప్రకారము ప్రద్యుమ్నుడు ప్రయాణించుచూ దివ్యలతాచ్ఛాదితము, సహస్ర కమలాలంకృత సరోవర సుశోభితములయిన అనేక దేశములను దాటుచూ వంద అక్షౌహిణీ సేనా వాహినిని తీసికొని యక్షులచే నియంత్రించబడిన మార్గమున కింపురుష వర్షమున కేగెను. అచట హేమకూట పర్వత ఛాయలందు రంగవల్లీ పురము ప్రస్థుతమై యున్నది. అచటి జనులు శంబరారి వినుచుండగా ఇట్ల కొనుచుండిరి. "పురము లందు మధురాపురము పరమధన్యమైనది. అచట శ్రీహరి అవతారము స్వీకరించెను. యదుకులము కూడ పరమధన్యము. ఎందుకనగా ఆ కులము నందు సమస్త బ్రహ్మాండ పాలకుడయిన అచ్యుతుడు ప్రాదుర్భవించెను. శూర పుత్రుడయిన వసుదేవుని నివాస

మందిరము కూడా ధన్యమే, ఎందుకనగా గోలోకనాధుడు ముకుందుడు ఉపస్థితుడై అద్దానిని మరింత మనోహరము కావించెను. దేవతలకు కూడ దుర్లభమయిన మధురా మండలము ధన్యము, ఎందుకనగా అచట మాధవుడు చరించెను. మనోహర మహావనము ధన్యాతి ధన్యము ఎందుకనగా శిశురూపధారి అయిన శ్రీకృష్ణుడు తన జన్మస్థలిని విడచి బలరామ సహితుడై బాలక్రీడలు ఆడెను, మరియు యశోదామాత ఆయనను లాలించి పాలించెను. పరాత్పరుడయిన శ్రీకృష్ణ పరమాత్ముని చరణారవింద పావన పరాగ విరాజితమయిన బృందావనము మరింత పుణ్య తీర్ధము. అచట బలరామ గోపబాల సహితుడై ముకుందుడు గో సంరక్షణ గావించెను. శ్రీకృష్ణ చరణారవింద పద రజము చే విరాజితమయిన బృందావనము మరింత పుణ్య తీర్ధము. శ్రీకృష్ణ భగవానుడు బృందావనమందు కావించిన దాన, మాన, రాసలీలలు యొక్క పవిత్ర లీలామృతమును త్రిలోకముల యందలి జనులు గానము చేయుచుండిరి. గోలోకధామమందు విరాజిల్లు శ్రీమాత ముకుందుని కూడి బృందావనమందు విరచిత అయినది. భగవానుని ఎడమ భుజము నుండి ఉత్పన్నమయిన కళిందనందిని యమున సహితము ధన్యురాలు. ఆ కాళిందీ తీరమునున్న ఘంకారము చేయు భ్రమరముల చే పరివేష్ఠితమయిన దివ్య వృక్షములు మరియు యమునా జలమును స్పర్శించిన మానవుడు కృతార్ధుడగును. శ్రీకృష్ణ వక్షస్థలము నుండి ఉత్పన్నమయినది, మరియ దేని దర్శనము చే పునర్జన్మ యుండదో అట్టి పర్వత రాజమయిన గోవర్ధనము వ్రజమండలమున విరాజమానమయినది.

"ఆకాశము నందలి మేఘమాలికలతో కూడిన విద్యున్మండలము వలె భూతల మందు యదు మండలి చే విరాజమానమయిన కుశస్థలీ పురము ధన్యాతి ధన్యము. అ దివ్యపురి యందు సాక్షాత్ పరమ పురుషుడు, పరమేశ్వరుడు చతుర్విధ రూప ధారుడై శోభిల్లు చుండును. ఆయనే ఉగ్రసేనునకు రాజాధిరాజ పదవిని ఇచ్చెను. బుద్ధిమంతుడయిన ఆ మహారాజు చే ప్రేరేపితుడయిన మహావీరుడు, మకర ధ్వజుడు, ప్రద్యుమ్నుడు సంపూర్ణముగ జగత్తుపై విజయము సాధించుటకు బయలు దేరెను. ఆయన అతిదుర్లభ దర్శనమును మనము ఈనాడు పొంది కృతార్ధులమయ్యెదము."

ఈ విధముగ శంబరారి ప్రద్యుమ్నుడు తన నిర్మల యశోగానమును విని అత్యంత హర్షితుడై ఆ కింపురుషులకు హార, కేయూర, కంకణ, కిరీట మణిమయ కుండలములను, అత్యధికముగ ధనమును బహూకరించెను. రంగవల్లీ పురాధీశుడయిన సుబాహుడు ప్రద్యుమ్నునకు బహుమతులర్పించెను. ఆయన యందు అతి ప్రసన్నుడయిన మీన కేతనుడు, ముకుంద నందనుడు ఆయనకు దివ్య చూడామణిని ప్రసాదించి ఇట్లు ప్రశ్నించెను. "మహారాజా! సుబాహు! ఈ పురమునకు రంగవల్లి యనునామమును ఎవరు పెట్టిరి? ఈ నామమును నేను ఎన్నడు వినలేదు. నాకు ఆ వృత్తాంతమును తెలుపవలసినది." సుబాహుడు "మహారాజా! ఒకనాటి మాట! పూర్వకాలమందు దేవాసురులు కలసి క్షీర సాగర మధనము కావించిరి. అపుడు సాగరము నుండి అమృత కలశము ఉద్భవించినది. ఆ కలశమును కమలనయనుడయిన శ్రీహరి తన నేత్ర ద్వయము చే అవలోకించెను. ఆ దివ్య నేత్రములు నుండి పడిన అశ్రుబిందువులందలి ఒక బిందువు ఆ కలశము నందు జాలువారెను. దాని నుండి ఒక వృక్షము మొలిచినది. అదియే "తులసి". కానీ భగవానుడు ఆ వృక్షమునకు ఇచ్చిన నామము "రంగవల్లి." ఆయన ఆ వృక్షమును కింపురుష వర్షము నందలి హేమకూట పర్వత సానువులందు పాతెను. అప్పటి నుండియు ఆ వృక్షము ఇచటనే విరాజమానమైయున్నది. ఆ వృక్షపు నలువైపులా ఏర్పడిన నగరమే కావున రంగవల్లీ నగరమని పేరొందినది. ఈ వృక్ష దర్శనమునకు ప్రతి దినము శ్రీరామ దూత అయిన మహానుభావుడు హనుమంతుడు సంగీత కుశలుడయిన అరిష్ఠషేణుని తో కలసి వచ్చునని ప్రతీతి." ఇది వినిన పిదన ప్రద్యుమ్నుడు సహితము ఆ మహిమాన్విత రంగవల్లీ వృక్షమును గాంచి, పరిక్రమగావించి, ప్రమాణము లిడి తిరిగి తన ప్రయాణమును కొనసాగించెను.

హేమకూట పర్వతపు చుట్టూ దట్టమయిన అడవి చుట్టుకొని యుండెను. అది భయంకరము, దర్గమమై సింహములు, చిరుత పులులు గర్జనలతో ప్రతి ధ్వనించుచూ జంబూకముల, గుడ్లగూబల సమ్మిళితమై మిక్కిలి గగుర్పాటు కలిగించు చుండెను.

వెదురు పొదలు, అత్తి చెట్లు, మర్రి చెట్లు, జిల్లేడు చెట్లు, భోజపత్ర వృక్షములు, నల్లని బెరడు గల వృక్షముల తో కూడి ఆ వనము భయానకముగ యుండెను. యాదవసేన ఆ వనమందు పయనించు చుండగా ఒక విచిత్రము జరిగెను.

వారి ఎదుటకు పది యోజనములు పొడవుగల ఒక భయంకర సర్పము – కొండ చిలువ వచ్చెను. అది మాటిమాటికీ పూత్కారము చేయుచూ అమాంతముగ ఏనుగులను సహితము మ్రింగ నారంభించెను. యాదవ సైన్యమందు హాహాకారములు చెలరేగినవి. ఆ అజగరపు నిశ్వాశము విషపూరితమూ దశదిశలను భస్మీపటలము కావించుచుండెను. అంత సత్యభామా దేవి దశపుత్రులు – **"భాను, సుభాను, స్వర్భాను, ప్రభాను, భానుమాను, చంద్రభాను, బృహద్భాను, అతిభాను, శ్రీభాను, ప్రతిభాను",** అనువారలు తమ తీక్షణ సాయకముల తో అద్దానిని ఖండించుట ప్రారంభించిరి. ఆ బాణ ప్రహారము చే శరీరము ఛిన్నాభిన్నమై, అందుండి ఒక దివ్య రూపము దాల్చిన గంధర్వుడు ప్రత్యక్షమయ్యెను. ఆతడు శ్రీకృష్ణ నందనులకు నమస్కరించి, దిశామండలమును ఉద్భాసితము కావించుచు ఒక దివ్య విమానము నధిరోహించి స్వర్గ లోకమున కేగెను.

బహుళాశ్వుడు "మహామునీ! ఈ గంధర్వుడెవ్వరు? ఏ పాప కారణమున ఈతనికి ఈ దురవస్థ కలిగినది? మీరు భూత, భవిష్యత్, వర్తమానములను కాంచగల ద్రష్టలు, నాకు దయ చేసి తెలియజేయ వలసినది." నారదుడు "మహారాజా! అరిష్ఠ శేణుడను గంధర్వునకు సుమతి అను సోదరుడు కలడు. అతడు హనుమంతుని వద్ద రామాయణమును వినుటకు ఏతెంచెను. హనుమంతుడు హేమకూట పర్వతమందు నిత్యము శ్రీరామసేవ యందు ప్రాత:కాలము నుండి సాయంత్రము వరకూ నిమగ్నమై యండెడివాడు. హనుమ త్ప్రభువు నిరంతరము లక్ష్మణ సహిత జానకీపతిని ధ్యానము చేయుచుండెడి వాడు. ఆ సమయమున ఈ సుమతి సర్పము వలె పూత్కారము కావించుచూ ఆయన ధ్యానమునకు భంగము కలిగించువాడు. అంత వానరేశ్వరుడు కుపితుడై "ఓరీ! దుష్టుడా! నీవు సర్పమునవు కమ్ము! అని శపించెను. అంత సుమతి దీనుడై "దేవా! మీ శరణుగోరుచున్న నన్ను రక్షింపవలసినది." అంత హనుమంతుడు ప్రసన్నుడై ద్వాపరాంతమున శ్రీకృష్ణ నందనులచే నీ శరీరము ముక్కలైనప్పుడు నీకు శాప విముక్తి అయి తిరిగి గంధర్వ శరీరము పొందెదవు. ఇందు సందియము లేదు." ఆ సుమతి ఏ ఈనాడు శాపవిముక్తుడయ్యెను.సత్పురుషుల శాపము వరదానతుల్యము. వారి వరము మోక్షదాయకము." తదనంతరము ప్రద్యుమ్నుడు వాసంతీ, మాధవీలతా శోభితము అయిన చైత్ర దేశములకేగెను. అచటి సరోవరము లన్నియు సహస్ర దళ పద్మములతో నిండి యున్నవి. అచటి పురుషులు ఒక్కొక్కరు పది ఏనుగుల బలవంతులు. వారి శరీరము నందు ముడుతలు కానరావు. వెంట్రుకలు తెల్లబడవు వారి శరీరము నుండి చెమట మరియు దుర్గంధము రాదు, మరియు శ్రమ నొందరు. అచట ఎల్లప్పుడూ త్రేతాయుగము నడుచుచుండును.

అచటగల దివ్యనదీ జలములు మరియు ఓషధీ ప్రభావము చే జీవన కాలము పది వేల సంవత్సరములు యందును. అచటి జలము అమృతమయము మరియు భూమి స్వర్ణమయము. ఆ భూమి నుండి ముత్యములు, రత్నములు, వైఢూర్యములు, ఉత్తత్తి అగును. అచటి మదమత్త రమనీమణులు అక్షయ రూప యవ్వన సౌందర్యముల చే ప్రకాశించుచుండిరి. అచటి ఉపవనములు దూరము నుండి మేఘములందలి విద్యుల్లతల వలె మెరయుచుండినవి. అచట "వసంతతిలకము" అను సుందర సురమ్య నగరము కలదు. ఆ నగరమును "శృంగార తిలకుడు" అను అత్యంత బలశాలి అయిన రాజు పరిపాలించుచుండెను. ఆ నగరము నందలి వీరులందరినీ ప్రోగుచేసి, స్వయముగ తాను కవచధారియై, ఒక ఎత్తైన ఏనుగును అధిరోహించి ప్రద్యుమ్నునికి అభిముఖముగ రణమందునిలచెను. ఆ సమయమున ఆయనను పది మంది జాంబవతీ పుత్రులు – **"సాంబుడు, సుమిత్రుడు, పురుజిత్, శతజిత్, సహస్రజిత్, విజయ, చిత్రకేతు, వసుమాను, ద్రవిడు, క్రతువు"**, ముట్టడించి క్రూర నాచారముల తో ముంచెత్తిరి. ఆ బాణముల ధాటికి ఆగలేక విపక్షి దళములు పలాయన మొనర్చు నారంభించిరి. బాణముల చే అంధకారము అలముకొనుట చే అంతటా కోలాహలము చెలరేగెను. అంత కుంజరమునందు ఉపస్థితుడయిన శృంగార తిలకుడు త్రిశూలమును చేతిలోనికి తీసికొని దానిని సాంబుని వక్షస్థలము పై ప్రయోగించెను. తీవ్ర సాయకముల చే ఇతర యోధులను సహితము మట్టి కరిపించెను. వనమందు దావానలము చెలరేగునట్టు ఆతడు ఒక్కడే సమరాంగణమంతయు సంచరించుచూ ప్రత్యర్థి సేనలను చీల్చి చెండాడ సాగెను. ఆ సమయమున బలరామ సోదరుడు గదుడు ఏతెంచి ఆ మహారాజు యొక్క కుంజర తొండమును చేజిక్కించుకొని భూమిపై పడవేసెను. ఆ సమయమున శృంగార తిలకుడు భూమిపై దూరముగ పడెను. తక్షణము

ఆతడు వ్యాకుల చిత్తుడై యుద్ధకాంక్షను వీడి చేతులు జోడించి పది కోట్ల గుఱ్ఱములు, ఒక లక్ష రథములు, పది వేల ఏనుగులు ప్రద్యుమ్ననకు బహూకరించి నమస్కరించెను. ఈ విధముగ కింపురుష వర్షమును జయించి నిషాదులు చూపించిన త్రోవనే హరి వర్షమున కేగిరి.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహులాశ్వ సంవాదము నందలి "కింపురుష ఖండము పై విజయము" అను ఇరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఏడవ అధ్యాయము

(ప్రద్యుమ్నుని గరుడాస్త్రము ద్వారా గ్రద్దలచే ఆక్రమింపబడిన యాదవసేనా రక్షణ, దశార్ణ దేశముపై విజయము మరియు దశార్ణ తీర్థ స్నానము)

నారదుడు "మహారాజా! ఆ సమయమున సకల సంపదలచే సమృద్ధమయిన "హరి వర్షము" అను రాజ్యము కలదు. అయ్యది సాక్షాత్ నిషిధ పర్వతమందు నెలకొని యున్నది. వీరుల టంకార ధ్వని చే అచటి వన్యప్రాంత మంతయు మారుమ్రోగుచుండును. అక్కడ ఒక్కొక్క క్రోసు పొడవుగల గృధ్రములు, గరుడపక్షులు విహరించు చుండును. అవి అన్నియును దీర్ఘాయువులు మరియు అపరిమితమయిన అకలి గలిగినవి. అవి అసంఖ్యాక యాదవ సైన్యము ఆగమించుట గమనించి అందలి గజ, హయములను ఆహారముగ గొనుట ప్రారంభించెను. ఆకాశమంతయు ఆ పక్షులచే నిండినది. వాని పక్షముల నుండి వెలువడిన గాలి తుఫానును సృష్టించుచుండెను. యాదవ సేన సర్వము అంధకార బంధురమై, హాహాకారములు చెలరేగినవి. అంతట మహాబాహువు అయిన ప్రద్యుమ్నుడు గరుడాస్త్ర సంధానము కావించెను. వెంటనే వినతానందనుడు, సాక్షాత్ గరుత్మంతుడు ప్రత్యక్ష మయ్యెను. ఆయన అంధకార బంధుర మయిన యాదవ సేన యందు ప్రవేశించి తన వాడి ముక్కు, బలమయిన రెక్కలుతో, తీక్షణమయిన గోళ్ళతో ఆ పక్షి సంఘములను చీల్చి చెండాడి ధరాశయనుల కావించెను. ఆ పక్షుల గర్వము సర్వమూ ఖర్వమయి గరుడుని భయమున దశదిశలకు పలాయనము చిత్తగించెను.

పిదప శ్రీకృష్ణ నందనుడు దశార్ణ జనపదమున కేగెను. దశార్ణ దేశమునేలు రాజు "శుభాంగుడు" సూర్య వంశజుడు "నిష్కోశాంచీ" పురమును రాజధాని గ చేసికొని ధర్మముగ దేశము నేలుచుండెను. ఆయన పదివేల ఏనుగుల బలశాలి. ఆయన వేదవ్యాసుని ముఖతా ప్రద్యుమ్నుని ప్రచండ, పౌరుష, పరాక్రమములు విని, దశార్ణనదిని దాటి, ఇవతలకి వచ్చి, చేతులు జోడించి సువర్ణమయ కిరీట సహిత మస్తకమును ప్రద్యుమ్నుని పాదములపై యుంచి, ఉత్తమ రత్నములను బహూకరించెను. సర్వ వ్యాపకుడు, సర్వదర్శీ అయిన ప్రద్యుమ్నుడు లోకహితార్థము శుభాంగుని ఇట్లు అడిగెను "మహారాజా! ఈ దేశము "దశార్ణము" అని ఎందువలన పిలువబడుచున్నది? నాకు తెలుప వలసినది." శుభాంగుడు "మహాప్రభూ! పూర్వకాలమున నృశింహ భగవానుడు హిరణ్య కశిపుని సంహరించి ప్రహ్లాద సహితుడై ఇచ్చటికి వచ్చి ఈ హరి వర్షము నందే నివసించెను. ఆ సమయమున నృశింహుడు ప్రహ్లాదునితో "పుత్రా! నీవు నా ఎడల శాంత భక్తుడవు. కానీ నేను నీ తండ్రిని సంహరించితిని. అందువలన నీ వంశము నందెవ్వరినీ నేను సంహరింపను."

ఈ విధముగ పలుకుచున్న నృశింహ భగవానుని నేత్రముల నుండి అనందజనిత అశ్రుబిందువులు జాలువారినవి. అవి "మంగళాయన సరోవరము" గా రూపాంతరము చెందినవి. అంత ధర్మాత్ముడయిన ప్రహ్లాదుడు హర్షవిహ్వలుడై చేతులు జోడించి ఇట్లనియె "భక్తజన పరిపాలకా! పరమేశ్వరా! నేను మాతా పితృసేవ చేయలేదు. అందువలన నేను వారి ఋణము ఎట్లు తీర్చుకొనగలను?" నృశింహుడు "మహాభాగా! నా అశ్రువుల చే ప్రకటితమయిన మంగళయాన తీర్థమందు స్నానమాచరించుము. అందువల్ల నీవు దశ (పది) విధములయిన ఋణముల నుండి విముక్తుడవగుదువు.

అవి – **"మాతా, పిత్ర, పత్నీ, పుత్ర, గురు, దేవతా, బ్రాహ్మణ, శరణాగత, ఋషి మరియు పితరుల ఋణములు"**. వానినే దశార్ణములని యుందురు. ఎవరు ఈ మహాతీర్థమందు స్నానమాచరించెదరో వారు సర్వులచే అవహేళన చేయబడినప్పటికీ వారు ఈ దశవిధ ఋణముల నుండి విముక్తులగుదురు. ఇందు సందియము లేదు." కయాధు కుమారుడయిన ప్రహ్లాదుడు ఈ తీర్థమందు స్నానమాచరించి అన్ని ఋణముల నుండి విముక్తుడయ్యెను. ఆయన ఇప్పటికీ ఈ నిషిధగిరి తీర్థమందు స్నానమాచరించుటకు వచ్చుచుండును. దశార్ణ తీర్థమునకు దగ్గర యున్న రాజ్యము కావున మాది దశార్ణ దేశమయినది." అది వినిన ప్రద్యుమ్నుడు తన సమస్త పరివార సహితుడై ఈ దశార్ణ మోచన తీర్థమందు స్నానమాచరించి విశేష దానములు సలిపెను. నారదుడు "నరేశ్వరా! ఎవరు ఈ దశార్ణ మోచన వృత్తాంతమును వినెదరో వారు సహితము ఆ పది ఋణముల నుండి విముక్తులై మోక్షగాము లగుదురు."

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి "దశార్ణ దేశ విజయము" అను ఇరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఎనిమిదవ అధ్యాయము

(ఉత్తర కురు వర్షముపై యాదవుల విజయము. వారాహీ పురము నందు గుణాకర మహారాజు ద్వారా ప్రద్యుమ్నుడు ఆదరింప బడుట)

నారదుడు "మహారాజా! తదుపరి ప్రద్యుమ్నుడు సుమేరు పర్వతమునకు ఉత్తరమున శృంగవన్ పర్వత సమీపముగల ఒక విచిత్రము మరియు సర్వ సమృద్ధము అయిన ఉత్తర కురు దేశమున కేగెను. అచట గంగానది భద్ర అనుపేర ప్రవహించుచున్నది. ప్రద్యుమ్నుడు భద్రానది యందు స్నానమాచరించి దవ్వునయున్న వారాహీ నగరమున కేగెను. ఆ నగరమును కురువర్షాధిపతి, గుణాకర చక్రవర్తి పరిపాలించుచుండెను. ఆ సమయమున గుణాకర చక్రవర్తి అన్ని విధములుగ సంభారములు సేకరించుకొని, దేవర్షి గణమును చుట్టూ యుంచుకొని అశ్వమేధ యజ్ఞమును ఆరంభించుచుండెను. ఆ సమయమున ఆయన శ్యామకర్ణ, శ్వేతవర్ణ అశ్వమును వదలి దానికి రక్షణగా తన కుమారుని వీరధన్వుని ఆ అశ్వ రక్షకునిగా పంపెను. ప్రచండ పరాక్రముడయిన వీరధన్వుడు పది అక్షౌహిణీ సేనను తీసికొని ఆ అశ్వము వెనుక బయలుదేరెను.

నాగ్నజితి యొక్క దశపుత్రులు – **"వీర, చంద్ర, సేన, చిత్రగు, వేగవాన్, ఆమ, శంకు, వసు, శ్రీమాన్, మరియు కుంతి"** మొదలగువారు అన్నివైపుల నుండి మొహరించి ఆ అశ్వమును బంధించిరి. "ఈ అశ్వము లలాటము నందు లిఖింపబడిన పత్రము చూచి ప్రద్యుమ్నుడు విస్మితుడయ్యెను. సమస్త యాదవసేనలు యుద్ధ సన్నద్ధులైరి. ఇంతలో అశ్వ రక్షకుడు గా యున్న వీరధన్వుడు సేనా సహితుడై అచటికి ఏతెంచెను. ఆ యోధులు దూరము నుండి యాదవ సేనా వాహిని చే రేగుచున్న ధూళిని గాంచి విస్మితులై దూరముననే నిలుచుండి ఇట్లు తర్కించుకొను చుండిరి. ప్రచండ పరాక్రముడయిన గుణాకర మహారాజు పరిపాలన యందు దస్యులు (దారిదోపిడీదారులు) దొంగలు లేరుకదా! ఇది గోచార సమయము కూడా కాదు. మరి సూర్యుని కూడా కప్పవేయు ధూళి ఎక్కడ నుండి ఉత్పన్నమగుచున్నది?" ఈ విధముగ వారు అనుకొను చుండగా వీరుల ధనుష్టంకారములు, గజములు ఘీంకారములు, కుంజరములు చీత్కారములు, హయముల సకిలింపులు, రణ దుంధుభుల మ్రోతలు, ఇవన్నియు కలసిన ధ్వని వినపడసాగినది. అంత ముకుందనందనుని చే ప్రేరితుడయిన ఉద్ధవుడు వీరధన్వుని సేన సమీపించి రథారూఢుడు, సూర్యతుల్య తేజస్వీ అయిన గుణాకరుని ఔరస పుత్రుడయిన వీరధన్వునికి ప్రమాణము లాచరించి ఇట్లనియె.

"మహారాజా! భూపాలురందు ఇంద్రుడు, యదుకుల భూషణుడు, ద్వారకాధీశుడు, ఉగ్రసేన మహారాజు

జంబూద్వీపము నందలి రాజులందరినీ జయించి రాజసూయము చేయ సంకల్పించెను. ఆయన యొక్క ఆజ్ఞచే ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు భారత వర్షము, కింపురుష వర్షము, హరివర్షములను జయించి ఇపుడు ఉత్తర కురువర్షమును ప్రవేశించెను. వంద అక్షౌహిణీ సేనతో వచ్చిన ప్రద్యుమ్నుని కుబేరుడు కూడా పూజించెను. అందువల్ల మీరు కూడా ఆయనకు బహుమతులు ఈయవలసినది. ఆయన చే బంధింపబడిన యజ్ఞపశువును బంధించుట ఎవరితరము? సాక్షాత్ శ్రీకృష్ణ పరమాత్ముడు ఆయనకు సహాయకుడగ యున్నాడు. మీరు ఆయనను సన్మానించి బహుమతులు, కప్పములు కట్టినచో అపుడు అందరికీ శుభమగును. లేని ఎడల యుద్ధమనివార్యము.”

వీరధన్వుడు “రాజాధిరాజైన గుణాకరుని సాక్షాత్ ఇంద్రుడు కూడా పూజించెను. ఆయన ప్రద్యుమ్నునకు బహుమతులీయడు. రమణీయ శృంగవన పర్వతమందు వరాహ భగవానుడు కొలువై యుండును. ఆయనను నిరంతరము అత్యంత ఆదరముతో భూదేవి సేవించుచుండును. ఆ క్షేత్రము నందు గుణకార మహారాజు కఠోర తపమాచరించెను. పదివేల సంవత్సరముల తరువాత వరాహభగవానుడు సంతుష్టుడై వరము కోరుకొనమనగా, మహారాజు శ్రీహరికి నమస్కరించి, పులకిత హృదయుడై ఇట్లనియె “భగవాన్! మీరు తప్ప ఈ భూమండలమందు వేరెవరూ (దేవ, దానవ, మానవులు) నన్ను జయింపకుందురు గాక!!” వరాహస్వామి “తధాస్తు” అని పలికి అదృశ్యుడయ్యెను. అందువలన గుణాకర మహారాజు యొక్క అశ్వమును మీరే విడువవలసినది. లేని ఎడల యుద్ధము అవశ్యము సంభవించును.”

వీరధన్వుని పలుకులు వినిన ఉద్ధవుడు వెనుకకు వచ్చి యధాతథముగ ఆ సందేశమును వినిపించెను. అంత **కాళిందీదేవి తనయులు “శృతవర్మ, వృష, వీర, సుబాహు, భద్ర, ఏకల, శాంతి, దర్శ, పూర్ణమాస”** అనెడు పది మంది ప్రద్యుమ్నుడు చూచుచుండగనే పది అక్షౌహిణీ సేనా వాహినిని తీసికొని ముందుకు సాగిరి. ప్రచండ పరాక్రములయిన ఉత్తర కురు వీరులకు, యాదవ వీరులకు మధ్య గొప్ప తుముల యుద్ధము ఆరంభమయ్యెను. అయ్యది రెండు సాగరముల మధ్య పోరు జరుగుచున్నట్లుండెను. ఇరువైపుల నుండి మెరయుచున్న బాణ వాహినిలు ఎగర నారంభించినవి. క్షతగాత్రులయిన యోధుల నుండి స్రవించు రుధిరము నదిగా మారి వంద యోజనములు ప్రవహించినది. మరణించగా మిగిలిన ఉత్తర కురువీరులు పలాయన మొనర్చిరి. కాళిందీ పుత్రుడు, మహావీరుడయిన పూర్ణమాసుడు, వీరధన్వుని రథమును తన బాణ పరంపర చే నుగ్గు నుగ్గు గావించెను. వీరధన్వుడు రథహీనుడయినప్పటికీ, మాటిమాటికీ టంకారము చేయుచూ పూర్ణమాసునిపై ఇరువది సాయికములు ప్రయోగించెను.

కానీ పూర్ణమాసుడా సాయికములును మధ్యే మార్గమున ఖండించెను. ఆ సమయమున వీరధన్వుడు ఒకే బాణమును తీసికొని అత్యంత భయంకర ధ్వని గావించుచున్న పూర్ణమాసుని ధనువు నారిని ఖండించెను. అపుడు పూర్ణ మాసుడు లక్ష బారువుల బరువు గల దివ్యగదను తీసికొని దానితో వీరధన్వుని ప్రహరించెను. గదా ప్రహరముతో వ్యాకులతనొందిన మదోత్కట యోధుడయిన వీరధన్వుడు తిరగి పరిఘను పూర్వమాసుని పై ప్రయోగించెను. అంత పూర్ణమాసుడు కొంచెము వ్యాకులుడై, కొంత తడవునకు తెప్పరిల్లి “పవనము” అను పర్వతమును నుగ్గడించి త్రిప్పి త్రిప్పి వారాహీ పురము వైపు విసరెను. వీరధన్వుడు సహితము ఆ పర్వతమందే యండెను. అట్లు ఆ పర్వతము విసురబడుటచే దానిపై నున్న వీరధన్వుడు గుణాకరుని యాగశాల యందు పడి రక్తము కక్కుకొని మూర్ఛ నొందెను.

ఆ సమయమున వారాహీ పురమందు హాహాకారములు చెలరేగెను. మానవ, దేవతా దుందుభులు మ్రోగినవి. దేవతలు పూర్ణమాసునిపై పుష్పవృష్టి కురిపించిరి. తన పుత్రుడు మూర్ఛితుడుగుట కాంచిన గుణాకరుడు యజ్ఞశాల యందు లేచి నిలబడి తన దివ్య కోదండమును చేపట్టి సమరమునకు సంసిద్ధుడాయెను. ధర్మజ్ఞులందు శ్రేష్ఠుడు, సర్వజ్ఞుడు, విద్వాంసుడు, మునీంద్రుడు అయిన వామదేవుడు ఆ యజ్ఞమందు హోత గా యుండెను. ఆయన ఇట్లనియె “మహారాజా! దేవతల యొక్క మహాకార్యము సిద్ధింపజేయుటకై పరిపూర్ణతమ పరమాత్ముడు శ్రీహరి యదుకులమందు అవతీర్ణుడై యుండెను. భక్త రక్షణకు, పృథివీ భార నాశనమునకు ఆయన ద్వారక యందు విరాజిల్లు చుండెను. ఆ శ్రీకృష్ణుడే ఉగ్రసేనుని యజ్ఞ సిద్ధికై, సంపూర్ణ జగత్తును ఓడించుటకై తన పుత్రుడయిన ప్రద్యుమ్నుని పంపెను.” గుణాకరుడు “బ్రహ్మన్! మీరు పరావేత్తలందు శ్రేష్ఠులు. నాకు పరమాత్ముడయిన శ్రీకృష్ణుని లక్షణములు తెలుపవలసినది.” వామదేవుడు “ఎవరి తేజము నందు సర్వుల తేజము లీనమగునో, ఆయననే పరిపూర్ణతమ పరమాత్మ శ్రీహరి యని పేర్కొందురు.

“అంశాంశ, అంశ, ఆవేశ, కళ మరియు పూర్ణ” అవతారము లందు భేదములు కలవు. వ్యాసాది మహర్షులు ఆరవ పరిపూర్ణ తత్వముగ చెప్పబడుదురు. పరిపూర్ణ భగవానుడు సాక్షాత్ శ్రీకృష్ణుడే!!! ఎందుకనగా ఆయన ఒక్క సాధనకు వచ్చి అనేక కార్యాములు సాధించెను.”

శ్రీకృష్ణుని పరతత్వమును, మహాత్మ్యమును విని గుణాకరుడు తన వైర భావము వీడి అనేక బహుమతులు గైకొని ప్రద్యుమ్నుని కడకేగెను. ఆయన ముకుంద నందనునికి, పరిక్రమ కావించి, నమస్కృతులిడి, బహుమతులు సమర్పించి గద్గద వాణితో ఇట్లనియె.

“ప్రభూ! నేడు నాజన్మ సఫలమయినది. నా కులము పవిత్రమయినది. నా సర్వ క్రతువులు, క్రియలు, నీ దర్శనము చే పూర్ణమయినవి. పరేశా! మీ చరణారవింద భక్తియే పరమార్ధ రూపము. సాధు సంగము చే మీ యందలి పరాభక్తి మాకు నిరంతరము కలుగుగాక! మీరు సదా భక్తులపై కృపాకటాక్షములు కురిపించు భక్తవత్సలులు. నన్ను రక్షించండి! నన్ను రక్షించండి!! ప్రద్యుమ్నుడు “మహారాజా! మీరు జ్ఞాన వైరాగ్య యుక్త ప్రేమలక్షణ భక్తిని ప్రాప్తించి యున్నారు. ఇపుడు మీకు నా భక్తుల తోడి సత్సంగము కూడా కలుగును.” ఈ విధముగ పలికి రాజుకు అశ్వమేధ యాగాశ్వమును తిరిగి ఇచ్చెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహులాశ్వ సంవాదము నందలి “ఉత్తరకురు వర్షముపై యాదవుల విజయ” మను ఇరువది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది తొమ్మిదవ అధ్యాయము

(ప్రద్యుమ్నుని హిమాలయ వర్షముపై విజయము. వానర, మధుపముల నుండి విముక్తి. దేవసఖ మహారాజు నుండి బహుమతులు గొనుట. చంద్రకాంత నది యందు స్నానము)

నారదుడు “మహారాజా! మహాబాహువు, శ్రీకృష్ణ నందనుడు ప్రద్యుమ్నుడు ఉత్తర కురు భూములపై విజయము నొంది అటు పిదప “హిరణ్మయ వర్షము”ను జయించుట కేగెను. అచట మిక్కిలి ఎత్తైన “స్త్రోత” పర్వతము దీప్తించు చున్నది. అచట సాక్షాత్ కూర్మావతారుడయిన శ్రీహరి నివాసముండును. మహానుభావుడు ఆర్యముడు ఆయనకు పరిచర్యలు కావించు చుండును. హిరణ్మయ వర్షము నందు పుష్పమాలా నదీ తీరమున చిత్ర వనమను ప్రసిద్ధ వనము కలదు. అయ్యది ఫల పుష్పములతో నిండినది. కందమూలములకు నిధి. ఆ వనమందు రామాయణ కాలము నాటి నల, నీల మొదలగు మహావానరముల సంతతి నివసించుచుండెను. సేనల కోలాహలము విని ఆ వానరములు యుద్ధ కాంక్షులై, పళ్ళు పటపట కొరుకుచూ, క్రోధావేశులై ప్రద్యుమ్నుని సేనపై దుమికిరి. ఆ వానరములు తమ నఖ, దంత, వాలములచే గజ, హయములను మిక్కిలిగా గాయపరచి, రధములను తను వాలములచే పట్టి ఆకాశము నందు ఎగుర వేయుట నారంభించెను.

కొన్ని వానరములు అర్జునుని కపిధ్వజముగల రధమును తమ లాంగలూము తో బంధించి ఆకాశమున కెగరెను. అర్జునుని కపిధ్వజమందు సాక్షాత్ ఆంజనేయ మహా ప్రభువు నివసించుచుండును. అంత హనుమంతుడు కుపితుడై తన వాలమును పెంచి, ఆ వానరములను బంధించి ధరిత్రిపై పడవేయుట నారంభించెను. అంత ఆ శ్రీరామ కింకరులైన సమస్త వానరములు శ్రీ ఆంజనేయ స్వామిని గుర్తించి హర్షోల్లాసులై చేతులు జోడించి అన్ని దిశల నుండి నెమ్మది నెమ్మదిగా వచ్చి పవన పుత్రుని చేరి ప్రణామము లర్పించినవి. కొన్ని వానరములు ఆయనను ఆలింగనము చేసికొన్నవి. కొన్ని వేగముగ పైకి, క్రిందికి ఎగుర నారంభించినవి. కొన్ని వానరములు తమ వాలములను ముద్దాడినవి. మహా వీరుడయిన హనుమంతుడు వారిని తన హృదయమునకు హత్తుకొని, శరీరములను నిమిరి, ఆశీర్వదించి కుశల సమాచారములరసెను. ఆయనకు ప్రమాణములర్పించి వానరములు తిరిగి చిత్ర వనమునకు వెడలినవి. హనుమంతుడు

తిరిగి అర్జునుని కపిధ్వజముందు అంతర్ధానుడయ్యెను. తదుపరి మీన ధ్వజుడయిన ప్రద్యుమ్నుడు మకర దేశము మీదుగా దుందుభులు ధ్వనింపజేయుచూ ముందుకు కదిలెను. మకరగిరి సమీపమున మధు భక్షకులయిన కొన్ని కోట్ల మధుపములు నివాసమున్నవి.

దుందుభి నాదములు వినుట తోడనే అవి అన్నియు ఎగిరి సమస్త యాదవ సేనావాహినిని చుట్టుముట్టి కుట్టుట ప్రారంభించినవి. ఆ సమయమున గజములు సహితము ఆ మధుపముల ధాటిని ఓర్వలేక ఛీత్కారములు కావింప మొదలిడినవి. అంత ప్రద్యుమ్నుడు వాయువ్యా స్త్రమును సంధించి విడచెను. ఆ అస్త్ర ప్రభావము చే ఆ మధుపములు అన్నియు దశ దిశలకు విసివేయబడినవి. అటుపిదప వారు "డిండిభ" దేశమున కేగిరి. అచటి ప్రజలు గజముఖులు. ఈ విధముగ అనేక దేశములు కాంచుచూ ప్రద్యుమ్నుడు "తిశృంగ దేశము" న కేగెను. అచటి మనుష్యులు శృంగ ముఖులు (కొమ్ములు గలవారు). త్రిశృంగ గిరి వద్ద "స్వర్ణ చర్చిత" మన నగరము కలదు. అందవి భవనము లన్నియు స్వర్ణ నిర్మితములు. ఆ నగర ప్రాకారము లన్నియు రత్నఖచితము లై యున్నవి. మంగళములకు నిలయము వలె యున్న ఆ నగరము చంద్రకాంతా నదీ తీరమున యున్నది. ఇంద్రుడు అమరావతి యందు ప్రవేశించి నటుల ప్రద్యుమ్నుడు ఆ నగర ప్రవేశము కావించెను. నాగులచే నాగకన్యల చే శోభించు భోగవతీ పురము వలె ఆ నగరమంతయు బంగారు మేనిఛాయ గల స్త్రీ పురుషుల చే నిండియుండెను. ఆ పురమును దేవ సఖుడను బలశాలి అయిన మహారాజు పరిపాలించు చుండెను. ఆతడు నారదుని చే యాదవ సేనావాహిని యొక్క బలపరాక్రమములను వినిన వాడై సువర్ణమయ సామాగ్రిని తీసికొని అత్యంత భక్తి భావము తో ప్రద్యుమ్నుని పూజించెను. అంత మహానుభావుడయిన ప్రద్యుమ్నుడు దేవ సఖుని ఇట్లు ప్రశ్నించెను.

"మహారాజా! మీరందరూ పూర్ణచంద్రుని వలె శోభించుచున్నారు. ఇది ఎట్లు సాధ్యము? నాకు తెలుపవలసినది." దేవసఖుడు "యదూత్తమా! పితరులకు స్వామి అయిన ఆర్యముడు కూర్మరూపధారి అయిన భగవానుడు లక్ష్మీపతి యొక్క చరణారవిందములను ప్రక్షాళన మొనర్చుట చే ఒక దివ్య నది ఆవిర్భవించినది. అది శ్వేత పర్వత శిఖరము నుండి క్రిందకు ప్రవహించుచున్నది."

"ఒకనాటి మాట!! మనువు పుత్రుడయిన ప్రమోదునకు ఆతని గురువు గోరక్షణ కార్యమునిచ్చెను. ఒకనాటి రాత్రి ఆ మనుపుత్రుడు కాపలాకాయుచూ ఒక కపిల గోవును సింహమని భ్రమపడి సంహరించెను. అందుచే వశిష్ఠుడు ఆతనిని శపించగా ప్రమోదునకు శూద్రత్వ మంకురించి కుష్ఠురోగ పీడితుడు అయ్యెను. ఆతడు అప్పటి నుండి అనేక తీర్థములందు స్నాన మాచరించుట మొదలిడెను. కానీ ఈ చంద్రకాంతా నది యందు స్నానమాచరించిన తక్షణమే ఆతడు కుష్ఠురోగ పీడా విముక్తుడయి శరీరమంతయు చంద్రకాంతి యుతుడాయెను."

అప్పటి నుండి మేమందరమూ నియమనిష్ఠలతో ఈ చంద్రకాంతా నది యందు స్నానమాచరించుట ఆరంభించితిమి. అందువలన నే మేమునూ దివ్యకాంతి శరీరుల మైతిమి. ఇందు సందేహము లేదు." అది వినిన ప్రద్యుమ్నుడు యాదవ సహితుడై చంద్రకాంతా నది యందు పవిత్ర స్నానమాచరించి అనేక రకములయిన దానములు సమర్పించెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి హిరణ్మయ వర్షమందు విజయము అను ఇరువది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పదియవ అధ్యాయము

(రమ్యక వర్షమందు కళంక రాక్షసునిపై విజయము, వైశ్రేయస వనము, మానవీ నగరము, మరియు మానవగిరి యొక్క దర్శనము. శ్రాద్ధదేవ మనువు ద్వారా ప్రద్యుమ్న స్తుతి)

నారదుడు "మహారాజా! ఈ ప్రకారముగ హిరణ్మయ వర్షము పై విజయము సాధించి ప్రద్యుమ్నుడు యాదవ సహితుడై దేవలోకము వలె ప్రకాశించు రమ్యక వర్షమున కేగెను. అయ్యది సాక్షాత్ నీలపర్వత సానువుల యందు

నెలకొన్నది. దానికి ఉత్తరమున భయంకర నదీ పురవృతమయిన "భీమవాదినీ" అను నగరము కలదు. అచట రామాయణ కాలము నాటి కాలనేమి పుత్రుడయిన "కళంకుడు" నివసించుచుండెను. ఆతడు త్రేతాయుగమున శ్రీరామ చంద్ర ప్రభువు భయమున పారిపోయి ఇచట నివసించుట. ఆరంభించెను. ఆతడు పదివేలమంది రాక్షసుల సహితుడై యాదవులను నిలువరించుటకు యత్నించెను. కారుమేఘ ఛాయ కలిగి గార్భభారూఢుడై ఆ రాక్షసరాజు యాదవసేనా వాహినికి ఎదురు వచ్చెను. యాదవ దానవుల మధ్య ఘోర యుద్ధము జరిగెను. లక్షణాదేవి యొక్క దశపుత్రులు – **"ప్రఘోషుడు, గాత్రవాన్, సింహ, ప్రబల, ఊర్ధ్వగ, సహ, ఓజ, మహాశక్తి మరియు అపరాజిత"** అనువారలు పరమ కళ్యాణ స్వరూపులు. వారు మెరయుచున్న తీవ్ర నారాచములను ప్రయోగించుచూ ముందునకేగిరి. వాయువు మేఘ మండలమును, ఛిన్నాభిన్నము కావించునట్లు ఈ లక్ష్మణాదేవి యొక్క పుత్రులు శౌర్య ప్రతాపముల చే రాక్షససేన అంతయు అతలాకుతలమయినది. తన సేన అంతయు ఛిద్రమగుట కాంచి రణదుర్మధుడు అయిన కళంకుడు యాదవసేనపై త్రిశూల ముద్గర ప్రయోగము కావించెను. అటుపిదప రాక్షసరాజు రధికులను, కుంజరములను నోటిలో వైచికొని నములుట ప్రారంభించెను. రత్న కంబళులు, బంగారు సంకెలలతో కట్టబడిన కుంజరములను ఆకాశమున కెగుర వేయుట నారంభించెను. అంత శ్రీకృష్ణ పుత్రుడు ప్రఘోషుడు కపీంద్రాస్త్రమును వైచెను. ఆ అస్త్ర ప్రభావము చే సాక్షాత్ హనుమంతుడు ప్రత్యక్షమై సుడిగాలి దూదిపింజను ఎగుర వేయునట్లు ఆ రాక్షసాధమును పట్టి ఆకాశమునందు వంద యోజనములు దూరము విసరివైచెను. అంత ఆంజనేయ ప్రభువును గుర్తించి కళంకుడు ఆ మహాకపి పై లక్ష బారువులు బరువుగల భయంకర గదను ఆయనపై ప్రయోగించెను. ఆంత హనుమంతుడు వేగముగ పైకిఎగరెను. ఆ గద భూమిపై పడెను. మారుతి పళ్ళు పటపట కొరికి వేగముగ ఎగురుచూ కళంకుని తలపై ఒక ముష్ఠి ఘాతమును ప్రహరించెను. ఆ సమయమున కళంకుడు అంజనాసుతుని పై ప్రహరించుటకు ఒక త్రిశులమును తీసికొనెను. కానీ కపీశ్వరుడు వాయువేగమున ఎగిరి ఆ రక్కసుని వీపుపైబడి, ఆతని భుజములు పట్టి భూమిపై పడవైచెను. అంత ధీరమారుతి వైఢూర్య పర్వతమును పెకరించి, తీసికొని వచ్చి ఆ రక్కసుని పై పడవైచను. రక్కసుని అంగము లన్నియు చూర్ణమయినవి. ఆ దుష్ఠుడు పరలోక గతుడాయెను.

ఆ సమయమున యాదవులు జయజయ ధ్వానములు, శంఖనాదములు కావించిరి. ఆ క్షణమునే మహానుభావుడు, శ్రీరామ బంటు, భవిష్యత్ బ్రహ్మ శ్రీ మారుతి అంతర్ధానుడయ్యెను. దేవతలు పుష్పవృష్ఠి కురిపించిరి. అంత ప్రద్యుమ్నుడు తన సేనాసహితుడై మనువు యొక్క మనోహర స్వర్ణనగరమున కేగెను. అచట "వైశ్రేయస" మన వనము గలదు. అయ్యది కల్ప వృక్షములు తోడనూ, కల్పలత తోనూ నిండియుండెను. సంతాన వృక్షపుష్ప సుగంధ భరితమయిన మలయమారుతము ఆ వనమంతయు నిండి యుండెను. కేతకీ, చంపాలతా మరియు పుష్ప పరిసేవితములై యున్న మాధవీలతా సమూహములచే ఆ వనము శోభించుచుండెను. నలుదిశలా ప్రతిధ్వనించుచ్ను విహంగముల కలకలా రావములచే ఆ వనము వైకుంఠమును పోలి యున్నది.

అచట "చారుధి" అను నామధేయముగల పర్వత రాజము శోభించుచున్నది. అది అయిదు వందల యోజనములు ఎత్తు కలది. దాని దిగువ భాగము వంద యోజనముల విస్తారము కలిగి యున్నది. అందు కోకిలలు, నెమళ్ళు, సారస పక్షులు, చిలుకలు, చక్రవాకములు, చకోరములు, హంసలు, వరకోకిలలు, అచట కలకలా రావము గావించుచు ఆ ప్రదేశమును మరింత ఆనంద ప్రదము కావించుచున్నవి. అన్ని ఋతువుల యందునూ పూలను చిగుర్చు వైశ్రేయస వనము నందన వనమును తిరస్కరించు చున్నది. అచ్చటి బాలమృగములు జాతి విద్వేషమును మరచి సింహములతో ఆడుచున్నవి. ముంగిసలు పాములతో సఖ్యముగ యున్నవి. అచట స్వచ్ఛ జలములు కలిగిన పది వేల సరోవరములు కలవు. వాటన్నిటి యందు శతదళ, సహస్రదళ పద్మములు శోభిల్లుచున్నవి. ఆ వనము ఎటు వయిపు చూచిననూ అత్యంత ఆనందమయముగ శోభిల్లు చున్నది.

సర్వజ్ఞడయిన ప్రద్యుమ్నుడు అచటగల నాగరీకులను ఓ! పవిత్ర దేశీయులారా! ఈ నగర మెవ్వరిది! ఈ అద్భుత వనమెవ్వరిది? మాకు తెలియజేయవలసినది." అపుడు ఆ నాగరీకులు "నరేశ్వరా! వైవశ్వత మనువు ఈ సమయమున ఈ రమణీయ మానవ పర్వత మందు మత్స్యావతారుడయిన నారాయణ భగవానుని ఆరాధించుచుండెను. మరియు ఇచ్చట ఎల్లప్పుడూ నివసించు మత్స్య భగవానుని వందన పూర్వకముగ పూజించుచూ కఠోర తపమాచరించుచుండెను.

ఈ నగరము మరియు వనము ఆయనవే!! ఇక్కడి భూమి మరియు పర్వతము సాక్షాత్ వైకుంఠ లోకము నుండి వచ్చినది. మీ రాజులు సూర్యచంద్ర వంశస్తులు అందరూ కూడా వైవస్వత మను సంతతికి చెందిన వారే! సమస్త క్షత్రియ జాతి యొక్క ప్రపితామహుడయిన వైవస్వత మనువు (శ్రాద్ధ దేవుడు) చరిత్రను విని ప్రద్యుమ్నుడు విస్మితుడయ్యెను.

అంత తన సోదర, యాదవ సహితుడై ప్రద్యుమ్నుడు మానవ పర్వతమునకు ఏగి భగవానుడయిన శ్రాద్ధదేవుని దర్శించెను. ఆయన వంద సూర్యుల పగిది వెలుగుచూ నలుదిశలను ప్రకాశింపజేయుచుండెను. ఆ మహాయోగి అయిన రాజేంద్రుడు మిక్కిలి శాంతరూపుడై యుండెను. ఆయన శుక, వ్యాస, వశిష్ఠ, భృహస్పతి ఆదిగా గల మహనీయుల చే శ్రీహరి యొక్క యశోవిశేషములను వినుచుండెను. యాదవ సహితుడై ప్రద్యుమ్నుడు ఆయనకు నమస్కరించి ప్రక్కన వినమ్రుడై నిలుచుండెను. శ్రీహరి ప్రభావము నెరిగిన మనువు ఆయనను భుజములు పట్టి, పైకిలేపి, ఆశీనుని కావించి గద్గదవాణితో ఇట్లనియె "వాసుదేవ, సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధాది రూపములతో ప్రకటమగు భక్తపాలకుడయిన భగవానునికి నమస్కరించుచున్నాను. మహాప్రభో! మీరు అనాది, అంతర్యామి మరియు ఆత్మస్వరూపులు. మీరు ప్రకృతికి పరులయిన కారణమున గుణత్రయమునకు అతీతులు. మహాత్మా! మీరు ప్రకృతిని వశపరుచుకొని గుణముల ద్వారా వ్యక్తమయిన విశ్వము యొక్క సృష్టి, స్థితి, లయ లను కావించుచున్నారు. అందువలన అజ్ఞాన కల్పితమయిన ఈ ప్రపంచమును అన్ని విధములుగ వదిలి నైచి, ఈ ప్రపంచము కేవలము మన: సంకల్పమని తెలిసి మాయకు పరమయిన, నిర్గుణ, అదిపురుషుని, సర్వజ్ఞుని, సర్వమునకు మూలమయిన వానిని, అంతర్యామినీ, సనాతన పరమాత్మ అయిన మిమ్ములను నేను ఆశ్రయము కోరుచున్నాను. ఎవరు విశ్వము నిద్రించిననూ, మెళకువగయుండునో, ఎవరిని జగత్తు యొక్క జనులు తెలియరో, ఎవరు సర్వమునకు పరుడో, సర్వ ద్రష్ఠ లేక ఆది పురుషుడో, ఎవరిని అజ్ఞానులు తెలియజాలరో, అట్టి సర్వదా శుద్ధ బుద్ధ స్వరూపమయిన, పరమాత్మ స్వరూపమయిన మీకు నమస్కారము. ఎట్లు ఆకాశము ఘటముతోనూ, అగ్ని కాష్ఠము తోనూ, వాయువు ధూళి కణముల తోనూ తాదాత్మ్యము చెందదో, అట్లే మీరును సమస్త గుణముల నుండి నిర్లిప్తులు. స్పటికమణి ఇతర రంగుల యొక్క వివిధ రంగులలో కనిపించి నప్పటికీ, స్వస్వరూపత: పరమ ఉజ్వలము యుండును. అట్లే మీరు కూడా విశుద్ధులు. వాక్కు యొక్క వివిధ శక్తులయిన వ్యంజన, లక్షణ, అభివ్యక్తీకరణ, అను వేని ద్వారా కూడా పరమార్ధపథ సంయక్ జ్ఞానమును అభివర్ణింపలేరు లేక ప్రాప్తించలేరు. వేదవాక్యముల వలన కూడా అభివర్ణింప లేని భ్రహ్మము లౌకిక వాక్యముల చే ఎట్లు వ్యక్తపరుపనగును? ఈ పర భ్రహ్మమును మీమాంసకులు 'కర్మ" మనియు, నైయాయికలు "కర్త" అనియు, కొందరు కాలమనియు, మరికొందరు యోగమనియు, కొందరు "విచార" మని, వేదాంతవేత్తలు భ్రహ్మమనియు, పేర్కొందురు. ఎవరిని ఈ లోకము నందు, కాల, గుణ, జ్ఞానేంద్రియ, కర్మేంద్రియ, చిత్త, మనో, బుద్ధి, అహంకార మహత్తత్వములు చేరజాలవో, వేదము కూడా ఎవరిని వర్ణనము చేయజాలదో, ఆ మహా చైతన్య శక్తియే పరబ్రహ్మమని చెప్పబడును. ఎట్లు అగ్ని కణములు తిరిగి అగ్ని యందు ప్రవేశించునో, అట్లే సర్వతత్వములు ఆ పరభ్రహ్మము నందే ప్రవేశించును. సత్పురుషులు దేనిని హిరణ్యగర్భము, పరమాత్వతత్వము, మరియు వాసుదేవుడని తెలుపుదురో ఆ పరబ్రహ్మ స్వరూపమే పురుషోత్తమోత్తములయిన మీరు".

"ఈ విషయము తెలిసే నేను ఈ సంసారము నందు అసంగభావుడనై సంచరించుచున్నాను." మనువు యొక్క ఈ సుమధుర వాక్కులు విని ప్రద్యుమ్న భగవానుడు మృదు మందహాసము గావించుచూ గంభీరవాణితో ఆతనిని మోహింప జేయుచూ ఇట్లనియె "మహారాజా! మీరు మా క్షత్రియులందరికీ ఆదిరాజు, పితామహులు, వృద్ధులు, శ్లాఘనీయులు మరియు ధర్మ ధురంధరులు. మేము సర్వదా మీచే పాలింపబడు వారము, మీ ప్రజలము. మీరు కావించుచున్న దివ్య తపము చే జగత్తుకు సుఖము లభించును. మీ వంటి సాధు పురుషులు సాక్షాత్ శ్రీహరి స్వరూపులు. కేవలము సాధుపురుషులు మాత్రమే మనసు నందున్న అంధకారమును పటాపంచలు గావించును; సూర్యుడు కాదు." ఈ విధముగ పలికి వైవశ్వత మనువుకు ప్రణామము లాచరించి, పరిక్రమ కావించి ప్రద్యుమ్నుడు ఆయన ఎదుట కూర్చుండెను.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి మానవ దేశముపై విజయమను ముప్పదియవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఒకటవ అధ్యాయము

(రమ్యక వర్షమందు మన్మధ శాలినీ పురమందు జనులచే శ్రీకృష్ణగానము. వ్యతి సంవత్సర ప్రజాపతి ద్వారా ప్రద్యుమ్నుడు పుజింపబడుట; కామవనము నందు ప్రద్యుమ్ననకు తన కామదేవ రూపమందు విలీనము)

మహారాజా! ఈ విధముగ రమ్యక వర్షమందు విజయము నంది ప్రద్యుమ్నుడు సుమేరు పర్వత పూర్వ భాగమయిన "కేతుమాల" వర్షము నకు చనెను. ఆ దేశము మాల్యవాన్ పర్వత శ్రేణుల వద్ద కలదు. ఈ పర్వతముల నుండే నాలుగు మహా పాతక నాశినులైన గంగా ప్రవాహములు ప్రవహించు చుండెను. ఆ మాల్యవాన్ పర్వతపు నికటము నందు మన్మధశాలిని అను పురము కలదు. అందలి రత్నమయ భవనములు, తోరణములు దేవతా రాజధాని అయిన అమరావతిని తలపించు చుండును. ఆ దేశము నందలి పురుషులందరూ కామదేవుని వంటి సౌందర్య స్వరూపులు. వారి అంగకాంతి శరదృతువు నందలి ప్రఫుల్ల నీలికమలముల వలె భాసించుచూ, నేత్రములు వికసిత కమల దళములను ధిక్కరించు చుండును. అందలి కన్యకామణులు పీతాంబర ధారిణులై, పుష్పహారములు ధరించి కందుక క్రీడలాడుచుందురు. వారిని స్పర్శించి ప్రసరించిన మలయమారుతము తుమ్మదల ఘుంకారము వలె ధ్వని కావించుచూ వంద యోజనముల విస్తారములు సుగంధ భరితము గావించుచుండును.

ఆ నగరవాసులు, బహుశృతులు, ప్రద్యుమ్నుని రాకను గుర్చి విని, నగరము వెలుపలికి వచ్చి ప్రద్యుమ్నాదులు వినుచుండగా ముకుందుని యశోగానమును ఆలపించుట నారంభించిరి. వారు కేతుమాల వాసులు "ప్రధాన పురుషేశ్వరుడు, ఆదిదేవుడు, శేషశయనుడు, దేవతలు ప్రార్ధన చే భూతల భార హరణమునకు ఆవిర్భవించిన భగవానునకు నమస్కారము. ఆయన పుట్టిన పిదప మాతా పితరులకు బంధవిముక్తి గావించెను. శిశు రూపమున నంద భవనమున కేగెను. పరమ దయామయి నందపత్ని అత్యంత ప్రేమతో ఆయన లాలన, పాలన కావించెను. అనంత మంగళములతో శోభించు ఆ పరమాత్ముడు తనను చంపవచ్చిన పూతనను సంహరించెను. నిద్ర నటించుచూ శకటమును ముక్కలు చేసి తృణావర్తుని వీపునెక్కి పరిమార్చెను. తల్లికి విశ్వరూపమును చూపించెను. గర్గాచార్యునిచే ఆయనకు నామకరణము కావింపబడి ఆయన యొక్క సుందర సౌభాగ్యలక్ష్మీ లక్షణములను వర్ణింపబడెను. వ్రజవాసులు ఆయనను మిక్కిలి ప్రేమించగా వెన్న దొంగతనము మొదలగు బాల్యక్రీడలాడెను. పెరుగు కుండలకు కన్నము పెట్టి పెరుగు త్రాగెను. మాత యశోద క్రోధురాలై రోటికి బంధించగా ఆ రోటిని లాగి యమళార్జున వృక్షములను విరచెను. గోపబాలురతో తిరుగుచూ కపిత్థ వృక్షములతో ప్రహరించి వత్సాసురుని సంహరించి, పిదప బకుని చంపుటములు పట్టి చీల్చి పరిమార్చెను.

వనమందు వేణుగానము చేయుచూ గోపబాలసహితుడై అఘాసురుని ముఖము జొచ్చి, వానిని చంపి, గోవుల, గోపబాలకుల రక్షించెను. గోపబాలకులను బ్రహ్మదేవుడు అపహరించినపుడు సమస్త గోవులు, గోపబాలుర రూపములు ధరించి సమస్త కార్యములను నిరాటంకముగ సలిపిన భగవానుడు శ్రీకృష్ణుడు కేవలము మనందరి శరీరములందున్న క్షేత్రజ్ఞుడు, లేక ఆత్మరూపుడే! ఆయనే అనంతుడు, పూర్ణుడు, ప్రకృతి పురుషులకు అధీశుడు, ఈశ్వరుడు, క్షరాక్షరములకు అతీతుడు, ఆదిదేవుడు శ్రీకృష్ణ భగవానుడు. జన్మలేని ఆ మహానుభావుడు గోవుల గోపబాలకుల రూపమున వ్రజమందు అన్నివైపులా సంచరించెను. ఆయన బలవంతుడయిన ధేనుకుని తాళవృక్ష వనమందు పరిమార్చి, కాళింది నదము నందు దూకి కాళియుని మదమడచి, ఆ పడగలపై నృత్యమెనర్చి బయల్వెడలెను. దావాలనమును త్రాగెను. బలిష్ఠుడయిన ప్రలంబుని బలదేవుని ముష్టి ఘాతములచే పరలోకమునకు పంపించెను. మధుర వేణు నాదము చే గోప వధువులను యమునా తటికి ఆకర్షించి వారినోట తన యశోగానమును వినెను. యమునా సరితయందు నగ్నముగ స్నానమాడు గోప వనితల దుకూలములు అపహరించెను. వనమున బ్రాహ్మణ పత్నులచే నొసగబడిన ప్రసాదమును గోపబాలుర సహితుడై స్వీకరించెను. ఇంద్ర పూజను ఆపించి, గోవర్ధన పూజనమొనర్చి, ఆగ్రహించిన పర్జన్య దేవుని యొక్క వర్ష ప్రభావము చే పీడితులయిన గోపగోపీ జన సముదాయమును, గోవులను గొడుగు వలె గోవర్ధన పర్వతమెత్తి సంరక్షించెను.

మదగజము లేత పద్మమును పెకలించునట్లు గోవర్ధనము ను ధరించిన శ్రీకృష్ణ భగవానుని శచీపతి స్థుతించెను. వరుణ లోకమునకేగి తన తండ్రి అయిన నందుని సురక్షితముగ తీసికొని వచ్చెను. స్వజనుల కోరికపై అంధకారమునకు అవతల యున్న గోలోకము యొక్క దర్శనము కావించెను. రాసమండలి యందు వ్రజ సుందరీమణులు తమ రూప, యవ్వన, సౌందర్యముల యందు అతిశయము గలిగినపుడు వారి మదమణచుటకై వారి నుండి అంతర్ధానుడయ్యెను. ఆయన పునర్దర్శనమునకై వ్యాకుల చిత్తులై వారు ఆయన యశోగానము నాలపించినపుడు పుష్పహార శోభితుడై తిరిగి వారి మధ్య ప్రత్యక్షమయ్యెను. విష్ణువు తన విభూతులతో క్రీడించునట్లు శ్రీకృష్ణుడు వ్రజభూమి యందు శబర రాజకన్యలతో క్రీడించెను. రాస మండలము నందు మదన మోహనుడు కిరీట కుండల కంకణ ధారియై భాసించుచూ రాసక్రీడ సలుపునపుడు దేవతలు సహితము ఆయనను స్థుతించిరి. భగవానుడు అంబికా వనమందు అజగర పీడితుడయిన నందరాజును రక్షించి ఆ మహా సర్పమునకు మోక్షమిచ్చెను. శంఖచూడుని నుండి ఆతని మణిని గ్రహించెను. వృషభరూపధారి అయిన అరిష్ఠుడు, గోపకులను భయపెట్టినపుడు, ముకుందుడు ఆ మహా వృషభము యొక్క శృంగములను విరచి, ఒక్కదెబ్బతో ఆ దానవుని ధరాశయనుని కావించెను. కంసుడు శ్రీకృష్ణుని గూర్చి విని భయము నొంది కేశి అను ప్రచండ పరాక్రముడు, అద్భుత బలశాలి అయిన రక్కసుని పంపెను. ఆతడు కాలమేఘము వంటి శరీరకాంతి కలిగి చూపరులకు గగుర్పాటు కలిగించుచుండెను.

బలానుజుడు ఆ రక్కసుని పట్టి ఒకసారి వదలివైచెను. కానీ వక్రబుద్ధి మారునా! ఆ మాయావి మహా వేగముగ ముందుకు కదలి రాగా, ముకుందుడు తన ముష్ఠిని వాని ముఖమునందు జొనిపి మారణకాండ కావించెను. నారద భగవానుడు, సహితము శ్రీహరి యొక్క సౌభాగ్యలక్ష్మిని వివిధరీతుల వర్ణించెను. పరమాత్ముడయిన శ్రీహరి వ్యోమాసురుని ప్రాణహీనుని కావించెను. అక్రూరుడు ఆ ఆదిదేవుని మహైశ్వర్యమును వర్ణించెను. తన హితకారి స్వఫల్క పుత్రుడయిన అక్రూరునకు జలాంతరమున దివ్యరూప సందర్శనము కావించెను. తదుపరి మధురా పురము యొక్క ఉపవనము చేరి, బలరామ గోపబాల సహితుడై మధురాపురి సందర్శనము చేసెను. స్వచ్ఛందముగ మధుర యందు తిరుగుచు కటువాక్యములు పలికిన రజకుని సంహరించి, తన భక్తుడయిన దర్జీకి వరములిచ్చి, పూలమాల లొసగిన సుదామునిపై కృపాకటాక్షము నొసంగి, కుబ్జను సుందరీమణిగా మార్చి, కంసుని యజ్ఞశాల యందు ధనుర్భంగము కావించి, రంగశాల ద్వారము నందు కువలయాపీడనమును సంహరించి, చాణూర ముష్ఠికాది క్రూర మల్లులను పరిమార్చి, కంసుని పట్టి, క్రిందపడవైచి, హతమొనర్చి, తన మాతా పితరులను కారాగార విముక్తుల గావించి ఉగ్రసేనుని మధురా నరేశునిగా తిరిగి పట్టాభిషేకమొనర్చెను. తదుపరి నందునికి ప్రసన్నమెనర్చి, గోపబాలరను అనేక ధనముల చే తృప్తి యొనర్చి, వారిని తిరిగి వ్రజభూమికి పంపెను.

బలరామ సహితుడై సాందీపని మహర్షి యొక్క గురుకులమందు విద్యాభ్యాసమొనర్చి, సముద్రమున ప్రవేశించి, పంచజన దానవుని పరిమార్చి, పాంచజన్యమును పరిగ్రహించి, మరణించిన గురుపుత్రుని యమలోకము నుండి తిరిగి తీసికొని వచ్చి గురుదక్షిణగా బహూకరించెను. ఉద్ధవుని గోప పురమయిన నంద వ్రజమునకు పంపి గోపాంగనలను అనుగ్రహించెను. అక్రూరుని హస్తినకు పంపి పాండవులను ఆశ్వాశించెను. పిదప జరాసంధుని పరాజితుని కావించి, ముచికుందుని ద్వారా కాలయవనుని భస్మీ భూతుని గావించి, పిదప తామందరూ సుఖముగ నివసించుటకు ద్వారకాపురి నిర్మాణము కావించి, కుండిన పురమునకు ఏగి, భీష్మక పుత్రిక అయిన రుక్మిణీ దేవిని అపహరించి పరిణయమాడెను. ఆమె పుత్రుని ద్వారా శంబరుని సంహరింప జేసి, ఋక్షరాజు జాంబవంతుని ఓడించి, జాంబవతిని వివాహమాడి, ఆతని వద్ద గ్రహించిన మణిని సత్రాజిత్ కు ప్రసాదించి సత్యభామా దేవిని సతిగా పరిగ్రహించెను. తన మామగారిని హత్య గావించిన శతధన్వుని శిరసుఖండించి, సూర్యసుత అయిన కాళిందిని పరిణయమాడి, కోసల రాజ తనయ అయిన నాగ్నజాతి (సత్య)ను, వర పరీక్ష యందు పెట్టబడిన ఏడు వృషభములను ఓడించి, పరగ్రహించి పరిణయమాడెను. తదుపరి కేకేయ రాజతనయ భద్రను హరించి, మద్ర రాజ పుత్రిక అయిన లక్షణను స్వయంవరమందు జయించి సమస్త శస్త్రాస్త్ర కోవిదుడయిన నరకాసురుని పరాజితుని గావించి, సంహరించి, ఆతనిచే కొనిరాబడిన పదహారు వేల మంది రాచ కన్నియలను వివాహమాడెను. సత్యభామా దేవి కోరిక మీదట స్వర్గమున కేగి ఇంద్రుని పరాజితుని గావించి

పారిజాత వృక్షమును, సుధర్మ సభను స్వర్గము నుండి ధరకు రావించెను. ద్యూత క్రీడ యందు దుష్టుడయిన రుక్మిని బలరాముని ద్వారా హత మొనర్చెను. బాణాసురుని వేయి చేతులు ఖండించి, ఉగ్రసేనుని రాజసూయమును కేవలముగ నిమిత్తము చేసికొని సంపూర్ణ జగత్తుయందు దుష్ట సంహారము కావించుటకై తన సుపుత్రుని ప్రద్యుమ్నుని పంపెను. ధరాతిపతులందరి దనుమణచి, కేతుమాలా పతిపై విజయము సాధించుటకు ఇచట కేతెంచిన ప్రద్యుమ్న భగవానునకు మానమస్కారము!!!

ఈ సుందర యశోగానమును విని పులకించి ముకుంద నందనుడు వారికి కనక కిరీట, కుండల, కేయూర, రత్న, మౌక్తిక, కుంజర, హయములను బహూకరించి సత్కరించెను. అంత మన్మథశాలినీ పురాధీశుడు సంవత్సర ప్రజాపతి ప్రద్యుమ్ననకు నమస్కరించి బహుమతులొసంగెను. తదనంతరము మహాబాహువు అయిన ప్రద్యుమ్నుడు అన్య సామాన్య నరులకు ఆగోచరమగు "కామ వనము" ప్రవేశించెను. అందు లోనికి కేవలము ప్రజాపతుల పుత్రికలు తమ సఖులతో మాత్రమే ప్రవేశించెదరు. ఆ సుందర వనము సాక్షాత్ కామదేవుని క్రీడాస్థలము. అయ్యది నలువైపులా కామాస్త్రముచే పరిరక్షింపబడు చుండెను. ఆ సమయమున చెరకువిల్లు, పంచపుష్పసాయకములు ధరించి కామదేవుడు కామవనమున బయలుదేరెను. ఆయన శ్యామవర్ణ శరీరముపై పీతాంబరము శోభించుచున్నది. ఆయన రూపము అత్యంత మనోహరముగ యుండి, ఆయన నారిధ్వని అన్ని వైపులా ఘోషించుచున్నది. ఆయన యొక్క పుష్ప బాణముల సోకి యాదవ వీరలు, సైనికుల, గజ, హయములు కామ మోహితులై పడిపోయినవి. ఆయన బాణముల శక్తి ఇంతింతని వర్ణింప నశక్యము. ఆ సమయమున జగదీశ్వరులకు సహితము ఈశ్వరుడైన ప్రద్యుమ్నుడు ఆ కామదేవుని యందు విలీనమయ్యెను. అంత సైనిక సహితులైన యాదవ యోధులందరూ ప్రద్యుమ్నుని కామదేవుని మన్మథుని అవతారమని తెలిసికొని విస్మితులైరి.

(శ్రీ గర్గ సంహిత యందలి విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి మన్మధ దేశ విజయమను ముప్పది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ముప్పది రెండవ అధ్యాయము

(భద్రాశ్వ వర్షమందు ప్రద్యుమ్నుడు పూజింపబడి స్తుతింపబడుట; యాదవ సేనలు చంద్రావతీ పురము పై దండెత్తుట. శ్రీకృష్ణ నందనుడయిన వృకుని ద్వారా హిరణ్యాక్ష పుత్రుడయిని హృష్టుని వధ)

నారదుడు "మహారాజా! ఇట్లు కేతుమాలా వర్షముపై విజయము సాధించి యోగసమృద్ధి కలిగిన భద్రాశ్వ వర్షము పైకి ప్రద్యుమ్నుడు దండెత్తెను. ఆ నగరము గంధమాదన పర్వత సానువుల సమీపమున యున్నది. అచట పాప నాశిని అయిన గంగ "సీత" యను పేర ప్రవహించుచున్నది. ఈ నదీ తీరమున "వేద క్షేత్రము" అను పరమ పవిత్ర తీర్థము కలదు. అందు మహానుభావుడయిన "హయగ్రీవుడు" నివాసముండును. అచట ఆయనకు ధర్మ పుత్రుడయిన భద్రాశ్వుడు నిరంతరము సేవలు చేయుచుండును. ఆ సీతాగంగ తీరము నందు విశాల స్థలముపై యాదవ సేన రకరకముల రంగులు కలిగిన శిబిరములు వైచుకొని విశ్రాంతి నొందిరి. ధర్మ పుత్రుడయిన భద్రాశ్వుడు ప్రద్యుమ్నుడు ఏతెంచెనన్న వార్తవిని, భక్తితో వచ్చి ఆయనకు ప్రదక్షిణ ప్రమాణము లాచరించి, బహుమతులు సమర్పించి ఇట్లు స్తుతించెను.

"మహాప్రభూ! మీరు సంపూర్ణ భగవత్స్వరూపులు. కేవలము సాధు సంరక్షణకై ఈ దిగ్విజయ యాత్ర కావించుచుండిరి. భగవాన్! పూర్వకాలమందు మీరు శంబరాసురుని సంహరించిరి. ఆతని కనిష్ఠ సోదరుడు ఉత్కుచుడు గోకులమున ప్రవేశించి నపుడు శ్రీకృష్ణ భగవానుడు వానిని పరిమార్చెను. కానీ ఆతని గరిష్ఠ సోదరుడు శకుని జీవించి ఏ యున్నాడు. అతడు కడు దుష్టుడు. దేవా! మీరే ఆతనిని పరిమార్చవలసినది. ఎందుకనగా వేరొకరు ఆతనిని తాకను కూడా తాకలేరు."

అంత ప్రద్యుమ్నుడు "ధర్మనందనా! ఈ దైత్యరాజు శకుని ఏ వంశజుడు? ఆతని నివాసమెక్కడ? ఆతని బల పరాక్రమములు ఎట్టివి? నాకు తెలుపవలసినది." భద్రాశ్వుడు "భగవాన్! కశ్యప ప్రజాపతి యొక్క పత్ని "దితి" ద్వారా ఇరువురు ఆది దైత్యులు ఉద్భవించిరి. వారి యందు గరిష్ఠుడు హిరణ్యకశిపుడు. కనిష్ఠుడు హిరణ్యాక్షుడు. ఆ హిరణ్యాక్షునకు తొమ్మిది మంది పుత్రులు కలిగిరి. వారు వరుసగా శకుని, శంబరుడు, హృష్ఠుడు, భూత సంతాపనుడు, వృకుడు, కాలనాభుడు, మహానాభుడు, హరిమశ్రుడు, మరియు ఉత్కచుడు. దేవకూటమునకు దక్షిణ దిశయందు జఠరగిరి సానువులందు చంద్రావతీ నగరము కలదు. ఆ పురము దైత్య దుర్గములచే శుశోభితమై యుండును. అచట తన ఆరుగురు సహోదరులచే పరివేష్టితుడై శకుని నివసించుచుండును. యదూత్తమా! ఎప్పుడెప్పుడు ఋషులు యజ్ఞముల నారంభించదరో అప్పుడప్పుడు ఆ దుష్ఠదైత్యులేతెంచి యజ్ఞ భంగ మొనర్చెదరు. ఓ! భక్తజన పాలకా! ఇంద్రాది దేవతలు సహితము ఆ దైత్యుని చూచి వెరచెదరు. ఈ దేవద్రోహి అయిన శకుని మీచే గెలువ యోగ్యుడు. ఎందుకనగా మీరు భక్త జనులకు శాంతిని ప్రసాదించుటకై జగద్విజయము కావించుచున్నారు. చతుర్వ్యూహ స్వరూపా! ప్రద్యుమ్న భగవానుడా! గో, బ్రాహ్మణ, దేవతా, సత్పురుషులను, వేదములను పరిరక్షించు మహానుభావా! మీకు పదే పదే నమస్కారము!!" ఈ విధముగ ప్రార్థించిన భద్రాశ్వుని చూచి ప్రద్యుమ్నుడు "భయము వలదు" అని అభయము ఒసంగి చంద్రావతీ నగరము వైపు దిగ్విజయము కొనసాగించెను.

శకుని నారదుని ద్వారా యదుకుల తిలకుడయిన ప్రద్యుమ్నుడు తనను సంహరించుటకు వచ్చుచున్నాడన్న వార్తవిని, దైత్య సభ కావించి, అందు శూలము నెత్తి ఇట్లనియె "ఈ రోజు శుభదినము. నేడు నేను మనకు శుభకరమయిన, అతి ప్రసన్న కరమయిన వార్త వింటిని. మన శత్రువయిన ప్రద్యుమ్నుడు తనకు తానుగా ఇచటకు ఏతెంచుచున్నాడు. నాకు భాతృఋణము తీర్చుకొను అవకాశము వచ్చుచున్నది. ఇంతకు పూర్వము ఈ ప్రద్యుమ్నుడు నా సోదరుడయిన శంబరుని హతమార్చెను. ఆ అపరాధ కారణమున నేను యాదవ సహితుడైన ప్రద్యుమ్నుని సంహరించెదను. అసురులారా! మీరందరూ అతని సేనను సంపూర్తిగా పరిమార్చి వలసినది. నేను మొదట ఇతనిని తదుపరి దేవరాజయిన ఇంద్రుని, దేవతలను సంహరించెదను."

శకుని యొక్క పలుకులు వినినంతనే ప్రేరితుడై "హృష్ఠుడు" ఒక కోటి దైత్య సైన్యమును తీసికొని యాదవ సేనకు ఎదురుగ నిలచెను. లీలా మాత్రముగ శరీరధారణ చేసిన ప్రద్యుమ్న భగవానుడు తన సేనను గృధ్ర వ్యూహముగ నిలిపెను. ఆ మహా గృధ్రమునకు చంపుటముల (ముక్కు) స్థానమున దనుర్ధర శిరోమణి అయిన అనిరుద్ధుడు, కంఠభాగమున అర్జునుడు, పృష్ఠ భాగమున జాంబవతీ తనయుడు సాంబుడు, నిలబడి తమ సేనలను పరిరక్షించుచుండిరి. రెండు పాదముల వద్ద దీప్తిమానుడు, గదుడు నిలబడగా ఉదర భాగమున పార్ష్ణిఉడు, పృశ్చ భాగమున భానుడు, సేనా రక్షణమున నిమగ్నమయిరి. ఆ సీతా గంగ తటమున యాదవ దానవ పక్షముల మధ్య పోరాటము రెండు సముద్రములు ఒకదానితో మరొకటి ఢీ కొట్టినట్లున్నది. కారు మేఘములు జలధారలు వర్షించునట్లు దానవులు యాదవ సేనపై బాణములు, త్రిశూలములు, ముసలములు, ముద్గరములు, తోమరములు, ఋష్ఠి ఆయుధములు వర్షము వలె కరిపించిరి. సేనా వాహిని యొక్క పాద ఘట్టనములచే పైకి లేచిన ధూళి సూర్యమండలమును కప్పివైచి, ఆ ప్రదేశమునంతయు ఆంధకార మొనర్చినది. ఎవరికినీ తమపై పడుచున్న బాణములు కానపట్టుటలేదు.

మిత్రవిందా సుతులు– **"వృక, వర్ష, అనిల, గృధ్ర, వర్ధన, ఉన్నాద, మహేశ, పాదన్, వహ్ని, క్షుది"** అను పదిమంది, దానవులతో సమరమునకు ముందుకు దూకిరి. బాణ పరంపరల చే అంధకారము ప్రబలినపుడు శ్రీకృష్ణ సుతుడు వృకుడు మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ దైత్య వాహిని యందలి రథ, గజ, హయ సమూహములను సంపూర్ణముగ ధరాశయనముల కావించెను. అనేక పదాతుల కవచ, ధనువుల తో పాటు తనువులను ఖండించుట చే వారందరూ సమరాంగణము నందు భూకాంత కౌగిలి యందు ఒదిగిరి. వృకుని బాణములచే కాళ్ళుతెగిన యోధులు సుడిగాలి చే విరువబడిన వృక్షసమూహములవలె యుండిరి. భుజములు నరుకబడిన సైనికులు అటునిటు పడి వంటగది యందలి గృహోపకరణముల వలె యుండిరి. బాణ ఘాతములచే గాయపడిన కుంజరములు ముక్కలు గావింపబడిన కూష్మాండముల వలె దీపించుచుండినవి. ఆ సమయమున మహా బలశాలి అయిన హృష్ఠుడు సింహారూఢుడై ముందుకు వచ్చి పది తీవ్ర నాచారములతో వృకుని కవచము పగులగొట్టి, వింటి నారిని ఖండించెను. పిదప నాలుగు బాణముల చే

రథ హయములను, రెండు బాణములతో సారథిని, మూడు బాణములచే ధ్వజమును పడగొట్టెను. పిదప ఇరువది బాణములతో వృకుని రథమును నష్టపరిచెను. అంత వృకుడు తన సర్వమును కొల్పోవుట గాంచి, వేరొక రథము నెక్కి రోషపరవశుడై వేరొక ధనువుకు స్వీకరించెను. అసురుడు ఆ ధనువును సహితము ఖండించెను. అంత యాదవ పుంగవుడు ఒక భారీ గదను తీసికొని, రక్కసుడెక్కిన సింహపు ముఖమును, ఉదరమును ప్రహరించి, రక్కసుని సహితము బలముగ ప్రహరించెను. అంత సింహము క్రోధోద్రిక్తయై సమరాంగణము నందు ఎగిరి గంతులు వేయుచూ, తన నఖ ,దంత, పంజాలచే అనేక మందిని చీల్చుచూ ముందుకు పోయెను. ఆ సమయమున అద్దాని జూలు మెరయుచూ, నాలుక భయంకరముగ లోనికి బయటకు కదులు చుండెను. ఆ పంచాస్యము మహాగర్జన కావించి కుంజరము కదళీతరువు పడద్రోయునట్లు వృకుని పుడమి పై పడవైచెను. అంత వృకుడు తిరిగి లేచి ఆ సింహమును తన రెండు చేతులతో క్రింద పడవేసెను. అంత వృకుడా భయంకర మృగము నధిరోహించి ఒక మల్లుడు వేరొక మల్లుని బంధించినటుల భయంకర గర్జన కావించెను. ఆ పంచాస్యము తిరిగి లంఘించిపైన పడుటకు ప్రయత్నించగా, మిత్రవిందా తనయుడు దానిపై తన బలమయిన ముష్టి ఘాతము ను ప్రయోగించెను. దానిచే ఆ సింహము యొక్క మర్మ స్థానములు కదిలి చతికిలపడెను.

అది కాంచిన హృష్ఠుడు కుపితుడై వృకుని పై తన త్రిశూలమును విసరెను. ఆ త్రిశూలము ఒక ఉల్క వలె వృకుని వైపు వచ్చుచుండగా వృకుడు తన కరవాలము చే ఆ త్రిశూలమును గరుడుడు సర్పమును ఖండించుట్లు, ముక్కలు ముక్కలు గ ఖండించెను. హృష్ఠుడు తన కరవాలము హస్తము నందు ధరించి, గర్జన చేయుచూ తన పద ఘట్టనచే భూమి కంపించుచుండగా ఆ కరవాలము తో వృకుని శిరమును ప్రహరించెను.

మహాబలి అయిన వృకుడు తన ఒర ద్వారా ఆ కరవాల ప్రహారము నాపి, తన చంద్రహాసము చే వృష్ఠని కంఠముపై ప్రహరించెను. ఆ ప్రహారము చే హృష్ఠని శిరము నేలపై బడెను. కిరీట కుండల సహితమయిన హృష్ఠని మస్తకము నేలను బడి క్రిందపడిన కమండలము వలె శోభించెను. హృష్ఠని మరణము చే వెరపునందిన మిగిలిన దైత్య వీరులు పలాయన మొనర్చి చంద్రావతీ నగరము లోనికేగిరి. ఈ సమయమున దేవతలు దుందుభులు మ్రోగించి, పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహులాశ్వ సంవాదము నందలి హృష్ఠ దైత్యుని వధ అను ముప్పది రెండవ అధ్యాయము సమాప్తము)

ముప్పది మూడవ అధ్యాయము

(సంగ్రామజిత్ చేతిలో భూత సంతాపుని వధ)

నారదుడు "మహారాజా! హృష్ఠుడు మరణించెనన్న వార్తవినిన శకుని ఆగ్రహమునకు అవధులు లేవు. ఆతడు దేవతలు సహితము గజగజ వణకు సోదరులను సమరాంగణమున కంపెను. భూత సంతాపుడు మహాగజము పైననూ, వృక దైత్యుడు గాడిద పైననూ, కాలనాభుడు వరాహము పైననూ, మహానాభుడు ఉన్మత్తమయిన ఒంటిపైననూ, హరిశమశ్రుడు తిమింగళము పైననూ అధిరోహించి యుద్ధ భూమికి వెడలిరి. మయాసురడు నిర్మించిన ఒక విజయ శీలమయిన రథము కలదు. ఆ రథముపై వైజయంతీ పతాకము ఎగురుచున్నది. అందువలననే అయ్యది వైజయంతీ లేక జైత్ర రథమని పేరునొందినది. అది అయిదు యోజనముల విస్తారము కలిగి వేయి హయముల చే లాగబడునది. ఆ మాయా మయమయిన రథము ఇచ్ఛానుసారము పోగల శక్తి కలది. వందలాది పతాకములచే శోభించునది. అయ్యది ఒక వేయి కలశములతో నిండి, రత్నమయ ఆభూషణముల తోనూ, ముత్యాల పరదాల తోనూ, మెరయుచు, వంద నిండు పున్నమి జాబిలి వెలుగులతో నిండియున్నది. శకుని ఆ దివ్య రథ మధిరోహించి, అందరి వెనుక యుద్ధ కాంక్షితుడై నగరము వెలుపలికి వచ్చెను.

వారి వెనుక పన్నెండు అక్షౌహిణీల సేన కలదు. యోధుల ధనుష్టంకారములు, వీరుల సింహనాదములు, హయముల సకిలింపులు, రథముల గణగణలు, గజముల ఘీంకారములతో భూనభోంతరాళములు నిండి ప్రతిధ్వనించుచున్నవి. అనేక పర్వతములు ధరాశయనమయినవి. సముద్రములు చెలియలి కట్టదాటి, నగరములను ముంచెత్తినవి. దేవతలు అమరావతీ పురమునకు తలుపులు మూసి దిట్టమయిన గొళ్ళెములు బిగించిరి. ఆ భీషణ సేనా వాహినిని అవలోకించిన శ్రేష్ఠ ధనుర్ధరుడు ప్రద్యుమ్నుడు ఇట్లనియె "భూతల మందు ఈ శరీరము పాంచ భౌతికము. బుడగ వలె క్షణ భంగురము. కర్మ, మరియు గుణములచే దీని నిర్మాణమయినది. ఇయ్యది పూర్తిగా కాలాధీనము. ఈ జగత్తు బాలకులాడు క్రీడా సదృశము. విద్వాంసులు దీని ఎడ అస్సలు శోకించరు. సాత్విక పురుషులు ఊర్ధ్వ లోకముల కేగుదురు. రాజస పురుషులు మధ్య లోకములందు, తామసిక జనులు అధోలోకముల పడిపోయెదరు. ఈ విధముగ జనులందరూ జనన మరణ చక్రమందు చిక్కుకొని నానా యోనులందు పడి పుట్టుచు చచ్చుచునుందురు. అందువలన ఈ లోకము మిక్కిలి భయగ్రస్థమయినది. కళ్ళు తిరుగుట చే ఎట్లు భూమండలము తిరుగుచున్నట్లు కనిపించునో, అట్లే మన: కల్పిత మయిన ఈ జగత్తు భ్రాంతి నొందించును.

"దర్పణము నందు తమ ప్రతిబింబమును గాంచి బాలురు ఎట్లు ముగ్ధులగుదురో, అట్లే ఈ ప్రపంచము సర్వము భ్రాంతి పూర్ణము. ఎట్లు భ్రమణము కావించుచున్న వ్యక్తుల సుఖము అస్థిరమో, అట్లే పాతాళవాసుల సుఖము సహితము స్థిరము కాదు. యజ్ఞముల ద్వారా ఉత్పన్నమయిన సుఖము సహితము కొన్ని నాళ్ళు మాత్రమే! శ్రేష్ఠ పురుషులు వీటన్నిటినీ దృష్ఠి యందుంచుకొని, సాంసారిక సుఖమును గడ్డిపోచవలె తలచి సమస్తమును త్యజించెదరు. ఋతువుల యొక్క గుణములు, దేహము యొక్క గుణ స్వభావములు మారుచునే యుండును. ఇచట దృష్ఠి గోచరమగు వస్తువులన్నియు సత్యములు కావు. యాత్ర యందు వివిధ బాటసారుల సమాగమము జరిగి, తిరిగి ఎవరి గమ్యమునకు వారు వెడలి పోయెదరు. అట్లే మనమందరమూ ఈ భూమిపై తిరుగుచున్న బాటసారులము. ఈ లోకము నందలి వస్తువులు ఎట్లు ఉల్కలవలె మెరసి మాయమగునో, పారలౌకిక వస్తువులు సహితము అట్లే యని తలచవలెను. ఈ రెండిటి వలన ప్రయోజన మేమున్నది? సర్వత్ర పరమేశ్వరుడయిన శ్రీహరిని చూచుచూ, పరమ కళ్యాణ మార్గమును నిశ్చయము కావించుకొని దాని యందు ప్రయాణింపవలెను. అనేక జలపాత్రల సమూహము నందు ఒకే చంద్రుడు ఎట్లు ప్రతిబింబించునో, సమిధల సముదాయము నందు ఒకే అగ్ని ఎట్లు నిండియుండునో, అట్లే ఒకే పరమాత్మ దేహధారులందరి లోపల, వెలుపల, వెలుగొందు చున్నాడు. జ్ఞాన నిష్ఠుడయిన మానవుడు అత్యంత వైరాగ్య సంపన్నుడై, కృష్ణభక్తుడై, ప్రాపంచిక విషయముల యందు ఏ విధమయిన ఆపేక్ష పెట్టుకొనడు. ఆ జీవుడు తపోవనమందున్ననూ, ఇంటిలో యున్ననూ త్రిగుణములు ఆతనిని స్పర్శింపనేరవు. అందువలన పరాత్పర బ్రహ్మ సాక్షాత్కారము నొందిన సన్యాసి ఎల్లప్పుడూ ఆనంద నిమగ్నుడై, బాలుని వలె సంచరించుచుండును. మదిరా పాన మత్తుడయిన మనుష్యుడు ఎట్లు వస్త్రధారణ చేసెనో పట్టించుకొననట్లు, సిద్ధ పురుషులు సమస్త అనాసక్తులై యుందురు. సూర్యోదయమయిన పిదప ఎట్లు సమస్త వస్తుజాలము గోచరమగునో, అట్లే జ్ఞానోదయమయిన పిదప అజ్ఞానాంధకారము పారద్రోలబడి, తన శరీరము లోపలనే పరబ్రహ్మము కలదను జ్ఞానము ధృఢపడును. అనంత పరమాత్ముని యొక్క దివ్య ధామము పండితుల ద్వారా తెలుపబడు శాస్త్రముల వలన గ్రహింపబడనట్లు, ఇంద్రియములు విభిన్న గుణముల యొక్క ఆశ్రయ భూతమయిన పరమాత్మ యొక్క సంయక్ జ్ఞానము తెలియబడదు. కొందరు వైకుంఠము పరమ పదమని, కొందు వైష్ణవ ధామమును పరంధామమని, కొందరు అజ్ఞానాంధకారమునకు అవతల యున్న శాంత స్వరూపమును పరబ్రహ్మమని, పరమ పదమని, కొందరు కేవలము కైవల్య మోక్షమే పరమధామమని పేర్కొందురు. కొందరు అక్షరసత్య ఉత్కృష్ఠతను ప్రతిపాదించెదరు. మరికొందరు గోలోకధామమే అన్నింటికి అది కారణమని నడువుదురు. మరికొందరు భగవానుని లీలా విహార కేంద్రమయిన నికుంజమే సర్వోత్కృష్ఠ పథమని నిర్వచింతురు.

"కాని మనన శీలుడయిన ముని వీటన్నిటి యందునూ శ్రీకృష్ణుని మాత్రమే చూచి ఈ పథమును ప్రాప్తించును." "ప్రద్యుమ్నుని యొక్క జ్ఞాన పూర్వక వచనములు విని, శాస్త్రమును గ్రహించి, విచారము వీడి, ధైర్య వర్ధకులై, జ్ఞాన ప్రాప్తి నొంది హర్షోల్లాసములతో నిండిన మనసు గలవారై తృప్తినొంది సమరమునకు సుముఖులైరి. ఆ తరుణమున సీతాగంగా

తటమున యాదవ దానవ సేనల మధ్య తుముల యుద్ధ మారంభమయ్యెను. అయ్యది రామాయణ కాలము నాటి వానర దానవ సమరమును పోలియుండెను. రథ, గజ, హయ, పదాతులు ఎవరికి సరిపడు వారు వారితో సమరమునకు పాల్పడిరి. మావటులచే ప్రేరితములై, రత్నకంబళుల చే కప్పబడిన ఉత్తుంగ గజరాజములు మేఘముల చే కప్పబడిన పర్వతముల వలె ఒప్పారు చున్నవి. అవి తమ దంతముల చే, తొండముల చే, తమ మార్గము నందలి రథములను, హయ, పదాతులను తుత్తునియలు కావించుచూ, కొన్నింటిని ఆకాశము నందు ఎగురవేయుచూ, యుద్ధ భూమిని కకావికలు కావించుచున్నవి. ఆ సమరాంగము నందు క్షత గాత్రులయిన గజములు ఉన్మత్తులవలె పరుగులెత్తుచూ, సైనికులను తొండముతో కొట్టి, పాదములతో త్రొక్కి చంపుచూ మారణకాండ కావించుచున్నవి. రెక్కలు గల గుర్రములు ఆకాశము నందు ఎగురుచూ రథములను పట్టి పైకెత్తి గజముల కుంభ స్థలములపై పడవైచుచున్నవి. తమ చేతులలోనికి శక్త్యాయుధములు తీసికొని హయారూఢులయిన యోధులు కుంజరముల కుంభ స్థలముల పైకి లంఘించి గజారోహులయిన నరేశ్వరులను ఖండించి, పంచాస్యము ఏనుగు కుంభస్థలమును భేదించునట్లు సంహరించు చుండిరి. కొందరు హయారూఢులయిన యోధులు తమ హస్తమునందు కరవాలము ధరించి వాయువు సునాయాసముగ కమలమును పెకలించినట్లు శత్రుసేనలను విదీర్ణము కావించుచూ ముందుకు పోవు చుండిరి. కొందరు గుర్రపు రౌతులు కరవాల హస్తులై ఆకాశము నందు మాంసఖండమునకై గ్రద్దలు పోట్లాడునట్లు ప్రతిపక్ష హయారూఢులయిన యోధులతో ద్వంద్వ యుద్ధము కావించుచుండిరి. కొందరు పదాతులు ఖడ్గ, పరశు, చక్ర, బల్లెములు ధరించి ప్రతిపక్షుల మస్తకములను పుచ్చకాయల వలె ఖండించుచుండిరి. ఆ సమయమున భద్రాదేవి పుత్రులయిన– **"సంగ్రామజిత్, బృహత్సేవ, శూర, ప్రకరణ, జయ, విజిత్, సుభద్ర, వామ, సత్యక, అశ్వయు"** అను పదిమంది యోధులు అందరి కంటే ముందుకేగి దైత్య గణములతో సమర మారంభించిరి.

ఆ సమయమున శకుని సోదరుడయిన భూత సంతాపనుడు ఒక మహా గజము నెక్కి తన నారాచ వర్షము చే ప్రతిపక్షులను నిశ్శేషము కావించుచుండెను. భూత సంతాపుని నారాచముల చే నలుదిక్కులా అంధకారము అలముకొన్నది. ఇది గమనించిన శ్రీకృష్ణ పుత్రుడు, వీరుడు అయిన సంగ్రామజిత్ వానిని నిరోధించుటకు ముందుకరిగెను. అతడు సమరాంగణము నందు వందలాది సాయికములు ప్రయోగించి భూతసంతాపుని గాయపరచెను.

అంత భూత సంతాపుడు ప్రళయకాల సాగర ఘోష వలె టంకారము గావించుచున్న సంగ్రామజిత్ యొక్క వింటినారిని ఖండించెను. అంత సంగ్రామజిత్ విద్యుత్ కాంతులీను మరియొక ధనువును చేపట్టి వంద బాణముల చే భూత సంతాపుని ధనస్సు, నారి, లోహకవచము ఖండించి అతడధిరోహించిన మత్తగజము యొక్క కుంభస్థలిని భేదించెను. దానిచే ఆ కుంజరము క్రిందపడెను. ఈ విధముగ బాణముల చే గాయపడిన భూత సంతాపుడు నెమ్మదిగ తేరుకుని, తన గజమను సేదతీర్చి, తిరిగి సంగ్రామజిత్ పై ప్రేరేపించెను. మూర్తిభవించిన యమ, కాలుల వలె తనపైకి వచ్చుచున్న మహానాగమును కాంచి సంగ్రామజిత్ ఒక దివ్య ఖడ్గమును దాల్చి, పైకి ఎగిరి, ఆ మహాగజముపై ప్రహరించెను. ఆ మహా ప్రహారము చే ఆ మదగజము యొక్క తొండము ఖండిపబడి, అది మిక్కిలి భయానకముగ రోదించుచూ, ఘీంకరించుచు భూత సంతాపుని క్రిందవైచి, జగత్తును కంపింప చేయుచూ యుద్ధ భూమిని విడచి పలాయన మొనర్చి వెనుకకు చంద్రావతీ పురమున కేగెను. ఈ విధముగ భూత సంతాపుని గజము పలాయనమొనర్చుట కాంచిన దానవ సైన్య మంతయు హాహాకారములు చెలరేగెను.

అంత భూత సంతాపుడు శ్రీకృష్ణ తనయునిపై గ్రీష్మ ఋతువు నందలి సూర్యకాంతిని వెదజల్లు పదునయిన చక్రమును ప్రయోగించెను. ఇట్లు భయంకరముగ తిరుగుచూ తనపైకి వచ్చుచున్న చక్రమును సంగ్రామజిత్ లీలాపూర్వకముగ తన చక్రముతో నూరు ముక్కలు కావించెను. అంత ఆ మహాసురుడు జఠరగిరి యందలి ఒక శిఖరమును పెరకి, ఆకాశమున ఎగురుచు, నినాదములు చేయుచూ భద్రా సుతునిపై వైచెను. సంగ్రామజిత్ ఆ శిఖరమును ఒడుపుగా పట్టుకొని తిరిగి భూత సంతాపుని పై విసరెను. అంత భూత సంతాపుడు సంపూర్ణ జఠరగిరితని పెకలించి తన హస్తము పై నుంచి, సమరాంగణము నందు ఆకాశ మార్గమున నిలచి సంగ్రామజిత్ నుద్దేశించి ఇట్లనియె "ఇక ఈ పర్వతము చే నీ జీవితమును సమాప్తము కావించెదను." ఇది గమనించిన సంగ్రామజిత్ "దేవ కూట" మను మరియొక పర్వతమును

పెరకి “నేనునూ ఈ యుద్ధ భూమి యందు నీ ప్రాణములు హరింతును” అని ప్రత్యుత్తరము పలికి ఆ యోధులిరువురు ఎదురెదురుగ నిలుచుండిరి. అది ఒక అద్భుత ఘటన. తన చేతిలోని పర్వతమును విసురుటకు సిద్ధపడుచున్న భూత సంతాపునిపై సంగ్రామజిత్ వేసిన దేవకూటము పడి, ఆ దైతుడు ఆ రెండు పర్వతముల క్రింద పడెను. ఆ రెండు పర్వతములు గ్రుద్దు కొనుటచే ఒక మహా శబ్దము ఆవిర్భవించినది. ఆ రెండు పర్వతము క్రింద నలుగుట చే భూత సంతాపుడు యమలోకమున కతిథి అయ్యెను. ఆతని యందలి జ్యోతి సంగ్రామజిత్ యందు లీనమయ్యెను. యాదవ సేన యందు జయ సూచకముగ దుందుభి నాదములు మ్రోగెను. పుష్పవృష్టి కురిసెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి భూతసంతాపుని వధ అను ముప్పది మూడవ అధ్యాయము సమాప్తము)

ముప్పది నాల్గవ అధ్యాయము

(అనిరుద్దుని చే వృకదైత్యుడు మరణించుట)

నారదుడు “మిథిలేశ్వరా! సంగ్రామజిత్ ద్వారా భూత సంతాపకుడు మరణించిన వెంతనే రాక్షస సైన్య మంతట హాహాకారములు చెలరేగినవి. అంత శకుని, వృక, కాలనాభ, మహానాభ, హరిశమశ్రులు, క్రోధోద్రిక్తులై ముందుకు సాగిరి. శ్రీకృష్ణ నందనులయిన ప్రద్యుమ్నుడు శకుని తోనూ, అనిరుద్దుడు వృకుని తోనూ, సాంబుడు కాలనాభుని తోనూ, దీప్తిమానుడు మహానాభుని తోనూ, భానుడు హరిశమశ్రుని తోనూ తలపడిరి. ఇంద్రుడు వజ్రాయుధముతో పర్వతమును భేదించినట్లు అనిరుద్దుడు ప్రత్యర్ధి సైన్యమును ఛేదించుట మొదలిడెను. ఆతని బాణ ఘాతములచే ప్రత్యర్ధి సైన్యము యొక్క కాళ్ళు, చేతులు, భుజములు ఖండింపపడుట ఆరంభించెను. సుడిగాలి చే కొట్టబడిన వృక్షముల వలె వారందరూ సమరాంగణము నందు ధరాశయనులయిరి. గజముల తొండముల తెగిపడిపది. కుంభ స్థలములు పగిలినవి. దంతములు ఛిన్నా భిన్నమయినవి. గజములు ఖండములు కావింపబడి క్రింద పడినవి. వానిపైగల కాశ్మీర కంబళులు విదీర్ణము కావింపబడి, కుంభ స్థలముపై గల ముత్యాల హారములు యుద్ధ భూమి నందు చెల్లాచెదరై, బాణముల చే కావింపబడిన అంధకార బంధురమందు నక్షత్రములవలె మెరయు చున్నవి. అనిరుద్దుని బాణ పరంపరను ఎదుర్కొని ఎందరో ప్రత్యర్ధి యోధులు మూర్ఛితులైరి. ఆ దృశ్యము భయానకముగనూ, రమణీయముగనూ, అద్భుతము గనూ యున్నది. ఎన్నియో రథములు నుగ్గునుగ్గు అయినవి. అన్నియే రథములు రథిక శూన్యములై నిలచినవి. రథికుల శిరములు కుంజరముల ఉదరములందు ప్రతిష్ఠితములయినవి. అతి కొంచెము సమయముననే దైత్యుల సేన యందు ఎందరో యోధులు మరణించుటచే అచట రుధిర సరిత ఏర్పడినది.

ఆ మహానది యందు ఏనుగులు మొసళ్ళ వలెను, ఒంటె, గాడిద మొదలగునవి తాబేళ్ళ వలెను, రథములు జల చరముల వలెను, కేశములు నాచు వలెను ఒప్పుచున్నది. నరుకబడిన చేతులు చేపల వలెను, తెగిపడిన కిరీట, కుండల, కేయురములు రాళ్ళ వలెను, శస్త్ర, శక్తి, ఛత్ర, శంఖ, చామర, ధ్వజములు ఇసుక రాశి వలెనూ, రథ చక్రములు భ్రమరముల వలెనూ, ఆ రక్త ప్రవాహము నందు కానపట్టుచున్నవి. ఇరుసేనలు ఆ రుధిర సరితకు రెండు ఒడ్లవలె ఒప్పారు చున్నవి. ప్రమధులు, భైరవులు, భూత, భేతాళ, యోగినీ గణములు, అట్టహాసములు చేయుచూ, నర్తించుచూ, కపాలములు చేకొని రక్తపానము కావించుచున్నవి. రుద్ర భగవానునికి కపాలమాల చేయుటకై కొన్ని గణములు కపాలములు సేకరించుచున్నవి. భద్రకాళి సింహ వాహన యై తన యోగిణీ గణములతో ఏతెంచి దైత్యులను తన ఆహారముగ కబళించుచున్నది.

గంధర్వ, అప్సర, విద్యాధర కన్యకలు విమానములపై నుండి వీరగతి ప్రాప్తినొందిన వీరులను పరిగ్రహించుటకు సిద్ధముగ నుండిరి. వారు వీరులను గైకొనుటకు పరస్పరము కలహించు చుండిరి. కొందరు మరణించిన వీరులు

సూర్యమండలమును భేదించుకొని వైకుంఠమున కేగుచుండిరి. కొందరు అసురులు అనిరుద్ధుని గాంచి భయభీతులై పలాయనము సాగించిరి. మరికొందరు దూరము నుండే చూచుచుండిరి.

ఆ సమయమున మహాభయంకర దైత్యుడయిన వృకుడు గర్జించుచూ, మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ, ఒక గార్ధభ వాహనము నెక్కి అనిరుద్ధుని నిలువరించెను. ఆ రణ దుర్మధుడయిన దైత్యుడు పది తీవ్రనారాచముల తో ప్రద్యుమ్న నందనుని ధనస్సును, నారిని ఖండించెను. తన ధనువు ఖండింప బడుటచే వేరొక ధనువు తీసికొని తానును పది బాణములతో వృకుని ధనువును ఖండించెను. వృకుని అధరములు కోపముతో అదిరినవి. అంత ఆ మహాదైత్యుడు ఒక గొప్ప శూలమును తన చేతిలోనికి తీసికొని, నాలుకతో పెదవులు తడుపు కొనుచూ శ్రేష్ఠ ధనుర్ధరుడయిన అనిరద్ధునితో ఇట్లనియె "నీవు పరాక్రమ వంతుడవయిన క్షత్రియుడవు. నీవు నా సేనా వినాశము కావించితివి. నేనే నిన్ను ఈనాడు సంహరించెదను. నా పరాక్రమము చూడుము."అంత అనిరుద్ధుడు" దైత్యుడా! వృధాగా మాటలాడు వారు ఎన్నడునూ కార్యశూరులు కాలేరు. నేను నిన్ను పరిమార్చెదను. నీవు నా పరాక్రమము ఆలోకింపుము. నేను నిన్ను సమరమున సంహరింపని ఎడల నాకు గో, బ్రాహ్మణ, గర్భస్థశిశువు, మరియు బాలకులను హత్య గావించిన పాపము శోకుగాక! ఈ విధముగ ఒండొరులు శపధములు చేసికొనిన పిదప వృకుడు తన త్రిశూలమును అనిరుద్ధునిపై ప్రహరించెను. ఆ త్రిశూలమును అనిరుద్ధుడు తన ఎడమ చేతితో పట్టుకొని తిరిగి వృకునిపై ప్రహరించి గాయపరచెను. అంత దైత్యుడు కృద్ధుడై ఒక బరువయిన గదను తీసికొని అనిరుద్ధుని రథముపై ప్రయోగించి దానిని చూర్ణము కావించెను. అంత అనిరుద్ధుడు ఒక తీవ్ర కరవాలము తీసికొని దైత్యుని రెండు భుజములు ఖండించెను. అంత ఆ భుజ విహీనుడు అయిన దైత్యుడు తన ముఖమును అత్యంత వెడల్పు గావించి, ఆకాశమును మ్రింగునా అన్నట్లు తెరచి అనిరుద్ధుని మ్రింగి వైచెను. కానీ ఆ మహా యోధుడు శ్రీకృష్ణ పౌత్రుడు. అందువలన దైత్యుని ఉదరమున ప్రవేశించి నప్పటికీ ఆతడు సురక్షితముగ యుండెను. మత్స్య గర్భుడై యున్నపుడు ప్రద్యుమ్నుడు, అఘాసుర ముఖమునందు శ్రీకృష్ణుడు, వృత్రాసురుని కంఠమున పురంధరుడు, ఎట్లు సురక్షితముగ యుండిరో అట్లే అనిరుద్ధుడు సహితము సురక్షితముగ యుండెను.

ఆ సమయమున యాదవ సేన యందు హాహాకారములు చెలరేగినవి. అంత బలదేవ సోదరుడయిన గదుడు తన గదాయుధముతో వృకుని తలపై బలముగ ప్రహరించెను.

ఆ సమయమున దైత్యుడు గైరికధాతు మిశ్రిత జలపాతము ప్రవహించు వింధ్యాచలము వలె శోభించెను. అంత అర్జునుడు సునాయాసముగ తన కరవాలము తో ఆ దైత్యుని రెండు కాళ్ళను తెగనరికెను. అంత ఆతడు పక్షములు తెగనరుకబడిన పర్వతము వలె నేలబడెను. అంత అనిరుద్ధుడు తన కరవాలము చే ఆ దైత్యుని ఉదరము ఛేదించి బయటకు వచ్చి, ఆ దైత్యుని శిరము ఖండించెను. అంత యాదవ సేనా వాహిని జయజయ ధ్వానములు కావించి దుందుభి ధ్వనులు మ్రోగించిరి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి వృక దైత్య వధ అను ముప్పది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఐదవ అధ్యాయము

(సాంబుని ద్వారా కాలనాభ దైత్యుని సంహారము)

బహుళాశ్వుడు "మహామునీ! ప్రద్యుమ్నతనయుడు మహాద్భుత సమరము గావించెను. వృకదైత్య సంహారమయిన పిదప సమరాంగణమున ఏమి జరిగినది?" నారదుడు "వృకుని మరణానంతరము కాలనాభుడు సూకరము నెక్కి మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచు రణభూమి ప్రవేశించెను. ఆ మహాసురుడు అక్రూరుని ఇరువది, గదుని పది,

అర్జునుని పది, సాత్యకిని అయిదు, కృతవర్మను ఇరువది, ప్రద్యుమ్నుని వంద, అనిరుద్ధుని పది, దీప్తిమానుని అయిదు సాంబుని వంద బాణములతో ప్రహరించి వారందరినీ గాయపరచెను. ఆ బాణ ప్రహారము ల చే రెండు ఘడియలు ఆ వీరులందరూ వ్యాకులులైరి. వారందరి రథ హయములు మరణించి, రథములు చూర్ణమయినవి. ఆ మహాదైత్యుని హస్త లాఘవమునకు రుక్మిణీనందనుడు ప్రసన్నుడై సమరాంగణమునందు ఆతనిని ప్రశంసించెను. తదుపతి ప్రద్యుమ్నుడు ఒకే ఒక్క బాణము తీసి ఆ దైత్యుని వాహనమయిన సూకరముపై ప్రయోగించెను. ఆ బాణము సూకరమును ఆకాశము పైకెత్తి లక్ష యోజనముల దూరమున గల స్వర్గలోకపు అంచుల వరకు ఈడ్చి, అచట ఆకాశమునందు కొంతసేపు త్రిప్పి, పిదప సాగరమున పడవైచెను. పిదప వేరొక నారాచము కాలనాభుని పై ప్రయోగించెను. ఆ సాయకము కాలనాభుని ఆకాశము నందు త్రిప్పి పిదప చంద్రావతీ నగరమున పడవైచెను.

తన నగరమున పడిన కాలనాభుడు కొంత తడవు వ్యాకులుడై తిరిగి సంభాళించుకొని, నెమ్మదిగ ఒక లక్ష బారువుల గదను తీసికొని, తిరిగి యుద్ధ భూమికి ఏతెంచి తన భారీ గదాయుధముతో యాదవ సేనను నాశనము చేయనారంభించెను. ఆతడు రథ, గజ, హయ, పదాతులను తన గదాయుధముతో తనకు ఎదురు పడిన వారెవరైననూ నుగ్గు నుగ్గ కావించుచుండెను. ఆతడు వారందరినీ రెండు చేతులతో ఆకాశము నందు విసురుచుండగా ప్రత్యర్థి సేన ఆకాశము నుండి వర్షపు చినుకుల వలె పడుట ప్రారంభించిరి. అంత జాంబవతీ నందనుడు సాంబుడు ఒక మహా గదాయుధమును ధరించి, ఆ దైత్యుని నిలువరించి, బలముగ ప్రహరించెను. ఆతని శిరమును గాయపరచెను. రణరంగ మందు వారిరువురి మధ్య భయంకర ద్వంద్వ యుద్ధము ఆరంభమయ్యెను. వారి గదల ప్రహారము చే అగ్ని కణములు చెలరేగుచుండెను. ఆ భయంకర ప్రహారముల చే రెండు గదలు చూర్ణమయ్యెను. తదుపరి వారు ఇరువురు వేరొక గదలు తీసికొని యుద్ధ సన్నద్ధులయిరి. అంత కాలనాభుడు సాంబుని చూచి “నేను ఈ ఒక్క ప్రహారము చే నిన్ను అంతకపురికి పంపింతును” అని శపథము చేసెను.

అంత సాంబుడు “మొదట నీవే ప్రహరింపవలసినది” అని పలికి నిలుచుండెను. అంత కాలనాభుడు తన బలమంతయు ఉపయోగించి ప్రద్యుమ్నుని తన పై గదా ప్రహారము కావించెను. సాంబుడు తన గద తో ఆ ప్రహారమును ఆపి, తిరిగి తన గదతో ఆ దైత్యుని వక్ష స్థలమున ప్రహరించెను. ఆ ప్రహారము చే దైత్యుని వక్షము పగిలి రక్తము కక్కుకొని ప్రాణశూన్యుడై పర్వతము వలె క్రింద పడెను. సర్వులు జయజయ ధ్యానములు కావించిరి. సత్పురుషులు సాధువాదములచే ప్రశంశించిరి. దేవ దుందుభులు మ్రోగినవి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. గంధర్వ వనితలు ఆలపించిరి. విద్యాధర స్త్రీలు నాట్యము చేసిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండాగ్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి కాలనాభ వధయను ముప్పది అయిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఆరవ అధ్యాయము

(దీప్తిమానుని ద్వారా మహానాభ సంహారము)

నారదుడు “మహారాజా! కాలనాభుడు కాలధర్మ మందిన పిదప దైత్య సేనా వాహిని యందు కోలాహలము చెలరేగెను. అంత మహానాభుడు అను దైత్య పుంగవుడు ఒంటెనెక్కి రణరంగ ప్రవేశము కావించెను. ఆ మహామాయావి తన ముఖము నుండి అగ్ని వర్షము కురిపించుచుండెను. ఆ అగ్ని అన్నివైపుల నుండి ప్రజ్వరిల్లుచూ ధరిత్రి పైనున్న వృక్షములను సహితము భస్మీపటలము కావించుచుండెను. ఆ అగ్ని చే యోధుల కవచములు, తలపాగలు, కటి బంధములు, అంగరక్షలు, అన్నియు రెల్లు గడ్డివలె మండనారంభించినవి. సముద్ర తీర నగరములందు తయారు చేయబడిన ఆకుపచ్చ,

ఎరుపు, తెలుపు, నలుపు మరియు అనేక రంగుల ఊలు కంబళులు కప్పబడిన ఎన్నో ఏనుగులు ఆ దావానల మందు మండుచూ, వృక్షములు సహితముగ మండుచున్న పర్వతముల వలె కానపట్టుచున్నవి. మస్తకముల పై రత్న, చామర, సువర్ణమయ హారములతో అలంకరింపబడిన హయములు ఆ దావానలమందు దగ్ధము కావింపబడుచూ కార్చిచ్చు పాలయిన హరిణముల వలె కానబట్టినవి. ఈ విధముగ అత్యంత దారుణముగ పీడింపబడుచున్న తన సేనను జూచి ముకుంద నందనుడు దీప్తిమానుడు ఆ మాయామయమయిన అగ్నిని ఆర్పుటకు పర్జన్యాస్త్రమును సంధించెను. ఆ అస్త్ర ప్రభావము చే ప్రళయకాల నీలి జలధరములు ఆకాశము నందు క్రమ్మి, ఏనుగు తొండములు వంటి జలధారలతో ఆ అగ్నిని ఆర్పివేసినవి. అంతేకాక ఆ జల ప్రభావమున అకస్మాత్తుగ వర్ష ఋతువు ప్రారంభమై మత్తకోకిలలు, నెమళ్ళు, సారస పక్షులు మధుర స్వనములు కావించుట నారంభించినవి. ఆకాశమంతయు ఇంద్ర ధనువులతోనూ, విద్యున్మాలలతోనూ నిండి మిక్కిలి ఆహ్లాదకరముగ తయారయ్యెను. ఈ విధముగ తన అగ్ని నష్టమగుటచే క్రోధోద్రిక్తుడై మహానాభుడు ఒక మహా త్రిశూలమును దీప్తిమానునిపై విసరెను. భయంకర సర్పము వలె తన పైకి వచ్చుచున్న ఆ మహా త్రిశులమును దీప్తిమానుడు తన నిశిత కరవాలము చే ముక్కలు ముక్కలుగ నరికెను. మహానాభుని వాహనమయిన ఒంటె తన తీక్షణమయిన దవడలతో ముకుంద పుత్రుని కరువ మందుకు వచ్చెను. అంత దీప్తిమానుడు తన నిశిత చంద్రహాసమును ఆ మృగము మెడపై ప్రయోగించి, శిరమును ఖండించెను. అంత ఆ ఒంటె రెండు ముక్కలై ధరాశయనమయ్యెను.

అంత దైత్యుడు మహానాభుడు మిక్కిలి వేగవంతుడై ఒక మహా గజము నధిరోహించి త్రిశూలధారియై భూనభోంతరములు కంపించునట్లు గర్జించెను. అంత దీప్తిమానుడు ఒక నల్లని సింధీ హయమును అధిరోహించి విద్యుత్ వలె మెరయుచున్న ఖడ్గము ధరించి, తన గుర్రపు డొక్కలో తన్ని ప్రేరేపించెను. అంత ఆ కాలహయము ఆకాశమున కెగిరి ఆ మహాకుంజర కుంభస్థలమును సింహము పర్వత శిఖరము నెక్కినట్లు అధిరోహించెను. అదే సమయమున దీప్తిమానుడు తన నిశిత కరవాలమును మహానాభుని కంఠముపై ప్రయోగించి ఆతని శిరమును శరీరము నుండి వేరు పరచెను. మహానాభువు అంతకునికి అతిథి అయ్యెను. ఇంతలో ఆ దురాత్ముని సైనికులు బాణ వర్షము కురిపింప నారంభించిరి. అంత దీప్తిమానుడు సింహము కుంజర యూధము పై చెలరేగినట్లు కరవాల హస్తుడై ఆ దైత్యుని సైన్యమును సర్వమునూ దునుమాడి సంహరించెను. చావగా మిగిలిన సైన్యము కకావికలై పలాయనము చిత్తగించిరి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. ఋషి, ముని, దేవతా గణములు ముకుందనందనుని ప్రశంశలతో ముంచెత్తిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండాగ్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి మహానాభ వధ అను ముప్పది అరవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఏడవ అధ్యాయము

(శ్రీకృష్ణ పుత్రుడయిన భానుని ద్వారా హరిశమశ్రుని వధ)

నారదుడు "మహానాభుడు మరణించిన పిదప దైత్యసేన పలాయనము కావించినదని వినిన హరిశమశ్రుడు తిమింగళము నెక్కి రణభూమి కి ఏతెంచెను. ఆ సమయమున ఆతని అధరములు కోపముతో అదురుచున్నవి. ఆతడు యాదవ సేనను కాంచి అత్యంత కఠోర వచనములు ఇట్లు పలికెను. "ఓరీ! మీరందరూ నామందు ఎంత? కేవలము స్వల్ప పరాక్రమలు. హీనులయిన్పటికీ కేవలము అస్త్ర శస్త్రములతో జయించుచున్నారు. మీ వంటి వారలందు పురుషత్వ మెక్కడ? మీ సేన యందు ఎవరేని బలవంతుడు అస్త్ర శస్త్రములు లేకుండా మల్ల యుద్ధము కావించితి రేని అపుడు మీ పౌరుషము తెలియనగును." దైత్యుని పలుకులు విని, ఆతని భీకరాకృతిని కాంచి, వానిని ప్రశంశించి ఎల్లరూ మౌనముగ యుండిరి. ఆ సమయమున సత్యభామా సుతుడు భానుడు మనసునందు శ్రీకృష్ణ భగవానుని సంస్మరించి, సమరాంగణము

నందు అస్త్ర శస్త్రములు విసర్జించి హరిశమశ్రునికి ఎదురేగెను. అంత దైత్యుడు తిమింగళము నుండి క్రిందికి దిగి, భుజములు అప్పళించి, ప్రయత్న పూర్వకముగ భానుని ఎదుర్కొనుటకు సిద్ధపడెను. వనమందు మదగజములు తమ దంతములతో, తొండములతో పరస్పరము ఎదుర్కొనునట్లు వారిరువురు తమ చేతులతో, ఒకరినొకరు త్రోసికొనుచు మల్లయుద్ధ మారంభించిరి. హరిశమశ్రుడు భానుని రెండు భుజములు పట్టి వంద యోజనములు వెనుకకు త్రోసెను. అంత శ్రీకృష్ణ తనయుడు భానుడు తప్పించుకొని ఒడుపుగా హరిశమశ్రుని పట్టి పదకొండు యోజనములు వెనుకకు ఈడ్చెను. అంత ఆ దైత్యుడు భానుని భుజములు ఒడుపుగా పట్టుకొని ఆతనిని తన ఒడిలోనికి లాగి, రెండు మోకాళ్ళను పట్టి, పైకి లేవనెత్తి, బలముగ భూమిపైకి విసరెను. భానుడు తిరిగి పైకి లేచి దైత్యుని బంధించి, త్రిప్పి, వానిని తన వీపుపై పెట్టి, వాని తొడలు పట్టి భూమిపై బలముగ విసరెను. తదుపరి ఇరువురు లేచి, భుజములు అప్పళించుకొని పాము, గరుడ పక్షి వలె మల్లయుద్ధము నందు లాఘవము ప్రదర్శించుచూ పోరాడు చుండిరి. ఇంతలో హరిశమశ్రుడు ముకుంద నందునుని మోకాళ్ళు పట్టి ఆకాశము పైకి లక్ష యోజనముల దూరము విసరెను. ఆకాశము నుండి క్రిందపడుట చే భానుడు కొంచెము వ్యాకులత పొందెను. కానీ శైల శిఖరము నుండి క్రిందపడిన ప్రహ్లాదుడు రక్షింపబడినట్లు భానుడు సహితము శ్రీహరి కృప చే సంపూర్ణముగ రక్షింపబడెను. అంత భానుడు పైకిలేచి హరిశమశ్రుని పొడవయిన గడ్డము పట్టి వానిని త్రిప్పిత్రిప్పి ఆకాశము నందు లక్ష యోజనములు దూరము విసరెను. ఆకాశము నుండి క్రిందపడి దైత్యుడు సహితము వ్యాకుతనొందెను. అంత దైత్యుడు తన గడ్డమును సవరించుకొని భానునిపై ముష్టి ఘాతమును ప్రహరించెను.

అటు పిదప వారిరువురు రెండు ఘడియలు భయంకర ద్వంద్వ యుద్ధము కావించిరి. హరిశమశ్రుని అంగములు పిప్పిపిప్పి అగుట ప్రారంభించెను. అంత ఆ దైత్యుడు ఒక శిలను తీసికొని భానునిపై ప్రహరించెను. భానుని క్రోధమునకు అవధులు లేవు. అతడు ఒక వృక్షమును పెరకి దైత్యుని రెండుమార్లు ప్రహరించెను. దైత్యుడు సహితము వేరొక వృక్షమును పెరకి దానితో భానుని ప్రహరించి, అంతటితో ఆగక ప్రక్కనే యున్న ఒక మహా గజము యొక్క తొండము పట్టుకొని త్రిప్పి త్రిప్పి దానితో భానుని కొట్టెను. భానుడు ఆ గజమును ఒక చేతితో పట్టి, వేరొక హస్తముతో మరొక హస్తిని చేపట్టి, ఆ రెండు ఏనుగులతో దైత్యుని ప్రహరించెను. దైత్యుడు ఆ ఏనుగులను తన చేతులతో పట్టి, క్రిందపెట్టి, వాని దంతములు పెరకి వానితో భానుని గాయపరచెను. ఆ సమయమున ఆకాశవాణి ఇట్లనియె "ఈ దైత్యుని మృత్యువు ఈతని గడ్డము నందు కలదు. ఈ మహాసురుడు శివ భగవానుని వర ప్రసాదము చే అత్యంత బలవంతుడయ్యెను." ఈ పలుకులు వినినంతనే భానుడు క్రోధోద్రిక్తుడై, పరుగిడి, తన రెండు చేతులతో దైత్యుని పాదములు పట్టి, లేపి, మాటిమాటికీ గర్జన చేయుచూ, వానిని మహా వేగముగ త్రిప్పి, బలముగ నేలపై విసరెను. అంత ఆతని గడ్డమును సంపూర్ణముగ పెకలించి, ఒక బలమయిన పిడిగుద్దును ఆతని శిరముపై ప్రహరించెను. తక్షణమే దైత్యుడు మరణించెను. యాదవులు జయజయ ధ్వానములు కావించిరి. దేవ దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి కురిసినది.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండాగ్గతమున నాదర బహులాశ్వ సంవాదము నందలి హరిమశ్రుని వధ అనెడు ముప్పది ఏడవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఎనిదవ అధ్యాయము

(ప్రద్యుమ్న శకునిల ఘోర యుద్ధము)

బహులాశ్వుడు "మునివర్యా! హరిశమశ్రాది సోదరులు మడసిన పిదప శకుని ఏమి చేసెను?" నారదుడు "మహారాజా! హరిశమశ్రుడు మరణించెనన్న వార్త విని శకుని కొంతసేపు అచేతనుడై, నెమ్మదిగ తెప్పరిలి, సమరాంగణమున శోక సంద్రమున మునిగి దైత్యులను సంభోధించుచూ ఇట్లనియె "ఓ! కాలకేయ, పౌలోమేయులారా! మీరందరూ నా మాట వినవలసినది. భగవానుని బలము అద్భుతము. అందువలన ఏది ఏ మయిననూ జరుగవచ్చు. నా సోదరుడు

కాలనాభుడు పూర్వకాలమందు సముద్ర మంధన సమయమున యమునితో పోరాడి గెలిచెను. కానీ దైవ వశమున నేడు మానవులతో పోరాడి మరణించెను. శంబరుడు సాక్షాత్ సూర్యునితో పోరాడి ఆతనిని ఓడించెను. కానీ బాలకుడయిన కృష్ణ కుమారుని చేతిలో మృత్యువు నొందెను. ఉత్కచుడు మహాబలులలో మహాబలుడు. ఆతడు ఇంద్రుని నిర్జించెను. కానీ బాలకృష్ణుని చేతిలో పరమపదించెను. ఈ విషయము నేను నారద మహర్షి ముఖతా వింటిని. పూర్వము సముద్ర మంధనమందు సర్వులూ చూచుచుండగా హృష్టుడు అగ్నిదేవుని ఓడించెను. కానీ ఆ వీరుడు నేడు ఒక మానవుని చే పరిమార్చబడెను. పూర్వము వరుణ దేవుని సహితము మట్టికరిపించిన భూత సంతాపనుడు నేడు ఒక తుచ్ఛ మానవుని చే సంహరింపబడెను. పూర్వము సమరమందు మహాదేవుని సహితము మెప్పించిన వృకుడు నేడు తుచ్ఛ వృష్ణి వంశస్థుల చేతిలో పరాజితుడయ్యెను. నా సోదరుడయిన మహానాభుడు ఒకప్పుడు దేవలోకమున వాయుదేవుని మదమడచెను. ఈనాడు ఆతడు సామాన్య యదుకుల వీరుని చే ధరాశయనుడయ్యెను. హరిశమశ్రుడు పూర్వకాలమున స్వర్గలోకమున ఇంద్రపుత్రుని పరాజితుని కావించెను. అటువంటి వీరుని ఈనాడు ఒక సామాన్య యాదవుడు సంహరించెను. అందువలన నేను శపథము చేయుచున్నాను. ఈ ధరిత్రిని యాదవ శూన్యము కావించెదను. జరాసంధుడు, సాల్వుడు, బుద్ధిమంతుడయిన దంతవక్త్రుడు, మరియు శిశుపాలుడు, వీరందరూ నా మిత్రులు. సుతల లోకమునుండి ప్రచండ పరాక్రములయిన దానవులను రావించి, ఈ మిత్రుల సహితుడనై మీతో కలసి దేవతలను జయించుటకు వెళ్ళెదను. ఈ కదనమునకు బాణాసురుడు సహితము మనకు సహకరించును. ప్రద్యుమ్నుని, యాదవులను జయించి, దేవతలను వారి వారి స్త్రీలతో సహా బంధించి, మేరు పర్వత గుహలయందు విసిరి వేయుదును. గోవులను, బ్రాహ్మణులను, దేవతలను, సాధు పురుషులను, వేదములను, తపస్సులను, యజ్ఞములను, శ్రాద్ధములను, తితీక్షువులను, నానా తీర్ధ సేవనము చేయు ధర్మాత్ములను, నిస్సందేహముగ సంహరించెదను. అటు పిదప సుఖముగ జీవించెదను. దేవతలపై విజయము సాధించిన కంసుడు ధన్యుడు. ఆతడు నాకు పరమ సుహృత్. బాధాకరమయిన విషయమేమనగా ఆతడు ఇపుడు భూతలమున లేడు. ఈ విధముగ పలికి నేరుగా ప్రద్యుమ్నునకు ఎదురు నిలచెను. లక్ష బారువుల బరువు గల ఒక దివ్య ధనువును చేపట్టి టంకారము చేయుట నారంభించెను. ఆ దివ్య ధనువు మయాసుర నిర్మితము. ఆ టంకార ధ్వని చే దిగ్గజములు వినికిడి కొల్పోయినవి. పర్వతములు కూలినవి. సముద్రములు చెలియలి కట్ట దాటినవి. బ్రహ్మాండమంతయు ప్రతిధ్వనించి భూమి కంపించినది. ఈ నారీ ధ్వని చే రణభూమి యందలి యోధులు కూలిరి. గజములు రణభూమి విడచి పరుగులెత్తినవి. యాదవ యోధులు భయాంధోళనకు లోనుకాగా మహాబలపరాక్రమవంతులైన యాదవ వీరులు గదుడు మొదలగు వారు అచటకి ఏతెంచి తమ ధనుష్టంకారములు కావించుచూ రణమునకు సిద్ధపడిరి.

శకుని మొదట తన నారాచములను అర్జునుని పై వేసెను. దాని చే రధ సహితుడై పార్ధుడు నాలుగు క్రోసులు దూరమున పడెను. అంత రణ దుర్మధుడైన శకుని గదుని పై ఇరువది బాణములు వైచి ఆతనిని వ్యోమ మండలమందు విసరివైచెను. ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన అనిరుద్ధుని నలుబది బాణముల తో ప్రహరించి ఆతనిని రధ సహితముగ పదహారు క్రోసుల దూరమున పడవైచి భూన భోంతరాళములు ప్రతిధ్వనించునట్లు సింహనాదము కావించెను. తదుపరి సాంబునిపై వంద బాణములు ప్రయోగించి ఆతనిని ముప్పది రెండు క్రోసులు దూరము ఎగురగొట్టెను. ఈ విధముగ పలు యోధులను బాధించుచూ చివరకు ప్రద్యుమ్నుని ఎదుటకు వచ్చి, అనేక బాణ సమూహముల చే ఆయనను గాయపరచెను. ఆ బాణ ప్రహారము చే ప్రద్యుమ్నుని రధము బొంగరము వలె, రెండు ఘడియలు వరకూ ఆకాశమున తిరుగుచూ పిదప వంద క్రోసులు దూరము పడెను. శకుని యొక్క శక్తి, సామర్ధ్యములు చూచి యాదవ వీరులు చకితులైరి. కుంజరము పర్వతమును ఢీకొట్టునట్లు సమస్త యాదవ యోధులు తమ అస్త్ర శస్త్రములతో శకునిని గాయపరుచుట ఆరంభించిరి. ఇంతలో యాదవ యోధులు గదుడు, అర్జునుడు, అనిరుద్ధుడు, సాంబుడు ధనుష్టంకారము కావించుచూ యుద్ధభూమికి ఏతెంచిరి. ఇంతలో మహాయోధుడయిన ప్రద్యుమ్నుడు సహితము వాయు వేగముతో వెళ్ళగలుగు రధము నధిరోహించి యుద్ధమండలమున కేతెంచెను. శకుని యొక్క వింటినారి ప్రళయ కాల సముద్ర ఘోషవలె వినిపించుచు యున్నది. శ్రీకృష్ణ కుమారుడు పది బాణములు ప్రయోగించి ఆ వింటి నారిని ఖండించెను. పిదప సహస్ర సాయకములతో ఆతని వేయి అశ్వములను హతమార్చి, వంద బాణముల ద్వారా రధమును చూర్ణము చేసి, ఇరువది బాణముల ద్వారా

సారధిని చంపెను. అంత దైత్యరాజు వేరొక రధమధిరోహించి తన ప్రచండ పరాక్రమ ధనువునకు నారి బిగించెను.

అంత అమ్ముల పొది నుండి వంద సాయకములు ఒకేసారి తీసి, సంధించి ప్రద్యుమ్నుని తో ఇట్లనియె "నా ప్రత్యర్థులందరి యందును ముఖ్యుడవయిన నిన్ను మందు సంహరించెదను. పిదప నిర్మల తేజస్సులయిన యాదవ సేన నంతటినీ పరిమార్చెదను." ప్రద్యుమ్నుడు "అసురా! ప్రాణుల ఆయువు ఎల్లప్పుడు కాలాధీనము. అయ్యది ఎల్లప్పుడూ వచ్చుచూ, వెళ్ళుచునే యుండును. అట్లే సుఖదు:ఖములు సహితము కాలాధీనములు. కృషీవలుడు భూమిని దున్ని విత్తనములు జల్లును. పిదప పైరు పక్వమునకు వచ్చిన పిదపఒక కొడవలి తీసికుని ఆ పైరునే నరుకును. అట్లే దుర్జయమయిన కాలము తన చే రచింపబడిన దేహధారుల యొక్క శ్రేణులను గుణముల ద్వారా పాలించి పోషించును. పిదప సమయమాసన్నమయినపుడు ఆ జీవులనే సంహరించును. జీవుడు అహంకార యుతుడై, మోహితుడై "నేను ఈ కార్యము చేయుదును. చేయుచున్నాను. ఇది నాది. ఇది నీది. నేను సుఖించుచున్నాను. నేను దు:ఖించుచున్నాను. ఈతడు నా స్నేహితుడు" అని ఆలోచించును." శకుని "నృపశ్రేష్ఠా! నీవు ధన్యుడవు. నీ వాణి, భాషణము ద్వారా ఋషులను, మునీశ్వరులను అనుకరించుచున్నావు. త్రిగుణముల చే మరల మరల ప్రభవించు స్వభావమున్నదే, దానిని త్యజించుట బహు దుర్లభము." ఈ విధముగ సమరాంగణమందు సత్సంగ సంబంధిత వాక్యములు పలుకుచూ ఇంద్ర వృత్రాసురుల వలె వారిరువురు రణమాచరించు చుండిరి.

శకుని చే వినిర్ముక్తమయిన సాయకములు సూర్య కిరణముల వలె మెరయుచూ ప్రద్యుమ్నుని వైపు రాసాగినవి. ప్రద్యుమ్నుడు ఒకే ఒక సాయకము తో ఆ బాణ సమూహమును కటు వాక్యము మిత్రత్వమును ఖండించునట్లు ఖండించెను. అంత శకుని లక్ష బారువుల బరువు గల ఒక గదను తీసికొని అద్దానితో ప్రద్యుమ్నుని తలపై మోదెను. ప్రద్యుమ్నుడు వజ్ర సమానమయిన గదతో ప్రత్యర్థి యొక్క ఘాతమునాపి, ఆ గదను నూరు ముక్కలు గావించెను. అంత రుక్మిణీ నందనుడు ఒక వాడి అయిన బల్లెము తీసికొని శకునిపై ప్రయోగించెను. ఆ ప్రహారము చే దైత్యుని వక్షము వ్రక్కలయినది. ఆ ఘాతము చే దైత్యుడు వ్యాకులుడై ఒక పరిఘ తీసికొని ప్రద్యుమ్నునిపై ప్రహరించెను.

తనపైకి వచ్చుచున్న పరిఘాయుధమును గమనించి ప్రద్యుమ్నుడు యమదండమును చేపట్టి ప్రయోగించెను. ఆ యమ దండము పరిఘను నుగ్గునుగ్గు గావించి, దైత్యుని రధమును, హయములను, సారధిని చూర్ణము గావించెను. అంత శకుని రోషతామ్రాక్షుడై, ఖడ్గధారియై మీదికి రాగా, మాయావతీ వల్లభుడు తిరిగి యమదండముతో ఆ ఖడ్గమును తునియలు కావించెను.

తదుపరి అదే యమదండముతో ముకుంద నందనుడు దైత్యుని భుజములపై ప్రహరించెను. ఆ మహాఘాతము చే దైత్యుడు మూర్ఛితుడయ్యెను. అంత క్రోధోద్రిక్తుడయిన ప్రద్యుమ్నుడు దైత్యసేన యందు ప్రవేశించి దావానలము అడవిని కాల్చునట్లు దైత్యసేన యందలి శూర వీరాగ్రేసరులను ధరాశయనుల కావించెను. ప్రద్యుమ్నుడు యమదండమును చేపట్టి యముని వలె అనేక రథ, గజ, హయ, పదాతులను హతమార్చుచూ మారణకాండ కావించెను. కాలుని వలె మారణకాండ కావించుచున్న ప్రద్యుమ్నుని కాంచి దైత్య సేన అంతయు పలాయన మొనర్చెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి శకుని ప్రద్యుమ్నుల సమరమను ముప్పది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది తొమ్మిదవ అధ్యాయము

(శకుని మాయాస్త్రములను ప్రద్యుమ్నుడు నివారించుట; ప్రద్యుమ్నుని చే విడువబడిన శ్రీకృష్ణాస్త్రము చే సంగరమందు శ్రీకృష్ణుడు ప్రత్యక్షమగుట)

నారదుడు "మహారాజా! ఇంతలో శకుని మూర్ఛ నుండి తేరుకొని, తన సేన అంతయు సర్వనాశన మగుట గని తిరిగి లక్ష బారువులు గల ధనువు చేపట్టి ప్రచండ పరాక్రముడయిన ఆ దైత్యరాజు ప్రద్యుమ్నుని గాంచి ఇట్లనియె "ఈ

భూతల మందు కర్మయే ప్రధానము. మహత్తత్వమే సాక్షాత్ గురువు మరియు సామర్థ్యశాలి అయిన ఈశ్వరుడు. ఇచట కర్మ యే ఉచ్ఛ నీచత్వములనూ, జయాప జయములనూ ప్రసాదించును. వేలాది గోవుల మధ్య విడిచిపెట్టబడిన దూడ ఎట్లు తన తల్లిని చేరి దుగ్ధపానము కావించునో, అట్లే ఎవరిచే చేయబడిన శుభాశుభ కర్మ ఫలములు కోట్ల మనుష్యులు యున్ననూ ఆ కర్తకు మాత్రమే ప్రాప్తించును. అందువలన నేను ధృఢమయిన సత్కర్మకావించి, ఆ ఫలితము ద్వారా నిన్ను అవశ్యము జయింతును. నీవు కూడా అట్లే చేయవలసినది.” అంత ప్రద్యుమ్నుడు “దైత్యరాజా! నీవు కర్మను అత్యంత ప్రధానముగ భావింతువేని, అయ్యది కాలము వినా ఏ విధమయిన ఫలమును ఈయలేదని తెలియవలసినది. కర్మము చేసిన పిదప కూడా దాని ఫలితము నందు ఎన్నో విఘ్నములు ఆపాదింపబడును. అందుచే విద్వాంసులు కాలమునే బలిష్ఠముగ తలంతురు. కర్మ పరిపక్వమయినప్పటికీ కర్త లేకుండా దాని ఫలితము ప్రాప్తమవదు. అందువలన కొందరు కాల, కర్మములు కంటె కర్తనే ప్రధానముగ పేర్కొందురు. మరికొందరు యోగము (ఉపాయము) ప్రధానమని నొక్కి వక్కాణింతురు. ఎందుకనగా అది లేక కర్మ లేక దాని ఫలసిద్ధి పొందనేరదు. యోగ, కర్త, కర్మ, కాలము యున్నప్పటికీ “విధి జ్ఞానము” లేని ఎడల ముందర చెప్పబడిన వన్నియు వ్యర్థము. ఎందువలననగా పరిణామము ప్రకారము ఆది (మొదలు) యొక్క విచారము లేక ఫలప్రసాదము, ఫల నిర్ణయము దుర్లభము. యోగ, కర్మ, కర్త, కాల, విధి జ్ఞానములు యున్ననూ పరాత్పరుడయిన పరబ్రహ్మము లేక ఇవి అన్నియు వ్యర్థము. అందువలన అఖిల విశ్వమునకు జ్ఞాన ప్రదాత అయిన ఆ పరిపూర్ణతమ భగవానునకు నమస్కరించు చున్నాను.” అంత శకుని “ఓ! మహాబాహూ! ప్రద్యుమ్నా! నీ సత్యసంగము నొంది ప్రతి దినము నీతో ప్రసంగించు మహానుభావుల మహిమను వర్ణించుటకు చతుర్ముఖ బ్రహ్మ సహితము అసమర్థుడు.”

ఇట్లు పలికి శకుని మయాసుర దత్తమయిన ధనువు చేకొని రౌరవాస్త్రమును సంధించెను. ఆ అస్త్ర మహిమ చే కోట్లాది విష సర్పములు, విషపు పురుగులు, బయలు దేరినవి. ఆ విష సర్పములు యాదవ సేన అంతటా బుసలు కొట్టుచుండగా, ఆ సేన అంతయు కకావికలగుట ప్రారంభించెను. అది గమనించిన బుద్ధిమంతుడయిన ప్రద్యుమ్నుడు గరుడాస్త్రమును సంధించి విడచెను. ఆ అస్త్ర ప్రభావము చే కోట్లాది గరుడ పక్షులు, నెమళ్ళు, నీల కంఠములు, మరియు ఇతర భయానక విహంగములు దైత్యులందరూ చూచు చుండగా సృష్టింపబడి, రౌరవాస్త్రము చే సృష్టింపబడిన నాగులను, విషపు పురుగులన్నింటినీ ఉట్టడగించి. క్షణములో అదృశ్యమయ్యెను. అంత రణ దుర్మధుడయిన శకుని రాక్షసీ, గంధర్వీ, గౌహ్యకీ, పైశాచీ మాయను ప్రయోగించెను. ఆ మాయచే కోట్లాది వికృత రూపములు కలిగిన భూత ప్రేతములు ప్రత్యక్షమై అగ్ని వర్షము కురియునారంభించెను. ఆ పైశాచిక మాయ నెరింగిన ప్రద్యుమ్నుడు అద్దానిని భేదించుటకు సాత్వికాస్త్రమును ప్రయోగించెను. దాని ప్రభావము వలన కోట్లాది విష్ణు పార్షదులు ప్రత్యక్షమై గరుడుడు నాగినిని భక్షించుటనట్లు క్షణములో ఆ రాక్షసీ మాయను నిర్మూలించిరి. ఆ మాయావి తిరిగి గౌహ్యకాస్త్రమును ప్రయోగించెను. దాని మూలమున భయంకర మేఘములావరించి మల, మూత్ర, రక్త, మేధ, మజ్జ, మరియు ఎముకలు వర్షించుట నారంభించెను. దానిని నిరోధించుటకు ప్రద్యుమ్నుడు శూకరాస్త్రమును సంధించెను. ఆ సాయిక ప్రభావము చే గుర్రు గుర్రుమని శబ్దము చేయు వరాహ భగవానుడు ఆవిర్భవించి, తన మెడ మీదనున్న జూలు విదిలించి ఆ మేఘములను చెల్లా చెదరు కావించెను.

తదనంతరము దైత్యుడు గంధర్వ మాయను ప్రయోగించెను. దాని ప్రభావమున అకస్మాత్తుగా యుద్ధరంగమందు సర్వము మాయామయి దాని స్థానమున కోట్లాది స్వర్ణ భవనములు, ప్రకటితమయ్యెను. సేన అంతయు చూచుచుండగనే ఆ భవనము లయందు సుందర వస్త్రములు, అలంకరణలతో సిద్ధమయ్యెను. గంధర్వ, విద్యాధర కన్యకలు నాట్యమాడు చుండిరి. వారందరూ పదహారు వర్షముల కమలనయనలు, మనోహారిణులు, మరియు సుందరీమణులు. వారి రూప లావణ్యములు కాంచి సమస్త వృష్ణి వంశీయులు మోహితులయిరి. గంధర్వాస్త్ర ప్రభావము నెరిగిన ప్రద్యుమ్నుడు దాని నివారణమునకై జ్ఞానాస్త్రమును సంధించెను. దాని ప్రభావము చే ఆ సుందర దృశ్యములన్నియు అదృశ్యమయ్యెను. తన అస్త్రము విఫలమగుట కని దైత్యడు రాక్షసీ మాయను ప్రయోగించెను. క్షణములో సమరాంగణము అంతయూ అంధకారబంధురమై, ఆకాశమంతయు రెక్కలుగల పర్వతములతో నిండి ప్రళయకాల వేళ వలె ఘోషించుచుండెను. ఆకాశము నుండి మండుచున్న చెట్లు, రాళ్ళు, ఎముకలు, కాళ్ళు, చేతులు లేని పీనుగుల శరీరములు, రక్తము, గదలు,

పరిఘలు, ఖడ్గములు, ముసలములు, వర్షించుట నారంభించిరి. పర్వతములు మేఘముల వలె ఆకాశము నందు తిరుగుచూ, గజ, హయములను భక్షించుట నారంభించినవి.

కోట్లాది రాక్షసులు చేతుల యందు శూలాది ఆయుధములు ధరించి "కొట్టు", "చంపు" అని అరుచుచూ యాదవ సైన్యము మీదికి పరుగులెత్తి చుండిరి. అంతేకాక రణరంగ మందు అనేక సింహ, వ్యాఘ్ర, వరాహములు, తమ నఖముల ద్వారా గజ, హయ పదాతులను చీల్చుట నారంభించినవి. ఈ రాక్షసీ మాయను ఛేదించుటకు ప్రద్యుమ్నుడు నృశింహాస్త్రమును సంధించెను. దాని ప్రభావము చే నరశింహ భగవానుడు ప్రత్యక్షమయ్యెను. ఆ రూపము చూపరులకు అచ్చెరువు కలిగించు చుండెను. వింత కాంతితో మెరయుచున్న జూలు, లోపలికి, వెలుపలికి కదులుచున్న నాలుక, భయంకరమయిన నఖములు, పొడవయిన వాలము మిక్కిలి శోభించుచున్నవి. ఆయన రణరంగమందు ఒక్కమారు లేచి సింహనాదము కావించెను. ఆ మహానాదము చే సప్త ఊర్ధ్వలోకములు, ప్రతిధ్వనించెను. దిగ్గజములు విచిలితము లయినవి. తారలు నేలరాలినవి. భూమండలము కంపించెను. ఆయన సర్వులు చూచుచుండగనే, ఆకాశమునందున్న పర్వతములను పట్టి రాక్షససేన పైకి విసరనారభించెను. రాక్షస, పిశాచములను పట్టి నములుచూ, పాదములతో నలుపుచూ, సింహ, వ్యాఘ్ర, వరాహములను తన తీక్షణమయిన నఖములతో విదీర్ణము గావించి, రాక్షసమాయను శూన్యము చేసి, తాను సహితము అదృశ్యుడయ్యెను.

రాక్షసమాయ నష్టమయిన పిదప రుక్మిణీసుతుడు విజయ దాయకమయిన "మౌళేంద్ర" మను శంఖమును పూరించెను. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. దేవ దుందుభులు మ్రోగినవి. ఈ విధముగ తన సర్వ మాయాజాలము నష్టమగుట కాంచి శకుని తన రాక్షస సహితుడై అక్కడ అదృశ్యుడై మయుడు తన కొసగిన "దైతేయి" మాయను ప్రయోగించెను. అంత ఆకాశము నందు సంవర్తకాది మేఘములు ప్రత్యక్షమై ఏనుగు తొండముల వంటి వర్షధారలను వర్షింప దొడగెను. సప్త సముద్రములు ఉప్పొంగి, చెలియలి కట్టదాటి భూమండలమును ముంచెత్తుట నారంభించెను. అందు యాదవులందరి ఆత్మీయులతో పాటు సమస్త వృక్షములు మునిగిపోయెను. యాదవులు తమ పరాక్రమము సర్వమూ మరిచి, పరాజితులైరి. అంత ప్రచండ పరాక్రమమునకు ఆశ్రయ భూతుడయిన ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణాస్త్రమమును సంధించెను.

ఆ సమయమున అచట కోట్లాది ఉష:కాల బాలభానుని పగిది, ఒక తేజస్సు సమస్త దిశలను వ్యాపింపచేసి దేదీప్యమాన మొనర్చుచు ఆవిర్భవించెను. ఆ తేజో పుంజముల మధ్య జలధర మేఘ సమాన శరీర కాంతి కలిగి, సువర్ణ కమల రేణువుల వంటి పీతాంబరమును ధరించి, నల్ల తుమ్మెదల వంటి కేశరాశి, వైజయంతీమాలాధారి, శ్రీవత్సాంకితుడు, కౌస్తుభధరుడు, ప్రపుల్ల కమల దళ లోచనుడు, చతుర్భుజుడు, శ్రీకృష్ణ భగవానుడు దృష్టి గోచరుడయ్యెను.

ఆయన సుందరమయిన కిరీట, కుండల, హార, నూపుర ధారియై, ఒప్పారెను. ఈ విధముగ యున్న శ్రీకృష్ణ భగవానుని గాంచి యాదవులు అత్యంత హర్షోల్లాసితులైరి. శంఖ చక్రధారి అయిన శ్రీకృష్ణుడు తన శాంగ ధనువు నుండి ఒకే ఒక బాణమును సంధించి, విడచి శకుని యొక్క ధనువును, నారిని ఖండించెను. తన శస్త్ర ములన్నియు నిండుకుండుట చే తిరిగి శస్త్రములు తెచ్చుకొనుటకు శకుని తిరిగి చంద్రావతీ నగరము లోనికి ఏగెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహులాశ్వ సంవాదము నందలి శ్రీకృష్ణా గమనము అను ముప్పది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నలుబది యవ అధ్యాయము

(శకుని యొక్క జీవ స్వరూపమయిన చిలుక సంహరింపబడుట)

నారదుడు "శకుని తిరిగి తన నగరమునకు ఏగిన పిదప భగవానుడు ప్రద్యుమ్నాది యోధులను పిలచి ఇట్లనియె "పూర్వకాలమందు ఈ శకుని ఒక చతుర్యుగముల పాటు నిరాహారిగ యుండి తపస్సు చే శివ భగవానుని మెప్పించెను.

శివుడు సంతుష్టుడై వరము కోరుకొనమనగా దైత్యుడాయనకు ప్రణామము లాచరించెను. ఆ సమయమున ఆతని రోమరోమములు నిక్కబొడుచుకొని, నేత్రములు అశ్రుమయములాయెను. ఆతడు చేతులు జోడించి గద్గద వాణితో ఇట్లనియె "ప్రభూ! మరణించితినేని, భూస్పర్శ తగులగునే తిరిగి జీవింప వలెను. ఆకాశము నందు రెండు ఘడియలు వరకూ నాకు మృత్యువు లేకుండ యుండవలెను." అంత మహేశుడు ఆతనికి ఒక చిలుకనిచ్చి "నిష్పాప దైత్య శిరోమణీ!

ఇది నీ జీవ తుల్యము. దీనిని ఎల్లప్పుడు రక్షించుచుండుము. ఎప్పుడేని ఇది మరణించిన ఎడల అంత నీ మృత్యువు తథ్యమని తెలియుము." ఇట్లు పలికి రుద్రుడు అంతర్ధానుడయ్యెను. అందువలన దుర్గము నందలి చిలుక వధింపబడిన ఎడల దైత్య సంహారము జరుగును." ఇట్లు పలికి శ్రీహరి ఆ వీర సభయందు గరుడుని పిలచి ఇట్లనియె "గరుడా! నీవు చంద్రావతీ పురమున కేగుము. అయ్యది వంద యోజనముల విస్తీర్ణము కలిగి, మిక్కిలి బలమయిన దైత్య సేన చే కాపాడబడు చున్నది. సువర్ణ రత్న ఖచితములు, అంబర చుంబితములు అయిన భవనములతో నిండి, వన, ఉపవనములతో, పరివేష్ఠితమై ఆ పురి మిక్కిలి శోభాయమానముగ యుండును. నీవు ఆ నగరమునకేగి శకుని యొక్క మందిరాంతర్గతమున, పంజరమున యున్న చిలుకను సంహరింపవలసినది."

అంత గరుడుడు ఆ పుర ప్రవేశమునకై సూక్ష్మరూపము ధరించెను. ఆయన దైత్యులకు చిక్కక తోరణములనూ, గుమ్మములనూ దాటుచూ, ఒక భవనము నుండి వేరొక భవనమునకు ఎగురుచూ, చివరకు శకుని యొక్క మందిరమును చేరెను. దైత్యుని జీవ స్వరూపమయిన చిలుకను వెతుకుచూ, ఆయన ఒక్క క్షణము ఆగెను. ఆ సమయముఎన శకుని యుద్ధమునకై కవచధారణ కావించుచూ వివిధ రకములయిన శస్త్రములను తీసికొనుచుండెను. ఆ సమయమున ఆయన భార్య అయిన మదాలస తన రెండు చేతులను ఆయన నడుముపై యుంచి ఇట్లనియె "ప్రాణనాథా! మీ ప్రాణ మిత్రులు, అనుకూలురు, సోదరులు, ఉద్భట దైత్య ప్రవరు లందరూ రణమున పరమపదించిరి. యాదవులతో సమరమునకు వెళ్ళవలదు. ఎందుకనగా వారి పక్షమున సాక్షాత్ నారాయణుడు గలడు, ఆయనకు బమమతులచ్చినచో మనకు కళ్యాణమగును.

శకుని "ప్రియా! యాదవులు బలవంతముగ నా సోదరులను వధించిరి. నేను నా సేన ద్వారా వారిని సంహరించెదను. శివుని వరము వల్ల ఈ భూతలమందు నా మరణము కల్ల. ప్రియా! చంద్ర అను ఉపద్వీపము నందు సుందర పతంగ పర్వతమందు నా జీవ రూపమయిన చిలుక భద్రముగ యున్నది. శంఖచూడమను సర్పము దానిని దివా రాత్రములు రక్షించుచుండెను. ఈ విషయము వేరొకరికి తెలియదు. నా మృత్యువు ఎవరి వల్లా కాదు. శకుని మరణ రహస్యమున వినిన గరుడుడు చంద్ర ద్వీపమును వెదుకుచూ వేగముగ సముద్రోపరితము చేరెను. ఆయనకు సుందర లతా బృందములతో నిండిన సింహళద్వీపము కానబడెను. ఆయన ఆ ద్వీపము చేరి విచారించగా, ఆ ద్వీపము సింహళ ద్వీపమున అని తెలిసి అచటి నుండి త్రికూట పర్వతమునకెగిరి, అచటి నుండి పాంచజన్య ద్వీపమునకేగెను. అచట ఆయనకు మిక్కిలి ఆకలయ్యెను. ఇంతలో సముద్రము నుండి రెండు యోజనముల పొడవుగల మొసలి వచ్చి గరుడుని కాలుపట్టి సముద్రము లోనికి లాగుట మొదలిడెను. అంత రెండు ఘడియలు వారిరువురు ఒకరినొకరు తమవైపుకు లాగుగటకు యత్నించిరి. గరుడుని బలము అద్వితీయము. అంత ఆయన తన చంపుటములతో ఆ మొసలి వీపుపై బలముగ ప్రహరించెను. అంత ఆ మొసలి మాయమై, ఒక గొప్ప విద్యాధరుడు ప్రత్యక్షమై, గరుడునికి నమస్కరించి ఇట్లనియె.

"మహాప్రభూ! నేను పూర్వకాలమందు "హేమకుండలుడు" అను ప్రసిద్ధ విధ్యాధరుడను. ఒకనాడు నేను ఆకాశగంగ యందు స్నానమాచరించుటకు ఏగితిని. అచట ముని శ్రేష్ఠుడు "కాకుస్థుడు" స్నానమాచరించుచుండెను. నేను ఆకతాయి తనముతో ఇయన కాలుపట్టి నీటి యందు లాగితిని. అంత కకుస్థుడు క్రుద్ధుడై "దుర్బుద్ధీ! నీవు మొసలివగుము" అని శపించెను. అంతట నేను ఆయన పాదములపై బడి ప్రార్థించగా ఆయన ప్రసన్నుడై నిన్ను గరుడుడు తన చంచువులతో ప్రహరించినపుడు నీవు తిరిగి నీ పూర్వ రూపమును నొందెదవు." అని నుడివెను." ఈ విధముగ పలికి విద్యాధరుడు స్వర్గమున కేగెను. తిరిగి గరుడుడు వ్యోమ మండలము ప్రవేశించి వేగముగ ఎగురుచు "హరిణము" అను ఉపద్వీపము ప్రవేశించెను. అచట ఆయన అపాంతరముడు అను ముని శ్రేష్ఠుని కాంచెను. ఆయన ఆశ్రమము ప్రవేశింపగనే గరుడుని

రెక్కల నుండి ఒక ఈక క్రిందికి రాలెను. అంత అపాంతరతముడు గరుడుని గాంచి "పక్షిరాజా! నా మస్తకముపై నీ ఈకను యుంచి నీవు ప్రశాంతముగ వెళ్ళవలసినది." అంత గరుడుడు ఈయన మస్తకముపై ఈకను యుంచి ప్రశ్నార్థకముగ ఆయన వైపు చూచెను. అంత అపాంతరముడు చిరునవ్వుతో "పక్షిరాజా! ఎప్పుడెప్పుడు శ్రీకృష్ణావతారము అవతరించునో అప్పుడప్పుడు గరుడుడు నా తలపై ఈ ఈకలు విడుచుచుండును. ఈ విధముగ నా తలపై అనంతమయిన గరుడుని ఈకలు గలవు. ఈ విధముగ సర్వమునకు ఆది, అంత్యము లేని శ్రీకృష్ణ భగవానునికి నేను శిరసు వంచి నమస్కరించుచున్నాను."

ఇది విని ఆశ్చర్యచకితుడై గరుడుడు, ఆ మునివరునకు ప్రమాణము లర్పించి, అచట నుండి రమణక ద్వీపమున కేగి, అచట సర్పముల చే ఈయబడిన బలిని తీసికొని, ఆవర్తక ద్వీపమున కేగి అచట గల సుధాకుండము నందలి సుధను పానము చేసి అచట నుండి శుక్ల ద్వీపమున కేగెను. అచట నన్ను (నారదుని) చంద్ర ద్వీపము గూర్చి ప్రశ్నించి, నా చే చెప్పగా విని, గరుడుడు ఉత్తర దిశకు పయనించి చంద్రద్వీపమును చేరి అచటి పర్వతము పై వ్రాలెను. అచట వినతా నందనుడు జలదుర్గమును, అగ్ని దుర్గమును కాంచెను. అంత బలిష్ఠుడయిన గరుడుడు జలదుర్గము నందలి నీటిని పూర్తిగా పీల్చి, అగ్ని దుర్గము పై వైచి, ఆ అగ్నిని ఆర్పెను. ఇంతలో అచటి పర్వత కంధర ద్వారమునున్న అసురులందరూ లేచి ఆయుధములు ధరించిరి. గరుడుడు వారితో రెండు ఘడియలు సమరము కావించి కొందరిని తన చంచువులతోనూ, మరికొందరిని తన రెక్కల తోనూ కొట్టి సంహరించెను. కొందరిని పట్టి పర్వతపు పృష్ఠ భాగము నందు విసరెను. పెక్కు మంది అసురులు మరణించిరి. మిగిలిన దైత్యులు నలుదిశలా పలాయనమొనర్చిరి.

ఈ విధముగ దైత్య సంహారము కావించి పక్షిరాజు గుహయందు ప్రవేశించి, శంఖుచూడుని కాంచి, తన మొరయుచున్న కాళ్ళతో గాయపరచెను. గరుడుని చూడగనే శంఖు చూడుడు చిలుక సహితముగ పంజరమును సముద్రము నందు పడవైచి పలాయన మొనర్చెను. గరుడుడు పంజర సహితముగ చిలుకను ముక్కున పట్టి యుద్ధ భూమి కేగుటకు సమకట్టెను. "చిలుక అపహరించబడినది" అను కోలాహలము ఆరంభమయ్యెను. అది నలుదిశలా ప్రసరిల్లి దైత్య సైనికులు సహితము వినిరి. భూ, స్వర్గ, పాతాళములందు ఈ "చిలుక అపహరించబడెను." అను వార్త చే కోలాహలము మిన్నుముట్టెను. అంత శకుని శంకితుడై, త్రిశూల ధారియై గరుడుని వెంబడించెను. గరుడుడు ఆకాశములన కోటి యోజనములు ఎగిరెను. దైత్యుడు సహితము ఆయనను వెన్నంటి త్రిశూలముతో ప్రహరించెను. గరుడుడు క్షత గాత్రుడు అయినప్పటికీ పంజరమును విడువలేదు. అంత సుమేరు పర్వత శిఖరమునకు లక్ష యోజనముల ఎత్తున పంజర సహితముగ శుకము క్రిందపడెను. అంత ఆ పర్వత శిఖరము పై బడి పంజరము ముక్కలై శుకము యొక్క ప్రాణములు అనంత వాయువుల యందు కలిసెను. గరుడుడు శ్రీకృష్ణుని వద్ద కేగెను. శకుని ఖిన్నుడై చంద్రావతీ పురమున కేగెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి గరుడాగమనము అను నలుబదియవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఒకటవ అధ్యాయము

(శకుని ఘోర యుద్ధము; ఏడు సార్లు మరణించి నప్పటికీ భూస్పర్శ తగిలి తిరిగి బ్రతుకుట; శ్రీకృష్ణ భగవానుని యుక్తి ద్వారా శకుని మరణించుట)

నారదుడు "శేషించిన దైత్యులను, నానా విధములయిన అస్త్ర శస్త్రములనూ, తీసికొని, వీరుడయిన శకుని ఉచ్ఛైశ్రవమను హయమును అధిరోహించి, క్రోదోద్రిక్తుడై, ధనువును టంకారము కావించుచూ శ్రీకృష్ణుని ఎదుట సమరము కావించుటకు నిలచెను. రణ దుర్మధుడయిన శకుని తన సైన్య సమేతుడై తిరిగి వచ్చుట కాంచిన యాదవ యోధులు

తిరిగి తమ తమ ఆయుధములు ధరించిరి. అత్తరి ఆ సేనల నడుమ భయంకర యుద్ధము ఆరంభమయ్యెను. సింహము మరియొక సింహముతో రణమొనర్చునట్లు ఇరుపక్షముల యోధులు ఒకరితో ఒకరు తలపడిరి. మేఘ గర్జన కావించుచూ శకుని అందరిముందుకు ఏతెంచెను. శకుని మొదట తన బాణ పరంపర చే సమరాంగణమును అంధకార బంధురము కావించి యాదవ యోధులకు గాయమొనర్చెను. అంత శ్రీకృష్ణ భగవానుడు ఒకే బాణముతో ఆ బాణరాశిని ఖండించెను. సమరమున కోదండము యొక్క నారిని ఆకర్ణాంతము లాగి శకుని పది బాణములతో ఆ బాణరాశిని ఖండించెను. అంత శ్రీహరి పది నారాచములతో శకుని యొక్క వింటి నారిని ఖండించెను. మాయావి అయిన శకుని వందరూపములు ధరించి సమరమారంభించెను. అంత శ్రీ కృష్ణుడు వేయి రూపములు ధరించి సమరము కొనసాగించెను.

మాయావి అయిన శకుని మయాసుర దత్తమయిన అగ్ని తుల్య త్రిశూలమును శ్రీహరిపై విసరెను. అంత ముకుందుడు కుపితుడై అద్దానిని ముక్కలు ముక్కలు గ నరికెను. అంత మురహరి తన కౌమోదకీ గదను శకుని శిరముపై ప్రహరించెను. ఆ గదాఘాతము చే శకుని క్రిందపడి, ఒక్క క్షణము మూర్ఛిల్లి, తిరిగి లేచి, తన గదను తీసికొని మాధవుని పై తిరిగి పోరు సాగించెను. అపుడు సమరాంగణము నందు ఇరువురి నడుమా ఘోరయుద్ధము జరిగెను. రెండు గదలు ఒక దాని నొకటి కొట్టుకొనుట చే ఠణ, ఠణ ధ్వనులు పెల్లుబికెను. శ్రీకృష్ణుని గదా ఘాతము చే శకుని గద చూర్ణమై భూమి పై పడి నిప్పుకణిక వలె దగ్ధమయ్యెను. రణ భూమి యందు రెండు మదించిన కుంజరముల వలె, రెండు బలిష్ఠమయిన సింహముల వలె వారిరువురు సంగ్రామము కొనసాగించిరి. శకుని శ్రీకృష్ణుని వంద యోజనములు వెనుకకు త్రోసెను. అంత శ్రీహరి దైత్యుని వేయి యోజనములు వెనుకకు త్రోసెను. అంత త్రిభువన నాధుడు, నారాయణుడు శకుని యొక్క భుజములు, తొడలు పట్టుకొని బాలుడు కమండలమును విసురునట్లు విసురుగ భూమిపై విసరెను. అంత శకుని భూమిపైబడి, వ్యధితుడై తిరిగి లేచి, “జారుధి” పర్వతమును పెరకి శ్రీ కృష్ణుని పై విసరెను. శ్రీహరి ఆ పర్వతమును పట్టి తిరిగి దైత్యుని పై ప్రయోగించెను.

ఈ విధముగ జయ శబ్దము కావించుచూ వారిరువురూ ఒకరిపై ఒకరు ఆ పర్వతమును విసురుకొనుచు, ఆ పర్వత ఘాతముల చే వారిరువరూ చంద్రావతీ నగరమును సహితము చూర్ణము కావించిరి. ఆ సమయమున మిక్కిలి కుపితుడై శకుని డాలు, ఖడ్గములు చేతబట్టి శ్రీకృష్ణుని ముందుకు వచ్చెను. అంత ముకుందుడు శాంగ ధనువు నెత్తి, ఒక అర్ధ చంద్రాకారపు బాణమును సంధించెను. అయ్యది గ్రీష్మ ఋతువు నందలి సూర్యుని వలె వెలుగుచూ, దిగ్మండలమును ఉద్భాసితము కావించుచూ, శకుని యొక్క మస్తకమును ఖండించెను. అంత శకుని ప్రాణశూన్యుడై భూమిపై పడెను. ఆతని శరీరమునకు భూమి స్పర్శ తగిలిన వెంటనే ఆతడు పునర్జీవితుడై తిరిగి లేచి సమరము ఆరంభించెను. ఈ విధముగ ఏడు సార్లు మరణించి నప్పటికీ ఆతడు పునర్జీవితుడు అగుచునే యుండెను. ఈ సారి ఆతడు సమస్త యాదవ కుల నాశనమునకై సమకట్టి ఆ మహాదైత్యుడు యాదవ సేన యందు ప్రవేశించి, హయ, గజములను, వాటిని అధిరోహించిన వారితో సహితముగ పట్టి ఆకాశమున లక్ష యోజనములు దూరము విసురుట నారంభించెను.

కొన్ని ఏనుగులను ముఖము, కొన్ని కాళ్ళు, కొన్నింటికి ఉదరము పట్టుకొని విసరుచు కాలాగ్ని రుద్రుని వలె విజృంభించి యాదవ సైన్య నాశనము కావించుచుండెను. ఆ దైత్యుడు తన పద ఘట్టనలతో ఎందరో యోధులను, సైనికులను త్రొక్కుచూ యాదవ సైన్యమును కకా వికలు గావించెను. అంత ఆర్త త్రాణ పరాయణుడు, విశ్వ రక్షకుడు, శ్రీకృష్ణ భగవానుడు సాధు పురుషుల రక్షణకై తన సుదర్శన చక్రమును ప్రయోగించెను. ప్రళయకాల కోటి సూర్యుల పగిది భాసించు సుదర్శనము ఆయన చేతి నుండి కదిలి వజ్రాయుధము వృత్రాసురుని ఖండించిన విధమున శకుని యొక్క శిరమును ఖండించెను. అంత శ్రీహరి శకుని యొక్క శరీరమును ఆకాశము నందు విసరెను. అంత మాధవుడు యాదవులను “ఈ శరీరమును బాణములతో ఆకాశమున యుంచవలసినది.” అని సూచించెను. యాదవ వీరులు ఆకాశము నుండి క్రిందపడుచున్న శరీరమును తను బాణములతో పైకి పంపు చుండిరి. దీప్తిమానుడు దైత్య సైనికులు చూచుచుండగా తన బాణము చే శకుని శిరమును వంద యోజనములు ఆకాశము లోనికి పంపెను. పిదప సాంబుడు వెయ్యి యోజనముల పైకి పంపెను. ఆ శరీరము తిరిగి క్రింద పడుచుండగా అర్జునుడు తన బాణముతో ప్రహరించగా అయ్యది పదివేల యోజనములు ఆకాశము నందు ఎగరెను. తిరిగి క్రింద పడుచుండగా అనిరుద్ధుడు తన సాయకములచే

లక్ష యోజనముల దూరము కొట్టెను. తిరిగి క్రిందికి వచ్చుచుండగా ప్రద్యుమ్నుడు తన నారాచములతో పది లక్షల యోజనములు దూరము కొట్టెను. అది తిరిది క్రింద పడుచుండగా యోగేశ్వరేశ్వరుడయిన శ్రీకృష్ణుడు తన సాయకముల చే ఆ దేహమును ఒక కోటి యోజనముల దూరము కొట్టెను. మరియొక బాణముతో ఆ దివంగత శరీరమును ప్రహరించగా అయ్యది ఆ మొండెమును అన్ని దిశలమందు త్రిప్పి త్రిప్పి చివరకు సాగరమున పడవైచెను. ఈ విదముగ దైత్యుని మరణానంతరము ఒక దివ్య జ్యోతి ఆ శరీరము నుండి వెలువడి, శ్రీకృష్ణుని యందు విలీనమయ్యెను. గంధర్వ, కిన్నెరలు శ్రీహరి యొక్క యశోగానమును కీర్తించిరి. విద్యాధర, గంధర్వ, కన్నియలు నాట్యము గావించిరి. సిద్ధ, చారణులు ఆయనను స్థుతించిరి. సమస్త ఋషి, ముని గణములు ఆయనను ప్రశంశించిరి. బ్రహ్మ, రుద్ర, ఇంద్ర, దిక్పాలాది సమస్త దేవతలు ఏతెంచి శ్రీ కృష్ణ భగవానునిపై పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి శకుని దైత్యుని వధ అను నలుబది ఒకటవ అధ్యాయము సమాప్తము)

నలుబది రెండవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు యాదవ సహితుడై చంద్రావతీ నగరమున కేగి శకుని పుత్రులకు ఆ రాజ్యము నిచ్చుట; తదుపరి శకుని మొదలగు వారి పూర్వ జన్మ వృత్తాంతము)

నారదుడు “మహారాజా! చావగా మిగిలిన దైత్యులందరూ పలాయనమొనర్చిరి. వేణు, వీణా, మృదంగ, దుందుభి నాదములు మ్రోగుచుండగా, వందిమాగధుల తన యశస్సును కీర్తించుచుండగా, పుత్ర, పౌత్ర, ఇతర యాదవ వీరులు తో పరివేష్ఠితుడై, శంక, చక్ర, గదా, పద్మ, శాంగ ధనువులతో శుశోభితుడై, దేవతా సహితుడై శ్రీహరి చంద్రావతీ నగరము ప్రవేశించెను. అచట, తన పతి మరణించుట చే రాణి మదాలస తన పుత్రుని ఒడిలోనికి తీసికొని, దు:ఖాతురయై, అత్యంత కరుణా పూరితముగ దు:ఖించు చుండెను. ఆమె ముఖము నుండి అశ్రుధారలు ప్రవహించుచూ అత్యంత దీనురాలై యున్నది. ఆమె చేతులు జోడించి, తన పుత్రుని శ్రీహరి పదములపై పడవైచి భగవానునికి నమస్కరించుచూ ఇట్లనియె “ప్రభూ! ఆది దేవా! మీరు భూభార హరణమునకై యదుకులమందు అవతరించిరి. మీరే ఈ సంసారమును సృజించి, తుదకు నాశనము కావించు చున్నారు. కానీ మీరు గుణాతీతులు. నేను మీ కృపాకటాక్షముల కై మీ చరణార విందములకు ప్రమాణము లర్పించుచున్నాను. నా పుత్రుడు మీ వలన మిక్కిలి భయమునొంది యున్నాడు. ఈతనిని రక్షించి, ఈతని మస్తకముపై మీ వరద హస్తమునుంచవలసినది. జగన్నివాసా! నా భర్త మీ యందు ఆచరించిన అపరాధములను మన్నింప వలసినది.”

మదాలస యొక్క ఈ విన్నపమును ఆలకించిన శ్రీకృష్ణ భగవానుదు శకుని పుత్రునిపై తన రెండు హస్తములుంచి, దీవించి, శకుని యొక్క రాజ్యమును సంపూర్ణముగ తిరిగి ఇచ్చివైసెను. అంతేకాక కల్పాంతము వరకు నిలిచియుండు ఆయువును, వైరాగ్య పూర్ణమయిన జ్ఞానమును, తన యందు నిశ్చల భక్తినీ ప్రసాదించెను. అంత ఆ శకుని కుమారునకు తన మెడలోని మాలను తీసి ఇచ్చి దీవించెను. పిదప అంతకు మునుపు శకుని దేవేంద్రుని నుండి కైవశము చేసికొనిన ఉచ్చైశ్రవము, చింతామణి, కామధేనువు, కల్పవృక్షములను తిరిగి దేవేంద్రునకు ఇప్పించెను.

బహుళాశ్వుడు “దేవర్షీ! ఈ శకుని మొదలగు దైత్యులు ఎవరు? ఎందువలన మీరు మోక్షమును ప్రాప్తించిరి? వీరి విషయమై నాకు మిక్కిలి ఆశ్చర్యము కలుగుచున్నది.”

నారదుడు “మహారాజా! పూర్వ కాలమున బ్రహ్మ కల్పమందు “పరావసువు” అను గంధర్వ చక్రవర్తి కలదు. ఆతనికి తొమ్మిది మంది పుత్రులు కలరు. వారు అందరూ కామదేవుని వంటి రూప యవ్వన శాలులు, దివ్య భూషణ, భూషితులు, మరియు గీత, వాద్య విశారదులు. వారు ప్రతి దినము బ్రహ్మ లోకమందు గానము చేయుచుండిరి. వారు

వరుసగా మందార, మందర, మంద, మందహాస, మహాబల, సుదేవ, సుఘన, సౌధ, శ్రీభాను అను నామధేయులు. ఒకప్పుడు బ్రహ్మదేవుడు తన పుత్రి అయిన వాగ్దేవత సరస్వతీదేవిని మోహ పరవశుడై కాంచెను. విధాత వ్యవహారమును కాంచిన పరావసు పుత్రులు మనసున నవ్విరి. సుర శ్రేష్ఠుడయిన బ్రహ్మ దేవుని గూర్చి హేళనగా నవ్వుట చే వారు అసురయోని యందు జన్మించవలసి వచ్చెను. శ్వేత వరాహ కల్పమందు వారు తొమ్మిదిమంది హిరణ్యాక్ష పత్ని యొక్క గర్భమందు జన్మించిరి. ఆ సమయమున వారు శకుని, శంబర, హృష్ఠ, భూత సంతాపన, వృక, కాలనాభ, మహానాభ, హరిశమశ్ను మరియు ఉత్కచ నామధేయులు.

ఒకానాడు తమ గృహమున కేతెంచిన అపాంతరమునిని భక్తితో పూజించి వారందరూ మిక్కిలి భక్తి ప్రపత్తులతో ఆయనను ఇట్లు ప్రశ్నించిరి. "స్వామీ! కైవల్యమునకు స్వామి సాక్షాత్ శ్రీహరి. ఆ భక్త వత్సలుడు భక్తులకు మోక్షమును ప్రసాదించును. కానీ మేము అసురయోనులందు జన్మించియున్నాము. ఎల్లప్పుడూ కుసంగము నందు తత్పరులమై యుండి దుష్ఠులమై యుంటిమి. మేము భగవద్భక్తిని అచరింపలేదు. మరి మాకు కైవల్య ప్రాప్తి ఎట్లు కలుగును? బ్రహ్మన్! మాకు పరమ కళ్యాణము కావించు ఉపాయమును తెలుపవలసినది. మీరు దీన జనులను ఉద్ధరించుటకు మాత్రమే జగమున చరించెదరు."

అపాంతరముడు సంతుష్ఠుడై ఇట్లనియె "దైత్య కుమారులారా! గుణములు వేరువేరుగ యుండవు. ఎవరూ కూడ తమ గుణములకు వేరుగ యుండరు. ఎవరు తమ గుణముల ద్వారా మోక్షాధీశుడు, గుణాతీతుడు అయిన నారాయణుని భజింతురో, ఆ దైత్యులు సహితము పరమాత్మ నొందిరి. ఎవరు ఐక్యత, సాహార్ద్రత, స్నేహము, భయము, క్రోధము మరియు అభిమానము, ఈ భావముల ద్వారా ఎవరు ఎల్లప్పుడూ శ్రీహరిని స్మరించెదరో వారందరూ (దైత్యులు) ఆయన యందే ఐక్యమయిరి. ఉదాహరణకు పృశ్ని గర్భుని తో ఐక్యత (ఒకే కులము, కుటుంబము, గోత్రము) కలిగి ప్రజాపతి గణములు ముక్తి నొందినవి. భగవానుని యందు సాహార్ద్రత కలిగి కయాధు పుత్రుడయిన ప్రహ్లాదుడు భగవానుని ప్రాప్తించెను.

శ్రీహరి యందలి స్నేహము చే మునులు, భయము చే హిరణ్య కశిపుడు, క్రోధము చే మీ తండ్రి హిరణ్యాక్షుడు, అభిమానము చే శృతులు, యోగి జనులు సహితము దుర్లభమయిన మోక్షమును పొందిరి. ఎవరు ఏ భావము చేత నయిననూ శ్రీకృష్ణుని మనసున యుంచుకొనవలెను. దేవతలు భక్తి భావము చే ఆయనను హృదయము నందుంచుకొని ఆయన ధామమును ప్రాప్తించెదరు. ఈ విధముగ పలికి ఆయన అంతర్ధానుడయ్యెను. ఆ రోజు నుండి శకుని మొదలగు వారు వైర భావమున శ్రీహరిని మనస్సుల యందు స్థాపించుకొనిరి. వారు వైర భావము చేతనే శ్రీహరి పధమును ప్రాప్తినొందిరి."

నారదుడు "మహారాజా! ఇందు ఆశ్చర్యమునకు తావులేదు. భ్రమర కీట న్యాయము చే కీటకము భ్రమర మగునట్లు ఎవరు భగవంతుని నిరంతరము స్మరించు చుందురో వారు భగవంతునే చేరెదరు."

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి శకుని పుత్రునిపై కృప యను నలుబది రెండవ అధ్యాయము సమాప్తము)

నలుబది మూడవ అధ్యాయము

(ఇలావృత వర్షము మందు శోభన మహారాజు నుండి బహుమతు లందుట; స్వాయంభువమనువు యొక్క తపోభూమి యందు సిద్ధులన్నియు రూపములతో ప్రకాశించుట; లీలావతీ పురము నందు అగ్ని దేవుని ఉపాయ ఉపలబ్ది; వేద నగరమందు మూర్తీభవించిన వేద, రాగ, తాళ, స్వర, గ్రామ, మరియు నృత్యముల భేదము.)

ఈ విధముగ భద్రాశ్వ నగరముపై విజయము సాధించి యాదవేశ్వరుడు ఇలావృత వర్షమున కేగెను. ఈ ఇలావృత వర్షమునందే భూకమలకమునకు కర్ణిక అనదగినది, రత్న మయ శిఖరములు కలది, దేవతా నివాస స్థానము,

సర్వగిరి రాజాధిరాజ మయిన సుమేరు పర్వతము కలదు. ఆ మహా పర్వతమునకు నలుప్రక్కలా మంధరము, మేరు మంధరము, సుపార్శ్వము, మరియు కుముదము అను నాలుగు పర్వతములు శోభించుచున్నవి. ఈ చతుర్పర్వత సహితమై శోభించు సుమేరువు ధర్మార్థ కామ మోక్షము లనెడు చతుర్విధ పురాషార్థయుక్తమయిన మనోరధము వలె ప్రకాశించుచున్నది. ఈ ఇలావృత వర్షమందు జాంబూరసము చే ఉత్పన్నమగు ఒక విధమయిన స్వర్ణము ఉపలభ్యమగును. ఇచటనే జంబూరసము చే "అరుణోద" మను నది ప్రవహించుచున్నది. ఈ నదీ జలము త్రాగుట చే భూతలమందు ఏ విధమయిన రోగములు అంకురింపవు. అంతేకాక ఇచటి కదంబ వృక్షముల నుండి కాదంబమను మధువు పంచధారలుగ ప్రవహించుచున్నది. ఈ మధుసేవనము చే శరీరము నందు జలుబు, జ్వరము, వివర్ణత, అలసట, మరియు శరీరము నందు దుర్గంధము మొదలయిన దోషములు ఉత్పన్నమవవు. ఆ మధుధారలచే కామ్య పూరకమయిన నదులు ప్రకటిత మయినవి. ఈ నదులు మనుజుల యొక్క ఇచ్ఛానుసారము రత్న, వస్త్ర, భూషణ, ఆసన, శయ్యా, మరియు అన్నము మొదలగు పదార్థములు ప్రసాదించునవి. అచట సుప్రసిద్ధమయిన "ఊర్థ్వ" వనము కలదు. ఇందు సంకర్షణ భగవానుడు విరాజిల్లు చుండును. ఈ వనము నందు శివుడు తన ప్రేయసి అయి శివానితో క్రీడించుచుండును. ఈ వనము నందు ప్రవేశించిన పురుషులు సహితము స్త్రీలుగా రూపాంతరము చెందెదరు. ఇచట స్వర్ణమయ పుష్పములు, శీతల సుగంధ మారుతము, కేసరీ వృక్షములు, లవంగలతలు, వీటన్నిటినీ అఘ్రాణించు మత్త మధుపములు, వీటితో ఇలావృత వర్ణమంతయు మిక్కిలి శోభించుచున్నది. అచటి భూమి అంతయు వైఢూర్య మణుల రజము తో నిండి మెరయుచున్నట్లు యున్నది. భగవానుడయిన శ్రీహరి, అలంకారయుక్త, దేవతామండిత మయిన ఇలాకృత వర్షమును జయించి బహుమతులు గైకొనెను. పూర్వకాలమున సత్యయుగ మందు ముచికుంద మహారాజు జామాత అయిన శోభనుని ఏకాదశీ వ్రతమునకు ప్రీతి చెంది దేవతలు ఆయనకు మందరాచల నివాసము నొసగిరి.

ఇప్పటికీ అరాకుమారుడు తన భార్య అయిన చంద్రభాగాదేవి సహితుడై, కుబేరుని వలె భాసించుచూ అచటనే నివసించుచుండెను. ఆ పరమ సుందరుడయిన శోభనుడు బహుమతులు గైకొని, శ్రీకృష్ణ సమ్ముఖమునకు ఏతెంచి, యదుకుల తిలకుడయిన శ్రీహరికి ప్రదక్షిణ ప్రమాణము లాచరించి, బహుమతులొసంగి, తిరిగి మందరా చలమునకు చనెను. ఈ మందరాచల శిఖరము నందు రత్నమయకమలములు పూయు దివ్య సరోవరము కలదు. అద్దానిని కాంచి కిరీటి అర్జునుడు మాధవుని "దేవకీ నందనా! స్వర్ణమయ లతాపుష్ప భరితమయిన ఈ సరోవర మెవ్వరిది? నాకు దయచేసి తెలుపవలసినది".

శ్రీకృష్ణుడు "అర్జునా! స్వాయంభువ మనువు యొక్క కులమునందు ఉదయించిన రాజాధిరాజు పృధువు ఇచట తపమొనర్చెను. ఈ అద్భుతకుండము ఆయనదే!! ఇందలి జలము త్రాగుటచే జనులు సర్వపాప విముక్తులు అగుదురు. ఇందు స్నానమాచరించుట చే ఇతర ప్రాణులు సహితము నా పరమ ధామము చేరుదురు." ఇట్లు పలికి భగవానుడు ఒక తపో భూమి యందు ప్రవేశించెను. ఆచట అష్ఠ సిద్ధులు రూపములు ధరించి నాట్యము చేయుచుండెను. అ సిద్ధులను అవలోకించి ఉద్దవుడు భగవానుని ఇట్లు ప్రశ్నించెను. "భగవాన్! మందరాచల సమీపమునున్న ఈ తపోభూమి ఎవరిది? ఇందు మూర్తిమానులయిన స్త్రీ మూర్తులెవరు? దయచేసి తెలుపవలసినది." భగవానుడు "ఉద్దవా! ఇచట పూర్వ కాలమందు స్వాయంభువ మనువు తపమాచరించెను. ఇది ఆయన యొక్క తపోభూమి. ఇప్పటికీ ఇయ్యది పరమ కళ్యాణ కారిణి. ఇచటనే అష్ఠ సిద్ధులు నారీరూప ధారణ చేసి ప్రకటితమగుచున్నవి. ఇందువలన ఈ తపోభూమి యందు ఎవరు ప్రవేశించెదరో, వారికి సహితము అష్ఠసిద్ధులూ సిద్ధించును. ఇచట ఒక్క క్షణము తపమాచరించిననూ మానవుడు దేవత్వమును పొందును. సాక్షాత్ చతుర్ముఖ బ్రహ్మ దేవుడు సహితము ఈ తపోభూమి యొక్క మహాత్మ్యమును వర్ణింపనశక్యుడు." ఈ విధముగ పలికి దుందుభులు మ్రోగించుచూ, శ్రీకృష్ణ భగవానుడు పూర్వము హిరణ్యకశిపుడు తపమాచరించిన ఉత్కృష్ఠ నగరమున కేగెను. ప్రస్తుతము ఇచ్చట లీలావతి అను సుందర స్వర్ణమయ నగరము యున్నది. ఈ నగరమునకు స్వామి సాక్షాత్ అగ్నిదేవుడు, వీతిహోత్ర నామధేయుడు. ఆతడు నిత్యము వ్రతపాలనము కావించుచూ ఒక దేహము ధరించి నగర పాలనము కావించుచుండెను. ఆ ధనుంజయ దేవుడు సహితము పరమ పురుషుడయిన శ్రీకృష్ణునికి బహుమతులొసంగెను.

ఈ విధముగ ఇలావృత వర్షమును వీక్షించుచూ శ్రీకృష్ణ భగవానుడు వేద నగరమున కేగెను. అయ్యది జంబూ ద్వీపమునందలి అత్యంత మనోహర స్థానము. ఆ నగరమందు వేదములు ఒక రూపము ధరించి కనిపించుచుండును. ఆ వేద సభ యందు వీణా పుస్తకధారిణి, వాగ్దేవత, సాక్షాత్ సరస్వతీ దేవి సమస్త మంగళములకు అధిష్ఠాన భూతుడయిన శ్రీకృష్ణ భగవానుని దివ్య మంగళ చరిత్రమును గానము చేయుచుండును.

ఊర్వశి, విప్రచిత్తి మొదలగు అప్సరసలు నాట్యము చేయుచూ తమ హావభావ కటాక్షముల తో వేద పురుషుని సేవించుచుండిరి. నేను (నారదుడు), విశ్వావసువు, తుంబురుడు, సుదర్శనుడు, చిత్రరథుడు మొదలగు వారందరూ వీణా, వేణు, మృదంగ, మురయిష్ఠి మొదలగు వాద్యములను, కరతాళ ధ్వనులతో మేళవించి వాయించుచుందురు. అచట హ్రస్వ, దీర్ఘ, ప్లుత, ఉదాత్త, అనుదాత్త, స్వరిత, సానునాసిక, నిరసానునాసిక, అను వివిధ భేదముల ననుసరించుచూ, స్థుతులు గానము చేయబడు చుండును. వేద పురము నందు ఎనిమిది తాళములు, సప్త స్వరములు, మూడు గ్రామములు, ఒక్కొక్కటి ఒక్కొక్క రూపము ధరించి భాసించుచుండును. అంతేకాక అచట రాగ రాగిణులు – భైరవ, మేఘమల్హార్, దీపక, మాలకోశ, శ్రీరాగ, హిందోళ మొదలగు రాగములు; వీరికి అయిదు మంది స్త్రీలు–రాగిణలు; ఒక్కొక్కరికి ఎనిమిది మంది పుత్రులు, వీరందరూ ఒక్కొక్కరు ఒక్కొక్క రూపము ధరించి ఆ వేద నగరము నందు సంచరించుచుందురు.

భైరవ రాగము “ఖాఖీ” రంగునందు, మాలకోశము చిలుక వంటి ఆకుపచ్చ రంగులోనూ, మేఘమల్హారము నెమలి వలెను, దీపకము స్వర్ణ తేజస్సుతోనూ, శ్రీరాగము అరుణ వర్ణముతోనూ, హిందోళము దివ్య హంస వలె తెల్లని వర్ణముతోనూ యుండును. బహుళాశ్వుడు “ముని శ్రేష్ఠా! తాళము, స్వరము, గ్రామము మరియు నృత్యము వీని యందు ఎన్ని భేదములు కలవు? వీనిని గూర్చి పూర్ణముగ తెలుపవలసినది”. నారదుడు “మహారాజా! తాళములు ఎనిమిది. అవి రూపకము, చర్చరీకము, పరమతము, విరాటము, కదుతము, మల్లకము, ఘటితము, మరియు జుటము. గ్రామములు మూడు. అవి మాధుర్యము, గాంధారము, మరియు ధ్రౌవ్యము. స్వరములు ఏడు. అవి నిషధము, ఋషభము, గాంధారము, షడ్జము, మధ్యము, దైవతము, మరియు పంచమము. నృత్యములు ఎనిమిది. అవి రాసము, తాండవము, నాట్యము, గాంధర్వము, కైనరము, విద్యాధరము, గౌహ్యకము మరియు అప్సరసము. అవన్నియు పది, పది హావ భావములతో అనుభవయుక్తమై యుండును.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి “వేదనగర వర్ణనము” అను నలుబది మూడవ అధ్యాయము సమాప్తము)

నలుబది నాల్గవ అధ్యాయము

(రాగిణిలు, మరియు రాగ పుత్రుల నామములు; వేదాదులచే భగవానుని స్థవనము)

బహుళాశ్వుడు “దేవర్షీ! నాకు రాగిణులు, రాగ పుత్రుల నామములు తెలుపవలసినది.” నారదుడు “మహారాజా! దేశ, కాల, స్వర, మిశ్రిత, క్రియా భేదముల ద్వారా విద్వాంసులు గీతములను ఏబది ఆరు కోట్లు గా విభజించిరి. వాని యందలి అంతర్భేదములు అనంతములు. శుద్ధ బ్రహ్మమయమయిన, ఆనంద స్వరూపుడయిన శ్రీహరినే నీవు రాగము గ తెలిసికొనుము. వీని యందలి ముఖ్య భేదములను నీకు వివరింతును.

భైరవ రాగము యొక్క పంచ రాగిణులు – పింగళ, శంఖీ, లీలావతీ, భైరవీ, మరియు అగరీ అనునని.

భైరవి రాగ పుత్రులు – మహర్షీ, సమృద్ధ, పింగళ, మగధ, బిలాబిల, వైశాఖ, లలిత, పంచమ అనువారలు.

మేఘ మల్హార్ యొక్క పంచ రాగిణిలు – చిత్ర, జయజయవంతీ, విచిత్ర, వ్రజమల్లారి, అంధకారీ.

మేఘ మల్హార రాగ పుత్రులు – శ్యామకార, సోరఠ, నట, ఉడ్డాయన, కేదార, వ్రజరహస్య, జలధార, విహగ.

దీపకము యొక్క పంచరాగిణిలు – కంచుకీ, మంజరీ, తోడి, గుర్జరీ, శాబరీ
రాగపుత్రులు – మేఘ, మచట, మారుమాచార, కౌశికీ, చంద్రహార, ఘంఘట, విహార, నంద.
శ్రీరాగ రాగిణిలు – బైరాటీ, కర్ణాటీ, గౌరీ, గౌరావటీ, చతుశ్చంద్రకళ.
రాగ పుత్రులు – సారంగ, సాగర, గౌర, మరుత్, పంచశర, గోవింద, హమీర, గౌర్భీర.
హిందోళ రాగిణిలు – వసంతీ, పరజా, హేరీ, తైలంగీ, సుందరి.
రాగ పుత్రులు – మంగళ, వసంత, వినోద, కుముద, వీహితి, విభాస, స్వర, మండల.

బహుళాశ్వుడు "మహామునీ! పరమాత్ముడయిన శ్రీహరి యొక్క శుద్ధ బ్రహ్మ స్వరూపమయిన వేదము రాగమండల మందు హిందోళముగ ప్రసిద్ది నొందినది. వాని యొక్క వివిధ అంగము లేవి?" నారదుడు "మహారాజా! వేద స్వరూపుడయిన శ్రీహరి ముఖమే వ్యాకరణము. చంధస్సు ఆయన పాదములు. మీమాంస శాస్త్రము (కర్మకాండ) చేతులు, జ్యోతిశ్శాస్త్రము నేత్రములు, ఆయుర్వేదము పృష్ఠము, ధనుర్వేదము వక్షస్థలము, గాంధర్వ వేదము ముక్కు, వైషేశిక శాస్త్రము మనస్సు. సాంఖ్యము బుద్ధి, న్యాయవాదము అహంకారము, వేదాంతము చిత్తము. రాగరూప శాస్త్రమంతము ఆయన విహారస్థలము.

బహుళాశ్వుడు "మహర్షీ! ఈ వేద పురమున కరిగి భగవానుడు ఏమి చేసెను?" నారదుడు "మహారాజా! యాదవేశ్వరుడయిన శ్రీహరి వేదపురికి ఏతెంచిన పిదప వేదము సరస్వతీ సహితుడై బహుమతులు గైకొని ఎదురేగెను. గంధర్వ, అప్సర, గ్రామ, తాళ, రాగ స్వరము లన్నియు వారితో కలసి వెళ్ళినవి. దేవతలకు సహితము దేవతా స్వరూపుడయిన భగవానుడు జనార్ధనుడు వేద పురుషుని గాంచి ప్రసన్నుడై సమస్త యాదవ గణముల సమక్షమున ఇట్లనియె "నిగమా! నీ మనసునందున్న ఏ కోరికయైననూ కోరుకొనుము. నేను ప్రసన్నుడనైన పిదప త్రిలోకముల యందునూ ఏ వస్తువు కూడా దుర్లభము కాదు." అంత వేదము "మహాప్రభో! మీరు నా యందు ప్రసన్నులయిన ఎడల నా ఉత్తమ పార్షదులందరికీ మీ దివ్య రూప సందర్శనము కావింపవలసినది. అత్యంత తేజోమయమయిన మీ నిజధామము గోలోకము నందలి మీ స్వరూపము, మరియు బృందావనము, రాసమండలి యందలి మీ రూపమును మీ ఈ పార్షదులందరూ దర్శించుటకు కాంక్షులగుచున్నారు." వేదము యొక్క విన్నపమును వినిన శ్రీకృష్ణ భగవానుడు శ్రీరాధాదేవి తో కలసిన తన దివ్యరూపమును వారికి చూపించెను. ఆ అనుపమ సుందర రూపమును గాంచి ఎల్లరూ మూర్ఛితులైరి. వారు తమ మన: శరీరములను మరచి సాత్విక భావావేశపరులయిరి. వారందరూ హర్షోల్లాసితులై, సత్పురుషుల సమక్షమున గానము నాలపించి నాట్యము చేసిరి. భగవానుని యొక్క మాధుర్య రూపము ఎట్లు వినిపింపబడినదో, అట్లే చూడబడినది. అట్లే వేదాదుల చే ఈ విధముగ స్థుతింపబడినది. "మహాప్రభూ! మీరు జ్ఞాన స్వరూపులు. సత్, అసత్తులకు పరమయిన, వారు. సర్వ వ్యాపకులు, సనాతనులు, ప్రశాంత రూపులు, జడశక్తి స్వరూపులు, సములు, మహత్వము కలవారు. స్వయంప్రకాశులు, పరమ దుర్లభులు పరాత్పరులు; మీ చిన్మయ ప్రకాశము చే భ్రమ లేక అజ్ఞానాంధ కారములను పటాపంటలు చేయువారయిన పరబ్రహ్మము. మహాప్రభూ! మీకు నమస్కారము."

సరస్వతీ దేవి "భగవాన్! యోగులు మిమ్ము పరంజ్యోతి స్వరూపులుగ ఎరుగుదురు. భక్త జనులు మిమ్ము చిన్మయ విగ్రహునిగా పేర్కొందురు. ఈ రోజు మీ చరణారవింద దర్శనమయిన పిదప ఆ భక్తి యోగముల గమ్యము మీరే అని అవగతమయినది. మీ పాదాబ్జములు నాకు కళ్యాణ కరములగు గాక! గంధర్వులు "ప్రభూ! శ్యామ, గౌర రూపములతో మీరే మీ స్వప్రకాశముచే ప్రకటీ కృతులగు చున్నారు. ఈ యుగళ రూపముల చే మేఘము, దాని యందలి విద్యున్మాల వలె మీరు శోభించు చున్నారు. అప్సరసలు "తమాలము సువర్ణ లతల చేతనూ మేఘము మెరుపుతీగ చేతనూ, నీలము సువర్ణము చేతనూ, శోభించునట్లు మీరు ఆదిపురుషులయిన శ్యామసుందరులు, శ్రీరాధాదేవి యొక్క నిత్య సహచర్యముల చే శోభించు చున్నారు." సంగీము నందలి మూడు స్థాయిలు (గ్రామములు) ఇట్లనియె "ఎవరి చరణ రజమును మహాదేవుడయిన శివుడు, శ్రీ లక్ష్మీదేవి, సమస్త జ్ఞాన పురుషులు, శ్రీరాధా సహితముగ దేవతలు, తమ హృదయము నందు ధారణ చేయుదురో, అట్టి మాధవుని చరణారవిందములను నిరంతరము భజయ చేయవలసినది. తాళములు "ఎవరి కారణమున బలిచక్రవర్తి సాత్విక రూపుడయ్యెనో, అట్టి భగవానునకు మన మనస్సును అర్పింప వలయును. మన మనో గుహాంతరాళమున శ్రీహరి యొక్క చరణార విందములను ప్రతిష్ఠించి, అద్దానిని సేవింప వలెను." గానములు

(లయలు) "సత్పురుషులు ఎవరి శరణుజొచ్చి దు:ఖ శోకములను విసిరి వేయుదురో, అట్టి రాధామాధవుల చరణములను మన హృదయ కమలమందు సదా ప్రతిష్ఠించు కొనవలెను." స్వరములు "ఎవరు శరదృతువు నందలి ప్రఫుల్ల, కమలముల శోభను తిరస్కరించగలరో, ఎవరిని మునిరూప భ్రమరములు ఎల్లప్పుడూ ఆస్వాదనము చేయుచుండునో, ఎవరు శంఖ, చక్ర కమలము లాది చిహ్నములతో శోభించుచుండునో, ఎవరి పాదములందు సువర్ణ ఖచిత నూపురములు మెరయు చుండునో, ఎవరు భక్తుల త్రివిధ తాపములను ఉన్మూలనము కావించెదరో, అట్టి రాధావల్లభుని దివ్య మంగళ చరణార విందములను మేము ఎల్లప్పుడూ ధారణ చేయుదుము గాక!!"

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండాగ్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి వేదాదుల ద్వారా భగవానుని స్తుతి అను నలుబది నాల్గవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఐదవ అధ్యాయము

(రాగిణిలు, రాగ పుత్రుల ద్వారా శ్రీకృష్ణ భగవానుని స్థవనము; శ్రీకృష్ణుడు ద్వారకాపురికి పయనమగుట)

నారదుడు "మహారాజా! తన తదనంతరము భైరవాది రాగ గణములు శ్రీహరి యొక్క రూపమును తమ కన్నులతో త్రావుచూ, ఆయన యొక్క ప్రతి అవయవమునూ, దర్శించుచూ హర్షోల్లాసితులైరి. శ్రీహరి యొక్క ఏఏ అంగములందు వారి దృష్టి పడిననూ అక్కడి నుండి వేరొక చోటికి మరలుట లేదు. ఆ రూప లావణ్యానుభవము కావించుచూ, వాని నుండి వెనుకకు మరలుటకు అసమర్థులయిరి. ఇట్లు అద్భుత రూపమును దర్శించుచూ మరల మరల ఆయన యశోగుణములను గానము చేయుచుండిరి. భైరవ రాగము "కమలాదేవి నిరంతరము తన ఒడి లోనికి తీసికుని, తన కమలముల వంటి కరముల తో సేవించు శ్రీహరి యొక్క పాదములను సదా చింతించవలెను." మేఘమల్హార్ రాగము "సర్వవ్యాప్తి అయిన శ్రీకృష్ణ భగవానుని ఊరువులు కదళీతరువులు, సువర్ణ స్థంభములు, తేజోమయములు, అనుపమ శోభాసంపన్నములు. అవి పీతాంబరము చే కప్పబడినవి. ఆ వందనీయ ఊరువులను నేను నిరంతరము ధ్యానించెదను." దీపకరాగము "భగవానుని కటి ప్రదేశమున నుండి క్రింద వరకూ గల రెండు కాళ్ళు, సమస్త సుఖదాయకములు మరియు సువర్ణ ప్రకాశము కలిగినవి. ఆ సుప్రసిద్ధ చరణములను భజింపవలసినది." మాలకోశ రాగము "శ్రీహరి భగవానుని నడుము అతి సన్ననిది. మలయమారుతము చే సహితము కంపితమగునది. ఆ కటి ప్రదేశమును చూచినంతనే మానవులు మోహితులగుదరు. నేను వినమ్రుడనై ఆయనకు వందనము లర్పించుచున్నాను." శ్రీరాగము "శ్రీరాధా వల్లభుని నాభి సరోవరము ను నేను నా హృదయము నందు ప్రతిష్ఠించుకొని ధ్యానించుచున్నాను. అయ్యది త్రివిధములయిన లహరీ వళులతో కూడిన పుష్కర కుండము వలె మిక్కిలి సుందరముగ యున్నది. అచట గల రోమావళి కామదేవుని క్రీడా వనమును సహితము తిరస్కరించు సౌందర్యాతిశయముతో కూడియున్నది." హిందోళము "ఆయన ఉదరము నందుగల మూడు సన్నని గీతలు వర్ణమాల కాదుగదా? అయ్యది రావి ఆకులపై వ్రాయబడిన మోహనమాల వలె యున్నది. ఉదరము పై గల రోమావళి కమల దళములను సహితము తిరస్కరించును."

భైరవ రాగ రాగిణులు "శ్రీకృష్ణ భగవానుడు ధరించిన పీతాంబరము ఇంద్రధనుసు కాదుగదా? స్వర్ణమయి తారలు గుచ్చబడిన ఆ మనోహర దుకూలము అత్యంత శోభాయమానముగ యున్నది. ఆయన మానవుల దు:ఖములు హరించువాడు. అందువలన ఆయననే భజింపవలసినది."

భైరవ రాగ పుత్రులు "భగవాన్! మీ చతుర్భుజములు చతుస్సాగరముల వలె విశ్వము సర్వమును సంరక్షణ కావించుచున్నవి, మరియు విశ్వమునకు ఆనందదాయకములై యున్నవి. దిగ్గజములు వలె ఈ ధరిత్రిని మోయుచున్నవి. అంతేకాక లోకులను పరిరక్షించుటకు దండన కూడ కావించుచున్నవి.

మేఘమల్హార్ రాగిణిలు "ఓ! మనసా! సర్వ వల్లభుడయిన శ్రీహరి భగవానుని అధరములను చింతింపుము. అవి దొండపండ్ల వలె ఎర్రని కాంతి కలిగి, నూతన జపా కుసుమముల వలె ప్రకాశించుచున్నవి." మేఘ మల్హార్ పుత్రులు "పరమేశ్వరుడయిన శ్రీహరి దంతపక్తిని భజింపుము. అవి కర్పూరము, మెగలిపువ్వు, ముత్యములు, రత్నములు, శ్రీఖండచందనము, పూర్ణ చంద్రబింబము, విద్యుత్ కాంతి, అమృతము మరియు మల్లెపూల కాంతిని సహితము తిరస్కరించినట్లు యుండును.

దీపకరాగ రాగిణిలు "భగవాన్! నిజజన రక్షణకు, అభీష్టవస్తు ప్రసాదమునకు, దక్షత గల మీ నయన యుగళ కృపా కటాక్షము మమ్ము ఎల్లప్పుడూ రక్షించుగాక! అవి కామదేవుని తీక్షణ సాయకముల కంటె తీవ్ర శక్తి కలిగినవి మరియు సమస్త విశ్వ లావణ్యరాశులు. అవి తమ ఉదారత లేక దాన గుణమున కల్ప వృక్షములను సహితము మించినవి." దీపక రాగ పుత్రులు "ఆహా! నూతన కమలముల మధ్య కుళింగపక్షులు కూర్చొన లేదు కదా! త్రిలోకములందరి దు:ఖములు నాశనము చేయుటకు రెండు నిశిత కరవాలములు పుట్టిన వేమో! ఇవి కామధేవుని ధనస్సు కావచ్చు! కాదు కాదు!! ఇవి శ్రీకృష్ణ పరమాత్ముని ముఖ మండలమున ప్రకాశించుచున్న రెండు కనుబొమలు."

మాలకోశ రాగిణిలు "ఈ సుందర కపోలమండలి పై రెండు చంచల కుండలములు నాట్యము చేయుచున్నవి. అవి చంద్ర మండలము నందు నాట్యము చేయుచున్న నాగినులు కాదుగదా? కాదు కాదు! ప్రపుల్ల కమలములపై భ్రమరములు తిరుగాడుచున్నట్లు కానపట్టుచున్నది." మాలకోశ రాగ పుత్రులు "ఆకాశమున ఆదిత్యుడు ప్రకాశించుచున్నాడా లేక మేఘ మండల మందు విద్యున్మాలలు మెరయుచున్నవా! కాదు కాదు! శ్రీ కృష్ణ భగవానుని గండమండలము పై నర్తించుచున్న కుండలముల కాంతి ఇది."

శ్రీ రాగరాగిణిలు "ఏమి చిత్రము? రెండు కుళింగ పక్షులు పోట్లాడు కున్నపుడు వాటి మధ్య సంధి కావించుటకై దొండపండు కరచిన చిలుక వచ్చినట్లున్నది. కాదు కాదు! కుళింగ పక్షులు సాక్షాత్ శ్రీహరి కన్నులు. చిలుక ఆయన నాశిక. దొండపండే ఆయన అధరములు. శ్రీరాగ పుత్రులు "ఎవరు నడుముకు పీతాంబరము కట్టి, శిరమున నెమలి పింఛము గల కిరీటము ధరించి, మెడను కొంచెము వంచి, వంశీ వేత్ర హస్తుడై, కర్ణములయందు మకర కుండల ధారియై, నటవర వేషము ధరించిన శ్రీహరి యొక్క భజన నేను ఎల్లప్పుడూ చేయుచున్నాను.

హిందోళ రాగ రాగిణిలు "అసతీపుష్ప సంకాశుడు, యమునా తటమున, కదంబకాననాంతరాళమున యుక్త వయస్సు చే శోభించుచున్న గోపాంగనలతో విహరించుచున్న శ్యామసుందరడు మా మంగళములను విస్తరించు గాక!" హిందోళ రాగ పుత్రులు "మహా ప్రభూ! హరీ! భూమండలమున మా అంత పాతకులు లేరు. మీ అంత పాపహరణ సమర్థులు లేరు. అందువలన మిమ్ములను జగన్నాధునిగ భావించి మిమ్ము శరణు జొచ్చుచున్నాము. అటు పిదప మీదయ! మాప్రాప్తి!!

నారదుడు "రాగములు ద్వారా చేయబడిన ఈ ధ్యానమును ఎవరు నిరంతరము వినినా, చదివినా, భక్తవత్సలుడయిన శ్రీహరి వానికి తప్పక దర్శనము నిచ్చును. ఇట్లు వేదాదులకు తన స్వస్వరూపము యొక్క దర్శనము కావించిన శ్రీ కృష్ణ భగవానుడు వారందరూ చూచుచుండగనే తిరిగి చతుర్భుజుడై, శారంగ పాణియై నిలిచెను. ఈ విధముగ దర్శించి దేవతా గణములు తిరిగి తమతమ స్థానములకు చనిరి. పిదప యాదవసేన యందు తన పుత్రుడు, శంబరారి అయిన ప్రద్యుమ్నుని తిరిగి అధిపతిగ నియమించి మురారి ద్వారకాపురికి తిరిగి వెళ్ళుటకు నిశ్చయించెను. ఆ సమయమున ఆయన రథము దారుకుని చే ఆయత్తము చేయబడెను. గరుడ ధ్వజము ప్రభంజనము వలె రెపరెప లాడుచుండగా, సుగ్రీవ, బలాహక, శైబ్య, మేఘ పుష్పకములను చంచల హయములు కట్టబడి, ఘంట, మంజీర మధుర ధ్వనులు కావించుచూ, రత్నఖచిత సువర్ణ వైఢూర్యములు తాపించిన రథము నందు శ్రీహరి తిరిగి ద్వారకా పురికి పయనమయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి శ్రీకృష్ణ ధ్యాన వర్ణనమను నలుబది ఐదవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఆరవ అధ్యాయము

(యాదవ గంధర్వుల సమరము, బలభద్రుని ప్రత్యక్షము, మరియు ఆయన చే గంధర్వ సేన సంహరింపబడుట; గంధర్వ రాజ పరాజయము; వసంతమాలతీ నగరము బలభద్రుని హలముచే కర్షణ కావింపబడుట; గంధర్వరాజు బహుమతులిచ్చుట; బలదేవుడు ఆతనిని కరుణించుట)

నారదుడు "మహారాజా! శ్రీకృష్ణ భగవానుడు ద్వారకాపురికి ఏగిన పిమ్మట ప్రద్యుమ్నుడు తన సేనా సహితుడై "కామదుఘ" నదీ తీరమున కేగెను. అచట హేమ రత్నమయము, అత్యంత మనోహరము, గంధర్వ పాలితము అయిన వసంతమాలతీ నగరము వంద యోజనముల విస్తీర్ణమున యున్నది. ఆ పురము ఏలక, లవంగ, జాజికాయ, జాపత్రీ తీగలతో చుట్టబడిన శ్రీఖండ చందన, పారిజాత వృక్షములతో నిండి మిక్కిలి శోభించుచున్నది. భ్రమరముల గుంజారవముతో, పక్షుల కిలకిలా రావములతో, సుగంధ భరిత మందమారుతము తో నిండి యున్న ఆ నగరము ఎత్తైన పర్వత యుక్తమయిన భోగవతీ పురము వలె శోభించుచున్నది. ఆ పురమును మహాబలుడు, పుణ్యాత్ముడు, పురంధరుని వంటి పౌరుష పరాక్రమములు గల "పతంగుడు" అను గంధర్వ చక్రవర్తి పరిపాలించుచుండెను. అతడు ప్రద్యుమ్నుడు సేనా సహితుడై దిగ్విజయమునకు ఏతెంచెనని విని, తన ఉద్భట గంధర్వ సేనను తీసికొని సమరము చేయుటకు సంకల్పించెను. పది కోట్ల మంది చతురంగబల సమేతుడై ఆతడు రణమున ప్రద్యుమ్నునికి ఎదురు నిలచెను. యాదవ గంధర్వుల మధ్య భయంకర యుద్ధము ఆరంభమయ్యెను.

ఇరు పక్షములు గద, పరిఘ, ముద్గర, తోమరములు ధరించి సమరము కావించుచుండిరి. ఇరు పక్షముల నుండి వేయబడుచున్న సాయకములు చే ఆకాశము నిండి అంధకార బంధుర మయ్యెను. అతిరథుడయిన పతంగుడు ధనుష్పాణియై, టంకారము కావించుచూ, మేఘ గర్జన చేయుచూ ముందుకురికెను. ఇంతలో బలానుజుడు గదుడు గదాయుధమును దాల్చి, శత్రుసేన యందు జొరబడి, ఇంద్రుడు వజ్రపాణియై పర్వతముల రెక్కలు ఖండించినట్లు శత్రు సైన్యమును ధరాశయనుల కావించెను. గదుని గదా ఘాతము చే రథములు చూర్ణమయినవి. కుంజరముల కుంభ స్థలములు పగిలినవి. హయముల పై నుండి యుద్ధ మొనరించుచున్న యోధులు ప్రాణశూన్యులయిరి. క్షణ మాత్రములో గంధర్వ సేన యందు రక్త ప్రవాహము నదిగా మారి పారుట ప్రారంభమయినది. ప్రమథ గణములు రుద్ర భగవానునికై పుర్రెల మాలలు కట్టుట ఆరంభించిరి. భద్రకాళి సింహవాహన యై, వందలాది ఢాకినీ గణములతో పరివేష్ఠిత యై వచ్చి పుర్రెల యందు రక్తము నిడుకొని కడుపార త్రాగుట నారంభించెను.

ఇట్లు గదుని చే గంధర్వ సేవ పరాజితమై, పలాయన మొనర్చుట కాంచిన గంధర్వాధీశుడు పతంగుడు ఒక లక్ష గజసేనను తీసికొని అచటికి ఏతెంచెను. పతంగుడు మొట్టమొదట ఒక భయంకర గదను తీసికొని గదుని వక్ష స్థలము పై ప్రహరించెను. గదుడు సహితము తన గదను పతంగుని వక్షముపై ప్రయోగించెను. ఈ విధముగ వీరిరువురి మధ్య రెండు ఘడియలు భయంకర గదా యుద్ధము చెలరేగెను. వారిరువురి గదలు ఢీకొనుట చే అగ్ని కణములు పైకి లేచెను. రణ దుర్మధుడయిన పతంగుడు ఒక లక్ష బారువుల బరువుగల తన గదతో గదుని శిరమును ప్రహరించెను. ఆ ప్రహారము చే గదుడు ఒక్క క్షణము మూర్ఛితుడయ్యెను. అదే క్షణము ద్వారకాపురి నుండి ఒక తేజ:పుంజము బయలుదేరి యుద్ధ భూమిని చేరెను. సమస్త యాదవులు కొట్లాది సూర్యకాంతితో సమానమయిన ఆ తేజస్సును అవలోకించిరి. దాని మధ్య నుండి భక్త వత్సలుడు, గౌరవర్ణుడు, మహాబలుడు బలదేవుడు బయల్వెడలెను. నీలాంబరధారి అయిన బలరాముడు కుపితుడై గంధర్వసేన నంతటినీ హలము తో పట్టి లాగుచూ, ముసలము తో ప్రహరించి సంహారము చేయ నారంభించెను. అనేక రథ, గజ, హయములు కాలగతి యందు కలసిపోయెను.

సమస్త శస్త్రధారులు చూర్ణమయి పర్వత శిలల వలె భూతలమున పడిరి. పతంగుడు సహితము రథహీనుడై,

భయముతో వసంత మాలతీ పురమునకు పరెగెత్తి తిరిగి యాదవులతో సమర మొనరించుటకు వ్యూహ ప్రక్రియ మొదలిడెను. అంత బలదేవుడు వంద యోజనముల విస్తీర్ణము గల వసంత మాలతీ పురిని కదిలించి కామదుఘ నది యందు పడవేయుటకు ఆ పురమును తన హలముతో లాగుట మొదలిడెను. నగరము నందలి భవనములు కంపించుచూ కూలుట మొదలిడెను. ఆ పురమంతయు హాహాకారములు చెలరేగినవి. సుడిగాలిన పడిన నౌక వలె అతలా కుతలమగుచున్న తన నగరమును కాంచి పరాభూతుడై, పతంగుడు తక్షణము ఇతర గంధర్వుల సహితుడై బహుమతులు గైకొని యాదవేంద్రుని వద్దకు వచ్చి చేతులు జోడించెను.

ఆతడు రెండులక్షల రత్న జటిత, సువర్ణ నిర్మిత విమానములను బహూకరించెను. అవి అన్నియు విశ్వకర్మ వినిర్మితములు, దశయోజన విస్తీర్ణములు, కోట్లాది పతాక కలశ శోభితములు; మరియు ఒక్కొక్కటి వేలాది సూర్యుల పగిది వెలుగు చున్నది. అంతేకాక నాలుగు లక్షల గోవులను, పది అరబ్బుల గుర్రములను, లవంగ, ఏలక, కేసర, జాజి, జవ్వాది, జాపత్రి మరియు అనేక అమృత ఫలములు నిండిన కోట్లాది పాత్రలను వారికి సమర్పించి, సమస్కరించి, బలభద్రుని గాంచి ఇట్లనియె.

"ఓ! మహానుభావుడయిన బలరామా! మీ పరాక్రమమును నేను ఎరుగజాలను. అందుకే ఈ అపరాధమును గావించితిని. ఎవరి ఒక్క ఫణము నందు సమస్త భూమండలము ఒక నువ్వు గింజవలె తేలియాడునో, అట్టి పరాక్రమోపేతుని ముందు ఎవరు అగగలరు? భగవాన్! కామపాలా! దేవాధిదేవా! సాక్షాత్ అనంత శేష స్వరూపా! బలరామా! మీకు నమస్కారము. మీకు విజయమగుగాక! అనంతా! మీ కీర్తి దిగంతముల వరకు వ్యాపించినది. మీరు సమస్త ముని, దేవ నాగేంద్ర గణములందు శ్రేష్ఠులు. ముసలధారా! హలధారీ! మీకు మరల మరల నమస్కారము." పతంగుని యొక్క స్తోత్రమును వినిన బలదేవుడు ప్రసన్నుడై ఆ గంధర్వపతకి అభయమొసంగెను. పిదప తన పదములపై పడిన ప్రద్యుమ్నాది యాదవ సైన్యమును దీవించి, సర్వులచే ప్రశంశితుడై తిరిగి ద్వారకా పురికి పయనమయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి వసంత మాలతీ నగర కర్షణము అను నలుబది ఆరవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఏడవ అధ్యాయము

(యాదవ సేనతో శక్ర సఖుని సమరము మరియు ఆతని పరాజయము)

నారదుడు "మహారాజా! తదనంతరము తన విజయ దుందుభులు మ్రోయించుచూ యాదవ సేనా సహితుడై ప్రద్యుమ్నుడు "మధుధారా" నదీ తీరము చేరెను. సువర్ణగిరి సానువుల యందు కుబేరుని సుందర వనము నందు సువర్ణకాంచన లతా సమూహములతో సువర్ణ హంస కారండవ కిలకిలారావముతో ఆ ప్రదేశమంతయు అత్యంత మనోహరముగ ఒప్పారు చున్నది. అచట గల హిమాలయ గుహలు దుర్గము వలె కాపాడుచూ, దేవతలకు రాక్షస పీడ లేకుండ కాపాడుచున్నవి. అక్కడికి దానవులు ప్రవేశింపలేరు. అప్పుడప్పుడు స్వర్గము నందు దానవ దాడుల చే భయము నొందిన లోక పాలక నిధులు సహితము అచట సుఖ నివాసము నొంది యున్నవి. "శక్రసఖుడు" అను దేవ శిరోమణి ఆ ప్రాంతమును పాలించుచుండెను. ప్రద్యుమ్నుని ఆగమన వార్త విని శక్రసఖుడు ముకుంద నందనుని నిలువరించ నిశ్చయించెను. బద్ధిమంతుల యందు శ్రేష్ఠుడు, మంత్రి వర్యుడు అయిన ఉద్ధవుడు మార్గము వెదుకుచూ శక్రసఖుని పురమున కరిగి, రాజసభ యందు ప్రవేశించి, మహారాజుకు నమస్కరించి ప్రద్యుమ్నుని పలుకులు వినిపించెను.

ఉద్ధవుడు "యాదవేంద్రుడు, ద్వారకాధీశుడు, రాజాధిరాజు అయిన ఉగ్రసేనుడు జంబూద్వీపము నందలి రాజులందరినీ జయించి రాజసూయము చేయ సంకల్పించెను. ఆయన ద్వారా దిగ్విజయమునకు పంపబడిన రుక్మిణీ నందనుడు ప్రద్యుమ్నుడు తన బల పరాక్రమముల చే భారత వర్షమందలి సమస్త రాజ్యములను వశ పరచుకొనుచూ ఇలావృత వర్షమును జయించుటకేతెంచెను. శ్రీకృష్ణ కుమారుడు అనన్య సామాన్య బల పరాక్రమోపేతుడు. మహారాజా!

నీవు నీ కుశలమును, శ్రేయస్సును, ఆపేక్షించితివేని శీఘ్రముగ బహుమతులు ఈయవలసినది. సర్వుల యందు, శ్రేష్ఠుడవయిన నరేశ్వరా! మీరు కప్పము కట్టని పక్షమున యుద్ధము అనివార్యమగును." శక్రసఖుడు "దూతా! వినుము. నేను దేవతలకు సహితము సదా వందనీయుడను. ఇంక మానవుల మాట చెప్పనేల! నేను సిద్ధుడను. మహావీరుడను. లక్ష ఏనుగుల బలశాలిని. అష్ట దిక్పాలకులకు రక్షకుడను. కుబేర సమాన సంపన్నుడను. సాక్షాత్ ఇంద్రతుల్య శక్తిశాలిని. ఉగ్రసేనుడే నాకు కప్పము కట్టవలెను. నేను ఇంతకు మున్ను ఎవరికీ కప్పములు కట్టలేదు. అందువల్ల మీ యదురాజునకు కప్పము కట్టు ప్రసక్తి లేదు." ఉద్దవుడు "యాదవుల బలపరాక్రమముల చే కుబేరుడు తిరస్కృతుడై కప్పము కట్టవలసి వచ్చెను. చైత్ర దేశాధీశుడు, బలవంతుడు అయిన శృంగార తిలకుడు హరివంశ ప్రభువు శుభాంగుడు, ఉత్తర ఖండాధీశుడు గుణాకరుడు, దైత్యసఖులు, రాక్షసేశ్వరులయిన లంకాపతి వీభీషణుడు, కేతుమాలుడు మరియు శకుని కప్పములు కట్టవలసి వచ్చెను. మహారాజా! అట్లే మీరును దుర్దశను ప్రాప్తించి ప్రద్యుమ్నునకు బహుమతులు ఈయవలసి వచ్చును." ఉద్దవుని సత్వాక్యములు వినిన శక్రసఖుడు కుపితుడై ఇట్లనియె "భగవద్భక్త శిరోమణీ! నేను బహుమతులిచ్చు వరకును నీవు ఇక్కడనే యుండవలసినది. నీవు వెనుకకు వెళ్ళుటకు వీలులేదు. ఇది సత్యము!" ఉద్దవుడు "నేను మంత్రుల యందు శ్రేష్ఠుడను. జ్ఞాన ప్రదాతను. ఎవరు నా మాట వినరో వారికి మంగళములు లభింపవు." ఈ విధముగ ఉద్దవుడు శక్రసఖుని వద్ద బంధింపపడెను.

ఉద్దవుడు వెనుకకు రాకపోవుట చే యాదవులు చింతితులైరి. అనేక దినములు అట్లే గడచినవి. అంత నా (నారదుని) ముఖతా ఉద్దవుడు బంధింపబడిన వృత్తాంతమును వినిన ప్రద్యుమ్నుడు త్రిపురాసుర సంహారమునకు బయలుదేరిన మహాదేవుని వలె, సమస్త యాదవ సేనా సహితుడై శక్రసఖుని మదమణచుటకు బయలుదేరెను. భయంకర దుందుభీ నాదములు, యోధుల ధనుష్టంకారములు, హయములు సకిలింపులు, గజముల ఘీంకారము లు కలసి దిశలు ఘూర్ణిల్లుచున్నవి. సైనికుల పదఘట్టన చే రేగిన ధూళి ఆకాశము వంటినది. ఇరుసేనల మధ్య భయంకర సమరము ఆరంభమయినది. వ్యోమ మండలమంతయు శస్త్రాస్త్రములతో నిండినది. ఆ సమరమును గాంచి మేరు పర్వతమందు విహరించుచున్న దేవతా గణములన్నియు భయవిహ్వలులై ఒక్క సారిగ పైకి లేచినవి.

క్రోధోద్రిక్తుడయిన మహాబలి శక్రసఖుడు రధారూఢుడై పది అక్షౌహిణీ సేనా సహితుడై ముందుకు దూకెను. ప్రాకృతిక ప్రళయ వేళ చతుస్సాగరములు ఢీకొనిన చో ఎట్లు భీషణ ధ్వని కలుగునో అట్లే మహా కోలాహలము చెలరేగెను. ఆ సమయమున బలదేవుని సోదరుడు, వీర సారణుడు కవచధారియై, గజారూఢుడై, మాటామాటికీ ధనుష్టంకారము కావించుచూ అందరి కంటె ముందుకేగి తన కోదండ పాండితీ ప్రకర్షణము చే శక్రసఖుని సేనను సంహరించుటకు ప్రారంభించెను. సారణుని బాణ పరంపర చే ఎందరో యోధులు ధరాశయనులైరి. కుంజరముల కుంభస్థలములు పగిలినవి. నరుకబడిన హయములు, క్షత గాత్రులయిన పదాతులు, గజములు చే సమరాంగణమంతయు పీనుగుల పెంటయై భూతనాధుని క్రీడావాటిక అయిన మహాశ్మశానము వలె కానపట్టెను. సారణుని బల పరాక్రమములు రుచి చూచిన దేవతల కోదండములు ఖండితమై, కవచములు విచ్ఛిన్నమై పలాయన మంత్రము పఠించిరి. తన సేన అంతయు పారిపోవుట కాంచిన శక్రసఖుడు అచటికి ఏతెంచి, ధనుష్టంకారము కావించి మేఘ గర్జన చేసెను. వీర ధనుర్ధరుడు అయిన శక్రసఖుడు సమరాంగణము నందు అర్జునుని పది, సాంబ, అనిరుద్దులను వంద, గదుని రెండు వందలు, సారణుని వేయి సాయకములతో ప్రహరించెను.

ఆ మహావీరుని సాయకముల చే ఆ వీరులందరూ రధ సహితులై రెండు ఘడియలు కుమ్మరి వాని చక్రము వలె సమరాంగణమున భ్రమించిరి. ఈ విధముగ గుండ్రముగ తిరుగుట చే వారి రధ బంధనములు సడలినవి. హయములు మృతి చెందినవి. సారధులు మూర్ఛనొందిరి. రధికులు మనమున ఖేదము నొందిరి. అంత జాంబవతీ నందనుడు సాంబుడు వేరొక రధ మధిరోహించి ధనుష్టంకారము కావించుచు ముందుకు వచ్చి పది బాణములతో శక్రసఖుని ధనువును ఖండించెను. రెండు బాణములతో సారధిని, వంద బాణములతో హయములను యమలోకమున కధితులుగావించెను. వెయ్యి నారాచములతో రధమును తుత్తునియలు గావించెను. రధహీనుడయిన శక్రసఖుడు కుపితుడై, వేరొక కుంజరము అధిరోహించి, శూలమును గ్రహించి, అద్దానితో సాంబుని ప్రహరించి ఆతని వక్ష స్థలమునకు

గాయము చేసెను. ఆ ఘాతము చే సాంబుడు కొంచెము వ్యాకులత నొందెను.

శక్రసఖుని గజము ఒక్కొక్క అడుగు, ఒక్కొక్క యోజనము దూరము నడుచుచూ, కాటుక కొండవలె నల్లగా ప్రకాశించుచుండెను. అయ్యది నాలుగు యోజనముల ఎత్తు కలిగి, దంతములు అర్ధ యోజనము విస్తరించెను. ఆ భయంకర హస్తికి నాలుగు యోజనములు పొడవు గల మూడు తొండములు యుండెను వాటి సహాయముతో ఆ మహానాగము రథములను పడవైచుచూ, ప్రత్యర్ధి గజ, హయముల ముద్ద జేయుచు, తన దంతములతో వానిని పొడుచుచూ, పాదములతో నుజ్జు గావించుచూ, సమరాంగణమున కాలుని వలె సర్వులకు కానపట్టెను.

శత్రువుల చే ప్రేరితమయిన ఆ మహాగజమును కాంచి యాదవ సేన భయభీతులై పలాయన మొనర్చిరి. అంత బలదేవుని సోదరుడు గదుడు తన గదాయుధమును చేపట్టి, ముందు కురికి ఆ మహా గజము కుంభస్థలము పై ప్రహరించెను. ఆ గదా ఘాతము చే కుంభ స్థలము పగిలి, రెక్కలు కత్తిరించబడిన పర్వతము వలె సమరాంగణమున కూలి మరణించెను. ఇంతలో శక్రసఖుడు తన గదను ఎత్తుటకు ప్రయత్నించెను. అది గమనించిన గదుడు తన భయంకర గదాయుధము చే ఆతని వక్షమున ప్రహరించెను. ఆ ఘాతము చే శక్రసఖుడు మూర్ఛితుడయ్యెను. తిరిగి లేచి, గదను చేపట్టి సమరమొనరించుటకు సమకట్టెను. వారిరువురు కొంతతడవు కానన మందు మదించిన కుంజరముల వలె గదాయుద్ధము సలిపిరి. పిదప గదుడు శక్రసఖుని భుజములు పట్టి త్రిప్పి త్రిప్పి వంద యోజనములు దూరమున గల ఆతని నగరమందు పడునట్లు విసరెను. అంత యాదవ సైన్యము జయ జయ ధ్వానములు గావించిరి. విజయ దుందుభులు మ్రోగినవి. సర్వులూ గదుని ప్రశంశించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి శక్రసఖుని సమరము అను నలుబది ఏడవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఎనిమిదవ అధ్యాయము

(శక్రసఖుడు ప్రద్యుమ్మునికి బహుమతులిచ్చుట; ప్రద్యుమ్నుడు లీలావతీ పుర స్వయంవరమున సుందరిని ప్రాప్తించుట; పిదప ఇలావృత వర్షము నుండి భారత వర్షమున కేతెంచి ద్వారక పురమునకు తిరిగి వచ్చుట)

నారదుడు "తన నగరమున పడిన శక్రసఖుడు మూర్ఛనుండి లేచి, ఒక్క క్షణము మిక్కిలి భయమునొంది, తిరిగి తేరుకొని శ్రీకృష్ణ కుమారుడయిన ప్రద్యుమ్నుడు పరబ్రహ్మముగ నెరింగి, తన సహచరులను తీసికొని, ఒక ఉత్సవము వలె బహుమతి సామాగ్రిని తీసికొని, యాదవ మంత్రి వర్యుడయిన ఉద్దవుని సమాదరముగ గొని, యాదవ సేనా సమూహము యొక్క సమీపమున కెతెంచెను. ఆతడు ఐరావత వంశమున జన్మించిన చతుర్దంతములు, మూడు తొండములు కలిగిన ఒక వెయ్యి శ్వేత కుంజరములను, సువర్ణగిరి యందు ఉత్పన్నమయిన రెండు యోజనములు ఎత్తు కలిగిన శరీరముగల ఉన్మత్త పర్వతాకారములు గలగిన మదగజములు ఒక కోటి, వంద అరబ్బుల స్వర్ణ రథములను, ఒక్కొక్కటి రెండు యోజనముల విస్తీర్ణము గల పది వేల విమానములను, పది లక్షల కామధేనువులను, ఒక వేయి పారిజాత వృక్షములను వెలుగులు చిమ్ముచున్న ముత్యములు పోసిన పెద్ద పెద్ద కడవలు, అనేక అత్తరు, పన్నీరు, శిరీష చిలకరింపబడి, ఏనుగు దంతములు మరియు సువర్ణ ఖచిత పట్టీలతో చేయబడిన కోట్లాది పాలనురుగు వంటి తెల్లని శయ్యలు (మంచములు), వానిపై పరువబడిన సుందర అస్తరణములు, గోడలపై అలంకరించు కోట్లాది సుందర వస్త్రాలంకరణములు, కూర్చుందుకు కోమలమయిన అసనములు, వేలాది విశ్వకర్మ వినిర్మితమయిన ముత్యములు గుచ్చములతోనూ, స్వర్ణ రత్న ఖచితములయిన తలడగలు, వేలాది పరదాలు, కొట్లాది పల్లకీలు, ఛత్ర చామర సహిత దివ్య సింహాసనములు, రాజ్యలక్ష్మీ భూషణములు, ఇంతేకాక కోటి ద్రోణముల అమృతము, సుధర్మ సభ, సర్వతోభద్ర మండలము, సహస్రదళ కమలములు,

కోట్లాది ముత్యములు, రత్నములు, వైఢూర్యములు సమర్పించెను. తదుపరి కోటి బారువుల నీలములు, గోమేధికములు, వేల బారువుల సూర్యకాంత, చంద్రకాంత మణులు, కోటి బారువుల శ్యమంతక మణులు, ఒక అరబ్బు (పది కోట్లు) పద్మరాగ మణులు, కోటి కోటి బారువుల జాంబూనద సువర్ణము, హాటక సువర్ణము. సువర్ణగిరి సువర్ణము, అర్పించెను. అష్ట దిక్పాలకుల అధిపత్యమును సంరక్షించు శక్రసఖుడు తన రాజ్యమును, స్వర్లోక సమస్త నిధులను, కానుకలుగా తీసికొని ఉద్ధవ సహితుడై ప్రద్యుమ్నుని వద్ద కేగి తన కుశలము కొరకై వాటినన్నిటినీ సమర్పించి చేతులు జోడించి నమస్కరించెను. శంబరారి ప్రద్యుమ్నుడు సంతుష్టుడై శక్రసఖుని రత్నమాలాలంకృతుని గావించి, తిరిగి ఆతని రాజ్యమందు ఆతనిని ప్రతిష్ఠించి ఆచటి నుండి బయలుదేరెను. సత్పురుషులు లక్షణము ఇట్టిది కదా!!

అచ్చటి నుండి బయలుదేరి "అరుణోదా" నదీ తీరమునకు చేరిన యాదవ సేనా సమూహము పది యోజనముల దూరము విస్తరిల్లెను. దివ్య పతాకములు వాటిపై రెపరెపలాడు చుండెను. ఆ ధ్వజముల కారణమున ఆ సేనా వాహిని అంతయు ఉత్తుంగ తరంగములతో కూడిన మహా సాగారము వలె శోభించుచుండెను. ఆ సమయమున ఒక అద్భుతము జరిగెను. ఆకాశము నుండి ఐరావతము నధిరోహించి దేవేంద్రుడు సేనా సహితుడై అచట కేతెంచెను. దేవ దుందుభులు మ్రోగినవి. మొదట ఇంద్రుని గుర్తింపక యాదవ వీరులు తమ తమ అస్త్ర శస్త్రములను ధరించి సాయుధులైరి. కానీ మహేంద్రుని గుర్తించి సర్వులు ప్రసన్నులయిరి. అంత దేవేంద్రుడు సభతీర్చి అందరూ వినుచుండగా ఇట్లనియె "మహారాజా! ప్రద్యుమ్నా!! నీవు పరావేత్తలందు శ్రేష్ఠుడవు. నా మాట వినవలసినది. స్వర్ణగిరి యందు 'లీలావతి" అను పురము కలదు. అచట విద్యాధరాధీశుడయిన "సుకృతి" రాజ్యము చేయుచుండెను. ఆయనకు సుందరి అను నామధేయము గల కన్య కలదు. ఆమె వందలాది పూర్ణ చంద్ర నిభానన. ఆమె స్వయంవరమునకై సర్వలోకపాలురు, దేవతలు, దివ్య రూపములు ధరించి అచటికి ఏతెంచిరి. కానీ ఆ రాచ కన్నియ "ఎవరి సౌందర్యమును చూచి నేను మూర్ఛపోయెదనో, ఆతనిచే నేను వివాహడామెదను." అని శపధము చేసినది. ఈ విధముగ ఆమె ఒక లోకోత్తర సుందరుని వివాహమాడుటకు ప్రయత్నించు చున్నది. నీవు కూడా సోదర సహితుడవై ఆ స్వయంవరమున పాల్గొని, దేవతలందరితో కూడిన ఆ స్వయంవరమును తిలకింప వలసినది."

ఇది విని ప్రద్యుమ్నుడు తన సోదర సహితుడై, దేవేంద్రుని కూడి ఆ స్వయంవరమును కాంచుటకు లీలావతీ పురమున కేగెను. స్వయంవర మండపము మిక్కిలి విశాలమయినది. ఆ ప్రదేశమంతయు రత్న ఖచిత స్వర్ణమయముగా యున్నది. నేల అంతయు అత్తరు, కస్తూరి, కేసరి కలిపిన నీటితో శుభ్రము చేయబడి సుగంధభరితమై యున్నది. ముత్యాల సరములు పరదాల వలె వ్రేళ్ళాడు చున్నవి. జాంబూనది స్వర్ణముతో చేయబడిన సింహాసనములు, వేయబడి రెండవ ఇంద్రలోకమా అన్నట్లు భాసించుచున్నది. ప్రద్యుమ్నుడు ఆ సభా ప్రాంగణము ప్రవేశించి, అందరినీ పరికించుచూ పర్వత శిఖరమున మృగరాజు ఉపస్థితమయినట్లు ఒక ఉత్తమాసనమున విరాజమానుడయ్యెను. అచట అనేక ప్రజాపతి ప్రముఖులు, రత్నా భరణ భూషితులై, సుఖాసీనులైరి. వారు ముని, దేవతా, రుద్రగణ, మరుద్గణ, అదిత్యగణ, వసుగణ, అగ్ని, అశ్వనీ దేవతా ద్వయము, మయ, వరుణ, సోమ, కుబేర, ఇంద్ర, సిద్ధ, విద్యాధర, గంధర్వ, కిన్నెర ప్రముఖులు. వారందరూ ప్రద్యుమ్నుని ఆగమనమును గాంచి తమ వివాహేచ్ఛను వదులుకొనిరి. ఆ సమయమున "సుందరి" ఒక పుష్పహారము చేపట్టి రంభ, రతీదేవి లను తిరస్కరించు రూప లావణ్యరాశియై బయలుదేరెను. ఆమెను గాంచి సభాసదులందరూ మోహపరవశులు కాగా సుందరి తనకు యోగ్యమయిన వరుని కొరకు విద్యున్మాల నూతన జలధరమును వెదుకుచున్నట్లు వెదకుచున్నది. దివ్యాంబర ధారి, ప్రఫుల్ల కమల నేత్రుడు అయిన అయిన నరలోక సుందరుడు ప్రద్యుమ్నుని కాంచి విధ్యాధర సుందరి మూర్ఛితురాలైనది.

కొంత సమయమునకు తెలివి తెచ్చుకొని, ఆనందమున మునిగి తేలుచూ వరమాలను ప్రద్యుమ్నుని గళమున వైచెను. విద్యాధరాదీశ్వరుడు సుకృతి తన కన్యకను ప్రద్యుమ్నునకిచ్చి వివాహము కావించెను. కానీ దేవతానీకమునకు ఇది నచ్చక, ఆ స్వయంవర మండపమును సూర్యుని మేఘములు క్రమ్మినట్లు చుట్టుముట్టిరి. క్రోధావేశులై ధనుష్పాణులైన సురలను చూచి ప్రద్యుమ్నుడు శ్రీకృష్ణ భగవద్దత్తమయిన ధనువును సారించి, సింహనాదమొనర్చెను. ఆయన ధనస్సు నుండి విడివడిన బాణపరంపర చే దేవతల శస్త్రములన్నియు ఛిన్నాభిన్నమయినవి. ధ్వజ, కవచములు పిట్లినవి. సూర్యుని

చే మేఘములు చీల్చబడినటుల దేవతలు దశదిశలు పలాయన మొనర్చిరి. ఈ విధముగ ప్రద్యుమ్నుడు స్వయంవరమందు విజయుడై, ఇలావృత వర్షమును జయించి భారత వర్షమునకు ఏగుటకు ఉద్యక్తుడయ్యెను. సోదరులు, యాదవ బంధువులు, సైనికులు సమస్త మంత్రిజన సహితుడై దుందుభులు మ్రోగుచుండగా తిరిగి భారత వర్ష ప్రవేశము గావించెను.

అనేక దేశములను చూచుచూ నెమ్మదిగ ఆనర్త దేశము ప్రవేశించి ద్వారకా పురికేతెంచెను. ప్రద్యుమ్నుని చే పంపబడిన మంత్రి వర్యుడు, బుద్ధిమంతుల యందు శ్రేష్టుడు అయిన ఉద్ధవుడు మహారాజయిన ఉగ్ర సేనునకు శ్రీకృష్ణభగవానునకు నమస్కరించి ప్రద్యుమ్నాదుల ఏఏ దేశములను ఏ విధముగ జయించి విజయ పరంపర కొనసాగించి, తిరిగి వచ్చిరో, ఆ వృత్తాంతమంతయు విశదీకరించెను. అంత మహారాజు ఉగ్రసేనుడు శ్రీకృష్ణ, బలదేవ, సమస్త యాదవ వృద్ధుల సహితుడై ప్రద్యుమ్నుని లోనికి తీసికొని వచ్చుటకై బయలుదేరెను. గీత వాద్యముల మ్రోగుచుండగా, వేద పండితులు వేదఘోష కావించుచుండగా, ముత్యములు, పేలాలు, పుష్పములు వర్షము వలె కురియు చుండగా ప్రద్యుమ్నుని ఆహ్వానించుటకు ముందుకు కదలిరి. ఒక మహాగజమును ముందర నుంచుకొని, స్వర్ణ కుంభము హస్తముల నిడుకొని, గంధర్వులు, అప్సరసలు, శంఖ, దుందుభి, వేణు, వీణా, గంధాక్షతలు, స్వర్ణ పాత్రలు, పుష్పములు, ధూపము నిడుకొని, ఉగ్రసేన మహారాజు ప్రద్యుమ్నుని సమ్ముఖమునకు ఏగెను. శ్రీకృష్ణ కుమారుడు యాదవ యోధులు తోడురాగా ఖడ్గము తీసికొని, ఉగ్రసేన మహారాజు వద్దకు వచ్చి దానిని ఆయనకు సమర్పించి, చేతులు జోడించి నమస్కరించెను. శ్రీకృష్ణ బలరాములకు శిరసు వంచి నమస్కరించి, యాదవ వృద్ధులకు సహితము వందనములర్పించెను. పిదప కుల పురోహితుడయిన గర్గాచార్యుని చేరి సాంజలి బంధకముగ ఆయన చరణార విందములకు సాష్టాంగ దండ ప్రమాణములు ఆచరించెను. ఉగ్రసేన మహారాజు ప్రద్యుమ్నుని భూరి ప్రశంశలతో ముంచెత్తి, వేద మంత్రములు మరియు బ్రాహ్మణ సహకారముతో విధి విధానముగ పూజించి, ప్రద్యుమ్నుని ఒక మదగజముపై ఆశీనుని కావించి ద్వారకాపురీ ప్రదేశము కావించెను. ద్వారక యందు ప్రతి ఇంటి యందు మంగళోత్సవము జరిగెను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి ప్రద్యుమ్నుని ద్వారకా గమనము అను నలుబది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నలుబది తొమ్మిదవ అధ్యాయము

(రాజసూయ యజ్ఞమందు ఋషులు, బ్రాహ్మణులు, మహారాజులు, తీర్థ క్షేత్రములు, దేవ గణములు, బంధువులు, స్నేహితుల శుభాగమనము)

బహుళాశ్వుడు "ముని శ్రేష్ఠా! ఉగ్రసేన మహారాజు రాజసూయ యజ్ఞమును ఎట్లు పరిసమాప్తి కావించెను? నాకు తెలుప వలసినది." నారదుడు "మహారాజా! తదనంతరము సమస్త ధర్మాత్ముల యందు శ్రేష్ఠుడయిన ఉగ్రసేన మహారాజు శ్రీకృష్ణ భగవానుని సహాయము చే రాజసూయ యజ్ఞము నారంభించెను. యదుకుల పురోహితుడయిన గర్గాచార్యుల వారు ముహూర్తమును నిర్ణయించి, అద్దానిని కావించుటకు యాదవ బంధువులను, స్నేహితులను నియమించెను. అత్యంత భక్తి భావము తో పిలచుట చే ముని ఋషి గణములు తమ పుత్ర శిష్య గణములతో ఏతెంచిరి. సాక్షాత్ వేద వ్యాసుడు, శుకుడు, పరాశరుడు, మైత్రేయుడు, పైలుడు, సుమంతుడు, దుర్వాసోముని, వైశంపాయనుడు, జైమిని, భార్గవుడయిన పరశురాముడు దత్తాత్రేయడు, అసితుడు, అంగిరుడు, వామదేవుడు, అత్రి, వశిష్ఠుడు, కణ్వుడు, విశ్వామిత్రుడు, శతానందుడు, భరద్వాజుడు, గౌతముడు, కపిలుడు, సనక సనందనాదులు, విభాండకుడు, పతంజలి, ద్రోణ కృపాచార్యులు, ప్రాడ్విపాకుడు, శాండిల్యుడు మరియు ఇతర ఋషులు తమ శిష్య సమేతులై ఏతెంచిరి. దేవతలయిన బ్రహ్మ, రుద్ర, ఇంద్ర, మరుద్గణ, వసుగణ, అగ్ని, అశ్వనీకుమార ద్వయము, యమ, వరుణ, సోమ, కుబేర, గణేశ, సిద్ధ,

విద్యాధర, గంధర్వ, కిన్నెర ఆదిగా గల దేవ జాతులందరు శుభాగమనము కావించిరి. గంధర్వ, విద్యాధర, అప్సరోభామలు సహితము విచ్చేసిరి.

భేతాళ, దానవ, దైత్య, ప్రహ్లాద, బలి, మరియు భీషణ రాక్షస సహితుడై విభీషణుడు, సమస్త వానర గణములతో వాయునందనుడు హనుమంతుడు విచ్చేసిరి. ఋక్షములు (ఎలుగుబంట్లు) మరియు బలమయిన వన్య మృగ సహితుడై మహానుభావుడయిన జాంబవంతుడు విచ్చేసెను. సమస్త పక్షి గణముల సహితుడై పక్షిరాజు గరుత్మంతుడు, సమస్త సర్ప గణములతో సర్పరాజు వాసుకి, సమస్త కామధేను సహితయై గోరూపధారిణి ధరణీమాత, సమస్త పర్వతములు జంగమాత్మక రూపములు ధరించి మేరు హిమాలయముల కూడి ఏతెంచిరి. సమస్త పొదల, వృక్షముల, లతల సహితుడై ప్రయాగ వృక్ష రాజైన ఆశ్రయ వట వృక్షము, మహా నదుల తో గూడి గంగాయమునలు, రత్నములు బహుమతులు చేగొని సప్త సాగరములు, ఉగ్రసేనుని రాజసూయము నందు పాల్గొనుటకు అత్యుత్సాహము తో ఏతెంచిరి.

సప్త స్వరములు, మూడు గ్రామములు (స్థాయిలు), నవారణ్యములు, పదునాల్గుమంది గుహ్యకులు, తీర్థ రాజమయిన ప్రయాగ, పుష్కర క్షేత్రము, బదరికాశ్రమము, సిద్ధాశ్రమము, సమస్త కుండ, సరోవర సహితముగ కురుక్షేత్రము, సమస్త ఉపవన సహితయై దండకారణ్యము, అవన్నియు సకల విమల క్షేత్రములతో కూడి అచట కేతెంచెను. వ్రజభూమి నుండి బృందావనము, గోవర్ధనము, ఇతర ఉపవన, కుండ, సరోవర సహితముగ ఏతెంచెను. రాణి కీర్తిదేవి, గోపేశ్వరి అయిన యశోదాదేవి తో కలసి ఏతెంచెను. కోట్లాది సఖీమణుల సహితయై శిబిక నధిరోహించి శ్రీరాధికాదేవి, ఆమెను అనుసరించి వంద గోపికా యూధములు ద్వారకా పురికి వచ్చిరి. ఈనాడు "గోపీభూమి" అను పిలువబడు చున్న ప్రదేశమున వారు విడిది చేసిరి. వారి అంగరాగముల చే గోపీ చందనము ఉత్పన్నమయ్యెను. ఎవరు గోపీచందనమును అలదు కొందురో ఆ నరులు నారాయణ స్వరూపులగుదురు. చాతుర్వర్ణముల వారు ఆ యజ్ఞము నందు ఉపస్థితులైరి. ప్రజ్ఞా చక్షువయిన దృతరాష్ట్రుడు, కలి అవతారమయిన దుర్యోధనుడు, శాల్వుడు, భీష్మ కర్ణులు, కుంతీపుత్రులయిన యుధిష్ఠర, భీమార్జున నకుల సహదేవులు, దమఘోష, వృద్ధశర్మ, జయసేన, దృష్టకేతు, భీష్మక, నగ్నజిత్, బృహత్సేన, పిదప మీ పితృపాదులయిన మిధిలేశ్వరుడు ధృతి మహారాజు, అన్య రాజన్యులు, బంధు బాంధవులు, సుహృదులు వారి వారి రాణులతో పుత్ర పౌత్రులతో కలసి వచ్చి యజ్ఞము నందు పాల్గొనిరి.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి స్వజన శు భాగమనము అను నలుబది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఏబదియవ అధ్యాయము

(మంగళ మయమయిన రాజసూయ ఉత్సవము, దేవతా, బ్రాహ్మణ, అతిధుల దానమాన సత్కారము)

నారదుడు "మహారాజా! రైవత పర్వతమునకు, సముద్రమునకు మధ్య గల అర్ధసిద్ధిని ప్రసాదించు పిండారక క్షేత్రమందు రాజసూయ యజ్ఞము ఆరంభింపబడెను. ఆ యజ్ఞము నందు అయిదు యోజనముల విస్తీర్ణము గల భూమి యందు కుండములు స్థాపింపబడెను. బ్రహ్మ కుండము ఒక యోజనము, పంచ కుండములు ఒక్కొక్కటి రెండు క్రోసుల చొప్పున స్థలమందు కట్టబడెను. సమస్త కుండములు, తోరణములు, వృక్షములు మరియు వేదులచే అత్యంత సుందరముగ నిర్మింపబడినవి. అచటి యజ్ఞ స్థంభము వేయి అడుగుల ఎత్తు యుండి సర్వులను ఆకర్షించుచుండెను. యజ్ఞ మండపము సర్వము సువర్ణమయమై అయిదు యోజనముల విస్తీర్ణము కలిగి దివ్య చాందరీలతో, మంగళ తోరణములతో శోభించుచుండెను. కదళీతరువులు సహితము ఆ ప్రాంగణ సుందరతను ఇనుమిక్కిలిగా పెంపొందించు చుండెను.

భోజ, వృష్ణి, అంధక, మధు, శూరసేన, దశార్హ వంశ యాదవ పరివేష్ఠితుడయిన ఉగ్రసేన మహారాజు దేవతా పరివేష్ఠితుడయిన మహేంద్రుని వలె యజ్ఞమండపము నందు శోభించుచుండెను. పరమాత్ముడు తన విభూతులతో శోభించునట్లు పరిపూర్ణ పరమాత్ముడు శ్రీకృష్ణుడు తన పుత్ర పౌత్రులతో సుశోభితుడై యుండెను.

మహాసంభారములన్నియు సంగ్రహించి, గర్గా చార్యుని గురువుగా నియమించుకొని యాదవరాజు ఉగ్రసేనుడు క్రతుశ్రేష్ఠమయిన రాజసూయ దీక్షను స్వీకరించెను. ఆ యజ్ఞము నందు పది లక్షల హోతలు, పది లక్షల ఆధ్వర్యువులు, అయిదు లక్షల ఉద్గాతలు ఉపవిష్ఠులైరి. అగ్ని కుండములందు ఆగకుండా ఏనుగు తొండధారల వంటి నేయి పోయబడుట చే అగ్ని దేవునకు అజీర్ణమాయెను. ఆ దినములందు త్రిలోకముల యందు ఆకలి చే ఆర్తుడయిన వాడు లేడు. సమస్త దేవతలు సోమపానము గావించి అజీర్ణరోగులైరి. తన ధర్మపత్ని "రుచిమతి దేవి" తో కలసి యాదవ చక్రవర్తి ఉగ్రసేనుడు పిండారక క్షేత్రమందు అవభృత స్నానమును ముగించెను. ఎట్లు దక్షిణ తో యజ్ఞము శోభించునో అట్లే మహారాణి రుచిమతి సహితుడై ఉగ్రసేనుడు శోభించెను. దేవ దందుభులు మ్రోగినవి. దేవతలు పుష్పవృష్ఠి కురిపించిరి.

యజ్ఞాంతము నందు ఉగ్రసేన మహారాజు సువర్ణ హార మండితములైన పదునాల్గు లక్షల కుంజరములను, వంద అరబ్బుల గుర్రములను దానమొసంగెను. బహుమూల్య హారములు, వస్త్రములు, కోట్లాది నవరత్నములు, మునివర్యుడు అయిన గర్గాచార్యుల వారికి సమర్పించెను. అంతేకాక ఆయనకు అనేక గృహములు, గృహోపకరణములు అర్పించెను. బ్రహ్మలుగ వచ్చిన (వర్తించిన) బ్రాహ్మణోత్తములు ఒక్కొక్కరికి యాదవేంద్రుడు ఒక వేయి గజములు, పది వేల హయములు, ఇరువది బారువుల బంగారము సమర్పించెను. మరుత్ మహారాజు యజ్ఞమందు ఎట్లు బ్రాహ్మణులు సంతుష్ఠులై తమ సువర్ణ పాత్రలను సహితము వదలి వెళ్ళిరో, అదే విధముగ ఉగ్రసేన మహారాజు యజ్ఞమందు సర్వులు మిక్కిలి సంతుష్ఠులై తమ తమ లోకములకు చనిరి. జయ జయ కారములు కావించిన వందిజనులను సహితము మహారాజు యధోచితముగ సత్కరించెను. రాక్షసులు, దైత్యులు, వానరములు, పశుపక్ష్యాదులు నాగులు, గోవులు, పర్వతములు, వృక్ష సముదాయములు తీర్ధములు, నదులు, సముద్రములు సహితము సంతుష్ఠులై తమ తమ స్థానములకు వెడలిరి. ఏఏ రాజులు రాజసూయమునకు అమంత్రితులైరో, వారుకూడా బహుమతులు ప్రసాదింపబడి, సంతుష్ఠులై వారి వారి దేశముల కేగిరి. నందాది గోపులకు పూజనము స్వయముగా శ్రీకృష్ణుడే కావించెను. వారు ప్రేమ, దానముల చే మిక్కిలి హర్షోల్లాసితులై వ్రజభూమికి చనిరి. ఈ విధముగ రాజసూయ యజ్ఞము పూర్ణము కావింపబడెను. ఎక్కడ శ్రీకృష్ణ పరమాత్మ యందునో అక్కడ ఏ కార్యము సఫలీకృతము కాదు?

ఏ మానవుడు సదా ఈ కధను పఠించుచూ, వినిపించునో ఆతనికి ధర్మార్ధ కామ మోక్షములు కరతలామలకములగును. శ్రీకృష్ణ భగవానుడు పరేశుడు, పరమేశ్వరుడు, పురాణ పురుషుడు. ఆయన నిన్ను పవిత్రుని కావించుగాక! ఏ మానవుడు ఈ విచిత్ర గాధను ఆలకించునో, అతడు తన కులమును సహితము పవిత్రమొనరించును. పరమేశ్వరుడు శ్రీహరి యజ్ఞమును కేవలము ఆసరాగా తీసికొని భూతల భారహరణము కావించెను. యదుకులమందు చతుర్వ్యూహ ధారణ కావించి, ఉదయించిన అనంత గుణశాలి, భువన పాలకుడయిన పరమేశ్వరుడు శ్రీకృష్ణ భగవానునికి నమస్కరించుచున్నాను.

(శ్రీ గర్గ సంహిత యందు విశ్వజిత్ ఖండార్గతమున నాదర బహుళాశ్వ సంవాదము నందలి రాజసూయ యజ్ఞోత్సవ వర్ణనమున ఏబదియవ అధ్యాయము సమాప్తము)

విశ్వజిత్ ఖండము సమాప్తము

శ్రీ బలభద్ర ఖండము

ఒకటవ అధ్యాయము

(శ్రీ బలభద్రావతార కారణము)

బహుళాశ్వుడు "బ్రహ్మన్! నేను మీ శ్రీముఖతా అమృతమయము పరమ మధురము, మంగళకరము, పరమాద్భుతము, అయిన విశ్వజిత్ ఖండమును శ్రవణము కావించితిని. శ్రీకృష్ణ పరమాత్ముడు పరిపూర్ణ భగవానుడు. ఆయనకు పదహారువేల మంది పత్నుల యందు ప్రతి ఒక్కరికి పదిమంది పుత్రులుత్పన్న మయిరి. ఆయనకు వేలాది పౌత్రులుదయించిరి. పృధివి యందలి రేణువులను లెక్కించవచ్చుగానీ, శ్రీకృష్ణ వంశజులను లెక్కించుట అసాధ్యము. బలరాముని అర్ధాంగి రేవతీదేవి. ఆమెకు ఒక్క పుత్రుడు కూడా కలుగలేదు. ఆ రహస్యమును తెలుపవలసినది."

నారదుడు మహారాజా! నీ ప్రశ్న మిక్కిలి సుందరము. శ్రీకృష్ణ భగవానుని భాతృమూర్తి అయిన బలరాముడు, సంకర్షణుడు, మరియు కామపాలుడు. ఆ మహాను భావుని చరిత్రను నీకు విశదీకరించెదను. దుర్యోధనుని గురువయిన ప్రాడ్విపాకుడు యోగులకు మరిము మునులకు సహితము అధీశ్వరుడు. ఆయన ఒకనాడు హస్తినకు ఏతెంచెను. దుర్యోధనుడు ఆయనను సమస్త ఉపచారముల చే పూజంచి, ఆదరించి, ఒక బహుమూల్య సింహాసనమందు ఆశీనుని గావించి, ఆయనకు ప్రదక్షిణ మాచరించి ఎదుట కూర్చుండి పిదప ఇట్లనియె "భగవాన్! సంకర్షణ భగవానుడు బలదేవునిగ ఈ భూతలమందు ఎవరి ప్రార్ధనచే, ఏ కారణము చే అవతరించెను.? ఆయన మా నగరమును తన హలము చే లాగి అతలాకుతలము గావించెను. ఆయన నాకు గురువు. నాకు గదాయుద్ధమును నేర్పించెను. నాకు ఆయన యొక్క ప్రభావమును సవిస్తరముగ తెలుపవలసినది." అంత ప్రాడ్విపాకుడు "కురుసత్తమా! యువరాజా! యాదవ శ్రేష్ఠుడయిన బలరాముని ప్రభావమును వినుము. దీనిని వినినచో సంపూర్ణ పాప పరిహారము అగును. ఇది ఈ ద్వాపరాంతమునకు సంబంధించినది. కోట్లాది దానవులు రాజుల రూపమున, వారి సేనల రూపమున భూమికి మిక్కిలి భారము కలుగ జేయుచున్నారు. అంత భూమాత గోవు రూపము ధరించి, స్వయంభువు అయిన బ్రహ్మ దేవుని కడకేగి మొరపెట్టుకొనెను. దేవ శ్రేష్ఠుడయిన బ్రహ్మ, నారాయణ, రుద్రులను ముందుంచుకొని, వామన దేవుని కాలి వేలి చే ఛిద్రమయిన బ్రహ్మాండము యొక్క ఉపరి భాగము నుండి ఈ బ్రహ్మాండము నుండి బడల్వెడలెను. ఈ బ్రహ్మాండమున కావల బ్రహ్మ ద్రవమందు కోట్లాది బ్రహ్మాండములు తేలియాడుచుండుట బ్రహ్మదేవుడు కాంచెను. తదనంతరము వారు విరజానదీ తటమున కేగి అచటి నుండి దేవతా సహితుడై, అనంత కోటి సూర్యుల తేజోరాశిని పోలు ఒక దివ్య తేజో మండలమును కాంచెను.

ఆ తేజోరాశికి వారు ప్రణామము లాచరించి, నమస్కరించి, ధ్యానము చేసిరి. అచట దేవతా సహితుడయిన బ్రహ్మ దేవునకు సంకర్షణ మూర్తి దర్శనమాయెను. ఆయన అనంత ముఖములు కలిగి మరియు అనంత గుణ లక్షితుడై యుండెను. ఆ సమయమున అనంత భగవానుడు కుండలాకారుడై, చుట్టలు చుట్టుకొని యుండెను. ఆయన ఒడిలో బృందావనము, యమునానది, గోవర్ధనగిరి, కుంజ నికుంజములు, లతా సమూహములు, అనేక విధములయిన వృక్షములు, గోప గోపీ జన సముదాయము తో నిండిన గోలోకధామము ఉపలభ్యమయినవి. అక్కడి నుండి వారు అనంత భగవానుని అనుమతి తీసికొని లోనికి ప్రవేశించి, అనంత బ్రహ్మాండములకు స్వామి అయిన శ్రీకృష్ణ భగవానుని కాంచిరి. ఆయన శ్యామ సుందరవర్ణుడై, పీతాంబరధారియై, వంశీ వనమలా విభూషితుడై, కణకణ ధ్వనులు కావించు స్వర్ణ కంకణ, కేయూర, భుజకీర్తి మరియు నూపుర ధారియై, కంఠమందు కౌస్తుభమణి ధరించి, సహస్ర బాలసూర్యుల పగిధి భాసించు కిరీటము ధరించి, ముఖమున సుందర ముంగురులు నుదిటిపై ఆడుచుండగా కమల నేత్రుడై, కమలవదనుడై విరాజిల్లు చుండెను. అటువంటి మహానుభావుని కాంచి బ్రహ్మాది దేవతలు నమస్కరించి, పృధివీ భార నివారణ గూర్చి వివరించిరి. భగవానుడు వారి విన్నపములను విని, అర్ధము చేసికొని, తన నిజ సేవకులయిన గోలోకవాసులను తత్కార్యమునకై యధా యోగ్యమయిన ఆదేశములిచ్చి సహస్రముఖుడయిన అనంతుని తో ఇట్లనియె "ఓ! అనంతా! నీవు మొదట

వసుదేవ పత్ని అయిన దేవకి గర్భమందు ప్రవేశించి, తదుపరి రోహిణీ గర్భము నుండి ప్రకటితుడవు గమ్ము. తదనంతరము నేను దేవకీ పుత్రునిగా ఆవిర్భవించెదను.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండము నందు నారద బహుళాశ్వ సంవాదము నందలి "శ్రీ బలభద్రావతార కారణము" అను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(శ్రీ బలభద్రుడు అవతరించుటకు తయారగుట)

ఈ విధముగ శ్రీకృష్ణ భగవానుని చే ఆజ్ఞాపింపబడి, అనంతుడు భూమిపై అవతరించుటకు సంసిద్ధుడగుచూ తన సభయందు విరాజమానుడయ్యెను. ఆ సమయమున సిద్ధ, చారణ, గంధర్వులు వచ్చి అత్యంత వినీతులై, అవనిత శిరస్కులై, అయనకు నమస్కరించిరి. పిదప తాళ చిహ్నాంకిత ధ్వజము చే అలంకరింపబడిన ఒక దివ్య రథమును "సుమతి" అను సారథి అయన సమ్ముఖమునకు తీసికొని వచ్చెను. శత్రు సేనలను చీల్చి చెండాడు ముసలము, దైత్యుల గర్వమును నిర్మూలించు హలము, "బ్రహ్మమయము", అను కవచము, ఆయన వద్దకు వచ్చినవి. అచటకు అందరూ చూచుచుండగనే రమా వైకుంఠ ధామము నుండి శేషుడు ఏతెంచెను. ఆయన సహస్ర ఫణుడై, వానిపై మకుటధారుడై యుండెను. సిద్ధ చారణులు, మరియు పాణిని, పతంజలి ఆదిగా గల మునులు ఆయనను స్థుతించు చుండిరి. ఆ శేషుడు ఏతెంచి, అనంతుని కీర్తించి, ఆయన యందు ఐక్యమయ్యెను. పిదప అజిత వైకుంఠమున గల సహస్ర ఫణ శేషుడు అచటికి వచ్చెను. ఆయన అజైక పాదుడు, అహిర్బుధ్న్యు, బహురూప, మమత్ ఆదిగా గల రుద్ర గణముల చే పరివేష్ఠితుడై యుండెను. భయంకర భూత ప్రేతములు, అనేక మంది వినాయకులు ఆయన నలుప్రక్కలా నిలబడియుండిరి. అనంతుని సభయందు ఈ విధముగ ఏతెంచిన అజిత వైకుంఠ శేషనాగుడు అనంతుని స్థుతించి ఆయన యందు విలీనమయ్యెను. పిదప శ్వేత ద్వీప వాసుడు కుముద, కుముదాక్షాది పార్శ్వుల చే సేవింపబడెడి వాడు, వేలాది పడగలపై కిరీట శోభితుడు, నీలాంబరధారి, శ్వేత పర్వతము వంటి ప్రభాశాలి, నీలకుంతల కాంతి శోభితుడు, భయంకర రూపము కలవాడు అయిన శేషుడు వచ్చి సర్వులు చూచుచుండగనే అనంతుని యందు లీనమయ్యెను. అటు పిదప పాతాళమునకు ముప్పది రెండు వేల యోజనములు క్రింద నుండి మరియొక శేషుడు ప్రవేశించెను. ఈ వేయి పడగల శేషుడు భగవానుని తామసీ యోగ సంపన్నుడు. ఆయన అనంత సూర్యుల భాతి తేజస్సు గల కిరీటము ధరించి వ్యాస, పరాశర, సనక, సనందన, సనత్కుమార, నారద, సాంఖ్యాయన, పులస్త్య, బృహస్పతి మరియు మైత్రేయాది మునులచే పరివేష్ఠితుడై, యుండగా వాసుకి, మహాశంఖ, శ్వేత, ధనుంజయ, దృతరాష్ట్ర, కుహక, కాళీయ, తక్షక, కంబళ, అశ్వతర, దేవదత్తాది మహా సర్పములు ఆయనకు దీవనలు వీచుచున్నవి. కస్తూరి, అగరు, కేసర చందనాదులు అలదు కొన్న అత్యంత నాగ సుందరీమణులు ఆయనకు సేవలు చేయుచుండిరి.

సిద్ధ, చారణ, గంధర్వ, విద్యాధరులు ఆయన యశస్సును గానము చేయుచుండిరి. హాటకేశ్వరుడు, త్రిపురుడు, బలుడు, కాలకేయులు, కలి, నివాత కవచాది దైత్యులు ఆయన అనుయాయులై ముందు నడుచుచుండిరి. ఏకాదశ రుద్రులు వ్యూహాకారములో ఆయన ముందు, కస్తూరి మృగము, కామధేనువు మరియు వరుణుడు ఆయన వెనుక నడచుచుండిరి. వీణా, మృదంగ, తాళాది వాద్యములు మ్రోగుచుండెను. ఆయన ఒక్కొక్క ఫణముపై ఒక్కొక్క భూమండలము నువ్వుగింజవలె ప్రతీతమై యున్నది. ఇట్లు పాతాళ లోక శేషుడు ఆగమించి అనంతుని శ్రీ విగ్రహమందు లీనమయ్యెను.

సభయందలి పార్షదులందరూ ఈ విచిత్ర లీలను అవలోకించి, ఆయనను పరిపూర్ణతమ భగవానునిగ గ్రహించి, అవనిత శిరస్కులై, ఆశ్చర్య చకితులైరి. తదుపరి అనంత ముఖుడయిన శేష భగవానుడు, సంకర్షణుడు తన సిద్ధ

పార్షదులతో ఇట్లనియె "భూభార హరణమునకై నేను భూతలమున కేగుచున్నాను. మీరు కూడా యదుకులమున జన్మము నొందవలసినది. తదనంతరము తన సారథి సుమతి తో "నీవు మిక్కిలి బలవంతుడవు మరియు శూరుడవు. నీవు ఇక్కడనే యుండవలసినది. నీవు ఏ విధమయిన ఖేదము నొంద పని లేదు. ఎప్పుడెప్పుడు నేను యుద్ధాభిలాషి నగుదునో, అప్పుడప్పుడు తాళ చిహ్నాంకిత రధమును తీసకొని నీవు నా వద్దకు రావలసినది. ఓ! హల ముసలములారా! బ్రహ్మ కవచమా! ఎప్పుడెప్పుడు నేను మిమ్ములను తలచుకొందునో అప్పుడు మీరు నా వద్దకు వచ్చెదరు గాక! ఓ పాణినీ! వ్యాసకుముదాది మహర్షులారా! అష్టాదశ రుద్రులారా! కోటి కోటి రుద్రగణములారా! మహానుభావా! గిరిజాపతీ, శంకరా! గంధర్వులారా! వాసుకి ఆదిగా గల నాగులారా! నివాత కవచాది దైత్యులారా! వరుణా! కామధేనూ!! నేను భూ మండలమందు యదుకులమున అవతారము స్వీకరించెదను. మీరందరూ నన్ను అచట దర్శింపవలసినది." ఈ విధముగ ఆజ్ఞను బడసి సర్వులు తమ తమ స్వస్థానములకు ఏగిరి. పిదప అనంతుడు నాగకన్యా యూధములను గాంచి "నేను మీ అభిప్రాయమును ఎరుగుదును. మీరందరూ తపమాచరించి గోపకుల ఇండ్ల యందు జన్మించి, నా దర్శనము కావింప వలసినది. ఒకానొక సమయమున యమునా తట మందు మనోహర రాస మండలాతర్గతమున నేను మీతో రాసము సలిపి మీ మనోరధమును సఫలీ కృతము గావించెదను."

తదనంతరము నివాత కవచుల కధీశ్వరుడయిన కలి చేతులు జోడించి, ప్రభుని చరణము లందు పుష్పాంజలి సమర్పించి, ఆయన చరణ కమలములపై తన శిరము నుండి ఇట్లనియె "ప్రభూ! నా కర్తవ్యము గూర్చి ఆజ్ఞాపింపవలసినది. మీరు నన్ను ఎక్కడికి వెళ్ళమన్ననూ, అచటికి ఏగెదను. తండ్రీ! మీ వియోగము నేను భరింప లేను. మీరు భక్త వత్సలులు. నన్ను తప్పక మీతో తీసికొని వెళ్ళవలసినది.

ఈ ప్రార్ధన చే ప్రసన్నత నొంది అనంతుడు కలితో ఇట్లనియె "కలీ! నీవు నాతో కలసి సుఖముగ భారత వర్షమునకు ఏతెంచెవలసినది. ఆచట నీవు దృతరాష్ట్ర తనూజుడైన దుర్యోధనుడను నామమున విఖ్యాత చక్రవర్తివి అగుదువు. నేను నీకు సహాయమొనరించి గదాయుద్ధమును నేర్పెదను." అటు పిదప కలి అనంత భగవానునికి నమస్కార మొనరించి తన స్వస్థానమున కేగెను. ఆ కలిఏ దుర్యోధన రూపమున అవతరించెను. శ్రీ విష్ణు భగవానుని మాయచే నీవు నీ స్వస్వరూపమును మరచితివి.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండము నందు నారద బహుళాశ్వ సంవాదము నందలి బలభద్రుడు అవతారమునకు తయారగుట అను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(జ్యోతిష్మతీ ఉపాఖ్యానము)

ప్రాడ్విపాక మునీంద్రుడు "తదనంతరము కోట్లాది శారద పూర్ణ చంద్ర నిభానన అయిన నాగలక్ష్మీ దేవి రధారూఢయై అచటికి ఏతెంచెను. కోట్లాది చెలికత్తెలు ఆమెను పరివేష్ఠించి యుండిరి. ఆమె సంకర్షణ భగవానుని సమీపించి "భగవాన్! నేను కూడా భూతలమునకు మీతో పాటే వచ్చెదను. మీ వియోగము చే నా ప్రాణములు నిలువవు." నాగలక్ష్మీ దేవి యొక్క కంఠము రుద్ధమయినది. సంకర్షణ భగవానుడు సమస్త జగత్తుకు కారణ భూతమయిన దానికి సహితము కారణ భూతమయిన వాడు. భక్తుల దు:ఖ నివారణము అయన కర్తవ్యము. అయన శ్రీ నాగలక్ష్మీ దేవిని ఉద్దేశించి "రంభోరూ! నీవు శోకపడవలదు. నీవు భూతలమున కేగి రేవతీదేహమున విలీనము కమ్ము. తిరిగి నన్ను చేరి నా సేవ యందు

ఉపస్థితమయ్యెదవు. అంత నాగలక్ష్మీ దేవి "స్వామీ! రేవతీదేవి ఎవరు? ఎవరి కన్యక? ఎక్కడ నివసించుచున్నది? నాకు విస్తారముగ తెలియజేయవలసినది" అది వినిన అనంత దేవుడు తన ప్రియను కాంచి మందహాసము చేయుచూ ఇట్లనియె.

"ఇది సృష్ట్యాది యందలి విషయము. కశ్యపునకు కద్రువ యందు నేను ఉద్భవించితిని. శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞచే సర్వ లోకములకు క్రిందయున్న పాతాళమునకు సహితము క్రిందకు ఏగి భూమిని నా ఒక్క శిరముపై నువ్వుగింజవలె ధరించి విరాజిల్లు చుంటిని. ఆ సమయమున చక్షుసుని పుత్రుడు చాక్షుసుడు మనువై సప్తదీప మయమయిన వసుంధరను సామ్రాటై ఏలుచుండెను. మహామనో మండలేశ్వరులయిన రాజులు, ఆతని చరణములపై తమ శిరములు యుంచి నమస్కరించు చుండిరి. ఇంద్రాది దేవతలు సహితము ఆతని శాశనమును మన్నించుచుండిరి. ప్రచండ పరాక్రమ వంతుడయిన చాక్షుస మనువు ప్రత్యర్థుల బల గర్వములను చూర్ణము కావించెను. ఆ చాక్షుస మనువుకు సుద్యుమ్నుడు మొదలగు పుత్రులుదయించిరి. తదుపరి చాక్షుసుడు యజ్ఞమొనరించగా ఆ యజ్ఞగుండము నుండి జ్యోతిష్మతి అను కన్యక ఉత్పన్నమయినది. ఒకానొక దినము చాక్షుసుడు ప్రియముగ "తల్లీ! నీకు ఎటువంటి వరుడు కావలెను?" అని అడిగెను. అందుకు ఆ కన్యక "తండ్రీ! ఎవరు అందరికంటె బలవంతుడో అతడే నా భర్త కావలెను." అని సమాధానమిచ్చెను. అంత చాక్షసుడు సర్వులతో బలవంతుడు ఇంద్రుడని తలచి, ఆయనను సాదరముగ ఆహ్వానించి, ఆశీనుని కావించి "సర్వులలో బలవంతుడ వీవు అని తలచుచున్నాను. ఇది సత్యమేనా?" అని ప్రశ్నించెను. అంత ఇంద్రుడు "మహారాజా! నేను సర్వులలో బలవంతుడను కాను. నా కంటె బలవంతుడు వాయుదేవుడు. నేను ఆయన సహాయము చే నా కార్యములు సంపూర్ణము కావించుచున్నాను."

అంత చాక్షుసుడు వాయుదేవుని పిలచి "నీ కంటె బలవంతులెవరైననూ కలరా?" అని ప్రశ్నించెను. అంత మారుత దేవుడు 'పర్వతములు నా కంటె బలమయినవి. ఎందుకనగా నేను ఎంత బలముగ వీచిననూ వాటిని కదల్పలేను." అంత చాక్షుసుడు పర్వతములను అదే ప్రశ్న అడిగెను. పర్వతములు "రాజా! భూమి మమ్ము భరించును కావున భూమి మా కంటె బలమయినది" అని సమాధాన మొసగినది. అంత రాజు భూమిని ప్రశ్నించగా భూమి " నా కంటే బలవానుడు సంకర్షణ భగవానుడు. అతడు నిత్యుడు; అనంతుడు మరియు అనంత గుణ సాగరుడు, ఆది దేవుడు, వాసుదేవ స్వరూపుడు, వేయిముఖముల వాడు, గజరాజు వలె విశాలకాయుడ. ఆయన కైలాసము వలె ఉజ్వల ప్రభాపూర్నుడు, కోటి సూర్యుల పగిది తేజోమూర్తి, మరియు కోట్లాది కామదేవుల గర్వమును చూర్ణము గావించు సౌందర్యరాశి. ఆయన దివ్య కమల కర్లికల మాలచే సుశోభితుడు ఆపరిమళమును సానము చేయుటకు భ్రమరములు ఘంకారము చేయిచూ పరిభ్రమించుచుండును. సిద్ధ, సారన, గంధర్వ, విద్యాధరులు ఆయన కీర్తిని గానము చేయించుందురు. దేవ, దానవ, సర్ప, ముని గణములు ఆయనను సదా ఆరాధించు చుందురు. ఆయన ఒక్కొక్క ఫణమందు సమస్త పర్వత, సరితా, సాగర, వన, మరియు కోట్లాది ప్రాణులకు నిలయమయిన వసుంధర ఒక్క నవ్వుగింజ వలె అలరారును. నిరంతరము ఆయనను కీర్తించు పుణ్యుడు త్రిలోకములను నాశనము చేయు వాడయిననూ, ఆతడు మోక్షమును పొందును. ఇట్టి ప్రభావ సంపన్నుడు, సమస్త కారణకారణుడు, సర్వులకు ఈశ్వరుడు, సర్వుల కంటె బలయుతుడు, శక్తిశాలి సంకర్షణ భగవానుడు. ఆయన కంటే బలవంతుడు వేరొకడు లేడు," అని పృధివి శలవిచ్చెను. అనంతుడు "ఈ విధముగ నా కీర్తి, యశోగుణములను వినిన జ్యోతిష్మతి పిత్రాజ్ఞను పాటించి నన్ను పొందుటకై వింధ్య పర్వతమున కేగి తపమాచరించెను. ఆమె ఒక లక్ష సంవత్సరములు గ్రీష్మము నందు పంచాగ్నుల మధ్యను, వర్షము నందు నిరంతర జల ధారల మధ్యను, శిశిరమున కంఠ పర్యంతము శీతల జలముల మునిగియును తీవ్రముగ తపమాచరించెను. ఆ సమయము నందు ఆమె భూశయనము కావించు చుండెను."

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండము నందు నారద బహుళాశ్వ సంవాదము నందలి జ్యోతిష్మతీ ఉపాఖ్యానమను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(రేవతీ ఉపాఖ్యానము)

అనంత భగవానుడు "తదనంతరము వందలాది పూర్ణచంద్రనిభానన, నవయవ్వని, తపము నందు సంలగ్న అయిన జ్యోతిష్మతి సుందరిపై ఇంద్రుని తో సహా నవ గ్రహముల దృష్టి పడినది. ఆ సుందరీమణిని గాంచి వారి హృదయములందు ఆమెను పొందవలెనన్న కామాభిలాష ఉత్పన్నమయినది. అంత వారందరూ జ్యోతిష్మతీ ఆశ్రమమునకు వచ్చి "సుందరీ! నీవు ధన్యురాలివి. నీవు ఎవరిని గూర్చి తపమాచరించుచుంటివి? నీవు తపస్సుకు యోగ్యమయిన వయస్కురాలివి కాదు. నీవు నీ మనోభిప్రాయమును మాకు ఎరిగింపవలసినది." అది వినిన జ్యోతిష్మతీ దేవతలతో "సహస్రముఖుడయిన అనంత భగవానుని నాకు భర్తగా ప్రసాదింపవలసినది. ఇదియే నా తపమునకు కారణము." అది వినిన ఇంద్రాది దేవతలు ఫక్కున నవ్వి ఒక్కొక్కరు తమ సమాధానమును తెలిపిరి.

ఇంద్రుడు "సర్పరాజును భర్తగా నొందుటకు నీవు వృధా గా తపమాచరించుచుంటివి. నేను దేవతా సార్వభౌముడను. నేను వంద అశ్వమేధ యాగములాచరించితిని. నేను నీ ఎదుటనే యున్నాను. నన్ను వరింపవలసినది." యముడు "నేను జగత్తునందలి ప్రాణులకు దండన విధించు సమవర్తిని. నీవు నన్ను వరించి పితృలోకమున నా ప్రియ పత్నివై మెలగవలసినది." కుబేరుడు "వరాననా! నేను సంపూర్ణ ధనాధిపతిని. నీవు నన్ను రాజాధిరాజుగ తెలిసికొని మనసు నందు సంకర్షణుని పై ప్రీతిని విడచి నన్ను పతి గా పరిగ్రహింప వలసినది." అగ్ని "విశాల లోచనా! నేను సమస్త యజ్ఞముల యందు ప్రతిష్ఠులయిన దేవతల ముఖ స్వరూపమును. అన్యుల ఎడ ప్రియత్వము వీడి నన్ను గ్రహింపవలసినది." వరుణుడు "భామినీ! నేను జలచరముల స్వామిని. లోక పాలకుడను, పాశహస్తుడను. సమస్త సముద్రముల ఐశ్వర్యము నా వైభవమే! అందువలన నీవు నన్ను పొందవలసినది." ఆదిత్య భగవానుడు "ఓ! చాక్షుషాత్మజా! నేను జగత్తు యొక్క నేత్రమును. నా ప్రచండ కిరణములు తాకని ప్రదేశము లేదు. అందువల్ల పాతాళవాసుడైన అనంతుని మరచి నన్ను వరింపుము." చంద్రుడు "నేను ఓషధులకు అధీశ్వరుడను. నక్షత్రములకు రాజును. అమృత పానము చేసితిని. అన్నిటికీ మించి కామినులకు బలప్రదానము కావింతును. "అందువల్ల ఓ! గజగామినీ! నీవు నా ఉపాసన కావింప వలసినది." మంగళుడు "ఈ పృధివి నా తల్లి. సాక్షాత్ ఉరుక్రమ భగవానుడు నా తండ్రి నా పేరు మంగళుడు. ఓ! కళ్యాణీ! సంసారమంతటికీ కళ్యాణ కారకుడనైన నన్ను వరింపుము." బుధుడు "నేను బుద్ధిమంతుల యందు శ్రేష్ఠుడను. వీరుడను. మరియు కామినుల రసమును పెంపొందించు బుధుడను. నీవు సర్వులను పరిత్యజించి నాతో ఆనందానుభవము పొందవలసినది." బృహస్పతి "నేను సర్వ దేవతలకు ఆచార్యుడను. సాక్షాత్ మాటకు అధిష్ఠాతనైన బృహస్పతిని. ఓ! శుభాననా! దీనిని గ్రహించిన నీవు నా ఉపాసనను కావింపవలసినది." శుక్రుడు "నేను దానవ గురువును. భృగు వంశోద్భవుడను. సాక్షాత్ కవిని. మహాప్రాజ్ఞీ! నీవు వివాహము గూర్చి ఆలోచించి నా భామిని వి కావలసినది." శని "కళ్యాణీ! నేను అందరి కంటె బలశాలిని. దేవతలపై కూడా నా ప్రభావము పడును. నీ దృష్టి యందుగల సర్వజగత్తును భస్మీపటలము చేయగల శక్తి నాకు కలదు. అందువలన సర్వచింతా త్యాగము కావించి నన్ను వరింపుము."

ఆ పలుకులు వినినంతనే జ్యోతిష్మతిదేవి యొక్క కనులు ఎర్ర తామరలైనవి. అధరములు కంపించినవి. ఆమె నన్ను (అనంతుని) స్మరించి క్రోదావేశురాలైనది. జ్యోతిష్మతీదేవి యొక్క క్రోధము చే బ్రహ్మలోకము నుండి పాతాళము వరకూ గల బ్రహ్మాండమంతయు కంపించెను. ఇది కాంచిన దేవతా ప్రముఖులందరూ భయకంపితులై, పూజా సామాగ్రిని గైకొని జ్యోతిష్మతి యొక్క చరణములపై బడి కాపాడమని ప్రార్థించిరి.

దేవతలు ఈ విధముగ ప్రసన్నము చేసుకుందుకు ఎంత ప్రయత్నము చేసినప్పటికీ జ్యోతిష్మతి మనసు మర్చుకొనక ఇట్లు శపించెను. "ఓ! శనీ! నీవు దుష్టుడవు. నీవు నన్ను పొందుటకు ఇచ్చటికేతెంచితివి. అందువల్ల నీవు కుంటివానివి కమ్ము! నీ దృష్టి పరమ నీచమగు గాక! నీవు అత్యంత నల్లని రూపమును పొందెదవు గాక! అంతేగాక నీవు నీరసముగనూ,

సన్నముగనూ తయారగుదువు గాక! నీకు నల్లమినుములు, నల్లని నువ్వుల నూనె పాద్యమగుగాక! శుక్రా! నీవు ఒంటెకంటి వాడివయ్యెదవు. బృహస్పతీ! నీవు స్త్రీ స్వభావము నొందెదవు. బుధుడా! నీ వారము (బుధవారము) నిష్ఫలమగు గాక! బుధ వారము నాడు చేయబడు యాత్ర విఫలమగును. మంగళుడా! నీవు కోతి ముఖము నొందెదవు గాక! చంద్రుడా! నీకు రాజయక్ష్మ రోగము అంకురించు గాక! సూర్యుడా! నీవు దంతములను కోల్పోదువు గాక! వరుణా! నీవు జలోదర రోగము చే పీడింపబడుదువు గాక! అగ్నీ! నీవు సర్వ భక్షకుడవు అగుదువు. కుబేరా! నీవు పుష్పక విమానమును కోల్పోయెదవు. యమరాజా! నీవు బలవంతులయిన రాక్షసులతో రణమాచరించునపుడు నీ అభిమానము గ్రహింపబడి వారిచే ఓడింపబడుదువు. దేవాధమా! ఇంద్రా! నీవు నన్ను లోబరుచుకుందుకు వచ్చితివి. అంతేకాక పరమాత్మని నిందించితివి. అందువలన ఒకానొక రాజు నీ భార్య అయిన శచీదేవిని హరించుటకు యత్నించి, స్వర్గ సుఖములు అనుభవించును. నీవు స్వర్గము నుండి పారిపోయెదవు. ఓ! స్వర్గాధీశా! నీవు ఒక రాక్షసుని తో ఓడి అతనిచే పాశ బద్ధుడవై లంకయందు అంధకార బంధురమయిన కారాగారము నందు నెట్టబడుదువు." జ్యోతిష్మతీ ద్వారా శాపము నొందిన దేవతల మధ్య గల దేవేంద్రుడు కుపితుడై ఇట్లు శపించెను "ఓ! క్రోధకారిణీ! నీవు సంకర్షణుని పతిగా పొందిన పిదప సహితము ఈ జన్మ యందు కానీ, వేరొక జన్మ యందు కానీ నీ ఇంట పుత్రోత్సవము జరుగదు." ఈ విధముగ పలికి దేవతా సహితుడై స్వర్గమున కేగెను. జ్యోతిష్మతి తిరిగి తపసు నందు లీనమయ్యెను.

తదనంతరము సర్వ జగత్తుకు కారణభూతుడయిన చరుతుర్ముఖ బ్రహ్మదేవుని దృష్టి తపమాచరించుచున్న జ్యోతిష్మతి పై పడెను. ఆయన హంస వాహనుడై బ్రహ్మ, బ్రహ్మవిద్, బ్రాహ్మణి అను శక్తులను గైకొని తన లోకమునుండి కదిలెను. ఆయన భూతలమునకు వచ్చి, ఆకాశపధమున నిలిచి ఇట్లనియె "జ్యోతిష్మతీ! చాక్షుస మను పుత్రీ! నీ తపము సఫలమయినది. నీవు సిద్ధురాలివైతివి. నేను నీ యందు అత్యంత ప్రసన్నుడనైతిని. ఏదేని వరము కొరుకొనుము." కంఠ పర్యంతము జలనిమగ్న అయిన జ్యోతిష్మతి బ్రహ్మ దేవుని పలుకులాలకించి బహిర్ముఖియై ఇట్లనియె "భగవాన్! మీరు నిశ్చయముగ నా యందు ప్రసన్నులైతిరేని సహస్రఫణుడైన అనంతుని నాకు పతిగా ప్రసాదించ వలసినది." బ్రహ్మదేవుడు "పుత్రీ! నీ కోరిక పరమ దుర్లభము. అయిననూ నీ కామ్యమును పూర్ణము కావించెదను. ఈ రోజు నుండే వైవశ్వత మన్వంతరము ప్రారంభమయినది. ఇందు ఇరువది ఏడు చతుర్యుగములు గడచిన పిమ్మట సంకర్షణుడు నీకు పతి అగును." అంత జ్యోతిష్మతి "భగవాన్! ఇది అత్యంత ఆలస్యము. మీరు సర్వ సమర్థులు. మీరు నా మనోరధమును తొందరగా పూర్ణము చేయవలసినది, లేని ఎడల నేను ఎట్లు దేవతలకు శాప మొసగితినో అట్లే మిమ్ములను సహితము శపించెదను." జ్యోతిష్మఇ పలుకులు వినిన బ్రహ్మదేవుడు శాపమునకు వెరచి ఒక్కతడవు ఆలోచించి ఇట్లనియె "ఓ! రాజకుమారీ! నీవు ఆనర్త దేశాధీశుడయిన రైవత మహారాజుకు కుమార్తెగా జన్మింపుము. ఆయన కుశస్థలీ పురము నందున్నాడు. పిదప ఈ జన్మము నందే నీ మనోరధము పూర్ణమగును. ఒకానొక కారణమున ఇరువది ఏడు చతుర్యుగములు ఒక ఘడియ కాలమందు పూర్తి అగును. జ్యోతిష్మతికి ఈ విధముగ వరము ఇచ్చి బ్రహ్మదేవుడు వెంటనే అంతర్ధానుడయ్యెను.

తదనంతరము జ్యోతిష్మతి రైవతుని యొక్క భార్య గర్భము నుండి జన్మించెను. ఆ మహారాజు ఆమెకు "రేవతి" అను నామము నుంచెను. కొంత కాలమునకు రూప గుణ, యవ్వన సౌందర్యరాశి అయిన రేవతి కమల దళనేత్రయై వివాహయోగ్యత నొందెను. ఒకనాడు రైవతుడు భార్య సమేతుడై అంత:పురము నందు కూర్చొని తన కన్యను "కుమారీ! నీవు ఎటువంటి భర్తను కోరుకొనుచున్నావు?" అని ప్రశ్నించెను. అంత రేవతీదేవి "నేను అందరికంటె బలవంతుడయిన పురుషుని వివాహ మాడవలెనని కోరుకొనుచున్నాను." అని పలికెను. అది వినిన రైవత మహారాజు తన భార్యా, పుత్రికల నిడుకొని సమస్త లోకములు వెదకుచూ చివరకు బ్రహ్మ లోకము చేరెను. అచట వారు ఒక ఘడియ వేచి యుండిరి. ఇంతలో పృధివి యందు ఇరువది ఏడు చతుర్యుగములు గడచినవి." మహానంతుడు నాగలక్ష్మీదేవి తో ఇట్లనియె "రంభోరూ! ఆ రేవతి ఇంకనూ బ్రహ్మ లోకముననే యున్నది. నీవు ఆమె శరీరము నందు ప్రవేశించి ఆవేశావతారిణివి కమ్ము! తదనంతరము ద్వారక యందు నాతో సమస్త భోగములు అనుభవించుము."

ప్రాడ్విపాకుడు "నాగలక్ష్మీదేవి సంకర్షణుని మాటలు విని, ఆయన ఆజ్ఞను స్వీకరించి బ్రహ్మలోకమున కేగి రేవతీదేహమున ప్రవేశించెను. కౌరవేంద్రా! తదుపరి సంకర్షణుడు సర్వలోక వందితమయిన గోలోకమును వీడి భూతల భారహరణమునకై పృధివియందు అవతీర్ణుడయ్యెను. ఇది బలభద్రాగమన వృత్తాంతము. ఈయది సమస్త పాప నాశకము మరియు పరమ మంగళ ప్రదాయకము.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి రేవతీ ఉ పాఖ్యానము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(శ్రీకృష్ణ బలరాముల ప్రాకట్యము)

దుర్యోధనుడు "మహానుభావా! నేను పూర్వ జన్మమందు అనంతుని భక్తుడనని తెలిపిరి. నేను ధన్యుడను. అంతేకాక వాసుదేవుని పరమాద్భుత లీలా విశేషములు కూడా తెలిపిరి. శ్రీకృష్ణ బలరాములు పుడమిపై అవతరించి తమ పైతృక నగరమును మధుర నుండి ద్వారకకు ఎట్లు తరలించిరి? వ్రజవాసుల సమక్షమున వారు గుప్తరూపులై ఎట్లు సంచరించిరి?" ప్రాడ్విపాకుడు "యాదవుల పురి అయిన మధురను ఉగ్రసేనుడు పరిపాలించుచుండెను. ఆతని పెద్ద సోదరుడయిన దేవకుని పుత్రిక అయిన దేవకిని వసుదేవునికిచ్చి వివాహము జరిపించిరి. వివాహానంతరము వధువు అత్తవారింటికి ఏగునపుడు ఉగ్రసేన పుత్రుడు కంసుడు ఏతెంచి నూతన వధూవరుల రథమును తోలుటకు నిశ్చయించెను. అంత అశరీరవాణి "ఓరీ! మూర్ఖుడా! నీవు ఎవరి రథమును తోలుటకు ఉద్యుక్తుడవగు చున్నావో వారి ఎనిమిదవ సంతానము చే నీవు హతుడవగుదువు." ఇది వినిన కంసుడు కాలక్రోధుడై కరవాలము దూసి దేవకిని సంహరించుటకు ఉద్యుక్తుడయ్యెను. అంత వసుదేవుడాతనిని సమాధానపరిచి "ఎవరి వలన నీవు చావు కలదని భయపడు చుంటివో ఆ దేవకీ పుత్రులందరినీ నీకు ఇచ్చెదనని" తెల్పెను. కంసుడంత నిశ్చింతుడై వారిరువురినీ కారాగార వాసుల కావించి నిశ్చింతుడైయ్యెను. తదుపరి దేవకీ వసుదేవులకు మొదటి శిశువు కలుగగనే వసుదేవుడు ఆ బాలకుని కంసున కిచ్చెను. కంసుడు వసుదేవుని సత్యసంధతకు మెచ్చి ఆ బాలకుని తిరిగి ఇచ్చివేసెను. ఇంతలో నారదుడు వచ్చి కంసునికి ఈ విధముగ బోధించెను. "గ్రుడ్డు యొక్క పరిణామము ఎంత విచిత్రమో, దేవతల పన్నాగములు సహితము అతి విచిత్రము. ఈ బాలకుడు ఎనిమిదవ బాలుడు కాకపోవునా? నీవు ఎట్లు గణింపవలెను? మందునుండి వెనుకకా? లేక వెనుక నుండి ముందుకా? ముఖ్య విషయమేమనగా ఈ యాదవులందరూ దేవతా స్వరుపులే! వారందరూ నీ వధను కోరుచున్నారు."

నారదుని మాటలు వినిన కంసుడు భయవిహ్వలుడై దేవకీ గర్భమందు జన్మించిన ప్రతి శిశువును భ్రూణ హత్య గావించెను. ఆ సమయమున యాదవులందరూ కంసుని కారణమున మిక్కిలి భయభీతులైరి. దేవకీదేవి ఏడవసారి గర్భము ధరించెను. కంసుని భయమున వసుదేవుని వేరొక పత్ని రోహిణి నందుని ఇంట తలదాచుకొనెను. శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞచే యోగమాయ దేవకి గర్భమునున్న పిండమును రోహిణ దేవి గర్భమునకు మార్చెను. మధురాపురవాసులు ఆశ్చర్య చకితులై "ఆహా! దేవకీ గర్భము ఎచట కేగినది? ఇది ఆశ్చర్య కరమయిన విషయము".

అది జరిగిన అయిదు రోజుల తరువాత బాధ్రపద శుక్ల షష్ఠి తిథి యందు స్వాతీ నక్షత్రము, బుధవారము మధ్యాహ్న సమయమున అయిదు గ్రహములు ఉచ్ఛయందు యుండగా వ్రజభూమి యందు తన తేజస్సు ద్వారా నంద భవనమందు బలరాముడు ప్రకటమయ్యెను. నందుడు ఆ బాలునికి జాతక కర్మాదులు చేయించి బ్రాహ్మణులకు పది లక్షల గోవులు దానమిచ్చెను. పిదప గోపకులందరినీ ఆహ్వానించి మహోత్సవమును గావించెను. తదనంతరము ఎనిమిదవ గర్భమున అర్ధరాత్రి సమయమున పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుడా విర్భవించెను. అదే సమయమున నందరాణి

యశోదాదేవి గర్భమున యోగమాయ ఆడపిల్లగా అవతరించెను. యోగమాయ యొక్క ప్రభావము వలన సర్వ జగత్తు సుషుప్తి యందు లీనమయ్యెను. శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞచే వసుదేవుడు బాలకృష్ణుని తీసికొని, యమునను దాటి, బృందావనము ప్రవేశించి, యశోదాదేవి యొక్క శయనాగారము చేరి, యశోద వద్ద బాలకృష్ణునుంచి, యశోదాతనయను తీసికొని వెనుకకు వచ్చి మధురాపురి చేరెను. కారాగారమున బాలిక యొక్క రోదనమునువిని శత్రుభయము చే పొంచియున్న కంసుడు బాలికను పట్టి ఒక శిలపై విసరెను. ఆ సమయమున ఆ చిన్నారి బాలిక కంసుని పట్టు విడిపించుకొని, పైకెగరి తన స్వరూపమయిన యోగమాయా రూపము దాల్చి, సిద్ధ, చారణ, గంధర్వముని గణములు స్తుతించు చుండగా కంసుని చూచి “ఓరీ! దుష్టుడా! నిన్ను సంహరించు బాలకుడు పుట్టి పెరుగుచున్నాడు. ఈ దీనులయిన దేవకీ వసుదేవులను నీవు వ్యర్థముగ కారాగార వాసులను కావించితివి.” ఈ విధముగ పలికి యోగమాయ వింధ్యాచలమున కేగెను. దేవి యొక్క వచనములు విని కంసుడు మిక్కిలి ఆశ్చర్యచకితుడై, దేవకీ వసుదేవులను విడిపించి, పూతనాది దైత్యుల రావించి “పది రోజుల లోపుగా పుట్టిన బాలకులందరినీ సంహరింపవలసినది,” అని పలికెను. కంసుని ఆజ్ఞచే దైత్య గణములు శిశు హత్యలు కావించిరి. ఇచట నంద వ్రజమున నందుడు పుత్ర జననము చే మహోత్సవము కావించెను. ఈ విధముగ కంసుని భయమున శ్రీకృష్ణ బలరాములు వ్రజభూమి యందు పెరిగిరి. వారు తమ మాయ చే గుప్తరూపమున యుండి వ్రజవాసులపై కృపను ప్రసరించుటకై వివిధ అద్భుత లీలలు గావించిరి.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ బలరామ కృష్ణుల ప్రాకట్యము అను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(శ్రీరామ కృష్ణుల వ్రజలీలా వర్ణనము)

దుర్యోధనుడు “మునిశ్రేష్ఠా! అనంత భగవత్ స్వరూపులయిన బలరామకృష్ణులు ఈ భూమండలమందు అవతారము స్వీకరించి తిరుగాడిరి. సంక్షేపముగ వ్రజభూమి, మధుర, ద్వారక మరియు ఇతర క్షేత్రములందు వారు కావించిన లీలలు తెలుపవలసినది.” ప్రాడ్విపాకుడు “దుర్యోధనా! శ్రీకృష్ణ భగవానుడు పుట్టిన దాదిగా అనేక లీలలు ఆరంభించెను. ఆయన పూతనకు మోక్ష ప్రసాదము, తృణావర్త, శకటాసురులను ఉద్ధరించెను. తల్లి అయిన యశోదకు విశ్వరూపము చూపించెను. పెరుగు దొంగిలించెను. తన శ్రీ ముఖము నందు తల్లికి బ్రహ్మాండ దర్శనము కావించెను. యమళార్జున భంజనము, దుర్వాసోమునికి తన మాయా ప్రభావమును చూపెను. శ్రీ గర్గా చార్యుని చే రాధాకృష్ణుల మహిమను, సుందరతను వర్ణింప జేసెను. బ్రహ్మదేవుడు భాండీరవన రాసమండలి యందు శ్రీ రాధాకృష్ణుల వివాహము జరిపించెను.

తదుపరి బలరామ కృష్ణులు ఇరువరు బృందావనమునకేగి వత్సాసుర, బకాసురులను సంహరించిరి. గోపబాలకుల సహితులై బృందావనమున విహరించిరి. తాళవనము నందు గార్ధభరూపధారి అయిన ధేనుకా సురుడు బలదేవునికి గాయము చేయ సమకట్టెను. అంత అనంత బలశాలి అయిన సంకర్షణుడు ఆ గార్ధభము యొక్క కాళ్ళు పట్టి, త్రిప్పి త్రిప్పి ఆ తాళ వృక్షములపై ప్రహరించి సంహరించెను. తదుపరి శ్రీకృష్ణ భగవానుడు కాళియుని మదమడచి, దావానలము త్రాగి, పిదప శ్రీరాధాదేవి యొక్క ప్రేమను ప్రకాశింప జేయుటకై ఆమె పెట్టిన పరీక్ష యందు పాల్గొని, బృందావన విహారము కావించెను. శంఖచూడుని సంహరించి శివాసురీ ఉపాఖ్యానాది అనేక లీలలను గావించెను. తదుపరి ఒకనాడు గోవర్ధన పూజ చేయించెను. అందువలన ఇంద్రుడు కోపోద్రిక్తుడై సంవర్తకాది మేఘములను పంపి వ్రజభూమిని వరద యందు ముంచెను. వ్రజవాసులు వ్యాకుల చిత్తులవగా, శ్రీకృష్ణ పరమాత్మ వారిని ఓదార్చి, అభయము ప్రసాదించి గోవర్ధన పర్వతమును ఒక పుట్టు గొడుగు వలె ఎత్తి సునాయాసముగ తన చేతినందుంచెను. ఏడు సంవత్సరములు

వయసు గల బాలుడు ఏడు దినములు గోవర్ధనమును పట్టి నిల్చుని యుండెను. అద్దానిని గాంచి ఇంద్రుడు భయభ్రాంతుడై, అత్యంత వినమ్రుడై, అవనిత శిరస్కుడై, బాల కృష్ణుని చరణారవిందములందు వ్రాలెను. తదుపరి ఆయనను స్తుతించి, అభిషేకించి, తిరిగి స్వర్గమున కేగెను. గోవర్ధన లీలా విలాసమును కాంచిన గోపకులు మిక్కిలి విస్మితులైరి.

తదుపరి శ్రీకృష్ణుడు భూమి యందు ముత్యములు నాటి, వృక్షములు మొలిపించి, వాటికి ముత్యపు గుత్తులను కాయించి గోపకులకు ఒక చమత్కారమయ ఐశ్వర్యము ను చూపించెను. తదుపరి శ్రీకృష్ణ భగవానుడు శృతిరూప, ఋషిరూప, మైథిలీ, కోసల దేశ నివాసినీ, అయోధ్యావాసినీ, యజ్ఞసీతా, పుళిందక, రమా వైకుంఠవాసినీ, శ్వేత ద్వీప వాసినీ, ఊర్ధ్వ గోపి, దేవశ్రీ, జాలంధరీ, బర్హిష్మతీ, పురంధ్రీ, అప్సర, సుతల వాసినీ, మరియు నాగేంద్ర కన్యల గోపీ యూథములతో వేరువేరుగా రాసమండల రచన గావించెను. ఒకానొక సమయమున శ్రీకృష్ణుడు బలరామ సహితుడై గోపబాలకులతో పాటు భాండీరవన మందు గోవులను మేపుచుండెను. ఆచట గోప బాలకులు ఒకరినొకరు మోయుట అను ఆటను అడుచుండిరి. బలరాముని బృందము నెగ్గగా ప్రలంబుడు బలదేవుని ఎత్తుకొని మ్రోయుచూ, అకస్మాత్తుగా విశాలకాయుడై అసుర రూపము ధరించి మధుర వైపు పరెగెత్తుట ఆరంభించెను. ఆ అసురుని వీపుపై ప్రతిష్ఠితుడయిన అమిత పరాక్రముడు బలదేవుడు కుపితుడై తన పిడికిలి బిగించి శక్రుని వజ్రఘాతము వంటి పోటుతో ఆ దైత్యుని శిరము పై ప్రహరించెను. వజ్రఘాతము తినిన పర్వతము వలె అసురుడు నేల కూలెను. ఒకానొక సమయమున గోవులు, గోపాలురు ఒక ముంజగడ్డి వనమున ప్రవేశించిరి. అకస్మాత్తుగా దావాగ్ని ప్రజ్వరిల్లి నలుదిక్కులా విస్తరిల్లెను. గోప గణములు బలరామ కృష్ణులను శరణు జొచ్చిరి. అంత భగవానుడు వారికి అభయమిచ్చి వారందరినీ కన్నులు మూసుకొనమని, ఆ భీషణ దావాగ్నిని త్రావెను.

అటు పిదప గోపబాలురతో కలసి యమునా తటమున కేగి యజ్ఞ దీక్షితులయిన బ్రాహ్మణ పత్నుల నుండి భోజనమును గ్రహించెను. తదుపరి వ్రజభూమి యందు వరుణుడు నందుని అపహరించెను. అంత శ్రీకృష్ణుడు వరుణుని గర్వభంగము కావించి, నందునకు మిగిలిన గోపకులకు సర్వ వందితమయిన వైకుంఠ దర్శనము కావించెను. తదుపరి ఒకనాటి రాత్రి అంబికా వనమందు సుదర్శనమను సర్పము నందుని కబళించుటకు యత్నించగా అఖిలలోకపాలక వందనీయమయిన తన పాదము తో ఆ సర్పమును స్పర్శించి దానికి ముక్తిని ప్రసాదించెను. ఒకానొక దినము బలరామ కృష్ణులు గోపబాలురతో ఆడుచుండగా వ్యోమాసురుడు చోరుని రూపమున ఏతెంచెను. ముకుందుడు వాని భుజములు పట్టి, దశదిశలు త్రిప్పి భూమిపై విసరెను. అసురుడు అసువులు బాసెను. ఒకనాడు కంసుని పసుపున అరిష్టాసురుడు ఆవుదూడ వలె ఏతెంచెను. భగవానుడు దాని కొమ్ములు పట్టుకొని త్రిప్పి త్రిప్పి ధరాశయనుని కావించెను. అంత నారద మహర్షి కంసుని వద్ద కేగి శ్రీకృష్ణ లీలలను వర్ణించెను. అది వినిన కంసుడు "కేశి" అను అసురుని పంపించగా, ఆతడు ఒక మహా హయ రూపమున వ్రజభూమికి వచ్చెను. శ్రీహరి దాని నోటి యందు తన హస్తమును జొనిపి దాని ప్రాణములు హరించెను. ఆ విధముగ శ్రీకృష్ణుడు బలరామ సహితుడై అనేక అద్భుత లీలలు గావించెను.

(శ్రీ గర్గ సంహిత యందు బలభద్ర ఖండాతర్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీరామకృష్ణుల వ్రజలీల వర్ణనము అను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(శ్రీ రామ కృష్ణుల మధురా లీలా వర్ణనము)

ప్రాడ్విపాక మునీంద్రుడు "దుర్యోధనా! శ్రీకృష్ణ బలరాముల లీలలను నీకు అత్యంత సంక్షిప్తముగ తెలియజేయు చున్నాను. తదుపరి కంసుడు శ్రీకృష్ణ బలరాములను మధురకు పిలిపించుటకు అక్రూరుని వ్రజభూమికి పంపెను. అక్రూరునితో ముకుందుడు మధురా నగరమునకు ఏగుచున్నాడన్న వార్త దావానలము వలె వ్యాపించి గోపిక లందరినీ

విరహము చే వ్యాకులతకు గురిచేసెను. భగవానుడు వారందరినీ వేరువేరుగా ఆశ్వాశించి, బలరామ సహితుడై అక్రూరుని రథమారోహించి మధురకు పయనమయ్యెను. మార్గ మధ్యమున యమునా తటమందు అక్రూరునికి శ్రీకృష్ణుడు తన నిజధామ సందర్శనము కావించెను. తదుపరి వారు మధుర చేరి, అపహార్ణ వేళ వరకు మధురలో విహరించిరి. లీలా రూపము తో మానుష వేషము ధరించిన శ్రీరామ కృష్ణులు కేవలము పురాణ పురుషులు. మధురాపుర వాసులు అందరు నరనారీమణులు, నదులన్నియు సముద్రము వైపు ప్రవహించునట్లు శ్రీకృష్ణ సందర్శనమునకై పరుగులెత్తిరి. కోట్లాది కామ దేవ సౌందర్యమును తిరస్కరించు సౌందర్యము గల శ్రీరామ కృష్ణులు సర్వ జనులకు తమ దర్శన భాగ్యము కలుగజేసిరి.

తదుపరి రాజమార్గమునందు రజకుని తమకు సుందర దుకూలముల నిమ్మని శ్రీకృష్ణుడు అడిగెను. కానీ ఆ రజకుడు నిరాకరించి మదగర్వితుడు, అగుటచే శ్రీహరి తన బలమయిన హస్తమును ఆతని పై ప్రయోగించి ఆ రజకుని హతమార్చెను. పిదప భగవానునికి ఒక శౌచకుడు కలసెను. ఆతడు శ్రీకృష్ణ బలరాములను సుందర వస్త్రముల తో అలంకరిచగా, శ్రీకృష్ణుడు ఆతనికి తన సారూప్యమును ప్రసాదించెను. పిదప వారు త్రిభంగి అయిన కుబ్జను కలసిరి. చందన గ్రహణమను సాకుతో ఆమెను నిటారుగ, అత్యంత సౌందర్య రాశిగా ముకుందుడు మార్చెను. తదుపరి అచటి వైశ్య వ్యాపారులతో సంభాషణ మొనర్చి, కొంతమంది బాలకులను తీసికొని ధనుర్యాగ ప్రదేశమున కేగెను. అచట స్వర్ణ మండిత సప్తతాళ వృక్షముల ఎత్తుయున్న ధనువును చూచెను. వేలాది మనుష్యులు దానిని ఎత్తలేక పోయిరి. అయ్యది అష్ఠధాతు నిర్మితము మరియు లక్ష బారువుల బరువు కలది. కంసునికి ఆ ధనువు పరశురామ ప్రసాదితము. ఆ వైష్ణవ ధనువు శేష భగవానుని తలపించుచున్నది. శ్రీకృష్ణ భగవానుడు దానిని అవలోకించి, సునాయాసముగ పైకెత్తి, నారిని సారించి, ఆకర్ణాంతముగ లాగి టంకారము కావించెను. ఏనుగు చెరకు గడను విరుచునట్లు శ్రీకృష్ణుడు ఆ ధనువును అవలీలగా రెండు ముక్కలు గావించెను. ధనువు భంగమగుట చే ప్రకటింపబడిన ధ్వని చే పాతాళము నుండి బ్రహ్మలోకము పర్యంతము కంపించెను. తారలు, దిగ్గజములు తమ, తమ స్థానముల నుండి విచిలితములయినవి.

సమస్త భూమండలము తక్కెడ వలె రెండు ఘడియలు కంపించెను. అపహార్ణ వేళ రంగస్థల ద్వారమందు కువలయా పీడమను కుంజరమును బలరామకృష్ణులు కాంచిరి. భగవానుడు అద్దాని వద్దకేతెంచి, బాలక్రీడగా కొంత సేపు యుద్ధము గావించి, దాని తొండము పట్టి, ఇటు నిటు త్రిప్పి భూమిపై పడవేయగా కుంజరము అసువులు బాసెను. పిదప శ్రీకృష్ణ ప్రభువు కంసుడు చేయుచున్న ధనుర్యాగ మండప రంగస్థల ప్రవేశము కావించి ఎవరి భావనల కణుగుణముగ వారికి దర్శనమిచ్చెను. పిదప రంగభూమి యందు సర్వులు చూచుచుండగనే చాణూర, ముష్ఠిక, శాల, తోశాల, కూటులను మల్లులను పరిమార్చెను. శ్రీకృష్ణుని కార్యములు కాంచిన కంసుడు ఆయనను దుర్భాషలాడుట మొదలిడెను. అంత శ్రీహరి ఎగిరి ఎత్తైన మంచెపై కూర్చొని యున్న కంసుని పట్టి క్రిందపడవైచెను. కంసుడు లేచి, కత్తి, డాలు ధరించి శ్రీకృష్ణుని ఎదిరించెను. గరుడుడు సర్పమును పట్టినట్లు శ్రీకృష్ణుడు తన ప్రచండ భుజబలము చే కంసుని పట్టి త్రిప్పి త్రిప్పి క్రింద పడవైచెను. అంత వారిరువురు పర్వత శిఖరమున పోట్లాడు రెండు మదపు కొదమ సింహముల వలె పోట్లాడి, కొంత సేపు ఆకాశమున కెగరి అచట పోట్లాడిరి. శ్రీకృష్ణుడు కంసుని పట్టి భూమిపై విసరెను. కంసుడు మంచెపై బడి, అద్దాని స్థంభములు కూలగా రంగభూమి యందు నేలపై పడెను. కేశవుడు ఆకాశము నుండి క్రిందకు కంసునిపై దూకెను. ఆ ప్రహారమునకు భూమి కొంతతడవు కంపించెను. కానీ కంసుడా ప్రహారమునకు అసువులు బాసెను.

సింహము తాను సంహరించిన గజమును తన ముఖముతో పట్టి ఈడ్చినటుల శ్రీకృష్ణుడు కంసుని శరీరమును ఆ రంగ భూమి అంతయు ఈడ్చుట చే రాజలోకమంతయు హాహాకారములు చెలరేగెను. లోకులు "వైర భావము తో శ్రీహరిని నిరంతరము తలచుట చే కంసుడు భ్రమర కీట న్యాయమున ఆ మహా ప్రభుని సారూప్యము నొందెను." అని పలికిరి. కంసుని మరణమును కాంచిన కంసుని సోదరులు కోపోద్రిక్తులై ఆయుధములు ధరించి, శ్రీకృష్ణునిపై దూకుటకు యత్నించిరి. ఇది గమనించిన బలదేవుడు ఒక పరిఘ తీసికొని వారందరినీ ధరాశయనుల కావించెను. దేవ దుందుభులు మ్రోగినవి. సర్వత్ర జయజయ ధ్వానములు చెలరేగినవి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. గంధర్వ, కిన్నెర, విద్యాధరులు

ఆయన యశోగానమును కీర్తించిరి. అప్సర విద్యాధర కన్యకలు నర్తించిరి.

శ్రీకృష్ణుడు అందరినీ ఆశ్వాశన మొనర్చి, తన మాతా పితరులను బంధ విమోచనము కావించి, ఉగ్రసేనునికి రాజ్యము నప్పగించెను. పిదప యజ్ఞోప వీతాది సంస్కారములు కావించుకొని సాందీపని ముని వద్ద సమస్త విద్యలను అభ్యసించెను. గురు దక్షిణగా మరణించిన గురుపుత్రుని తీసికొని వచ్చెను. శంఖాసురుని వధించెను. పిదప మధురా నగరమందు నివసింపసాగెను.

వ్రజభూమి యందు జనుల వ్యధ బాపుటకు ఉద్దవుని అచటకు పంపెను. తదుపరి తాను వ్రజభూమి కేతెంచి రాసమండల మందు శ్రీ రాధా గోపికల సహితుడై రాసలీల గావించెను. ఋభు మహర్షికి ముక్తి నొసంగెను. తిరిగి మధురా నగర మేతెంచి అచటి రాచ కార్యములందు నిమగ్నుడాయెను. బలదేవుడు కోలాసురుని వధించి మధుర కేతెంచెను. ఈ విధముగ శ్రీ బలరామ కృష్ణుల లీలలు వేలాదిగా మధురా నగరమందు జరిగినవి.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ రామ కృష్ణుల మధురా పుర లీలలు అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(శ్రీ రామ కృష్ణుల ద్వారకా లీలా వర్ణన)

ప్రాడ్విపాకముని "దుర్యోధనా! ఇక బలరామ కృష్ణుల ద్వారకాలీలలు సంక్షేపముగ చెప్పెదను. వినుము. కంసుని దేహ పతనానంతరము మధురపై జరాసంధుడు దాడి వెడలెను. శ్రీకృష్ణుడు వానిని పరాజితుని గావించి, సముద్ర మధ్యమున ద్వారక దుర్గ నిర్మాణము కావించి ఒక్క రాత్రిలో తన బంధు భాంధవులందరినీ ద్వారకకు పంపించి, వారు అక్కడ నివసించుటకు ఏర్పాట్లు గావించెను. కాలయవనుడు ఆక్రమించి నపుడు ముచికుందుని ద్వారా ఆతనిని సంహరింప జేసెను. తదుపరి బలరామ కృష్ణులు ప్రవర్షణ గిరి ఎక్కి అక్కడ నుండి ద్వారకా పురికి ఏగిరి. బ్రహ్మ లోకమునుండి వచ్చిన రైవతుడు తన కన్యను సర్వాభరణ భూషితను గావించి, ఆమెను బలదేవునికి వివాహ రూపమున సమర్పించి, తదుపరి తపమాచరించుటకు బదరికాశ్రమమునకు తరలెను. తదుపరి శ్రీకృష్ణుడు కుండిన పురమునకేగి శత్రువులు చూచుచుండగా రుక్మిణీదేవిని హరించి తెచ్చెను. తదుపరి జాంబవతీ, సత్యభామా, కాళిందీ, మిత్రవింద, నాగ్నజాతి, భద్ర, లక్షణ, మరియు నరకాసురుడు బంధించిన పదహారు వేల వంద మంది రాచ కన్యలను విధి విధానముగ వివాహమాడెను. భీష్మక కుమారి రుక్మిణి యందు ఆయనకు ప్రథమ పుత్రుడు ప్రద్యుమ్నుడుదయించెను. ఈయన కామదేవుని అవతారము. అందుచేత తన తండ్రి అయిన శ్రీకృష్ణుని వలె మహా సౌందర్యశాలి. ఈతడు అనిరుద్దుడను పుత్రునకు జన్మనిచ్చెను. ఈ బాలుడు బ్రహ్మదేవుని అవతారము. తదుపరి ఒకానొక సమయమున ఉగ్రసేనునకు రాజసూయము కావింపవలెనని బుద్ధి పుట్టినది. అంత ప్రద్యుమ్నుడు ఆ భాద్యత స్వీకరించి, తన సోదర, బాంధవ సహితుడై విజయయాత్ర కొనసాగించి, జంబూ ద్వీపము నందలి తొమ్మిది ఖండములను జయించెను. కామధుగ నదీ తీరమున నున్న వసంతమాలతీ నగర ప్రభువయిన పతంగుని తో వారికి సమరము సంభవించినది. అందు పతంగుడు, బలదేవ సోదరుడయిన గదుడు ఇరువురు గదా యుద్ధ మారంభించిరి. ఆ సమయమున పతంగుని ప్రహారము చే గదుడు ఒక్క క్షణము మూర్ఛిల్లెను. అంత కోటి సూర్య సమానమయిన ఒక కాంతి పుంజ మేతెంచి, అందునుండి బలభద్రుడావిర్భవించి, తన హలముతో గంధర్వ సేన నంతటినీ లాగి, ముసలము చే ప్రహరించి వారిని ఉట్టుడిగించెను. యోధులు, రథ. గజ, హయములు చూర్ణమయ్యెను. అంత రథ హీనుడయిన పతంగుడు తన నగరమున కేగి, తిరిగి యాదవులపై విజయము సాధించుటకు వ్యూహరచన గావింప మొదలిడెను. అది తెలిసిన బలదేవుడు తన హలముతో

ప్రహరించి వసంతమాలతీ నగరమును అంతటినీ లాగి కామధుగ నది యందు కలిపివేయ సంకల్పించి, లాగుట మొదలిడెను. నగరము నందలి భవనములు, కట్టడములు, కూలుట నారంభమయ్యెను. సర్వత్రా హాహాకారములు చెలరేగి, నగరమంతయు సాగరమందు క్షోభింపడుచున్న నౌక వలె అటునిటు ఊగ నారంభించెను.

అంత పతంగుడు బుద్ధి తెచ్చుకొని యాదవులకు సముచిత కప్పములు, బహుమతులు నొసంగి బలభద్రునికి ప్రదక్షిణ ప్రణామములాచరించెను. తదుపరి బలభద్రుడు, సాంబుని విడిపించుటకై ఈ హస్తినకేతెంచినపుడు మీరు నిరాకరించిరి. ఆ తడవు మీరందరూ చూచుచుండగనే హస్తినను తన హలాయుధపు మొనచే ఉక్కడగించి, గంగ యందు ముంచుటకు ప్రయత్నించెను. తదుపరి నాగకన్యా యూధముతో యమునలో రాసలీల లాడుసమయమున యమునను సహితము తన నాగలితో ఈడ్చెను. ఒకనాడు నారదుని ప్రేరణచే నరకాసురునికి మిత్రుడు, సుగ్రీవుని మంత్రి అయిన ద్వివిదుడు బలదేవునితో యుద్ధమొనరించుటకు ఏతెంచెను. రైవత పర్వతమందు నాలుగు ఘడియలు వారిరువురి మధ్య ద్వంద్వ యుద్ధము జరిగెను. ద్వివిదుడు శిలా వృక్షములతో బలదేవుని ప్రహరించెను. బలదేవుడు ముసలముతో ఆ వానరుని శిరము పై ప్రహరించెను. ద్వివిదుడు తన ముష్ఠి ఘాతములతో బలదేవుని కి గాయమొనర్ప సంకల్పించెను. అంత బలదేవుడు తన రెండు చేతులతో ద్వివిదుని పట్టి, ఆ పర్వతము పై విసరి, వక్షస్థలమందు ప్రహరించెను. ఆ ఘాతము నకు ద్వివిదుడు మరణించెను.

తదనంతరము కౌరవ పాండవ యుద్ధ విషయమును విని బలరాముడు తీర్ధయాత్ర నిమిత్తమై కొందరు నాగరికులను, బ్రాహ్మణులను తీసికొని ద్వారకా నగరిని విడచి తీర్ధయాత్రా ప్రస్థానము కావించెను. ఆయన సిద్ధాశ్రమమును సందర్శించి, ప్రభాస క్షేత్రమున స్నానమాడి పశ్చిమముగ పయనించెను. ఆయన సరస్వతీ, ప్రతి స్రోతా, సైంధ వారణ్యము, జంబూ మార్గము, ఉత్పలావర్తము, అబ్రుదము, హేమవంతము సింధు నదములందు వేరువేరుగా స్నానమాచరించెను. తదనంతరము బిందుసరోవరము, త్రిత కూపము, సుదర్శనము, అత్రి తీర్ధము, ఔశనసము, ఆగ్నేయము, వాయనము, సౌదాసము, గృహ తీర్ధము, శ్రాద్ధ దేవాది తీర్ధములను సేవించి అచట కూడా స్నానమాచరించెను. తదనంతరము ఉత్తర దిశ కేగి కైలాసము, కరవీరము, మహాయోగము, గణేశము, కుబేరము, ప్రాగ్జోషితము, రంగవల్లీ, సీతారామము మొదలగు క్షేత్రములు, చైత్ర దేశము, వాసంత తిలకము, దశార్ణము, భద్ర, కూర్మతీర్ధము, పుష్పమాలా, చిత్ర వటము, చంద్ర కాంతము, నైశ్రేయశము, మను పర్వతము చక్షువు, కామశాలినీ, కామవనము, వేదక్షేత్రము, సీతా, పృధుతీర్ధము, తపోభూమి, లీలావతి, వేద నగరము, గాంధర్వము, శుక్రము, భీమరధీ, శ్రీ జాహ్నవీ, కాళిందీ, హరిద్వారము, కురుక్షేత్రము, మధురా మరియు పుష్కర క్షేత్రములందు పుణ్య స్నానము ఆచరించెను. అక్కడి నుండి శంబల గ్రామము, సూకర క్షేత్రము, సందర్శించుచూ, సంకర్షణుడు నైమిశారణ్యము ప్రవేశించెను. బలరాముని ఆగమనమును గమనించి శౌనకాది ఋషులు పైకి లేచి ఆయనకు ప్రణామము లర్పించిరి. అచట వేదవ్యాసుని శిష్యుడయిన రోమ హర్షణుడు పురాణములు వల్లించుచుండెను. ఆయన లేచి నిలబడ లేదు. అంత బలరాముడు కుపితుడై ఒర దర్భ చేతిలోనికి తీసికొని, దాని పదునయిన కొన చే రోమహర్షణుని శిరము ఖండించెను. అది గని మునులు హాహాకారములు చేసిరి.

బలరాముడు అది గాంచి స్వయముగ తాను సర్వలోకములనూ పవిత్రము గావింపగల శక్తిమంతుడయినప్పటికీ, లోక సంరక్షణార్ధము పన్నెండు నెలలు తీర్ధ స్నానములు చేయు వ్రతము సంకల్పించెను. అచట ఇల్వల దైత్యుని పుత్రుడయిన పల్వలుడు నివసించుచుండెను. ఆ నైమిశారణ్యమున పర్వదినముల యందు ఆ దైత్యుడు భయంకర సుడిగాలి రూపము ధరించి, ధూళిని, దానితో పాటు దుర్గంధ భూయిష్ఠమయిన రక్తము, మాంసము, మలమూత్రములు, మదిర మొదలగు వానిని వర్షించుచుండెను. వాని అంగములు వజ్ర కఠినములు. నాలుక ఎల్లప్పుడు లోనికి బయటకు కదులు చుండును. కాటుక కొండ వంటి దేహము, తప్తమయిన తామ్రము వంటి శిరోజములు, పొడవయిన మీసములు, గడ్డము కలిగి చూపరులకు భయంకరముగ యుండువాడు. ఋషి, బ్రాహ్మణుల శాంతి కొరకు బలదేవుడు వానిని ఆకాశము నుండి హలముతో క్రిందికి లాగి, ముసలము తో ప్రహరించి పరిమార్చెను. మునులందరూ బలరాముని యెడ, అతి ప్రసన్నులై, స్తుతించి, గొప్పగా ఆశీర్వదించి, అభిషేక మొనర్చిరి.

తదుపరి మునుల ఆజ్ఞను బడసి బలరాముడు సరయు, కౌశికీ, మానస సరోవరము, గండకీ మరియు గోమతీ

తీర్థములందు స్నానమాచరించెను. పిదప అయోధ్య, నందిగ్రామము, బర్హిష్మతీ, బ్రహ్మావర్తము, మొదలగు తీర్థములందు మునిగి చివరకు తీర్థరాజ మయిన ప్రయాగ చేరెను. అచట పది వేల ఏనుగులు దాన మొనర్చి అచటి నుండి చిత్రకూటము, వింధ్యాచలము, కాశీ, విపాశా, శోణ, మిథిలా, మరియు గయా క్షేత్రములు సందర్శించి, చివరకు గంగాసాగర సంగమ ప్రదేశము చేరి అచట కొమ్ములకు బంగారపు తొడుగులు, తొడిగి, సుందర కంబళులు పరచిన వంద కోట్ల గోవులను బ్రాహ్మణులకు దానమిచ్చెను. ప్రతి గొవుపైననూ వేరు వేరుగా స్వర్ణ రత్నములు ప్రోది చేయబడెను.

తదనంతరము దక్షిణ దిశగా ప్రయాణించి, మహేంద్రాది పర్వతములను, సప్త గోదావరులను, వేణీ, పంపా, భీమరథీ, స్కంధక్షేత్రము, శ్రీశైలము, వేంకటాచలము, కాంచీపురము, కావేరీ నది, శ్రీరంగము, ఋషభాద్రి, సేతుబంధము, కృతమాలా, తామ్రపర్ణి, మలయాచలము, కులాచలము, దక్షిణ సింధు, ఫాల్గుణ తీర్థము, పంచాప్సరము, గోకర్ణము, శూర్పారకము, తాపీ, పయోష్ణీ, నిర్విఘ్నా, దండకారణ్యము, రేవా, మాహిష్మతీ, అవంతిక, మొదలగు తీర్థములందు సంకర్షణ భగవానుడు స్నానమాచరించి సేవించెను. తదుపరి నీ సహాయమునకై కురుక్షేత్రమునకు వచ్చును. ఈ బలభద్రుని పరమపావనమయిన తీర్థయాత్రా చరిత్రను నీకు వర్ణించితిని. కౌరవేంద్రా! ఇయ్యది సర్వ పాపహరము, మరియు సర్వ కళ్యాణ కారకము, అయిన పవిత్ర ప్రసంగము.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండార్గతమున నారద బహులాశ్వ సంవాదము నందలి శ్రీ రామ కృష్ణుల ద్వారకా లీలా ప్రసంగమును ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(బలరాముని రాసలీలా వర్ణనము)

దుర్యోధనుడు “మునిసత్తమా! బలభద్ర భగవానుడు నాగకన్య గోపికలతో ఎప్పుడు విహరించెను? నాకు దయచేసి తెలుపవలసినది.” ప్రాడ్విపాక ముని “ఒకనాటి మాట! వ్రజము నందు తన సుహృదులనూ, బంధువులనూ చూడవలెనని బలదేవుని హృదయము నందు కోరిక కలిగినది. ఆయన తన తాళధ్వజ యుక్తమయిన తేరునధిరోహించి గోవులు, గోపబాలురు, నిండిన వ్రజభూమికేతెంచెను. నంద యశోదలు ఎంతోకాలము నుండి ఆయనను చూచుటకు ఉత్కంఠితులై యుండిరి. ఆయనను చూచిన తోడనే హృదయమునకు హత్తుకొనిరి. బలదేవుడు వసంత ఋతువు నందలి రెండు మాసములు వ్రజభూమి యందే యుండెను. పూర్వము అనంతుడు నాగకన్యలను గోపికలుగ జన్మించమనుట మనము వినియున్నాము కదా! వారందరూ గర్గాచార్యుని వద్ద కేగి, బలదేవుని గూర్చి తెలిసికొని ఆయన కొరకు పంచాంగ పూజ (పద్ధతి, పటలము, స్తోత్రము, కవచము, సహస్ర నామము) అచరించిరి. అద్దాని ప్రభావము చే బలభద్రుడు ప్రసన్నుడై యమునా తటమందలి రాసమండల మందు వారితో రాసక్రీడ కావించెను. ఆ దినము చైత్ర మాసపూర్ణిమ.

అరుణ వర్ణమునున్న చంద్రుడు అరణ్యమునంతనూ వివిధ రంగులతో రంజింప చేయుచుండెను. శీతల మందమారుతము కమల మకరంద పరాగముల చే సర్వత్ర మందమందముగ వీచుచూ సర్వులకు హృదయానందమును కలుగజేయు చుండెను. ఆనంద దాయిని అయిన యమున తన చంచల కెరటములచే నిర్మల మారుతమును యమునా తటమంతయు వ్యాపింపజేయు చున్నది. నికుంజములన్నియు లతా పుష్పములతో నిండినవై, లేత పల్లవములతో నిండి పుష్ప పరాగావృతములై యున్నవి. మత్తెక్కిన కోకిలలు, నెమళ్ళు, మధురముగ కూయు చున్నవి. మదమత్త మధుపములు పుష్పముల చుట్టూ భ్రమణము గావించుచూ మధుర ధ్వనిని కావించుచున్నది. ఈ విధముగ వ్రజభూమి అంతయు అత్యంత శోభాయమానముగ యున్నది.

బలరాముని నూపురములు మధుర ధ్వని కావించుచున్నవి. ఆయన సువర్ణ మణి రత్న ఖచిత కంకణ, కేయూర,

భుజకీర్తి, కిరీట కుండలములతో శోభించుచుండెను. ఆయన ముఖము కమలము వలె వికసించి యుండెను. ఆయన నీలాంబరధరుడై, కమలదళనేత్రుడై, యక్షిణీ పరివేష్ఠితుడయిన యక్షరాజు వలె గోపికలతో పరివేష్ఠితుడై విరాజిల్లు చుండెను. తదనంతరము వరుణుని చే ప్రేరితమయిన వారుణిదేవి వృక్షముల బెరడు నుండి ప్రకటితమై ప్రవహించ నారంభించినది.

ఆ పుష్ప మకరందము చే ఆ ప్రదేశమంతయు సుగంధ భరితమయ్యెను. వారుణీ పానము చే మదవిహ్వాలుడయిన బలరాముని కమల దళ నేత్రములు ప్రేమావేశము చే అరుణ వర్ణమును పొందినవి. తదనంతరము లీలా విహారజన్య శ్రమ చే ఆయన ముఖము పై స్వేద బిందువులు అంకురించినవి. గజరాజగమనుడు, ఐరావత తొండము వంటి భుజములు, చేతులు గల బలదేవుడు ఆ గోప కన్యలతో ఉన్మత్త మద గజము వలె క్రీడా విహారము కావించెను. కోట్లాది పూర్ణ చంద్రులు ఒక్కచోట చేరి ప్రకాశించునట్లు అయన నుండి తేజస్సు వెలువడు చుండెను. నల్ల త్రాచుల సహితము తిరస్కరించు నల్లని ముంగురులు, వేణీ బంధములు గలిగి, కపోలములందు మనోహర పత్రరచన కావింపబడిన సుందర, ముగ్ధ మనోహర గోప సుందరీమణులతో ఈ విధముగ అఖిల భువనపతి అయిన బలభద్ర దేవుడు అచట విరాజితుడై రాస విహారము గావించెను. పిదప ఆయన జలక్రీడలాడుటకై దూరము నుండి యమునా నదిని పిలచెను. కానీ యమున ఆయన మాటలు ఆలకించలేదు. అంత బలభద్రుడు క్రొధోద్రిక్తుడై తన హలాయుధపు అంచు చే యమునను ఈడ్చి ఇట్లనియె నేను నిన్ను పిలిచినప్పటికీ నీవు రాలేదు. నీవు నీ ఇచ్చానుసారము ప్రవర్తించితివి. నేను ఇప్పుడే నా ముసలము చే నిన్ను వంద ముక్కలు కావించెదను."

అంత యమున భయభీతయై, పరిగెత్తుకు వచ్చి ఆయన పాదములపై పడి ఇట్లనియె "ఓ! లోకాభిరామా! సంకర్షణా! బలభద్రా! మహాబాహూ! నీ అనంత బలపరాక్రమములు నేను ఎరుగను. ఈ సమస్త భూమండలమును నీ ఒక్క పడగ పై నువ్వు గింజ వలె ధరించితివి. నేను మీ పరమ ప్రభావము నెరుగని అజ్ఞానిని. మిమ్ము శరణు జొచ్చుచున్నాను. మీరు భక్త వత్సలులు. దయచేసి నన్ను విడిచిపెట్టుము ప్రభో!!" అంత యమునను కరుణించి, విడిచిపుచ్చి గోపికల సహితుడై మదగజరాజు కుంజర యూధము తో క్రీడించునట్లు యమున యందు దిగి వారందరితో జలక్రీడలాడెను. పిదప ఆయన బయటకు వచ్చిన పిదప యమునా దేవి ఏతెంచి ఆయనకు అనేక నీలి వస్త్రములు, సువర్ణ ఖచిత రత్నాభరణములు బహుమతులు గ అర్పించెను. బలదేవుడు వాటన్నింటినీ వేరువేరుగా ఆ గోప కన్యలందరికీ పంచి, తాను నీలి వస్త్రములు మరయు రత్నమాలాలంకృతుడై ఐరావతము వలె విరాజిల్లెను. ఈ విధముగ బలరాముడు ఆ వసంతరాత్రిని గడిపెను. నేటికీ యమున బలదేవుని బలపరాక్రమములకు నిదర్శనమా యన్నట్లు వక్రముగ ప్రవహించుచున్నది. ఎవరు ఈ బలరాముని రాసలీలా ప్రసంగమును వినునో, వినిపించునో ఆతడు సర్వపాప విముక్తుడై పరమానంద పద ప్రాప్తి నొందును.

(శ్రీ గర్గసంహిత యందలి బలభద్ర ఖండాంర్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి బలరాముని రాసలీలా వర్ణనమను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(బలభద్రుని పూజ, పద్ధతి, పటలము)

దుర్యోధనుడు "భగవాన్, మీరు సర్వజ్ఞులు. గోపికలకు గర్గాచార్యుల వారు ఉపదేశించిన బలభద్ర పంచాంగము గూర్చి వివరింప వలసినది. ప్రాడ్విపాకుడు "ఒకనాడు గర్గాచార్యుల వారు యమునా నదీ స్నానమునకై గర్గాచలము నుండి బయలుదేరి వ్రజభూమికి ఏతెంచిరి. లలిత లతా సమూహములు యమునా ప్రవాహ వేగము చే, మృదు మందముగ కదులుచున్నవి. పుష్ప సుగంధ భరితమయిన మలయ మారుతము సర్వులను మత్తెంకించుచుండగా భ్రమరములు

ఘుంకారము కావించుచుండెను. ఈ విధమయిన ప్రశాంత వాతావరణములో గర్గుడు ఒక లతా నికుంజ సమీపమున ఏకాంతముగ కూర్చొని శ్రీకృష్ణ బలరాములను ధ్యానము చేయనారంభించెను. ఆ సమయమున గోపిక లేతెంచి ఆయనకు నమస్కరించిరి. వారికి తమ పూర్వ జన్మ స్మృతి కలిగి తాము నాగకన్యలమని తెలిసికొనిరి. అంత వారు బలభద్రుని పొందుటకై గర్గుని సేవించి, ఆయనను ప్రాప్తించు సాధనను గూర్చి అడిగిరి. గోపకన్యల అనన్య భక్తిని గాంచి గర్గుడు వారి ఉద్దేశ్యము సిద్ధించుటకై "పద్ధతి, పటలము, స్థోత్రము, కవచము, మరియు సహస్రనామము". అను పంచాంగ సాధన వారికి ప్రసాదించెను.

"పద్ధతి" – అనగా ఒక దేవత యొక్క అనుగ్రహమునకై పాటించు నియమ నిష్ఠలు. బలదేవ పద్ధతి, అయనను ప్రాప్తించు నియమ నిష్ఠలు వినుము. "బలదేవుడు సహస్రముఖుడు. సమస్త భువనాధీశుడు. అనేక తీర్థ దానములు సహితము ఆయనను పొందుటకు అనర్హములు. ఆయన కేవలము అనన్య భక్తి ద్వారా మాత్రమే ప్రాప్తించును. శ్రీహరి యొక్క అనుజుడయిన బలభద్రుడు సత్సంగము చే శీఘ్రముగ ప్రాప్తించును. ఎవరి హృదయము నందు సిద్ధ భక్తి ఉదయించునో ఆతడే సిద్ధ పురుషుడు. బ్రహ్మ ముహూర్తమందు నిద్రలేచి, శ్రీ రామకృష్ణుల నామోచ్చరణ, గావించి, గురువునకు, పృధివికి ప్రణామములాచరించి, అంత భూమిపై పదములు నిడవలెను. తదనంతరము స్నానాదుల ముగించి, ఒక నిర్జన ప్రదేశము నందు కుశాశ్వమును పరచి, కూర్చుండి, రెండు చేతులను ఒడిలోనికి చేర్చి, దృష్టిని నాసాగ్రము నందు నిలిపి శ్రీ బలరాముని ధ్యానింప వలెను. ఆయన గౌర వర్ణుడు; నీలాంబర ధారి, వనమాలా విభూషితుడు, మిక్కిలి మనోహరమూర్తి. అట్టి హలధారి అయిన బలరాముని ప్రసన్నుని కావించుటకై నిత్యము ఆయనను ధ్యానింప వలెను. సాధకుడు తాను బాహ్యాంతరముల యందు మిక్కిలి శుద్ధముగ యుండి, మౌనధారియై, క్రోధమును త్యజించి, త్రికాల సంధ్యావందన మాచరించవలెను. మనసు నందు కామక్రోధాదులు యుండరాదు. ఎల్లప్పుడు సత్యము పలుకవలెను. జితేంద్రియుడై దినమునకు ఒక్కసారి పాయసాన్నమును భుజింపవలెను. రెండు సార్లు, మాత్రమే జలపానము కావింప వలెను.

ఈ విధముగ అంత:శత్రువులు ఆరింటినీ (కామ, క్రోధ, మోహ, లోభ, మద, మాత్సర్యములు) పై విజయము సాధించి, అనగా వానిని విసర్జించి, ఏకాగ్ర చిత్తుడై భజన కావించినచో కారణములకు సహితము కారణమయిన పరిపూర్ణ భగవానుడు సంకర్షణుడు ప్రసన్నుడగును. ఇది పద్ధతి.

పటలము:– ఇది మంత్ర సాధన. బలభద్ర భగవానుని పటలము పరమ గోపనీయము మరియు సిద్ధి ప్రదాయకము. దీనిని ఒక ఏకాంత స్థలమందు చతుర్ముఖ బ్రహ్మదేవుడు నారదునకు ప్రసాదించెను. మొదట ప్రణవము నుచ్చరించి, పిదప కామరాజ బీజమును రచించి కాళింది భేదన, సంకర్షణ పదములు చతుర్యాంతములుగ లిఖించి పిదప స్వాహా అని జోడింపవలెను. ఈ మంత్ర రాజము "ఓం క్లీం కాళిందీ భేదనాయ సంకర్షణాయ స్వాహా!" మానవులు వ్రత నియమములు తీసికొని ఒక లక్ష పదహారు వేల సార్లు జపము చేయవలెను. ఈ విధముగ కావించు సాధకునకు ఇహపరలోకము లందు పరమసిద్ధి ప్రాప్తించును. ఇందు సందేహము లేదు. మంత్ర జపానంతరము విశేష పూజ కావింపవలెను. ఈ పూజా విధానమును తెల్పెదను "ఒక సుందర స్థలమందు కర్ణికా, కేసరియుక్తమయిన ముప్పది రెండు దళములు గల పంచరంగుల కమలము నుంచి, దానిపై మంగళకరమయిన స్వర్ణ సింహాసనమునుంచి, అందు పరమశ్రేష్ఠమయిన బలరాముని మూర్తిని పెట్టి, ఆయనను భక్తి యుక్తముగ పూజింప వలెను. పిదప "ఓం నమో భగవతే పురుషోత్తమాయ, వాసుదేవాయ, సంకర్షణాయ, సహస్రవదనాయ, మహానంతాయ స్వాహా!" అను మంత్రము స్మరించుచూ శిఖాబంధనము కావింపవలెను. తదుపరి బలరామునకు అన్ని దిశల మందు ప్రణామములర్పించి, ఆయన సమ్ముఖమున అత్యంత భక్తి, వినయములతో కూర్చొని ఈ క్రింది మంత్రమును పఠించుచూ ఆయనను ఆవాహన కావింపవలెను, "ఓం జయ జయానంత బలభద్ర కామపాల తాలాండక్ కాళిందీ భంజన ఆవిరావిర్భాయ మమ సమ్ముఖోభవ". తదనంతరము "నమస్తేస్తు శీరపాణే హల ముసల ధర రౌహిణేయ నీలంబర రామ రేవతీరమణ సమస్తేస్తు "ఈ మంత్రము ద్వారా ఆసనము, అర్ఘ్య, పాద్య, స్నాన, యజ్ఞోపవీత, వస్త్ర, భూషణ, గంధ, అక్షత, పుష్ప, మధుపర్క, ధూప, దీప, నైవేద్య, పుష్పాంజలి మొదలగు ఉపచారములు సమర్పింప వలసినది. ఓం విష్ణవే, మధుసూదనాయ, వామనాయ, త్రివిక్రమాయ,

శ్రీధరాయ, హృషీకేశాయ, పద్మనాభాయ, దామోదరాయ, సంకర్షణాయ, వాసుదేవాయ, ప్రద్యుమ్నాయ, అనిరుద్ధాయ, అధోక్షజాయ, పురుషోత్తమాయ, శ్రీ కృష్ణాయ నమ:. ఈ మంత్రము ద్వారా పాద, గుల్ఫ, జాను, ఊరు, కటి ఉదర, పార్శ్వ, వీపు, భుజములు, చేతులు, అధరములు, నేత్రములు, మరియు శిరము, ఈ విధముగ సర్వాంగములు పూజింప వలసినది. పిదప (ఓం శంఖాయ నమ:) ఈ విధముగ మొదట ప్రణవము, ప్రతిపదము చతుర్థీ విభక్తి వేసి చివర నమ: శబ్దము చేర్చి ఈ క్రింది పదములతో సంపూర్ణ పూజ కావింపవలెను. (శంఖ, చక్ర, గదా, పద్మ, అసి, ధనుస్సు, వేత్ర, హల, ముసల, కౌస్తుభ, వనమాల, శ్రీవత్స, పీతాంబర, నీలాంబర, వంశీ, నేత్ర, గరుడాంక, తాళాంక ధ్వజ, దారుక, సుమతి, కుముర, కుముదాక్ష). ఈ ప్రకారముగ కమలమునకు అన్ని వైపులా తమతమ స్థానములందు విష్వక్సేనుని, వేదవ్యాసుని, దుర్గా గణేశులను, దిక్పాల నవగ్రహములను, వేరు వేరుగా పూజనము చేయవలెను. తదనంతరము స్థాలీపాక విధానము చే అగ్ని దేవ పూజనము కావించి, పూర్వోక్తముగ "ఓం క్లీం కాళిందీ భేదనాయ సంకర్షణాయ స్వాహా "అను మంత్రముచే ఇరువది అయిదు సార్లు ఆహుతులు అర్పింపవలెను. పిదప "ఓం నమో భగవతే వాసుదేవాయ" అను ద్వాదశాక్షరీ మంత్రముతో ఎనిమిది వేల సార్లు, మరియు చతుర్వ్యూహ సంయుక "ఓం నమో భగవతే తుభ్యం వాసుదేవాయ సాక్షిణే ప్రద్యుమ్నాయనిరుద్ధాయ నమ: సంకర్షనాయచ "అను మంత్రము తో ఎనిమిది వేల ఆహుతులు ఈయవలెను. పిదప అగ్నికి, ఆచార్యునకు ప్రదక్షిణ మాచరించి ఆయనకు తగిన దక్షిణ మరియు వస్త్రములు, స్వర్ణ ఆభూషణములు, తామ్రపాత్రలు, దూడలు గల ఆవులు, స్వర్ణము ఇచ్చి సంతృప్తుని కావింప వలెను. పిదప బ్రాహ్మణులకు పూజన సత్కారము లొనర్చి వారికి, మిగిలిన నగరవాసులకు భోజనము నిడవలెను. పిదప ఆచార్యునకు ప్రణామము లర్పింప వలెను.

ఎవరు ఈ పటల, పద్ధతుల ద్వారా బలరాముని స్మరణ, పూజన మొనర్చుదురో అతడు ఇహపర లోకములందు వివిధ సిద్ధులను, సమృద్ధులను పొంది సంపన్నుడగును. యువరాజా! బలదేవ భగవానుని గోపనీయము, మరియు సర్వసిద్ధి కరము అయిన పటలమును నీకు వినిపించితిని.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ బలభద్రుని పూజా, పద్ధతి మరియు పటలము అను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(శ్రీ బలరామ స్తోత్రము)

దుర్యోధనుడు "మహామునీ! సమస్త సిద్ధులను ప్రసాదించు శ్రీ బలరామ స్తోత్రమును నాకు దయచేసి తెలుపవలసినది." ప్రాడ్విపాకుడు "యువరాజా! ఈ బలరాముని స్తోత్రము వేదవ్యాస ప్రణీతము. ఇది మానవులకు సమస్త సిద్ధులను, మోక్షమును సహితము ప్రసాదించును. "దేవాధిదేవ! భగవన్! కామపాల! మీకు నమస్కారము. ఓ బలరామా! మీరు సాక్షాత్ అనంతులు, మరియు శేషులు. మీకు నమస్కారము. మీరు పృధివీ దారుకులు, పరిపూర్ణ బ్రహ్మ మరియు స్వయం ప్రకాశులు. హస్తమున హలమును ధరించి, సహస్రఫణములతో యుక్తులయిన సంకర్షణ స్వరూపులు. మీకు నిత్యము నమస్కారము. ఓ! పురుషశ్రేష్ఠా! మీరు అచ్యుతుని సోదరులు, రేవతీ హృదయేశ్వరులు, మీ శస్త్రము హలము. మీరు ప్రలంబాసుర సంహారి. మీరు నన్ను ఎల్లప్పుడు రక్షింతురు గాక! బలరామా! బలభద్రా! తాళధ్వజా! మీకు మరల మరల నమస్కారము. మీరు గౌరవర్ణులు, నీలంబరధారులు, రోహిణీ తనయులు. మీరు నమస్కారము. మీరు ధేనుక, ముష్టిక, కూట, పల్వల, రుక్మి, కూపకర్ణ, మరియు కుంభాండక సంహారులు. మీరు కాళిందీ భేదనులు, హస్తిన కర్షణులు; ద్వివిధ వధ కావించిన యాదవ రాజులు; వ్రజమండలము శోభిల్ల చేయువారు. మీరు కంసుని సోదరులను వధించిరి. మీరు సర్వులకు ప్రభువు మరియు అనేక తీర్థయాత్రలు కావించు మహనీయులు.

మీరు దుర్యోధనునకు సాక్షాత్ గురువులు. ప్రభూ! నన్ను రక్షింపవలసినది! రక్షింపవలసినది! ఓ! అచ్యుతా! మీకు జయము; జయము. ఓ! పరాత్పర దేవా! మీరు స్వయముగా అనంతులు. మీ కీర్తి సర్వ దిశల యందు వ్యాపించినది. మీరు దేవతా, ముని, సర్వ గణముల యందు శ్రేష్ఠులు. హల, ముసలములు ధరించిన బలరామునకు నమస్కారము. ఏ మానవుడు నిరంతరము ఈ స్థవమును పఠించునో, అతడు శ్రీహరి యొక్క పరమపదమును ప్రాప్తినొందును. జగత్తు యందు సమస్త శత్రువులను నాశనము చేయు బలయుక్తుడగను, మరియు ధన, స్వజనములు ప్రాప్తించును.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ బలరామ స్తోత్రము అను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(శ్రీ బలరామ కవచము)

దుర్యోధనుడు “మహామునీ! ధీమంతుడయిన గర్గాచార్యుల వారు గోపికలకు అన్ని విధముల రక్షించు దివ్య కవచమును ప్రసాదించిరి. దానిని నాకు సెలవీయవలసినది.” ప్రాడ్విపాకుడు “మొదట మనుష్యుడు పవిత్ర జలమందు స్నానమాచరించి శుద్ధ వస్త్రములు ధరించి కుశాశనమునందు కూర్చొని, కుశల చే చేయబడిన పవిత్రమును ధరించి, మంత్రానుష్ఠానము చేయవలెను. పిదప అచ్చుతాగ్రజుడయిన బలరాముని స్మరించి ఆయనకు నమస్కరింపవలెను. పిదప మనసును ఏకాగ్రము కావించి ఈ మంత్రరూప కవచమును ధరింప వలెను, “ఏ భగవానుడు గోలోకపతియో, ఎవరి కీర్తనము పరమ పవిత్రమో, ఆ పరమేశ్వరుడు నన్ను శత్రువుల నుండి రక్షించుగాక! ఎవరి ఫణముపై ఈ భూమండలము నువ్వు గింజ వలె నిలిచియుండునో, ఆ భగవానుడు ఈ భూ మండల మందు నన్ను రక్షించుగాక! ముసల ధారి అయిన భగవానుడు దుర్గము నందు, ఆదిదేవుడయిన భగవానుడు సంకర్షణుడు వనము నందు రక్షించుగాక! యమునా ప్రవాహమును నిరోధించు భగవానుడు జలమందు, నీలాంబరధారి అయిన భగవానుడు అగ్ని యందు నిరంతరము నన్ను రక్షించుగాక! భగవానుడయిన రాముడు సుడిగాలి యందు, బలదేవ భగవానుడు శూన్యమందు, అనంతవపు భగవానుడు సముద్రము నందు నన్ను రక్షించుగాక! వాసుదేవ భగవానుడు పర్వతములపై, శతమస్తకుడు భయంకర వివాదముల యందు, రోహిణీ నందనుడు రోగముల నుండి నన్ను రక్షించుగాక! కామము నుండి ధేనుకాసురారి, క్రోధము నుండి ద్వివిదుని పై ప్రహరించు భగవానుడు, లోభము నుండి పల్వల శత్రుడు, మోహము నుండి జరాసంధ శత్రువు, సదా నన్ను రక్షించుగాక! విష్ణు ధుర్య భగవానుడు ప్రాత:కాలమున, మధురాపురి నరేశుడు పూర్వాహ్ణ సమయమున, గోప సఖుడు మధ్యాహ్న కాలమందు, స్వరాట్ భగవానుడు దినమున అపహార్ణ సమయమున నన్ను రక్షించుగాక! ఫణీంద్ర భగవానుడు సాయంకాలమున, పరాత్పరుడు ప్రదోష సమయమున నన్ను రక్షించుగాక! దురంత వీర్య భగవానుడు మధ్య రాత్రి నుండి ప్రత్యూష కాలము వరకు, రేవతీపతి కోణముల యందు, ప్రలంభాసుర శత్రువు దిశల యందు, యదూద్వహుడు అథో ప్రదేశముల యందును, బలభద్రుడు ఉపరితలమున, అతిదూరముననూ, దగ్గరనూ బలదేవుడు నన్ను రక్షించుగాక! లోపలి నుండి పురుషోత్తముడు, వెలుపల మహాబలుడయిన నగేంద్రలీలుడు నన్ను రక్షించుగాక! పరిపూర్ణ భగవానుడయిన హరి సదా, సర్వధా నా హృదయము నందుండి ఉత్కృష్ట రూపముతో నన్ను రక్షించుగాక!” బలదేవుని ఈ మహాద్భుత కవచము దేవ దావనవులకు సహితము భయనాశము కావించి, పాపరూప ఇంధనమును జ్వలింప జేసి, అగ్నిరూప విఘ్నములను వినాశనము కావించును.

శ్రీ గర్గసంహిత యందలి బలభద్ర ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ బలరామ కవచము అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(బలభద్ర సహస్రనామము)

మహాత్మ్యము – ఈ సహస్ర నామము మానవులకు చతుర్విధ పురుషార్థములు నొసగునది. దీనిని వంద సార్లు పఠించినచో మానవుడు ఈ లోకమున విద్యావంతుడు అగును. ఈ సహస్రనామమును పఠించు మానవునకు లక్ష్మీ, వైభవము, సద్వంశము నందలి జన్మ, రూప, బల, తేజస్సులు, లభించును. గంగా లేక యమునా తీరమున గానీ, దేవాలయ ప్రాంగణమందు గానీ ఈ సహస్ర నామమును వేయిసార్లు పఠించిన యెడల అనేక సిద్ధులు ప్రాప్తించును. ఇద్దానిని పఠించుటనే తోడనే పుత్రార్ధికి పుత్రులు, ధనార్ధికి ధనము, ప్రాప్తించును. బంధమునున్న వానికి విమోచనము, రోగికి ఆరోగ్యము సిద్ధించును. ఏ మనుష్యుడు పురశ్చరణ విధి విధానముతో పద్ధతి, పటలము, స్తోత్రము, కవచ సహిత సహస్రనామమును పది వేల సార్లు కావించిన పిదప హోమ, తర్పణ, గోదాన, బ్రాహ్మణ పూజ విధి విధానముగ కావించునో, ఆతడు ఈ భూ మండల మంతటికీ చక్రవర్తి అగును. ఎల్లప్పుడు అనేక మంది సామంత రాజులతో పరివేష్ఠితుడై యుండును. వాని ద్వార మందు నిరంతరము మదజల ధారలు కార్చు కుంజరములు వేచియుండును. ఏదేని మనుష్యుడు నిష్కామ భావన తో బలభద్ర భగవానుని ప్రసన్నుని కావించుటకు ఈ సహస్ర నామమును పఠించునేని ఆ మానవుడు జీవన్ముక్తుడు అగును. అచ్యుతాగ్రజుడు, బలభద్రుడు ఆతని గృహమందు నివసించును. ఘోర పాపము లాచరించిన పాపి సహితము ఈ సహస్ర నామములు పఠించెనేని, మేరు పర్వత సదృశములయిన వాని పాపములు దగ్ధమగును. ఆతడు ఇహలోక మందు సర్వ సుఖములు అనుభవించి, పరమందు గోలొక ధామమునకు ప్రయాణమగును."

నారదుడు "అచ్యుతాగ్రజుడయిన బలభద్రుని పంచాంగమును విని, ద్యుతిమానుడయిన దుర్యోధనుడు పరమ భక్తితో ప్రాడ్విపాకమునిని పూజించెను. పిదప ప్రాడ్విపాకుడు దుర్యోధనుని ఆశీర్వదించి తన ఆశ్రమమునకు చనెను. పరబ్రహ్మ, పరమాత్మ అయిన బలదేవుని కథను ఎవరు వినిపించెదరో లేక వినెదరో, వారు ఆనంద మయులగుదురు. నృపేంద్రా! నీకు సమస్త మనోరథములను పరిపూర్ణము కావించు బలభద్ర చరిత్రను వర్ణించితిని. ఏ మానవుడు దీనిని శ్రవణము కావించునో, ఆతడు శ్రీహరి యొక్క శోకరహిత, ఆనందమయ ధామమును ప్రాప్తించును.

ఓం! అస్యశ్రీ బలభద్ర సహస్ర నామ స్తోత్ర మంత్రస్య, గర్గాచార్య ఋషి: అనుష్టుప్ చంద:; సంకర్షణ పరమాత్మ దేవతా; బలభద్ర ఇతి బీజమ్; రేవతీ రమణ ఇతి శక్తి:; అనంత ఇతి కీలకమ్, బలభద్ర ప్రీత్యర్థే జపే వినియోగ:

॥ధ్యానమ్॥

స్ఫురదమల కిరీటం కంకణార్వ:
చలదలక కపోలం కుండల శ్రీ ముఖాబ్జం
తుహినగిరి మనోజ్ఞం నీలి మేఘాంబరాఢ్యం
హల ముసల విశాలం కామపాలం సమీడే॥

ముందర ఓం, మరియు చివర నమ: ఇది ప్రతి పదమునకు చేర్చుకొన వలసినది. బలభద్ర, రామభద్ర, రామ, సంకర్షణ, అచ్యుత, రేవతీరమణ, దేవ, కామపాల, హలాయుధ, నీలాంబర, శ్వేతవర్ణ, బలదేవ, అచ్యుతాగ్రజ, ప్రలంబఘ్న, మహావీర, రౌహిణేయ, ప్రతాపవాన్, తాళాండక్, ముసలీ, హలీ, హరీ, యదువర, బలీ, సీరపాణి, పద్మపాణి, లగుడీ, వేణువాదన, కాళిందీ భేదన, వీర, బల, ప్రబల, ఊర్ధ్వగ, వాసుదేవ, కళా, అనంత, సహస్ర వదన, స్వరాట్, వసు, వసుమతీ, భర్తా, వాసుదేవ, వసూత్తమ, యదూత్తమ, యాదవేంద్ర, మాధవ, వృష్ణి వల్లభ, ద్వారకేశ, మధురేశ, దానీ, మానీ, మహామనా, పూర్ణ, పురాణ, పురుష, పరేశ, పరమేశ్వర, పరిపూర్ణతమ, సాక్షాత్ పరమ, పురుషోత్తమ, అనంత, శాశ్వత, శేష, భగవాన్, ప్రకృతేపర:, జీవాత్మ, పరమాత్మా, అంతరాత్మా, ధ్రువ, అవ్యయ, చతుర్వ్యూహ, చతుర్వేద, చతుర్మూర్తి, చతుష్పద, ప్రధాన, ప్రకృతి, సాక్షీ, సంఘాత, సంఘవాన్, సఖీ మహామనా, బుద్ధిసఖ, చేత, అహంకార, ఆవృత, ఇంద్రియేన, దేవతా, ఆత్మా, జ్ఞాన, కర్మా, శర్మా, అద్వితీయ, ద్వితీయ, నిరాకార, నిరంజన, విరాట్, సామ్రాట్,

మహౌఘ, ఆధార, స్థాణ్ను, చరిష్ణుమాన్, ఫణీంద్ర ॥ (100)

ఫణిరాజ, సహస్ర ఫణి మండిత, ఫణీశ్వర, ఫణీ, స్ఫూర్తి, ఫూత్కారీ, ప్రభూ, మణిహార, మణిధర, వితలీ, సుతలీ, తలీ, అతలీ, సుతలేశ, పాతాళ, తలాతల, రసాతల, భోగితల, స్ఫూర్ద్యంత, మహాతల, వాసుకీ, శంఖ చూడాభ, దేవదత్త, ధనుంజయ, కంబళాశ్వ, వేగతర, ధృతరాష్ట్ర, మహాభుజ, వారుణీ మదమత్తాంగ, మదఘూర్ణిత లోచన, పద్మాక్ష, పద్మమాలీ, వనమాలీ, మధుశ్రవ, కోటి కందర్పలావణ్య, నాగకన్యా సమార్చిత, నూపురీ; కటిసూత్రీ, కటకీ, కనకాంగదీ, ముకుటీ, కుండలీ, దండీ, శిఖండీ, ఖండమండలీ, కలి, కలిప్రియ, కాల, నివాతకవచేశ్వరా, సహారకృత్; రుద్రవపు, కాలాగ్ని, ప్రళయ, లయ, మహాహి, పాణిణి, శాస్త్రకార, భాష్యకార, పతంజలీ, కాత్యాయన, ఫక్కికాభూ, స్ఫోటాయన, ఉరంగమ, వైకుంఠ, యాజ్ఞిక, యజ్ఞ, వామన, హరిణ, హరి, కృష్ణా, విష్ణు, మహావిష్ణూ, ప్రభవిష్ణు, విశేషవిత్, హంస, యోగేశ్వర, కూర్మ, వారాహ, నారద, ముని, సనక, కపిల, మత్స్య, కమఠ, దేవమంగళ, దత్తాత్రేయ, పృధు, వృద్ధి, ఋషభ, భార్గవోత్తమ, ధన్వంతరీ, నృశింహ, కల్కి, నారాయణ, నర, రామచంద్ర, రాఘవేంద్ర, కోసలేంద్ర, రఘూద్వహ (200)

కాకుస్థ, కరుణాసింధూ, రాజేంద్ర, సర్వ లక్షణ, శూర, దాశరధీ, త్రాత, కౌసల్యానంద వర్ధన, సౌమిత్ర, భారత, ధన్వీ, శత్రుఘ్న, శత్రుతాపన, నిషంగీ, కవచీ, ఖడ్గీ, శరీ, జ్యాహత్ కోష్ఠక, బద్ధ గోధాంగుళీత్రాణ, శంభు కోదండ భంజన, యజ్ఞత్రాతా, యజ్ఞ భర్తా, మారీచ వధకారక, అసురారీ, తాటకారీ, విభీషణ సహాయకృత, పితృవాక్యకర, హర్షీ, విరాధారీ, వనేచర, ముని, మునిప్రియ, చిత్రకూటారణ్య నివాసకృత్, కబంధహ, దండకేశ, రామ, రాజీవలోచన, మతంగ, వనసంచారీ, నేతా, పంచవటీ పతీ, సుగ్రీవ, సుగ్రీవసఖా, హనుమత్ప్రీత మానసా, సేతుబంధ, రావణారి, లంకాదహన తత్పర, రావణ్యరీ, పుష్పకస్థ, జానకీ విరహాతుర, అయోధ్యాతిపతీ, శ్రీమాన్, లవణారి, సురార్చిత, సూర్యవంశీ, చంద్రవంశీ, వంశీవాద్య విశారద, గోపతీ, గోపవృందేశా, గోప, గోపీశతావృత, గోకులేశ, గోపపుత్ర, గోపాల, గోగణాశ్రయ, పూతనారీ, బకారీ, తృణావర్త నిపాతక, అఘారీ, ధేనుకారీ, ప్రలంబారీ, వ్రజేశ్వర, అరిష్ఠహా, కేశిశత్రు, వ్యోమాసుర వినాశకృత్, అగ్నిపాన, దుగ్ధపాన, బృందావన లతా, ఆశ్రిత, యశోమతీ సుత, భవ్య, రోహిణీ లాలిత, శిశు, రాసమండల మధ్యస్థ, రాసమండల మండన, గోపికాశతయుథార్థీ, శంఖచూడ వదోధ్యత, గోవర్ధన సముద్ధర్తా, శత్రుజిత్, వ్రజరక్షక, వృషభానువర, నంద, ఆనంద, నందవర్ధన, నందరాజసుత, శ్రీశా, కంసారీ, కాళీయాంతకా, రజకారీ, ముష్ఠికారీ;

కంసకోదండ భంజన, చాణూరారి, కూటహంత, శలారీ, తోశాలాంతక, కంస భ్రాతృనిహంత, మల్లయుద్ధ ప్రవర్తక, గజ హంతా, కంస హంతా, కాల హంతా, కళంక:, మగధారి, యవన:, పాండు పుత్ర సహాయకృత్, చతుర్భుజ, శ్యామలాంగ, సౌమ్య, ఔపగ విప్రియ, యుద్ధభృత్, ఉద్దవ సఖా, మంత్రీ, మంత్ర విశారద, వీర;, వీరమధన, శంఖధర, చక్రధర, గదాధర, రేవతీ చిత్తహర్తా, రేవతీ హర్ష వర్ధన, రేవతీ ప్రాణనాధ, రేవతీ ప్రియకారక, జ్యోతీ, జ్యోతిష్మతీ భర్తా, రైవతాద్రి విహార కృత్, ధృతినాధ, ధనాధ్యక్ష, దానాధ్యక్ష, ధనేశ్వర, మైధిలార్చితపాదాబ్జ, మానద, భక్తవత్సల, దుర్యోధనగురు, గుర్వీ, గదాశిక్షాకర, క్షమీ, మురారీ, మదన, మంద, అనిరుద్ధ, ధన్వినాంవర, కల్పవృక్ష, కల్పవృక్షీ, కల్పవృక్షవన ప్రభూ, శ్యమంతకమణి, మాన్య, గాండీవి, కౌరవేశ్వరా, కూష్మాండఖండన కర, కూపకర్ణ ప్రహారకృత్, సేన్యా, రేవత జామాతా, మధుసేవిత, మాధవ సేవిత, బలిష్ఠ, పుష్ఠ సర్వాంగ, హృష్ఠ, పుష్ఠ, ప్రహర్షిత, వారాణసీగత, కృద్ధ, సర్వ, పౌండ్రక ఘాతక, సునందీ, శిఖరీ, శిల్పీ, ద్వివిదాంగ నిశూదనా, హస్తినాపుర సంకర్షీ, రధీ, కౌరవ పూజిత, విశ్వకర్మా, విశ్వధర్మా, దేవశర్మా, దయానిధి, మహారాజు, చత్రధరా, మహారాజోప లక్షణ, సిద్ధగీత, సిద్ధకధా, శుక్ల చామరా వీజిత, తారాక్ష, కీర్నాస, బింబోష్ఠ, సుస్మితచ్ఛవీ, కరీంద్ర, కరదోర్దండ, ప్రచండ, మేఘమండల, కపాట వక్షా, పీనంశ, పద్మపాద (400)

స్ఫురద్యుతి, మహావిభూతి, భూతేశ, బంధమోక్షీ, సమీక్షణ, చైద్యశత్రు, శత్రుసంధ, దంతవక్త్ర నిషూధక, అజాతశత్రు, పాపఘ్న, హరిదాస సహాయకృత్, శాలబాహు, శాల్వహంతా, తీర్ధయాయీ, జనేశ్వరా, నైమిశారణ్య యాత్రార్థీ, గోమతీ తీర వాసకృత్, గండకీ స్నానవాన్, స్రగ్వీ, వైజయంతీ విరాజిత, అమలాన్, పంకజధార, విపాశీ, శోణ సంప్లుత, ప్రయాగ తీర్ధరాజ, సరయు, సేతు బంధన, గయాశిర, ధనద, పౌలస్త్య, పులహాశ్రమ, గంగాసాగర సంగార్థీ, సప్త గోదావరీపతీ, వేణీ, భీమరధీ, గోదా, తామ్రపర్ణీ, వటోదకా, కృతమాలా, మహాపుణ్యా, కావేరీ, పయస్వినీ, ప్రతీచీ, సుప్రభా, వేణీ,

త్రివేణీ, సరయూపమా, కృష్ణా, పంపా, నర్మదా, గంగా, భాగీరథీ, నదీ, సిద్ధాశ్రమ, ప్రభాస, బిందు, బిందుసరోవర, పుష్కర, సైంధర, జంబూ, నరనారాయణాశ్రమ, కురుక్షేత్రపతీ, రామ, జామదగ్న్య, మహాముని, ఇల్వలాత్మజ హంతీ, సుదామా, సౌఖ్యదాయకా, విశ్వజిత్, విశ్వనాధ, త్రిలోక విజయీ, జయీ, వసంత మాలతీ కర్ష, గద, గద్య, గదాగ్రజ, గుణార్ణవ, గుణనిధీ, గుణపాత్రా, గుణాకర, రంగవల్లీ, జలాకార, నిర్గుణ, సగుణ, భృహత్, దృష్ట, శృత, భవత్, భూత, భవిష్యత్, అల్పవిగ్రహా, అనాదీ, ఆది, ఆనంద, ప్రత్యగ్ధామా, నిరంతర, గుణాతీత, సమ, సౌమ్య, సమధృక్ (500)

నిర్వికల్ప, గుధ, వ్యూధ, గుణ, గౌణ, గుణాభాస, గుణావృత, నిత్య, అక్షర, నిర్వికార, క్షర, అజస్త్రసుఖ, అమృత, సర్వగ, సర్వవిత్, సార్ధ, సమబుద్ధి, సమప్రభ, అక్లోధ్య, అచ్ఛేధ్య, ఆపూర్ణ, అశోష్య, అదాహ్య, అనివర్తక, భ్రహ్మ, భహ్మాధర, భ్రహ్మా, జ్ఞాపక, వ్యాపక, కవి, అధ్యాత్మ, అధిభూత, అధిదైవ, స్వాశ్రయ, ఆశ్రయ, మహావాయు, మహావీర, చేష్టా, రూప తనుస్థిత, ప్రేరక, భోధక, భోదీ, త్రయోవింశదికగణ, అంశాంశ, నరావేశ, అవతార, భూపరిస్థిత, మహ, జన, తప, సత్య, భూ, భువ, స్వ, నైమిత్తిక, ప్రాకృతిక, ఆత్యంతికమయలయ, సర్గ, విసర్గ, సర్గాది, నిరోధ, రోధ, ఉ తిమాన్, మన్వంతరావతార, మను, మనుసుత, అనఘ, స్వయంభూ, శాంభవ, శంకు, స్వాయంభువ సహాయకృత్, సురాలయ, దేవగిరి, మేరు, హేమ, అర్చిత, గిరి, గిరీశ, గణనాధ, గౌరీ, ఈశ, గిరిగహ్వర, వింధ్యా, త్రికూట, మైనాక, సువేల, పారిభద్రక్, పతంగ, శిశిర, కంక, జారుధీ, శైలసత్తమ, కాలంజర, బృహత్సాను, దరీభృత్, నందికేశ్వర, సంతాన, తరురాజ, మందార, పారిజాతక (600)

జయంతకృత్, జయుతాంగ, జయంతీ, దిగ్, జయాకుల, వృత్రహా, దేవలోక, శశీ, కుముదబాంధవ, నక్షత్రేశ, సుధా, సింధు, మృగా, పుష్య, పునర్వసు, హస్త, అభిజిత్, శ్రవణ, వైధ్రుత, భాస్కరోదయ, ఇంద్ర, సాధ్య, శుభ, శుక్ల, వ్యతీపాత, ధృవ, సిత, శిశుమార, దేవమయ, భ్రహ్మలోక, విలక్షణ, రామ, వైకుంఠనాధ, వ్యాపీ, వైకుంఠ నాయక, శ్వేతదీప, అజితపద, లోకాలోక చలాశ్రిత, భూమి వైకుంఠదేవ, కోటి భ్రహ్మాండ కారక, అసంఖ్యాక భ్రహ్మాండపతి, గోలోకేశ, గవాంపతి, గోలోకధామా ధీశణ, గోపికా కంఠభూషణ, హ్రీధర, శ్రీధర, లీలాధర, గిరిధర, ధురీ, కుంతధారీ, త్రిశూరీ, భీభత్సా, ఘర్ఘరస్వన, శూలార్పితగజ, సూచ్యార్పితగజ, గచచర్మధర, గజీ, అంత్రమాలీ, ముండమాలీ, వ్యాళీ, దండకమండలు, భేతాళ భృత్, భూతసంఘ, కూష్మాండగణ సంవృత, ప్రమదేశ, పశుపతీ, మృడానీ, ఈశ, ముండ, వృష, కృతాంతసంఘారీ, కాలసంఘారీ, కూట, కల్పాంత భైరవ, షడాసన, వీరభద్ర, దక్షయజ్ఞ విఘాతక, ఖర్పరాశీ, విషాశీ, శక్తిహస్త, శివా, అర్ధద, పినాక టంకారహర, చల ఝుంకార నూపుర, పండిత, తర్కవిద్వాన్, వేదపాఠీ, శృతీశ్వరా, వేదాంతకృత్, సాంఖ్యశాస్త్రీ, మీమాంసీ, కణనామభాక్, కాణాది, గోతమ, వాదీ, వాద, వైయాయిక, నయ (700)

వైశేషిక, ధర్మశాస్త్రీ, సర్వశాస్త్రార్ధ తత్వగ, వైయాకరణ కృత్, చంద, వైయాస, ప్రాకృతీ, వచ, పరాశరీ సంమితావిత్, కావ్యకృత్, నాటక ప్రద, పౌరాణిక, స్మృతికర, వైద్యా, విద్యావిశారద, అలంకార, లక్షణార్ధ, వ్యంగ్యవిత్, ధ్వనివిత్, ధ్వని, వాక్యాస్పాట్, పదస్పోట, స్పోటవృత్తి, రసార్దవిత్, శృంగార, ఉజ్వల, స్వచ్ఛ, అద్భుత, హాస్య, భయానక, అశ్వత్థ, యువ భోజీ, యువక్రీత, యవాశన, ప్రహ్లాద రక్షక, స్నిగ్ధ, ఏలవంశ వివర్ధన, గతాధి, అంబరీషాంగ, విగాధి; గాధీనాంవర, నానామణి సమాకీర్ణ, నానారత్న విభూషణ, నానా పుష్పధర, పుష్పీ, పుష్పధన్వా, ప్రపుష్పిత, నానాచందన గండాడ్య, నానా పుష్ప రసార్చిత, నానా వర్ణమయ, వర్ణ, సదానానా వస్త్రధర, నానా పద్మాకర, కౌశీ, నానా కౌశేయ వేషధృక్, రత్నకంబళధారీ, దౌతవస్త్ర సమావృత, ఉత్తరీయధర, పూర్ణ, ధనకంచుకవాన్, సంఘవాన్, పీతోష్ణీష, సితోష్ణీష, రత్నో ష్ణీష, దిగంబర, దివ్యాంగ, దివ్య రచన, దివ్యాలోక విలోకిత, సర్వోపమ, నిరుపమ, గోలోకాంకీ కృతాంగన్, కృతస్తోత్సాగ గోలోక, కుండలీ, భూత, ఆస్థిత, మాధుర, మధురా, ఆదర్శీ, చలత్ఖంజనలోచన, రధిహర్తా, దుగ్ధహర, నవనీత శితాశన, తక్రభృక్, తక్రహారీ, దధిచౌర్యకృతశ్రమ, ప్రభావతీ బద్ధకర, దామీ, దామోదర, దమీ, సికతా భూమిచారీ, బలకేళి, వ్రజార్ధక్, ధూళి దూసర సర్వాంగ, కాకపక్షధర, సుధీ, ముక్తకేశ, వత్సబృంద, కాళిందీ కూల వీక్షణ, జలకోలాహలీ, కూలీ (800).

పంక ప్రాంగణలేపక, శ్రీ బృందావన సంచారీ, వంశీవటతటస్థిత, మహామన నివాసీ, లోహార్గ లవణాధిప,

సాధు, ప్రియతమ, సాధ్య, సాధ్వీశ, గతసాధ్యస, రంగనాధ, నిర్లేశ, ముక్తినాధ, అఘనాశక, సుకీర్తి, సుయశ, స్పీత, యశశ్వీ, రంగరంజన, రాగషట్క, రాగపుత్ర, రాగిణీ, రమణోత్సుక, దీపక, మేఘమల్హార్, శ్రీరాగ, మాలకోశ, హిందోళ, భైరవాఖ్య, స్వర జాతిస్మర, మృదు, తాళ, మాన, ప్రమాణ, స్వరగమ్య, కళాక్షర, శమీ, శ్యామీ, శతానంద, శతయామ, శతక్రతు, జాగర, సుప్త, ఆసుప్త, సుషుప్త, స్వప్న, ఉర్వర, ఊర్జ, స్ఫూర్జ, నిర్జర, విజ్జర, జ్వర వర్జిత, జ్వరజిత్, జ్వరకర్తా, జ్వరయుక్త, త్రిజ్వర, జ్వర, జాంబవాన్, జంబుకాశంకీ, జంబూద్వీప, ద్విపారిహా, శాల్మలీ, శాల్మలీద్వీప, ప్లక్ష, ప్లక్ష వనేశ్వర, కుశధారీ, కౌశీ, కౌశిక, కుశవిగ్రహ, కుశస్థలీపతీ, కాశీనాధ, భైరవ శాశన, దాశార్హ, సాత్వత, వృష్ణి, భోజ, అంధకనివాసకృత్, అంధక, దుందుభి, ద్యోత, ప్రద్యోత, సాత్వతాంపతి, శూరసేన, అనువిషయ, భోజేశ్వర, వృష్ణీశ్వర, అంధకేశ్వర, ఆహుక, సర్వనీతిజ్ఞ, ఉగ్రసేన, మహోగ్రవాక్, ఉగ్రసేన ప్రియ, ప్రార్థ్య, ప్రార్థ; యదు సభాపతి, సుధర్మాధిపతి, సత్వ, వృష్ణి చక్రావృత, భిషక్ (900)

సభాశీల, సభాదీప, సభాగ్ని, సభారవి, సబాచంద్ర, సభాభాస, సభాదేవ, సభాపతి, ప్రజార్థద, ప్రాజాభర్తా, ప్రజాపాలన తత్పర, ద్వారకా దుర్గ సంచారీ, ద్వారకాగ్రహ విగ్రహ, ద్వారకా దుఃఖసంహర్తా, ద్వారకా జన మంగళ, జగత్సుఖ, బ్రహ్మణ్యదేవ, బ్రహ్మణ్య, బ్రహ్మ పాదరజోదధత్, బ్రహ్మపాదరజస్పర్శీ, బ్రహ్మ పాద నిషేవక, విప్రాంఘ్రి జలపూతాంగ, విప్రసేనా పరాయణ, విప్రముఖ్య, విప్రహిత, విప్రగీత మహాకధ, విప్రపాద జలార్ద్రాంగ, విప్ర పాదోదక ప్రియ, విప్రభక్త, విప్రగురు, విప్ర, విప్ర పదానుగ, అక్షౌహిణీ వృత, యోద్ధా, ప్రతిమా పంచ సంయుత, చతుర, అంగిర, పద్మవర్తీ, సామంతోద ధృతపాదుక, గజకోటి ప్రయాయీ, రధకోటి జయధ్వజ, మహారధ, అతిరధ, జైత్రస్యందన మాస్థిత నారాయణాస్త్రీ, బ్రహ్మాస్త్రీ, రణశ్లాఘీ, రణోద్భట, మదోత్కట, యుద్ధవీర, దేవాసుర భయంకర, కంకర్ణమరు త్రేజకుంతల వ్యాప్తకుండల, అగ్రగ, వీరసమ్మర్ధ, మర్దల, రణ దుర్మధ, భట ప్రతిభట్, ప్రోచ్చ, బాణవర్షీ, ఇషు తోయద, ఖడ్గఖండిత సర్వాంగ, షోడశాబ్ద, షడక్షర, వీరఘోష, అక్లిష్టవపు, వజ్రాంగ, వజ్రభేద, రుగ్మవజ్ర, భగ్నదంత, శత్రునిర్భస్త్ర నోద్యత, అట్టహాస, పట్టధర, పట్టరాజ్ఞీపతీ, పటు, కళ, పటహవాదిత్ర, హుంకార, గర్జితస్వన, సాధు, భక్తపరాధీన, స్వతంత్ర, సాధు భూషణ, అస్వతంత్ర, సాధుమయ, మనక్సాధు గ్రస్తమనా, సాధు ప్రియ, సాధుధన, సాధు జ్ఞాతి, సాధుఘన, సాధుచారీ, సాధుచిత్త, సాధువశ్య, శుభాస్పద (1000) ఇవి అన్నియు శ్రీ బలభద్ర మహాప్రభుని దివ్య సహస్రనామములు.

(శ్రీ గర్గ సంహిత యందలి బలభద్ర ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి శ్రీ బలభద్ర సహస్రనామమను పదమూడవ అధ్యాయము సమాప్తము)

బలభద్ర ఖండము సమాప్తము

శ్రీ విజ్ఞాన ఖండము

ఒకటవ అధ్యాయము

(వేదవ్యాస మునీంద్రుడు ద్వారకకు ఏతెంచుట, మరియు ఉగ్రసేనుడాయనను పూజించుట)

బహుళాశ్వుడు "మహామునీ! సర్వ శ్రేష్ఠమయిన శ్రీకృష్ణ భక్తి మార్గమును, నేను సహితము ఆయన భక్తుడనగుటకు అద్దాని ప్రభావమును దయచేసి వర్ణింపవలసినది." నాదరుడు "మహారాజా! వేదవ్యాస ముని ముఖతా వెలువడిన శ్రీకృష్ణ భక్తి మార్గమును నేను వర్ణించెదను. ఏ మార్గము నందు వెళ్ళుటచే పరమాత్ముడు, భక్త సులభుడు మిక్కిలి ప్రసన్నుడగునో, ఆ మార్గమును నీకు వివరించెదను. జనక రాజా! తన దుర్వార భుజబలము చే ఉద్ధతినందిన ఇంద్రుని నిర్జించి శ్రీకృష్ణ పరమాత్ముడు ద్వారక యందు సుధర్మ సభను ఏర్పాటు చేసెను. అయ్యది విశ్వకర్మ వినిర్మితము. వైఢూర్య ఖచిత స్థంభముల చే కోట్లాది ఆసనములు గల పంక్తులతో ఆ సభ శోభించెడిది. ఆ సభ యందలి భూమి పద్మరాగ నిర్మితము. ఆ సభ వివిధములుగ విభజింపబడి, అందమయిన చాండ్‌లరీల తో అలంకరింపబడి, ముత్యాల పరదాలతో అలంకృత మయినది. అందలి ఆసనములన్నియు సింహాసనముల వలె యుండి వానిపై కాలమేఘ ప్రహరణము చే ఆవిర్భవించు మెరుపుల వంటి కాంతి కలిగిన, జాంబూనద స్వర్ణ నిర్మితమయిన కలశములతో శోభించుచున్నవి. అందు ప్రాత:కాల సూర్యకాంతిని పోలు రత్నమయ కంకణ, కేయూర, నూపుర ధారిణిలు, చంద్రముఖులయిన గంధర్వ స్త్రీలు గానము చేయు చుండగా విద్యాధర స్త్రీలు నృత్యము గావించు చుండిరి. ఆ సభకు నాలుగు కోణములందు నందనము, సర్వతోభద్రము, ధ్రౌవ్యము, మరియు చైత్ర రథము అను దివ్య వనములు శోభించుచున్నవి. ఆ వనములందు స్వచ్ఛ జలములు గల వేలాది సరోవరములు, అందు భ్రమరములు ఘంకారము చేయుచున్న సహస్రదళ పద్మములు, విరాజిల్లు చున్నవి. రెపరెపలాడుచున్న ధ్వజ, పతాకములతో అలంకృతమయిన ఆ సుధర్మా సభ పది యోజనములు విస్తీర్ణము, అయిదు యోజనముల ఎత్తు కలిగియుండెను. అందు ప్రవేశించిన మానవులు తమను తాము సర్వోత్కృష్టులుగ భావింతురు. అందు సింహాసనారూఢులయిన మనుష్యులు తమను తాము "ఇంద్రులు" గా తలంచెదరు. త్రిలోకముల యందు ఎన్ని చతురత గల గుణములున్నవో అని అన్నియు ఆ మానవుని యందు చేరును. ఆ సభ యందు ఎంతకాలము ఒక మనుష్యుడు యుండునో, అంత సమయము వానికి షడూర్ములు (శోక, మోహ, జరా, మృత్యు, ఆకలి, దప్పిక) దరి చేరవు. ఎంతమంది మానవులు అందు ప్రవేశించెదరో అంత పెద్దదిగ ఆ సభ పెరుగును. ఓ! జనక పతీ! యాదవుల జనాభా అరువది కోట్లు. అనుచర సహితులై వారందరూ ఆ దివ్య సభా భవనము యొక్క నాల్గవ భాగమందు యుండెడివారు.

ఎక్కడ పరిపూర్ణతమ భగవానుడయిన శ్రీకృష్ణుడు విరాజమానుడై యుండెనో ఆ సభా భవన వర్ణనము ఎవరు సలుపగలరు?" అటువంటి దివ్య సభ యందు ఒకానొక దినము ఉగ్రసేన మహారాజు విరాజిల్లు చుండెను. కోట్లాది యాదవులు ఆయనను పరివేష్ఠించి యుండిరి. వంది, మాగధ, సూతుల ద్వారా ఆయన యొక్క యశోగానము ఆలపింపబడుచున్నది. ఆ సమయమున పరాశర పుత్రుడు, సాక్షాత్ వ్యాస భగవానుడు అచటికి ఏతెంచెను. ఆయన నీలిమేఘ శరీరుడు, మరియు మెరుపువంటి ఎర్రని జటాజూటము కలవాడు. ఆయనను చూడగనే యదురాజు సింహాసనము నుండి లేచి చేతులు జోడించి, ప్రణామములాచరించి, ఆసీనుని కావించి, షోడశోపచార పూజన మొనర్చి ఆయన ఎదుట నిలిచి ఉగ్రసేనుడిట్లనియె.

"బ్రహ్మాన్! మీ శుభాగమనము చే నేడు నా జన్మము, ధర్మాచరణము, ఈ భవనము సర్వము సఫలమయినవి. మీ వంటి ఆనంద స్వరూపుల కుశలమే శ్రీకృష్ణ చంద్రుల అభీష్ఠము. అయిననూ దయచేసి మీ కుశలము శలవీయ వలసినది. దానిచే నేను నిశ్చింతుడనగుదును. ప్రభూ! మీ వంటి మహానుభావులు ఎక్కడెక్కడికేగుదురో అక్కడక్కడ లౌకిక మరియు పారలౌకిక సిద్ధి కలుగును. మీ వంటి సాధుపురుషులు ఒక్క క్షణము ఉన్నప్పటికీ సాక్షాత్ విష్ణుమూర్తి అక్కడ నివసించును. ఇంక లౌకిక విషయముల గూర్చి చెప్పనేల? బ్రహ్మాన్! నేను పూర్వ జన్మమందు ఏ పుణ్యము, యజ్ఞము అచరించితినో

తెలియదు. దాని ఫలితముగ ఈ ద్వారకా రాజ్యము ప్రాప్తించినది. అంతేకాక మీ వంటి మహానుభావులయిన భూలోక దేవతలు ప్రతి దినము మాకు దర్శన మిచ్చుచున్నారు. అందువల్ల నేను నిశ్శందేహముగ పుణ్యము నాచరించితినని నమ్ముచున్నాను.”

వ్యాసుడు “నీవు ధన్యుడవు. నీ నిర్మల బుద్ధికి ధన్యవాదములు. మహారాజా! పూర్వ జన్మమున నీవు మరుత్త నామ ధేయుడవు. నీవు మనసున ఏ విధమయిన కామన లేక కోరిక లేకుండా నీవు విశ్వజిత్ యజ్ఞమును కావించితివి. అందువలన శ్రీహరి భగవానుడు నీకు ప్రసన్నుడాయెను. నీ నిష్కామ భావన చే నీకు ఈ పరమ సౌభాగ్యము ప్రాప్తించినది. ఈ శ్రీకృష్ణుడు సాక్షాత్ పరిపూర్ణ భగవానుడయిన శ్రీహరి. అనంత బ్రహ్మాండములు ఆయన యొక్క ఆధీనము నందు యున్నవి. పరాత్పరుడయిన ఈయన గోలోకపతి. ఆయన సర్వ స్వతంత్రుడు అయినప్పటికీ, భక్తికి వశీభూతుడై నీ భవనము నందు విరాజిల్లు చున్నాడు. విచిత్రమయిన విషయమేమనగా భజించువారికి భగవానుడు ముక్తి నొసంగును. కానీ భక్తి సాధన నొసంగడు. అందువలన భక్తి యోగము మిక్కిలి దుర్లభము అని ఎరుంగుము.”

(శ్రీ గర్గ సంహిత యందలి విజ్ఞాన ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి వేదవ్యాసుని ఆగమనము అను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(వ్యాసదేవుని ద్వారా గతుల నిరూపణము)

ఉగ్రసేనుడు “మహానుభావా! మీ వర్ణన చే నేను కృతకృత్యుడను, ఆనందభరితుడనైతిని. మీరు నన్ను మిక్కిలి కరుణించిరి. నామనసునందుత్పన్న మయిన సందేహములు తీర్చుటకు మీరే సమర్థులు. బ్రహ్మన్! సకామ కర్మలు గతి ఎట్లుండును? వాని లక్షణములేవి? భేదము లేవి? అవన్నియు దయచేసి నాకు విశిదపరుచవలసినది. వ్యాస భగవానుడు “మహారాజా! గుణములు తోడి సంబంధము చే కర్మలన్నియు సకామములై యుండును. వాటి త్యాగము చే అవన్నియు నిష్కామములగును. యదురాజా! సకామ కర్మలన్నియు బంధహేతువులే! నిష్కామ కర్మ మోక్ష హేతువులగును. అదియే పరమ మంగళకరము. సత్వ, రజస్తమో గుణములు ప్రకృతి చే ఉత్పన్నమగును. ఎట్లు విష్ణు భగవానుడు సర్వ పదార్థములందు వ్యాపించెనో, అట్లే త్రిగుణములు విశ్వమంతయు ఓతప్రేతమై యున్నవి. దేహ పతన మందు జీవుడు సత్వ గుణస్థితుడైనచో స్వర్గలోకమునకేగును. రజోగణాధిక్యము చే నరలోకము, తమో గుణాధిక్యము చే నరకలోకము పొందును. ఏ విధమయిన గుణ సంబంధము లేనిచో విష్ణులోక ప్రాప్తినొందును. మహారాజా! ఎవరు వనవాసి యై పంచాగ్నుల మధ్య తపమాచరించునో వారు నిష్పాపులై సప్తర్షి లోకము నొందెదరు. ఎవరు సన్యాశాశ్రమ నియమములు పాటించునో, తన మనసుపై విజయము నొంది, త్రిదండ ధారులై, అష్టాంగ యోగమును పాటింతురో వారు ఆ ప్రభావము చే జనలోకము లేక మహర్లోక వాసులగుదురు. ఇందు సందేహము లేదు. యజ్ఞానుష్ఠానము కావించు మానవులు అనేక వర్షములు ఇంద్రలోక వాసులగుదురు. దాన శీలుడయిన వ్యక్తి చంద్రలోకమును, వ్రతశీలురు సూర్యలోకమును పొందెదరు. తీర్థ యాత్రాపరులు అగ్ని లోకమును, సత్య ప్రతిజ్ఞాపరులు వరుణ లోకమును, విష్ణు ఉపాసకులు వైకుంఠమునకు, శివోపాసకులు కైలాసమునకు ప్రయాణము కావింతురు. ఎవరు సుఖ ఐశ్వర్య సంతానమునకై నిత్యము పితరులను పూజించువారు దక్షిణాపథమున ఆర్యముని తో కలసి పితృలోకమున కేగుదురు. పంచ దేవతా ప్రీతిగా ఉపాసన చేయు స్మార్తులు స్వర్గ లోకమునకు అధికారులగుదురు. ప్రజాపతుల నుపాసించు వారు దక్షాది ప్రజాపతుల లోకముల కేగుదురు. భూతముల పూజించు వారు భూత లోకములకు, యక్షులనర్చించు వారు యక్ష లోకమునకు, వెళ్ళుదురు. మహారాజ! ఎవరు ఎవని యందు భక్తి కలిగి యుందురో వారు కేవలము ఆ లోకమున కేగుదురు. ఇందు సందేహము లేదు. అట్లే దుస్సంగమున వశీభూతులై నిత్యము పాపము నందు చరించువారు యమలోకము నందు దారుణ నరకము లందు విసర బడుదురు.

మహామతీ! బ్రహ్మలోక పర్యంతము ఎన్ని లోకములు గలవో అందు ఏ లోకమున కేగిననూ అక్కడ నుండి వెనుకకు రావలసినదే!!! ఈ లోకములన్నింటికీ పునరావృత్తి గలదు. సకామ కర్మము లన్నింటికీ ఈ గమనాగమన రూపగతి యున్నది. ఎంత కాలము జీవునకు పుణ్యబలము కలదో, అంత దనుక స్వర్గము నందు విహరించి, పుణ్యము లిప్తమయిన పిదప ఇష్టము లేనప్పటికీ కాల ప్రేరణ చే క్రింద పడును. అందువలన ఓ మహాబాహూ! కర్మ ఫలములను త్యాగము చేయవలసినదే! మనుష్యుడు జ్ఞాన వైరాగ్యములు నాశ్రయించి నిష్కామ అభయము ప్రసాదించు, మరియు పరమ హంసల చే సేవింపబడు శ్రీకృష్ణ పవిత్ర చరణార విందములను ఉపాసించవలెను. హఠముగ సమస్తలోక సంహారము గావించు మృత్యువు సహితము ఆ భగద్ధామము చేరునపుడు శాంతి నొందును.

ఉగ్రసేనుడు "భగవన్! సమస్త లోకములకు పునరావృత్తి కలదని సెలవిచ్చిరి కదా! అందువలన నాకు ఆ లోకములందు వైరాగ్యముత్పన్న మయినది. స్వామీ! ఏ లోకమునకు చనిన చో, ప్రాణి వెనుకకు రాదో, ఏది సర్వమునకు పరమో, ఏది శ్రీకృష్ణ భగవానుని పరమ ధామమో దానిని గూర్చి, దయచేసి నాకు తెలుపవలసినది."

శ్రీ వేదవ్యాసుడు "ఏ లోకమునకు ఏగిన ప్రాణి వెనుకకు రాదో అయ్యది శ్రీకృష్ణ పరమాత్మ యొక్క పరమ ధామము. అది ఈ బ్రహ్మాండముల కావల యున్నది. దానిని గోలోక ధామమందురు. ఈ బ్రహ్మాండము జీవ సమూహము తో నిండి ఏబది కోట్ల యోజనముల విస్తీర్ణమున యున్నది. దీని బయట వంద కోట్ల యోజనముల విస్తీర్ణమున బ్రహ్మద్రవమను జలరాశి యున్నది. అందు ఈ బ్రహ్మాండము ఒక పరమాణువు వలె కానపట్టును. ఇదియే కాక కోట్లాది బ్రహ్మాండములు ఆ ద్రవరాశి యందు తేలుచున్నవి. వీటన్నిటికీ పరముగ అవతల గోలోకము యున్నది.

ఆ గోలోకము నందు సూర్య, చంద్ర, అగ్ని ప్రకాశములు లేవు. కామ క్రోధాదులకు అందు ప్రవేశము లేదు. అచట శోక, బాధ, జరా మృత్యువులు యుండవు. అచట ప్రకృతి మరియు కాలము లేదు. అందువల్ల గుణములు కూడా శూన్యము. అది అనిర్వచనీయము. శుద్ధ బ్రహ్మ సహితము ఆ లోకమును దర్శించుటకు అసమర్ధుడగును.

శ్రీకృష్ణ తేజము చే ప్రకటితమగు అనేక పార్షదులు అచట నివసించుచుందురు. ఎవరు మనో ఇంద్రియములపై విజయము ప్రాప్తించి అకించన భక్తులగుదురో, సంసార సుఖములందు ఎంత మాత్రము మమత్వము యుండదో, ఎవరు సర్వము నందు, సర్వుల యందూ సమత్వము కలిగి యుందురో, ఎవరు నిరంతరము శ్రీకృష్ణ చరణారవింద పానము చేయు చుందురో, ఎవరు ప్రేమలక్షణ భక్తి యుతులై మనసు నందు ఏ విధమయిన కోరిక లేకుండ యుందురో వారు ఈ లోకము లన్నింటినీ లంఘించి ఆ ఉత్తమ ధామము చేరుదురు. ఇందు సందేహము లేదు.

(శ్రీ గర్గ సంహిత యందలి విజ్ఞాన ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి వ్యాసుని చే గతుల నిరూపణమను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(సకామ మరియు నిష్కామ భక్తి యోగ వర్ణనము)

ఉగ్రసేనుడు "బ్రహ్మన్! గుణ మరియు కర్మల యొక్క గతి మీ ముఖార విందము నుండి వింటిని. అన్ని లోకములు పునరాగమనయుక్తములై యున్నవి. నిష్కామ భావము చే శ్రీహరిని పూజించిన మహాత్ములు మాత్రమే పునరాగమన శూన్యము, మరియు ఉత్తమ ధామమయిన గోలోకమును చేరుదురు. అయ్యది దివ్యము మరియు ఇతరులకు దుర్లభము. ప్రభూ! నాకు భక్తవత్సలుడయిన భగవానుడు ప్రసన్నుడగు భక్తి యోగము ఎన్ని విధములుగ యున్నది? దానిని గూర్చి వివరింపవలసినది."

వ్యాసభగవానుడు "ద్వారకాధీశా!! నీవు ధన్యుడవు. నీవు శ్రీహరి యందు భక్తియుతుడవు, మరియు శ్రీకృష్ణుడు నీ ఇష్ట దైవము. నీవు భక్తియోగము గూర్చి ప్రశ్నించితివి. అందువల్ల నీ నిర్మల బుద్ధి ధన్యమయినది. దేనిని వినినచో

సంసార మంతటినీ సంహరించు మహాపాపి సహితము శుద్ధమగునో, ఆ భక్తి యోగము గూర్చి విస్తారముగ వివరించెదను. మహారాజా! సగుణము, నిర్గుణము అని భక్తి రెండు రకములు. సగుణ భక్తి యందు భేదములనేకము. కానీ నిర్గుణ భక్తి ఏకలక్షణ సంయుతము. దేహధారుల యొక్క గుణములను బట్టి సగుణ భక్తి అనేక విధములుగ యుండును. వాని వర్ణనము వినుము. ఈ గుణాధిక్యతను బట్టి మూడు విధములయిన భక్తులు కలరు. భేద దృష్టి కలిగి క్రోధము, హింస, దంభము, మాత్సర్యములను ఆశ్రయించి శ్రీహరిని పూజించువారు తామస భక్తులు. ఎవరు యశస్సు, ఐశ్వర్యము, ఇంద్రియ భోగోపలబ్ధి లక్ష్యములుగ, ప్రయత్న పూర్వకముగ శ్రీహరిని పూజించు వారు రాజస భక్తులు. కేవలము కర్మ క్షయమే ఉద్దేశ్యముగ, అభేద దృష్టిచే మోక్షమునకై శ్రీహరిని ఉపాసించువారు సాత్విక భక్తులు. ఆర్తులు, ఆర్థార్థులు, జిజ్ఞాసువులు, జ్ఞానులు ఈ నాలుగు విధములుయిన మనుష్యులు జనార్ధనుని భజించెదరు. ఈ భక్తి యోగము అనేక విధములుగ యుండును. భక్తి యోగము ద్వారా శ్రీహరిని పూజించు మానవులు సకామ భక్తులయినప్పటికీ, అనేక సుకృతములు గల పుణ్యాత్ములు."

ఇపుడు నిర్గుణ భక్తిని వర్ణించెదను. గంగా జలము స్వాభావికముగ సాగరము వైపు ఎట్లు ప్రవహించునో, అట్లే శ్రవణ మాత్రమున, కారణము లేకుండా, మనస్సు నిరంతరము అవిచ్ఛిన్నముగ, కారణములకు కారణ భూతుడు. పరిపూర్ణతమ భగవానుడు అయిన శ్రీహరి వైపు ప్రవహించు చుండును. దీనినే నిర్గుణ భక్తి యని పేర్కొందురు. మానదా! నిర్గుణ భక్తి లక్షణములను వివరించెదను. ఈ భగవద్భక్తులకు ఈ అఖండ భూమండలాధిపత్యము, బ్రహ్మ పదము, ఇంద్రపదవి, పాతాళాధి పత్యము, యోగుల యొక్క సిద్ధులు, వీటి వేని యందునూ అభిరుచి యుండదు. కేవలము భగవదనురాగమే వారికి ఆనంద ప్రదము. అందువల్ల వారు సాక్షాత్ భగవంతుడు అనుగ్రహించి నప్పటికీ సాలోక్యముక్తి నొల్లరు. "దూరముగ యున్నపుడు యున్న ప్రేమ దగ్గరగ యున్నపడు యుండదు," అన్న యోచనను ఆధారము చేసికొని ఈ నిష్కామ భక్తులు భగవద్విరహము నందు వ్యాకులత నొందుట యందు ప్రీతి కలిగి యందురు. వారికి సామీప్య ముక్తి సహితము ప్రీతి కలుగదు. ఎందుకనగా వారు నిరపేక్షులు గాన అదియును రుచింపదు. వారు కేవలము భగవత్సేవ యందు మాత్రమే ప్రీతి కలిగి యుందురు.

వీరు (ఈ భక్తులు) సాయుజ్యము సహితము ఇష్టపడరు. ఎందుకనగా ఈ విధముగ ఏకమయినచో స్వామి, సేవకుల మధ్య అంతర్యము యుండదు. వీరు నిరపేక్షులు గాన వారికి సర్వుల యందునూ సమానత్వము కలిగి శాంత స్వభావులై, ఎవరితోనూ వైరభావము లేక యుందురు. వారు సామాన్య సంసారుల నుండి కైవల్యము వరకూ అంతటినీ సకామ భక్తిగా భావింతురు. పూవుల సుగంధము నాసికకే తెలియును. కన్నులకు దాని నెరుగు జ్ఞానము లేదు. అట్లే నిరపేక్ష మహానందము కేవలము భగవానుని నిష్కామ భక్తులకు మాత్రమే తెలియును. ఫలరసము తయారుచేయు హస్తము దాని మధురిమను ఎరుగనట్లే సకామ భక్తులు నిరపేక్షానందమును ఎన్నడు తెలియలేరు. అందువల్ల మహారాజా! ఈ నిర్గుణ భక్తినే నీవు పరమ శ్రేష్ఠమని తెలియుము.

ఇపుడు నిర్గుణ భక్తుల యొక్క ఉపాసనా విధానమును నీకు ఎరింగితును. విష్ణు భగవానుని స్మరణము, ఆయన గుణనామ కీర్తనము, శ్రవణము, చరణసేన, వందన, అర్చన, దాస్య, సఖ్య, ఆత్మ నివేదన ఇనియే!!! వారు విష్ణుని అత్యంత ప్రేమలక్షణ భక్తితో ప్రేమించి సేవించెదరు. ఇటువంటి నిరంతర భగవాద్భవన కావించు భక్తులు జగత్తునందు దుర్లభము. ఎవరు తమకంటె అధికుల యందు భక్తి, తమకంటె కనిష్టుల యందు కరుణ, తమ సాటి వారి యందు మిత్రత్వము, సర్వ జీవుల యందు దయ, శ్రీకృష్ణ భగవానుని చరణార విందములందు నిశ్చల భక్తి, ఎల్లప్పుడు శ్రీకృష్ణ దర్శన లాలస, విదేశమున యున్న భర్తను, పతివ్రత అయిన స్త్రీ నిరంతరము గుర్తుకు తెచ్చుకున్నట్లు, నిరంతరము శ్రీ కృష్ణ భగవానుని గుర్తుకు తెచ్చుకొని స్మరించుచూ, శ్రీకృష్ణ భగవానుని స్మరణ చే రోమ రోమమూ పులకించి, నేత్రముల నుండి ఆనందా శ్రువులు కారుచుండునో, భగవానుని విరహము చే ఎవని శరీరము కాంతి విహీనమగుచుండునో, ఎవరు నిరంతరము శ్రీకృష్ణా! ముకుందా! హరీ! అని భజించు చుందురో, దివా రాత్రములు ఎల్లప్పుడూ ఎవరు శ్రీహరి యందు మనసు లగ్నము చేసి యుందురో వారు మాత్రమే భగవానుని ఉత్తమ భక్తులు."

(శ్రీ గర్గ సంహిత యందలి విజ్ఞాన ఖండార్గతమయిన నారద బహులాశ్వ సంవాదము నందలి సకామ, నిష్కామ భక్తి యోగ వర్ణనమను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(భక్త, సాధు జనుల యొక్క మహిమా వర్ణనము)

వ్యాసభగవానుడు "ఎవరు ఆకాశ, వాయు, అగ్ని, జల, పృధివీ, నక్షత్ర మండలమందు నిరంతరము శ్రీకృష్ణ భగవానుని దర్శనము కావించి హర్షోల్లాసితులై యుందురో, వారితో కోట్లాది కామదేవుల సహితము మోహింప చేయు రాధావల్లభుడు, నందనందనుడు మాట్లాడుట దృష్టి గోచరమగును. సదానంద స్వరూపుడయిన భగవానుని దర్శన ప్రాప్తినొంది, హర్షము చే మనసు నిండుట చే, ఎల్లప్పుడు నవ్వుచూ, వింత ప్రవర్తన కలిగి యుందురు. కొంచెము సేపు మాట్లాడుచూ, ఒక్కొక్కప్పుడు నిశ్శబ్ధముగ యుందురు. విష్ణు భగవానుని ఉత్తమ భక్తులయిన వీరు కృతకృత్యులు. వారు కేవలము శ్రీకృష్ణ స్వరూపులై యుందురు. వీరిని దర్శించినంత మాత్రమున మానవులు కృతార్థులగుదురు. కాలుడు, యముడు సహితము వీరిని దండన నొనర్చుటకు అసమర్థులు. ఇటువంటి భక్తాగ్రేసరుల వామభాగమందు కౌమోదకీ గద, దక్షిణమున సుదర్శనము, ముందు శాంగ ధనువు, వెనుక మేఘ గర్జన కావించు పాంచజన్యము, నందక ఖడ్గము, శత చంద్రము అనుడాలు, అనేక తీక్షణ బాణములు అన్ని వైపులా పరివేష్ఠించి ఆ భక్తుని రక్షించు చుండును.

ఒక మహా కమలము ఆ భక్తుని శిరముపై ఎల్లప్పుడూ ఛాయా ప్రసాదము కావించు చండును. ఈ సత్పురుషుల శ్రమను గరుడుడు తన పక్షముల నుండి వచ్చు గాలిచే విసురుచూ దూరము కావించును. ఈ సద్భక్తులు ఎక్కడెక్కడికి చనిదెరో, వారి వెంట శ్రీహరి వెళ్ళి తన చరణ యుగళ పరాగము చే ఆ ప్రదేశములన్నింటినీ తీర్థ స్థానములుగ మార్చును. ఈ సాధు జనులు ఒక్క క్షణము సహితము ఏ ప్రదేశమున యుందురో అచట తీర్థ స్థానములు అన్నియు నివసించును. ఆ ప్రదేశములందు ఒక మహాపాపి దేహము విడచిననూ, అతడు విష్ణు సాయుజ్యమును పొందును. ఎవరికి శ్రీకృష్ణ పరమాత్ముడు ఇష్టుడో, వానిని చూచి దూరము నుండే ఆదివ్యాధులు, భూత, ప్రేత పిశాచములు, దశ దిశలకు పలాయన మొనర్చును. అనపేక్ష సాధు పురుషులకు నదీ నదములు, పర్వత సాగరములు, మరియు ఇతర వ్యవ ధానములన్నియు మార్గము నిచ్చును. ఎవరు సాధుపురుషులో, జ్ఞానము నందు నిష్ఠ కలిగిన వారో, విషయ విరాగులో, అజాతశత్రులో, అటువంటి మహాత్ముల దర్శనము పుణ్యహీనులకు దుర్లభము. శ్రీకృష్ణ భక్తుడు ఏ కులము నందు జన్మించునో, ఆ కులము మలిమయినప్పటికీ, అద్దానిని బ్రాహ్మణ వంశము వలె అత్యంత నిర్మలమని ఎరుంగుము. శ్రీకృష్ణ భక్తుడు తన మాతృ, పితృ, భార్యల వంశములందు పది తరములను బంధ విముక్తుల గావించును. ఇటువంటి సత్పురుషుల సంబంధులు, పోష్యవర్గము, సుహృతులు, శత్రువులు, ఇంటి యందు నివసించు పశు పక్ష్యాదులు, కీట పతంగములు సహితము పావనమగుదును."

"దేవ దేవేశ్వరుడయిన శ్రీకృష్ణ భక్తులు నివసించు దేశము బ్రాహ్మణులకు నివాసయోగ్యము కానప్పటికీ, కృష్ణ జింకలు కానపడనప్పటికీ, సౌవీర, కీకట, మగధ, మ్లేచ్ఛ దేశములందు నివసించినప్పటికీ, అచటి లోకులను పవిత్రము కావించును. ఇటువంటి సంత పురుషులతో సంబంధము పెట్టుకొను జనులు ధర్మ, తీర్థ, జ్ఞాన, యజ్ఞ వర్జితులయినప్పటికీ తుదకు శ్రీహరి ధామము చేరుదురు. ఇది శ్రీకృష్ణ భక్తుల మహిమ. ఈ వర్ణన చే మానవులకు చతుర్విధ పురుషార్థములు ఉపలభ్యమగును."

ఉగ్రసేనుడు "భగవాన్! శ్రీకృష్ణుడు సాక్షాత్ పరిపూర్ణ పరమాత్ముడు. కానీ దురాత్ముడయిన దంతవక్త్రుని జ్యోతి ఆయన యందు ప్రవేశించినది, అని విని యుంటిని. ఇది పరమాశ్చర్యము. ఎందుకనగా కేవలము మహాత్ములైన సాధు పురుషులకు మాత్రమే సాధ్యమగు సాయుజ్యము ఒక సాధారణ వ్యక్తికి, అందులోనూ శత్రువునకు ఎట్లు సాధ్యపడినది?" వ్యాసుడు "మహారాజా! "నేను, నాది" అను భావన కేవలము త్రిగుణాత్మక ప్రాణుల యందు మాత్రమే యుండును. ఎందుకనగా వారు కామ క్రోధముల మధ్య కొట్టు మిట్టాడు చుందురు. పరమ ప్రభువయిన శ్రీహరికి ఈ భావన యుండదు. ఎవరు ఎటువంటి భావము తో నైననూ ఆయన యందు మనసులగ్నము చేసిన ఎడల వారికి శ్రీహరి యొక్క

సారూప్యత భ్రమర కీట న్యాయమున ఉపలబ్ధమగును. సాంఖ్యయోగ సాధన లేకుండగనే, మానవులు కామ, క్రోధ, భయ, స్నేహ, సహృదయతా భావములతో భగవానుని యందు తన్మయత్వము నొందుదురు. నంద, యశోదాదులు, మరియు వసుదేవుడు భగవానుని స్నేహ భావముతో ప్రాప్తించిరి. గోపికలు కామ భావన తో ప్రాప్తించిరి. ఎంతమాత్రము బ్రహ్మ భావన తో కాదు. ఎందుకనగా వారు భగవానుని రూప, గుణ, మాధుర్య భావము లందు మనస్సును సంలగ్నము చేసిరి. నీ పుత్రుడయిన కంసుడు భయము చేతనూ, శిశుపాల దంతవక్త్రులు క్రోధము చేతనూ, మీ యాదవులందరూ ఏకత్వము లేక సజాతీయత్వ భావన చేతనూ, మేము (వ్యాసుడు, నారదుడు) సహృదయ భావము చేతనూ భగవానునికి దగ్గరయితిమి. ఏ ఉపాయము చేతనైననూ శ్రీకృష్ణ భగవానునికి దగ్గరయి, దివా రాత్రములు స్మరింప వలెను. ఇది శత్రువునకు సహితము సంభవము. ఈ కారణము చేతనే దైత్య గణములు శ్రీహరి యందు శత్రు భావము కలిగి యుందురు."

శ్రీ గర్గసంహిత యందలి విజ్ఞాన ఖండార్గతమయిన నారద బహుళాశ్వ సంవాదము నందలి భక్త సంతజనుల మహిమా వర్ణనము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(భక్తి యొక్క మహిమా వర్ణనము)

వ్యాసభగవానుడు "మహారాజా! వత్సాసుర, అఘాసుర, ధేనుకాసుర, బకాసుర, పూతన, కేశి, కాలయవన, అరిష్టాసుర, ప్రలంబాసుర, ద్వివిద, పల్వల, శంఖ, శాల్వాది అసురులే ప్రకృతికి పరమయిన పురుషుని ప్రాప్తినందగా, భక్తి యుతులై యుండు పుణ్యాత్ములు ఆయనను పొందుట యందు ఆశ్చర్య మేమున్నది? మహారాజ! అత్యంత పూర్వ కాల మందు మహాబలశాలులయిన మధుకైటభులు అను దానవులు, అట్లే హిరణ్యకశిపు హిరణ్యాక్షులు, రావణ కుంభకర్ణులు శ్రీ విష్ణు భగవానుని యందు వైర భావము పెంచుకొని పరమ పదము నొందిరి. అటువంటప్పుడు ఎల్లప్పుడూ సత్సంగము నందు పాల్గొని, భగవానుని ప్రేమించుచూ, నిరంతరము ఆయన చరణారవింద పరాగము గ్రోలుచూ యందు ప్రహ్లాద, బాణాసుర, బలి, శంఖచూడ, విభీషణ మొదలగు ఎందరెందరు భగవానుని పరమ పదము ప్రాప్తించ లేదు? దేవర్షి నారదుడు, బృహస్పతి, వశిష్ఠ, పరాశర, సాంఖ్యాయన, అసిత, శుకదేవ, సనకాది భక్తులు భగవానుని చరణారవింద మకరందమును గ్రోలుచూ భూతలమున స్వార్ధరహితులై నిరంతరము సంచరించు చున్నారు.

యతి, ఉత్కళుడు, అంగ, భరత, అర్జున, జనక, గాధి, ప్రియవ్రత, యదువు, అంబరీష ఆదిగా గల నిష్కామ భక్తులు, పరమ హంస గణములు, శ్రీకృష్ణ ప్రభుని కథామృత పానమత్తులై తిరుగుచుందురు. మండోదరి, మతంగ మహర్షి శిష్యురాలైన శబరి, తార, అనసూయ, అహల్య, కుంతి, ద్రుపద నందిని ద్రౌపది, వీరందరూ ప్రశంశనీయమయిన మహిళా భక్తురాండ్రు. వీరి ఖ్యాతి పరమ హంసల తుల్యమయినది. సుగ్రీవుడు, హనుమంతుడు, అంగదుడు, జాంబవంతుడు, గరుడుడు, జటాయువు, కాకభుశుండి మొదలగు వారు తిర్యక్ యోని యందు జన్మించిన ప్రభృతులు. కుబ్జ, వాయక్, సుదామ, మాలీ, గుహుడు మొదలగు వారు సహితము భక్తుల సంగము నొంది శ్రీహరి యొక్క ఉత్తమ భక్తులయిరి. ధర్మము, తపము, యోగము, సాంఖ్యము, యజ్ఞము, తీర్థయాత్ర, యమనియమములు, చాంద్రాయణాది వ్రతములు, వేద పఠనము, దక్షిణ, పూజ, మరియు దానము, ఇవి ఏవియును భక్తి లేకుండ శ్రీకృష్ణుని వశము నొందలేవు. యజ్ఞ, వ్రత, స్వాధ్యాయ, తప, తీర్థ, యోగ, పూజ, యమ నియమములు, సాంఖ్యయోగము – వీటిచే లభించు ఫలము కేవలము భక్తి చే లభించును. అంతవరకు ఎందుకు? భక్తి చే లభించు పధము వీటి వేటిచే కూడా ఉపలబ్ధము కాదు. ఈ భక్తి జగత్తునందలి పాపముల చే నిండిన అధములను సహితము ఉద్ధరించునది, జగత్తు నుండి తరింప చేయునది,

సంసార రూప సాగరము నుండి లేవ నెత్తునది, విషయ సేవనము చే ఏర్పడిన సంచిత కర్మములను దగ్ధ మొనర్చునది, పరాత్పరుడయిన భగవత్ పథమును ప్రాప్తింప జేయునది. ఈ భక్తి, పండిన పండ్ల భారము చే క్రిందికి వంగిన దివ్య వృక్షరాజము వలె శోభాయమాన మైనది.

మోహమనెడు కారు మేఘముల మధ్య విద్యుత్ వలె వెలుగుచూ, శాస్త్రముల యందు నిక్షిప్తమయిన నిగూఢ రహస్య వచనములను ప్రకటించు జ్యోతియే ఈ భక్తి. ఇయ్యది విజయరూప దీపావళి, మరియు సర్వ గుణములపై విజయము నొందు విజయ దశమిగా తెలుపబడినది. భగవద్ధామమును చేరుటకు భక్తి యనునది అతి సరళ మయిన సాధనము మరియు మెట్టు.

(శ్రీ గర్గ సంహిత యందలి విజ్ఞాన ఖండార్గతమున భక్తి యొక్క మహిమా వర్ణనము అను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(మందిర నిర్మాణము, విగ్రహ ప్రతిష్ఠ మరియు పుజా విధానము)

ఉగ్రసేనుడు "మహామునీ! గృహస్థుడు ఎల్లప్పుడూ కర్మగ్రస్థుడై యుండును. కర్మా సక్తుడయిన గృహస్థుడు శ్రీహరి యొక్క సేవ ఎట్లు చేయగలుగును." దయచేసి నాకు తెలుపవలసినది. అంతేకాక ఎవని జీవితమందు భక్తి ఆనెడు అంకురము ఉదయించదో, భక్తి ఉద్దీపన కాదో, అటువంటి వ్యక్తి శ్రీహరిని ఎట్లు ప్రసన్నుని కావించును?" వ్యాసుడు "భక్తి అంకురించని ఎడల సత్పురుషుల సాంగత్యము చేయవలెను. సత్సంగము వలన అట్టి భక్తి అంకురము ఉత్పన్నమయి వేగముగ వృద్ధి నొందును. దేని ప్రభావముచే గృహస్థు, శ్రీకృష్ణ భగవానుని సులభముగ ప్రాప్తించునో, ఆ శ్రీకృష్ణ సేవనా విధి నీకు తెల్పెదను. సత్కులము నందు పుట్టి శ్రీకృష్ణ తత్పరుడయిన ఒక ఉత్తముని గురువుగా పొంది మనుష్యుడు సిద్ధి నొందును. మానవుడు అటువంటి గురువు నుండి శ్రీకృష్ణ సేవా విధానమును నేర్చుకొన వలెను. ఎవరు శ్రీకృష్ణ దీక్షా రహితులో వారి సర్వము నిష్ఫలమగును. గురు హీనమయిన మానవుని దర్శించుట వలన ఇతర మానవులు పుణ్యము నష్ఠమగును.

సనాతన భగవానుడయిన శ్రీకృష్ణుని మందిరమును ఉత్తర ముఖముగ నిర్మింపవలెను. అందు ఎత్తైన ఆసనమును స్థాపించి దానిపై కలశము తో శోభించు పీఠము నమర్పవలెను. ఈ పీఠమునకు సత్, చిత్, ఆనందములనెడి మూడు మెట్లు నిర్మింపవలెను. ఆ ఆసనము పై సుందర వస్త్రమును పరచి దానిపై పత్తి పరుపును పరుచవలెను. దాని చుట్టూ తలగడలు అమర్చి, వాటన్నిటినీ (పరుపు, తలడగలు) స్వర్ణ దారములు కుట్టిన ఆచ్ఛాదనము చే కప్పవలెను. మందరిపు గోడలపై చిత్రము లుంచి వాటిని పరదాల తో కప్పవలెను. అన్ని వైపులా ఆ మండపమునకు తోరణములు కట్టి నేలను తుడిచి, జలప్రోక్షణ చేసి శుభ్రము కావింపవలెను. మందిర ప్రాంగణమున వెండితో సుందర సభా మండపమును నిర్మింపవలెను. అంతేకాక ఆ ప్రాంగణ మధ్యమున తులసీ వనము పెంచవలెను. మందిరపు వెలుపలి ద్వారమున కిరుప్రక్కలా రెండు ఏనుగులు, సింహముల ప్రతిమలు యుండవలెను. మందిర శిఖరము బంగారము తో చేయబడవలెను. శిఖరమున చక్రము యుండవలెను. మందిర ద్వారమందు శ్రీహరి నామములు రచింపబడి యండవలెను. గోడలపై, శంఖ, చక్ర, గదా, ధనువులు యుండవలెను. ఎడమ వైపు తూణీరములు, కుడివైపు బాణములు చిత్రములు యుండవలెను. మందిరపు వెనుక భాగమున శత చంద్రమను డాలు, నందకమను ఖడ్గము, హల ముసలములు తప్పక చిత్రింపబడవలెను.

సింహాసనము వెనుక గోపికలు మరియు గోవులు చిత్రింపబడవలెను. మందిరపు మెట్లపై గోపాలురు, ద్వారములు కిరుప్రక్కలా జయవిజయుల విగ్రహములు యుండవలెను. గడపపై కల్పవృక్షము, స్థంభముల పై మనోహర లతలు,

మందిరపు గోడలపై గంగా, యమునా, బృందావనము, గోవర్ధనము, వస్త్రాపహరణము, రాస మండలము మొదలగు లీలా చిత్రములుండవలెను. అట్లే చిత్ర కూటము, పంచవటీ, రామరావణ యుద్ధము, మొదలగు చిత్రము లుండవలెను. కానీ ఎట్టి పరిస్థితులు యందు జానకీ హరణ ప్రసంగమొనర్చు చిత్రము లుండరాదు. దశావతార చిత్రములు, బదరికాశ్రమము, సప్తపురములు, మూడు గ్రామములు, తొమ్మిది వనములు, తొమ్మిది ఊసర క్షేత్రములు చిత్రములు యుండవచ్చు. ఈ ప్రకారమయిన చిత్రములు అంకితమొనర్చి మందిర నిర్మాణము కావింపవలెను.

తదనంతరము అందు శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్ఠ కావింప వలెను. శ్రీకృష్ణుని కిశోరావస్థ, లేక చేతియందు వంశీరవము ధరించి వాయించుచున్న విగ్రహము, అట్లే కుడికాలు కొంచెము వంచి లేక వక్రముగ యున్న విగ్రహములు సేవించుటకు సర్వోత్తమములు. భక్తుడు ఇట్లు పరమ భక్తితో ఇటువంటి విగ్రహములు గురువు ద్వారా మందిరమున ప్రతిష్ఠించి పిదప అత్యంత భక్తితో అందు తత్పరుడై సేవ చేయవలెను. నాలుకను భగవానుని ప్రసాదము సేవించుట యందు, నాశిక చే తులసీ సుగంధమును అఘ్రాణించుట యందు, చెవులు ముకుంద కథా శ్రవణమందు నియోగింపవలెను. భాగవతోత్తములు మనుష్యులు ఏ భావమును తెలియుటకు శ్రీకృష్ణ సేవ నొనర్చెదరో, అదియే ప్రేమ లక్షణ భక్తి అని నుడివెదను. మహారాజా! ఒక వెయ్యి అశ్వమేధ యాగములు, వంద రాజసూయ యాగములు, శ్రీకృష్ణ సేవ యందు పదహారవ వంతు నందు ఒక అంశకు కూడా సరిరావు. ఏ మానవుడు నిరంతరము శ్రీకృష్ణ కథామృతమును వినునో, శ్రీకృష్ణ కథా ఉపదేశకులను దర్శించునో వాని కోట్లాది జన్మముల పాపములు నశించును. ఇందు సందియము లేదు. దేహావసాన సమయమున వానిని కొనిపోవుటకై శ్యామ సుందర రూపులయిన మనోహర విష్ణు పార్షదులు గోలోకము నుండి రథమును తెచ్చెదరు.

(శ్రీ గర్గ సంహిత యందలి విజ్ఞాన ఖండార్గతమున మందిర నిర్మాణము, విగ్రహ ప్రతిష్ఠ, మరియు పూజావిధి అను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(నిత్య కర్మ మరియు పూజా విధి వర్ణనము)

వేదవ్యాసుడు "మహారాజా! ప్రతి దినము బ్రహ్మ ముహూర్తము నందు లేచి గోవిందుని, గురువును మరియు కశ్యపాది ఋషులను స్మరించవలెను. తదుపరి ఆ హరి భక్తుడు భూమికి ప్రణామము లాచరించి భూమిపై కాలు మోపవలెను. పిదప ఆచనము చేసి సకామ భక్తులు ఒక సుఖాసనము పై కూర్చొని చేతులు ఒడిలో చేర్చి తన గురువును ఇట్లు ధ్యానింపవలెను, "నా గురుదేవులు జ్ఞాన ముద్రా ధారణము చేసిరి. ఆయన స్వరూపము అత్యంత శాంతము. ఆయన స్వస్తికాసనముపై విరాజమానులై యుండిరి." ఇట్లు గురువును ధ్యానించి పిదప ఏకాగ్ర చిత్తుడై శ్రీకృష్ణుని ధ్యానింపవలెను. శ్రీకృష్ణ భగవానుడు కిశోరావస్థయందుండెను. ఆయన శ్యామల విగ్రహుడు. కరము లందు వంశీ వేత్ర ధరుడు, అత్యంత మనోహరుడు " ఈ విధముగ స్థుతించి అపుడు బయటకు చనవలెను. మహారాజా! గృహస్థుడు ఎట్లు పవిత్రుడగును? ఈ విధి విధానములు తెల్పెదను.

మృత్తికను తీసికొని "అశ్వక్రాంత" మొదలగు మంత్రములు పఠించుచూ శౌచానంతరము ఒక్క మారు లింగమును, మూడు మార్లు గుదమును, పదిమార్లు ఎడమ చేతిని, ఏడు మార్లు రెండు చేతులను, మూడు మార్లు రెండు పాదములను, మృత్తిక మరియు జలముతో శుభ్రపరుప వలెను. బ్రహ్మచారులు, వానప్రస్థులు దీనికి ద్విగుణీకృతము గా చేయవలెను. సన్యాసులు దీనికి నాలుగు మార్లు అధికముగనూ గావింపవలెను. రోగులకు దీని లో సగము, స్త్రీలకు అందులోసగము చాలును. శౌచ కర్మ లేకుండా చేయు ఏ కర్మము మనుష్యులకు ఫలితము నీయదు. ముఖ శుద్ధి కూడా అవసరము. ముఖశుద్ధి కాని మనుజునకు మంత్రము ఫలితము నీయదు.

"వనస్పతులారా! మీరు నాకు ఆయు, బల, వీర్య, యశ, పుత్ర, పశు, ధన, బ్రహ్మజ్ఞాన మరియు ప్రజ్ఞను ప్రసాదించ వలసినది " అని పలికి దంత ధావన కావింపవలెను. పాలుకారు వృక్షములు, దుర్గంధ యుక్త వృక్షములు, బబూల్, కపాస్, మర్రి వృక్షములు దంత ధావనకు నిషిద్ధములు. పిదన చేతులు జోడించి "హరితహయ" అను మంత్రము ఉచ్చరించుచూ సూర్య భగవానునికి ప్రణామములర్పింపవలెను. తదనంతరము స్వస్థచిత్తులై ప్రహ్లాదాది భగవద్భక్తులను స్మరింపవలెను. పిదప తులసీ మృత్తికను ఒంటికి అలదుకొని స్నానమాచరించ వలెను. స్నానమాచరించినంత సేపూ గంగాష్టకమును కానీ, యమునాష్టకమును కానీ పఠింపవలెను. సప్త మోక్ష పురములు (అయోధ్యా, మధురా, మాయా (హరి ద్వారము) కాశీ, కాంచీ, అవంతిక (ఉజ్జయిని), ద్వారక) ను స్మరింపవలెను.

పిదప మూడు గ్రామములను (మహాయోగము నందు శాలిగ్రామము, హరిమందిరము నందు శంభల గ్రామము, కోసల దేశమున నంది గ్రామము), తదుపరి నవారణ్యములను (దండక, జంబూమార్గ, పుష్కల, ఉత్పలావర్త, నైమిశము, కురుజాంగాల, అర్బుద, హేమంత) స్మరించి ఈ తీర్థములన్నింటినీ మరల మరల ఉచ్చరించుచూ స్నానమాచరించ వలెను. స్నానానంతరము అహింసా యుక్తమయిన వస్త్రములు ధరించి, పన్నెండు తిలకములు, ఎనిమిది ముద్రలు ధరింపవలెను. పిదప సంధ్యావందన మాచరించి మౌనియై శ్రీకృష్ణ మందిరమున కేగి గంట వాయించుచూ "జయ జయ" శబ్దములు కావించుచూ భగవానుని నిద్రలేపు "ఉత్తిష్ఠోత్తిష్ఠ గోవింద యోగ నిద్రాం విహాయచ – గోవింద భగవానుడా! యోగ నిద్ర చాలించి లే స్వామీ!" అను స్తోత్రము కావింప వలెను. తదుపరి భగవానునకు మంగళహారతి సమర్పించి, స్నానాదికములు కావించి, మంగళమయ వస్త్ర భూషణములతో అలంకరించి, హారతినిచ్చి, అన్న భోగములను సమర్పించవలెను. పిదప వివిధ గంధయుక్తమయిన పదార్థములను (ప్రసాదము) తాను స్వీకరింప వలెను. ఎవరు ఈ విధముగ నిత్యము పూజనము చేయుదురో వారు నిస్సందేహముగ కృతార్థులగుదురు. మధ్యాహ్నము రాజభోగ నివేదనము కావించి, హారతి నీయవలెను. అపుడు భగవానుడు శయనింపవలెను. సాయంత్రము నాలుగు గంటల వేళ శంఖము పూరించి తిరిగి ఆయనను లేపవలెను. పిదప సంధ్యా హారతిచ్చి పాలు నివేదించ వలెను. ప్రదోష కాలవేళ ప్రదోష హారతిచ్చి తిరిగి రాత్రి మృష్టాన్న భోగము నివేదించి శ్రీహరిని శయనింప జేయవలెను. ఇది రాజ సేవ, మహారాజులకు సహితము ఈ సేవ విధి విధానము. శ్రీకృష్ణ భగవానుని సేవ యందు చిత్తమును పూర్ణముగ నియోగించు మానవుడు ఆద్యంతక పరమ పదమును ప్రాప్తించును. శ్రీకృష్ణ జన్మాష్టమి, శ్రీరామ నవమి, శ్రీ రాధాష్టమి, అన్న కూటము, వామన ద్వాదశి, నృశింహ చతుర్దశి, అనంత చతుర్దశీ దినము లందు శ్రీకృష్ణ భగవానునికి విశేష పూజన మొనర్పవలెను.

(శ్రీ గర్గసంహిత యందు విజ్ఞాన ఖండాంర్గతమయిన నాదర బహులాశ్వ సంవాదము నందలి నిత్యకర్మ పూజా విధి విధాన వర్ణనము అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(పూజా విధి విధాన వర్ణనము)

వ్యాస భగవానుడు "సాధకుడు స్నానాది నిత్య, నైమిత్తిక క్రియలను పూర్తి కావించి పూజకు సిద్ధము చేసికొన్న నేలను శుభ్రము చేసికొని దానిపై పంచరంగులతో ముప్పది రెండు దళములు, కేసరములు, కర్ణిక గల ఒక దివ్య కమలమును ప్రతిష్ఠించ వలెను. రంగులతో పద్మపు రంగవల్లి (ముగ్గు) వేయవలెను. కర్ణికపై శ్రీహరి యొక్క సింహాసనము నుంచి దానిపై శ్రీ రాధా, రమా, భూదేవీ, విరజా, వీరిని స్థాపించ వలెను. ఆ నలుగురు దేవతల మధ్య సాక్షాత్ పురుషోత్తముడయిన శ్రీకృష్ణుని ప్రతిష్ఠించవలెను. కమలము యొక్క ఎనిమిది దళములందు ఎనిమిది మంది శ్రీ రాధికా సఖీమణులను యుంచవలయును. మరి ఎనిమిది దశములందు ఎనిమిది మంది శ్రీకృష్ణ సఖులను యుంచవలెను. ఇట్లే మిగిలిన పదహారు దళములు నింపవలెను. కమలమునకు సమీపమున శంఖ, చక్ర, గదా, పద్మ, నందక, శాంగ, బాణ, హల, ముసల, కౌస్తుభ, వనమాల, శ్రీవత్స, నీలాంబర, పీతాంబర, వంశీ, వేత్రముల నుంచవలెను. వానికి పార్శ్వమున

తాళ చిహ్నము కానీ, గరుధ ధ్వజము కానీ యున్న రధమును యుంచి, అందు సుమతిని కానీ, దారుకుని గానీ సారధిగ యుంచి, గరుడ, కుముద, నంద, సునంద, చండ, ప్రచండ, బల, మహాబల, కుముదాక్షులను విద్వాంసులను స్థాపించవలెను. వివిధ దిశల యందు వేరువేరుగా దిక్పాలకులను స్థాపించి, తదుపరి విష్వక్సేనుడు, శివుడు, బ్రహ్మ, దుర్గ, లక్ష్మి, గణేశుడు, నవ గ్రహములు వరుణుడు, మరియు షోడశ మరుద్గణములకు ఆసనము లొసంగ వలెను.

కమలమునకు రెండవ ప్రక్క వేదికపై పండిత జనుడు వీతిహోత్రుని స్థాపించవలెను. అటుపిదప శ్రీకృష్ణ ప్రభువును ఆవాహన మొనర్చి, ఆసనము, పాద్యము, అర్ఘ్యము, స్నానము, యజ్ఞోపవీతము, వస్త్రము, చందనము, అక్షతలు, మధుపర్కము, పుష్పములు, ధూప, దీప, ఆభూషణములు, నైవేద్యము, ఆచమనము, తాంబూలము, దక్షిణ, మొదలగు వానిచే షోడశోపచార పూజ కావిపవలెను. పిదప ప్రదక్షిణ, ప్రార్ధన కావించి, హారతి నొసంగి తిరిగి నమస్కరించవలెను. ఇందు ప్రతి కర్మకు వివిధ పద్ధతులు కలవు. ఆవాహనకు పుష్పము, ఆసనమునకు రెండు కుశలు, పాద్యమునకు నల్ల దూర్వములు, మరియు అపరాజిత, అర్ఘ్యమునకు సుగంధ భరిత పుష్పములు, స్నాన జలమందు చందనము, కర్పూరము, కుంకుమ, అగరు, మొదలగు సుగంధ ద్రవ్యములను కలుప వలెను. మధుపర్కమునకు కమలము, ధూపమునందు అష్ట గంధములు, దీపమునకు కర్పూరము, పచ్చని యజ్ఞోపవీతము, వస్త్రమునకు పీతాంబరము, భూషణములకు స్వర్ణ భూషణములు, గంధమునకు కుంకుమ, చందనము, పుష్పములకు తులసీమంజరీ, అక్షతలకు పసుపు బియ్యము, నైవేద్యమునకు నానా విధములయిన పరమాన్నములు, షడ్రుచులు కలిగిన భోజన పదార్ధములు ఉత్తమములు. జలములకు గంగా యమునా జలములు, భజనానంతర ఆచమమునకు జయ ఫలములు, మరియు కక్కోల ఫలములు నీటి యందు కలుపుట ఉత్తమము. తాంబూలము నందు లవంగములు, ఏలుకలు, మరియు దక్షిణ యందు సువర్ణము అర్పించుట ఉత్తమము. ప్రదక్షిణ ప్రకారము ఊరేగించుట, మరియు హారతి యందు గోఘ్రుతము, శ్రేష్ఠము. ప్రార్ధన యందు ప్రేమ లక్షణ యుక్త భక్తి కలిగి యుండుట, నమస్కారము నందు అత్యంత నమ్రత కలిగి సాష్ఠాంగ దండ ప్రణామము లాచరించుట ఉత్తమము. తదనంతరము సాధకుడు పవిత్రుడై ద్వాదశాక్షరీ మంత్రము తో శిఖను బంధించి పూజాసామాగ్రి నంతటినీ ముందుంచుకొని భగవానుని మందు కూర్చొన వలెను.

(శ్రీ గర్గసంహిత యందు విజ్ఞాన ఖండాార్గతమయిన పూజా విధి విధాన వర్ణనమను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(పూజోపచారములు మరియు పూజా వర్ణన)

వ్యాస భగవానుడు “మహారాజా! పూజన సామాగ్రి సమర్పించుటకు వేదము నందు సుందర మంత్రరాశి కలదు. నీ కొరకు దానిని వర్ణించెదను. పూజ ఎప్పుడూ మంత్రోచ్ఛారణ చేయుచూ అర్ధ సహితముగ కావింప వలెను.

ఆవాహన

గోలోకధామాధిపతే రమాపతే
గోవింద దామోదర దీన వత్సల ।
రాధాపతే మాధవ సాత్వతం పతే
సింహాసనేస్మిన్ మమ సమ్ముఖోభవ ॥

గోవిందా! గోలొకాధిపతీ! రమాపతీ! దీనుల యందు దయ చూపుట నీ లక్షణము. దామోదరా! నీవు లక్ష్మీ లేక రాధాదేవి యొక్క ప్రాణ వల్లభుడవు. మాధవా! నీవు ఈ సింహాసనము నందు నా ముందు విరాజమానుడవు కమ్ము.

ఆసనము

శ్రీపద్మరాగ స్ఫుర దూర్ధ్వ పృష్ఠం
మహార్హ వైఢూర్య ఖచిత పాదాబ్జమ్ ।
వైకుంఠ వైకుంఠ పతే గృహాణ
పీఠం తడిద్ధాటక కుంభాండమ్॥

వైకుంఠపతే! ఈ పీఠపు పై భాగమున పద్మరాగ మణులు మెరయుచున్నవి. నీ పాదాబ్జములు ముంచు పాద పీఠము వైఢూర్య ఖచితమై యున్నది. ఇయ్యది విద్యుల్లతల వలె వెలుగు సువర్ణ కలశముల యుక్తమై యున్నది. దయచేసి దీనిని మీరు గ్రహింప వలసినది.

పాద్యము

పరంస్థితం నిర్మల రౌక్మ పాత్రే సమాకృతం బిందుసరోవరాద్ధి ।
యోగేశ, దేవేశ జగన్నివాస గృహాణ పాద్యం ప్రణమామి పాదౌ॥

మహాప్రభో! స్వచ్ఛమయిన సువర్ణ పాత్రయందు బిందు సరోవర తీర్థము నుండి ఉత్తమ జలములను తీసికొని వచ్చితిని. ఓ! జగధాదిష్ఠాతా! నేను మీ చరణ కమలములకు ప్రణామము లర్పించుచున్నాను. మీరు దయచేసి ఈ పాద్యమును స్వీకరింప వలసినది.

అర్ఘ్యము

జలజ చంపక పుష్ప సమన్వితం విమమర్ఘ్య మనర్ధధర స్థితమ్ ।
ప్రతి గృహాణ రమారమణ ప్రభో యదుపతే యదునాథ యదూత్తమ ॥

రమారమణ ప్రభో! యదుపతీ, యదునాథ, యదూత్తమ! కమలములు మరియు చంపక పుష్ప సమన్వితమయిన నిర్మల జలము ఈ శంఖము నందు నిండియున్నది. ఈ నిర్మలము, ఉత్తమము అయిన అర్ఘ్యమును స్వీకరింపుము.

స్నానము

కాశ్మీర పాటీరవ మిశ్రతేన సుమల్లికో శీరవతా జలేన ।
స్నానం కురుత్వం యధునాద దేవ గోవింద గోపాలక తీర్థపాద ॥

గోవింద! సదా గోరక్షకా! మీ శ్రీ చరణములు తీర్థ స్వరూపములు. యాదవనాథా! ఈ జలమందు కేసర, చందన, మల్లికా పుష్ప గంధము మిశ్రితమై యున్నది. మీరు దీనితో స్నానమాచరించవలసినది.

మధుపర్కము

మధ్యాహ్న చండార్క భవ శ్రీమాపహం సితాంగ సంపర్క మనోహరం పరం ।
గృహాణ విష్ణో మధుపర్కమేనం సందృశ్య పీతాంబర సాత్వతం పతే ॥

యదువల్లభ! పీతాంబరధారీ! కర్పూర మిళితమయిన ఈ ద్రవము అత్యంత మనోహరము. ఈయది మధ్యందిన మార్తాండుని చే కావింపబడు శ్రమను దూరము చేయును. భగవాన్! మీరు మీ దృష్టిచే దీనిని పరికించి, దీనిని దయచేసి స్వీకరింపమని నా ప్రార్ధన.

వస్త్రము

విభో! సర్వత: ప్రస్ఫురత్ ప్రోజ్వలంచ స్ఫురద్రశ్మి శూన్యం పరం దుర్లభం చ ।
స్వతో నిర్మితం పద్మ కింజిల్కవర్ణ గృహాణాంబరం దేవ పీతాంబరాఖ్యమ్ ॥

ప్రభూ! ఇచట పీతాంబరమను వస్త్రము ప్రస్తుతమై యున్నది. పరమ దుర్లభమయిన ఈ వస్త్రము తనకు తానుగా తయారయి పద్మకింజిల్క వర్ణము కలిగి, అత్యంత ఉజ్వలమై తన కాంతిని అన్ని వైపులా ప్రసరించు ఈ దివ్య దుకూలమును దయచేసి మీరు తీసికొన వలసినది.

యజ్ఞోపవీతం

సువర్ణాభామపీత వర్ణ సుమంత్రై: పరం ప్రోక్షితం వేద విన్నిర్మింతచ ।
శుభం పంచకార్యేషు నైమిత్తికేషు ప్రభోయజ్ఞ యజ్ఞోపవీతం గృహాణ ॥

భగవాన్! ఈ యజ్ఞోపవీతము పీత వర్ణము (పసుపు పచ్చ) కలిగి స్వర్ణము వలె మెరయు చున్నది; మరియు ఇది వేద జ్ఞానులయిన బ్రాహ్మణుల ద్వారా విచరితమయిన మంత్రముల ద్వారా ప్రోక్షణ చేయబడినది. నిత్య నైమిత్తిక కర్మము లందు ఇది మిక్కిలి కళ్యాణ దాయకమగును. మహాప్రభో! దీనిని గ్రహింప వలసినది.

ఆభూషణములు

కనకరత్న మయం మయనిర్మితం మదన రుక్మదనం సదనం రుచామ్ ।
ఉషసి పూష సువర్ణ విభూషణం సకలలోక విభూషణ గృహ్యతామ్ ॥

సర్వలోక విభూషణా! ఈ ఉపస్థితయిన కనకరత్న ఖచిత సువర్ణమయ భూషణములు మయునిచే వినిర్మితములు. కామదేవుని కాంతిని సహితము తిరస్కరించు ప్రభా భాండారములు. ప్రభో! ప్రాత:కాల సూర్య కాంతిని పోలు ఈ ఆభూషణములను దయచేసి స్వీకరింప వలసినది.

గంధము

సంధ్యేందు శోభమ్ బహుమంగళం శ్రీ కాశ్మీర కపండక యుక్తమ్ ।
స్వమండనం గంధచయం గృహాణ సమస్త భూమండల భార హారిన్ ॥

సాయంకాల పూర్ణ చంద్ర సదృశ శోభాయమానము, అనంత మంగళదాయకము, కేసర కర్పూర యుక్త గంధరాశి మీ అలంకారము కొరకు యుంచబడినది. సంపూర్ణ లోకభారహరణా! దయచేసి దీనిని గ్రహింపవలసినది.

అక్షతలు

బ్రహ్మావర్తే బ్రహ్మణా పూర్వముత్పాన్ బ్రాహ్మై స్థోయై సించితాన్ విష్ణునాచ ।
రుద్రేణారాద్ రక్షితాన్ రాక్షసేభ్య: సాక్షాత్ భూమన్నక్షతాస్త్వం గృహాణ ॥

తొలుత బ్రహ్మావర్తమందు బ్రహ్మదేవుని చే నాటబడినవి, విష్ణు భగవానుని చే నీటితో తడుప బడినవి, శంకర భగవానుని చే రాక్షసుల నుండి రక్షింపబడినవి అయిన ఈ అక్షతలను దయ చేసి మీరు తీసికొన వలసినది.

పుష్పములు

మందార సంతానక పారిజాత కల్పద్రుమ శ్రీహరి చందనానామ్ ।
గృహాణ పుష్పాణి హరే తులస్యా మిశ్రాణి సాక్షాన్న వమంజరీభి: ॥

భగవాన్! మందారము, సంతానకము, పారిజాతము, కల్ప వృక్షము, హరిచందనము మొదలగు పుష్పములు ఉ పస్థితమయినవి. ఈ పుష్పములతో పాటు తులసీ దళములు మిశ్రితమై యున్నవి. మహాప్రభూ! మీరు వీనిని స్వీకరించ వలసినది.

ధూపము

లవంగ పాటీరజ చూర్ణ మిశ్రం మనుష్యదేవాసురసౌంఖ్యాదంచ ।
సభ్య: సుగంధీ కృత హర్మ్యదేశం ద్వారావతీ భూప గృహాణ ధూపమ్ ॥

ద్వారకాధీశా! దేవ దానవ మానవ ప్రభృతులను ఆనందపరుచునది, భవనములను సుగంధ భరితము కావించునది, మలయగిరి శిఖరముల నుండి తెచ్చిన లవంగ చూర్ణము మిశ్రితమయినది, అయిన ధూపమును ఆఘ్రాణింప వలసినది.

దీపము

తమోహారిణం జ్ఞానమూర్తిమ్ మనోజ్ఞం లసద్విర్తికర్పూర పూరం గవాజ్యమ్ ।
జగన్నాథ దేవ ప్రభో: విశ్వదీప స్ఫురజ్జ్యోతిషం దీపముఖ్యం గృహాణ ॥

ప్రభూ జగన్నాథా! మీరు విశ్వమును ప్రకాశింప చేయువారు. అంధకారమును నాశము చేయు జ్ఞాన స్వరూపులు. ఈ దీపము వత్తులతో అలంకరింపబడి కర్పూరము కలిపిన గోఘ్రుతము తో తడుపబడినది. ఇట్లు కాంతి యుతమయిన ఈ దీపమును మహాప్రభూ! మీరు స్వీకరింపవలసినది.

నైవేద్యము

రసై:శరైర్వేద విధివ్యయస్థితం రసై: రసాఢ్యం చ యశోమతీ కృతమ్ ।
గృహాణ నైవేద్యమిదం సురోచకం గవ్యామృతం సుందర నందనందన ॥

నందనందనా! షడ్రుచులు కలిగినది, వేద వేదోక్తముగ వండబడినది, అయిన నైవేద్యము మీ కొరకై సిద్ధముగ యున్నది. యశోదాదేవి చే తయారు చేయబడిన ఈ ప్రసాదము రసభరితము. అత్యంత రుచికరమగుట యేకాక ఇది గోఘ్రుతము చే తయారు కాబడినది కావున ఇది అమృత తుత్యమయినది. దీనిని దయచేసి మీరు గ్రహింపవలసినది.

జలము

గంగోత్తరీవేగ బలాత్ సమృదధృతం సువర్ణ పాత్రేణ హిమాంశు శీతలమ్ ।
సునిర్మలాంభో హ్యమృతోపమయం జలం గృహాణ రాధావర భక్తవత్సల ॥

భక్తవత్సలా! ప్రయత్న పూర్వకముగ ఈ అమృత జలము గంగోత్తరీ ప్రవాహము నుండి కొనిరాబడినది. ఇది హిమాలయముల వలె అతి చల్లనిది. సువర్ణ పాత్రయందు యుంచబడిన ఈ అమృతధార తన నిర్మల కాంతిని వెదజల్లుచున్నది. రాధావరా! మీరు దయచేసి తీసికొన వలసినది.

అచమనం

రాధాపతే శ్రీ విరజాపతే ప్రభో, శ్రియ:పతే సర్వ పతేచ భూపతే ।
కంకోల జాతీఫల పుష్పవాసితం పరం గృహాణాచమనం దయానిధే ॥

రాధాపతీ! మీరు భగవతి అయిన విరజాదేవికి స్వామి. సర్వేశ్వరా! మీరు లక్ష్మీనాధులు, మరియు భూమండలేశ్వరులు. దయానిధీ! కక్కోల, జయఫల మరియు పుష్ప సువాసితములయిన ఉత్తమ ఆచమనీయము ప్రస్తుతింపబడినది. మహాప్రభూ! మీరు ఇద్దానిని స్వీకరింప వలసినది.

తాంబూలము

జాతీఫలైలాసుల వంగనాగ వల్లీదళై: పూగఫలైశ్చ సంయుతమ్ ।
ముక్తసుధాఖాదిర సారయుక్తం గృహాణ తాంబూల మిదల రమేశ ॥

రమేశా! జయఫలము, ఏలకులు, లవంగము, నాగకేసరము, సుపారీ (వక్క), ముత్యముల భస్మము, నల్లతుమ్మ సారము కలిపిన తాంబూలమును స్వీకరింప వలసినది.

దక్షిణ

నాకపాల వసుపాలమైలి భిర్వందితాంఘ్రి యుగళ ప్రభో హరే ।
దక్షిణాం పరిగ్రహాణ మాధవ లోక దక్షవర దక్షిణాపతే ॥

ప్రభో! స్వర్లోక, వసులోక వాసుల కిరీటములు మీ చరణారవింద పూజన మొనర్చును. మీరు దక్షిణాదేవి పతి. ప్రాణులకు ధనమొసంగుట యందు మీరు కుశలురు. భగవాన్! మీరు ఈ దక్షిణను గ్రహింప వలసినది.

నీరాజనము

ప్రస్ఫురత్పరమదీప్తి మంగళం గోఘ్రుతాక్త నవపంచ వర్తికమ్ ।
ఆర్తికం పరిగ్రహాణ చార్తిహన్ పుణ్యకీర్తి విశదీ కృతావనే ॥

మహాప్రభూ! ఈ హారతి శ్రేష్ఠ ప్రకాశ యుక్తమై, దీప్తివంతము మరియు మంగళమయము, గోఘ్రుతము నందు తడుపబడిన పదునాల్గు వత్తులు కలిగిన దీపము. ఇది మీ పవిత్ర కీర్తిని విస్తరింపచేయునది. భగవాన్! దీనిని స్వీకరింప వలసినది.

నమస్కారం

సమోస్త్వనంతాయ సహస్రమూర్తయే సహస్ర పాదాక్షి శిరోరు బాహవే ।
సహస్ర నామ్నే పురుషాయ శాశ్వతే, సహస్ర కోటియుగ ధారిణే నమ: ॥

అనంతుడు, వేలాది శరీరములు కలవాడు, చరణ, జంఘ, బాహు, ఊరు, శిరసు, నేత్రములు, వేలకొలదిగా యున్నవాడు, వేలాది నామ ధేయములు కలవాడు, కోట్లాది యుగముల నుండి యున్నవాడు అయిన పరమ పురుషుడు, భగవానునకు సమస్కరించుచున్నాను.

ప్రదక్షిణ

సమస్త తీర్థ యజ్ఞ దాన పూర్తకాదిజం ఫలం ।
లభేస్తు ఫలస్య శాశ్వతం కరోతియ: ప్రదక్షిణమ్ ॥

ఏ మానవుడు పరమ పావన ప్రభువయిన పరాత్పరునికి ప్రదక్షిణ కావించునో వానికి సంపూర్ణ తీర్థ, యజ్ఞ, దాన, పూర్తములు (నూతులు త్రవ్వించుట, చెట్లు పాతుట మొదలగు కార్యములు) కావించిన పుణ్యములు లభించును.

ప్రార్థన

హరేమస్తమ: పాతకీనాస్తిభూమై తథాత్వస్తమో నాస్తి పాపాపహారీ ।
ఇతిత్వంచ మత్వా జగన్నాథదేవ యథేశ్చా భవేత్తే తథామాం కురుత్వమ్ ॥

భగవాన్! ఈ జగత్తునందు నాతో సమానమైన పాపి లేడు. మీతో సమానమైన పాప హరణుడు లేడు. ప్రభూ! దీనిని తెలిసి మీరు ఏది ఉచితమని తలచెదరో దానిని ఆచరింప వలసినది.

స్థుతి

సంజ్ఞానామాత్రం సదసత్పర మహచ్ఛశ్వ ప్రశాంతం విభవం సమం మహత్ ।
త్వాం భ్రహ్మ వందేహి సదుర్గమంపరం సదా స్వధామ్నా పరిభూత కైతవమ్ ॥

చేతనా స్వరూపుడు సత్, అసత్‌లకు పరుడు, నిత్యుడు, విరాడ్రూపుడు, శాంతమూర్తి, ఐశ్వర్య స్వరూపుడు, సర్వుల యందు సమత్వము కలిగిన వాడు, ఎవరైననూ చేరుటకు పరమ దుర్లభుడు, స్వతేజము చే మాయను తిరస్కరించువాడు, అయిన పరబ్రహ్మకు నేను నమస్కరించుచున్నాను.

మహామతీ! ఈ మంత్రముల ద్వారా దేవేశ్వరుడయిన భగవానునికి పూజనమొనర్చి ప్రయత్న పూర్వకముగ ఆయనకు సర్వాంగ పూజ కావింపవలెను. "ఓం నమో నారాయణాయ పురుషాయ మహాత్మనే విశుద్ధ సత్య దీస్థాయ మహా హంసాయ ధీమహి" అని ఉచ్చరించి ప్రాణాయామము కావింపవలెను. తదనంతరము భగవాన్ విష్ణు, మధుసూదన, వామన, త్రివిక్రమ, శ్రీధర, హృషీకేశ, పద్మనాభ, దామోదర, సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ, అధోక్షజ, పురుషోత్తమ, శ్రీకృష్ణ నామములతో భగవానుని పాదములు, గుల్ఫములు, జానువులు, ఊరువులు, కటి, ఉదరము, వీపు, భుజములు, చేతులు, నాశిక, చెవులు, అధరములు, నేత్రములు, శిరస్సులను వేరువేరుగా పుజింపవలెను. దీనిని సర్వాంగ పూజ అందురు. పిదప ఆయన సఖీమణులను, శంఖ, చక్ర, గదా, పద్మ, అసి (ఖడ్గము), ధనస్సు, బాణములు, హలము, ముసలము, కౌస్థుభమణి, వనమాల, శ్రీ వత్సము, పీతాంబరము, నీలాంబరము, వంశీ, వేత్రము, తాళ ధ్వజము, గరుడ ధ్వజము చేయుక్తమయిన రథము, దారుక, సుమతి సారధులు, గరుడ, కుముద, నంద, సునంద, చండ, మహాబల, కుముదాక్ష, విష్వక్సేన, శివ, భ్రహ్మ, దుర్గ, గణేశ, దిక్పాల, వరుణ, నవగ్రహ, షోడశ మాతృకలను ఆవాహన కావించి వారి నామములకు ముందు ఓంకారము, చివర చతుర్థీ విభక్తి వేసి దానికి నమ: అను శబ్దము జోడించి (ఓం శివాయ నమ:) మంత్రముల ద్వారా వారిని పూజింపవలెను. పిదప ఓం నమో వాసుదేవాయ నమ: సంకర్షణాయచ ప్రద్యుమ్నాయానిరుద్దాయ సాత్వతాం పతయే నమ:॥ ఈ మంత్రము చే వంద సార్లు ఆహుతులను ఈయవలెను. పిదప భగవానునకు ప్రదక్షిణ గావించి, మహా భోగ నివేదనము చేసి, సాష్టాంగ దండ ప్రణామములు కావించి "ధ్యేయం సదా" ఇత్యాది మంత్రములు పఠింపవలెను. ఈ మంత్రార్థము "ఎవరు నిరంతర ధ్యాన యోగ్యుడో, ఎవరు తన మహిమ చే అవమానింప బడడో, జనుల మనోరథములను పూర్ణము కావించునో, తీర్థములకు ఆది పురుషుడో, భ్రహ్మ శివులు సహితము ఎవరిని స్థుతించునో, ఎవరు శరణు నిచ్చుట యందు కుశలుడో, భృత్యుల దు:ఖములను దూరము కావించునో, ప్రజాపతులకు సహితము పాలకుడో, సంసార సముద్రమును దాటించునో, అట్టి భగవానునికి, పురుషోత్తమునకు ప్రణామము లాచరించు చున్నాను."

మహారాజా! ఈ విధముగ భక్తుడు భగవంతునికి ప్రణామములు అర్పించి విధి విధానముగ తిరిగి హారతి సమర్పింపవలెను. పిదప గంట, వీణా, వేణు, మృదంగ, కరతాళ ధ్వనులతో పాటుగా భగవత్ కీర్తన ఆలపించవలెను.

ఆ సమయమున భక్త జనులు ప్రేమ విహ్వలులై భగవానుని ఎదుట జయజయ ధ్వానములు కావించుచు నర్తించెదరు. భగవానుని సుందర లీలా కథామృతమును గానము చేసెదరు. పిదప శ్రీకృష్ణ ప్రభువుకు పున: నమస్కరించి సూర్య తుల్య మందిరమందు శయనింపజేసెదరు. మహారాజా! ఈ విధముగ ధర్మ చిత్తులై శ్రీకృష్ణ సేవ కావించు మానవునకు దేవతలు ప్రణామము కావించెదరు. ఈ రకమయిన శ్రీహరి భక్తులు దేహావసాన సమయమున స్వర్గముపై పాదముంచి యోగులకు సహితము దుర్లభమయిన పరమ థామమయిన గోలోకము చేరెదరు. ఇది శ్రీకృష్ణ భగవానుని సేవా విధానము. ఇది మానవులకు చతుర్విధ పురుషార్థములను ఇచ్చునది.

(శ్రీ గర్గసంహిత యందు విజ్ఞాన ఖండార్గతమయిన నాదర బహుళాశ్వ సంవాదము నందలి పూజోపచారము మరియు పూజా వర్ణనము అను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(పరమాత్ముని స్వరూప నిరూపణము)

ఉగ్రసేనుడు "మునీంద్రా! మీరు సాక్షాత్ శ్రీకృష్ణ స్వరూపులు. నా యందు ఎంతో దయను కురిపించిరి. మీ శ్రీముఖతా నేను శ్రీకృష్ణ భగవానుని పూజా, పద్ధతి, విస్తార పూర్వకముగ వింటిని. దీని వలన నా జీవితము సఫలమయినది. ఆహా! ప్రాణుల యందు మూర్ఖత్వము నిండియున్నది. వారు మోహ, లోభ, మదముల చే విశృంఖలము గ యున్నారు. జగత్తును మోహింపజేయు చున్న ఈ శక్తి అత్యద్భుతమైనది. ప్రభూ! ఈ మోహము ఎట్లు ఉత్పన్నమయినది? ఇది ఏ విధముగ నివృతి అగును? ఈ విషయము దయచేసి నాకు తెలుపవలసినది."

వ్యాసుడు "జలమున ప్రతి బింబించు చంద్రుని రూపము జల వేగము చే కదులు చున్నట్లు కానిపించును. కానీ వాస్తవమునకు అది కదులట్లేదు. అదే విధముగ పరమ ప్రభుని ప్రతిబింబరూపమయిన మాయ సర్వత్రా విస్తరిల్లి యున్నది. దాని ప్రభావము చే సంసారము స్థిరముగ యున్నది. ఆ మాయ వలనే కాలము, అంత:కరణము, దేహము, గుణములు పుట్టుచున్నవి. మనుష్యుడు వీని ద్వారా విపరీత కర్మలు ఆచరించి బంధమున పడును. ఇంద్రియముల ప్రభావము చే దర్పణము నందు బాలుడు, ఎండమావి నందు నీరు, రజ్జువు నందు సర్పము భ్రాంతి నొందును. మహారాజా! ఈ జగత్తు అంతయు మహా మోహమయము. ఇందు రజో, తమో గుణములు అణువణువునా నిండియున్నవి. అప్పుడప్పుడు సత్వగుణము సహితము కానిపించును. ఇది అంతయు మనసు చేయు లీలా విలాసము. మనోవికారము కేవలము భ్రమ. మాయ అలాత చక్రము (అగ్ని చక్రము) వలె వేగముగ తిరుగుచూ సర్వులను "ఇది నేను, నేను చేసితిని, నేను చేయుదును, ఇది నాది, ఇది నీది, నేను సుఖముగ యున్నాను లేక దు:ఖమున యున్నాను, లోకులు నన్ను ప్రేమించుచున్నారు." ఈ విధమయిన భ్రమ యందు మానవులను యుంచుచున్నది. మనుష్యులు అహంకారము చే బుద్ధిని కోల్పోవు చున్నారు. ఇది నా నమ్మకము." ఉగ్రసేనుడు "మహాత్మా! నాకు దయచేసి పరమాత్ముని లక్షణములను వర్ణింప వలసినది. విద్వాంసులు భగవానుని పూజ, పద్ధతి యందు శ్రీకృష్ణుని లక్షణములను ఎన్ని విధములుగ తెలిపిరి?"

వ్యాసుడు "సనాతన భగవానుడు జన్మ మృత్యు రహితుడు. శోక మోహములకు అతీతుడు. యువావస్థ, మరియు వార్ధక్యము అను భేదములు ఆయన యందు యుండవు. అహంకారము, మదము, సుఖదు:ఖములు, భయ, రోగ, ఆకలి, దప్పిక, కోరిక, రతి, మానసిక వ్యధ ఇత్యాదులేవియు ఆయనకు యండవు. మునీశ్వరులు దేనిని ఆత్మగా గుర్తించిరో అయ్యది "ఉదాసీనము, శాంతము, నిష్క్రియ, దేహము లేనిది, కానీ సర్వత్రా యుండునది, అహంకార శూన్యము, శుద్ధ తేజ స్వరూపము, దాని యందు అన్ని గుణములు యుండును, కానీ అది వాటన్నిటికీ పరమైయుండును. అది నిష్కళంకము, మంగళ స్వరూపము, జ్ఞానము యొక్క సాకార విగ్రహము. ఆ ఆత్మ జగత్తు నిద్రించినప్పటికీ తను నిద్రింపదు. దేహ ధారులయిన మానవులు దాని నెరుగరు. కానీ అయ్యది సర్వులను ఎరుగును. అదియే ఆది పురుషుడు. అది సర్వులనూ

చూచును. కానీ దాని నెవ్వరూ చూడలేరు. అది పరమ స్వచ్ఛము మరియు మల రహితము. ఆ స్వచ్ఛ తేజ స్వరూపమును నేను ఉపాసించుచున్నాను.”

ఎట్లు ఘటముల చే ఆకాశము, కాష్ఠము చే అగ్ని, ధూళి చే గాలి, రంగులచే స్వచ్ఛ స్ఫటికము ఎటువంటి నిరూపత్వము నొందదో, అట్లే సదాచార పురుషుడు గుణముల యందు యున్నప్పటికీ అవి ఆయనను అంట లేవు. సత్ శబ్దము చే సూచింపబడు పరమాత్మ భావ ప్రకటితము చేయు శుద్ధ శక్తి చే గానీ, వాక్చాతుర్యము చే కానీ, పదాస్ఫోరణ పదముల చే కానీ, సర్వోత్తమ గుణముల చే కానీ తెలియబడదు. అటువంటప్పుడు లౌకిక ప్రాణులు ఆయనను ఎట్లు తెలిసికొనగలవు? కొందరు దానినే కర్త, కర్మ, కాలము, పరమ సుందరము, విచారము (మనసు చే తర్కించి ఆలోచించుట) అని తెలుపుదురు. వేదాంతులు దానిని “బ్రహ్మము” అని పేర్కొందురు. ఆ పరబ్రహ్మమును కాలము నందుత్పన్నమయిన గుణములు స్పర్శింప లేవు. ఇంద్రియ మనో, బుద్ధి, చిత్త, అహంకార, మహత్తత్వములు సహితము గ్రహింప లేవు. వేదము వర్ణింప లేదు. అగ్ని యందు అగ్ని కణములు విలీనమయినట్లు సర్వులు అందు విలీనమగుదురు. ఆ పరమాత్మయే సర్వుల యందు విరాజమానుడై యున్నాడు. ఆయననే సాధుజనులు హిరణ్య గర్భుడనీ, పరమాత్వ తత్వమనీ, వాసుదేవ భగవానుడనీ పేర్కొందురు. ఆ శ్రేష్ఠతముని స్వస్వరూపమును గూర్చి విచారించి, మోహమును విడచి, జగత్తు నందు ఆసక్తి రహితుడై ప్రవర్తించ వలెను. ఒకే చంద్రుడు అనేక జలపాత్రలందు వేరువేరుగా కనిపించినట్లు, ఒకే అగ్ని అనేక కాష్ఠములందు వర్ధిల్లు నట్లు, ఒకే పరమాత్మ తన ద్వారా తయారు చేయబడిన విభిన్న జీవరాశుల లోపల, వెలుపల విరాజమానుడైయున్నాడు. సూర్యుడు ఉదయించిన పిదప ఎట్లు అంధకారము ప్రాలద్రోలబడి వస్తువులు దృష్ఠి గోచరమగునో, అట్లే జ్ఞానము యొక్క ప్రాదుర్భావమయిన పిదప, అజ్ఞానాంధకారము, నశించి, జీవునకు తన శరీరము నందు బ్రహ్మోప లబ్ధి కలుగును, (పరమాత్మ సందర్శనము కలుగును). ఇంద్రియముల ప్రవృత్తులు వేరువేరుగా యండుట వలన గుణముల యొక్క ఒకే విషయమును మానువులు వేరువేరుగా గ్రహింతురు.

అట్లే అనంత తేజోమయ స్వరూపుడయిన భగవానుడు ఒక్కడయి నప్పటికీ, మునుల శాస్త్రములు అనేకములుగ యుండి ఆ స్వరూపమును వేరువేరుగా, భేద పూర్వకముగ వర్ణించిరి. పురుషోత్తముడయిన శ్రీకృష్ణ భగవానుడు శ్రీహరి. తన భక్తులను కరుణించుట ఆయన స్వభావము. అయనే కైవల్యానాధుడు. నృగ మహారాజును ఉద్ధరించిన మహాత్ముడు. నేను ఆ పరిపూర్ణ పరబ్రహ్మకు ప్రణామములు నర్పించుచున్నాను. “ఈ విధముగ పలికి వేద వ్యాస మమర్షి ఉగ్రసేనుని నుండి వెడలుటకు అనుమతి తీసికొని, యాదవులందరూ చూచుచుండగా అక్కడ నుండి అంతర్ధానమయ్యెను.

నారదుడు “నేను శ్రీకృష్ణ భగవానుని యందు భక్తిని ఇనుమడించు విజ్ఞాన ఖండమును నీకు వినిపించితిని. దీనిని వినిన వారికి మోక్ష ప్రదాయకమని చెప్పబడినది. గర్గాచార్యుల వారు దీనిని వర్ణించిరి. ఆ గ్రంధము గర్గ సంహితగా ప్రసిద్ధి నొందినది. ఈ సంహిత సంపూర్ణ దోషములను హరించి, పరమ పవిత్రత, మరియు చతుర్విధ ఫల పురుషార్ధములను ప్రసాదించునది. ఇంతవరకూ గోలోక, బృందావన, గిరిరాజ, మాధుర్య, మధురా, ద్వారకా, విశ్వజిత్, బలభద్ర, మరియు విజ్ఞాన ఖండములను తొమ్మిది ఖండములందు దీని వివరణ, వర్ణన జరిగినది. మహారాజా ఎట్లు నవరసములచే శ్రీకృష్ణుని దివ్య విగ్రహము విభూషితమయినదో, ఎట్లు పృధివి భారతాది నవ వర్షములచే శోభించు చున్నదో అట్లే గర్గముని ప్రణీతమయిన గర్గ సంహిత సహితము తొమ్మిది ఖండములచే విరాజిల్లు చున్నది. ఎట్లు శ్రీకృష్ణ భగవానుని అంగుళుల యందు, అగ్ని తప్తమయిన స్వర్ణమునందు నవరత్నముల అంగుళీయకము అలంకృతమయినదో, అట్లే చతుర్విధ ఫల పురుషార్ధదాయిని అయిన గర్గ సంహిత సర్గ, విసర్గాది తొమ్మిది అంగములచే శోభిల్లుచున్నది. మహారాజా! ఏ మానవుడు నిరంతరము ముని ప్రణీతమయిన ఈ గర్గ సంహితను నిరంతరము శ్రవణము చేయునో, ఆతడు ఈ సంసారము నందు సర్వ సుఖములు పొంది, అంతము నందు గోలోక ధామము చేరును. వంధ్య (సంతాన హీన అయన స్త్రీ) పీతాంబర ధారి అయిన శ్రీకృష్ణ భగవానునికి వందన మొనర్చి ఈ సంహితను వినిన యెడల ఆమెకు శీఘ్రముగ పుత్ర సంతతి కలుగును. ఈ కధను వినుట వలన రోగులు స్వస్థులగుదరు. నిర్ధనులకు విపుల సంపదలు లభించును. మూర్ఖుడు పండితుడగును. ఎవరేని రాజు కార్తీక మాసమునందు ముని ప్రణీతమయిన గర్గ సంహితను శ్రవణము చేసినచో ఆతడు నిస్సందేహముగ చక్రవర్తి అగును. అనేక మంది రాజులు ఆతని చరణ పాదుకలు పట్టుకొని నిలుచుందురు. ఆతడు

మహా వేగముతో పయనించు సింధుదేశపు హయములు, వింధ్య గిరి యందు ఉత్పన్నమయిన విశాల గజరాజములచే సంపన్నుడగును. వైతాళికులు ఆతని యశోగానమును కావింతురు. వారకాంతలు ఆతనికి సేవలు చేయుదురు. ఎవరేని ప్రతి ఖండము శ్రవణా నంతరము రెండు గోవుల శృంగములకు బంగారు తొడుగులు, గిట్టలకు వెండి తొడుగులు, వీపుకు తగరపు తొడుగు చేయించి భూషణములతో అలంకరించి దానము చేసిన ఎడల వాని మనోభీష్టము లన్నియు ఈడేరును. జనకరాజా! ఎవరేని గర్గ సంహితను నిష్కామ భావము తో శ్రవణము చేసిన ఎడల భక్త వత్సలుడయిన శ్రీకృష్ణ భగవానుడు వాని హృదయ కమలమందు నివసించును.

గర్గాచార్యుడు "బ్రహ్మన్! ఈ విధముగ పలికి దివ్యదర్శి అయిన నారద మునీంద్రుడు బహుళాశ్వ మహారాజు యొక్క అనుమతి నొంది అందరూ చూచుచుండగా ఆకాశమున కెగరెను. అంత బహుళాశ్వ మహారాజు ఈ గర్గ సంహితను మనసున నిధి ధ్యాసము చేసి కృతకృత్యుడనయ్యెనని భావించెను. బ్రహ్మన్! నీ ప్రశ్న వలన నేను ఈ సంహితను తెలిపితిని. ఎవరేని దీనిని వినినా, చదివినా కోటి యజ్ఞముల ఫలితము నిచ్చును." శౌనకుడు "మహామునీ! మీ సత్సంగము చే నేను ధన్యుడను, కృతార్థుడను అయితిని. నాకు శ్రీకృష్ణుని యందు ప్రేమ జనించు ఉత్తమ భక్తి ప్రాప్తించినది."ఎవరు మునుల విశాల హృదయమనెడు మానస సరోవరము నందు చరించు రాజహంసయో, ఎవరి మురళి సంపూర్ణ, ఆనంద పూర్వక మధురనాదము కావించునో, ఎవరి కళ సంసారమంతయు వ్యాప్తి నొందినదో, ఎవరు శూరసేనుని వంశమందు అవతరించిరో, ఎవరు సాధు జనులచే నిరంతరము ప్రకాశింపబడెదరో, ఎవరు తన బాహు బలము చే కంసుని సంహరించెనో ఆ శ్రీకృష్ణ పరమాత్మ మిమ్ము రక్షించుగాక!" అని గర్గాచార్యుడు ఆ మునులను ఆశీర్వదించెను. పిదప ఆయన ఆ మునుల నుండి తిరిగి వెళ్ళుటకు అనుమతి గైకొని, తిరిగి సర్గ విసర్గాది నవాంగములచే యుక్తమయిన గర్గ సంహిత స్వర్గ దాయకము మరియు చతుర్విధ ఫల పురుషార్ధ దాయికమని నొక్కి వక్కాణించి గర్గాచార్యుడు నిష్క్రమించెను.

శరదృతు వికసిత కమలముల వంటి భగవాన్ రాధాపతి యొక్క శ్రీ చరణయుగళిని నేను నిరంతరము నా హృదయమున స్థాపించు చున్నాను. ముని రూప భ్రమరములు వాని చుట్టూ పరిభ్రమించు చున్నవి. వజ్రకమల చిహ్నములు అందు చిత్రింపబడినవి. స్వర్ణ నూపురములు వాని యందు మెరయు చున్నవి. ఈ చరణ యుగళి భక్తుల సంసార తాపమును నివారించి, వారి హృదయము లందు దివ్య జ్యోతిని వెలిగించును.

(శ్రీ గర్గసంహిత యందు విజ్ఞాన ఖండార్గతమున నారద బహుళాశ్వ సంవాదము నందలి పరమాత్మ స్వరూప నిరూపణము అను పదియవ అధ్యాయము సమాప్తము)

విజ్ఞాన ఖండము సమాప్తము

అశ్వమేధ ఖండము

ఒకటవ అధ్యాయము

(అశ్వమేధ కథ ప్రారంభము; గర్గ వజ్రనాభ సంవాదము)

నారాయణం నమస్కృత్య నరంచైవ నరోత్తమమ్ ।
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయము దీరయేత్ ॥

నమ: శ్రీ కృష్ణ చంద్రాయ నమ: సంకర్షణాయ చ।
నమ: ప్రద్యుమ్న దేవాయాని రుద్దాయ నమో నమ: ॥

సర్వ వ్యాపి అయిన నారాయణునకు, నర శ్రేష్ఠుదయిన అర్జునునకు నారాయణుని లీలా కథామృతమును సంయక్ భాషలలో అభివ్యక్త పరచిన వాగ్దేవత సరస్వతీ దేవికి, భగవల్లీలలను బహు విస్తారముగ వర్ణించిన వేద వ్యాస మునీంద్రునకు ప్రణామము లాచరించి సమస్త పురాణములను ఉచ్చరించ వలెను.

శ్రీకృష్ణ భగవానునికి, సంకర్షణునికి, ప్రద్యుమ్న ప్రభువునకు, అనిరుద్ధ దేవునికి అందరికీ నమస్కారము.

గర్గాచార్యుడు "ఒకనాటి మాట! ఒకానొక నాడు ఋషుల సభ జరుగుచున్నది. ఆ సమయమున రోమ హర్షణుడు సూతుని పుత్రుడయిన ఉగ్రశ్రవసుడు ఏతెంచెను. ఆయనను చూచిన తడవుగ శౌనకాదులు లేచి, అర్ఘ్య పాద్యాదులిచ్చి, ఆశీనుని గావించి, కుశల ప్రశ్నల అనంతరము ఇట్లు ప్రశ్నించిరి "మహామతీ! మీ శ్రీముఖతా మేము సంపూర్ణ శాస్త్రములు, పురాణ కథలు, శ్రీహరి యొక్క నానా విధములయిన లీలా విహార చరిత్రలను వింటిమి. పూర్వకాలమందు శ్రీ గర్గా చార్యుల వారు మాకు శ్రీ గర్గ సంహితను వినిపించిరి. అందు శ్రీ రాధా మాధవ మహిమ, దాని వర్ణనము కావించిరి. ఓ! సూతనందనా! ఈనాడు మేము పరమ దు:ఖ హారక మయిన శ్రీకృష్ణ కథను వినవలెనని కూతుహలపడుచున్నాము. మీరు దయచేసి ఆ కథను మాకు ప్రసాదింప వలసినది." శౌనకుని తో పాటు ఎనభై ఎనిమిది వేల మంది ఋషులు ఇదే అభిప్రాయమును వ్యక్త పరచిన పిమ్మట రోమహర్షణ కుమారుడు శ్రీకృష్ణ చరణారవిందములను మదిలో స్మరించి ఇట్లనియె.

"ఓ! శౌనకా! శ్రీకృష్ణ పదయుగళి యందలి మకరందమును పానము చేయవలెనన్న మీ బుద్ధి ధన్యము. వైష్ణవ సంగము శ్రేష్ఠమని దేవతలు కూడా వక్కాణింతురు. ఎందుకనగా వారి సంగము చే శ్రీకృష్ణ కథామృతమును వినగలుగు అదృష్ఠము ప్రాప్తించును. అయ్యది సర్వ పాప కల్మష వినాశకము. అద్దానిని కొంచెము చతుర్ముఖ బ్రహ్మ, మరి కొంచెము ఉమా వల్లభుడయిన పరమ శివుడు తెలియును. నా వంటి మశికము వంటి వానికి దానిని గూర్చి ఏమి తెలియును? వాసుదేవ లీల ఒక సముద్రము. అందుమునిగి మోహితులై బ్రహ్మాది దేవతలు సహితము తెలుపలేక పోయిరి. యాదవ రాజ శిరోమణి అయిన ఉగ్రసేనుని, యజ్ఞ ప్రవరుడయిన గర్గాచార్యుడు తన మనమున ఇట్లు తలచెను, "యాదవేశ్వరుడు ఉగ్రసేనుడు ధన్యుడు. ఆయన శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞచే ద్వారకా పురి యందు అశ్వమేధమును కావించెను. ఆ యజ్ఞమును కాంచి నాకు మిక్కిలి ఆశ్చర్యమయినది. నేను నా సంహిత యందు శ్రీకృష్ణ లీలలు ప్రత్యక్షముగ చూసినవి, వినినవి రచించితిని. నేను ఆ సంహిత యందు ఆశ్వమేధము యొక్క కథను స్పృశింపలేదు. ఇపుడు ఆ అశ్వమేధ యాగ వర్ణన కావింతును. కలియుగ మందు ఈ కథా శ్రవణ మాత్రమున శ్రీకృష్ణ భగవానుడు వారికి భోగములు, మోక్షములు ప్రసాదించును. శౌనకా! ఈ విధముగ పలికి శ్రీ గర్గా చార్యుల వారు శ్రీకృష్ణ భక్తి చే ప్రేరితుడై ఉగ్రసేనుని అశ్వమేధ కథను ఇట్లు నుడివిరి. అద్దానికి "అశ్వమేధ చరిత్రము" అని నామకరణము చేసిరి. మునులారా! ఈ విధముగ పలికి గర్గాచార్యుడు కృతకృత్యుడయ్యెను.

యాదవకుల పరమగురువయిన గర్గాచార్యుల వారు ఎనిమిది దినముల లో అశ్వమేధ చరిత్రను వినిపించి

వజ్రనాభుని కలియుటకు మధురాపురి ఏతెంచిరి. జ్ఞాన శిరోమణి అయిన గర్గాచార్యుడు ఆకాశము నుండి క్రిందకు దిగుట కాంచిన వజ్రనాభుడు తన ద్విజులతో, సభాసదుల తో దిగ్గున లేచి, ఆయనకు సమస్కరించి, ఆసనము సమర్పించి, ఆయన చరణములు పట్టి, పూలమాలలతో ఆయనను అలంకృతుని కావించి మృష్టాన్నము నివేదించెను. షోడశ వర్ష ప్రాయుడు, సుధృఢ శరీరుడు, విశాల బాహుడు, శ్యామ సుందరుడు, కమల నయనుడయిన వజ్రనాభుడు గురు చరణోదకమును తన శిరముపై జల్లుకొని రెండు చేతులు జోడించి ఇట్లనియె "బ్రహ్మన్! మీకు నమస్కారము. స్వాగతము. నేను మీకు ఏమి చేయగలను? నేను మిమ్ములను భగవత్స్వరూపులుగ తలంచు చున్నాను. మీరు బ్రహ్మర్షుల యందు శ్రేష్ఠులు. గురువు బ్రహ్మ, రుద్రుడు మరియు బృహస్పతి. గురువు సాక్షాత్ నారాయణుడు. నేను అట్టి గురుదేవులకు నమస్కరించుచున్నాను. ముని శ్రేష్ఠా! మానవులకు మీ దివ్య దర్శనము దుర్లభము. విశేషించి మా వంటి విషయాసక్తులకు మరింత దుర్లభము. మా కులమంతటికీ అచార్యులయిన గర్గాచార్యా! తేజస్వీ! యోగభాస్కరా! మీ దర్శన మాత్రము చే కుటుంబమంతయు పవిత్రమయినది." వజ్రనాభుడు వంద సింహముల బలము కలవాడు. వజ్రనాధుని పలుకులు విని మునీంద్ర వర్యుడు, మహాత్ముడు శ్రీ గర్గుడు శ్రీహరి చరణములను చింతించి, ప్రసన్నుడై వజ్రనాభుని తో ఇట్లనియె.

"మహారాజా! యదువంశ శిరోమణీ! నీవు కేవలము సత్కర్మలే చేసితివి. సమస్త పృధివీ జనులను పాలించితివి. వత్సా! నీవు భూతలమందు ధర్మమును స్థాపించితివి. విష్ణురాతుడు (పరీక్షిత్) నీకు మిత్రుడగును. అపుడు అన్య నరేశులు నీ వశము నందుందురు. నృపశ్రేష్ఠా! నీవు, నీ ప్రజలు, నీ పురము, మరియు ఈ వ్రజభూమి భవ్యములు. నీవు శ్రీకృష్ణ, బలరామ, ప్రద్యుమ్న, అనిరుద్ధులను భజించుచు, ఉత్తము భోగములను భోగింపుము. నిశ్శంకగా రాజ్యము నేలుము." శ్రీ గర్గుని మాటలను విని, వజ్రుడు వారందరినీ తలచి, విరహము తో గద్గద కంఠుడాయెను. ఆయన కన్నుల నుండి అశ్రుధారలు జాలు వారెను. వజ్రుడు దు:ఖితుడై, అవనిత శిరస్కుడగుట గాంచి, గర్గుడు ఆశ్చర్య చకితుడై, ఆతని దు:ఖమును శాంతింపజేయుటకై ఇట్లనియె.

"రాజేంద్రా! నీవు ఎందులకు రోదించు చున్నావు? నేనుండగా నీకు భయము దేనికి? నీవు నీ దు:ఖకారణమును సమస్తము నాకు తెలుపుము." అంత గద్గద కంఠుడయిన వజ్రుడు "దేవా! శ్రీకృష్ణ, సంకర్షణాది సమస్త యాదవులు నన్ను ఇచట వదలి పరలోకమునకు చనిరి. ఇది తలచుకొని నేను దు:ఖించుచున్నాను. బ్రహ్మన్! స్వామి, అమాత్యులు, మిత్రులు, జనపదులు, కోశాగారము, దుర్గము మరియు సేన – ఇవి అన్నియు మహారాజు యొక్క ఏడు అంగములు. నాకు ఇవన్నియు వున్ననూ ఏకాకిగ అనిపించుచు నాకు ప్రీతి నొనర్చుట లేదు. నేను శ్రీకృష్ణుని చూడలేదు. ఆయన చరిత్రను వినలేదు. మీరు ఈ చరిత్రను నాకు తెలుపవలసినది. నేను నా కన్నులతో యాదవుల సంహారము మాత్రమే కాంచితిని. ఇపుడు నాకు దు:ఖము అతిశయించుచున్నది. చతుర్వ్యూహ రూపధారి అయిన శ్రీహరి ఏ పురము నైతే సృజించెనో అది కూడా సముద్రము నందు కలసి పోయినది. శ్రీకృష్ణ భగవానుడు సహితము భక్తికి పరమ ధామమయిన గోలోకమునకు వెళ్ళిపోయెను. శిష్య వత్సలులయిన గురుదేవా! నేను దేని కొరకు జీవింపవలెను? దయచేసి తెలుపవలసినది. నేను నేడే వనమునకు పోయెదను. నా మనసు నందు రాజ్యము చేయవలెనన్న ఇచ్ఛ లేనే లేదు."

యదుకుల తిలకుడయిన వజ్రనాభుని పలుకులు వినిన శ్రీ గర్గాచార్యులు వారు ఆతనిని ప్రశంసించి ఆతని దు:ఖమును శాంత పరచుటకై ఇట్లనియె "వృష్ణి వంశ తిలకా! నా మాట వినుము. అది శోక వినాశకరము, పాపహరము, మరియు శుభకారకము. నీవు సావధానుడవై వినవలసినది. పూర్వ కాలమందు కుశస్థలీ పురము నందు విరాజమానుడయిన శ్రీకృష్ణ భగవానుడు ఇపుడునూ సర్వధా, సర్వత్రా, విరాజమానుడై యున్నాడు. భూపతీ! నీవు భక్తి భావముతో ఆయనను వీక్షింపుము. ఈనాడు నీకు భగవానుని యొక్క భోగ మోక్ష ప్రదాయకమయిన ఒక ప్రత్యేక ఉపాఖ్యానమును వినిపించెదను. వసుధానాధా! శ్రీ కృష్ణ బలరాముల ఉత్తమ కధను వినుము."

సూతుడు "శౌనకా! ఈ విధముగ శ్రీ గర్గా చార్యుల వారు తొమ్మిది రోజులు తన పవిత్ర సంహితను వినిపించిరి.

(శ్రీ గర్గసంహిత యందలి అశ్వమేధ ఖండమునందు, గర్గ, వజ్రనాభ సంవాదము అను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(శ్రీకృష్ణావతారపు పూర్వార్ధ గత లీలల సంక్షేప వర్ణన)

సూతుడు “ఈ ప్రకారముగ శ్రీ గర్గాచార్యుని ముఖతా శ్రీ గర్గ సంహితను విని వజ్రనాభుడు మిక్కిలి ప్రసన్నుడాయెను. అంత ఆతడు తన గురు పాదములకు నమస్కరించి “ప్రభూ! ముని శ్రేష్ఠా! మీ శ్రీ ముఖతా వినిన శ్రీకృష్ణ చరిత్రచే నా దు:ఖము సర్వము దూరమయినది. కృపానాథా! ఈ కథ వినుటకు నేను అత్యంత ఉత్సుకుడనై యున్నాను.
మునీంద్రా! ద్వారక యందు ఉగ్రసేన మహారాజు అశ్వమేధ యజ్ఞము కావించెననీ, నేను ఇంతకు పూర్వము వినియుంటిని. మీరు ఆ అశ్వమేధ చరిత్రను సంపూర్ణముగ నాకు ఎరింగింప వలసినది. మునీశ్వరా! కరుణామయులయిన గురువులు తమ శిష్యులకు అడగకుండగనే గూఢ రహస్య విషయము లన్నింటినీ విశదీకరించెదరు కదా?” యదుకుల గురుడు, గర్గుడు వజ్రనాభుని సవినయ పలుకులు విని ప్రసన్నుడై శ్రీకృష్ణ చరణార విందములను మనసున స్మరించి ఇట్లనియె “యాదవ శ్రేష్ఠా! శ్రీకృష్ణ చరణ యుగళి యందు నీకు అత్యంత భక్తి కుదిరినది. ఇది ఇతరులకు పరమ దుర్లభము. ఈ భక్తి నీకు సహజముగ అబ్బినది. ఇది ఏ పరమ సౌభాగ్యము. అందువలన నీవు ధన్యుడవు. ఈ విషయము నందు ఒక పురాతన ఇతిహాసము కలదు. దానిని చెప్పెదను. వినుము. దీని శ్రవణ మాత్రమున మనుష్యుడు సమస్త పాప దూరుడగును.

ద్వాపరమున పాపుల భారము చే పీడింపబడిన ధరణీదేవి చతుర్ముఖ బ్రహ్మదేవుని వద్ద మొరపెట్టు కున్నది. అది వినిన బ్రహ్మ శ్రీహరిని శరణు వేడెను. అంత ఆ మహానుభావుడు శ్రీ రాధికా వల్లభుడు, శ్రీకృష్ణ పరమాత్ముడు వసుధకు ఆశ్వాసన మొసంగి, దేవతా సహాయముతో భూభార హరణము కావింప నిశ్చయించెను. పిదప వసుదేవునికి దేవకితో మధురలో వివాహమయ్యెను. అంత ఆకాశవాణి కంసుని హెచ్చరించెను. దేవకీ పుత్రుల వలన తనకు మరణము సంభవించునన్న విషయము తెలిసిన కంసుడు వారి ఆరుగురు పుత్రులను హతమార్చెను. కంసునకు భయము కలిగి ఆతనికి సర్వ దిక్కులా, సర్వత్రా శ్రీకృష్ణుడే కనిపించుట మొదలయ్యెను. తదుపరి భగవానుడు యోగమాయను ఆజ్ఞాపించగా, యోగమాయ దేవకి యొక్క ఏడవ గర్భమును సంకర్షణము కావించి, దానిని రోహిణి యందు ప్రవేశ పెట్టి, తాను యశోదా గర్భమున జన్మించెను.

భగవానుడు తాను దేవకీ గర్భమున ప్రవేశింపగా బ్రహ్మాది దేవతలు అరుదెంచి ఆయనను స్థుతించిరి. పిదప శ్రీకృష్ణ జననము జరిగెను. వేదవ్యాస మునీంద్రుడు బాలకృష్ణ రూపమును వర్ణించెను. వసుదేవుడు ఆ బాలకృష్ణుని స్థుతించెను. జగదీశ్వరుడయిన శ్రీకృష్ణుడు దేవకీ వసుదేవులకు తమ పూర్వ జన్మ వృత్తాంతమును తెలిపి, తదుపరి ఆ జగద్గురుని ఆదేశానుసారము వసుదేవుడు బాలకృష్ణుని గోకులము నందు వదలి అచట గల యశోదా తనయను వెనుకకు తీసికొని వచ్చెను. కంసుడు ఆ బాలికను ఒక బండ రాయిపై విసరెను. కానీ ఆ బాలిక పై కెగిరి, ఒక దివ్య రూపము దాల్చి “నీ పాలిటి కాలుడు పుట్టి పెరుగుచున్నాడని” తెలిపి అంతర్ధాన మయ్యెను. పిదప కంసుడు దేవకీ వసుదేవులను ఓదార్చి బంధ విముక్తుల కావించి విడచి పుచ్చెను.

కంసుడు తన దైత్య మిత్రుల రావించి, సభ జరిపి, బాలురకు, సాధు పురుషులకు ఉపద్రవము కావించుట నారంభించెను. వ్రజము నందు శ్రీకృష్ణుడు ఉద్భవించిన పిదప నందుడు మహోత్సవము కావించెను. నందుడు కప్పము కట్టుటకు మధుర కేగి అచట వసుదేవుని కలసెను. ఇంతలో విషమిశ్రిత స్థన దుగ్ధమును పిల్లవానికి పట్టించుటకు ఏతెంచిన పూతన యొక్క ప్రాణములను పాలతో పాటు శ్రీకృష్ణుడు హరించెను. ఆ ఆసురి యొక్క మహా కళేబరమును కాంచిన నందాది గోపకులు విస్మితులయిరి. తదుపరి శ్రీకృష్ణుని పాదములు తగిలి పాలు, పెరుగు ఇత్యాదులు పెట్టబడిన బండి క్రిందబడెను. సుడిగాలి రూపమున వచ్చిన తృణావర్తుడు బాలకృష్ణుని పాలబడి మరణించెను. ఒకనాడు యశోదామాత బాలకృష్ణుని లాలించు చుండగా ఆయన ఆవులించెను. ఆ తల్లి ఆయన ముఖమున విశ్వరూపమును కాంచెను. తదనంతరము శ్రీ రామకృష్ణులకు నామకరణములు జరిగినవి. పిదప ఆ బాలురిరువురు వ్రజభూమి యందు బాలక్రీడ లారంభించిరి.

వారు గోపాంగనల ఇండ్లు జొరబడి పాలు, పెరుగు, వెన్న దొంగిలించుట నారంభించిరి. ఒకనాడు శ్రీకృష్ణుడు మన్నుతిని, తన నోటి యందు తల్లికి సమస్త బ్రహ్మాండరూప సందర్శనము కావించెను. వెన్న దొంగతనము, రజ్జువుతో బలముగ రోటికి కట్టబడుట, యమళార్జున వృక్షముల భంజన, వారి శాపవిముక్తి, వారిరువురు భగవానుని స్థుతించుట, బాలక్రీడ, ఉపనందాది వృద్ధుల మంత్రాంగము, బృందావన గమనము, అచట సమవయస్కులయిన బాలురతో గోవులను కాచుట, అదే సమయమున వత్సాసుర, బకాసుర, అఘాసుర వధ, సఖులతో పాటు శ్రీహరి యమునా తటమున భుజించుట, బ్రహ్మదేవుని ద్వారా గోవులు, గోప బాలకుల అపహరింపబడుట, శ్రీకృష్ణుడు స్వయముగ గోవులుగ, గోప బాలురుగ మారుట, బ్రహ్మదేవుడది గ్రహించి, తన పొరపాటు తెలిసికొని మోహ నివృతి నంది, క్రిందికి వచ్చి శ్రీకృష్ణుని స్థుతించుట, శ్రీకృష్ణుడు గోపబాలుర సహితుడై వ్రజమున కేతెంచుట, గోచారణ సమయమున ధేనుకాసుర వధ జరుగుట, కాళీయుని విష పూరిత జలములు త్రాగుటచే మరణించిన గోవులను, గోపబాలురను గోవిందుడు పునర్జీవితులను కావించుట, కాళియుని మదమడచుట, ఆ సమయమున నాగ పత్నులు ఆయనను స్థుతించుట; యమునకు కాళియుని ఆగమన రహస్యమును ఎరిగించుట, తదుపరి ముంజాటవి నందు దావాగ్నిని త్రాగుట, గోప గోపీజనమును రక్షించుట, క్రీడా సందర్భమున ప్రలంభుని సంహరించుట, దావానలము నుండి గోవులను రక్షించుట; వర్షాకాల వర్ణనము, గోపీ గీతములు, గోకులము నందు గోపకన్యల ద్వారా కాత్యాయనీ వ్రతము అనుష్ఠింపబడుట, వారి వస్త్రాపహరణము, బృందావన సౌభాగ్య వర్ణనము, గోపబాలకులు భగవానుని భోజనమడుగుట, భగవానుడు వారిని బ్రాహ్మణుల యజ్ఞమునకు పంపుట; బ్రాహ్మణ పత్నులందు శ్రీకృష్ణుని కృపా ప్రసాదము, బ్రాహ్మణులు తమ మూఢత్వమునకు పశ్చాత్తాపబడుట; ఇంద్ర యజ్ఞమును మాన్పించి గోవర్ధన యజ్ఞమును చేయించుట; కుపితుడయిన ఇంద్రుడు భయంకర వర్షమును కురిపించుట; శ్రీకృష్ణుడు వ్రజవాసులను రక్షించుటకు గోవర్ధనమును తన చేతితో ఎత్తుట, దేవరాజు ఇంద్రుని గర్వము ఖర్వమగుట, గర్గ మహర్షి ద్వారా శ్రీకృష్ణ భగవానుని భావి జాతక కర్మలు, వాని ఫలితముల వివరణ, గోపకుల శంక, భగవానుని ద్వారా అది నివారింప బడుట, కామధేనువు చే భగవానుని గోవింద పదముపై అభిషేకించపడి స్థవము కావింపబడుట.

నందుడు వరుణ లోకమునకు కొనిపోబడుట, శ్రీకృష్ణుడు ఆయనను వెనుకకు తెచ్చి, గోపకులకు వైకుంఠాలయ దర్శనము కావించుట, అయిదు అధ్యాయముల యందు రాస క్రీడ వైభవ వర్ణనము, నందుని అజగరము నుండి కాపాడుట, శంఖచూడుని వధించుట, గోపికల యుగళ గీతికలు, అరిష్టాసుర వధ, కంస నారదుల సంవాదము, కంస అక్రూరుల సంభాషణము, కేశి వధ, నారద మహర్షి శ్రీకృష్ణ సంభాషణము, వ్యోమాసుర వధ, అక్రూరుని గోకులాగమనము, వ్రజ దర్శనము చే శరీరము పులకించుట; అంత:కరణానందము చే శరీరము రోమాంఛమై గద్గదవాణితో పలుకుట, శ్రీకృష్ణ బలరాములతో ఆతడు సంభాషించుట, గోపీజన విలాపము, మధురాగమనము, మార్గ మధ్యమునందు అక్రూరునికి యమునా నది యందు శ్రీకృష్ణుని నిజ దర్శనము, ఆతని చే స్థుతింపబడి తిరిగి మధర కేగుట, నగర దర్శనము, నగర సంపత్తి వర్ణనము, రజకుని శిరచ్ఛేదము, శౌచకునకు(దర్జీ) వరదానము, సుదాముని అనుగ్రహించుట, కుబ్జకు శ్రీకృష్ణ దర్శనము, కంస ధనస్సు భంజనము, కంస సైనికుల వధ, కంసునికి దుర్నిమిత్తములు కనిపించుట, కంసుని రంగోత్సవము, కువలయాపీడవధ, పురవాసులు శ్రీకృష్ణ బలరాముల దర్శించుట, వారికి ఆ సోదరుల పట్ల ప్రీతి కల్గుట, రంగస్థలమందు మల్లుల వధ, సోదర సహితముగ కంసుని వధ, శ్రీకృష్ణ బలరాములు మాతా పితరులను విడిపించుట, సమస్త సుహృదులకు తృప్తి నిచ్చుట, ఉగ్రసేనుని రాజుగా అభిషేకించుట, నందాది గోప ప్రభృతులు వ్రజభూమికి తిరిగి వెళ్ళుట, బలరామ కృష్ణుల ఉపనయన సంస్కారము, గురుకులమున కేగి విద్యాభ్యాసము గావించుట, గురుపుత్రుని యమలోకము నుండి తిరిగి తెచ్చుట;

పంచజనుని సంహరించుట, ఉద్ధవుడు వారిని స్వాంతన పరచుట, వ్రజవాసినులతో కలియుటకు శ్రీకృష్ణుడు వ్రజభూమికి ఏతెంచుట, కోలదైత్య వధ, కుబ్జా మిలనము, అక్రూరుని హస్తినకు పంపుట, పాండవుల పట్ల విముఖత తో కూడిన వ్యవహారమును మానుమని ధృతరాష్ట్రునకు నచ్చ చెప్పుట," మొదలగునవి వర్ణింప బడినది.

(శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందు శ్రీకృష్ణావతార పూర్వార్ధ లీలలను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(జరాసంధ ఆక్రమణము నుండి పారిజాతాపహరణము వరకు శ్రీకృష్ణ లీలల సంక్షిప్త వర్ణనము)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తన జామాత కంసుడు వధింప బడెనన్న సమాచారము వినిన జరాసంధుడు మిక్కిలి కోపించి అనేక అక్షౌహిణీ సేనలు తీసికొని అనేక మార్లు మధురపై దండెత్తెను. కానీ వాని సేనల సమస్తమూ బలరామ కృష్ణులు సంహరించిరి.

ఇట్లు అనేకమార్లు యుద్ధము జరుగుచుండుటచే శ్రీకృష్ణుడు విశ్వకర్మను రావించి, సాగరగర్భమందు ద్వారకాపురి నిర్మాణము కావించెను. ఇంతలో కాలయవనుడు సహితము మధురను ఆక్రమించెను. శ్రీకృష్ణుడు ముచికుందుని ద్వారా వానిని సంహారము గావించి, ముచికుందుని చే స్థుతింపబడి, ఆతనిని బదరికాశ్రమమునకు పంపించి, వెనుకకు వచ్చి, మ్లేచ్ఛ సేనను వధించి, వాని ధనమును ద్వారకకు తరలించెను. ఇంతలో జరాసంధుడు యుద్ధమునకు వచ్చెను. భగవానుడు ఒక విశేషమయిన ప్రణాళికను రచించి, తాను పలాయన మొనర్చినట్లు అభినయించెను.

రైవతుడను మహారాజు ద్వారకకు వచ్చి, రేవతి యను తన పుత్రికను బలరామునికిచ్చి వివాహము జరిపించెను. రాజకుమారి అయిన రుక్మిణి ప్రేమ సందేశమును విని శ్రీకృష్ణుడు కుండినపురమున కేగి, అచట అంబికాదేవి మందిరము నుండి తన ప్రేయసి రుక్మిణిని అపహరించి, అచటి రాజులను జయించి ద్వారకకు ఏతెంచెను. మిగిలిన రాజులు శిశు పాలునకు స్వాంతన నిచ్చి మారుమాట్లాడక ఇంటికి పొమ్మని సలహాఇచ్చిరి. తదుపరి ఒక విశిష్ఠ ప్రతిజ్ఞ చేసి రుక్మి యుద్ధ భూమికి ఏతెంచెను. శ్రీకృష్ణుడు ఆతనితో కొంతతడవు రణమాచరించి, తుదకు వానిని రథ చక్రమునకు కట్టి శిరోముండనము కావించెను. రుక్మి అతి దు:ఖితుడాయెను. అంత బలదేవుడేతించి, ఆతనిని శాంతపరచి, శ్రీకృష్ణుని చే ఆతనిని విడిపింపజేసెను. అనంతరము వారందరూ ద్వారకకు ఏతెంచిరి. అతి వైభవముగా రుక్మిణీ కృష్ణుల వివాహము జరిగెను. తదుపరి ప్రద్యుమ్నుడు జనన మందెను. అతడు సూత గృహమునుండి అపహరింపబడెను. మాయావతీ కధనము చే అతడు తన పూర్వ వృత్తాంతమును తెలిసికొని, శంబరాసురుని సంహరించి వెనుకకు ఏతెంచెను. ద్వారకావాసులు మిక్కిలి సంతోషము నందిరి. సత్రాజిత్ అను యాదవునకు సూర్యారాధన చే శ్యమంతక మణి ప్రాప్తించినది. అద్దానిని ఒకనాడు శ్రీహరి ఉగ్రసేనునకు ఇమ్మని అడిగెను. కానీ సత్రాజిత్ నిరాకరించెను. ఆ మణి ధరించి సత్రాజిత్ సోదరుడు ప్రసేనుడు అడవికి వేటకు వెడలెను. అచట ఒక సింహము వానిని సంహరించినది. అంత శ్రీహరిపై కళంక మంకురించినది. దానిని బాపుకొనుటకై భగవానుడు అడవికి ఏగి, ఋక్ష రాజయిన జాంబవంతుని గుహ జొచ్చెను. అచట వారిరువురికి భయంకర ద్వంద్వ యుద్ధము జరిగెను. అంత జాంబవంతుడు ఆయనను పరమాత్మగా ఎరిగెను.

అంత జాంబవంతుడు మణిని, తన కన్య అయిన జాంబవతిని ఆ మహానుభావుని కర్పించెను. భగవంతుడు శ్యమంతక మణిని సత్రాజిత్తున కిచ్చెను. సత్రాజిత్ తన కన్య సత్యభామను కూడ శ్రీకృష్ణునకిచ్చి వివాహమొనరించి, మణిని సహితము కట్నముగ సమర్పించెను. ఒకనాడు బలరామ కృష్ణులు హస్తినకు ఏగిరి. ఆ సమయమున అక్రూర, కృతవర్మల చే ప్రేరితుడై శతధన్వుడు సత్రాజిత్తును సంహరించెను. ఇది వినిన శ్రీకృష్ణుడు శతధన్వుని సంహరించెను. బలరాముడు మిధిలానగరమునకు ఏగి, జనకుని తో వేదాంత చర్చ సలిపెను. ఆ సమయముననే దుర్యోధనుడు బలరాముని వద్ద గదాయుద్ధము నేర్చుకొనెను. ఇచట శ్రీకృష్ణుడు అక్రూరునకు మణి నొసంగి ఇంద్ర ప్రస్థము నకు చనెను. అచట ఆయనకు కాళింది ప్రాప్తించెను. ఆమెను ద్వారకకు పంపి అచట వివాహమాడెను. అట్లే మిత్రవింద, సత్యలను కూడా వివాహము చేసికొనెను. తదనంతరము లక్ష్మణ, భద్ర అను కన్యలను కూడా ఆయన వివాహమాడెను. ఒకానొకనాడు శ్రీకృష్ణుడు దేవరాజయిన ఇంద్రుని ఓడించి పారిజాత వృక్షమును ద్వారకాపురికి తెచ్చి తన ప్రియసతి అయిన సత్యభామా దేవికి ప్రసాదించెను.

వజ్రనాభుడు "మహామునీ! శ్రీకృష్ణ భగవానుడు ఇంద్రుని జయించి, పారిజాత వృక్షమును తెచ్చి సత్యభామా దేవి

కిచ్చుటకు కారణమేమి? ఈ వృత్తాంతమును విస్తారముగ తెలియజేయవలసినది.” అంత శ్రీ గర్గా చార్యుడు “ఒకానొక సమయమున దేవర్షి నారదుడు స్వర్గము నుండి ద్వారకా పురికి ఏతెంచి ఒక పారిజాత పుష్పమును సమర్పించెను. ఆయన దానిని తన పట్టపురాణి అయిన రుక్మిణీదేవి కి సమర్పించెను. అందువల్ల సత్యభామా దేవి దు:ఖిత అయ్యెను. అంతలో శ్రీకృష్ణుడు సత్యభామా దేవిని కలసి, ఆమె దు:ఖమునకు కారణమరసి, ఆమెను ఆశ్వాశించి “దు:ఖపడవలదు, నీకు పారిజాత వృక్షమును తీసికొని వచ్చెదనని” “వాగ్దానము చేసెను. అదే సమయమున ఇంద్రుడు వచ్చి నరకాసురుని అకృత్యములు ఏకరువు పెట్టెను. అంత భగవానుడు వృకసూదనా! నా ప్రియభార్య అయిన సత్యభామ దు:ఖితయై రోదించుచున్నది. ఈ రోదనము పారిజాత వృక్షము కొరకే! మీరు సత్యభామ కోసమై పారిజాత వృక్షమును ఇచ్చిన ఎడల నేను సేనా సహితుడనై నరకాసుర సంహారము కావింతును. ఇందు సందేహము లేదు.” అది విని ఇంద్రుడు “శ్రీ కృష్ణా! నీవు నరకాసుర వధకావించి నందన వనమందు ఏఏ పారిజాత వృక్షములన్నవో అవన్నియు తీసికొని పోవలసినది.” భగవానుడు “తథాస్తు” అని పలికి సత్యభామా సహితుడై గరుడుని అధిరోహించి ప్రాగ్జ్యోషిత పురమున కేగెను. ఇంద్రుడు వెడలిన పిదప సత్యభామ “జగత్పతీ! మీరు ముందుగా ఇంద్రుని నుండి పారిజాత వృక్షమును తీసికొనవలసినది. లేని ఎడల ఇంద్రుడు తన పని పూర్తి అయిన పిదప మన కార్యము చేయడు.” “శ్రీకృష్ణుడు’అమరేశ్వరుడు పారిజాతమును ఈయని ఎడల ఆతని వక్షస్థలమందు చందన మలదు స్థానమందు కౌమోదకీ గదా ప్రహారము కావింతును.”

ఇట్లు పలికి నరకుని పురమునకేగి, అచటగల ఏడు దుర్గములు పహారాకాయుచున్న భయంకర అసురులను తన చక్రముతో ముకుందుడు భేదించెను. మరుదైత్యుడు తన పుత్ర సహితుడై ఆ దుర్గ రక్షణ కావించు చుండెను. శ్రీకృష్ణుడు క్షణములో వారందరినీ అంతక పురికి పంపెను. నరకుడు తన సేనావాహిని తో ఏతెంచి బాణ వర్షమును కురిపించెను. శ్రీకృష్ణుడు తన చక్రము ద్వారా నరకుని రెండు ముక్కలు గావించి, గరుడుని ద్వారా వాని సేన నంతటినీ సంహరింపజేసెను. నరకుని సంహరించి, వారి వద్దగల ఉత్తమ రత్న సంపత్తిని గ్రహించెను. ఆచట పదహారువేల ఒక వంద మంది రాచ కన్యలు సముదాయమును కాంచెను. వారందరూ దైత్య, సిద్ధ రాచకన్యలు. శ్రీహరి వారందరినీ ద్వారకకు పంపి ఇంద్రుని మణినీ, చత్రమును, దేవమాత అదితి యొక్క కుండలములను తీసికొని స్వర్గము నుండి పారిజాత వృక్షము ను తెచ్చుటకు అమరావతికి ఏగెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి శ్రీకృష్ణ కథా వర్ణనము అను మూడవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(పారిజాతాపహరణము)

గర్గాచార్యుడు “మహారాజా! నరకాసుర వధానంతరము మాధవుడు స్వర్గమునకేగి, ఇంద్రునికి ఆతని ఛత్రము, మణి ప్రసాదించి, దేవమాత అయిన అదితికి ఆమె కుండలములనిచ్చి, పురుంధరునికి తన అభిప్రాయమును వ్యక్తము చేసెను. శ్రీహరి యొక్క అభిప్రాయమును తెలిసి కూడా పురంధరుడు పారిజాత వృక్షము నియ్య నొల్లకుండెను. అంత ముకుందుడు బలపూర్వకముగ దేవతలను పరాజితుల గావించి, పారిజాతమును తన చే జిక్కించుకొనెను.” ఇది వినిన వజ్రనాభుడు విస్మితుడై, శ్రీహరి యొక్క గుణముల యందు శ్రద్ధను యుంచి తన గురుదేవునిట్లు ప్రశ్నించెను. “ఇంద్రుడు దేవతలకు ప్రభువు. ఆయన శ్రీకృష్ణుడు పరమేశ్వరుడని ఎరుగును కదా! కానీ భగవానునికి ప్రతి గా అపరాధమును ఆయన ఎట్లు కావించెను? దీనిని గూర్చి దయచేసి తెలుపవలసినది.” ఇంద్రుని చేష్టలను పసిగట్టి ముందు గనే సత్యభామాదేవి శ్రీకృష్ణుని ఎదుట సుస్పష్టము కావించినది కదా! ఈ వృత్తాంత మంతయు సంపూర్ణముగ వినవలెనని నాకు మిక్కిలి ఉత్కంఠగ యున్నది. మీరు ఇంద్రముకుందుల మధ్య జరిగిన సమరమును గూర్చి నాకు విస్తారముగ తెలుపవలసినది.”

గర్గాచార్యులు "మహారాజా! అదితిదేవి శ్రీకృష్ణ భగవానుని స్థుతించినది. పురంధరుడు సహితము పారిజాతమును తీసికొని వెళ్ళుటకు అనుమతించెను. అంత శ్రీకృష్ణుడు నందన వనమున కేగెను. అందు అనేక పారిజాత వృక్షములు కలవు. వాటన్నిటి మధ్య ఒక మహా వృక్షము క్షీర సాగర మధనము నుండి పుట్టెను. ఆ వృక్షము నుండి కమల సుగంధము ఉత్పన్నమగుచున్నది. ఆ దివ్య సుందర వృక్షము నందన వనమునకే విభూషణమై స్వచ్ఛ, స్వర్ణ కాంతితో వెలుగులు చిమ్ముచూ, తగరపు రంగు నవ పల్లములతో నిండి యుండెను. ఆ పారిజాత వృక్షము నవలోకించి మానిని సత్యభామా దేవి మాధవుని పరికించి "స్వామీ! ఈ వనమంతటిలోనూ ఈ వృక్ష రాజమే శ్రేష్ఠముగ యున్నది. నేను ఈ వృక్షమును ఇష్ఠపడుచున్నాను." తన ప్రియతమ పలుకులు వినినంతనే ముకుందుడు మందస్మితుడై, అవలీలగా ఆ వృక్షమును పెరకించి గరుడుని పై యుంచెను.

ఆ సమయమున ఆ వనమును రక్షించు వనపాలురు శస్త్రధారులై అచటికి ఏతెంచి, మాధవుని చూచి "ఓ! మానవా! ఇది మా ఇంద్రవల్లభ అయిన శచీదేవి యొక్క వృక్షము. దీనిని ఎందుకు అపహరించుచున్నావు? పూర్వ కాలమందు సమస్త దేవతలు ఇంద్రాణి అయిన శచీదేవి యొక్క ప్రసన్నత కొరకై ఈ వృక్షమును ఉత్పన్నము కావించిరి. ఈ వృక్షమును తీసికుని నీవు కుశలముగ యుండలేవు. తొలుత సమస్త పర్వత పంఖములను ఖండించిన వృత్రాసుర నిషూదనుని, మహేంద్రుని పరాజితుని కావించి మాత్రమే ఈ వృక్షమును తీసికొని పోగలవు. లేని ఎడల పారిజాత వృక్షమును ఇక్కడనే వదలి వెళ్ళవలసినది. మేము దేవరాజు ఇంద్రుని అనుచరులము. అందువలన మిమ్ము ఈ వృక్షమును తీసికొని వెళ్ళనివ్వము. ఒక వేళ పురంధరుడు ఈ వృక్షమును మీరు తీసికొని వెళ్ళుటకు అనుమతించిన ఎడల మేము మిమ్ము అడ్డుకొనము. మేము కేవలము వన రక్షకులము మాత్రమే సుమా!"

వనరక్షకుల పలుకులు విని ముకుందుడు నిశ్శబ్దముగ యుండెను. కానీ సత్యభామా దేవి రోషముతో లేచి వన రక్షకులతో ఇట్లనియె "ఒక వేళ ఈ వృక్షరాజము సముద్ర మధనమున ఉత్పన్నమయిన ఎడల ఇది సర్వలోకముల సంపత్తి. అటువంటప్పుడు మీ శచీదేవికి గానీ, దేవరాజయిన ఇంద్రునకు గానీ ఏమి హక్కుండదు? సముద్రము నందు ఉత్పన్నమయిన వస్తువులను ఇంద్రుడు తానొక్కడే ఎట్లు అనుభవించును? అమృతము, చంద్రుడు, ధనము ఇవి జగత్తుకంతటికీ చెందినవి కాదా! అట్లే ఈ పారిజాత వృక్షము కూడా! ఒకవేళ శచీదేవి తన పతి యొక్క బాహుబల మందు గర్వితయై, తన పతిని వశము నందు ఉంచుకొనినదై ఈ వృక్షమును తీసికొని వెళ్ళుటకు నిరాకరించినట్లయిన మీరు వెంటనే వెళ్ళి ఈ విధముగ చెప్పెదరు గాక! మమ్ము క్షమించవలసిన అవసరము లేదు. ఆమె ఏమి చేయదలిచిననూ చేసికొను గాక! సత్యభామ పారిజాతాపహరణము కావించుచున్నది. ఇది ఆమెకు తెలియపరుచ వలసినది. సత్యభామా దేవి పలుకులు ప్రతి అక్షర పర్యంతము గర్వము తో నుండి నిర్భయముగ యున్నవి. నీవు నీ పతికి ప్రాణ వల్లభవయినచో, నీ పతి నీ వశము నందు యున్నచో, పారిజాతాపహరణము గావించు నా పతిని ఆపుము. మీరందరూ దేవతలు కదా! ఆ విషయము నాకు పూర్తిగా తెలియును. నేను మానుష స్త్రీని అయినప్పటికీ మీ పారిజాతమును అపహరించుచున్నాను. మీకు చేతనయిన ఆపుటకు ప్రయత్నించవలసినది." శ్రీకృష్ణ వల్లభ అయిన సత్యభామా దేవి పలుకులు విని శచీదేవి మిక్కిలి కుపిత అయినది. దేవరాజు ఇంద్రుడు శ్రీకృష్ణుని ఆపుటకు ఉద్యక్తుడు అగుట లేదు. అంత శచీదేవి "దేవరాజా! నీవు వజ్రధారివి. పాకశాశనుడవు. వృత్రాసుర సంహారివి.

"నిన్ను గడ్డిపరక వలె తలచి అత్యంత బలశాలి అయిన మాధవుడు తన ప్రియురాలయిన సత్యభామ కొరకు నా పారిజాత వృక్షమును అపహరించుచున్నాడు. నీవు ఆ వృక్షరాజమును ఆతని నుండి తీసికొనుము. శ్రీకృష్ణుడు సత్యభామా వశుడు. ఆతడు స్త్రీల చేతి యందు ఆటబొమ్మ. నీవు సమరము నందు ఆతనిని పరాజితుని కావించి నీ అధికారమును సుస్థిరము కావించుకొనుము. నీవు పూర్వ కాలమందు పర్వతముల రెక్కలు ఖండించితివి. నీవు భయమును వీడి, దేవతలను తీసికొని, సేనా సహితుడవై సమరమునకు సిద్ధము కమ్ము."

శచీదేవి యొక్క పలుకులు వినిన పురంధరుడు భయభీతుడై యుద్దమునకు సమకట్టలేదు. కానీ కోపోద్రిక్త అయిన శచీదేవి మాటిమాటికీ ఆయనను ప్రేరేపించినది. అంత ఇంద్రుడు మదమత్తుడై, క్రోధోద్రిక్తుడై, శ్రీకృష్ణుని నిందించుచూ ఇట్లనియె "సుముఖీ! నీ పారిజాత వృక్షమును అపహరింపజూచిన వానిని నూరంచుల గల వజ్రాయుధము

చే నిహతుని కావించెదను." ఇట్లు పలికి ఇంద్రుడు ఐరావతమును అధిరోహించెను. ఆ కుంజరమునకు మూడు తొండములు యుండి వీపుపై ఎర్రని కంబళులు కప్పబడి యుండెను. అయ్యది చతుర్దంతములు కలిగి, తన శ్వేత ప్రభ చే హిమాలయము వలె గోచరించుచుండెను. పాదములకు స్వర్ణ సంకెలలు కట్టబడి, దేవతా పరివేష్ఠితమై యుండెను. ఆ సమయమున యమ, అగ్ని, వరుణ, మరియు సమస్త మరుద్గణములు పురంధరుని వెంట యున్నవి. ఏకాదశ రుద్రులు, ద్వాదశాదిత్యులు, అష్ఠ వసువులు, కుబేరాది లోక పాలకులు, విద్యాధర, గంధర్వ, సాధ్య, పితృగణములు, మొదలగు ముప్పది మూడు కోట్ల దేవతలు శక్రుని అనుసరించుచు సమరము నందడుగు పెట్టిరి. వారందరూ శ్రీకృష్ణుని యందు కోపము కలిగి యుద్ధ సన్నద్ధులై నిలబడిరి. ఇందు కొందరు దేవతలు ఇంద్రుడు పిలువగా, మరి కొందరు నారదుడు ప్రేరేపించగా ఏతెంచిరి. ఇంద్రుడు వజ్రహస్తుడై నిలబడెను. మిగిలిన దేవతలు పరిఘ, ఖడ్గ, గద, శూల, పరశువు తీసికొని సమరాంగణమున నిలిచిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద మందలి పారిజాతాపహరణ మను నాల్గవ అధ్యాయము సమాప్తము)

అయిదవ అధ్యాయము

(దేవరాజు మరియు దేవతలతో శ్రీ కృష్ణుని సమరము మరియు విజయము, పారిజాతమును ద్వారక యందుంచుట)

శ్రీ గర్గాచార్యులు వారు "మహారాజా! శ్రీకృష్ణ ప్రభువు ఇంద్రుని, దేవతలను యుద్ధ సన్నద్ధులగుట కాంచి, తాను ముందుగా పాంచజన్యమును పూరించెను. ఆ ధ్వని చే దిక్కులు పిక్కటిల్లెను. వెంటనే వజ్రముల వంటి బాణములు కురిపింపనారంభించెను. అపుడు దిశలు, ఆకాశము నారాచములతో నిండుట గమనించి దేవతలు సహితము బాణ వృష్ఠి కురిపింప నారంభించిరి. శ్రీకృష్ణుడు దేవతలు ప్రయోగించు బాణములను తన సాయకములతో వందలాది ముక్కలుగ లీలా పుర్వకముగ కావించుచుండెను. పాశధారి అయిన వరుణుని పాశములను సర్వభోజి అయిన గరుడుడు ఖండించెను. లోక భయంకరమయిన యముని దండమును శ్రీహరి తన గద చే క్రింద పడవైచెను. చక్ర ప్రహరణము కావించి కుబేరుని శిబికను తిలల వంటి తునకలు గావించెను. సూర్యుని క్రోధ పూర్వక దృష్ఠి చే కాంచి హతాశుని గావించెను. అగ్నిదేవుడు తన శిఖలతో ముందుకు రాగా ముకుందుడు ఆ అగ్నిని పానము చేసెను. తదనంతరము రుద్రగణములు విసిరిన శూలములను తన చక్రముతో నుగ్గు నుగ్గు గావించి, తన భుజ బలముతో వారిని తీవ్రముగ ప్రహరించి ధరాశయనుల కావించెను.

తదనంతరము విద్యాధరులు, మరుద్గణములు, సాధ్యులు శ్రీహరిపై బాణవర్షము కురిపించిరి. ఇట్లు బాణ వర్షము కురిపించుచూ ముందుకు వచ్చుచున్న దేవసేనను చూచి సత్యభామాదేవి మిక్కిలి భయకంపిత అయినది. భయపడుచున్న తన పత్నిని కాంచి అచ్యుతుడు "సత్యా! భయపడవలదు. నేను ముందుకు వచ్చుచున్న దేవసేన సమస్తమును సంహరించెదను. ఇందు సందేహము లేదు," ఈ విధముగ పలికి, తన శాంగ ధనువును ఎక్కుపెట్టి ఆ దేవతానీకము సమస్తమును సింహము తన పంజాతో నక్కలను పారద్రోలినట్లు నలు దిక్కులకు పలాయన మొనర్చునట్లు చేసెను. పిదప కంస నిఘాదనుడు కుపితుడై గరుడునితో "వినతా నందనా! నీవు రణమండలమందు యుద్ధము చేయుటలేదు" అని పలికెను. అంత గరుడుడు కుపితుడై శ్రీకృష్ణ సత్యలను తన మూపుపై నిడుకొని, తన గోళ్ళతో, రెక్కలతో దేవతా నీకమును హింసించుట నారంభించెను. గరుడుని పక్షపు దెబ్బలు తినిని దేవతలు కకావికలై పరుగులు తీసిరి. తన ముక్కుతో దేవతలను గాయపరుచుచూ, యుద్ధ భూమి అంతయు పక్షిరాజు ఎగురుట నారంభించెను.

ఇంద్ర, ఉపేంద్రలిరువురు ఒకరిపై ఒకరు జలధారల వలె నారాచములను గుప్పించుచూ రెండు జలధర మేఘముల వలె శోభిల్లిరి. ఈ సమయమున గరుడుడు ఐరావతముతో సమరము చేయుచుండెను. ఐరావతము తన దంతముల చే గరుడుని గాయపరుచుటకు యత్నించెను. గరుడుడు తన రెక్కలతో, కాళ్ళతో, గోళ్ళతో, అతి బలమయిన ముక్కుతో ఐరావతమును ఛిన్నాభిన్నము కావించెను. శ్రీకృష్ణ భగవానుడొక్కడు వజ్రధారి అయిన శచీపతి తో సహితముగ సమస్త దేవతా నీకముతో సమరము కొనసాగించు చుండెను. శ్రీకృష్ణ శక్రులిరువురు ఒకరినొకరు ఓడించుటకు తీవ్రముగ యత్నించు చుండిరి. అంత ఇంద్రుని వద్ద గల సమస్త శస్త్రాస్త్రములు నిండుకున్నవి. అంతట ఆయన తన వజ్రమును పైకెత్తెను. శ్రీకృష్ణుడు తన చక్రమును చేతిలోనికి తీసికొనెను. అంత త్రిలోకములందలి చరాచర ప్రాణికోటి హాహాకారములు కావించెను. ఇంద్రుడు విసరిన వజ్రమును మురారి తన ఎడమ చేతితో పట్టుకొనెను, కానీ తన చక్రమును ప్రయోగింప లేదు. ఆ సమయమున ఇంద్రుని వద్ద ఆయుధములు లేవు. కేశవుడు కేవలము "ఆగు" అని పలికెను.

గరుడుడు ఐరావతమును క్షతగాత్రము గావించెను. అయ్యది లజ్జితయై, భయభీతయై, వెనుకకు పరుగులెత్తినది. ఆ దృశ్యము చూచి సత్యభామ నవ్వ సాగినది. శచీదేవి, ఇంద్రుడు పరాన్ముఖుడై పరుగుదీయుట గాంచి, రోషభూయిష్టయై "దేవేశ్వరా! మీరు, దేవతలు, విశాల సేనా సహితులై ఒక్కడైన మాధవుని చేతిలో పరాజితులైరి. మీ బలపరాక్రమములు వ్యర్థములు. మీరు నిశ్శబ్దముగ ఈ రణమును తిలకింపవలసినది. నేను ముకుందుని జయించి పారిజాతమును వెనుకకు తెచ్చెదను." అంత శచీదేవి శిబికనధిరోహించి రణభూమికి ఏతెంచినది. ఆమె వెంట సమస్త దేవతలు తిరిగి సమరాంగణము ప్రవేశించిరి. శచీదేవిని చూచి శ్రీకృష్ణుడు యుద్ధవిరక్తుడాయెను. అంత సత్యభామాదేవి రోషము పూని అధరములు వణుకుచుండగా "ప్రభూ! నేను శచీదేవి తో సమరము సల్పెదను." అంత ముకుందుడు మందస్మితుడై తన సుదర్శనమును సత్యభామకిచ్చి, తాను పారిజాత వృక్షమును పట్టుకొనెను. సత్యభామా దేవి సమరావేశము తో ముందుకురాగా బ్రహ్మాండమంతయు కోలాహలము చెలరేగెను. బ్రహ్మాది దేవతలు భయభీతులైరి.

అంత ఇంద్రుని చే ప్రేరేపితుడయిన దేవ గురువు బృహస్పతి అచటికి ఏతెంచి యుద్ధ సన్నద్ధ అయిన పులోమజాత్మజను ఆపి ఇట్లనియె "శచీ! నా మాట వినుము. ఇది జాగ్రత్తగా ఆలోచించవలసిన విషయము. శ్రీకృష్ణుడు సాక్షాత్ భగవానుడు. సత్యభామ సాక్షాత్ లక్ష్మీదేవి. దేవేంద్ర వల్లభా! నీవు వారితో ఎట్లు యుద్ధము కావింతువు? ఇంద్రుని అవహేళన చేయుట మాని గృహమున కేగుము. సత్యభామకు పారాజాతమునిచ్చి సమస్త లోకములకు భయమును బాపుము.

"ఎవని భయము చే వాయువు వీచునో, అగ్ని మండునో, మృత్యువు సర్వత్రా చరించుచున్నదో, సూర్యుడు తాపము నిచ్చునో, బ్రహ్మ, రుద్ర, ఇంద్రాది దేవతలు భయభీతులగుదురో అట్టి శ్రీకృష్ణుడు నరకాసురుని వధించి ఇచటకు ఏతెంచెను. ఆయనను నీ వెరుగవు." దేవగురువు యొక్క మాటలు విని శచీదేవి లజ్జితయై, శ్రీకృష్ణ సత్యలకు నమస్కరించి, తనను తాను నిందించుకొనుచూ గృహమున కేగెను. తదుపరి లజ్జితుడై నమస్కరించుచున్న ఇంద్రుని కాంచి సత్యభామ "దేవేంద్రా! నీ చేతి నుండి వజ్రము అదృశ్యమగుటచే సిగ్గుపడవలదు. ద్వంద్వ యుద్ధమందు ఎవరో ఒకరు ఓడుట సహజము."

అంత పాకనాశనుడు "దేవీ! ఆది మధ్యాంత రహితుడయిన పరమాత్మ యందు ఈ జగత్తు అంతయు యున్నది. ఆయన నుండియే ఇది ఉత్పత్తి అయి తిరిగి లయమగుచున్నది. ఈ సృష్టి, స్థితి, సంహారములకు కారణ భూతుడయిన పరమాత్మ చేతి యందు ఓడుట సిగ్గుపడు విషయము కానేకాదు. ఎవరు సమస్త భువనములకు ఉత్పత్తి స్థానమో, ఎవరు అత్యంత సూక్ష్మమూర్తి మరియు కేవలము నిర్గుణ నిరాకారమో, నిజమునకు అనిర్వచనీయుడను శబ్దములు సహితము ఎవరిని ప్రతిపాదన చేయలేవో, ఎవరు సమస్త జ్ఞాన తత్వములను ఎరుగునో, ఆ సర్వజ్ఞుడయిన మహాత్ముడే తన స్వరూపమును తెలిసికొనగలుగును. ఇతరులెవరూ తెలియలేరు. జన్మ రహితుడు, నిత్యుడు, సనాతనుడు, స్వేచ్ఛగా జగత్తుకు ఉపకారము కోసము శరీరధారణ కావించిన మహాత్ముని ఎవరు, ఎట్లు ఓడింపగలరు?" సత్యభామ తో ఇట్లు పలికి ఇంద్రుడు నిశ్శబ్దుడయ్యెను.

అపుడు శ్రీకృష్ణ భగవానుడు మందహాసము కావించి "శక్రా! మేమే సామాన్య మానవులము. మీరు దేవరాజులు. నేను ఇచటికి వచ్చి కావించిన అపరాధమును మన్నింపుము. దేవరాజా! ఇది మీ పారిజాతము. దీనిని యోగ్యమయిన స్థలమునందు యుంచవలసినది. నేను సత్యభామ చెప్పిన మాటవిని దీనిని తీసికొన దలచితిని. మీరు నాపై ప్రహరించిన వజ్రాయుధము ఇదిగో! ఇది కేవలము మీ శస్త్రము మాత్రమే! దీనిని విరోధుల పై ప్రయోగించి వారి నివారణ కావింప వలసినది." ఇంద్రుడు " శ్రీకృష్ణా! మీరు "నేను మనుష్యుడను" అని పలికి నన్ను మోహము నందు ముంచుచున్నారు. మాకు అవగతమయినది. మీరు జగదీశ్వరులు. మేము మీ సూక్ష్మ రూపమును ఎరుగము. మీరు జగదోద్ధారకులు. గరుడధ్వజా! ఈ పారిజాతమును మీరు ద్వారకాపురికి కొనిపోవలసినది. మీరు మానవ లోకము విడుచునపుడు ఇది భూతలమున యుండదు. గోవిందా! అపుడు ఈ వృక్షరాజము స్వయముగా దేవలోకమున కేతెంచును."

ఈ వినయపూర్వకమయిన పలుకులు విని, వజ్రధారికి తన ఆయుధమునిచ్చి, దేవతలందరూ స్థుతించు చుండగా ముకుందుడు ద్వారకా పుర చేరెను. ఆయన ఆకాశము నందు ఉపస్థితుడై శంఖము పూరించెను. ఆ ధ్వని ద్వారకా వాసులందరి హృదయములందు ఆనందమును నింపెను. ఆయన గరుడుని దిగి సరాసరి సత్యభామా సహితుడై ఆమె భవనము నందు ప్రవేశించి, ఆ గృహోద్యాన వనమందు ఆ పారిజాత వృక్షమును నాటెను. ఆ వృక్షము నందు స్వర్గ పక్షులు నివసించు చుండెడివి. భ్రమరములు ఆ పుష్ప సుగంధమును ఆస్వాదించెడివి. మాధవుడు మాధవ మాసమందు ఒకే ముహూర్తము నందు వేరు వేరు భవనములందు పదహారువేల ఒక వంద మంది రాచకన్యలను ఒకేసారి వివాహము చేసికొనెను. దానితో ఆయన రాణుల సంఖ్య పదహారువేల ఒక వందా ఎనిమిది అయినది. పరిపూర్ణ తమ భగవానుడు అన్ని రూపములు ధరించి వారిని సంతోష పెట్టెను. ఆయనకు ప్రతి భార్య యందు పది మంది పుత్రులు కలిగిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వముధ ఖండమందు పారిజాత ఆగమనము
అను అయిదవ అధ్యాయము సమాప్తము)

ఆరవ అధ్యాయము

(శ్రీకృష్ణ చరిత్ర యొక్క సంక్షేప వర్ణన)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! నేను మీ ఎదుట శ్రీహరి యొక్క యశమును సంక్షేపముగ వర్ణించెదను. ఒకానొక సమయమున ముకుందుడు రుక్మిణీదేవి తో ఒక అద్భుత హాస్య వినోదము కావించెను. అనిరుద్ధుని వివాహ సమయమున ఆయన సోదరుడయిన బలరాముని ద్వారా రుక్మిణీ సోదరుడయిన రుక్మిని వధింపజేసెను. బాణాసురుని కుమార్తె ఉష ఒక స్వప్నమును గాంచి దానిని గూర్చి తన చెలి అయిన చిత్రలేఖ తో చర్చించెను. చిత్రలేఖ శ్రీహరి పౌత్రుడయిన అనిరుద్ధుని అపహరించి తెచ్చి ఉషాదేవికి సమర్పించెను. కన్యాంత:పురమున ప్రవేశించిన కారణమున బాణుడు అతనికి కారాగారవాసము విధించెను. అంత బాణాసురునితో యాదవులకు ఘోర యుద్ధము జరిగెను.

సాక్షాత్ శ్రీకృష్ణ శంకరుల మధ్య సమరము జరిగినది. ఆ సమయమున శివ జ్వరము, విష్ణు జ్వరము పరస్పరము కలహించినవి. మాహేశ్వర జ్వరము శ్రీకృష్ణుని స్థుతించినది. శ్రీకృష్ణ భగవానుడు బాణాసురుని చేతులు ఖండించి నాలుగింటిని మాత్రమే యుంచెను. అంతకు మందు బాణుడు వేయి చేతులు కలవాడు. బాణుని ప్రాణరక్షణకై పశుపతి శ్రీహరిని స్థుతించెను. అనిరుద్ధునకు ఉషాదేవి ప్రాప్తించెను.

యాదవ బాలకులకు భగవానుడు నృగ మహారాజు చరిత్ర ను వినిపించి ఆయనను ఉద్ధరించెను. ఒకానొక సందర్భమున బలరాముడు వ్రజభూమిని సందర్శించెను. చాలాకాలము తరువాత కనిపించుటచే ఆయనను చూచి గోపికలు విలపించి, పిదప స్థుతించిరి. బలరాముడు బృందావన విహారమునకై యమునా నదిని తన నాగటి చాలుతో లాగెను. శ్రీకృష్ణ భగవానుడు కాశీరాజు పౌండ్రకుని వధించెను. కాశీరాజు పుత్రులు పురశ్చరణ కావించి, ఒక భయంకర

కృత్యను సృష్టించిరి. అది ద్వారకా నగరమును ఆక్రమించుట మొదలిడెను. అంత సుదర్శనుడు దానిని దగ్ధమొనర్చి, కాశీ నగరమును సహితము కాల్చెను. రైవత పర్వత మందు బలరాముడు ద్వివిదుని సంహరించెను. దుర్యోధనాదులు సాంబుని హస్తినాపుర కారాగారమందు బంధించినపుడు బలరాముని పరాక్రమములు ప్రకటితమయినవి. ఉగ్రసేనుని రాజసూయ యజ్ఞమందు శ్రీహరి శకుని దానవుని సంహరించెను. దేవర్షి నారదుడు ద్వారక యందు శ్రీకృష్ణుని గృహ స్థోచిత లీలలను దర్శించెను.

శ్రీకృష్ణ భగవానుని దిన చర్య, బందీలయిన రాజుల ద్వారా పంపబడిన దూత ద్వారా శ్రీహరి యొక్క స్తుతి, భగవానుడు యాదవ, ఉద్ధ సహితుడై ఇంద్ర ప్రస్థమునకు ఏగుట, గిరివ్రజ పురమునందు భీమసేనుని చే జరాసంధుని వధ, జరాసంధుని పుత్రుడయిన సహదేవునికి రాజ్యాభిషేకము, బంధవిముక్తులయిన రాజుల ద్వారా శ్రీకృష్ణ స్తుతి, రాజసూయ యజ్ఞమందు శ్రీకృష్ణుని అగ్రపూజ, శిశుపాలుని వధ, దుర్యోధనుని అభిమాన ఖండన, సాళ్వ ప్రద్యుమ్నుల మధ్య ఇరువది ఏడు రోజుల యుద్ధము, శ్రీకృష్ణుని ద్వారకా గమనము, శ్రీకృష్ణుని ద్వారా శాల్వ, దంత వక్ర, విదూరథుల వధ; మొదలగునవి జరిగినవి. తదనంతరము కౌరవుల హస్తిన యందు కపట ద్యూతము కావించి భార్యా, సోదర సహితుడైన యుధిష్ఠిరుని ఓడించుట; వారు తమ తల్లిని విదురుని ఇంటి యందు యుంచి వనవాసమునకు చనుట, వారు విభిన్న వన్య ప్రదేశములందు నివసించుట, దుర్యోధనుడు రాజై ఆనందముగ రాజ్యమును పాలించుట, కానీ పాండు పుత్రులు, యుదిష్ఠిరాదులు వెడలిన పిదప జనులు వానిని అభినందింప కుండుట. వనవాసము నందున్న పాండవులను శ్రీకృష్ణ బలరాములు కలసి ధైర్యము చెప్పుట. శ్రీకృష్ణుడు ద్వారకకు ఏతెంచి ఉగ్రసేనుని సుధర్మ సభయందు కౌరవుల అరాచకములను తెలుపుట. యాదవులు విస్మితులై “అహో! ధృతరాష్ట్ర మహారాజు ఎంతపని చేసెను? ఆతడు దీనులు, దయనీయులయిన సోదర పుత్రులను కపట ద్యూతము నందు ఓడించి అధర్మ పూర్వకముగ ఇంటి నుండి గెంటెను. అధర్మ పరులయిన కౌరవులు నష్ట పోయెదరు. భగవానుడు పాండవులకు రాజ్యసంపత్తి నిచ్చును.”

గర్గాచార్యుల వారు “రాజా! తదుపరి భగవానుడు యాదవుల అభిప్రాయములు విని, సాయంకాలము గృహమునకేగి తల్లి దేవకికి ప్రమాణము లాచరించెను. దేవకీ దేవి అత్యంత ప్రేమాదరములతో ఆయనకు భోజనము నిడి ఆశీర్వదించెను. తదుపరి శ్రీకృష్ణుడు తన రాణుల భవనమునకు చని, ప్రియజనులతో పూజింపబడి అచటనే శయనించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండము నందలి గర్గ వజ్రనాభ సంవాదము నందలి శ్రీకృష్ణ చరిత్రమను ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏడవ అధ్యాయము

(నారద మహర్షి బ్రహ్మ లోకము నుండి ఏతెంచుట, ఉగ్రసేన మహారాజు ఆయనను సత్కరించుట, దేవర్షి అశ్వమేధ యజ్ఞ మహత్వమును వివరించుట, శ్రీ కృష్ణానుమతిని తీసికొని నారదుని ద్వారా అశ్వమేధ యజ్ఞ విధిని తెలిసి కొనుట)

శ్రీ గర్గాచార్యుల వారు “మహారాజా! ఒకానొక సమయమున నారదముని తుంబుర సహితుడై మహతీ వీణపై శ్రీకృష్ణ లీలలు గానము చేయుచూ బ్రహ్మ లోకము నుండి అనేక లోకములు దర్శించుచు శ్రీకృష్ణ బలరాములను దర్శించుటకు భూతలమున కేతెంచెను. ఆయన పింగళ వర్ణ జటాజూట ధారియై, శ్యామల కాంతి యుతుడై, మృగ నయనుడై, ఫాలభాగమునందు తిలకము ధరించి, పచ్చని పట్టు పీతాంబరమును కట్టుకొని, శరీరము నందు గోపీ చందనమును అలదుకొని రెండవ సూర్యుడా అన్నట్లు ప్రకాశించు చుండెను. ఆ సమయమున సుధర్మ సభయందు దేవరాజ సింహాసనమందు సుఖాసీనుడై యున్న ఉగ్రసేన మహారాజు దేవర్షి రాకను గమనించి, వెంటనే లేచి, ఆయన చరణములకు సాష్టాంగ దండ ప్రణామము లాచరించి సుఖాశీనుని కావించెను. తిరిగి విధి విధానముగ ఆయనకు పూజన మొనర్చి నారద మహర్షిని ఇట్లు ప్రశ్నించెను.

"దేవర్షీ! మీ దర్శనము చే నా జన్మ సాఫల్యము నొందినది. నా భవనము సార్ధకత నొందినది. నా తనువు, మనస్సు కృతార్ధము లైనవి. కామ క్రోధాదుల కతీతమయిన దేవర్షి శిరమణీ! మహాత్మా! మీకు నమస్కారము. మీరు వచ్చిన పని ఏమి? నన్ను ఆజ్ఞాపించ వలసినది." దేవతలను మించు దేదీప్యమాన తేజశ్శాలి అయిన నారద మహర్షి మహారాజు యొక్క వినయపూర్వక పలుకులు విని మనసున సంతసిల్లి శ్రీహరి ప్రేరితుడై ఇట్లనియె "మహారాజా! నీవు ధన్యుడవు. నీ యొక్క భక్తి భావము వలననే శ్రీకృష్ణ పరమాత్ముడు బలరామ సహితుడై ఈ భూతలమందు నివసించుచుండెను. పూర్వము నీవు నా సలహా మేరకు క్రతుశ్రేష్ఠమయిన రాజసూయమును కావించితివి. శ్రీకృష్ణ పరమాత్ముని కృపా కటాక్ష వీక్షణము చే అది నిర్విఘ్నముగ కొనసాగినది. అద్దాని వలన నీ కీర్తి ముల్లోకముల లోనూ వ్యాపించినది. రాజసూయ, అశ్వ మేధములు – ఈ రెండు యజ్ఞములు కావించుట చక్రవర్తులకు అత్యంత కఠినము. కానీ రాజేంద్రా! నీవు హరి భక్తి పరాయణుడవు. అందువల్ల ఈ రెండునూ నీకు సులభములు. ఈ రెండు యజ్ఞముల యందునూ రాజసూయమును నీవునూ, యుధిష్ఠిరుడునూ శ్రీకృష్ణ కృప వలన పూర్ణము చేయగలిగిరి.

"అశ్వమేధము సమస్త పాప హరము మరియు మోక్ష దాయకము. ద్విజులను, గోవులను, విశ్వమును నాశనము కావించిన వారు సహితము అశ్వమేధ యజ్ఞము చే పునీతులగుదురు. అందువలన యజ్ఞము లన్నింటి యందునూ అశ్వమేధమును సర్వోత్కృష్టమని పేర్కొందురు. ఎవరు అశ్వమేధములు నిరపేక్షగా, నిష్కామముగ అనుష్ఠించెదరో వారు సిద్ధులకు సహితము దుర్లభమయిన భగవానుడు గరుడ ధ్వజుని సన్నిధికి చేరుదురు." ఈ విధముగ నారద ఉగ్రసేనుల మధ్య సంభాషణము జరుగుచుండగా బలరామ సహితుడై శ్రీకృష్ణుడేతెంచెను. వెంటనే ఉగ్రసేనుడు లేచి, వారిరువురికి పూజన మొనర్చి, ఆశీనుల గావించి ఇట్లనియె "దేవదేవా! జగన్నాధా! జగదీశ్వరా! వాసుదేవా! నాదొక విన్నపము. నా పుత్రుడయిన కంసుడు అనేక క్రూర అసురులను కూడి అపరాధములు నెరుగని శిశువుల నెందరినో హత మార్చెను. గోవిందా! ఆ పాపికి ముక్తి ఎట్లు కలుగును? బాలఘాతి అయిన కంసుడు ఇపుడు ఏ లోకమున యున్నాడు? జగదీశ్వరా! వారి పాపముల చే నేను సహితము భయభీతుడ నగుచున్నాను. ఎందుకనగా పుత్రుల పాపము చే తండ్రులు సహితము నరక శిక్ష అనుభవించవలెను. అందువలన మాధవా! నేను కంసుని ఉద్ధరణకై ఏ ఉపాయము నవలంబింప వలెను? దయ చేసి తెలుపవలసినది. జగత్పతీ! నేడు నారద మహర్షి "బ్రహ్మ హత్య, విశ్వ ఘాతి, మరియు గోహత్యా పరాయణుడు సహితము అశ్వమేధా నుష్ఠానము కావించుట చే శుద్ధుడగును." అని వచించెను. అందువలన నా మనసు ఆ యజ్ఞమందు లగ్నమయినది. మీ ఆజ్ఞ అయిన ఎడల నేను ఆ యజ్ఞమును అనుష్ఠించెదను."

ఉగ్రసేనుని మాటలు వినిన శ్రీకృష్ణ భగవానుడు మిక్కిలి ప్రసన్నుడై భూతల భారహరణమును గూర్చి యోచించుచూ మనసున ఇట్లు తలచెను, "నేను అనేక మార్లు భూ భార మణగించితిని. అయిననూ అది పూర్ణము కాలేదు. ఇంకనూ భూభారము మిగిలి యన్నది. దాని నివారణము అశ్వమేధము చే పూర్ణమగును. విదూరధ వధ సమయమున "నేను ఇక యుద్ధ భూమి యందు నా చేతులతో ఎవరిని సంహరింపనని ప్రతిజ్ఞ కావించితిని. కానీ నా పుత్రులను, యదు వంశీయులను సమరము నకు పంపుదును. ఈ అశ్వమేధము కేవలము ఒక కారణము. నేను ఈ కారణమున సంపూర్ణ పృధివీ విజయమును గావించెదను." ఈ విధముగ ఆలోచించి ఉగ్రసేనుని తో ఇట్లనియె "మహారాజా! కంసుడు నా చేతిలో మరణించెను. అందువల్ల ఆతడు నిశ్చయముగ వైకుంఠ ధామమునకు అరిగి నా స్వరూపము ధరించి అచట నివసించుచుండెను. ప్రతి దినము నా దర్శనము కావించుట చే నీవునూ పాపరహితుడవు అయి యున్నావు. అయిననూ నీవు అశ్వమేధమును కావింపుము. కానీ పాపనాశనమునకూ, కంస ఉద్ధరణకు కాదు. నీ పవిత్ర యశమును విస్తరిల్లు జేయుటకు అశ్వమేధము కావింపుము."

"భూపాలా! ఈ యజ్ఞము చే భూతలమందు నీ యశము, విస్తరిల్లును." అనాయాసముగ గొప్పకర్మలు కావించు శ్రీకృష్ణ భగవానుని తో ఉగ్రసేనుడు ఇట్లనియె "మహాప్రభో! నేను యజ్ఞముల యందు శ్రేష్ఠమయిన అశ్వమేధమును కావింతును. అది మీ కృపాకటాక్షముల చే నిర్విఘ్నముగ సంపూర్తి యగును. నాకు దయచేసి ఆ యజ్ఞము యొక్క విధి విధానములు, తెలియజేయవలసినది." శ్రీకృష్ణుడు "మహారాజా! మీరు అద్దానిని నారద మహర్షిని అడుగవలసినది. ఆయన మీకు పూర్ణముగ దానికి గూర్చి వివరించును." ఉగ్రసేనుడానందభరితుడై నారదుని వంక తిరిగి "దేవర్షీ!

అశ్వమేధమునకు వలయు హయము ఎట్లుండవలెను? అందు పాల్గొను ద్విజుల సంఖ్య ఎంత? అందు దక్షిణ ఎట్లు ఈయవలెను? యజమాని అయిన వాని నియమము లేవి? ఇవన్నియు నాకు తెలుపవలసినది.”

ఉగ్రసేనుని పలుకులు విని అమిత తేజస్వి అయిన నారద మహర్షి, మందస్మితుడై ఆ మహారాజు వంక సాదరముగ చూచుచూ ఇట్లనియె, “మహారాజా! విద్వాంసులు ఈ యజ్ఞమందు పూర్ణ చంద్ర కాంతి గలిగిన గుర్రమును ఉపయోగించవలెనని నుడివిరి. దాని ముఖము ఎర్రగనూ, లేక పసుపు పచ్చగనూ యుండి చూచుటకు మనోహరముగ, సర్వాంగ సుందరముగ యుండవలెను. దాని చెవులు నల్లగనూ, నేత్రములు సుందరముగనూ యుండవలెను. చైత్రమాస పూర్ణిమ నాడు ఆ హయమును స్వేచ్ఛగా విడువవలెను. గొప్ప గొప్ప వీరులు దాని వెంట నుండి ఒక సంవత్సరము వరకూ కాపాడవలెను. ఆ హయము ఎప్పటికీ మీ నగరమునకు వచ్చునో అప్పటి వరకూ దానిని రక్షించవలెను. యజమాని అప్పటి వరకూ ధైర్యము వహించి యత్న పూర్వకముగ తన ఉద్దేశ్యము సిద్ధించు వరకూ ప్రయత్నించుచుండవలెను. ఆ అశ్వము ఎక్కడ మూత్ర పురీషములను విడుచునో అక్కడ బ్రాహ్మణుల ద్వారా యజ్ఞము కావించి ఒక వెయ్యి గోవులను దానము చేయవలెను. మీ నామము, బలపరాక్రమములు, వ్రాయబడిన ఒక బంగారు రేకును దాని ముఖము పై వ్రేలాడదీసి అన్ని చోట్లా దండోరా వేయుచూ ఇట్లు ఘోషించ వలెను. “సమస్త రాజలోకము వినవలసినది. ఈ అశ్వము నాది. ఆ శ్యామ కర్ణాశ్వమును ఎవరైననూ బలపూర్వకముగ వశము చేసికొనిన ఎడల వారిని బలపూర్వకముగ పరాజితులను కావించెదము.”

యజ్ఞారంభము నందు వేదవిదులు, సర్వశాస్త్ర విశారదులు, తపస్వులు, సత్కులీనులు అయిన ఇరువది వేల బ్రాహ్మణులను వరణము చేయవలెను. ఇపుడు ఈ యజ్ఞము నందు ఈయవలసిన దక్షిణలు గూర్చి వివరించెదను.

అశ్వమేధ యజ్ఞ దీర్ఘ దక్షిణ ఈ ప్రకారముగ యున్నది. ప్రతి ఒక్క ద్విజునకు ఒక వేయి అశ్వములు, వంద ఏనుగులు, రెండు వందల రథములు, ఒక వేయి గోవులు, ఇరువది బారువుల బంగారము ఈయవలెను. ఇది యజ్ఞ ప్రారంభ దక్షిణ. యజ్ఞ సమాప్తి అయిన పిదప అంతే దక్షిణ తిరిగి ఈయవలెను. అసిపత్రవ్రత నియమానుష్ఠానము తో బ్రహ్మ చర్య పాలనము ఒనర్చుతూ, రాత్రి పత్నీ సహితుడై భూతలమున శయనింపవలెను. ఒక సంవత్సరము అటువంటి వ్రత పాలనము అత్యావశ్యకము. దీన జనులకు భోజనము మరియు ధనము దానము చేయవలెను. ఈ విధులతో యజ్ఞము పూర్తి అగును. అసిపత్రవ్రత సహితముగ ఈ యజ్ఞము పూర్ణము కావించినచో బహు పుత్ర లాభము కూడ కలుగును. భీష్ముని వంటి కాముని జయించిన మానవుడు లేడు. అందు వలననే అందరూ ఈ అద్భుత వ్రత పాలనమొనర్ప లేరు. మహారాజా! మీ యందు ఆ కాముని జయించు శక్తి యున్న ఎడల తక్షణమే గర్గాచార్యుల వారిని రావించి, యజ్ఞారంభము చేయవలసినది.”

(శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున యజ్ఞ సంబంధ విధి వర్ణనము అను ఏడవ అధ్యాయము సమాప్తము)

ఎనిమిదవ అధ్యాయము

(యజ్ఞమునకు యోగ్యమయిన శ్యామకర్ణము గూర్చి వెదకుట)

దేవర్షి నారదుని యొక్క సుస్పష్టమయిన పలుకులు విని ఉగ్రసేన మహారాజు చకితుడై, ఇంతలోనే మందస్మితము కావించుచూ ఇట్లనియె “మహర్షీ! నేను నిశ్చయముగా అశ్వమేధమును కావింతును. మీరు మా అశ్వశాల యందు ఈ యజ్ఞమునకు యోగ్యమయిన అశ్వమును దయచేసి చూపవలసినది. మహారాజు యొక్క పలుకులు విని నారదుడు సంతోషించి తథాస్తు అని దీవించి శ్రీకృష్ణ సహితుడై అశ్వాన్వేషణమునకై అశ్వశాల కరిగి, అచట గల అనేక మనోహర

అశ్వములను గాంచెను. కొన్ని అశ్వములు ధూమ్ర, నీలి, శ్యామ, పద్మ వర్ణముల యందు మరికొన్ని పాలవలె తెల్లగను, పలాశ పుష్పముల వలె ఎఱ్ఱగనూ, కాంతి గల అనేక అశ్వములు గలవు. అవి అన్నియు మనోవేగముగ పోగల దివ్య హయములు. కొన్ని తామ్ర వర్ణములు, కొన్ని చిలుకల వలె ఆకుపచ్చనివి, కొన్ని కుసుంభ వర్ణము కలవి, కొన్ని పూర్ణ చంద్రుని వలె తెల్లనివి. వాటిని చూచి నారదుడు అశ్చర్య చకితుడై ఇట్లనియె "మహారాజా! మీ అశ్వము లన్నియు అత్యంత సుందరములు. పృధివి యందు ఇటువంటి అశ్వములు లేవనిన అతిశయోక్తి కాదు. స్వర్గ, రసాతలము లందు సహితము ఇటువంటి అశ్వములు కద్దు. శ్రీకృష్ణ కృప చే నీకు ఇటువంటి అశ్వసేన లభించినది. కానీ మీ అశ్వశాల యందు శ్యామకర్ణములు లేవు."

దేవర్షి యొక్క పలుకులు విని ఉగ్రసేనుడు దు:ఖితుడై ఇక "ఈ యజ్ఞము ఎట్లు జరుగును" అని దు:ఖించెను. అది చూచి శ్రీకృష్ణుడు మంద స్మితుడై మేఘ గంభీర ధ్వనితో ఇట్లనియె "మహారాజా! అన్ని చింతలు మాని నా అశ్వశాలకు వెళ్ళి శ్యామ కర్ణములను కాంచ వలసినది."

ఉగ్రసేనుడు నారద మహర్షి సహితుడై శ్రీకృష్ణుని అశ్వశాల కేగి అచట యజ్ఞ యోగ్యమయిన వేలాది శ్యామ కర్ణములను కాంచెను. ఆని పుచ్ఛము పచ్చగనూ, అంగకాంతి పూర్ణ చంద్రుని వలె తెల్లగ, ఉజ్వలముగ యుండి మనో వేగమును కలిగినవి గా యుండెను. వాని ముఖములు తప్తమయిని స్వర్ణము వలె మెరయుచున్నవి. ఇట్టి సర్వ శుభ లక్షణ సంపన్నములయిన దివ్యాశ్వములను చూచి, మహారాజు విస్మితుడై శ్రీకృష్ణునునకు శిరసు వంచి నమస్కరించి ఇట్లనియె.

"జగన్నాధా! నేను ఇచట అనేక శ్యామకర్ణ అశ్వములను కాంచితిని. ఆహా! మీ భక్తులకు ఈ భూమండలమున దుర్లభమయిన వస్తువు లేదు. పూర్వ కాలమందు ధృవ, ప్రహ్లాదుల మనోరధము పూర్ణమయినట్లే, నా మనోరధము కూడా పూర్ణమగును. అంత శ్రీకృష్ణ భగవానుడు "మహారాజా! మీరు నా ఆజ్ఞ చే ఈ శ్యామకర్ణములందు ఒక అశ్వమును తీసికొని వెళ్ళి మీ యజ్ఞము ప్రారంభింపవలసినది. అంత ఉగ్రసేనుడు "ప్రభూ! నేను మీ ఆజ్ఞను తప్పక ౭దల దాల్చెదను." ఈ విధముగ పలికి ఉగ్రసేనుడు శ్రీకృష్ణ నారద సహితుడై రాజసభ కేగెను. అచట తుంబుర సహిత నారదుడు వారికి వీడ్కొలు పలికి, శ్రీకృష్ణునకు నమస్కరించి, ఉగ్రసేనునకు ఆశీర్వచనములు ప్రసాదించి బ్రహ్మ లోకమునకు చనెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి శ్యామకర్ణ అశ్వ అవలోకనము అను ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

తొమ్మిదవ అధ్యాయము

(గర్గాచార్యుని ద్వారకాపురి ఆగమనము; అనిరుద్ధుడు అశ్వమేధ హయ రక్షా ప్రతిజ్ఞ స్వీకరించుట)

గర్గాచార్యుడు "మహారాజా! నారదుని గమనానంతరము ఉగ్రసేన మహారాజు నా కొరకై దూతలను పంపెను. దూతలు నా వద్దకు వచ్చి "దేవదేవా! బ్రహ్మన్! భూదేవ శిరోమణీ! దయచేసి మా పలుకులు ఆలకింపవలసినది. ద్వారకాపురి యందు శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞానుసారము మీ శిష్యుడు, బుద్ధిమంతుడు ఉగ్రసేన మహారాజు క్రతుశ్రేష్ఠమయిన అశ్వమేధమును కావింప నిశ్చయించెను. మహామునీ! ఆ యజ్ఞ మహాత్సవమునకు మీరు శీఘ్రముగ విచ్చేయ వలసినది. దూతల చే చెప్పబడిన విషయమును వినిన పిదప నేను గర్గాచలము నుండి ద్వారకా పురికి ఏగుటకు సమకట్టితిని. నృపశ్రేష్ఠా! ఆ యజ్ఞమును తిలకించుటకు నాకు కూడా మనసున మిక్కిలి కుతూహలముగ యున్నది. దూరము నుండే ఆనర్త దేశమున ద్వారకా పురి, నానా వన, ఉపవన శోభితమై యున్నది.

ద్వారకా పురి అనేక సరోవరములు, దిగుడుబావులు, పక్షులు సంకలితమై వానిచే ఆ నగరపు శోభ ఇనుమడింప

జేయబడుచున్నది. అచటి సరోవరములందు నీల, రక్త, శ్వేత, పచ్చ కమలములు అరవిరిసి యున్నవి. కదంబ, మ(్రి, తాడి, తమాల, వకుళ, నాగకేసర, పున్నాగ, కోవిదార, రావి, నేరేడు, హరసింగార, మామిడీ, గోస్థనీ, కపిత్థ, మల్లి, జాజి, ప్రియవంశ, గుల్మవంశ, సూర్యముఖి, కర్ణికార, సహస్రకందుక, అగస్త్యపుష్ప, పూగీఫల, ఏలక, లవంగ, దేవదారు మొదలగు చెట్లు, పుష్పలతలు, మరియు సుగంధ ద్రవ్యముల లతలు ఆ నగర వనములందు కోకొల్లలుగ శోభించుచున్నవి.

అంతేకాక అందు హంసలు, పావురములు, కోయిలలు, మైనాలు, చక్రవాకములు, చాతకములు, కారండవములు మొదలగు అనేక సుందర విహంగములు వైకుంఠము నుండేతెంచి అచటగల వృక్షముల పై వ్రాలి, తమ సుమధుర కంఠముతో "కృష్ణా, కృష్ణా" అని పాడుచున్నవి. ఈ విధముగ యున్న వనములను చూచుచూ నేను ముందుకు పోయి స్వర్ణ, రజిత, తామ్ర దుర్గములను కాంచితిని.

ఆ మూడు దుర్గములు వెడల్పయిన, లోతయిన, కందకములతో చుట్టియున్నవి. అనేక దివ్య వృక్ష సమన్వితమయిన రైవత పర్వతము, దానిని చుట్టియున్న అఖండ సముద్రము, మరియు మంచినీటిని ప్రసాదించు గోమతీనది, వీటన్నింటితో నిండిన ద్వారకాపురి అత్యంత రమణీయముగ యున్నది. ఆ పురమునందు మంగళమయమయిన ఉత్సవ సూచకముగ మంగళ తోరణములు కట్టబడియున్నవి. అంతేకాక ఆ పురియందు స్వర్ణ భవనములు, పుష్టిగా యున్న లోకులు, సువర్ణ జటిత అంగడులతో కూడిన విక్రయశాలలు, ధ్వజ పతాంకితమయిన మనోహర హర్మ్యములు, ఎత్తైన విష్ణు, శివ మందిరములు, దృష్టి గోచర మగుచున్నవి. పెద్ద పెద్ద శౌర్య సంపన్నులయిన యాదవ వీరులు, వేలాది విమానములు, వందలాది రహదారి కూడలులు, రంగురంగుల కలశములతో ఆ దివ్య పురి శోభించుచున్నది. విశాలమయిన రహదారులు, అశ్వ, గజ, గోశాలలు, ఇతర అన్యాన్య శాలలు, రహదారులపై చాందలరీలతో అమర్చబడిన సుందర స్కంధములతో ఆ పురము సాక్షాత్ అమరావతి వలె యున్నది.

ఆ పురము నందు తొమ్మిది లక్షల భవనములు కలవు. శ్రీకృష్ణ భగవానుని పదహారు వేల నూట ఎనిమిది దివ్య భవనముల చే ఆ పురము పరివేష్ఠితమై యున్నది. ఆ నగరపు ద్వారమందు విచ్చుకత్తులు పట్టి శూర ద్వారపాలకులు దివా రాత్రములు రక్షించు చుండిరి. ప్రతి ఇంటి యందు శ్రీకృష్ణ బలరాముల యశోగీతములు ఆలాపించుచుండిరి. ఈ విధముగ ఆ పుర శోభను వీక్షించుచూ నేను సుధర్మ సభయందు ప్రవేశించి తలసీమాలతో శ్రీకృష్ణ నామ జపము చేయుచూ నిలుచుని యుంటిని.

రాజర్షి ఉగ్రసేనుడు నన్ను చూచి అతి ప్రసన్నుడై, ఇంద్ర సింహాసనము నుండి లేచి, కోట్లాది యాదవ సహితుడై నాకు నమస్కరించి, ఆశీనుని గావించి, పూజన మొనర్చెను. సమస్త యాదవుల ఎదుట నా చరణములు కడిగి, ఆ చరణోదకమును తన శిరముపై జల్లుకుని ఇట్లనియె "నేను దేవర్షి నారదుని ముఖతా అనంత ఫలదాయకమయిన అశ్వమేధ యజ్ఞమును గూర్చి వింటిని. మీ అనుజ్ఞ చే నేను ఆ యజ్ఞమును అనుష్ఠింపదలచితిని. ఎవరి చరణ సేవ చే పూర్వకాల మందు భూపతులందరూ జగత్తును తృణ ప్రాయముగ తలచి, తమ మనోరథ మహాసాగర తరణము కావించిరో ఆ భగవానుడు, వాసుదేవుడు, శ్రీకృష్ణుడు ఇక్కడే విరాజమానుడై యున్నాడు." గర్గాచార్యుడు "మహారాజా! యాదవేశ్వరా! నీవు మిక్కిలి ఉత్తమమయిన నిర్ణయమును తీసికొంటివి. అశ్వమేధ యాగము చే మీ కీర్తి త్రిలోకముల యందును వ్యాప్తి చెందును. కానీ అశ్వరక్షణము ఎవరు కావింతురు? దీనిని నిశ్చయింపవలసినది. ఎందుకనగా భూమండలమందు ఈనాడు నీకు శత్రువులు అధికము.

ఒక పూర్ణ వర్షకాలము మీరు అసిపత్ర వ్రతామాచరించ వలసియుండును. అందువలన ఈ యజ్ఞము సుకుశల సంపన్నమగును. పూర్వ కాలమందు రాజసూయమునకు ప్రద్యుమ్న కుమారుడు సమస్త భూ మండలముపై విజయము ప్రాప్తించెను. ఈసారి అశ్వ రక్షణకు తిరిగి ఆతనినే నియుక్తుని గావించెదరా? ఈ పలుకులు విని రాజు చింతితుడై భక్తుల సమస్త దు:ఖములను దూరము కావించు శ్రీ కృష్ణ భగవానుని వంక పరికించెను. రాజు చింతామగ్నుడు కావుట కాంచి శ్రీకృష్ణుడు మందస్మితుడై ఒక తమలపాకు తో నిర్మితమయిన తాంబూలమును పట్టుకొని సభను ఉద్దేశించి ఇట్లనియె "ఓ బలవంతులారా! యుద్ధ కుశలురైన యాదవ వీరులారా! ఈ ఉగ్రసేన మహారాజు సమక్షమున నా పలుకులు వినలసినది. ఎవరు భూ మండలమందలి సమస్త రాజుల నుండి యాగాశ్వమును రక్షించి, తిరిగి తెచ్చు మహారథి, వీరాధి వీరుడు

ఎవరైన యున్న ఎడల ఈ తాంబూలమును గ్రహింపవలసినది.”

శ్రీహరి పలుకులు వినిన యాదవ వీరులందరూ అభిమాన శూన్యులై ఒకరి ముఖము ఒకరు చూచుకొనిరి. ఈ విధముగ శ్రీహరి యొక్క కరపద్మము నందు ఆ తాంబూలము ఒక ఘడియ కాలమున్నది. యోధులందరూ నిశ్శబ్దముగ యున్న సమయమున ఉషాపతి అనిరుద్ధుడు ఉగ్రసేన మహారాజుకు సమస్కరించి తాంబూలము స్వీకరించి, శ్రీకృష్ణునికి పాదాభివందనము కావించి ఇట్లనియె. జగదీశ్వరా! నేను లోకమునందలి సమస్త పృధివీ పతుల నుండి యగాశ్వమును రక్షించెదను. నేను అశ్వమును రక్షింపని ఎడల నా ప్రతిజ్ఞ వినవలసినది – క్షత్రియ, వైశ్య, శూద్రులు బ్రాహ్మణ స్త్రీతో వ్యభిచారము చేయుట చే ఎట్టి దుర్గతి ప్రాప్తించునో నిశ్చముగా అట్టి దుర్గతి నాకు ప్రాప్తించుగాక! దేవా! నేను బ్రాహ్మణుని గురువుగా భావించి అయనకు సేవ చేయని ఎడల ఎట్టి స్థితి నొందెదనో, అవశ్యము అదే స్థితిని పొందెదనుగాక!” అనిరుద్ధుని తీవ్ర ప్రతిజ్ఞను విని యాదవులందరూ ఆశ్చర్యచకితులైరి. శ్రీకృష్ణ పరమాత్మ మిక్కిలి ప్రసన్నుడాయెను. ఆయన తక్షణమే తన మనుమని శిరము పై తన దివ్య హస్తము నుంచి ఆశీర్వదించెను. అనిరుద్ధుడు సుధర్మ సభయందు చేతులు జోడించి నిలుచుండెను. అంత శ్రీహరి మేఘ గంభీర స్వరముతో “అనిరుద్ధా! నీవు ఒక సంవత్సరము అశ్వమేధ అశ్వమును సమస్త రాజుల నుండి రక్షించి తిరిగి రమ్ము.”

(శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ, వజ్రనాభ సంవాదము నందలి గర్గాచార్యుని ఆగమనమను తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

పదియవ అధ్యాయము

(ఉగ్రసేనుని సభయందు దేవతల శుభాగమనము; అనిరుద్ధుని శరీరమందు బ్రహ్మదేవుడు మరియు చంద్రుడు విలీన మగుట; రాజు రాణి సంభాషణము)

శ్రీకృష్ణుడు ఈ విధముగ పలుకుచుండగనే బ్రహ్మదేవుడు మహాదేవుని సహితుడై అచటకు ఏతెంచెను. తదుపరి ఇంద్ర, కుబేర, యమ, వరుణ, వాయు, అగ్ని, నిరుతి, చంద్రుడు మొదలగు లోకపాలురు అందరూ శ్రీకృష్ణ దర్శన లాలస తో ఏతెంచిరి. పిదప ద్వాదశాదిత్యులు, భేతాళురు, మరుద్గణములు, విశ్వదేవతలు, సిద్ధ, సాధ్య, యక్ష, గంధర్వ, కిన్నెర, కింపురుష, విద్యాధరులు, ఋషి ముని గణములు, శ్రీకృష్ణ దర్శనమున కేతెంచిరి. శ్రీకృష్ణుడు ఉగ్రసేన సహితుడై వారందరికి సముచిత ఆసనము లొసగి ఆదరించెను. దేవతా ఋషి గణములందరూ వారివారి ఆసనములందు ఆశీనులయిన పిదప లీలామానుషధారి అయిన శ్రీకృష్ణుడు వారందరినీ ప్రత్యేకముగ ప్రశంశించెను. అంత బ్రహ్మదేవుడు ఇంద్ర ప్రేరితుడై కృష్ణుని పార్శ్వ భాగమున ఆశీనుడై ఇట్లనియె “శ్రీకృష్ణా! మీ మనుమడయిన అనిరుద్ధుడు ఇంకనూ బాలకుడు. శ్యామకర్ణ అశ్వమును భూ మండల రాజుల నుండి కాపాడుట కష్టతరము. హరీ! ఈ దుష్కర కార్యమును ఈ బాలుడు ఎట్లు ఈడేర్చగలడు? అందువలన ఈతనిని ఈ కార్యమునకు పంపవలదని మనవి. ఒక వేళ మీరు పంపదలుచు కున్నచో, వానితో పాటు ప్రద్యుమ్నుని గానీ, బలరాముని గానీ, స్వయముగ మీరు గానీ వెళ్ళవలెను.” అంత శ్రీకృష్ణుడు మందస్మితుడై “అనిరుద్ధుడు హఠము చేసి వెళ్ళుచున్నాడు. ఈ విషయము నందు నా మాట వినుట లేదు. మీరు అతని వద్దకేగి నచ్చ చెప్పవలెను.” శ్రీకృష్ణుని మాటవిని బ్రహ్మదేవుడు చంద్ర భగవానుని తీసికొని అనిరుద్ధుని వద్ద కేగెను. వారిరువురు అనిరుద్ధుని చేరగనే ఆతని యందు లీనమయిరి. ఈ విషయము గమనించిన ఇంద్రాది దేవతలు విస్మితులైరి. సమస్త యాదవులు, నరేశ్వరులు, ఉగ్రసేనుడు సహితము ఆశ్చర్యచకితులై వజ్రనాభా! నీ తండ్రిని అందరూ స్తుతించిరి. ఇందువలననే అందరూ అనిరుద్ధుని పరిపూర్ణ భగవానునిగ తలచెదరు.”

తదనంతరము ఉగ్రసేనుడు సభయందు లేచి శ్రీకృష్ణ భగవానునకు అంజలి ఘటించి అశ్వమేధ యాగ కౌతుకము మనసు నందు ఉప్పొంగు చుండగా తన అంత:పుర ప్రవేశము గావించెను. అయ్యది దేవరాజు భవనమును మించిన సౌందర్యముతో ప్రకాశించుచున్నది. అచట వివిధ రత్న భూషణ విభూషిత, దాస దాసీ సేవిత, శ్వేత చామర వీచిత, శచీదేవి వంటి మనోహర రూపిణి అయిన మహారాణి రుచిమతీదేవిని ఒక పర్యంకము నందు కాంచెను.

తన భర్త అయిన యాదవేశ్వరుని చూచి ఆమె వెంటనే లేచి యథోచితముగ మహారాజును సమాదరించెను. అంత ఉగ్రసేనుడు తన పరమ ప్రియ అయిన రుచిమతిని కాంచి మేఘ గంభీర స్వరముగతో ఇట్లనెను, "ప్రియా! నేను శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞచే ఈనాడు అశ్వమేధ యాగము నారంభించుచున్నాను. ఆ మహా ప్రభుని సంకల్పము చే మానవులకు మనో వాంఛితములు సఫలమగును. మహారాజు పలికిన పలుకులు విని రాణి తన పుత్రుల నందరినీ తలచుకొని పుత్ర శోక సంతప్తయై ఇట్లనియె "నేను నా పుత్ర దర్శనమును వాంఛించుచున్నాను. నాకు దేవతలకు సహితము వాంఛితములయిన ఈ సంపదలేవియు రుచించుట లేదు. మీరు సుఖముగ యజ్ఞమును అనుష్ఠింపవలసినది. కానీ నా మనసు నందు ఆ యజ్ఞము పట్ల ఏ మాత్రము ఉత్సుకత లేదు. కానీ మహారాజా! ఈ యజ్ఞ ఫలితముగ మనకు సుందర పుత్రులు ప్రాప్తించురేని నేను తప్పని సరిగా దీనిని అనుష్ఠించెదను."

రాణి యొక్క పలుకులు విని మహారాజు ఉదాసీనుడై తిరిగి పలికెను. "భద్రా! నేను చెప్పెడి పలుకులు జాగ్రత్తగా వినుము. పుత్రుల ఎడల కోరిక మిక్కిలి దు:ఖదాయకము. దానిని వదలి సాక్షాత్ ముక్తి దాయకుడయిన శ్రీకృష్ణ పరమాత్ముని భజింపుము. మన మిరువురము వృద్ధుల మయినాము. ఇపుడు పుత్రులు ఎట్లు కలుగును? అందువలన బంధనమునకు కారణ భూతమయిన అజ్ఞాన జనిత శోకమును వీడుము. యాదవేశ్వరుడు ఈ విధమయిన విజ్ఞాన జనక ఉత్తమ విషయములు భోధించుచుండగా మహారాణి రుచిమతి తిరిగి ఇట్లనియె.

"మహారాజా! ఈ యజ్ఞము మనోవాంఛాఫల సిద్ధిని ప్రాప్తించిన ఎడల నాకు ఒక కోరిక కలదు. నా మరణించిన పుత్రుని సహితము నేను చూడదలిచితిని. ఆతనిని రప్పించ వలయును. ఒకవేళ మరణించిన వానిని తిరిగి దర్శించుట ఎట్లు అని ప్రశ్నింతురేని దాని సమాధానము కూడా నా నుండి వినవలసినది. శ్రీకృష్ణుడు మరణించిన గురుపుత్రుని బ్రతికించి గురుదక్షిణ నొసంగెను. అట్లే నేనునూ నా పుత్రుని చూడదలచు కుంటిని." అది వినిన మహారాజు నన్ను (గర్గుని), శ్రీకృష్ణుని తన అంత:పురమునకు పిలిపించి, మాకు భూరి స్వాగత సత్కారములాచరించి, పూజన కావించి తన అభిప్రాయమును వెల్లడించెను. ఉగ్రసేనుని పలుకులు విని నేను శ్రీహరిని మాట్లాడమని ప్రేరేపించితిని. అంత భగవానుడు "మహారాజా! పూర్వము మరణించిన నీ పుత్రులందరూ దివ్య దేహ ధారులై స్వర్గము నందు దేవతల వలె విరాజిల్లుచున్నారు. మీరు ధైర్యము వహించి ఈ యజ్ఞమును పరిసమాప్తి కావింపవలసినది. యజ్ఞానంతరము నేను మీ పుత్రుల దర్శనము తప్పక మీకు కావింతును."

శ్రీకృష్ణుని పలుకులు విని ఉగ్రసేనుడు అతి ప్రసన్నుడై తిరిగి వారితో కలసి సుధర్మ సభయందు ప్రవేశించెను. శ్రీకృష్ణ సహితుడయిన ఉగ్రసేనునకు దేవతలు, లోకపాలురు ప్రణామము లిడిరి. వజ్రనాభా! ఈ ఉగ్రసేనుని ఉత్తమ తపమును నేను ఎట్లు వర్ణింపగలను?" ఉగ్రసేనుడంత లజ్జితుడై, అవనిత శిరస్కుడై, వారి ముందు ఇంద్ర సింహాసనమందు కూర్చొనుటకు మనసొల్లక నుంచునే యుండెను. అంత శ్రీకృష్ణ భగవానుడు ఆయన స్థితిని గమనించి, మందస్మితుడై, ఉగ్రసేనుని హస్తమును పట్టి ఆయనను ఇంద్ర సింహాసనమందు కూర్చుండ బెట్టెను. నిష్కామభక్తి యొక్క ఫలము ఎవరు చెప్పగలరు?

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద మందలి రాజు రాణిల సంవాదము అను పదియవ అధ్యాయము సమాప్తము)

పదకొండవ అధ్యాయము

(ఋత్విక్కుల వరణము, పూజనము, శ్యామకర్ణ అశ్వమును రావించి పూజించుట, బ్రాహ్మణులకు దక్షిణ, దానము నిచ్చుట, అశ్వము యొక్క ఫాలభాగమున స్వర్ణ పత్రముపై ఉగ్రసేనుని బలపరాక్రమములు గర్గాచార్యుని చే ఉల్లేఖింపబడుట, అనిరుద్ధుని అశ్వ రక్షణకు ఆదేశించుట)

శ్రీ గర్గాచార్యులు "తదనంతరము సుధర్మ సభయందు వాసుదేవ ప్రేరితుడయిన ఉగ్రసేన మహారాజు అచటకు వచ్చిన ఋత్విక్కులకు శిరసు వంచి నమస్కరించి, వారిని సంతోషపెట్టి, వారందరినీ ఋత్విక్కులుగ వరించెను. పరాశర, వ్యాస, దేవల, చ్యవన, అసిత, శతానంద, గాలవ, యాజ్ఞవల్క్య, బృహస్పతి, అగస్త్య, వామదేవ, మైత్రేయ, లోమశ, కవి (శుక్రాచార్యుడు), నేను (గర్గుడు), క్రతు, జైమిని, వైశంపాయన, పైల, సుమంతువు, కణ్వ, భృగు, ధౌమ్య, పరశురామ, అకృతవ్రణ, మధుచ్ఛంద, వీతిహోత్ర, కవష, ఆసురీ, జాబాలి, వీరసేన, పులస్త్య, పులహ, దుర్వాసో, మరీచి, ఏకత, ద్విత, త్రిత, అంగిర, నారద, పర్వత, కపిల, జాతుకర్ణ్య, ఉతథ్య, సంవర్త, ఋష్యశృంగ, శాండిల్య, ప్రాడ్విపాక, కహోడ, సురత, మను, కచ, స్థూలశిర, మిత్రభూ, అపాంతర తమ, దత్తాత్రేయ, మహాముని మార్కండేయ, జమదగ్ని, కశ్యప, భరద్వాజ, గౌతమ, అత్రి, వశిష్ఠ, విశ్వామిత్ర, పతంజలి, కాత్యాయన, పాణిని, మరియు వాల్మీకి, మొదలగు ఋషులందరినీ యాదవేశ్వరుడు ఉగ్రసేనుడు పూజించెను. ఆ నిమంత్రితులయిన ఋత్విజులందరూ మహారాజుతో ఇట్లనిరి "దేవ దానవ వందితా! ఉగ్రసేన మహారాజా! నీవు యజ్ఞమును ఆరంభింప వలసినది. శ్రీకృష్ణ కృప చే అది అవశ్యము పూర్తి యగును." మహర్షుల యొక్క దివ్య వచనములను విని అంధక కులాధీశుడు ఉగ్రసేనుని ఇంద్రియములన్నియు సంతుష్టిని పొందినవి. ఆయన యజ్ఞ సంభారములనన్నింటినీ చేర్చెను. తదనంతరము బ్రాహ్మణులు స్వర్ణ హలము తో భూమిని దున్ని పిండారక క్షేత్ర సమీపమున విధి విధానముగ మహారాజును యజ్ఞదీక్షితుని కావించిరి. నాలుగు యోజనముల భూమిని దున్ని మహారాజు ఆ ప్రదేశమున యజ్ఞమండప నిర్మాణము కావించెను. యోని, మేఖలా సహిత కుండ నిర్మాణము కావించి, అందు విధి విధానముగ అగ్నిద్యోతనము కావించెను. వజ్రనాభా! నా మాటగా ఉగ్రసేనుడు నానారత్న విభూషితము, మరియు ధ్వజ పతాక మండితము అయిన సుందర సభామండప నిర్మాణము కావించెను.

ఆ సభామండపమును గాంచి శ్రీకృష్ణుడు తన పుత్రునితో ఇట్లనియె "ప్రద్యుమ్నా! నీవు శస్త్రధారులయిన శూరవీరులను గొని యజ్ఞాశ్వమును తోడ్కొని రమ్ము." శ్రీహరి యొక్క పలుకులు విని ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన ప్రద్యుమ్నుడు తన సోదరులయిన సాంబుడు, భానుడు మొదలగు వారిని తీసికొని అశ్వశాలకేగి అచట స్వర్ణ శృంఖలముతో బంధితమై యున్న అనేక శ్యామకర్ణముల యందు ఒక దివ్య అశ్వమును సునాయాసముగ బంధ విముక్తి గావించెను. బంధనము విడివడుట చే ఆ అశ్వము నెమ్మది నెమ్మదిగా అశ్వశాలను వీడి బయటకు వచ్చెను. ఆ అశ్వరాజము ముక్తా ఫల మాలలచే శోభించుచు మనోహరముగ యుండి, శ్వేత ఛత్ర, చామరముల తో అలంకృత మయినది. దాని ముందు వెనుక, ప్రక్కల యున్న శ్రీకృష్ణ పుత్రులు అద్దానిని దేవతలు శ్రీహరిని సేవించునట్లు సేవించుచుండిరి. అశ్వము శూర వీరులచే రక్షింప బడుచూ, భూతలమును తన గిట్టలతో నొక్కుచూ నెమ్మదిగ సభా భవనము ప్రవేశించెను. శ్యామ కర్ణమును గాంచిన మహారాజు ఉగ్రసేనుడు హర్షోల్లాసితుడై నన్ను (గర్గుని) ఆ హయమును ఆవశ్యకమయిన విధి విధానములు కావించుటకు పంపెను.

నేను రాణి రుచిమతీ సహితముగ ఉగ్రసేనుని కూర్చుండ బెట్టి, పిండారక క్షేత్రమందు ధర్మానుసారము సమస్త విధి విధానములు కావించితిని. ఉగ్రసేన మహారాజు చైత్రశుద్ధ పూర్ణిమ నాడు మృగ చర్మ ధారణ కావించి, యజ్ఞదీక్షితుడై అసి పత్ర వ్రత నియమములు స్వీకరించెను. నేను యదుకుల గురువు నగుట చే ఆ యజ్ఞము నందు, సమస్త బ్రాహ్మణులకు ఆచార్యుడుగా నియుక్తుడనైతిని. తదనంతరము శ్రీకృష్ణుని ఆజ్ఞచే సమస్త బ్రాహ్మణీకము వేద మంత్రములు ఉచ్చరించుచూ

తమతమ ఆసనములందు ఆశీనులయిరి. పిదప గణేశాది సమస్త దేవతలకు వేరువేరుగా పూజన మొనర్చి, అశ్వస్థాపన కావించి, దానిపై కేసర, చందన, పుష్పమాల, బియ్యములు పోసి, ధూప నివేదనము కావించిరి. పిదప నైవేద్యములు సమర్పించి, హారతి ఇచ్చి అశ్వమును పూజించి రాజును దానమునకై ప్రేరేపించిరి. వారి ఆదేశమును విని మహారాజు మందు నాకు ధన దానము సమర్పించెను – ఒక లక్ష గుర్రములు, ఒక వెయ్యి ఏనుగులు, రెండు వేల రథములు, ఒక లక్ష క్షీరము నిచ్చు గోవులు, వంద బారువుల సువర్ణము; ఇది అంతయు మహారాజు నాకు (గర్గునకు) దానముగ సమర్పించెను. వినుము – ప్రతి బ్రాహ్మణునకు ఒక వేయి గుర్రములు, రెండు వందల గజములు, రెండు వందల రథములు, ఇరువది బారువుల బంగారము సమర్పించెను. తదుపరి అనిమంత్రితముగ కొంత మంది బ్రాహ్మణులు ఏతెంచిరి. వారికి ఒక్కక్కరికి ఒక రథ, గజ, గోవు, ఒక బారువు సువర్ణము, ఒక హయము ప్రసాదించెను.

ఈ విధముగ భూదేవతలను దక్షిణలతో సత్కరించి, నమస్కరించి ఆనందింప జేసెను. ఈ ప్రకారముగ దానమొనర్చిన పిదప గుర్రపు నుదిటిపై ఒక స్వర్ణ పత్రము నుంచెను. ఆ పత్రము పై ఉగ్రసేనుని బల పరాక్రమములు ఈ విధముగ వ్రాయబడినవి. “చంద్ర వంశార్గతమయిన యదుకులము నందు విరాజమానుడయిన ఉగ్రసేన మహారాజు మహా పరాక్రమ వంతుడు. ఆయన ఆదేశమును ఇంద్రాది దేవతలు సహితము ఔదల దాల్చుదురు. ఆయన పరమ కృష్ణ భక్తాగ్రేసరుడు. ఆయన భక్తి చే బంధింపబడి శ్రీకృష్ణ భగవానుడు ఎల్లప్పుడూ ద్వారక యందే నివసించును. శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞచే చక్రవర్తి అయిన ఉగ్రసేన మహారాజు తన యశమును విస్తారము కావించుటకై అశ్వమేధ యాగానుష్ఠానము కావించుటకు నిశ్చయించెను. ఆయనే ఈ దివ్య మనోహర శ్యామ కర్ణాశ్వమును విడచెను. దీనికి రక్షకుడు గా శ్రీకృష్ణ పౌత్రుడు, వృక దైత్య నిఘాదనుడు, అనిరుద్ధుడు చతురంగబల సమేతుడై అనుసరించు చున్నాడు. ఈ భూతల మందు ఏఏ రాజులు కలరో, ఎవరు తమను శూర వీరులుగ తలచెదరో వారు ఈ అశ్వమును తమ స్వబలముతో ఆపెదరు గాక! ధర్మాత్ముడు అయిన అనిరుద్ధుడు తన బాహుబల పరాక్రమము చే అనాయాసముగ ఈ అశ్వమును విడిపించును. ఏ నరేశ్వరులు ఈ అశ్వమును బంధింప లేరో వారు అనిరుద్ధుని చరణములకు ప్రమాణములు సలిపి కుశలముగ వెనుకకు తిరుగవలసినది.”

ఈ స్వర్ణ పత్రము వ్రాసిన పిదప శంఖ, మృదంగ, నగారా, గోముఖాది అనేక వాద్యములు మ్రోగినవి. గంధర్వ, గణములు శ్రీకృష్ణ బలరామ చరిత్రను మనోహర గీతములుగ మలచి పాడుచుండిరి. అప్సరసలు నాట్యము సలిపిరి. తదుపరి శ్రీకృష్ణ భగవానుడు అత్యంత ప్రసన్నుడై ఉగ్రసేనుని సమక్షమున నిలిచియున్న అనిరుద్ధునకు అశ్వ సంరక్షణ బాధ్యత నొసంగెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ, వజ్రనాభ సంవాద మందలి “అశ్వ పూజనము” అను పదకొండవ అధ్యాయము సమాప్తము)

పన్నెండవ అధ్యాయము

(ఆశ్వ రక్షణకై అనిరుద్ధుని సేనాపతి గా అభిషేకించుట)

శ్రీ గర్గాచార్యులు “ తదుపరి ఉగ్రసేనుడు ద్వారకా పురి యందు శ్యామ కర్ణమును పూజనము కావించి వేద మంత్రోక్త ఉద్ఘోషల మధ్య దానిని విడచెను. ఆ అశ్వము సుధాకుండలికములు (జిలేబీలు) భుజించి, స్వర్ణ మాలా ధారియై ఆ స్థానము నుండి కదిలెను. ఆ అశ్వ రక్షణకు ఉద్యుక్తుడయిన వృక హంతకుడు అనిరుద్ధునకు అశ్వ రక్షణకై ఉగ్రసేనుడు సాదరముగ ఇట్లనియె “శ్రీకృష్ణా పౌత్రా! ప్రద్యుమ్న పుత్రా! నీవు అశ్వ రక్షణకై ఏఏ విషయములు పలికితివో, అవన్నియు శీఘ్రముగ పూర్ణము కావింపుము. తొలుత మన రాజసూయము నందు నీ తండ్రి ప్రద్యుమ్నుడు పృథివియందు విజయము నొందెను. నీవు ఆతని మహాబలశాలి మరియు శూర వీర పుత్రుడవు. నీవు దైత్య రాజయిన శకుని సోదరుడు వృకుని హతమార్చితివి. సమస్త రాజులను జయించితివి. భీష్ముని సహితము సమరము నందు సంతుష్టుని కావించితివి.

సాక్షాత్ చతుర్ముఖ బ్రహ్మదేవుడు, మరియు చంద్ర భగవానుడు ఎవని యందు విలీన మయిరో ఆతని మహిమను వర్ణించుట ఎవరి తరము? అందువలననే సమస్త ముని, ఋషి గణములు నిన్ను పరిపూర్ణునిగ వర్ణింతురు. నీవు శూర వీర సేన చే పరివేష్టితుడవై ముందుకు సాగి అశ్వమేధ హయ రక్షణ గావింపుము. బాలురను, రథ హీనులను, భయభీతులను, శరణాగతులను, దీనులను, నిద్రించువారినీ, ప్రమత్తులనూ, ఉన్మత్తులనూ, యుద్ధము నందు సంహరింప వలదు. ప్రద్యుమ్న నందనా! శ్రీకృష్ణా శీర్వాదము చే నీ మార్గము నిర్విఘ్నమగుగాక! నీవు సేన మరియు అశ్వ సహితముగ సుకుశలముగ తిరిగి రమ్ము."

మహారాజు యొక్క పలుకులు వినిన అనిరుద్ధుడు ఆయనకు నమస్కరించి అశ్వరక్షణకై చిత్తైకాగ్రత కావించెను. అంత బ్రాహ్మణ ఋత్వికులు శ్రీకృష్ణుని ఆజ్ఞచే తత్కాలము అనిరుద్ధునిచే మంత్ర పాఠ పూర్వకముగ స్నానము చేయించి, ప్రసన్న పూర్వకముగ ఆయనకు అర్చన గావించిరి. అనిరుద్ధునికి వీర తిలకము దిద్ది, విధి పూర్వకముగ బహుమతులిచ్చి యుద్ధమునకై ఒక ఖడ్గము నిచ్చిరి. శూరసేనుడు ఒక రత్నమాలను, వసుదేవుడు కుండలములను, బలరాముడు కవచమును, శ్రీకృష్ణుడు చక్రమును, ప్రద్యుమ్నుడు ఇంతకు మునుపు శ్రీకృష్ణుని చే ఈయబడిన ధనస్సును, అక్షయ తూణీరములను, ప్రసాదించెను.

శంకర భగవానుడు త్రిశూలమును, ఉద్ధవుడు కిరీటమును, దేవకుడు పీతాంబరమును, వరుణుడు నాగపాశములనూ, స్కంధుడు శక్తినీ, వాయుదేవుడు ఒక దివ్య వ్యజనము (పంఖా), యముడు తన దండమును, కుబేరుడు సువర్ణ రత్నమాలను, అర్జునుడు పరిఘను, భద్రకాళి ఒక గొప్ప గదను, సూర్యుడు ఒక దివ్య మాలను, పృథివీదేవి రెండు దివ్య యోగమయ పాదుకలను, గణేశుడు దివ్య కమలమును, అక్రూరుడు విజయదాయక మయిన దక్షిణా వర్త శంఖమును, దేవరాజు ఇంద్రుడు విశ్వకర్మ వినిర్మితమయిన, వేయి హయములు పూన్చిన, సువర్ణ సంపన్న, మనో వేగము గల వియజశీల దివ్య రథమును ప్రసాదించిరి. ఆ అదరము ఈ బ్రహ్మాండమునకు లోపల, వెలుపల కూడా పయనింప గలిగినది. మరియు వందలాది పతాక శోభితయై, కదలునపుడు మేఘ గర్జన సమానమయిన ఉద్ఘోషకావించును. ఆ సమయమున దుందుభులు, శంఖముల ధ్వని మిన్నుముట్టినది. వీణా, మృదంగ, వంశీ నాదములు మధుర రాగములలో అన్ని వైపులా వినిపించుచున్నవి. వేద మంత్రముల ఘోష సర్వత్రా వ్యాపించినది. లాజలు, పుష్పములు, మరియు ముత్యముల వర్షము కురిసినది. దేవతలు అనిరుద్ధునిపై పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద నందలి "అనిరుద్ధాభిషేకము" అను పన్నెండవ అధ్యాయము సమాప్తము)

పదమూడవ అధ్యాయము

(అనిరుద్ధుడు అంత: పురము నుండి ఆజ్ఞ తీసికొని యజ్ఞరక్షణకు బయలుదేరుట, అతనికి సహాయకుడుగ సాంబుడు దృఢ ప్రతిజ్ఞ స్వీకరించుట; లక్షణాదేవి అతనికి యుద్ధ ప్రోత్సాహము కావించుట, శ్రీకృష్ణుని సోదరులు, పుత్రులు శ్రీకృష్ణుని ఆజ్ఞను బడసి యుద్ధ సన్నద్ధులగుట; యాదవుల చతురంగ బలముల విశేష వర్ణన)

తదనంతరము గురుజనులకు నమస్కరించి అనిరుద్ధుడు దేవకీ, రోహిణీ, రుక్మిణీ, సత్య భామ మరియు ఇతర శ్రీహరి వల్లభల దీనెనలు, ఆజ్ఞ బడయుటకై అంత:పురమున కేగెను. వారి ఆజ్ఞలు బడసి తన తల్లి అయిన రతీదేవి, సవతి తల్లి అయిన రుక్మవతీ దేవి లకు ప్రణామము లాచరించి ఇట్లనియె "నేను అశ్వ రక్షణకు బయలుదేరు చున్నాను.

దీని కోసమై మహారాజు నన్ను ఆజ్ఞాపించిరి. నా వెంట అనేక యదువంశ వీరులు బయలుదేరు చున్నారు.” అనిరుద్ధుని కధనము విని ఆ మాత లిరువురు అతనిని హృదయమునకు హత్తుకొని గద్గద కంఠము తో, మిక్కిలి వినమ్రుడై యున్న తనయుని ఆశీర్వదించి, సమరము న కేగుటకు అనుమతి నిచ్చిరి. మాతలకు నమస్కరించిన పిదప అతడు తన పత్నుల భవంతులకు వీడ్కోలు పలుకుటకు ఏగెను. తమ భర్త యొక్క ఆగమనమును కాంచిన ఉష మొదలగు అనిరుద్ధుని ముగ్గురు పత్నులు ఆయనను సమాదరించిరి, కానీ విరహ సంభవము చే వారు ఉదాసులైరి. అనిరుద్ధుడు తన ప్రియ పత్నులను సమాశ్వాశించి తిరిగి రాజ సభకు ఏతెంచెను. తదుపరి యజ్ఞాశ్వ రక్షణమునకై బయలుదేరు చున్న అనిరుద్ధుని కొరకు ఋషులు, మునులు మంగళ పాఠములు చదివిరి. తదుపరి అతడు సమస్త మహర్షులకు, గురుజనులకు, ఉగ్రసేన మహారాజుకు, శూరసేన, వసుదేవ, బలరామ, శ్రీకృష్ణ, ప్రద్యుమ్న, ఇతర పూజనీయ యాదవ ప్రముఖులకు ప్రణామము లర్పించి, సమస్త నాగరికుల నుండి పూజలు అందుకొనెను. అతడు హస్తము లందు ధనుర్బాణములు ధరించి, అంగుళులకు ఉడుము చర్మము తో చేసిన తొడుగులు యుంచి, కవచ కుండల ధారియై, కాళ్ళకు జోళ్ళు ధరించి, సింహ పరాక్రముడయిన అనిరుద్ధుడు ఖడ్గ, డాలు, శిరస్త్రాణ, శక్తులను ధరించి, ఇంద్రుడు బహూకరించిన దివ్య రథమధిరోహించి పురము నుండి బయటకు వెడలెను. ఆ సమయమున వివిధ వాద్య ఘోష, వేదమంత్ర ఘోష మిన్నుముట్టెను. పురవాసులందరు ఆ యాత్రను చూచుచుండిరి. శ్రీకృష్ణుడు ఆతని తో పాటు ఉద్ధవాది మంత్రులను, భోజ, వృష్ణి, అంధక, మధు, శూరసేన, దశార్హ కులములందుత్పన్న మయిన వీర యోధులను సహితము పంపెను. ఉగ్రసేన మహారాజు ఆ యదువంశ వీరులను ఉద్దేశించి ఇట్లడిగెను. “యాదవ వీరులారా! ఈ సమరము నందు అనిరుద్ధునికి సహాయముగ ఎవరు వెళ్ళుదురు?”

ఈ పలుకులు విని జాంబవతీ నందనుడు సాంబుడు అందరూ చూచుచుండగా మహారాజునకు నమస్కరించి ఇట్లనియె “రాజేంద్రా! ఈ మహా సమరము నందు ఎల్లప్పుడూ సంసిద్ధుడనై, జాగరూతతో యుండి, అనిరుద్ధుని రక్షించి సహాయము గావింతును, నేను సమరమున ఈతని రక్షింపని ఎడల ఏకాదశ వ్రత త్యాగము కావించు మానవుడు ఏ గతి నొందునో నాకునూ అదియే గతి పట్టుగాక! గోహత్య, బ్రహ్మ హత్య, కావించిన వారికి ఏ గతి పట్టునో నాకునూ ఆ గతి పట్టు గాక?” ఈ విధముగ పలికి సాంబుడు అంత:పురమున కేగెను. అచట తన తల్లి అయిన జాంబవతికి ప్రణామములు అర్పించి తన అభిప్రాయమును వివరించెను. ఆతని పలుకులు విని తల్లి విరహ బాధితయై, తనయుని హృదయమునకు హత్తుకొని, ఆశీర్వాదము నిచ్చెను. తదనంతరము మాతలందరికీ నమస్కరించి తన పత్నీ గృహమున కేగెను. అతనిని చూడగనే శుభ లక్షణ లక్షిత అయిన లక్ష్మణ కూర్చుందుకు ఆసనము నిడి, కనుల నీరు నిండగా, కంఠము గద్గదము కాగా మాట్లాడలేక మౌనముగ యుండి పోయెను. సాంబుడు ఆమెను ఆశ్వాశించి తన అభిప్రాయమును వెల్లడించెను. ఆమె అద్దానిని విని, విరహ భావము చే ఖిన్న చిత్తయై తన పతి దేవునితో ఇట్లనియె “పతిదేవా! మీరు అశ్వమును, అనిరుద్ధుని రక్షించి తీరవలెను. ఒక వేళ యుద్ధము అవసరముయినచో తప్పక సమర మొనరించ వలెను. రణ భూమి నుండి ఎన్నడునూ విముఖులు కారాదు. మీకు వేలాది సోదరులు, వారికి మానవతులయిన భార్యలు కలరు. ఒక వేళ రణ భూమి యందు మీరు పరాజితులయిన మాట విని, వారు నా వైపు చూచి నవ్వినచో అది నా పాలిట మృత్యువగును.”

లక్ష్మణ యొక్క మాటలు వినిన సాంబుడు నవ్వి, తన ప్రాణ వల్లభతో ఇట్లనియె “భద్రా! యుద్ధ భూమి యందు త్రిలోకములు కలసి నా పై యుద్ధమునకు వచ్చిననూ నేను వారిని సంహరించెనని నీవే విందువు. ఒక వేళ శూరుడయిన సాంబుడు యుద్ధ విముఖుడు అయనేని పేద బ్రాహ్మణ నింద కావించిన పాపి అగును. ఆ దశ యందు పూర్ణ చంద్ర బింబానన వైన నీ ముఖము మరి చూడను.” ఈ విధముగ తన మొదటి భార్యను ఆశ్వాశించి, రెండవ పత్ని వద్దకు ఏగి, వారిని సహితము ఆశ్వాశించి, సుభద్రాభిమన్యులను కలసి, అపుడు బయటకు కదలెను. ధనస్సు, ఖడ్గము చేపట్టి రధారూఢుడై అనిరుద్ధుడు యున్న ఉప వనమును చేరెను. తదుపరి శ్రీకృష్ణుడు “గద ఆది తన సోదరులను, “భాను” ఆదిగా గల తన పుత్రులను కూడా పంపెను. వారందరూ శౌర్య సంపన్నులు మరియు యుద్ధ కుశలురు. వారందరూ ధనువులు ధరించి, కవచ ధారులై, చతురంగ బల సమేతులై కోట్లాది యాదవ సేనను తీసికొని నగరము వెలుపలికి వచ్చిరి.

వారందరి దివ్య రథములు, తాళ, హంస, మీన, మయూర, సింహ, పతాకములతో శోభితమై యున్నవి. ఆ రథముల అంగ ప్రత్యంగములన్నియు సువర్ణ మండితములై యున్నవి. ప్రతి రథమునకు నాలుగు హయములు పూన్చబడి, మిక్కిలి ఎత్తుగ యుండి దేవతా విమానముల వలె శోభించుచున్నవి. ఆ రథములకు పైన సూర్యుని వలె ప్రకాశించు కలశములు, లోపల ఛత్ర చామరములు, ముత్యాల పరదాలు అమర్చబడినవి. శ్రీకృష్ణ పుత్రులందరూ అటువంటి రథములధిరోహించి కుశస్థలీ పురము వెలుపలికి ఏతెంచిరి. కుంజరముల కుంభస్థలముల పై గోమూత్రము తో తడిసిన సింధూరము, కస్తూరి తో పత్ర రచన కావింపబడినది. ఆ కుంజరములు కాల, సజల భూ ధరముల వలె కానపట్టు చున్నవి. వాని గండ స్థలముల నుండి మదధారలు కారుచున్నవి. వాని తెల్లని దంతములు కమల నాళములను పోలియున్నవి. కొన్ని గజములు ఐరావత కులము నుండి ఉత్పన్నమై శ్వేత వర్ణమున యున్నవి. వానికి మూడు తొండములు, నాలుగు దంతములు, యున్నవి. వాటన్నిటినీ శ్రీకృష్ణుడు నరకాసురుని జయించి తెచ్చెను. అవన్నియు పురమునకు వెలుపలి కేతెంచెను. ఒక లక్ష ఏనుగులు మూపున ధ్వజములు ఎగురుచూ, దుంధుభులు యుంచబడెను. ఇంకొక లక్ష ఏనుగుల పై మావటులు లేకుండెను. వాటి వెనుక ఒక కోటి గజ గణము వెలువడినది. వానిపై శూర వీర యోధులు ప్రతిష్ఠితులై యుండిరి. సముద్రము నందు అటు నిటు తిరుగు పెద్ద మొసళ్ళ వలె ఆ కుంజర యూథములు ఆ సేన అంతయు అటునిటు తిరుగుచున్నవి. అవి తమ తొండములతో పొదలను పెరకి ఆకాశమున విసురుచూ, మద ధారల చే భూమిని తడుపుచూ, పద ఘట్టన చే పృధివిని కంపింప జేయుచున్నవి. తమ కుంభ స్థలములతో ఢీకొని అవి దుర్గము లనూ, భవనములనూ, గిరి శిఖరములనూ సహితము పడగొట్టగల సమర్ధత కలిగి యున్నవి. అంతేకాక ఆ మహా బలులయిన కుంజర యూథము శత్రు సైన్యమును అతలాకుతలము చేయు సమర్ధత కలిగి, స్వర్ణ సంకెలలతో బంధింపపడి సర్వ శోభాయమానముగ ప్రకాశించుచున్నవి.

తదుపరి నారదుని చే చూడబడిన అశ్వములన్నియు అశ్వశాలల నుండి బయల్వెడలినవి. అవి అన్నియు స్వర్ణ హారాలంకృతములై, ఎరుపు, తెలుపు, నలుపు రంగులలో యుండి బలమయిన కాళ్ళు కలిగి మనో వేగము కలవిగా యున్నవి. ఆ అశ్వము లన్నియు అనేక దేశముల నుండి శ్రీకృష్ణుని ఆదేశమున తేబడినవి. శ్రీకృష్ణుని అశ్వశాల యందుగల శ్యామకర్ణ హయములు వైష్ణవ మరియు శ్వేత ద్వీపముల నుండి కొనిరాబడినవి. అందు కొన్ని మయూర కాంతి, కొన్ని నీలకంఠ వర్ణము, కొన్ని విద్యుత్ రేఖల వలెను, కొన్ని గరుడుని వలెనూ పోకడ కలిగినవి. ఆ అశ్వము లన్నియు దివ్య పంఖములు (రెక్కలు) కలిగి యున్నవి.

వాని శిఖలయందు మణులు యుండి శ్వేత చామరాలంకృతములై యున్నవి. వాని పుంఛము మరియు ముఖము నుండి దివ్య ప్రభ వెలుగొందు చున్నది. ఆ సర్వాంగ సుందర హయములు వేలాది సంఖ్యలో యుండి అవన్నియు కుశస్థలీ పురము నుండి బయటకు వెడలినవి. శ్రీకృష్ణుని ఈ అశ్వములు తమ కాళ్ళతో పృధివిని స్పర్శింపవు. అవి వాయువేగ మనో వేగము కలిగి చంచల మనోహరముగ యున్నవి. ఈ హయములు పారుచున్న నీటి యందు, కఠినమయిన శిలల పైన, బురద నేలపైన కూడా ఎగురగలవు. అంతేకాక అవి సముద్రము పై సహితము నిరాధారముగ ఎగురగలవు. ఇవియేగాక మరికొన్ని హయములు మ్లేచ్ఛ దేశముల నుండి ఉత్పన్నమయినవి. అవి ప్రతి దినము వంద యోజనములు నిర్విరామముగా పరుగెత్తి తిరిగి రాగలవు. వీటన్నిటి పైననూ సాయుధులైన యోధులు కళ్ళెములు పట్టి ముందుకు సాగుచుండిరి. తదుపరి ద్వారకా నగరము నున్న పదాతిదళము కవచ, ధనుష సహిత సాయుధ యోధులు. కొందరు డాలు, ఖడ్గ పాణులై లోహ కవచములు ధరించి మదగజము వంటి శరీర సౌష్ఠవము కలిగి యుండిరి. వారు సమరము నందు ప్రత్యర్ధులపై విజయము ప్రాప్తించు శక్తి సామర్ధ్యములు కలిగి యుండిరి. ఈ విధముగ కుశస్థలీ పురము నుండి బయటకు వచ్చిన చతురంగ బల సేనా సమూహమును కాంచిన దేవ దానవ మానవులందరూ మహా విస్మయము నొందిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి యాదవ సేనా నిర్గమమను పదమూడవ అధ్యాయము సమాప్తము)

పదునాల్గవ అధ్యాయము

(అనిరుద్ధుడు సేనా సహితుడై అశ్వరక్షణకై ప్రయాణించుట, మాహిష్మతీ పురపు రాజకుమారుడు అశ్వమును బంధించుట మరియు అనిరుద్ధుడు ఇంద్ర నీల మహారాజు తో యుద్ధమునకు ఉద్యుక్తుడగుట)

శ్రీ గర్గాచార్యులు "నరేశ్వరా! తదనంతరము ఉగ్రసేన మహారాజు యొక్క ఆజ్ఞచే వసుదేవుడు, బలరాముడు, శ్రీకృష్ణుడు, ప్రద్యుమ్నుడు మొదలగు యాదవ వీరులు అనిరుద్ధుని కలియుటకు నగరము వెలుపలికి వచ్చి సేనా పరివేష్ఠితుడయిన అనిరుద్ధుని గాంచెను. శ్రీకృష్ణుడు రాజసూయ యజ్ఞారంభమున ప్రద్యుమ్నునికి ఉపదేశించిన నీతిని తిరిగి అనిరుద్ధున కుపదేశించెను. శ్రీకృష్ణ భగవానుని ఉపదేశమును వినిన అనిరుద్ధాది యాదవ వీరులందరూ అద్దానిని తమ శిరోధార్యముగ భావించిరి. తిరిగి ఆ యాదవ ప్రముఖులు శుభాశీర్వచనములు ఒసంగి రథారూఢులై పురమున కేగిరి. అనిరుద్ధుడు ఆ అశ్వము వెనుక అనేక దేశముల కేగెను. కానీ శ్రీకృష్ణుని భయమున ఏ రాజు కూడా ఆ అశ్వమును ముట్టుకొనుటకు కూడా సాహసింపదయ్యె! ఎక్కడెక్కటికి ఆ అశ్వము చనినదో, అక్కడక్కడికి అనిరుద్ధాదులు చనిరి. ఈ విధముగ అనేక రాజ్యములు అవలోకించుచూ చివరకు ఈ అశ్వము నర్మదా నదీ తీరమునున్న మాహిష్మతీ పురమున కేగెను. ఆ పురమున చాతుర్వర్ణముల ప్రజలు నివసించు చుండిరి. ఆ పురము అనేక ప్రాకారములతో దుర్గములతో నిర్మితమయినది. శంకర భగవానుని మందిరము అంబరమును చుంబించుచూ ఆ పురము యొక్క శోభను ఇనుమడింప జేయుచున్నది.

పంచ యోజన విస్తీర్ణముగల ఆ నగరమును రాజధాని గ చేసికొని ఇంద్రనీల మహారాజు పరిపాలించు చుండెను. శాల, తాళ, తమాల, వట, బిల్వ, రావి వృక్షములతో నిండిన వనములు ఆ పురము యొక్క శ్రేయోవృద్ధిని కల్పించుచున్నవి. అనేక సరోవరములు, దిగుడు బావులు మరియు వాని వద్ద కారండవాది పక్షులు కిలకిలా రావములు కావించుచూ సర్వులకు ఆహ్లాదమును కలిగించు చున్నవి. ఇటువంటి నగరము యొక్క ఉపవనము లోనికి శ్యామకర్ణము ప్రవేశించెను. ఇంద్రనీల మహారాజు పుత్రుడు నీలధ్వజుడు మహావీరుడు. అతడు వేలాది యోధులను కొని వేట నిమిత్తమై నగరము వెలుపలికి వచ్చెను. నీల ధ్వజుడు పుష్ప శోభితమయిన కదంబ వృక్ష ఛాయయందు విశ్రాంతి నొందుచున్న యాగాశ్వమును కాంచి, తన వాహనమును దిగి, క్రీడా సదృశముగ ఆ హయపు జూలును పట్టుకొని యాదవరాజు శిరోమణి అయిన ఉగ్రసేనుని పత్రమును పఠించి "ఏమి? అనిరుద్ధుడే ధనుర్ధరుడా? మనము కామా? నా తండ్రి బ్రతికి యుండగా వేరొకడు ఇటువంటి గర్వితమయిన పత్రము లిఖించునా?"

అని పలికి ఆ రాజపుత్రుడు ఆ హయమును బంధించి తన తండ్రి వద్దకు పోయి ఈ వృత్తాంత మంతయు నివేదించెను. తన పుత్రుని వాక్కులు విని శివభక్తుడు, మహాతపస్వి అయిన ఇంద్రనీలుడు ఇట్లనియె "నాయనా! తొలుత క్రతు శ్రేష్ఠమయిన రాజసూయ సమయమున నా కుబద్ధి అయిన ఒక మంత్రి మాట విని ప్రద్యుమ్నునికి కప్పము కట్టితిని. ఇపుడు తిరిగి అశ్వరక్షణకై అనిరుద్ధడేతెంచెను. ఆహా! దైవలీలలు విచిత్రములు కదా! దైవ వశమున కుంటి వాడు పర్వతములను లంఘించును. ఈ మధ్య ద్వారక యందు వృష్ణి వంశీయుల వృద్ధి కలిగినది. నేను అనిరుద్ధాది సమస్త యాదవులను పరాజితులను కావించెదను. అతనికి ఈ శ్యామకర్ణమును తిరిగి ఇవ్వను గాక ఇవ్వను. నేను భక్తి భావముతో శంకర భగవానుని సంతుష్టుని కావించితిని. ఆయన ఈ సమరమున మనకు సహకరించి రక్షించును.

ఈ విధముగ పలికి వీరుడయిన ఇంద్ర నీలుడు స్వర్ణ రజ్జువు తో ఆ అశ్వమును కట్టి సేనా సహితుడై అనిరుద్ధుని నిలువరించుటకు నిశ్చయించెను. ఇంతలో అశ్వమును పరిరక్షించుచూ వంద అక్షౌహిణీ సేన తో అనిరుద్ధుడు నర్మదా తీరమున కేతెంచెను. ఆ సేన యందు సాంబుడు, మధువు, బృహద్భానువు, చిత్రభాను, వృక, అరుణ, సంగ్రామ జిత్, సుమిత్ర, దీప్తిమాన, భాను, వేదబాహు, పుష్కర, శృతదేవ, సునందన, విరూప, చిత్రబాహు, న్యగ్రోధ, కవి మొదలగు అనేక మంది యోధులు అనిరుద్ధునకు సహాయకులు గ యుండిరి. గద, సారణ, అక్రూర, కృతవర్మ, సాత్యకి మొదలగు

వృష్ణివంశ ప్రభృతులు సహితము ఆ సేనా వాహిని యందు ఉపస్థితులై యుండిరి. వారందరూ శ్యామ కర్ణమును కానక తమ లోతాము ఇట్లనుకొనిరి "పూర్వము రాజసూయము నందు దైత్య, దేవతా, మానవ వీరులు, తొమ్మిది ఖండము లందరి నరేశ్వరులందరూ పరాజితులై బహుమతులొసగిరి కదా! ఈనాడు ఉగ్రసేనుని ప్రచండ శాశనమును తిరస్కరించి, అభిమాన వశుడై అశ్వమును హరించిన కుబద్ధి ఎవరు? వానికి ఈ అశ్వాప హరణమునకు దండన అవశ్యము కావింప వలెను."

అందరి నోటా ఇదియే మాట విని రుక్మవతీ నందనుడు అనిరుద్దుడు మంత్రి ప్రవరుడయిన ఉద్ధవునితో ఇట్లనియె "నర్మదానదీ తీరమునున్న ఈ నగరము ఎవరిది? చూడగా ఈ అశ్వము ఈ నగరము నందే బంధింపబడినది అని తెలియుచున్నది." అనిరుద్ధుని పలుకులు విని ప్రసన్నుడై ఉద్ధవుడు ఇట్లనియె "ప్రభూ! ఇది ఇంద్రనీల మహారాజు నగరము. మాహిష్మతీ పురము దీని నామధేయము. ఇక్కడ నివసించు సర్వ వర్ణముల ప్రజలు మాహేశ్వర భక్తులు."

"వృష్ణి కుల వల్లభా! పూర్వకాలమున ఈ పురాధీశుడు పన్నెండు సంవత్సరములు నర్మదానదీ తీరమున నర్మదేశ్వరుని పూజన మొనర్చెను. ఆతని షోడశోపచార పూజకు ప్రసన్నుడై మహాదేవుడు శంకరుడు ప్రత్యక్షమై వరమడుగమనగా అంత మహారాజు గద్గద ఖంటుడై "ఈశానా! మీరు సాక్షాత్ జగత్తునంతటికీ గురు స్వరూపులు. మీకు నమస్కారము. మహేశ్వరా! మీరు సకామ జీవులకు కల్పవృక్షము, మరియు దాత. మీరు మమ్ములను సదా మానవ, దైత్య, దేవతల నుండి ప్రాప్తించు భయము నుండి రక్షింప ప్రార్ధన." రాజు యొక్క వరమునకు మహేశుడు సంతోషించి "తథాస్తు" అని పలికెను. అంతర్ధానుడయ్యెను. ఈ కారణమున రుద్రవర ప్రభావము గల ఈ వీరనరేశుడు సమరము చేయక నీ అశ్వమును విడువడు."

ఉద్ధవుని పలుకులు విని అనిరుద్దుడు సమస్త యాదవులనుద్దేశించి ఇట్లనియె "మంత్రి సత్తమా! వినుము. ఏ విధముగ ఈ రాజునకు శివ రక్షణ యున్నదో అట్లే మనకు కూడా పరమేశ్వరుడయిన శ్రీకృష్ణ రక్షణ యున్నది." ఈ విధముగ పలికి శూరుడయిన ఇంద్రనీలుని జయించు యోచన కావింప దొడంగెను. అంత సమస్త యాదవ యోధులు ఖడ్గ, గద, ధనస్సు, పరిఘ మొదలగు ఆయుధములు ధరించి యుద్ధ సన్నద్దులయిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి అనిరుద్దుని ప్రయాణమను పదునాల్గవ అధ్యాయము సమాప్తము)

పదిహేనవ అధ్యాయము

(అనిరుద్ధ, సాంబుల శౌర్యము; మాహిష్మతీ నగరము పై విజయము)

ఇంద్రనీల తనూజుడు నీలధ్వజుడు మూడు అక్షౌహిణీల సేనను తీసికొని నగరము వెలుపలికి సంగరమునకై ఏతెంచెను. అతడు తన తండ్రి పలుకులు గుర్తుంచుకొని యదు వంశీయులపై అమిత క్రోధముతో యుండెను. రాకుమారుని కాంచి అనిరుద్దుడు ఒంటరిగా వానితో యుద్ధము చేయుటకు బయలుదేరెను. వారిరువురు ఇంద్ర వృత్రాసురుల వలె ఒండొరులతో సంగర మారంభించిరి. సమరాంగణ మందు అనిరుద్దుడు బాణ వర్షము కురిపింప నారంభించెను. ప్రత్యర్థుల గుండెలవసి భయభీతులై పలాయన మొనర్చ నారంభించిరి. తన సేనా వాహిని పలాయన మొనర్చుట కాంచిన నీలధ్వజుడు ధనుష్టంకారము కావించుచూ ముందుకురికెను. ఈ విధముగ అతడు సేనలు పురి కొల్పుచూ యుద్ధ సముఖుల కావించెను.

అనిరుద్దుడు శత్రు సైనికులచే ముట్టడింపబడుట కాంచిన సాంబుని రోషమున కవధులు లేవు. అతడు ఒక అక్షౌహిణీ సేనను తీసికొని టంకారము కావించుచూ అచటకు చేరెను.

అతడు ఇరువది సాయకములతో నీలధ్వజుని, అయిదు బాణములతో రథ, హయ, గజములను గాయపరచెను. సాంబుని సాయకములు తగిలి వారందరూ ధరాశయనులైరి. రథములపై రథములు, గజములపై గజములు, హయములపై హయములు, పదాతులపై పదాతులు పడి క్షణములో రణభూమి యందు రక్త సరిత పారుట మొదలిడెను. చతురంగ బలములు ఛిన్నాభిన్నమయినవి. తన సేనపై కార్చిర్చు వలె చెలరేగుచున్న యాదవులను జయింపవలెనన్న ఇచ్ఛ గల నీలధ్వజుడు ధనుస్సు పట్టుకొని బాణ వర్షము కురిపింప నారంభించెను. ఆతడు పది బాణములతో సాంబుని ధనువును కటు వాక్యములు మిత్రత్వమును ఖండించు నటుల ఖండించెను. నాలుగు బాణములతో సాంబుని హయములను, రెండు సాయకములతో ధ్వజమును, ఒక బాణముతో సాంబుని సారథిని వధించి వంద బాణములతో అతని రథమును చూర్ణము గావించెను. ఈ విధముగ సాంబుని రథ హీనుని గావించి నీలధ్వజుడు అతని సేనను గాయపరచుట నారంభించెను. ఇంతలో నీలధ్వజుని సర్వసేనయునూ తిరిగి యుద్ధ రంగమున ప్రవేశించి యాదవ సేనా వాహినిని తమ బాణ పరంపర చే నష్ట పరచుట ప్రారంభించెను. ఆ సేనల నడుమ ఘోర యుద్ధము జరుగుచుండెను. ఖడ్గ, పరిఘ, బాణ, గద, శక్తుల ద్వారా ఇరు పక్షములు ఒకరినొకరు గాయపరచుకొను చుండిరి.

సాంబుడు వేరొక రథమును అధిరోహించి సుదృఢ ధనువును గ్రహించి తిరిగి రణక్షేత్రమందు ప్రవేశించెను. ఆతడు వంద సాయకములతో నీలధ్వజుని రథమును చూర్ణము కావించి, హయముల వధించి, ధనస్సు ఖండించెను. అంత రథ హీనుడై, ధనువు ఖండింపబడిన రాకుమరుడు మిక్కిలి క్రోధుడై ఒక గదను తీసికొని సాంబుని గాయపరచుటకై ముందుకు వచ్చెను. సాంబుడు సహితము గదాయుధమును ధరించి, రథము దిగి, రణ భూమి యందు ముందునకేగెను. ఒకరినొకరు కొదమ సింహముల వలె ఎదుర్కొని ద్వంద్వ యుద్ధము సలుపసాగిరి. అంత నీలధ్వజుడు తన గదతో సాంబుని ప్రహరించెను. మదించిన మదగజము పుష్ప ఘాతమును పరిగణించనట్లు, సాంబుడు హేలగా నవ్వి తన గదతో నీలధ్వజుని ప్రహరించెను. ఆ ప్రహారము చే రాజ కుమారుడు సమరాంగణము నందు మూర్ఛితుడై పడెను. వారి సైనికులందరూ హాహాకారములు చేయుచూ పలాయన మొనర్చిరి.

తన తనయుడు మూర్ఛనొందుట చే అత్యంత క్రోధితుడై ఇంద్రనీల మహారాజు స్వయముగ కదన రంగమున అడుగు పెట్టెను. ఆయనతో రెండు అక్షౌహిణీల సేన కలదు. ఆయన వచ్చుచునే బాణ పరంపర వర్షము వలె కురిపింప నారంభించెను. ఆయన ఉద్ధతిని కాంచి శ్రీకృష్ణ పుత్రుడు, మహా బలవంతుడయిన మధువు తన సాయకములచే ఇంద్రనీలుని రథహీనుని కావించెను. ఇంతలో అర్జున ప్రియ శిష్యుడయిన సాత్యకి సమరాంగణమున కేతెంచి ఇంద్రనీలుని సేనను తన బాణ పరంపర చే ఛిన్నాభిన్నము కావించెను. తదనంతరము యాదవులు విడచిన పిదప ఇంద్ర నీలుడు తన నగరమునకేగి, దు:ఖముతో వ్యాకులుడై తన పురము నందు మహాదేవుని ప్రార్థించెను. అంత పరమశివుడు ప్రత్యక్షమై వివరమంతయు అరసెను. శివుని మాటవిని ఇంద్రనీలుడు సమస్త విషయ వృత్తాంతమును నివేదించెను. అది విని పినాక పాణి "రాజేంద్రా! నీవు శోకింపవలదు. నా వరదానము వ్యర్థము కాదు. నిన్ను దేవ, దైత్య, మానవులు నిర్జింపలేరు. కానీ ఈ శ్రీకృష్ణ పుత్రులు ఆయన అంశతో ప్రభవించిరి. వీరు దైవ, దైత్య, మానవ జాతికి చెందిన వారు కాదు. అందువలన వీరితో పరాజయమునకు నీకు దు:ఖపడవలసిన అవసరము లేదు. నీవు శ్రీకృష్ణునకు అపరాధము చేయకుండ యుండవలసినది. అందువలన నీవు వెంటనే ఇచటికి ఏతెంచిన యాదవ వీరులకు శ్యామ కర్ణమును తిరిగి ఇచ్చివేయుము. నీకు మేలు జరుగును." ఇట్లు పలికి రుద్రుడు అదృశ్యుడయ్యెను. ఆయన ముఖతా శ్రీకృష్ణుని మహాత్మ్యమును వినిన ఇంద్రనీలుడు ప్రసన్నుడై గుర్రము తో పాటు అనేక రత్నములు, వంద బారువుల సువర్ణము, ఒక వేయి బలిష్ఠమయిన మదగజములు, లక్ష అశ్వములు, పది వేల రథములు తీసికొని నీలధ్వజుని తో పాటు అనిరుద్ధుని వద్ద కేతెంచెను. ఆ మహారాజు తో పాటు పుర ప్రముఖులు కూడా యుండిరి.

వారందరితో కలసి ఇంద్రనీలుడు అనిరుద్ధుని వద్ద కేగి, నమస్కరించి, బహుమతులు అర్పించి ఇట్లనియె "శ్రీకృష్ణ, బలరామ, ప్రద్యుమ్నులకు నమస్కారము. యదుకుల తిలకుడయిన అనిరుద్ధునికి నమస్కారము. దైత్యసూదనా! నా

కర్తవ్యమును ఆదేశింపవలసినది. అంత అనిరుద్ధుడు "నృప శ్రేష్ఠా! మీరు మాతో కలసి యుండి ఈ అశ్వమును ఒక మిత్రుని అశ్వము వలె తలచి శత్రువుల నుండి రక్షింప వలసినది. అనిరుద్ధుని పలుకులు విని, ఇంద్రనీలుడు అద్దానికి సమ్మతించి, నీలధ్వజునకు పట్టము కట్టి, తాను స్వయముగా యాదవసేనతో పాటు వెళ్ళుటకు నిశ్చయించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండమున గర్గ వజ్రనాభ సంవాద నందలి అనిరుద్ధుని విజయ వర్ణనమును పదిహేనవ అధ్యాయము సమాప్తము)

పదహారవ అధ్యాయము

(చంపావతీ మహారాజు ద్వారా ఆశ్వము పట్టబడుట; యాదవులతో హేమాంగదుని సైనికుల ఘోర యుద్ధము, అనిరుద్ధ, శ్రీకృష్ణ పుత్రుల శౌర్యము చే హేమాంగదుడు పరాజితుడగుట)

శ్రీ గర్గాచార్యుల వారు "మహారాజా! అక్కడ నుండి విడిపింపబడిన పిదప యాగాశ్వము అనేక దేశములు అవలోకించుచూ ఉశీనర జనపదమునున్న చంపావతీ పురము చేరెను. హేమాంగద మహారాజు చే పరిపాలింపబడుచున్న ఆ పురము ఒక విశాల దుర్గము చే చుట్టబడి యున్నది. దాని లోపల చతుర్విధ వర్ణముల వారు నివసించుచుండిరి. ఆ పురము గగన చుంబిత భవనముల చే పరివేష్ఠింపబడి యున్నది. పుణ్యాత్ముడయిన హేమాంగద మహారాజు శూర వీరులతో పరివేష్ఠింపబడి తన పుత్రుడయిన హంసధ్వజుని తో కలసి రాజ్య పాలన కావించుచుండెను. ఆతడు యాగాశ్వమునవలోకించి, అవలీలగా పట్టుకొని స్వర్ణ శృంఖలములతో బంధించి కోటగోడ యొక్క తలుపులను, గవాక్షములను మూసి కోట గోడపై రెండు లక్షల శతఘ్నులను యుంచి యుద్ధ నిశ్చయుడయ్యెను.

హయమును కానక ముందుకు వచ్చిన అనిరుద్ధుని సేనలు ఆ నగరపు ఉపవనము నందు డేరాలు దింపి, పిదప అనిరుద్ధుడు తన మంత్రి అయిన ఉద్ధవుని ఇట్లు ప్రశ్నించెను. "మంత్రి వర్యా! ఇది ఎవరి నగరము? ఎట్లు మన హయమును హరించిరి? మీకు తెలియవచ్చు. అట్లయిన ఆలోచించి శలవీయవలసినది." అది విని బుద్ధిమంతులయందు శ్రేష్ఠుడయిన ఉద్ధవుడు ఇట్లనియె "ద్వారకా నాథా! ఇది చంపావతీ నగరము. దీనిని తన పుత్రుడయిన హంసధ్వజునితో కలసి హేమాంగద మహారాజు పరిపాలించుచుండెను. ఆతడే మన గుర్రమును హరించెను. ఈతడు సమరము చేయక హయమునీయడు. ఈతడు తన నగరము నందే యుండి శతఘ్నుల ద్వారా దీర్ఘకాలము యుద్ధము చేయును. ఈ నరేశుడు నగరము నుండి బయటక రాడు. అందువలన నరేశ్వరా! నీకు తోచినది చేయవలసినది." అనిరుద్ధుడు "సత్పురుషుల యందు శ్రేష్ఠుడా! ఉద్ధవా! మహానుభావా! దుర్గములో దాక్కొనిన ఈ శత్రువులందరినీ లోహమయములైన నారాచ సంపత్తితో అర్ధ ఘుడియలో పడవైచెదను."

అని పలికి అనిరుద్ధుడు కోట్లాది బాణములను ఆ దుర్గమును పడకొట్టుటకై వర్షము వలె కురిపించ నారంభించెను. అంధక వంశవీరులు ఆ పురము నంతయు తమ బాణ పరంపరల చే అతలాకుతలము కావించరి. హంసధ్వజాది వీరులు శంకితులైరి. అంత మహారాజు మాట చే కొందరు సాహసించి కోటగోడ నెక్కి బయటకు చూచిరి. యదుకుల వీరులు కవచధారులై, ధృఢ సంకల్పులై యుండుట కాంచి భయభీతులైరి. యదువంశ వీరులు తెరిపి నీయక బాణ వర్షము కురిపించుచునే యుండిరి.

అంత హేమాంగదుడు తన శతఘ్నులను ఉపయోగించి శాత్రవ సేనపై అగ్ని వర్షము కురిపింప నారంభించెను. వారు తమ శతఘ్ని బలము చే శాత్రవ సైన్యమును మట్టు పెట్టెదమని నిశ్చయముగ యుండిరి. ఆ సమయమున అనిరుద్ధుని సేన యందు హాహాకారములు చెలరేగినవి. శతఘ్నుల తాకిడికి సమస్త వృష్ణి వంశ వీరులు విహ్వాలులైరి. వారి అంగములు క్షత విక్షతములైనవి. అనేక మంది యోధులు యుద్ధ భూమిని విడచి పలాయన మొనర్చిరి. కొందరు

సైనికులు మూర్ఛితులైరి. కొందరు ప్రాణములరచేత బెట్టుకొని కూర్చొండిరి. కొందరు యుద్ధ భూమి యందు భస్మీభూతులయిరి. ఎందరికో కాళ్ళు, చేతులు, భుజములు తెగినవి. కొందరు శస్త్ర హీనులై క్రింద పడిరి. కొందరి కవచములు అగ్నియందు మండినవి. ఎందరో హాహాకారములు చేసిరి. ఎందరో యోధులు శ్రీకృష్ణ బలరాముల నామములు స్మరించి పిలువ నారంభించిరి. ఆ యుద్ధ భూమి యందు శతఘ్నుల ప్రహారము తిని ఎన్నియో మద గజముల శరీరములు జర్జరీ భూతములయి యుద్ధ భూమి నుండి పారిపోవుట మొదలిడినవి. అనేక హయములు శరీరములు ఛిన్నా భిన్నమగుట చే మృత్యుముఖమున ప్రవేశించినవి. రధములు చూర్ణము లయినవి. యాదవ సేన అంతయు అగ్ని ధారల చే చుట్టబడినది.

ఈ పరిస్థితి నంతయు గమనించి సంగ్రామ స్థలి యందు అనిరుద్ధుడు శ్రీకృష్ణ స్మరణము చేసెను. అందుచే ఉషా వల్లభునకు కర్తవ్యము అవగతమయినది. ఆతడు తన శాంగ ధనువును తీసికొని, అమ్ముల పొదినుండి ఒక్క బాణము తీసి పర్జన్యాస్త్రమును సంధించి విడచెను. ఆ అస్త్ర ప్రభావము చే యాదవసేన పై ఒక మేఘము ఆవహించి ఏనుగు తొండముల వంటి జలధారల చే నలువైపులా వ్యాపించుచున్న అగ్నిని సంపూర్ణముగ ఆర్పివైచెను. అంత వృష్ణి వంశీయుల అంగములు శీతలములయ్యెను. అంత వారందరూ అగ్ని భయము వీడి, అనిరుద్ధుని ప్రశంశించి, యుద్ధ సన్నద్ధులైరి. అంత అనిరుద్ధుడు యాదవుల నుద్దేశించి “నేను రెక్కల గల అశ్వము నెక్కి పుర ప్రవేశము కావించి శాత్రవ రాజు పై దాడి చేసెదను.” అంత సాంబాది వీరులందరూ ఆతనిని వెళ్ళవలదని ఆపి, తాము ఆ కార్యము సాధించుటకు ఉద్యక్తులైరి. ఇట్లు పలికి హరి పుత్రులందరూ రెక్కల గుర్రములధిరోహించి, కందకములు దాటి, చంపావతీ నగరము ప్రవేశించిరి. వారందరూ ధనుర్ధారులు, కవచధారలు, యుద్ధ కుశలురు. వారు పుర ప్రవేశము చేసినదాదిగా సర్వాకార బాణ ప్రయోగము చేసి శాత్రవ సంహారము కావించుట ఆరంభించిరి. శత్రువులు సహితము రాజాజ్ఞ చే ధనుర్ధారులై, క్రోధమూర్తులై ముందుకురికిరి. వారి సంఖ్య ఒక కోటి ఉన్నది. ఇట్లు బహు సంఖ్యలో శాత్రవ సేనా వాహిని ముందుకు వచ్చుట కాంచి సాంబుడు, మధువు, చిత్రభానుడు, వృకుడు, అరుణుడు, సంగ్రామజిత్, సుమిత్రుడు, దీప్తిమానుడు, భానుడు, వేద బాహు, పుష్కర, శృతదేవ, సునందన, విరూప, చిత్రబాహు, న్యగ్రోధ, కలి అను సమస్త శ్రీకృష్ణ పుత్రులు విజృంభించి నారాచ పరంపర కురిపింప నారంభించిరి. ఆ సమయమున రక్తపునది నగర ద్వారము గుండా బయటకు ప్రవహించుట నారంభించినది. ఇది చూచి బయటయున్న అనిరుద్ధుడు అనుమానాస్పదుడై “ఏమీ! నా పిన తండ్రులందరూ మరణించెనా ఏమి? అందువలననే ఈ ఘోర సరిత బయటకు ప్రవహించుచున్నది. ఈ నదిని నా అగ్ని శిఖల వంటి బాణములలో ఇరికించి, పర్వతముల వంటి గజేంద్రములచే ఈ పురమును ఛిన్నాభిన్నము కావించెదను. అంత అనిరుద్ధుని ఆదేశముచే, మావటుల చే ప్రేరితమై కాటుక కొండల వంటి మదగజములు తమ తొండములతో చిన్న చిన్న వృక్షములను, పొదలను పెరకి నగరముపై విసర నారంభించెను. అవి తమ పద ఘట్టనలచే నగరము నందు భూ కంపము పుట్టించెను. ఆ మహా మదగజములు తమ కుంభ స్థలముల చే ఆ నగర కోటగోడల ఢీకొనుచూ వాటిని చూర్ణము చేసెను. దుర్గము యొక్క గోడలను పడగొట్టెను. ఆ గజములు బంధించిన తలుపులు పగులగొట్టి, గవాక్షములు బ్రద్దలు చేసి పురమున ప్రవేశించి గృహములను నేలమట్టము కావించుట ప్రారంభించెను. ఆ సమయమున చంపావతీ నగరమందు హాహాకారములు చేలరేగినవి. మహారాజు తో పాటు సభికులందరూ అత్యంత ఆశ్చర్య చకితులై భయభీతులైరి. అంత రాజు పరాజయము ఒప్పుకొని, ఒక పుష్పహారము చేకొని, శ్రీకృష్ణ పుత్రుల వద్దకు ఏగి “పాహిమాం” అని శరణువేడెను.

నరేశ్వరుని ఆగమనమును గాంచిన ధర్మవేత్త సాంబుడు, తన సోదరులను, దీన జనులను హత్య గావించుచున్న కుంజరులను ఆపి ఆ మహారాజుతో ఇట్లనియె “రాజా! నీకు శుభమగు గాక! నీవు నా హయమును గొని అనిరుద్ధుని కడకేగుము. నీకు శుభమగును.” సాంబుని పలుకులు విని, శ్యామకర్ణమును గైకొని హరి పుత్రుల సహితుడై నగరము వెలుపలి కేతెంచి యాగాశ్వమును, దానితో పాటు ఒక కోటి స్వర్ణ ముద్రలు అనిరుద్ధుని కర్పించెను. అంత నీతివేత్త, దీన వత్సలుడు అయిన అనిరుద్ధుడు పుష్పమాల తో బంధింపబడిన ఆ మహారాజు రెండు చేతులు విడిపించి “నృప శ్రేష్ఠా! నీవు నాతో కలసి వచ్చి శత్రురాజుల నుండి శ్రీ కృష్ణ ప్రసన్నత కొరకై ఈ హయమును రక్షింపవలసినది.” అనిరుద్ధుని పలుకులు విని హేమాంగదుడు తన పుత్రునకు రాజ్యాభిషేకము కావించి ప్రసన్నుడై అనిరుద్ధునితో బయలు దేరెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండాగ్గతమయిన చంపావతీ విజయ వర్ణనమను పదహారవ అధ్యాయము సమాప్తము)

పదిహేడవ అధ్యాయము

(స్త్రీ రాజ్యము పై విజయము, రాణి సురూప అనిరుద్ధుని పత్నియై ద్వారకకు ఏగుట)

గర్గాచార్యులవారు “మహారాజా! అక్కడి నుండి విడిపింపబడి ఉజ్వల అంగములు కల శ్యామకర్ణము యాదవ వీరుల సహితయై ఉశీనర జనపదమందలి అనేక దేశములు చూచుచూ నెమ్మదిగ బయటకేతెంచెను. ఆ అశ్వము ప్రతి ఒక రాజ్యము నందు ప్రవేశించినది. అనేక మంది రాజులు అద్దానిని పట్టి తిరిగి విడచి వైచిరి. ఇంద్రనీల, హేమాంగదులు పరాజితులైన వార్త విని చాల మంది నరేశ్వరులు ఆ అశ్వమును పట్టుకొనుటకు కూడా సాహసించలేదు. నృపశ్రేష్ఠా! అనేక వీర విహీన రాజ్యములు అవలోకించుచూ శ్యామకర్ణము స్త్రీ రాజ్యమున ప్రవేశించెను. అచట సురూప అను రాజకన్య రాజ్యము నేలు చుండెను. అక్కడ పురుష రాజులెవ్వరూ జీవించరని నానుడి. ఆ దేశము నందు ఏ పురుషుడైననూ ఒక స్త్రీని చేపట్టి కామ భావనతో ఆమెను అనుభవించినచో అతడు ఒక సంవత్సరము నందు మరణించును. స్త్రీ రాజ్యము నందు పూవులతో నిండిన ఒక వనము కలదు. ఏలక, లవంగ, లతలు అందు అన్ని వైపులా అలముకొని మధుర సుగంధమును వెదజల్లు చున్నవి. అశ్వము ఆ వనము ప్రవేశించి, ఒక చింత చెట్టు ఛాయయందు విశ్రమించెను.

ఆ అశ్వమును అచటి స్త్రీలు మరియు చాతుర్వర్ణములు వారు చూచిరి. ఈ వృత్తాంతమును వినిన రాణి కోట్లాది స్త్రీ గణము వెంటరాగా, ఛత్రచామర విరాజితమయిన ఒక తేరునందు ఆశీనయై ఆ అశ్వమును చూచుటకేతెంచెను. ఆ హయమును గాంచి, దాని ముఖమున బంధింపబడిన పత్రమును నవలోకించి, మిక్కిలి రోష భూయిష్ఠయై గుఱ్ఱమును బంధించి కదనమునకు నిశ్చయించెను. అనేక మంది స్త్రీలు కవచధారులై రథ, గజ, హయముల నధిరోహించి సమరమున కేతెంచి నారాచములు కురిపింపనారంభించిరి. అనిరుద్ధుడు హేమాంగదుని గాంచి “మహారాజా! ఈ స్త్రీలు ఎవరు? ఏ ఉపాయము చే మనకు కళ్యాణ మగును? విస్తారముగ వివరింప వలసినది.” హేమాంగదుడు “నృపేశ్వరా! ఇచ్చట రాణియే రాజ్యము నేలును. ఎందుకనగా రాజు ఇచట జీవింప జాలడు. అందువలన ఈ స్త్రీలు మన హయమును హరించి సమరమునకు సన్నద్ధలై ఏతెంచిరి.” అతి విని అనిరుద్ధుడు “ఇచట రాజు ఎందుకు మరణించును?” ఎందుకు రాణియే పరిపాలించును. మీకు సమస్తము తెలియును. దయచేసి తెలుపవలసినది.” అనిరుద్ధుని పలుకులు విని హేమాంగదుడు తన గురువయిన యాజ్ఞవల్క్యుని తలంచి, ఆయన పాదార విందములకు నమస్కరించి ఇట్లనియె “యాదవేంద్రా! ఈ వృత్తాంతమును తొలుత నేను చంపావతీ నగరమున యాజ్ఞ వల్క్యుని చే చెప్పగా వింటిని. జాగ్రత్తగా వినుము.”

ఒకనాటి మాట! ఆ సమయము సత్యయుగము. ఈ దేశమును “నారీపాలుడు” అను విఖ్యాతుడగు మహారాజు పరిపాలించుచుండెను. ఆయన సింహళ ద్వీప వాసిని అయిన “మోహిని” అను యువతిని వివాహమాడెను. ఆమె పద్మినీ నాయిక. పూర్ణ చంద్ర నిభానన; మరాళ గతి కలది. ఆమె సౌందర్య మోహమున పడి రాజు దివా రాత్రములు మరచెను. ఆమె తో రమించుచూ అనేక సంవత్సరములు గడచినవి. కామ మోహితుడగుట చే అతడు ప్రజలకు సహితము న్యాయము చేయని వాడయ్యెను. ఆ సమయమున ప్రజానీకమంతయు దు:ఖ సంద్రమున మునిగిరి. ప్రజలు పరస్పరము కలహించుచూ, దేశము వినాశమగుట గమనించిన రాణి మోహినీ దేవి రాజ్య పాలన బాధ్యత తాను స్వీకరించి రాచ కార్యములు సంభాళింప మొదలిడెను,. ఒకనాడు ఆ మహారాజును కలియుటకై అష్టావక్ర మహర్షి ఏతెంచెను. రాజు కామాసక్తుడై, ఆ వచ్చిన మహానుభావుని ఆదరింపక “ఈ కురూపి ఇచటకేట్లేతెంచెను?” అని ప్రశ్నించెను. అంత ముని క్రుద్ధుడై “ఓరీ! మూర్ఖ నపుంసకా! నీవు స్త్రీ లోలుడవై మునులను అవమానించుచున్నావు. నీ దేశమందు ఎల్లప్పుడూ స్త్రీలే

రాజ్యమేలు గాక! ఈ రాజ్యము నందు పురుష రాజులు జీవించరు. నీవు ఇప్పుడే ఈ రాజ భవనము నుండి బయటకు పొమ్ము. ఈ రాజ్యమున పురుషుడు ఒక స్త్రీని పొంది ప్రతి దినము ఆమెను భోగించిన ఎడల ఆతడు ఒక సంవత్సరము లోపల మరణించును." ఈ విధముగ పలికి అష్టావక్రుడు తన ఆశ్రమమునకు చనెను.

ముని యొక్క శాపము చే రాజు నపుంసకుడై "ఈ దుర్దశ ముని శాపము చే జరిగినదని" వ్యాకులుడై, తనను తానే ఈ విధముగ నిందిపదొడంగెను. "ఆహా! స్త్రీలకు వశీభూతుడనై, మందభాగ్యుడనైన నేను ఏల ఇట్లు ప్రవర్తిల్లితిని? మునుల పూజ కావింపక నరక మార్గమున పడితిని. దుష్ఠ పాపాత్ముడనైన నాపై యమ దూతల దృష్ఠి పడినది. నేను వైతరణి యందు పడెదను. ఈ దశ యందు నన్ను ఎవరు కాపాడెదరు?" ఇట్లు తలచి రాజు ఇల్లు విడచి వనము నందు తిరుగుచు, పశ్చాత్తాపము నొంది, విష్ణుభక్తుడై, నిరంతరము విష్ణునామ సంకీర్తన మొనర్చి వైకుంఠ ప్రాప్తి నొందెను. ఆ శాప వశమున ఇచట పురుషులు రాజ్యము చేయరు. కేవలము స్త్రీలు శాశనము చేసెదరు. ఇందు సందియము లేదు."

అనిరుద్దుడు, హేమాంగదుడు ఇట్లు సంభాషించుచుండగా క్రోధ పూర్వకులైన స్త్రీ సైన్యము వారిపై శర వర్షము కురిపింపసాగినది. ఆ స్త్రీలను చూచి అనిరుద్దుడు విస్మితుడై "నేను స్త్రీలతో ఎట్లు యుద్ధము చేయుదును?" అను సంశయము నందు పడెను. అంత మండలేశ్వరి అయిన సురూప తన సేనా వాహినితో అతని ఎదుటకు ఏతెంచి ఇట్లనియె "ఓ! వీర శిరోమణీ! రణ భూమి యందు నిలువుము. నీవు గొప్ప సేనతో ఏతెంచితివి. అయిననూ ఏల వ్యర్థముగ ఆలోచనలో పడితివి? నేన సమరాంగణము నందు వృష్ణి వంశీయలనందరినీ పరాజితుల కావించి వారిని నా పెంపుడు జంతువులుగ మార్చెదను. ఎందుకనగా నేను నిన్ను చూచి మదన జ్వర పీడితనైతిని.

ఆ మాటలు విని వాక్చతురుడయిన అనిరుద్దుడు "రాణీ! నీవు దేవ దేవేశ్వరుడయిన శ్రీకృష్ణుని అశ్వమును హరించితివి. నీవు స్వయముగ ఆ అశ్వమును తిరిగి అప్పగించుము. నీవు ఎవరి స్మరణ మాత్రమున మానవులు కృతకృత్యులగుదురో, అట్టి శ్రీకృష్ణ భగవానుని దర్శనము వలన ఎట్టి మహాఫలము లభించునో నీకు తెలియును గదా! అందువలన నీవు ద్వారకకు వెళ్ళి ఆ సర్వేశ్వరుని దర్శనము కావింపుము." అంత సురూప తన పూర్వ జన్మ స్మృతి కలిగి అనిరుద్దునితో ఇట్లనియె "దేవా! నేను పూర్వ జన్మమున ఒక ప్రసిద్ధ అప్సరసను. మోహిని నామధేయము. నా అంగములు స్వాభావికముగ పద్మ సుగంధ భరితములై, కమలదళ నేత్రనై, యుండెడిదానను. ఒకనాడు పద్మయోని సంభవుడు, చతుర్ముఖ బ్రహ్మదేవుడు హంసారూఢుడై ఎక్కడికో వెళ్ళుచుండెను. నేను ఆయన వద్ద కేగి నన్ను స్వీకరింపమని కోరితిని. బ్రహ్మ నన్ను స్వీకరింప లేదు. నేను ఆయనపై కోపించి కుకుద్మతీ నదీ తీరమున కేగి తీవ్ర తపమాచరించితిని. ఆ తపస్సు చే బ్రహ్మ సంతుష్టుడై వా వద్దకు వచ్చి వరము కోరుకొనమనెను. నేను "దేవదావా! మీకు నమస్కారము. నేను మిమ్ము శరణు జొచ్చు చున్నాను. మీరు నన్ను స్వీకరింపవలసినది. లేని యెడల నేను ఈ క్షణము ఈ క్షీణ శరీరమును త్యజించెదను." అంత బ్రహ్మ దేవుడు "భామినీ! శోకింపవలదు. నీ మనోరథము వేరొక జన్మమందు సఫలమగును. ఆ సమయమున నా నామము "అనిరుద్దు"డగును. ఆ సమయమున నీవు స్త్రీ రాజ్యమునకు రాణి వగుదువు. నా మాట సత్యము." పిదప నేను జన్మమొందితిని. యాదవ శ్రేష్ఠా! మీరు సాక్షాత్ బ్రహ్మదేవులే! మీరు నా కొరకే ఇచట కేతెంచిరి. సురూప యొక్క కథనము వినిన సమస్త యాదవ సేన చకితులైరి. అంత ధర్మాత్ముడయిన అనిరుద్దుడు నిర్మల మనసుతో ఇట్లనియె "భద్రా! నీవు ద్వారకకు వెళ్ళుము. నేన నా దండయాత్రానంతరము తిరిగి వచ్చి, నా ప్రియతమగ పరిణయమాడుదును." తదనంతరము సురూప తన మంత్రిణి అయిన ప్రమీలకు రాజ్యాధికారము నిచ్చి అశ్వమును అనిరుద్దునకు సమర్పించి తాను ద్వారకకు పయనమయ్యెను.

(శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి స్త్రీ రాజ్యముపై విజయమను పదిహేడవ అధ్యాయము సమాప్తము)

పద్ధెనిమిదవ అధ్యాయము

(భీషణుడను దానవుని ద్వారా అశ్వము అపహరింప బడుట; యాదవ వీరులు విమానము ద్వారా ఉపలంకకు వెళ్ళుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! ఈ విధముగ స్త్రీ రాజ్యము నుండి విడిపింపబడి, దుగ్ధసమాన ఉజ్వల కాంతి గల యాగాశ్వము నెమ్మదిగ పయనించుచూ సింహళ ద్వీప సమీపమున కేగెను. అచట ఆ జవనాశ్వము ఫల పుష్ప శోభితము, సుజల భరితము అయిన ఒక గొప్ప జలాశయమును కాంచెను. అంత ఆ అశ్వము తనకు తాను ఆ జలాశయమునకు చని జలపానము కావించెను. ఆ సరోవర పరిశరమున గల భీషణుడు అను రాక్షసుడు ఆ హయమును పట్టుకొనెను. ఆ సమయమున సమస్త యాదవసేన అచటకు చేరి "అరె! నేవెవడవు? సింహపు మేతను నక్క హరించినట్లు యాదవేంద్రుడయిన ఉగ్రసేనుని అశ్వమును నీవు తీసికొనుచున్నావు. ధూర్తుడా! నిలువుము. యుద్ధము చేయము. నిన్ను సమరమున చంపి ఈ హయమును విముక్తము కావించెదము. సోదర సహితులైన శకుని, నరకాసుర కళంకాది సమస్త రాక్షసులు మా చేతిలో హతశేషులయిరి. నీవు తృణ ప్రాయుడవు. హయమును వదలి పొమ్ము. లేనిచో మా చేతితో మరణము నొందెదవు."

వారి భాషణము విని దేవతలను సహితము భయ భీతుల కావించు భీషణుడు ఖడ్గ, శూల, గదాయుధములు ధరించి, కవచము బూని వారితో ఇట్లనియె "ఓరీ! మీరు నన్నెట్లు ఎదిరించగలరు? మానవులు మా భోజనము. తొలుత యాదవ రాజు విశ్వజిత్ యజ్ఞము కావించినపుడు నేను నాతోడి రాక్షసులను తెచ్చుటకు లంకకు పోయితిని. నేను తిరిగి వచ్చు సమయమునకు నారద మహర్షి యజ్ఞము పూర్తి కావచ్చినదని తెలిపెను. మీ ఈ అశ్వమేధ యజ్ఞము వృధా ప్రయత్నము. మీలో నా నుండి యాగాశ్వమును విడిపించు యోధుడు కలడా! లేకున్న ఈ ప్రయత్నము వీడి వెనుకకు వెళ్ళవలసినది. లేకున్న నా నాలుగు లక్షల అనుయాయులు మిమ్ములను నమిలి మ్రింగుదురు. ఇక్కడికి పన్నెండు యోజనముల దూరమున, సముద్ర మధ్యమున ఉపలంక యను నా పురము యున్నది. ఎట్లు భోగవతీ నగరము సర్పభూయిష్ఠమై యుండునో, అట్లే ఉపలంక అంతయు నిశాచర మయము." ఇట్లు పలికి భీషణుడు ఆకాశమార్గమున ఆ అశ్వమును తీసికొని తన నగరమునకు చనెను. సమస్త యాదవులు శోక సంద్రమున మునిగిరి. అనిరుద్ధుడు "భోజరాజాశ్వమును మనము ఎట్లు విడిపించెదము?" అని ప్రశ్నించెను. అది వినిన నీతికుశలురు అయిన సాంబుడు మొదలగువారు "మహారాజా! చింతను వీడుము. మన వద్ద రెక్కలు గల అశ్వములు, విమానములు, అస్త్రములు, రెండు లోకములు జయించు మహా వీరులు కలరు. మేముండగా నీకు చింతఏల?"

"మనమందరము అశ్వములపై వెళ్ళెదము. లేని ఎడల సముద్రముపై బాణములతో వంతెన కట్టి పోయెదము. లేదా విష్ణుదత్తమయిన విమానము లో వెళ్ళి వారిని ఆక్రమించెదము." అంత అనిరుద్ధుడు మంత్రి ప్రవరుడయిన ఉద్ధవుని పిలచి ఇట్లనియె "మంత్రి వర్యా! శ్యామ కర్ణము మన చేతుల నుండి జారినది. భగవానుడు మీ ఆదేశానుసారముగ కావింపమని ఆదేశించెను. మా పిన తండ్రుల పలుకులు మీరు కూడా వినియున్నారు. మీ అభిప్రాయమేమి?" అనిరుద్ధుని పలుకులు విని ఉద్ధవుడు లజ్జితుడై "నాయనా! నేను శ్రీకృష్ణునకు విశేషించి ఆయన పుత్ర పౌత్రులకు దాసుడను. నిరంతరము వారి ఆజ్ఞకు బద్ధుడనైన సేవకుడను. వారి ఇచ్ఛ, నీ ఇచ్ఛ ఎట్లున్నదో అదియే కావింపుము. నిశ్చయముగ అది సఫలమగును." అనిరుద్ధుడు "యాదవేశ్వరా! నేను విష్ణుదత్తమయిన విమానమునందు పది అక్షౌహిణీ సేన తీసికొని దైత్య నగరముపై దండెత్తెదను. సారణ, కృత వర్మ, సాత్యకిలు ఇచట యుండి ఈ సేనా రక్షణ బాధ్యత స్వీకరింప వలసినది." ఈ విధముగ పలికి అనిరుద్ధుడు తన పదునెనిమిది మంది పినతండ్రులను, గద, ఉద్ధవ సహితుడై పది అక్షౌహిణీ సేనతో సూర్యతుల్యమయిన విష్ణు దత్త విమానము నందు ఉపలంక పై జైత్ర యాత్రకు బయలుదేరెను. ఆ యోధులు ఎక్కిన విమానము పూర్వకాలమందు శ్రీ సీతారాములు కపి సహితుడై ఎక్కి పయనించిన పుష్పకము వలె శోభిల్లెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాద నందలి విమానారోహణము అను పదునెనిమిదవ అధ్యాయము సమాప్తము)

పంతొమ్మిదవ అధ్యాయము

(యాదవ నిశాచరుల ఘోర యుద్ధము; అనిరుద్ధ భీషణుల మూర్ఛ మరియు చేతన. రణభూమి యందు బకుని ఆగమనము)

శ్రీ గర్గాచార్యుడు "మహారాజా! తదనంతరము రుక్మవతీ కుమారుడయిన అనిరుద్ధుడు తన విశాల సేనా సహితుడై విమానము ద్వారా పయనించి ఉపలంక చేరెను. అనిరుద్ధుడు విష సర్పముల వంటి విషయుక్త నారాచములను ప్రయోగించి ఆ నగరపు వన, ఉపవనములను ధ్వంసము చేయ నారంభించెను. అచట గల క్రీడా స్థలములను, ద్వారములను, భవనములను, మహా హర్మ్యములు, గోపురములను సహితము విమానము నుండి యాదవ వీరుల విధ్వంసము కావించుట నారంభించిరి. ముసలములు, శక్తి, బాణ, శిలా వర్షము నిరంతరము కురియ నారంభించెను. అచట ప్రచండ వాయువు చెలరేగి దిశలన్నియు ధూళి సరితములై కన్నులకు ఏదియును కానరాకుండెను. ఆ అస్త్ర వర్షము చే భీషణుని నగరము కకావికమయినది. హాహాకారములు చెలరేగినవి. రాక్షసులు విహ్వలులైరి. అంత భీషణుడు "భయపడవలదు" అని ఆశ్వాశించి రాక్షస సహితుడై బయటకు వచ్చెను. పిదప యాదవ నిశాచరుల మధ్య ఘోర యుద్ధము జరిగినది. వృష్ణివంశ యాదవుల బాణ పరంపర చే కాళ్ళు, చేతులు, భుజములు తెగి నిశాచరులు సుడిగాలి యందు విరిగిన వృక్షముల వలె సముద్రమునపడిరి. కొందరు రక్కసులు పురము నందే ధరాశయనులైరి. ఆ రక్కసుల మరణము చే ఒక భయంకర రక్త ప్రవాహము వైతరణీ నది వలె ప్రవహింప నారంభించినది. భీషణుడు యాదవుల శౌర్యమునకు విస్మితుడై యాదవుల వంక గుడ్లురుమి చూచుచు "మీరు నిర్బలుల వలె ఆకాశము నందు నిలబడి యుద్ధము చేయుచున్నారు. మీ వీరత్వము వ్యర్థము. ప్రశంశా యోగ్యము కాదు. మీ శరీరము నందు శక్తి యున్న ఎడల క్రిందకి వచ్చి నాతో రణమాచరించ వలసినది."

అంత అనిరుద్ధుడు భూతలమున విమానము నిలిని ఇట్లనియె "ఎక్కువగ ఆలోచింపవలసిన పని ఏల? ఈ మహా సమరమున భయము వీడి నాతో యుద్ధము గావింపుము." అంత భయంకర యోధుడయిన భీషణుడు తన ధనువు నుండి అయిదు తీవ్ర నారాచములు అనిరుద్ధుని పై ప్రయోగించెను. అనిరుద్ధుడు సునాయాసముగ వాటిని ఖండించి వేరొక సాయకముతో భీషణుని ధనువును ఖండించెను. భీషణుడు వేరొక ధనువును తీసికొని నారిని బిగించి నూరు సర్పాకార బాణముల ద్వారా అనిరుద్ధుని గాయపరచెను. అనిరుద్ధుని రథము చూర్ణమై, హయ సారధులు హతమై ఆయన మూర్ఛితుడాయెను. అది గమనించిన యాదవ వీరులు రోషభూయిష్ఠులై, అధరములు అదురుచుండగా అచటకు వచ్చి, అసురునిపై బాణ వర్షము కురిపించిరి. అంత భీషణుడు తన ధనువును విడచి, ఒక భయంకర గదా దండము చేపట్టి వారందరినీ ప్రహరించి సింహము పంజాతో మృగములను అతలాకుతలము చేయునట్లు భూతలము పై పడవైచెను.

గదా ప్రహారముల చే యాదవ వీరులు క్రిందబడి సర్వాంగములు ఛిన్నా భిన్నమై సమరాంగణము నందు ధరాశయనులైరి. అంత బలదేవుని కనిష్ఠ సోదరుడు గదుడు తన గదాయుధము చే భీషణుని మస్తకము పై ప్రహరించెను. వజ్ర ఘాతము చే వ్యధితమయిన పర్వతము వలె భీషణుడు రణ రంగమున కంపితుడై కుప్పకూలి నేలపై బడెను. భీషణుని శిరము గాయపడి మూర్ఛితుడయ్యెను. అంత భీషణుని సైనికులు గదుని సంహరించుటకు శస్త్రాస్త్రధారులై అచటికి ఏతెంచిరి. కానీ నృశింహుడు తన పంజాలతో గజములను గాయపరచునట్లు గదుడు తన వజ్రసమ గదతో వారందరినీ ధరాశయనుల కావించెను. అంతలో అనిరుద్ధుడు మూర్ఛను వీడి, తెలివి తెచ్చుకొని, ధనుష్పాణియై "నా శత్రువు భీషణుడెక్కడ?" అని గర్జించెను. అనిరుద్ధుడు కోలుకొనుట చే యాదవ సైన్యము జయజయ ధ్వానములు కావించినవి. ఇంతలో నారదుని సూచన ప్రకారము అరణ్యమున యున్న భీషణుని తండ్రి అయిన బకుడు అచటికి ఏతెంచెను.

అతడు కాటుక కొండ వలె నల్లగా ఉండి ఒక తాడి చెట్టు ప్రమాణమున యుండెను. ఆతని కళ్ళు భయంకరముగ

యండి, నాలుక మాటిమాటికీ బయటకు వచ్చుచూ, చేతిలో త్రిశూలము, గద ధరించి సమరాంగణమున అడుగుపెట్టెను. వచ్చుచునే అతడు ఒక గజమును చేతితో పట్టుకొని, నోటియందిడుకొని నములుచూ శరీరమంతయు రక్తమయమై భయంకర పిశాచరూపుడై యొప్పెను. ఆతని రెండు కాళ్ళు రెండు తాడి చెట్లు ప్రమాణమున యుండి భూమిని కంపిప జేయుచున్నవి. దేవతలను సహితము భయ భీతులను గావించు బకుడు సంగర రంగమున ప్రవేశింపగనే నిశాచరులు జయజయ ధ్వానములు కావించిరి. ఆతడు కాలుని వలె వచ్చుచుండగా యాదవులు భయభ్రాంతులై శ్రీకృష్ణ చరణార విందములను స్మరించి తమ లోతాము ఇట్లనుకొను చుండిరి. "మిత్రులారా! మన ఎదుటకు వచ్చిన ఈ రాక్షసుడెవ్వరు? ఈతడు చూచుటకు భీభత్సరూపుడై యుండి కాలాంతకుని వలె కానపట్టు చున్నాడు." బకుడు క్రిందపడియున్న తన తనయుని భీషణుని గాంచి శోకమగ్నుడై "హా దైవమా! హతవిధీ! అని శోకించెను. ఇంతలో భీషణుడు మూర్ఛి నుండి లేచి "నా భయము చే గదుడు ఎక్కడ దాగి యున్నాడు" అని ప్రశ్నించెను. తన పుత్రుడు లేచుట గాంచిన నరభక్ష రాక్షసుడు బకుడు మిక్కిలి హర్షము నొంది, తన తనయుని హృదయమునకు హత్తుకొని ఆశ్వాశన మొసంగెను. తనకు సహాయముగ వచ్చిన తన తండ్రిని గాంచి భీషణుడు ప్రసన్న చిత్తుడాయెను.

(శ్రీ గర్గ సంహిత యందలి అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి బకాగమనము అను పంతొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువదియవ అధ్యాయము

(బక, భీషణ పరాజయము మరియు యాదవులు యాగాశ్వమును తీసికొని విమానములో వెనుకకు వచ్చుట)

గర్గాచార్యుడు "మహారాజా! తదనంతరము అసుర యోధుల మధ్య నిలచి బకుని భీషణుని యుద్ధ కారణమును ఈ విధముగ అడిగెను "పుత్రా! తృణప్రాయులయిన ఈ యాదవులతో నీకు యుద్ధము సంభవించుటకు కారణమేమి! ఈ సమరమందు అనేక మంది రాక్షసులు మృతులై, నీవు సహితము మూర్ఛితుడవైతిని. ఇది చాలా ఆశ్చర్యకరమయిన విషయము." అంత భీషణుడు అవనిత శిరస్కుడై యాగాశ్వమును అపహరించిన వృత్తాంతమునంతయు తన తండ్రికి నివేదించెను. తన కుమారుని పలుకులు వినిన అనంతరము బకుడు యాదవసేన యందు గదాయుధుడై అరణ్యము నందు దావానలము వ్యాపించినట్లు చొరబడెను. సింహము మృగములను ఆక్రమించునట్లు బకుడు ఎదురు వచ్చిన యాదవ సేనను తన చేతులతో, కాళ్ళతో, భుజములతో, గదతో కొట్టి చంపుతూ ప్రళయాగ్ని వలె విజృంభించెను. అశ్వములు పట్టుకొని ఆకాశము నందు విసరెను. గజ రథములకు కడా అదియే గతి పట్టినది. ఆ మహాబలి మనుష్యులను తన ఆహారముగ మ్రింగ నారంభించెను. యదుకుల తిలకా! వజ్రనాభా! ఆ రక్కసుని గర్జనలకు భూనభోంతరాళములు ప్రతిధ్వనించెను. భూ మండలమున జనులు కొంత తడవు బధిరులయిరి.

ఆ భయానక యుద్ధముచే యాదవ సైనికులు మనసున ఖిన్నులై హాహాకారములు సలిపిరి. ఆ దురాత్ముడయిన రాక్షసుని చే తన సైన్యము నాశనము కావింపబడుట కాంచిన జాంబవతీ నందనుడు సాంబుడు అయిదు నారాచ బాణములు ధనుసుకు సంధించి బకుని పై ప్రయోగించెను. అంత బకుడు తక్షణము భూమిపై పడెను. పిదప కొంత తడవు యుండి తిరిగి లేచి మేఘ గర్జన కావించెను. అంత జాంబవతీ నందనుడు తిరగి మరొక అయిదు సాయకములు సంధించి తీవ్ర వేగమున వైచెను. అంత బకుడు ఆ ఘాతమునకు ఎగిరి లంకపై పడెను. తిరిగి లేచి సంరాంగణమున కేతెంచి అగ్ని శిఖల వలె వెలుగొందుచున్న త్రిశూలమును సాంబునిపై ప్రయోగించెను. అంత సాంబుడు సునాయాసముగ ఆ త్రిశూలమును మార్గ మధ్యమున ముక్కలు ముక్కలు చేసెను. అంత రణ దుర్మధుడయిన బకుడు ఒక గొప్ప గదను తీసికొని సాంబుని హయములను, సారధిని సంహరించి, పిదప పతాక సహిత రథమును చూర్ణము గావించి సాంబునితో

ఇట్లనియె "నీవు రథహీనుడవు. వేరొక రథము నెక్కి నాతో యుద్ధము చేయుము. నేను రణభూమి యందు అధర్మముగ, అన్యాయముగ నిన్ను సంహరింపను." అంత సాంబుడు నవ్వి, అంతలోనే కుపితుడై ఒక గద తీసికొని దైత్యుని హృదయముపై ప్రహరించెను. ఆ ఘాతము చే బకుడు వ్యాకులుడై సాంబుని విడచి యాదవ సైన్యమున ప్రవేశించి యదేశ్ఛగా రథ, గజ, హయ, పదాతులను ప్రహరించి సంహరింపసాగెను.

అది గమనించిన రుక్మవతీ నందనుడు అనిరుద్ధుడు ఒక అక్షౌహిణీ సేనతో అచటకేతెంచి బకునితో ఇట్లనియె "ఓరీ! మూఢుఢా! నీవు వీర పురుషుల విడచి భయభీతులతో యుద్ధ మొనర్చు చున్నావు. నీ శరీరము నందు శక్తి యున్న ఎడల నాతో పోరాడుము." అది వినిన బకుడు కుపిత భుజంగము వలె బుసలు కొట్టుచూ అనిరుద్ధుని ఎదుటకు వచ్చెను. ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన అనిరుద్ధుడు పది తీవ్ర నారాచముల చే దైత్యుని పై ప్రహరించెను. అవి అతని శరీరమును చీల్చుకొని వెలుపలికి వచ్చి భీషణుని సహితము విదీర్ణుని గావించి భూమిపై దిగబడినవి. అంత వజ్రాయుధపు చే దెబ్బలచే కృంగిన పర్వతముల వలె భూమిపై పడి మూర్ఛిల్లిరి. ఆ సమయమున యాదవ సేన యందు జయజయ ధ్వానములు మ్రోగినవి. దుందుభులు, శంఖములు, నగారాలు, గోముఖములు మ్రోత చే దిక్కులు పిక్కటిల్లినవి. ఒకేసారి తమ నాయకులిరువురు పడిపోవుట గాంచిన రాక్షసవీరులు క్రోధోద్రిక్తులై ఒక్కసారిగా యాదవ సైన్యము పై పడిరి. అంత ఆ ఇరువురు సేనల మధ్య భయంకర తుముల యుద్ధము ఆరంభమయినది.

ఖడ్గ, బాణ, గద, శక్తి, తోమరాది ఆయుధముల ద్వారా ఒకరినొకరు ఘాత, ప్రత్యద్ఘాతములు, కావించుకొను చుండిరి. రాక్షసుల ఉద్ధతిని గమనించిన సాంబాది శ్రీకృష్ణ పుత్రులు తీక్షణ బాణముల ద్వారా వారిని ప్రహరించిరి. ఆ భయంకర బాణ సమూహముల చే ఎందరో రాక్షస యోధులు ధరాశయనులైరి. కొందరు మృత్యు ముఖము వరకు పోయిరి. కొందరు జీవితేచ్ఛ చే సమరాంగణమును విడచి పలాయన మొనర్చిరి. తదుపరి రెండు ఘడియల తరువాత బకుడు లేచి, అనిరుద్ధుని సమ్ముఖమునకు ఏతెంచి చేతిలోనికి ఒక భయంకర గదాయుధమును తీసికొని, అనిరుద్ధునిపై ప్రహరించి "ఇది నిన్ను సంహరించును" అని పలికెను. తనపై పడుచున్న గదాయుధమును యమ దండము ప్రయోగించి అనిరుద్ధుడు చూర్ణము గావించెను.

అంత కుపితుడయిన బకుడు తన నోటిని భయంకరముగ తెరచి, రాహువు చంద్రుని కబళించినట్లు మ్రింగుటకు పరుగు పెట్టసాగెను. అతడు దగ్గరకు వచ్చు వరకు వేచి యుండి అనిరుద్ధుడు తిరిగి యమ దండమును వానిపై వైచెను. ఆ ప్రహారము చే బకుని మస్తకము పగిలి ముఖము నుండి రక్తము బొటబొటా కారి మూర్ఛితుడై పడెను. తన తండ్రి క్రిందపడుట గమనించిన భీషణుడు పరిఘాయుధమును చేపట్టి యాదవ సంహారము కావింప మొదలిడెను. అంత బలవంతుడయిన అనిరుద్ధుడు వరుణ దత్తమయిన నాగ పాశములు వైచి, భీషణుని పట్టి బంధించి సమరాంగణము నందు పశువును ఈడ్చినట్లు ఈడ్చెను.

వరుణ పాశ బంధుడయిన భీషణుడు పరాజితుడై అవనిత శిరస్కుడై నిలచెను. పరాజితుడు, బలహీనుడయిన అసురుని గాంచి సాంబుడు "అసురేంద్రా! నీకు శుభమగుగాక! నీవు శీఘ్రమే నీ నగరమునకు పోయి అనిరుద్ధుని యజ్ఞాశ్వమును తిరగి తెమ్ము. ఈ అనిరుద్ధుడు మహాత్ముడు. అశ్వ రక్షణము పేర జనులకు తన దర్శన భాగ్యము కలిగించుటకై ఈతడు తిరుగుచుండెను. దేవ, దైత్య, మానవులు, ఈతని వద్దకు వచ్చి తమ శిరసును వంచి ఆతని పాదములకు సమస్కరించెదరు. అది వారి పాపముల సర్వమును హరించును. నీవు ఈతనిని శ్రీ కృష్ణ సమానుడని తెలియుము. నీవు సమరమున సాక్షాత్ శ్రీకృష్ణుని చేతిలో పరాజితుడవయితివని తెలియుము. ఇట్లు తలంచి దు:ఖము, చింత వీడి మాతో కలసి వచ్చి శ్రీకృష్ణ దర్శనము కావించుము.

సాంబుడు ఈ విధముగ నచ్చ చెప్పుట చే నాగపాశ విముక్తుడై భీషణుడు తన నగరమున కేగి అనేక ధన రాశులతో పాటు యాగాశ్వమును సహితము తిరిగి సమర్పించెను. అంత అనిరుద్ధుడు భీషణుని సహితము యాగాశ్వ రక్షణకు తమతో రమ్మని పిలచెను. అంత భీషణుడు కొంత తడవు ఆలోచించి "నా తండ్రి సచేతనుడయిన పిదప నేను ఆతని ఆజ్ఞను గైకొని మీ వద్దకు వచ్చెదను. ఇందు సంశయము లేదు." అంత అనిరుద్ధుడు యాగాశ్వ సహితుడై, తన సైన్యము, ధన రాశులు తీసికొని విమానము నధిరోహించి ఆకాశ మార్గమున తన సేనను చేరెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖంగార్గతమున గర్గ, వజ్రనాభ సంవాదము నందలి ఉపలంక పై విజయమను ఇరువదియవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఒకటవ అధ్యాయము

(భద్రావతీ పురమందు యవనాశ్వ మహారాజు పై అనిరుద్ధుని విజయము)

శ్రీ గర్గాచార్యులు "వజ్రనాభా! ఈ విధముగ విమానా రూఢుడై విజయ దుందుభులు మ్రోగించుచూ ఉషా వల్లభుడు అనిరుద్ధుడు ఆకాశ మార్గమున తన సేనా వాహినిని చేరెను. వారందరినీ చూచి అక్రూరాది ప్రముఖులు వారి కుశల సమాచారములు అరసిరి. వారికి పూస గ్రుచ్చినట్లు అనిరుద్ధాదులు సమర వృత్తాంత మంతయు వివరించిరి. ఇంతలో బకుడు మూర్ఛను వదిలి తెలివి తెచ్చుకొనెను. అక్కడ యాదవులు కనబడక రోష పూర్వకముగ వారిని గూర్చి భీషణుని ప్రశ్నించెను. భీషణుడు తన తండ్రికి యావత్ వృత్తాంతమును వివరించెను. బకుడు అధరములు వణకు చుండగా కోపొద్రిక్తుడై "నాకు తెలియును. సింహమును చూచి హరిణము భయపడినట్లు యాదులు నా భయము చే విమానము ద్వారా కుశస్థలీ పురమునకు పలాయన మొనర్చిరి. అందువలననే నేను ధరిత్రిని యాదవ శూన్యము కావించెదను. నేను కృష్ణుని ద్వారకకు పోయి సమస్త యాదవులను సంహరించెదను."

అంత భీషణుడు "మహారాజా! క్రోధము వలదు. ఈ సమయము మనకు అనుకూలముగ లేదు. దైవము అనుకూలించినపుడు యాదవులను జయించెదము." పుత్రుడు ఈ విధముగ నచ్చ చెప్పిన పిదప బకుడు నిశ్శబ్దముగ వనము నందు వన చరములను తినుటకు చనెను. తదనంతరము అశ్వమునకు విధి పూర్వకముగ అభిషేకించి, శ్రేష్ఠ బ్రాహ్మణులకు దానము లొసంగి అనిరుద్ధుడు తిరిగి విజయ యాత్ర కొనసాగించెను.

అశ్వము అనేక దేశములను కాంచుచూ, సంచరించుచూ, భద్రావతీ పురము చేరెను. ఆ పురము అనేక ఉప వనములతో కూడి, పర్వతములతో, దుర్గములతో చుట్టబడి యుండెను. రజతమయ భవనములు ఆ పుర శోభను ఇనుమడింప జేయుచున్నవి. అనేక మంది వీర పురుషులు అందు నివసించుచుండిరి. తలుపులన్నియు లోహ నిర్మితములై యున్నవి. ఇటువంటి పురము నందు జొరబడి శ్యామ కర్ణము మహారాజు ఎదుట నిలబడెను. అంత యవనాశ్వుడు ఆ అశ్వపు ముఖ పత్రమును చదివి, మిక్కిలి క్రుద్ధుడై, ఆ హయమును బంధించి సేనా సహితుడై అనిరుద్ధుని ఎదుర్కొనుటకు నగరము వెలుపలికి ఏతెంచెను.

అంత ప్రద్యుమ్న సుతుడు మంత్రి ప్రవరుడయిన ఉద్ధవునితో "మంత్రివర్యా! సేనా సహితుడై ఏతెంచిన ఈ రాజన్యుడెవరు? ఈతడు మన హయమును అపహరించెను. ఈతని గూర్చి సర్వమును తెలుపవలసినది." ఉద్ధవుడు "అనిరుద్ధ మహారాజా! ఈతడు యవనాశ్వ నామధేయుడు. ఈతడు మరుధన్వ రాజు పుత్రుడు. తన తండ్రి దివంగతుడు అయిన పిదప రాజ్యము ఈతనికి సంక్రమించినది. ఈతడు కేవలము పదహారు సంవత్సరముల వయసు గల యువకుడు. ఈతడు తన దుష్ఠ మంత్రి యొక్క బోధ చే యుద్ధము అవశ్యము కావించును, కానీ దయచేసి ఈతనిని చంపవలదు." అనిరుద్ధుడు అందులకంగీకరించి, సింహము మత్తేభముతో తలపడినటుల సమరము గావించి యవనాశ్వుని మూడు అక్షౌహిణీ సేనా సమూహమును సంహరించి, ఆతనిని విరథుని గావించి ఇట్లనియె "రాజా! మా హయమును మాకు అప్పగింపుము. లేదా మాతో సమరమాచరింపుము."

యావనాశ్వుడు ఆ పలుకులు విని, ఆతడు శ్రీకృష్ణ పౌత్రుడని తెలిసి, అనిరుద్ధునకు హయమును అప్పగించి చేతులు జోడించి ఇట్లనియె "నృపేశ్వరా! ద్వారక యందు యజ్ఞము జరిగినపుడు నేను శ్రీకృష్ణ చరణారవింద దర్శనమునకు ఏతెంచెదను." అనంతరము అనిరుద్ధుడు ఆ బాల వీర కిశోరమును తిరిగి సింహాసనమందు ప్రతిష్ఠించెను. యవనాశ్వుడు అనిరుద్ధుని పాదములకు నమస్కరించెను. అంత రుక్మవతీ సుతుడు తిరిగి శ్యామ కర్ణమును స్వేచ్ఛగా వదలి దానిని వెంబడించుటారంభించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండాంర్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి భద్రావతీ పురము పై విజయము అను ఇరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఇరువది రెండవ అధ్యాయము

(యజ్ఞాశ్వము అవంతీపురము చేరుట; అవంతీ పురాధీశుడు సేనా సహితముగ అనిరుద్ధుని సత్కరించుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! యదుకుల తిలకుడయిన అనిరుద్ధుని అశ్వము అనేక జనపదములందు పయనించి చివరకు "రాజపుర" జనపదము నందు ప్రవేశించెను. మార్గము నందు సిప్రానదీ దర్శనము కావించి అవంతికా దేశపు ఉప వనమున ప్రవేశించెను. ఆ సమయమున శ్రీకృష్ణ పరమాత్ముని గురువయిన సాందీపని మహర్షి తన గృహము నుండి నదీ స్నానము నకై వెలువడి ఆచటకు చేరెను. ఆయన తులసీమాలా ధారియై, భుజమందు ఉతికిన వస్త్రములు పట్టుకొని, శ్రీకృష్ణ నామము నిరంతరము జపించుచు, నీరు త్రాగుచున్న శ్యామ కర్ణమును వీక్షించిరి. అక్కడనే స్నానమాచరించుచున్న అవంతీ రాజకుమారుడు "బిందు" ను ఆ అశ్వము యొక్క వృత్తాంతమును కనుగొనమని ప్రేరేపించెను. అంత రాజాధిదేవి యొక్క అనుంగు పుత్రుడు, "బిందు" తన తోటి వీరులను తీసికొని ఆ హయమును పట్టుకొని, తన గురు దేవుల వద్దకు ఏతెంచి హర్షాతి రేకము చే అద్దాని విషయమంతయు విన్నవించెను.

సాందీపని మహర్షి ఫాల పత్రమును చదివి ప్రసన్నుడై రాకుమారునితో ఇట్లనియె "ఇయ్యది ఉగ్రసేన మహారాజు యొక్క అశ్వము. సాక్షాత్ శ్రీకృష్ణ పౌత్రుడు అనిరుద్ధుడు ఈ అశ్వ రక్షకుడుగా వచ్చుచున్నాడు. ఈ అశ్వము తన ఇష్టానుసారము ఇచట కేతెంచినది. ఇపుడు అనిరుద్ధుడు సహితము వచ్చును. అతనితో పాటు సాయుధులైన యాదవ వీరులనేకులు ఏతెంచెదరు. నీ సోదరి మిత్రవింద యొక్క పుత్రులు సహితము ఏతెంచెదరు. నీవు శ్రీకృష్ణ చంద్రుని పుత్రులందరికీ సాదర స్వాగత సత్కారములు కావింపవలెను. నా మాట ననుసరించి నీవు సమర యోచన సంపూర్ణముగ విడువ వలెను.

రాకుమారుని మనసున గుర్రమును పట్టుకొనవలెనని యున్నది. కానీ గురువు యొక్క పలుకుల చే ఆతడు ఈ ఆలోచన విరమించెను. ఇంతలో సమస్త లోకముల గర్వ భంగము కావించు యాదవ సేనా కోలాహలము వినిపించెను. దుందుభుల మహానాదములు, ధనువుల టంకారములు, రథముల ఘణత్కారములు, వీరుల గర్జనలు, గజముల ఘీంకారములు, హయముల సకిలింపులు, శతఘ్నుల మహానాదములు, ఇవన్నియు సమస్త లోకములకు భయదాయకములు. వీటన్నిటినీ చూచి రాకుమారుడు విస్మితుడయ్యెను.

ఇంతలో రథ, గజ, హయ, పదాతి సేనలతో భోజ, వృష్ణి, అంధక, మధు, శూరసేన, దశార్హ వంశములకు చెందిన యాదవులందరూ అచటికి చేరిరి. ఆ సేన యొక్క ధూళిచే ఆకాశము ఆచ్ఛాదింపబడినది. పదఘట్టనల చే పృథివి కంపితమయినది. అందరికందరూ "యజ్ఞాశ్వమును ఎవరు అపహరించిరి! ఎక్కడికి పోయినది? అని తలపోయుచుండిరి. ఆ సమయమున అన్వేషకులకు పుష్ప భరిత వృక్షములతో నిండిన అత్యంత అద్భుత ఉపవనమున చామరములతో బంధింపబడిన అశ్వమును కాంచి వెనుకకు వెళ్ళి అనిరుద్ధునకు ఈ విషయమున నెరిగించిరి. అనిరుద్ధుడు విస్మితుడై, మందస్మితుడై యున్న "బిందు" వద్దకు ఉద్ధవుని పంపెను. ఆ సమయమున అవంతీ పురమున గొప్ప కోలాహలము చెలరేగెను. బయట నిలిచియున్న భయంకర సేనా వాహినిని చూచి అవంతీపుర వాసులు భయభీతులైరి. అదే సమయమున యువరాజు బిందును వెదకుచూ ఆతని సోదరుడు అనుబిందుడు ఒక కోటి వీరులను తీసికొని నగరము వెలుపలికేతెంచెను. అచట దుగ్ధరాశి వలె తెల్లనిది, శ్యామ కర్ణములు కలది అయిన యాగాశ్వమును బంధించిన "బిందుడు" కానపడెను.

అంత అనుబిందుడు "సోదరా! శ్రీకృష్ణ భగవానుని దేవత వలె పూజించు యాదవుల హయము ఇది. వారితో మనకు గల సంబంధము వలన, మన కుల కుశలము కొరకు కూడా ఈ హయమును వదుల వలెను. సోదరా! ఈ యాదవ సేనను తిలకింప వలసినది. తొలుత జరిగిన రాజసూయము నందు వీరు దేవ, దానవ, దైత్య, అసుర, మానవ జాతులన్నింటి పైననూ విజయము సాధించిరి." అనుబిందుని పలుకులు విని బిందుడు ఓటమి నంగీకరించి తన వద్దకు

వచ్చిన ఉద్దవునితో ఇట్లనియె."

"మహాత్మా! మంత్రివర్యా! నేను మిత్రులతో కలియుట కొరకు మాత్రమే ఈ అశ్వమును చేపట్టితిని. ఈ రోజు మీరందరూ ఇక్కడనే విశ్రమింప వలసినది." ఈ మాటలు విని బిందువును అభినందించి, ఉద్దవుడు వెనుకకు వెళ్ళి అనిరుద్దనకు జరిగిన విషయమంతయు వివరించెను. అనిరుద్దుడు సహితము ప్రసన్నుడై సేనా సహితముగ అవంతీపుర సమీపమున సిప్రానదీ తీరమున శిబిరములు దింపిరి. అవి పది యోజనముల విస్తీర్ణమున రంగురంగుల వస్త్రముల చే నిర్మింపబడినవి. వీటన్నిటి పైననూ సువర్ణ కలశములు యున్నవి. రాకుమారుడు బిందువు అచటికి వచ్చిన యాదవ సైన్య మంతటికీ భక్ష్య, భోజ్య, చోష్య, లేహ్యములతో అతిథి సత్కారములు కావించెను. అంతేకాక పశువులకు సహితము పచ్చగడ్డి మేతను పెట్టెను. ఈ విధముగ భోజనములు పెట్టి రాజాధిదేవి, ఆమె భర్త, ఇరువురు కుమారులు వచ్చి, శ్రీకృష్ణ పుత్రులందరినీ కలసి మిక్కిలి ప్రసన్నులయిరి.

తదనంతరము తన తాతగారి గురువయిన సాందీపని మహర్షిని రావించి, ఆయనకు సాష్టాంగ దండ ప్రమాణము లాచరించి, ఆశీనుని కావించి, విధి విధానముగ పూజించి ఇట్లనియె "భగవాన్! ద్వారక యందు శ్రీకృష్ణ భగవానుని ఆజ్ఞచే ఉగ్రసేన చక్రవర్తి అశ్వమేధ యాగమును కావించుచుండెను. బ్రహ్మన్! ముని శ్రేష్ఠా! మీరు నా యందు దయదలిచి ఆ యజ్ఞము నందు పాలుపంచుకొనుటకు మీ పుత్ర సహితముగ రావలసినది. అనిరుద్దుని ఆహ్వానమును మన్నించి శ్రీకృష్ణ దర్శన లాలస చే యజ్ఞమున కేగుటకు సాందీపని ముని నిశ్చయించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి అవంతి కాగమనము అను ఇరువది రెండవ అధ్యాయము సమాప్తము)

ఇరువది మూడవ అధ్యాయము

(అనిరుద్దుని ప్రశ్నచే సాందీపని ముని ద్వారా శ్రీకృష్ణ తత్వ నిరూపణము. పరబ్రహ్మత్వము మరియు భజనీయత యొక్క ప్రతిపాదనము. జగత్తు నుండి వైరాగ్యము భగవద్భజన ఉపదేశము)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదనంతరము అనిరుద్దుడు సాందీపని మునిని ఈ విధముగ ప్రశ్నించెను. "భగవాన్! నాకు జగత్తు యొక్క స్వప్న తుల్య సుఖములను త్యజించి నిత్యానంద స్వరూపము నందు రమించు సారతత్వము యొక్క ఉపదేశమును కావింప వలసినది." అంత సాందీపని మహర్షి మందస్మితుడై, పృథు మహారాజుకు సనత్కుమారు డపదేశించి నట్లు అత్యంత ప్రసన్నతతో ఇట్లనియె "లోకేశా! నీవు శ్రీహరి యొక్క నాభి కమలము నుండి ఉత్పన్నమయిన ఆదిదేవుడవు. నీ ముందు సారతత్వమయిన విషయము గూర్చి నేను ఏ విధముగ మాట్లాడగలను? కానీ నీ వచనమందలి గౌరవము చే, సమస్త దీన జనుల యొక్క కళ్యాణము కొరకు వివరణ నిచ్చెదను. శ్రీకృష్ణ భగవానుని చరణ సేవయే సారసత్వము. ఆయన పద పూజన మాత్రముచే ధృవుడు ధృవ పదము నొందెను. ప్రహ్లాద, అంబరీష, గయ, మరియు యదువు అక్షయ పద ప్రాప్తి నొందెను. అందువలన నీవునూ ప్రయత్న పూర్వకముగ శ్రీకృష్ణ సేవ చేయవలసినది. అయ్యది సమస్త సాధనల సారభూతము. మీరందరూ ఎంతో సౌభాగ్యశాలురు. ఎందుకనగా ఆయన వంశము నందు పుట్టి ఆయన కుటుంబీకులు, సంబంధీకులు అయిరి. శ్రీహరికి ప్రియులగుట చే మీరందరూ జీవన్ముక్తులే! మీ యాదవులు మినహా ఎవరేని శ్రీ కృష్ణుని తమ పుత్రునిగా, సోదరునిగా, తండ్రిగా, మిత్రునిగా తలచి ఆ భావము సుదృఢముగ యుండెనేని, వానికి అంతకు మించిన కర్తవ్యము లేదు."

అనిరుద్దుడు "మహామునీ! ఈ జగత్తుయొక్క ఆదిభూతమయిన, సనాతనమయిన కర్త ఎవరు? ఎవని నుండి ఇది ప్రాకట్యమయినది? అంతేకాక భగవానుడు, జగదీశ్వరుడు ప్రతి యుగము నందు ఏఏ రూపములతో ధర్మ సంస్థాపన

కావించును? ఈ విషయములన్నియు విస్తారముగ వివరింపవలసినది." సాందీపని ముని "అనిరుద్ధా! ఎవని నుండి ఈ జగత్తు ఉద్భవించి, తిరిగి లయింప బడునో ఆతడే ఈశ్వరుడు, పరబ్రహ్మ, మరియు భగవానుడు ఒక్కడే!! నృపశ్రేష్ఠా! ప్రతి యుగము నందునూ దక్షాది ప్రజాపతులు ఆయన నుండే ప్రకటమయి తిరిగి ఆయన యందే లయమగుచున్నారు. విద్వాంసులు ఈ విషయమున మోహితులు కారు. రాజా! శ్రీకృష్ణుడు సాక్షాత్ పరబ్రహ్మ. ఆయన నుండే జగత్తు ఉద్భవించినది. స్వయముగ ఆయనే ఈ జగత్స్వరూపముగ యున్నాడు. ఆయన యందే ఈ జగత్తు లయమగుచున్నది. ఆయనే పరంధాముడు.

ఆయన సత్, అసత్‌లకు పరుడు. కానీ ఈ సంపూర్ణ చరాచర జగత్తు ఆయన కంటే భిన్నము కాదు. ఆయనే మూల ప్రకృతి. ఆయనే వ్యక్తరూప సంసారము. ఆయన యందే స్థితినొంది, ఆయన యందే సంసారముంతయు లీనమగును. ఎవరి నుండి ప్రకృతి పురుషులు ఉత్పత్తి అగుదురో, ఎవరి నుండి చరాచర జగత్తు ప్రాదుర్భావ మగునో, ఎవరు ఈ సకల దృశ్య ప్రపంచమునకు కారణమో, ఆ పరమాత్ముడయిన శ్రీకృష్ణుడు నా యందు ప్రసన్నుడగు గాక! రాజేంద్రా! నాలుగు యుగముల యందు ఆయనే శ్రీ విష్ణు స్వరూపము చే పాలన చేయసాగెను. యుగ వ్యవస్థ ఈ విధములుగ యున్నది. సత్యముగము నందు సర్వభూత హిత తత్పరుడయిన శ్రీహరి కపిలాది రూపములు ధరించి ఉత్తమ జ్ఞాన ప్రదానము కావించెను. త్రేతా యుగమందు చక్రవర్తి, సామ్రాట్‌గా ప్రకటితమయి ఆ ప్రభువు దుష్టులను నిగ్రహించి మూడు లోకముల పాలన కావించును. ద్వాపర మందు వేదవ్యాస రూపధారియై అవిభాజమయిన వేదరాశిని నాలుగు వేదములుగ విభజించి అనేక శాఖోప శాఖలుగ దానిని విస్తరిల్ల జేసెను. కలియుగాంతమున శ్రీహరి కల్కిరూపము ధరించి దుష్టులను నిర్జించి తిరిగి సన్మార్గము ను స్థాపించును. ఆ ప్రకారముగ అనంతాత్ముడయిన శ్రీకృష్ణుడే సంపూర్ణ జగత్తు యొక్క సృష్టి, స్థితి, పాలనము కావించును. ఆయనకు భిన్నముగ ఎవరి నుండి ఈ సృష్టి ఉత్పన్నమవదు. ఈ ప్రకృతి మరియు జగత్తుకు భిన్నమయిన సచ్చిదానంద స్వరూపుడు శ్రీకృష్ణునకు నమస్కారము. శ్రీకృష్ణుడే సమస్త లోకములకు ఆది కారణము మరియు ధ్యేయము. ఆ అవినాశి అయిన పరమాత్మ నాపై ప్రసన్నుడగు గాక! ఇందువలన ఓ! అనిరుద్ధా! ఈ జగత్తు యొక్క సమస్త దు:ఖములను విడచి దేవేశ్వరుడు, మోక్షదాత అయిన శ్రీకృష్ణ చంద్రుని భజింపుము. ఈ విధముగ ఏ భక్తి యుతుడయిన మానవుడు శ్రీకృష్ణ భగవానుని వృత్త సారము వర్ణనము వినినా, మననమును చేసినా ఆతని బుద్ధి నిర్మలమగును. వానికి ఆత్మ విషయమున ఎన్నడు మోహము కలుగదు. ఆతడు ఎల్లప్పుడు భగవత్స్మరణము నందు సంలగ్నుడై యుండి అవిరళ, అచల భక్తి యొక్క యోగ్యతను ప్రాప్తించును.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి వైరాగ్య కధనము అను ఇరువది మూడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది నాల్గవ అధ్యాయము

(అమలాశ్వ, యాదవ వీరుల మధ్య ఘోర యుద్ధము)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! సాందీపని ముని యొక్క వచనములు విని అనిరుద్ధుడు మిక్కిలి ప్రసన్నుడై, శ్రీకృష్ణ పరమాత్ముని పాద పద్మముల యందు తన మసస్సును సంలగ్నము చేసి ఆ మునీంద్రుని తో ఇట్లనియె "ప్రభూ! మీ ఉపదేశ రూప ఖడ్గము చే నా మోహరూప శత్రువు నశించినది. ఇక మీరు మీ పుత్ర సహితులై ఈనాడే శ్రీకృష్ణ పురి అయిన ద్వారకకు బయలుదేర వలసినది." ఆ మాట విని సాందీపని ముని మిక్కిలి ప్రసన్నుడై, శ్రీకృష్ణుని చే ఈయబడిన పుత్రుని గొని రధారూఢుడై ఆరోజే ద్వారకా పురమున కేగెను. ద్వారకా పురమందు శ్రీకృష్ణ బలరాములు మిక్కిలి ఆదరముతో ఆయనను ఆహ్వానించిరి. సమస్త యాదవులు, భోజ రాజయిన ఉగ్రసేనుడు విధి విధానముగ ఆయనను

పూజించిరి. తదుపరి ప్రద్యుమ్న సుతుడు స్వర్ణ సంకెలతో బంధింపడియున్న యాగాశ్వమును తిరిగి స్వేచ్ఛగా వదలిపెట్టెను.

ఆ హయము వేగముగ పరుగెత్తి, అనేక రాజ్యములు దాటి చివరకు "రాజ పురము" చేరెను. ఆ పురాధినాధుడు సాల్వుని సోదరుడు "అనుసాల్వుడు" స్వేచ్ఛగా సంచరించుచున్న ఆ హయమును పట్టి, అద్దాని ఫాల భాగమునున్న పత్రమును చదివి, మొదట హర్షించి, పిదప రోషముతో పెదవులదురు చుండగా, తనను చూచుచున్న సైనికులను పరికించి ఇట్లనియె "ఇది మిక్కిలి సౌభాగ్య కరమయిన విషయము. నా శత్రువులందరూ కట్టుగట్టుకొని ఇచటికి ఏతెంచుచున్నారు. నేను వారందరినీ సంహరించి, నా భాతృ ఋణము తీర్చుకుందును." ఈ విధముగ పలికి, యాదవులను తృణ ప్రాయములుగ ఎంచి, పది అక్షౌహిణీల సేనను తీసికొని నగరము వెలుపలికి ఏతెంచెను. ఆ సమయమున యాదవులు ఎదురుగ వచ్చి బాణ పరంపరను కురిపించుచున్న ఒక గొప్ప సేనావాహినిని కాంచిరి. అంత వారునూ ప్రత్యర్థులపై బాణ వర్షము కురిపించుట నారంభించిరి. ఆ సమరాంగణము నందు ఇరు పక్షముల మధ్య ఖడ్గ, బాణ, తోమర, గదాయుధముల ద్వారా ఘోర యుద్ధము ఆరంభమయినది. అనుశాల్వుని సేన పలాయనము కావించినది. అది గమనించిన మహాబలుడు అనుసాల్వుడు మేఘ గర్జన కావించి, తన సేనను ఆపి, వెనుకకు త్రిప్పి రణోన్ముఖులను గావించి తాను రధారూఢుడై సంగర భూమి ప్రవేశించెను. తొలుత దీప్తిమానుని గాంచి ఆవేశము నొంది అనుసాల్వుడు పది బాణములు ప్రయోగించి ఆతనిని గాయపరచెను. ఆ బాణ సమూహము దీప్తిమానుని భుజములను క్షతవిక్షితుని గావించెను. దీప్తిమానుడు రోషభూయిష్ఠుడై ఒకేమారు పది తీవ్ర నారాచములను సంధించి అనుసాల్వుని పై విడచెను. ఆ బాణములు అనుసాల్వుని శరీరము నందు దిగి గాయము చేసి వెనుకకు వచ్చినవి.

ఆ బాణముతో గాయపడిన అనుసాల్వుడు మూర్ఛితుడై పడెను. అది గాంచిన వాని సైనికులు రోషము చెంది చిత్ర విచిత్ర శస్త్రములు ధరించి యుద్ధభూమి యందు దీప్తిమానుని గాయపరచుట నారంభించిరి. ఆ సమయమున శ్రీకృష్ణ పుత్రుడు భానుడేతెంచి సూర్య ప్రతాపముచే మేఘములు పటాపంచలయినట్లు తన బాణ ధాటి చే శత్రు సైనికులను ఛిన్నాభిన్నము కావించెను. అంత అనుసాల్వుని సైనికులు పలాయన మంత్రము పఠించిరి. ఇంతలో అను సాల్వుని మంత్రి ప్రచండుడు అనెడివాడు సత్యభామా కుమారుడయిన భానునిపై శక్తిని ప్రయోగించెను. ఆ శక్తి భానుని వక్షమును చీల్చి, బయటకు వచ్చి ధరిత్రి యందు దిగినది. అంత భానుడు మూర్ఛితుడై రణభూమి యందు రధమునుండి క్రిందపడెను. ఆ దృశ్యమును గాంచిన జాంబవతీ నందనుడు సాంబుడు అచటికి ఏతెంచి, కోదండము చేతిలోనికి తీసికొని, ధనువు సారించి, టంకారము కావించి వంద బాణములతో ప్రచండుని ధ్వజము, సారధిని, హయసహిత సంపూర్ణ రధమును చూర్ణము కావించెను.

తన రధము తునియలగుట చే ప్రచండుడు తన చేతిలోనికి గద తీసికొని శలభము అగ్నిలోనికి దూకునటుల సాంబునిపై దుమికెను. ఆ విధముగ ఏతెంచుచున్న ప్రచండుని కాంచి సాంబుడు సూర్య చంద్రుల పగిది భాసించు ఒకే నారాచమును తీసి, ప్రయోగించి వాని మస్తకము నుత్తరించెను. ఆ సమయమున వాని సేన హాహాకారములు కావించెను. ఇంతలో అనుసాల్వుడు మూర్ఛనుండి లేచి, తన మంత్రి ప్రచండుడు సాంబుని ద్వారా హతమార్చబడెడని తెలిసి, కవచము బిగించి రధారూఢుడై, ధనువు చేపట్టి, సాంబునికి ఎదరుగ వచ్చి నాలుగు బాణముల ద్వారా ఆతని హయములను, రెండు బాణముల ద్వారా సారధిని, మూడు బాణముల ద్వారా ధ్వజమును, అయిదు బాణములతో సాంబుని ధనువును, ముప్పది బాణములతో రధము యొక్క సంధి ప్రదేశమును తునియలు గావించెను. అంత సాంబుడు వేరొక రధమధిరోహించి, కుపితుడై వేరొక ధనువు చేపట్టి నూరు నారాచములను శత్రువు పై ప్రయోగించెను. దానిచే అనుసాల్వుడు రధము విరిగినది. అశ్వములు కాలగతి యందు కలసినది. సారధి దివంగతుడై అనుసాల్వుడు తిరిగి మూర్ఛనొందెను. అంత ఆతని సైనికులు గ్రద్ద ఈకలు కట్టబడినవి, విష సర్పముల వంటి బాణములు సాంబునిపై ప్రయోగించిరి. యుద్ధ రంగమందు సాంబుడు ఒంటరిగ పోరాడుట కాంచి శ్రీ కృష్ణ పుత్రుడయిన మధువు రోషభూయిష్ఠుడై పావురపు రంగు దివ్యాశ్వము నధిరోహించి, ఖడ్గము చేతబట్టి, సాంబ సహితుడై ఆ సేనను అర్ధ పహరమున ఉచకోత కోసిరి. ఇంతలో అనుసాల్వుడు లేచి, తన పరాజయము గాంచి, జలముచే ఆచమనము కావించి, శుద్ధుడై సమస్త శత్రువులను హతమార్చుటకు నిశ్చయుడై మయాసుర దత్తమయిన బ్రహ్మాస్త్రమును సంధించెను. ఆ దుష్టునకు ప్రయోగము తెలియును, కానీ ఉపసంహారము తెలియదు.

ఆ అస్త్రమహిమ చే అంతరిక్షము నందు ఒకేసారి ద్వాదశ అదిత్యులు ఉదయించిన నంత వేడి పుట్టి యాదవసేనను దుస్సహ తేజముతో జ్వలింప మొదలిడెను. అంత యాదవ సైనికులు అనిరుద్ధుని చేరి "మహాత్మా! మమ్ము రక్షింపవలసినది" అని వేడుకొనిరి. అంత ప్రద్యుమ్న సుతుడు వారికి అభయ ప్రధానము కావించి, తానునూ బ్రహ్మాస్త్ర ప్రయోగము కావించి దానిని శాంతింప జేసెను. అంత అనుసాల్వుడు ఆగ్నేయాస్త్రమును విడచెను. ఆ అస్త్ర ప్రభావము చే ఆకాశమంతయు అగ్ని ప్రభవించి సమరాంగణము అంతయు జ్వలింప నారంభించెను. అనిరుద్ధుడు వారుణాస్త్ర ప్రయోగము గావించి దానిని శాంతింప జేసెను. అంత మాయావి అయిన అనుసాల్వుడు వాయువ్యాస్త్ర ప్రయోగము గావించెను. అనిరుద్ధుడు పర్వతాస్త్ర ప్రయోగము గావించి దానిని వ్యర్ధ పరచెను. తదుపరి అనుశాల్వుడు వేయి బారువుల బరువుగల గొప్ప గద చేపట్టి కృద్ధుడై వీరశిరోమణి అయిన అనిరుద్ధునితో ఇట్లనియె.

"నీ సేన యందు ఎవరేని గదాయుద్ధ కుశలురున్న ఎడల వారు ముందుకు రావలసినది." అది విన గదాధారి అయిన గదుడు అనిరుద్ధుడు చూచుచుండగనే మందుకురికి "దైత్యరాజా! ఈ సేన యందు అస్త్ర శస్త్ర నిపుణులు ఎందరోకలరు. అందువలన గర్వము వలదు. ఎందువలననగా రణక్షేత్రమున నీవు ఏకాకివి, నీవు నా మాట వినెదవేని, తొలుత నాతో యుద్ధము చేయుము. తదుపరి ఇతరులను చూడవచ్చు. " ఈ విధముగ పలికి గదుడు లక్ష బారువుల గద చేకొని అనుసాల్వుని శిరముపై, పిదప వక్ష స్థలము పై ప్రహరించెను. అనుసాల్వుడు సహితము గదుని ప్రహరించెను. ఈ విధముగ వారిరువురు క్రోధమూర్ఛితులై ఒకరిపై ఒకరు భయంకర ఘాతములు కావించుకొనుచుండిరి. ఇంతలో గదుడు అనుసాల్వుని పట్టి వందమార్లు త్రిప్పి ఆకాశము నందు విసరెను. అనుసాల్వుడు భూమిపై పడి, తిరిగి లేచి, గదుని సహితము ధరపై పడవైచెను. అటు పిదప గదుడు ఒక కుంజరమును పట్టి దానిని అనుసాల్వుని పై విసరెను. దైత్యుడు దానిని పట్టి తిరిగి గదునిపై విసరెను. వారిరువురు మొకాళ్ళు, మోచేతులతో ప్రహరించు కొనుచు చివరకు ఇరువురు మూర్ఛితులై ధరిత్రి పై బడిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందు రాజపుర విజయము అను ఇరువది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఇరువది అయిదవ అధ్యాయము

(అనుశాల్వుని ద్వారా అనిరుద్ధునకు బహుమతులు మరియు యాగాశ్వము అర్పింపబడుట; పల్వల దైత్యుడు అశ్వమును అపహరించుట)

శ్రీ గర్గాచార్యులు "వారిరువురి ద్వంద్వ యుద్ధమును గాంచిన యాదవులు "అను సాల్వుడు ధన్యుడు" అని పలికిరి. శత్రు సైనికులు "గదుడు మహావీరుడు" అని చర్చించిరి. ఇట్లీ విధముగ పలువురు పలు విధములుగ ఇరువురినీ ప్రశంశించుచుండగా బలానుజుడు గదుడు పైకి లేచి, క్రోధోద్రిక్తుడై "నా శత్రువు నన్ను ప్రహరించి రణభూమి యందు ఎచటి కేగెను?" అని పలికి, అనుసాల్వుని చూచి, చేతితో పట్టి, అనిరుద్ధుని వద్దకు ఈడ్చుకొని వచ్చి వజ్రము వంటి పిడికిలి తో రెండు మార్లు ప్రహరించెను. అంత అనుసాల్వుడు తిరిగి మూర్ఛితుడయ్యెను. అంత అనిరుద్ధుడు వానిపై స్వయముగ శీతల జలము జల్లి, వ్యజనములు వీపించి అతనికి స్పృహ రప్పించెను. అంత అనుసాల్వుడు లేచి ఎదురుగ శ్యామవర్ణ పరమ సుందరుడు అనిరుద్ధుని గాంచి ప్రణామములర్పించి "శ్రీకృష్ణ పౌత్రా! అనిరుద్ధా! నీవు నా ప్రాణములు రక్షించితివి. నా అపరాధములు మన్నింప వలసినది. సచ్చిదానంద స్వరూపుడయిన వాసుదేవునకు నమస్కారము. సంకర్షణ, ప్రద్యుమ్న, అనిరుద్ధులయిన మీకు నమస్కారము. మీరు మీ అశ్వమును స్వీకరింప వలసినది. నేను సహితము మీతో మీ అశ్వరక్షణకై వచ్చెదను."

ఈ విధముగ పలికి నగరమునకు చని, యాగాశ్వముతో పాటు పది వేల గజమును, ఒక లక్ష హయములు, ఏబది వేల రథములు, ఒక వేయి శిబికలు, అర్పించెను. అంతేకాక ఒక వెయ్యి ఒంటెలు, వేయి గవయములు, పంజరమున బంధించిన రెండు వేల సింహములు, ఒక వేయి వేట కుక్కలు, వేయి శిబిరములు, ఒక లక్ష ధనువు యొక్క నారిలు, పది వేల పరదాలు, ఒక లక్ష క్షీరము నిచ్చు గోవులు, ఒక వేయి బారువుల బంగారము, నాలుగు వేల బారువుల వెండి, అనిరుద్ధున కర్పించెను. అంత అనిరుద్ధుడు అత్యంత ప్రసన్నుడై అతనికి మణిమయ హారము బహూకరించెను. అనుసాల్వుడు ఒక శ్రేష్ఠమయిన మంత్రిని రాజ స్థానమున తాత్కాలికముగ నియమించి అనిరుద్ధునితో యాగాశ్వ రక్షణ కేగెను. స్వేచ్ఛగా ఆ హయము అనేక దేశములందు పయనించుచూ, ముందుకు పోవు చుండెను. అంతటా రాజ లోకము నందు "అనుసాల్వుడు ఓడెను. యవనాశ్వుడు, భీషణుడు సహితము పరాజితులైరి." అనిన మాటలు విని రాజులెవ్వరు ఈ హయమును ఆపుటకు ప్రయత్నింపలేదు. ఈ విధముగ తిరుగు చుండగా ఆరు మాసములు గడచి ఇంకనూ ఆరు మాసములు మిగిలి యున్నవి. మణిపురి, రత్న పురాధీశులు హయమును పట్టి అనిరుద్ధుని భయమున తిరిగి దానిని వదలిరి.

ఇట్లు అనేక దేశములు తిరుగుచూ, ఆ శ్యామకర్ణము తూర్పు దిశగా ప్రయాణించి పల్వల దైత్యుని నివాసమున కేగెను. ఈ దైత్యుడు నారద మహర్షి ద్వారా ఈ యజ్ఞాశ్వ వృత్తాంతమును విని, నైమిశారణ్యమున జరుగబోవు యజ్ఞమును వినాశము గావించి, తొందరగా తన రాజ్యమున కేతెంచెను. దారిలో ప్రయాగ క్షేత్రమున నీరు త్రాగుచున్న యాగాశ్వమును చూచి శ్రీకృష్ణ భగవానుని ఏ విధముగనూ లెక్కపెట్టక, వెంటనే ఆ అశ్వమును పట్టెను. ఆ సమయమున వృష్ణి వంశీయులందరూ దండకారణ్యము దర్శించి చర్మణ్వతీ నదిని దాటి, చిత్రకూటము ప్రవేశించిరి. అచట శ్రీరామ క్షేత్ర మందు దానము లిచ్చి, అశ్వమును వెదకుచూ ప్రయాగ క్షేత్రమున కేతెంచిరి. అచట వారు పత్ర సహిత యాగాశ్వమును దురాత్ముడయిన పల్వలాసురుడు పట్టి బంధించుట గమనించిరి.

పల్వలుడు కాటుక కొండవలె నల్లగ యుండి, రెండు యోజనముల పొడవు గలిగి, నేత్రములు నిప్పుకణికల పోలియుండి, వాని మీసములు, గడ్డము, తామ్రశిఖల వలె మెరయుచుండెను. పెద్ద పెద్ద దంతములు, ఉగ్రభృకుటి కలిగి ఆతని ముఖము అత్యంత భయంకరముగ గోచరించుచున్నది. ఆ బ్రాహ్మణ ద్రోహి తన నాలుకను పాము వలె ఆడించు చుండెను. ఆ నాలుక యందు పది వేల ఏనుగుల బలము కలదు. వానిని చూచుట తోడనే యాదవుల పెదవులదిరి. "ఓరీ! నేవెవరవు? మా యాగాశ్వమును తీసికొని నీవు ఎచటకు పోవుచున్నావు? శీఘ్రముగ దానిని విడువుము. లేని యెడల మా చేతులలో మృత్యువు నొందెదవు?" పల్వలుడు "నేను దేవతలకు సహితము దు:ఖము నీయగల పల్వల దైత్యుడను. నా ఎదుట మానవులు భయము చే వ్యాకుల చిత్తులగుదురు." అంత యాదవ యోధులు వానిపై బాణ వర్షము కురిపింప నారంభించిరి. అంత ఆ దైత్యుడు అశ్వ సహితుడై అంతర్ధానుడు అయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి "పల్వల దైత్యుని చే అశ్వాప హరణము అను ఇరువది అయిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఆరవ అధ్యాయము

(నారద మహర్షి ముఖతా పల్వల దైత్యుని నివాసము తెలిసి, యాదవులు అనేక తీర్థములందు స్నాన దానములు చేసి కపిలాశ్రమమును చేరుట; అచట కపిల మునికి ప్రణామములర్పించి సాగరతటమున నిద్రించుటకు శిబిరములు వేయుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! యాగాశ్వము అపహరింపబడుటచే సర్వులు శోక సముద్రమున మునిగిరి. "ఇపుడు మన కర్తవ్యమేమి?" అని ఆలోచించుచున్న అనిరుద్ధాది వీరులకు ఏ ఉపాయము స్ఫురింపలేదు. ఇంతలో వారి

వద్దకు నారద భగవానుడు ఏతెంచెను. నారద మహర్షి ని కాంచి అనిరుద్ధుడు మిక్కిలి సంతోషించి, ఆయనను ఆశీనుని గావించి, విధి విధానముగ పూజించి ఇట్లడిగెను "భగవాన్! మీరు వక్తలందు శ్రేష్ఠులు. దురాత్ముడయిన పల్వలుడు మా అశ్వమును తీసికొని ఎచటకు పోయెను? దయచేసి మాకు తెలుప వలసినది. మీ దర్శనము దివ్యము. మీరు ఆదిత్యుని వలె మూడు లోకములు సంచరించెదరు. త్రిభువనాంతరాళమున వాయువు వలె చరించు మీరు సర్వజ్ఞులు మరియు ఆత్మ సాక్షులు. అందువలన మాకు పల్వలుని సమాచారము తెలుపవలసినది."

ఇది వినిన నారదమహర్షి ఇట్లనియె "నృపేశ్వరా! పల్వలుడు మీ అశ్వమును తీసికొని సముద్ర మధ్యమున గల పాంచజన్యమను ఉప ద్వీపమునందు బంధించెను. ఆతని మిత్రుడు, బంధువు అయిన శకుని యాదవుల చేత మరణించుట చే ఆతడు యాదవుల పరిమార్చుటకు ఈ కార్యము కావించెను. అతడు సుతల లోకము నుండి రాక్షసులను రప్పించి అచట రాజ్యము చేయుచుండెను. అతడు శివ వరప్రసాది. అందువలన మిక్కిలి గర్వితుడై యుండును." అంత అనిరుద్ధుడు "నారద మహర్షి! చంద్రమౌళి, శివుడు ఈ దైత్యునకు ఏ విధమయిన వరములిచ్చెను? ఆతని ఏ కార్యముచే శివుడు సంతుష్టుడయ్యెను?" నారదుడు "ప్రద్యుమ్న పుత్రా! ఒకానొక సమయమున ఈ దైత్యుడు కైలాస పర్వత మందు ఒంటి కాలిపై నుంచొని పన్నెండు సంవత్సరములు ఘోర తపమాచరించెను. అందుకు శితికంఠుడు సంతుష్టుడై వరము కోరుకొనమనగా, దైత్యుడు "సదాశివా! మీకు నమస్కారము. కృపానిధానా! మహా సమరమందు మీరు నన్ను రక్షింప వలసినది," అని పలికెను. శివుడు "తథాస్తు" అని పలికి అంతర్ధానుడయ్యెను. అప్పటి నుండి ఆ దైత్యుడు పాంచజన్య ఉపద్వీపము నందు బలవంతముగ రాజ్య పాలనము చేయు చుండెను. ఆతడు మీకు సమరము మినహా వేరే విధముగనూ అశ్వమునీయడు." అనిరుద్ధుడు "ముని వర్యా! నేను సేనా సహితముగ దుష్టపల్వనుని హతమార్చెదను. ఒకవేళ అతడు శివ ప్రసాదమున సమరము చేసిననూ నాకు పూర్ణ విశ్వాస మున్నది. శివ భగవానుడు ఈ కృష్ణ ద్రోహికి రక్షణ నీయడు."

ఈ విధముగ పలికి అనిరుద్ధుడు విజయ యాత్రకై అకస్మాత్తుగా యాదవులందరికీ ఆజ్ఞనిచ్చెను. నారద మహర్షి హృదయమున సమరమునవలోకింప వలెనన్న కాంక్ష కలదు. ఆయన అనిరుద్ధుని నుండి వెడలుటకు అనుమతి నడిగి, ఆకాశ మార్గమున ఆ ఉపద్వీపము దరికి ఏగెను. పిదప యాదవులందరూ తీర్థ రాజము నందు స్నాన దానములు సలిపి యుద్ధ యాత్రకై సంసిద్ధులైరి. వారు రథ, గజ, హయములు ప్రయాణించుటకు ప్రతి దినము రెండు లక్షల సైనికులు మార్గము సుగమము కావించు చుండిరి. ఆ నిష్కంటక మార్గ మందు పదాతులు సహితము మిక్కిలి వేగముగ వెడలుచుండిరి. యాదవ సేన భారము చే శేషనాగము పీడితుడై ఇట్లనుకొనెను" ఈ భూతలమున ఏమి జరుగుచుండెను?".

అనిరుద్ధుడు సేనకు ముందు గుప్తభావముతో వెడలుచుండెను. అశ్వ రక్షణ అనునది కేవలము ఒక కారణము. ఆ కారణమున ఆయన పాపులందరినీ నశింపజేయుచూ ఎక్కడికి వెళ్ళిననూ అక్కడ శ్రీ కృష్ణ యశోగానమును ఆలపించుట నాలకించెను. వారి వద్ద గల ధనమంతయు శ్రీకృష్ణ చిత్త మత్తులకు ప్రసన్న పూర్వకముగ అర్పించుచుండిరి. ఈ విధముగ వారు శ్రీకృష్ణ యశోగానమును వినుచూ వారు కాశీ, గయాది తీర్థములు, క్షేత్రములు దర్శించి తూర్పు దిశగా పయనించిరి. యాదవుల మహాసేనను గాంచి గిరి వ్రజ పురాధీశుడు, జరాసంధ పుత్రడు సహదేవుడు శంకితుడై, నానా విధముల రత్న రాశులను తీసికొని భయవిహ్వాలుడై, అనిరుద్ధుని పదముల వ్రాలెను. శరణాగత వత్సలుడయిన అనిరుద్ధుడు సహదేవుని ప్రసన్నతా పూర్వకముగ లేవనెత్తి, ఆదరించి, ఒక రత్నమాలను బహూకరించి, రాజ్యము నందు తిరిగి స్థాపించి, అచట నుండి కపిలాశ్రమమునకు చేరెను. అచట గంగా సాగర సంగమమందు గ్రుంకులిడి, కపిల మహామునిని సందర్శించి, సేనా సహితముగ ఆయన పాదములకు నమస్కరించెను. పిదప ఆయన అశ్రమమునకు దక్షిణముగ దివ్య హర్మ్యములు వంటి శిబిరములు వైచి, అనిరుద్ధుడు అనుయాయుల సహితుడై, విజయాభిలాషులయిన సమస్త యాదవ సైన్యముతో విశ్రాంతి నొందెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి అశ్వమునకై ఉపద్వీపాగమనము అను ఇరువది ఆరవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఏడవ అధ్యాయము

(యాదవులు సముద్రముపై బాణమయ సేతు నిర్మాణము కావించుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదుపరి అనిరుద్ధుడు ఉద్ధవుని పిలచి ఇట్లనియె "మంత్రివర్యా! మన యాగాశ్వమును అపహరించిన పల్వలుని పాంచజన్య ద్వీపము ఎంత దూరమున యున్నది?" ఉద్ధవుడు శ్రీకృష్ణ చరణార విందములను తలచి ఇట్లనియె "ప్రభూ! మార్గ మధ్యమున నేను విన్నది మీకు తెలిపెదను, "పాంచజన్య ద్వీపము సముద్ర మధ్యమున దక్షిణ దిశగా ముప్పది యోజనముల దూరము నున్నది." అది వినిన బలవంతుడు, ధైర్యశాలి, నిత్యోత్సాహి అయిన అనిరుద్ధుడు యాదవ వీరులతో ఇట్లనియె " మనము సాగరమును దాటవలెను. అందువల్ల బాణములతో ఈ సముద్రముపై వంతెన నిర్మింపవలసినది." అంత యాదవ వీరులు పరస్పరము మందస్మితులై ధనువులు చేపట్టి బాణ వర్షము కురిపింపసాగిరి. సమస్త జలచరములు ఆ తీక్షణ బాణ సమూహమునకు గాయపడి దూరముగ పరుగులెత్తినవి. అంత దేవర్షి నారదుడు ఆకాశ మార్గమున వీరిని గమనించుచున్న వాడై ఇట్లనియె "మీరెవ్వరి బాణములు సముద్రమును దాటి ఉపద్వీపమును చేరలేదు." అ పలుకులు విని అక్రూర, హృదీక, సాత్యకి, ఉద్ధవ, కృతవర్మ, సారణ, హేమంగద, ఇంద్రనీల, అమలాశ్వాది భూపాలుర గర్వము సర్వము ఖర్వమైనది. అంత అనిరుద్ధుడు శ్రీకృష్ణ భగవానుని చరణార విందములను మనసారా స్మరించి శాంగధనువు తుల్యమయిన మరొక ధనువును చేపట్టి, ఆకర్ణాంతము లాగి బాణ పరంపరను వర్షించెను. అంత నారదుడు "అనిరుద్ధుని సాయకములు సముద్రమును దాటి ఒడ్డును చేరినవి" అని పలికెను. అంత దేవర్షి పలుకులు విని సాంబుడు, దీప్తిమానుడు మొదలగు యాదవులు సహితము నారాచములను సంధించి వదలిరి. అవి కూడా తీర ప్రాంతమున కేగినవి. వీరు కోట్లాది బాణ పరంపరను ప్రయోగించిరి. ఈ ప్రక్రియను ఆలోకించి ధనుర్ధారులందరూ ఆశ్చర్య చకితులైరి. ఈ విధముగ సాగరోపరిభాగమున ఒక యోజనము వెడల్పు, ముప్పది యోజనములు పొడవు గల బాణపు వంతెన నాలుగు పహరములలో నిర్మితమయినది. ఆ రాత్రి అనిరుద్ధాది యాదవ వీరులు తమ శిబిరము లందు నిద్రించిరి. శ్రీకృష్ణ పౌత్రులందరూ ఆయన ప్రతిబింబములే! వారిని గూర్చి ఏమని తెలుపుదును?

(సేతు బంధనమను ఇరువది ఏడవ అధ్యాయము సమాప్తము)

ఇరువది ఎనిమిదవ అధ్యాయము

(యాదవులు పాంచజన్య ఉపద్వీపము చేరుట; దైత్యుల మంత్రాంగము; మయాసురుడు యాగాశ్వమును తిరిగి ఇమ్మని సలహా ఇచ్చుట; కానీ పల్వలుడు యుద్ధమునకు కృత నిశ్చయుడగుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! మరునాడు ఉదయము అనిరుద్ధుడు శౌచ కర్మలు ముగించి, యాదవ సహితుడై, తొలుత శ్రీరామ చంద్ర ప్రభువు కపి సేనా సహితుడై సాగరమును దాటిన వైనమున, సాగరమును దాటి వంద యోజనముల విస్తీర్ణముగల పాంచజన్య ఉపద్వీపమును గాంచిరి. ఆ ద్వీపమున అసురపురి ఇరువది యోజనముల విస్తీర్ణమున దైత్య నివాసమై యున్నది. అందు పున్నాగ, నాగకేసర, చంప, తిలక, దేవదారు, అశోక, పాటల, మామిడి, మందార, కోవిదార, నిమ్మ, నేరేడు, కదంబ, పనస, పాల, తమాల, మల్లి, జాజి, మదన మొదలగు వృక్షములు, మరియు వానినల్లుకున్న తీగలతో బహు పుష్పమయమై ఆ దైత్య నగరము అత్యంత సుందరముగ యున్నది. అందు భవనములు రత్న నిర్మితములు.

అంత యాదవులు ఆగమనమును వినిన దుష్ట పల్వలుడు వారి సేనను గణించుటకై మాయావి అయిన మయుని పంపెను. మయుడు వెళ్ళి యాదవ సేనను పరికించి, చూచి విస్మితుడై వెనుకకు వచ్చి ఇట్లనియె “దైత్యరాజా! బలవంతులయిన వృష్ణి వంశ యోధులను గణించుట నశక్యము. అక్కడ అనిరుద్ధుడు లక్షల, కోట్ల సేనా పరివేష్ఠితుడై యున్నాడు. సమస్త యాదవులు సాగరో పరిభాగమున బాణములతో సేతువు కట్టి ఇచటకేతెంచిరి. వారి సేనా వాహిని దేవతలను సహితము విస్మితుల కావించుచున్నది. దైత్యరాజా! నేను ముసలి వాడనైనాను. కాని ఇంతవరకు సాగరో పరిభాగమున బాణములతో వంతెన కట్టుట కనలేదు. వినలేదు కూడా! ఇది ఇపుడు నీ ఎదుటనే జరిగినది. రఘుకుల శిరోమణి అయిన శ్రీరామచంద్రుడు సహితము కపులచే సేతువు కట్టించెను. అది రాళ్ళు మరియు వృక్షములచే కట్టబడినది. అది ఆయన యొక్క నామ ప్రభావము చే జలములపై తేలియాడినది. దానిని నేను ప్రత్యక్షముగ చూచితిని. కానీ ఈనాడు నేను చూచినది పరమాద్భుతము. మహారాజా! పూర్వము శ్రీకృష్ణుడు కంసుడు, శకుని మొదలగు ఘోర ప్రతాప వంతులయిన దైత్యులను సంహరించెను. భూతలమందు సమస్త రాజులను పరాజితులు కావించెను. శ్రీకృష్ణుడు సాక్షాత్ భగవంతుడు. పూర్వ కాలమందు బ్రహ్మదేవుని ప్రార్థనచే భూతల భార హరణమునకు, భక్త జన రక్షణకు, ఆయన గోలోకము నండి అవతీర్ణుడయ్యెను. ఆయన దుష్టులను, పాపులను నాశనము చేయుటకు కుశస్థలి యందు విరాజమానుడయ్యెను. అందువల్ల అనిరుద్ధాది వీరులు భీషణ, బకాది అసురులను; అన్య నరేశ్వరులను జయించి ఇచటకు ఏతించిరి.

“శ్రీకృష్ణ పుత్ర పౌత్రులు, బంధు వర్గము ఆకాశమును కూడా జయించుటకు వెనుకాడరు. వారికి భూతల మందు విజయము సాధించుట ఒక లెక్క కాదు. అందువలన పల్వలా! నీవు మరణించక బ్రతికియున్న దైత్యుల సుఖము కొరకు, కులనాశనము కాకుండ యుండుటకు యాదవుల యాగాశ్వమును వారికి అప్పగించ వలసినది. దేవ ద్రోహులయిన దైత్యులకు సుఖము లభించుటకు తపస్సుచే సంక్రమించిన ఈ రాజ్యమును శ్రీకృష్ణ భజన గావించుచూ భోగించుము.” ఈ విధముగ శుభ వచనములతో నచ్చ చెప్పినప్పటికీ పల్వలుడు శ్రీకృష్ణ విముఖుడు కావున, ఒక పెద్ద నిట్టూర్పు విడచి రోషభూయిష్ఠుడై ఇట్లు పలికెను “దైత్యా! నీవు యుద్ధము చేయలేక భయభీతుడ వగుచున్నావు. నా యెదుట మిక్కిలి హాస్యాస్పదమయిన పలుకులు పలుకుచున్నావు. నీకు ముసలి తనము వలన బుద్ధి మరియు బలము క్షీణించినవి. అందువలన నేను నీ మాట వినను. శ్రీకృష్ణుడు సాక్షాత్ భగవంతుడు అయినప్పటికీ, యాదవులు ఆయన వంశస్థులు అయిననూ నేను శివభక్తుడను. నా ఎదుట వీరు నిలువలేరు. నీవు భయపడవలదు. నీ మాయా శక్తులన్నియు ఏమయినవి? నేను నీ మంత్ర బలము చేతనే యుద్ధము చేసెదను. అనిరుద్ధుడు శూరుడయిన నేమి? మనము కామా? నేను బ్రతికి యుండగా ఈ యాదవుల కింత కండకావరమా? నేను నా ధనుస్సు నుండి విడిచిన బాణముల ధాటిచే అనిరుద్ధుని గర్వమును సంపూర్ణముగ హరించెదను. నేను సమరాంగణమున తీక్షణ సాయక వర్షము కురిపించి, అనిరుద్ధుని కవచమును ఛిన్నాభిన్నము కావించి రక్తపుటేరులు ప్రవహింప జేయుదును. యోగినులు పుర్రెలలో మానవుల రక్తముతో తమ దాహార్తతను తీర్చుకుందురు. వైరి వీరుల పచ్చిమాంసము తిని నేడు మహాకాళి సంతుష్ఠ అగును. నేను నా మహా కోదండ పాండితీ ప్రకర్ష చే కోట్లాది భల్ల బాణములు కురిపించుచుండగా సమస్త లోకములు విస్మితములై నా పౌరుష పరాక్రమములను ప్రత్యక్షముగ కాంచును.”

పల్వలుని పలుకులు విన పరమ బుద్ధిమంతుడు, మాయావి అయిన మయుడు, శ్రీకృష్ణుడు మహత్త్వమును తెలిసిన కారణమున తిరిగి ఇట్లనియె “నీవు ఒకవేళ ఈ యాదవ యోధులయిన శ్రీకృష్ణ పుత్ర పౌత్రులను ఓడించిన ఎడల శ్రీకృష్ణ బలరాములు ఇచటకు ఏతెంచెదరు.” ఈ విధముగ నచ్చ చెప్పిననూ కాల పాశము చే బంధితుడయిన దుష్ట దైత్యుడు ఆ సలహాను వినక పెడ చెవిని పెట్టెను. పల్వలుడు “ శ్రీకృష్ణ బలరాములు నాకు పరమ శత్రువులు. సమస్త వృష్ణి వంశజులు నాకు శత్రుగణమే! ఎవరు నా మిత్రుల మరణమునకు కారకులైరో నేను వారిని మృత్యు ద్వారమునకు చేర్చెదను. ఇపుడు ఈ యాదవులును సంహరించి, తదుపరి నేను సహితము యజ్ఞము చేసి, ఆ యజ్ఞము నందు ద్వారకా పురికేగి అచట మిగిలిన యాదవులను ఉట్టడిగించెదను. మయుడు “దైత్యరాజా! గర్వము వీడుము. ఈ అశ్వము కాలరూపమై నీ నగరమునకు ఏతెంచినది. ఇంత వరకు మరణించక మిగిలియున్న మహాదైత్య సంహారము కావించుటకు మాత్రమే ఈ యాదవసేన ఇచ్చటకు అడుగుపెట్టినది. అనిరుద్ధుని బాణ సమూహములు నీ నగరమును

ఛిన్నాభిన్నము కావించి శూరవిహీనము కావించును. ఇందు సందియము లేదు. ఎవరు హిరణ్యాక్షాది దానవులను సంహరించెనో, రావణ కుంభకర్ణాది నిశాచరులను నిర్జించెనో, ఆ శ్రీహరియే శ్రీకృష్ణ రూపమున అవతీర్ణుడయ్యెనని నేను వింటిని. నీవు నీకున్న చిన్న రాజ్యమును చూచి గర్వపడు చున్నావు. నా మాట వినుము. అశ్వమును తిరిగి ఇచ్చి నీ రాజ్యము, కులము, కుశలములను కాపాడుము. మనకు ఈ కాలము అనుకూలము కాదు. పల్వలుడు "నేను నీ మాటను అర్థము చేసి కుంటిని. నీవు యాదవులతో సమరము చేయవు. పూర్వము రావణ సహోదరుడయిన విభీషణుడు శ్రీరాముని శరణు వేడినట్లే నీవును యాదవుల వద్దకు పొమ్ము."

పల్వలుని మాటలను వినిన మయుడు తన మానసిక దు:ఖము నివారించుకొనుటకై ఇట్లు తలపోసెను. "పూర్వ కాలమందు వైర భావముతో భగవచ్చింతన చేసిన కారణమున అనేక దైత్య నిశాచరులు వైకుంఠ ధామము చేరిరి. అందువలన ఎవరు ఆ భావమున శ్రీహరికి హృదయమున స్థాన మర్పించెదరో వారు సహితము ఉత్తమ గతుల నొందుదురు." ఈ విధముగ తలపోసి మయుడు అకస్మాత్తుగా ఇట్లనియె "పల్వలా! నీవు మహావీరుడవు. నేను నిన్ను యుద్ధ భూమి నుండి పరాన్ముఖుని కావింపను. నీవు రణభూమికి ఏగి నీ సాయక సహాయమున యాదవ సంహారము కావింపుము. నేను నీ మాట ప్రకారమే సంగర భూమి కేగి సంగ్రామము కావింతును." ఇట్లు పలికి మయాసురుడు, పల్వలుడు మందహాసము గావించు చుండగా మౌనము వహించెను. ఆంత పల్వలుని నలుగురు మంత్రులు ఊర్ధ్వకేశుడు, నదుడు, సింహుడు, కుశాంబుడు మొదలగు వారు రోషభూయిష్ఠులై ఇట్లు పలికిరి" మహారాజా! మాకు ఎన్నాళ్ళుగనో యుద్ధము చేయు అవసరము కలుగలేదు. అదృష్ట వశమున నేడు కలిగినది. మేమందరము మయాసురుని తీసికొని యుద్ధ రంగమున కేగి క్షణములో యాదవ వధ కావించెదము. ఈ మంత్రుల మాటలు విని పల్వలుడు మిక్కిలి ప్రసన్నుడై వారికి రణము కావించుటకు అనుజ్ఞ నొసంగెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి "దైత్య మంత్రాంగణము" అను ఇరువది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఇరువది తొమ్మిదవ అధ్యాయము

(యాదవ దానవుల ఘోర సంగ్రామము; ఊర్ధ్వకేశ అనిరుద్ధుల ద్వంద్వ యుద్ధము)

శ్రీ గర్గాచార్యుల వారు "రాజేంద్రా! తదనంతరము ఊర్ధ్వ కేశాది మంత్రులందరూ కవచధారులై కోట్లాది దైత్య సేనను తీసికొని నగరము వెలుపలికేతెంచిరి. వారందరూ శ్రేష్ఠ ధనుర్ధరులు, మరియు విద్యాధర సమాన శౌర్య సంపన్నులు. వారందరూ లోహ కవచములు ధరించి ఖడ్గ, శూల, గదా, పరిఘ, ముద్గర, ఏకఘ్నీ, దశాఘ్నీ, శతఘ్నీ, భృశుండీ, బల్లెములు, బంధిపాలములు, చక్ర, సాయిక, శక్తి మొదలగు సమస్త అస్త్ర శస్త్రములు ధరించి, రథ, గజ, హయ, గోవులు, దున్నపోతులు, మృగములు, ఒంటెలు, గాడిదలు, పందులు సింహములు, నక్కలు, పెద్ద పెద్ద గ్రద్దలు, చీలములు, మొసళ్ళు, తిమింగళములు మొదలయిన వాహనములు అధిరోహించి రణ దుర్మధులయిన దైత్యులు సమరాంగణము ప్రవేశించిరి. దంధుభుల నాదము చే, వీరుల సింహ గర్జనలచే, శతఘ్నిల భయంకర రావము చే ధరిత్రి మాటిమాటికీ కంపించుచున్నది. అసురుల భయంకర సేనా వాహినిని గాంచి దేవతలయిన ఇంద్ర కుబేరులు భయకంపితులయిరి. భూతలము నందు అనేక విజయములను చవి చూచిన యాదవ సేన కూడా దైత్య సేనా వాహినిని కాంచి మనసు నందు కొంచెము విషాద ఛాయలు నెలకొన్నవి. పూర్వము రాజసూయ యజ్ఞమందు చంద్రావతీ నగర ముట్టడి యందు ప్రద్యుమ్నుడు కావించిన ధైర్య బోధను అనిరుద్ధుడు యాదవ సేనకు కావించెను. దానితో యాదవులందరూ మిక్కిలి ఉత్సాహమును ప్రోది చేసికొని, శస్త్రములు ధరించి రణోత్సాహులయిరి. అంత పాంచజన్య ఉప ద్వీపము నందు వారిరువురి సేనల

మధ్య ఘోర సమరము మొదలయినది. అయ్యది తొలుత జరిగిన వానర నిశాచర సమరమును జ్ఞప్తికి తెచ్చినది.

ఆ సమరము నందు రధికులు రధికులతో ఇట్లు ఎవరికి తుల్యమయిన వారితో వారు పరస్పరము కదనము కావించుచుండిరి. ఆ మహా సమరమున అనేక మద గజములు రధికుల సహిత రధములను, హయ, పదాతులను తమ తొండములతో ఎత్తి, విసరి, చూర్ణము కావించెను. కొన్నింటిని ఆకాశముపైకి, కొందరిని భూమిపై విసరి విధ్వంసము కావించెను. ఎన్నో క్షత విక్షితములయిన ఏనుగులు రణభూమి బయటకు పరుగులెత్తినవి. ఆ సమయమున అనేక మందిని తమ పద ఘట్టనల ద్వారా పిండి పిండి కావించెను. హయముల నధిరోహించిన వీర యోధులు రధములపై లంఘించి రధికులను, గజ కుంభ స్థలముల పైకెగరి గజారోహులయిన యోధులను ఊచకొత కోసిరి. కొందరు యోధులు హయముల నధిరోహించి, గజ సైన్యము నందు జొరబడి ఖడ్గధారులై అనేక గజముల పాదముల, తొండముల నరుకుచూ అనేక మంది శత్రు సేనలను విదీర్ణము కావించిరి.

అనేకమంది వీరులు ఖడ్గపాణులై అశ్వములను రెండు ముక్కలుగ ఖండించిరి. గజముల దంతముల పట్టి పైకి ప్రాకి వానిపై యున్న యోధులను సంహరించిరి. మారుతము ఎట్లు సునాయాసముగ కమలముల మధ్య నుండి ప్రసరించునో అట్లు కరవాలములు పట్టి ప్రత్యర్థులను ఖండించుచూ యోధులు ముందుకు సాగుచుండిరి. ఇట్లు ఇరు పక్షముల మధ్య బాణ, గద, పరిఘ, ఖడ్గ, శూల, శక్త్యాది ఆయుధ పాణులయిన యోధులు రోమాంచ కరమయిన సమరము కావించుచుండిరి. ఆ యుద్ధ భూమి అంతయు హయముల సకిలింపులతో, ఏనుగుల ఘీంకారములతో, పదాతుల గర్జనలతో నిండియుండెను. కొందరు యోధులు రధముల నేములు కత్తిరించుట చే రధములు కుప్పకూలినవి. సేనా వాహిని యొక్క పదఘట్టన చే పైకి లేచిన ధూళి రాశిచే సమరాంగహము పైనున్న ఆకాశము సంపూర్ణముగ కప్పబడి ఆ ప్రదేశమంతయు అంధకార బంధురమయినది. అచట ఎవరు తమవారో, ఎవరు పరాయివారో తెలియకున్నది. రధములు కూలి విరిగిన వృక్షముల వలె కానపట్టు చున్నవి. వీరులపై వీరులు, హయములపై హయములు, పడి యుద్ధ రంగము మహా ఘోరముగ యున్నది. ఇరు పక్షముల యందు రక్తము నదుల వలె ప్రవహించుచున్నది.

భేతాళ గణములు శివప్రీతిగా పుర్రెల మాలలు కట్టుటకై శిరములు సంగ్రహించుచున్నవి. సింహవాహిని మహాకాళి తన ఢాకినీ గణములతో రక్త పానము చేయుచూ కానపడినది. ఢాకినులు తమ సంతానమునకు వేడివేడి రక్తమును రుచి చూపించుచున్నవి. గంధర్వ, అప్సర, విద్యాధర, స్త్రీలు క్షత్రియ ధర్మముననుసరించి వీరగతి నందిన యోధులు దేవతా స్వరూపము ధరించుట చే వారిని వరించు చుండిరి. వారిలో వారు పతులకై కలహించు చుండిరి. ధర్మ పరాయణులైన శూరులు యుద్ధ భూమి యందు మడమత్రిప్పక కదనము సలిపిన శూరులు మరణించిన పిదప సూర్యమండలము భేదించి విష్ణు లోకమునకు ఏగుచుండిరి. ఎందరో వీరులు ఆ మహా యుద్ధము గాంచి రణ విరక్తులై సమరాంగణము నుండి పరుగులెత్తుచూ మరణించిరి. వారందరూ యమలోక గతులైరి. ఈ విధముగ అనేక మంది యాదవ యోధులు దైత్య శూరులను అంతక పురికి అతిధులు గావించిరి. కోట్లాది దానవులు, వేలాది యాదవులు ఆ సమరమున మృత్యుగతినొందిరి.

ఆ సమయమున ధనుర్ధారులందు శ్రేష్ఠుడయిన అనిరుద్ధుడు ఊర్ధ్వ కేశుని తో ద్వంద్వ యుద్ధ మొనర్చెను. వారిరువురు ఇంద్ర వృత్రాసురుల వలె కదనము కావించిరి. ఆ సమయమున నదునితో గదుడు, సింహుని తో వృకుడు, కుశాంబుని తో సాంబుడు సమరాంగణమున ఎదుర్కొనిరి. వారి మధ్య తుముల యుద్ధము ఆరంభమయ్యెను. అపుడు మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచూ ఊర్ధ్వకేశుడు అనిరుద్ధునిపై పది నారాచములు ప్రయోగించెను. రుక్మవతీ నందనుడు వానిని మార్గ మధ్యమున ఖండించెను. తదుపరి పల్వల మంత్రి మరియొక పది నారాచములను సంధించెను. అవి అన్నియు సర్ణ పక్షములు గల భల్ల బాణములు.

ఆ సాయకములు అనిరుద్ధుని కవచమును ఖండించి శరీరము నందు గుచ్చుకొనెను. పిదప నాలుగు బాణములు ప్రయోగించి అనిరుద్ధుని రధాశ్వములను సంహరించి, ఇరువది సాయకముల ద్వారా అనిరుద్ధుని ధనువును, నారిని ఖండించెను. ఈ విధముగ అనిరుద్ధుని నిలువరించి, రధహీనుని గావించగా అనిరుద్ధుడు వేరొక రధ మదిరోహించెను.

ఆ అదరము ఇంద్ర దత్తము. ఆ రథము నధిరోహించి, "ప్రతి శాంగ" మను ధనువును గ్రహించి, శ్రీకృష్ణ దత్తమయిన ఆ ధనువు నందు ఒకే ఒక బాణము సంధించి రోష భూయిష్ఠుడయిన ప్రద్యుమ్న కుమారుడు తన హస్త లాఘవమును ప్రదర్శించుచూ ఊర్ధ్వకేశుని రథముపై ప్రయోగించెను. అది ఊర్ధ్వకేశుని రథ సహితముగ ఆకాశము నందు పరిభ్రమింపజేసి క్రింద పడవైచెను. ఊర్ధ్వకేశుని రథము నిప్పులు విరజిమ్ముతూ భూమిపై పడి నుగ్గు నుగ్గు అయ్యెను. సారధి, హయములు పంచత్వము నందినవి. ఊర్ధ్వకేశుడు మూర్ఛితుడయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి యాదవాసురుల సంగ్రామమను ఇరువది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పదియవ అధ్యాయము

(ఊర్ధ్వకేశ అనిరుద్ధులు, నద గదుల ఘోర యుద్ధము, మరియు దైత్యులు సంహరింపబడుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తిరిగి ఊర్ధ్వకేశుడు మూర్ఛనుండి తేరుకొని వేరొక రథము నెక్కి అనిరుద్ధుని నిలువరింప సమకట్టెను. ఆతడు అనిరుద్ధుని సమక్షమున కేతించిన తక్షణము యాదవశూరుడు అ దానవుని రథమును చూర్ణము కావించెను. అంత దానవుడు వేరొక రథ మారోహించగా అద్దాని గతి అట్లే అయ్యెను. ఈ విధముగ ఊర్ధ్వకేశుని తొమ్మిది రథములు అనిరుద్ధుని ద్వారా భగ్నమయ్యెను. అంత దానవ శూరుడు కృద్ధుడై యాదవ కిశోరము పై ఒక తీవ్ర శక్తిని ప్రయోగించెను. తనపై పడుచున్న తీవ్ర శక్తిని అనిరుద్ధుడు తీవ్ర నారాచముల చే ఖండించెను. అంత ఊర్ధ్వకేశుడు ఒక స్వర్ణమయ రథము నధిరోహించి అనిరుద్ధుని ఎదుటకు వచ్చి, అయిదు సాయకములచే ఆతనిని గాయపరచెను. వాటి గాయములచే ప్రద్యుమ్న పుత్రుడు మిక్కిలి ఖేద పడెను. అంత కుపితుడైన శ్రీకృష్ణ పౌత్రుడు తన హస్త లాఘవమును ప్రదర్శించి విచిత్ర పక్షములు గల పది బాణములు దానవుని వక్షముపై ప్రయోగించెను. ఆ బాణములు తీవ్ర గతిని పోయి ఊర్ధ్వకేశుని హృదయ రక్తపానము కావించి, అబద్ధపు సాక్ష్యము నిచ్చు మానవులు నరక కూపమున పడవేయబడునట్లు ఊర్ధ్వకేశుని క్రిందపడవైచెను.

అంత దైత్యుడు తిరిగి పైకి లేచి "నిలు, నిలు" మని అరచి, పది బాణములు ఎక్కుపెట్టి అనిరుద్ధుని శిరముపై వైచెను. అవి అనిరుద్ధుని శిరస్త్రాణమున దిగి అతడు పది శిఖలు గల వృక్షము వలె శోభించెను. పూలచెండు మదగజమును గాయము చేయలేనట్లు, ఆ సాయకములు యాదవ శిరోమణిని ఏమియును చేయలేక పోయినవి. అంత అనిరుద్ధుడు కృద్ధుడై బంగారు రెక్కలు గల నూరు బాణములను ధనసున సంధించి విడువగా, అవి దైత్యుని సర్వాంగములు భేదించి, శరీరమును భేదించి ధరిత్రిపై దిగబడినవి. ఈ విధముగ శ్రీకృష్ణ భక్తి విముఖుడయిన మూఢుడు అధోగతి పాలయినట్లు ఊర్ధ్వకేశుడు ధరాశయనుడయ్యెను. దానవ సైన్య మందు హాహాకారములు, యాదవ సేన యందు జయజయ ధ్వానములు మిన్ను ముట్టెను. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. యాదవరాజా! ఊర్ధ్వకేశుడు దివ్యదేహధారుడై, విమానారూఢుడై, పుణ్యాత్ములకు నివాస స్థలమయిన స్వర్గ లోకము చేరెను.

తన సోదరుడు మరణించుట గాంచిన నదుడు మిక్కిలి శోకగతుడాయెను. గజారూఢుడయిన నదుడు వేరొక మదగజమందు విరాజమానుడయిన గదుని లక్ష్యముగ చేసికొని అనేక నారాచములను ప్రయోగించెను.

మహాదనుర్ధరుడయిన గదుడు అనిరుద్ధుడు చూచుచుండగనే ఒకే ఒక్క బాణముతో వాటిని ఖండించెను. సోదర దూర దు:ఖాంబుధి యందు మునిగిన నదుడు కుపితుడై తీవ్ర నారాచ ప్రయోగము చే గదుని గజమును సంహరించెను. ఆ యోధుని గజహీనుని గావించెను. అనేక బాణ ఘాతముల చే అంగ ప్రత్యంగములు విదీర్ణమై ఆ గజరాజము భూమిపై పడి పంచత్వము నొందినది. దానితో గదుడు సహితము క్రిందపడెను. ఈ అద్భుత ఘటన చే గదుడు

కుపితుడై గదాయుధుడై వనము నందు ఒక సింహము వేరొక సింహమును ఆక్రమించినటుల నదునిపై లంఘించెను. గదుడు తమను చేరగనే నదుని కుంజరము ఆతని పట్టి ఆకాశము పైకి వంద యోజనములు విసరెను. గదుడు క్రిందపడి, లేచి, నదుని వద్ద కేతించి, ఆతని గజమును తొండముతో సహా పట్టి గిరగిరా త్రిప్పి భూమిపై విసరెను. ఆ ఘాతము నకు నదుని గజము తక్షణమే మరణించెను. అది చూచి నదుడు ఆశ్చర్య చకితుడై, గదుని ప్రశంసించి, వేరొక గదను తీసికొని ద్వంద్వ యుద్ధమునకు గదుని ఆహ్వానించెను. గదుడు సహితము గదాయుధుడై ఆ ఆహ్వానము స్వీకరించి సమరసన్నద్ధుడయ్యెను.

అంత నదుడు "యాదవా! నీవు మానవుడవు. నీతో సమరము చేయుటకు నాకు సిగ్గుగా యున్నది. ఎందుకనగా నీవు అల్పుడవు. నాతో ఎట్లు యుద్ధము చేయగలవు! నీవే ముందు ప్రహారము కావింపుము. ఎందుకనగా నేను ప్రహారము కావించిన ఎడల నీవు మిగలవు." గదుడు ఇంద్రుడు వృత్రాసురునితో సంభాషించినటుల నదునితో భాషించి ఇట్లనియె "దైత్యా! నీవు పలుకు ప్రగల్భములు ఏమియును చేయలేవు. శూరులు రణరంగమందు అధిక ప్రసంగము కావింపరు. నీవు నీ పరాక్రమము చూపింపుము." అది విని కుపితుడై నదుడు గర్జన చేయుచూ తన విశాల గదాయుధము తో గదుని ప్రహరించెను. ఆ ప్రహారమును సహించి గదుడు విచిలితుడు కాక పర్వతము వలె నిలచెను. దైత్యుడు లజ్జితుడయ్యెను. అంత వీరశిరోమణి అయిన గదుడు నదుని గాంచి "పరంతపా! నీవు వీరుని వయిన ఎడల నా ప్రహారము సహితము చవిచూడవలసినది." అని పలికి గదుడు నదుని లలాటముపై ప్రహరించెను. దర్మజ్ఞుడయిన నదుడు గదుని భుజములపై ప్రహరించెను. వారిరువురు గదాయుద్ధ కుశలురు. ఒండొరులు రెండవ వారిని హతమార్చవలెనన్న అభిలాష తో చెలరేగి ప్రహరించుకొనుచూ విజయాభిలాషులై ప్రయత్నము కొనసాగించుచుండిరి. ఇరువురి యందు ఓడుటగాని, ఉత్సాహమును కొల్పోవుట గానీ లేదు. వారు ఫాలము, భుజములు, రక్తసిక్తమై పుష్పించిన పలాశ వృక్షముల వలె శోభించిరి. రెండు గదల ఘర్షణ చే అగ్ని కణములు పైకి లేచినవి. వారిరువురి మధ్య ఘోర సంగరము చెలరేగినది. అంత గదుడు నదుని రెండు భుజములు పట్టి, సింహము ఆబోతును క్రింద పడవేయునట్లు భూమిపై విసరెను. నదుడు గదుని వక్షముపై బలమయిన పిడికిలి పోటు పొడిచెను. గదుడు నదుని శిరముపై ప్రహరించెను.

ఇట్లు పిడికిళ్ళతో, మోకాళ్ళతో, భుజములతో, కాళ్ళతో, చేతులతో, ఒకరినొకరు పొడుచుచూ, నొక్కుచూ, కుమ్ముచూ, కొట్టుచూ, మల్లయుద్ధ విశారదను ప్రకటించిరి. ఇంతలో నదుడు గదుని పాదము పట్టి, త్రిప్పి భూమిపై విసరెను. అంత గదుడు రోషతామ్రాక్షుడై నదుని పాదము పట్టి త్రిప్పి త్రిప్పి ఒక కుంజరము యొక్క పృష్ఠ భాగముపై విసరెను. తిరిగి నదుడు లేచి రోహిణీ కుమారుని భుజములు పట్టి ఆకాశమున వంద యోజనములు విసరెను. అక్కడ నుండి క్రింద పడిననూ వజ్రదేహుడయిన గదునకు గాయము కాలేదు, కానీ మనసున కొంచెము వ్యాకులత నొందెను. అంత దైత్యుని పట్టి గదుడు ఆకాశమున సహస్ర యోజనములు విసరెను. నదుడు సహితము క్రిందపడి, తిరిగి లేచి, యుద్ధ సన్నద్ధుడై సమారంగణమున ప్రవేశించెను. వారిరువురు బాహువులతో, పిడికిళ్ళతో, కేశములతో, నఖములతో, దంతములతో, కాళ్ళతో, మోకాళ్ళతో, మోచేతులతో, చేతులతో, భుజములతో, ఘోర యుద్ధము సలిపి సమరాంగణము నందు ఇరువురు మూర్ఛితుడై పడిరి. ఇరుసేనల యందు వారిని ప్రశంశించిరి. గదుని మూర్ఛను కాంచిన అనిరుద్ధుడు శోకించి స్వయముగ శీతల జలము చిలకరించి, వ్యంజనమును వీచి గదుని మూర్ఛనుండి తెలివి తెచ్చుటకు యత్నించెను. ఇంతలో గదుడు లేచి "నదుడెక్కడ? నదుడెక్కడ?" అని అరచెను. కానీ ఆ సమయమునకు నదుడు ప్రాణ శూన్యుడై విగత జీవుడయ్యెను. యాద సేన అంతయు జయజయ ధ్వానములు కావించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి ఊర్ధ్వకేశ, నదుల వధ అను ముప్పదియవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఒకటవ అధ్యాయము

(వృకుడు సింహుని, సాంబుడు కుశాంభుని వధించుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తన సేన పరాజితమగుట కాంచి సింహుడను దానవుడు మిక్కిలి అగ్రహొదగ్రుడై, కన్నుల నుండి విస్ఫులింగములు విడుచుచూ, తన వాహనమయిన గార్ధభము నెక్కి రధారూఢుడయిన వృకుని లక్ష్యముగ నిడుకొని, అతనిపై బాణ వర్షము కురిపింప నారంభించెను. తనపై పడుచున్న బాణ వర్షమును తిలకించి శ్రీకృష్ణ నందనుడు వృకుడు క్రీడా సదృశముగ వానిని ఖండించెను. అంత అసురేశ్వరుని కోపమునకు అవధులు లేవు. ఆతడు ధనువుపై ఎనిమిది బాణములుంచి, నాలుగు సాయకములచే వృకుని హయములు సంహరించి ఒక బాణముతో పతాకమును ఖండించి, వేరొక నారాచము చే సారధి యొక్క శిరమును శరీరము నుండి వేరు పరచి, ఒక బాణముతో వృకుని నారి సహిత ధనువును ఖండించి, వేరొక బాణముతో వృకుని వక్షము నందు ఘాతము కావించెను. సింహుని అత్యద్భుత వీర పరాక్రమము గాంచి సర్వులూ ఆశ్చర్య చకితులైరి. అంత వృకుడు వెంఠనే ఒక శక్త్యాయుధమును స్వీకరించి సింహుని పై ప్రయోగించెను." అది సింహుని శరీరము ను ఛేదించి, వెనుక నుండి బయటకు వచ్చి, సర్పము బిలము లోనికి దూరునట్లు ఆ శక్తి దైత్యుని దేహము నుండి బయల్వెడలి ధరిత్రి యందు దిగబడెను. సింహుని వాహనము తత్కాలము మరణించినది. కానీ సింహుడు తిరిగి లేచి, గర్జనకావించి, ఒక పదునయిన శూలమును వృకునిపై విసరెను. తనపైకి వచ్చుచున్న శూలమును వృకుడు తన చేతితో పట్టుకొని, తిరిగి దానినే తన శత్రువుపై ఆఘాతించెను. సింహుని శరీరము విదీర్ణమయినది. ఆతడు హాహాకారములు కావించుచూ ధరిత్రిపై పడి ధరాశయనుడయ్యెను. ఆ సమయమున దానవ సేన యందు హాహాకారములు, యాదవ సేన యందు జయ జయ ధ్వానములు మిన్నుముట్టెను.

అంత క్రోధ పూరితుడయిన కుశాంబుడు రధారూఢుడై రణభూమి ప్రవేశించి సాంబాది యాదవ ప్రముఖులను తన తీవ్ర నారాచములచే బాధించి సమరము మొదలిడెను. ఆ యోధుని నారాచ ప్రహారము చే అనేక మదగజములు ఛిన్నాభిన్నమై ధరాశయనములయినవి. రధములు చూర్ణములయినవి. హయముల కంఠములుత్తరింప బడినవి. పదాతి దళములెవరికీ శిరములు మిగులకుండెను. ఈ విదముగ అనేక యోధుల మస్తకములు ఖండించుచూ, సమరాంగణమున స్వేచ్ఛగా తిరుగుచున్న కుశాంబుని పరాక్రమము గమనించి, సాంబుడు ఆతనిని ద్వంద్వయుద్ధమునకు ఆహ్వానించెను. సాంబుడు "వీర పురుషా! కోట్లాది సామాన్యులతో సమరమొనరించి సంహరించుట వలన లాభమేమున్నది? వచ్చి నాతో యుద్ధము చేయుము."

అంత కుశాంబుడు సాంబుని గాంచి నవ్వుచూ ఒకేసారి ఎనిమిది శరములను సాంబునిపై ప్రయోగించెను. అవి సాంబుని వక్షమును బాధించినవి. సాంబుడు అద్దానిని సహింపక, కోదండమునకు ఏడు సాయకములు సంధించి, ప్రయోగించి, దానవుని వక్షమునకు తీవ్ర ఘాతము కావించెను. ఆ వీరులిరువురు రోషావేశముతో, విజయకాంక్షతో, స్కంధ తారకులవలె సంగర మాచరించు చుండిరి. వారిరువురు విష సర్పముల వంటి సాయకములతో బాణ వర్షము కురిపింప సాగిరి. కుశాంబుడు తన ధనువుపై నూరు బాణములు సంధించి, ప్రయోగించి, సాంబుని రథహీనుని గావించి, ధనుసును ఖండించెను. తన ధనువు ఖండింపబడి, రధము చూర్ణమై, సారధి మరణించుట గాంచిన సాంబుడు వేరొక రధమారోహించి, ధనువు చేతబూని ఇట్లనియె "దైత్యా! ఇంత మహా పరాక్రమము ప్రదర్శించిన పిదప నీవు ఎక్కడికి పోయెదవు? ఒక్క క్షణము ఓపిక వహించి, నా పరాక్రమము చవిచూడుము." ఇట్లు పలికి ఒక తీవ్ర భల్ల బాణము ధనుసుకు సంధించి దానిని ఒక దివ్య మంత్రము తో అభిమంత్రించి కుశాంబునిపై ప్రయోగించెను. అది కుశాంబుని సారధి సహితముగ రధమును అలాత చక్రము వలె గిరగిరాత్రిప్పుచూ ఒక యోజనము దూరము ఈడ్చుబడెను. ఆ దృశ్యమును కాంచుచున్న సాంబుని ముఖ మందు హాస్యము తొణికిసలాడినది. తిరిగి సాంబుడు వేరొక తీవ్ర సాయకము

సంధించి ఇట్లనియె "ఓ! అసురేశ్వరా! నీ వంటి మహావీరులు, దేవేంద్రతుల్య పరాక్రములు స్వర్గ లోకము నందే నివాసయోగ్యులు. భూమిపై కాదు. ఈ నా సాయకములచే నీవు నిస్సందేహముగ స్వర్గమునకేగెదవు. నీపై నా కృప యున్నది." ఈ విధముగ పలికి ఆ దివ్యాస్త్రమును ప్రయోగించెను. ఆ బాణము కుశాంబుని రథ, సారథి సహితముగ అనేక లోకములు దాటి సూర్యమండలము వరకు పోయెను. సూర్యుని తేజస్సు చే రథము దగ్ధమయినది. దైత్యుని శరీరము కాలి, నిర్జీవమై ఆసురీపురమున పల్వలుని సమీపమున పడెను. అంత దానవ సైన్యమందు హాహాకారములు, యాదవ సైన్యమందు జయ జయ ధ్వానములు చెలరేగినవి. దేవతలు సాంబుని పై పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద మందలి సింహ, కుశాంబుల వధ అను ముప్పది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ముప్పది రెండవ అధ్యాయము

(మయుడు పల్వలునికి నచ్చచెప్పుట; పల్వలుని యుద్ధ ఘోష; సమస్త దైత్యుల యుద్ధమునకు నిర్గమించుట; ఆలస్యముచే సైన్య పాలక పుత్రుని వధ; దు:ఖితుడయిన సైన్య పాలకునికి మంత్రి పుత్రులు వివేక పూర్ణ సూచన)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! స్వర్ణ సింహాసనాధిష్ఠుడయిన పల్వలునికి మయుడు తిరిగి ఈ విధముగ బోధించెను. "నరేశ్వరా! మీరు యాదవుల బలము చూచితిరి. దైత్య సమూహ సహితముగ మీ మంత్రులు నలుగురు మరణించిరి. ప్రస్తుతము ఈ నగరము మొత్తములో మిగిలియున్న ప్రముఖులము మన మిద్దరము మాత్రమే!" పల్వలుడు "నేను యాదవులను శీఘ్రముగ నాశనము చేయుటకు యుద్ధ భూమికి ఏగుదును. నీవు నా భవనము నందు దాగుకొనుము. శ్రీకృష్ణుడు తొలుత నందపుత్రుడని పిలువబడెను. ఈ సిగ్గులేని వసుదేవుడు ఇపుడు తన పుత్రుడు అని చెప్పుచున్నాడు. ఈతడు గోపికల ఇండ్లయందు పాలు, పెరుగు, వెన్న, నెయ్యి మొదలగు దుగ్ధ రసములను అపహరించువాడు. రాసమండలి యందు కాముకుడై నాట్యము చేయును. జరాసంధుని భయముచే సముద్రమును శరణు వేడెను. ఎవరు తన మేనమామను చంపెనో ఆతడు పురుషార్థములను ఎట్లు ఈయగలడు?" పల్వలుని మాటలు వినిన మయుడు క్రోధితుడై ఇట్లనెను. "ఓరీ! మూఢుడా! ఎవరి వలన బ్రహ్మ, రుద్రుడు, మాయా (దుర్గ) మరియు ఇంద్రుడు భయము నొందునో, అట్టి సర్వ భయంకరుని, నిత్య నిర్భయుని, నీవు నిందించుచున్నావు. ఎవరు మూర్ఖులై అజ్ఞాన వశమున, కుసంగ కారణమున, శ్రీకృష్ణ భగవానుని నిందించెదరో వారు బ్రహ్మదేవుని ఆయువు పూర్తియగు వరకు కుంభీపాకమందు పడెదరు. ఎవరు చండపాల, శిశు పాలురను ఖండించెనో, ఎవరు దానవ దమనుడో, అట్టి పరమాత్ముని నీవు నీ కుల కుశలత కొరకు భజింపుము."

మయుని వచనములు విని పల్వలునకు పరమ జ్ఞానము ప్రాప్తించెను. అతడు ఒక్క క్షణ మాలోచించి ఇట్లనియె "శ్రీకృష్ణుడు విశ్వపాలకుడనీ, బలరాముడు ఆదిశేషుడనీ, ప్రద్యుమ్నుడు మన్మథావతారమనీ, ఇక్కడకు ఏతించిన అనిరుద్ధుడు సాక్షాత్ బ్రహ్మదేవుడనీ నాకు తెలియును. వీరి చేతి యందు మన వధ జరుగవలెను. దీనిని గూర్చి ఆలోచించియే నేను యాగాశ్వమును అపహరించితిని. ఆతని బాణ ఘాతము చే నాకు మృత్యువు ప్రాప్తించినేని, శీఘ్రముగ, సుఖ పూర్వకముగ నేను శ్రీకృష్ణ పరమ పదమున కేగుదును. తొలుత కూడా అనేక దానవులు శ్రీహరిని వైర భావముతో భజించి విష్ణుసాయుజ్యము నొందిరి. నేను సహితము ఆ వైర భావమును ఆశ్రయించుచున్నాను.

ఈ విధముగ పలికి పల్వలుడు కవచము ధరించి, సేనాపతిని పిలచి "సేనాపతీ! నీవు ప్రయత్న పూర్వకముగ దండోరా వేయించి ఈ పురము నందు నా ఆదేశమును అమలు జేయుము. వీరుల యందు ఎవరు బ్రతికి యున్ననూ, వారందరూ అనిరుద్ధునితో సమరమునకు సిద్ధము కావలయును. లేని ఎడల వారెవరైననూ వధార్హులు." పల్వలుని ఆదేశానుసారము సేనాపతి ఆ ఆజ్ఞను (ఆదేశమును) వీధి వీధికి, ఇంటింటికీ దండోరా వేయించెను. దండోరాతో పాటు ఈయబడిన భీషణ ఆజ్ఞానుసారము అందరూ అన్ని రకముల శస్త్రా స్త్రములను తీసికొని పల్వలుని సభా భవనమునకు

విచ్చేసిరి. తొలుత సేనాపతి కవచదారియై, చేత ఖడ్గము ధరించి రధారూఢుడై నగరము నుండి బయలు దేరెను. దుర్నేత్రుడు, దుర్ముఖుడు, దు:స్వభావుడు, దుర్మదుడు – ఈ నలుగురు మంత్రి పుత్రులు కూడా యుద్ధమునకు బయలుదేరిరి. పల్వలునితో మత్త గజములు, చపలమయిన గుర్రములు, దేవ విమానముల వంటి రధములు బయలు దేరినవి. ఈ చతురంగ బలములతో పాటు ఇష్టానుసారము సంచరించగల మయ దత్తమయిన రధము నందు పల్వలుడు బయలు దేరెను. ఆతని వెంట నాలుగు లక్షల రాక్షస వీరులుండిరి.

సేనా పాలకుని పుత్రుడు క్షధార్తుడై ఇంటి యందు భోజనము చేయుచుండెను. అందువలన ఆతడు యుద్ధ నిమిత్తము నియమిత సమయములో రాలేక పోయెను. ఆతడు రాకపోవుటను సైనికులు పల్వలునికి ఎరిగించిరి. అంత మహారాజు యొక్క ఆదేశము చే ఆతడు తాళ్ళచే బంధింపబడి రాజ సమక్షమునకు తేబడెను. సేనాపతి యొక్క పుత్రుని చూచి పల్వలుడు క్రోధోద్రిక్తుడై ఆతనిని భృశుండి తో ప్రహరించెను. అంత సేనాపతి పుత్రుడు మరణించెను. ఈ విషయము రణమాచరించుచున్న సేనాపతికి తెలిసి ఆతడు దు:ఖితుడై, గుర్రములతో వేగముగా పయనించుచున్న రధము నుండి క్రింద పడి విలపింపసాగెను– "హా! పుత్రా! నన్ను వృద్ధుడనైన తండ్రిని వదలి నీవు స్వర్గస్థుడవు అయినావా! నాయనా! నీవు రాజ శాశనమును దాటి ఎచట కేగితివి?" ఈ విధముగ రోదించుచూ, రణ రంగమున క్రిందపడెను.

అంత మంత్రి పుత్రులు శోకమగ్నమయిన సేనాపతిని కాంచి ఇట్లు పలికిరి "సేనాపతీ! నీవు శూరుడవు. రణ భూమి యందు ఇట్లు రోదించు తగదు. శోకించినప్పటికీ మరణించిన నీ పుత్రుడు తిరిగి రాడు. మృత్యువు జీవులందరికీ పుట్టినప్పడి నుండియు వెంటనే యుండును. ఆతనికి సమయము అసన్నమయినది. ధీర పురుషులు మృత్యువును గూర్చి శోకింపరు. మూర్ఖులు మాత్రమే మరణించిన వారి కొరకు శోకించెదరు. కొందరు గర్భము నందు, మరికొందరు పుట్టిన వెంటనే, కొందరు బాల్యము నందు, కొందరు మధ్య కాలమునందు, కొందరు దు:ఖము చే కొందరు ఎత్తైన స్థలము నుండి క్రిందపడుట చే మృత్యువు నొందుచున్నారు.

దైవవశమున పుట్టిన ప్రతి జీవియును ఒకానొక దినమున మృత్యువాత పడక తప్పదు. ఎవరు తండ్రి? ఎవరు పుత్రుడు? ఎవరు మాత? ఎవరు పత్ని? విధాత కర్మానుసారము ప్రాణుల సంయోగ వియోగము కావించును. సంయోగము నందు ఆనందము, వియోగము నందు శోకము కలుగును. ఇటువంటి అవస్థ కేవలము మూర్ఖులకు మాత్రమే కలుగును. "పురుషుడు" ఆత్మారాముడు ఈ హర్ష శోకములకు వశీభూతుడు కాడు. నీవు దు:కితుడవై ప్రాణ త్యాగము చేసిన ఎడల ఆత్మఘాతివి అగుదువు. దాని మూలమున నరకమున పడి తిరిగి జన్మ తీసికొందువు. ఇందు సందేహము లేదు. ఈ మహా సమరమున నీవు యాదవ వీరులతో యుద్ధ మొనర్చుము. క్షత్రియ వృత్తి కలవారలకు ధర్మ యుద్ధమును మించిన వేరొక కళ్యాణ కారకము లేదు. సమరాంగణము నందు యుద్ధము సలుపుచూ వీరగతి ప్రాప్తి నొందువారు సర్వ లోకములను లంఘించి విష్ణు సాయుజ్యమును పొందెదరు."

మంత్రి పుత్రులు ఈ విధముగ నచ్చ చెప్పుటచే సేనాపతి దు:ఖము వీడి, రోషము నొంది, యాదవ వీరుల కొరకు నిరీక్షించెను. రణభూమి యందు దృష్టి నిలిపి సేన అంతటికీ ఈ విధముగ తెలిపెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద మందలి సేనాపతి పుత్రుని వధ అను ముప్పది రెండవ అధ్యాయము సమాప్తము)

ముప్పది మూడవ అధ్యాయము

(శ్రీకృష్ణ కృప చే దైత్యరాజ నందనుడు కునందనుని ప్రాణము రక్షింపబడుట)

సేనాపతి "ఇచటకు రణ దుర్మధులయిన ధనుర్ధారులందరూ ఏతించిరి. కానీ యువరాజు రణభూమి యందు కనబడుట లేదు. అతడు నా పుత్రుని చంపించి ఇంటి వద్ద ఏమి చేయుచున్నాడు? అతడు భృశుండి పాలబడి నా

పుత్రుడు పోయిన దారిని ఏల పోలేదు?" ఈ విధముగ పలకి రాకుమారుని బంధించుటకు నగరమున కేగెను. రాజకుమారుడు రాత్రి మదిర సేవించి పరుండెను. ఈ మధ్యపాన మత్తుచే రాజాజ్ఞను ఉల్లంఘించెను. దండోరా విని, అతని పత్ని రోదించుచూ ఆతని లేపుటకు యత్నించెను, "ఓ! వీరుడా! ప్రాత: కాలము అయినది. నగర వాసుల నుండి మరియు నీ తండ్రి యొక్క తీవ్రమయిన ఆజ్ఞచే యుద్ధము నందు పాల్గొనని వీరులు వధార్హులు అని చెప్పబడినది. అందువల్ల నీవు తొందరగా నీ తండ్రి దర్శనమున కేగుము." తన పత్ని యొక్క పలుకుల చే ఆతనికి కొంచెము స్పృహ కలిగినది. పల్వలుని సేన వెడలిన పిదప అతని పత్ని ఆతనిని నిద్ర నుండి లేపుటకు ప్రయత్నించెను. అంత రాకుమారుడు నిద్రలేచి, ధనుర్ధారియై మనసున శివ భగవానుని, గణేశుని స్మరించుచూ రధము నెక్కి యుద్ధ భూమికేగెను.

రాకుమారుని చూచి సేన పాలకుడు కోపముతో "నీవు దైత్య రాజు శాశనమును ఏ ధైర్యముతో ఉల్లంఘించివి? నాకు తెలుపుము. నా సుతుడు సహితము నీ వలెనే విలంబము కావించి శతఘ్ని ద్వారా మరణించెను. నీవు నీ తండ్రి వద్దకు పోవలసినది. ఆయన మిక్కిలి సత్యవాది. ఆయన నిన్ను పట్టుకొనుటకే నన్ను పంపెను. నీకు శీఘ్రమే మరణశిక్ష విధించును." సేనాపతి యొక్క తీవ్రమయిన పలుకులు విని రాకుమారుని ముఖము చిన్న బోయెను. ఆతడు దు:ఖితుడై తన తండ్రి వద్దకు వెళ్ళెను. దైత్య సముదాయము చే పరివేష్ఠితుడై పల్వలుడు అనిరుద్ధుని ఓడించుటకై కృత నిశ్చయుడై రధమునందు కూర్చొని యుండెను. తండ్రిని గాంచి, ఆయన చరణములపై మస్తకము నుంచి, రాజకుమారుడు లజ్జితుడై, అవనిత శిరస్కుడై, భయవిహ్వలుడై నిలుచని యుండెను. దానవేంద్రుడు తన ఎదుట నిలుచని యున్న పుత్రుని కాంచి, పళ్ళు పటపటా కొరుకుచూ "ఓరీ! నీ వినాశనము నకై నీవు నా ఆజ్ఞను ఉల్లంఘించితివి. ఈ అపరాధము చే నీకు దండన నొసంగెదను. నిశ్చయముగ నీవు ప్రాణ భయము చే ఇంటి యందు దాగుకొని యుంటివి. కునందనా! నీవు నా పుత్రుడవు కావు. కుపుత్రుడవు. శత్రు సమానుడవు. అత్యంత మలినుడవు. నిన్ను శతఘ్ని ద్వారా ఇప్పుడే చంపించెదను."

తన పుత్రునితో ఇట్లు పలికి మనసున ఖిన్నుడై ఏల నేను ఇట్లు ప్రతిజ్ఞ చేసితినని తీవ్రముగ పరితాపము చెందుతూ, ఆహా! సైన్య పాలకుని పుత్రుని సహితము నేను అపరాధము లేక సంహరించితిని. ఆ పాపము చే నా పుత్రుడు సహితము మరణించును. ఇందు సందేహము లేదు. ఒక వేళ నేను నా పుత్రుని మృత్యుముఖము నుండి వెలితీసితినేని నా సమస్త సేన నన్ను పరిహసించెదరు. దైత్యరాజు ఇట్లు తన పుత్రుని కోసము పరితపించుట కాంచి, సేనాని నవ్వుచూ "మహారాజా! ముందు మీరు ఈ కునందనుని హతము చేయవలసినది. తదుపరి దానవ యాదవ సంగ్రామము జరుగును. దైత్యేంద్ర! నీవు సత్యవాదివి. ఈ కర్మ అత్యంత దారుణము. ఒకవేళ దు:ఖ కారణమున ఈ కార్యము చేయవేని, నీవు నరకమున పడెదవు. భూపాలా! కోసలపతి దశరధుడు కేవలము సత్యము కోసమే శ్రీరాముని వంటి సుతుని వదలుకొనెను. సత్య బంధమున పడియే హరిశ్చంద్రుడు తన సతి, సుతులను, చివరికి తనను తాను అమ్ముకొనెను. విరోచనుడు తన జీవితమును అర్పించెను. శిబి చక్రవర్తి తన శరీరమును, బలి చక్రవర్తి సమస్త భూ మండలమును, ధధీచి మహర్షి శల్య సహిత దేహమును త్యాగము చేసిరి. అట్లే దైత్యరాజా! నీవు మోహమును వీడి ఆజ్ఞాభంగము కావించిన నీ సుతుని హతము చేయుము. నీవు కావించిన ప్రతిజ్ఞను నీవే ఆచరింపుము. లేనిచో ఆ రాజు యొక్క రాజ్యము నందు నివసించుటకు జనులు ఇష్టపడరు."

సేనాని యొక్క పలుకులు విని పల్వలుడు ఖిన్నుడై చివరకు తన పుత్రుని మరణాదేశమును ఇచ్చెను. తదనంతరము దు:ఖించుచు యాదవులను నిలువరించుటకు ఏగెను. అంత సేనాని రాకుమారునకు మహారాజు యొక్క ఆజ్ఞను వినిపించెను. అంత కునందుడు ఇట్లనియె "సేనాపతీ! మీరు పరాధీనులు. అందువలన మీరు రాజాజ్ఞను పాలించవలసిన ఆవశ్యకత కలదు. పరశురాముడు తన పిత్రాజ్ఞ చే తన తల్లి యొక్క మస్తకము ఖండించెను. నేను నిశ్చింతుడను. నేను ధర్మ పాలన కావించితిని. నాకు మృత్యు భయము లేదు. నన్ను శతఘ్నిచే చంపవలయును." ఈ విధముగ పలికి రాకుమారుడు తన కిరీటమును భుజకీర్తులు, ముత్యాల హారములు, సువర్ణమయ మాలలు, కుండలములు, కడియములు, ఇవన్నియు తీసి బ్రాహ్మణులకు దానముగ సమర్పించెను. ఆ బ్రాహ్మణులు మిక్కిలి దు:ఖముతో ఆతనిని ఆశీర్వదించిరి. తదనంతరము స్నానమాచరించి, తీర్థ మృత్తికను శరీరమునకు అలదుకొని, నోటి యందు తులసీదళము, మరియు కంఠమందు తులసీ మాల వేసికొని రాకుమారుడు "శ్రీకృష్ణ! శ్రీరామ!" అని స్మరించు చుండెను. సేనాపతి ఆతని భుజములు పట్టి, బలముగ, బలవంతముగ శతఘ్నిముందు నిలబెట్టెను. అచట హాహాకారములు చెలరేగి సైనికులు, బ్రాహ్మణులు రోదింప సాగిరి.

పల్వలుడు సహితము రోదింప సాగెను. శతఘ్ని యందు మందు కూరి, తగరపు ముద్దలు పెట్టి అగ్ని నంటించిరి. ఆ సమయమున భయంకర శతఘ్నిని చూచి, సర్వ వ్యాపి అయిన పరమేశ్వరుని తలచుచు రాకుమారుడు అశ్రువులు కార్చుచూ ఇట్లనియె.

"ఎవరి నేత్రములు ప్రఫుల్ల కమల దళముల వలె విశాలమయినవో, దంతపంక్తి శంఖము మరియు పూర్ణ చంద్రుని వలె ఉజ్వలముగ యుండునో, ఎవరు ఎల్లప్పుడూ నరేంద్రుని వలె యుందురో, ఎవరి చరణార విందములను ఇంద్రాది దేవతలు సహితము పూజింతురో, అట్టి హరి, ముకుందుని, శ్రీకృష్ణుని నా ప్రాణాంతకాలమున స్మరించుచున్నాను. హా! గోవిందా! హరీ! మురారీ! ద్వారకానాధా! శ్రీకృష్ణ, వ్రజేశ్వర, పృధివీ పాలక! నన్ను రక్షించండి. మీ స్మరణ చే ఏనుగు మొసలి నుండి రక్షింపబడినది. స్వాయంభువ మనువు, ప్రహ్లాద, అంబరీష, ధృవ, అనర్తరాజు కక్షీవానుడు భయ విముక్తులయిరి. రైవతుడు, చంద్రహాసుడు ఎట్లు మీ స్మరణచే రక్షింప బడిరో, అట్లే నేను మీ శరణము నందు వచ్చితిని. యుద్ధము చేయక ఇట్లు మృతి నొందుట ఉచితము కాదు. నేను యుద్ధ భూమి నందు అనిరుద్ధుని సంతుష్టుని కావింపలేదు. యాదవులకు సంతోషము కలిగింప లేదు. శ్రీకృష్ణ పుత్రులను దర్శింప లేదు. శాంగ ధనువు నుండి వెలువడిన బాణముల ద్వారా నా శరీరము ముక్కలు ముక్కలు కావింపబడలేదు. అటువంటి సమయమున ఈ వీర కునందనునికి చోరుని వంటి దుస్థితి కలిగినది. కానీ నేను మీ భక్తుడను. నా దుస్థితి చూచి సమస్త పాపులు నవ్వెదరు. పరిహాసము చేసెదరు. ఎవరిని చూచి యమభటులు పరుగులు తీయుదురో, విఘ్నములు కావించు గణనాయకులు మరణించెదరో, అట్టి పూజనీయమయిన శ్రీకృష్ణ భక్తులను శతఘ్ని ఎట్లు చంపగలదు?"

శూర వీరుడయిన కునందనుడు ఇట్లు పలుకుచుండగా సేనాపతి యొక్క ఆజ్ఞచే సైనికుడు శతఘ్నిని వదలెను. అంతట హాహాకారములు చెలరేగినవి. కానీ కృష్ణ స్మరణచే ఒక విచిత్రము జరిగినది. శతఘ్ని చల్లబడినది. అగ్ని మండలేదు. ఈ ఆశ్చర్యమును చూచి రాజుతో సహా సర్వులు చకితులైరి. అంత సైన్య పాలుడు శతఘ్ని యందు మందు చల్లబడినది. లోహ గోళములు సహితము అట్లే అయినవి. అందువల్ల తిరిగి ఈతనిని శిక్షింపవలెను." ఆ పలుకులు విని వీర గణములు "ఈ బుద్ధిమంతుడయిన రాకుమారుడు పాపశూన్యుడు మరియు కృష్ణ భక్తుడు. అందువల్ల భగవానుడు ఆతనిని రక్షించెను. ఇకనీవు అతనిని వధింపరాదు" అని పలికిరి. వీరుల పలుకులు విని సేనాని మిక్కిలి కోపించి తిరిగి చూడగా రాకుమారుడు కన్నులు మూసికొని శ్రీకృష్ణ నామస్మరణము కావించుచు శతఘ్ని ముందు కూర్చొని యుండెను. అంత సేనాపతి తిరిగి శతఘ్నిని నిప్పుతో అంటించెను. ఆ సమయమున శతఘ్ని పగలి, వజ్రపాతము వంటి ధ్వని కలిగి సేనాపతి మరణించెను. అంతేకాక అతనిని అనుసరించిన సైనికులు సహితము మరణించిరి. ఆ ధ్వని చే హాహాకారములు చెలరేగి కొందరు సైనికులు బధిరులైరి. ఆ సమయమున రాజ పుత్రుడు నిర్భయుడై యుండెను. పల్వలాది దానవులు జయజయ ధ్వానములు కావించిరి. అంత దైత్యుడు "ఎవరిని శ్రీ కృష్ణుడు రక్షించునో ఆ మనుష్యుని ఎవరు నిర్జింపగలరు? ఎవరు భగవద్భక్తుని వధించుటకు ఏతించెదరో వారే దైవయోగమున మరణించెదరు. ఎవరు ఈ రాజకుమారుని భయము మరియు మృత్యువు నుండి రక్షించెనో ఆ భక్త వత్సలుడయిన శ్రీకృష్ణునికి నమస్కరించెదను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదమందలి రాజకుమారుని జీవన రక్ష అను ముప్పది మూడవ అధ్యాయము సమాప్తము)

ముప్పది నాల్గవ అధ్యాయము

(దైత్య యాదవుల ఘోర యుద్ధము; పల్వల, కునందన, అనిరుద్దుల అద్భుత పరాక్రమము)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదుపరి పల్వలుడు తన కుమారుని ఒక రథముపై నిలిపి, సైన్య సమేతుడై, అత్యంత ఉత్సాహముతో సమరమున కేగెను. దానవ సైనికులందరూ సమస్త శస్త్రములు ధరించిరి. వారు అనేక విధములయిన వాహనములధిరోహించి, వేర్వేరు కవచములు ధరించి నానా రూపములతో భయంకరముగ

కనిపించుచుండిరి. వారందరూ మదగజ శరీరులు మరియు సింహ పరాక్రములు. వారందరూ పృధివిని కంపింపజేయుచూ వృష్ణి వంశీయుల వద్ద కేగిరి. అనేక మంది దైత్యులు వచ్చుట గమనించిన అనిరుద్దుడు కొంచెము శంకితుడై తన సేనను చక్రవ్యూహము నందు యుంచెను. నలు ప్రక్కలా శూరులయిన యాదవులు శస్త్రధారులై రథ, గజ, హయములపై యుండి నిరీక్షించుచుండిరి. ఆ చక్రవ్యూహ వెలుపరితలమున ఇంద్రనీలాది రాజులు, వారి మధ్య అక్రూర, కృత వర్మాది వీరులు, వారి మధ్య గదాది శ్రీకృష్ణ సోదరులు, వారి మధ్య సాంబుడు దీప్తిమానుడు మొదలగు శ్రీకృష్ణ పుత్రులు, ఈ విధముగ చక్ర వ్యూహమును పన్ని వారందరి మధ్య కవచధారియై అనిరుద్దుడుండెను. అపుడు సాగర తటమున ఆ ఇరుసేనల మధ్య గొప్ప యుద్ధము జరిగెను. ఆ సమరమున రథికులు రథికులతో గజములు గజములతో, హయములు హయములతో, పదాతులు పదాతులతో, వీరులు ఎవరికి తగిన వీరులతో వారు సమరమాచరించిరి. తీక్షణ బాణములు, ఖడ్గ, పాశ, పరశు, శతఘ్ని, భృశుండి ద్వారా యాదవసేనలు పల్వల సేనను వధించుచుండిరి. వారి థాటికి తట్టుకొనలేక దానవసేన రణ రంగము నుండి పలాయన మొనర్చెను. సైనికుల పదముల నుండి లేచిన ధూళి పైకెగసి, ఆకాశమున సూర్య మండలమును కప్పి ఆ ప్రదేశమును అంధకార బంధుర మొనర్చెను. అదే అదనుగా తీసికొని దైత్యులు పలాయన మొనర్చిరి.

యాదవ తీక్షణ బాణములతో గాయపడి కొందరు నూతిలోనూ, కొందరు అవనిత శిరస్కులై గడ్డివాముల యందునూ, కొందరు చిన్న చిన్న సరోవరములోనూ, కొందరు దిగుడు బావుల యందునూ తలదాచుకొనిరి. తన సేన అంతయు పరాజితమై పలాయన మొనర్చుట గాంచిన పల్వలుడు రోషావేశముతో తన పుత్రుని, మంత్రి కుమారులను వెంట బెట్టుకొని ముందుకు వచ్చెను. ఆ మహా సమరమున పల్వలుని తో అనిరుద్దుడు, దుర్నేత్రునితో బృహద్భానుడు, దుర్ముఖునితో అరుణుడు, దు:స్వభావునితో వ్యగ్రోధుడు, దుర్మధునితో కవి, కునందనునితో శ్రీకృష్ణ తనయుడు సునందనుడు పోరాటము సలిపిరి. అచట దేవతలు సహితము విస్మయమొందు మహా సంగ్రామము నెలకొన్నది. కార్తీకమాసము నందలి సంపూర్ణ సమయము అచట సంగరము నందే గడచినది. మాటిమాటికీ ధనుష్టంకారము కావించుచు పల్వలుడు కుపితుడై సంగ్రామము నందు ఇంద్రనీలుని పై మూడు, హేమాంగదుని పై ఆరు, అనుశాల్వ, అక్రూరులను పది, గదునకు పదకొండు, సాత్యకిని ఆరు, కృతవర్మను అయిదు, ఉద్ధవుని పది, సాంబుని వంద బాణములతో గాయపరెచెను. ఆ బాణ ఘాతములతో ఆ వీరులందరూ రెండు ఘడియలు బొంగరముల వలె తిరుగు చుండిరి. వారి రథాశ్వములు చూర్ణము లాయెను. ఆ దానవుని హస్తలాఘవము చూచి అనిరుద్దాదులు మిక్కిలి విస్మితులయిరి. అంత పల్వలుడు ఇతర యోధులను గాయపరచుటకు పోయెను. అంత అనిరుద్దుడు క్రోధ తామ్రాక్షుడై "ఓరీ! దైత్యా! నా ముందు నిలువుము. పరాక్రమము చూపించి నీవు ఎక్కడకు ఏగెదవు?"

అనిరుద్దుని మాటలు విని కునందుడు అనిరుద్దునితో ఇట్లనియె "ప్రద్యుమ్న నందనా! సమరాంగణము నందు దైత్యరాజును చూచు యోగ్యత నీకు లేదు. అందు వలన నీవు తొలుత నా బలము చూడుము." అనిరుద్దుడు దైత్య కుమారా! నీవు ఇంకనూ బాలుడవు. నీకు ఇంకనూ యుద్ధ యోగ్యత రాలేదు. అందువలన ఇంటికేగి ఆటబొమ్మలతో ఆడుకొనుము. అంత రాజపుత్రుడు. "నేను ఇచట పెద్ద పెద్ద వీరులతో బాలక్రీడలాడెదను. ఇంటి వద్ద అవి చూచు వారు ఎవరూ లేరు," అని పలికి తన ప్రచండ కోదండము నందు నూరు సాయకములు ఒకేసారి సంధించి, రథము నందు ఆరూఢుడయిన అనిరుద్దుని పై వైచెను. ఆ బాణ ఘాతము చే అనిరుద్దుడు సారధి, రథము, హయముల సహితుడై ఆకాశ మార్గమున ఎగిరి కపిలాశ్రమమున పడెను. ప్రద్యుమ్న నందనుడు గాయపడుట చే యాదవ సేన యందు హాహాకారములు చెలరేగినవి. అంత రణస్థితి యందు సాంబాది శూరులు ఆ రాజపుత్రుని హతమార్చుటకు కేతెంచిరి. బహు సంఖ్యలో ఏతెంచిన యోధులను చూచి కునందనుడు హర్షోల్లాసితుడై సాంబుని పది, మధువును అయిదు, బృహద్భానుని అయిదు, చిత్రభానుని మూడు, వృకుని పది, అరుణుని ఏడు, శృతదేవుని ఎనిమిది, సంగ్రామ జిత్‌ను అయిదు, సుమిత్రుని మూడు, దీప్తిమానుని మూడు, భానుని, వేదబాహుని అయిదు, పుష్కరుని ఏడు, సునందనుని ఇరువది, విరూపుని పది, చిత్ర బాహుని తొమ్మిది, న్యగ్రోధుని పది, కవిని తొమ్మిది, వీక్షణ బాణముల ద్వారా గాయపరచి

విజయ సూచకముగ శంఖమును పూరించెను. ఆ బాణ ప్రహారములకు చక్కెరలు కొట్టుచూ కొందరి రథములు ఒకటి, రెండు యోజనములు, కొన్ని అయిదు క్రోసుల దూరమున పడినవి. ఆ సమయమున యాదవ సైన్యము శ్రీకృష్ణ, బలరామాది నామములు స్మరించుచు రోదింపసాగిరి. అంత గదాది యోధులు, ఇంద్రనీలాది రాజులు రోషముతో బాణ వర్షము కురిపించిరి. వారందరూ కూడ వచ్చుట గమనించిన కునందనుడు వారిని సహితము తీవ్ర నారాచములతో గాయపరచెను. వారందరూ మూర్ఛపోయిరి. పిదప పల్వల కుమారుడు బాణ వర్షము కురిపించుచూ యాదవ సేనపై మారణ కాండ మొదలిడెను. గాయముల చే పలువురు యాదవ యోధులు పంచత్వము నొందిరి.

సంగరమంతయు రక్త సరిత పారుట నారంభించెను. ఆ దృశ్యము ఎంత భయంకరముగ యుండెనన ఆ ప్రవాహము నందు బ్రతికియున్న ఏనుగులు మునిగి మరణించు చుండెను. ఆ సమయమున యాదవ సేన అంతయు హాహాకారములు చెలరేగినవి. ఆకాశమున వరుణాది దేవతలు ఆశ్చర్య చకితులై ఒకింత భయ భీతులైరి.

తమ విజయమును గాంచి సమస్త అసుర సైన్యము ప్రసన్నత నొందినది. ఆక్కడ కపిలాశ్రమమున మూర్ఛితుడై పడియున్న అనిరుద్ధుని కపిలముని గాంచెను. ఆతని రథము నష్టమయి, వక్షము విదీర్ణమయినది. పరమ కృపాళువు అయిన కపిల మునీశ్వరుడు తన చేతితో అనిరుద్ధుని తాకి, తన తపో బలముతో ఆతనికి స్వస్థత కలిగించి చైతన్య వంతుని కావించెను. తదనంతరము అనిరుద్ధుడు లేచి, మహర్షికి నమస్కరించి, సేతువు మీదుగా ప్రయాణించి రణస్థలి చేరెను. సమరాంగణమునకు వచ్చుచునే రథారూఢుడయిన అనిరుద్ధుడు "ప్రతి శాంగ" మను ధనువును ఎత్తి దానికి కేవలము ఒక్క బాణమును సంధించి దైత్య కుమారునిపై ప్రయోగించెను. ఆ బాణ వేగము చే ఆ రథము సారథి, హయములు సహితముగ దైత్య తనయుడు ఆకాశమున కెగరి ఎనిమిది ఘడియలు బొంగరము వలె తిరుగుచునే యుండెను. ఇంతలో సాంబాది వీరులు, అనుసాల్వాది రాజులు అచటకు ఏతెంచిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాద మందలి దైత్య, యాదవ యుద్ధ వర్ణనమను ముప్పది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఐదవ అధ్యాయము

(పల్వలుని మంత్రి కుమారుల వధ; పల్వలుని ద్వారా మాయా యుద్దము; అనిరుద్దుడు వానిని పరాజితుని కావించుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదుపరి సంగ్రామము నందు అనుశాల్వుడు దుర్ముఖుని తోనూ, ఇంద్రనీలుడు దుర్నేత్రునితోనూ, హేమాంగదుడు దుర్మధుని తోనూ, సారణుడు దు:ఖభావునితోనూ సమర మారంభించిరి. ఈ విధముగ సంగర రంగమున పరస్పర ద్వంద్వ యుద్ధములు మొదలయినవి. సారణుడు గదాయుధమును ధరించి దైత్యుడయిన దు:స్వభావుని ప్రహరించి సంహరించెను. హేమాంగదుడు దుర్మదుని పై మూడు బాణములు ప్రయోగించెను. దుర్మధుడు హేమాంగదుని గాయపరచెను. పిదప హేమాంగదుడు శక్త్యాయుధమును ప్రయోగించి దుర్మధుని సంహరించెను. ఇంద్రనీలుడు దుర్నేత్రుని బాణ సమూహములు ఖండించి వానిని కాలగతి యందు కలిపెను. అనుసాల్వుడు నారాచ బాణములచే దుర్ముఖుని రథహీనుని గావించెను. దుర్ముఖుడు వేరొక రథమారోహించి, తిరిగి తీవ్ర నారాచములు ప్రయోగించి అనుసాల్వుని రథహీనుని గావించెను. అంత అనుసాల్వుడు ఒక పరిఘ తీసికొని రణస్థలి యందు దుర్ముఖునిపై ప్రహరించి సంహరించెను. ఈ విధముగ మంత్రి పుత్రులు నలుగురు కాలగతులైరి. శేషించిన దైత్యసేన పలాయన మొనరించెను. ఆ సమయమున కునందనుడు ఆకాశము నుండి క్రిందపడి నోటి నుండి రక్తము కారి మూర్ఛితుడయ్యెను. రథము చూర్ణమయినది. హయములు మరణించినవి.

అది చూచిన పల్వలుడు రోషతామ్రాక్షుడై అనిరుద్ధునిపై పది బాణములు ప్రయోగించెను. వానిని గమనించిన ప్రద్యుమ్న పుత్రుడు తన సువర్ణ భూషిత సాయకముల ద్వారా వానిని ఖండించెను. తిరిగి ధనువు సంధించి, రాజసూయ రణమందు శకుని ప్రద్యుమ్నుని తో పలికిన పలుకులు పలికెను, "యదుకుల వీరా! నీవు వీరుడవు. నేడు ఈ సాయకము చే నిన్ను సంహరించెదను. నేను అసత్యమాడను. నీకు ప్రాణములపై తీపి యున్న ఎడల నిన్ను నీవు కాపాడుకొనుము. ఆ మాటలు విని అనిరుద్ధుడు తన కోదండము నందు సాయకము సంధించి నవ్వుచు ఇట్లనియె "ఏ ప్రాణి ఎవరి చేతిలో మరణించును? ఎవరిచే రక్షింపబడును? ఎల్లప్పుడు కాలమే మనుషులను రక్షించుచు మరియు భక్షించును. "నేను కర్తను, నేను చేయుచున్నాను, నేను చంపుదును, నేను పాలకుడను" అని ప్రాణి కాలము నందే వినాశమగును. నేను నిన్ను, నువ్వు నన్ను గెలువలేము. కేవలము జగదీశ్వరుడే మన ఇరువురిపై గెలుచును. దానవా! ఆ కాలపురుషుడు ఎవరికి గెలుపు నీయనున్నాడో ఎవరికి ఎరుక? నేను నా విజయము కొరకై ఆ కాల దేవతను మనసునందు ప్రార్థించు చున్నాను. నీవు సహితము కాలము బలీయమని తెలిసి, అజ్ఞానమును వీడి యుద్ధము చేయుము. అనిరుద్ధుని పలుకులు విని పల్వలుడు ఆశ్చర్య చకితుడయ్యెను.

దైత్యుడు సంతోషము నంది ఇట్లనియె "యదుకుల తిలకా! ఈ భూతలమందు కర్మ ప్రధానము. కర్మయే గుణము మరియు ఈశ్వరుడు. కర్మము చేతనే మానవులు ఉచ్చ, నీచ స్థితులు పొందెదరు. ఎట్లు లేగదూడ వేలాది గోవులయందు తన తల్లిని పసిగట్టునో, అట్లే ఎవరు ఏ విధమయిన శుభా శుభ కర్మములు కావించిననూ కర్మ ఫల ప్రధాన వేళ ఎవరు ఎక్కడయున్ననూ ఆ ఫలము వారిని చేరును. అందువలన నేను నా సుధృఢ కర్మ ద్వారా నీపై విజయము నొందెదను. నేను ప్రతిజ్ఞ చేసితిని. నీవు ప్రతీకారము కావింపవలసినది." అనిరుద్ధుడు "దైత్యరాజా! నీవు కర్మ ప్రధానమని తలచుచున్నావు. కానీ కాలము లేక కర్మ ఫలము నీయజాలదు. ఎట్లనిన భోజనము వండిననూ ఒక్కొక్క మారు తినుటకు కుదరదు. పాకము (వంట) విభిన్న ప్రకారములుగ జరుగును. అది సిద్ధించుటకు దానని వండ వలెను. వండుటకు ఒక మనిషి (కర్త) అవసరము. అందువలన విద్వాంసులు "కర్మ, కాలము" "కర్త" వలనను సాధ్యము అని నుడువుదురు. ఆ కర్త ఏ శ్రీకృష్ణ భగవానుడు. ఆయనే గోలోక స్వామి, మరియు పరాత్పర పరమేశ్వరుడు. ఆయనే బ్రహ్మ, విష్ణు, రుద్రులను దేవతలను సృష్టించెను.

పల్వలుడు "శ్రీకృష్ణ పౌత్రా! నీవు ధన్యుడవు. నీవు నీ వచనములతో ఋషులను అనుకరించు చుంటివి. నీవు త్రిగుణములకు అతీతుడవు. కానీ ప్రాణులకు తమ స్వభావమును పరిత్యజించుట దుష్కరము. యదుశ్రేష్ఠా! సావధానుడవై నీపై పడుచున్న ప్రాణ సంహార నారాచమును చూచి నీ మనసును యుద్ధమందు నిలుపుము." ఈ విధముగ పలికి తన బాణముతో మయాసురుని యొక్క మాయను ప్రయోగించెను. దాని మూలమున సర్వత్రా అంధకార మలముకొన్నది. ఎవరికీ ఎవరూ కానబడకుండిరి. సేన యందు ఎవరు తనవారో, ఎవరు పరులో తెలియకున్నది. యోధులపై భయంకర శిలావర్షము కురియ నారంభించినది. నలుదిక్కులా జలధారలచే వర్షమారంభమయ్యెను. మెరుపులు మెరయుచూ, మేఘములు గర్జించుచున్నవి. మేఘములు వేడి వేడి రక్తము, మూత్ర మిశ్రిత మలము వర్షింప నారంభించినవి. ఆకాశము నుండి శిరము లేని మొండెములు, శిరములు వర్షించుట నారంభించెను. సమస్త యాదవులు సమరాంగణము నుండి పలాయన మొనర్చుట ఆరంభించిరి. అంత అనిరుద్ధుడు శ్రీకృష్ణ చరణార విందములను స్మరించి, మోహనాస్త్రమును సంధించి విడచెను. అది రాక్షస మాయను భేదించెను. మేఘములు మాయమయి సూర్య మండలము దేదీప్యమాన మయినది. మాయ దూరమగుటచే మాయావి అయిన పల్వలుడు తిరిగి కనిపించెను. పల్వలుడు కుపితుడై యాదవ నాశనమునకై బ్రహ్మాస్త్రమును ప్రయోగించెను. అనిరుద్ధుడు దానిని బ్రహ్మాస్త్రము చేతనే శాంతింపజేసెను. అంత విజయము సాధించుటకు పల్వలుడు గంధర్వాస్త్రము ప్రయోగించెను. అకస్మాత్తుగా అక్క గంధర్వ నగరము కానవచ్చెను. సంగర భూమి చిహ్నములే లేవు. కోట్లాది స్వర్ణ హర్మ్యములు దృష్టి గోచర మయినవి. ఆ నగరము నందు అనేక గంధర్వకన్యలు తాళ, మృదంగములు వాయించుచూ, నృత్యములు చేయుచూ, మధుర కంఠములతో పాడుచుండిరి. కందుక క్రీడల ద్వారా, హావ భావముల ద్వారా, "కటి, వేణీ" ప్రదర్శనముల ద్వారా కమల నయనలు లోకులకు మనో రంజకము కావించుచుండిరి. వారి సౌందర్యమును చూచి యాదవ వీరులు కామ వేదనతో విహ్వలులయిరి. వారు తమ అస్త్ర

శస్త్రములన్నియు భూమిపై విడచి తమలో తాము "మనము ఎక్కడయున్నాము? దైవయోగమున స్వర్గలోకము చేరలేదు కదా? మన మోహితులయిన సుందరీమణులు, కలకంఠులు నృత్యము చేయుచున్నారు. వీరి లావణ్య జలధి నందు మునిగి మనము కామ వేదన చే విహ్వాలులగు చున్నాము. మనకు విజయమెట్లు కలుగును? ఇచట రణ క్షేత్రము కనిపించుట లేదు."

అదే సమయమున చేతి యందు కరవాలము పట్టి యాదవ వీరులను సంహరించుటకు పల్వలుడు ఉద్యక్తుడయి, వేలాది యాదవులను సంహరించెను. అది చూచి అనిరుద్ధుడు "అహో! నీవు సత్పురుషులు నిందించిన అధర్మ యుద్ధమును రణరంగమందాచరించుచున్నావు. మోహితులను సంహరించుట చే నిన్ను ఎవరు ప్రశంశించరు. నీ శరీరము నందు శక్తి యున్న ఎడల నాతో రణ మాచరింపుము." అనిరుద్ధుని మాటలు విని తన బల మదము చే నిండిన పల్వలుడు చేతులందు కరవాలము, డాలు ధరించి అనిరుద్ధుని పైకి వచ్చెను. అంత కుపితుడైన అనిరుద్ధుడు రథము నుండి క్రిందకి దూకి తన వద్దకు వచ్చుచున్న పల్వలుని పై కాలదండము ప్రయోగించెను. అంత పల్వలుని వక్షము పగిలి, మూర్ఛితుడై నాలుగు దినములు యుద్ధ భూమి యందే పడి యుండెను. పల్వలుడు మూర్ఛితడుగుటచే అతని గాంధర్వ మాయ మటుమాయమై, ఆ ప్రదేశమంతయు శాంతమయ్యెను. యుద్ధ స్థలి తిరిగి కనిపించెను. యాదవులందరూ ఆశ్చర్య చకితులైరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి అనిరుద్ధుని విజయమను ముప్పది అయిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఆరవ అధ్యాయము

(శ్రీకృష్ణ పుత్రుడు సునందనుని ద్వారా కునందనుని మృతి)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! అదే సమయమున కునందనుడు మూర్ఛ నుండిలేచి, క్రోధోద్రిక్తుడై, ధనసును సారించి బాణ వర్షము కురిపించుచూ సమరాంగణమున ప్రవేశించెను. శత్రువులను నాశనము చేయు అనిరుద్ధుడు వానిని చూచి "ఎవరీతడు?" అని ప్రశ్నించెను. సైనికులు "మహారాజా! ఈతడు పల్వల నందనుడు. మీతో కయ్యమునకు వచ్చెను" అని తెలిపిరి. అంత అనిరుద్ధుడు క్రుద్ధుడై "ఈ కునందనుని తప్పక సంహరించెదనని నారి సారించబోయెను. ఆ సమయమున శ్రీకృష్ణ పుత్రుడు సునందనుడు "మహారాజా! ఈ దైత్య పుత్రుడెంత? అతి కొంచెము యున్న ఆతని సేన ఎంత? నేను మీ కృపతో వానిని ఓడించెదను. నేను యుద్ధమున కేగెదను. నా ప్రతిజ్ఞ వినవలసినది. అది మీకు ఆనందదాయకమగును. ఒకవేళ నేను కునందనుని ఓడించలేక పోయిన ఎడల శ్రీకృష్ణ చరణారవింద పానమందు విరక్తుడగు మానవుడు ఏ పాపము నొందునో అది నాకు కలుగు గాక! నేను ఈ దానవుని పరాజితుని కావింప నేని, నేను భవబంధము హరించు గురువుకు, తండ్రికి సేవ చేయని వాడు ఏ పాపము నొందునో, ఆ పాపము నొందెదను గాక!"

సునందనుని ప్రతిజ్ఞ విని అనిరుద్ధుడు మిక్కిలి ప్రసన్నుడయ్యెను. ఆ వీరునకు అనుజ్ఞ నిచ్చెను. అంత సునందనుడు కవచధారియై, ఒక్కడే కునందనుని ఎదుర్కొనుటకు ఏగెను. ఆతనిని ఎదుర్కొనుటకు వీరుల యందు శ్రేష్ఠుడు, శూర శిరోమణి అయిన కునందనుడు ముందుకు వచ్చెను. వారిరువురు దమన పుష్కులుల వలె నొప్పారిరి. ఇరువురి శరీరములు సాయకములచే విదీర్ణము లగుచున్నవి. రెండు ప్రక్కల నుండి కోట్లాది బాణములు సాగుచుండుటచే, ఇరువురు పూచిన మోదుగు చెట్లవలె భాసించుచుండిరి. వారిరువురు ఎప్పుడు బాణము తీయుచున్నారో, సంధించుచున్నారో, నారి లాగుచున్నారో, విడుచుచున్నారో, ఎవరికి ఎరుక పడుట లేదు. కానీ బాణ సమూహములు మటుకు సాగుచున్నవి. దైత్య రాజకుమారుడు "భ్రామకాస్త్రము" సంధించి సునందనునిపై ప్రయోగించెను. దాని ఫలితముగ సునందనుని హయముల

సహితముగ రథము రెండు ఘడియలు కుమ్మరి వాని చక్రము తిరిగినట్లు తిరుగుచునే యుండెను. అది ఆగిన పిదప శ్రీకృష్ణ కుమారుడు కునందనునిపై బాణ ప్రయోగము కావించెను. దాని ప్రభావము చే కునందనుని రథము ఆకాశము నందు మతితప్పిన ఏనుగు వలె కొంచెము సేపు సంచరించి పిదప క్రిందపడి చూర్ణమయ్యెను. దాని మూలమున హయములు, సారథి మరణించెను. అంత దైత్య తనయుడు వేరొక రథ మధిరోహించెను. అంత శ్రీకృష్ణ నందనుడు వేరొక రథ మధిరోహించెను. ఆ సమయమున సునందనుడు తీవ్ర నారాచములచే ఆ రథమును చూర్ణము కావించి, ధ్వజమును పడగొట్టెను. ఈ విధముగ దైత్య నందనుడు ఏడు రథములు పొగొట్టుకొనెను. పిదప కునందనుడు ఒక విచిత్ర వాహనము నెక్కి సంగర భూమిపై ఏతించెను.

ఈ తడవు దైత్యకుమారుడు పది తీవ్ర సాయకములు సునందనునిపై ప్రయోగించెను. అవి శ్రీకృష్ణ కుమారుని మిక్కిలి బాధించి గాయము చేసినవి. అంత సునందనుడు సహితము పది తీవ్ర నారాచములు తీసికొని కునందనునిపై ప్రయోగించెను. అవి దైత్యుని వక్షస్థలము నుండి దూసుకొని పోయి వెనుక నుండి బయటకు వచ్చి, భూమిలో దిగబడినవి. వారిరువురు తిరిగి ఒకరినొకరు బాణముల ద్వారా గాయపరచుకొనిరి. వారిరువురి శరీరములు క్షత విక్షితములయినవి. వారిరువురి నుండి రక్తము ప్రవాహము వలె ప్రవహించు చున్నది. అయిననూ రోషపూర్వకముగ తీవ్ర నారాచములను గుప్పించుకొను చుండిరి. అంత సునందనుడు స్వర్ణ ధనువు నందు ఒక అర్ధ చంద్రాకార బాణమును సంధించి ఇట్లనియె "వీరపురుషా! నేను ఈ బాణముతో నీ మస్తకమును ఖండించెదను. నీవు బలవంతుడవయినచో రక్షించుకొనుము. ఈ రణ క్షేత్రమందు నా మాట సత్యమవదేని ఎవరు సతీ, సాధ్వీ, పతివ్రతా, మరియు గురుపత్నిని కామభావన చే చూచెదరో వారు పొందు యమయాతనలను నేను పొందెదను గాక! నేను సత్యము పలుక లేదేని సమర్థుడయ్యునూ తన పితృ, గురువులను పోషింపని వానికి ఏ పాప మంకురించునో ఆ పాపమును పొందెదను గాక!"

ఈ పలుకులు విని దైత్య సుతుడిట్లనియె "నేను సంగ్రామ మందు శత్రువు చేతిలో మరణించుటకు భయపడను. మృత్యువు అన్ని ప్రాణులకు సంతరించును. కానీ నీవు నా మరణార్థమై ఏ మహా బాణమును సంధించితివో అద్దానిని శీఘ్రముగ ఖండించెదను. ఒక వేళ ఖండింపని ఎడల నేను ఎవరు అభిమాన వశమున ఏకాదశి నాడు అన్నము తిందురో, అంతేకాక తల్లి, వదిన, సోదరి, పుత్రికలతో కూడని పాపము చేయువాడు ఏ నరకమునకు పోవునో అక్కడకు నేను సహితము పోయెదను." ఈ మాటలు విని సునందుని మనసున శంక కలిగెను. అంత అతడు శ్రీహరిని స్మరించి ఇట్లనియె "నేను కపటము విడచి స్వచ్ఛమయిన మనసుతో శ్రీకృష్ణుని చరణ యుగళిని సేవించిన ఎడల నా మాట సత్యమగు గాక! నేను నా భార్యను విడచి ఏ స్త్రీ నయిననూ కామ భావన చే చూడని వాడనైనచో నా మాట సత్యమగుగాక!" ఈ విధముగ పలికి సునందనుడు మహాకాలుడు మరియు అగ్ని వలె వెలుగొందు ఒక మహా బాణము తీసి అభిమంత్రించి దానిని రాక్షస రాజ పుత్రునిపై ప్రయోగించెను. రాజపుత్రుడు తక్షణమే ఆ సాయకమును ఖండించెను. వెంటనే హాహాకారములు చెలరేగినవి. ధరణీ మండలము కంపించినది. దేవతలు భయకంపితులయిరి. కానీ ఇంతలో ఒక ఆశ్చర్యము జరిగినది. ఆ సాయకము ఖండింపబడుట చే క్రింద భాగము క్రింద పడెను. కానీ ఊర్ధ్వ భాగము ముందుకు పోయి రాజపుత్రుని శిరము ఖండించెను. మదగజము పుష్పమాలను విరుచునట్లు రాక్షస రాజపుత్రుడు ధరిత్రిపై బడెను. క్రిందపడిన కిరీట కుండల యుక్త మస్తకమును కాంచిన రాక్షస వీరులు హాహాకారములు కావించిరి. దేవతలు సునందనునిపై పుష్పవృష్టి కురిపించిరి.

(శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండాంర్గతమున దైత్య పుత్ర వధ వర్ణనము అను ముప్పది ఆరవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఏడవ అధ్యాయము

(శివ భగవానుడు తన గణముల సహితుడై పల్వలుని వైపు నుండి యుద్ధమున కేతెంచుట; శివ గణములకు యాదవులకు మధ్య ఘోర యుద్ధము. దీప్తిమానుడు శివ గణములను ఓడించుట; అనిరుద్ధుడు జృంభణాస్త్రము చే భైరవుని మోహింప జేయుట)

వజ్రనాభుడు "బ్రహ్మన్! కునందనుడు మరణించిన పిదప, పల్వలుడు రణరంగమందు మూర్ఛితుడయిన పిదప కరుణామయుడయిన శివుడు ఎందుకురాలేదు? దైత్యులు గుర్రము నెట్లు తిరిగి ఇచ్చిరి? యజ్ఞము ఎట్లు పూర్తి అయినది? ఈ విషయములన్నియు నాకు విస్తారముగ తెలుప వలసినది. శ్రీ గర్గాచార్యులు "పల్వలుడు మూర్ఛితుడయిన పిదప, కునందనుడు మరణించిన పిదప నారదుని ప్రేరణతో శివుడు మిక్కిలి రోషభూయిష్ఠుడై, నంది వాహనుడై, మస్తకము నందు జటాఘూటము నందు చంద్రరేఖ ధరించి, కంఠము నందు పుర్రెలమాల, సర్పములు దాల్చి, సర్వాంగముల యందు భస్మధారియై, భయంకర రుద్రుడై ఏతెంచెను. పది చేతులు, అయిదు తలలు, పదిహేను నేత్రములు కలిగి చేతుల యందు త్రిశూలము, పట్టిశము, బాణము, ధనుస్సు, గొడ్డలి, పాశ, పరిఘ, బందిపాలము ధరించి, సహస్ర సూర్యతేజుడై, భూత గణావృతుడై సమస్త వృష్ణివంశ యోధులను సంహరించుటకు కైలాసము నుండి భూతలమునకు భూమిని కంపింప జేయుచూ ఏతెంచెను. ఆ సమయమున త్రిలోకముల యందు కలకలము రేగి సర్వులు భయభీతులయిరి. ఈ విధముగ ఏతెంచిన శివుని కాంచి యాదవులు సహితము మిక్కిలి భయమునకు లోనయిరి.

అనిరుద్ధుడు నిస్తేజుడయ్యెను. సమరాంగణము నందు ఆతడు దు:ఖితుడై కంపింప నారంభించెను. అంత శంకర భగవానుడు త్రిశూల ధారియై "అనిరుద్ధ, సునందనులెక్కడ? నా భక్తుడయిన కునందనుని వధించి సాంబాది యాదవులు ఎక్కడకు పోయిరి? నా భక్త శిరోమణి అయిన పల్వలుని మూర్ఛితుని గావించి యాదవ గణములు ఎక్కడకు పోయెదరు? ఈ యుద్ధ స్థలి యందు నా భక్తుని శత్రువులయిన సర్వులను నేను సంహరించెదను. నేను, బ్రహ్మ, విష్ణువు మేము ముువ్వురము సంకటములందు భక్తులను రక్షించెదము." ఈ విధముగ పలికి రుద్రుడు అనిరుద్ధుని కడకు భైరవుని పంపి "శూరుడా! నీవు అనిరుద్ధునితో యుద్ధము చేయుము. అంత సునందనునితో యుద్ధము చేయుటకు నందినీ, గదునితో వీరభద్రుని, సాంబునితో మయూర వాహనుడయిన స్కందుని, భానునితో భృంగిని, యాదవ సైనికులతో రణ మాచరించుటకు భూత ప్రేత గణములను పంపెను. రుద్రదేవుని ఆజ్ఞచే భూత, ప్రేత, వినాయక, భైరవ, ప్రమథ, భేతాళ, బ్రహ్మ రాక్షస, ఉన్మాద, కూష్మాండులు కోట్లాది మంది యుద్ధ భూమి యందరుదెంచిరి. భూతములు యాదవులను మండుచున్న కట్టెలతో మోదుచుండిరి.

వినాయకుడు పట్టిశముతోనూ, భైరవుడు శూలము తోనూ, ప్రమథులు మంచపు కోళ్ళతోనూ యాదవులను ప్రహరించుచుండిరి. బ్రహ్మరాక్షసులు మనుష్యులను గుర్రములను భుజింప నారంభించిరి. యాతుధాన్యులు మనుష్యుల శిరములు తినుచుండిరి. భేతాళురు పుర్రెలతో రక్తము తీసికొని పానము చేయుచుండిరి. పిశాచములు నాట్యము చేయుచుండగా, ప్రేతములు గీతములాలపించు చుండెను. వారందరూ యోధుల శిరములను కందుకముల వలె విసురు చుండిరి. వారందరూ అట్టహాసము కావించుచూ, యుద్ధ భూమి అంతయు కలదిరియుచూ ఏనుగులను, రథారోహులను నములు చుండిరి. ఢాకినీ పిశాచినులు తమ పిల్లలకు రక్తపానము చేయించు చుండిరి. ఉన్మాద, కూష్మాండులు స్వర్గస్థులయిన వీరుల పుర్రెలను మాలలుగ కట్టి శివున కర్పించు చుండిరి. ఆ సమయమున యాదవ సేన అంతయు హాహాకారములు చెలరేగి అశ్వములు, గజములు, పదాతులు, వేలాది మంది యుద్ధ భూమి యందు క్రిందపడి హతశేషులయిరి.

శివగణములు ఈ విధముగ విజృంభించుట గాంచి దీప్తిమానుడు తీవ్ర నారాచములు సంధించి ప్రయోగించ మొదలిడెను. ఈ తీవ్ర బాణములు కోట్లాది భూత, ప్రేత, వినాయకుల శరీరములందు గుచ్చుకొని వారిని బాధింప దొడంగెను. ఈ విధముగ ప్రహారములు తగులుట చే భూత గణములన్నియు పలాయనము కావించుట మొదలిడెను.

కొన్ని యుద్ధ స్థలి యుందు పడెను. కొన్ని మరణించినవి. ప్రేత గణములు పలాయనము గావించుట చూచి భైరవుడు క్రోధోద్రిక్తుడై ఒక శునకము నెక్కి త్రిశూల ధారియై ముందుకు వచ్చెను. ఆ కాల భయంకరుని ఎదుటకు ఏగి ఎదుర్కొనుటకు ఎవరికి శక్యము కాలేదు. కానీ అనిరుద్ధుడు ఏకాకిగా సమరము మొదలిడెను. అనిరుద్ధుడు భైరవుని పై అయిదు తీవ్ర నారాచములు ప్రయోగించెను. భైరవుడు ఒక పరిఘతో అనిరుద్ధుని రథమును నుగ్గు నుగ్గు గావించెను. అంత అనిరుద్ధుడు వేరొక రథమధిరోహించి, ఒక సుధృఢ ధనువు చేపట్టి పది సాయకముల ద్వారా భైరవుని గాయపరచెను. ఆ బాణములకు భైరవునకు వ్యాకులత గలిగి కొంచెము మూర్ఛ వచ్చెను. తిరిగి తేరుకొని అగ్ని శిఖల వలె ప్రజ్వలించు త్రిశూలమును అనిరుద్ధునిపై వైచెను. తనపై పడుచున్న త్రిశూలమును కాంచి అనిరుద్ధుడు వానిని బాణములతో ముక్కలు ముక్కలు కావించెను. అంత శివ పుత్రుడయిన భైరవుడు తన ముఖము నుండి అగ్ని పుట్టించెను. ఆ అగ్ని చే భూమి, వృక్షములు, దశదిశలు, మండుట నారంభించెను. రథ, గజ హయ పదాతులు సహితము ఊక వలె మండుట నారంభించెను. ఎందరో వీరులు అగ్ని శిఖలచే మ్రింగబడి భస్మమయిరి. సర్వ సేనయు అగ్ని పరివేష్ఠిత మయినది. అందరూ శ్రీకృష్ణ చింతన నారంభించిరి. తన సేన వ్యాకులులై యుండుట కాంచి భైరవ విరచితమయిన మాయను తెలిసిన యుద్ధ విశారదుడు అనిరుద్ధుడు, ఒకే ఒక బాణము తీసికొని, సంధించి, పర్జన్యాస్త్రమును మంత్రించి, శ్రీకృష్ణ చరణార విందములను చింతించుచు విడచెను.

ఆ బాణ ప్రయోగము చే ఆకాశము మేఘావృతమై కుంభవృష్టి కురియనారంభించెను. మయూర, కోకిల, చాతక, సారస పక్షులు కిలకిలారావములు కావించెను. అన్ని చోట్ల ఇంద్రగోపములు (వాన పురుగులు) ఎగురు చుండెను. ఆకాశము మెరుపుల చే ఇంద్ర ధనువుల చే నిండి మొరయు చుండెను. తన ప్రయత్నము నిష్ఫల మనగా భైరవుడు ఒక భయంకర గర్జన చేసెను. ఆ గర్జనచే పాతాళము నుండి సమస్త ఊర్ధ్వలోకములు వరకు బ్రహ్మాండ మంతయు ప్రతిధ్వనించినది. దిగ్గజములు విచిలితములయినవి. మనుష్యులు బధిరులయిరి. అంత సర్ప భూషణుడు అయిన భైరవుడు కృద్ధుడై, చేతులు నులుముచూ పళ్ళు పటపటా కొరుకుచూచ నేత్రములు ఎరుపెక్కగా, నాలుక లోనికి, వెలుపలికి ఆడించుచూ, అనిరుద్ధుని తృణ ప్రాయముగ తలచుచూ, ఒక తీక్షణమయిన పరశువును చేతిలోనికి తీసికొనెను. ఆ సమయమున రణనీతి కుశలుడయిన అనిరుద్ధుడు జృంభకాస్త్రము ప్రయోగించి శ్రీకృష్ణుడు బాణాసుర విజయమునకై శంకరుని మోహితుని కావించినట్లు భైరవుని మోహితుని చేసెను. అనిరుద్ధుడు చూచుచుండగా భైరవుడు ఆవులించుచూ, నిద్రాసక్తుడై నిద్రించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాద మందలి భైరవ మోహనము అను ముప్పది ఏడవ అధ్యాయము సమాప్తము)

ముప్పది ఎనిమిదవ అధ్యాయము

(నందీశ్వరుని చే సునందనుని మృతి, శివుని త్రిశూలధాటికి అనిరుద్ధుడు మూర్ఛనొందుట; సాంబుని శివనింద; శివ సాంబుల యుద్ధము; రణభూమి యందు శ్రీకృష్ణుని శుభాగమనము)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! రణభూమి యందు భైరవుడు నిద్రించుట కాంచిన పరమశివుడు కృద్ధుడై వీరుడయిన సునందనునిపై దండెత్తుటకు నందీశ్వరుని ఆదేశించెను. వెంఠనే వృషభము క్రోధము చే ఊగుచూ కొమ్ములు, దంతములు, మరియు వెనుక కాళ్ళతో యాదవ సేన పై విరుచుకు పడెను. ఎదురుగ యున్న సునందనుని కొమ్ములతో పొడిచెను. ఆ కొమ్ముల యొక్క ఘాతము చే ఆతని వక్ష స్థలము పగిలి ఆతడు మరణించెను. అంత గజారోహణుడయిన అనిరుద్ధుడు "భయపడవలదు, భయపడవలదు" అని ధైర్యము చెప్పుచూ అచటికి ఏతించెను. శ్రీకృష్ణ పుత్రుడయిన సునందనుడు

మరణించుట గాంచి అనిరుద్ధుడు మిక్కిలి దు:ఖితుడై శోక సముద్రమున మునిగెను. అంత పరమ శివుడు "మహామతీ! అనిరుద్ధా! నీవు రణక్షేత్రమందు శోకింపవలదు. యుద్ధము నందు వెనుదిరుగుట శూరులకు అకీర్తికరము. అందువల్ల నీవు నాతో యుద్ధము చేయుము. నాతో ముందుకు యుద్ధాభిలాషుడవై వచ్చిన నీకు ప్రాణములు పోవు సమయమాసన్న మయినది."

భగవానుని పలుకులు విని అనిరుద్ధుడు శోకము వీడి, శివుని పై అయిదు బాణములు ప్రయోగించెను. ఆ బాణములు జటాజూటము నందు చిక్కి గ్రద్ద రెక్కలు గల వనస్పతి శిఖలవలె ఒప్పారెను. అంత శివుడు తన కోదండము పై ఒక బాణము సంధించి అనిరుద్ధుని నారిని ఖండించెను. అంత అనిరుద్ధుడు శీఘ్రముగ వేరొక నారిని బంధించి వేరొక సాయకము తో శివుని నారిని ఖండించెను. వారిరువురి మధ్య రోమాంఛమయిన సమరము జరుగుచున్నదని విని దేవతలందరూ ఇంద్ర సహితులై విమానము నందు ఏతించి విస్మితులై కాంచుచుండిరి. దేవతలు "వీరిరువురు త్రిభువన సృష్ఠి సంహారకులు. అందువలన వీరి రణము నిష్ఫలము. వారిలో ఎవరు గెలిచెదరు? ఎవరు పరాజితులగుదురు? తదనంతరము మూడు రోజులు వారిరువురి మధ్య ద్వంద్వ యుద్ధము జరిగెను. అంత శివుడు క్రుద్ధుడై కోదండము నందు సాయకము నుంచి బ్రహ్మాస్త్ర మంత్రము పఠించి ప్రయోగించెను. అంత అనిరుద్ధుడు బ్రహ్మాస్త్రమును బ్రహ్మాస్త్రము తోనూ, వజ్రాస్త్రమును పర్వతాస్త్రము తోనూ, పర్జన్యాస్త్రమును ఆగ్నేయాస్త్రము తోనూ శాంతింప జేసెను. అంత పరమ శివుడు క్రోధోద్రిక్తుడై మూడంచులు గల త్రిశూలమును అనిరుద్ధునిప పై వైచెను. అయ్యది అనిరుద్ధుని విదీర్ణుని గావించి గజమును రెండు ముక్కలుగ చీల్చినది. గజము తక్షణము మరణించినది. అనిరుద్ధుడు మూర్ఛితుడయ్యెను. వారిరువురు రణస్థలి యందు నేలపై పడిరి. హాహాకారములు చెలరేగి యాదవులు రోదించుట మొదలిడిరి.

యమాగమనమయిన చో పాపులు ఎట్లు భయపడెదరో అట్లే రుద్రుని గాంచి యాదవసేన భయభీతులయిరి. అనిరుద్ధుడు మృతుడయిన వాని వలె మూర్ఛితుడయ్యెనని విని సాంబుడు నమ్మజాలక, స్కంధుని తో చేయు సమరమునాపి, ఆ దరికి చేరెను. ఎదురుగ పడియున్న అనిరుద్ధుని గాంచి అశ్రుధారలు కారుచుండగా ఇట్లనియె "రుద్రా! సంగ్రామమందు నీవు సునందనుని సంహరించి, అనిరుద్ధుని మూర్ఛితుని గావించి రాక్షసులను పాలించెదవా? నేను వేదము లందు, భాగవత శాస్త్రములందు, బ్రాహ్మణుల ముఖతా "శివుడు వైష్ణవుడు" అని వింటిని. నీవు నిరంతరము శ్రీకృష్ణ భజన కావింతువని వింటిని. ఈనాడు ప్రద్యుమ్న కుమారుని ధరాశయనము చే అవన్నియు వర్ధమయినవి. సునందనుడు శ్రీకృష్ణ పుత్రుడు. నీవు అతనిని సంహరించితివి. శివా! మహేశ్వరా! నీవు వ్యర్థ యుద్ధము గావించుచుంటివి. ఛీ! ఇది నిందితము. నీవు శ్రీకృష్ణ విముఖుడవు. ఈ రణభూమి యందు సాయకముల ద్వారా నిన్ను సంహరించెదను. నిలువుము. నిలువుము."

సాంబుని వచనములు విని మహాదేవుడు ప్రసన్నుడై "యాదవ శ్రేష్ఠా! నీవు ధన్యుడవు. నీవు చెప్పిన వన్నియు సత్యములు. దేవదానవ వందితుడయిన శ్రీకృష్ణ భగవానుడు నా స్వామి. కానీ వీర పురుషుడా! కునందనుడు మరణించి, పల్వలుడు మూర్ఛనొందిన పిదప నేను కేవల భక్తరక్షణకై ఇచటకు ఏతించితిని. నేను ఇచ్చిన మాటను సత్యమొనర్చుచున్నాను. నా భక్తులకు ప్రియమొనర్చుటకు కొంచెము కోపము తెచ్చుకొంటిని." మహానుభావుడయిన శంభుడు భగవానుడు, భూతనాధుడు ఈ పలుకులు పలికినప్పటికీ సాంబుడు తీవ్ర రోషముతో సాయకములు ప్రయోగించి ఆయనను గాయపరచెను. పూలమాల గజరాజును బాధించనట్లు ఆ బాణములు స్వామిని కించిత్ కూడా బాధపెట్టలేదు. అంత వారిరువురు పరస్పరము బాణములు వేసికొనుచు గాయములు కావించు కొనుచుండిరి. వారిరువురి సమరము గాంచి దేవతలు సమస్త లోక సంహారము జరుగునని తలంచిరి. పృధివ్యాకాశములందు తీవ్ర కోలాహలము చెలరేగినది. సమస్త వృష్ణి వంశీయులు శ్రీకృష్ణ స్మరణ కావింప దొడంగిరి. యాదవులకు మహా విపత్తి సంభవించెనని తెలిసి, యదుకుల తిలకుడు, మధుసూదనుడు రథముపై అచటికి ఏతించెను.

శ్యామ సుందరుడు, శంఖచక్ర గదాధారియై, ధనుర్బాణ, ఖడ్గ, కమలములు ధరించి, శ్రీవత్స, కౌస్తుభము, పీతాంబరము, వనమాల, వైజయంతీమాల ధరించి రథముపై అచటికి ఏతెంచెను. ఆ అదరమునకు శ్వేత వర్ణముతో ప్రకాశించుచు అత్యంత వేగ గమనము కలిగి సామగాన మొనర్చు సుగ్రీవాది దివ్య హయములు పూన్చబడినవి. చలితో

కొట్టు మిట్టాడుచున్న జనులు సూర్యోదయమయిన వెంటనే ఎట్లానంద పడెదరో, అట్లే శ్రీకృష్ణా గమనము అయిన వెంటనే యాదవులు అట్లానంద పడిరి. యాదవ సేన అంతయు జయజయ ధ్వానములు కావించినవి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. తమ సహాయమునకు శ్రీకృష్ణుడేతెంచెనన్న వార్త తెలిసి సాంబుడు ధనవు త్యజించి ఆ భగవానుని పాదములపై పడెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద మందలి అనిరుద్దాదులకు సహాయము చేయుటకై శ్రీ కృష్ణాగమనము అను ముప్పది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ముప్పది తొమ్మిదవ అధ్యాయము

(శంకర భగవానుడు శ్రీకృష్ణుని స్థుతించుట; శివకృష్ణుల ఏకత్వము; శ్రీకృష్ణుడు అనిరుద్ధునకు, సునందనునకు జీవన దానమొసగి పల్వలుని చే యాగాశ్వమును తిరిగి ఇప్పించుట)

శ్రీ గర్గాచార్యులు "శ్రీకృష్ణ భగవానుడు అచట ఉపస్థితుడగుట కాంచి మహాదేవుడు త్రిశూలము, ధనువు వదలి భక్తి పూర్వకముగ ఇట్లనియె "సచ్చిదానంద స్వరూపా! సర్వవ్యాపకా! విష్ణుదేవా! నా అవినయమును దూరము కావింపుము. మనసును వారించి, విషయ మృగతృష్ణలను శాంత పరుచవలసినది. ప్రాణుల పట్ల నాకు దయను పెంచి, సంసార సాగరము నుండి నన్ను రక్షింపవలసినది. దేవనది అయిన గంగ ఎవరి మకరందరాశియో, ఎవరి సౌరభ సమూహము సచ్చిదానందమయమో, ఎవరు బంధనములు భేదించెదరో, అట్టి శ్రీపతి చరణార విందములకు నేను సమస్కరించుచున్నాను. పరమార్ధ దృష్ట్యా మనిద్దరికీ భేదము లేనప్పటికీ నేన మీ వాడిని. మీరు నా వారు కారు. ఎందుకనగా సముద్రము తరంగములను పుట్టించును, కానీ తరంగములు సముద్రమును పుట్టింపవు. ఓ! గోవర్ధన ధారీ! ఇంద్రానుజా! దానవకుల శత్రూ! సూర్య చంద్ర నేత్రధారీ! మీ దర్శనము చే నాకు సంసారము పట్ల విముఖత ఏర్పడుచున్నది. పరమేశ్వరా! మీరు మత్స్యాది అవతారములు స్వీకరించి ఈ వసుధా పాలనము కావించెదరు. దయచేసి నన్ను కూడా పాలింపవలసినది. దామోదరా! గుణమందిరా! సుందర వదనారవిందా! గోవిందా! భవసాగరమును మథించు మందరాచల స్వరూపా! నారాయణా! కరుణామయా! నేను మీ చరణ యుగళి నందు శరణాగతుడను. ఈ ఆరు పదముల స్థుతి రూపిణీ షట్పది (భ్రమరము) నా ముఖరూప కమలమందు నివసించుగాక!" శంకర భగవానుని చే కావింపబడిన స్థుతిని విని శ్రీకృష్ణ భగవానుడు మిక్కిలి సంతసించి, తన పదముల పై వ్రాలిన శివుని లేవనెత్తి, ఆయన అభిప్రాయమును అడిగెను.

"పరమశివా! నీ యందు నా బుద్ధి హీనతగల కుమారులు ఏ అపరాధము కావించిరి? నీవు యదుకుల వినాశనము ఎందుకు కావించితివి? నీవు యుద్ధస్థలికి ఎందుకు ఏతెంచితివి? ఒకవేళ వచ్చినా ఎందుకు సమరము కావించితివి. ఇయ్యది సవిస్తారముగ నాకు తెల్పుము." శ్రీకృష్ణుని ప్రశ్నకు పరమ లజ్జితుడై పరమశివుడు కొంత తడవు ఆలోచించి ఇట్లనియె" దేవదేవా! జగన్నాథా! రాధికావల్లభా! జగన్మయా! కరుణాకరా! నేను లజ్జావిహీనుడను, మరియు అపరాధిని. నన్ను రక్షింప వలసినది. నేను మీ ఎదుట ఏమి చెప్పగలను? మీరు సర్వజ్ఞులు. నేను మీ మాయచే మోహితుడనై నా భక్తుల రక్షణకై ఇచటికి ఏతెంచితిని. మీరు నా అపరాధమును మన్నింపవలసినది. నేను "జగద్నాశకుడను" అను అభిమానము చే శ్రీకృష్ణుడు, పరమాత్మునికి చెందిన వృష్ణి వంశీయులను సంహరించితిని. అందుకే సాధు పురుషులు పరమ వాంఛితమయిన మహైశ్వర్యమును సహితము వీడి నీ చరణ కమలారవిందములను ఆశ్రయించెదరు. జనులకు మనస్సు శ్రీకృష్ణుని యందు లగ్నము అవనంతవరకు సుఖదు:ఖములనెడి ద్వంద్వములు జరుగుచునే యుండును. శ్రీకృష్ణుని యందు మనస్సు లగ్నమయిన ఎడల భక్తియోగరూపమయిన ఖడ్గము ప్రాప్తించును. అయ్యది మనుష్యుల కర్మరూప వృక్షము యొక్క మూల ఛ్చేదము కావించును. కొంత మంది నా భక్తి గర్వము చే, బలము చే, గర్వితులై, నా స్వామివయిన

నిన్ను అవమానించెదరు. వారు నిశ్చయముగ నరకమున కేగుదురు." ఈ విధముగ పలికి శంకర భగవానుడు నిశ్శబ్దుడై, కన్నుల నుండి అశ్రుధారలు కారుచుండగా స్వర్ణదండము వలె శ్రీ కృష్ణ చరణయుగళి పై పడెను.

శ్రీకృష్ణ ప్రభువు శంకరుని లేవనెత్తి, తన వద్ద నుంచోబెట్టి, తన సుధా భరిత దృష్టిని అయనపై ప్రసరించి ఇట్లనియె "పరమశివా! దేవతలందరూ తమ భక్తులను పాలించెదరు. అట్లే నీవును నీ భక్తులను పాలించితివి. ఇది నిందిత కర్మ కాజాలదు. మన మిరువురము పరస్పర హృదయములందుంటిమి. మన ఇరువురిలో భేదము లేదు. దోషబుద్ధి గలవారు మన ఇరువురి యందు భేద మరయుదురు. సదాశివా! నీ భక్తులు నాకు, నా భక్తులు నీకు నమస్కరించెదరు. నా ఈ మాటను పెడచెవిని పెట్టు దురాత్ములు నరక గతులు అగుదురు." ఈ విధముగ పలికి మరణించిన తన పుత్రుని సునందనుని సుధామయ దృష్టిచే చూచి అతనిని పునర్జీవితుని కావించెను.

అనిరుద్ధుని వక్షమునకు గ్రుచ్చుకున్న శూలమును నెమ్మదిగ వెలికితీసి అతనికి సహితము జీవన దాన మొసంగెను. అటు పిదప యుద్ధ భూమి యందు మరణించిన యాదవులందరినీ తన సుధాదృష్టిచే చూచి వారందరినీ బ్రతికించెను. అంత దేవతలు పుష్పవృష్టి కురిపించి గరుధధ్వజ భగవానుని ప్రసన్నుని కావించిరి. త్రిలోక నేత అయిన శ్రీకృష్ణుని చూడగనే సమస్త యాదవులు జయజయ ధ్వానములు కావించిరి. తదనంతరము మహాదేవుని రక్షణచే పల్వలుడు సురక్షితుడై లేచి రోషము తో "అనిరుద్ధుడెక్కడ?" అని ప్రశ్నించెను. అంత పరమశివుడు సముచిత వచనములతో వానిని సముదాయించెను. శ్రీకృష్ణ ప్రభావము నెరిగిన మహామనస్వి అగుటచే పల్వలుడు ఆనందమొంది, శ్రీకృష్ణ స్తుతి కావించి, అనేక ధనరాశులతో పాటు యాగాశ్వమును సహితము వెనుకకు ఇచ్చెను.

అటు పిదప తన సైన్యము, యాగాశ్వ సహితుడై శ్రీ కృష్ణుడు సేతు మార్గమందు పయనించి, సముద్రతటమున కేతెంచి, అక్కడి నుండి పశ్చిమ ముగ పయనించెను. పల్వలుని రాజ్యాభిషిక్తుని కావించి, శివ భగవానుడు తన గణముల సహితుడై కైలాసమున కేగెను. ఎవరు శ్రీకృష్ణ చరిత్రను తమ గృహముల యందు చదివెదరో, వారికి శ్రీకృష్ణ భగవానుడు ఎల్లప్పుడూ సహాయము నిచ్చును.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద మందలి "అనిరుద్ధ విజయవర్ణన" మను ముప్పది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

నలుబదియవ అధ్యాయము

(యజ్ఞాశ్వము వ్రజమండలమున ప్రవేశించుట; శ్రీదాముడు దానిని బంధించి నందుని కడకు ఏగుట; నందుడు సమస్త యాదవ సహితుడై శ్రీకృష్ణుని కలియుట; యాదవ సేన నంద వనమున, శ్రీకృష్ణుడు నంద పట్టణమున నివసించుట)

శ్రీగర్గాచార్యులు "మహారాజా! శ్రీకృష్ణుని ద్వారా ముక్తులయిన పుత్రులు మరియు యాగాశ్వము అనేక దేశముల నవలోకించుచూ ముందునకు పోయెను. పల్వల నరేశ్వరుడు పరాజితుడయ్యెనన్న వార్త విని, ఏ రాజులు ఆ అశ్వమును బంధించుటకు సాహసింపలేదు. ఈ విధముగ ముందుకు పోయి యాగాశ్వము భారత వర్షాంగర్తమయిన వ్రజభూమిని చేరెను. అచట యమునా నదిని దాటి బృందావనము దర్శించుచు చివరకు ఒక తమాల వృక్ష ఛాయన విశ్రమించెను. అచట యున్న గోపబాలురు గోవులను కాచుట ఆపి, ఆ హయము చుట్టూ చేరి కుతూహలము తో చప్పట్లు చరచుచుండిరి. ఇంతలో గోపగణ నాయకుడయిన శ్రీదాముడు అచటికి ఏతెంచి, అశ్వమును గాంచి, సునాయసముగ దానిని పట్టి, ఆవులను కట్టు రజ్జువుతో ఆ హయము మెడను కట్టి, "ఈ అశ్వమెవరిది? ఎవరు దీనిని వదలిరి?" అని మిగిలిన గోపబాలురుతో చర్చించుచూ నంద గృహమున కేతెంచెను.

ఆ అశ్వమును చూడగనే నందుడు ప్రసన్నుడై, దాని ఫాలమున లిఖించబడిన పత్రమును చదివి గద్గదవాణితో ఇట్లనియె "మన గ్రామమునకు ఏతించిన గుర్రము ఉగ్రసేన మహారాజుది. నా ముని మనుమడయిన అనిరుద్ధుడు దీనికి అన్ని విధములుగ రక్షకుడు. నేను మిత్రులను కలియుటకై ఈ అశ్వమును బంధించెదను. పిదప అచ్చు శ్రీకృష్ణుని వంటి ఆకృతి గల అనిరుద్ధుని కాంచెదము." ఇట్లు పలికి, యశోదాదేవికి తన అభిప్రాయము తెలియజేసి, ఇతర గోపకులందరినీ కూడగట్టి గ్రామము బయటకు వచ్చెను. ఆ సమయమున భోజ, అంధక, వృష్ణి, వంశజులయిన యాదవులందరూ అశ్వమునకు కొంచెము వెనుక వచ్చుచుండిరి. వారు గంగా సాగర సంగమము నుండి నైపాల తీర్థము, మిథిలా, అయోధ్యా, బర్హిష్మతీ, కన్యాకుబ్జము, బలభద్ర తీర్థము, గోకులము, సూర్యకన్యా (యమున) సాక్షాత్ కేశవుడు నివసించు మధురా పురమును గాంచి బృందావనమున ప్రవేశించి నంద వ్రజమున కేతెంచిరి. నంద వ్రజమును దూరము నుండియే చూచి రధారూఢుడయిన శ్రీ కృష్ణుడు అందరి కంటె ముందుగా నందవ్రజమున కేగుటకు నిశ్చయించెను. అచట నందుడు ఒక మహోన్నత గజమును అందముగ అలంకరించి ముందరనుంచెను. అనేక విధముల వాద్యములు వాయించుచూ, శంఖనాదములు చేయుచూ, జయజయ నాదములు కావించుచు, గోపవాసుల సహిత నందుడు పూలమాలలు, పూర్ణ కుంభము పట్టుకొని వేచి యుండెను.

ఆ సమయమున ఆయన కుడిభుజము అదిరినది. ఆయన ఈ శుభ శకునములు చూచి మనసులో "ఏమీ! నేను నా ముద్దు కృష్ణుని చూచెదనేమో? ఎందుకనగా శుభ సూచకముగా నా కుడిభుజము, కుడికన్ను అదురుచున్నవి. ఒక వేళ నేను శ్రీకృష్ణుని చూచిన ఎడల వస్త్ర భూషణాలంకృతములయిన ఒక లక్ష గోవులను బ్రాహ్మణులకు దానమొనర్చెదను." ఈ విధముగ సంకల్ప మొనర్చి, నిశ్శబ్దముగ యున్న తరుణమున వ్రజవాసుల ద్వారా తన పుత్రుడు ఏతించుచున్న వార్త వినెను. "శ్రీ కృష్ణుడు వచ్చుచున్నాడు అన్న వార్త వానిన వెంతనే విరహ వేదన ననుభవించుచున్న నందుడు రోదించుచూ ముందునకేగెను. ఆయన మాటిమాటికీ "హే! కృష్ణ!" హే! కృష్ణ! నీవు ఎక్కడికి వెళ్ళితివి? దు:ఖితుడనైన నన్ను ఎందుకు చూచుట లేదు?" అని పలుకుచుండెను తన తండ్రిని చూడగనే పితృవత్సలుడయిన శ్రీకృష్ణుడు రథము నుండి దూకి ఆయన పాదములపై పడెను. సంధ్యానంతరము ఏతించిన తన పుత్రుని లేవనెత్తి, హృదయమునకు హత్తుకొని, అశ్రువులతో స్నానము చేయించెను. శ్రీకృష్ణుడు సహితము కరుణ నిండిన కన్నుల నుండి అశ్రువులు కార్చెను.

తదుపరి ప్రేమభరితులయిన శ్రీదామాది స్నేహితులను వేరువేరుగ హృదయమునకు హత్తుకొనెను. ఈ భూతలము నందు భక్తుల మహాత్మ్యమును వర్ణింపగల మహాత్ములెవ్వరు? ఒక ప్రక్క నందాది గోపకులు, వేరొక ప్రక్క శ్రీకృష్ణాది యాదవులు రోదించుచుండిరి. అందరూ విరహ వ్యాకులులగుటచే ఎవ్వరూ మాటలాడ నశక్యులైరి. శ్రీకృష్ణుని ముఖము నుండి అశ్రుధారలు ప్రవహించుచున్నవి. ఆయన గద్గద వాణిచే ప్రేమానందమున మునిగిన సమస్త గోపకులను ఆశ్వాశించెను. వారందరికీ జగదీశ్వరుడు మధుకు వెళ్ళినపుడు ఎట్లుండెనో, ఇప్పుడు తిరిగి వచ్చినపుడు అట్లే యుండెను. నూతన జలధర దేహకాంతితో, కిశోరా వస్థయున్న బాలకుని వలె ప్రకాశించు చుండెను. నేత్రములు శరత్కాల పున్నమివలె శ్వేతవర్ణము తో యుండెను. కోట్లాది కామదేవుల లావణ్యము తో యొప్పెను. సుందరాధరమ్ములపై చిరునవ్వు, చేతిలో మురళిని ధరించి, ద్విభుజుడయిన శ్రీకృష్ణుడు మిక్కిలి మనోహరుడై యుండెను. విద్యుత్ కాంతి కలిగిన పీతాంబరము, మీన కుండలములు, చందనాలంకృత శరీరము, వక్ష మందు కౌస్తుభము, మోకాళ్ళ వరకూ వ్రేలాడు మాలతీమాల, దొండపండ్ల వంటి పెదవులు, ఈ విధమయిన నేత్రానంద కరమయిన రూపమును వ్రజవాసులు నేత్రములతో త్రావుచుండిరి.

తదుపరి ప్రేమరసాబ్ధి యందు మునిగిన నందుడు సాంబునికి, అనిరుద్ధునకు, సమస్త యాదవులకు శుభాశీశులు ప్రసాదించెను. పిదప సమస్త యాదవులు, పుత్ర పౌత్రులతో పరివేష్ఠితుడయిన నందుడు తన పురము ప్రవేశించెను. ఆయన దు:ఖము సంపూర్ణముగ దూరమయ్యెను. ద్వారము చేరుట తోడనే శ్రీకృష్ణుడు రథము నుండి దూకి సాంబాది పుత్రుల సహితుడై తన తల్లికి ఆనందము కలిగించుటకు ఆమె భవనమునకు చనెను. యశోదాదేవి గృహ ద్వారము వద్దనే రోదించుచూ వేచి యున్నది. యశోదాదేవి తన ప్రాణాధికుడయిన పుత్రుని హృదయమునకు హత్తుకొని గద్గద కంఠముతో ఆయనను ఆశీర్వదించెను.

నంద, ఉపనంద, వృషభాను, వృషభానువరులు అందరూ ఆయనను చూచుటకేతించిరి. యాదవ సహితుడయిన

శ్రీకృష్ణుడు అచటకు ఏతించిన గోపాలురతో విధి విధానముగ కలసి అందరినీ సమాదరించెను. వారందరూ శ్రీకృష్ణుని కుశల మడిగిరి. శ్రీకృష్ణుడు సహితము వారిని కుశల సమాచారములడిగెను. తదుపరి బృందావనమున, యమునా తటమున అనిరుద్ధుని విశాలసేన శిబిరములు దించినది. అనిరుద్ధుడు, సాంబుడు, ఉద్ధవాదులు శిబిరముల యందే యుండిరి. కానీ శ్రీకృష్ణ భగవానుడు నందుని ఇంటనే యుండెను. నందుడు అచట యున్న సైనిక సిబ్బందికి అంతటికీ, భోజనములిడెను. పశువులకు సహితము గ్రాసమిడెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాద మందలి యాదవసేన వ్రజమండల ప్రవేశమను నలుబదియవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఒకటవ అధ్యాయము

(శ్రీ రాధా కృష్ణుల కలయిక)

శ్రీ గర్గాచార్యులు "సాయం సమయమున శ్రీ రాధాదేవి శ్రీకృష్ణుని ఆహ్వానించినది. ఆమె ఆహ్వానమును గొని, ఒక ఏకాంత స్థలమందు, శీతల కదళీవనమునకు శ్రీకృష్ణుడేగెను. కదళీ వనమందు ఒక మేఘ హర్మ్యము నిర్మింపబడినది. అందు చందనమున ముంచిన వింజామరలు వీచుచుండెను. అరటి ఆకులతో అలంకరించబడిన కారణమున ఆ భవనము మిక్కిలి మనోహరముగ యున్నది. ఆ విశాల భవనమున యమునా నదిపై నుండి శీతలమలయ మారుతము వీచుచూ, ఆ భవనమును మరింత శీతలము కావించుచున్నది. అట్టి సుందర శీతల భవనము శ్రీ రాధాదేవి యొక్క విరహాగ్నిచే భస్మీభూత మగుచున్నది. గోలోకము నందు ప్రాప్తమయిన శ్రీదాముని శాపము చే శ్రీ రాధాదేవి శ్రీ కృష్ణ విరహము భరింప వలసి వచ్చుచున్నది. ఈ దశ యందుకూడా, ఆమె తన శరీరమును ఎందుకు రక్షించుకున్నదనిన, ఏదో ఒకరోజు శ్రీకృష్ణుడు వచ్చుచున్న ఆశ.

సఖుల ముఖతా శ్యామ సుందరుడు వనము నందు ప్రవేశించెనన్న వార్త విని శ్రీ రాధాదేవి, తన ఆసనము నుండి లేచి సఖీ సహితురాలై, ద్వారము వద్ద వేచియున్నది. శ్రీ రాధాదేవి శ్రీకృష్ణుని ఆహ్వానించి, ఆసనము నిచ్చి, అర్ఘ్య పాద్యాది ఉపచారములు సమర్పించి, విరహజనిత దు:ఖమును త్యజించినది. సంయోగము చే హర్షోల్లాసిత అయినది. ఆమె శుద్ధ వస్త్రములు, ఆభూషణములు ధరించి, చందనమునలదుకొని, శింగారించుకొనినది. తన ప్రాణ నాథుడయిన శ్రీకృష్ణుడు మధురాపురమున కేగిన మీదట ఆమె మరి అలంకారము కావించుకొనలేదు, మృష్టాన్న భోజనము ఆరగింపలేదు, తాంబూల చర్వణము చేయలేదు, శయ్యపై పరుండలేదు. ఆ సమయమున సింహాసనాధీశుడయిన మదన మోహనుని గాంచి శ్రీ రాధాదేవి గద్గద కంఠయై, అశ్రువులు కార్చుచూ, ఇట్లనియె "హృషీకేశా! నీవు గోకులేశ్వరుడవు. మరి గోకులము, మధుర వదలి కుశస్థలి కెందుకేగితివి? నాకు ఆ విషయము గూర్చి తెలుప వలసినది. మీ వియోగము చే నాకు క్షణమొక యుగము వలెను, ఘడియ మన్వంతరము వలెను, దినము పరార్థము వలెనూ గోచరించుచున్నది. దేవా! నాకు ఏ కుసమయమున ఈ దు:ఖదాయకమయిన విరహము ప్రాప్తించినది? ఏ కారణము చే నాకు సుఖకరమయిన మీ పాదార వింద దర్శనము కావింప బడుటలేదు. సీతాదేవి శ్రీరాముని, హంస మానస సరోవరమును ఎట్లు కోరునో, అట్లే నేనునూ రాసేశ్వరుడవయిన నిన్ను నిరంతరము కలియుటకు మనస్కరించు చున్నాను. నీవు సర్వజ్ఞుడవు. నీకు నా దు:ఖమును ఎట్లు తెలుపగలను? వంద సంవత్సరములు గడచినవి. కానీ నా వియోగము నకు అంతము లేకున్నది."

తన ప్రాణ ప్రియుడయిన మదన మోహనునికి ఈ విధముగ విన్నవించి విరహావస్థ యందున్న శ్రీ రాధాదేవి భోరు భోరున ఏడవసాగెను. ఈ విధముగ రోదించుచున్న తన ప్రియతమను గాంచి తన వచనముల ద్వారా ఆమె యొక్క మానసిక వ్యధను తొలగించుటకై ఈ విధముగ శాంత వచనములు పలికెను, "ప్రియ రాధా! నీవు శోకింపవలదు.

మన ఇరువురి తేజము ఒక్కటే! కానీ రెండు రూపములతో ప్రకటితమయితిమి. ఈ విషయమును మహర్షి బృందము నెరుంగుదురు. నేనెక్కడనో నీవక్కడే! నీవెక్కడనో నేనక్కడే!! మన ఇరువురి యందు ప్రకృతి పురుషుల వలె వియోగము లేదు. ఏ నరాధముడు మనలను వేరుగా తలచునో, అతడు దేహాంతము నందు నరకము నందు పడును. శ్రీ రాధికా! ఎట్లు చక్రవాకము ప్రాత:కాలమున తన ప్రియ చక్రవాకమును వీక్షించునో అట్లే నీవును సదానన్ను నీ దగ్గరగా చూచెదవు. ప్రాణవల్లభా! అతి కొద్ది దినములలో సమస్త గోప, గోపికలను, నీతో సహితముగ అవినాశ బ్రహ్మ స్వరూపమయిన గోలోక ధామమునకు వెడలుదుము." ఆ మాటలు వినిన శ్రీ రాధికాదేవి అతి ప్రసన్నయై శ్రీకృష్ణునికి పూజనము కావించి రాసక్రీడ కై ప్రార్థించెను. అంత రాసేశ్వరుడు అంగీకరించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన శ్రీ గర్గ వజ్రనాభ సంవాదము నందలి శ్రీ రాధాకృష్ణుల కలయిక అను నలుబది ఒకటవ అధ్యాయము సమాప్తము)

నలుబది రెండవ అధ్యాయము

(రాసక్రీడా ప్రసంగమున బృందావనము, యమునా తీరము, వంశీవటము, నికుంజ భవన శోభా వర్ణనము)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! హేమంత ఋతువుయొక్క ప్రధమ మాసపు (మార్గశీర్ష మాసము) పూర్ణిమ నాటి రాత్రి శ్రీ రాధికా వల్లభుడు బృందావనము నందు పూర్వకాలము వలెనే సర్వులనూ మోహింపజేయు మురళిని వాయించెను. ఆ ధ్వని సర్వులనూ ఆకట్టుకొనుచూ నలుదిశలా వ్యాపించెను. మేఘ గతిని వారించుచూ, తుంబురుని మరల మరల ఆశ్చర్య చకితుని గావించుచూ, సనక సనందనుల ధ్యానమును భగ్నము కావించుచూ, బ్రహ్మ దేవుని విస్మితుని చేసి, ఉత్కంఠ పూరిత స్వరము చే బలి చక్రవర్తిని చపలుని కావించుచూ, నాగరాజయిన శేషుని యందు చంచలతను తెచ్చుచూ, బ్రహ్మాండ కవాటమును భేదించుచూ ఆ వంశీధ్వని సర్వదిశలా వ్యాపించెను. ఇంతలో సర్వ జనులకు తాపము కలిగించు సూర్య కిరణములు అంతరించి, సర్వులకు ఆహ్లాదము కలిగించు పూర్ణ చంద్రుడుదయించెను. ఆ సమయమున యమున దివ్యరూపము ధరించెను. బృందావనము, గిరిరాజయిన గోవర్ధనము, వ్రజభూమి సహితము దివ్యరూప ధారులయ్యెను. శ్యామల వర్ణ ధారిణి అయిన యమునా నది యొక్క ఉత్కృష్ఠత మరింత పెరిగెను.

ఇరువైపులా యున్న గట్లు శ్రేష్ఠమయిన ముత్యములు, హరిత రత్నములు, తో నిర్మింపబడిన కరతోలికల కూడినవై, వైఢూర్య, నీలిమణి, హరిద్మణి, ఇంద్రనీల, మరియు వజ్రములతో నిర్మింపబడిన మెట్లతో నిండి యమున మరింత శోభాయమానముగ కానపట్టెను. యమున అచట శ్రీకృష్ణ సదనమునకు పున:ఏతించుచున్న నదులన్నిటి యందు ఉత్కృష్ఠముగ శోభించుచున్నది. స్వేచ్ఛగా విహరించుచున్న మత్స్య గణములతో, సుందర శ్యామాంగ ధారిణి అయిన యమున సర్వుల పాపములనూ నాశనము కావించుచూ, ఎత్తైన కెరటములను విరజిమ్ముచూ, ప్రఫుల్ల కమల శోభితయై యుండెను.

గోవర్ధనము శత పూర్ణచంద్రుల కాంతితో ప్రకాశించుచూ, మందార, చందన, కల్పవృక్ష శోభితయై, రాసమండలి, మణిమయ మండపములతో విరాజిల్లు చున్నది. ఆ శిఖరములపై మంజుల నికుంజ కుటీరములు ప్రకాశించుచున్నవి. యమునా తటము, మంద మందముగ వీచు మలయమారుతము, శ్రీఖండ కుంకుమాగరు యుక్త మృత్తిక, పరమ కళ్యాణ మయముగ గోచరించుచున్నది. వసంత ఋతువు నందలి నూతన పల్లవములు, రంగురంగుల పుష్పములతో విరాజిల్లు బృందావనము మందార, చందన, చంపా, కదంబ, నారింజ, మామిడి, రావి, అగరు, నిరంబ, మారేడు, తాడి, మర్రి, కొబ్బరి చెట్లతో సుశోభితమైయున్నది. అంతేకాక తమాల, సాల, కల్పవృక్ష, కుంద, బేరి, అరటి చెట్లు కూడా

ఆ పర్వతము నిండా నిండి కేతకీ, శిరీష పుష్పములతో కూర్చబడి ఆ పర్వత రాజము విరాజిల్లుచున్నది. సత్పురుషులకు మోదమొనరించు లతలతో, కమల సమూహములతో, తులసీ చెట్లతో, నిండిన బృందావనము మధుమయమయిన మాధవీలతలతో శోభించుచున్నది. మహారాజా! ఒక్కసారి యోచించుము. వ్రజ మండల మధ్య భాగమున బృందావనము, యమునాతీరము, మధుర విహంగ ధ్వనులు, వాటితో మిళితమయిన వంశీరవ ధ్వని!! మనసునకు. ఆనందదాయకము అగుచున్నది కదా!

యమునా తీరము పలాశ, వేప, రావి, కోవిదార, అర్జున, దేవదారు వృక్ష జాతులతోనూ, పున్నాగ, నాగకేసర, కుటజ పుష్పజాతులతోనూ నిండియున్నది. చక్రవాక, సారస, చిలుక, శ్వేతరాజహంస, కారండవాది పక్షులు కలకూజితములతో ఆ ప్రాంత మంతయు కోలాహలము నిండి యుండెను. తీరము నందు కోకిలలు, పావురములు, నీలకంఠములు, మధురముగ కూయుచున్నవి. పురివిప్పిన నెమళ్ళు నాట్యము చేయుచూ క్రేంకరించుచున్నవి. ఇంత మధురమయిన యమునా తీరమును మహారాజా! నీవు ధ్యానింపుము. ఆ వనమందు హరిణ, మర్కటములు చరించుచున్నవి. గోవర్ధన శిఖరములు పద్మరాగ మణి యుక్తమై యున్నవి.

బృందావనము నందు నికుంజములు కౌస్తుభము మరియు ఇంద్రనీలము చే అలంకృతమై యున్నవి. కోట్లాది చంద్రుల కాంతి గలిగిన చాండ్లరీలు వ్రేళ్ళాడతీయబడి యున్నవి. ఆ నికుంజ భవన ద్వారము మణిమయ నిర్మితము. ముత్యముల రాశులు మెరుపుతో, స్వర్ణమయముగ దీపించు పతాకములు రెపరెప లాడుచున్నవి. హంస, మరియు పావురములు ఆ మందిరము చుట్టూ చేరి యున్నవి. ఆ భవనము మందార, గన్నేరు, కుంద, చంపా పుష్పమాలతో అలంకరింపబడి యున్నది. అంతేకాక నాగకేసర, కమల, హరిచందన, పుష్ప, పల్లవములతో కట్టిన మాలలు, మల్లి, జాజి పుష్పములతో కట్టిన పుష్పహారములతో అలంకరింపబడిన నికుంజభవనము మన్మధుని మనసును సహితము హరించునట్లు గోచరించుచున్నది. ఆ భవనపు గోడలపై రత్నమయ దర్పణములు, శ్వేత చామరములు, భవనపు శోభను మరింత ఉత్కృష్ఠము గావించుచున్నవి. పుష్పమాలికలతో అలంకరింపబడిన సువర్ణ సింహాసనములు, శయ్యాసనములు, ఆ భవనపు శోభను మరింత ఇనుమడింప జేయుచున్నవి. భవనపు నేల అంతయు శ్రీ చందనము, అగరు, కస్తూరి, పుష్ప సుగంధ మకరందము చే కలిపిన నీటిచే చిలకరింపబడి అపూర్వ సౌరభము వెదజల్లు చున్నది. వసంత ఋతువు నందు క్రొత్తగా చిగురించు పల్లవములపై నుండి మందగతితో వీచు మలయమారుతము వలె అక్కడి సుగంధము నెమ్మదిగ ప్రసరించుచూ ఆహ్లాదకరముగ యున్నది. అచటి వృక్షశాఖలన్నియు పుష్ప, ఫల భారముతో నమ్రతగ వంగి యున్నవి. మహారాజా! శ్రీహరి యొక్క ఆ నికుంజ భవనమును నీవు ధ్యానింపుము.

శ్రీహరి యొక్క వేణునాదము చే ఉత్పన్నమయిన గీతము మిక్కిలి ప్రేమాస్పదమై, ప్రేమానందమును వృద్ధి పరుచు చున్నది. అది వినిన సమస్త వ్రజ సుందరీమణుల మనసు శ్రీకృష్ణ వశమయినది. వారు సమస్త గృహ కర్మములు విడచి వ్రజభూమికి చనిరి. పతులు నిరోధించిన పడతులు తమ స్థూల శరీరములు వదలి సూక్ష్మ శరీరములతో శ్రీకృష్ణుని కడకు ఏగిరి. ఒక స్వర్ణమయమయిన దుకూలము పరుచబడిన దివ్య సింహాసన మధ్యభాగమున శ్రీ శ్యామ సుందరుడు శ్రీ రాధికాదేవి సహితుడై, సుఖాసీనుడై యుండెను. ఆయన నీలి మేఘ శ్యామల ఛాయా శరీరుడై, ప్రాత:కాల సూర్య సమ కిరీటము ధరించి, తన దివ్య మనోహర కాంతి నలువైపులా విరజిమ్ముతూ, అధరము నందుంచబడిన మురళి, మదన మోహనుని మోహన రూపమును మరింత ఇనుమడింప జేయుచుండగా, కోట్లాది కామదేవులను మోహింపజేయు ముకుందుని అక్కడికి ఏతించిన వ్రజ భామలు వీక్షించిరి. మీన కుండలధారి అయిన తమ ప్రియతముని కాంచి ఆ అతివలు మూర్ఛ నొందిరి. వారి శరీరము నందు ఎటువంటి చేష్ఠలు లేవు. అంత శ్రీకృష్ణుడు తన అమృతమయ వాక్కులతో సర్వులనూ ఆశ్వాశించెను. అంత వ్రజవాసినులు చేతన నంది, గద్గద వాణితో, శ్రీకృష్ణుని స్థుతించి, తమ విరహజనిత దు:ఖమును పరిత్యజించి, తమ ప్రాణ వల్లభుని వైపు అత్యంత ప్రేమగా చూచిరి.

మాలతీ లతలు వ్యాప్తిచెందిన దివ్య వృక్షముల తో నిండిన భ్రమర గుంజితమయిన బృందావనము నందు మదన మోహనుడు గోపాంగనలతో విహరింప నారంభించెను. తన కరకమలములతో శ్రీ రాధికాదేవి హస్తకమలమును గ్రహించి ఆమెను యమునా తటికి తీసికొని వెళ్ళెను. అచట విహరించిన పిదప తిరిగి తమ నికుంజ భవనమున

కేతించిరి. ఆ భవనము నందు శ్రీకృష్ణ చరణార విందు చింతనాలగ్నమయిన గోపాంగనల పాదముల యందలి నూపురములు, చేతుల యందలి కంకణములు, కాళ్ళకు మంజీరములు, కటి ప్రదేశమందలి రత్నఖచిత వడ్డాణములు చిరుగంటలు చేయుచున్న రూపమును మహారాజా! నీవు మనసుతో వినవలసినది. మంద మంద సుందర మందహాసములతో మెరయుచున్న కపోలములు, విద్యుల్లతల కాంతి ప్రకటించు దంత పంక్తులు కూడియున్న గోప వనితల రూపము మిక్కిలి మనోహరముగ యున్నది. కాంచన కనక కోటీర రత్న హారములు, హరిత మణిమయ భుజకీర్తులు, సూర్య మండలము వలె దీప్తించు కుండలములు ధరించి కొందరు గోప యువతులు "ముగ్ధ" ల వలె, కొందరు ఇంతులు "మధ్యగ" వలెనూ, కొందరు తరుణీ మణులు "ప్రగల్భ" ల వలెనూ ప్రకాశించు చుండిరి. ఇంతలో కొందరు వ్రజ సుందరీమణులు మందస్మితము కావించు చుండిరి. కొందరు మదమత్త వన విహారము చేయుచుండిరి. కొందరు ఒకరి చేతులనొకరు పట్టుకొని పరుగిడు చుండిరి. మరి కొందరు వారిని పూల చెండ్లతో కొట్టుచుండిరి. కొందరు పరుగులిడు చుండగా వారి కేశపాశములు విడివడు చుండెను. మరికొందరు ప్రక్కవారి సువర్ణ హారములు క్రీడా సదృశముగ లాగుచుండిరి. ఆ నికుంజ భవనము నందు శ్రీ, జాహ్నవీ, మధుమాధవీ, శీలా, రమా, శశిముఖీ, విరజా, సుశీలా, చంద్రాననా, లలిత, అచల, విశాఖ, మాయా మొదలగు అసంఖ్యాక గోపికలు గలరు.

ఇచట నేను కొద్ది గోపికల పేర్లను మాత్రమే నుడివితిని. అచట గల మణిమయ భూమి యందు కొందరు లీలా ఛత్రములు, మరి కొందరు అతిమౌక్తిక, లతా పుష్పహారములు, కొందరు చామరములు, దండములు, రెపరెపలాడుచున్న పతాకములు, పట్టుకొని నడచుచుండిరి. కొందరు గోపాంగనలు శ్రీహరి యొక్క వేషము ధరించి నాట్యము చేయు చుండిరి. కొందరు వీణ, మృదంగము, చేతులతో తాళము వాయించుచుండిరి. కొందరు వ్రజ వనితలు వృషభాను నందిని వేషము ధరించి కుండల, కేయూర అలంకృతలై, వంశీ వేత్రములు ధరించి నడచు చుండిరి. తమ హావభావములతో, రసతాళయుక్త మందస్మితముతో, ఘల్లుఘల్లు మనుచున్న నూపుర ధ్వనిచే నిర్మల కటాక్ష వీక్షణములు, ముడి వేసిన కనుబొమల విలాసములతో, సంగీత నృత్యకళా జ్ఞానము చే శ్రీ రాధా మాధవులను సంతుష్టులను కావించుచుండరి. యమునా తటము నందు నికుంజ భవన సమీపమున యున్న వనభూమి యందు నట వేషధారి అయిన శ్రీకృష్ణ భగవానుడు శ్రీ రాధికా సహితుడై గోవర్ధన మందు విహరించుచుండెను.

పద్మరాగమణి వంటి అరుణిమ గల నఖములు, ఘల్లు ఘల్లుమను నూపురములు గల కాళ్ళు, దివ్య కాంతి యుతములయిన సంపూర్ణావయములు, తను నడచిన భూ ప్రదేశమును అరుణ రాగ రంజితము కావించు ఎర్రని పాదములు, లక్ష్మీదేవి చే లలితముగ వొత్తబడిన కాళ్ళు, పీతాంబరము చే కప్పబడిన బలమయిన తొడలు, సన్నని నడుము, భ్రమరముల వంటి రోమావళి గల నాభి సరోవరము, మూడు రేఖలతో అలంకరింపబడిన ఉదరము, భృగు చరణము చే మరియు కౌస్తుభమణి చే అలంకృతమయిన వక్షము, నూతన మేఘమాల వంటి శరీరకాంతి, ఏనుగు తొండముల వంటి భుజములు, చేతులు, రత్నమయ భుజకీర్తులు, మణిమయ కంకణములు, ఒక చేతి యందు కమలము, రెండవ చేతి యందు రాజహంస వంటి తెల్లని శంఖము, శంఖాకార గ్రీవము, సుందర కపోలములు, గూఢమయిన చిబుకము, విద్యుల్లతా సమూహము వంటి కిరీటము, మార్తాండ మండలముల వంటి కుండలములు, అధరములపై మురళి, ఫాలభాగము పై కదలాడు ముంగురములు, సజల పద్మపత్రము వంటి స్వేద బిందువులతో, కోట్లాది కామ దేవుల సౌందర్యాభిమానమును తిరస్కరించు శ్రీ విగ్రహము, గలిగిన శ్రీ రాధా వల్లభుని మీరందరూ భజింతురుగాక!

ఎర్రని నఖములతో కూడిన పాదపద్మములు, మనోహర రావములు కావించుచున్న మంజీర, నూపుర, ఘంకారములతో సహితముగ వడ్డాణపు చిరుగంటలు, నీలపురంగు దుకూలముతో కప్పబడిన మిక్కిలి తెల్లని శరీరము, మనోహర మందహాసము, విభిన్న అవయవములకు పొందికగా అమర్చబడిన సువర్ణమయ రత్నహారములు, తాటంకయుత కర్ణములు, కౌస్తుభ మణి దారిత కంఠము, సుందర రత్నమాలలు, మనోహర పుష్పమాలాంలకృత వక్ష స్థలము, చూడామణి మరియు అర్ధ చంద్ర స్వర్ణ భూషణము, అలంకృత మయిన మస్తకము, చేతుల యందు సహస్రదళ పద్మము, భుజ కీర్తులతో అలంకరింపబడిన శ్రీయుతమయిన భుజములు, మణిమయ కంకణ భూషణమయిన చేతులు, సుందరమయిన నాసిక, మరియు బేసరి, మెరయుచున్న కపోలములు, యవ్వనావస్థకు అనురూపమయిన మందగతి, సుందర వేణీ

బంధము, కూర్చిన శిరోజములు, సంధ్యాకాలమున ఉదయించిన కోట్లాది పూర్ణ చంద్రుల కాంతిని తిరస్కరించు ముఖ బింబము, సుందర హావభావ సుశోభితము, వన వికసిత నీలి కమలదళముల వంటి నేత్రములు, శ్రీ చందనము, అగరు, కేసరి పంకములచే అభిషేకింపబడినది, మందస్మిత, అమావాస్య నిశి వంటి కుంతలరాశి కలది, పారిజాత పుష్పములు కేశపాశము నందు యుంచబడినది, కల్పవృక్షముల వంటి అంగకాంతి కలిగినది, నేత్రముల యందు కాటుక శోభ కలిగినది, గజగామిని, పద్మినీ నాయిక, అయిన రాసేశ్వరీ, శ్రీ రాధికాదేవిని సదా భజింతుము.

ఎవరు సమస్త క్షేత్రములందు క్షేత్రజ్ఞుడై నివసించునో, ఆది పురుషుడు, ఆది యజ్ఞ స్వరూపుడు, సమస్త కారణములకు కారణరూపుడు, ప్రకృతి పురుషులకు పరుడు, శివ, ధర్మ, ఇంద్ర, శేష, బ్రహ్మ, గణేశ, అన్య దేవతలు చే స్థుతింపబడువాడు, శ్రీ రాధా, లక్ష్మీ, దుర్గా, భూదేవీ, విరజా, సరస్వతీ, మరియు సంపూర్ణ వేదములచే స్థుతింపబడువాడు అయిన శ్రీహరిని భజించెదను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి రాసక్రీడా వర్ణనము అను నలుబది రెండవ అధ్యాయము సమాప్తము)

నలుబది మూడవ అధ్యాయము

(శ్రీకృష్ణుడు శ్రీ రాధా, గోపికలతో విహరించుట; గోపికలు అభిమాన పూర్వక వచనములతో శ్రీకృష్ణుడు శ్రీ రాధికా సహితుడై అంతర్ధానుడగుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! లతా, వృక్ష, భ్రమరయుక్తమయిన బృందావనము నందు శీతల మంద పవనములు వీచుచుండగా, మనోహర వంశీరవ నాదము చేయుచున్న ముకుందుని గాంచి దేవతలు సహితము మోహితులగు చుండిరి. వేణుగానమును విని విహ్వలమయిన శ్రీ రాధికాదేవి శ్రీకృష్ణుని తన బాహువులతో బంధించెను. గోకుల చంద్రుడయిన శ్రీకృష్ణుడు గోకులచకోరి అయిన శ్రీరాధాదేవిని ప్రేమ పూర్వకముగ స్పర్శించుచూ పూలతో అలంకరింపబడిన శయ్యపై ఆనందమయ దివ్య క్రీడా విలాసము కావించెను. శ్రీకృష్ణుని తో విహరించుచూ శ్రీ రాధాదేవి అత్యంత సుఖము నొందుచూ బ్రహ్మానంద నిమగ్నమయ్యెను. ఆమె ముకుందస్వామిని వశము చేసికొని, వారిరువురు పరమానందానుభవము నొందిరి.

ప్రేమానందమును ప్రసాదించు శ్రీ రమా వల్లభుని రాసమండలి యందు గోప రమాదేవిలు అన్ని వైపుల నుండి బంధించిరి. అందు వంద యూధముల తరుణీమణులు యుండిరి. నంద నందనుడు ఎంతమంది వ్రజ సుందరీ మణులు గలరో, అన్ని రూపములు ధరించి వారితో విహరించెను. బ్రహ్మ సాక్షాత్కారానంతరము సంత పురుషులు ఎట్లు పరమానందము నందు నిమగ్నమగుదురో, అట్లే బృందావన విహారిణులైన వ్రజ సుందరీమణులు మదన మోహనునితో విహరించిన పిదప అట్లే బ్రహ్మానంద సాగరమున మునిగిరి. శ్రీ వల్లభుడయిన శ్యామ సుందరుడు తన కరార విందముల ద్వారా వారందరినీ హృదయమునకు హత్తుకొనెను. ఎందువలననగా వారందరూ తన భక్తిచే భగవానుని వశము చేసికొనిరి. ఆ గోప సందరీమణుల ముఖము నందు స్వేద బిందువులుదయించినవి. శ్రీకృష్ణ భగవానుడు తన పీతాంబరము చే మిక్కిలి ప్రేమతో వారి స్వేదమును తుడిచెను. ఈ గోపాంగనల తప:ఫలితమును నేను ఏమని వర్ణింపగలను? వారు సాంఖ్య, యోగ, తప, ఉపదేశ శ్రవణ, తీర్ధసేవన, గానము ఇవేవి లేకుండా కేవలము ప్రేమ పూర్వక కామన ద్వారా శ్రీహరిని ప్రాప్తించిరి.

తదనందరము సమస్త గోప వనితలు అభిమాన వతులై పరస్పరము ఇట్లు సంభాషించిరి "సఖులారా! ఈ కృష్ణుడు మునుపు మనను విడచి మధురా పురమునకు చనెను. ఎందుకనగా స్వతహాగా ఈయన సుందరుడు. అక్కడ

పరమ సుందర రూప వతులయిన స్త్రీలను దర్శించుటకేగెను. కానీ అక్కడ అత్యంత సుందర వనితలు దక్కలేదు. పిదప అచట నుండి ద్వారకకు ఏగెను. అక్కడ కూడా సరి అయిన సుందరీమణులు దృష్టి గోచరము కాలేదు. పిదప ఒక రాకుమారిని వివాహమాడెను. ఆమె భీష్మక కుమారి అయిన రుక్మిణి. తదుపరి ఆమెను సుందరిగా కానక అనేక వివాహములు చేసికొనెను. అట్లు పదహారు వేలమందిని తీసికొచ్చి ఇంటి యందుంచెను. వారెవ్వరి యందును ఈయనకు అనుకూలవతి అయిన సుందరీమణి కనబడక తిరిగి వ్రజభూమికి మన వద్ద కేతెంచెను. అందువల్ల మనము త్రిలోకములందునూ సమస్త సుందరీమణుల యందు శ్రేష్ఠులము, సులోచనలము, చంద్రముఖులము, మరియు సుస్థిర యవ్వనవతులము. మనముందు స్వర్గలోక దేవాంగనలు కూడా రూపము నందు ఆగరు. ఎందుకనగా మనము మన కటాక్ష వీక్షణముల ద్వారా శ్రీకృష్ణుని వెంటనే వలలో వేసికొని కాముకుని గావించినాము. ఒక హంస ముత్యమును స్వీకరించిన పిదప వేరొక వస్తువును ఎట్లు తినగలదు? అన్ని చోట్లా ముత్యములు దొరకవు కదా! అవి కేవలము మానస సరోవరము నందు మాత్రమే లభించును. భూమండల మంతటనూ సుందర స్త్రీలు లభింపరు. కేవలము వ్రజభూమి యందు మాత్రమే లభించెదరు."

జగదీశ్వరుడయిన శ్రీకృష్ణుడు ఆత్మారాముడు. ఆయన గర్వితులయిన ఆ వ్రజ సుందరీమణుల మాటలు విని తక్షణమే శ్రీ రాధా సహితుడై అంతర్ధానుడయ్యెను. నిర్ధనుడయిన మనుష్యుడు సహితము ధనము వచ్చిన పిదప గర్వితుడగును. మరి నారాయణుడు ప్రాప్తించిన వారి విషయము గూర్చి ఏమి చెప్పగలము?

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండము నందు గర్గ వజ్రనాభ సంవాదము నందలి "రాసక్రీడ" యను నలుబది మూడవ అధ్యాయము సమాప్తము)

నలుబది నాల్గవ అధ్యాయము

(గోపికలు శ్రీకృష్ణుని వెదకుచూ వంశీవటము వద్దకు వచ్చుట; శ్రీకృష్ణుడు గర్విత అయిన శ్రీ రాధాదేవిని విడచి అంతర్ధానుడగుట)

వజ్రనాభుడు "మునివర్యా! సంసారము నందు ఏ జనులు కృష్ణ కథా సుధను తమ కర్ణములతో వినెదరో, శ్రీకృష్ణ నామ జపమును తమ నోటితో చేయుదురో, నిత్యము ఆయన ధ్యాన దర్శనములు కావింతురో, ప్రతి దినము ఆయన చరణోదకమును త్రాగుదురో, మరియు ప్రసాదమును భజింతురో అట్టి జనులు ధన్యులు. ఎవరు శరీర సౌఖ్యము ఉత్తమ మనుకొని, భోగములు భోగించుచూ శ్రవణ, మననాది క్రియలు విసర్జించెదరో, వారు మరణానంతరము నరక కూపమున పడి సూర్య చంద్రులున్నంత కాలము కాలసూత్ర నరకమందు పడియుందురు. మహామునీ! నాకు తదుపరి జరిగిన శ్రీకృష్ణ కథామృతము తెలపీయ వలసినది."

శ్రీ గర్గాచార్యులు "శ్రీకృష్ణుడు అంతర్ధానుడయిన పిదప గోపాంగనలు ఆయనను కానక హరిణములు తమ యూథపతిని కోల్పోయినట్లు దు:ఖమగ్నులయిరి. పిదప పూర్వము వలె అనేక యూథములుగ విడి, అన్ని ప్రక్కలకు వెళ్ళి, అన్ని వనములలో ఆయనను వెదుకనారంభించిరి. వారు వృక్షములను, లతలను, యమునను, పుష్పములను, ఫలములను, గోవర్ధనమును, పక్షులను, మృగములను, ఈ విధముగ కనిపించిన ప్రతి వస్తువునల్లా శ్రీకృష్ణుని గూర్చి ప్రశ్నించిరి. కానీ అవి ఏవియును ప్రత్యుత్తరమునీయజాలినవి. ఎందువలననగా అవన్నియు మోహమునకు వశీభూతమయినవి. ఈ విధముగ వారు శ్రీకృష్ణుని జాడను అడుగుచూ గోప సుందరీమణులు "కృష్ణా! కృష్ణా!" అనుచు కృష్ణమయిలయిరి. కృష్ణ స్వరూపులయిన గోపాంగనలు శ్రీ కృష్ణ చరితమును అనుకరించుచూ యమునా తటమున యున్న ఇసుక వద్ద ఆగిరి. ఆ ఇసుక యందు

శ్రీకృష్ణ చరణ ముద్రికలు గాంచి వానిని అనుసరించి తీవ్రగతిని ముందుకేగిరి. వారు శ్రీకృష్ణ పదరేణువులను తీసికొని తమ మస్తకమందుంచుకొని పరవశులగు చుండిరి. ఇంతలో వారికి వేరొక ముద్రికలు సహితము కనిపించినవి. అవి చూచి వారు "ఇది తెలియ చున్నదా? శ్రీ శ్యామ సుందరుడు శ్రీ రాధికాదేవి సహితుడై యుండెను. ఇట్లు పరస్పరము పలుకుచు వారు తాళవనమున ప్రవేశించిరి.

ఇంతలో శ్రీ రాధా సమేతుడయిన శ్రీకృష్ణుడు గోపికల కోలాహలము విని శ్రీ రాధికాదేవితో ఇట్లనియె " కోట్లాది పూర్ణ చంద్ర నిభాననా! తొందరగా నడువుము. మన ఇరువురినీ తీసికొని పోవుటకు వ్రజవాసినులు ఏతించుచున్నారు. అంత శ్రీ రాధికాదేవి ముందు శ్యామ సుందరుని పూలతో అలంకరింపజేసి ఇది వరలో యున్న విధముగ అలంకరించెను. పిదప నంద నందనుడు సహితము అనేక పుష్పములు కొనివచ్చి శ్రీ రాధాదేవిని పూర్వకాలమున భాండీర వనమందు అలంకరించిన రీతిని శింగారించెను.

తదుపరి తన ప్రాణవల్లభకు అంగాంగములందు అనుపమ లేపనములు అనులేపనము కావించి. తాంబూల చర్వణము చేయించెను. శ్యామ సుందరుని ద్వారా కావింపబడిన అలంకారము చే శ్రీ రాధాదేవి సుందరత యందు పరాకాష్ఠ నొందెను. పిదప ఒక్కొక్క పూల వృక్షము క్రింద పుష్పమయమయిన ఒక దివ్య శయ్య ఏర్పరిచి తన ప్రియ సఖితో దివ్య ప్రేమమయ క్రీడను కావించెను. బృందావనము, గోవర్ధన గిరి రాజము, యమునా తీరము, నందీశ్వరగిరి, బృహత్సాను గిరి, లోహిత పర్వతము, మరియు వ్రజమండల బయటి వనములు, అన్ని చోట్లా తన ప్రాణ వల్లభ తో కలసి విహరించి చివరకు వంశీవట వృక్షము క్రిందకు చేరెను.

అచట గోపవాసినులచే "కృష్ణ! కృష్ణ" అను కోలాహలము వినిపించుచున్నది. అంత ఆయన తన ప్రియతమతో "ప్రియా! తొందరగా నడువుము" అని నుడివెను. శ్రీకృష్ణుని పలుకులు విని శ్రీ రాధికాదేవి "దీనవత్సలా! నేను విహరించుట యందు అసమర్ధురాలిని. నేను ఇంటి నుండి బయటకు రాకుంటిని. నేను దుర్బలురాలిని. మీకు ఎక్కడికి వెళ్ళవలెనని అని పించునో అచటకు నన్ను కూడా కొనిపోవలసినది." అది వినిన మదన మోహనుడు అత్యంత చెమటతో తడసిన శ్రీ రాధికా దేవిని తన పీతాంబరము తో వీవన వలె విసరెను. అంత ముకుందుడు "ప్రియా! నీకు ఎక్కడ సుఖముగ నుండునో అక్కడకే వెడలుదుము" అని పలికెను. అది వినిన శ్రీ రాధాదేవి కించిత్ గర్వము కలిగినదై ఇట్లు తలపోసెను "నా ప్రియతముడు ఈ రాత్రి, ఈ ఏకాంత స్థలి యందు సమస్త సుందరీమణులను వదలి నా సేవ చేయుచున్నాడు." మనసున ఇట్లు తలంచి ఆమె సమాధానమీయక మిన్నకున్నది. అంతేకాక ఆమె తన వీపు శ్యామసుందరుని వైపు త్రిప్పి వెనుకకు తిరిగెను. అంత శ్రీహరి మరియొకమారు "ప్రియా! నీవు శాప వశమున వియోగ పీడితవైయున్నావు. అందువల్ల సదా నీకు నేను సాయపడుచున్నాను. వెనుకయున్న సమస్త గోపికలను విడచి నీకు సేవ చేయుచున్నాను. నీవు నా భుజము పై కూర్చొని నీకు ఇష్టమయిన ఏకాంత స్థలమునకు సుఖముగ ఏగ వలసినది." ఇట్లు పలికినను సమాధానము రాకున్నది. అంత అచ్యుతుడు తన లీలను ప్రదర్శించి అంతర్ధానుడయ్యెను. వెనువెంటనే శ్రీ రాధాదేవి గర్వము సర్వము ఖర్వమయ్యెను. ఆమె దు:ఖ సంతప్తయై రోదించ నారంభించెను. శ్రీ రాధికా దేవి యొక్క రోదనము విని సమస్త గోపికలు అచటకు ఏతించి అత్యంత దు:ఖిత అయిన శ్రీ రాధాదేవిని చూచిరి. వారు చామరము తీసికొని శ్రీ రాధపై చల్లని వాయువు వీవ నారంభించిరి. ప్రేమ పూర్వకముగ ఆమెను కేసర యుక్త జలమందు స్నానము చేయించి గోప సుందరీమణులు ఆమెను తీయని పలుకులతో ఆశ్వాశించిరి. శ్రీ రాధికాదేవి ముఖతా ఆమె గర్వ కారణమున మాధవుడు మాయమయ్యెనని వార్త విని వారు విస్మితులైరి. అంత వారందరూ వారివారి అభిమానము (గర్వము) ను వర్జించి, యమునా తటము కేతించి శ్రీకృష్ణ ప్రభువు తిరిగి వచ్చుటకు మధుర స్వరముతో ఆయన గుణగానము చేయ నారంభించిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాద మందలి రాసక్రీడ అను నలుబది నాల్గవ అధ్యాయము సమాప్తము)

నలుబది అయిదవ అధ్యాయము

(గోపాంగనల ద్వారా శ్రీకృష్ణ స్తుతి; శ్రీకృష్ణా గమనము)

గోపికలు "ఎవరు తన అధరముల లాలిత్యము తో పగడములను సహితము తిరస్కరించునో, మధుర మురళీ నాదముతో ఆనందము నిచ్చునో, ఎవరి ముఖార వించము నీలి కమలము వలె కోమలము మరియు శ్యామలమో, అట్టి గోప కుమారుడయిన శ్యామ సుందురుని మేము ఉపాసించు చున్నాము. ఎవరి అంగకాంతి సాయం సంధ్యను తలపోయునో, ఎవరు వన విహారమును సదా ఇష్టపడెదరో, ఎవని అంగములు మిక్కిలి కోమలములో, ఎవని నేత్రములు ప్రఫుల్ల కమలదళములు వలె సుందరము మరియు విశాలమో, ఎవరు భక్త జనాభీష్టములను పూర్ణము కావించెదరో, ఎవరు వ్రజ సుందరీమణుల నేత్రములను శీతలము కావించెదరో ఆ మదన మోహనుని శ్రీకృష్ణుని భజించుచున్నాము.

ఎవని లోచనములు చంచలములో, కోమలాధరములు అర్ధవికసిత కమలమువలె శోభించుచున్నవో, ఎవని చేతి వేళ్ళు, మరియు పెదవులు మురళీ సుశోభితములైనవో, ఆ వేణు వాదన రసికుడయిన మాధవుని మేము భజించుచున్నాము. ఎవని దంతములు మల్లెమొగ్గల వలె ఉజ్వలముగ ప్రకాశించుచున్నవో, ఎవరు వ్రజభూమికే భూషణుడో, ఎవరు సకల భువనములకు మంగళముల నిచ్చునో, ఎవరు తన శబ్ద సౌరభములచే మనసును హరించునో, అటువంటి సుందర రూపముగల పురుషుని గోపాంగనలు వెదుకుచున్నారు. ఎవని ఆకృతి దేవతలకు సహితము పూజనీయమో, ఎవని చరణార విందామృతము మునీశ్వరులు సహితము నిత్యము సేవించెదరో, ఆ కమల నయనుడు, శ్యామ సుందరుడు భగవానుడు నిత్యము మాకు కళ్యాణ మొనర్చుగాక! ఎవరు గోపకులతో మల్లయుద్ధ మొనర్చెదరో, ఎవరు యుద్ధము నందు గొప్ప వీరులను సహితము పరాజితుల నొనర్చెదరో, ఎవరు సంపూర్ణ యోగులకు సహితము ఆరాధ్య దేవతయో, అట్టి శ్రీహరిని మేము ఎల్లప్పుడూ సేవించెదము.

"ఎవరి శరీరము నూతన మేఘము వంటి ఛాయ కలిగినదో, ఎవరి లోచనములు ప్రఫుల్ల కమలముల శోభను తిరస్కరించునో, ఎవరు గోపాంగనల హృదయములను తన చూపులతో హరించునో, ఎవని అధరములు నూతన పల్లవముల శోభను తిరస్కరించునో, అట్టి శ్యామ సుందరుని మేము ఉపాసించెదము. ఎవరు అర్జునుని రథమునకు శోభయో, ఎవరు సమస్త పాపములను క్షణములో భస్మీపటలము కావించునో, ఎవరు వేదవాణికి జీవనాధారమో, ఆ నిర్మల శ్యామ తేజము మా మనుసులో ఎల్లప్పుడూ స్ఫురించుగాక! ఎవరి కిరీటము నందు నెమలి పింఛములు శోభించునో, ఎవని అంగ వైభవము నీలి మేఘ కాంతిని పోలియుండునో, ఆ నీలకేశ పాశధారి శ్యామ సుందరుని మేము భజించు చున్నాము."

"ఎవరి లీలలను వ్రజవనితలు నిరంతరము గానము చేయుచుందురో, ఎవరు కోమలముగ మురళిని వాయించుచుండునో, ఎవరు సారస్వత స్వరూపుడో, ఆయనను మేము నిరంతరము భజించుచుందుము. ఎవరు మనసుపై మోహమును కలిగించెదరో, ఎవరు శాంగ ధన్వధారియో, ఎవరు అభిమాన వతులయిన గోప కన్యలను విడచి వెళ్ళిపోయెనో, ఎవరు నిరంతరము నారదాది మునులచే భజింపబడునో, ఆ నంద గోపనందనుని నిరంతరము భజించెదము. ఏ శ్రీహరి అసంఖ్యాక వ్రజవాసినుల చే పరివేష్ఠింపబడి రాసమండలి యందు అందరిపై విజయము నొందునో, ఆ శ్యామ సుందరుని రాధికా సహితులమై వెదకుచున్నాము. దేవదేవా! మీరు దు:ఖహారకమయిన మీ పరిపూర్ణ రూపముతో మాకు దర్శనమీయ వలసినది. మేము నీకు పరిపూర్ణ దాసీలము. మీరు మమ్ము పూర్వము వలె మీ దానిగా చేసికొన వలసినది. ఎవరు ప్రళయ జలములందు తన తీక్షణమయిన కోరతో భూమండలమును ఎత్తిన యజ్ఞవరాహ రూపుడో, ఎవరు హిరణ్యాక్షవధ కావించెనో, ఆ శ్రీహరి మనసునుద్ధరించుట యందు సమర్థుడు. ఎవరు వేనుని భుజముల నుండి స్వేచ్ఛా రూపముతో ప్రకటితమయ్యెనో, ఎవరు మత్స్యరూప ధారియై వేదరక్షణ గావించెనో, ఆ శ్రీకృష్ణుడే ఈ అశుభవేళ మన గోపికలందరికీ శరణు నిచ్చుగాక!"

ఏ పరమ ప్రభుడు సముద్రమంధన వేళ మహా కూర్మ రూపము ధరించి మంధర పర్వతమునకు ఆధార

భూతముగ నిలచెనో, మరియు నృశింహ రూపము దాల్చి తన భక్తుడయిన ప్రహ్లాదునకు బాసటగ నిలచి హిరణ్యకశిపుని వధించెనో, ఆ శ్రీహరి మనకు ఆశ్రయమిచ్చుగాక! ఎవరు బలి చక్రవర్తి వద్ద మూడడుగుల భూమి నడిగి త్రివిక్రమ రూపముతో, త్రి భువనములనూ కొలెచెనో, దేవ ద్రోహులను శిక్షించి ముని జనులకు అనుగ్రహ మొసంగెనో, యదుకుల రూపుడయిన బలభద్రునిగ అవతరించి హస్తినా పురిని తన నాగలితో గంగ యందు ముంచ సంకల్పించెనో, అట్టి శ్రీకృష్ణ భగవానుడు మనలను రక్షించుగాక! ఎవరు గోవర్ధన పర్వతము నెత్తి గోపగోపీజనమును, నందాదులను, పశు పక్ష్యాదులను రక్షించెనో, కౌరవ సభా మధ్యమున ద్రుపద రాజకుమారి యొక్క శీల రక్షణ కావించెనో, అట్టి శ్రీహరి యొక్క పదార విందములను మనమందరము శరణు జొచ్చెదము గాక!

"ఎవరు వనమాలా విరాజితుడు, పరమ సుందర కేశ పాశకుడు, నెమలి పింఛము ధరించునో, ఎవరు బృందావన పుష్పమాలచే అలంకృతుడో, ఎవరు కస్తూరి, అగరు సౌరభము వెదజల్లుచూ భక్త జనుల మనసులను ఎల్లప్పుడూ తన వైపుకు లాగుకొనునో, ఎవని అంగకాంతి లేత తమలపాకు వంటి నీల కాంతి గలిగి, ఎవరి ఆకృతి లావణ్య నిధియై యుండునో, అట్టి శ్యామ సుందరుడు, మదనమోహనుడు మనను రక్షించుగాక!" ఈ విధముగ భక్తి పూర్వకముగ గోప వనితలచే ఆహ్వానింపబడిన వాడయిన ముకుందుడు తక్షణము అచట ప్రత్యక్ష మయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి రాసక్రీడా ప్రసంగమున శ్రీ కృష్ణాగమనము" అను నలుబది అయిదవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఆరవ అధ్యాయము

(శ్రీకృష్ణాగమనము చే గోపికల ఉల్లాసము, శ్రీ రాధాదేవి మూర్ఛ నుండి తేరుకొనుట, శ్రీహరి శ్రీ రాధా వ్రజవనితలతో వన విహారము, స్థల, జల, పర్వత విహారము మరియు రాసక్రీడ)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! వ్రజవాసినులు శ్రీకృష్ణుని కాంచిన తక్షణము జయజయ ధ్వానములు కావించి, అత్యంత హర్షోల్లాసితులు అయిరి. శ్రీ రాధికా దేవి మూర్ఛనొందినది. అది చూచి గోపాంగనలు శ్రీకృష్ణుని ప్రాధేయపడిరి. అంత శ్రీహరి వ్రజభూమి యందు వంశీనాదము కావింప దొడంగెను. అయిననూ శ్రీ రాధికాదేవి మెళకువనందలేదు. అది చూచి ముకుందుడు మరల మరల మురళీగీతికలాలపించెను. అది విని శ్రీ రాధికాదేవి మేలుకొనినది. కానీ వియోగ దు:ఖము స్మరించి తిరిగి మూర్ఛితురాలైనది. అంత శ్రీకృష్ణుని ఆజ్ఞను బడసి చంద్రానన అను సఖి శ్రీ రాధికాదేవితో ఇట్లు సంబోధించెను, "శ్రీ రాధికాదేవీ! ఏ కృష్ణ చంద్రుడు నిన్ను విడచి వెళ్ళెనో, ఆయనే ఒక యుగము గడచిన పిమ్మట తిరిగి వచ్చెను. ఆ దేవకీ నందనుడే నీ వద్ద కూర్చొని నీ దు:ఖ నాశనమునకై వేణుగానమాలపించు చుండెను. రాసము యొక్క రమణీయ ప్రాంగణము నందు మధురమృదంగ నాదము మ్రోగుచుండగా దేవాంగనలచే సేవింపబడు మాధవుడు నృత్యము కావించుచూ వేణు నాదము వినిపించుచుండెను. ఆ దేవకీ నందనుడు బృందావనమందు గోపికా మండలి మధ్య వేణువు వాయించుచూ, గీతమాలాపించు చుండెను. గోప, గోపీ, గోవల్లభుడు మరియు కంసరూప వనమును దహించు దావానల రూపుడయిన దేవకీ నందనుడు వేణువు వాయించుచూ గానము చేయుచుండెను. గోప బాలికలు తాళము వేయుచుండగా, దానికి ప్రతిగా తన కనుబొమల విలాసమును ప్రదర్శించుచూ, గోపాంగనల గీతములు వినుచూ ముకుందుడు వేణు నాదమును కావించుచుండెను. దేవీ! నీ పరమ ప్రియుడు, నందనందనుడు సర్వాభరణ భూషితుడై నీ కొరకు వేణుగానము కావించుచున్నాడు."

వేణుగానము ఆలాపించుచున్న శ్యామ సుందరుని మహిమా వర్ణనము వినిన శ్రీ రాధాదేవి ప్రసన్నురాలై, లేచి తన ప్రియుని గాఢాలింగము చేసికొనెను. తదుపరి బృందావనా ధీశ్వరుడయిన గోవిందుడు తన ప్రాణ వల్లభ సహితుడై

వనము నందు వృక్ష శోభను కాంచుచూ విహరింప మొదలిడెను. తదనంతరము వ్రజవనితలు మెరుపులు మేఘమాలికను చుట్టుముట్టినట్లు అన్ని వైపుల నుండి ముకుందుని ముట్టడించిరి. అంత మాధవుడు అచట ఎంతమంది గోపికలు కలరో అన్ని రూపములు ధరించి యమునా తీరమున కేతెంచెను. పూర్వకాలమందు శృతులు నారాయణుని చూచి ప్రసన్నులయినట్లు గోపాంగనలు శ్యామ సుందరునితో అట్లే ఆనందానుభవము అనుభవించిరి. గోపాంగనలు తమ వస్త్రములను ఒక ఆసనముగ వైచిరి. దానిపై శ్రీరాధాకృష్ణులు ఉపవిష్ఠులయిరి. "ఆహా! గోపాంగనలు తమ భక్తిచే భగవంతుని సహితము వశము చేసికొనిరి గదా! శ్రీకృష్ణుడు గోలోకము నందు మున్ను ధరించిన త్రిభువన రూపమును శ్రీ రాధికా దేవితో కలసి వారందరికీ ప్రకటించెను. వారందరూ ఆ పరమాద్భుత రూపము గాంచి బ్రహ్మానందము నందు నిమగ్నులై తమను తాము మరచిరి. వన విహారానంతరము వారితో కలసి గోవిందుడు యమునా జలములందు ప్రవేశించి విహరించెను. మాధవుడు మాధవిపై, మాధవి మాధవునిపై జల ప్రోక్షణ కావించుచూ, అత్యంత ఉత్సాహముతో క్రీడించుచుండగా వారి వేణీ కేశపాశములు విడివడి పుష్పములన్నియు యమున యందు పడి విచిత్ర వర్ణముతో ప్రకాశించుచూ, యమున అనేక రంగుల పూసిన వస్త్రము వలె కానపట్టెను. విద్యాధర దేవాంగనలు పుష్పవృష్టి కురిపించిరి. జల విహారమయిన పిదప శ్యామ సుందరుడు లీలగా యమున నుండి బయటకేతెంచి గోవర్ధన పర్వతముపైకి ఏగెను. ఆయన సహచరిణులయిన గోప వనితలు ఆయనను అనుసరించిరి. కొందరు వ్యజనములు, చామరములు, తాంబూలములు, దర్పణములు, నానా విధములయిన ఆభూషణముల పాత్రలు, పుష్పభాండములు, చందన పాత్రలు, పారాణి, వస్త్రములు, వీణా, మృదంగ వాద్యములు, ఇట్లు వివిధ వస్తువులు తీసికుని ఆ గోపీ గణములు ఆ దివ్య పురుషుని అనుసరించిరి. రాగ, రాగిణిలు, పూర్వము గోలోకమందున్న గోపికలు అందరూ గోపికా రూపములు ధరించి మాధవుని సమీపమున గాన, నాట్యములు గావించు చుండిరి. వారందరి మధ్యా వేణునాదము కావించుచూ మదన మోహనుడు నాట్యము చేయుచుండెను.

రాసమండలమంతయు బాజా భజంత్రీలు, కడియ, కంకణ, నూపురముల గణగణలతో మారుమ్రోగుచుండెను. దేవతలు, దేవాంగనలు శ్రీకృష్ణుని రాసక్రీడ చూచి ప్రేమ వేదనతో మూర్ఛితులయిరి. మెరుపు తీగలతో కూడిన మేఘము, చంద్రకాంతితో పరివేష్ఠిత మయిన చంద్ర బింబము ఎట్లుండునో, గోపాంగనల చే చుట్టుముట్టబడిన ముకుందుడు అట్లే ప్రకాశించెను. ఆ పర్వతముపై గిరిధరుడు పుష్పహారములు, పారాణి, కాటుక, కమలములతో శ్రీ రాధికాదేవిని అలంకరించెను. శ్రీ రాధికాదేవి సహితము కుంకుమాగరు చందనములచే ముకుందుని ముఖారవిందము నందు పత్రరచన గావించెను. అంత మందస్మిత అయిన శ్రీరాధాదేవి మాధవునకు తాంబూలము నిచ్చెను. ఆ తాంబూలమును శ్రీహరి మిక్కిలి ప్రేమతో స్వీకరించెను. అట్లే శ్రీకృష్ణార్పిత తాంబూలమును శ్రీ రాధికాదేవి సహితము స్వీకరించి అతి ప్రసన్న అయ్యెను. అంత శ్రీకృష్ణుడు ఆమె నములుచున్న తాంబూలమునడిగెను. ఆమె భయభీతయై ఆయన చరణార విందముల పై బడెను.

"పద్మా, పద్మావతీ, నందీ, ఆనందీ, సుఖదాయినీ, చంద్రావళీ, చంద్రకళ, మరియు వంధ్యా" వీరందరూ శ్రీహరి యొక్క పాణవల్లభులు. శ్రీహరి వసంత ఋతువు చిగురించిన బృందావనము నందు కామదేవుని తిరస్కరించు ఎన్నో మన మోహిత రూపములు ధరించెను. కొందరు గోపికలు ఆయన అధరామృతమును సేవించిరి. మరికొందరు ఆయనను బాహువుల మధ్య బంధించిరి. మదన మోహనుడు గోపాంగనల వక్షస్థలమందలి సింధూరము కపోలములకంటుకొని అనుపమ శోభతో ప్రకాశించెను. పిదప కదళీ వనము నందు గోపాంగనల సహితుడై రాసము చేసెను. ఈ ప్రకారముగ రాస మండల మందు నిత్యానంద మయుడయిన శ్యామ సుందరునితో ఆ రాత్రి ఒక్క క్షణము వలె గడిచెను. ఈ విధముగ రాస క్రీడానంతరము శ్రీహరి నంద భవనమునకు చనెను. శ్రీ రాధాదేవి వృషభాను పురము, గోపాంగనలు తమ తమ ఇండ్లకు వెడలిరి. వ్రజభూమి యందలి గోపకులు శ్రీహరి యొక్క రాస క్రీడను గూర్చి ఇసుమంత తెలియరు. ఎవరికి వారు తమ స్త్రీలు తమ వద్దనే యుండిరని తలచిరి. శ్రీ రాధా మాధవ పరమోత్తమ శృంగార చరిత్రను చదివినా, వినినా, అక్షయధామమయిన గోలోకమును ప్రాప్తించెదరు.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి "రాసక్రీడా - సంపూర్ణము" అను నలుబది ఆరవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఏడవ అధ్యాయము

(శ్రీకృష్ణ సహితులై యాదవులు వ్రజవాసులను ఆశ్వాసించి అక్కడ నుండి బయలు దేరుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! నేను నుడివిన శ్రీకృష్ణ చరిత్ర శాస్త్రముల యందు బహు గుప్తముగ వర్ణింపబడినది. ఇపుడు మిగిలిన చరిత్రను విస్తారముగ వివరించెదను. ఈ విధముగ శ్రీకృష్ణ భగవానుడు నంద భవనము నందు ఎనిమిది దినములు యుండి, అందరికీ ఆనందమును పంచి తిరిగి బయలుదేరుటకు సిద్ధమయ్యెను. యశోదామాత తన ప్రియపుత్రుడు బయలుదేరుచున్నాడని గ్రహించి పెద్దపెట్టున రోదించుట మొదలిడెను. గోపికల కన్నులు సహితము అశ్రుమయములయినవి. ప్రతి ఇంటా పూర్వము వలెనే కరుణా పూరితులై సర్వులు రోదించిరి. స్వాంతన పరచుట యందు సిద్ధహస్తుడయిన శ్రీహరి ఎంత మంది వ్రజాంగనలు కలరో అన్ని రూపములు ధరించి వారందరినీ వేరు వేరుగా ఆశ్వాశించెను.

శ్రీ రాధా దేవిని సహితము బుజ్జగించెను. పిదప తల్లితో "అమ్మా! నేను ఈ ఉత్తమ అశ్వమేధ యజ్ఞము పూర్ణము కావింప జేసి వెంఠనే తిరిగి వచ్చెదను. లేదేని నువ్వు నేటి నుండి పుత్ర రూపమున ప్రతి దినము నీ వద్దనే చూచెదవు. ఎవరు నన్ను భక్తితో పూజించెదరో వారికి నేను కాలము వలన భయమును కూడా నాశనము చేసెదను."

ఈ విధముగ తల్లికి ఆశ్వాసన నిచ్చి, నేత్రముల నుండి అశ్రుధారలు కారుచుండగా నంద భవనము వెలుపలికి వచ్చి, గోపకుల సహితుడై తిరిగి అనిరుద్ధుని శిబిరమున కేతెంచెను. శ్రీకృష్ణుని ఆజ్ఞను బడసి అనిరుద్ధుడు తిరిగి యాగాశ్వమును పూజించి దిగ్విజయ యాత్రకై వదలెను. అనిరుద్ధాది యాదవులు అశ్రువులు నిండిన నందాది గోపకులకు అతి కష్టముతో వీడ్కోలు పలికి తమ తమ రథములు అధిరోహించిరి. శ్రీకృష్ణ పుత్ర పౌత్రులందరూ ఆయన వలెనే బహు సుందరాకారులు. గోవిందుని సహితముగ ఆ యాదవులందరూ బయలు దేరుటకు ఉద్యక్తులగుచుండగా గోపకులందరూ భోరుభోరున రోదింప మొదలిడిరి. పూర్వము జరిగిన విరహము గుర్తుకు తెచ్చుకొని, వారందరూ గద్గద కంఠులై, కపోలములన్నియు అశ్రు భరితములయినవి. నందుని నేత్రములు వర్షాకాల మేఘములను పోలెను. ఆయనకు నోటమాట రాక మౌనముగ రోదింప సాగెను. శ్రీకృష్ణుడు సహితము అశ్రువులు కార్చుచూ "తిరిగి వచ్చెదను" అని నిశ్చయముగ పలికి వేరువేరుగ వారందరినీ ఆశ్వాశించి ఇట్లనియె "గోపాల గణములారా! చైత్ర మాసమందు ద్వారకా పురి యందు యజ్ఞారంభ వేళ నేను మిమ్ముల నందరినీ ఆహ్వానించెదను. ఇందు సందేహము లేదు. మిత్రులారా! మీరందరూ ప్రతి దినము గోకులము నందు నన్ను కాంచెదరు." ఈ విధముగ ఆశ్వాశించి వారిచ్చిన ఫలహారములను తీసికొని నందునికి ప్రణామములు కావించి వృష్ణి వంశీయులందరితో శ్రీహరి అచట నుండి అదరముపై బయలుదేరెను.

నందాది దు:ఖితులైన గోపకులు శ్రీకృష్ణ చరణారవింద సంలగ్నమనస్సులను వెనుకకు త్రిప్పుటకు విఫలులై కేవలము శుష్క శరీరము తో గోకులమునకు చనిరి. ఆ దినము నుండి ప్రేమ మగ్నమయిన గోప గోపీగణము యోగులకు సహితము దుర్లభమయిన శ్రీకృష్ణుని తమకు సమీపమున తమతో కలసి చూచిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి యాదవులు వ్రజభూమిని వీడుట అను నలుబది ఏడవ అధ్యాయము సమాప్తము)

నలుబది ఎనిమిదవ అధ్యాయము

(అశ్వము హస్తినా పురమునకేగుట; అద్దాని ఫాల పత్రమును చదివి దుర్యోధనాదులు రోష పూర్వకముగ అశ్వమును బంధించుట; యాదవ సైనికులు కౌరవ సేనను గాయపరచుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదనంతరము ఆ యాగాశ్వము యమునా నదిని దాటి, అన్య రాజ్యమును వీక్షించుచూ చివరకు కురు దేశమును చేరెను. దానిని బలవంతుడయిన విచిత్ర వీర్య తనయుడు ధృతరాష్ట్రుడు పాలించు చుండెను. ఆ అశ్వము అనేకానేక ఉపవనములు, సరోవరముల తో నిండిన కౌరవ పురమును గాంచెను. ఆ నగరము దర్గముల తో నిండి గంగానది కందకము వలె చుట్టూ ప్రవహించుచుండగా, దుర్గమముగ యున్నది. ఆ నగరమంతయు స్వర్ణ రజిత భవన మండితమై యుండి, అనేక శూర వీరులకు ఆలవాలమై యుండెను. ఆ కౌరవ పురము నుండి వన్య మృగములను వేటాడుట కై సుయోధనుడు బయటకు వచ్చెను. ఆతడు వీరజన పరివేష్ఠితుడై, రధారూఢుడై యుండెను. దుర్యోధనుడు మానధనుడు. ఆతడు ఫాలపత్ర సహిత అశ్వమును కాంచెను. అంత కౌరవరాజు దుర్యోధనుడు అనాయాసముగ రథము దిగి, సునాయాసముగ హయమును బంధించి, అద్దాని ఫాలమునున్న పత్రమును పఠించెను. ఆ కౌరవ వీరులందరూ క్షణకాలము మౌనము వహించి, పిదప క్రోదోద్రిక్తులై, రోష తామ్రాక్షులై పరస్పరము ఇట్లనుకొనిరి "ఏమి ఇది? యాదవుల మందు నిలువగల క్షత్రియులు లేరా? పూర్వ కాలమున రాజసూయ యజ్ఞమందు వీరిని పరాజితులను కావించితిమి కదా! ఈ మూర్ఖులు మరల అశ్వ మేధమును చేపట్టిరా? అందువలన మనము వీరిని గెలువవలెను. అశ్వమును తిరిగి ఇవ్వవలదు. యాదవులను జయించిన పిదప మనమే అశ్వమేధము కావించెదము.

"ఈ ఉగ్రసేను డెవరు? ఈ కృష్ణుడెంత? ఈ అశ్వమును రక్షించునదెవ్వరు? ఈ యాదవులు మనముందు ఏ మాత్రము పౌరుషము చూపగలరు? కృష్ణాది సమస్త యాదవులు జరాసంధుని భయమున సముద్రమును శరణునొందిరి. వారు మన భయము వలన యుద్ధము విడచి పరుగులిడిరి. ఇంతకు ముందు మనము దయ దలిచి ఈ యాదవులకు రాజ్యమునిచ్చితిమి. ఇపుడు వీరు తమకు తామే చక్రవర్తులమని అనుకొను చున్నారా? పాండవుల మాన రక్షణకై తొలుత మనము యాదవులను సంహరింప లేదు. ఇపుడు పాండవులు సహితము మనకు శత్రువులయిరి. అందువలన మనము వారిని దేశ బహిష్కృతులను కావించితిమి. ఇపుడు ఈ యాదవులను జయించి ఉగ్రసేనుని చక్రవర్తిత్వమును పరీక్షించెదము."వారందరూ శ్రీకృష్ణ విముఖత, మరియు కౌరవ రాజ్య ధనమదము తో అట్లు పలికిరి. అశ్వమును నగరములో బంధించి, సమస్త అస్త్ర శస్త్రములు కూడగట్టుకొని నగరములో వేచి యుండిరి.

అశ్వము దూరముగ పోవుట చే సాంబుడు పది అక్షౌహిణీ సేనా సహితుడై, శ్రీకృష్ణ ప్రేరితుడై, అక్రూర, సాత్యకి సహితుడై హస్తిన వైపు వెళ్ళెను. వారికి ఎదురుగ కౌరవ సేన కానబడెను. శ్రీకృష్ణ భక్తులు, మరియు ఇహ, పరలోక విజయేచ్ఛ గల యాదవులు కౌరవ సేనను తృణ ప్రాయముగ తలచి ఇట్లనిరి "మా అశ్వమును బంధించిన వారెవరు? ఎవరి యందు మయుడు ప్రసన్నుడయ్యెను? యుద్ధ స్థలి యందు ఎవరికి తీవ్ర నారాచముల ద్వారా బాధ నొందవలెనని ఉత్సుకత యున్నది? ఎవరు ఉగ్రసేన మహారాజును చక్రవర్తిగా తెలియరో, (ఒప్పుకొనరో), వారు తమ వినాశనమునకు ఈ అశ్వమును బంధించెదరు. హేమాంగద, ఇంద్రనీల, బక, భీషణ, పల్వలులను మేము పరాజితులను గావించితిమి." ఈ పలుకులు విని కౌరవ సైనికులు క్రోధోద్రిక్తులై ఇట్లనిరి. "మేము అశ్వమును బంధించితిమి. మీరు మమ్ము ఏమి చేయగలరు? మేము మా సాయకములు ద్వారా మీ యాదవులందరినీ యమలోకమునకు పలాయనము కావించెదము. ఉగ్రసేనుడు ఎన్ని దినముల నుండి రాజ్యము చేయుచుండెను? మేము అతనిని బంధించి, ఆతని రాజ్యము సహితము ఆక్రమించెదము. అనిరుద్ధుడేడి? మా భయమున ఆతడెక్కడున్ననూ, ఆతనిని సాయకములతో పూజించెదము. ఇందు సందేహము లేదు."

కౌవరసేనల మాట వినిన యాదవులు క్రోధోద్రిక్తులై బాణ పరంపర ప్రయోగించిరి. ఆ బాణములచే కౌరవుల నాలుకలు కత్తిరింపబడి, దంతములు రాలి, ముఖములు ఛిన్నాభిన్నమై రక్తము వమనము చేయుచూ, క్షత గాత్రులై దుర్యోధనుని కడకేగి ఈ వృత్తాంతమంతయు వివరించిరి.

(శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి కౌరవుల ద్వారా శ్యామకర్ణాపహరణ అను నలుబది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

నలుబది తొమ్మిదవ అధ్యాయము

(యాదవ కౌరవుల ఘోర యుద్ధము)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! కౌరవ సేనల భగ్నముఖములు అవలోకించి దుర్యోధనుడు రౌద్రుడై భీష్మ, ద్రోణ, కర్ణాది వీరులను చూచి ఇట్లనియె "ఎంత ఆశ్చర్యము? నీచ యాదవులు స్వయముగ వారి మృత్యు ముఖమున కేతించిరి. ఈ మూర్ఖులు ధృతరాష్ట్ర మహారాజు యొక్క మహాబలము నెరుగరా?" ఈ విధముగ పలికి తన రథ, గజ, తురంగ, పదాతి సమేత చతురంగ బలములను యాదవులపై సమరమునకు పంపెను. పది అక్షౌహిణీ సేనా వాహిని భూమిని కంపింప జేయుచూ, శత్రువులకు భయము గొలుపుచూ ముందునకేగెను. ఆ సేనా వాహినిని కాంచిన జాంబవతీ నందనుడు సాంబుడు అత్యంత ఉత్సాహముతో తన సేనను యుద్ధ ప్రేరితుల గావించెను. సమస్త కౌరవ సైన్యము క్రౌంచ వ్యూహము పన్నిరి. అందు ముఖభాగమందు భీష్ముడు, గ్రీవము నందు ద్రోణుడు, రెండు రెక్కల యందు కర్ణ శకునిలు, వెనుక వైపున దుర్యోధనుడు నిలిచి యుండిరి. ఈ క్రౌంచ వ్యూహ మధ్య భాగమున సమస్త కౌరవ సేనా వాహినీ యుద్ధ సన్నద్ధమై నిలిచి యుండెను. శత్రు దుర్భేధ్యమయిన క్రౌంచ వ్యూహమును గాంచి శంకితులై యాదవులు సాంబుని చూచి "నీవునూ అద్దానికి ధీటైన వ్యూహ రచన యత్న పూర్వకముగ కావింపుము" అనిరి. సాంబుడు వ్యూహ రచనా నిపుణుడు. అయినప్పటికీ కౌరవ సేనను తృణ ప్రాయముగ తలచి వ్యూహ రచన గావింపక అట్లే యుద్ధమునకు ఆనతిచ్చెను.

రెండు ఘడియల వరకూ రెండు పక్షముల మధ్య ఘోర యుద్ధము జరిగి ధరిత్రి కంపిప దొడంగెను. ఉభయ సేనల యందు రణభేరిలు, శంఖములు, మ్రోగు చుండెను. ధనుష్ఠంకార ధ్వని నిరంతరముగ వినబడు చుండెను. గజములు ఘీంకరించుచు, హయములు సకిలించుచుండెను. శూరులు సింహనాదములు కావించు చుండిరి. రథముల నేమిలు గణగణమని మ్రోగుచుండెను. ఇరుప్రక్కల సైనికుల పగఘట్టన చే ధూళి రేగి, ఆకాశమంత ఎత్తు ఎగిరి రణభూమి నంతటినీ అంధకార బంధురము కావించెను. ఆకాశము మలినమయినది. ఇరు పక్షముల యందు ఘోర యుద్ధము మొదలై ఒకరినొకరు బాణ, గద, పరిఘ, శతఘ్ని, శక్తి, తోమరములు ప్రహరించు కొనుచూ గజారోహులు గజారోహులతో ఇట్లు ఎవరికి సరిపడు వారు వారితో సమర మొనరించుచుండిరి. బాణవర్షము కురిపించుచూ సాంబుడు భీష్మునితోనూ, అక్రూరుడు కర్ణుని తోనూ, యుయుధానుడు శకుని తోనూ, సారణుడు ద్రోణాచార్యుని తోనూ, సాత్యకి దుర్యోధనుని తోనూ, బలి దుశ్శాసనుని తోనూ, కృత వర్మ, భూరి శ్రవసుని తోనూ సమర మాచరించుచుండిరి.

ఈ విధముగ ఘోర ద్వంద్వ యుద్ధము కొనసాగుచుండగా, సాంబుడు కుపితుడై ఒక సుదృఢమయిన ధనవు చేపట్టి, దానికి నారి బిగించి, భయంకర టంకారము కావించి, ప్రత్యర్ధి శూరుల హృదయ కంపనము కావించెను. తనపై పడుచున్న సాయకములను భీష్ముడు మధ్యలో ఖండించెను. అంత సాంబుడు సింహనాదము కావించి పది సువర్ణయుక్త సాయకములను భీష్ముని కవచము పైననూ, నాలుగు బాణములు రథాశ్వముల పైననూ, మరియొక పది బాణములతో ఆయన నారి సహితముగ ధనువును ఖండించెను. కవచము భేదింపబడి, రథాశ్వములు సారధి మరణించి,

చేత ధనువు తెగి పడుట చే రోషమగ్నుడై భీష్ముడు గదాయుధమును చేతిలోనికి తీసికొనెను. అంత సాంబుడు ఆయనను చూచి "మహాత్మా! మీరు నేలపై యున్నారు. నేను మీతో యుద్ధము ఎట్లు చేయగలను? నేను మరియొక రథమును ఇచ్చెదను. కురుశ్రేష్ఠా! నా నుండి ఒక వేయి రథములు తీసికొని నా వంటి మూఢుడు, మరియు లజ్జావిహీనునిపై విజయము నొంద వలసినది." అది వినిన అదర విహీనుడయిన భీష్ముని అధరములు కోపముతో అదిరినవి. అంత ఆయన పళ్ళు పటపట కొరుకుచూ ఎర్రనయిన నేత్రములతో ఇట్లనియె "నీవిచ్చిన రథముపై నేను కూర్చొని సంగ్రామము కావించినచో నాకు అపకీర్తి కలుగును, మరియు పాపము, నరక వాసము సంక్రమించును. ప్రతి గ్రహణము కేవలము బ్రాహ్మణులు మాత్రమే కావింతురు. మేము దాతలము మాత్రమే! మేమే దయగలిగి యాదవులకు రాజ్యమిచ్చితిమి." అంత సాంబుడు "ఈ భూమండలమందు చక్రవర్తులకు భయపడి రాజులు తమ రాజ్యముల నిచ్చెదరు. కానీ అది దానమనబడదు" అని ప్రత్యుత్తరమిచ్చెను.

అంత భీష్ముడు క్రుద్ధుడై తన గదతో సాంబుని ప్రహరించెను. ఆ ఘాతమునకు వ్యథితుడై, వ్యాకులుడై సాంబుడు మూర్ఛనొందెను. అంత ఆతని సారధి ఆతనిని సంభాళించి, అతనిని జీవింప చేయుటకై అక్కడ నుండి వేగముగ రణ భూమినుండి బయటకు తీసికుని వెడలెను. ఆ సమయమున యాదవ సేన యందు గొప్ప కోలాహలము చెలరేగెను. ఇంతలో భీష్ముడు వేరొక రథమారోహించి, కవచము బిగించి, శరాసనమును సరి చేసికొని మార్గ మధ్యమున అడ్డు వచ్చిన యాదవ సేనను హతమార్చుచూ దుర్యోధనుని కడకేగెను. ఆ సమయమున సాత్యకి గ్రద్ద రెక్కలు కట్టిన బాణములతో దుర్యోధనుని రథహీనుని గావించెను. అయిననూ సుయోధనుడు వేరొక రథమధిరోహించి, విష సర్పముల వంటి బాణములు ప్రయోగించి ప్రత్యర్థిని సహితము రథహీనుని గావించెను. అంత అమిత పరాక్రముడయిన సాత్యకి వేరొక రథమారోహించి, ఒకే ఒక్క బాణమును ధనుసుకు సంధించి, విడచి దుర్యోధనుని రథ సహితముగ నాలుగు క్రోసుల దూరమున పడగొట్టెను. ఆకాశము నుండి ఆ రథము క్రిందపడి సారధి, హయముల సహితముగ భస్మీపటలమయినది. దుర్యోధనుడు మూర్ఛితుడయ్యెను. అంత ద్రోణాచార్యుడు క్రోధోద్రిక్తుడై, సారణుని తో సమరము మాని సాత్యకి వైపు ఏతించి అగ్నిమయ సాయకమును విడచెను. అది అత్యంత వేగముగ వచ్చి సాత్యకి రథ, సారధి హయముల సహితముగ భస్మీపటలము గావించెను.

ఆ సాయకపు తీవ్రతకు సాత్యకి సహితము సొమ్మసిల్లెను. అంత సమరాంగణమున కృతవర్మ భూరిశ్రవసుని పరాజితుని గావించి, సింహనాదము చేయుచూ ద్రోణుని పై ఆక్రమించి, ఆయనను రథహీనుని గావించి, కవచమును సహితము ఛేదించెను. అంత కర్ణుడు కుపితుడై అక్రూరుని విడచి కృతవర్మ వద్దకు వచ్చి ఒక శక్త్యాయుధమును ప్రయోగించెను. అయ్యది శరీరమును ఛేదించి, బయటకు వచ్చి భూమిలోనికి దిగబడెను. అంత కృతవర్మ హృదయము విదీర్ణమగుట చే మూర్ఛ నొందెను. అంత యుయుధానుడు క్రోధ పూర్వకముగ శకునిని పరాజితుని కావించి, రథమును కర్ణునిపై నడిపించి పది బాణములు కర్ణునిపై ప్రయోగించెను. వారిరువురి బాణములు ఒకదానితో మరొకటి ఢీ కొనుచూ ఆకాశము నందు అలాత చక్రముల వలె భ్రమింప నారంభించెను. అంతయుయుధానుడు కాకి రెక్కలుగల తీక్షణ సాయకములను కర్ణుని కవచముపై ప్రయోగించెను. అవి పాపులు స్వర్గము చేరక నరకము నందు పడునట్లు ఆ కవచమును తాకి, తాకనట్లు క్రిందపడెను. యుయుధానుడు విస్మితుడయ్యెను. అంత కర్ణుడు అట్టహాసము గావించి నానా శస్త్రాస్త్రములు ప్రయోగించి యుయుధానుని రథహీనుని గావించెను. అది చూచి బలి దుశ్శసనుని పరాజితుని గావించి అగ్నితుల్య రథమారోహించి కర్ణు నెదుర్కొనెను. బలి తన వద్దకు వచ్చుట కాంచిన సూర్య పుత్రుడు కర్ణుడు వాయువ్యాస్త్రమును సంధించి ఆతనిని రథ సహితముగ దూరముగ విసరివైచెను. బలి ఒక యోజనము దూరమున పడెను. ఇంతలో సాంబుడు మూర్ఛ నుండి తేరుకొని బాణ వర్షము చే అంధకారము కలిగించి యుద్ధ స్థలికేతించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి యాదవ కౌరవుల సంగ్రామ వర్ణనమను నలుబది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

ఏబదియవ అధ్యాయము

(కౌరవుల పరాజయము, మరియు వారు శ్రీకృష్ణ భగవానుని కలసి బహుతముల సహితముగ అశ్వమును తిరిగి ఇచ్చుట)

శ్రీ గర్గాచార్యులు "నృపేశ్వరా! ఆ సమయమున భోజ, వృష్ణి, అంధక, యోధులు మరియు మధురా, శూరసేన ప్రదేశముల నుండి మహాసంగ్రామ కర్కశులయిన యాదవ యోధులు యమునను దాటి, తమ పద ఘట్టనల ధూళి చే ఆకాశమును కప్పుచూ, భూమిని కంపింప జేయుచూ, అచటికేతించెను. అశ్వమును వెదకుచూ శ్రీకృష్ణ, అనిరుద్ధాది మహావీరులు సహితము అచట కేతించిరి. వృష్ణి వంశీయులు దూరము నుండే భయంకర యుద్ధ ఘోష, కోదండముల టంకారములు, శతఘ్నుల ప్రకంపనలు, శూరుల సింహనాదములు, శస్త్రముల పరస్పర ఆస్ఫోటనారవములు, కోలాహలము, హాహాకారములు వినిరి. అది విని వారు యాదవ కౌరవుల నడుమ యుద్ధము జరుగుచున్నదని తెలిసి, మనసు నందు అయిష్టత పొడసూప శ్రీకృష్ణ, అనిరుద్ధులు అచటికి ఏతించిరి. శ్రీకృష్ణాదులు మహాసైన్యముతో మన సహాయతకు వచ్చిరని తెలిసిన సాంబాదులు ఆయనకు ప్రణామము లాచరించిరి. శ్రీకృష్ణాగమనము అయిన పిదప యాదవులు రణభేరులు మ్రోగించుచూ శంఖ, గోముఖాది శబ్దములు కావించిరి. ఆకాశము నందు స్థితగతులై దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. భూతల మందు యాదవులు జయజయ ధ్వానములు కావించిరి.

"సమరాంగణము నందు వంద అక్షౌహిణీ సేనా వాహిని తీసికుని మహాబలుడయిన అనిరుద్ధుడు వచ్చెను." అన్న వార్త వినిన కురుయోధులు భయకంపితులయిరి. ప్రళయకాల సముద్రము వలె ఘోషించుచున్న యాదవ సేనను చూచి వైశ్యులు పరుగులిడిరి. గృహములందు తాళములు పెట్టబడినవి. బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, సూద్ర, స్త్రీ సముదాయములు గృహముల నుండి బయటకు వచ్చి దుర్యోధనుని నిందించుచూ రోదింపసాగిరి. తదనంతరము నిద్ర నుండి లేచినట్లు దుర్యోధనుడు మూర్ఛ నుండి బయటకు వచ్చి, యాదవ సేనను పరికించి, భయకంపితుడై కాలినడకన తన నగరము లోనికి పారిపోయెను. తదుపరి కర్ణ, భీష్మ, కృప, ద్రోణ, దుర్యోధనాదులు సభా భవనమునకేగి ధృతరాష్ట్రునికి నమస్కరించి ఈ విషయమంతయు నివేదించిరి.

తమ పరాజయము, యాదవుల విజయము, శ్రీకృష్ణుని శుభాగమనమును గూర్చి వినిన ధృతరాష్ట్రుడు విదురుని ఇట్లు ప్రశ్నించెను. "మహావీరా! వంద అక్షౌహిణిల సేనా వాహినితో క్రోధోద్రిక్తుడై వాసుదేవుడిచ్చుటకు వచ్చెనని వింటిమికదా! మన తక్షణ కర్తవ్యమేమి?" ధృతరాష్ట్ర మహారాజు ప్రశ్న విని విదురుడు నవ్వి ఇట్లనియె.

"మహారాజా! ఇది వరలో బలరాముడొక్కడే వచ్చి తన హలముతో హస్తినాపురమును నేలమట్టము చేసి గంగలో కలుపుటకు ప్రయత్నించెను. ఇపుడు దేవకీ హృదయకమలము నుండి ఆవిర్భవించిన ఆతని సోదరుడు అరుదెంచెను. శ్రీకృష్ణుడు సాక్షాత్ శ్రీహరియే! మహారాజా! వీరు సమరము నందు కంసుడు, శకుని మొదలగు మహా దైత్యులను సంహరించిరి. అనేకానేక రాజులను, దేవతలను సహితము పరాజితుల గావించిరి. అందువల్ల మహారాజా! ఇది యుద్ధమునకు సమయము కానేకాదు. మీరు యాదవుల శ్యామకర్ణమును తిరిగి ఇచ్చివేయ వలసినది. దీని వలన కౌరవ యాదవ వినాశకరమయిన యుద్ధము జరుగదు." తన సోదరుడయిన విదురుని సద్భాషణమును వినిన ధ్రుతరాష్ట్ర మహారాజు కౌరవ వీరులతో కాలాను చితముగ ఇట్లనియె "మీరందరూ శ్రీకృష్ణుని వద్దకేగి అశ్వమును తిరిగి ఈయ వలసినది. దేవాధిదేవుడయిన శ్రీహరిని ఎదిరించుట మీకు కానిపని. శ్రీహరి యాదవుల సహాయార్థమై ఇచటికి ఏతించెను. అందువల్ల మీరందరూ ఆయనను ప్రసన్నుని కావింప వలసినది. కౌరవేంద్రుని ఆదేశమును విని కౌరవులు భయభీతులైరి. అంతవారు గంధాక్షతలు, అశ్వ సహితముగ దివ్య వస్త్ర, రత్న భూషణములు తీసికొని శ్రీకృష్ణ బలరాముల దివ్యనామ కీర్తనము కావించుచూ కాలినడకన శ్రీకృష్ణ సందర్శనమునకు ఏగిరి.

కౌరవాగమనము కాంచిన యాదవులు నానా విధములయిన శస్త్రాస్త్రములు చేత బట్టుకొని క్రోధముతో యుద్ధోన్ముఖులయిరి. అంత కౌరవులు సమస్తము తాము సమరమునకు పరాన్ముఖులమని, కేవలము శ్రీకృష్ణ భగవానుని దర్శనార్థమై ఏతించితిమని తెలిపిరి. ఈ విషయమును వినిన యాదవులు విస్మితులయి, ఆ వృత్తాంతమంతయు శ్రీకృష్ణ భగవానునికి నివేదించిరి. అంత శ్రీకృష్ణా దేశానుసారము శస్త్ర రహితులై ఏతించిన కౌరవ ప్రముఖులను యాదవ వీరులు ప్రేమగా ఆహ్వానించిరి. వారందరూ శ్రీకృష్ణుని వద్దకేగి, తమ తప్పిదమునకు లజ్జాపూర్ణులై, అవనిత ముఖులై నిలుచుని వారందరూ వేరువేరుగా ప్రణామము లాచరించి ఇట్లనియె. అందరికంటె ముందు ఆచార్యుడు ద్రోణుడు "కృష్ణా! జగదీశ్వరా! భద్రా! నన్ను రక్షించండి. మీ మాయ చే మోహితులయిన ఈ కౌరవులను కూడా రక్షింపవలసినది."

కృపుడు "మధుసూదనా! కైటభ నాశనా! లోకనాథా! మీరు నన్ను మీ భృత్యుల, భృత్యుల, భృత్యుల సేవకునిగ పరిగణించినచో, అది నా జన్మ సాఫల్యమును సిద్ధింపజేయును." కర్ణుడు "మాధవా! నా ధనము మీ భక్తుల కుపయోగ పడుగాక! నా ప్రాణములు స్వామి కార్యమునందు నిమగ్నమగు గాక! అంతమున మీరు నా ప్రాప్యవస్తువుగా మిగిలెదరు గాక! భూరిశ్రవశుడు "వరదా! నాథా! మేము మీ నుండి ఇతరులెవరూ ఈయలేని వస్తువును అర్థించు చున్నాము. మీరు నా యందు సుముఖమయిన దృష్టిని ప్రసరించెదరు గాక! దేవా! మేము వివశులమై అంజలి ఘటించి మీ ముందు నిలుచుంటిమి. జన్మాంతరమున కూడా నేను మీ మందు ఈ విధముగనే అంజలి ఘటింతును గాక!"

దుర్యోధనుడు "నేను ధర్మము నెరుగుదును. కానీ అందు నా మనసు సంతసింపదు (ధర్మము రుచింపదు); నేను పాపమును కూడా ఎరుగుదును. కానీ దాని నుండి వెను దిరుగుటకు మనస్కరించదు. ఏ దేవత నా హృదయము నందుండి ఈ కర్మము ను ఆచరింప చేయుచున్నదో, నేను ఆ కర్మము నే ఆచరించుచున్నాను. మధుసూదనా! యంత్రము యొక్క గుణ దోషముల వలన ప్రభావితులవక నన్ను క్షమించ వలసినది. నేను యంత్రమును. మీరు యంత్ర సంచాలకులు. (గుణ దోషములకు బాధ్యుడు యంత్ర సంచాలకుడు మాత్రమే! యంత్రము కాదుగదా!) అందువలన నాకు దోషమును ఆపాదించవలదు." భీష్ముడు "యోగీంద్రా! గోపికలు ఎవరిని రాగాంధులై చుంబించిరో, యోగి, భోగులు సహితము ఎవరిని నిరంతరము తమ మనసు నందు సేవించెదరో, అట్టి మీ చరణ కమలములకు నేను ఎల్లప్పుడూ అంజలి ఘటింతును గాక!" విదురుడు "దేవా! బ్రహ్మ నిష్ఠాగరిష్ఠులు తాము కావించిన శుభాశుభ కర్మములందు అహంకార, మమకార భావములను యుంచుకొనరు. బ్రహ్మము ఎవరు అన్న ప్రశ్న ఉదయించినపుడు సమాధానము కేవలము అయ్యది దేవ దానవ మనుష్యులకు అగమ్యమని మాత్రమే తెలియును. వేదములు సహితము ఆ బ్రహ్మమును "అది కాదు" "ఇది కాదు" అని మాత్రమే వర్ణించును. కానీ దానికి కూడా అవగతము కాదు. కానీ ప్రభో! ఆ పరబ్రహ్మము మీరే!!!"

తనను శరణు జొచ్చిన కౌరవ ప్రముఖులను చూచి ప్రసన్నుడై శ్రీకృష్ణ భగవానుడు మేఘ గంభీరవాణితో ఇట్లనియె "ఆర్యులారా! నా మాట వినవలసినది. నేను నారద మహర్షి చే ప్రేరితుడనై ఈ యుద్ధము ఆపుటకు మాత్రమే ఇచట కేతించితిని. నా పుత్రుడు నిరంకుశుడై నా ఆజ్ఞ పాలింపనోపుట లేదు. ఈతడు మహనీయుల పట్ల అపరాధములు కావించుచున్నాడు. మాతో కలియుటకు వచ్చిన మీరు ధన్యులు, మహనీయులు. నా పుత్రుడు కావించిన దోషమును దయచేసి మన్నింప వలసినది. ఉగ్రసేనుని హయమును దయచేసి తిరిగి ఇచ్చి, దానిని రక్షించుటకు మీరు కూడా రావలసినది. యారద కౌరవులు మిత్రులు. ముందు నుండి మన మధ్యనున్న ప్రేమ సంబంధ బాంధవ్యములను దృష్టియందుంచుకొని మనము పరస్పరము కలహింపరాదు." శ్రీకృష్ణుని ఈ తీయని పలుకులు విని కౌరవులు ప్రసన్నులై ఆశ్వముతో పాటు బహూమూల్య బహుమతులర్పించి, మనసున ఖేదమొంది, తమ నగరములకు తిరిగి వెళ్ళిరి. కానీ భీష్మాచార్యుడు అశ్వరక్షణకై యాదవ సేనతో వెళ్ళుటకు నిశ్చయించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండాంర్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి హస్తినాపుర విజయమను ఏబదియవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఒకటవ అధ్యాయము

(యాదవుల ద్వైత వనమందు యుధిష్ఠిర మహారాజును కలసి, తిరిగి అశ్వము వెనుక అనేక దేశములు చూచుచూ కుంతల పుర ప్రవేశము కావించుట)

శ్రీ గర్గాచార్యులు "నృపేశ్వరా! తదుపరి శ్రీకృష్ణ భగవానుడు యాదవులను సమీక్షించి, అందరినీ కలసి, పిదప రథారూఢుడై కుశస్థలీ పురమునకు అరిగెను. అటు పిమ్మట అనిరుద్ధుడు తిరిగి యాగాశ్వమునకు పూజనమొనర్చి దానిని బంధ విముక్తను గావించి విడచెను. విడిచిన పిదప అశ్వము తీవ్రగతిని ప్రయాణించి ముందుకు సాగెను. దాని వెనుక యాదవ వీరులు శీఘ్రగతిని ప్రయాణించిరి. దుర్యోధనుని పరాజయ వార్తను వినిన మహీపతులు, అశ్వము తన రాజ్యమందున్ననూ శ్రీకృష్ణ భయమున అద్దానిని ముట్టుకొనుటకు కూడా సాహసింపలేదు. తదనంతరము అశ్వము అటునిటు తిరుగుచూ ద్వైత వనము ప్రవేశించెను. అందు ధర్మనిష్ఠుడు, మహానుభావుడయిన ధర్మరాజు యుధిష్ఠిరుడు తన సోదర పత్నీ సహితుడై వనవాసమాచరించు చుండెను. ఆ ద్వైత వనమందు భీమసేనుడు గజ సమూహములతో బాలకుడు ఆట బొమ్మలతో క్రీడించునట్లు ఆడుచుండెను.

అతడు ఆక్కడకేతించిన అశ్వమును కాంచెను. ఆ వనము విశాలమయినది. అయ్యది మర్రి, రావి, మారేడు, ఖర్జూరము, తిలక, సాల, పలాశ, మామిడి, మొదలగు వృక్షములతో నిండియుండెను. ఆ దుర్జర నిర్జన వనము హరిణములు, అడవి పందులు, వ్యాఘ్రములు, ఎలుగుబంట్లు, సర్పములకు ఆలవాలము. నిరంతరము కీచురాళ్ళు రొదజేయుచుండును. గ్రద్దలు, కాకులు నివాసముండును. సగము శరీరము గాలిలోలేచి పడగ విప్పు సర్పములు అగణితముగ యున్నవి. నక్కలు, వానరములు, అడవి దున్నలు, నల్లని ఆవులు ఆ వనమునకు శోభనిచ్చుచున్నవి. అంతే కాక గజ, గవయ, చిరుత పులులు, భల్లూకములు, అడవి మనుషులు మొదలగు జంతువులు నివసించుచుండుటచే అది మహా భయంకరముగ కూడయున్నది. ఇటువంటి వనమునందు గుర్రము ప్రవేశించుట చే దానిని అవిక్రమ పరాక్రమవంతుడగు భీమసేనుడు సునాయాసముగ పట్టుకొని తన ఆశ్రమము వద్దకు తీసికొని వచ్చెను. ఆ సమయమున మిక్కిలి కష్టముల కోర్చి, అశ్వమును శోధించి అనిరుద్ధాదులు అచటికి చేరిరి. అశ్వము బంధింపపడుట కాంచి వారు తమలో తాము ఇట్లనుకొనిరి. ఈ అశ్వమును పట్టుకొనిన వనచరుడు భీమసేనుని వలె గోచరించుచున్నాడు. పెద్ద పెద్ద చేతులు, అత్యంత పరిపుష్ఠ శరీరము, ఎరుపెక్కిన కళ్ళు, మహా గౌర వర్ణము, ఇవన్నియు ఆయన వలెనే యున్నవి. ఆయన కష్టములు సహింప సమర్ధుడు. ఈయన అంగములన్నియు ధూళిలిప్తములై, గదాయుధుడై యున్నాడు." ఇట్లు పరస్పరము చర్చించి ఇట్లనిరి.

"సోదరా! నీవెవరవు? రాజాధిరాజు యొక్క అశ్వమును గ్రహించి ఎక్కడకు వెళ్ళదలచు కుంటివి? ఈ హయమును వీడుము. లేనిచో బాణ ప్రహారము చే నిన్ను శిక్షించెదము." ఆ మాట విని భీమసేనుడు దట్టమయిన అడవిలో ఆ హయమును కట్టివైచి, పది వేల బారువుల బరువుగల తన గదను ధరించి వారి ఎదుటకు వచ్చెను. మహా పరాక్రమ వంతుడయిన భీమసేనుడు తన గదతో వారందరినీ ప్రహరింప ప్రారంభించెను. భీముని గదా ఘాతములు తినిన యదవసైనికులు అక్కడికక్కడే మూర్ఛనొందిరి. ఆ వనచరుని పరాక్రమమునకు క్రుద్ధుడై అనిరుద్ధుడు ఆయనపైకి ఒక వెయ్యి గజ సైన్యమున పంపెను. ముందర ఆ గజములు భీముని తమ తొండములతో, దంతములతో నొక్కినవి. అంత భీముడు వానిని త్రోసి వెంటనే నిలబడెను. ఆయన అధరములు కోపముతో అదురుచుండెను. అంత ఆయన తన వజ్ర సదృశమయిన గదతో వాటిని ప్రహరింప నారంభించెను. కొన్నింటిని ఎత్తి ఆకాశమున విసరెను. కొన్నింటిని భూమిపై విసరెను. కొన్నింటిని పాదములతో త్రొక్కెను. అంత గజములన్నియు పారిపోవమొదలిడినవి. అంత అత్యంత కుపితుడయిన గదుడు అచటకు ఏతించి ఆయన భీముని పోల్చుకొనెను. కానీ మనసున శంక యుండి గదుడు ఆ వనచరునకు నమస్కరించి ఇట్లనియె.

"వీరుడా! నీవెవరవు? నాకు నిజము తెల్పుము." అంత భీమసేనుడు "ఓ! గదా! నేను భీమసేనుడను.

మా శత్రువయిన దుర్యోధనుడు మమ్ము ద్యూత క్రీడయందు ఓడించి నగరము నుండి భహిష్కరించెను. ఇక్కడికి ఒక యోజన దూరమందు యుధిష్ఠరుడు సోదర సహితుడై వనవాసము చేయుచుండెను. భగవంతుని విచిత్ర లీల చూడుము. వనమున నివసించుచూ ఇప్పటికి ఎనిమిది సంవత్సరములు అయినది. ఇంక నాలుగు మిగిలియున్నవి. పిదప ఒక సంవత్సరము అజ్ఞాతవాసము చేయవలసియున్నది. అర్జునుడు ఇంద్రుని పిలుపున స్వర్గమున కేగెను. అతడు భూతలమునకు ఎప్పుడు ఏతించునో తెలియదు. గదా! యాదవుల కుశల సమాచారము తెలుపుము. ఈ అశ్వమెవరిది? మీరు ఎందువలన ఇచటికి ఏతించిరి?" అని పలికి భీముడు దుర్యోధనుడు గావించిన దుష్కార్యమును తలచి రోదించెను. గదుడు సహితము దు:ఖితుడై భీమునికి ఆశ్వాశన మొసగి, ఆతనికి సమస్త విషయములను విస్తారముగ ఎరింగించెను. అది అంతయు విని, భీముడు ప్రసన్నుడై, అనిరుద్ధాది యాదవ వీరులను యుధిష్ఠిరుని వద్దకు తీసికొని వెళ్ళెను.

యాదవాగమనమును వినిన అజాత శత్రువు యుధిష్ఠిరుడు మిక్కిలి ఆనందము నొంది, నకులాది సోదరులతో వారిని ఆహ్వానించుటకు ఆశ్రమము బయటకు వచ్చెను. యాదవులు సమస్తము ఆయనకు సాష్టాంగ దండ ప్రణామములు గావించిరి. యుధిష్ఠిరుడు వారికి ద్వైత వనమందు వసతి కల్పించెను. యుధిష్ఠిరుడు సూర్య భగవానుని చే ఈయబడిన పాత్ర ద్వారా వారందరికీ యధా యోగ్యమయిన భోజనము కల్పించెను.

అచట ఒక రాత్రి యుండి, మరునాడు ఉదయము అనిరుద్ధుడు యజ్ఞ నియంత్రణము చే అశ్వమును విముక్తము గావించి, యాదవ సహితుడై అచటి నుండి వెడలెను. అశ్వము నెమ్మదిగ సారస్వత దేశమున కేగెను. ఇష్టానుసారము పోవుచున్న హయరాజము చివరకు కుంతల చేరెను. ఆదేశమును వైష్ణవ భక్తుడయిన చంద్రహాసుడు రాజ్యము చేయుచుండెను. ఆతడు కేరళరాజ పుత్రుడు. శ్రీకృష్ణ భగవానుని అనుగ్రహము చే ఆతనికి ఈ రాజ్యము దక్కినది. ఈ భక్తుడయిన చంద్రహాసుని కథ జైమిని భారతము నందు విస్తారముగ వివరింపబడినది. అందు నారదుడు అర్జునునకు ఈ వృత్తాంతము ను వివరించును. ఈ కుంతల నగరము నందు సర్వులు శ్రీకృష్ణ భక్తులు, పుణ్య పరాయణులు, పరస్త్రీ పరాన్ముఖులు, తమ స్వపత్నుల యందు అనురాగము కలిగినవారు, బ్రాహ్మణ భక్తులు. వారు నిరంతరము శ్రీకృష్ణ గాధలను పురాణ శ్రవణము చేయుచూ శ్రీ రాధామాధవ నామ జపము చేయుచుందురు. అక్కడి ద్విజులు ఊర్ధ్వ పుండ్రములు ధరించి, తులసీ మాలలు వేసికుని, గోపీ చందనము, కేసరము, హరి చందనము పూసుకుందురు. అచటి వైష్ణవులు అందరూ పన్నెండు తిలకములు, ఎనిమిది ముద్రలు ధరించెదరు. ఆ నగరమును అన్ని వైపులా చూచుచూ అశ్వము రాజభవనము చేరెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి "యాగాశ్వము కుంతల పురము చేరుట" అను ఏబది ఒకటవ అధ్యాయము సమాప్తము)

ఏబది రెండవ అధ్యాయము

(భక్తి సార్వభౌముడగు చంద్రహాసుడు అనేక బహుమతులు తీసికొని అశ్వమును అనిరుద్ధునకు అప్పగించుట మరియు తిరిగి యాదవుల ప్రస్థానము)

శ్రీ గర్గాచార్యులు "తన భవనము వద్దకు ఏతించిన అశ్వమును శ్రీకృష్ణ దాసుడయిన చంద్రహాసుడు పట్టి ఫాల పత్రమును పఠించి ఇట్లనియె "ఆహా! నేడెంత సుదినము! ఏమి సౌభాగ్యము? నేడు సాక్షాత్ శ్రీకృష్ణ పౌత్రుడు అనిరుద్ధుని గాంచెదను. నేను పూర్వ జన్మములందు ఏ పుణ్య కార్యము లాచరించితినో తెలియదు. కానీ దాని వశమున ఈనాడు

శ్రీకృష్ణ తుల్యుడయిన ఆయన మనుమని అనిరుద్ధుని చూచు అవకాశ మొచ్చినది. ఈనాటి వరకు మాయా మానుష దేహుడయిన శ్రీ కృష్ణుని దర్శింప నైతిని. అందువల్ల ఆ ప్రద్యుమ్న తనయుని తో ద్వారకకు పోయి అచట శ్రీకృష్ణుని, బలరాముని, ప్రద్యుమ్నుని, వారిచే పూజింపబడుచున్న ఉగ్రసేన మహారాజును చూచెదను." ఇట్లు పలికి చంద్రహాస మహారాజు గంధ పుష్పాక్షతలు, దివ్య వస్త్ర, రత్న, సహితుడై యాగాశ్వమును తీసికొని మాలా తిలక శోభితులయిన పురోహితులను కూడి అనిరుద్ధుని దర్శించుటకై బయటకు వెడలెను. మంగళమయమయిన గీత వాద్యములతో మహారాజు పాదచారియై, నాగరికుల సహితుడై వచ్చుట కాంచిన అనిరుద్ధుడు మిక్కిలి ప్రసన్నుడై తన మంత్రి అయిన ఉద్ధవుని తో ఇట్లనియె "మంత్రివర్యా! మనను కలియటకు వచ్చుచున్న ఈ రాజు ఎవరు? ఈతని వృత్తాంతమును తెలియజేయవలసినది."

ఉద్ధవుడు "ప్రద్యుమ్ననందనా! ఈతడు కేరళ రాజపుత్రుడు. చంద్రహాస నామధేయుడు. ఈతని మాతా పితరులు పసితనము నందే పర లోక వసులయిరి. కుళిందుడు ఈతనిని పెంచెను. ఈతడు బాల్యమునండే శ్రీకృష్ణ భక్తుడు. అందువల్ల ఆయనే ఈతనిని రక్షించెను. ఒక దుష్టబుద్ధి అయిన మంత్రి తనయ తో ఈతని వివాహమయ్యెను. కుంతల దేశాధీశుడు ఈతనికి రాజ్యమిచ్చి తాను వనమునకేగెను. ఈతని వృత్తాంతమును స్వయముగా శ్రీకృష్ణుని ముఖతా నేను వింటిని. ఈయనకు దర్శన మిచ్చుటకు స్వయముగా శ్రీకృష్ణుడే ఇచటకు ఏతెంచును." ఉద్ధవుని పలుకులు విని అనిరుద్ధుడు మిక్కిలి చకితుడయ్యెను. ఇంతలో సమస్త పరివార సహితుడై చంద్రహాస మహారాజు అనిరుద్ధుని వద్ద కేతించి శ్యామ కర్ణము నర్పించి, ప్రసన్న పూర్వకముగ అనేక ధనరాశులు బహూకరించెను. ఏబది వేల గజములు, ఒక లక్ష రథములు, ఒక కోటి గుర్రములు ఒక కోటి స్వర్ణ ముద్రలు, ఒక వేయి శిబికలు, పది లక్షల ధేనువులు, పది వేల ధనుసు యొక్క నారులు, ఒక కోటి బారువుల బంగారము, నాలుగు కోట్ల బారువుల వెండి, ఒక లక్ష భూషణములు ఇవన్నియు కూడా బహుమతులుగ అనిరుద్ధుని కర్పించి ఇట్లనియె.

"సమస్త దేవతా శ్రేష్ఠుడు, శ్రీకృష్ణ పౌత్రుడు, లోకేశ్వరుడు, ప్రద్యుమ్న పుత్రుడు, యదుకుల తిలకుడు, పరిపూర్ణ పరమాత్మ దేవత అయిన అనిరుద్ధునికి నమస్కరించుచున్నాను." భక్తుని వచనములు విని, అనిరుద్ధుడు ఆయనను ప్రశంశించి, ఒక దేదీప్యమానమయిన రత్నమాలను బహూకరించెను. చంద్రహాసుడు తన రాజ్యముపై ఒక మంత్రిని నియుక్తుని గావించి అశ్వరక్షణకై బయలు దేరెను. యాదవసేన ఒక రాత్రి అచటనే విశ్రమించి, మరునాడు ఉదయము చంద్రహాసుని తో కలసి అక్కడ నుండి ప్రస్థానమయిరి. ఫాల పత్ర సహిత యాగాశ్వము ముందునకు పోయి విశాలమయిన సరస్వతీ నదిని చేరెను. ఆ నది మిక్కిలి వేగముగ ప్రవహించుచూ, ఒడ్డులను ఒరుసుకొని పారుచుండెను. ఆ నదిని దాటుట మిక్కిలి కష్ట సాధ్యము. ఆ నది ఒడ్డున అనేక నౌకలు బంధించి యుంచబడినది. వంద అక్షౌహిణీ సేనతో ఆ నదిని దాటుటకు అనిరుద్ధుడు యోచన చేసెను. తొలుత అనిరుద్ధుడు సాంబాది ప్రముఖుల తో ఏనుగు నెక్కి జల ప్రవేశము చేసెను, పిదప నీటి యందు దిగెను. మొదట నీరు కలుషిత మయినది; పిదప పంకిల మయ్యెను. సమస్త యాదవులు విస్మితులయిరి. యాదవ సేన అంతయు ఆ నదిని దాటు సరికి అచట కేవలము నామమాత్రముగ మాత్రమే నది మిగిలినది. తదనంతరము యాగాశ్వము నెమ్మది నెమ్మదిగ సింధునది, సముద్రమునకు మధ్య గల నారాయణ సరోవరము చేరెను. అశ్వము దాహార్తయై అందలి జలములు త్రాగెను. ఇంతలో అనిరుద్ధాది యాదవ వీరులు కూడా అచటికి చేరిరి. ఆ మార్గ మధ్య మందు అనిరుద్ధునికి ధర్మ ద్వేషులయిన మ్లేచ్ఛులు తారసపడిరి. వారిని ఓడించి అశ్వమును చేరు సరికి కొంత సమయము పట్టినది. అంత వారందరూ నారాయణ సరోవరమున స్నానమాచరించిరి.

శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదమందలి చంద్రహాసుని చే అనిరుద్ధుని ప్రార్థనము అను ఏబది రెండవ అధ్యాయము సమాప్తము

ఏబది మూడవ అధ్యాయము

(ఉద్ధవుని సలహాచే సమస్త యాదవులు ద్వారకాపురి వైపు కరుగుట; అనిరుద్ధుడు తొలుత ఉద్ధవుని ద్వారకకు పంపి యాత్రా వృత్తాంతమును తెలియజేయుట)

శ్రీ గర్గా చార్యులు "ఉగ్రసేనుని యాగాశ్వము అనేక రాజ్యములు దాటి, వీరులయిన రాజులను దర్శించుచూ, భారత వర్ష మందు తిరుగాడు చుండగా కాలచక్రము నెమ్మదిగ కదిలి ఫాల్గుణ మాస మేతెంచినది. అయ్యది సర్వులకు తమ స్వస్థలమును దర్శింప జేయునది. ఫాల్గుణ మాస మేతించిన పిదప అనిరుద్ధుడు ఉద్ధవుని ఇట్లు ప్రశ్నించెను. "మంత్రి వర్యా! ఉగ్రసేనుడు చైత్ర మాసమందు యజ్ఞము చేయును. ఇక ఎన్నో రోజులు మిగిలి లేవు. ఈ భూతల మందు అశ్వాపహరణము కావించు రణ కోవిద శాత్రవ రాజులు ఎవరు మిగిలిరి? నాకు తెలుప వలసినది." ఉద్ధవుడు "మహాప్రభూ! ఇక భూమ్యాకాశములందు అశ్వము ను అపహరించు శూరులు మిగిలి లేరు. ఇక నీవు సేనా సహితుడవై ద్వారకా పురి వైపు చనియుట ఉత్తమము." ఈ పలుకులు విని అనిరుద్ధుడు హర్షోల్లాసితుడై యాగాశ్వము కడకేగి దానికి ఉద్ధవుని పలుకులు సారంశము వినిపించెను. సర్వజ్ఞ అయిన ఆ దివ్యాశ్వము ద్వారకాపురి వైపు లంకాపురి నుండి కిష్కింధకు పయనమయిన హనుమంతుని వలె పయనించుట మొదలిడెను.

దాని వెనుక సాంబుడు, భానుడు ఆదిగా గల వీరులు వాయువేగ మనో వేగముతో అశ్వములపై పరుగులిడిరి. వారందరూ ఆ అశ్వమును సర్ణ రజ్జువుతో బంధించి తమ పురివైపు ప్రస్థానము కావించిరి. బాజా భజంత్రీలు, దుందుభులు మ్రోగించుచూ, పృధివీతలమును కంపింప జేయుచూ, దుష్ఠ శత్రువుల మనసును భయ భ్రాంతము కావించుచూ, యాదవ గణములు ముందుకేగుచున్నవి. యాదవులతో పాటు నడచుచున్న యాగాశ్వమును కాంచి, కలహ భోజనుడయిన నారదుడు ఒక దూత వేషమున ఇంద్రుని వద్దకేగి ఆ అశ్వమేధము గూర్చి విస్తారముగ తెలిపెను. అంత ఇంద్రుడు ఆ యాగాశ్వమును అపహరించుటకు యోచన చేసి, వెంఠనే అదృశ్యుడై, ఆ అశ్వమును కాంచుటకు భూతలమునకు వచ్చెను. విష్ణుమాయ చే దేవతలు సహితము మోహితులగుదురు. బ్రహ్మ, కుబేర, ఇంద్రాది దేవతలే విష్ణుమాయను తెలియకున్న ఇక సాధారణ మానవుల విషయము చెప్పనేల? ఇంద్రుడు భూతలమునకేగి వృష్ణి వంశీయుల కై ఎదురుచూచు చుండెను. ఆ సేన కోట్లాది శూరవీర ప్రవృతమై, ప్రళయ భయంకర సాగర ఘోష కావించుచూ ముందున కేగుచుండెను. యాదవుల విశాల సేనను గాంచి ఇంద్రుడు భయము నొందెను. శ్రీకృష్ణ భయమున దేవేంద్రుడు తిరిగి అమరావతి కేగెను. ఇంద్రుడు యుద్ధాభిలాష మాని నిశ్శబ్దముగ తన పని కావించుట, కేవలము శ్రీకృష్ణ కృప.

సమస్త చతురంగ బల సమేతమయిన అనిరుద్ధుని సేన అమరావతి యందలి దేవేంద్రుని సేన వలె శోభించుచున్నది. రథ, గజ, హయ, పదాతులు సంపూర్ణముగ వేరై, గుంపులు గుంపులుగ ముందుకు నడచు చుండిరి. శ్రీకృష్ణ పుత్రులు హర్షోల్లాసితులై ద్వారకా పథము ననుసరించిరి. వారు జంబూ ద్వీప విజేతలు. కానీ వారు లోక పరలోక విజయకాంక్షులై యున్నారు. వారు శ్యామకర్ణమును ముందుంచుకొని, అనేక విధములయిన విజయ దుందుభులు మ్రోగుచుండగా, నాట్య గాన, ఉత్సవములు గావించుచూ ముందరకేగు చుండిరి. సాంబాది శ్రీకృష్ణ పుత్రులు, ఇంద్రనీలాది వేలాది భూపతుల సహితుడై, అనిరుద్ధుడు ఆనర్త దేశము ప్రవేశించి, సాంబుని అనుజ్ఞగైకొని, ఉద్ధవుని ద్వారకకు పంపెను. ఈ విధముగ అనిరుద్ధ ప్రేరితుడయిన ఉద్ధవుడు ఆయనకు నమస్కరించి, ఒక శిబిక నధిరోహించి, మహామునుల సమక్షమున, పిండారక క్షేత్ర సభా మండపమున నిరీక్షించుచున్న ఉగ్రసేన మహారాజు వద్దకుచనెను. అచట వసుదేవ, కృష్ణ, బలరామ, ప్రద్యుమ్నాదులు యజ్ఞరక్షణ కావించుచుండిరి. అచట ఉద్ధవుడు రాజ్యసభ ప్రవేశించి, ఉగ్రసేన మహారాజుకు వందనము లర్పించి, శ్రీకృష్ణ బలరామాదులకు యధాయోగ్య ప్రమాణము లాచరించి వారి ఎదుట నిలబడెను. ఉద్ధవుని గాంచి సర్వులు ప్రసన్నులయిరి. వారు ప్రశ్నించిన పిదప ఉద్ధవుడు సర్వ వృత్తాంతమును ఈ విధముగ ఎరింగించెను.

"రాజేంద్రా! మీ శ్యామకర్ణ అశ్వము నిర్విఘ్నముగ వెనుకకు వచ్చినది. అనిరుద్ధాది యాదవులందరూ కుశల

పూర్వకముగ తిరిగి వచ్చిరి. గోవిందుని కృపచే ఇంద్రనీల, హేమాంగదులేతెంచిరి. స్త్రీ రాజ్య సామ్రాజ్ఞి అయిన స్వరూప ఇంతకు ముందే ఇచట కు ఏతెంచినది. భీషణ సహిత బకుడు పరాజితుడైనాడు. బిందు మరియు అనుసాల్వులు తమ నగరముల నుండి వచ్చుచున్నారు. పాంచజన్యమను ఉపద్వీపము నందు పల్వలుడు అను దైత్యుని ఓడించితిమి. ఆ సమరము నందు శంకర భగవానుడు సునందుని, అనిరుద్ధుని వధించెను. కానీ కృష్ణ భగవానుడు అచటికి వచ్చి సర్వులకు జీవన దాన మొసంగెను. ఇచట గమనించవలసిన విషయమేమనగా కేవలము శ్రీకృష్ణ కృప చేతనే మేమందరము కుశలముగ తిరిగి ఏతెంచితిమి. కౌరవులు పరాజితులయిరి. భీష్మలవారు మాతో ఇచటికి ఏతెంచిరి. మేము ద్వైత వనము నందు దు:ఖ పీడితులయిన పాండవులను పరామర్శించి, వ్రజభూమి యందు శ్రీహరి విరహము చే వ్యాకులులయిన గోపగణములను సహితము దర్శించితిమి. బాల్యావస్థనుండి శ్రీకృష్ణ భక్తుడయిన చంద్రహాస మహారాజు మాతో పాటు వచ్చి యుండెను. మరెందరో భూపాలురు భయముతో ఇచటకు ఏతించిరి.

ఉద్ధవుని ముఖతా శ్రీకృష్ణ కీర్తి గానమును వినిన ఉగ్రసేనుడు ప్రేమ విహ్వలుడై కొంత తడవు నోటమాట రాక ఆనంద మహాసాగరమున మునిగెను. ఆయన తదుపరి లేచి ఉద్ధవునకు ఒక మణిమయ హారము బహూకరించెను. అంత శ్రీకృష్ణ భగవానుడు లేచి, హర్షోల్లాసితుడై సభాసదులందరూ చూచుచుండగా తన మిత్రుడయిన ఉద్ధవుని గాఢాలింగనము చేసికొనెను. అంత ఉగ్రసేనుడు శ్రీకృష్ణునితో "గోవిందా! నీవు యాదవ సహితుడవై అనిరుద్ధుని తీసికొని వచ్చుటకు వెళ్ళవలసినది." అని పలికెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదము నందలి ఉద్ధవాగమనము అనెడు ఏబది మూడవ అధ్యాయము సమాప్తము)

ఏబది నాల్గవ అధ్యాయము

(వసుదేవాది యాదవుల ద్వారా అనిరుద్ధుని స్వాగతించుట; అశ్వము మరియు సేనాసహితముగ యాదవులు ద్వారకాపురికేతించుట, శ్రీకృష్ణ, ఉగ్రసేనుల ద్వారా వచ్చిన నరేశ్వరులందరూ సత్కరింపబడుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదుపరి ఉగ్రసేనునాదేశానుసారము వసుదేవాది శ్రేష్ఠయాదవులు, విజయయాత్ర చేసి తిరిగి వచ్చిన అనిరుద్ధాదులను స్వాగతించుటకు ద్వారకాపురి నుండి రథ, గజ, హయ, శిబికలపై ఆరూఢులై బయలుదేరిరి. వారి వెంట శ్రీకృష్ణుడు, బలరాముడు, ప్రద్యుమ్నాది యాదవ శ్రేష్ఠులు వెడలిరి. శ్రీకృష్ణ బలరాముల తల్లులైన దేవకీ, రోహిణిలు, శ్రీకృష్ణ పత్నులు రుక్మిణీ, సత్య భామాది అష్ట మహిషులు, మరియు పదహారు వేల మంది ఇతర మహిషులు, శిబికల నధిరోహించి వారి వెనుక చనిరి. అనేకమంది కన్యకామణులు ఏనుగుల నెక్కి పుష్పములు, పేలాలు, ముత్యములు, వర్షించుటకరిగిరి.

ఆ ఊరేగింపునకు ముందు కళ్ళాపి జల్లుటకు అతివలు నీటి బిందెలు పట్టుకొని కదిలిరి. సౌభాగ్యవతులయిన బ్రాహ్మణ పత్నులు గంధ పుష్పాక్షతలు, దూర్వాంకురములు పట్టుకొని వెళ్ళిరి. రూపవతులయిన వారాంగనలు శ్రీహరి యొక్క గుణములు గానము, నాట్యము చేయుచూ కదిలిరి. సమస్త యాదవులు శంఖనాదములు చేయుచూ, దుందుభులు మ్రోగించుచుండిరి. దాని మధ్య వేదఘోష వినిపించు చుండెను. వాటన్నిటి మధ్యా గర్గాచార్యాది మునులు ద్వారకాపుర పతాకాంకితమయిన ఒక గజరాజును ముందుంచుకొని బయలుదేరిరి. వీధుల యందు సుగంధ బరిత కళ్ళాపి చల్లబడెను. ఆ పురము నందలి ప్రతి భవనము అరటి స్థంభములతోనూ, తోరణములతోనూ, అలంకృతమై యుండెను. రత్నమయ దీపములు రకరకములయిన చాండ్లరీలతో ద్వారకా పురి అంతయు శోభించు చుండెను.

ఆ నగరము నందలి దివ్య స్త్రీ పురుషులు పట్టు పీతాంబరములు కట్టుకొని నగరపు శోభను మరింత ఇనుమడింపు

చేయుచుండిరి. పక్షుల కలకూజితములతో, అగరు గంధముతో శ్రీకృష్ణ నగరి అమరావతి వలె శోభిల్లుచుండెను. ఈ విధముగ నగర శోభను తిలకించుచూ యాదవులు శ్యామకర్ణము, అనిరుద్ధుడు యున్నచోటికి వచ్చిరి. తన గురుజనులు వచ్చుట చూచిన ప్రద్యుమ్న నందనుడు రథముదిగి, శ్యామకర్ణమును పట్టుకొని ఇతర భూపాల సహితుడై కాలినడకన వారికి ఎదురేగెను. తొలుత యదుకులాచార్యుడయిన గర్గాచార్యుల వారికి నమస్కరించి, తదుపరి వసుదేవ, బలరామ, శ్రీ కృష్ణ ప్రద్యుమ్నులకు ప్రణామములర్పించి అశ్వమును వారికి అప్పగించెను. వారందరూ ఆతనిని హృదయ పూర్వక శుభాశీశులు ఇచ్చి ఇట్లనిరి" నీవు సమస్త నరేశ్వరులను జయించి ఒక్క సంవత్సరము లోపు తిరిగి ఇచటకు ఏతించితివి. ఇది భృహత్కార్యము." ఈ వచనమును విని అనిరుద్ధుడు గర్గాచార్యుని చూచి "విప్రవర్యా! మార్గ మధ్యమున ప్రత్యేక యుద్ధములందు శ్యామకర్ణము బంధింప పడినప్పటికీ, మీ కృపా కటాక్ష వీక్షణములచే తిరిగి విడిపించగలిగితిమి. అందుచే ప్రతి ఒక్కరు తమ శక్త్యానుసారము గురుదేవుని పూజింపవలెను." తదుపరి అనేకమంది భూపాలురు ముందుకు వచ్చి ప్రేమమగ్నులై వేరువేరుగా శ్రీకృష్ణ బలరాముల పాదములకు ప్రణామములర్పించిరి. అవనిత శిరస్కులయిన నృపాలురను చూచిన బలరామకృష్ణులు, చంద్రహాస, భీష్మ, బిందు, అనుసాల్వ, హేమాంగద, ఇంద్రనీలాదులను వారి హృదయములకు హత్తుకొనిరి. తదుపరి విజయయాత్ర చేసి వెనుకకు వచ్చిన అనిరుద్ధుని ఒక మహాగజముపై ఆరూఢుని కావించి, వసుదేవుడు తన పుత్ర పౌత్రాదుల తో కలసి యాదవ పురి యందు ప్రవేశించెను. ఆ సమయమున దేవాంగనలు పుష్ప వృష్టి కురిపించిరి.

ఏనుగుల పై కూర్చొనియున్న కన్యామణులు పేలాలు, ముత్యముల వర్షము కురిపించిరి. ఆ ఊరేగింపు నృత్య, వాద్య, గీత, వేదమంత్ర ఘోషతో సుశోభితమై యుండెను. వారందరూ సుగంధ భరిత కళ్ళాపి జల్లిన వీధుల యందు ఊరేగుచూ, పిండారక క్షేత్రము చేరిరి. యాదవుల ఈ దేవ దుర్లభ వైభవమును గాంచిన సమస్త రాజనీకము తమను తాము నిందించుకొనిరి. వారు మండుచున్న నేతి సుగంధము తో నిండిన యజ్ఞశాలను కూడా కాంచిరి. అసిపత్ర వ్రతధారి అయిన యదుకుల తిలకడు ఉగ్రసేనుడు ఆ నృపారులను, ఆ నృపాలురు ఇంద్రసమ తేజస్వీ, జితేంద్రియుడు శరీర పుష్టి కలవాడు అయిన ఉగ్రసేనుని చూచిరి. ఆయన కుశాశన స్థితుడై, నియమ నిర్వహణ కు తన భూషణముల నన్నింటినీ విడచి, చేతి యందు మృగశృంగము ధరించి, తన రాణి సహితుడై, మృగ చర్మములపై విరాజమానుడై యుండెను. ఉగ్రసేన మహారాజు నెయ్యి, గంధాక్షతలు, మొదలగు వానితో యజ్ఞ మండపము నందు అగ్ని పూజ కావించుచుండెను. ఆయనతో కూర్చొని యున్న ఋషులు, మునుల, కన్నులు పొగ కారణముగ అరుణిమతో కూడియున్నవి. అనిరుద్ధాదులు తమ వాహనముల నుండి క్రిందికి దిగి, అశ్వమును ముందుంచుకొని, అత్యంత ప్రసన్నులై మహారాజుకు అనేకమార్లు ప్రణామములాచరించిరి. అనంతరము ఉగ్రసేనుడు యాదవులకు, యాగమునకు వచ్చిన నరేశ్వరులకు యథోచితముగ సన్మానము కావించెను.

పిదప అనిరుద్ధుడు నమస్కరించి, చేతులు జోడించి, అందరూ వినుచుండగా జంబూద్వీపమునకు స్వామి అయిన ఉగ్రసేన మహారాజుతో ఇట్లనియె "మహారాజా! మీరు ఆయనను చూడవలసినది. ఈయన ఇంద్రనీల మహారాజు. మిక్కిలి ప్రేమతో మీ చరణారవిందములపై పడెను. మీరు దేవుని వలె ఆయనను లేవనెత్తవలసినది. హేమాంగద, అనుసాల్వ, బిందు, చంద్రహాస, మరియు దేవవ్రత భీష్ముల వారు మీ సమీపమున కేతించిరి. వారిని ఒక్కమారు చూడవలసినది. ఈయన నా రక్షకుడయిన సాంబుడు. ఈతడు సునందనుడు. ఈయనను వీక్షింపవలసినది. శ్రీ రుద్ర దేవుడు నన్నూ, ఈయనను హతమార్చెను. కానీ శ్రీకృష్ణ భగవానుడు మాకు జీవన దానమొనర్చెను. ఈయననూ, మిగిలిన యాదవులను వీక్షింప వలసినది. నిర్విఘ్నముగ తిరిగి వచ్చిన యాగాశ్వమునూ, మరియు సమరమాచరించుటకు మీరిచ్చిన ఖడ్గమును కూడా తీసికొన వలసినది."

అనిరుద్ధుని పలుకులు విని ఉగ్రసేనుడు మిక్కిలి ప్రసన్నుడై అతనిని ప్రశంశించి, మిగిలిన నరపతులను యథాయోగ్యముగ ఆశీర్వదించి, సమస్త నరపతులనూ పూజించి, పిదప భీష్ముని గాంచి "భీష్ముల వారూ! వచ్చి నన్ను ఆలింగనము చేసికొనవలసినది." అని పలికి యదుకుల తిలకుడయిన ఉగ్రసేనుడు భీష్ముని గాఢాలింగనము చేసికొనెను. పిదప యాగమున కేతించిన రాజులందరూ విభిన్న గృహములందు నివాసముండిరి. పిదప అనిరుద్ధుని, సాంబుని ఇతర

శ్రీకృష్ణ పుత్రులను దేవకీ, రోహిణీ, రుక్మవతీ, రుక్మిణీ మొదలగు పూజనీయమయిన స్త్రీలు వారి హృదయమునకు హత్తుకొని హర్షానందము ను అనుభవించిరి. స్వరూప, రోచన ఉష మొదలగు అనిరుద్ధ పత్నులకు కూడా మిక్కిలి ఆనందము కలిగెను. సాంబుని ప్రశంశను విని దుర్యోధన పుత్రి లక్ష్మణ అత్యంత హర్షానుభవము పొందెను. సేనా సహితముగ అనిరుద్ధుడు ఏతించిన పిదప ద్వారక యందలి ఇంటింటిలోనూ మహోత్సవము జరిగెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి యజ్ఞాశ్వము యొక్క ద్వారకాగమనము అను ఏబది నాల్గవ అధ్యాయము సమాప్తము)

ఏబది అయిదవ అధ్యాయము

(వ్యాసుడు ముని దంపతులను, రాజదంపతులను గోమతీ జలములు తెమ్మని ఆదేశించుట; నారదుని మోహము మరియు భగవానుని ద్వారా మోహభంజనము. శ్రీకృష్ణుని కృప చే రాణులు కలశము లందు నీరు నింపి తెచ్చుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదుపరి అష్టద్వార పరివృతము, రెపరెపలాడుచున్న పతాకముల చే సుశోభితము, అగ్నికుండ సంపన్నము, ఎనిమిది మంది యాజ్ఞకులతో నిండియున్న యజ్ఞమండపము పలాశ, మారేడు, చంద్ర చెట్ల మానులచే తయారు కావింప పడిన యూప స్థంభముల తో, అనేకానేక వేదికలతో విభూషితమైయున్నది. అచట సృక్, సృవము, మృగ చర్మములు, కుశలు మొదలయిన వస్తువులు ఉపస్థితమై యున్నవి. రాజర్షి అయిన ఉగ్రసేనుడు వేద వేదాంగ వేత్తలయిన ఋషీశ్వరుల మధ్య యాదవ సహితుడై కూర్చొని దేవరాజు ఇంద్రుని వలె శోభించు చుండెను. శ్రీకృష్ణ భగవానుని ఆహ్వానము చే నందాది గోపికులు, వృషభాను వరుడు మొదలగు శ్రేష్ఠ పురుషులు, శ్రీదామాది గోపాల బాలురు, ద్వారకాపురికేతించిరి. యశోదా, శ్రీ రాధాదేవి మొదలగు వారు శిబికలు, రధములు అధిరోహించి కుశస్థలీ పురమేతించిరి. ఆహ్వాన పత్రమందిన పిదప దృతరాష్ట్రమహీపతి తన పుత్రులతో, కౌరవులతో ఏతించెను. అనేక ఇతర రాజులు సహితమేతించిరి. శ్రీకృష్ణుని ఆహ్వానమును పురస్కరించుకొని పాండవులు ద్రౌపతి సహితులై వనము నుండి అచట కేతించిరి.

శ్రీకృష్ణుడు నారదుని పంపి ఇంద్రాది అష్ఠ దిక్పాలకులను, అష్ఠ వసువులను, ద్వాదశాదిత్యులను, సనక సనందనాదులనూ, ఏకాదశ రుద్రులనూ, మరుద్గణములనూ, భేతాళ, గంధర్వ, కిన్నెర, కింపురుష, విశ్వేదేవ, సమస్త సాధ్యగణ, విద్యాధర, దేవపత్నీసహిత దేవతలను, అప్సరసలను, ఆహ్వానించెను. వారందరూ శ్రీకృష్ణ దర్శనాభిలాష తో ద్వారకకు ఏతెంచిరి. కైలాసము నుండి సర్వమంగళా సహితుడై పరమశివుడేతెంచెను. సుతల లోకము నుండి దైత్యగుణ సముదాయముతో ప్రహ్లాదుడు, బలి చక్రవర్తి ఏతెంచిరి. భీషణ, విభీషణ, మయ, పల్వలులు సహితము వచ్చిరి. దంష్ట్రధారులయిన వన జంతువులతో జాంబవంతుడు, వానరములతో హనుమంతుడు, పక్షులతో గరుత్మంతుడు, సర్పములతో నాగరాజు వాసుకి, ఏతెంచిరి. అంతేకాక ధేనువులతో ధేనురూపధారిణి ధరణీదేవి, పర్వత సహితులై మేరువు మరియు హిమా చలము, వృక్ష సహితమై వటవృక్షము, రత్నములతో రత్నాకరుడు (సముద్రము); నదులతో కలసి గంగానది, సమస్త తీర్ధములతో కలసి తీర్ధరాజము ప్రయాగ, మరియు పుష్కరము వీరందరూ ప్రత్యేకముగ ఆహ్వానింపబడిన వారై ఏతెంచిరి. శ్రీకృష్ణుని ఆహ్వానముచే వ్రజభూమి, యమసోదరి యమునా దేవి సహితము ఏతెంచిరి. వారందరినీ చూచి ఉగ్రసేనుడు ప్రసన్నుడై యధాయోగ్యమయిన స్థలములందు వారిని ఆశీనుల కావించెను.

కొందరిని శిబిరము లందు, కొందరిని మందిరము లందు, కొందరిని విమానములందు, కొందరిని ఉపవనములందు ఆవాసముంచెను. ఆ యజ్ఞము నందు వేదవ్యాసుని ఆచార్యునిగనూ, బకదాల్భ్యుని బ్రహ్మ స్థానముననూ, గర్గులవారు నియమించిరి. అంతేకాక మున్ను నియమింపబడిన ఋషులు ఋత్విక్కులుగ ఉపస్థితులయిరి. తదుపరి శ్రీకృష్ణుని ఆదేశముచే అనిరుద్ధుడు తన రూపముతోనూ, చతుర్ముఖ బ్రహ్మగనూ, చంద్రునిగనూ, మూడు రూపములు

ధరించి శోభించెను. ప్రద్యుమ్న సుతుని లీలలు గాంచిన దేవతలు, యాదవులు, నరేశ్వరులు ఆశ్చర్య చకితులైరి. అంత వ్యాసుడు ఉగ్రసేనునితో, "యాదవ శ్రేష్ఠా! ఈ కూర్చున్న వారిలో అరువది నాలుగు మంది దంపతులను తీసికొని గోమతీ తటమునకు ఏగి నీటిని తీసికొని రావలసినది. అదితి కశ్యపులు, అరుంధతీ వశిష్ఠులు, కృపిద్రోణులు, అత్రిఅనసూయ, రుక్మిణీ కృష్ణులు, రేవతీ బలరాములు, మాయావతీ ప్రద్యుమ్నులు, ఉషా అనిరుద్ధులు, సుభద్రార్జునులు, లక్ష్మణా సాంబులు, తమ భార్యలతో హేమంగదాది నృపతులు వెళ్ళిరి. ఈ విధముగ పత్నీ సహితులై బ్రహ్మ క్షత్రియులు రక్షా బంధనము కట్టుకొని గోమతీ జలములకై ఏగిరి.

దేవకీ, రోహిణీ, కుంతీ, గాంధారీ, యశోదలను, ముందుంచుకొని రుక్మిణీ సహితుడయిన శ్రీకృష్ణుడు కలశమును పైకెత్తెను. అట్లే రేవతీ సహితుడై బలరాముడు, అట్లే సపత్నీ సహితులై మిగిలిన దంపతులు పుష్ప పల్లవ సహితములయిన స్వర్ణ కలశములు తీసికొని గోమతీ తటమున కేగిరి. ఆ యూధము నందు రుక్మిణీ సహితుడయిన వాసుదేవుని కాంచిన నారద మహర్షి, సత్యభామా దేవి గృహమునకు ఆమె ఒంటిరిగ యున్నపుడు ఏగెను. ఆదేవి ఆయన యొక్క ఆగమనమునకు కారణ మడుగగా ఆయన ఇట్లు శలవిచ్చెను. "సత్రాజిత్ నందినీ! నీ ఇంటనే నీకు ఆదరము లేదని నాకు తోచుచున్నది. శ్రీకృష్ణుడు రుక్మిణీ సహితుడై గోమతీ జలములు తెచ్చుటకేగెను. అనేక మంది నీ గృహమునకు యాచనకు వచ్చెదరు. పారిజాత వృక్షమును నీవే స్వర్గము నుండి క్రిందకు తెచ్చితివి. శ్రీకృష్ణుని సంకల్ప సిద్ధి కలిగించు శ్యమంతక మణి నీ సొంతము. అటువంటి నీవు, అత్యంత సుందరీమణివి, గరుడునిపై యాత్ర కావించిన దానివి, అయిన నిన్ను విడచి శ్రీకృష్ణుడు రుక్మిణీదేవితో జలములు తెచ్చుట కేగెను. అమ్మా! సత్యభామినీ! తన పుత్రుడు ప్రద్యుమ్నుడనీ, తన మనుమడు అనిరుద్ధుడనీ, రుక్మిణీ దేవి తన అధికార దర్పమును అన్నింటా ప్రదర్శించుచున్నది."

"నా ప్రాణ వల్లభుడు రుక్మిణీ దేవితో వెళ్ళెను." అను వచనము వినిన సత్యభామ మిక్కిలి క్రోధము వహించి, దు:ఖితురాలై రోదన మొదలిడినది. ఆ సమయమున నారదుని చేష్టలు తెలిసిన శ్రీకృష్ణ భగవానుడు ఒక రూపము ధరించి సత్యభామాదేవి మందిరమున కేతెంచెను. వచ్చిన తక్షణము ఆయన తన దేవితో "ప్రియా! నేను గోమతీ తీర్థమున కేగలేదు. అన్న గారయిన బలరాముడు వదినతో కలసి వెళ్ళెను. నేను భోజనమునకు వచ్చితిని" అని పలికెను. ఆ మాటవిని సత్యభామాదేవి ప్రసన్నురాలెయ్యెను. నారదుడు భయభీతుడై వేరొక మందిరమున కేగెను.

ఆయన జాంబవతీ గృహమున కేగి తిరిగి ఈ విషయము ప్రస్తావించెను. అంత జాంబవతీ దేవి చిరునవ్వుతో "మునీంద్రా! అసత్యము పలుకవలదు. శ్రీనాథుల వారు భోజన మారగించి శయనించుచుండిరి." అంత నారదుడు మిత్రవిందా గృహమున కేగి ఇట్లనియె "అమ్మా! రాజ దంపతుల సమాజమునకు నీవు వెళ్ళలేదా? ఇంటిలో ఎందుకు కూర్చుంటివి? అక్కడ రమా వల్లభుడయిన శ్రీకృష్ణుడు రుక్మిణీ, సత్యభామా, జాంబవతీ సహితుడై గోమతీ జలములు తెచ్చుట కేగెను. మిత్రవింద "దేవర్షీ! కేశవునకు సర్వులూ ఇష్టులే! ఆయన ఎవరిని విడిచి వెళ్ళునో వారు జీవింపనోపరు. ఇంటిలోపల చూడవలసినది. ఆయన అక్కడ తన మనుమనితో పోట్లాడుచూ క్రీడించుచుండెను." అంత ఆ మహర్షి లేచి సర్వ శ్రీకృష్ణ పత్నుల ఇండ్లకు వెడలెను. అంత ఆయనకు శ్రీకృష్ణ భగవానుని ఉనికి అర్థమయ్యెను. అంత ఆయన ఈ సమాచారమును తెలుపుటకు గోపాంగనా భవనమునకు శ్రీరాధాదేవి వద్దకు ఏగెను. అచట నందనందనుడు వారితో పాచికలాడుచుండెను. అక్కడనుండి త్వరగా చేతిని పట్టుకొని, కూర్చుండ బెట్టి, విధి విధానముగ పూజించి ఇట్లనియె.

"విప్రవర్యా! మీరు ఏపనిపై ఏతించిరి? వ్యర్థముగ ఇటునటు తిరుగుచుండిరి. నేను నా పత్నుల ఇండ్లయందు మిమ్ములను కాంచితిని. మునిశ్రేష్ఠా! మీ భయము వలననే నేను ఇన్ని రూపములు దాల్చితిని. మీరు బ్రాహ్మణులు. అందువలన దండనకు అనర్హులు. కానీ ప్రార్థించుచున్నాను. నేను సర్వులకు దేవుడను. నాకు బ్రాహ్మణులు దేవుడు. బ్రాహ్మణ ద్రోహము కావించు మూఢుడు నాకు శత్రువు. ఎవరు బ్రాహ్మణులను నా రూపముగ భావించి పూజించెదరో వారు ఇహలోకమునందు సుఖములు భోగించి పరమున నా ధామమున కేతెంచెను. దేవర్షీ! నీవు నా పురము నందు నా మాయచే మోహితుడవైతివి. ఇది తలచి బాధపడవలదు. బ్రహ్మ రుద్రాది దేవతలు సహితము నా మాయ యందు పడి మోహితులగుదురు." భగవానుని వచనములాలకించి, నారద మహర్షి భగవానుని ప్రశంశించి, నిశ్శబ్దముగ ఋత్విజులున్న మండపమున కేగెను. అక్కడ శ్రీకృష్ణ సహితులైన నరపతులు, రుక్మిణీదేవి ఆదిగా గల అతివలు, నానా విధములయిన

బాజా భజంత్రీలతో గోమతీ తటమునకు ఏగిరి. అచట గోవింద భగవానుని యశస్సు కంకణ, నూపుర ధ్వనులతో కూడి మధురముగ గానము చేయబడుచున్నది. గర్గుడు, వ్యాసుడు జలాధిదేవతల నారాధించి ఒక జల కలశమును అనసూయ దేవికి ఇచ్చిరి. తదుపరి రేవతీ మొదలగు స్త్రీలు జలకలశములు ఎత్తుటకు యత్నించిరి. కానీ అది వారి కోమల హస్తముల వల్ల కాలేదు.

పూలభారము చే పీడితులగు కోమలాంగులు జల కలశములను ఎట్లు ఎత్తగలరు? అంత ఆ పూబోణులు మందహాసము కావించుచూ "ఇపుడు జల కలశముల వినా మనము యజ్ఞ మండపముల కెట్లు వెళ్ళగలము" అని ప్రశ్నించిరి. అపుడు రుక్మిణీదేవి ఆదిగా గల లలన లందరూ శ్రీకృష్ణుని భక్తితో స్మరించి ఇట్లనిరి "హే! కృష్ణా! జగన్నాధా! భక్తుల కష్టములను నివారించు చక్రధారీ! మీరు సర్వశక్తి సంపన్నులు. ఈ సంకటమందు మమ్ము రక్షింపవలసినది." ఈ విధముగ పలికిన వెంటనే ఆకలశములు భారహీనమయినవి. వారు రత్న ముత్య మండితమయిన వారి శిరములందు ఆ జలకుంభములనుంచుకొని, వారి పతులతో శీఘ్రముగ యజ్ఞమండపమున కేతెంచి శ్యామకర్ణ సహితుడై ఉగ్రసేనుడున్న స్థలమందుంచిరి.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదమందలి "గోమతీ జలములు తెప్పించుట" అను ఏబది అయిదవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఆరవ అధ్యాయము

(విభిన్న బంధువర్గమును విభిన్న కార్యములందు నియోగించుట; శ్రీ కృష్ణుని బ్రాహ్మణ చరణ దోహనము నందు నియోగించుట; నిరంతర గోఘృత ఆహుతి చే అగ్ని దేవునకు అజీర్ణము కలుగుట; యజ్ఞపశువు యొక్క తేజము శ్రీకృష్ణుని యందు ప్రవేశించి, దాని శరీరము కర్పూరముగ రూపాంతరము చెందుట; యజ్ఞ సమాప్తి యందు అవభృత స్నానము)

శ్రీ గర్గాచార్యుల వారు "ఉగ్రసేనుడు తన బంధువర్గము నంతటినీ యజ్ఞ పరిచర్య యందు నియోగించెను. ఆయన విభిన్న కార్యములకు విభిన్న వ్యక్తులను నియమించెను. భీమసేనుని వంటశాలాధ్యక్షునిగనూ, ధర్మజుని ధర్మపాలన సిబ్బంది యొక్క కర్మ మందునూ, సత్పురుషుల సేవాతత్పరతకు అర్జునుని, విభిన్న ద్రవ్య సేకరణకు నకులుని, పూజన కర్మకు సహదేవుని, ధనాధ్యక్షునిగ దర్యోధనుని, దానకర్మ యందు కర్ణుని, సేవించుట అను కార్యక్రమమునకు ద్రౌపదీదేవిని, రక్షణ భాధ్యతకు శ్రీకృష్ణుని పద్దెనిమిది మంది మహారధులయిన పుత్రులను, నియోగించెను. అట్లే వివిధ కార్యక్రమములకు యుయుధానుని, విదీర్ణ, హృదీక, విదుర, అక్రూర, ఉద్దవాదులను నియుక్తులను గావించెను. అంత శ్రీకృష్ణుని "దేవా! మీరు ఏ కార్యమును సంభాళించెదరు?" అని ప్రశ్నించెను. అంత శ్రీకృష్ణుడు "మహారాజా! నేను బ్రాహ్మణుల పాదములు కడుగు పనిని స్వీకరించెదను. నేను ఇంద్రప్రస్థము నందునూ ఇదియే కావించితిని." ఇదివిని బ్రహ్మాది దేవతలు, భూతలమందు మనుష్యులు నవ్విరి. ఈ విధముగ పలికి శ్రీకృష్ణుడు తపస్వులయిన మునుల, ఋషుల పాదములు కడిగి యధా యోగ్యమయిన ఆసనము లందు ఆశీనుల కావించెను. పిదప వారికి అనేక విధములయిన వస్త్రభూషణములు అర్పించి పన్నెండు విధముల తిలక ధారణ కావించెను. అనేక ఆసనములందు ఆశీనులై ఆ ముని ఋషి గణములు యజ్ఞ మండపమందు దేవతల వలె శోభించిరి.

తదుపరి విభిన్న వస్తువుల అర్థులయిన వారు (భిక్షకులు, విరక్తులు, క్షుధార్తులు, అర్థులు) ఏతెంచి "రాజా! మాకు

అన్నము, పాత్రలు, వస్త్రములు ఇమ్ము" అని అర్థించిరి. మునివరులు, మహారాజ సమ్మేళనముతో మునిగియున్న ఉగ్రసేనుడు ఈ కరుణా క్రందన విని మిక్కిలి ఉత్సాహముతో వారికి అన్నము, బంగారము, వెండి, వస్త్రములు, వంట పాత్రలు, రథ, గజ, హయ, గోవులు, చత్రములు, శిబికలు, ఇటువంటి వెన్నంటినో దానమొనర్చెను. ఎవరెవరికి ఏది ఇష్టమో, మహారాజు వారికది ప్రసాదించెను. యజ్ఞ కర్మయందు దీక్షితుడయిన అసి పత్రధారి ఉగ్రసేన మహారాజు స్నానము చేసి, రాణి రుచిమతీ సహితుడై మిక్కిలి శోభించెను. వేదశాస్త్ర విశారదుడయిన వ్యాసుడు, జ్యోతిశ్శాస్త్ర శిరోమణి అయిన శ్రీ గర్గాచార్యులవారు, ఇరువది వేల ఋత్విక్కులు ఆ శ్రేష్ఠ యజ్ఞమును కావించుచుండిరి. అగ్ని కుండమందు ఏనుగు తొండము వంటి ధారతో బ్రహ్మ వేత్తలయిన బ్రాహ్మణులచే నెయ్యి పోయబడుచున్నది. శ్రీకృష్ణ కృపచే అగ్ని దేవునకు అజీర్తి గలిగినది. ఆయన సర్వులు వినుచుండగా మహారాజుతో "నేను సంతృప్తుడను. ఇక నాకు యజ్ఞపశు వును ఈయవలసినది." అగ్ని దేవుని పలుకులాలకించి మునీంద్ర సహిత ఉగ్రసేనుడు స్వర్ణ రజ్జువుతో బంధింపపడిన శ్యామ కర్ణము వద్ద కేతించి ఇట్లనియె.

"ఓ! అశ్వమా! నీవు అగ్ని దేవుని పలుకులు వింటివి. ఆయన ఘృతము చే సంతృప్తినొందిన పిదపనే యజ్ఞ పశు వును ఆహారముగ తీసికొనును." మహారాజు యొక్క పలుకులు విని శ్యామ కర్ణము ప్రసన్నమై, శ్రీకృష్ణుని వైపు చూచుచూ, తనకు సమ్మతమే అన్నట్లు తల వాల్చెను. తక్షణము ఆ అశ్వము శరీరము నుండి ఒక జ్యోతి బయటకు వచ్చి సర్వుల చూచుచుండగా మధుసూదనుని యందు లీనమయ్యెను. ఆ అశ్వము శరీరము కర్పూరమై నేల రాలెను. ఆ అద్భుత కర్పూర రాశిచే యజ్ఞ మండపము, మరియు ద్వారకా పురి అంతయు సుగంధ భరితమయ్యెను. ఈ అద్భుతమును గాంచి వ్యాసాది ఋత్విక్కులు ఉగ్రసేనుని తో "మహారాజా! నీ యజ్ఞము ఉత్తమ ఫలము నిచ్చును. ఇపుడు మేము ఈ కర్పూరము తోడనే హవనము కావించెదము. నీవు కూడా అట్లే చేయవలసినది." ఈ విధముగ పలికి సమస్త ఋత్విజులు ఆ కర్పూరము తోడనే హవనము గావించిరి. చతుర్వ్యూహ ధారి అయిన సాక్షాత్ పరమేశ్వరుడు తన పుత్ర పౌత్రులచే పరివేష్ఠితుడై యున్న చోట ఏ వస్తువు దుర్లభము? అంత గర్గుడు మహేంద్రుని తో "శక్ర భగవాన్! ఈ హవనము నందు కర్పూర హారతి తీసికొని వలసినది. ఇకముందు వచ్చు కలియుగమున ఇటువంటి హారతి లభ్యమగుట అసంభవము." అది విని ఇంద్రుడు మందస్మితుడై "మహర్షీ! కౌరవ పాండవ సమరమయిన పిదప ధర్మరాజు యుధిష్ఠిరుడు హస్తిన యందు కావించు అశ్వమేధము నందు నేను పున:హారతిని స్వీకరింతును. మీరు దీనిని దుర్గభమని ఎందుకు పేర్కొనిరి?" ఇంద్రుడు పలకిన పలుకులు విని మునులందరూ దానిని సత్యమని భావించిరి. తదుపరి దేవతలందరికి ఆహుతులు సమర్పించిరి.

ఆ కర్పూర హోమముతో చరాచర జగత్తు ప్రసన్నమయినది. పిదప ఉగ్రసేన మహారాజు శ్రీకృష్ణాది యాదవులతో, ఇతర భూపాలురతో, బ్రాహ్మణులతో కలసి పిండారక తీర్థము నందు అవభృత స్నానమాచరించెను. వేదోక్తవిధిగా స్నానమాచరించి, పట్టు వస్త్రములు ధరించి మహారాజు రాణి సమేతుడై దక్షిణా సహిత యజ్ఞ పురుషుని వలె శోభించెను. ఆ సమయమున మానవ దేవ దుందుభులు మ్రోగినవి. పుష్పవృష్టి కురిసినది. పిదప స్వధాపానము చేయించి పురోడాశమును ప్రాశనము గావించి, యజ్ఞ శేషమును సర్వులకు ప్రసాదముగ పంచెను. తదుపరి దేవకీ ఆదిగా గల పుణ్యస్త్రీలు ఆయనకు హారతినిచ్చిరి. అనంతరము తనకు హారతినిచ్చిన అతివలకు మహారాజు అనేక విధములయిన రత్న, వస్తు, అలంకార భూషణములు సమర్పించెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి ఉగ్రసేన మహారాజుకు అభిషేకము అను ఏబది ఆరవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఏడవ అధ్యాయము

(బ్రాహ్మణ భోజనము, దక్షిణా దానములు, పురస్కార వితరణ, సంబంధుల సన్మానములు, దేవతలాదిగా గల వారలు తమ తమ నివాసముల కేగుట)

శ్రీగర్గాచార్యులు "మహారాజా! తదనంతరము శ్రీకృష్ణ భీమసేనులు వంటవారి ద్వారా అనేక పదార్థములు చేయించి, బ్రాహ్మణులను, ఇతర రాజులను పూజించి, షడ్రసోపేతమయిన మృష్టాన్న భోజనము పెట్టించెను. వంట బ్రాహ్మణులను నియోగించి పూరీలు, పాయసము, పప్పు, పెరుగు, హల్వా, ఫేణీ మొదలగు దివ్య పదార్థములతో, అన్న రాశులతో భోజనములు వడ్డించెను. కొందరు బ్రాహ్మణులు ఫలములు, కొందరు ఎండుటాకులు, కొందరు కేవలము జలము, కొందరు దర్భరసము, కొందరు కేవలము గాలిని మాత్రమే భుజించెదరు. కొందరికి భోజనము మాట మాత్రము తెలియదు. వారి ముందు ఈ విధములయిన భక్ష్య, భోజ్య, లేహ్య, చోష్య పదార్థములు వడ్డింప పడినపుడు వారు విస్మితులైరి. వారు కొందరు సోంపాపిడిని మాలతీ పుష్పములనీ, లడ్డూలను ఫలములనీ, కొందరు పాయసము, ఫేణీలను గాంచి చంద్రబింబమని భ్రమ పడిరి. కొందరు అప్పడములను పలాశ పత్రములని, మరికొందరు మధశీర్షికమను పిండివంటను మామిడి పండని భ్రమపడిరి.

కొందరు పచ్చళ్ళను, లస్సీలను చందనమని తలంచిరి. కొందరు చక్కెరను చూచి ఇసుకని భ్రమపడిరి. ఈ విధముగ ఆ బ్రాహ్మణులందరూ భోజనము కావించి కొందరు పాలు, ద్రాక్షరసము, మామిడి రసము, ఇట్లు పలు విధములయిన రసములు ఆస్వాదించి భుక్తాయాసముతో క్రిందపడిరి. అంత శ్రీకృష్ణ భీమసేనులు ఆ మునులతో పరిహాసమాడుచూ "మునులారా! మీకు ఏ భోజనము కావలెనో మాకు తెలుప వలసినది. మేము ఆ భోజనమును వెంటనే ప్రస్తుతించెదము." వారి మాటలను విని మునులందరూ పరస్పరము ముఖములు చూచుకొని, పరమానంద భరితులై మందస్మితులై మౌనముగ యుండిరి.

తెలుగు, కర్ణాటక, గుజరాత్, గౌధ, సనాఢ్య మొదలగు అనేక జాతుల బ్రాహ్మణ శిరోమణులను రాజాధిరాజైన ఉగ్రసేనుడు వస్త్ర, సువర్ణ, రత్నరాశులతో సత్కరించి, వారి చరణముల యందు తన మస్తకముంచి నమస్కరించెను. యజ్ఞాంతము నందు మొదట ఉగ్రసేనుడు గర్గాచార్యుల వారికి ఒక లక్ష గుర్రములు, ఒక వేయి ఏనుగులు, రెండు వేల రథములు, లక్ష ధేనువులు, వంద బారువుల సువర్ణము, దక్షిణగా విధి విధానముగ సమర్పించెను. దానికి అర్ధ దక్షిణ వ్యాసునకు, బకదాల్భ్యునకు ఒసగెను. తదుపరి ఋత్విక్కులుగ వేయి గుర్రములు, వంద గజములు, రెండు వందల రథములు, వేయి ధేనువులు, ఇరువది బారువుల బంగారము దక్షిణగా సమర్పించెను. పిదప యజ్ఞమునకు విచ్చేసిన ప్రతి బ్రాహ్మణునకు ఒక రథ, గజ, హయ, గోవు, ఒక బారువు సువర్ణము మరియు రెండు బారువుల వెండి బహూకరించెను. ఆ మహా యజ్ఞమందు ద్వారకాపురి అమరావతి వలె వెలిగి పోయెను.

ఆ సమయమున వంది, మాగధ, సూత, గాయక, వైతాళిక, వారాంగనలు ద్వారము వద్దకు వచ్చిరి. అచట వీణా, వేణు, మృదంగ, తాళ, దుందుభి, ధ్వనులతో, సంగీత, నృత్య, వాద్యములతో, మహోత్సవము జరుగుచుండెను. అంతేగాక సంగీత, గీతములతో పాటు సామగానము కూడ గానము చేయబడుచున్నది. నర్తకీమణులు తమ కుంకుమ రంగు వస్త్రములు ఎగురవేయుచూ సంగీత, నృత్యములు చేయుచుండిరి. ఆ ఉత్సవమున పాల్గొనిన వారందరికీ మహారాజు మేఘము వలె ధన వర్షము కురిపించెను. వారందరూ మిక్కిలి ఆనంద పరవశులయిరి. తదుపరి భూపాల శిరోమణి అయిన ఉగ్రసేనుడు అచటికి వచ్చిన రాజులందరికీ ఒక్కొక్కరికీ ఒక లక్ష గుర్రములు, వేయి ఏనుగులు, వంద శిబికలు, కుండలములు, కంకణములు, ముప్పది బారువుల సువర్ణము సమర్పించెను. దీనికి ద్విగుణీకృతమయిన సంపద నందాది గోపికులకు, గదాది సమస్త యాదవులకు సమర్పించెను. యశోదాది గోపాంగనలకు దేవకీ మొదలగు యదుకుల స్త్రీలకు, రుక్మిణీ, శ్రీ రాధికా మొదలగు శ్రీహరి పట్టపురాణులకు అనేక దివ్య వస్త్రాలంకారములు సమర్పించి సంతుష్టుల కావించెను.

చివర, మహారాజు మిక్కిలి ప్రసన్నుడై గర్గాచార్యుల వారికి వంద గ్రామములు ఇచ్చెను. కానీ ఆయన ఆ వంద గ్రామములను అక్కడ యున్న బ్రాహ్మణులకు దానముగ సమర్పించెను. పిదప శ్రీకృష్ణ బలరాములను వస్త్ర, భూషణ, తిలక, పుష్పహార, నీరాజనములాదిగా గల ఉపచారములచే పూజించెను. అంత శ్రీకృష్ణుడు నవ్వుచూ "మహారాజా! ఈ మహాయజ్ఞ మందు మీరు సమర్థులయినప్పటికీ నాకు ఏదియును ఈయలేదు. అంత ఉగ్రసేన మహారాజు "జగదీశ్వరా! మాధవా! మీరు బలరామ సహితులై శీఘ్రమే యథోక్త దక్షిణ తీసికొనవలసినది." అని పలికి ప్రేమ విహ్వలుడై తన అశ్వమేధ, రాజ సూయ యజ్ఞ ఫలితమును సంపూర్ణముగ శ్రీకృష్ణునికి సమర్పించెను. ద్వారక యందు జయజయ ధ్వానములు మిన్ను ముట్టినవి. దేవతలు పుష్పవృష్టి కురిపించిరి. తదనంతరము సంపూర్ణ దేవతలు తమ తమ భాగములు తీసికొని స్వర్గమునకు తిరిగి వెళ్ళిరి. ఆ ప్రకారముగ దైత్యులు, పశువులు, పక్షి, వానర, సర్ప, పర్వత, గో, వృక్ష, నది, తీర్థ, సముద్రములు అన్నియు తమ తమ భాగములు తీసికొని సంతుష్టులై యథాస్థానముల కేగిరి. ఎవరెవరు రాజులు అక్కడికేతించిరో వారందరూ దాన మర్యాదల చే సంతుష్టులై, తమ సేనలతో భూమిని కంపింపజేయుచూ యథా స్థానములకు చనిరి. నందాది సమస్త గోప జనము శ్రీకృష్ణుని చే పూజింపబడి, ఆయన విరహము నను భవించుచూ వ్రజభూమికి ఏగిరి. ఈ విధముగ ఉగ్రసేన మహారాజు శ్రీకృష్ణ కృపచే తన మనోరథమును పూర్ణము కావించుకొని నిశ్చింతుడయ్యెను.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి విశ్వ భోజ్య దక్షిణాది వర్ణనమను ఏబది ఏడవ అధ్యాయము సమాప్తము)

ఏబది ఏనిమిదవ అధ్యాయము

(శ్రీకృష్ణుని ద్వారా కంసాదుల ఆవాహన; వారు శ్రీ కృష్ణునే పరమ పితగా భావించి ఈ లోకము నందలి మాతా పితరులను కలువక వైకుంఠమున కేగుట)

శ్రీ గర్గాచార్యులు "నృపేశ్వరా! అటు పిదప శ్రీకృష్ణ పరమాత్ముడు కంసాదులను ఆవాహన చేసెను. కంసుడు తన సోదర సహితుడై అచట కేతించి ఎల్లరూ విస్మితులై చూచుచుండగా వేరు వేరుగా శ్రీకృష్ణ, బలరామ, ప్రద్యుమ్న; అనిరుద్ధులకు భక్తితో ప్రణామము కావించెను. సుధర్మ సభయందు ఇంద్ర సింహాసనము నందు ఆశీనులయిన ఉగ్రసేన, రచిమతీ దేవులకు తమ పుత్రులు చతుర్భుజులై శ్రీకృష్ణ స్వరూపులై కానబడిరి. అంత వారు మిక్కిలి ప్రసన్నులయిరి. కంసాదులు శ్రీకృష్ణ పార్శ్వమున నిలబడిరి. అంత మహారాజు వారిని తన దగ్గరకు పిలచెను. అంత భగవానుడు వారితో "వీరిరువురు ఈ లోకము నందు మీకు మాతా పితరులు. మిమ్ము చూచుటకు మిక్కిలి ఉత్సుకలగు చున్నారు. మీరు వారి వద్దకు వెళ్ళి వినమ్రులై నమస్కరించవలసినది." శ్రీకృష్ణుని పలుకులు విని అత్యంత కింకర భావ యుక్తులై కంస, న్యగ్రోదాది వీరులు నవ్వుచూ ఇట్లనిరి. "నాథా! మాయ చే సంసార చక్రమందు భ్రమించుచూ మేము ఇటువంటి మాతా పితరులను ఎంతో మందిని చూచితిమి. కేవలము శ్రీహరి మాత్రమే జీవులకు తండ్రి యని శృతి ఘోషించుచున్నది. ఇపుడు మీ వద్ద నిలుచుని వేరొకరిని మాతా పితరులుగ మేము అంగీకరింపలేము. పూర్వకాలమందు యుద్ధ సమయమున మేము మిమ్ము దర్శించితిమి. తదుపరి ప్రద్యుమ్న, అనిరుద్ధుల ప్రాదుర్భావమయినది. అది మేము చూడలేదు. చతుర్వ్యూహము నందు మిమ్ములను చూచుటకు మాత్రమే మేము ఇచటకు ఏతించితిమి. ఆహా! ఏమి మా సౌభాగ్యము. మేము శ్రీకృష్ణ, బలభద్ర, ప్రద్యుమ్న అనిరుద్ధులను నలుగురు పరిపూర్ణతమ మహా పురుషులను సందర్శించితిమి. ఏ పూర్వ పుణ్య ప్రభావమున యోగులకు సహితము దుర్లభమయిన ఏ చతుర్వ్యూహ దర్శనము మాకు కలిగినదో మేమెరుగము. "ఓ! శ్రీకృష్ణా! సంకర్షణా, ప్రద్యుమ్నా, అనిరుద్ధా! మేము మూఢులము. కుబుద్ధులము. మా అపరాధములు మన్నింప బడుగాక!

గోవిందా! ఇక వైకుంఠ ధామమునకు తిరిగి రావలసినది. మీరు లేక వైకుంఠము శూన్యముగ గోచరించుచున్నది. మీరుండుట చే ద్వారక వైభవశాలిని, ధన్య అయినది. బ్రహ్మ, ఇంద్ర, అగ్ని, సూర్య, శివ, మరుద్గణ, యమ, కుబేర, చంద్ర, మరియు వరుణాదులు ఎవరి చరణారవిందములను పూజింతురో మేము వానిచే సదాభజింతుము. గొప్ప గొప్ప మునీశ్వరులు, దేవతలు, లక్ష్మీదేవి, భక్తజనులు, సాత్వికులు, గంధ చందన, ధూప అక్షత, లాజ, దూర్వాంకుర తాంబూలముల చే ఏ చరణములను పూజింతురో ఆ చరణార విందములను మేము సహితము ఆరాధించెదము." ఈ విధముగ పలికి కంసుడు సహోదరసహితుడై వైకుంఠధామమున కేగెను. పత్నీ సహితుడై ఉగ్రసేన మహారాజు ఆశ్చర్య చకితుడయ్యెను.

(శ్రీ గర్గ సంహితయందు అశ్వమేధ ఖంగార్గతమున గర్గ వజ్రనాభ సంవాదము నందలి కంసాదుల ఆవాహన అను ఏబది ఎనిమిదవ అధ్యాయము సమాప్తము)

ఏబది తొమ్మిదవ అధ్యాయము

(శ్రీ గర్గాచార్యులు ఉగ్రసేనునకు శ్రీకృష్ణ సహస్ర నామమును వర్ణించుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! తదుపరి ఉగ్రసేనుడు తన పుత్రుని యందలి ప్రేమ బంధనమును త్రెంచుకొని, విశ్వమంతయు కేవలము మనో సంకల్పమని తెలిసికొని వేదవ్యాసుని ఒక సందేహ మడిగెను. "బ్రహ్మన్! మానవుడు ఏ విధముగ లౌకిక సుఖములు పరిత్యజించి పరబ్రహ్మ పరమాత్మ అయిన శ్రీకృష్ణుని భజింప గలుగును? దీనిని నాకు తెలియపరుచవలసినది." వ్యాసుడు "మహారాజా! నేను నీకు ఒక హితకరమయిన విషయమును బోధించుచున్నాను. ఏకాగ్ర చిత్తుడవై వినుము. రాజేంద్రా! నీవు శ్రీ రాధాకృష్ణులను ఉత్కృష్టము గ ఆరాధించుము. వీరిరువురికి సహస్రనామములు కలవు. వాని ద్వారా వీరిరువురిని మిక్కిలి భక్తి భావముతో భజింపుము. రాధా సహస్ర నామమును భగవంతులైన బ్రహ్మ, శివుడు, నారదుడు, అప్పుడప్పుడు నా వంటి సాధారణ మానవులు సహితము పారాయణ చేయుదురు." ఉగ్రసేనుడు "బ్రహ్మన్! నేను పూర్వకాలమున సూర్యగ్రహణ సమయమున కురుక్షేత్రమందు, ఒక ఏకాంత దివ్య శిబిర మందు నారద మహర్షి ముఖతా "రాధా సహస్ర నామావళి" ని వినియుంటిని. కానీ అనాయాసముగ మహా కార్యములు (గొప్ప పనులు) కావించు "శ్రీకృష్ణ సహస్రమును" నేను వినియుండలేదు. మీరు దయచేసి నాకు ఆ దివ్య నామములను తెలుప వలసినది."

వ్యాసుడు ప్రసన్నుడై ఉగ్రసేనుని ప్రశంశించి, శ్రీకృష్ణ పరమాత్మ వైపు చూచుచూ ఇట్లనియె "నేను పరమ సుందరమయిన శ్రీకృష్ణ సహస్రమును నీకు వినిపించెదను. పూర్వము స్వయముగ శ్రీకృష్ణ ప్రభువు గోలోకమున శ్రీరాధాదేవికి ఈ దివ్య నామములు ఉపదేశించెను." భగవానుడు "ప్రియా! ఈ సహస్రనామ స్తోత్రావళి మిక్కిలి రహస్యమైనది. ఇది ఎల్లరకు తెలిసిన ఎడల హాని కలుగును. కేవలము ఎవరికి అధికారము కలదో వారికి మాత్రమే తెలుపవలెను. ఈ స్తోత్రము సంపూర్ణ సుఖదాయకము, మోక్ష ప్రదాయకము, కళ్యాణ స్వరూపము, ఉత్కృష్ట పరమార్ధ రూపి, సమస్త పురుషార్థ ప్రదాయిని. ఈ సహస్రము కేవలము నా రూపము. ఎవరు దీనిని పఠించెదరో వారు నా రూపము నొందెదరు. ఏ శఠునకు గానీ, డంభాచారికి గానీ, దీనిని ఉపదేశించరాదు. ఎవరు కరుణాచిత్తుడో, గురుభక్తి పరాయణుడో, సత్పురుషుల సేవకుడో, అరిషడ్వర్గ రహితుడో, శ్రీకృష్ణ భక్తుడో, అతనికి మాత్రమే దీనిని ఉపదేశింప వలెను.

ఓం అస్యశ్రీకృష్ణ సహస్రనామ స్తోత్ర మంత్రస్య; నారాయణ ఋషి: భుజంగ ప్రయాతల ఛంద:, శ్రీకృష్ణచంద్రో దేవతా, వాసుదేవో బీజమ్, శ్రీ రాధా శక్తి: మన్మధ: కీలకమ్; శ్రీ పూర్ణ బ్రహ్మ కృష్ణచంద్ర భక్తి జన్యఫల ప్రాప్తయే జపే వినియోగ:॥

ధ్యానమ్

శిఖి ముకుట విశేషం నీల పద్మాంగదేశమ్
విధుముఖ కృతకేశం కౌస్తుభా పీత వేషమ్ ।
మధుర రవ కలేశం శంభజే భ్రాతృశేషమ్
వ్రజ జన వనితేశం మాధవం రాధికేశమ్ ॥

హరి = భక్తుల పాపములను హరించువాడు దేవకీ నందన = దేవకీ పుత్రుడు/తన ఆవిర్భావము చే దేవకీ దేవికి ఆనందము కలుగ జేయువాడు కంసహంతా = కంసుని వధించిన స్వామి పరాత్మా = పరమాత్ముడు; పీతాంబర: = పీతవస్త్రధారి; పూర్ణ దేవ: = పరిపూర్ణ దేవత; రమేశ: = రమా వల్లభుడు, కృష్ణ: = అందరినీ తన వైపుకు ఆకర్షించువాడు; పరేశ: = బ్రహ్మాది దేవతలను సహితము నియంత్రించువాడు పురాణ: = అనాది పురుషుడు; సురేశ: = దేవతలపై కూడా ఆధిపత్యము కలవాడు; అచ్యుత: = తన పధము నుండి ఎన్నడూ చ్యుతుడు కాని వాడు; వాసుదేవ: = సమస్త ప్రాణికోట్ల అంత: కరణములనందు నివసించు వాడు. దేవ: = ప్రకాశ స్వరూపుడు, ధరా భారహర్తా: = ఫృధివీ భారము హరించు వాడు; కృతీ: = కృతకృత్యుడు రాధికేశ: = రాధా వల్లభుడు పర: = సర్వోత్కృష్టుడు. భూవరే: = ఫృధివి యొక్క స్వామి. దివ్య గోలోకనాద: = దివ్య గోలోకము యొక్క పతి; సుధామ్న స్థధా రాధికాశాపహేతు: = రాధికా సుదాముల పరస్పర శాప కారణుడు, ఘ్రుణీ = దయాళువు; మానినీ మానద: = మానినిలకు మానము నిచ్చువాడు; దివ్యలోక: = దివ్యధామ స్వరూపుడు; లసద్గోపవేశ: = సుందర గోప వేషధారి; అజ: = జన్మము లేనివాడు, రాధికాత్మా = రాధిక యొక్క ఆత్మ అయినవాడు; చలత్కుండల: = మెరయుచున్న కుండలముల కలవాడు. కుంతలీ = ఉంగరములు తిరిగిన ముంగురులు కలవాడు. కుంతలస్త్రక = కేశరాశి యందు పుష్పధారణ చేసినవాడు. కదాచిత్ రాధయా రధస్య: = అప్పుడప్పుడు శ్రీ రాధికా సహితుడై రధము నందు విరాజమానమైనవాడు; దివ్యరత్న: = దివ్యరత్నదారి; సుదాసౌధ భూచారణ: = సుధా సౌధ భూములందు విహరించువాడు; దివ్యవాసా: = దివ్య వస్త్రధారి; కదాబృంద కరణ్యచారీ = అప్పుడప్పుడు బృందావనమందు చరించువాడు; స్వలోకే మహారత్న సింహాసనస్థ: = తనధామమందు విశాలము, బహుమూల్యము అయిన సింహానమందు విరాజమానుడు; ప్రశాంత: = పరమ శాంతుడు; మహాహంస భైశ్చామరై వీజ్యమాన: = గొప్ప హంసల వంటి చామరముల చే వీవబడువాడు. చలచ్ఛత్ర ముక్తావళీ శోభమాన: = ఊగుచున్న ముత్యముల మాలలు కట్టబడిన శ్వేత ఛత్ర ఛాయన విరాజమానమైనవాడు; సుఖీ = ఆనంద స్వరూపుడు; కోటి కందర్ప లీలాభిరామ: = కోట్లాది కామదేవుల లావణ్యము కలవాడు. క్వణన్నూ పురాలంకృతంఘ్రి: = మోగుచున్న నూపురములు దాల్చినవాడు; శుభాంఘ్రి: = శుభ లక్షణ సంపన్నమయిన పాదములు కలవాడు, సుజామ: = సుందరమయిన మోకాళ్ళు గలవాడు. రంభాశుభోరు: = కరలీతరువుల వంటి తొడలు కలవాడు. కృశాంగ: = కోమలమయినవాడు; ప్రతాపీ = ప్రతాపశాలి; ఇభశుండసుదొర్దండఖండ: = ఏనుగు తొండముల వంటి సుందర భుజ దండములు కలిగిన వాడు; జపాపుష్ప హస్త: = జపాకుసుమముల వంటి ఎర్రని అరచేతులు కలవాడు; శాత్‌దరశ్రీ: = సన్ననినడుము కలవాడు.

మహాపద్మ వక్షస్థల: = వక్షస్థలమందు పద్మమాలా విరాజితుడు; చంద్రహాస: = వెన్నెలవంటి మందహాసము కలవాడు; లసత్కుంద దంత: = మల్లెమొగ్గల వంటి ఉజ్వల కాంతి గలిగిన దంతములు కలవాడు. బింబాధరశ్రీ: = పండిన దొండపండ్ల వంటి అధరములు కలవాడు; శరత్పద్మనేత్ర: = శరత్కాల ప్రఫుల్ల కమల దళముల వంటి నేత్రములు కలవాడు; కిరీటజ్వలాభ: = ఉజ్వల కాంతియుతమయిన కిరీటము ధరించినవాడు; సఖీకోటీభిర్వృత్తమాన: = కోట్లాది సఖులతో శోభించువాడు; నికుంజే ప్రియారాధ్యా రాససక్తు: = నికుంజమందు శ్రీ రాధాదేవి తో రాసలీలా తత్పరుడు. నవాంగ: = తన దివ్యాంగములు నిత్యనూతనముగ, రమణీయత కలిగినవాడు; ధరాబ్రహ్మ రుద్రాధిభి:ప్రార్థిత:సంధరా భారదూరీ క్రియార్ధ ప్రజాత: = పృధ్వి, బ్రహ్మ, రుద్రాదుల ప్రార్ధనచే పృధివీ భూర హరణకొరకు అవతారము స్వీకరించినాడు, యదు: = యదుకుల ప్రవర్ధితుడు; దేవకీ సౌఖ్యద: = దేవకీ దేవికి సుఖదాయకుడు; బంధనచ్ఛిత్ = భవబంధములు ఛేదించువాడు; సశేష: = శేషావతారమయిన బలరామునితో విరాజమానమయిన వాడు. విభు: = వ్యాపకుడు/సర్వ సమర్ధుడు; యోగమాయీ = యోగమాయను ప్రవర్తింపజేయువాడు; విష్ణు: = వ్యాపకత్వము కలవాడు; వ్రజే నందపుత్ర:

= వ్రజమండలమందు నందనందనునిగా లీలలు గావించినవాడు; యశోదాసుతాఖ్య: = యశోదా పుత్రునిగ విఖ్యాతుడు; మహాసౌఖ్యద: = గొప్ప సౌఖ్యప్రదాత; బాలరూప: = శిశురూపధారి; శుభాంగ: = శుభ లక్షణ సంపన్నమయిన శరీరము కలవాడు; పూతనా మొక్షద: = పూతనకు మోక్షదాయకుడు; శ్యామరూప: = సుందర శ్యామరూపధారి, దయాళు: = కృపాళువు; అనోభంజన: = శకటమున భంజించినవాడు; పల్లవాంఘ్రి: = నూతన పల్లవముల వంటి ఎర్రని పాదములు కలవాడు; తృణావర్త సంహారకారీ = తృణావర్తుని సంహరించిన వాడు; గోప: = గోపాల రూపుడు; యశోదాయ: = యశోదయొక్కయశ: రూపుడు; విశ్వరూప ప్రదర్శ: = తన విశ్వరూపమును దర్శింపజేసినవాడు; గర్గ దిష్ఠ: = గర్గాచార్యునిచే నామకరణము కావింపబడినవాడు; భాగ్యోదయశ్రీ: = భాగ్యోదయ సూచక శోభా సంపన్నుడు; లసద్బాలకేళి: = సుందర బాలోచిత క్రీడలు సల్పువాడు; సరామ: = బలరామ సహితుడై విహరించువాడు; సువాచ: = మనోహర పలుకులు పలికెడివాడు; క్వణన్నూపురై: = మోచేతులు, మోకాళ్ళపై పాకుతూ వెళ్ళువాడు; దధిస్పృక్ = పెరుగును తాకువాడు; హైయుగవీదుగ్ధభోక్తా = తాజా వెన్న తినువాడు; దధిస్స్యోయకృత్ = దధి క్రియ కావించువాడు; దుగ్ధభుక్ = పాలభోగమారగించువాడు; భాండ భోక్తా = పాల పెరుగుకుండల పగుల గొట్టువాడు; మృదం భుక్తవాన్ = మట్టి తినువాడు; గోపజ: = నంద గోప పుత్రుడు; విశ్వరూప: = విశ్వమే రూపముగ గలవాడు; ప్రచండ సుచండ ప్రభామండితాంగ: = సూర్య తేజశ్శరీరుడు. యశోదా కర్తైర్బంధన ప్రాప్త: = యశోదచే రోటికి కట్టబడిన వాడు; ఆద్య: = ఆదిపురుషుడు; మణిగ్రీవ ముక్తిప్రద: = నలకూబర మణి గ్రీవుల విముక్తులను కావించిన వాడు దామబద్ధ: = యశోదచే కట్టబడినవాడు; కదావ్రజే గోపికాభి:నృత్యమాన: = అప్పుడప్పుడు వ్రజగోపికలతో నృత్యమాచరించువాడు; నంద సన్నంద కైర్లల్యామాన: = నంద సన్నందుల ద్వారా లాలింపబడువాడు; కదా గోపనందాక: = నందగోపుని ఒడిలో విరాజమానుడై యుండువాడు; గోపాలరూపీ = గోప వేషధారి, కళిందాంగజాకూలగ: = కాళింది నందిని అయిన యమునా తీరమున విహరించువాడు; వర్తమాన: = నిత్యసత్యుడు; ఘనైర్మారుతైశ్చన్న: భాండీరదేశే నందహస్తాద్ రాధయా గృహీతో వర: = భాండీర వనమందు ఒకానొక సమయమున మేఘాచ్ఛాదితమయినపుడు నందుని నుండి రాధాదేవి చే చేకొనిన వాడు. గోలొక లోకగతే మహారత్న సంఘైర్యుతో కదంబావృతే నికుంజే రాధికా స్వాద్వివాహే బ్రహ్మణా ప్రతిష్ఠాన గత: = గోలోకము నుండి తేబడిన రత్న సమూహములు, కదంబ వృక్షముల చే కూడిన నికుంజము నందు బ్రహ్మ దేవుని చే రాధాదేవితో వివాహమయినవాడు. సామ మంత్రై: పూజిత: = సామవేద మంత్రముల ద్వారా పూజింపబడువాడు. రసీ–పరమ రసికుడు; మాలతీనాం వనేపి ప్రియారాధ్యా సహ రాధికార్థ రాసయుక్త: = మాలతీ వనములందు తన ప్రియతమ యగు రాధాదేవికి సుఖము నిచ్చుటకై రాసవిలాస సంలగ్నుడు; రమేశ:ధరానాథ: = లక్ష్మీపతి మరియు పృధివీ నాథుడు; ఆనందద: = ఆనందమును ప్రసాదించువాడు; శ్రీనికేత: = శ్రీ రమానివాసుడు; వనేశ: = బృందావన స్వామి. ధనీ = ఐశ్వర్యపతి; సుందర: = అప్రతిహాత సౌందర్యనిధి; గోపికేశ: = గోపాంగనల ప్రాణ వల్లభుడు. కధారధయా నందగేహే ప్రాపిత: = ఒకానొక సమయమున శ్రీ రాధిక ద్వారా నందగొపుని ఇంట చేర్చబడినవాడు; యశోదా కరైర్లాలిత: = యశోద యొక్క చేతుల యందు లాలింపబడినవాడు, మందహాస: = మంద మనోరమ హాసము చే శోభితుడు; క్వాపీభయి = ఒక్కొక్కప్పుడు భయపడినట్లు లీల చేయువాడు; బృందారకారణ్యవాసీ = బృందావనమందు నివసించువాడు; మహామందిరేవాసకృత్ = నందుని విశాల మందిరమందు నివసించువాడు; దేవపూజ్య: = దేవతలకు కూడా పూజనీయుడు; వనేవత్సచారీ = వనమందు దూడలను కాచువాడు; మహావత్సహారీ = వత్సాసుర సంహారీ; బకారీ = బకాసుర శత్రువు; సురై:పూజిత: = దేవగణ పూజితుడు; అఘారినామా = అఘాసుర సంహారి; వేనేవత్సకృత్ = వనము లందు నూతన ఆవు దూడలకు జన్మము నిచ్చువాడు, గోపకృత్ = నూతన గొప బాలుర నిర్మాణము చేయువాడు; గోపవేశ: = గోపవేషధారి; కదాబ్రహ్మణా సంస్థుత: = బ్రహ్మదేవుని ముఖతా తన యశోగానమును వినువాడు; పద్మనాభ: = ప్రళయ జలము లందు తన నాభి నుండి కమలమునుత్పన్నము చేయువాడు; వివారీ = బృందావన విరచితుడు; తాళభృక్ = తాటి పండ్లను తినువాడు; ధేనుకారి = ధేనుకాసుర శత్రువు; సదారక్షక: = సదాసర్వ రక్షకుడు; గోవిషార్తి ప్రణతీ = విషయుక్త యమునా జలములు త్రాగిన గోవుల విషము నాశనము చేయువాడు. కళిందాంగజాకూలగ: = కళిందకన్య యమునా తటమున విహరించువాడు; కాళీయస్యదమీ = కాళీయుని మదమడచువాడు; ఫణేశునృత్యకారి = కాళియుని ఫణములపై నాట్యము

చేయువాడు. ప్రసిద్ధ = ప్రసిద్ధుడు; సలీల: = లీలాపరాయణుడు; శమీ = శాంత స్వభావుడు; జ్ఞానద: = జ్ఞానదాతా; కామపూర: = కామనలను పూర్ణము చేయువాడు; గోపయుక్త: = గోపకులతో విరాజమానుడు; గోప: = గోవుల పాలకుడు; ఆనందకారీ = సర్వులకు ఆనందము నిచ్చువాడు; స్థిర: = స్థైర్యయుక్తుడు; అగ్నిభుక్ = దావానల పానము చేసినవాడు; పాలక్ = రక్షకుడు; బాలరీల: = బాలకుల వలె క్రీడించువాడు; సురాగ: = సుందర మురళీ రాగము సలిపెడువాడు; వంశీధర: = మురళీధారి; పుష్పశీల: = పుష్పాలంకృతుడు ప్రలంభప్రభానాశకుడు = బలరామ రూపమున ప్రలంభుని సంహరించినవాడు; గౌరవర్ణ: = తెల్లన వర్ణము గల బలరాముడు; బల: = బలవంతుడు; పద్మనేత్ర: = కమలనయనుడు; కృష్ణాగ్రజ: = కృష్ణుని అగ్రజుడు; ధరేష: = ధరణీధరుడు; ఫణీశ: = నాగరాజు; నీలాంబరాభ: = నీలవస్త్రధారి; మహాసౌఖ్యద: = గొప్ప సుఖము నిచ్చువాడు; అగ్నిహారక: = మధ్యాటవి యందు ఉత్పన్నమయిన అగ్నిని పానము చేసినవాడు; వ్రజేశ: = వ్రజమునకు స్వామి; శరద్‌గ్రీష్మ వర్షకర: = వివిధ ఋతువుల కర్త; కృష్ణవర్ణ: = శ్యామ సుందరుడు; వ్రజే గోపికా పూజిత: = వ్రజమండలి యందు గోపికలచే పూజితుడు; చీరహర్తా = చీరలను అపహరించిన వాడు; కదంబే స్థిత: = చీరల గైకొని కదంబ వృక్షమందు కూర్చున్నవాడు; చీరద: = చీరలను తిరిగి ఇచ్చినవాడు; సందురీశ: = సుందరీ మణులయిన గోపకన్యల ప్రాణేశ్వరుడు. క్షుధా నాశకృత్ = గోప బాలకుల ఆకలి తీర్చినవాడు; యజ్ఞపత్నీమణులయిన గోపకన్యల ప్రాణేశ్వరుడు. క్షుధా నాశకృత్ = గోప బాలకుల ఆకలి తీర్చినవాడు; యజ్ఞపత్నీ మన:స్పుక్ = యజ్ఞము చేయుచున్న బ్రాహ్మణుల పత్నుల మనసు నందుండువాడు. కృపాకారక: = దయానిధి; కేళికర్తా = క్రీడా పరాయణుడు; అవనీశ:= భూస్వామి; వ్రజేశక్రయాగ ప్రణాశ:= వ్రజమండలమందు శక్రయాగమును భగ్నపరిచినవాడు; అమితాశీ = గోవర్ధన పూజయందు అపరిమిత భోజన మండలమందు శక్రయుగ మును భగ్నపరచినవాడు; అమితాశీ = గోవర్ధన పూజనమందు అపరిమిత భోజన రాశిని భుజించినవాడు; శునాశీమోహప్రద: = ఇంద్రుని మోహమును ఖండించిన వాడు; బాలరూపీ = బాలరూపధారీ; గిరే: పూజకీ = గోవర్ధన గిరిరాజ మునకు పూజనమొనర్చినవాడు; నందపుత్ర: = నందుని పుత్రుడు; అగధ్ర: = గిరివరధారి; కృపాకృత్ = కృపాళువు; గోవర్ధనోద్ధారి నామా = గోవర్ధనోద్ధారి అనునామము కలవాడు; వాతవర్షాహర్ = తుఫాను నుండి రక్షించువాడు; రక్షక: = రక్షకుడు; వ్రజాధీశగోపాంగన శంక: = వ్రజాధీశు డు, గోపాంగనచే శంకింపబడినవాడు (గోవర్ధన పర్వతము నెత్తిన పిమ్మట ఎల్లరూ ఈయనను సాధారణ మానవుడు కాదని తెలిసిరి); అగేంద్రోపరి శక్రపూజ్య: = గోవర్ధనగిరిపై ఇంద్రునిచే పూజింపబడినవాడు; ప్రాకేస్థుత: = పూర్వమే స్థుతింపబడినవాడు; మృషానిక్షక: = తనను శంకించువారల వ్యర్ధ ప్రలాపమును తీర్చువాడు దేవగోవిందనామ = గోవిందనామధేయుడు (200).

వ్రజాధీశ రక్షాకర: = వ్రజరాజయిన నందుని రక్షించువాడు; పాశిపూజ్య; పాశధారి అయిన వరుణుని తో పూజింపబడినవాడు; అనుగ్రైర్గోపజై: దివ్య వైకుంఠ దర్శీ = గోపగోపీ జనములకు వైకుంఠ దర్శనము కావించినవాడు; చలచ్చారు వంశీక్వణ: = మనోహర వంశీరవమును నలుప్రక్కలా ప్రసరించువాడు. కామీనీశ: = గోపసుందరీమణుల ప్రాణేశ్వరుడు; వ్రజేకామినీ మోహన: = వ్రజభామినులను మోహింపజేయువాడు; కామరూప: = కామదేవుని వంటి రూపసి; రసాక్తు: = రసమగ్నుడు; రసీ రాసకృత్ = రాసక్రీడలాచరించువారల భావనిధి రాధికేశ: = శ్రీ రాధికాదేవి యొక్క స్వామి. మహామోహన: = మోహప్రదానుడు; మానినీ మానహారీ = మానినుల మౌనము హరించువాడు; వివాహీనర: = విహార శీలుడయిన శ్రేష్ఠ పురుషుడు; మానహృత్ = మానము హరించువాడు; రాధికాంగ: = శ్రీ రాధికాదేవిని నామాంగముగ ధరించినవాడు; ధరాద్వీపగ: = భూమండల మందలి సర్వద్వీపములు వెళ్ళగలుచువాడు; భండచారీ = విభిన్న వన ఖండములందు విహరించు స్వామి. వనస్థ: = వనవాసీ; ప్రియ: = సర్వులకు ప్రియుడు; అష్టావక్రర్షద్రష్ట: = అష్టావక్ర ఋషిని దర్శింపజేయువాడు; సరాధ: = శ్రీ రాధికాదేవితో విహరించువాడు. మహా మోక్షద: = మోక్షప్రదాయకుడు; ప్రియార్ధ పద్మహారీ = తన ప్రియతమ యొక్క ప్రసన్నత కొరకై కమలములు తెచ్చువాడు. వటస్థ: = వటవృక్షమందు విరాజమానుడు; సుర: = దేవత; చందనాక్తు: = చందన చర్చితుడు; ప్రసక్తు: = శ్రీ రాధికాదేవి యందు అనురక్తుడు; రాధయా వ్రజం హ్యగత్ = శ్రీ రాధికా సహితుడై వ్రజమండలమందు అవతీర్ణుడయినవాడు; మోహినీషు మహామోహకృత్ = మోహినుల యందు మహామోహమును ఉత్పన్నము చేయువాడు; గోపికా గీతకీర్తి: = గోపికల ద్వారా కీర్తింపబడిన

కీర్తిగలవాడు; రసస్థ: = తన స్వ స్వరూప రసమందు స్థితిగతుడు; పటీ = పీతాంబరధారి; దుఖి:తా కామినీశ: = దు:ఖితులయిన స్త్రీల రక్షకుడు; వనే గోపికా త్యాగకృత్ = వనమందు గోపికలను త్యాగమొనర్చినవాడు; పిద చిహ్న ప్రదర్శ: = వనమందు తనను వెదుకుచున్న గోపికలకు పాద చిహ్నములు దర్శింప జేసినవాడు; కళాకారక: = అరువది నాలుగు కళల యందు ప్రవీణుడు; కామమోహీ = తన రూప లావణ్యముల చే కామదేవుని సహితము మోహింప జేయువాడు; వశీ: = మనో ఇంద్రియములను వశము నందుంచుకొనువాడు; గోపికా మధ్యగ: = గోపాంగనల మధ్య విరాజమానమైనవాడు; పేషనాచ: = మధురభాషీ; ప్రియాప్రీతికృత్ = తన ప్రియతమను ఆనంద పరుచు కార్యములాచరించువాడు; రాసరక్తు: = రాసమందు నిమగ్నుడు; కలేశ: = సంపూర్ణ కళలకు స్వామి. రసారక్తు చిత్త: = రసమగ్న చిత్తశాలి; అనంత స్వరూప: = అనంత రూపుడు లేక శేషనాగ స్వరూపుడు; స్రజాసంవృత: = మోకాళ్ళ వరకు వ్రేశ్శాడు వనమాలా ధారి; వల్లవీమధ్యవస్థ: = గోపాంగన మండలి మధ్య కూర్చున్న వాడు; సుబాహు = సుందరమయిన బాహువులు కలవాడు; సుపాద: = సుందర చరణములవాడు; సువేశ: = సుందర వేషము కలవాడు; సుకేశో వ్రజేశ: = సుందర కేశములుగల వ్రజమండల స్వామి; సఖా = సఖుడు; వల్లభేశ: = ప్రాణవల్లభ అయిన శ్రీ రాధా హృదయేశ్వరుడు; సుదేశ: = సర్వోత్కృష్ఠ దేవస్వరూపుడు; క్వణ త్కింకిణీ జాల భృత్ = జ్ఞాన కారకమయిన కింకణీ ధారి; నూపురాఢ్య = చరణములందు నూపుర శోభా సంపన్నుడు; లసత్కంకణ: = దండములందు కంకణ ధారణ చేయువాడు; అంగదీ = బాజూబంధము ధరించువాడు; హారభార: = హారభార విభూషితుడు; కిరీటి = ముకుటధారీ; చలత్కుండల: = కర్ణములందు మెరయుచున్న కుండలములు కలవాడు; అంగులీయస్ఫురత్ కౌస్తుభ: = వ్రేళ్ళకు ఉంగరములతో బాటు వక్ష స్థలమందు ధగధగలాడుచున్న కౌస్థుభమణి ధరించినవాడు. మాలతీ మండితాంగ: = మాలతీ మాలాలంకృత శరీరము కలవాడు; మహానృత్యకృత్ = మహారాస మందు నృత్యమాచరించువాడు. రాసరంగ: = రాసరంగమందుతత్పరుడు; కళాఢ్య = సమస్త కళలతో సంపన్నుడు; చలద్ధారంభ: = వేళ్ళాడుచున్న హారముల ప్రభ నలుదిశల వెలయించువాడు; భామినీ నృత్యయుక్త: = భామినిలుతో నృత్యము నందు సంలగ్నడు; కళిందాంగజాకేళికృత్ = కళిందనందినీ అయిన యమునా జలములందు క్రీడించువాడు. కుంకుమశ్రీ: = కేసర కుంకుమ శోభాసంపన్నుడు; సురైర్నాయకా నాయకైర్గీయమాన: = తమ ప్రాణ వల్లభల సహితులైన దేవతల ద్వారా యశోగానమ చేయబడువాడు. సుఖ్యాఢ్య = స్వరూపభూప సంపన్నుడు; రాధాపతి: = రాధికా ప్రాణవల్లభుడు; పూర్ణ బోధ: = పూర్ణ జ్ఞాన స్వరూపుడు; కటాక్ష స్మితీ: = వంకర తిరిగిన కుండలములతో మందస్మిత ముఖము కలవాడు; వల్గిత భ్రూవిలాస: = నాట్యము చేయుచున్న కమబొమలు కలవాడు. సురమ్య: = అత్యంత రమణీయుడు; అతిభి: కుంతలాలోకేశ: = ఎగురుచున్న భ్రమరములవంటి నల్లని కేశరాశి కలవాడు; స్ఫురద ప్రహకుందస్రజా చారుకేశ: = రెపరెపలాడుచున్న నెమలి పింఛములు కిరీటము నందు కలిగి కుందపుష్ప మాలాలంకృతుడు; మహాసర్పతో నందరక్షా పరాంఘ్రి: = పెద్ద కొండ చిలువ భయము నుండి నందుని బాపిన పాదము కలవాడు; సదా మోక్షద: = సతతము మొక్ష ప్రదాయకుడు; శంఖచూడ ప్రణాశీ: = శంఖ చూడుని సంహరించినవాడు; ప్రజారక్షక: = ప్రజలను రక్షించువాడు; గోపికా గేయమాన: = గోపికలచే గానము చేయబడు యశము గలవాడు. కుండి ప్రణాశ ప్రయాస: = అరిష్టాసుర వధ కొరకు ప్రయాసపడువాడు; సురేజ్య: = దేవతలకు పూజనీయుడు. కలి: = కలిస్వరూపుడు; క్రోధకృత్: = దుష్టులపై క్రోధితుడు; కంస మంత్రోపదేష్టా = నారద రూపముతో కంసునికి మంత్రోపదేశము చేయువాడు; అక్రూర మంత్రోపదేశీ = అక్రూరునకు తన నామ మంత్రోపదేశము నొనర్చినవాడు; సురార్థ: = దేవతల ప్రయోజనము సిద్ధింప చేయువాడు; బలికేశియ: = కేశి నాశము చేసినవాడు; పుష్పవర్ష్మా మలశ్రీ: = దేవతలు పుష్ప వృష్టి కురిపించిన వారు; అమలశ్రీ: = ఉజ్వల శోభా సంపన్నుడు; నారదాదేశతో హ్యోమహంతా = నారదుని సూచన చే వ్యోమాసురుని వధకావించినవాడు; అక్రూర సేవాపర: = నంద వ్రజము నందు ఏతించిన అక్రూరుని సేనయందు సంలగ్నమయిన వాడు. సర్వదర్శీ = సర్వులను దర్శించినవాడు; వ్రజే గోపికామోద: = వ్రజ భూమి యందు గొపాంగనను మోహింప జేయువాడు; కులవర్తీ = యమునా తటమందు విరాజమానుడు; సతీ రాధికా బోధద: = మధురా నగరమునకు ఏగునపుడు శ్రీ రాధికాదేవికి ఆశ్వాసన కలిగించినవాడు. స్వప్నకర్తా = శ్రీ రాధికా దేవి కొరకు సుఖమయ స్వప్న సృష్ఠి కావించినవాడు; విలాసీ = లీలావిలాస పరాయణుడు; మహామోహనాశకుడు; స్వబోధ: =ఆత్మభోద స్వరూపుడు; వ్రజే

శాపతస్త్యక్తు రాధా సరాశ: = వ్రజమందు శాపవశమున నివసించుచున్న శ్రీ రాధాదేవిని నిత్యాగమొనర్చినవాడు; మహామోదాగ్ని దగ్ధాపతి: = శ్రీ కృష్ణ విషయక మోహ దావానలమందు దగ్ధమగు శ్రీ రాధాదేవి పాలకుడు; సఖీ బంధనా మో చితాక్రూర: = సుఖల బంధనము నుండి అక్రూరుని విడిపించువాడు; ఆరాత్ సఖీ కంకణైస్త్రాక్రూర రక్షీ = గోపికల పీడనము నుండి అక్రూరుని రక్షించువాడు; వ్రజే రాధయూరథస్థ: =వ్రజము నందు రాధికా దేవి సహితుడై రథము నందు విరాజమానుడు; కృష్ణ చంద్ర: = శ్రీ కృష్ణ చంద్రుడు; గోపికై: సుగుప్తోగమీ: = గోప బాలకులతో అత్యంత గుప్త రూపముతో మధరాయాత్ర సలుపువాడు; చారులీల: = మనోహరలీలలు కావించువాడు; జలేక్రూర సందర్శక: = యమునా జలములందు అక్రూరునకు తన స్వరూపమును దర్శింపజేసినవాడు; దివ్య రూప: = దివ్య రూపధారి; దిదిక్షు: = మధురా పురము చూచుటకు ఉత్సుకత కలిగిన వాడు; పురమోహినీ చిత్తరూపీ= మధురాపురము నందలి మనోహర స్త్రీ మూర్తులను సహితము మోహింపజేయువాడు; రంగకార ప్రగాశి = కంసుని రజకుని నష్ఠ పరచినవాడు; సువస్త్ర: = సుందర వస్త్రధారీ; స్రజీ = సుదామ మాలి చే సమర్పింపబడిన మాలలు ధరించిన వాడు; వాయకప్రీతికృత్ = శౌచకుని (దర్జీని) ప్రసన్నము చేసినవాడు; మాలిపూజ్య: = పుష్పమాలిచే పూజింప బడినవాడు; మహాకీర్తిద: = గొప్ప కీర్తికలవాడు; కుబ్జావిహోది: = కుబ్జతో వినోదించువాడు. స్ఫురచ్చండ కోదండ రుణ: = కంసుని కాంతియుతమయిన కోదండమును ఖండించినవాడు. ప్రచండ: = మిక్కిలి బలమును ప్రదర్శించువాడు; భటాత్రిపద: = కంసుని మల్ల యోధులను పీడించిన వాడు; కంస దుస్వప్నకారీ = కంసునికి దుస్వప్నములు చూపించినవాడు; మహామల్లవేశ: = మహామల్లుల వలె వేషధారణ కావించువాడు; కరీంద్ర ప్రహారీ = గజరాజమయిన కువలయా పీడనముపై ప్రహారము కావించువాడు; మహామాత్య: = మావటులను సంహరించువాడు; రంగభూమి ప్రవేశ: = కంసుని రంగశాల ప్రవేశించువాడు; రసాఢ్య: = నవరస సంపన్నుడు; యశ:స్పుక్ = యశస్వీ; బలీవాక్పటశ్రీ: సంభాషణల యందు మిక్కిచతురుడు; మహామల్లహ = గొప్ప మల్లులయిన చాణూర, ముష్టికులను వధించువాడు; స్త్రీ వచోర్థీ = రంగోత్సవ ఉత్సవము చూచుట కేతించిన స్త్రీల సంభాషణలు వినుటయందు ఉత్సుకుడు. ధరానాయక:కంసహతా = కంసుని సంహరించువాడు మరియు భూతలమునకు స్వామి; ప్రాగ్యదు: = మహారాజయిన యదు స్వరూపుడు; సదాపూజిత: = ఎల్లప్పుడూ అందరిచే పూజింపబడువాడు; ఉగ్రసేన ప్రసిద్ధ: = ఉగ్రసేనుని వృద్ధికి కారకుడయిన వాడు; ధరారాజ్యద: = ఉగ్రసేనునికి భూ మండల రాజ్యమంతయు ఇచ్చినవాడు. యాద వైర్మండితాంగ: = యాదవ సమన్వితుడు; గురో: పుత్రద: = గురువుకు పుత్ర ప్రదానము కావించినవాడు; బ్రహ్మావిద్ =బ్రహ్మ వేత్తా; బ్రహ్మ పాఠీ = వేదపాఠము (పఠనము) చేయువాడు; మహా శంఖ: = శంఖాసుర మహారాక్షసుని సంహరించినవాడు; దండధృక్ పూజ్య: = దండధారి అయిన యమునికి సహితము పూజ్యుడు. వ్రజే ఉద్దవ ప్రేషితా = వ్రజ సమాచారము సేకరించుటకు ఉద్దవుని పూజించువాడు. గోప మోహీ = తన గుణ, రూప, సద్భావన చే గోపగణములను మోహింప జేయువాడు; యశోదా ఘ్రుణీ = తల్లి అయిన యశోదపై అత్యంత కృపాళువు; గోపికా జ్ఞానదేశీ = గోపాంగనలకు జ్ఞానోపదేశము చేయువాడు; సదాస్నేహకృత్ = ఎల్లప్పుడు ప్రేమ/స్నేహము చేయువాడు; కుబ్జయా పూజితాంగ: = కుబ్జ ద్వారా పూజింపబడినవాడు; అక్రూర గేహంగమీ = అక్రూరుని గృహమునకు ఏగినవాడు; మంత్రవేత్తా = మంత్రణా మర్మజ్ఞుడు; పాండవ ప్రేషితాక్రూర: = పాండవుల సమాచారము తెలిసికొనుటకై అక్రూరుని పంపినవాడు; సఖీ సర్వదర్శీ = సర్వుల సాక్షీ; సర్వజ్ఞుడు; నృపానంద కారీ = ఉగ్రసేన మహారాజుకు ఆనందము కావించువాడు; మహాక్షౌహిణీ: = జరాసంధుని ముప్పది అక్షౌహిణీ సేనను నాశనము చేయువాడు. జరాసంధ మానోద్ధర: = జరాసంధుని అభిమానమును భంగము చేయువాడు; ద్వారకా కారక: = ద్వారకా పురీ నిర్మాణము కావించినవాడు; మోక్ష కర్తా: = భవబంధ విముక్తము కావించువాడు; రణీ = యుద్ధమునకు సదాఉత్సుకుడు; సార్వభౌమ స్థుత: = సత్యయుగ చక్రవర్తి అయిన ముచికుందుని చే స్థుతింపబడిన వాడు; జ్ఞానదాతా = ముచికందునికి జ్ఞాన ప్రదాత; జరాసంధ సంకల్పకృత్ = తన పరాజయాభినయము కావించి జరాసంధుని సంకల్పమును పూర్ణము కావించిన వాడు; దావ దంఘ్రి: = కాలి వేగమున పరుగెత్తివాడు; నాగతుప్త తంద్వార కామధ్యవర్తీ = ప్రవర్షణగిరి నుండి దూకి ద్వారక యందు విరాజమానుడు; రేవతీ భూషణ: = బలరామ రూపముతో రేవతీ సౌభాగ్య భూషణుడు; తాళచిహ్నా యదు: = తాళ చిహ్నమును పతాకమందు దాల్చు యదువీరుడు; రుక్మిణీ హారక: = రుక్మిణీ దేవిని అపహరించిన వాడు; చైర్య భేద్య: = చేదిరాజయిన శిశుపాలుని

భేదించినవాడు; రుక్మిరూప ప్రణాశీ = రుక్మి యొక్క శిరోమండనము కావించి వానిని కురూపిగా గావించినవాడు. సుఖాశీ = స్వస్వరూప ఆనందాస్వాదకుడు; అనంత: = శేషనాగ స్వరూపుడు; మార: = కామదేవతావతారము, కార్ష్ణీ = శ్రీ కృష్ణ కుమారుడయిన ప్రద్యుమ్నుడు; కామ: కామదేవుడు; మనోజ: = మన్మధుడు; శంబరాది: = శంబరాసుర శత్రువు; రతీశ: = రతీదేవి యొక్క స్వామి; రధీ = రధారూఢుడు; మన్మధ: = మనసును మధించువాడు; మీన కేతు: = మత్స్య చిహ్న ధ్వజుడు; శరీ = బాణ ధారీ; స్మర: = కాముడు; దర్పక: = కామదేవుడు; మాన: = మాన మర్దనము చేయువాడు; పంచబాణ: = పంచబాణ ధారి అయిన మన్మధుడు; ప్రియ: సత్యభామాపతి: = సత్యభామ యొక్క పతి(ప్రియమయిన వాడు); యాదవేశ: = యాదవుల స్వామి సత్రాజిత్ ప్రేమ పూర: = సత్రాజిత్ యొక్క ప్రేమను పూర్ణము చేయువాడు; ప్రహాస: = ఉత్కృష్ణమయిన హాసము కలవాడు; మహారత్నద: = మహారత్నమయిన శ్యమంతకమును వెదుకు వాడు; జాంబవ ద్యుద్ధకారీ = జాంబవంతుని తో యుద్ధము చేయువాడు; మహాచక్రదృక్ = సుదర్శన చక్రధారి; ఖండగదృక్ = నందకమను ఖడ్గధారి, రామసంధి: = బలరామ సహితుడై సంధి చేయువాడు; విహాస్థిత: = లీలా విహార పరాయణుడు; (400)

పాండవ ప్రేమకారీ = పాండవులను ప్రేమించువాడు; కళిందాంగనా మోహన: = కాళిందీ మనోమోహకారీ; ఖండానార్తీ = ఖాండవ వనమును అగ్నిదేవునికై అర్పించుటకు ఇచ్ఛగలిగినవాడు; ఫల్గుణ ప్రీతకృత్ సఖా = అర్జునుని ప్రేమించు సఖుడు. నగ్నకర్తా = ఖాండవ వన దహనము కావించి నగ్నము (శూన్యము) కావించినవాడు; మిత్రవిందా పతి = మిత్రవింద (అవంతీ దేశ రాకుమారి) పతి; క్రీడ నార్దీ = క్రీడా సక్తుడు; నృప ప్రేమకృత్ = నగ్నజిత్ మహారాజును ప్రేమించువాడు; సప్తరూపాగోజయీ = ఏడు ఎద్దులను ఒకేసారి ఎదుర్కొని ఓడించిన వాడు; సత్యాపతి: = నాగ్నజిత్ కుమారి సత్యాపతి; పారివర్హీ = నగ్నజిత్ మహారాజు చే ఈయబడిన కట్నమును గ్రహించినవాడు; యుధోష్ఠమ్ = పూర్ణుడు; నృపై: సంవృత: = సత్యాదేవిని తీసుకొని వెనుకకు వెళ్ళు సమయమున అనేక మంది రాజులతో యద్ధార్థులయిన రాజులతో మోహరింపబడిన వాడు; భద్రాపతి: = భద్రయొక్క స్వామి; మధోర్వ్రిలాసి = మధుమాస పూర్ణిమ యందు రాసము చేయువాడు; మానినీశ: = మానినీ ప్రాణ వల్లభుడు. జనేశ: = జనుల (ప్రజల) స్వామీ; శునాసీర మోహాకృత: = ఇంద్ర మిత్రుడు; సత్య భార్యా: = సతులయిన భార్యాయుతుడు; సతాక్ష్య = గరుడారూఢుడు. మురారీ = మురదైత్య వినాశకుడు; పురీ సంధ భేత్తా = నరకుని పురము యొక్క దుర్గ సముదాయమును భేదించిన వాడు; సువీర: శిర: ఖండన: = శ్రేష్ఠ అసుర వీరుల యొక్క దుర్గ సముదాయమును భేదించిన వాడు; దైత్యనాశీ = దైత్యులను నాశనము చేయువాడు; శరీ భైమ: = శాయకధారియై నరకుని సంహరించువాడు; చండవేగ: = ప్రచండ వేగశాలి; ప్రవీర: = ఉత్కృష్ఠ వీరుడు; ధరాసంస్తుత: = పృధివీ దేవి ముఖము నుండి తన యశోగానమును వినువాడు. కుండల చత్రహర్తా = అదితీ దేవి కుండలములను, ఇంద్రుని ఛత్రమును నరకాసురుని ఓడించిన పిదప తిరిగి వారికి ఇచ్చిన వాడు. మహారత్నయుక్ = మహా మణిరత్న సంపన్నుడు; రాజకన్యా అభిరామ: = పదహారు వేల రాజకన్యల పతి; శచీ పూజిత: = స్వర్గమందు శచీదేవిచే పూజింపబడిన వాడు; శక్రజిత్ = పారిజాతాపహరణము నందు ఇంద్రుని ఓడించినవాడు; మానహర్తా = ఇంద్రుని అభిమానమును చూర్ణము చేసినవాడు. పారిజాతాపహారీ రమేశ: = పారాజాత వృక్షమును అపహరించు రమావల్లభుడు; గృహీ చామరై:శోభిత: = గృహస్థరూపుడై శ్వేత చామరములు వీయించు కొనువాడు; భీష్మక కన్యాపతి: = భీష్మక కుమారి అయిన రుక్మిణీదేవి పతి; హాస్యకృత్ = శ్రీ రుక్మిణీ దేవితో హాస్యములాడువాడు; మానినీ మానకారీ = మానిని అయిన రుక్మిణీ దేవికి మానము (గౌరవము) నిచ్చువాడు. రుక్మిణీ వాక్పటు: = రుక్మిణీ దేవితో భాషణము చేయునందు చతురుడు; ప్రేమ గౌహా: = ప్రేమాధిష్ఠానరూపుడు; సతీ మొహన: = సతులను కూడా మోహింపజేయువాడు; కామదేవా: పరశ్రీ: = రెండవ కామదేవుని వలె భాసించువాడు; సుదేష్ణ: = సుధేష్ణుడను శ్రీ కృష్ణ పుత్రుడు, సుచారు = మంచి అందము కలవాడు; చారుదేష్ణ: = చారుదేష్ణ; చారు దేహా: = అందమయిన శరీరము కలవాడు; బలీ చారుగుప్త: = అతి బలశాలి; చక్కని గోప్యము కలవాడు; సుతీ భద్రచారు: = భద్రచారుడను పుత్రుడు కలవాడు; చారు చంద్ర: = చంద్రుని వంటి చక్కదనము కలవాడు; విచారు: = విశిష్ఠమయిన ఆలోచన కలవాడు; చారు: = అందమయినవాడు; రధీ పుత్రరూప: = రధీ పుత్ర స్వరూపుడు; సుభాను, ప్రభాను, చంద్రభాను భృహద్భాను, అష్ఠభాను, సాంబ, సుమిత్ర,

క్రతు, చిత్రకేతు, వీర అశ్వసేన; వృష, చిత్రగు, ప్రయోష, సింహ, బల ఊర్ధ్వగ, వర్ధన, ఉన్మాద, మహాశ, వృక, పావన, వహ్నిమిత్ర: కృధి, హర్షక, అనిత, అమిత్రజిత: సుభద్ర:, జయ, సత్యక:, వామ, ఆయు, యదు, కోటీశ:, పుత్ర పౌత్రై:ప్రసిద్ధ: = ఈ విధముగ కోట్లాది పుత్ర పౌత్రులతో ప్రసిద్ధుడు; హలీ దండకృత్= హలము దండముగా గల బలదేవుడు; రుక్మహా= రుక్మిని వధించినవాడు; అనిరుద్ధ: = ఎవరి వల్ల ఆపలేనివాడు; రాజభిర్హాస్యగ: = అనిరుద్ధుని వివాహ మందు రాజ వర్గము చే హేళన చేయబడినవాడు (బలరాముడు); ద్యూతకర్తా: = వినోదము కొరకు ద్యూత క్రీడనాడు వాడు; మధు: = మధువంశమందు అవతీర్ణుడు; భ్రహ్మసూ: = భ్రహ్మదేవుని అవతారమయిన అనిరుద్ధుడు; (500)

బాణపుత్రీ పతి: = బాణాసురుని పుత్రిక అయిన ఉషాదేవి భర్త; మహా సుందర: = అతిశయ సౌందర్యశాలి; కామ పుత్ర: = ప్రద్యుమ్న పుత్రుడు; బలీశ: = బలవంతులకు ఈశ్వరుడు; మహాదైత్య సంగ్రామకృద్ యాదవేశ: = గొప్ప గొప్ప దైత్యులతో యుద్ధమొనర్చు యాదవుల స్వామి; పురీభంజన: = బాణాసురుని నగరమును నష్టపరుచువాడు; భూత సంత్రాసకారీ = భూత గణములను సంత్రస్థము కావించువాడు; మృధే రుద్రజిత్ = యుద్ధము నందు రుద్రుని జయించువాడు; రుద్రమోహీ = జృంభ కాస్త్రము చే రుద్రుని మోహింపజేయువాడు; కూపకర్ణప్రహారీ= కూపకర్ణుడను ప్రమధ భగణము పై ప్రహారము చేయువాడు; ధనుర్భంజన: =ధనస్సును భంగము చేయువాడు; బాణమాన ప్రహారీ = బాణాసురుని గర్వమును చూర్ణము చేయువాడు; జ్వరోత్పత్తికృత్ = జ్వరోత్తత్తి చేయువాడు; జ్వరేణ సంస్థుత: = రుద్ర జ్వరము చే స్థుతి చేయబడువాడు. భుజా భేద కృత్ = బాణాసురుని భుజములు భేదించిన వాడు; బాణ సంత్రాసకర్తా = బాణాసురుని మదిలో బాధ ఉత్పన్నము చేయువాడు. మృడ ప్రస్తుత: = శివ భగవానుని ద్వారా స్తుతి చేయబడిన వాడు. యుద్ధకృత్ = యుద్ధము చేయువాడు; భూమి భర్తా = భూ మండల భరణ, పోషణ చేయువాడు; నృగం ముక్తిద: = నృగ మహారాజు యొక్క ఉద్ధారము చేయువాడు. యాదవానాం జ్ఞానద: = యాదవులకు జ్ఞాన ప్రదాయకుడు; రధస్థ: = దివ్యరధారూఢుడు; వ్రజ ప్రేమప: = వ్రజ వాసులకు ప్రేమరస పానము కావించువాడు; గోపముఖ్య: = గోపశిరోమణి, మహా సుందరీక్రీడిత: = తన ప్రేయసులైన పరమ సుందరీమణులతో క్రీడించువాడు; పుష్పమారీ = పుష్పమాలాలంకృతుడు; కళిందాంగజా భేదన: = కాళిందీ ధారను తన వైపుకు లాగువాడు (బలరాముడు); సీరపాణి: = హలధారి; మహా దంభిహా = గొప్ప ధంభ, పాఖండుల మదమణచువాడు; పౌండ్రకమాన ప్రహారీ = పౌండ్రకుని శిరమును భేదించువాడు; కాశీరాజ ప్రణాశీ = కాశీరాజును నాశనము చేయువాడు; మహాక్షౌహిణీ ధ్వంశకృత్ = శత్రుల విశాల సేనా వాహినిని ధ్వంశము చేయువాడు; చక్రహస్త: = చక్రపాణి; పురీదీపక: = కాశీ పురమును దగ్ధము చేయువాడు; రాక్షసీనాశకర్తా = రాక్షసీ గణమును నాశనము చేయువాడు; అనంత: = శేషస్వరూపుడు; మహాధ్రు: = ధరణీ ధారణ చేయువాడు; ఫణీ = ఫణధారి; వానరారి = ద్వివిదుడను వానరుని శత్రువు; స్ఫురద్గౌర వర్ణ: = ప్రకాశమానమయిన గౌర (తెల్లని) వర్ణ స్వరూపుడు; మహా పద్మనేత్ర: = వికసించిన కమల దళముల వంటి నేత్రములు కలవాడు; కురుగ్రామ తిర్యగ్ గతి: = కురుపురమయిన హస్తినను గంగ యందు కలుపుటకు ఈడ్చినవాడు; గౌరవార్థ: కౌరవై: స్థుత: = ఆయన గౌరవార్థము కౌరవుల చే స్థుతింపబడిన వాడు (బలరాముడు); ససాంబ పారిబర్హీ = సాంబ సహితుడై కౌరవుల నుండి కట్నము తీసికొని వెనుకకు వచ్చినవాడు; మహా వైభవీ = మహా వైభవశాలి; ద్వారకేశ: = ద్వారకా నాధుడు; అనేక: = అనేక రూపములు ధరించినవాడు; చలన్నారద: = నారదుని విచిలితుని కావించిన వాడు; శ్రీ ప్రభాదర్శక: = తన ప్రభ (దివ్యత్వమును) చూపించువాడు; మహర్షి స్థుత: = మహర్షులచే స్థుతింప బడువాడు; భ్రహ్మదేవ: = బ్రాహ్మణులను దేవతలుగ తలుచువాడు; లేక చతుర్ముఖ భ్రహ్మదేవుని ఆరాధ్యదైవము; పురాణ: = పురాణ పురుషుడు; సదా షోడశస్త్రీసహిస్థిత: = ఎల్లప్పుడూ పదహారు వేల మంది పత్నీ సహితుడై నివసించువాడు; గృహీ = ఆదర్శగృహస్థుడు; లోకరక్షాపర: = సమస్త లోకముల రక్షణ యందు తత్పరుడు; లోకరీతి: = లోక రీతిని అనుకరించువాడు; ప్రభు: = అఖిల విశ్వమునకు స్వామి; ఉగ్రసేనావృత్ = ఉగ్రసేనల చే పరివృతుడు; దుర్గయుక్తు: = దుర్గముల యందుండు వాడు; రాజదూత స్థుత: = జరాసంధుని చే బందీకృతులయిన రాజులు పంపిన దూతచే స్థుతింపబడిన వాడు; బంధ భేత్తా స్థిత: = బంధింపబడిన రాజుల బంధనములు ఖండించి వారి ముక్త దాతగా విరాజమానమైనవాడు. నారద ప్రస్తుత: = నారదుని చే ప్రస్తుతింపబడిన వాడు; పాండవార్థీ =

పాండవుల అర్ధసిద్ధము కావించువాడు; నృపైర్మం(త్రకృత్ = రాజులతో మంత్రాంగము సలుపువాడు; ఉద్దవ (ప్రీతి పూర్ణ: = ఉద్దవుని (ప్రేమచే పరిపూర్ణుడు; పుత్ర పౌత్ర వృత:= పుత్ర పౌత్రుత చే పరివృతుడు; కురు గ్రామ గంతీ ఘృణీ = ఇంద్ర ప్రస్థమునకు ఏగు దయాళువు; ధర్మరాజస్థుత: = ధర్మరాజు యుధిష్ఠిరుని చే స్థుతింపబడిన వాడు; భీమ యుక్తు: = భీమసేనునితో (ప్రేమగా కలియువాడు; పరానందద: = పరమానంద ప్రదాయకుడు; దర్మజేనమంత్రకృత్ = ధర్మజుడు యుధిష్ఠిరునకు సలహాలు ఇచ్చువాడు; దిశాజిత్ బలీ = దిగ్విజయ బలవంతుడు; రాజసూయార్ధకారీ = యుధిష్ఠిరుని రాజసూయమును సిద్ధింప జేయువాడు; జరాసంధాహ = జరాసంధుని వధింప జేయువాడు; భీమసేన స్వరూపు = భీమసేన స్వరూపుడు; విప్రరూప: = బ్రాహ్మణ రూపము ధరించి జరాసంధుని కడకేగిన వాడు; గదాయుద్ధకర్తా =భీమ రూపముతో గదా యుద్ధము చేయువాడు; కృపాళు: = దయాళువు; మహాబంధన చ్ఛేదకారీ = భవబంధన ఛేదము కావింపువాడు; నృపై: సంస్థుత: = జరాసంధుని కారాగారము నుండి విముక్తులయిన రాజులచే స్థుతింపబడిన వాడు; ధర్మగేహ మాగత: = ధర్మరాజ గృహమునకు వచ్చినవాడు; ద్విజై సంవృత: = బ్రాహ్మణ పరివేష్ఠితుడు; యజ్ఞ సంభారకర్తా = యజ్ఞ సంభారములను సమకూర్చువాడు; జనై: పూజిత: = సర్వులచే పూజింపబడువాడు; చైద్య రుద్వాక్ క్షమ:= చేదిరాజయిన శిశుపాలుని దుర్వచనములను సహించినవాడు; మహా మోక్షద: = మోక్ష ప్రదాయకుడు; అరే:శిరచ్ఛేదకారీ= శత్రువుల (శిశుపాలుని) శిరమును సుదర్శన చక్రముతో ఖండించినవాడు; మహాయజ్ఞ శోభాకర;= యుధిష్ఠిరుని మహాయజ్ఞము యొక్క శోభను ఇనుమడింపుజేయువాడు; చక్రవర్తీ నృపానందకారీ = రాజులకు ఆనంద ప్రదానము కావించు సార్వభౌముడు; సుహారీ విహారీ = సుందర హార శోభితుడై విహార పరాయణుడైనవాడు; సభా సంవృత: = సభాసదులచే పరివేష్ఠితుడు. కౌరవస్యమానహృత్ = కురురాజయిన దుర్యోధనుని మానము హరించువాడు; శాల్వ సంహారక్ = శాల్వుని సంహరించిన వాడు; యానహంతా = సాల్వుని సౌభ విమానమును ముక్కలు చేసిన వాడు; సభోజ: = భోజవంశ సహితుడు; వృష్ణి: = వృష్ణి వంశజుడు, మధు: = మధువంశీయుడు (600) శూరసేన: = శూరసేన వంశజుడు; దశార్హ: = దశార్హ వంశీయుడు; యదు: అంధక: = యదువంశీ మరియు అంధక వంశజుడు; లోకజిత్ = లోక విజేత; ద్యుమన్మాన హారీ = ధ్యుమానుని మానమును హరించువాడు; వర్మ ధృక్ = కవచధారీ; దివ్య శస్త్రీ = దివ్యాయుధ ధారీ; స్వబోధ: = ఆత్మబోధ స్వరూపుడు; సదారక్షక: = సాధుపురుషుల సదారక్షకుడు; దైత్య హంతా = దైత్యుల వధించువాడు; దంవ వక్త్ర ప్రణాశీ = దంత వక్త్రుని నశింపజేయువాడు; గదాధృక్ = గదాధారి; జగతీర్థయాత్రా కర: = సంపూర్ణ జగత్తు యందు తీర్ధయాత్ర చేయువాడు (బలరాముడు). పద్మహార: = కమలముల హారము ధరించువాడు; కుశోసూత హంతా = కుశాగ్రము చే సూతుని సంహరించినవాడు; కృపాకృత్ = దయ చూపించువాడు; స్మృతీశ: = ధర్మ శాస్త్రముల యొక్క స్వామి, అమల: = నిర్మలుడు; పల్వాలాంగ ప్రభాఖండకారీ. పల్వలును అంగకాంతిని ఖండించువాడు. భీమ దుర్యోధన జ్ఞాన దాతా = భీమసేన దుర్యోధనులకు జ్ఞానమునిచ్చువాడు; అపర: = ఆయక కంటె ఎక్కువ (గొప్ప వారు లేరు); రోహిణీసౌఖ్యద: = తల్లి అయిన రోహిణీ దేవికి సుఖ ప్రసాదకుడు. రేవతీశ: = రేవతీ పతి అయిన బలరాముడు; మహాదానకృత్ = గొప్ప దాని; విప్రదారిద్రయహ = సుదామా బ్రాహ్మణుని దారిద్ర్యమును దూరము చేయువాడు; సదాప్రేమయుక్త: = నిత్యప్రేమి; శ్రీ సుదామ్న సహాయ: = సుదామునికి సహాయకుడు; సరామ: భార్గవ క్షేత్రగంతా: = బలరామ సహితుడై పరశురాముని సూర్పారక క్షేత్ర యాత్ర చేయువాడు; శతే సూర్యోపరాగే సర్వదర్శీ = విఖ్యాతమయిన సూర్యగ్రహణ సమయమున సర్వులను (బంధువులను) కలిసినవాడు; మహాసేనాయా స్థిత: = విశాలసేన సహితుడై విరాజమానమయినవాడు; స్నానయుక్త మహాదానకృత్ = సూర్య గ్రహణ సమయమున గ్రహణ స్నానమాచరించి, మహాదానములాచరించినవాడు; మిత్ర సమ్మేళనార్థీ = మిత్రులతో కలియుటకు ఇష్టపడువాడు. పాండవ ప్రీతిద: = పాండవులకు ప్రీతి కలిగించువాడు; కుంతి జార్థీ = కుంతీ దేవి మరియు ఆమె పుత్రులకు అర్ధసిద్ధి కలిగించువాడు; విశాలక్ష మోహప్రద: = విశాలాక్షుని మోహము నందు ముంచువాడు. శాంతిద: = శాంతిని ప్రసాదించువాడు; సఖీ కోటిభి: = గోపికాభి: సహవటే రాధికారాధన: = సఖీ స్వరూపులయిన యవ్వన వతులయిన గోపికలతో వటవృక్షము క్రింద శ్రీ రాధి కారాధనము చేయువాడు; రాధికా ప్రాణనాథ: = శ్రీ రాధాదేవి యొక్క ప్రాణేశ్వరుడు; సఖీ మోహదావాగ్ని: = సఖుల యొక్క మోహరూప దావాగ్నిని హరించువాడు;ణ వైభవేశ: = వైభవము గల స్వామి; స్ఫురత్కోటి కందర్పలీలా

విశేష: = కోట్లాది కామదేవుల మించిన లీలా విశేషములను ప్రకటించువాడు; సఖీ రాధికా దు:ఖనాశ. సఖుల సహితముగ శ్రీ రాధికాదేవి యొక్క దు:ఖమును నాశనము చేయువాడు. విలాసీ = విలాసవంతుడు; సఖీ మధ్యగ: = సఖుల మండలము నందు విరాజమానుడు; శాప: = శాపములు దూరము చేయువాడు; మాధవీశ: = మాధవీ శ్రీరాధ యొక్క స్వామీ. శతం వర్ష విక్షేపహృత్ = శత వర్ష వియోగ వ్యదను దూరము నొనర్చువాడు; నందపుత్ర: = నందకుమారుడు; నందవక్షగత: = నందుని ఒడిలో కూర్చొనువాడు. శీతలాంగ: = శీత శరీరశాలి; యశోదాశుచ: స్నానకృత్ = యశోదాదేవి యొక్క ప్రేమాశ్రువుల యందు స్నానము చేయువాడు. దు:ఖ హంతా = దు:ఖమును దూరము చేయువాడు; సదా గోపికా నేత్రలగ్న:వ్రజేశ: = నిత్య నిరంతరము గోపికల కనుల యందు నివసించువ్రజేశుడు. దేవకీ రోహిణీ భ్యాంస్థుత: = రోహిణీ, దేవకీ చే సంస్థుతుడు. సురేంద్ర: = దేవతల స్వామి. సదా గోపికా జ్ఞానద: = గోపికలకు ఏకాంతము నందు జ్ఞానమును ప్రసాదించువాడు. మానద: = అభిమాన ప్రదాయకుడు; దురభిమానమును ఖండించువాడు; పట్టరాజ్ఞీభి: ఆరాత్ సంస్థుత:ధనీ = పట్టపురాణులతో కూడి, మిగిలిన రాణులతో పరివేష్ఠితుడైన పరమైశ్చర్య సంపన్నుడు. సదా లక్ష్మణా ప్రాణనాధ: = లక్ష్మణాదేవికి ఎల్లప్పుడూ ప్రాణ వల్లభుడు; సదా షోడశస్త్రీ సహస్రస్థుతాంగ: = పదహారు వేల రాణుల ద్వారా తన శ్రీ విగ్రహము స్థుతింపజేయబడువాడు; శుక: = శుకముని స్వరూపుడు; వ్యాసదేవ: = వేదవ్యాస స్వరూపుడు; సుమంతు: = సుమంతపు (ఈ విధముగ సర్వ ఋషులు ఆయన స్వరూపమే యని తెలియవలెను. సిత: = సిత; భరద్వాజక: = భరద్వాజుడు; గౌతమ: = గౌతముడు. ఆసురీ: = ఆసురీ; సద్వశిష్ఠ: = శ్రేష్ఠుడయిన వశిష్ఠ మహర్షి; శతానంద: = శతానందుడు; ఆధ్యా:రామ: = ఆధ్యారాముడని ప్రసిద్ధి నొందిన పరశురాముడు. పర్వతోముని: = పర్వతుడు; నారద: = నారదుడు; ధౌమ్య: = ధౌమ్యుడు; ఇంద్ర: = ఇంద్రముని; అసిత: = అసితుడు; అత్రి: = అత్రి మహాముని; విభాండ: = విభాండకుడు; ప్రచేతా: = ప్రచేత మహర్షి; కృప: = కృపుడు కుమార: = సనత్కుమారుడు; సనంద: = సనందనుడు; యాజ్ఞవల్క్య: = యాజ్ఞవల్క్యుడు; ఋభు: = ఋభుడు; అంగిర: = అంగిరసుడు; దేవల: = దేవలుడు; శ్రీ మృకండ: = శ్రీ మృకండ మహర్షి; మరీచి: = మరీచి; క్రతు: = క్రతువు; ఔర్వక: = ఔర్వుడు; లోమశ: = లోమశుడు; పులస్త్య: = పులస్త్యుడు; భృగు: = భృగువు; భ్రహ్మరాత: = భ్రహ్మరాతుడు; వశిష్ఠ: = వశిష్ఠుడు; నర:నారాయణ: = నరనారాయణులు; దత్త: = దత్తాత్రేయుడు; పాణిని: = పాణిని ఋషి; (వ్యాకరణ సూత్రకారుడు); పింగళ: = పింగళ మహర్షి (చంధస్సు సూత్రకారుడు); భాష్యకార: = భాష్యకారుడు అయిన పతంజలి మహర్షి; కాత్యాయన: = కాత్యాయనుడు; విప్రపాతంజలి: = బ్రాహ్మణుడయిన పతంజలి; (700)

గర్గ: = యదుకులాచార్యుడు గర్గ మహాముని; గురు: = భృహస్పతి; గోష్పతి: = వాచస్పతి అయిన బృహస్పతి గౌతమీశ: = గౌతమీ యొక్క స్వామి; ముని: జాజలి: = జాజలి మహర్షి; కశ్యప: = కశ్యప ఋషి; గాలవ: = గాలవుడు; ద్విజ:సౌభరి: = భ్రహ్మర్షి సౌభరి; ఋష్య శృంగ: = ఋష్యశృంగ మహర్షి; కణ్వ: = కణ్వుడు; ద్విత: = ద్వితుడు; ఏకత: = ఏకతుడు; జాతూద్భవ: = జాతుకర్ణ్యుడు; ఘన: = ఘనుడు; కర్దమస్య ఆత్మజ: = కర్దమ పుత్రుడు అయిన కపిలుడు; భార్గవ: = భృగు పుత్రుడయిన చ్యవనుడు. కౌస: = కౌత్సుడు; ఆరుణి: = ఆరుణి; శుచి: పిప్పలాద: = పవిత్రుడయిన పిప్పలాదముని; మృకండస్య పుత్ర: = మార్కండేయుడు; పైల: = పైలుడు; జైమిని: = జైమిని; సత్ సుమదితు: = సుమంతువు; వరో గాంగళ: = శ్రేష్ఠుడయిన గాంగళ ముని; స్ఫోటగేహ: ఫలాద: = ఫలములు భక్షించు స్ఫోట గేహుడు; సదా పూజిత: బ్రాహ్మణ: = నిత్య పూజితుడు; బ్రాహ్మణ స్వరూపుడు; సర్వరూపీ = సర్వరూపధారి; మహామోహనాశ: మునీశ: = మోహనాశనము చేయు మునీశ్వరుడు; ప్రాగ్మర: = పూర్వ దేవతలు (ఉపేంద్రావతారము నందలి దేవతా స్వరూపము); మునీశస్తుత: = మునీశ్వరుల ద్వారా స్థుతి చేయబడువాడు; శౌరి విజ్ఞానదాతా = వసుదేవునికి జ్ఞాన ప్రదానము చేయువాడు; మహాయజ్ఞకృత్ = గొప్ప యజ్ఞము చేయువాడు; ఆభృధస్నానపూజ్య: = అవభృతస్నానము చే పూజ్యమయిన వాడు; సదాదక్షిణాద: = ఎల్లప్పుడూ దక్షిణ నిచ్చువాడు; నృపై: పారిబర్హీ = రాజుల వద్ద బహుమతులు గొనువాడు; వ్రజానందద: = వ్రజమునకు ఆనందరము నిచ్చువాడు; ద్వారకా గేహదర్శి = ద్వారకా పుర సందర్శనము చేయువాడు; మహా జ్ఞానద: = గొప్ప జ్ఞాన ప్రదాయకుడు; దేవకీ పుత్రద: = దేవకీ దేవికి తన చనిపోయిన పుత్రులను చూపించినవాడు; అసురై: పూజిత: = అసురులచే పూజింపబడెడువాడు. ఇంద్ర సేనాదృత: = బలి చక్రవర్తి చే సన్మానితుడు;

సదాఫల్గుణ ప్రీతికృత్ = ఎల్లప్పుడు అర్జునుని ప్రేమించినవాడు; సత్ సుభద్రా వివాహే ద్విపాశ్వ ప్రద: = సుభద్రాదేవి శుభ వివాహము నందు కట్నముగ గజములు, గుర్రములు అర్పించినవాడు; మానయాన: = వరపక్షమును సన్మానించువాడు; భువం దర్శక: = భూ మండలమును చూచువాడు; మరియు చూపించువాడు; మైథిలేన ప్రయుక్త: = మిథిలాదీశుడైన బహుళాశ్వుడు, మిథిలా నివాసి శృత దేవుడు ఇరువురిచే ఒకే సమయమున దర్శనమునకై ప్రార్థింపబడినవాడు; అశు: బ్రాహ్మణై: సహరాజ్ఞాస్థిత: బ్రాహ్మణైశ్చ స్థిత: = ఒకే సమయమున బహుళాశ్వునికి, శృతదేవునికి దర్శనమిచ్చినవాడు; మైధిలే కృతీ: = మిథిలా రాజు మరియు బ్రాహ్మణునకు ఇరువురి కర్తవ్యములను పాలించినవాడు; లోకవేదోపదేశీ = లోకమునకు వేదోపదేశము కావించినవాడు; సదా వేద వాక్యై: స్తుత: = సదా వేద వచనముల ద్వారా స్తుతింపబడువాడు; శేషశాయి = శేషశయనుడు; అమరేషు బ్రాహ్మణై: పరీక్షావృత: = భృగు ఆది ఋషులచే సర్వశ్రేష్ఠ దేవతగా నిర్ణయింపబడినవాడు; భృగుప్రార్థిత: = భృగు మహర్షి చే ప్రార్థింపబడినవాడు; దైత్య: = దైత్య నాశక:; ఈశరక్షీ = భస్మాసురుని భస్మము కావించి పరమశివుని రక్షించిన వాడు; అర్జునస్య సఖా = అర్జునమిత్రుడు; అర్జునస్యాపి మానప్రహారీ = అర్జునుని అభిమానమును భంగము కావించిన వాడు; విప్రపుత్రప్రద: = బ్రాహ్మణునికి పుత్ర ప్రదానము కావించిన వాడు; ధామగంతా = బ్రాహ్మణ పుత్రులను తీసికొని వచ్చుటకు తన దివ్య ధామమునకేగినవాడు; మాధవీచిర్విహారస్థిత: = తన భార్యస్వరూపలయిన మధుకుల స్త్రీలతో సముద్రము నందు జలవిహారము కావించినవాడు; కళాంగ: = కళలు అంగములుగ గలవాడు; మహామోద దావాగ్ని దగ్ధాభిరామ: = మహామోహమయమగు దావాగ్ని యందు దగ్ధమగు లోకులను సహితము తన వైపు ఆకర్షించువాడు; యాదు: ఉగ్రసేన నృప: = యదుకుల వాసి ఉగ్రసేన మహారాజు; అక్రూర: = అక్రూరుడు లేక క్రూర రహితుడు; ఉద్దవ: = ఉద్ధవుడు లేక ఉత్సవ స్వరూపుడు;శూరసేన: = శూరసేనుడు; శూర: = శూరుడు; హృదీక: = కృత వర్మ యొక్క తండ్రి హృదీకుడు. (సమస్త యాదవులు భగవత్స్వరూపులు. అందువల్ల ఈ నామముల యందు ఈ భగవానుని గణింపవలెను.) సత్రాజిత్: = సత్రాజిత్; అప్రమేయ: = ప్రమాణాతీతుడు; గద: = బలరాముని సోదరుడు గదుడు; సారణ: = సారణుడు; సాత్యకి: = సత్యక పుత్రుడు; దేవభాగ: = దేవ భాగుడు; మానస: = మానసుడు; సంజయ: = సంజయుడు; శ్యామక: = శ్యామకుడు; వృక: = వృకుడు; వత్సక్ = వత్సకుడు; దేవక: = దేవకుడు; భద్రసేన: = భద్రసేనుడు; నృప అజాతశత్రువు: = మహారాజు యుధిష్ఠరుడు జయ = జయుడు (అర్జునుడు); మాద్రీపుత్ర: = నకుల సహదేవులు; భీష్మ: = భీష్ముడు; కృప: = కృపాచార్యుడు; బుద్ధి చక్షు: = ప్రజాచక్షువు దృతరాష్ట్ర మహారాజు; పాండు: = పాండవుల తండ్రి అయిన పాండురాజు; శాంతను = భీష్ముని తండ్రి అయిన శంతనుడు; దేవో బాహ్లిక: = దేవ స్వరూపుడయిన బాహ్లికుడు; భూరిశ్రవ: = భూరి శ్రవుడు; చిత్ర వీర్య: = విచిత్ర వీర్యుడు; విచిత్ర: = చిత్రాంగదుడు; శాల: = శాలుడు; దుర్యోధన : = ఎవరితో యుద్ధము చేయుట కఠినము – దుర్యోధనుడు. కర్ణ: = కర్ణుడు; సుభద్రాసుత: = అభిమన్యుడు; ప్రసిద్ధ:విష్ణురాత: = పరీక్షిత్ మహారాజు; జనమే జయ: = పరీక్షిత్ సుతుడు జనమే జయుడు. (800)

పాండవ: = పంచ పాండవులు; కౌరవ: = కురుకులమందు ఉత్పన్నమయిన క్షత్రియ సముదాయము, సర్వతేజా:హరి: = సంపూర్ణ తేజము చే భక్తుల చిత్తమును హరించు శ్రీ కృష్ణ భగవానుడు; సర్వరూపీ = సర్వరూపుడు; రాధయా వ్రజం హ్యాగత: = శ్రీ రాధాదేవి సహితుడై వ్రజమందు అవతీర్ణుడు; పూర్ణదేవ: పరిపూర్ణ తమ పరమాత్ముడు: వర: = సర్వులకు వరణీయుడు; రాసలీలాపర: = రాసక్రీడాపరాయణుడు; దివ్యరూపీ = దివ్య రూపము కలవాడు; రథస్థ: = రథమందు విరాజమానుడు; నవద్వీప ఖండ పదర్శీ = జంబూ ద్వీపము యొక్క తొమ్మిది ఖండములు చూచు, చూపించువాడు; మహామానద: = గొప్ప అహంకారమును ఖండించువాడు; గోపజ: = గోపనందనుడు; విశ్వరూప: = స్వయముగ విశ్వముగ ప్రకాశించువాడు; సనంద: = సనందనుడు; నంద: = నందుడు; వృష: = వృషభానుడు; వల్లవేశ: = గోపేశ్వరుడు; సుదామా = సుదాముడు; అర్జున: = అర్జునుడు; సౌబల: = సుబలుడు; సకృష్ణ: స్థోక: = స్థోక కృష్ణుడు; అంశుక: = అంశుకుడు; సద్విశాలర్ష భాఖ్య: = విశాల మరియు ఋషబుడను ఇరువురు సఖుల కలవాడు; సుతేజస్వికః = శ్రేష్ఠ తేజస్వీ; కృష్ణమిత్రో వరూధ: = శ్రీ కృష్ణ మిత్రుడయిన వరూధుడు; కుశేష: = కుశేష్వరుడు; వనేష: = వనేశ్వరుడు రాజు; గోకులేశ: = గోకులస్వామి; సదాగొగణ: = ఎల్లప్పుడు గోసముదాయముతో నివసించువాడు; గోపతి:

= గోస్వామీ; గోపికేశ: = గోపాంగనా వల్లభుడు; గోవర్ధన: = గోవులను వృద్ధి నొందించువాడు; గోపతి: = గోపాలకుడు; కన్యాకేశ: = గోపకన్యామణుల ప్రాణ వల్లభుడు; అనాది: = సర్వులకు పూర్వుడు; ఆత్మా = అంతర్యామి/పరమాత్మ; హరి: = శ్యామవర్ణుడయిన శ్రీ కృష్ణుడు; పర:పురుష: = పరమపురుషుడు; నిర్గుణ: = ప్రాకృత గుణములకు అతీతుడు; జ్యోతిరూప: = జ్యోతిర్మయ విగ్రహుడు; నిరీహ: = కామనా రహితుడు; సదానిర్వికార: = సదా వికార శూన్యుడు; ప్రపంచాత్పర: = సకల దృశ్యప్రపంచమునకు పరుడు. ససత్య: = సత్యయుక్తుడు; పూర్ణ: = పరిపూర్ణుడు; పరేశ: = పరమేశ్వరుడు; సూక్ష్మ: = సూక్ష్మ స్వరూపుడు; ద్వారకాయాం నృపేణ అశ్వమేధస్య కర్తా = ద్వారక యందు ఉగ్రసేన మహారాజు ద్వారా అశ్వమేఘ యజ్ఞము అనుష్ఠానము చేయించినవాడు. అపి పౌత్రేణ భూభార హర్తా = పుత్ర పౌత్రుల సహకారముతో భూభార హరణము కావించినవాడు; పున:శ్రీవృజే రాధాయా రాస రంగస్య కర్తా హరి: = పున: శ్రీ వ్రజమందు శ్రీ రాధికా సహితుడై రాసక్రీడ కావించిన వాడు; గోపికానాంచ భర్తా = శ్రీ రాధా మరియు ఇతన గోప యువతుల భర్త; సదైక: = సదా ఏకమాత్ర అద్వితీయుడు; అనేక: = అనేక రూపములతో ప్రకటితమయినవాడు; ప్రభాపూరితాంగ: = ప్రకాశమయమయిన అంగములు కలవాడు; యోగమాయాకర: = యోగమాయ యొక్క ఉద్భావకుడు; కాలజిత్ = కాల విజయుడు; సుదృష్టి: = ఉత్తమ దృష్టి కలవాడు; మహత్తత్వరూప: = మహోత్తత్వస్వరూపుడు; ప్రజాత: = ఉత్కృష్ఠమయిన అవతారము ధరించినవాడు; కూటస్థ: = కూటస్థుడు; నిర్వికారుడు. (త్వగింద్రియుడు = నాలుక; మాట్లాడువాడు;) ఆద్యాంకుర: = విశ్వవృక్షము యొక్క ప్రధమాంకురము; వృక్షరూప: = విశ్వవిక్ష స్వరూపుడు; వికార స్థిత: = కార్యకారణ స్వరూపుడు; వైకారిక స్తైజసస్తామసశ్చ అహంకార: = వైకారిక, తైజస, తామస (సాత్విక, రాజస, తామస) అను త్రివిధ అహంకార స్వరూపుడు); నభ: = ఆకాశ స్వరూపుడు; దిక్ = దిశా స్వరూపుడు; సమీర: = వాయురూపుడు; సూర్య: = సూర్య స్వరూపుడు; ప్రచేతోన్యివాహ్ని: = వరుణుడు; అశ్వనీ కుమార రూపుడు; అగ్ని స్వరూపుడు; శక్ర: = ఇంద్రుడు; ఉపేంద్ర: = వామన భగవానుడు; మిత్ర: = మిత్ర దేవత; శృతి: = వేద స్వరూపుడు; త్వక్ = త్యగింద్రియుడు; దృక్ = నేత్రేంద్రియుడు; ఘ్రుణ: = నాసికేంద్రియుడు; జిహ్వా: = రసేంద్రియుడు. గిర: = హేగేంద్రియుడు భుజా = హస్తస్వరూపుడు; మేధరక: = జననేంద్రియ స్వరూపుడు; పాయు: = పాయు స్వరూపుడు; అంఘ్రి: = చరణ స్వరూపుడు; సచేష్ఠ: = చేష్ఠ శీలుడు; ధరా = పృధివీ స్వరూపుడు; వ్యోమ = ఆకాశ రూపుడు; వా: = జలరూపుడు; మారుత: = వాయురూపుడు; తేజ: = అగ్ని స్వరూపుడు. (పంచ భూత స్వరూపుడు); రూపమ్ = రూపము; రస: = రస రూపము (రుచి); గంధ: = వాసనా రూపుడు; శబ్ద: = శబ్దరూపుడు; స్వర్శ: = స్వర్శరూపుడు; సచిత: = చిత్తయుక్తుడు; బుద్ధి: = బుద్ధి రూపుడు; విరాట్ = విరాడ్రూపుడు; కాలరూప: = కాలస్వరూపుడు. వాసుదేవ : = సర్వ వ్యాపి అయిన భగవానుడు (900)

జగత్కృత్ = సంసార సృష్ఠి కావించినవాడు; అండేశయాన: = బ్రహ్మాండ గర్భము నందు శయనించు భగవానుడు (యోగనిద్ర): సశేష: = శేష శయనుడు; సహస్ర స్వరూప: = వేలాది రూపమలు ధరించువాడు; రమానాధ: = లక్ష్మీపతి; ఆధ్యోవతార: = బ్రహ్మదేవుని రూపమున ప్రధమముగ అవతారము దాల్చినవాడు; సదా స్వర్గకృత్ = విధాత రూపమున ఎల్లప్పుడు సృష్ఠి చేయు భగవానుడయిన శ్రీహరి; పద్మజ: = దివ్య కమలము నుండి ఉత్పన్నమయిన చతుర్ముఖ బ్రహ్మదేవుడు; కర్మకర్తా = నిరంతర కర్మ చేయువాడు; నాభి పద్మోద్భవ: = నారాయణుని నాభి కమలము నుండి ఉత్పన్నమయిన బ్రహ్మ దేవుడు; దివ్య వర్ణ: = దివ్యకాంతి స్వరూపుడు; కవి: = త్రికాల దర్శి; లేక విశ్వరూప కావ్యమును నిర్మించుఆదికవి; లోకకృత్ = జగత్ సృష్ఠికర్త; కాలకృత్ = కాలనిర్మాత; సూర్య రూప: = ఆదిత్య రూపుడు; అనిమేష: = కనురెప్పలు వాల్చనివాడు; అభవ: = జన్మ లేని వాడు; వత్సరాంత: = సంవత్సరమునకు అంతిమ స్థానము; మహీయాన్ = గొప్పవారికి సహితము అత్యంత గొప్పవాడు; తిధి: = తిధి స్వరూపము; వార: = దిన స్వరూపము; నక్షత్రమ్ = నక్షత్ర రూపుడు; యోగ: = యోగ స్వరూపడు; లగ్న: = లగ్న స్వరూపుడు; మాస: = మాస స్వరూపుడు; ఘటీ = అర్ధముహూర్త స్వరూపుడు; క్షణ: = క్షణ స్వరూపుడు; కాష్ఠికా = కాష్ఠ స్వరూపుడు, ముహూర్త: = రెండు ఘడియల స్వరూపము (సమయము); యామము = ప్రహరము; గ్రహా: = గ్రహస్వరూపుడు; యామినీ = రాత్రి స్వరూపుడు దినమ్ = దివ్య స్వరూపుడు; ఋక్ష మాలాగత: = నక్షత్ర పంక్తుల యందు గమనము గావించు గ్రహరూపి; (ఈ విధముగ భగవానుడు

నిర్గుణమయిన కాల స్వరూపుడు గా వర్ణింపబడెను) దేవ పుత్ర: = వసుదేవ నందనుడు; కృత: = సత్యయుగ స్వరూపుడు; త్రేతయా: = త్రేతాయుగ స్వరూపుడు; ద్వాపర: = ద్వాపర రూపుడు; అసౌకలి: = కలియుగ స్వరూపుడు యుగానాం సహస్రమ్ = సహస్ర చతుర్యుగ రూపుడు (బ్రహ్మ దేవునికి ఒక పగలు); మన్వంతరమ్ = మన్వంతర కాలము; లయ: = సంహార రూపుడు; పాలనమ్ = పాలనకర్మ కావించువాడు; సత్కృతి: = ఉత్తమ సృష్టి రూపుడు; పరార్థమ్ = పరార్థకాల స్వరూపుడు; సదోత్పత్తికృత్ = ఎల్లప్పుడు సృష్టి చేయువాడు; ద్వయక్షర: బ్రహ్మరూప: = రెండక్షరములు "కృష్ణ" యను బ్రహ్మ స్వరూపుడు; రుద్రసర్గ: = రుద్రస్వరూపుడు; కౌమార సర్గ: = సనకాది కుమార ముని స్వరూపుడు; మునీ: స్వర్గకృత్ = ముని గణముల కర్త; దేవకృత్ = దేవతా గణముల జీవిత రచయిత: ప్రాకృత: = ప్రాకృత స్వరూపుడు; శృతి: = వేదరూపుడు; స్మృతి: = ధర్మశాస్త్ర స్వరూపుడు; స్తోత్రమ్ = స్థుతి స్వరూపుడు; పురాణం = పురాణ స్వరూపుడు; ధనుర్వేద: = ధనుర్వేద స్వరూపుడు; ఇజ్యా = యజ్ఞ స్వరూపుడు; గంధర్వ వేద: = సంగీత శాస్త్ర స్వరూపుడు. విధాతా = బ్రహ్మ స్వరూపి; నారాయణ = జ్ఞాన స్వరూపుడు/జ్ఞానము ప్రసాదించువాడు; విష్ణువు; సనత్కుమార: = సనకాది బాల ముని స్వరూపులు; వరాహ: = వరాహావతార రూపుడు; నారద: = దేవర్షి నారద రూపుడు; ధర్మ పుత్ర: = ధర్ముని పుత్రులయిన నర నారాయణాది ఋషులు; ముని: కర్దమస్యాత్మజ: = కర్దమ పుత్రుడయిన కపిలముని స్వరూపుడు; సయజ్ఞోదత్త: = యజ్ఞ స్వరూపుడు తేక దత్తా త్రేయుడు; అమరోనాభిజ: = నాభి చక్రవర్తి తనయుడు అవినాశి అయిన ఋషభదేవుడు; కూర్మ: = కచ్ఛప లేక కూర్మావతారుడు; ధన్వంతరి = ధన్వంతరి అవతారము. మోహినీ = మోహినీ అవతారము. ప్రతాపీ నారసింహ: = అతి ప్రతావ వంతమయిన నరశింహావతారము; ద్విజే వామన: = బ్రాహ్మణుడయిన వామనావతారము; రేణుకా పుత్రరూప: = పరశురామావతారము. స్తుతి స్తోత్ర కర్తా ముని: వ్యాసదేవ: = వేద విభాజకుడు మరియు స్థోత్ర నిర్మాత అయిన వ్యాస భగవానుడు; ధనుర్వేద భాగ రామచంద్రావతార్ = ధనుర్వేద జ్ఞాత అయిన శ్రీరామావతారము. సీతాపతి: = జనక నందిని అయిన సీత యొక్క పతి; భారహృత్ = భూభారమును హరణము కావించువాడు; రావణారి: = రావణ శత్రువు నృప: సేతుకృత్ = సేతు బంధనము కావించిన మహారాజు (శ్రీరామ చంద్రమూర్తి); వానరేంద్ర ప్రహారీ = వానర రాజయిన వాలిని సంహరించినవాడు; మహా యజ్ఞకృత్ = గొప్ప గొప్ప యజ్ఞములు (అశ్వమేధాది) కావించిన శ్రీరామ చంద్రమూర్తి; ప్రచంచ: రాఘవేంద్ర: = ప్రచండ పరాక్రముడయిన శ్రీరాముడు; బల:కృష్ణచంద్ర: = బలరామ సహిత శ్రీ కృష్ణుడు; కల్కి: = కల్కి అవతారము; కళేశ: = కళకు ఈశ్వరుడు; ప్రసిద్ధో బుద్ధ: = బుద్ధావాతారము హంస: = హంసావతారము; అశ్వ: = హయగ్రీవావతారము; ఋషీంద్రోజిత: = ఋషి ప్రవరుడయిన పులహుని పుత్రుడు అజితుడు; దేవ వైకుంఠనాధ: = దేవ లొకము మరియు వైకుంఠ లోకములకు అధిపతి; అమూర్తి: = నిరాకారుడు; మన్వంతరస్యావతార: = మన్వంతరావతారము; గజోద్ధారణ: = గజ, మొసలి యుద్ధము నందు గజమును ఉద్ధరించిన స్వామి బ్రహ్మపుత్ర: శ్రీమను: = బ్రహ్మదేవుని పుత్రుడయిన స్వాయంభువ మనువు; దానశీల: = దానశీలుడు; దుష్యంతజో నృపేంద్ర: = దుష్యంతుని తనయుడయిన భరత చక్రవర్తి; సందృష్ట; శృత: భూత: ఏవంభవిస్యత్ భవత్ = కనిపించినది, వినిపించినది, భూత, భవిష్యత్ మరియు వర్తమాన స్వరూపుడు; స్థావరో జంగమ: = స్థావర జంగమ స్వరూపుడు; అల్పంద మహత్ = అల్పుడు మరియు మహానుభావుడు (ఏక కాలమందు రెండు సంపూర్ణ విభిన్న గుణములు కలిగిన వాడు); (1000)

ఈ విధముగ శ్రీభుజంగ ప్రయాత ఛందస్సు నందు చెప్పబడిన శ్రీరాధికా వల్లభుడు శ్రీకృష్ణుని సహస్ర నామములను ఏ ద్విజుడు భక్తి భావముతో నిరంతరము పఠించునో ఆతడు కృతార్థుడై సాక్షాత్ శ్రీకృష్ణ స్వరూపుడగును. ఈ సహస్ర నామము వినినంత మాత్రమున గొప్ప పాపరాశిని ఖండించును. వైష్ణవులకు ఇయ్యది అత్యంత ప్రియము మరియు పరమ మంగళకరము.

ఆశ్వయుజ మాసము నందు రాస పూర్ణిమనాడు; శ్రీకృష్ణ జన్మాష్టమి నాడు; చైత్రమాస రాస పూర్ణిమ నాడు; తదుపరి భాద్రపద మాసము నందలి రాధాష్టమి నాడు ఎవరు భక్తియుతుడై ఈ సహస్ర నామమును పూజించి, పఠించునో ఆతడు/ఆమె ప్రసస్థులై చతుర్విధ ఫల పురుషార్థములను పొందెదరు. ఎవరు ఈ సహస్ర నామమును శ్రీకృష్ణ పురి అయిన మధుర నందు కానీ, బృందావనము నందు కానీ, వ్రజభూమి యందు కానీ, గోకులమందు కానీ, వంశీవటము

(మర్రి చెట్టు) యొక్క సమీపమున కానీ, అక్షయవట సమీపమున కానీ, సూర్య పుత్రిక అయిన యమునా నదీ తీరమున కానీ పఠించెదరో ఆ భక్తులు తప్పక గోలోకధామము చేరెదరు.

ఎవరు భూమండల మందు కానీ, ఏ స్థానమందైననూ, ఇంటియందు లేక వనమందు, పరమ భక్తి భావము తో ఈ స్తోత్ర పఠనము కావించెదరో, ఈ పఠనము ద్వారా భగవంతుని భజించెదరో వారిని శ్రీహరి భగవానుడు ఒక్క క్షణమైననూ వదలడు. మాధవుడు, అచ్యుతుడు, అనంతుడు, కేశవుడు, మహానుభావుడయిన శ్రీకృష్ణుడు వానికి సంపూర్ణముగ వశీభూతుడగును.

ఈ సహస్రనామ స్తోత్రము కేవలము భక్తులకు మాత్రమే! ఇతరులకు ఇయ్యది సదా గోపనీయము; సదా గోపనీయము; సదా గోపనీయము;

దీనిని అందరి ముందు తెలుపరాదు. సంసారలంపటులకు దీనిని ఎట్టి పరిస్థితుల యందు ఉపదేశింపరాదు. ఈ సహస్రనామ పుస్తకము ఏ గృహము నందుండునో ఆ గృహము నందు శ్రీ రాధాకా నాధుడు, ఆదిపురుషుడు, శ్రీకృష్ణ భగవానుడు ఎల్లప్పుడూ నివాసముండును. అంతేకాక ఆ పవిత్ర గృహమందు ఆరు గుణములు పన్నెండు సిద్ధులు, ముప్పది శుభలక్షణ సంపన్న గుణసహితుడై శ్రీహరి చేరును.

(శ్రీ గర్గసంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన శ్రీకృష్ణ సహస్రనామ వర్ణన మను ఏబది తొమ్మిదవ అధ్యాయము సమాప్తము)

అరువదియవ అధ్యాయము

(కౌరవ సంహారము, పాండవ స్వర్గారోహణము; శ్రీ రాధా వ్రజవాసి సహిత శ్రీ కృష్ణుడు గోలోకమునకేగుట)

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! ఈ విధముగ శ్రీ వేద వ్యాసుని ముఖతా శ్రీకృష్ణ సహస్రనామమును వినిన పిదప ఉగ్రసేనుడు ఆయనను పూజించి శ్రీకృష్ణ పరమాత్మ యందు తన మనసును సంపూర్తిగా నిలిపెను. పిదప శ్రీకృష్ణ పరమాత్ముడు మిధిలా నగరమునకేగి బహుళాశ్వునికి, శృతదేవునికి దర్శనమిచ్చి ద్వారకకేతెంచెను. పాండవులు యాదవ అశ్వమేధానంతరము తిరిగి వనవాసమున కేగి, వనముల యందు చరించి, వనవాస, అజ్ఞాతవాస కష్టములను సహించి సేనా సహితముగ విరాటనగరమందు కూడగట్టు కొనిరి. ఇచట శ్రీకృష్ణ భగవానుడు ప్రార్థించినప్పటికీ కౌరవుల వారికి కించిత్ రాజ్య భాగమునీయ నిరాకరించిరి. అంత కౌరవ పాండవ యుద్ధ మనివార్యమయినది. ఇది విని కృష్ణుడు తాను ఆయుధము పట్టనని శపధము చేసెను. బలరాముడు తీర్ధయాత్రల కేగెను. ఆ తీర్ధయాత్రా సమయమున బలదేవుడు రోమహర్షణుని (సూతుని), పల్వలుని సంహరించెను. తదనంతరము కౌరవ పాండవులు ధర్మక్షేత్రమయిన కురుక్షేత్రమందు పరస్పర సమరమొనరించిరి. శ్రీకృష్ణ కృపచే పాండవులు విజయము నొందిరి. పాపులయిన కౌరవులు మరణించిరి. తదనంతరము ధర్మజుడు తొమ్మిది సంవత్సరములు రాజ్యపాలన కావించెను. అందు ఆయన మూడు అశ్వమేధ యాగములు కావించెను.

అటుపిదప శ్రీకృష్ణ ఇచ్ఛానుసారము సమస్త యాదవులకు బ్రహ్మర్షులచే గొప్ప శాపము ప్రాప్తించినది. పిదప శ్రీకృష్ణ భగవానుడు తన భక్తుడయిన ఉద్ధవునకు అశ్వత్థ వృక్షము క్రింద భాగవత ధర్మములు ఉపదేశించెను. కొన్ని దినముల పిదప యాదవుల యందు పరస్పర స్వర్ధ ఏర్పడి ప్రభాస క్షేత్రమందు వారిలో వారు కొట్టుకొని సర్వులు పరమ పదించిరి. బలరాముడు మానవ శరీరమును వదలి, దివ్య శరీరము దాల్చి, తన ధామమునకు ఏగెను. అంత శ్రీకృష్ణుడు వ్రజభూమికి ఏగి, యశోదానందులను, శ్రీరాధికా దేవిని, గోప గోపీ జన సముదాయమును కలసి ఇట్లనియె "నంద యశోదలారా! ఇక మీరు నా యందు పుత్ర బుద్ధిని విడచి గోకుల వాసులతో సహితముగ, నాధామమయిన గోలోకమునకు

వెళ్ళవలసినది. ఇకముందు సర్వులకు దు:ఖమొసగు కలియుగము వచ్చుచున్నది. అందు మానవులు ప్రయత్న పూర్వకముగ పాపులగుదురు. ఇందు సందేహము లేదు. అందు పరస్పరము సంపర్కము, వివాహములకు స్త్రీ పురుషులకు, మరియు వర్ణములకు ఏ నియమములు యుండవు. అందువలన జరామరణములు లేచి నా లోకమునకు శీఘ్రము గ వెళ్ళవలసినది."

శ్రీకృష్ణుడు ఈ విధముగ చెప్పుచుండగా గోలోకము నుండి ఒక దివ్య విమాన మేతెంచినది. దానిని గోపకులందరూ అత్యంత ప్రసన్నముగ గాంచిరి. అది అయిదు యోజనముల విస్తీర్ణము మరియు ఎత్తు కలిగి యున్నది. నిర్మల మణులతో, ముక్త రత్నములతో అలంకరింపబడి మణిమయ దీపములతో ప్రకాశించుచున్న తొమ్మిది లక్షల మందిరములు ఆ దివ్య విమానమందు విరాజమానమై యున్నవి. దానికి రెండు వేల చక్రములు యుండి, అయ్యది రెండు వేల హయములతో పూన్చబడినది. ఆ రథమందు దివ్య పరదాలు పరుచబడి, దానిని కోట్లాది సఖుల చుట్టుముట్టి యుండిరి. ఆ సమయమున శ్రీ కృష్ణుని శరీరము నుండి కోట్లాది కామ దేవుల సౌందర్యముగల చతుర్భుజుడయిన శ్రీమహా విష్ణువు ప్రకటితమయ్యెను. ఆయన శంఖ చక్రములు ధరించెను. ఆయన ఒక సుందర అదరము నందు శ్రీమహాలక్ష్మీ సమేతుడై శీఘ్రముగ క్షీరసాగరమున కేగెను. పిదప నారాయణ రూపధారి అయిన శ్రీకృష్ణ హరి మహాలక్ష్మీ సమేతుడై గరుడుని పై కూర్చొని వైకుంతధామమున కేగెను. అంత శ్రీకృష్ణుడు నర, నారాయణులను ఇరువురు క్షత్రియ రూపులను అభివ్యక్తించెను. వారిరువురు బదరికాశ్రమమున కేగిరి. తదనంతరము పరిపూర్ణ జగత్పతి శ్రీకృష్ణ భగవానుడు శ్రీ రాధికా సహితుడై ఆ రథమును అధిరోహించెను. నంద, యశోదాది గోప గోపికామణులందరూ తమ పాంచభౌతిక శరీరములను త్యజించి దివ్య దేహులయిరి. శ్రీకృష్ణ భగవానుడు వారందరినీ ఆ రథమందు కూర్చుండ బెట్టి అందరితో గొలోక ధామమునకు వెళ్ళిపోయెను.

వారందరూ బ్రహ్మాండమును దాటి బయటకు వెడలి విరజానదిని గాంచిరి. వెంఠనే శేషనాగము యొక్క ఒడిలో మహాలోకమయిన గోలోకము దృష్ఠి గోచరమయినది. అయ్యది దు:ఖనాశకము మరియు పరమ సుఖదాయకము. అది చూచి శ్రీకృష్ణుడు శ్రీ రాధికా సహితుడై రథము దిగి, అక్షయ వట సందర్శనము చేసి, ఆ పరమ ధామము ప్రవేశించెను. గిరివరమయిన శత శృంగము, రాసమండలము, చూచుచుండగనే ద్వారముల గుండా పన్నెండు వనముల సంకులము, కల్పవృక్ష పరివృతము అయిన బృందావనము చేరెను. యమునా నది ఆ వనమును ఆనుకొని ప్రవహించుచున్నది. ఆ వనము పుష్పభరిత కుంజ, నికుంజముల తో యుండి, గోప గోపీ జన సముదాయములతో నిండియున్నవి. సర్వదా వసంత ఋతువు, మల యానిలము అద్దానికి మిక్కిలి శోభనుచేకూర్చుచున్నవి. అంతకుముందు శూన్యము వలె తోచిన గోలోక ధామము శ్రీకృష్ణాగమనము తో జయజయ ధ్వానములు తో నిండినది.

తదనంతరము ద్వారక యందు యదుకుల స్త్రీలు దేవకీ మొదలగు వారు చితియందు ప్రవేశించి వేరొక లోకముల కేగిరి. మరణించిన వారికి అందరికీ అర్జునుడు యధావిధిగా పార లౌకిక క్రియలు ఆచరించెను.

ఆయన తనకొసగబడిన గీతా జ్ఞానము చే మనసున కొంచెము శాంతిని ఆపాదించుకొని, మహా దు:ఖితుడై సర్వులకు అంత్యేష్ఠి కర్మములు ఆచరించెను. తదుపరి హస్తినా పురమున కేగి ఈ విషయమును తన సోదరుడగు యుధిష్ఠిరునకు తెలిపెను. అపుడు పాండవులందరూ ద్రౌపతీ సహితులై స్వర్గారోహణము కావించిరి. ఇటచ సముద్రుడు శ్రీ రుక్మిణీ వల్లభుడు శ్రీ కృష్ణ నివాసము మినహా మిగిలిన ద్వారక నంతటినీ నీటి యందు ముంచెత్తెను. ఇప్పటికీ ద్వారక యందు **శ్రీకృష్ణుని ఘోష – "అవిద్యోవా, సవిద్యోవా బ్రాహ్మణో మామకీ తను:"** (బ్రాహ్మణుడు విద్వాంసుడయినా, విద్యా విహీనుడయినా ఆతడు నా శరీరమే!). కలియుగ ప్రారంభ కాలమున శ్రీహరి యొక్క అంశావతారమయిన విష్ణుస్వామి మహాసాగరము జొచ్చి, శ్రీహరి యొక్క ప్రతిమను ప్రాప్తించి, ద్వారకు తెచ్చి అక్కడ స్థాపించెదరు. కలియుగము నందు ఎవరు ఆ ద్వారకాధీశుని, అక్కడకు వెళ్ళి దర్శించెదరో వారు కృతార్థులగుదురు. ఎవరు శ్రీహరి గోలోక పయనమను చరిత్రను విందురో, యాదవ గోపకుల ముక్తి వృత్తాంతమును చదివెదరో వారు పాప విముక్తులగుదురు.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదమందలి శ్రీ రాధాకృష్ణుల గోలోకారోహణము అను అరువదియవ అధ్యాయము సమాప్తము)

అరువది ఒకటవ అధ్యాయము

(భగవానుడు శ్యామల వర్ణుడగుట యందలి రహస్యము; కలియుగ పాపమయ ప్రవృత్తి; దాని నుండి కాపాడబడుటకై శ్రీకృష్ణ సమారాధన, మరియు ఏకాదశీ మహాత్మ్యము)

వజ్రనాభుడు "బ్రహ్మన్! నారాయణ స్వరూపుడయిన శ్రీకృష్ణ భగవానుడు ప్రకృతికి పరుడు. అయినా ఆయన శ్యామల వర్ణుడు ఎట్లయ్యెను? ఈ విషయమును నాకు వివరముగ తెలుప వలసినది. మహామునీ! శ్రీకృష్ణ ప్రభుని చరిత్ర మీరెరిగినట్లు కర్మ మోహితులమయిన మేమెరుగము." శ్రీ గర్గా చార్యులు వారు ఆ రాజకుమారుని ప్రశంశించి ఇట్లనియె "మహారాజా! భరతాది ఋషులు శృంగార రసమును నీలి రంగుగా వర్ణించిరి. అంతేకాక లావణ్యరాశి; మరియు ఉ జ్వలమగుట చే శ్రీహరి యొక్క రూపము శ్యామలమైనది. ఆకాశమునకు గానీ, నీటికి గానీ రంగులేదు. కానీ బహుదూరము నుండి నీరు శ్యామలము, ఆకాశము శ్యామలము, నది శ్యామలము; అందు వలన ఉజ్వల లావణ్య సింధువయిన శ్రీకృష్ణుడు శ్యామల వర్ణుడుగా కనబడును. ఏదైన శ్రేష్ఠ శ్వేత వస్త్రము నందు ఇరులకు భావాను సారముగ "శ్యామ" ఛాయ గోచరమగును. అట్లే కోట్లాది కామదేవుల లీలలు గావించుట చే సాధుజనులు శ్రీహరిని శ్యామరూపునిగ వర్ధింతురు."

వజ్రనాధుడు "ముని శ్రేష్ఠా! మీ సద్వచనముల చే నా సందేహము దూరమయినది. మునీంద్రా! మీరు భవిష్యద్రష్టలు. ఇకపై భూతల మందు ఘోర కలియుగము వచ్చుచున్నది. అందు మానవ స్వభావము లెట్లుండును? దయచేసి వివరింప వలసినది."

శ్రీ గర్గాచార్యులు "మహారాజా! కలియుగము నందు పది వేల వర్షముల వరకూ భగవంతుడయిన జగన్నాధుడు భూతలమందు స్థితిగతుడై యుండును. అటుపిదప ఆయన ఉన్నప్పటికీ లేనివాని వలె నియంత్రణ వదలి పెట్టును. అందు సగము సమయము అనగా అయిదు వేల సంవత్సరములు గంగాదేవి గంగాజల మందు నివాసముండును. అందు సగము అనగా రెండు వేల అయిదు వందల సంవత్సరములు గ్రామ దేవతలు కొలువుందురు. అటుపిదప వారి ప్రభావమంతరించును. తదనంతరము కలి యొక్క మోహము కారణమున సర్వులు మోహులగుదురు. అందువలన నరకప్రాయ లగుదురు. అందరి ఆయువు అత్యంత అల్పమగును. బ్రాహ్మణులు బ్రాహ్మణుల వద్ద మూల్యము తీసికుని తమ కన్యలను అమ్ముకొందురు. క్షత్రియులు పరమ లుబ్ధులై తమ కన్యలను సంహరించెదరు. వైశ్యులు బ్రాహ్మణుల ధనమును హరించుట యందు తత్పరులై అవినీతి వ్యాపారము లాచరించెదరు.

శూద్రులు మ్లేచ్ఛ సంఘము చే బ్రాహ్మణులను దూషించెదరు. బ్రాహ్మణులు శాస్త్ర జ్ఞాన శూన్యులగుదురు. క్షత్రియులు రాజ్యాధికార వంచితులగుదురు. వైశ్యులు నిర్ధనులగుదురు. శూద్రులు తాము పని చేయు వారలకు మిక్కిలి దు:ఖము కలిగించెదరు. సర్వులు ధర్మకర్మ యందు ఆసక్తిలేక పగటిపూట మైధున కార్యక్రమములు ఆచరించెదరు. స్త్రీలు స్వేచ్ఛా విహారిణులగుదురు. పురుషులు యోని లంపటులగుదురు. దేవతా, పితృ, ఋత్విజుల, విష్ణు భగవానుని, వైష్ణవ జనులను (భగవద్భక్తులను), తులసీ, గోపూజ, మరియు సేవా, సత్కారములను కాల మోహితులగుట వలన మానవులు ఏ మాత్రము ఇష్ఠపడరు. లోకులు వేశ్యల యందు పరస్త్రీల యందు, పరధనములందు, ఆసక్తియుతులగుదురు. క్రమక్రమముగ శూద్రుల వలె సర్వులు ఒకే వర్ణము వారగుదురు. నిరంతరము మంచు మరియు రాళ్ళ వర్షము చే పృధివి సస్యహీనమగును. పంట పొలములు బంజరుభూమి యగును. వృక్షములు ఫలముల నీయవు. నదుల యందు నీరు ఇంకి పోవును. ప్రజలు ప్రభువులను, ప్రభువులు ప్రజలను సంహరించెదరు."

వజ్రనాభుడు "మునీంద్రా! అపుడు కలియుగ మందు జీవులు ముక్తి నెట్లు పొందెదరు?" శ్రీ గర్గాచార్యులు "యుధిష్ఠిరుడు, విక్రమాదిత్యుడు, శాలివాహనుడు, విజయాభినందనుడు, నాగార్జునుడు, భగవాన్ కల్కి, వీరు ధర్మాత్ములయిన ప్రభువులు. వారు రాజులుగ ప్రతిష్ఠితులయినపుడు కలియుగమందు ధర్మ ప్రతిష్ఠాపన జరుగును. యుధిష్ఠిరుని కాలమయినది. మిగిలిన రాజులు యోగ్య సమయమున అవతరించెదరు. వారు చక్రవర్తులై, అధర్మ నాశనము కావించి ధర్మ ప్రతిష్ఠాపన

కావించెదరు. వామనుడు, బ్రహ్మ, ఆదిశేషుడు, సనకాదులు విష్ణు భగవానుని ఆదేశానుసారము ధర్మరక్ష, సంస్థాపనకై, కలియుగమున బ్రాహ్మణ జన్మము నెత్తుదురు. వామనుని అంశ చే విష్ణుస్వామి, బ్రహ్మ దేవుని అంశ చే మధ్వాచార్యులు, ఆదిశేషుని అంశ చే రామానుజాచార్యులు, సనకాదులు నింబకాచార్యుల రూపమున అవతరించెదరు. కలియుగ మందు సంప్రదాయ ప్రవర్తకులుగ ఆచార్యులు యుందురు. వీరు నలుగురు విక్రమనామ సంవత్సర ప్రారంభకాలమందు ఉద్భవించి, భూతలమును తమ సంపర్కము చే పావన మొనరింతురు. సంప్రదాయ విహీనుల మంత్రములు నిష్ఫలమగును, అనగా సర్వులు సంప్రదాయములు పాటింపవలెను. ఈ సంప్రదాయము లందు పాపనాశకమగు శ్రీకృష్ణ కథామృతముండును. బ్రాహ్మణ శ్రేష్ఠులు, నారాయణ పరమయిన వైష్ణవ జనులు ఈ కథలను ప్రచారము కావింతురు. సత్య యుగమందు ఒక్కడు పాపము చేసిన ఎడల ఆదేశమంతయు పాపభరితమగును. త్రేతాయుగము నందు గ్రామము, ద్వాపరమందు కులము, కలియుగ మందు కేవలము కర్త మాత్రమే ఆ పాపమును భరింపవలసి యుండును. సత్యయుగ మందు ధ్యానము, త్రేతాయుగ మందు యజ్ఞ యాగములు, ద్వాపరమందు అర్చనా, చేయుటచే మానవులు ఎట్టి ఫలితము నొందెదరో, కలియుగమున కేవలము కేశవ నామ కీర్తనము చే మనుష్యులా ఫలము నొందెదరు.

సత్యయుగము నందు సత్య కర్మము పది సంవత్సరముల యందు సఫలమగును. త్రేతాయుగ మందు ఒక సంవత్సరమునందు, ద్వాపర మందు ఒక మాసము నందు, కలియుగము ఒక రోజు (రేయి/పగలు) నందు సఫలమగును. సర్వ ధర్మ రహితమయిన ఘోర కలియుగము నందు ఏ మానవుడు వాసుదేవ భగవానుని ఆరాధన యందు తత్పరుడగునో, అతగు నిస్సందేహముగ కృతార్థుడగును. ఈ కలియుగము నందు ఎవరు ఎవరు భగవన్నామమును చేయుదురో, లేక చేయించెదరో వారు నిస్సందేహముగ సౌభాగ్య శాలురు. “కృష్” అను శబ్దము సర్వము, “ణ” అను శబ్దము ఆత్మ యొక్క వాచకములు, అందువలన ఎవరు సర్మాత్ముడయిన పరబ్రహ్మయో అతడే కృష్ణుడు; పరబ్రహ్మ స్వరూపము, వేదముల యొక్క సారము, మరియు పరాత్పర వస్తువు. “కృష్ణ” అను రెండక్షరములు సంయక్‌రూప జప యోగ్యములు. దీనికి మించిన తత్వము లేదు. మానవులు ఎంత వరకూ కృష్ణ సేవన మొనర్పరో, అంతవరకూ కామాసక్తులై, గర్భవాస యాత్ర కావించుచూ, యమయాతనలు పడుచూ భోగుర్థులై పుడుచూ, చచ్చుచూ యుందురు. విషయవాంఛలు, భోగోపకరణములు, బంధువులు, బాంధవ్యములు, ఇవన్నియు భూతలమందు వినాశకారకములు. అందు చే వానిని సత్వరము వదలి వేయవలెను. వానిని స్వయముగ విడచినచో అది సుఖదాయకమగును. కానీ ఇతరులు వానిని విడిపించినచో అవి మిక్కిలి దు:ఖకారకములు అగును.

దైవవశమున ఎవరేని సంతజనులు/మహా పురుషుల యొక్క నిందాశ్రవణము జరిగెనేని, వెంటనే శ్రీకృష్ణ స్మరణ చేసినచో, వారు ఆ పాపము నుండి విముక్తులగుదురు. లేని ఎడల వారు రౌరవ నరకమందు పడెదరు. దేవతలు కాష్ఠము (కొయ్య), రాయి, లేక బంగారు ప్రతిమలందుండరు. ఎక్కడ మనుష్యులకు భగవద్భావము (భక్తి) యుండునో అక్కడే శ్రీహరి ప్రతిష్ఠితుడై యుండును. అందువలన మానవులకు భావమే ప్రధానము. ఎవరు కృష్ణయను రెండక్షరముల నుచ్చరించిరో వారు మోక్షమునకేగుటకు ఆయత్తులైరి. రోగార్తులగుట, సత్పురుషుల తోడి వైరము, ఇతరులను హింసించుట, బ్రాహ్మణ మరియు వేదనింద, క్రోధము దాల్చుట; కటు వచనములు పలుకుట, ఇవన్నియు నరకమునకు పోవు మానవ లక్షణములు. ఎవరు స్వర్గము నుండి ఈ లోకమునకు వచ్చిరో వారి లక్షణములు నాలుగు. 1.దాన ప్రసంగము. 2.మధుర వచనము. 3.దైవ పూజ. 4.బ్రాహ్మణ సత్కారము.”

వజ్రనాభుడు “మహానుభావా! వ్రతములయందు శ్రేష్ఠ మయినది ఏది? తీర్ధముల యందుత్తమ తీర్ధమేది? పూజనీయమయిన దేవతలలో ముఖ్యుడెవరు? ఈ విషయములు నాకు తెలుప వలసినది.”

శ్రీ గర్గాచార్యుల వారు “వ్రతముల యందు ఏకాదశీ వ్రతము సర్వశ్రేష్ఠము, తీర్ధములందు భాగీరథీ గంగా, దైవ భక్తుల యందు వైష్ణవులు, దేవతల యందు విష్ణు భగవానుడు, పూజనీయుల యందు గురువు గొప్పవారు. ఎవరు ఈ విషయమును నమ్మరో వారు కుంభీపాకమందు పడెదరు.” వజ్రనాభుడు “మహర్షీ! ఏకాదశి నాడు ఫలములు స్వీకరించు వారి గతిఏమి? నాకు విస్తారముగ తెలుప వలసినది. “శ్రీ గర్గాచార్యులు” యదునందనా! ఏకాదశి నాడు అన్నము కానీ, ఫలములు కానీ తినరాదు. నృపశ్రేష్ఠా! విధి విధానముగ ప్రసన్న పూర్వకముగ ఎవరు ఏకాదశీ వ్రతామరించెదరో వారు

తప్పక శుభ ఫలితములు పొందెదరు." నీకు ఏకాదశీ, మరియు భాగీరథీ మహాత్మ్యమును తెలిపెదను. ఉపవాసము చేయుటచే ఫలితము పూర్ణముగ లభించును. ఫలములు స్వీకరించుట చే సగము, నీరు త్రాగుట చే దాని కంటె కొంచెము తక్కువ ఫలము లభించును. వరి మరియు అన్ని రకముల అన్నములు త్యజించి కేవలము ఫలములు ప్రసన్నముగ తీసికొనవలెను. ఏకాదశి రోజున అన్నము తినువాడు ఈ లోకమున ఛండాలుని తో సమానుడు. మరియు మరణానంతరము దుర్గతిని ప్రాప్తించును. రాజేంద్రా! పాలు, పెరుగు, మిఠాయి, దోసకాయ, మెంతి, తామర విత్తనములు, మామిడి, సీతాఫలము, గంగా ఫలము, నిమ్మ ఆకులు, దానిమ్మ, నారింజ, సైంధవ లవణము, మాడిదల్లము, అల్లము, బేరి పళ్ళు, నేరేడు, దొండ, పటిక బెల్లము, చెరుకు, ద్రాక్ష మొదలయినవి ఒక్క మారు తినవచ్చు. దినమున మూడవ ప్రహరము అయిన పిదప ఒక శేరు ఫలములందు సగము బ్రాహ్మణునకు దానమిచ్చి, మిగిలిన సగము తినవలెను. ఏకాదశి రోజున ఒకమారు ఫలములు, రెండు మార్లు నీరు త్రాగవచ్చు. విష్ణు భగవానుని పూజించుచూ రాత్రి జాగరణ చేయవలెను. ఏ మానవుడు రెండు లేక మూడు మార్లు ఫలములు తినునో వానికి ఫలితముండదు. పదిహేను దినముల వచ్చు పాపము ఒక్క ఏకాదశి ఉపవాసము వలన పోవును. బ్రాహ్మణులకు భోజన దానమిచ్చి, స్వయముగ ఉపవాసము చేసి, ఏకాదశీ మహాత్మ్యము ను వినునో, అటువంటి మానవుడు సమస్త పాప విముక్తుడు అగును. ఏకాదశీ వ్రతము చే ధనార్థికి ధనము, పుత్రార్థికి పుత్రులు, మోక్షార్థికి మోక్షము లభించును.

(శ్రీ గర్గ సంహిత యందు అశ్వమేధ ఖండార్గతమయిన గర్గ వజ్రనాభ సంవాదమందలి ఏకాదశీ మహాత్మ్యము అను అరువది ఒకటవ అధ్యాయము సమాప్తము)

అరువది రెండవ అధ్యాయము

(గురువు మరియు గంగా మహాత్మ్యము; వజ్రనాభుని కృతజ్ఞత; గురుదేవ పూజనము; శ్రీకృష్ణ భజన, పూజన మరియు గర్గ సంహిత మహాత్మ్యము)

శ్రీ గర్గాచార్యులు 'మహారాజా! ఎవరు పూర్వజన్మమందు అక్షయమగు తపమాచరించెదరో వారికి మాత్రమే గురువుల యందు భక్తియుండును. ఎవరు సమర్థుడయినప్పటికీ గురువును గౌరవించడో అతడు కుంభీపాక నరకమందు పడును. ఎవరు గురుభక్తి హీనునకు ఎదురు పడుదురో వారికి గోహత్యపాతకము చుట్టుకొనును. వారు గంగా యమునలందు స్నానమాచరించి శుద్ధులవవలెను. ఎవరెవరు ఎంతెంత సంపాదించిననూ, అందు దశాంశము గురువునకు చెందును. దీనిని పాటింపక ఏ శిష్యుడు భోగించునో, ఆతడు మహా రౌరవ నరకమందు పడును. ఎవరు శ్రీహరిని నవవిధ భక్తితో కొలిచెదరో వారు అనాయాసముగ ఈ సంసారమును తరించెదరు. "జ్ఞాతి (కుటుంబీకులు), విద్యా, మహత్వము, రూపము, యవ్వనము" వీనిని ప్రయత్న పూర్వకముగ విడువవలెను. అనగా దీని యందలి అహంకారమును వదులవలెను. ఎందువలననగా ఇవి అయిదు భక్తి మార్గమున కాటంకములు.

ఎవరు భక్తి భావముతో శ్రీకృష్ణ ప్రసాదము, చరణోదకము, స్వీకరించెదరో, వారు ఈ పృధివిని పావన మొనర్చెదరు. ఇందు సందేహము లేదు. గంగ పాపమును, చంద్రుడు తాపమును, కల్పవృక్షము దీనతను, హరించును. కానీ సత్సంగము పాప, తాప, దైన్యతల మూడింటినీ హరించును. మానవుల పితృగణములు ఆ కులము నందు కృష్ణ భక్తులు పుట్టనంత వరకూ పిండము కొరకై సంసారమున భ్రమింతురు. శ్రీహరి యందు మనసు లగ్నము చేయని గురువు, బంధువు, తండ్రి, తనయుడు, మిత్రుడు, రాజు ఎందులకు? ఎవరు తమ విద్యా, ధన, గృహ, కుల, రూపాది విషయములందు, స్త్రీ పుత్రుల యందు, ఫలకామనచే అన్య దేవతల ఆరాధన యందు అభిమానము, మోహము గలిగిన మానవులు జీవించిననూ, మరణించి నట్లే!!!!

నృపశ్రేష్ఠా! నేను నీకు శ్రీకృష్ణ చరిత్ర నంతటినీ వివరించితిని. దీని శ్రవణ మాత్రము చే శోక, మోహ, భయములు, నివారణమగును. శ్రీకృష్ణ భక్తి జాగృతమగును. మానవులు ఈ చరిత్రమును శ్రవణ, పఠనముల చే తమ మనో వాంఛా ఫలములను పొందెదరు.

"అందువలన రాజేంద్రా! నీవు భక్తి భావము చే వెంటనే పరమ భక్తి భావముతో ఇంటి యందు లేక వనమందు నివసించుచూ, ఈ విశ్వమంతయు నీ మనో సంకల్ప విలాసమనీ గ్రహించి, నిరంతరము జగదీశ్వరుడయిన శ్రీకృష్ణుని భజింపుము. నరేశ్వరా! నీ ఆయువు హేమంత ఋతు రాత్రి వలె దీర్ఘమగుగాక!" నీ దర్శనము హేమంత ఋతు సూర్యుని వలె సర్వులకు ప్రియమగు గాక!" ఇది విని వజ్రనాభుడు హర్షోల్లాసితుడై శ్రీగురు చరణములకు ప్రణామము లాచరించి "గురుదేవా! మీ కరుణామయ ముఖతా శ్రీకృష్ణ మహాత్మ్యమును విని కృతార్థుడనయితిని. నా మనసు శ్రీకృష్ణుని యందు సంలగ్నమయినది." ఈ విధముగ పలికి శ్రీ గర్గాచార్యుని గంధ పుష్పాక్షలతో, సువర్ణ మాలలతో పూజించెను. అంతేకాక రథ, గజ, హయ, సువర్ణ, రజిత, గ్రామములాదిగ సమర్పించి, పూజించి, మిక్కిలి ఆనందముతో ఆయనకు పరిక్రమ కావించి, నీరాజనమునిచ్చెను. తదనంతరము శ్రీగర్గాచార్యులు వారు భూపాలునకు ఆశీర్వాదము నొసంగి, ఆయన తనకు ఒసంగిన దక్షిణలు తీసికొని, అక్కడ నుండి బయలు దేరి యమునా తటమున "విశ్రామ ఘాట్" అనుతీర్థము చేరెను. అచట గల బ్రాహ్మణోత్తము లందరికీ ఆ ధనము దానము చేసెను. తదుపరి వజ్రనాభుడు శ్రీ గర్గాచార్యుల వారి మాటను విని హస్తిన యందు యుధిష్ఠిరుని వలె అశ్వమేధ యజ్ఞమాచరించెను.

పిదప ఆ మహారాజు మధురా పురమున "దీర్ఘ విష్ణు", "కేశవదేవ", బృందావనము నందు "గోవిందదేవ", గోవర్ధనమందు "హరిదేవ", గోకులమందు "గోకేలేశ్వర", గోకులమునకు ఒక యోజనము దూరమున "బల దావుజీ" అర్చనా విగ్రహములు స్థాపించెను. వజ్రుడు లోకుల కళ్యాణమునకై వ్రజ మండల మందు వేరొక అయిదు "బలదావుజీ" విగ్రహములు సహితము స్థాపించెను. కలియుగమున నాలుగు వేల అయిదు వందల సంవత్సరములు అయిన పిదప గోవర్ధనముపై శ్రీనాథుని ప్రాదుర్భావమగును. ఆ ప్రతిమ సూర్య స్వరూపుడయిన శ్రీ విష్ణు స్వామి పూజించును. తదనంతరము వల్లభాది ఇతర గోకుల వాసులు ఆయన శిష్యులై ఆ శ్రీనాథుని పూజించెదరు.

శ్రీమద్భాగవత శ్రవణము చే పరీక్షిత్ మహారాజు ముక్తి నొందుట చే వజ్రనాభుడు వైరాగ్యవంతుడై రాజ్యత్యాగము కావింప నెంచెను. ఆ సమయమున పరమ వైష్ణవుడు ఉద్ధవుడు శ్రీకృష్ణ చరణ పాదుకలను శిరమున ధరించి నరనారాయణాశ్రమము (బదరీ) నుండి అచటి కేతించెను. మహారాజు యథోచిత స్వాగత సత్కారము లాచరించి, ఆసనమిచ్చి, ఆయన చరణములందు తన శిరము నుంచెను. అంత ఉద్దవుడు వజ్రనాభునికి భాగవత కథను వినిపించెను. అంత వజ్రుడు మిక్కిలి హర్షోల్లాసితుడై ఇట్లు పలికెను.

"మహాప్రభో! నేను ఈ భాగవతమును తొలుత పరీక్షితుని సభ యందు వింటిని. శుకదేవుడు వ్యాస భగవానుని విరచితమయిన భాగవతమును వినిపించెను. మీరు కూడ ఆ కథను వినిపించిరి. నేను కృతార్థుడనైతిని." ఈ విధముగ పలికి వజ్రనాభుడు తన రాజ్యము నందు తన పుత్రుడయిన ప్రతిబాహువునకు పట్టము కట్టి విమానము ద్వారా గోలోక ధామమునకేగెను. ఆయనతో పాటు ఉద్దవుడు సహితము ఆ పరమధామము చేరిరి. మధుకు దక్షిణమున ప్రతి బాహువు, ఉత్తరమున పరీక్షిత్ పుత్రుడు జనమేజయుడు రాజ్యము చేసిరి.

"ఇకముందు పరమ దారుణమయిన కలియుగము వచ్చుచున్నది. కానీ సంపూర్ణ పాన నాశనమునకు ఒక నివారణము కానపట్టుచున్నది. ఎంత వరకు భాగవత శాస్త్రము యుండునో, ఎంత వరకు గోకులము నందు గోస్వాములు నివసించెదరో, ఎంత వరకు గంగ, గోవర్ధనములుండునో, అంత వరకు కలియుగ ప్రభావము యుండదు. ఎట్లు భారత వర్షమందలి తొమ్మిది ఖండములందు మధ్య భాగమున ఒక పుష్ప కర్ణిక వలె సువర్ణమయ మేరుగిరి యున్నదో, అట్లే గర్గాచార్యుని గోలోక ఖండ సంహిత యందు అశ్వమేధ పర్వము సుమేరువు వలె ప్రకాశించుచున్నది. దీని శ్రవణ మాత్రమున బ్రహ్మ హత్య, స్త్రీ హత్య, రాజ హత్య, పితృ హత్య మరియు గో హత్య, మొదలగు సమస్త పాతకముల నుండి ముక్తి నొందెదరు. దీనిని శ్రవణము చేసిన ఎడల బ్రాహ్మణుడు విద్యను, క్షత్రియుడు రాజ్యమును, వైశ్యుడు ధనమును, శూద్రుడు ధర్మమును ప్రాప్తి నొందును. నదుల యందు గంగ, దేవతలందు శ్రీకృష్ణ భగవానుడు, తీర్థములందు ప్రయాగ;

అట్లే సమస్త సంహితలందు అశ్వమేధఖండ సంహిత ఉత్తమము. దీని శ్రవణ మాత్రమున మానవుడు తృప్తినొందును. ఎట్లు భాగవత శ్రవణము చే ఇతర శాస్త్రముల యందు ఆసక్తి యండదో, అట్లే ఈ సంహితను పఠించిన పిదప అన్యత్ర ఆసక్తి యుండదు."

ఈ విధముగ మునులు శ్రీకృష్ణ చరిత్రను విని ప్రసన్న చిత్తులై ఉగ్రశ్రవశుని మిక్కిలి ప్రశంశించిరి.

శ్రీ గర్గా చార్యులవారు ఇట్లు పలికిరి "కరుణానిధీ! నారాయణా! నేను సంసార సాగరము నందు మునిగి అత్యంత దయనీయ దు:ఖితుడనైతిని. గ్రహములు కాల రూపమున నా అంగాంగములను ఛిద్రము కావించినవి. నన్ను ఉద్ధరింపుము. అనాధ రక్షకా! సాధు శిరోమణీ! గురుదేవా! మమ్మనుగ్రహింప వలసినది. పరమేశ్వరుడు త్రిలోకములను అనుగ్రహించునట్లు మీరు మమ్ములను అనుగ్రహించు గాక!"

"నా గురుకృప మరియు మదన మోహనుని సేవా పుణ్యము చే నా వాణి అనుగ్రహించినంత మేర నేను మీకు శ్రీకృష్ణ చరిత్రను వినిపించితిని. వ్యాస, వాల్మీకి మహర్షులారా! మీరు నా ఈ తుచ్ఛ కవితపై దృష్టి సారించి, నా అపరాధములను మన్నింప వలసినది. వ్రజపాలకుడు, నీలిమేఘ శ్యాముడు, దేవతల స్వామి, భక్తుల పీడను దూరము కావించు పరమార్ధ స్వరూపుడు, ఆ అనంత దేవుని, రాధా వల్లభుని, మాధవుని, శ్రీకృష్ణుని, నా శిరసు వంచి మనసున భక్తి భావము చే ప్రణామము లాచరించుచున్నాను."

గర్గ సంహిత సంపూర్ణము

గర్గ సంహిత మహత్యము

(గర్గ సంహిత ప్రాకట్య ఉపక్రమము)

ఎవరు శ్రీకృష్ణునే ఆరాధ్య దేవతగా భావించి, వృష్ణివంశస్తులకు అచార్యుడై, కవిశ్రేష్ఠులయిన శ్రీ గర్గాచార్యులు వారికి మరల మరల నమస్కారములు. శౌనకుడు "బ్రహ్మన్! నేను మీ ముఖతా శ్రోత్రేంద్రియమునకు సుఖము నొసగు పురాణముల మహాత్మ్యమును విస్తారముగ వింటిని. ఇపుడు గర్గ సంహిత యొక్క సారరూప మహాత్మ్యమును నాకు వర్ణింప వలసినది. శ్రీ రాధామాధవుల మహిమలను వివిధ ప్రకారములుగ వర్ణింపబడిన గర్గసంహిత ధన్యము." సూతుడు "శౌనకా! ఈ మహాత్మ్యమును నేను నాదర మహర్షి ద్వారా వింటిని. దీనిని "సమ్మోహన తంత్ర" మందు పరమ శివుడు పార్వతీ దేవికి వల్లించెను. అద్దానిని నీకు తెలిపెదను.

కైలాస పర్వత మందలి నిర్మల శిఖరమందు, అలకనందా తటమున అక్షయవట వృక్ష ఛాయన పరమశివుడు ఎల్లప్పుడూ విరాజమానుడై యండును. ఒకనాటి మాట! సంపూర్ణ మంగళముల కధిష్ఠాత్రి అయిన గిరిజాదేవి శంకర భగవానుని ప్రసన్న పూర్వకముగ ఇట్లడిగెను "నాధా! మీరు ఈ ప్రకారము ధ్యానము చేయుచున్న ఆ మహనీయుని ఉత్కృష్ఠ చరిత్ర, మరియు జన్మ, కర్మ రహస్యము నాకు తెలుప వలసినది. ప్రభూ! నేను మీ ముఖతా గోపాలదేవుని సహస్ర నామములు వింటిని. మీరు నాకు ఆఖ్యానము కూడా తెలుప వలసినది." శంకరుడు "సర్వమంగళా! రాధాపతి, పరమాత్మ, శ్రీకృష్ణ ప్రభువు యొక్క చరిత్ర గర్గ సంహిత యందు కలదు." పార్వతీ దేవి "శంకరా! పురాణ సంహితలు అనేకములు గలవు. కానీ మీరు గర్గ సంహితను ప్రత్యేకముగ ప్రశంశించుచున్నారు. ఈ సంహిత యందు భగవానుని ఏ లీలలు వర్ణింపబడినవి? పూర్వకాలమందు ఎవరి చే ప్రేరితుడై గర్గముని ఈ సంహితను రచించెను? దీని శ్రవణ మాత్రమున ఏ విధమయిన పుణ్యము ప్రాప్తించును? అద్దాని ఫలితమేమి? పురాతన కాలమందు దీనిని ఎవరు పఠించిరి?" పార్వతీదేవి ఈ విధముగ ప్రశ్నించుట చే శంకరుడు ప్రసన్నుడై గర్గసంహితను ఒక్కమారు స్మరించి ఇట్లనియె "దేవీ! శ్రీరాధా మాధవుల యొక్క, గర్గ సంహిత యొక్క మహాత్మ్యమును శ్రద్ధగా వినవలసినది. ఇది అత్యంత పాప నాశకము. ఒకానొక సమయమందు బ్రహ్మదేవుని ప్రార్ధనచే శ్రీకృష్ణ భగవానుడు భూతలమున అవతరించుటకై చింతించు చుండెను. ఆ సమయమున శ్రీకృష్ణ పరమాత్ముడు మొట్టమొదట శ్రీరాధాదేవికి ఈ చరిత్రను తెలిపెను. తదుపరి గోలోకమున ఆదిశేషుడు ఈ ఆఖ్యాన శ్రవణమునకై ప్రార్ధించెను. అంత భగవానుడు ప్రసన్నుడై తన సంపూర్ణ చరిత్రను తిరిగి వినిపించెను. తదుపరి శేషుడు బ్రహ్మదేవునికి, బ్రహ్మ ధర్మునికి, వినిపించిరి.

తదుపరి ధర్ముడు తన పుత్రులయిన నరనారాయణులకు ఒక ఏకాంత ప్రదేశమున అమృతమయమయిన ఈ సంహితను వినిపించెను. అంత నారాయణుడు సేవా పరాయణుడయిన నారదునికి, దీనిని అందించెను. తదుపరి తనను ప్రార్ధించిన గర్గాచార్యునికి నారద మహర్షి తాను నారాయణుని నుండి వినిన సర్వస్వమునూ వినిపించెను. శ్రీహరి భక్తి, జ్ఞానముల చే నిండిన ఈ కథామృతమును విని గర్గుడు నారదుని పూజించెను. పిదప నారదుడు భూత, భవిష్యత్, వర్తమానములను తెలిసిన గర్గునితో ఇట్లనియె "గర్గాచార్యా! మీకు నేను శ్రీహరి యొక్క యశోగాధ సంక్షేపముగ వినిపించితిని. ఇది వైష్ణవులకు పరమ ప్రీతికరము. దీనిని మీరు విస్తారముగ వర్ణింపవలసినది. కృష్ణ భక్తిని ఇనుమడింపజేయునట్లు, సర్వుల కామనలు పూర్ణమగునట్లు, నాకు పరమ ప్రియమగునట్లు, ఒక అద్భుత శాస్త్రముగ దీనిని తిర్చిదిద్ద వలసినది. నా ఆజ్ఞను అనుసరించి కృష్ణ ద్వైపాయనుడు సమస్త శాస్త్రముల యందు పరమోత్కృష్ఠమయిన భాగవతమును రచించెను. నేను భాగవతమును ఎట్లు రక్షించెదనో, అట్లే నీ సంహితను సహితము బహుళాశ్వ మహారాజుకు వినిపించెదను."

(శ్రీ గర్గ సంహితా మహాత్మ్యము నందు పార్వతీ శంకర
సంవాదమను ఒకటవ అధ్యాయము సమాప్తము)

రెండవ అధ్యాయము

(నారదుని ప్రేరణ చే గర్గాచార్యులు వారు గర్గ సంహితను రచించుట; సంతాన హీనుడై దు:ఖితుడయిన ప్రతిబాహు మహారాజు వద్దకు శాండిల్య మహర్షి ఏతెంచుట)

మహాదేవుడు "దేవర్షి నారదుని పలుకులు విని వినయముతో తన వంచుకొని, మందస్మితుడై ఇట్లనియె". "బ్రహ్మన్! మీరు విధించిన కర్తవ్యము మిక్కిలి కష్టతరము. అయిననూ మీ కృపా కటాక్షములు యున్నచో నేను ఆ కార్యమును సాధింతును." ఇది విని నారద మహర్షి హర్షాతిరేకము చే మహతి యందు వీణానాదము కావించుచు బ్రహ్మ లోకమునకేగెను. తదనంతరము శ్రీ గర్గాచార్యుల వారు గర్గాచలమునకేగి ఈ మహాద్భుత శాస్త్ర రచన గావించెను. ఇందు దేవర్షి నారద, బహుళాశ్వ సంవాదము కలదు. ఇందు శ్రీకృష్ణుని విభిన్న చరిత్రలు పన్నెండు వేల శ్లోకములందు అమృతమయముగా వర్ణింపబడెను. శ్రీ గర్గాచార్యులు వారు తాను గురుముఖతా విన్నది, తాను కనులారా చూచినది, అంతయు ఇందు వర్ణించెను. ఇది "గర్గ సంహిత" అను పేర ప్రసిద్ధమై, సర్వులకు కృష్ణ భక్తినీ, సర్వ కార్యసిద్ధినీ ప్రసాదించును. ఈ విషయమై ఒక పురాణేతిహాసము కలదు. దీనిని విన్నంతనే సర్వ పాపములు నశించును.

వజ్రనాభుని పుత్రుడయిన ప్రతిబాహువు ప్రజా పాలనతత్పరుడు. ఆయన భార్య మాలినీదేవి. వారు మధురా పురి యందు నివసించుచుండిరి. వారికి పుత్ర సంతతి లేదు. వారు దూడల సహితముగ ఆవుల దానము చేసిరి. భూరి దక్షిణల సహితముగ అనేక యజ్ఞయాగాదులు కావించిరి. భోజన, ధనముల ద్వారా గురువులను, బ్రాహ్మణులను, దేవతలను పూజించిరి. అయిననూ సంతతి కలుగక, రాజు చింత్రాక్రాంతుడై, ఆ దంపతులిరువురు శోక సముద్రమున మునిగిరి. ఆ రాజు యొక్క పితరులు "ఈ రాజు యొక్క అనంతరము మనకు తర్పణ లిచ్చువారు లేరు. ఈ విషయమును వీరు, వీరి భృత్యులు పట్టించుకొనుట లేదు." మహారాజు "పుత్రహీనుడయిన మనుష్యుని జన్మము నిష్ఫలము. పుత్రులు లేని గృహము శూన్యమై దు:ఖ భరితముగ యుండును. పుత్రుడు లేక మనుష్యుడు ఏదో ఒక ఉపాయము ద్వారా పుత్రుని బడయవలెను. అందు వలన భూతల మందు కీర్తి, పరలోక మందు శుభగతి కలుగును. ఏ పుణ్యశాలి గృహ మందు పుత్రోదయమగునో వాని ఇంట ఆయురారోగ్య, సంపత్తి ఎల్లప్పుడు నివసించును." అని చింతించెను. ఆ మహారాజు తన కేశములు తెల్లనగుట కూడా గమనించి ఆయన చింతా క్రాంతుడయ్యెను.

ఆ సమయమున శాండిల్య మహాముని స్వేచ్ఛగా విహరించుచూ ప్రతిబాహువును కలియుటకు మధురాపురి ఏతెంచెను. ఆయనను చూచి, మహారాజు వెంటనే లేచి, అర్ఘ్య పాద్యాదులు సమర్పించి, ఆశీనుని గావించి, మధుపర్కాది ఉపచారములతో సేవించెను. రాజు ఉదాసీనుడుగ యుండుట గమనించి, ముని విస్మితుడై స్వస్తి వాచకములతో ఆయనను దీవించి కుశల ప్రశ్నలడిగెను. అంత మహారాజు "బ్రహ్మన్! పూర్వ జన్మ దోష ఫలితముగ నాకు సంప్రాప్తించిన దు:ఖమును గూర్చి నేను ఏమని చెప్పగలను? కానీ మీ వంటి ఋషులకు ఏదియును అజ్ఞాతము కాదు. నాకు రాజ్యము, నగరము ఏవియునూ రుచించుట లేదు. నేనేమి చేయగలను? ఏ విధముగ నాకు పుత్ర ప్రాప్తి కలుగును? నా యొక్క స్థితి చూచి నా రాజ్య ప్రజలు సహితము దు:ఖితులైయున్నారు. బ్రహ్మన్! మీరు సాక్షాత్ దివ్య దర్శి. నాకు వంశ ప్రవర్ధకుడు; దీర్ఘాయువు అయిన పుత్రుడు కలుగుటకు ఏదేని ఉపాయము తెలుప వలసినది." అంత మునీంద్రుడు మహారాజును శాంత పరుచుచూ ఇట్లనియె.

(శ్రీ గర్గ సంహితా మహాత్మ్యము నందు ప్రతిబాహు శాండిల్యుల సంవాదమను రెండవ అధ్యాయము సమాప్తము)

మూడవ అధ్యాయము

(ప్రతిబాహు మహారాజుకు శాండిల్యముని గర్గసంహిత యొక్క మహాత్మ్యమును, శ్రవణ విధిని తెలుపుట)

శాండిల్య మహర్షి "పూర్వము నీవు ఎన్నియో ఉపాయములతో కార్యము లాచరించితివి. అవి ఏవియును పుత్ర సంతతి ఈయలేదు. ఇపుడు పత్నీ సహితుడవై శుద్ధ హృదయము తో గర్గ సంహితను ఆలకింపుము. ఈ సంహిత ధన, పుత్ర మోక్ష ప్రధానము కావించును. కలియుగము నందు ఏ మానవుడు ఈ సంహితను శ్రవణము చేయునో, వానికి విష్ణు భగవానుడు పుత్రుడు, సుఖము మరియు అన్ని రకముల భోగములు, సంపదలు ప్రసాదించును. నరేశ్వరా! ఈ గర్గ సంహితను నవ: పారాయణ రూప యజ్ఞము చే మానవుడు సద్య: పావనుడగును. ఈ లోకము నందు సర్వ సుఖములు ప్రాప్తించును. దేహ పతనానంతరము గోలోకము చేరును. ఈ కథను వినుట చే రోగగ్రస్తులు రోగము నుండి, భయభీతులు భయము నుండి, బంధనగ్రస్తులు బంధనము నుండి విముక్తులగుదురు. నిర్ధనుడు ధనవంతుడు, మూర్ఖుడు పండితుడు అగును. ఈ కథా శ్రవణము చే బ్రాహ్మణుడు విద్వాంసుడు, క్షత్రియుడు విజేత, వైశ్యుడు ధనసంపత్తిని, శూద్రుడు పాప రహితుడు అగును. సకల మనోరథములు సఫలమగును. ఎవరు నిష్కాములై భక్తి పూర్వకముగ ఈ సంహితను వినెదరో వారు విఘ్నములు జయించి, దేవతలను పరాజితుల గావించి, గోలోక ధామమునకు ఏగెదరు.

మహారాజా! గర్గ సంహిత అంత తేలికగా ఎవ్వరికి లభింపదు. అనేక వేల జన్మలానంతరము మాత్రమే అది సాధ్యము. దీనిని వినుటకు దినముల యొక్క నియమము లేదు. ఎప్పుడయిననూ వినవచ్చును. కలియుగ మందు దీని శ్రవణము భక్తి, ముక్తులను ప్రసాదించును. జీవితము క్షణ భంగురము. రేపు ఏమగునో ఎవరికి ఎరుక? అందువల్ల ఈ సంహితా శ్రవణమునకు తొమ్మిది రోజులు నియమము చెప్పబడినది. శ్రోత జ్ఞాన పూర్వక బ్రహ్మ చర్యము అవలంబించుచూ, ఏక భుక్త భోజనము కావించ వలెను. ఆ విధానము చే ప్రతి దినము మిష్ఠాన్నము (మిఠాయిలు); వరి లేక జొన్నల యొక్క పూరీలు, సైంధవ లవణము, కందమూలములు, పెరుగు, పాలు, ఆహారముగ స్వీకరింప వలెను. విష్ణు భగవానునికి అర్పించిన ప్రసాదమే ఆహారముగ స్వీకరింప వలెను. శుద్ధ మనస్కుడై కథా శ్రవణము చేయవలెను. పృథ్వీశయనము చేయుచూ, క్రోధ లోభములను విడువ వలెను. ఈ విధముగ గురుముఖముగా కథా శ్రవణము చేసినట్లయిన సంపూర్ణమనో వాంఛా ఫలసిద్ధి కలుగును.

గురుభక్తి రహితులు, నాస్తికులు, పాపులు, విష్ణుభక్తి రహితులు, శ్రద్ధాశూన్యులు, మరియు దుష్టులకు ఈ కథాశ్రవణము అందదు. విద్వాంసులైన శ్రోతలు తమకు పరిచితులయిన బ్రహ్మ, క్షత్రియ, వైశ్య శూద్రులందరినీ పిలిచి ఒక శుభ ముహూర్తమందు ఈ కథా శ్రవణము కావింప వలెను. భక్తి పూర్వకముగ అరటి బోదెలను స్థంభములుగా నిలిపి, ఒక మండప నిర్మాణము కావించి, పంచ పల్లవ సహిత కలశ స్థాపన చేసి, గణేశుని పూజించి పిదప నవగ్రహ పూజ చేయవలెను. తదనంతరము పుస్తకమును పూజించి, వక్తను సహితము గౌరవించి ఆయనకు సువర్ణ దక్షిణ అర్పించవలెను. ధనహీనుడయిన వెండి సహితము సమర్పించ వచ్చును. కలశమయ శ్రీ ఫలమును స్థాపించి, తీయని పదార్థములు నివేదించ వలెను. తదుపరి తులసీ దళములతో భక్తిగా పూజ చేసి, హారతినీయవలెను. కథ సమాప్తి దినమున శ్రోతలకు ప్రదక్షిణము ఆచరించ వలెను. "పరస్త్రీ గాములు, ధూర్తులు, కొండెములు చెప్పువారు, శివనిందాపరులు, విష్ణుభక్తి హీనులు, క్రోధి" వీరు వక్తగా పనికిరారు. "వివాదములు చేయువారు, నిందకులు, మూర్ఖులు, కథకు విఘ్నము కలిగించువాడు, సర్వులకు దు:ఖము కలిగించువారు" శ్రోతలుగ అనర్హులు.

గురుసేవా పరాయణులు, విష్ణు భక్తులు, కదార్థమును గ్రహించువారు, వినుటయందు ఆసక్తి కలిగినవారు, వారు శ్రేష్ఠమయిన శ్రోతలు, శుద్ధులు, ఆచార్య కులోత్పన్నులు, శ్రీ కృష్ణ భక్తులు, అనేక శాస్త్ర విశారదులు, దయాశీలురు,

సందేహ నివృతి యందు నిష్ణాతులు, వీరు ఉత్తమ వక్తలు.

తొమ్మిదవ రోజు యొక్క విధి విజ్ఞాన కాండ యందు తెలుప బడినది. ఆ దినమున బుద్ధి సంపన్నమయిన శ్రోత పుష్ప చందన నైవేద్యముల చే పుస్తకమును పూజించి, తిరిగి స్వర్ణ, రజిత, వస్త్ర భూషణ, దక్షిణలతో వక్తను పున: పూజించి యధాశక్తి తొమ్మిది వేలు, లేక తొంబది తొమ్మిది, లేక తొమ్మిది మంది బ్రాహ్మణులను ఆహ్వానించి వారికి పాయసముతో పాటు మృష్టాన్న భోజనము నొసంగ వలెను. అపుడు కథాశ్రవణ ఫలితము లభించును. కథా విశ్రాంతి సమయమున విష్ణు భక్తి కీర్తనలాలపించ వలెను. ఆ సమయమున బాజా భజంత్రీలు, శంఖ మృదంగాది వాద్యములు, జయ జయ ధ్వానములు కావింప వలెను. ఏ శ్రోత గర్గ సంహితను స్వర్ణ సింహాసనము పై యుంచి వక్తకు దానమిచ్చునో అతడు దేహ పతనానంతరు శ్రీహరిని ప్రాప్తించును."

(శ్రీ గర్గ సంహిత మహాత్మ్యము నందలి ప్రతిబాహు సంవాదమందలి గర్గ సంహిత మహాత్మ్యము మరియు విధి విధానమను మూడవ రెండవ అధ్యాయము సమాప్తము)

నాల్గవ అధ్యాయము

(శాండిల్య మహాముని ప్రతిబాహు మహారాజు కు గర్గ సంహిత వినిపించుట; శ్రీకృష్ణుడు ప్రత్యక్షమై రాజునకు వరదాన మొసగుట; రాజుకు పుత్రుడు ప్రాప్తించుట; సంహితా మహాత్మ్యము)

పరమశివుడు "ప్రియా! శాండిల్యముని యొక్క పలుకులు విని రాజు ప్రసన్నుడై వినయముతో ఇట్లు ప్రార్థించెను. "మహర్షీ! నేను మీ శరణాగతుడను. మీరు శీఘ్రముగ శ్రీహరి యొక్క కథాశ్రవణము కావించి నన్ను పుత్రవంతుని కావింపుడు." మహారాజు యొక్క విన్నపమును విని శాండిల్యుడు యమునా తటము నందు మండప నిర్మాణము కావించి సుఖదాయకమగు కథా పారాయణ యోచన కావించెను. అది విని అనేక మంది మధురా వాసులు కూడా అచటికి ఏతించిరి. మహైశ్వర్య సంపన్నుడయిన ప్రతిబాహు మహారాజు కథా ప్రారంభమున, సమాప్తమున కూడా బ్రాహ్మణులను ఉత్తమ భోజనములతో, ధనరాశులతో సత్కరించెను. తదుపరి రాజు శాండిల్యమునివరుని అనేక విధములుగ పూజించి రథ, అశ్వ, గజ, గో, ద్రవ్యరాశి, మరియు మెరయుచున్న అనేక రత్నరాశులు బహూకరించెను. సర్వమంగళా! తదుపరి శాండిల్యుడు నాచే చెప్పబడిన సంపూర్ణ దోష నివారణకరమయిన కృష్ణ సహస్రమును పారాయణ కావించెను. కథా సమాప్తి అయిన పిదప శాండిల్యుని చే ప్రేరితుడై మహారాజు మదన మోహనుని భక్తి పూర్వకముగ ధ్యానించెను.

తక్షణము శ్రీకృష్ణుడు తన ప్రేయసి శ్రీరాధికా సహితుడై, పార్షదులతో అక్కడ ప్రత్యక్షమయ్యెను. ఆయన వంశీ వేత్ర హస్తుడై, కోట్లాది కామదేవులను మోహ పరచు కాంతిచే ప్రకాశించు చుండెను. ఆయనను కాంచి, సర్వులూ లేచి ఆయన పాదములపై వ్రాలిరి. అంత శాండిల్యుడు "ప్రభూ! మీరు సదా వైకుంఠ పురమందు లీలాతత్పరులై యుందురు. మీ స్వరూపము పరమ మనోహరము. గోపాలక లీల యందు మీకు విశేషమయిన అభిరుచి కలదు. పరమ శ్రేష్ఠులయిన మీకు నమస్కరించు చున్నాను." ప్రతి బాహు మహారాజు "గోలోక నాథా! బృందవనాధీశ్వరా! మీరు భక్తులకు సుఖదాయకులు. నిత్య విహారా! రాధాపతీ! వ్రజాంగనలు నిరంతరము మీ కీర్తిగానము చేయుదురు. గోవిందా! గోకుల పాలకా! రాణీరాధేశా! పురుషోత్తమా! మీకు జయమగు గాక! మిమ్ము శరణు జొచ్చు చున్నాను."

సమస్త శ్రోతలు "జగన్నాధా! మా అపరాధములు మన్నింప వలసినది. రాజుకు సుపుత్రుని, మాకు మీ చరణార విందములందలి భక్తినీ ప్రసాదింపవలసినది." భగవానుడు "శాండిల్యమునివరా! రాజా! ప్రజలారా! మీ కథనము

సఫలమగును. బ్రహ్మన్! ఈ గ్రంధ రచయిత గర్గముని. అందువలన ఇది గర్గసంహిత గా ప్రసిద్ధమయినది. ఇది సంపూర్ణముగ దోషములు హరించునది. పుణ్య స్వరూపిణి. చతుర్విధ పురుషార్ధ ఫల ప్రదాయిని. కలియుగము నందు ఏఏ మానవుడు ఏఏ కామనలతో దీనిని పఠించునో, ఆ కామనలు తప్పక ఫలించును." ఈ విధముగ పలికి మాధవుడు అంతర్ధాన మయ్యెను. ఆ సమయమున శాండిల్యుడు, మహారాజు, ప్రజలు, సర్వులు పరమానందభరితులైరి. తదుపరి శాండిల్యుడు తనకు ఒసగ బడిన ధనమును తిరిగి మధురా వాసులయిన బ్రాహ్మణులకు పంచి ఇచ్చి, మహారాజుకు మరియొక మారు ఆశ్వాసన మొసంగి అంతర్ధానుడయ్యెను.

తదుపరి మహారాణి గర్భవతియై ఒక గొప్ప సుపుత్రునకు జన్మనిచ్చెను. రాజు పరమానంద భరితుడయ్యెను. అతడు పుత్రోత్సవమునకై బ్రాహ్మణులకు గో, భూ, సువర్ణ, వస్త్ర, గజాశ్వములను దానమొనర్చెను. ఆ పిల్లవానికి జాతక కర్మాదులు కావించి "సుబాహు" అని నామ కరణము చేసెను. ఈ విధముగ ప్రతిబాహువు సఫల మనోరధుడయ్యెను. మహారాజు (ప్రతి బాహువు) గర్గ సంహిత శ్రవణము కావించుచూ, ఇహలోక ఫలము లన్నియు అనుభవించి చివరకు యోగులకు దుర్లభమయిన గోలోకమున కేగెను. ఈ గర్గ సంహిత స్త్రీ, పుత్ర, ధన, వాహన, కీర్తి, గృహ, రాజ్య, సుఖ, మోక్షములను ప్రసాదించును."

సూతుడు "శౌనకా! మహాదేవుని ముఖతా ఈ మహాద్భుత ఇతిహాసమును వినిన విష్ణు భగవానుని వైష్ణవీ మాయ (సర్వమంగళ, పార్వతీదేవి) పరమ ప్రసన్నురాలైనది. ఈ విష్ణు కధలను మరల మరల వినుటకు కలియుగ మందు బిల్వకేశ వనమందు ఆవిర్భవించుటకు నిశ్చయించుకొనినది.

ఈ కారణముననే ఆ తల్లి లక్ష్మీరూపధారిణియై గంగకు దక్షిణ తీరమున "సర్వ మంగళ" గా ప్రకటితయినది. మునులారా! నాచే చెప్పబడిన ఈ గర్గసంహిత మహాత్మ్యమును చెప్పినా, వినినా, చదివినా, వారు పాపములు, దు:ఖములు నుండి విముక్తులగుదురు.

(శ్రీ గర్గ సంహితా మహాత్మ్యము నందలి శాండిల్య ప్రతిబాహు సంవాదము నందలి గర్గసంహితా మహాత్మ్యము అను నాల్గవ అధ్యాయము సమాప్తము)

మంగళ్ మహత్

అనుబంధము

శ్రీ శివకృత శ్రీకృష్ణ స్తోత్రము

(షట్పదీ)

ఓం! అవినయమపనయ విష్ణో దమయమన: శమయ విషయ మృగత్రష్ణామ్ ।
భూతదయాం విస్తారయతారయ సంసార సాగరత: ॥

దివ్యధునీ మకరందే పరిమళ పరిభోగ సచ్చిదానందే ।
శ్రీపతి పదారవిందే భవభయ ఖేదచ్ఛిదే వందే ॥

సత్యపి భేదాపగమే నాథ తవాహం నమానుకీనర్త్వం ।
సాముద్రీహి తరంగ: క్వచన సముద్రీ న తారంగ: ॥

ఉద్ధతనగ నగాభిదనుజ దనుజకులామిత్ర మిత్రశశిదృష్ఠే ।
దుష్ఠే భవతి ప్రభవతి నభవతికిం భవ తిరస్కార: ॥

మత్స్యాది భిరవతారై రవతారవతారవతా సదా వసుధామ్ ।
పరమేశ్వర పరిపాల్యో భవతా భవతా పభీతోహమ్ ॥

దామోదర గుణమందిర సుందర వదనారవింద గొవింద ।
భవ జలధి మధన మందర పరమం దరమపనయత్వంమే ॥

నారాయణ కరుణామయ శరణం కరవాణి తాకకీ చరణౌ ।
ఇతి షట్పదీ మదీయే వదన సరోజే సదా వసతు ॥

బలభద్ర కవచము

దుర్యోధన ఉవాచ:
గోపీభ్య: కవచం దత్తం గర్గాచార్యేణ ధీమతా. సర్వ రక్షాకరం దివ్యం దేహి మహ్యం మమామునే.
శ్రీ ప్రాడ్విపాక ఉవాచ:
స్నాత్వా జలే క్షేమధర: కుశాశన: పవిత్ర పాణి: కృత మంత్ర మార్జన:
స్మృత్వాధనత్వా బలమచ్చుతాగ్రజం సంధారయేద్ వర్మ సమాహితో భవేత్ ॥

గోలోక ధామాదిపతి: పరేశ్వర: పరేషు మాంపాతు పవివత్ర కీర్తన:
భూమండలం సర్షపవద్ విలక్ష్యతే యమ్మూర్ధ్ని మాంపాతు స భూమి మండలే ॥

సేనాసు మాం రక్షతు సీరపాణిర్యుద్ధే సదా రక్షతు మాం హలీచ
దుర్గేషు చావా న్ముసలీ సదా మాం వనేషు సంకర్షణ ఆదిదేవ: ॥

కళిందజా వేగహరే జలేషు నీలాంబరో రక్షతు మాం సదాగ్నౌ
వాయైచ రామోవతు ఖే బలశ్చ మహార్ణవేనంత వపు: సదామామ్ ॥

శ్రీ వాసుదేవో వతు పర్వతేషు సహస్ర శీర్షా చ మహా వివాదే
రోగేషు మాం రక్షతు రౌహిణేయో మాం కామపాలోవతు వా విపస్తు ॥

కామాత్ సదా రక్షతు ధేనుకారి: క్రోధాత్ సదామాం ద్వివిద ప్రహారీ
లోభాత్ సదా రక్షతు బల్వలారిర్మోహాత్ సదామం కిల మాగధారి ॥

ప్రాత: సదా రక్షతు వృష్ణిధుర్య: ప్రాహ్ణే సదామాం మధురా పురేంద్ర:
మధ్యందినే గోప సఖ: ప్రపాతు స్వరాట్ పరాహ్ణేవతు మాం సదైవ ॥

సాయం ఫణీంద్రోవతు మాం సదైవ పరాత్పరో రక్షతు మాం ప్రదోషే
పూర్ణే నిశీథేచ దురంత వీర్య: ప్రత్యూష కాలేవతు మాం సదైవ ॥

విదిక్షుమాం రక్షతు రేవతీ పతిర్దిక్షు: ప్రలంబారి రథో యదూద్వ:
ఊర్ధ్వసదామాం బలభద్ర ఆరాత్ తథా సమంతాద బలదేవ ఏవహి ॥

అంత: సదావ్యాత్ పురుషోత్తమో బహిర్నాగేంద్ర లీలోవతు మాం మహాబల:
సదాంతరాత్మాచ వసన్ హరి: స్వయం ప్రపాతు పూర్ణ: పరమేశ్వరో మహాన్ ॥

దేవాసురాణాం భయనాశనం చ హుతాశనం పాప చ యైంధ నానామ్
వినాశనం విఘ్న ఘటస్య విద్ధి సిద్ధాసనం వర్మవరం బలస్య ॥

దేవాధిదేవ భగవన్ కామపాల నమోస్తుతే ।
నమోన్వనంతాయ శేషాయ సాక్షాత్ రామాయతే నమ: ॥

శ్రీ బలరామ స్థోత్రమ్

దుర్యోధన ఉవాచ:
స్థోత్రం శ్రీ బలదేవస్య ప్రాడ్విపాక మహామునే
వదమాం కృపయా సాక్షాత్ సర్వ సిద్ధి ప్రదాయకమ్ ॥

ప్రాడ్విపాక ఉవాచ:
స్థవ రాజంతు రామస్య వేదవ్యాస కృతమ్ శుభమ్
సర్వ సిద్ధి ప్రదం రాజశృణు కైవల్యదం నృణామ్ ॥

దేవాధిదేవ భగవన్ కామపాల నమోస్తుతే
నమో స్వధంతాయ శేషాయ సాక్షాత్ రామాయతే నమ: ॥

ధరాధరాయ పూర్ణాయ స్వధామ్నే సీరపాణయే
సహస్రశిరసే నిత్యం నమ: సంకర్షణాయతే ॥

రేవతీ రమణాత్వం వై బలదేవో అచ్యుతాగ్రజ:
హలాయుధ ప్రలంభఘ్న పాహిమాం పురుషోత్తమ ॥

బలాయ బలభద్రాయ తాళాంకాయ నమోనమ:
నీలాంబరాయ గౌరాయ రోహిణేయాయతే నమ: ॥

ధేనాకారి: ముష్టికారి: కూటారి: పల్వలాంతక:
రుక్మ్యారి: కూపకర్ణారి: కుంభాండారి స్త్వమేవహి ॥

కాళిందీ భేదనోసి త్వం హస్తినా పూర కర్షక:
ద్వివిదాం: యాదవేంద్రా వ్రజమండల మండన: ॥

కంస భాతృ ప్రహంతాసి తీర్ధ యాత్రా కర: ప్రభు:
దుర్యోధన గురు: సాక్షాత్ పాహి పాహి ప్రభోత్వ ॥

జయ జయాచ్యుత పరాత్పర స్వయమనంత దిగంతాగత శృత
సురమునీంద్ర ఫణీంద్ర వరాయ తే ముసలినే బలినే హలినే నమ: ॥

య: పఠేత్ సతతం స్థవనం నర: సతుహరే: పరమం పదమా వ్రజేత్
జగతి సర్వబలం త్వరిమర్దనంభవతి తస్యధనం స్వజనం ధనమ్ ॥

శ్రీ యమునా స్తోత్రము

మార్తాండ కన్యకాయాస్తు స్తవం ఋ మహామతే ।
సర్వ సిద్ధికరం భూమౌ చాతుర్వర్గ్య ఫలప్రదమ్ ॥

కృష్ణ వామాంశ భూతాయై కృష్ణాయై సతతం నమ: ।
నమ: శ్రీ కృష్ణ రూపిణ్యై కృష్ణే తుభ్యం నమో నమ: ॥

య: పాపపంకాంబుక్వళంకుత్సిత: కామీకృధీ: సత్సుకలిం కరోతిమి ।
వృందావనం ధామ వదాతి తస్మై నందన్మిలిందాది కళింద నందినీ ॥

కృష్ణే సాక్షాత్ కృష్ణ రూపా త్వమేవ వేగవర్తే వర్తతే మత్స్యరూపీ ।
ఉర్మౌ ఊర్మౌ కూర్మరూపీ సదాతే బిందౌ బిందౌ భాతి గోవింద దేవ: ॥

వందే లీలావతీం త్వాం సఘనఘననిభాం కృష్ణ వామాంశభూతాం వేగం వై ।
వైరజాఖ్యం సకల జలచయం ఖండయంతీమ్ బలాత్ స్వాత్ ॥
ఛిత్వా బ్రహ్మాండమారాత్ సురనగరనగాన్ గండశైలాది దుర్గాన్
భిత్వా భూఖండ మధ్యే తటిని ధృతవతీ మూర్మిమాలాం ప్రయత్నీమ్ ॥

దివ్యం కౌ నాయధేయం శృతపథ యమునే దండయత్యద్రితుల్యం
పాపవ్యూహం త్వఖండం వసతుమమ గిరామండలే తుక్షణంత్ ।
దండ్యాంశ్చకార్యదండ్యాన్ సకృదపి వచసా ఖండితం యద్
గహీతం భ్రాతర్మార్తాండసనో రటపి పరిదండస్తో ప్రచండేతి దండ: ।

రజ్జుర్వా విషయాంధకూపతరణే పాపాఖుదర్వీకరీ వేణ్యుష్ణిక్చ
విరాజమూర్తి శిరసో మాలాస్థివా సుందరీ ।
ధన్యం భాగ్యమత: పరం భువి నృణాం యత్రాదికృద్ వల్లభా
గోలోకేప్యతి దుర్లభాతి సుభగా భాత్యద్వితీయా నదీ ॥

గోపీగౌకుల గొపకేళికలతే కాళింది కృష్ణ ప్రభే త్వత్కాలే
జలలోల గొళ విచలత్ కల్లోల కోలాహల: ।

త్వత్ కాంతార కుతూహలాలి కులకుం ఘుంకార కేకాకుల:
కూజిత్ కొకిలసంకులో వ్రజలతాలంకార భృత్ పాతుమామ్ ॥

భవంతి జిహ్వాత్ ససురోమ తుల్యా గిరో యదా భూసికతా ఇవాషు ।
తదప్యలం యాంతి నతే గుణాంతం సంతోమహాంత: కిల శేషతుల్యా: ॥

కళిందగిరి నందినీస్తవ ఉషస్స్వయం వాపర:
శృతశ్చయది పాఠితో భువి తనోతి సన్మంగళమ్ ।
జనోపి యది ధారయేత్ కిల పరేచ్ఛ యో నిత్యత:
సయాతి పరమం పదం నిజనికుంజ లీలావృతమ్ ॥

శ్రీ యమునా కవచము

యమునాశ్చ కవచం సర్వరక్షాకరం నృణామ్
చతుష్పధార్ధదం సాక్షాఛృణు రాజన్ మహామతే ।
కృష్ణాం, చతుర్భుజాం, శ్యామాం పుండరీక దళేక్షణామ్
రథస్థాం సుందరీం ధ్యాత్వా ధారయేత్ కవచం తత: ॥

స్నాత: పూర్వ ముఖీ మౌనీ కృతసంధ్య: కుశాశనే
కుశేర్బద్ధ శిఖో విప్ర: పఠేద్వై స్వస్తికాసన: ।
యమునా మే శిర: పాతు కృష్ణా నేత్రద్వయం సదా
శ్యామా భ్రూభంగదేశం చ నాసికాం నాక వాసినీ ॥

కపోలౌ పాతుమే సాక్షాత్ పరమానంద రూపిణీ
కృష్ణ వామాంస సంభూతా పాతుకర్ణ ద్వయం మమ
అధరౌ పాతు కాళిందీ చిబుకం సూర్యకన్యకా
యమస్వసా కంధరాం చ హృదయం మే మహానది ॥

కృష్ణ ప్రియా పాతు పృష్ఠం తటినీ మే భుజద్వయమ్
శ్రోణీతటం చ సుశ్రోణీ కటిం మే చారు దర్శనా ।
ఊరుద్వయం తు రంభోరు ర్జానునీ త్వఢ్ ధ్రిమోదినీ
గుల్ఫౌ రాసేస్వరీ పాతు పాదౌ పాపాప హారిణీ ॥

అంతర్బహిర్ధశ్చోర్ధ్వం దిశాసు విదిశాసు చ
సమంతామ్ పాతు జగత: పరిపూర్ణతను ప్రియా ॥

శ్రీ కృష్ణుని అష్ట మహిషీ పుత్రులు

రుక్మిణీ దేవి పుత్రులు – ప్రద్యుమ్నుడు, చారుదేష్ణుడు, సుదేష్ణుడు, చారుదేహుడు, సుచారుడు, చారుగుప్తుడు; భద్రచారుడు, చారుచంద్రుడు; విచారుడు; చారుడు.

సత్యభామా దేవి పుత్రులు – భానుడు, సుభానుడు, స్వర్భానుడు, ప్రభాను, భానుమాను, చంద్రభాను, భృహద్భాను, అతి భాను, శ్రీభాను, ప్రతిభాను.

జాంబవతీ దేవి పుత్రులు – సాంబుడు, సుమిత్రుడు, పురుజిత్, శతజిత్, సహస్రజిత్, విజయ, చిత్రకేతు, వసుమామ, ద్రవిదుడు, క్రతువు.

నాగ్నజితి దేవి పుత్రులు – వీరుడు, చంద్రుడు, సేనుడు, చిత్రగు, వేగవాన్, ఆనుడు, శంకుడు, వసువు, శ్రీమాన్, కుంతి.

కాళిందీ దేవి పుత్రులు –శృతకర్మ, వృషుడు, వీరుడు, సుబాహువు, భద్ర, ఏకలుడు, శాంతి, ధర్ముడు, పూర్ణమాసుడు.

లక్ష్మణాదేవి పుత్రులు – ప్రఘోష, గాత్రవాన్, సింహ, బల, ప్రబల, ఊర్ధ్వగ, సహ, ఓజ, మహాశక్తి, అపరాజితుడు.

మిత్రవిందా దేవి పుత్రులు – వృకుడు, హర్షుడు, అనిల, గృధ్ర, వర్ధన, ఉన్మాద, మహాశ, పావన, వహ్ని, క్షుధి

భద్రా దేవి పుత్రులు – సంగ్రామజిత్, భృహత్సేన, సూర, ప్రహరణ, విజిత్, జయ, సుభద్ర, నామ, సత్యక, అశ్వయు

పాత్ర	పూర్వజన్మ
శ్రీకృష్ణుడు	శ్రీ కృష్ణ భగవానుడు
శ్రీ రాధాదేవి	శ్రీ రాధాదేవి
బలరాముడు	శేషుడు
నందుడు	ద్రోణుడు అను వసువు
యశోద	ధర యను ద్రోణుని భార్య
వృషభానుడు	సుచంద్రుడు అను రాజపుత్రుడు. (నృగ మహారాజు పుత్రుడు)
కీర్తిదేవి	కళావతి (పితృ దేవతలకు స్వధాదేవికి జన్మించిన కన్యక
రుక్మిణి	లక్ష్మీదేవి
లక్ష్మణ	దక్షిణ (యజ్ఞపురుషుని భార్య)
కాళింది	విరజానది
భద్ర	భగవతి లజ్జ
మిత్రవింద	గంగ
ప్రద్యుమ్నుడు	మన్మధుడు
అనిరుద్ధుడు	చతుర్ముఖ బ్రహ్మ దేవుడు
వసుదేవుడు	కశ్యపుడు
దేవకీ దేవి	అదితి
రోహిణి	కద్రువ
శూరసేనుడు	ప్రాణుడు అను వసువు
దేవకుడు	ధ్రువుడు అను వసువు
ఉద్ధవుడు	వసువు అను వసువు
అక్రూరుడు	దక్ష ప్రజాపతి
హృదీకుడు	కుబేరుడు
కృతవర్మ	వరుణుడు
గదుడు	ప్రాచీనబర్హి
ఉగ్రసేనుడు	మరుత్తులు మరియు మరుత్తరాట్ చక్రవర్తి
యుయుధానుడు	అంబరీషుడు
సాత్యకి	ప్రహ్లాదుడు
శంతన మహారాజు	క్షీరసాగరము
భీష్ముడు	ద్యు అను వసువు
శాలుడు	దివోదాసు
దృతరాష్ట్రుడు	భగుడు (సూర్యుని అంశ)
పాండురాజు	పూష (సూర్యుని అంశ)
యుదిష్ఠిరుడు	ధర్ముడు
భీమసేనుడు	వాయుదేవుడు
అర్జునుడు	స్వాయంభువ మనువు

సుభద్ర	శతరూప
కర్ణుడు	సూర్యుడు
నకుల, సహదేవులు	అశ్వనీ కుమారులు
బాహ్లికుడు	ధాత
ద్రోణాచార్యుడు	అగ్ని దేవుడు
దుర్యోధనుడు	కలి పురుషుడు
అభిమన్యుడు	చంద్రుడు
అశ్వత్థామ	శంకరుని అంశ
పదహారు వేల శ్రీకృష్ణ పత్నులు	రమాదేవి అవతారములే
గోమతీ నది	సాక్షాత్ శ్రీహరి యొక్క అశ్రు కణముల నుండి ఉద్భవించినది
కంసుడు	కాలనేమి రాక్షసుడు
పూతన	రత్నమాల (బలి చక్రవర్తి తనయ)
శకటాసురుడు	హిరణ్యాక్ష పుత్రుడు ఉత్కచుడు
తృణావర్తుడు	సహస్రాక్షుడు అను మహారాజు
యమళార్జున వృక్షములు	నలకూబరుడు మరియు మణిగ్రీవుడు అను కుబేర పుత్రులు
బకాసురుడు (కొంగ)	హయగ్రీవ రాక్షసుని పుత్రుడు ఉత్కళుడు
అఘాసురుడు (కొండ చిలువ)	శంఖాసురుని పుత్రుడు అఘుడు
వత్సాసురుడు	మురాసుర పుత్రుడయిన ప్రమీలుడు
ధేనుకాసురుడు	బలి చక్రవర్తి తనయుడు సాహసికుడు
కాళియుడు	వేదశిరుడు అను ఋషి
కాక భుసుండి	అశ్వ శిరుడు అను ఋషి
రజకుడు	శ్రీ రామావ తారము సీతామాత గూర్చి నిందలు పలికిన చాకలి
దర్జీ (శౌచకుడు)	శ్రీ రామ లక్ష్మణులకు వివాహ సమయమున బట్టలు కుట్టిన దర్జీ
సుదాముడు	హేమమాలి అను యక్షుడు
కుబ్జ	శూర్పణఖ
కువలయా పీడము (ఏనుగు)	మందగతి యను బలి చక్రవర్తి తనయుడు
చాణూరాది మల్లులు	ఉతథ్య మహాముని సంతానము. తండ్రి శాపము చే భూమిని జన్మించిరి.
కంస సోదరులు	దేవయక్షుని కుమారులు (సహస్రదళ పద్మ ఘ్రాణము చే శపించబడిరి)
పంచజనుడు	పాంచజన్యము (లక్ష్మీదేవి శాపము)
కేశి (గుర్రము)	కుముదుడు అను ఇంద్ర ఛత్ర వాహనుడు
శంఖ చూడుడు	సుదాముడు (శ్రీకృష్ణ సఖుడు)
ప్రలంబుడు	విజయుడు అను గంధర్వుడు (హూహూ పుత్రుడు)
అజగరము	సుదర్శనుడు అను విద్యాధరుడు
అరిష్టాసురుడు	వరతంతువు అను బ్రాహ్మణుడు, (బృహస్పతి శిష్యుడు)
వ్యోమా సురుడు	కాశీరాజు భీమరథుడు

సూచన :- ఇందు కొన్ని పూర్వ జన్మలు భారతమునకు, గర్గ సంహితకు భేదములు యున్నవి. భక్తులు సహృదయతో పరిశీలించెదరు గాక!

మూడు గ్రామములు - మహా యోగమున శాలి గ్రామము, హరి మంతమున శంబల గ్రామము, కోసల దేశమున నందిగ్రామము.

సప్త మోక్ష పురములు - అయోధ్యా, మధుర, మాయా, కాశీ, కాంచీ, అవంతిక, ద్వారక.

నవారణ్యములు - దండక, సైంధవ, జంబూమార్గ, పుష్కల, ఉత్పలావర్తము, నైమిశము, కురుజాంగాలము, అర్బుదము, హేమంతము.

మంగళ్ మహత్